కవిరాజ శిఖామణి

నన్నెచోడదేవకృత

కుమార సంభవము

(సంజీవనీ వ్యాఖ్యా సమేతము)

ప్రథమ భాగము

(1 - 6 ఆశ్వాసములు)

వ్యాఖ్యాత

డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు

విశ్వవిద్యాలయము
బ్లిక్ గార్డెన్స్, నాంపల్లి
హైదరాబాదు-4

1994

కవిరాజ శిఖామణి

నన్నెచోడదేవకృత

కుమారసంభవము

(సంజీవని వ్యాఖ్యా సమేతము)

ప్రథమ భాగము

(1 - 6 ఆశ్వాసములు)

వ్యాఖ్యాత

డాక్టర్ జొన్నలగడ్డ మృత్యుంజయరావు,
ఎం.ఏ., పిహెచ్.డి.

రాజమహేంద్రవరము

తెలుగు విశ్వవిద్యాలయము

పబ్లిక్ గార్డెన్స్ నాంపల్లి

హైదరాబాదు-4

1994

Nanne Choda Deva's
KUMARASAMBHAVAMU

Commentary by
Dr. JONNALAGADDA MRTYUNJAYA RAO, M.A., Ph.D.

తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ సంఖ్య : 152
హైదరాబాదు — 500 004

మొదటి ముద్రణ : నవంబరు 1994

ప్రతుల సంఖ్య : 1000

వెల : రూ. 80-00 లు

ప్రతులకు :
రిజిస్ట్రార్
తెలుగు విశ్వవిద్యాలయము
లలిత కళాక్షేత్రము
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాదు — 500 004

ముద్రణ :
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

విషయ సూచిక

ఆచార్య పేర్వారం జగన్నాథం
ఉపాధ్యక్షులు

తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్

ముందు మాట

తెలుగులో ఉన్న కొన్ని కావ్య ప్రబంధాలు అచ్చమైన తెలుగు పదాలతో, మాండలికపద ప్రయోగాలతో విలసిల్లుతున్నాయి. కొన్ని ప్రబంధాలు క్లిష్టమైన పదాలతో ఉండి ఇప్పటికి పాఠకులకు అర్థతాత్పర్యాలు తెలియని పరిస్థితి కొనసాగుతున్నది. వాటికి ఇంతవరకు వివరణతోడి వ్యాఖ్యానాలు వ్రాయనందున, ప్రముఖ కావ్య ప్రబంధాలు సాహిత్యాభిమానులకు దురవగాహంగా మిగిలిపోయినాయి. వాటిని అధ్యయనం చేయడానికి ఇప్పుడున్న తెలుగు నిఘంటువులు చాలవు. ప్రబంధాల అంతరార్థాన్ని అవగాహన చేసుకోవడం దుస్సాధ్యంగా ఉంటున్నది. అర్థవివరణలతో సహా కావ్యార్థాన్ని తెలుసుకోగల పండితులు దేశంలో కొందరే ఉన్నారు. వారు ఈ కావ్య ప్రబంధాలకు సరళమైన శైలిలో కావ్య పఠనాసక్తిని పెంపొందించే విధంగా వ్యాఖ్యానాలు విరచింపగల సమర్థులు. అట్టి పండితుల సహాయ సహకారాలతో తెలుగులోనే క్లిష్టమైన ప్రబంధాలకు వ్యాఖ్యానాలు రచించే ప్రణాళికను 'వ్యాఖ్యాలహరి' పేరుతో తెలుగు విశ్వవిద్యాలయం ఇటీవల చేపట్టింది, వ్యాఖ్యానాలు అవసరమున్న కావ్యాలను ఉపసంఘం ద్వారా ముందుగా ఎంపిక చేసి వాటికి వ్యాఖ్యానం వ్రాయగల పండితులను ఎంపిక చేయడం జరిగింది. ఇట్లా దేశంలో ఉన్న సుప్రసిద్ధ పండితులకు వారు వ్యాఖ్యానాలను వ్రాయగల ప్రబంధాలను కేటాయించి అర్థ తాత్పర్యాలతో సహా, వ్యాఖ్యానాలు రచింపవలసినదిగా కోరినాము. వారు దయతో అంగీకరించినారు. వారికి తెలుగు విశ్వవిద్యాలయం కృతజ్ఞతాభివందనాలు సమర్పిస్తున్నది.

మా కోరికను మన్నించి డా. జొన్నలగడ్డ మృత్యుంజయరావు గారు నన్నెచోడుని 'కుమార సంభవం' కావ్యానికి సరళవ్యాఖ్యానం రచించి ఇచ్చినారు.

దానిని రెండు భాగాలుగా ప్రచురిస్తున్నాం. ప్రస్తుతం 6 అశ్వాసాలు గల మొదటి భాగాన్ని పాఠకుల ముందుంచుతున్నాం.

ఇది పాఠకుల మన్ననలకు పాత్ర మవుతుందని ఆశిస్తున్నాం. మేము ఇదివరకే ఈ ప్రణాళిక క్రింద ప్రచురించిన కాశీఖండం జనామోదాన్ని పొందింది. భీమేశ్వర పురాణము. శివరాత్రి మాహాత్మ్యము ప్రచురణలకు సిద్ధంగా ఉన్నవి. అంతేకాక తెలుగు విశ్వవిద్యాలయం ఇటీవల అలబ్ధ అముద్రిత గ్రంథ ముద్రణ ప్రణాళికలను చేపట్టి సుప్రసిద్ధ కావ్యాలను ప్రచురించి పాఠకలోకానికి అందిస్తున్నది. వాటి ప్రయోజనాన్ని గురించి పలువురు ప్రముఖులు శ్లాఘించినారు.

ఇట్లాగే వరుసగా క్లిష్టమైన తెలుగు కావ్య ప్రబంధాలకు వ్యాఖ్యానాలు వివరింప జేసి పాఠకుల ముందుంచుతామని మనవిచేస్తున్నాను. రసజ్ఞలోకం సమాదరిస్తుందని ఆశిస్తున్నాను.

భావ. కార్తిక పూర్ణిమ
తేది : 18-11-94.

(పేర్వారం జగన్నాథం)

పీఠిక

ఆంధ్ర కావ్యములలో నన్నెచోడుని కుమారసంభవమువలె విద్వద్విమర్శకుల తర్జనభర్జనలకు గుఱియైన కావ్య మింకొకఁడు లేదనిన అతిశయోక్తి కాదు. ఆ తర్జనభర్జనలన్నియు నన్నెచోడుని కాలమునుగూర్చియే. కాని తత్కావ్యస్థ విషయమునుగూర్చి యంతగాఁబట్టించుకొన్నవారు పెక్కురు లేరు. అల్పసంఖ్యాకు లున్నను వారు తమకై తాము తత్కావ్యమునందలి కతిపయ పద్యములకు సుష్ఠుపాఠములను నిర్ణయించుకొని యర్థనిర్ణయము చేయ యత్నించిరే కాని, మను వసుచరిత్రాది కావ్యములకు వలెఁ బ్రతిపదార్థ తాత్పర్య విశేషాంశములతోఁ గూడిన సమగ్ర వ్యాఖ్య వ్రాసి లోకమునకుఁ దెల్లముసేయు ప్రయత్నమును జేయరైరి. శ్రీ నేలటూరి వేంకట రమణయ్య, శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్య ప్రభృతు లొకరిద్ద ఱట్టిపనికిఁ బూనినను నది నాలుగైదాశ్వాసముల దాఁటిపోలేదు. అట్టి యతిజటిలమైన కావ్యమును వ్యాఖ్యానించు భాగ్యము నాకుఁగలిగినందుల కానందించుచు, నా భాగ్యమును నాకుఁగలిగించిన తెలుఁగు విశ్వవిద్యాలయమువారి కనేక కృతజ్ఞతాభివందనముల నర్పించుచున్నాను.

నన్నెచోడుని కాలమునుగూర్చి యెన్ని తర్జనభర్జనలు జరగినను, నే యొక్కరును నిందనుక నాతని కాలమును గచ్చితముగాఁ దేల్చినవారు లేరు. ఈ గ్రంథమును దొలుత వెలుఁగులోనికిఁ దీసికొనివచ్చిన శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగా రతఁడు క్రీ.శ. 940 ప్రాంతమువాఁ డనియు, నందుచే క్రీ.శ. 1026 ప్రాంతమువాఁడును, నాదికవి యని యెల్లరచే నంగీకరింపఁబడినవాఁడును నగు నన్నయకంటెఁ బూర్వుఁడై యాదికవి యనఁదగినవాఁడనియు నిర్ణయించిరి. శ్రీ వీరేశలింగము పంతులుగారు క్రీ.శ. 1150-70 ప్రాంతమునసుండి యుండునని నిర్ధారణము చేసిరి. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు క్రీ.శ. 1120 ప్రాంతమువాఁడని నిర్ణయించిరి. శ్రీ శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగారు 'తిక్కన కనంతర మఱువది దెబ్బది సంవత్సరములవఱకుఁ జోడరాజుల శాసనములు కనుపట్టుచున్నవి కావునఁ త్రయోదశశతాబ్ది చతుర్థపాదమో, చతుర్దశ శతాబ్ది ప్రథమపాదమో నన్నెచోడునిచే వెలసియుండు'నని నిర్ణయించిరి. శ్రీ చాగంటి శేషయ్యగారు నన్నెచోడుని కాలము క్రీ.శ. 1028-1078 అయి యుండునని యభిప్రాయపడిరి.

ఈ పండితులలో యథార్థ నిర్ణయమునే మనసునందుంచుకొని కొందఱును, నన్నెచోడు నెట్లయినను నన్నయ భట్టారకునకుఁ బూర్వపువానినిగాఁ జేయవలయునని కొందఱును, నన్నయకుఁ గొంచెముకాలము తరువాతివానినిగాఁ జేయవలయునని కొందఱును దమ వాదోపవాదములను సాగించినట్లు కనుపట్టుచున్నది.

ఈ కవి కాలనిర్ణయమునకు గ్రంథమున మనకు లభించిన యాధారములు మూఁడు.

1. ఇతఁడు కరికాలచోడుని వంశములోని వాఁడనుట,

2. తండ్రి పాకనాటిలోని యిరువదియొక్క వేయిటి కధీశుఁడైన చోడబల్లి యనియుఁ, దాను డెంకణాదిత్యుఁడ ననియుఁ, దల్లి హైహయాన్వయ సంజాతయైన శ్రీదేవి యనియుఁ జెప్పికొనుట.

3. జంగమ మల్లికార్జునదేవుని శిష్యుఁడననిచెప్పికొని తన గ్రంథము నాతనికే కృతి యిచ్చుట.

నన్నెచోడుఁడు నన్నయకంటె మిక్కిలి పూర్వుఁడని సిద్ధాంతముచేయుటలో శ్రీ మానవల్లి రామకృష్ణకవిగా రుదాహరించిన యుపపత్తులు రెండు తెగలకుఁ జెంది యున్నవి. మొదటిది శాసనప్రమాణము. రెండవది భాషాప్రాచీనత.

1. శాసన ప్రమాణము: ఆయన పేర్కొన్న శాసనములు మూఁడు.

కుడుంబాలూరుశాసనము: ఈ శాసనములో క్రీ.శ. 900-950 నడిమి కాలమున నున్న విక్రమకేసరి యనునొక చోళరాజు మల్లికార్జునుఁడనెడి యొక యోగిని గౌరవించి యాయనపేర నొక మఠమును గట్టించినట్లు కలదఁట.

బీచుపల్లి శాసనము: ఈ శాసనములోఁ జోడబల్లిదేవుఁ డనెడి యొకరాజు క్రీ.శ. 902 వ సంవత్సరములోఁ గృష్ణాతీరమున విశ్వనాథదేవాలయమునకు భూదాన మిచ్చిన ట్లున్నదఁట.

పేరులేని మఱియొక శాసనము: నన్నెచోడుఁడను నొకరాజు పశ్చిమ చాళుక్యులతోడి యుద్ధమున క్రీ.శ. 940 వ సంవత్సరములో నిహతుఁడయినట్లు కలదఁట.

ఈ మూఁడు శాసనములలోని పేర్లను గ్రంథములోని తండ్రికొడుకులయు, గురుశిష్యులయుఁబేర్లతో సరిపోవుచున్నవి. కనుక నా మువ్వురే యీ మువ్వురనియు క్రీ.శ. 940 లో యుద్ధమునఁ జనిపోయిన నన్నెచోడుఁడే యీ గ్రంథకర్తయనియుఁ గవిగారి సిద్ధాంతము.

ఖండనము

ఈ సిద్ధాంతము సూక్ష్మవిమర్శనమునకు నిలుచునది కాదు. చోళరాజులలోఁ జోడబల్లి, నన్నెచోడుఁడు ననుపేర్లు గలవారు పెక్కురు గలరు. అట్లే శైవ మఠాధిపతులలో మల్లికార్జునుఁడను పేరు గలవారును జాలమంది కలరు. అందుచే శాసనములందుఁ బేర్కొనఁబడిన యీ మువ్వురిపట్ల గ్రంథమునఁ బేర్కొనఁబడినవారికిఁగల సంబంధము - అనఁగాఁ బితాపుత్ర సంబంధముగాని, గురుశిష్య సంబంధము గాని స్థాపితమగువఱకు వారే వీ రనుట పొసఁగదు.

అట్టి సంబంధమును స్థాపింపఁగల శాసనములు రెండు మాత్రమే కలవు.

1. పెద చెరుకూరు శాసనము: నన్నెచోడుని కాలనిర్ణయ విషయమున నీ శాసనమునకుఁగల ప్రాధాన్యము మఱి దేనికిని లేదు. దీనిని వేయించినవాఁడు మల్లిదేవుఁడను చోళరాజు. ఆ గ్రామమున వేంచేసియున్న భీమేశ్వర స్వామికి బరిదపూండి యను గ్రామము నీ చోళరాజు దానమిచ్చుట యీ శాసనవిషయము. ఆ దాన మప్పటి కాకతీయ చక్రవర్తి యగు గణపతిదేవుని పుణ్యప్రాప్తి కొఱకు నీఁబడినట్లు కలదు. కావున నీ శాసనము క్రీ.శ. 1198-1260 నడుమఁ బాలించిన గణపతిదేవుని నాఁటిది. అది యాతని చరమదశలో వ్రాయఁబడినదని కూడఁ దెలియుచున్నది. దీని కాధారము పెదచెరుకూరు రెండవ శాసనము. అదియు నీ మల్లిదేవునిదే. ఇందు గణపతిదేవుని ప్రశంస లేదు. గణపతిదేవుని యంత్యకాలమున నతని సామంతులు స్వతంత్రు లయినటు లైతిహ్యము గలదు, అది చారిత్రక సత్యము. దాని నీ శాసనముతో సమన్వయింపఁగా మొదటి శాసనమునాఁటికి సామంతుఁడై యుండిన మల్లిదేవుఁడు రెండవ శాసనమునాఁటికి స్వతంత్రుఁ డాయెనని యనుమేయము. కాఁగా నీ మొదటి శాసనము క్రీ.శ. 1250 ప్రాంతమునఁబుట్టియుండవచ్చును. అం దీ మల్లిదేవుని వంశవృక్ష మిటు లున్నది.

కరికాల చోడుఁడు
|
చోడబల్లి
|
నన్నెచోడుఁడు
|
సూరభూపతి, రాజరాజ మహీపతి
|
ఘటంకారుఁడు
|
మల్లిదేవుఁడు
|
నన్నెచోడుఁడు
|
మల్లిదేవుఁడు — (శాసనము వేయించినవాఁడు.)

ఈ వంశములోఁ జోడబల్లి కుమారుఁడు నన్నెచోడుఁ డొకఁడు గలఁడు. అతఁ డీ శాసనదాతకైదు తరములవాఁడు. పురావస్తు పరిశోధన శాఖ వారి సూత్రము ప్రకార మొక్కొక్క తరమునకు 25 సంవత్సరముల చొప్పున లెక్కించుచుఁ బోఁగా, నన్నెచోడుఁ డీతనికి 125 సంవత్సరముల పూర్వుఁడు. అనఁగా క్రీ. శ. 1125 ప్రాంతము వాఁడు. ఈ శాసనముతప్పఁ జోడరాజుల శాసనములలోఁ జోడబల్లి నన్నెచోడులకుఁ బితాపుత్ర సంబంధమును నిరూపించు శాసనమే లేదు.

2. కొప్పరపు శాసనము : దీని దాత చోడబల్లి. ఈతఁడు సోమేశ్వరమను గ్రామమును ధృతకాలాముఖ వ్రతుఁడును, తత్త్వవేత్తయు నగు మల్లికార్జునున కర్పించిన ట్లిందుఁ గలదు. క్రీ. శ. 1115 లోఁ జోడబల్లిచే సత్కృతుఁడైన మల్లికార్జునయోగి క్రీ. శ. 1125 - 30 ప్రాంతమున నన్నెచోడునిచేత గ్రంథప్రదానరూపమున సత్కృతుఁడగుట చూడఁగా నీ మువ్వురు పురుషులకును గ్రంథమున సూచింపఁబడిన సంబంధమే కలదని నిశ్చయముగాఁ జెప్పవచ్చును. క్రీ. శ. 1115 ప్రాంతముననే తండ్రితోఁ బరిచయము గల మల్లికార్జునయోగి యీ కవికి గురువగుటయు సంగతముగనే యున్నది. ఇంతకంటెఁ బ్రబలాధారము దొరకి, యీ సిద్ధాంతమును బూర్వపక్షము చేయునంతకు నిదియే నిజ మనుకొనవలయును.

2. భాషా ప్రాచీనత :

ఇఁక భాషాప్రాచీనత యను విషయమున శ్రీ రామకృష్ణకవిగారు వ్రాసిన వాక్యము లివి — 'నన్నెచోడుఁడు నన్నయకంటెఁ బూర్వుఁ డని కుమార సంభవము నందలి వ్యాకరణ చ్ఛందో విశేషాత్మకాపూర్వపద ప్రయోగములు సహస్ర ముఖముల ఘోషించుచున్నవి.'

పయి సిద్ధాంతమున కీ క్రిందివి యుదాహరణము లగును.

1. ఛందో విశేషములు : పూర్ణార్ధ బిందుప్రాసము — దీర్ఘముమీఁది యరసున్నను నిండుసున్నచేసి సిద్ధపూర్ణానుస్వార పూర్వకాక్షరముతోఁ బ్రాసమును జెల్లించుట,

పోండిగ నగజ తపశ్శిఖి
మూండు జగంబులను దీవ్రముగఁ బర్విన బ్ర
హ్మాండము గాఁచిన కాంచన
భాండముక్రియఁ దాల్చెఁ దత్ప్రభాభాసితమై. 6-157

వీండేమి సేయుఁ బంచిన
వాం డుండఁగ నిక్కమునకు వధ్యుఁడు గా నా
ఖండలుఁడు గాక యేసిన
వాం డుండఁగ నేమిసేయు వరశర మనిలోన్. — మొదలగునవి, 10-155

నన్నయ గాని. తదర్వాచీనులుగాని యిట్టిప్రాసము నెక్కడను వాడియుండ లేదు. ఇట్టి ప్రాసమైత్రి నన్నయకుఁ బూర్వముండి యుండును. కావున నన్నెచోడుఁడు నన్నయకుఁ బూర్వుఁడు గావలయును. 'ఇది పూర్ణార్ధబిందుప్రాసముగాదు; కవి యీ శబ్దములను బూర్ణబిందుయుతములుగనే వాడె' నందురా, యప్పుడును నన్నెచోడుఁడు నన్నయకుఁ బూర్వుఁడే యగును. పూర్వమొకప్పుడు పూర్ణమై యుండిన బిందువు పిమ్మట ఖండబిందు వయినట్లు భాషాచరిత్రమునుబట్టి తెలియుచున్నది. నన్నయ నాఁటికే యర్ధబిందువు లయినవాని నీ కవి పూర్ణబిందువులుగా వాడినాఁడుగాన నిది యాతని ప్రాచీనతకే తార్కాణ మని శ్రీ మానవల్లివారి వాదము.

2. వ్యాకరణ విశేషములు :

వైరిపదము : తెలుఁగు విభక్తిప్రత్యయము చేరని కేవలసంస్కృత శబ్దముతో వికృతి శబ్దము సమసించుట వైరిపద మనఁబడును.

వాని కురియు ననేకాస్త్రవర్ష మెల్ల
నశ్రమమున విఖండించి యరద సూత
రథ్య కోదండ కేతన రాజితోడ
వర కిరీటంబు దెగి నేల నురుల నేసె. 12.52

చ. పుడమిపుఁడున్ ధనాఢ్యుఁడును భూరిబలుండును శౌర్యవంతుఁడున్
గడు దృఢపాణియున్నయినఁగాని యొడంబడ దశ్వమేధ మెం
దడరఁగఁజేయఁ దన్మఖమునందుల పుణ్యఫలంబు లందఁగా
నడుగడు గశ్వమేధమను నాజిమొనంజని చావుసేగియే. 11.44

ఇది యీ గ్రంథమునఁ బెక్కుచోట్లఁ గలదు. ఈ వైరిపదము ప్రాచీన సంప్రదాయమునఁ గలదు. నన్నయయుఁ గఱకంఠుఁడు, ప్రాణగొడ్డము మున్నగు ప్రయోగములను జేయఁగా వానిని లాక్షణికు లనింద్యగ్రామ్యములుగా నంగీకరించిరి. వీనిని శివకవులు విశేషముగా వాడియుండిరి, ప్రాచీనకాలమున నివి విశేషముగా వాడుకలోనుండి క్రమముగాఁ దఱిగిపోయినవనియు. నన్నయ తననాఁటికి వ్యవహారమున రూఢమువై యుండుటచే వీనిని మాత్రమే ప్రయోగించెననియు గ్రహింపవలయును, నన్నయ ప్రయోగించిన వైరిపదములు కొలఁది. కుమారసంభవమున నవి కొల్లలు. నన్నయ ప్రయోగించినవి రూఢములు. నన్నెచోడునివి కల్పితములు, కావున వైరిపదము నింద్యముగాఁ బరిగణింపఁబడని కాలమున అనఁగా నన్నయకుఁ బూర్వ మీ గ్రంథము రచింపబడి యుండవలయును. ఇది కవిగారి వాదము.

3. ఈతఁడు కర్ణాటపదములను దన గ్రంథమున విరివిగా వాడియుండెను. ఉదా. వెంచలు = సస్సులు. కొలవేళులు = వట్టివేళ్లు, కందవడము = తెర; ఇట్టి పదము లనేకములు. ఈ పదములనుబట్టి యాంధ్రకర్ణాటములు బాగుగా విడివడని కాలమున నీతఁ డుండియుండునని కవిగారివాదము. నన్నయకుఁ బూర్వ మీ పదములు కర్ణాటాంధ్రములందు సామాన్యముగా వాడఁబడుచుండె ననియుఁ, గావున నీ పదము

లను వాడిన నన్నెచోడుఁడు నన్నయకుఁ బూర్వుఁడే యయియుండవలయుననియుఁ గవిగారి వాదము.

4. క్రౌంచపద వృత్తము. ఈ వృత్తమును వాడుటలో నన్నెచోడుఁడు కర్ణాటలక్షణమును బాటించెననియు. నందువలన నితఁడు నన్నయకుఁ బూర్వుఁడనియు వీరి మతము. ఈతని క్రౌంచపదమునఁ బ్రతిపాదమును రెండు భాగములుగాఁ గంద సీసములందు వలె విభజింపఁబడి, కందమునవలెఁ బూర్వార్ధమునఁ బ్రాసమును, ద్వితీయార్ధమున విశ్రమము మాత్రమే కూర్పఁబడియుండెను.

చంచుల నాస్వాదించుచు లేఁదూం డ్లకరువు ప్రియులకు నలఁచుచు మై

5. అశ్రుత పూర్వశబ్దములు, అర్థములు :

1. కుందు ధాతువునకు 'కుందిల్లు' అను రూపము,
   'వనటం గుందిల్లి చింతించుచున్',

2. సమూహము అను నర్థమున 'సమూహి'.
   'శారద నీరద సమూహి చాడ్పునఁ బోలెన్',

3. గ్రహ శబ్దమునకుఁ దద్భవముగ 'గాము' గాక 'గ్రాము'.
   'పఱతెంచి మగుడఁ బెట్టిన
   నతిముతి వలి గ్రాము వట్టిన ట్లనలుఁడు మై',

4. పరభాగ శబ్దమునుండి 'పరభాగిల్లు' = అతిశయిల్లు అను నామధాతువును నిష్పన్నము చేయుట,
   'ఉమా మహేశ్వరుల పురోభాగంబునం బరభాగిల్లుచు'. 10_112

ఇట్టివే కావడించు, ఎంగిలించు అను ధాతువులు
'ప్రమథగణము దక్షుఁ బడఁగొట్టి కట్టుచుఁ,
గాలుఁ జేయు బడియుఁ గావడించి' 2_84

మొన లావులించి వాసనచల్లఁ బసిగొని
లేఁ దేఁటి గము లెంగిలింపకుండ. 3_108

5. వెంటఁబడు, వెంబడించు - అను నర్థమున 'వెనుదెంచు'
'దిగ్గజేంద్రంబు వెనుదెంచెఁ దెరల గుహాఁడు,'

6. అలు అనుదానికి బహువచన రూపము. 'అందురు.'

బేటము = అనురాగము, కేనము = అసూయ, మేలిల్లు = శ్రేష్ఠము, కండవడము = తెర, కొలవేరు = వట్టివేరు, గోమిని = లక్ష్మి, తలతంత్రము = సేన,

ఇవిగాక యసంఖ్యాకములైన కన్నడపదములు, తమిళపదములు విచ్చలనిడిగా వాడఁబడినవి. 'కరికాల చోడుఁ' డనుటకుఁ 'గరికాలచోడు' అని ప్రయోగించుట.

'జలధి మహీపతి మొలనూలుగాఁ జుట్టి.
పాలించెఁ గలిఁ గరికాలచోడు'

ఇట్టి విశేషరూపములు నన్నయ భారతములోఁగాని, తరువాతి గ్రంథములలోఁగాని కానరాకపోవుటకుఁ గారణము నన్నయనాఁటికిఁ దెలుఁగుభాష యన్నివిధముల సుపరిష్కృతమై నియతి చెందినదనియు, నన్నెచోడునినాఁటి కట్టి సంస్కారము జరుగలేదనియుఁ, దెలుఁగు సోదరభాషలైన ద్రావిడ కన్నడములతోఁ బూర్తిగా విడ్డివడక యా భాషల పదములను, నర్థములను గొంతవఱకు వాడుకొనుచున్న కాలములో నీ గ్రంథము రచింపఁబడినదనియు రామకృష్ణకవి వాదము.

ఖ ం డ న ము

1. పూర్ణార్ధబిందు ప్రాసము: ఈ ప్రాసమును బూర్వకవులుగూడ ముఖ్యముగా శివకవులు వాడినారు. శివకవులేకాక నాచన సోముఁడు సైత మీప్రాసమును వాఁడినాఁడు. ఉదా :-

'ఎంచినప్రేమ నీ పదక మిమ్మని రుక్మిణి మున్ను వేఁడుడున్,
నోఁచినవారి సొమ్ములవి నోమనివారికి వచ్చునే యిలన్ ?'
కావున నిది ప్రాచీనతకు నిదర్శనముగాదు,

2, వైరిపదమును శివకవులు బాహాటముగా వాడినారు. పాల్కురికి సోమనలో నిట్టివి పెక్కులు గానవచ్చును, అంతమాత్రమునఁ బాల్కురికి సోమన నన్నయకుఁ బూర్వుఁడని చెప్పఁగలమా ?

3. కర్ణాట పదములు : వీనినిగూడ శివకవులు విరివిగా వాడినారు, శైవమతము నకుఁ గర్ణాటమే ప్రాధాన్యము వహించినది, తన్మతానుయాయులగు కవులందఱును గర్ణాటపదములను స్వేచ్ఛగా వాడిరి. ఇదియుఁ బ్రాచీనతకు లక్షణముగాదు.

4. క్రౌంచపద వృత్తము : ఈ వృత్తమును నన్నెచోడుఁడు వాడుట యాతని ప్రాచీనతను స్థాపింపదు సరిగదా, యది యాతని యర్వాచీనతనే స్థాపించును, నన్నయ తనకుఁ బూర్వము వాడుకలోనున్న వృత్తములను దన గ్రంథమున నుపయోగించుకొనియే యున్నాఁడు. అక్కర యిందుల కొక ప్రబలనిదర్శనము. నన్నయ తరువాతనే 'క్రౌంచపదము' వాడుకలోనికి వచ్చియుండును, నన్నెచోడుని కుమార సంభవమునం దక్కరలు లేకపోవుటయుఁ, గ్రౌంచపద ముండుటయు నీతఁడు నన్నయకుఁ దరువాతివాఁ డనుటను దెలుపుచున్నది. క్రౌంచపద వృత్తమునందలి మార్పు నన్నెచోడునకుఁ గల కర్ణాటభాషాపరిచయమును దెలుపును.

నన్నయకుఁ బూర్వపు శాసనములందును, నన్నయ భారతమునను గానవచ్చు మధ్యాక్కఱ యీతని కావ్యమున మచ్చున కొక్కటి యైనను లేదు, మధ్యాక్కఱ దేశివృత్తము ; తరువోజాది దేశిచ్ఛందముల నెన్నిటినో యాదరించిన యితఁడు మధ్యాక్కఱ నాదరింపకపోవుటకుఁ గారణ మీతఁడు మధ్యాక్కఱయెడఁ గవుల కాదరము తగ్గిపోయిన కాలమున - నన(గా నన్నయకుఁదరువాత నుండెననుటకుఁ బ్రబల నిదర్శనము.

పయి విచారణమునుబట్టి నన్నెచోడుఁడు పదునొకండవ శతాబ్దాంతిమ భాగము నందును, బన్రెండవ శతాబ్ద ప్రథమ భాగమునను నుండియుండును.

ఇంచుమించు దేశమునందలి విద్వాంసులందఱు నిదే యభిప్రాయమునకు వచ్చి యుండఁగా, నిటీవల నన్నెచోడుని గూర్చి యింకొక క్రొత్త యభిప్రాయ 'మశనిపాతము' వలె వచ్చిపడినది. అది యాతని కాలమునుగూర్చినది కాక, 'అహో ! మూలచ్ఛేదీ తవ పాణ్డిత్య ప్రకర్ష' యనున ట్లాతని కృతికర్తృత్వమునకే యెసరుపెట్టునట్టిది. 'నన్నెచోడుఁ డనువాఁడొకఁడు కుమారసంభవమును రచింపలేదు, మానవల్లి రామకృష్ణకవి గారే దానిని రచించి, ప్రసిద్ధికొఱకు నన్నెచోడునిపేర వెలయించినా రనునది యీ యభిప్రాయము. ఈ యభిప్రాయమును లేవనెత్తినవారు డాక్టర్ కొర్లపాటి శ్రీరామమూర్తి, ఎం. ఏ., పిహెచ్. డి.; డి. లిట్. గారు, వారు తమ యభిప్రాయమును సిద్ధాంతీకరించు

టకు 'నన్నెచోడుని కుమారసంభవము ప్రాచీనగ్రంథమా?' యనుపేర నొక పెద్దగ్రంథ మునే రచించినారు తమ వాదమున కుపోద్బలకముగా వారనే'కోప' పత్తులను జూపి యున్నారు.

శ్రీ శ్రీరామమూర్తిగారు తమ గ్రంథమును బ్రధానముగా నాఱు భాగములుగా విభజించియున్నారు. అవి – 1. కుహనా వాదము, 2. కృతక రచనము, 2. కుటిల శృంగారము. 4. కూడలి స్థలము, 5. కృత్రిమ పాఠము, 6. కూట సృష్టి.

వీనిలోఁ 'గూటసృష్టి' యనుదానిని శ్రీ గుమ్మా శంకరరావుగారు నిశితముగా విమర్శించి శ్రీ శ్రీరామమూర్తిగారి వాదమును 'తెలుఁగు పరిశోధన' యను త్రైమాసిక పత్రిక నాలుగవదియగు ప్రథమ వార్షిక ప్రత్యేకసంచికలో ఖండించియున్నారు.

డా. రావుగారి ఖండనము సారాంశమిది.

1. మానవల్లివారు తమ దగ్గఱనున్న ప్రతినే తంజావూరి గ్రంథాలయములో దొంగచాటుగాఁ జేర్చిరని డా. మూర్తిగారనుటలో సత్యములేదు. అదియే సత్యమని యెంచునెడ, కందుకూరివారును వావిళ్లవారును, సరిచూచిన పండితులును నసత్యమాడిరని యెంచవలసివచ్చును. అందుచే నొక్క డా. కొర్లపాటివారి మాటలలోనే నత్యము లేదనిన సరిపోవును.

2. తంజావూరి గ్రంథాలయ ప్రతిపైఁగల ముఖపత్రము నవీనమయినంత మాత్రమునఁ బ్రతి నవీనము కానక్కఱలేదు. ప్రతి ప్రాచీనమే.

3. కుమారసంభవ కావ్యములోని యెన్నో పద్యములను దరువాతి కవులనుకరించిరని మానవల్లివారనఁగాఁ, గుమారసంభవ కర్తయే వారినందఱ ననుకరించెననియు, మూలములు సహజములు కాఁగా, ననుకరణములు కృతకము లనియు డా. మూర్తిగారు నిరూపింప యత్నించిరి. ఎప్పుడును మూలముకంటె ననుకరణమే మేలురముగా నుండుట సంభవము గావునఁ గుమారసంభవకర్త పద్యములే మూలములు. అనంతర కవులవే యనుకరణములు.

4. కుమారసంభవము నందలి కతిపయ ప్రయోగములు మానవల్లి వారి కవితలోఁగూడ నున్నట్లు డా. కొర్లపాటివారు చూపరైరి.

5. రచనాకాల నిర్ణాయకములుగా భావించిన కుమారసంభవకావ్యస్థములగు 'కరి సిర మాడ', 'ద్వాదశార్ధార్ధనయను' ఇత్యాదిగాఁ గల పద్యములకు డా. శ్రీరామ మూర్తిగారు స్వానుకూలముగాఁ గావించిన వ్యాఖ్యలను డా. శంకరరావుగారు సమర్థముగా ఖండించి వారి యాలోచన యెట్లక్రమమో నిరూపించిరి.

6. ఇఁకఁ జక్రబంధముపై డా. మూర్తిగారు చేసిన వ్యాఖ్య యెట్లు కృతకమో, విలక్షణమో, యసమర్థనీయమో, యసంభవమో, యింద్రజాలమో, దుష్టమో, యసహజమో డా. శంకరరావుగారు చక్కఁగా నిరూపించినారు. బంధకవిత్వ మక్షరబంధమేకాని, యర్థబంధము కాదని తెలియమియే డా. కొర్లపాటివారి వాదమునకు మూలమని చెప్పినారు. అంతేకాదు ! డా. మూర్తిగారి పద్ధతి ననుసరించినచో నదే పద్యమునఁ గవిత్రయము వారిని, గడకు డా. కొర్లపాటివారిని సైతము నెట్లు రప్పింప వచ్చునో ప్రదర్శించినారు.

డా. శంకరరావుగారు డా. కొర్లపాటివారి వాదమును ఖండించిన తీరు మిక్కిలి సమర్థనీయముగా నుండుటచే నేను మరలఁ దత్ ఖండన వ్యాపారమునకుఁ బూనుకొనఁ దలఁచుట లేదు..

శ్రీ సూర్యదేవర రవికుమార్ అనువారు వ్యాససుధ యను వ్యాస సంపుటిలో 'నన్నెచోడుని కుమారసంభవము ప్రాచీన గ్రంథమే' యనుపేర నొకపెద్ద వ్యాసమును రచించి డా. శ్రీరామమూర్తిగారి సిద్ధాంతమును సమర్థనీయముగా ఖండించిరి.

వారి ఖండనపద్ధతి యిటు లున్నది.

1. తంజావూరి గ్రంథాలయమునందలి ప్రతి మానవల్లివారి ముద్రితప్రతి కనుసరణమని డా. కొర్లపాటివా రనుట సరికాదు.

2. మానవల్లి రామకృష్ణ కవిగారు తెలుఁగు భాషలో నాదికవిగాఁ బ్రసిద్ధి పొందిన నన్నయభట్టుమీఁద సదభిప్రాయము లేనివా రగుటచేత నన్నెచోడుని నన్నయకంటెఁ బూర్వకవిఁగా నిరూపించి నన్నయకు నాదికవి గౌరవము నణఁచివేయు కోరికతో నన్నెచోడుని కుమారసంభవమును గూటసృష్టిచేసి రను డా. శ్రీరామమూర్తి గారి యభిప్రాయమును శ్రీ రవికుమార్ మానవల్లి కవి రచనలనుండి వారి యుపన్యాసము నించుక విపులతరముగా నుదాహరించి మానవల్లివారికి నన్నయపై నెంతమాత్ర

మును ద్వేషము లేదని నిరూపించిరి. మానవల్లివారి యుపన్యాసమునందలి కేవలము నాలుగు వాక్యములనుమాత్ర ముదాహరించి వారికి నన్నయపై ద్వేషము గల దనుట డా. కొర్లపాటివారికిఁ దగదని శ్రీ రవికుమార్‌గా రనిరి.

3. మానవల్లి వారు ప్రకటించిన వల్లభామాత్యుని క్రీడాభిరామములో 'మా కరకౌశల మెక్కడను జూపఁబడలే'దని కవి గా రన్నదానికి డా. శ్రీరామమూర్తిగారు 'కవిగారు ప్రకటించిన యితర గ్రంథములలోఁ గవిగారి కరకౌశలము గలదని చేసిన కువ్యాఖ్యను శ్రీ రవికుమార్‌గారు నిరసించిరి.

4. మానవల్లివారు 17-4-1894 వ తేదీని కుమారసంభవ కూటసృష్టికి శ్రీకారము చుట్టిరని డా. శ్రీరామమూర్తిగారి వాదము. కాని యొక సంవత్సరమునకుఁ బిమ్మట 19-5-1895లోఁ గవిగారు తమ యుపన్యాసములో నన్నయకుఁ బూర్వము విక్రమార్కచరిత్రకర్త యగు కవివల్లభుఁ డుండినట్లు పేర్కొనిరే కాని నన్నెచోడుని యూసైన నెత్తలేదు. అంచుచే డా. శ్రీరామమూర్తిగారి వ్రాఁత నత్యదూరమని శ్రీ రవికుమార్‌గారి యభిప్రాయము.

5. తమ యుపన్యాసములో గర్భ బంధకవిత్వాదులను నిరసించిన కవిగారు డా. శ్రీరామమూర్తిగా రన్నట్లు కుమారసంభవకర్త యయియుండినచో, వానిని స్వీయ కావ్యములోఁ బ్రయోగించియుండరని శ్రీ రవికుమార్‌గారు డా. మూర్తిగారి వాదమును ద్రోపిపుచ్చిరి.

6. కుమారసంభవమునందలి మొదటి పద్యములో మ,ర గణములచే 'మా,రా.' (మానవల్లి రామకృష్ణ కవి) పేరును, చక్రబంధమున మానవల్లి రామకృష్ణ కవి పేరును నెట్లో సాధించిన డా. శ్రీరామమూర్తిగారి యసాధారణపాండిత్యమునకు, ననితరసాధ్య విమర్శనపద్ధతికి, నాశ్చర్య'కరకౌశలము'నకు శ్రీ రవికుమార్ గా రబ్బురపడుచు, నవి సత్యేతరములని కొట్టివైచిరి.

7. మగణ రగణముల కూడికతోఁ గృతిని బ్రారంభించినచోఁ గృతికర్త శీఘ్ర మరణము నొందునని తెలిసిన కవిగారు రాగణములతోనే కుమారసంభవమును బ్రారంభించునంతటి యవివేకులా? అవి స్వనామధేయ సూచకములని మక్కువపడి మొదలిడిరన్నను, వారు తొంబదేఁడులకుఁ బైగా జీవించుట కే మందు రని శ్రీ రవి కుమార్‌గారి ప్రశ్నము.

8. మానవల్లివారు కుమారసంభవమును దామే రచించినట్లు లోకు లనుకొను మాటల కిచ్చిన సవినయ సమాధానమున డా. శ్రీరామమూర్తిగారికి నక్కవినయమే గోచరించుటకు శ్రీ రవికుమార్‌గా రాశ్చర్యపడిరి.

9. కైవు, తరవారి మున్నగు పదము లర్వాచీనములనియు, వానిని బ్రయోగించిన నన్నెచోడుఁ డర్వాచీనుఁడే యగునని డా. కొర్లపాటి వా రన, విమర్శకులలో నేకాభిప్రాయము లేని పదప్రయోగములనుబట్టి కవి కాలనిర్ణయమును జేయుట ప్రామాదిక మని శ్రీ రవికుమార్‌గారు త్రోసిపుచ్చిరి. అట్లే వివిధకవులు వివిధ రీతులలో రచించిన క్రౌంచపదవృత్తమును బట్టి కూడ నన్నెచోడుని కాలమును నిర్ణయించుట తప్పని శ్రీ రవికుమార్‌గారు నిర్ణయించిరి.

10. కుమారసంభవములోని పెక్కు పద్యములు ప్రాచీనాంధ్రకవుల పద్యములను బోలియున్న వనియు, నా ప్రాచీనుల పద్యములు సహజము లనియు, వాని ననుసరించిన కుమారసంభవ పద్యములు దోషభూయిష్ఠములగుటచేఁ గృతకము లనియు డా. శ్రీరామమూర్తిగారు నిర్ణయించిరి. అ నోటితోనే వారే మానవల్లివారి మహాప్రతిభావంతమైన పద్యరచనను బ్రశంసించిరి. అట్టి ప్రతిభా సంపన్నులైన కవిగారే కుమారసంభవమును రచించియుండినచో, నందలి పద్యము లట్లు రసహీనములుగా, దోషభూయిష్ఠములుగా, నపప్రయోగములతోఁ గృతకముగా నుండు టెట్లు సంభవించుః నని శ్రీ రవికుమార్‌గారు ప్రశ్నించిరి.

11. డా. శ్రీరామమూర్తిగారు కుమారసంభవము కుటిల శృంగార సంభరిత మని చెప్పిరి, మానవల్లివారు వసుచరిత్రాది మహాకావ్యములలోని శృంగారమునే యసహ్యించుకొనినట్లు వారి యుపన్యాసమునందలి వాక్యములవలన విశదమగును. శృంగారరసమునెడ నట్టి దృష్టిగల మానవల్లివారు డా. శ్రీరామమూర్తిగా రన్నట్లు కుమారసంభవ కర్త యైనచో దాని నంత కుటిల శృంగార సంభరితముగా నెట్లు రచించియుందురని శ్రీ రవికుమార్‌గారి ప్రశ్నము.

పైని శ్రీయుతులు డా. గుమ్మా శంకరరావుగారును, సూర్యదేవర రవికుమార్‌గారును డా. కొర్లపాటి శ్రీరామమూర్తిగారి 'నన్నెచోడుని కుమారసంభవము ప్రాచీన గ్రంథముగాదు; అది యత్యాధునికుఁడైన మానవల్లి రామకృష్ణకవి రచించినది' యను దుర్వాదము నెట్లు నిశితముగా ఖండించిరో చూపఁబడినది.

వారు స్పృశించిన విషయములను గూర్చి యిఁక నే నేమియు వ్రాయ నక్కఱలేదు.

పయి యిరువురును డా. శ్రీరామమూర్తిగారి వాదములోని కొన్ని యంశములను విపులముగను, గొన్నిటిని సంగ్రహముగను, నిరసించిరి. ఇరువురును డా. శ్రీరామమూర్తిగారి గ్రంథమునందలి కృతక రచనమను నంశము నే కారణముననో యంతగాఁ బట్టించుకొనరైరి.

అవి కృతకములు కావని సమర్థింపవచ్చును, నే నా ప్రయత్నమును జేయుదును, కాని యా పద్యములనన్నిటిని గృతకములు కావని నిరూపించుట కిటఁ జోటు లేదు. అట్లు చేయవలయునన్న మఱియొక బృహద్గ్రంథమునే వ్రాయవలసియుండును, అవసర మగుచో నట్టి ప్రయత్నమును జేయఁగలను, అందుచే నిట మచ్చున కొండు రెండు పద్యములను మాత్రము చూపి వానివిషయమున డా, శ్రీరామమూర్తిగారు భ్రాంతిపడిన విధమును, బ్రమాదపడిన రీతిని వివరించి వాని కృతకత్వమును బరాస్తము చేసి, తత్సహజత్వమును నిరూపింప యత్నింతును,

డా. శ్రీరామమూర్తిగారు సూరన యుదయనోదయమునందలి —

అలితతి నీలముల్, ముదురుటాకులు పచ్చలు, లేఁజిగుళ్లు కెం
పులు, దళరాజి వజ్రమయముల్, కలికావళు లాణిముత్తియం
బులుగఁ బొసంగు చంగుని బొక్కన మెల్లను నాత్మలోన నిం
పులు పొదలించె రాజునకుఁ బూచి బెడంగగు పొన్న లున్నతిన్.

అను పొన్నచెట్లను వర్ణించు పద్యము నిచ్చి. కుమారసంభవకర్త దాని ననుకరించుచు మామిడిచెట్లను వర్ణించు నీ క్రిందిపద్యమును రచించెనని చూపిరి.

మొగడలు వజ్రముల్. విరులు ముత్తెము, లింపగు నున్పుఁగెంపులేఁ
జిగురులు పద్మరాగములు, చిల్కలు వైరిజరాజి, తుమ్మెదల్
నగరివు నీలజాలములు నాఁ దనరారె వసంతవల్లభుం
డగు వలరాజు పంచమణి హర్మ్యములోయనఁ జూతభూజముల్.

ఉదయనోదయ పద్యము హృద్యముగాదని యెవ్వరు ననరు. కాని కుమార సంభవ పద్యము హృద్యము గా దనుటకు సహృదయతా లోపము కారణమనవలయును.

డా. మూర్తిగారు కుమారసంభవమునందుఁ జేసిన యాక్షేపణములను జూపి వానికిఁ దగిన సమాధానముల నిత్తును.

"ఇందు రెండు 'అన' లు. ఇది రాజునకు ఇంపుకలిగించినది కాదు. రసజ్ఞులకును ఇంపు కలిగించునది కాదు."

పద్యమునఁ బ్రకరణమునుబట్టి యెన్ని 'అన' లైన నుండవచ్చును. 'మొగడలు .... నగరిపు నీలజాలములు నాన్, 'పంచమణీ హర్మ్యములో-యన' అను చోట్లఁ గల నాన్, అనన్ అనునవి యత్యంతము నావశ్యకము లయి సముచితముగా నున్నవి. అయినను 'అనుకరించుటవలని అనర్థకము' (అనుకరించుటవలని యనర్థము), 'ఆవశ్యకము లేదు (ఆవశ్యకత లేదు), 'ఒరయూరి కధిపతిని' అన్నది మాత్రము బిరుదముకాదు, ఇదమిత్థము', 'విషయీ విషయ విపర్యయము' పుట 67 (విషయి విషయ విపర్యయము) అనురీతిని విశేష్య విశేషణ భేదము తెలియక పెక్కువాక్య విన్యాసములు చేసిన వీ రా కుమారసంభవ కావ్యకర్త నధిక్షేపించుట!

"నున్నఁగెంపులేఁజిగురులు పద్మరాగములు' అనునెడ 'కెంపు' విశేషణము ఇంపు గలిగించునది కాదు."

పద్మరాగముల వర్ణ మెఱుపు కావున 'లేఁజిగురులు' ఎఱ్ఱనివే యైనను మరల దానికి 'కెంపు' = ఎఱ్ఱని అను విశేషణముప బ్రయోగించుటచేఁ గెంపదికమై మఱింత యింపును గలిగించుచున్నది.

"మన్మథునికి నవరత్నమయ సౌధములనుగాక పంచమణి హర్మ్యములను మాత్రమే ప్రసాదించుటకు హేతువు పరికరము లయిదగుట మాత్రమే. పంచమణి హర్మ్యములు ప్రసిద్ధముకాదు."

ఏల ప్రసిద్ధముకాదు? అయిదు మణులతో నిర్మించిన హర్మ్యము లుండఁ గూడదా? కేవల మొక్కమణితో నిర్మించిన హర్మ్యముగూడ నుండవచ్చును, ఈ యధిక్షేపమును సూరన పద్యమువందు వీ రేల చేయలేదో! అచ్చటను నయిదేమణులు చెప్పఁబడినవి, అంగజుని బొక్కసమున నవరత్నము లుండవలదా?

"మామిడి మొగ్గలు వజ్రములు, మామిడి పువ్వులు ముత్యములు అనిపించుట సహజముకాదు."

ఏలకాదు ? సహజమేకాదు. సముచితమును.

"ఫలములు లేకుండఁ జిలుకలు ప్రాలుటకూడ సహజముకాదు."

ఫలరహితములైన మామిడిచెట్లనే కవి వర్ణించెనని యేల యనుకొనవలయును? చిలుకలు ప్రాలెననుట యవి సఫలము లనుటకే జ్ఞాపకము.

"వలరాజు వసంతవల్లభుఁడఁట! వలరాజు వసంత సఖుఁడు కాని వసంత వల్లభుఁడు కాఁడు. వల్లభశబ్దము మిత్ర వాచకము కాదు."

వల్లభశబ్దమున కొక్క 'భర్త' యను నర్థము మాత్రమే కలదని వీరి భ్రాంతి. దానికిఁ బ్రియుఁడు, ఇష్టుఁడు అను నర్థములే నిజమైన యర్థములు. భర్త యెట్లును బ్రియుఁడు గనుక నా యర్థములును దరువాత వచ్చినవి. ఇష్టుఁ డన మిత్రుఁడే కదా! అందుచే వసంతవల్లభుఁ డనఁగా వలరాజే యగును.

"నీలములకు 'నగరిపు' విశేషణము ప్రాసమాత్ర ప్రయోజని."

ఇది యెంత హాస్యాస్పదము, నన్యాయకృతమునైన మాట! నగరిపు = ఇంద్ర. వీరి దృష్టిలో నీలముల కింద్ర విశేషణము వ్యర్థమన్న మాట! ఇంద్ర నీలము లను మాటయే వీరు వినలేదన నాశ్చర్యముగా నున్నది! ఒక మహాకవిని బట్టుకొని 'యీ పదము గణమాత్ర ప్రయోజని. ఇది ప్రాసమాత్ర ప్రయోజని' అని నిరపించుట సంగతమా?

ఈ విధముగాఁగుమారసంభవ పద్యము కృతకము గాదనియు, నత్యంతము సహజసుందర మనియు నిరూపింపఁబడినది.

ఇట్లు వీరు చూపిన ప్రతి పద్యమును సహజసుందర మని నిరూపింపనగును.

ఇప్పుడు వారు కొన్ని పద్యములలో నెడనెడ చేసిన యాక్షేపములకు సమాధానము లీఁబడును.

'బండతలయు మోఁకాలు ముడివెట్ట' (8-135) మోఁకాలికి బట్టతలకు ముడివెట్టుట అను పలుకుబడి ప్రసిద్ధము. మోఁకాలికి బండతలకు ముడివెట్టుట అను పలుకు బడి అప్రసిద్ధము.'

ఇచ్చట బండతల యనఁగా బట్టతల యనియే యర్థము. సూర్యరాయాంధ్ర నిఘంటువు బండతల యనుదానికి బట్టతల యనునర్థమునిచ్చి దాని కీ పద్యమునే యుదాహరించినది.

"అలరు పుష్పము లమ్ము లని తలంచి' 4-75) 'మెలఁతల తలవెంట్రుకలఁ బొంది కందెడు నలరుపుష్పము' అనుట హృద్యముగాదు. అంతేకాదు అలరు పుష్పము లనుట అగ్గి నిప్పు లనుట."

అలరు శబ్దమునకుఁ బూ వనియే కాక విరియు, విచ్చు, ఒప్పు అనునర్థములును గలవు. అలరుపుష్పము లనుచో అలరు ఉదంతతద్ధర్మార్థక విశేషణమై యలరునట్టి (విచ్చునట్టి) పుష్పము లను నర్థము గలిగియున్నది.

"తలిరాకునైనఁ గదల్పనోపని మందపవనుండు - ఇట్లనుట తర్కసహము గాదు."

తలిరాకులనైన ననుటచేఁ బవనుని మాంద్యాతిశయము ద్యోతితమయి, యట్టివాఁడు పెనుప్రాపుగా నీశ్వరునిపై నెత్తిపోవు మన్మథుని యవివేకమును మఱింత స్పష్టపఱుచుచున్నది.

డా. శ్రీరామమూర్తిగారి విమర్శ పద్ధతి కింకెన్ని యుదాహరణములు చూపవలయును? కుమారసంభవమునందలి కవిత డా. శ్రీరామమూర్తిగారి 'దుర్వ్యాఖ్యా విషముచే మూర్ఛిత' యైనది.

ఇది కుమారసంభవకర్త మానవల్లి రామకృష్ణకవిగారే కాని నన్నెచోడుఁడు కాఁ డను 'మున్నకై పెక్కినట్టి తలంపుతో' వారుచేసిన విమర్శమని విజ్ఞులకుఁ దోఁపక మానదు.

'ఎస్సు - యెస్సు,' 'రిమ్ము' అను పదముల నాంగ్లభాషలోని 'Yes', Ri,m, అను పదములనుగా భావించి శ్రీ వేదాల తిరువేంగళాచార్యులుగారు నన్నెచోడు నాధునికునిగా వర్ణయించిరని శ్రీ శ్రీరామమూర్తిగారు తమ కనుకూలురనుగా వారిని పేర్కొనిరి.

'కుమారసంభవమునందు 'యెస్' (6-21) అని యింగ్లీషుమాటను చోడుఁడు వాడినాఁడు; 'రిమ్మలు' (8-159) అనియు వాడినాఁడు. కనుక నతఁడు ఇంగ్లీషువారు మనదేశమునకువచ్చి వాళ్ళభాషను మనదేశమున ఆఁడువాళ్ళవరకు వ్యాపింపఁజేసిన తరువాతనే-అనఁగా క్రీ.శ. 1880 ప్రాన్తములలోనే యుండవలసినవాఁడగును.' అని వేదాల తిరువేంగళాచార్యులుగారి అభిప్రాయము.

ఇంతకంటె హాస్యాస్పదము, నన్యాయమునైన మాట యింకొకటి యుండదు. ఎంత నవీనుఁడయినను నిటువంటి పౌరాణికమైన వస్తువును గైకొని కావ్యమును వ్రాయువాఁ డాంగ్లపదములను బ్రయోగించునా? ఒక మహాకవి యొక పదమును బ్రయోగింపఁగా, దాని యర్థము తెలియనప్పుడు నిఘంటుకారులు ప్రకరణమునుబట్టి దాని యర్థమును నిర్ణయించి యా పదమును నిఘంటువులోని కెక్కింతురు. ఈ సూత్రము ననుసరించియే ఎస్సనుపదమునకుఁ 'దిరస్కార సూచకముగ ధ్వనిచేయుట' యను నర్థమును బండితులు నిర్ణయించిరి. రిమ్మల = రెమ్మల = ఉపశాఖలలో = అని కవిగారే యర్థము నిచ్చిరి.

ఆ పదములు కనవచ్చు తావు లివి,

తరువోజ.'....వలదని బుద్ధులు చెప్పఁ
బోయిన మా మాటఁబోవక మమ్ము
నేలిదముగఁజేసి యెస్సని వోయె.(దు) 6-21

క. చెఱకునఁ బుచ్చక రిమ్మలఁ
గఱచిన రసమానరాని గతిఁ దరుణుల నెటు చే
వెఱ వాపక సంగతి కే
డ్తెఱ సేసి మనోరథములుఁ దీరునిఁ బడయన్. 8-159

ఇది మానవల్లివారి పాఠము. ఇందు మొదటిపాదమున యతిభంగమయినది. ఈ పద్యమునకు వావిళ్ళవారి ప్రతిలోఁ బాఠాంతరము గలదు.

క. చెఱకీనఁ బుచ్చ కఱిముఱిఁ
గఱచిన రసమానరాని గతిఁ దరుణులచేఁ
దఱ వాపక సంగతి కే
డ్తెఱసేసి మనోరథములు దీరుఁడు పడయున్.

ఈ పాఠమున 'రిమ్మ' గానరాదు.

ఇవిగాక శ్రీ శ్రీరామమూర్తిగారు కుమారసంభవకర్తపై నింకొక యభియోగమును మోపిరి. అది యాంగ్ల పదప్రయోగముగాక, యాంగ్ల పదబంధ భావము.
ఆ.వె. 'అధిపుఁబాసినపుడ యలఁదురవలవదె

మెలుత మెట్టఁబడిన మీను వోలె,' 8-162

ఇందలి 'మెట్టఁబడిన మీను' అనునది యాంగ్లమునందలి 'Fish out of water' అనుదాని కాంధ్రీకరణమనియు, నందుచేఁ గుమారసంభవకర్త మిక్కిలి యాధునికుఁడనియు వారి వాదము. ఇది యెన్ను, రిమ్మ అను పదములకంటెను నతిముఖ్యమని వారి యభిప్రాయము.

ఈ యుపమానము తెలుఁగువారికిఁ గ్రొత్తకాదు. ఒక కుటుంబములోని యజమానుఁడు పోఁగానే, ఆ కుటుంబ సభ్యులు చెఱువులోని చేఁపలవలె బయటఁబడినా రనుట తెలుఁగునాట సామాన్యముగా ననుమాట. అది యాంగ్లవాక్య భావానుసరణమని భావింపనక్కఱ లేదు.

ఒక భాషలోని భావ మింకొకభాషలో నుండఁగూడదని యేమున్నది? ప్రకరణములు తుల్యము లయినప్పు డన్నిభాషలలోను భావములు తుల్యములుగానే యుండును. అం దేమియు వింతలేదు. అంతమాత్రమున నా కవి నన్యభాషాభిజ్ఞునిగాఁ జెప్పవలను పడదు.

ఈ యుదాహరణమును జూడుఁడు.

ఆంగ్లమున at a stone's throw అను పదబంధము గలదు. దానికి ఱువ్విన ఱాయి పోవునంతదూరము అనఁగా సమీపమున అని యర్థము. His house is at a stone's throw = వాని యిల్లు ఱువ్వినఱాయి పోవునంతదూరమున అనఁగా సమీపమున నున్నది. తెలుఁగులో 'అమ్ము వేటు దూరము' అని తత్తుల్యమయినది కలదు. 'ఱాయి' యైనను, 'అమ్ము' అయినను నొక్కటే కదా!

'వ. అమ్ము వేటు నేలకంటెను దూరంబుగాఁ జని........' వి.పు. 4-190.

ఇది యాంగ్లములోని పదబంధమునకుఁ దుల్యముగా నున్నదిగదా యని విష్ణుపురాణకర్తయగు వెన్నెలకంటి సూరన్నను (1480-90) మనదేశము నాంగ్లేయులు పరిపాలించిన కాలమునాఁటివాఁడని యనవచ్చునా? 'మెట్టఁబడిన మీను' గూడ నిట్టిదేయని గ్రహింపనగును.

కుమారసంభవము మానవల్లి రామకృష్ణకవిగారి రచన కాదనుట కింకొక బలవత్తమకారణము గలదు.

కుమారసంభవ పద్యములకు లఘుటీక వ్రాసిన మానవల్లివారు దశమాశ్వాసమునందలి 'సుజనజనైక భూషణము శూరత' అను 200 వ పద్యమునకు— 'ఈ పద్యములోని శ్లేషార్థము నాకు స్ఫురింపదయ్యె' నని వ్రాసిరి. వారే తత్కావ్యకర్త యయినచో నశ్లీల వ్రాయుదురు. అట్లు వ్రాయుటయును దాను గుమారసంభవ కావ్యమును రచింపలేదని లోకమును గట్టిగా నమ్మించుటకే యందురా వారి కొక నమస్కారము!

శ్రీ కొర్లపాటి వారు తమ విమర్శగ్రంథములో నన్నెచోడుని పద్యములందలి కృతకత్వమును నిరూపించుచుఁజేసిన విమర్శనమును గాకినాడ వాస్తవ్యులు పండిత విమర్శకులు శ్రీ కాశీభొట్ల సత్యనారాయణగారు పరాస్తము చేసినతీరును బరికింపుఁడు. వారి సుదీర్ఘ వ్యాసమునుండి యొకేయొక యుదాహరణము.

సురనది ఝషములు డిగ్గఁగ
శరనిధి కా శరధిలోని ఝషకము లెక్కన్
సురనది కి ల్లెడపడకయ
కురిసె మహావృష్టి గుండ్లు కూల్చినభంగిన్. 6-105

'ఎంత మహావర్షము కురిసినను ఆకాశగంగలోని చేపలు సముద్రములోనికి డిగుట సంభవమేమోకాని సముద్రములోని చేపలు, ఆకాశగంగలోనికి ఎక్కుట అసంభవము. అందువలన ఇది కృతకము.' ఇది కొర్లపాటివారి యభిప్రాయము,

'ఈ వాక్యం వ్రాసిన పెద్దమనిషికి అసలు కవితాహృదయమే లేదంటే అబద్ధం కాదు. తొలిరాత్రి గదిలో స్తన శల్య పరీక్షనుచేస్తూంటే ఈ డాక్టర్నెందుకు కట్టుకొన్నానా అని వధు వేడ్చిందట. ఈ డాక్టరుగారిని చూచిన కవితా సరస్వతికూడా అంతే. 'నింగీ నేలా ఏక మయ్యాయి' అనే సామాన్యోక్తి కూడా తలకెక్కని ఈ

విమర్శకునకు అలంకారశాస్త్రం జోలెందుకు ? ఆకాశగంగలోని చేపలు సముద్రము లోనికి దిగుట సంభవమేమో - అంటే అక్కడికి తా నాకాశగంగను చూచినట్లు, దానిని సిద్ధాంతీకరిస్తున్నట్లు మాట్లాడడం తమ బుద్ధివైశాల్యాన్ని ప్రదర్శించటమే. దీనికి మూలమని, సహజమని చూపబడిన ఉదయనోదయము నందలి పద్యములోని నాయిక కాళ్ళు చాపి పడుకొని ఆకాశాన్నిచూస్తూ ఏడుస్తోందేమో అనుకోవాలి. అలాకాకపోతే కంటినీరు చెవులవరకు ప్రాకటం, అవి కర్ణ పాథోనిధులు కావటం, అందుండి ఎదురెక్కిన చేపలా కన్నుండటం కుదరదు. ఈ పద్యం రుచించిన విమర్శకునకు ఆ పద్యం కృతకమైందంటే నాలుకయందున 'రుచి బొడిపులు' అరిగిపోవటమే కారణం.'

'కుమారసంభవకర్తకు సంస్కృతపదముల సరిగా నుపయోగించుటకానీ, కూర్చుటకానీ తెలియదు. నిరర్థకములు, అనర్థకములు, పునరుక్తములు నగు పదములు. తగని వాక్యరచనలు, మాటల కక్కురితి, అపప్రయోగములు, చాలచోటుల నానాభాషా సాంకర్యము, అధికముగా పరభావచౌర్యము ఇత్యాదిలోపములు చాలా యున్నవి.' అను వేదాల తిరువేంగళాచార్యులవారి మాట యెంత అవిచారమూలకమో, యెంత యన్యాయమో విజ్ఞులెఱుఁగకపోరు. అయిన నొక ప్రశ్నము.

'శ్రీ మానవల్లివా రనినట్లు నన్నెచోడుఁడు నన్నయకుఁ బూర్వకాలమున నుండినవాఁడు కాఁడు. డాక్టర్ కొర్లపాటివా రనినట్లు కుమారసంభవము శ్రీ మానవల్లి వారి రచనయుఁగాదు. మీ రనినట్లు నన్నయ తిక్కనల నడిమికాలమువాఁ డయి యుండుచోఁ - దరువాతవచ్చిన కవు లెవ్వరును దమ కావ్యములలోఁ బూర్వకవిస్తుతిలో నన్నెచోడుని బేర్కొనకుండుటకుఁ గారణమేమి ? నిజమే. అది యాలోచనీయాంశమే. అనంతర కవులలో నొక్కరు కాకపోయిన వేఱొక్కరెవ్వరయిన నట్టి మహాకవిని స్మరింపకుండుటకుఁ గారణము మృగ్యము. కాని యది కారణముగా నన్నెచోడు నత్యాధునికునిగా నిర్ణయించుట యన్యాయము. నన్నెచోడుని పదప్రయోగవైచిత్రి, విలక్షణమైన శయ్య యతఁడు ప్రాచీనకాలమువాఁడనియే ఘోషించుచున్నవి.

కావ్య సమీక్ష

ఇఁక నీ విషయము నింతటితో నాఁపి కావ్యసమీక్షకు దొరఁకొందును. ఈ కావ్యమునఁ బంద్రెండాశ్వాసములు గలవు, ఒక్కొక్క యాశ్వాసమునందలి కథ యిది.

ప్రథమాశ్వాసము : 1, దక్షుని ప్రార్థన ననుసరించి యాదిశక్తి సతీదేవి యను పేర నతనికిఁ బుత్రికయై శివుని వివాహమాడుట. 2, అ దంపతులు గజరూపములను ధరించి క్రీడింపఁగా వారికి గజముఖుఁ డావిర్భవించుట, 3. దక్షుఁడు తన పుత్రికల నందఱను జూడనరిగి కశ్యప ప్రభృతి జామాతలచే సమ్మానితుఁ డగుట.

ద్వితీయాశ్వాసము : 1' దక్షుఁడట్లే శివునిగూడఁ జూడనేఁగఁగా నాయన తక్కిన యల్లురవలె మామను సత్కరింపకుండుట. 2. అందులకుఁ గుపితుఁడై దక్షుఁడు శివు నవమానింపఁ దలఁచి తానుజేయు యజ్ఞమున కతని నాహ్వానింపక తన కూఁతును మాత్రమే పిలిపించుట. 3, తనభర్త నాహ్వానింపమికి సతీదేవి తండ్రి నధిక్షేపింప, నతఁడు శివుని నిందించుట, అందుల కామె పట్టరానికోపమున యోగాగ్నియం దాత్మాహుతి చేసికొనుట,

4. గజాస్యుఁడు ప్రమథసహితుఁడై దక్షాధ్వరధ్వంసముఁ గావించి, దక్షుని బంధించి శివునికడకుఁ దెచ్చుట, 5, శివుఁ డతనిని క్షమించి యాగఫలము ననుగ్రహించి ప్రజాపతిగ నియమించుట,

తృతీయాశ్వాసము : 1. సతీదేవి హిమవంతునకుఁ గూఁతురై పుట్టుట, 2. హిమవంతుని కడకు నారదుఁడు వచ్చి పార్వతినిజూచి యామె యీశ్వరునకు భార్య యగునని చెప్పుట. 3, శివుఁడు తపస్సొనరింప హిమవత్పర్వతమునకు రాఁగా, హిమవంతుఁ డాతని పరిచర్యకై పార్వతిని నియోగించుట,

చతుర్థాశ్వాసము : 1. దేవతలు, తారకాసురుఁడు తమ్ముఁబెట్టు బాధలను బ్రహ్మతో మొరపెట్టుకొనఁగా నతఁడు పార్వతీ పరమేశ్వరుల కుమారుఁడు తారక సంహార మొనరింపఁగలఁడని యుపదేశించుట, 2. పార్వతీశ్వర సంయోగమును గల్పింప నింద్రుఁడు మన్మథుని నియోగించుట, 3, మన్మథుఁడు సపరివారముగా నీశ్వరుని తపోవనమున కేఁగుట, 4, వసంతుఁడు శివ తపోవనమున నకాల వసంతోదయమును గల్పించుట.

పంచమాశ్వాసము : 1. వాసంతకుసుమాలంకృతయై తన్ను సేవింపవచ్చిన పార్వతిని జూచి శివుఁడు చలించుట. 2. నిజ మనోవికారమునకుఁ గారణము మన్మథుఁడని తెలిసికొని శివుఁ డాతనిని దన మూఁడవ కంటిమంటచే భస్మీకరించుట. 3. రతివిలాపము. 4. భర్తకై విలపించు రతి నాకాశవాణి సమాశ్వాసించుట. 5. పార్వతి విరహతాపము. 6. చెలికత్తెల శిశిరోపచారములు.

షష్ఠాశ్వాసము : 1. పార్వతి తండ్రి యనుమతిని గైకొని తపోవనమున కేఁగుట. 2. ఆమె యొక మునిపల్లెనుజేరి యచ్చటనున్న జంగమ మల్లికార్జునుని యొద్ద దీక్షఁ గైకొని తపోవేషధారిణియై గంగాతీరమున నాశ్రమ మేర్పఱుచుకొని ఘోరమగు తపస్సు నాచరించుట. 3. ఒక్కొక్క ఋతువులోను బార్వతీ తపోవర్ణనము.

సప్తమాశ్వాసము : 1. శివుఁడు కపటబ్రహ్మచారి వేషమునఁ బార్వతి కడకు వచ్చి యామె తపస్సునకు మెచ్చి యామెకు సాక్షాత్కరించుట. 2. శివుఁడు కన్యావరణార్థము సప్తర్షులను హిమవంతుని చెంతకుఁ బంపుట.

అష్టమాశ్వాసము : సప్తర్షులు వివాహనిశ్చయము గావించుకొని వచ్చుట. 2. శివుఁడు పెండ్లికొడుకయి బ్రహ్మాదులతోఁ బెండ్లికిఁ దరలిపోవుట. 3. హిమవంతుఁడు మగపెండ్లివారి కెదురుసన్నాహము నెఱపుట. 4. ఆ రేయి యోషధిప్రస్థపురమున విజృంభించిన విటీ విట శృంగారక్రీడలు.

నవమాశ్వాసము : పార్వతీశ్వరుల వివాహము. 2. తుంబురునారదులగానము. 3. రంభాదుల నాట్యము. 4. దేవతల ప్రార్థనపై శివుఁడు మన్మథుని బునరుజ్జీవితుని గావించుట. 5. వసంతోత్సవము. 6. జలక్రీడలు. 7. పార్వతీ పరమేశ్వరులు కైలాస నగమున కరుగుట. 8. వారి వివిధ రతి క్రీడా వర్ణనము.

దశమాశ్వాసము : 1. పార్వతీశ్వరుల శయనమందిరము. 2. అందుఁ బ్రవేశించిన యగ్నిపై శివుఁడు నిజవీర్యమును జల్లుట. 3. అగ్ని దానిని దాల్చి శరవణ సరసి కరుగుట. 4. అరుంధతి గాక తక్కిన ఋషిపత్ను లగ్నివలన శివుని వీర్యమునుగొని గర్భవతులగుట. 5. వారు నిజ గర్భస్థ పిండములను సరోవరగర్భమునఁబెట్టి పోవుట. 6. ఆ పిండము లన్నియు నేకమయి పక్వమై కుమారుఁ డుద్భవించుట. 7. నారదుఁ డా కుమారుని తేజోవిశేషాదుల నింద్రునకుఁజెప్పఁగా నతఁడు కుమారునిపై నెత్తి వచ్చి, యోడిపోయి శివుని శరణుఁ జొచ్చుట. 8. పార్వతీ పరమేశ్వరు లా కుమారుని

దను కుమారునిగా గుఱుతించి తారకాసురవధకై సురసేనా నాయకునిగా నభిషేకించుట. 9. కుమారుని క్రౌంచాచల భేదనము. 10. దేవతలు బృహస్పతి తనయుఁడగు సుమతిని దారకాసురుని కడకు రాయబారిఁగా నంపుట. 11. తారకుఁడు దూతను నిందించి వధింపఁబూనుట. 12. శుక్రకృత ధర్మోపదేశము. 13. తారకుఁడు దేవ సభకు దూత నంపుట. 14. యుద్ధనిశ్చయము, 15. శుక్రుఁడు తారకునకు రాజనీతి నుపదేశించి యుద్ధమును నివారింపఁబూనుట. 16. తారకుని నిరాకరణము.

ఏకాదశాశ్వాసము : 1. ఉభయ సైన్యములును జతురంగ బలసమన్వితములై యుద్ధభూమినిజేరి ఘోరయుద్ధముఁజేయుట.

ద్వాదశాశ్వాసము : 1. కుమారతారకులు పరస్పరము పోరుట, 2. కుమారకృత తారకాసురసంహారము, 3. దేవతల యభినందనములు. 4. విజయలక్ష్మి శోభితుఁడగు కుమారుఁడు తల్లిదండ్రులను దర్శించుట. 5. పరమేశ్వరుఁడు కుమారున కీశ్వర తత్త్వోపదేశము చేయుట.

సతీవృత్తాంతము, గజాననోత్పత్తి, దక్షాధ్వరధ్వంసము అను వానివి విడిచి యీ కథనే పార్వతీజననాదిగాఁ గవికుల గురువైన కాళిదాస మహాకవి సంస్కృతమునఁ గుమారసంభవమును రచించెను. ఆ కాళిదాసు కావ్యమున కిది యనుకరణముగాని, యనువాదముగాని కాదు. అట్టి మహాకవి కావ్య మొకఁ డున్నప్పు డదే కావ్యమును వ్రాయఁదలఁచు కొన్నవాఁ డెంతటివాఁడైనను దాని ననువదింపకుండ నిగ్రహమును బాటించుట కష్టము. ఆ కవి కవితాప్రతిభనుండి తప్పించుకొను టంత సులభముగాదు. కాని నన్నెచోడుఁడు మిక్కిలి స్వతంత్రుఁడైన యాంధ్రమహాకవి. అతఁడు వర్ణన ప్రియుఁడు. చేసిన సుదీర్ఘ వర్ణన లన్నియు స్వకపోలకల్పితములే. కాళిదాసుశ్లోకము లలో బహు స్వల్ప సంఖ్యాకములైన వానికి - వ్రేళ్ళపై లెక్కింపఁదగిన వానికి నీతని కావ్యమున నాంధ్రీకరణ ప్రాయములు గానవచ్చును. కాళిదాసుచే శిరఃకంప మును జేయించు పద్యములును గొన్ని యీ కవి కావ్యమునఁ గలవు. మచ్చున కీ పద్యములు చూడఁదగును.

కవి కోపించెనో ? కానక
మును గోపించెనో ? మహోగ్రముగ నుగ్రుఁడు సూ
చినఁ గాలెనో ? చూడక యట
మును గాలెనో ? నాఁగ నిమిషమున నఱఁ గాలెన్. 5.51

గిరిసుత పైఁ గామాగ్నియు,
హరు పై రోషాగ్నియుం, దదంగజుపై ను
ద్ధుర కాలాగ్నియు, రతి పై
నురు శోకాగ్నియును దగిలి యొక్కట నెగసెన్. 5.52

మొదటి పద్యమున మన్మథుని నిమిషమాత్ర దగ్ధత యత్యద్భుతముగా వర్ణింపఁబడినది. రెండవదానిలో నాలుగగ్ని లేకపై యొక్కట నెగసిన తీ రాశ్చర్యముగాఁ జెప్పఁబడినది. ఇట్టి పద్యము లెవరిచేనైన నోహో యనిపింపకమానవు.

కాళిదాసు వర్ణనలతో నీ కవి వర్ణనలను బోల్చి చూచుచో నీతఁ డా మహాకవితో నెట్లు పోటీపడి రచించెనో స్పష్టపడఁగలదు. 'అస్మదీయానూన ప్రతిభార్ణవోదీర్ణ రుచిర వస్తు విస్తారి తోత్తమకావ్యరత్న' మని యాతఁడే వాకొనుటలోని యంతరార్థ మిదియే.

జాను తెనుఁగు

జానుతెనుఁ గను పదమును వాడిన మొదటి కవి యీతఁడే కావచ్చును. జాను తెనుఁ గనఁగాఁ దన యభిప్రాయమేమో యతఁడు స్పష్టముగాఁ జెప్పలేదు కాని, యా పదము నతఁ డుపయోగించిన పద్యమునుబట్టి యతని యభిప్రాయమును మనము గ్రహింపవచ్చును.

చ. సరళముగాఁగ భావములు జానుదెనుంగున నింపుపెంపుతోఁ
బిరిగొన, వర్ణనల్, ఫణితి పేర్కొన, నర్థములొత్తగిల్ల, బం
ధురముగఁ బ్రాణముల్ మధుమృదుత్వరసంబునఁ గందళింప, న
క్షరములు సూక్తు లార్యులకుఁ గర్ణరసాయనలీలఁ గ్రాలఁగాన్. కుమా. 1.35

అనుదానినిబట్టి భావములు సరళముగా వ్యక్తముచేయుట—జానుతెనుఁగు లక్షణమని యతఁ డుద్దేశించినట్లు తెలియనగును.

జానుతెనుఁ గను నీ మాటను బాల్కురికి సోమనాథుఁడు కూడఁ బ్రయోగించెను. దాని కుదాహరణముగా నతఁడొక పద్యమును వ్రాసెను.

బలు పొదతోలు సీరయును, బాఁప సరుల్, గిలుపారు కన్ను వె
న్నెల తల. సేఁదుకుత్తుకయు. నిండిన వేలుపుఁటేలు, వల్గు పూ
సలు గల తేని లెంక వని జానుతెనుంగున సన్నుతించెదన్
వలపు మదిం దలిర్ప బసవా! బసవా! బసవా! వృషాధిపా!

ఈ పద్యమునుబట్టి జానుతెనుఁగన నచ్చతెనుఁగను భ్రాంతి పొడమవచ్చును. కాని యీ క్రింది ద్విపదలలో నా పదమున కాతఁడే లక్షణమును జెప్పెను.

ఉరుతర గద్య పద్యోక్తులకంటె
సరసమై పరఁగిన జానుతెనుంగు
చర్చింపఁగా సర్వసామాన్య మగుటఁ
గూర్చెద ద్విపదలు కోర్కి దైవార. (బసవ పురాణము)

ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ఠ రచన
మానుగా సర్వసామాన్యంబు గామి
జాను తెనుఁగు విశేషము ప్రసన్నతకు. (పండితారాధ్య చరిత్ర)

సోమనాథుని యభిప్రాయములో జాను తెనుఁగన నారూఢ గద్యపద్యాది ప్రబంధ పూరిత సంస్కృత భూయిష్ఠ రచనకంటెను, ఉరుతర గద్య పద్యోక్తులకంటెను భిన్నమై, సర్వసామాన్యమై, విశేషముగాఁ బ్రసన్నమై, సరసమైన భాషయనియర్థము చేపికొన వచ్చును. సంస్కృత భూయిష్ఠముకాని రచన యచ్చతెనుఁగు కాదా? యనిన, సంస్కృత భూయిష్ఠమైన రచనవలెనే యచ్చతెనుఁగుకూడ సర్వసామాన్యము, సరసము, ప్రసన్నముకాదు, తెనుఁగువారి నిత్యవ్యవహారములో నుండు సంస్కృతముతో మేళవించినను, ఏ రచనకు సర్వసామాన్యత, సరసత, ప్రసన్నత ముఖ్యములయి యుండునో యది జానుతెనుఁగని గ్రహింపవలయును. అది 'ఉరుతర గద్య పద్యోక్తుల కంటె భిన్నమై యుండవలయు' ననుటలో సోమనాథుఁడు ద్విపద నుద్దేశించె నన వచ్చును. కాని నన్నెచోడుఁడు గద్యపద్యోక్తులతోనే రచన గావించెను. సంస్కృత పదములను మెండుగాఁ బ్రయోగించెను. అందుచే నన్నెచోడుని యభిప్రాయమున జానుతెనుఁగన సంస్కృత మిశ్రిత మయినను, గద్యపద్యోక్తులతోఁ గూడినది యయినను భావ సారళ్యముగల రచనయని చెప్పవచ్చును. అదియే సోమనాథుఁ డుద్దేశించిన సర్వసామాన్యత, సరసత, ప్రసన్నత యని చెప్పవచ్చును.

నిజమునకు జాను తెనుఁగును ప్రస్తావించిన యీ కవులిరువురి రచనలును వారు దానికిఁ జెప్పిన లక్షణమునకు లక్ష్యములు గావు. ఇరువురి రచనలును సంస్కృత భూయిష్ఠములే. ఇరువురివియును సర్వసామాన్యములుగాని, విశేషప్రసన్నములుగాని కావు. నన్నెచోడుని రచనయందు విద్వద్వరేణ్యుల నెంతయో తికమకపెట్టు పద్యము లెన్నియో కలవు. మఱి వారేల యట్టి లక్షణమును జెప్పిరన, నది యాదర్శ రచన కుండవలసిన లక్షణమనియే కాని యక్షరశః తాము పాటింతు మనుట కాదు.

మార్గ దేశి కవిత్వములు

నన్నెచోడుఁడు మార్గ దేశి కవిత్వము లను మాటలను ప్రయోగించెను.

మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గును నిలిపి రంధ్రవిషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్.

మార్గ కుమార్గము దేశి య
మార్గము వగవంగఁ దనకు మది వదలక దు
ర్మార్గ పదవర్తు లనఁ దగు
మార్గవులం దలఁప నలవి మహి సుకవులకున్.

పూర్వము మార్గకవిత లోకమునఁ బ్రసిద్ధముగా నుండఁగా నాంధ్రదేశమునఁ జాళుక్యరాజు మొదలుగాఁ బలువురు దేశికవితను బుట్టించి రని యున్నది. కావున - చాళుక్య రాజులకుఁ బూర్వముండినది సంస్కృత కవిత్వమే కనుక మార్గ కవిత్వమనఁగా సంస్కృత కవిత్వమనియు, వా రాంధ్రదేశమునఁ బుట్టించి నిలిపినది భారతమువంటి కవిత్వము గాన దేశికవిత్వ మన నదియే యనియు నన్నెచోడుని యభిప్రాయ మయియుండునని మనము తలఁపవచ్చును. కుమార్గ మని మార్గను, నమార్గ మని దేశిని ద్రోసిపుచ్చి దుర్మార్గమును బట్టి పోవు మాఱుగవులను సుకవులు స్మరింపరాదని నన్నెచోడుని హెచ్చరిక. ఆంధ్రదేశమున దేశికవిత్వమును నిలిపిన చాళుక్యరా జాంధ్రమున భారతమును రచింపఁజేసిన రాజరాజ నరేంద్రుఁ డనియుఁ నంతకుఁ బూర్వమే తెలుఁగుభాషకు రాజభాషగాఁ బట్టముగట్టి శాసనముల

కెక్కించిన గుణగవిజయాదిత్యుఁడనియు నభిప్రాయభేదములు గలవు. కాని సుప్రసిద్ధమైన భారతగ్రంథ రూపమున నాంధ్రదేశమున దేశికవిత్వమును నిలిపినవాఁడు రాజరాజనరేంద్రుఁడే కావునను, గుణగ విజయాదిత్యుని కాలమునాఁటికిఁ గొన్ని శాసనస్థ పద్యములుతప్పఁ జెప్పుకొనఁదగిన కవితారూపమునఁ దెనుఁగు లేదు కావునను పీ పద్యమునఁ బేర్కొనఁబడిన చాళుక్యరాజు రాజరాజనరేంద్రుఁడే యని విశ్వసింపఁ దగును. నన్నెచోడుని కవిత్వముకూడ నన్నయాదుల కవిత్వమునే పోలియున్నది కావున నతని కవిత్వమువలెనే దేశి యని భావింపవచ్చును.

వ స్తు క వి త్వ ము :

నన్నెచోడుఁడు తన కుమారసంభవమున బహుపర్యాయములు ప్రయోగించిన యింకొక మాట వస్తుకవిత్వము. అతని దృష్టిలో వస్తుకవిత్వ మన నేమియో యూహింపవలసినదే కాని యిదమిత్థముగాఁ జెప్పవలనుపడదు. ఈ క్రింది పద్యమును జూచుచో నతని యభిప్రాయమువ వస్తుకవిత యననేమో తెలియవచ్చును.

మృదురీతి సూక్తు లిం పొదవింప మేలిల్లు
        భావమ్ము నెలమిఁ బ్రీత్యావహముగ
మెఱుఁగులఁ గన్నులు మిఱుమిట్లు వోవంగఁ
        గాంతి సుధాసూతి కాంతిఁ జెనయ
వర్ణన లెల్లచో వర్ణన కెక్కంగ
        రసములు దళుకొత్తి రాలువాఱ
దేశి మార్గంబులు దేశీయములుగా న
        లంకారములఁ దా నలంకరింప
నాదరించి విని సదర్థాతిశయమున
బుధులు నెమ్మనమున నిధులు నిలుప
వలవదే సమస్త వస్తు కవీశ్వర
నూత్న రుచిర కావ్య రత్న వీథి ? 1-66

పయి పద్యభావమునుబట్టి వస్తుకవిత్వము మృదువులై యాహ్లాదమును గలిగించు సూక్తులతోను, ప్రీతినిగలిగించు మేలయిన భావములతోను, వెన్నెల వెలుఁగు వలెఁ గన్నులు మిఱుమిట్లుగమ్ము కాంత్యాది గుణములతోను, శృంగారాది రసముల

తోను, ప్రసిద్ధములయిన వర్ణనలతోను. దేశి కవితారీతులతోను, నుపమాద్యలంకారముల తోను బండితు లాదరించులాగున నుండునది యని తెలియుచున్నది.

ఇతఁడు కవిస్తుతిలోఁ గొందఱను వస్తుకవులనుగా స్తుతించెను. వారిలోఁ బొలుత నాదికవి వాల్మీకిని వస్తుకావ్యాబ్జ రవినిగాఁ బ్రశంసించెను. తరువాత వ్యాసుని, గాళి దాసుని, భారవిని, నుద్భటుని, బాణుని వస్తుకవులనుగాఁ బేర్కొనెను,

ఈతఁడు పేర్కొనిన యీ సంస్కృతకవుల కావ్యములను బరిశీలింపఁగా నవి యన్నియును గథాప్రధానములై, వర్ణనాత్మకములై, యలంకార శోభితములై యున్నట్టివే కదా! ఇతని కుమారసంభవము కూడఁ గథాప్రధానము, వర్ణనాత్మకము, అలంకార శోభితము నయి యొప్పుచున్నది. కావునఁ బయి లక్షణములతోఁ గూడినదే వస్తుకవిత యని చెప్పవచ్చును.

అయిన నొకమాట. వస్తు వర్ణనాలంకారములు లేని కావ్య మేదయిన నుండునా? అట్టిచో లోకమునఁగల కావ్యజాలమునం దంతటను వస్తుకవిత్వమే యున్నదన వచ్చునా? యనిన నట్లుకాదు. కేవలతత్త్వ ప్రతిపాదక గ్రంథములును, వేదాంత ప్రధాన గ్రంథములు నుండవచ్చును. అట్టివానిలోనిది వస్తుకవిత్వము గాదన్నమాట.

నన్నెచోడుఁ డీ గ్రంథము నింకొకచోటఁ బ్రబంధమునుగాఁ బేర్కొనెను,

'జంగమ మల్లికార్జును నిసర్గకవి స్తవనీయ ....
భంగిగ విస్తరించెదఁ బ్రబంధము సద్రసబంధురంబుగాన్. 1-48

దీనినిబట్టి యతని దృష్టిలో వస్తుకవిత్వమన్నను, ప్రబంధకవిత్వ మన్నను నొక్కటే యని భావింపవచ్చును. ఆంధ్ర సాహిత్యమున మొట్టమొదటి ప్రబంధ మిదియే యని చెప్పవచ్చును. ప్రబంధమునకు లక్షణము లేవి యని చెప్పఁబడినవో, యవి యన్నియు నిందుఁ బుష్కలముగాఁ గలవు,

వర్ణనలు

ప్రబంధములో నష్టాదశ వర్ణన లుండవలయునని నియమము, నన్నెచోడుఁడు వర్ణనప్రియుఁడు. పదునెనిమిది వర్ణనలును బరిపూర్ణముగా నున్న తెలుఁగుకావ్య మిది యొక్కటియే యని చెప్పవచ్చును. తాను గావ్యమునఁ జేయఁబోవు వర్ణనల నీ కవి యవతారికనిలో చ్చియున్నాఁడు.

వన జలకేళీ రవి శశి
తనయోదయ మంత్ర గతి రత క్షితిప ర ణాం
బునిధి మధు ఋతు పు రోద్వా
హ నగ విరహ దూత్య వర్ణనాష్టాదశమున్.

మన్మథుఁడు పరమేశ్వరుని తపోవనమునకు వచ్చి వసంతుని బిల్చి 'యీ వాసంతికానంద దోహల మీ కాననలక్ష్మి కి' మ్మనినప్పు డీ కవి వనవర్ణనమును గావించి నాఁడు.

పార్వతీ పరమేశ్వరుల వివాహానంతరము మన్మథుఁడు పునర్జన్మము నంది నప్పుడు జనులందఱు నానందముతో జలకేళి సలిపినట్లు వర్ణింపఁబడినది.

శివుఁడు పెండ్లికై హిమవంతమునకుఁ దరలివచ్చినప్పుడు సూర్యాస్తమయ మును, నంధకారమును, జార చోరాదులను, జంద్రోదయమును వర్ణించినాఁడు. తనయో దయ వర్ణనమును గుమారోదయ సందర్భమునఁ జేసినాఁడు.

యుద్ధమునకు ముందు శుక్రుఁడు తారకునకుఁ జేసిన నీత్యుపదేశములో మంత్ర వర్ణనమును, కుమారుఁడు దేవసేనలతోఁ దారకునిపై దండెత్తి వెడలినప్పుడు గతి (యాత్రా) వర్ణనమును, పార్వతీశ్వరుల సంభోగ సందర్భమున రతి వర్ణనమును, గుమారుఁ డింద్రు నోర్చినప్పుడు క్షితిప వర్ణనమును, గుమార తారకు లొండొరులతోఁ బోరినప్పుడు యుద్ధవర్ణనమును, దక్షుఁడు తన యల్లుఁడగు వరుణుని జూడఁబోయినప్పు డర్ణవ వర్ణనమును గావించినాఁడు.

శివుని వివాహానంతరము పురజనులు వన జలకేళులు సలిపినప్పుడు స్త్రీల మధు పాన వర్ణనమును, పార్వతి తపస్సు చేసినప్పుడు ఋతుషట్క వర్ణనమును, సప్తర్షు లోషధిప్రస్థమునకుఁ బోయినప్పుడు పుర వర్ణనమును, పార్వతీశ్వరుల వివాహ సందర్భమున నుద్వాహవర్ణనమును, హిమవద్వర్ణనమున నగవర్ణనమును, మన్మథ దహనానంతరము పార్వతీ విరహవర్ణనమును, కుమారుఁడు తారకునికడకు బృహస్పతి సుతుఁడగు సుమతిని రాయబారిగాఁ బంపినప్పుడు దూత్యవర్ణనమును గావించినాఁడు.

ఈ వర్ణనలలో నీ కవి గావించిన చమత్కారములు సహృదయ హృదయా నందకరములు. మచ్చునకుఁ గొన్ని :

జలవాసులైన హరి ల
క్ష్మలు వర్ష నిశావసానమున మేల్కని క
న్నులు విచ్చి చూచినట్టులు
జలజోత్పలరుచులు వెలసె శారదవేళన్. 6-113

శరదాగమంబు తన సుత
కురు పరితాపంబు సేయుచుండుట హిమ భూ
ధర పతి గని వానిపయిన్
బరిగొనియెనొ నాఁగఁ దుహినపటలము పర్వెన్. 6-123

మరు చేతనుండి హరు గె
ల్పరు, దుమచేనుండి గెల్వనౌనని సుమన
శ్శరములు కరముల వెలపిన
కరణిఁ గరాంగుళము లచలకన్యక కొప్పున్. 8-58

పాయక సర్వర్తుక పు
ష్పాయత గంధములు గొంచు నప్పురిఁ బగలున్
రేయును నింటింటికి మృదు
వాయువు సనుచుండు గట్టువాలును బోలెన్. 7-125

ఇట్లెన్నియని యుదాహరించుట ! ఈతఁడు చేసిన వర్ణనలన్నియు వివిధాలంకారములచే శోభిల్లుచుఁ గవితాపరిమళముచే గుబాళించుచుండును.

ర స ము లు

నన్నెచోడుని కుమారసంభవము సర్వరసముల కాలవాలము.

అయినను నిందు శృంగార మంగిరసముగాను, దక్కిన వీరాదు లంగరసములుగాను బ్రపంచింపఁబడినవి. సంయోగ విప్రలంభములనెడి ద్వివిధ శృంగారములు నిందు వర్ణితము లయినవి. మొదట సతీశంకరుల సంయోగమున సంయోగశృగారమును, సతీ మరణానంతరము పార్వతీ వివాహపర్యంతమును విప్రలంభ శృంగారమును, మరలఁ బార్వతీపరమేశ్వరుల సంయోగ శృంగారమును విస్తృతముగా వర్ణింపఁబడినవి.

ఇఁక దక్షాధ్వరధ్వంస సందర్భమున గణనాయకులు పెట్టుబాధల కోడి దేవతలు పాఱిపోయిన విధమును వర్ణించునప్పుడు హాస్యరసమును, మన్మథ దహనానంతరము రతి విలాపసందర్భమునఁ గరుణ రసమును, తారకుని రౌద్రాకారమును వర్ణించుటలో రౌద్రరసమును, కుమారుని పరాక్రమ వర్ణనలో వీరరసమును. యుద్ధభూమి వర్ణనమున బీభత్సరసమును, యుద్ధమున రాక్షసమాయకుఁ బ్రతీకారముగా మహామాయ వారి నెల్ల చీమలనువలె మ్రింగినవిధమును వర్ణించునప్పు డద్భుతరసమును, శివుఁడు కుమారునకు జ్ఞానోపదేశము చేయు సందర్భమున శాంతరసమును నీ కవి మనోహరముగా వర్ణించినాఁడు.

నన్నెచోడుని కుమారసంభవమునందలి కవితాసుందరి యుపమోత్ప్రేక్షా రూపకాది వివిధాలంకార శోభితయై, ప్రసాద మాధుర్యాది సర్వగుణ విలసితయై విరాజిల్లుచుండును.

వర్ణనావేశ పరవశుఁడై నన్నెచోడుఁ డొక్కొకతఱి నౌచిత్యము మేర మీఱిన పట్టులును గలవు. 'అనౌచిత్యా దృతే నాన్య ద్రసభఙ్గస్య కారణ' మనికదా లాక్షణికుల హెచ్చరిక ; ఎంతటి యావేశపరవశుఁడైనను గవి సంయమమును గోల్పోవక యౌచిత్యరేఖ నతిక్రమింపక ప్రవర్తిల్లుచు రససంపదను రక్షించుకొనవలయును. పార్వతీ యౌవనమును ముందు వర్ణించియుఁ దనివితీఱక యితఁడు మరల వివాహమునకు ముందామె సర్వావయవములను వర్ణించుట యనావశ్యకము. అందును నా వర్ణనను సప్తర్షులచేఁ గావింపఁజేయుట మఱియు ననుచిత మనిపించును. అత్తవారింటికిఁ గూఁతును సాగనంపునపుడు తల్లియగు మేనయుఁ గూఁతురగు పార్వతియు నొండొరులఁ గౌఁగిలించుకొను తీరుమ వర్ణించిన సందర్భమునందలి

ఉరు కుచాగ్రంబు లొండొంటి నొత్తుదేర
నెదురు కౌఁగిలింపఁగ నను వెట్టుఁగాక
కెలని కౌఁగుచుఁ గుచతటుల్ బలిమినొత్త
నంది కే లెట కేనియు నందికొనిరి. 9-143

అను పద్య మౌచిత్యదూర మనఁ జెల్లును. ఇట్టిపట్టుల సహజముగా నుండవలసిన శోకస్థాయిక మగు కరుణమునకు భంగమయి జుగుప్స గలుగుచున్నది.

మతము - గురువు

ఈ కృతియందలి యవతారికా పద్యములో 'అఖిల లోకములుం దగఁ గాచుచున్న వేదాంగు ననంతు విష్ణుఁ గమలాధిపు సంస్తుతిఁ దేల్తు సమ్మతిన్' అని విష్ణుస్తుతిని జేసినను, ఆ స్తుతించుటలో విష్ణుని 'పరమేశ్వరోరువా - మాంగమునందు ము న్నుదయమ్మై నియమస్థితిఁ గొల్చిన వానినిగాఁ జెప్పుట నన్నెచోడుని శివభక్తితత్పరత్వమును దెలుపుచున్నది, 'శ్రీవాణీం' ద్రేత్యాది ప్రథమ పద్యమునఁగూడ విష్ణు బ్రహ్మలను శివునర్చించువారినిగనే పేర్కొనుటయు, హరిని వికచారుణాంబుజ సహస్రములను బూన్చి హరునిఁ బూజించువానినిగాఁ జేయుటయేకాక యతఁడు భ్రాంతికి లోనైనవానినిగా నిరూపించి నవ్వులపాలు చేయుటయు నీ కవి శివభక్తి పారమ్యమునకు నిదర్శనము. శివుఁడు వివాహ మంటపమునకు విచ్చేయునప్పు డా దేవున కిరుగెలంకుల డాపి మణిహేమ దండ చామరలు పెట్టువారినిగా హరి సురవల్లభులను బేర్కొనుటయు నతని శివభక్తి తాత్పర్యమునకు నిదర్శనము.

కాలాముఖ శైవవ్రత సంప్రదాయానుసారి యగు జంగమ మల్లికార్జునుఁ డీతని గురువు. అ గురువునకుఁ బరమశివునితో నభేదమును బాటించునంతటిది యీతని గురుభక్తి, వివాహమునకుఁ దరలివచ్చు నీశ్వరునిఁ జూడవచ్చిన పురస్త్రీ లాతని జంగమ మల్లికార్జుననిగా భావించినట్లు వర్ణించునంతటి గురుభక్తి తత్పరత యీతనిది. అయినను నన్నెచోఁడుడు శివకథను గైకొని దానినొక కావ్యమునుగా రచించినాఁడేకాని పండితారాధ్య పాల్కురికి సోమనాథులవలె నన్యమతాసహనమును జూపునట్టియు, శైవమతైక ప్రచార సాధనమయినట్టియు గ్రంథమును రూపొందించి యుండలేదు. అందుచే నన్నెచోడుఁ డెంతటి శివభక్తుఁడైనను వీరశైవుఁడు మాత్రము కాదని చెప్ప వచ్చును.

గర్భ బంధ చిత్ర కవిత్వములు

ఈ కవి యీ కావ్యమున గర్భకవిత్వమును, బంధకవిత్వమును, చిత్రకవిత్వమును రచించెను.

శివుఁడు కుమారస్వామికి జ్ఞానోపదేశము చేయుసందర్భమున నితఁడు చతుర్విధ కందమును, కందగర్భవృత్తమును రచించినాఁడు.

చతుర్విధకందము

సుజ్ఞాన యోగ తత్త్వ వి
ధిజ్ఞుల్ భవ బంధనములఁ ద్రెంచుచు భువిలో
నజ్ఞాన పదముఁ బొందక
ప్రాజ్ఞుల్ శివుఁగొల్తు రచలభావన దవులన్. 12-216.

గర్భ ద్వితీయ కందము

భవ బంధనములఁ ద్రెంచుచు
భువిలో నజ్ఞానపదముఁ బొందక ప్రాజ్ఞుల్
శివుఁ గొల్తు రచలభావన
దవులన్ సుజ్ఞానయోగ తత్త్వవిధిజ్ఞుల్.

గర్భ తృతీయ కందము

అజ్ఞాన పదముఁ బొందక
ప్రాజ్ఞుల్ శివుఁగొల్తు రచలభావన దవులన్
సుజ్ఞాన యోగ తత్త్వ వి
ధిజ్ఞుర్ భవ బంధనములఁ ద్రెంచుచు భువిలో.

గర్భ చతుర్థకందము

శివుఁ గొ_ రచల భావవ
దవులన్ సుజ్ఞాన యోగతత్త్వ విధిజ్ఞుల్
భవ బంధనములఁ ద్రెంచుచు
భువిలో నజ్ఞానపదముఁ బొందక ప్రాజ్ఞుల్.

కందగర్భ వృత్తము.

హరు మనమారఁ గొల్చు దరు దాతనిఁ గొల్చియు నాదిబోడఁ దాఁ
బొరయునె భూరిభోగ పురభూతి విభుత్వముఁ బొంది పేర్మితోఁ
బిర బిన దారుణోగ్ర శరపాత నియుక్త పదంబునందుఁ దాఁ
బొరయఁడు వారికోర్చి హరి భూతగణేశ్వరుఁబొందు నాత్మలోన్. 12-219

ఉద్ధృత కందము.

మనమారఁ గొల్చి డరు దా
తనిఁ గొల్చియు నాదిబోడఁ దాఁ బొరయునె భూ
జన దారుణోగ్ర శరపా
త నియుక్త పదంబునందుఁ దాఁ బొరయఁడు పో.

కుమారస్వామిచే నోటువడి పరమేశ్వరుని శరణుఁ జొచ్చినప్పు డాతనిచే నా నాగాభరణుని నాగబంధ మురజబంధములలో నీ కవి స్తుతింపఁ జేసెను.

తారకాసురుని నిర్జించిన కుమారస్వామిని దేవతలందఱును జక్రబంధమున స్తుతించుట చూడనగును.

అర్థాలంకారములనే కాక యితఁడు శబ్దాలంకారములను గూడ నీ కావ్యమునఁ బ్రయోగించినాఁడు.

పుష్కర షండములోఁ గల
పుష్కరమూలములు గబళములఁ గొనుచున్ స
త్పుష్కర తలముల మునుమిడి
పుష్కరములఁ బెఱికివైచెఁ బుష్కరమునకున్. 1-94

గోపాలక విను మిప్పుడు
గోపాలకు లాది గాఁగఁ గుత్సితమతులై
గోపాలకు లెల్లను జెడి
గోపాలకు లైరి తారకున కతిభీతిన్, 4-21

మందా రార్కాలయములు
మందా రార్కావనీజ మయ మయ్యె సదా
నందన వనజా వాసము
నందన వనజాకరాభినందిత మయ్యెన్. 4-27

ముక్తా ముక్తాయుధములు
ముక్తా ముక్తాయుధౌఘములు(దగు సుభటుల్
ముక్తా ముక్తాసులు(బర
ముక్తా ముక్తాసుబంధములు నగుచు ననిన్. 11-130

ఈ శబ్దచిత్రములను నర్థచిత్రములను జూడు(డు.

తానేల వచ్చు భూనతి
మానవపతి చరిత నీతిమార్గంబైనన్
తా నేల వచ్చు భూసతి
మానవ పతి చరిత నీతిమార్గంబైనన్. 10-181

ఈ ననియ తల(చు(జాగియు
నీ ననియ తలంచు లోభి యెప్పుడు ననికిం
జా ననియ తల(చు వీరు(డు(
జా ననియ తలంచు(బంద సరి యెట్లగునో. 11.48

ఇత(డు వివిధ వృత్తములను దన్నామ సార్థక్య మేర్పడునట్లు సందర్భాను కూలముగా వాడుట గమనింప(దగినది.

ప్రథమాశ్వాసమున సతీపరమేశ్వరుల వివాహ సందర్భమున నరణ్యమున మత్తేభముల క్రీడించుటను మత్తేభవృత్తములోనే వర్ణించెను.

చతుర్థాశ్వాసమున శివుని తపస్సును భంగపఱుప మన్మథు(డు వచ్చినప్పుడు వసంతోదయముగా మత్తకోకిలముల సంరంభము నీ కవి మత్తకోకిల వృత్తములోనే వర్ణించినా(డు.

సప్తమాశ్వాసమున(గపట వటు రూపమున నేతెంచు శివునకు(బార్వతి చెప్పిన స్వాగతమునకు స్వాగత వృత్తమునే వాడెను,

తపస్సుచేయు మానిని యగు పార్వతిని గపటబ్రహ్మచారి మానినీవృత్తము లోనే వర్ణించెను.

అష్టమాశ్వాసమున నక్షత్రముల వర్ణనను మణిగణనికర మను వృత్తములోనే యిత(డు కావించెను.

దశమాశ్వాసమున శరవణ సరస్సునందలి క్రౌంచముల గమనములను క్రౌంచ పద వృత్తములోనే యీతఁడు రచించెను.

అందే కుమారస్వామి యుదయముచే మునులును, జనులును బొందిన యుత్సాహము నుత్సాహ వృత్తములోనే వర్ణించెను.

కవి కాలీన సాంఘిక ప్రతిఫలనము

ఏ కావ్యాదర్శము నందయినను దత్కవి కాలమునాఁటి సంఘము ప్రతిఫలించుచుండును. నన్నెచోడుని కుమారసంభవమునందును, నాతని కాలమునాఁటి సాంఘిక పరిస్థితులు ప్రతిబింబించెనని నిరూపింపవచ్చును.

యుద్ధరంగమునకుఁ బోవుటకు ముందు వీరభటులు తమతమ ప్రతాపములను బ్రకటించుటయుఁ, ద్యాగభోగనిరతు లగుటయుఁ దమతమ ప్రియురాండ్రను గడపటి సారిగా వీడుకొనుటయుఁ, బ్రియురాండ్రు భావి వియోగ భారమును సహింపలేక ప్రియులకంటె ముందే ప్రాణపరిత్యాగము చేయుటయు మున్నగు వీర శృంగార కృత్యము లన్నియు స్వయముగా క్షత్రియకుల సంజాతుఁడును, వీరుఁడునైన నన్నెచోడునకుఁ బ్రత్యక్షానుభవములోనివే యని యూహింప వచ్చును.

మఱియు రాజసేవకులకు వేతనముగాఁ బసిఁడుల ప్రోవులిచ్చుటయుఁ, బిఱికి పందలయిన యుద్ధభటులకు జొన్నలు గొలుచుటయు నా నాఁటి యాచారములయి యుండవచ్చును.

భావజ విభుఁ డలి శుక పిక
సేవక తతి కెడరు దీర జీతము సేయం
గా వెలిఁ జోపిన పసిఁడుల
ప్రోవులు నాఁ దమ్మి లెలమిఁ బూచె బెడంగై. 4-92

మునుమిడి వైరివాహముల ముట్టి పడల్పడ ద్రేపినట్టి కై
పునఁ బయికెత్తు వాహకుల పొంక మఱం దలకొంత గోపి ము
న్నొకని వడివాఱు పందలను గోవుల సూరెలఁ బోలి నూర్చు పే
ర్చునఁ బతికెత్తి కేగ్గలన జొన్నలు గొన్న ఋణంబు నీఁగుదున్. 11-42

ఒక యసాధారణ కార్యమును నిర్వహించుటకయి రా జొక సేవకుని నియోగించి నప్పుడు వానికి సమ్మానపూర్వకముగాఁ దాంబూలము నొసఁగుటయు, దాని నతఁ డంగీకార సూచకముగాఁ బరిగ్రహించుటయు నా కాలమునాఁటి రాజసేవా ధర్మములలో నొకటియై యుండునని భావింపవచ్చును.

వ. 'నాకుఁ దగిన కెలసంబు గంటి దీనికింతకు మైకొంటిఁ దాంబూలము దయసేయు' మని వసంత సహితంబుగా వలరాజు సురరాజుచేత నపార సత్కారములు గొని వీడుకొని చనుదెంచునంత. 4-54

వివిధ కళా శాస్త్ర పరిజ్ఞానము

కవికి వివిధ శాస్త్రములందును, గళలందును గల పరిజ్ఞానము స్వీయకావ్యమునందుఁ జోటు చేసికొనుచుండును. రామరాజభూషణుని సంగీతశాస్త్ర నైపుణ్య మాతని వసుచరిత్రమునందును. శ్రీకృష్ణదేవరాయల రాజనీతి వైశారద్య మాతని యాముక్తమాల్యదయందును గనవచ్చుట యిందులకు నిదర్శనము. నన్నెచోడునకును గవిత్వముతోపాటు చిత్రలేఖన సంగీత నాట్యాది వివిధ లలితకళల నైపుణ్యము గలదు. ఇంకను నతనికి అశ్వశాస్త్రము, గజశాస్త్రము మున్నగు శాస్త్రములందును, యుద్ధ రాజ్య తంత్రములందును విశేష పరిజ్ఞానము గలదని యీ కావ్యమునందలి యనేక నిదర్శనములను బట్టి నిరూపింపవచ్చును.

విలక్షణ ప్రయోగములు

ఈ కవి రచనలో నన్యకవిసాధారణములుగాక విలక్షణములైన ప్రయోగములు గొన్ని కలవు.

1. ఇతఁడు భావార్థక ట వర్ణకమునకు మాఱుగా నొక్కొక్కచో డు వర్ణకమును ప్రయోగించును.

'అతి సత్త్వులఁ గూడి బలియు ౯గుడది యరుదే ' అగుట యనుటకు బదులుగా 'అగుడు' అని ప్రయోగించుట.

'దో-షారంభులు వర్జనీయు లగు డది యరుదే.' 10.46

అగుటకు అగుడు అని ప్రయోగించుట,

'హరు మనమారఁ గొల్చు డరు దాతనిఁ గొల్చియు ....'

కొల్చుటకు మాఱుగాఁ గొల్చుడు.

2. ఒక యుపమావాచకముండఁగా దానిపై మఱియొక యుపమావాచకము నితఁడు తఱచుగాఁ బ్రయోగించుచుండును.

'శారద నీరద సమూహి చాడ్పునఁ బోలెన్.' 10.20

'మిగిలి నిగళంబు పెట్టిన పగిది వోలె. 9.68

సమకాలిక కవులు

నన్నెచోడుని కాలమున 'తారుఁ' డను నొక కవియు, 'షణ్ముఖుఁ' డను నొక కవియు నుండిరనియు, వీ రిరువురును బరస్పరము స్పర్థతో మెలఁగెడివారనియు నన్నెచోడుఁడు షణ్ముఖుని శిష్యుఁడై యాతనియెడ నెక్కువ మక్కువ గలిగియుండె ననియుఁ, దార కవిని దారకాసురునిగాను, షణ్ముఖునిఁ గుమారస్వామినిగాను శ్లేషించి యతఁడు కొన్ని పద్యములను గుమారసంభవమున రచించెననియు నొక యైతిహ్యము గలదు. దాని కీ క్రిందిపద్యములు నిదర్శనములు.

తన జనకుఁ డురు స్థాణువు
జనని యపర్ణాఖ్య దా విశాఖుం డనఁగాఁ
దనరియు నభిమత ఫలముల
జనులకు దయ నొసఁగుచుండు షణ్ముఖుఁగొలుతున్. 1.8

అన్యతారక వితతుల నాదరించి
వెలయ సత్కవి బుధ గురు బలము వడపి
యొనర దైవజ్ఞునట్ల శుభోదయమున
దివ్య సుకృతిఁ బ్రతిష్ఠింతుఁ దిరము గాఁగ. 1.3

ఇనుఁ డుదయింపక ముందఱ
ఘనముగ వర్తించుఁ దారక ప్రభ గాక
యియ్యనుఁ డుదయించిన పిమ్మటఁ
గనుఁగొన లోకమునఁ దారకప్రభ కలదే? 10.152

తారకవి రచిత కృతియుం
దారక విరచిత సుకృతియుఁ దా నడఁగు: సదా
చారక విబుధాలికి సువి.
దారక విబుధాధినాథు షణ్ముఖుఁ గనినన్. 10_158

ఇతని కాలమున రామేశ్వరుఁడను పేరు గల యింకొక కవి యుండెనని కుమార సంభవమునందలి యీ క్రింది పద్యమువలనఁ దెలియుచున్నది.

'శ్రీ రామేశ కవీశ్వరాదు లెద నీ శ్రీపాదముల్ భక్తితో నారాధించి.... 10_90

ఈ రామేశ కవీశ్వరుఁడు శివభక్తుఁడైన యాంధ్రకవియై యుండునని శ్రీ వీరేశలింగము పంతులుగా రభిప్రాయపడఁగా, 'నితఁ డే భాషాకవియో చెప్పఁజాల' మని శ్రీ శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగా రభిప్రాయపడిరి.

కృతజ్ఞత

ఈ వ్యాఖ్యాన రచనలో నా కుపయోగపడిన గ్రంథములు.

1. శ్రీ మానవల్లి రామకృష్ణకవి పరిష్కృత కుమారసంభవ ప్రతి (1914)

2. నన్నెచోడుని కుమార సంభవమునందలి ప్రథమ, తృతీయ, చతుర్థాశ్వాసములకును, పంచమాశ్వాసమునఁ బదునైదవ గద్యము వఱకును శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు రచించిన వ్యాఖ్యానపు వ్రాఁతప్రతి.

3. శ్రీ బులుసు వేంకటరమణయ్యకృత లఘువ్యాఖ్యతోఁ గూడిన వావిళ్లవారి నన్నెచోడుని కుమారసంభవప్రతి.

4. శ్రీ నేలటూరి వేంకట రమణయ్యగారు నన్నెచోడుని కుమారసంభవమునందలి మొదటి నాలుగాశ్వాసములకును రచించిన వ్యాఖ్యానము.

5. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు రచించిన 'నన్నెచోడుని కుమార సంభవము - వ్యాఖ్య - విమర్శ - పాఠ పరామర్శ'

పయి గ్రంథముల రచయితలకు నా కృతజ్ఞతలు.

కుమార సంభవము

ప్రథమాశ్వాసము

స్రగ్ధర

శ్రీవాణీంద్రామరేంద్రార్పిత[1] మకుట మణిశ్రేణి[2]ధామాంఘ్రి పద్మా
జీవోద్యత్కేసరుం డాశ్రితజనలషితాశేషవస్తుప్రదుం డా
దేవాధీశుండు నిత్యోదితుఁ డజుఁడు మహాదేవుఁ డాద్యుండు విశ్వై
కావాసుం డెప్పుడున్ మా కభిమతములు ప్రీతాత్ముఁడై యిచ్చుఁగాతన్. 1

అర్థము: శ్రీ వాణీం.........కేసరుండు : శ్రీ = లక్ష్మీదేవియొక్కయు, వాణీ=సరస్వతీదేవియొక్కయు, ఇంద్ర=పతులైన విష్ణు బ్రహ్మలచేతను, అమర+ ఇంద్ర=సురపతి-ఇంద్రుని-చేతను, అర్పిత=ఉంపఁబడిన మకుట=కిరీటములయందలి, మణి=రత్నములయొక్క శ్రేణి=వరుసలయొక్క ధామ=కాంతులు, అంఘ్రి-పద్మ= అడుగుఁదామరలచే, ఆజీవ = బ్రదుకు గలిగి- ఉద్యత్ = ప్రకాశించుచున్న, కేసరుండు = అకరువులు గలవాఁడును, ఆశ్రిత....ప్రదుండు: ఆశ్రిత = ఆశ్రయించిన, జన=జనులచేత, లషిత=కోరఁబడిన, అశేష=ఎల్ల, వస్తు=అర్థముల యొక్క (ను), ప్రదుండు=ఇచ్చువాఁడును, నిత్య+ఉదితుఁడు=శాశ్వతుఁడని చెప్పఁబడినవాఁడును, నిత్యమయిన వాక్కు గలవాఁడు - అనఁగా వేదములే యీతని వాక్కనుట అనియేనియు, అజుఁడు=అభవుఁడును-పుట్టుక లేనివాఁడును, ఆద్యుండు=మొదటివాఁడును, విశ్వ+ఏక+ఆవాసుండు=సర్వమునందు ముఖ్యముగా నుండువాఁడును, అగు, ఆ-దేవ+అధి+ఈశుండు=ప్రసిద్ధుఁడగు దేవతాధిపతి, మహాదేవుఁడు=ఈశ్వరుఁడు, ఎప్పుడున్, ప్రీత+ఆత్ముఁడు+ఐ=సంతోషించిన మనస్సు గలవాఁడయి, మాకున్, అభిమతములు=కోరికలు, ఇచ్చున్+కాతన్=ఇచ్చుఁగాక.

తాత్పర్యము: విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు తమ శిరస్సులను మోపఁగాఁ దత్కిరీటములందలి మణులకాంతులు తన అడుగుఁ దామరలకు అకరువులుగాఁ గలవాఁడును, ఆశ్రయించిన జనులు కోరిన యెల్ల యర్థముల నిచ్చువాఁడును, శాశ్వతుఁ

1. ర్చిత. 'అర్పిత' పాఠమే సమన్వయానుకూలము. 2. వామా, కామా,

డని చెప్పఁబడువాఁడును, వేదములు వాక్కులయిన వాఁడును, పుట్టుకలేనివాఁడును, మొదటివాఁడును, అన్నిటియందుండువాఁడును అగు ఆ దేవతా ప్రభువు మహేశ్వరుఁడు సంతుష్టాంతరంగుఁడై మా కెప్పుడును గోరికల ననుగ్రహించును గాక!

విశేషములు :- కావ్యమును శ్రీకారముతోను, మగణముతోను ప్రారంభించుట మంగళప్రదము. కృత్యాది నాశీర్నమస్క్రియా వస్తునిర్దేశములలో నేదో యొక్కటి యుండవలయునను నియమము చొప్పున నిందు ఆశీరూప మంగళాచరణము గావింపఁబడినది. కావ్యము మంగళాది, మంగళమధ్యము, మంగళాంతము గావలయు ననుటచే నిది యిట్లు మంగళాది యైనది. కావ్యాంతమున 'మంగళమహాశ్రీ' యని యుండుటచే మంగళాంత మయినది. కృతికర్తయగు నన్నెచోడఁడు శైవుఁడు. కృతిపతి శివస్వరూపుఁడగు జంగమ మల్లికార్జునుఁడు. కావ్యనాయకుఁడు శివుఁడే, కావున నీ మొదటి పద్యమునందలి శివ విశేషణము లన్నియుఁ దన్మహత్త్వ ద్యోతకములై యా దేవుని సర్వదేవతాధిపతిత్వమును స్థాపించుచున్నవి. ఇం దెచ్చటను 'అంకిత' మనుమాట లేకున్నను, 'మల్లికార్జున మునికిన్' 'నా చెప్పంబూనిన' అని యుండుటచే, నీ కృతికిఁ బతి జంగమ మల్లికార్జునుఁడే యని భావింపవచ్చును. మహాదేవుఁ 'డాశ్రిత జనలషితాశేషవస్తుప్రదుఁ' డగుటచేఁ, దదాశ్రితులమే యైన మా కభిమతములు తప్పక యనుగ్రహించు ననుట. 'ఆశ్రితజ'నేత్యాది మహాదేవ విశేషణము సాభిప్రాయ మగుటచే నలంకారము పరికరము. 'అలఙ్కారః పరికర స్సాభిప్రాయ విశేషణైః'- చన్ద్రా.

వాణీ+ఇంద్ర = వాణీంద్ర, ధామ + అంఘ్రి = ధామాంఘ్రి —.... సవర్ణదీర్ఘ సంధులు- అ, ఇ, ఉ, ఋ, ఌ, లకు సవర్ణములయిన అచ్చులు పరములగునపుడు వాని దీర్ఘము లేకాదేశములగును. అమర + ఇంద్ర = అమరేంద్ర .... గుణసంధి, అ, ఆ లకు ఇ, ఉ, ఋ, ఌ, అను నచ్చులు పరము లగునపుడు క్రమముగా ఏ, ఓ, అర్, అల్ అనునవి యేకాదేశము లగును. విశ్వ + ఏక = విశ్వైక- వృద్ధిసంధి. అ, ఆలకు ఏ, ఐలు పరము లైనచో ఐకారమును, ఓ, ఔలు పరము లైనచో ఔకారమును ఏకాదేశము లగును, నిత్యోదితుఁడు- నిత్య + ఉదితుఁడు- వద్ ధాతు క్తప్రత్యయాంత రూపము. వద్ + త- వద్‌లోని వకారమునకు సంప్రసారణము వచ్చి ఉద్ + త. ఇడాగమమయి ఉదిత = చెప్పఁబడిన.

కావ్యారంభమున స్రగ్ధరా వృత్తమును వాడి, అందు మగణముతో రగణమును గదియించుటచే నీ కవి యుద్ధమున మరణించెనని యొక కింవదంతి గలదు. దాని కాధారమీ పద్యము.

క. మగణమ్ముఁ గదియ రగణము - వగవక కృతి మొదల నిలుపువానికి మరణం
బగు నిక్కమండ్రు మడియఁడె - యగునని యిది దొల్లి వెంకటాదిత్యుం
డనిన్" అథర్వణచ్ఛందము,

కాని కాళిదాసుకూడఁ దన యభిజ్ఞాన శాకుంతలమును "యా సృష్టిః స్రష్టు రాద్యా" యని స్రగ్ధరా వృత్తముతోనే ప్రారంభించి మగణముతో రగణమును గదియించెనుగదా ; అతని కట్లు జరిగె ననుమాట వినఁబడదే!

'అర్చిత' 'కామ' అను పాఠములకంటె, 'అర్పిత' 'ధాప' అను పాఠములే మే లయినవి. అన్వయ సౌలభ్యము గలవి. ఈ కవి ప్రయోగపద్ధతి ననుసరించి రేఫ సంశ్లేషమునందు రేఫమునకుఁగాక, తక్కిన వ్యంజనమునకే యతిమైత్రి పొసఁగించెను గావున 'అర్చిత' అనునదియే సరియైన పాఠమని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు.

కాతన్ - అగు + డుజ్.' లూట్టు డుజ్ఞున కెడు త వర్ణంబులు ద్రుతాంతంబు లగు', అగు + తన్. బాల. క్రియ. 26. 'లాఁతిచో సహితము కాదేశాదులు గానంబడియెడి.' బాల. క్రియ. 102 - కాతను. స్రగ్ధర - నాలుగు పాదము లుండును. ప్రతిపాదమునను మ-ర-భ-న-య-య-య- అను గణము లుండును, మొదటి యక్షరమునకును, ఎనిమిదవ, పదునేనవ యక్షరములకును యతిమైత్రి, ప్రాసనియమము గలదు. ఇం దీశ్వరు నవ్యక్త స్వరూపము వర్ణింపఁబడినది.

ఇష్టదేవతాస్తుతి

సీ. రమణీయ శృంగార రజత పర్వతము నా
శోభిల్లు[1] శుద్ధ విస్ఫూర్తి మూర్తి
ఆ పర్వతాగ్ర హేమైక శృంగంబు నా
నమరు జటా మకుటాతి భాతి

1. సిద్ధ.

ఆ తుంగ శృం[1]గజలాపూర్ణ సరసి నాఁ
బొంగారు జాహ్నవీ భూరి వారి
ఆ నిమ్న సరసీ విహార మరాళికా
పంక్తి నా నొప్పు కపాల[2]మాల

ఆ,వె. ఆ మహామరాళికాబర్హ కాంభోజ
పుష్ప నిభ సముత్థ భోగ భోగి
సమితిఁ దా[3]ల్చి పొల్చు శంకరుఁ డంబికా
ధవుఁడు మా కభీష్టదాత గాత. 2

అర్థము : రమణీయ-శృంగార-రజత-పర్వతము-నాన్ = మనోహరమైన షొగసుగల వెండికొండ (కైలాసము) యనఁగా, శోభిల్లు=ప్రకాశించు, శుద్ధ-విస్ఫూర్తి-మూర్తి=శుభ్రమైన ప్రకాశముతోడి యాకారము,

ఆ-పర్వత+అగ్ర-హేమ+ఏక-శృంగంబు-నాన్=ఆ, (వెండి) కొండయొక్క, పయి భాగమునందలి, బంగారు, శిఖరము, అనఁగా, అమరు=ఒప్పునట్టి, జటా-మకుట+అతి-భాతి=జడ లనెడి కిరీటముయొక్క అధికమైన కాంతి,

ఆ-తుంగ-శృంగ-జల + అపూర్ణ-సరసి-నాన్=ఆ, ఎత్తైన శిఖరమునందలి, నీటితో, బాగుగా నిండిన, సరస్సు, అనఁగా, పొంగు+ఆరు = ఉప్పొంగునట్టి, జాహ్నవీ-భూరి-వారి=గంగానదియొక్క, అధికమైన, నీరు,

ఆ-నిమ్న-సరసీ-విహార-మరాళికా-పంక్తి-నాన్ = ఆ, లోఁతయిన, సరస్సునందు, సంచారముగల (సంచరించు), ఆఁడు హంసల, వరుస యనఁగా, ఒప్పు, కపాల-మాల=పుఱ్ఱెల దండ,

---

1. శిలా. 2. ఈల, 3. దాల్చి.

ఆ-మహా.........సమితిన్: ఆ-మహత్ (మహా)+మరాళికా=ఆ గొప్పవియగు నాఁడు హంసలయొక్క, ఆబ ర్హాణ + అంభోజ-పుష్ప = దెబ్బలుగల తామరపూలతో, నిభ,=సమానమై, సముత్థ=లేచిన-విప్పారిన, భోగ=పడగలు గల, భోగి=పాముల యొక్క, సమితిన్ = సమూహమును, తాల్చి = ధరించి, పొల్చు + ఒప్పునట్టి, శంకరుండు = శివుఁడు, అంబికా - ధవుఁడు = పార్వతీదేవి భ ర్తయైనవాఁడు, మాకున్, అభీష్ట - దాత = కోరికల యొక్క (ను) ఇచ్చువాఁడు, కాతన్ = అగుఁగాక.

తా త్ప ర్య ము :- మనోహరమైన సొగసు గల కై లాస మనునట్లు ప్రకాశించు తెల్లని యాకారమును, ఆ కొండపై నుండు బంగారు శిఖర మనునట్లొప్పు జడల కిరీటపు అధికమైన కాంతిని, ఆ యెత్తైన శిఖరమునందలి నీటితో బాగుగా నిండిన సరస్సు అనునట్లు ఉప్పొంగు గంగ యందలి అధికమైన నీటిని, ఆ గంభీరమైన సరస్సు నందు విహరించు నాఁడుహంసల వరుస యనునట్లు ఒప్పు పుర్రెల దండను, ఆ యాఁడుహంసల దెబ్బలు గల (కాడలతోడి) తామరపూలతో సమానమై విప్పారిన పడగలు గల పాముల సమూహమును ధరించి యొప్పు పార్వతీభ ర్త యగు శంకరుఁడు మాకుఁ గోరికల నిచ్చువాఁడు అగుఁగాక.

వి శే ష ము లు :- ఇందు శివుని వ్య క్త స్వరూపము వర్ణింపఁబడినది. కై లాసము వెండికొండ గావున తెల్లగా నుండును, దానివలెఁ దెల్లనైనది శివుని ఆకారము. వెండి కొండపై బంగరు శిఖరము వలెఁ దెల్లని దేహము గల శివునిపై జటా కిరీటము ప్రకాశించును. ఆ కొండపై నుండు జలాపూర్ణ సరస్సువలె శివుని శిరస్సుపై గంగా నది కలదు. ఆ సరస్సులో విహరించు నంచపిండువలె శివునకుఁ గపాలమాల కలదు. ఆ యంచలు పెకలించిన తామరపూల వంటి విప్పారిన పడగలు గల పాముల నతఁడు ధరించెను. ఇట్లు కవి మొ త్తము కై లాస పర్వతమువలెనే యొప్పు శివునిఁ గన్నులకుఁ గట్టించినాఁడు. అందుచే నిది శివుని వ్య క్తస్వరూప వర్ణన. సీసమునందలి యొక్కొక్క పాదమునందు నుత్ప్రేక్షాలంకారము గలదు, శంకరుఁడు = శుభములను జేయువాఁడు కావున అభీష్ట ప్రదుఁడు తప్పక అగును. శంకరుఁడను విశేష్య మిట సాభిప్రాయము గావున నలంకారము పరికరాంకురము.' సాభిప్రాయే విశేష్యే తు భవే త్పరికరాఙ్కురః'- భద్రాద్రి. పర్వతము, ఆ పర్వతము శృంగము, ఆ శృంగమునందలి సరసి, ఆ సరసిలోని

యంచలు, ఆ యంచల దెబ్బలు గల తామరలు- ఇట్లు చెప్పి విడిచిన దానినే మరల గ్రహించుట రమ్యముగా నున్నది. ముక్తపదగ్రస్తచ్ఛాయ కలదు. సీసపద్యమునందలి ప్రతిపాదాంతమునను - స్ఫూర్తి మూర్తి, (మకు) టాతి ఖాతి, భూరి వారి, (క) పాల మాల అను రీతిగా ననుప్రాసము గలదు. ఆటవెలఁది పాదముల చివరఁగూడ - భోగ భోగి, దాత గాత. అనుప్రాసము గలదు. అనుప్రాసము కొఱకే యేమో 'భోగి భోగి' యను పాఠము అకాడమీ ప్రతిలో స్వీకరింపఁబడినది. కాని అర్థ సౌలభ్యముకయి యా పాఠము విడువఁబడినది.

చ. హరి వికచామలాంబుజసహస్రము పూన్చి మృగాంకునం[1] దవి
స్ఫురిత మలాసితాబ్జమని పుచ్చఁగఁ జాఁచిన చేయి చూచి చం
దురుఁ డది రాహు సావి వెఱఁ దుప్పలఁదూలఁగ జాఱుచున్న న
య్యిరువురఁ జూచి నవ్వు పరమేశ్వరుఁ డీవుత మా కభీష్టముల్. 3

అర్థము:- హరి=విష్ణువు, వికచ+అమల+అంబుజ- సహస్రము=వికసించిన, నిర్మలమైన, తామరల, వేయి, పూన్చి=సమర్పించి, మృగ+అంకున్ =లేడిచిహ్నముగాఁ గలవానిని-చంద్రుని, అందున్=ఆ పూజా పుష్పములలో, అవిస్ఫురిత- మల+అసిత+అబ్జము =వికసింపని, మాలిన్యముచే, నల్లనైన, తామర, అని, పుచ్చఁగన్=తొలఁగించుటకు, చాఁచిన=చాఁచినట్టి, చేయి, చూచి, చందురుఁడు=చంద్రుఁడు, అది=ఆ విష్ణుని చేయి, రాహు- సావి = రాహు వని, వెఱన్ = భయముతో, తుప్పలఁదూలఁగన్ = మిక్కిలి చలింపఁగా, జాఱుచున్ + ఉన్నన్ = జాఱుచుండఁగా, ఆ +ఇరువురన్= ఆ యిద్దఱను (విష్ణువును, చంద్రుని), చూచి, నవ్వు = నవ్వెడు, పరమ + ఈశ్వరుఁడు, మాకున్, అభీష్టముల్ = కోరికలు, ఈవుతన్ = ఇచ్చుఁగాక.

తాత్పర్యము :- విష్ణువు వికసించినవి అమలములు నైన వేయి తామరలతో శివుని శిరస్సును బూజించుచుండెను, అప్పు డతనికి శివ శిరశ్చంద్రుఁడు కనఁబడెను, మచ్చతోడి చంద్రుని జూచి యతఁడు వికసింపక మలినమై నల్లనైన తామర యని భ్రాంతినొంది, తాను అమలములైన తామరలు వైవఁగా నిది యెక్కడనుండి

1. ప్రా. ప్ర. కంఠ, అకా. నం

వచ్చినదను చికాకుతో దానిని దొలఁగింపఁ దనచేతిని జాఁచెను. అతని నల్లని చేతిని జూచి చంద్రుఁడు తన్ను మ్రింగవచ్చు రాహువని భ్రాంతిపడి భయముచే మిక్కిలి చలించి జాఱెను. ఇది యేదో మనము తాఁకకయే జాఱుచున్నదే యని విష్ణువును జాఱెను - వెనుదీసెను. ఇట్లు జాఱుచున్న ఆ యిరువురను- విష్ణు చంద్రులను జూచి నవ్వు పరమేశ్వరుఁడు మాకుఁ గోరికలను దీర్చుఁగాక.

విశేషములు :- తాను శివునిఁ బూజించినది అమలాంబుజములతో కాఁగా, నీ అవిస్ఫురిత మలాసితాబ్జ మెచ్చటినుండి వచ్చెనని విష్ణుని సందియము. విష్ణువునకుఁ జంద్రునియందు అబ్జభ్రాంతి. అబ్జశబ్దమునకుఁ దామరయేకాక చంద్రుఁడనియు నర్థ ముండుట గమనార్హము. చంద్రునకు నీలమేఘశ్యాముఁడగు విష్ణుని నల్లనిచేతియందు రాహుభ్రాంతి. రాహువు సర్పాకారుఁడయి నల్లగానుండును గదా! తన్ను మ్రింగ వచ్చుచున్నాఁడని రాహు వనినఁ జంద్రునకు భయము. కావుననే యతఁడు దుస్సలఁదూలి జాఱుట. శివుఁడు సర్వజ్ఞుఁడగుటచే భ్రాంతి యెఱుఁగనివాఁడు. అతఁడు విష్ణుచంద్రుల భ్రాంతిని బోఁగొట్ట సమర్థుఁడు. భ్రాంతిగ్రస్తులమైన మాకును భ్రాంతిని బోఁగొట్టి యభీష్టముల నీఁగలవాఁ డనుట. ఇందు శివుని దయాళుత, సామర్థ్యము ప్రతిపాదితములు. అలంకారము భ్రాంతిమంతము,

తుస్సలఁదూలు- తూలు + తూలు అని శబ్దరత్నాకరకారుని పదచ్ఛేదము. అప్పుడు అందదుకు ప్రభృతులలోనిదయి' అందదుకు ప్రభృతులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు 'బాల-సంధి. 42 అనుదానికి లక్ష్యమగును, ఈవుతన్ = ఇచ్చుతన్. 'లాఁతిచో సహితము కాదేశాదులు గానంబడియెడి.' బాల. క్రియ. 102. అనుదానిచే ఇచ్చునకు 'ఈవు' ఆదేశము. రాహు సావి = రాహువని. సావి = (రూ) సవి. దీని కిందే ప్రయోగాంతరము- 'తన నీడ నీరిలోపలఁ, గని యది ప్రతిగజము సావి కడుకొని కోపంబునఁ దాఁకి పోరఁ జొచ్చెను.' కుమా. సం. 1,65, '........ నిర్జర వాహినీ మహా, తోయము సావి చీర యెగఁద్రోచి ....' శివరాత్రి, 4.40. చంద్రుఁడు (ప్రకృతి) - చందురుఁడు (వికృతి). రాహు + సావి- 'రాహు బాహు శబ్దంబుల కంతట వు వర్ణకలోపంబు వైకల్పికంబు, 'ఆ + ఇరువురన్-ఆ + యిరువురన్- 'సంధి లేనిచోట స్వరంబుకంటెం బరంబయిన స్వరంబునకు యడాగమంబగు.' -బాల. సంధి, 3. 'త్రికంబుమీఁది యసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు.' బాల, సమాస. 14, 'ద్విరుక్తంబగు హల్లు పరంబగునపు డాచ్చికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు.' బాల. సమాస. 13, కవి శైవుఁడగుట, విష్ణుని

శివపూజకునిగాఁ జేయుటయేగాక, యతనిని శివునకుఁ బరిహాసాస్పదునిగాఁ జేయుటయు గమనింపఁ దగినది. 'హరి స్తే సాహస్రం కమలబలి మాధాయ పదయోః' - శివమహిమ్నః 19. అని విష్ణుఁడు శివుని వేయితామరలతోఁ బూజించుట ప్రసిద్ధమే.

ఉ. వీంగు నపారసత్త్వ గుణవిస్ఫురణం బరమేశ్వరోరువా
మాంగమునందు ము న్నుదయమై నియమస్థితిఁ గొల్చి తద్దయున్
లోంగొని[1] పేర్మితో నఖిలలోకములుం దగఁ గాచుచున్న వే
దాంగు ననంతు విష్ణుఁ గమలాధిపు సంస్తుతిఁ దేల్తు సమ్మతిన్. 4

అర్థము: వీంగు = వీఁగు = విజృంభించు నట్టి, అపార-సత్త్వ-గుణ-విస్ఫురణన్ = అధికమైన సత్త్వ మనెడి గుణముయొక్క ప్రకాశముతో, పరమేశ్వర + ఉరు-వామ + అంగము + అందున్ = పరమేశ్వరునియొక్క, పెద్దదియగు, ఎడమమేని యందు, మున్ను = పూర్వము, ఉదయము + ఐ = పుట్టి, నియమ-స్థితిన్ = నిష్ఠతో. కొల్చి = సేవించి, తద్దయున్ = మిక్కిలి, లోంగొని = లోఁగొని = వశపఱుచుకొని, పేర్మితోన్ = ప్రేమముతో, అఖిల-లోకములున్ = ఎల్లలోకములును, తగన్ = సముచితముగా, కాచుచున్ + ఉన్న = రక్షించుచున్న, వేద + అంగున్ = వేదము శరీరముగాఁ గలవానిని, అనంతున్ = అంతములేనివానిని, కమలా + అధిపున్ = లక్ష్మియొక్క, పతిని, విష్ణున్ = విష్ణుని, సమ్మతిన్ = అభిలాషతో, సంస్తుతిన్ = స్తోత్రముతో, తేల్తున్ = సంతోషపెట్టుదును.

తాత్పర్యము:- విజృంభించు సత్త్వగుణస్ఫూర్తితోఁ బరమేశ్వరుని మేని యెడమభాగమునందు ముందు పుట్టి, నిష్ఠమై నతనిని సేవించి, తదనుగ్రహమున నెల్లలోకములను మిక్కిలి వశపఱుచుకొని, ప్రేమముతో సముచితముగాఁ గాచుచున్న వేదశరీరుఁడు, అనంతుఁడు, లక్ష్మీపతియు నగు విష్ణుని సమ్మతితో సంస్తుతించి సంతోషపెట్టెదను.

విశేషములు:- వీంగు, లోంగొను అనునవి వీఁగు, లోఁగొను అనువాని ప్రాచీనరూపములు. తత్ప్రయోగము నన్నెచోడని ప్రాచీనతకు నిదర్శన

---

[1] లోంగిన.

మందురు. ఇప్పటి పీఁగు, లోఁగొను అనువానిని ఉంచినచో ఖండ పూర్ణ బిందు పూర్వకాక్షరములకుఁ బ్రాసమైత్రి నంగీకరింపవలసివచ్చును. త్రిమూర్తులలో విష్ణువు సత్త్వగుణ ప్రధానుఁడు. బ్రహ్మ రజోగుణప్రధానుఁడు. విష్ణువును బరమేశ్వర వామాంగమునం దుద్భవించినవానినిగను, వానిని నియమస్థితిఁగొల్చి నట్లును జెప్పుటచే విష్ణుస్తుతి వ్యాజమున శివుని మహత్త్వమే యిందుఁ బ్రతిపాదింపఁబడినట్లయినది.

విష్ణువు శివుని వామాంగమున జనించెనని యిందుఁగలదు. పాల్కురికి సోమ నాథుని పండితారాధ్యచరిత్రమునను నిట్లే కలదు.

'ఆది నీశ్వరుని వామాంగంబు చెమట

శ్రీ దయితుండు జనించిన తద్విధంబు' — పండితా. వాదప్రకరణము.

కాని బొడ్డపాటి పేరయ తన విజయవాటి మల్లికార్జున శతకమున 'దక్షిణాంగంబ యత్నంబుచేసి' అని విష్ణుని శివ దక్షిణాంగ జనితునిగాఁ జెప్పినాఁడు.

చ. అమిత రజోగుణ స్ఫురణ నావహమై పరమేశు దక్షిణాం
గమున జనించి భక్తిఁ జిరకాలము సద్విధిఁ గొల్చి తత్ప్రసా
దమున నజాండ[1]భాండజని తత్త్వ సువేద కళాగమాది వి
శ్వము సృజియించి పొల్చు నజు వాగ్విభు సంస్తుతి [2]చేసెదన్ మతిన్. 5

అర్థము : అమిత-రజస్ (ః) + గుణ-స్ఫురణన్ = అధికమైన రజస్సనెడి గుణముయొక్క, స్ఫూర్తిచే, ఆవహము + ఐ = కలిగినదియై, పరమేశు-దక్షిణ + అంగమునన్ = పరమేశునియొక్క, కుడిమేనియందు, జనించి = పుట్టి, భక్తిన్ = భక్తితో, చిర-కాలమున్ = చాలకాలమును, సత్ + విధిన్ = మంచి నియమముతో, కొల్చి = సేవించి, తద్ + ప్రసాదమునన్ = ఆ శివుని యనుగ్రహముచేత, అజ + అండ-భాండ-జని-తత్త్వ-సువేద-కళా + ఆగమ + ఆది-విశ్వమున్ = కుండవంటి బ్రహ్మాండము యొక్క పుట్టుక, చతుర్వింశతి తత్త్వములు, మంచి వేదవిద్యలు, శైవాగమములు

1. వావిళ్ల ప్రతి పాఠము-లోక. 2. చేయు సన్మతిన్.

మున్నగువానితోడి ప్రపంచమును, సృజియించి=పుట్టించి, పొల్చు=ఒప్పునట్టి, వాచ్-వాక్+విభున్=సరస్వతీదేవి భర్త, అగు, అజున్=బ్రహ్మను, మతిన్=మనస్సునందు, సంస్తుతి-చేసెదన్=స్తోత్రము చేయుదును.

తాత్పర్యము: సత్త్వగుణమున విష్ణువు శివుని వామాంగమున జనింపఁగా, అధిక రజోగుణస్ఫూర్తిచేఁ గలిగి, పరమేశ్వరుని కుడి మేనఁబుట్టి, చాలకాలము భక్తితో యథావిధి సేవించి, యతని యనుగ్రహముచే బ్రహ్మాండభాండమును, తత్త్వములు, వేదవిద్య, శాస్త్రములు మున్నగువానితోడి విశ్వమును బుట్టించి యొప్పునట్టి సరస్వతీ భర్తయైన బ్రహ్మను మనసునందు స్తుతింతును.

విశేషములు: కవి యిందును బ్రహ్మ శివుని దక్షిణాంగమునఁ బుట్టెననియు, నతఁడతని చిరకాలము సద్భక్తిఁ గొలిచెననియు, నతని యనుగ్రహముననే విశ్వసృష్టిని జేసెనని యుఁజెప్పుచు బ్రహ్మస్తుతి వ్యాజమున శివుని మాహాత్మ్యమునే ప్రతిపాదించినాఁడు, కవి శైవమతాభినివేశ మిందు వ్యక్తమగుచున్నది.

పొల్చునజు-పొల్చు+అజు. 'ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమంబగు.' బాల సంధి. 33.

'సంస్తుతిచేతు సన్మతిన్' అను పాఠము కంటె 'సంస్తుతి చేసెదన్ మతిన్' అను పాఠము వ్రాఁత ప్రతి లిపి కనుగుణము. సుందరము. 'చేతు' నను నసాధు రూపము పరిహృత మగును.

వాగ్విభు-వాచ్+విభు-చవర్గాక్షరములకు ఝల్ వర్ణములు పరములగునపుడును, పదాంతమునందును, కవర్గాక్షరములు ఆదేశము లగును. (అనునాసికములు, అంతస్థములు తప్పఁ దక్కిన హల్లులకు ఝల్ అనునది ప్రత్యాహార సంజ్ఞ.) అంతస్థములు-య ర ల వ. వాక్+విభు- అనునాసికేతర వర్గీయాక్షరములకు నాదహల్లు పరమగునపుడు ఆయా వర్గముల తృతీయాక్షరము లాదేశము లగును- వాగ్విభు. రజోగుణ-రజస్+గుణ-పదాంత సకారమునకు విసర్గాదేశము. రజః+గుణ. హ్రస్వ అకారము తరువాత వచ్చు విసర్గమునకు హ్రస్వ అకారముగాని, మృదు హల్లులు (హశ్శులు) గాని పరములగునపుడు 'ఉ' ఆదేశమయి, పూర్వమందున్న అకారముతోఁగూడి గుణ సంధియై ఓ గా మాఱును. రజోగుణ.

చ. అనుపమ దివ్యమూర్తి యను నంతియకాదు భవాష్టమూర్తులం
దును వరమూర్తి దాన, ప్రభతోడ జగజ్జన రాజి కెల్ల నిం
దనయముఁ దాన దృష్టి యను నంతియకాదు త్రిలోచనాదిలో
చనమును దానయైన రవి చారు నిజ ప్రభ మాకు నీవుతన్. 6

అ ర్థ ము :- అనుపమ - దివ్య - మూర్తి = సాటిలేనిదియు, అమానుషము అయినదియు నైన ఆకారము గలవాఁడు, అను + అంతియ - కాదు = అనునంత మాత్రమే కాదు, భవ+ అష్ట -మూర్తులందును =శివుని యొక్క ఎనిమిది మూర్తుల లోను, దాను + అ = తానే, వర - మూర్తి = శ్రేష్ఠమైన మూర్తి, ప్రభతోడన్= కాంతితో, జగత్ +జన -రాజికిన్ = లోకమునందలి జనులయొక్క వరుసకు, ఎల్లన్ = అంతకును, ఇందున్, అనయమున్ = ఎల్లప్పుడును, తాన = తానే, దృష్టి = చూపు, అను + అంతియ-కాదు, త్రిలోచన + ఆది - లోచనమును = ముక్కంటియొక్క (మూఁడు కన్నులలో) మొదటిదైన, కన్నును, తాను + అ, ఐన, రవి = సూర్యుఁడు, చారు - నిజ - ప్రభన్ = మనోహరమైన, తనదైన, వెలుఁగును, మాకున్, ఈవుతన్ - ఇచ్చుఁగాక.

తా త్ప ర్య ము :- నిరుపమానము, అమానుషమునైన ఆకారము గల వాఁడనునంతమాత్రమే కాదు - శివుని యెనిమిది మూర్తులలోను దానే శ్రేష్ఠమైన మూర్తి. తన వెలుఁగుతో లోకమునందలి ప్రాణికోటి కంతకును దానే యెల్లప్పుడును దృష్టి యనునంత మాత్రమే కాదు- ముక్కంటియైన శివునకుఁ గల మూఁడుకన్ను లలో మొదటి కన్నయిన వాఁడును దానేయైన సూర్యుఁడు మాకుఁ దనదైన వెలుఁగు నిచ్చుఁగాక.

వి శే ష ము లు :- త్రిమూర్తులను స్తుతించిన పిమ్మట సూర్యుని స్తుతించు టకు సూర్యుఁడు శివుని యష్టమూర్తులలో నొకఁడగుటయే కారణము. తన వంశమునకు మూలపురుషుఁ డగుటయు నింకొక కారణము. భవాష్ట మూర్తులు -పంచభూతములు (పృథివి, నీరు, తేజస్సు, వాయువు, ఆకాశము), సూర్యుఁడు, చంద్రుఁడు, యజ మానుఁడు. త్రిలోచనాదిలోచనము - త్రిలోచనుని కన్నులు-సూర్యుఁడు, చంద్రుఁడు, అగ్ని, వానిలో మొదటిది సూర్యుఁడనుట. 'చారు నిజప్రభ' యనుట లోకమున వ్యక్త

ముగాఁ గానవచ్చు మండుటెండ కంటె సౌమ్యమయిన ప్రభ యింకొకటి కలదనియు, సూర్యుఁడు దానిని ప్రసన్నుల యెడలఁ బ్రసాదించుననియుఁ దెల్పుటకు. 'రాజికెల్ల నెం-దనయము' అని కవి పాఠమేని, సూర్యకాంతి భూలోకముననే కాక యూర్ధ్వలోకముల కన్నింటికింగూడఁగలదని తెల్పు టగును,' వే. ప్ర. శా.

జగజ్జన = జగత్ + జన - సకార తవర్గములకు శవర్గచవర్గములతో పూర్వమందైనను, పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్గ చవర్గ వర్ణము లాదేశమగును. శ్చుత్వసంధి. అంతియ = అంత + ఎ = అంత + ఇయ -

చ. తను వసితాంబుదంబు, సితదంత ముఖం[1] బచిరాంశు, వాత్మగ
ర్జన మురుగర్జనంబుఁ, గర సద్రుచి శక్ర శరాసనంబునై
చన మదవారివృష్టి హితసస్యసమృద్ధిగ నభ్రవేళ నాఁ
జను గణనాథుఁ గొల్తు[2] ననిశంబు నభీష్టఫల[3]ప్రదాతగాన్. 7

అర్థము :- తనువు = శరీరము, అసిత + అంబుదంబు = నల్లని మేఘము, సిత-దంత- ముఖంబు = తెల్లని దంతము నగ్రము, అచిర + అంశువు= మెఱపు, ఆత్మ- గర్జనము – తనయొక్క, ధ్వని, ఉరు-గర్జనంబున్ = గొప్పది యగు మేఘధ్వనియును, కర-సత్ + రుచి = తొండముయొక్క, మంచి, కాంతి, శక్ర- శరాసనంబున్ = ఇంద్రధనుస్సును, ఐ = అయి, చనన్ = ఒప్పఁగా, మద-వారి- వృష్టిన్- మదజలమనెడు వర్షముచే, హిత-సస్య- సమృద్ధి + కన్ = మేలనెడు పంటయొక్క పుష్కలత్వము కాఁగా, అభ్ర-వేళ = వర్షాకాలము, నాన్ = అనఁగా, చను = ఒప్పునట్టి, గణనాథున్ = విఘ్నేశ్వరుని, అభీష్ట-ఫల- ప్రదాత+ కాన్ = కోరిన ఫలముల నిచ్చువాఁడుగా, అనిశంబున్ = ఎల్లప్పుడును, కొల్తున్= సేవింతును.

తాత్పర్యము :- శరీరము నల్లని మేఘమును, తెల్లని దంతము నగ్రము మెఱపును, తాను జేయు ధ్వని గొప్ప యుఱుమును, తుండకాంతి ఇంద్రధనుస్సును అయి

---

1. వా. ప్రతి. ముఖగం. 2. వా. ప్రతి. దెచ్చు. 3. వా. ఫలంబు మా కిలన్.

యొప్పఁగా మదజల వర్షముచే భక్తుల మేలనెడు పంట పెంపొంద వర్షాకాల మన నొప్పు గణపతిని గోరిన యర్థముల నిచ్చువానినిగా నెల్లప్పుడును సేవింతును.

విశేషములు:- "సితదంతయుగంబు" అనుదానికి 'సితదంతముఖంబు' అని శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారి సవరణ. వినాయకుఁ డేకదంతుఁడుగదా- 'దంతాగ్రము నోరుమూసినపుడు గానరాక తెఱచినపుడు గానవచ్చును. అందుచే నచిరాంశు సామ్యము సుందరముగా నుండును. నీలమేఘమే తనువు, మెఱపే తెల్లని దంతముకొన, ఉఱుమే గర్జ, ఇంద్రధనువే తొండముకాంతి- ఇట్లు వర్షాకాలపు లక్షణములన్నియు గణపతి యందుండుటచే నతనిని వర్షాకాలముతో రూపించుట జరగినది. వర్షాకాలము సస్య సమృద్ధిని గలిగించునట్లు, గజముఖుఁడు మదజలమనెడు వర్షముచే భక్తులకు హితమును గలిగించును. ఇట్లు ఉపమేయోపమానముల కభేదము చెప్పఁబడుటచే నలంకారము రూపకము. 'విషయ్యభేద తాద్రూప్యరఞ్జనం విషయస్య యత్ రూపకమ్.' చన్ద్రా,

కొల్తున్. కొలుచు- 'అచ్చికంబులం బదమధ్యంబుల నలఘుల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బాల. ప్రకీర్ణ. 17. కొల్చు. తద్ధర్మాదులందు లాట్టగు- బాల. క్రి.5. కొల్చు + లాట్టు. లకారంబునకు దుగ్రుజువురునుముఙ్గగు, బాల. క్రి. 8. కొల్చు+ను (ఉత్తమ పురుషైక వచనము) లాట్టు రుఙ్గు పరంబగునపుడు దుగాగమం బగు. బాల. క్రి. 22. కొల్చు +దు +ను- దువర్ణంబుతోడ దుగ్దకారంబు తకారంబగు. కొల్తును. బాల. క్రియ. 108. అవసానంబునందు ద్రుతస్వరంబునకేని ద్రుతంబునకేని లోపంబు బహుళంబుగా నగు.. బాల, సంధి. 20. కొల్తున్.

క. తన జనకుఁ డురుస్థాణువు
జనని యపర్ణాఖ్య దా విశాఖుం డనఁగాఁ
దనరియు నభిమతఫలముల
జనులకు దయ నొసఁగుచుండు షణ్ముఖుఁ గొలుతున్. 8

అర్థము: తన జనకుఁడు=తన తండ్రి (శివుఁడు) ఉరు-స్థాణువు=గొప్ప వాఁడగు ఈశ్వరుఁడు, పెద్దమోడు, జనని=తల్లి (పార్వతి), అపర్ణా + ఆఖ్య = అపర్ణ యను పేరు గలది, (అపర్ణ యనఁగాఁ బార్వతి), పర్ణములు లేనిది, తాన్ = తాను (కుమారస్వామి), విశాఖుండు = కుమారస్వామి, శాఖలు లేనివాఁడు, అనఁ

గాన్, తనరియున్ = ఒప్పియును, జనులకున్ = మనుష్యులకు, అభిమత - ఫలములన్ = కోరిన ఫలములను, కోరిన పండ్లను, దయన్ = దయతో, ఒసఁగుచున్ + ఉండు = ఇచ్చుచుండు, షణ్ముఖున్ = ఆఱు మొగములు గలవానిని - కుమారస్వామిని, కొలుతున్ = సేవింతును.

తాత్పర్యము:- తన తండ్రి గొప్పవాఁడగు స్థాణువు (శివుఁడు) - పెద్ద మ్రోడు. తల్లి అపర్ణ (పార్వతి) - పర్ణములు లేనిది. తాను విశాఖుఁడు (కుమారస్వామి) - శాఖలు లేనివాఁడు. ఇంత యేమన ఒక స్థాణువునకును, అపర్ణకును బుట్టినవాఁడయి, తాను విశాఖుఁడై కుమారస్వామి తన భక్తజనులకు దయతోఁ గల్పవృక్షము వలెఁ గోరినఫలముల నొసఁగుచుండుట. అట్టి ఆఱు మొగముల సామిని భజింతును.

విశేషములు:- స్థాణు వనఁగా నీశ్వరుఁడును, మ్రోడును, 'స్థాణూ రుద్ర ఉమాపతిః', ప్రళయేఽపి తిష్ఠతీతి స్థాణుః- ప్రళయమునందు నుండువాఁడు - శివుఁడు- అమరము, అపర్ణయనఁగాఁ బార్వతియు, పర్ణములు లేనిదియు, 'అపర్ణా పార్వతీ దుర్గా మృడానీ చండి కాంబికా.' తపసి పర్ణానా మప్యనశనా దపర్ణా. తపస్సునందుఁబర్ణములను గూడ భుజింపనిది - పార్వతి - అమరము. విశాఖుఁడనఁగాఁ గుమారస్వామియు, విగత శాఖుఁడనియును. 'బాహులేయ స్తారకజి ద్విశాఖ శ్శిఖివాహనః' - వినా పక్షిణా - మయూరేణ శాఖతి వ్యాప్నోతీతి విశాఖః. పక్షియైన నెమలిచేఁ దిరుగువాఁడు- కుమారస్వామి - అమరము. ఫలము = లాభము, పండు, ఇట్లు అర్థద్వయము గల శబ్దముల నుపయోగించుటచే నలంకారము శ్లేషము. 'నానార్థసంశ్రయ శ్శ్లేషః' - చన్ద్రా. స్థాణువు, అపర్ణ, విశాఖ అయినది అభిమత ఫలముల నొసఁగు ననుట విరోధము. కాని ఆ శబ్దములకు శివుఁడు, పార్వతి, కుమారుఁడు అను నర్థములు చెప్పుటచే నా విరోధమున కాభాసత్వ మేర్పడుచున్నది కావున నలంకారము విరోధాభాసము. ఆభాసత్వే విరోధస్య విరోధాభాస ఉచ్యతే - చన్ద్రా. ఇందు విభావనాలంకారమును గలదు. 'విభావనా వినాపి స్యా త్కారణం కార్య జన్మచేత్- చన్ద్రా.

దీనిని బోలి సంస్కృతమున నింతకంటెఁ జమత్కృతి గల శ్లోక మున్నది.

స్థాణు ర్భవాన్ మూల విహీన ఏవ
పుత్రో విశాఖో జననీ త్వపర్ణా,
పరోపనీతైః కుసుమై రజస్రం
ఫల త్యభీష్టం కి మిదం విచిత్రమ్ -(ప్రసంగరత్నావళ్యుదాహృతము.)

షణ్ముఖ - షట్ + ముఖ - అనునాసిక హల్లులు పరములగునప్పుడు వర్గములందలి మొదటి నాలుగక్షరములకును ఆ వర్గమునందలి అనునాసికాక్షరము వికల్పముగా నాదేశమగును - షణ్ముఖ, అనునాసిక సంధి.

క. హరుఁ డాదిగ సకల చరా
చర మయ జీవాళి నెల్ల సతతముఁ గామా
తురులుగ [1]వశగతిఁ జేసిన
మరుఁ డీవుత మఖిలవశ్యమతి మత్కృతికిన్. 9

అర్థము :- హరుఁడు = ఈశ్వరుఁడు, ఆదిగన్ = మొదలుగా, సకల - చర + అచర - మయ - జీవ + ఆళిన్ + ఎల్లన్ = అన్ని జడములు అజడములు అను వానితో నిండిన ప్రాణుల వరుస నంతను, సతతమున్ = ఎప్పుడును, కామ + ఆతురులుగన్ = కామముచేఁ పీడింపఁబడినవారినిగా, వశ - గతిన్ + చేసిన = లోఁబఱుచుకొనిన, మరుఁడు = మన్మథుఁడు, మత్ + కృతికిన్ = నా కావ్యమునకు, అఖిల - వశ్య - మతిన్ = ఎల్లరను వశపఱుచుకొనఁదగిన బుద్ధిని, ఈవుతన్ = ఇచ్చుఁగాక.

తాత్పర్యము :- ఈశ్వరుఁడు మొదలుకొని జడములు అజడములునైన యెల్ల జీవులను ఎల్లప్పుడును గామపీడితులనుగాఁజేసి వశపఱుచుకొను మన్మథుఁడు నా కావ్యమునకు ఎల్లరను వశపఱుచుకొనఁగల తెలివి నిచ్చుఁగాక.

విశేషములు :- మన్మథుఁడు హరునే కామాతురునిగాఁ జేసినవాఁడు. ఆ వృత్తాంతమును వర్ణించునదియే యీ కావ్యము. హరునే యట్లొనరింపఁగలవాని కితర జీవు లొకలెక్కలోనివారు కారు. మరుఁడు అందఱను వశగతిఁ జేసినవాఁడు గావునఁ గవి తన కావ్యమున కా గుణమునే అనుగ్రహింపుమని యతనిని వేఁడికొనుచున్నాఁడు. స్మరుఁడు (ప్రకృతి) - మరుఁడు (వికృతి). ఈవుతన్ + అఖిల = ఈవుత మఖిల- ఎడు త ల ద్రుతంబున కచ్చు పరంబగునపుడు మకారం బగు. బాల, క్రియ 28.

1. వగశతి

చ. ముని మను జాసు రాహి సురముఖ్యులు మున్నుగ సర్వజీవులం
దన వశ మర్థిఁజేసి మను దర్పకు నోర్చిన వీతరాగిఁ జి
ద్ఘనతను నీశు నాత్మ సుభగస్థితి మైమెయి నర్ధనారిఁ జే
సిన నగజాత మత్కృతిని జేకొని తత్సుభగత్వ మీవుతన్. 10

అర్థము: ముని- మనుజ + అసుర + అహి- సుర- ముఖ్యులు = మునులు, మనుష్యులు, రాక్షసులు, నాగులు, దేవతలు అను వారిలోఁ బ్రధానులు, మున్నుగన్ = మొదలుగా, సర్వ - జీవులన్ = ఎల్లప్రాణులను, తన - వశము = తన అధీనము, అర్థిన్=సమర్థతతో, చేసి, మను = ఉండునట్టి, దర్పకున్ = మన్మథుని, (గర్వితుని), ఓర్చిన=ఓడించిన, (ఆర్చిన) అనుచోఁగాల్చివైచిన యని యర్థమగును. వీత -రాగిన్= పోయిన ప్రేమము గలవాఁడు - ప్రేమరహితుఁడు, అగు, ఈశున్ = ఈశ్వరుని, చిత్ + ఘన-తనున్ = జ్ఞానమనెడి గొప్ప శరీరము గలవాఁడును, ఆత్మ - సుభగ-స్థితిన్ = తనయొక్క, మంచి ప్రేమము యొక్క, ఉనికి చేత, మైమెయిన్ = అనాయాసముగా, శరీరమును శరీరమునఁ జేర్చి యనియేని, అర్ధ - నారిన్ = సగము స్త్రీగల వానినిగా, చేసిన = చేసినట్టి, నగ - జాత = కొండకూఁతురు - పార్వతి, మత్ + కృతిని = నా కావ్యమును, చేకొని = ఆదరించి, తద్ + సుభగత్వము= ఆ సౌభాగ్యమును, ఈవుతన్ = ఇచ్చుఁగాక, పార్వతి వలె నీ కృతియు సౌభాగ్యము గలిగి శివప్రియ యగుఁగాక యనుట.

తాత్పర్యము:- మునులు, మనుజులు, రాక్షసులు, నాగులు, దేవతలు అను వారిలోఁ బ్రధానులు మొదలుగా నెల్ల ప్రాణులను గోరి తన వశము చేసికొను మన్మథు నోడించిన రాగరహితుఁడగు నీశ్వరుని జ్ఞానాధిక్యముచేఁ దన సౌభాగ్యముచేత నర్ధనారీశ్వరునిగాఁ జేసినట్టి పార్వతి నా కావ్యము నాదరించి యా సౌభాగ్యము ననుగ్రహించుఁగాక.

విశేషము:- పార్వతి తన ప్రేమముచేతనే శివుని సగము మేనిని హరించెను. '(నారదః) సమాదిదేశైకవధూం భవిత్రీం - ప్రేమ్ణా శరీరార్ధహరాం హరస్య' - కుమార సం. 1-50. ఇందు మన్మథుని యాధిక్యమును, పిమ్మట నతని

నోర్చెనని పరమేశ్వరుని యాధిక్యమును దెలిపి, పార్వతి తన సౌభాగ్యముచే నట్టి పరమేశ్వరుని సైతమర్ధనారిఁ జేసెనని తెల్పుటచే పార్వతి సౌభాగ్యాతిశయమ్ము వ్యజ్యమాన మగుచున్నది.

ఓర్చిన - ఓడు + చు 'ఆడోడుకూడుల డకారంబునకుం జుక్కు పరంబగు నపుడు రేఫంబగు' బాల. క్రియ. 80: ఓరుచు. 'అచ్చికంబులం బదమధ్యంబుల నలడరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బాల. ప్రకీర్ణ 17 - ఓర్చు. 'ఉన్న కలజి నవర్ణకంబులు భవ ద్వావిశత్యర్థవదర్థంబు లందగు.' బాల, క్రియ. 46 - ఓర్చిన. చిత్ + ఘన = చిద్ఘన, 'అనునాసికాంతస్థ వర్ణములు తప్పఁ దక్కిన పదాంతగత హల్లులకు (ఝల్లులకు) మృదుహల్లులు (హశ్శులు) కాని, అచ్చులు కాని పరము లగునపుడు ఆ హల్లుల వర్గమునకుఁజెందిన తృతీయ వర్ణమాదేశముగా వచ్చును. తద్ + సుభగత్వము - అనునాసికాంతస్థభిన్నములైన హల్లులకు (ఝల్లులకు) కఠిన హల్లులు (ఖరులు) పరములగునపుడు వాని వర్గములందలి ప్రథమ వర్ణములు (చరులు) ఆదేశముగా వచ్చును. తత్సుభగత్వము. వీతరాగిన్ - బహువ్రీహిని మరల మత్వర్థీయమును బ్రయోగించుట యిందు విశేషము.

క. వేదాగమ రూపమున మ
హాదేవు నపారగుణ మహాసంస్తుతి సం
పాదిత యగు భారతి నేఁ
డాదిగ మత్కృతికి నెలయునదిగాక దయన్. 11

అర్థము :- వేద + ఆగమ- రూపమునన్ = వేదములు, శివాగమములు అనువాని రూపముచే, మహాదేవు = ఈశ్వరునియొక్క, అపార-గుణ- మహత్ (మహా) - సంస్తుతి-సంపాదిత = అమితములైన గుణములయొక్క- గొప్పదియగు స్తోత్రమును సంపాదించినది. అగు, భారతి = సరస్వతి, నేఁడు + ఆదిగన్ = నేఁడు మొదలుకొని, దయన్ = దయతో, మత్ + కృతికిన్ =, నా కావ్యమునకు, ఎలయునది + కాక = ఉన్ముఖ యగుఁగాక.

తాత్పర్యము :- వేదములు, శివాగమములు, అనువాని రూపమున మహాదేవుని అపారములైన గుణముల స్తోత్రమును సంపాదించినదియగు భారతి నేఁడు మొదలుగా నా కావ్యమునకు దయతో నున్ముఖురా లగుఁగాక.

విశేషము :- భారతి వేదరూపమునను, శివాగమ రూపమునను మహా దేవుని అపారగుణములను స్తోత్రముచేయు ననుట.

మహాదేవ + అపార- 'షష్ఠీ సమాసమునం దుకార ఋకారముల కచ్చుపర మగునపుడు నుగాగమం బగు.' బాల. సంధి. 34. మహాదేవు నపార 'మహాదేవు' అనునది అపారగుణ మహా సంస్తుతి సంపాదిత అను సిద్ధసమాసము మధ్యమున నున్న పదముతో నన్వయించుచున్నది. 'కొన్నియెడల సిద్ధసమాస మధ్యగత పదంబులతోఁ దద్భిన్న పదంబుల కన్వయంబు చూపట్టెడి.' ప్రౌఢ. సమాస. 35.

నన్నయ 'హరిహరాజ గజాననార్క షడాస్య మాతృ సరస్వతీ- గిరిసుతాదిక దేవతాతతికిన్ నమస్కృతి' చేయఁగా నితఁడు తదనుసారిగా నాయా దేవతలను విడివిడిగా స్తుతించినాఁడు.

గురుప్రశంస

ఆ. వె. అన్య దైవ వితతి నర్థించి[1] కొలువు తా
డిడి ఫలంబు గొనుట పడయఁగనెడి[2]
సద్య[3] మిష్టఫలదు జంగమ మల్లికా
ర్జునునిఁ గొలుపు మొనరు మునుఁగఁ గొనుట. 12

అర్థము :- అన్య-దైవ- వితతిన్ = (జంగమ మల్లికార్జునుని కంటె) వేఱయిన దేవతల సమూహమును, అర్థించి = కోరి, కొలువు = కొలుచుట, తాడు+ ఇడి = తాటిమొక్క పెట్టి-నాటి, ఫలంబు + కొనుట = పండును అనుభవించుట, పడయన్ + కనెడి = పొందఁగలిగెడు, సద్యము = వెంటనే, ఇష్ట-ఫలదున్ = కోరిన ఫలముల నిచ్చునట్టి, జంగమ మల్లికార్జునునిన్, కొలుపు = కొలుచుట, మొనరున్ = పెరుఁగును, మునుఁగన్ + కొనుట = (అన్నము) (చేయి) మునుఁగునట్లు గ్రహించుట-సమృద్ధిగా (పూర్ణముగా- సూ.ని.) గ్రహించుట, మొనరున్=మునరుతేనెను, మునుఁగన్ = మునుఁగచెట్టునందు, కొనుట = పడయుట. అని శ్రీ వేటూరి ప్రభా

---

1. వా. చు, 2. సా. పడయనెందు, 3. వా. సద్వరిష్టఫలదు,

కర శాస్త్రిగారు మఱియొక యర్థమును జెప్పిరి. కాని శ్రీగురువను నర్థముగల పదము- మునగ కాని మునుఁగ కాదు. అందుచే నది పొసఁగదు.

తాత్పర్యము :- ఇతర దైవతములను గోరి కొలుచుట తాటిటెంక పాఁతి, అది మొలచి పెద్దచెట్టయి ఫలించిన పిమ్మట దాని ఫలమును అనుభవించుట వంటిది. చిరకాలసాధ్యమనుట, కోరినవెంటనే ఫలముల నొసఁగు జంగమ మల్లికార్జునుని సేవ యన్నము (చేయి) మునుఁగునట్లు సమృద్ధిగాఁ బెరుఁగును గొనుటవంటిది.

విశేషములు ;- కొలుపు- కొలుచు ధాతు కృదంతరూపము. 'పువర్ణకంబు- మూ య్వాదుల కగు.' బాల. కృ. 11. తాడిడి- తాడు + ఇడి లేక తాడి + ఇడి- తాడు = తాడి = తాళవృక్షము. సద్యము- సద్యస్, ఈ శబ్దము సకారాంతమైనను సలోపము వచ్చిన రూపము తెలుఁగున వాడఁబడినది. 'ఆద్యంతంబును నీ యన, వద్య కథ వినంగఁ గనినవారికిఁ బాయున్, సద్యంబ బ్రహ్మహత్యా, వద్యము మొదలైన పాపవర్గం బెల్లన్, భార. స్వ. 86. అన్యదైవ వితతి నర్చించి కొలుపు తాడిడిఫలంబు గొనుట, జంగమ మల్లికార్జునుని కొలుపు మొసరు మునుఁగఁ గొనుట. ఇందుఁ బూర్వోత్తరార్ధముల సదృశము లయిన వాక్యార్థముల కైక్యారోపము చేయఁబడినది. కావున నిదర్శనాలంకారము. 'వాక్యార్థయో స్సదృశయో రైక్యారోపో నిదర్శనా.' చన్ద్రా. మొత్తము పద్యమునం దితరదైవతములకంటె శివుని కాధిక్యము చెప్పఁబడినది గావున వ్యతిరేకాలంకారము. 'వ్యతిరేకో విశేష శ్చే దుపమేయోపమానయోః.' చన్ద్రా.

వ. అని సద్భక్తియుక్తి నిశ్చయించి 13

అర్థము : అని, సత్+భక్తి-యుక్తిన్ = మంచి భక్తితోఁగూడుకొనినట్లుగా, నిశ్చయించి = నిర్ణయించి.

తాత్పర్యము : అని సద్భక్తితో నిర్ణయించి. - పయి పద్యముతో నన్వయము.

క. శ్రీ పీఠంబున నిడుకొని
శ్రీ పాదుకలందు[1] బ్రాలి సేవించెద నేఁ
బాపహతిఁజేసి పుణ్యం
బాపాదింపంగ మల్లికార్జునదేవున్. 14

---

1 సా ష్టనిచ్చి.

అర్థము : శ్రీ-పీఠంబునన్ = శోభాయమానమగు నాసనముపై, ఇడుకొని = ఉంచి, శ్రీపాదుకల + అందున్ = దివ్యములైన పాదరక్షల యందు, వ్రాలి = పడి, ఏన్ = నేను, పాప-హతిన్ + చేసి = పాపముల నాశనమును గావించి, పుణ్యంబు, ఆపాదింపఁగన్ = కలిగించుటకు, మల్లికార్జునదేవున్ = జంగమ మల్లికార్జునదేవుని, సేవించెదన్.

తాత్పర్యము : శ్రీపీఠమునం దిడు తన దివ్యములైన పాదుకలపైఁబడి నేను పాపములను బోకార్చి పుణ్యములను గలిగింప జంగమ మల్లికార్జునదేవుని సేవింతును.

మ. అమలజ్ఞాన సుదీపవర్తిఁగొని వృద్ధాచారుఁడై వేదశా
స్త్రములందున్న సదర్థమెల్లఁగొని విద్వత్ప్రీతిఁ గావించువా
ని మహాత్ముం డనఁబొల్చు పుణ్యనిధి వాణీముఖ్యు సర్వజ్ఞు జం
గమలింగంబగు మల్లికార్జును సదాకల్యాణుఁ గీర్తించెదన్. 15

అర్థము :- అమల-జ్ఞాన-సు-దీప-వర్తిన్ = స్వచ్ఛమైన జ్ఞానమనెడి మంచి దివ్వెయొక్క వత్తిని, కొని, వృద్ధ + ఆచారుఁడు + ఐ = పెద్దల ఆచారములు గలఁవాడయి వేద-శాస్త్రములందున్, ఉన్న, సత్ + అర్థము = మంచి విషయము, సత్సంపద, ఎల్లన్ = సర్వమును, కొని = గ్రహించి, విద్వస్ (త్) + ప్రీతిన్ = (దానితో) పండితుల సంతోషమును, కావించు = చేయు, వానిన్, మహత్ (మహా) + ఆత్ముండు, మహాత్ముఁడు, అనన్, పొల్చు = ఒప్పు, పుణ్య-నిధిన్ పుణ్యరాశియు, వాణీ-ముఖ్యున్ = వాగ్దేవికిఁ ప్రధానుఁడైనవాఁడును, సర్వజ్ఞున్ = అన్నియుఁదెలిసినవాఁడును, జంగమ-లింగంబు = సంచరించు శివుఁడైనవాఁడును, అగు, మల్లికార్జునున్ = మల్లికార్జునుని, సదా - కల్యాణున్ = నిత్యమంగళుని, కీర్తించెదన్ = పొగడుదును.

తాత్పర్యము :- నిర్మలజ్ఞాన మనెడు దీపపు వత్తిని గొని పెద్దల యాచారము ననుసరించువాఁడయి వేదశాస్త్రములందలి సద్విషయము నెల్ల గ్రహించి విద్వాంసులకుఁ బ్రీతి గావించువాఁడును, మహాత్ముఁ డన నొప్పు పుణ్యరాశియు, వాగ్దేవికిఁ బ్రధానుఁడైనవాఁడును, సర్వజ్ఞుఁడును, సంచరించు శివుఁడైన వాఁడును, నిత్యమంగళుఁడును అగు మల్లికార్జునుని స్తుతించెదను.

విశేషము :- అమలజ్ఞాన సుదీపవర్తి -అమలజ్ఞాన మనెడి సుదీపము యొక్క వర్తి - రూపకము. ఇట నిధి జ్ఞానము. నిధి నెఱుఁగఁగోరువారు దివ్వెను సాయముగాఁ గొని, పెద్దలు తెలిపిన యాచారములఁ బాటించి యన్వేషింతురు. అప్పుడు వారికి సదర్థము (నిధి) లభించును. దానితో వారు విద్వత్ప్రతి చేయుదురు.

వ. అని యిష్టదేవతా నమస్కారమ్ము చేసి సమస్త దేవతాస్వరూపం
బైన మదీయ గురు చరణారవిందంబు లభినందించి, 16

అర్థము :- అని, ఇష్ట-దేవతా-నమస్కారమ్ము=ఇష్టమైన దేవతల నమస్కారము, చేసి, సమస్త-దేవతా-స్వరూపంబు = ఎల్లదేవతల స్వరూపము, ఐన, మదీయ-గురు-చరణ+అరవిందంబులు = నా వాఁడైన, గురువుయొక్క, తామరల వంటి పాదములు, అభినందించి = పూజించి.

తాత్పర్యము :- అని యిష్టదేవతలకు నమస్కరించి, యెల్లదేవతల స్వరూపమయిన నా గురుదేవుఁడయిన జంగమ మల్లికార్జునుని అడుగుఁదామరల నర్చించి- తరువాతి పద్యముతో నన్వయము.

కవిస్తుతి

క. కవితామృతోదయాంబుధిఁ
గవి సజ్జనకనకు వస్తుకావ్యాబ్జ రవిన్
గవితారంభంబుల స
త్కవు లభినందింతు రాదికవి వాల్మీకున్. 17

అర్థము :- సత్ + కవులు = మంచి కవులు, కవితా+ఆరంభంబులన్ = కావ్య ప్రారంభ సమయములందు, కవితా + అమృత + ఉదయ + అంబుధిన్ = కవిత్వమనెడి, అమృతము యొక్క, పుట్టుకకు, సముద్రుఁడైనవాఁడును, కవి- సత్ + జన - కనకున్ = కవి పండిత జనులలో బంగారమైనవాఁడును, వస్తు - కావ్య + అబ్జ - రవిన్ = కథాప్రధానములైన కావ్యములనెడి తామరలకు సూర్యుఁడైన వాఁడును, ఆది కవిన్ = మొదటి కవియైనవాఁడును, అగు, వాల్మీకున్ = వాల్మీకుని, అభినందింతురు = ప్రశంసితురు.

తాత్పర్యము :- కవితామృత ముదయమందిన సముద్రుఁడును, కవులలోను, సజ్జనులలోను బంగారమయినవాఁడును, కథాప్రధానములైన కావ్యములనెడి పద్మములకు సూర్యుఁడయినవాఁడును, ఆదికవియైనవాఁడును అగు వాల్మీకిని గావ్యారంభము లందు సత్కవు లభినందింతురు.

విశేషములు :- కవితామృతోదయాంబుధి, కావ్యాబ్జ-అనుచోటుల రూపకాలంకారము. 'సత్' శబ్దమునకుఁ బండితుఁడని యర్థము - 'విద్వాన్ విపశ్చి ద్దోషజ్ఞ స్సన్ సుధీః కోవిదో బుధః - పాపం శ్యతీతి సన్' - పాపముఁ జెఱచువాఁడు - అమరము. సత్ + జన = సజ్జన - శ్చుత్వసంధి. 'వాల్మీకః' అని అకారాంతపులింగ రూపము గలదు. దాని తత్సమ రూపము వాల్మీకుఁడు. వల్మీకము = పుట్ట. దాని నుండి పుట్టిన వాఁడు వాల్మీకుఁడు. వస్తు కావ్యము - వస్తు వనఁగా నితివృత్తము (కథ) ఇతివృత్తము నకుఁ (గథకుఁ) బ్రాధాన్యము గల కావ్యమని యర్థము. ఈ కవి వాల్మీకిని, భారవిని, గాళిదాసుని వస్తుకవులనుగాఁ బేర్కొనెను గనుక నితని దృష్టిలో వస్తుకవు లనవెవరో తెలిసికొనవచ్చును. వారి కవిత వస్తు కవిత యన్నమాట.

క. వేదాంత భారత పురా
ణాదులు సేయు టొక పేర్మియని చనఁ బొగడం
గా దెడ్డ నజుఁడు నోపని
వేదము లేర్పఱిచె ననిన[1] వేదవ్యాసున్. 18

అర్థము :- అజుఁడున్ = బ్రహ్మ కూడ, ఓపని = చాలని - చేయలేని, వేదములు, ఏర్పఱిచెన్ = విభజించెను. అనినన్ = అనినచో, వేదవ్యాసున్, వేదాంత-భారత - పురాణ + ఆదులు = ఉపనిషత్తులు, మహాభారతము, అష్టాదశ పురాణములు మున్నగునవి, చేయుట = చేఁత, ఒక - పేర్మి = ఒక గొప్ప, అని, ఎడ్డన్ = ఎడఁదలో, పొగడన్ + చనన్ + కాదు = ప్రశంసింపనక్కఱలేదు.

తాత్పర్యము :- బ్రహ్మసైతముఁజేయలేని వేదవిభజనమును జేసె నన్నచో వేదవ్యాసుని వేదాంతములు, మహాభారతము, అష్టాదశ పురాణములు మున్నగు వానిని రచించుట యొక గొప్పయని మనస్సులోఁ బ్రశంసింప నక్కఱలేదు.

1. ముద్రిత ప్రతి - నంబ్రము.

విశేషములు :- వేదాంతాదులను రచించుట కంటె వేదవిభజనము కష్టతరమగుట. అది బ్రహ్మకుఁగూడఁ జేతఁగాని పని. వేదవిభజనమునే చేసినప్పుడు, వేదాంతాది రచన యొక గొప్పయా యనుటచే నలంకారము కావ్యార్థాపత్తి. 'కైముత్యేనార్థ సంసిద్ధిః కావ్యార్థాపత్తి రిష్యతే.' చంద్రా. చేయుడు = చేయుట. భావార్థక ట వర్ణమునకు బదులుగా డు వర్ణకమును బ్రయోగించుట నన్నెచోడుని పద్ధతి.

క. భాసురమతి వాల్మీకి
వ్యాసాదులు చనిన జగతి వర కవితా సిం
హాసన మెక్కి కవీంద్రుల
దాసులఁగా నేలెఁ గాళిదాసుఁడు పేర్మిన్. 19

అర్థము :- వాల్మీకి-వ్యాస + ఆదులు = వాల్మీకి, వ్యాసుఁడు మొదలగువారు, చనిన- జగతిన్ = అధిష్ఠించి విడిచిపోయిన వేదిక మీఁద, పేర్మిన్ = గొప్పతనముతో, భాసుర-మతి = ప్రకాశించు బుద్ధిగల, కాళిదాసుఁడు, వర-కవితా-సింహాసనము = ఉత్తమమైన కవిత్వమనెడి సింహాసనము, ఎక్కి = అధిష్ఠించి, కవి + ఇంద్రులన్ = కవిశ్రేష్ఠులను, దాసులన్ + కాన్ = దాసులనుగా, ఏలెన్ = పాలించెను.

తాత్పర్యము :- ప్రకాశించు బుద్ధిగల కాళిదాసుఁడు వాల్మీకివ్యాసాదులధిష్ఠించి విడిచిన వేదికమీఁద నుత్తమకవిత్వమనెడి సింహాసనము నధిష్ఠించి కవిశ్రేష్ఠులను దాసులనుగా నేలెను.

విశేషములు :- వ్యాస వాల్మీకుల తరువాతనే కాళిదాసుఁ డనుట. కాళిదాసుఁడు ఋతుసంహారము, రఘువంశము, కుమారసంభవము, మేఘసందేశము అను శ్రవ్యకావ్యములను, విక్రమోర్వశీయము, మాళవికాగ్నిమిత్రము, అభిజ్ఞానశాకుంతలము అను దృశ్యకావ్యములను రచించిన మహాకవి. కవీంద్రుల దాసులఁగా నేలె-తక్కిన కవిశ్రేష్ఠులందఱుఁ గాళిదాసుని కవితారాజ్యాధినేతృత్వము నంగీకరించి యతని ననుసరించినవారే యనుట.

క. భారవియు, వస్తుకవితను
భారవియును బరఁగి రుదయపర్వతశిఖరా
గ్రారోహ ణేంద్రకీల న
గారోహణ వర్ణనల జనారాధితులై. 20

అర్థము :- భా-రవియున్ = కాంతిచేత, సూర్యుఁడును, వస్తుకవితను = కథాప్రధాన కవిత్వముచేత, భారవియును = భారవి యను పేరుగల కవియును, ఉదయపర్వత-శిఖర + అగ్ర + ఆరోహణ + ఇంద్రకీల-నగ + ఆరోహణ-వర్ణనలన్ = తూర్పుకొండయొక్క, కొమ్ము యొక్క, కొనయొక్క, ఎక్కుట ఇంద్రకీల పర్వతము నెక్కుట యొక్క వర్ణనలచేత, జన + ఆరాధితులు = జనులచేఁ బూజింపఁబడినవారు, ఐ, పరఁగిరి = ఒప్పిరి.

తాత్పర్యము :- కాంతిచేత సూర్యుఁ డుదయపర్వత శిఖరాగ్రము నారోహించి జనారాధితుఁడై పరఁగెను. అట్లే వస్తుకవిత్వముచే భారవి యను కవి ఇంద్రకీల, పర్వతారోహణమును వర్ణించి జనారాధితుఁడై పరఁగెను.

విశేషములు :- సూర్యునకుఁ గాంతి యెట్టిదో, భారవి యనుకవికి వస్తుకవిత యట్టి దనుట. సూర్యుఁ డుదయపర్వత శిఖరారోహణమును జేయఁగా, భారవి తన కిరాతార్జునీయకావ్యమున నింద్రకీల పర్వతారోహణ వర్ణన గావించెను, తమ తమ పనులచే నిరుపురును జనారాధితులై పరఁగిరి. భారవి-ఒక సంస్కృతకవి. ఇతఁడు కిరాతార్జునీయ మనుకావ్యమును సంస్కృతమున రచించెను. 'భారవే రర్థగౌరవమ్' అని యితఁ డర్థగౌరవమునకుఁ బ్రసిద్ధుఁడు. అలంకారము యథాసంఖ్యము.

క. క్రమమున నుద్భటుఁడు కవి
త్వము మెఱయఁ గుమారసంభవము సాలంకా
రము [1]గూఢవస్తుమయ కా
వ్యముగా హరలీల చెప్పి హరు మెచ్చించెన్. 21

అర్థము :- ఉద్భటుఁడు = ఉద్భటుఁడను పేరుగల కవి, క్రమమునన్ = వరుసగా, కవిత్వము, మెఱయన్ = ప్రకాశింపఁగా, కుమారసంభవము, స + అలంకార

1. పా. గూఢ.

మున్ = అలంకారశాస్త్రసహితముగను, గూఢ-వస్తు-మయ - కావ్యముగాన్ = గూఢమగు వస్తుమయము-కథాప్రధానమునైన కావ్యముగను, హరలీల = హరలీల యను నొక కావ్యమును, చెప్పి = రచించి, హరున్ = శివుని, మెచ్చించెన్ = మెప్పించెను. శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి పాఠము 'గూఢ' కాక 'గూడ' అనునది. అట్టిచో- అలంకారము + కూడన్ = అలంకారము కూడునట్లుగాను, వస్తుమయమైన కావ్యము గాను 'హరలీల' అనుకావ్యమును రచించెనని చెప్పవలయును. కేవల వస్తుమయము- కథాప్రధానముగాఁగాక, అలంకారయుక్తముగాఁగూడ 'హరలీల' చెప్పెనని భావము. కాని ఉద్భటుఁ డనునతఁ డొక యలంకార గ్రంథమును రచించె ననుట ప్రసిద్ధము.

తాత్పర్యము :- ఉద్భటుఁ డనునతఁడు క్రమముగాఁ గవిత్వము మెఱయు నట్లు కుమారసంభవమును, అలంకారసహితముగను, గూఢము, వస్తుమయము నగు నట్లును హరలీల యను కావ్యమును రచించి శివుని మెప్పించెను.

విశేషములు:- ఉద్భటుఁడు అలంకార శాస్త్ర గ్రంథమును రచించిన మిక్కిలి ప్రాచీనుఁడైన కవి. ఇతఁడు కాశ్మీరము నేలిన జయాపీడుఁ డను రాజునాస్థానమున సభాపతిగా క్రీ. శ. 779-813 లో నుండెను. గూఢ మనఁగా ధ్వనిమయముగా నని చెప్పవలయును. అతఁడు హరలీల యను కావ్యమును సాలంకారముగను ధ్వనిమయము గను, వస్తుమయముగను రచించి హరుని మెప్పించెనని భావము,

క. కరములు దునుముడుఁ బరముని
వరదునిగాఁ గొలిచి కవితవలననె మగుడం
గరములు వడసి జగంబునఁ
బరఁగె మహాకవి యనంగ బాణుఁడు పేర్మిన్. 22

అర్థము :- కరములు = చేతులు, తునుముడున్ = నఱికినంతనే, పరము నిన్ = ఉత్కృష్టుఁడైన శివుని, వరదునిగాన్ = వరముల నిచ్చువానినిగా, కొలిచి = సేవించి, మగుడన్ = మరల, కవితవలననె = కవిత్వమువలననే, కరములు, వడసి = పొంది, బాణుఁడు, జగంబునన్ = లోకమునందు, పేర్మిన్, = గౌరవ ముతో, మహాకవి = గొప్పకవి, అనంగన్, పరఁగెన్ = ఒప్పెను.

తాత్పర్యము :- చేతులు ఖండించినంతనే ఉత్కృష్టుఁడగు శివుని పరమభక్తుఁడౌనఁగువానిఁగాఁ గొలిచి మరలఁ గవిత్వమువలననే చేతులు పొంది భాణుఁడు లోకమునందు గౌరవమొప్ప మహాకవి యనఁబరఁగెను.

విశేషములు :- ఈ బాణుఁడెవరు ? కవులలోఁ బరిగణింపఁబడినవాఁడు గనుక భట్టబాణుఁడా ? లేక బలిచక్రవర్తి కొడుకు బాణుఁడా ? 'బాణోచ్ఛిష్టం జగత్సర్వ' మని యున్నది కావున 'మహాకవి' యనఁబరఁగినవాఁడు భట్టబాణుఁడే కావచ్చును. కాని బలిచక్రవర్తి కొడుకు బాణుఁడుకూడ మహాభక్తుఁడు. అతని చేతులను శ్రీకృష్ణుఁ డుషాపరిణయ సందర్భమునఁ దునుమఁగా నతఁడు శివునెదుట నృత్యము చేసి అభంగ వృత్తములతో స్తుతింప శివుఁడు కరముల ననుగ్రహించె నఁట. భట్టబాణుని పక్షమునఁగూడ.

'చేతులు రెండును దునుప మహాతాత్పర్యమున మిమ్ము నర్చించి జగ
త్ఖ్యాతముగ మగుడఁ బడయఁడె, ఖ్యాతిగ నీచేత భట్టబాణుఁడు రుద్రా'

అని శివతత్త్వసారము 39-6 లోఁ బండిత మల్లయ్య చెప్పెను. బాణుఁడు తన శివభక్తిని నిరూపించుకొనుటకయి చేతులు నఱుకుకొని 'శివకర శివకర' యను మహాక్రమముగల గద్యమును రచించి శివునిచే మరలఁ గరములు పడసెనని సోమనాథుఁడు పండితారాధ్యచరిత్రమునఁ జెప్పినాఁడు. అందుచే నీ యిరువురిలో నే బాణుఁడైనఁ గావచ్చును.

తునుముడుస్- 'ఆనంతర్యంబున డువర్ణకంబు ద్రుతాంతం బగు' బాల. క్రియ. 42. కరములు వడసి-కరములు + పడసి. 'ప్రథమమీఁది పరుషములకు గసడదవలు బహుళముగా నగు.' బాల. సంధి. 13.

క. మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశకవితఁ బుట్టించి తెనుం
గున[1] నిలిపి రంధ్రవిషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్. 23

---

1 గున్నః.

అర్థము :- మును=పూర్వము, మార్గ-కవిత - మార్గకవిత్వము - అనఁగా వ్యాస వాల్మీకి కాళిదాసాదుల కేవల సంస్కృత కవిత్వము లేదా నన్నయాదుల సంస్కృత సాహిత్య సంప్రదాయానుసారి భారతాదిక కవిత్వము, లోకంబునన్ = లోకమునందు, వెలయఁగన్ = ప్రకాశింపఁగా, చాళుక్య-రాజు - మొదలుగన్ = చాళుక్యవంశపురాజు (రాజరాజనరేంద్రుఁడు) మొదలుకొని, పలువుర్=పలువురు- అనేకులు, చనన్=తగునట్లు, అంధ్ర-విషయంబునన్=ఆంధ్రదేశమునందు, దేశి-కవితన్= దేశి కవిత్వమును అనఁగా రగడలు, అక్కఱలు, ద్విపదలు మున్నగు దేశిచ్ఛందోరీతులలో రచింపఁబడిన కవిత్వమును, పుట్టించి, తెనుంగునన్=తెనుఁగు బాసయందు, నిలిపిరి.

తాత్పర్యము :- పూర్వము లోకమునందు మార్గకవిత్వము ప్రకాశించుచుండఁగా నాంధ్రదేశమునఁ జాళుక్యరాజులు మొదలుకొని పలువురు దేశి కవిత్వమును బుట్టించి యందుఁ దెనుఁగుబాసను నిలిపిరి.

విశేషములు:- మార్గ దేశి కవితలవిషయమున నభిప్రాయభేదములు గలవు. మార్గకవిత యనఁగా వ్యాస వాల్మీకి కాళిదాసాదుల కేవల సంస్కృతకవిత్వ మనియు, దేశికవిత యనఁగా నన్నయాద్యాంధ్రకవుల కవిత్వ మనియు నొక యభిప్రాయము. మార్గకవిత యనఁగా సంస్కృత సాహిత్యము ననుసరించి సంస్కృత వృత్తములతోఁ గూడిన భారతాది రచనారీతి యనియు, దేశికవిత యనఁగా రగడలు, అక్కఱలు, ద్విపదలు మున్నగు కేవల దేశిచ్ఛందోరీతులలో రచింపఁబడిన కవిత్వ మనియు వేఱొక యభిప్రాయము. దీని తరువాతిదైన 'సురవరుల'నిత్యాది పద్యమున (25వ పద్యము) నీ కవి పురాణకవిసంఘము, నుత్తమ మార్గ సత్కవీశ్వరులను, దేశిసత్కవుల'నని మువ్విధములవారిని బేర్కొనుటచే - పురాణకవు లనఁగా వ్యాస వాల్మీకి కాళిదాసాది కేవల సంస్కృతకవు లనియు, ఉత్తమమార్గ సత్కవీశ్వరు లనఁగా సంస్కృతచ్ఛందోరీతులతో భారతాది రచనలు చేసిన నన్నయాది కవులనియు, దేశి సత్కవులనఁగా దేశిచ్ఛందోరీతులలో - రగడలు, ద్విపదలు మున్నగువానిలోఁ గవిత్వమును జెప్పిన సుకవులనియు నీ రెండవతెగవారి యభిప్రాయము. కాని పరిశీలింపఁగా మొదటి యభిప్రాయమే - అనఁగా మార్గకవిత కేవల సంస్కృత కవిత్వమనియు, దేశికవిత నన్నయాదుల భారతాదికము వంటి కవిత్వమనియు ననుట సమంజస మని తోఁచుచున్నది. ఏలయనఁ జాళుక్యరాజులు తెనుఁగున నిలిపినది భారతమువంటి కవిత్వమునుగాని కేవల దేశిచ్ఛందోరీతులలో రచింపఁబడిన కవిత్వమును గాదు. వారి నాఁటికిఁ గేవల సంస్కృత

కవిత్వము వ్యాప్తిలో నుండెను. అదియే మార్గకవిత్వము. చాళుక్య లాంధ్రదేశ పరిపాలకులై తెనుఁగున భారతమును రచింపఁజేసిరి. అందుచే వారు తెనుఁగున నిలిపి నది అట్టి కవిత్వము. అదియే దేశకవిత్వమని తలఁప నగును. 'చన సత్యాశ్రయునిఁ దొట్టి చాళుక్యనృపుల్' అను పాఠము తంజావూరిప్రతిలో లేదు, అందు 'చనఁజాళుక్య రాజు మొదలుగఁ బలువుర్' అను పాఠము గలదు. కావున నది స్వీకృతము. 'ఇందు-చాళుక్యరాజు అనఁగా నిప్పటికి రాజనరేంద్రునకుఁ బూర్వపుఁ దెలుఁగు గ్రంథములు తెలియరాలేదు కావున నాతఁడే యిందు స్మరింపఁబడినవాఁడనఁజెల్లును ఒండె పద్య రచనలు కొన్ని గుణగవిజయాదిత్యుని నాఁటఁగలవు గాన ఆతఁడేని కాఁదగును. తత్పూర్వ గ్రంథములు దొరకునంతదాఁక నీ యర్థ మిట్లే కుదుర్కొనఁ గలదు.' (శ్రీ వే, ప్ర. శా.).

పలువుర్-పలువురు - 'పదాంతంబులయి యసంయుక్తంబులయిన ను లు రు ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బాల. ప్రకీర్ణ, 16. ఇందు ను రు ల కుత్వలోపంబు ప్రాయికంబుగ హల్పరకంబులకుఁ జూపఁబడు.' అని చిన్నయ చెప్పెను. ప్రాయికముగా ననుటచే నిట్టి యవసాన వరక రు వర్ణములకును క్వాచిత్కముగా నుత్వలోపము గలదని తెలియుచున్నది.

చ. సురవరులం గ్రమంబున వచోమణిసంహతిఁ బూజ చేసి మ
ద్గురు చరణారవిందములకుం దగ సమ్మతిఁజేసి కొల్చి వి
స్తరమతులం బురాణకవి సంఘము నుత్తమ మార్గ సత్కవీ
శ్వరులను దేశిసత్కవుల సంస్తుతిఁజేసి మనోముదంబునన్. 24

అర్థము :- సుర - వరులన్=దేవతాశ్రేష్ఠులను, క్రమంబునన్ = వరుసగా, వచస్ (ః) + మణి-సంహతిన్ = మణుల వంటి వాక్కుల సమూహముతో, పూజ - చేసి - పూజించి, మత్ + గురు - చరణ + అరవిందములకున్ = నాయొక్క-గురువైన జంగమ మల్లికార్జునుని యడుగుఁదామరలకు, తగన్ = తగునట్లు, సమ్మతిన్ + చేసి=అభిలాషతో, కొల్చి=సేవించి, మనస్ (ః) + ముదంబునన్= మనస్సంతోషముతో, విస్తర - మతులన్ = అధికమైన బుద్ధిగలవారు, అగు, పురాణ-కవి - సంఘమున్ = పూర్వ కవుల సమూహమును, ఉత్తమ - మార్గ - సత్ + కవి + ఈశ్వరులను = శ్రేష్ఠులైన మార్గ సుకవివరులను, దేశి - సత్ + కవులన్= దేశి సుకవులను, సంస్తుతిన్ + చేసి = ప్రశంసించి,

తాత్పర్యము :- దేవతాశ్రేష్ఠులను క్రమముగా వాక్ప్రసూనసముదాయముతోఁ బూజించి, నా గురువైన జంగమ మల్లికార్జునుని పాదపద్మములను సముచితముగాఁ గోరి సేవించి, యధికమతిమంతులగు పూర్వకవుల సమూహమును, ఉత్తములైన మార్గ సత్కవివరులను, దేశి సుకవివర్యులను మనస్సంతోషముతో సంస్తుతించి - తరువాతి వచనముతో నన్వయము.

విశేషములు :- పురాణ కవి సంఘము .... దేశి సత్కవులన్ - పూర్వులైన మార్గకవివరులను - అనఁగా సంస్కృత కవిశ్రేష్ఠులను,పూర్వులైన దేశికవి వర్యులను - అనఁగా నాంధ్రకవిశ్రేష్ఠులను.

వచస్ + మణి, మనస్ + ముదము - పదాంతమందలి సకార మేదైన వర్ణము పరమైనప్పుడును, అవసానమందును విసర్గముగా మాఱును. - వచః + మణి, మనః + ముదము - హ్రస్వ అకారము తరువాత వచ్చు విసర్గమునకు హ్రస్వ అకారము గాని, మృదు హల్లులు (హశ్శులు) కాని పరములగునపుడు ఉ ఆదేశముగా వచ్చి పూర్వమందున్న అకారముతోఁగూడి గుణసంధి ననుసరించి ఓ గా మాఱును. వచ + ఉ + మణి = వచోమణి, మన + ఉ + ముదంబు = మనోముదంబు.

వ. మఱియు 25

క. గుఱు తెఱిఁగి వస్తు చయమున
కొఱగెడు నా దీపవర్తియును బోలె నిజ
మ్మెఱిఁగి కృతి[1] వస్తు సమితికి
వఱలఁగ మదినొఱగు విబుధవర్గముఁ దలఁతున్. 26

అర్థము :- గుఱుతు + ఎఱిఁగి = గుర్తుపట్టి, వస్తు - చయమునకున్ = (తైలకర్పూరాది) వస్తువుల సమూహము వైపు, ఒఱగెడు = వంగునట్టి, ఆ - దీప-వర్తియును + పోలెన్ = ఆ దీపపు వత్తి (జ్వాల) వలె, నిజమ్ము + ఎఱిఁగి = నిజము తెలిసికొని, కృతి - వస్తు - సమితికిన్ = కావ్యములందలి కథల సమూహమునకు, వఱలఁగన్ = ఒప్పునట్లు, మదిన్ = మనస్సుతో, ఒఱగు = వంగునట్టి, విబుధ - వర్గమున్ = పండితుల సమూహమును, తలఁతున్.

1. కృత.

తాత్పర్యము :- వస్తువును (నిధిని) గుఱితించి దానిపై ప్రమోగునట్టి దీపపు వత్తివలె, నిజమెఱిగి కావ్యమునందలి యితివృత్తమున కభిముఖమగు పండితుల సమూహమును స్మరింతును.

విశేషములు :- కావ్యమునందలి వస్తువుపైఁ గవికిఁగల ప్రీతి గమనింపఁ దగినది. దీపపువత్తి (జ్వాల) వస్తువు = పదార్థముపై ప్రమోగునట్లు, పండితులు గూడఁ గావ్యవస్తువుపై = కథపై - ఇతివృత్తముపై ప్రమోగుఁజూపుదురు. అలంకార మునపు- నిధులు కలచోట దీపశిఖ యథోముఖమగునని నిధిశాస్త్రము.

వ. మఱియు దోషగ్రాహులగు కుకవి వరాకులం బరిహరించితి నెట్లనిన 27

అర్థము :- మఱియున్, దోష- గ్రాహులు = తప్పులనే పట్టువారు, అగు, కుకవి- వరాకులన్ = నీచులైన దుష్కవులను, పరిహరించితిన్ = విడిచితిని, ఎట్లు+ అనినన్ = ఏ రీతిగా ననఁగా.

తాత్పర్యము :- మఱియు నేను దప్పులనే పట్టువారయిన నీచ దుష్కవు లను రోసితిని. ఏ విధముగా ననఁగా- పయి పద్యముతో నన్వయము.

విశేషములు :- కుకవిః - కుత్సితః కవిః, వరాకుఁడు = నీచుఁడు. కుకవి వరాకులు = వరాకులైన కుకవులు- విశేషణోత్తరపద కర్మధారయము.

క. మార్గ కుమార్గము దేశి య
మార్గము [1]వగవంగఁ దమకు మది వదలక దు
ర్మార్గ పదవస్తు లనఁదగు
మార్గవులం దలఁప నలఁతి మహి సుకవులకున్. 28

అర్థము :- వగపంగన్ = ఆలోచింపఁగా, తమకున్ = మార్గవులకు, మార్గ = మార్గ కవిత్వము, కు- మార్గము = చెడురీతి, దేశి = దేశికవిత్వము,

---

1. వదలంగ.

అమార్గము = కానిత్రోవ- అనఁగా నసాధ్యమగు త్రోవ, మదిన్ = మనసునందు, వదలక = విడిచిపెట్టక, దుర్మార్గ-పద- వర్తులు = మార్గకవిత్వమును చెడ్డదని రోసి, దేశికవిత్వము సాధ్యపడక పాడుత్రోవనుబట్టి యుండువారు, అనన్ + తగు = అన నొప్పునట్టి, మార్గవులన్ = మాఱు + కవులన్ = కవివేషధారులను, తలఁపన్ = = స్మరించుటకు, మహిన్ = భూమియందు, సుకవుల్లకున్ = మంచికవులకు, అల్లఁతి = తక్కువతనము.

తాత్పర్యము :- కవులుగాకున్నను, కవులవలెఁ బైకిఁగనుపట్టువారికి మార్గ కవితారీతి చెడ్డది. దేశి కవితాపద్ధతి చేతఁగానిది. మఱి వారు రెంటిని గాక దుర్మార్గము ననుసరించి వర్తిలువారు. అట్టి మార్గవులను- కవి వేషధారులను స్మరించుట సుకవులకు న్యూనత, ఈ పద్యమునకు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రులవారి వ్యాఖ్య యిటు లున్నది. మార్గకున్ = సంస్కృత (ప్రధాన) కవితకు, దేశియ= దేశభాషా (ప్రధాన) కవితా రచనయే, మార్గము = బాట, సంస్కృత రచనమో, సంస్కృత భాషామయమయిన రచనమో చేయుటకుముందు దేశిరచన నలవఱచుకోవలెను. ,ద్వారమున నా సంస్కృతరచన చేయవలెను. ఇదీ సరియైన మార్గము- ఈ, మార్గము = త్రోవ, వగవంగన్ = అర్థించుటకు - అపేక్షించు విషయమున, తమకున్ = కుకవులకు, మది వదలక = మనోవైముఖ్యము తొలఁగక. మనసు చొరక (కాన) దుర్మార్గ పదవర్తులు దుర్మార్గమునఁ బదములను (అడుగులను) సాగించువారు- చెడ్డదయిన మార్గ-సంస్కృత, పద-శబ్దములందు, వర్తులు = వర్తించువారు, ఆనఁదగు అనట్టి) మార్గవులన్ = మాఱట పశువులను, మాఱుకవులను, అనఁగా మాయ కవులను (ఇమిటేషన్ కవులను), సుకవులకున్, మహిన్, తలఁపన్, అలఁతి = తల్పము - తుచ్ఛము.

తాత్పర్యము :- సంస్కృత కవితా రచనము, ఒండె, సంస్కృత శబ్ద ప్రధాన కవితా రచనము చేయఁగోరువారు ముందు దేశిరచనలో నాటితీరవలెను, అట్లు దేశిత్రోవను చనుటకు మనసొల్లక వంకరటింకరలుగా కలుకుగా నుండు దుర్మార్గ మున పదములు ప్రయోగింపఁబోవు వారు కుకవులు, పశుప్రాయులు - వారిని దలఁపరాదు.

గీ. చెనసి గుణమైన దోషంబు చేయనేర్చుఁ
గుకవి కృతులందు దోషంబు గుణము సేయ
నేరఁ డది యట్ల దొంతులు సేరి నాయి
దోర్ప నేర్చుఁగా కది యేమి[1] నేర్ప నేర్చు ? 29

అర్థము :- కుకవి, కృతులందున్ = కావ్యములయందు, చెనసి = ఎదిరించి, గుణము + ఐనన్ = గుణము నైనను, దోషంబు, చేయన్ = చేయుటకు, నేర్చున్ = సమర్థుఁడగును, దోషంబున్ = దోషమును, గుణము + చేయన్ + నేరఁడు = గుణముచేయఁజాలఁడు, అది, అట్లు + అ = అట్లే, నాయి = కుక్క) చేరి = సమీపించి, దొంతులు = దొంతరలు, దోర్పన్ + నేర్చున్ + కాక = పడఁగొట్టఁగలదు గాక, అది = కుక్క, ఏమి, చేర్పన్ + నేర్చున్ = వరుసగాఁ బెట్టఁగలదు ?

తాత్పర్యము :- కుకవి కావ్యములందు గుణమునైనను దోషముగాఁ జేయఁగలఁడు గాని దోషమును గుణముగాఁ జేయఁజాలఁడు, అది యట్లే, కుక్క దొంతరను బడఁగొట్టఁగలదు కాని దొంతరగాఁ బెట్టలేదు గదా !

విశేషములు :- ఇందు ఉపమానోపమేయ వాక్యముల వేఱు వేఱగు ధర్మములకు బింబ ప్రతిబింబ భావ ముండుటచే నలంకారము దృష్టాంతము. 'చేద్బింబ ప్రతిబింబత్వం దృష్టాన్త స్త దలఙ్కృతిః' చన్నారు.

ఇట్టిభావము గల పద్యమే కొఱవి గోపరాజకృత సింహాసనద్వాత్రింశికలోఁగలదు.
.... ఎల్లెడం,
ద్రోవసరాక కుక్కలకు దొంతులు పేర్పఁగ నేర్పు గల్గునే ? 1-16.

గీ. నెఱయ రసవంతమగు కృతి కెఱఁగనేర
రల్పరసకృతి కెఱఁగుదు రలుపు లెల్లఁ,
జెఱకు విడిచిన రసమున కెఱఁగి రాక
పిప్పి కరిగెడు నీఁగల పెల్లు పోలె. 30

1. పా. సేర్పు నేర్ప.

అర్థము :- చెఱకు-విడిచిన- రసమునకున్ = చెఱకు పిండఁగా వచ్చు రసమునకు, ఎఱఁగి-రాక = ఆసక్తి చూపలేక, పిప్పికిన్, అరిగెడు = పోయెడు, ఈఁగల-పెల్లు + పోలెన్ ఈఁగలగుంపువలె, అలుపులు + ఎల్లన్ = అల్పులైన వా రందఱును, నెఱయన్ = నిండుగా, రసవంతము + అగు = రసవంతమైన, కృతికిన్ = కావ్యమునకు, ఎఱఁగన్ + నేరరు = అభిముఖులు-ప్రవణులు కారేరు. ఆసక్తిఁ జూపలే రసుట, అల్ప-రస-కృతికిన్ = నీరసమైన కావ్యమునకు, ఎఱఁగుదురు.

తాత్పర్యము :- ఈఁగలగుంపు చెఱకును బిండఁగా వచ్చు రసము నాస్వాదింపలేక పిప్పిపై మూఁగునట్లు, అల్పులు బాగుగా రసవంతమగు కావ్యము నాస్వాదింపఁజాలక నీరసమైన కావ్యము నాస్వాదింతురు.

విశేషములు :- అలంకారము-ఉపమ. అల్పులు (ప్రకృతి) - అలుపులు (వికృతి). ఈఁగలు రసమునకేల యెఱఁగఁజాలవు? రసముపై నవి వ్రాలకుండఁ గాఁపరులు గట్టికట్టుదిట్టము చేయుటచేఁ గావచ్చును. లేదా యవి రసములోఁబడి మరణించునే కాని దాని నాస్వాదింపలేకపోవచ్చును. పిప్పిపై వ్రాలుటకు వాని నెవరును వారింపరు కావున నవి యథేచ్ఛముగా వ్రాలును. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రుల వారు ఈ పద్యము నందలి మూఁడవ పాదము నిట్లు సవరించిన నుపమానోపమేయములకు సక్రమ నిర్వాహము కుదురు ననిరి. 'నెఱయ రసమున్న చెఱకున కెఱఁగి రాక.' నెఱయ రస వంతమగు కృతి = నెఱయ రసమున్న చెఱకు; అల్పరస కృతి = పిప్పి.

వ. కావున 31

తాత్పర్యము :- అందుచేత - పయి పద్యముతో నన్వయము.

గీ. తజ్ఞునం దెఱ్ఱనగు కవితా విశేష
మజ్ఞునం దేమి యెఱుఁగంగ నగు? సమస్త
కనక వర్ణోత్కర మ్మొరగంట నొరసి
చూచి కా కెఱ్ఱవచ్చునె సుద్దబాత? 32

అర్థము :- తద్ + జ్ఞ + అందున్ = బాగుగాఁ దెలిసినవానియందు - విద్వాంసునందు, ఎఱ్ఱన్ + అగు = ఎఱుఁగనగు - తెలియవచ్చునట్టి, కవితా

విశేషము, అజ్ఞునందున్ = తెలియనివానియందు, ఏమి + ఎఱుఁగంగన్ + అగున్ = ఏమి యెఱుఁగఁగలఁడు ? సమస్త - కనక - వర్ణ + ఉత్కరమ్ము = ఎల్ల బంగారపుఁజాయల సమూహము, ఒరగంటన్ = గీటురాతితో, ఒరసి = రాచి, చూచి కాక = చూచుటచేఁగాక, సుద్ద - ఱాతన్ = సున్నపుఱాతితో, ఎర్గన్ + వచ్చునె = తెలియనగునా ?

తాత్పర్యము :- విద్వాంసుఁడు తెలియనగు కవితా విశేషము అజ్ఞునకేమి తెలియును ? ఏమియుఁ దెలియదనుట. బంగరు చాయ మంచిదో కాదో గీటురాతితో రాచిచూచినఁ దెలియనగునుగాని సుద్దఱాతితో రాచినచోఁ దెలియనగునా ? తెలియరా దనుట.

విశేషములు :- ఉపమానోపమేయ వాక్యముల వేఱు వేఱగు ధర్మములకు బింబ ప్రతిబింబ భావముండుటచే నలంకారము దృష్టాంతము. ఒరగల్లు-నికషోపలము. ఒరగంటన్-ఒరగల్లు+చేతన్-టివర్ణంబు కొన్నింటి యంతాక్షరంబున కాదేశంబును గొన్నింటి కంతాగమంబును గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగ నగు,' ఒరగ + టి + చేతను. బాల, ఆచ్ఛిక, 31, 'పదాద్యంబగు హ్రస్వంబుమీఁది టి వర్ణంబునకు ముందు పూర్ణబిందు వగు' బాల. ఆచ్ఛిక. 33, ఒరగంటి+చేతను, 'ఔపవిభక్తికంబుల తృతీయా సప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు, బాల, ఆచ్ఛిక, 38, ఒరగంటి+అను. 'అంద్వవగాగమంబులం దప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు,' బాల. సంధి. 11. ఒరగంటను. తద్+జ్ఞ - సకార తవర్గములకు శవర్ణ చవర్గములతోఁబూర్వమందైనను బరమందైనను గూడిక గలుగునపుడు క్రమముగా శవర్ణ చవర్గ వర్ణము లాదేశమగును- తజ్జ్ఞ, ఎఱుఁగు-' ఆచ్ఛికంబులం యుపధ్యంబుల న ల డ ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు,' బాల. ప్రకీర్ణక. 17 'అలఘురేఫము లుప్తాచ్కమగుచో లఘురేఫంబగు.' ప్రౌఢ. ముక్త. 2. ఎర్గు. ఱాయి + చేతను - 'విభక్తి పరంబగునపుడు గోయి ప్రభృతుల తుది యక్షరంబు తివర్ణంబగు.' బాల. ఆచ్ఛిక. 35. ఱాతి + చేతను, తృతీయ కత్వ మాదేశమై (బాల, ఆచ్ఛిక. 38). అపదాది స్వర సంధి (బాల. సంధి. 11.) జరుగఁగా 'ఱాతన్' అగును.

వ. అది యెట్లనిన. 33

తాత్పర్యము :- అది యే ప్రకారమనఁగా- తరువాతి పద్యము నన్వయము:

గీ. [1]అన్యతారక విక్రృతుల నాదరించి
[2]వెలయు సత్కవి బుధగురు బలము వడసి
యొనర దైవజ్ఞు నట్ల శుభోదయమున
దివ్యసుకృతిఁ బ్రతిష్ఠింతుఁ దిరముగాఁగ. 34

అర్థము :- అన్య - తారక-విక్రృతులు = ఇతరములగు నక్షత్రముల చెడుగులను- విరోధియైన, అసత్కవియైన, తార కవికృతులు = తారుఁడను కవి రచించిన కబ్బములను, అనాదరించి = గర్హించి, వెలయు = ఒప్పునట్టి, సత్ + కవి-బుధ-గురు-బలము=మంచి, శుక్రుడు, బుధుఁడు, గురుఁడు అను గ్రహములయొక్క బలము - సుకవులయొక్కయు, పండితులయొక్కయు, గురువులయొక్కయు బలము, వడసి = పొంది, ఒనరన్=ఒప్పునట్లు, దైవజ్ఞ+అట్లు+అ=జ్యోతిష్కుని వలెనే, శుభ+ఉదయమునన్=మంగళకరమగు ఉదయకాలమున - మంగళకరమైన ఆరంభము నందు, దివ్య-సుకృతిన్ = గొప్ప సత్కార్యమును - ఉత్కృష్టమైన సత్కావ్యమును, తిరము+కాఁగన్=స్థిర మగునట్లు, ప్రతిష్ఠింతున్=నెలకొలుపుదును.

తాత్పర్యము :- ఇతర నక్షత్రముల చెడుగుల ననాదరించి, శుక్ర, బుధ, గురు గ్రహములు బలము గలిగియుండఁగా, మంగళకరమగు ఉదయకాలమునందు జ్యోతిష్కుఁడు దివ్యమైన శుభకార్యమును స్థిరముగాఁ బ్రతిష్ఠించునట్లు, నేనును శత్రువైన తారుఁ డను కవి కావ్యముల ననాదరించి, సుకవులయు, బుధులయు, గురువులయు ననుగ్రహమును బొంది శుభోదయకాలమున దివ్యమైన కావ్యమును బ్రతిష్ఠింతును.

విశేషములు :- తారక, కవి, బుధ, గురు, ఉదయ, సుకృతి. అను శబ్దములకుఁగల యర్థద్వయము ననుసరించి అలంకారము శ్లేషము. నేను దైవజ్ఞునట్లు దివ్యమైన కృతిని బ్రతిష్ఠింతు ననుటచే నలంకార ముపమ. 'ఈ పద్యమువలన నన్నెచోడునికాలమున నొక యసత్కవి తారుఁ డనువాఁ డుండెనని యేర్పడును. ఇక్కడ రెండర్థములు పొసఁగి తీరవలెను గాన ఒక యర్థమున "తారకవి" యుండక తప్పదు. 'తతులు' నీరసము, అర్థానుగుణము నని వ్రాఁతప్రతిలో నున్నను నేనై 'కృతులు' అని మార్చినాఁడను.' శ్రీ వే. ప్ర. శా.

దైవజ్ఞునట్ల-దైవజ్ఞ + అట్ల. షష్ఠీసమాసమునందుకార ఋకారముల కచ్చు పర మగునపుడు నుగాగమంబగు. బాల. సంధి. 34. తిరము (వికృతి)- స్థిరము (ప్రకృతి)

1. వ్రా. అన్యతారకవిరతులను. 2. వా. యు.

కా వ్య ప్ర శ స్తి

చ. సరళముగాఁగ భావములు జానుఁదెనుంగున నింపు పెంపుతోఁ
బిరిగొన, వర్ణనల్ ఫణితి పేర్కొన, నర్థము లొత్తగిల్ల, బం
ధురముగఁ బ్రాణముల్ మధు మృదుత్వ రసంబునఁ గందళింప న
క్షరములు సూక్తు లార్యులకుఁ గర్ణరసాయనలీలఁ గ్రాలఁగాన్.35

అ ర్థ ము :- భావములు, సరళము+కాఁగన్ – అకృత్రిమముగా, జాను+తెనుంగునన్=స్పష్టముగాఁ దెలియు తెనుఁగున, ఇంపు-పెంపుతోన్=మాధుర్యాతిశయముతో, పిరిగొనన్=పెనఁగొనఁగా, వర్ణనల్, ఫణితి = వాక్కు, పేర్కొనన్ = ప్రసిద్ధినొందఁగా, అర్థములు, ఒత్తగిల్లన్=అంటియుండఁగా, ప్రాణముల్=కావ్యజీవములు, బంధురముగన్ = ఒప్పుగా. మధు - మృదుత్వ-రసంబునన్ = తేనెయొక్క మృదుత్వముతోడి రసముచే, కందళింపన్=అంకురింపఁగా. అక్షరములు, సూక్తులు=(సు+ఉక్తులు)=మంచిమాటలు, ఆర్యులకున్=పండితులకు, కర్ణ-రసాయన-లీలన్=వీనుల విందగు విధమున, క్రాలఁగాన్=ఒప్పఁగా. ('దివ్యసుకృతిఁ బ్రతిష్ఠింతు') నని పూర్వపద్యముతో నన్వయము.

తా త్ప ర్య ము :- భావములు సహజములుగా స్పష్టమై యందఱకుఁ దెలియు తెనుఁగునఁ బెనఁగొనఁగను. వర్ణనలు, వాక్కు ప్రసిద్ధములుగా, అర్థము లంటియుండఁగను, కావ్యజీవము లొప్పుగా మృదుమధురముగా నంకురింపఁగను, అక్షరములు, సూక్తులు పండితులకు వీనులవిందగునట్లు ఒప్పఁగను- ప్రతిష్ఠింతునని పూర్వ పద్యముతో నన్వయము.

వి శే ష ము లు :- జానుఁదెనుఁగు = స్పష్టముగాఁదెలియు తెనుఁగు. ఈ మాటను పాల్కురికి సోమనాథుఁడుకూడ వాడియుండెను. 'ఉరుతర గద్య పద్యోక్తుల కంటె, సరసమై పరఁగిన జానుఁదెనుంగు, చర్చింపఁగా సర్వసామాన్య మగుట' బస. పు. 1-81 పం. 'జానుఁదెనుఁగు విశేషము ప్రసన్నతకు' పండితా. దీక్షా. 6 పా. జానుఁదెనుఁ గన అచ్చతెనుఁగు కాదు. అందఱకు సుబోధమై యుండు తెనుఁగని యర్థము. నన్నెచోడుఁ డీ పద్యమునఁ గవిత్వ మెటు లుండవలయునో చెప్పినాఁడు.

సీ. మృదురీతి సూక్తులిం పొదవింప మేలిల్లు
భావమ్ము నెలమిఁ బ్రీత్యావహముగ
మెఱుఁగులఁ గన్నులు మిఱుమిట్లు వోవంగఁ
గాంతి సుధాసూతికాంతిఁ జెనయ
వర్ణన లెల్లచో వర్ణన కెక్కంగ
రసములు దళుకొత్తి రాలువాఱ
దేశి మార్గంబులు దేశీయములుగా న
లంకారములఁ దా నలంకరింప

ఆ. వె. నాదరించి విని సదర్థాతిశయమున
బుధులు నెమ్మనమున[1] నిధులు నిలుప
వలవదే[2] సమస్త వస్తుకవీశ్వర
నూత్న రుచిర కావ్య రత్న వీథి? 36

అర్థము ;- సమస్త .... వీథి: సమస్త = ఎల్ల, వస్తు-కవి + ఈశ్వర = వస్తువు ప్రధానముగా నుండునట్లు రచించు కవిశ్రేష్ఠులయొక్క, నూత్న = క్రొత్తవియు,. రుచిర = మనోహరములు, (అగు), కావ్య-రత్న=రత్నములవంటి కావ్యములయొక్క, వీథి = వరుస _ బంగారు, వెండి, నవరత్నములు మొదలయిన యెల్ల వస్తువులతో, రచితమైన, రుచిరకావ్య మనెడి రత్నాల బజారు,

సూక్తులు = మంచిమాటలు, మృదు-రీతిన్ = మృదువుగా, ఇంపు = ఆహ్లాదము, ఒదవింపన్ = కలిగింపఁగను, మేలిల్లు = శ్రేష్ఠముగు, భావమ్మున్= భావముకూడ, ఏలమిన్ = వికాసముతో, ప్రీతి + ఆవహముగన్ = ఆనందమును గలిగించునట్లుగను,

కాంతి = 'కాంతి' యను గుణము, మెఱుఁగులన్ = మెఱుపులతో, కన్నులు, మిఱుమిట్లు + పోవంగన్ = చీఁకట్లు క్రమ్మకొనఁగా, సుధా-సూతి = చంద్రుని యొక్క, కాంతిన్ = వెలుఁగును, చెనయన్ =పోలఁగను,

1. ఱ, 2. ముద్రితప్రతి. రచింప వరకవీశ్వరునకు.

వర్ణనలు, ఎల్లచోన్ = అన్ని యెడలను, వర్ణనకున్ + ఎక్కంగన్ = పొగడ్త కెక్కఁగను, రసములు = శృంగారాదులు, తళుకొత్తి (తళుకు+ఒత్తి)= మిక్కిలి యొప్పి, రాలు వాఱన్ = ప్రవహింపఁగను,

దేశి-మార్గంబులు = దేశి, మార్గ అను కవితా రీతులు, దేశీయములు + కాన్= దేశ్యములు గాఁగను, అలంకారములన్ = ఉపమాదులతో, తాను, అలంకరింపన్ = అందగింపఁగను,

బుధులు = పండితులు, ఆదరించి = మన్నించి, విని, సత్ + అర్థ + అతిశయమునన్ = మంచి యర్థములపెంపుచే, నెమ్మనమునన్ (నెఱ +మనము) = నిండు మనస్సునందు, నిధులు-నిలుపన్ = పదిలపఱుపఁగా, వలవదే = వలదా ?

తాత్పర్యము :- ఎల్ల వస్తుకవిశ్రేష్ఠుల నూతనములు, మనోహరములునైన కావ్యశ్రేష్ఠముల పంక్తి-సూక్తులు మృదువుగా నాహ్లాదము గలిగింపను, మేలైన భావములు ప్రీతి గలిగింపఁగను, కాంత్యాదిగుణములు తమ కాంతులతోఁ గన్నులు మిఱుమిట్లు గ్రమ్మ వెన్నెల వెలుఁగును బోలఁగను, వర్ణనలు అన్నియెడలను ప్రసిద్ధి నొందఁగను, శృంగారాది రసములు మిక్కిలి యొప్పి ప్రవహింపఁగను, దేశి మార్గ కవితారీతులు దేశీయములై ఉపమాద్యలంకారములతో నలంకరింపఁగను, పండితుఁ లాదరించి విని మంచి అర్థముల పెంపునఁ దమ మనస్సులందుఁ బదిలపఱుచుకొనఁ గను వలదా ? వలయు ననుట.

ఈ పద్యమునఁ గావ్యము రత్నవీథిగా రూపింపఁబడినది. ఆ బజారులో వస్తువులఁ జూడఁ గొనఁ గోరువారికి అక్కడి సూక్తులు ఇంపొదవింపవలయును. వానిని జూపువారు మృదువుగా మర్యాదౌచితితో మాటలాడవలయును. కావ్యభాషకూడ మృదు మధురముగా నుండవలెను. భాషయేకాక భావముగూడ ప్రీతిని గొలుపు నదిగా నుండవలయును. ఆ యా రత్నాదుల మెఱుఁగుపెట్టుటలు పూఁతమెఱుఁగులు గాక నిజముగా వస్తువులందుఁ జేర్పఁదగినవై కన్నులకు మిఱుమిట్లు గొల్పునవిగా నుండవలయును. కావ్యపు మెఱుఁగులు గూడ అర్థమయినవై యోచించి చూచుచోఁ గన్నులకు మిఱుమిట్లు గొల్పవలయును. రత్నాదుల కాంతి చంద్రకాంతిని మించు చున్నట్లుండవలయును. కావ్యమునఁ గాంతి యను కావ్యప్రాణము చల్లఁగా, హాయిగా వెన్నెల వలె నుండవలెను. వణిజులు చేయు రత్నాభరణాదివర్ణనలు మెప్పఁదగినవై

యుండవలయును, కావ్యమందలి అష్టాదశవర్ణనలు ప్రశస్తముగా నుండవలయును, ఆ యా వస్తువిశేషము లుంచు ప్రదేశములకు మార్గములు అందమయినవిగా నుండ వలయును. కావ్యమున దేశి రచన మార్గరచన హృద్యములు కావలయును, ధ్వన్యలంకారములు - కావ్యాలంకారములు అలంకరింపవలయును.'

విశేషములు :- మిఱుమిట్లు- మిట్లు + మిట్లు. 'అందదుకు ప్రభృతులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు'. బాల. సంధి. 42. నెమ్మనము = నెఱ + మనము, 'అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచోఁ గానంబడియెడి' బాల-సంధి. 39.

చ. పరగు[1] సువర్ణ బంధ మృదుభావము గల్గియు లోను జూడఁగాఁ
బొరపగుఁ[2] జిత్రరూపమును బోలె నసత్కవి కావ్య మిమ్మహిన్
బరగు సువర్ణబంధ మృదుభావ విశేషము లోన[3] వెల్పటన్
సరియగు రత్నపుత్రికయు సత్కవి కావ్యము నొక్కరూపమై. 37

అర్థము :- ఇమ్మహిన్ - ఈ + మహిన్ = ఈ భూమి యందు, అసత్ + కవి - కావ్యము = కుకవియొక్క కావ్యము, పరగు = ఒప్పునట్టి, సువర్ణ - బంధ - మృదు - భావము = తగిన యక్షరముల కూర్పువలని మృదుత్వము - మంచిరంగుల కూర్పు తోడి మృదుత్వము, కల్గియున్ = కలిగినప్పటికిని, లోను + చూడఁగాన్ = లోపలఁజూడఁగా, చిత్ర - రూపమును + బోలెన్ = చిత్తరువు నందలి ఆకృతి వలె, బొరపు + అగున్ = విపరీతముగా నుండును, సువర్ణ - బంధ- మృదు-భావ విశేషము = అక్షరముల సముచితమైన కూర్పువలని మార్దవాతిశయము, - బంగరు కూర్పువలని మార్దవాతిశయము, లోనన్ = లోపలను, వెల్పటన్ = బయటను, సరి = సమానము, అగు, = అగునట్టి, రత్న-పుత్రికయున్ = రతనాల బొమ్మయును, సత్ + కవి - కావ్యమున్=సుకవియొక్క కావ్యమును, ఒక్క - రూప + ఐ = ఒక్క విధముగనే యుండి, పరగున్ = ఒప్పును.

---

1. వా. పా. పరఁగ, 2. వా. పా. బొరపగు చిత్రరూపమును బోలె. 3. లొప్పు దెల్పులన్,

తాత్పర్యము :- కుకవి కావ్యము పైకి మంచి యక్షరముల కూర్పువలని మార్దవము గలిగియున్నట్లు కనుపట్టియుఁ, బైకి మంచి రంగుల కూర్పువలని మృదుత్వము గలిగియు లోన వేఱుగా నుండు చిత్తరువునందలి ఆకృతి వలె, విపరీతముగా నుండును. అక్షరముల సముచితమైన కూర్పువలని మార్దవాతిశయము - బంగారు కూర్పువలని మృదుత్వాతిశయము లోపలను వెలుపలను సమానముగా నుండు రతనాల బొమ్మయు, సుకవి కావ్యము నొక్కవిధముగనే యుండి యొప్పును.

విశేషములు :- అసత్కవి కావ్యము చిత్రరూపముతోను, సత్కవి కావ్యము రత్నపుత్రికతోను బోల్పఁబడినవి కావున నలంకారము ఉపమ. అది 'సువర్ణ బంధ .... విశేషము' నందలి వర్ణ శబ్దమునకుఁగల యర్థద్వయముచే నగు- శ్లేషాలంకారముతోఁ గూడియున్నది. 'పరగు'ను సానుస్వారముగా శ. ర. గ్రహించెను. కాని నిర్ధారక ప్రయోగములు లేవు.

ఉ. అక్కజమై మహార్థ నివహంబు సదుక్తులు మెచ్చఁజూచినన్
గ్రుక్కిదమైన సత్కృతి యగుర్వగుఁ గా కిలఁ జీకు లావుకం
ద్రొక్కినయట్లు నోటికొలఁదుల్ పురికొల్పఁగ నందులోన నొ
క్కొక్కఁడు సక్కనైనఁ గృతియుం గృతి యందురె? వాని మెత్తురే? 38

అర్థము :- అక్కజము+ఐ=ఆశ్చర్యకరమయి, మహత్ (మహా)+అర్థ-నివహంబు=గొప్ప విషయముల యొక్క సమూహము, సత్+ఉక్తులు = మంచి మాటలు, మెచ్చన్+చూచినన్ = ప్రశంసనీయముగా, క్రుక్కిదము+ఐన=నిండినది యగు, సత్+కృతి = మంచికావ్యము, ఇలన్=భూమియందు, అగుర్వు+అగున్+గాక = శ్రేష్ఠమయినది యగును గాని, చీకు = గ్రుడ్డివాఁడు, లావుకన్=పూరేడు పిట్టను, త్రొక్కిన + అట్లు = అదిమిన విధముగా, నోటి-కొలఁదుల్ = నోటికి వచ్చినన్ని, పురికొల్పఁగన్ = ప్రేరేపింపఁగా, అందులోనన్ = ఆ మాటలలో, ఒక్క+ఒక్కఁడు=ఒక్కటొక్కటి, చక్కన + ఐనన్ = బాగుగా నున్నను, కృతియున్=అట్టి కావ్యమును, కృతి+అందురె = కావ్య మందురా ? అన రనుట, వానిన్ = ఆ కృతికర్తను, మెత్తురే = ప్రశంసింతురా ? ప్రశంసింప రనుట.

తాత్పర్యము :- ఆశ్చర్యకరమగు విధమున గొప్ప విషయముల సమూహమును, సూక్తులను ప్రశంసనీయముగా నిండియున్న సత్కావ్యము శ్రేష్ఠమగును

గాని గ్రుడ్డివాఁడు పూరేడుపిట్ట నదిమినట్లు నోటికి వచ్చిన విధమున సహజముగాఁ గూయుటప్పుళ్లలో నొక్కటొక్కటి బాగుగా నున్నను ఆ కృతిని కృతి యందురా? ఆ కృతి కర్తను మెత్తురా? మెచ్చ రనుట.

విశేషములు :- అగుర్వు=అధికము, శ్రేష్ఠము. ఇందే "పుష్పవృష్టి పైఁ, గురిసెఁ బురారిసూతికి నగుర్వుగ" కు. సం. 12-193. 'అగుప్పఁగ' అను పాఠముకంటె నిది మేలు. చీకు లావుకం ద్రొక్కినయట్లు - అలంకార ముపమ. ఒక్కొక్కఁడు నక్కనైనన్-ఒక్కొక్కఁడు + చక్కనైనన్ - గసడదవాదేశము. ఆ కూఁతలలో నొక్కొక్కటి ప్రత్యేకముగా బాగుగా నున్నను, సమంపటః బాగుగా నుండకున్నచో నా కృతి కృతి యనిపించుకొన దనుట. లావుక (ము)- 'లావు కన లావక మొప్పును -' ఆం. భా. 2. 97. లావకము - పూరేడుపిట్ట. లావుక (వికృతి) లావకము (ప్రకృతి). లావుక పిట్ట. అందును గ్రుడ్డివాఁడు దానిని ద్రొక్కినచో నది నోటికి వచ్చినట్లు కూయును. అట్టి కూఁతలు గల కృతి యనుట.

క. చతురోక్తుల నుతపద బహు
గతుల నలంకార భావ కాంతిరసార్థో
న్నతిఁ గృతి నతిరసికులు వర
సతిగతి నెఱిఁగింపవలదె సౌభాగ్యమునన్? 39

అర్థము :- అతి-రసికులు = మిక్కిలి సరసులైనవారు-కవులు, కృతిన్ = కావ్యమును, చతుర + ఉక్తులన్ = నేర్పుతోడి మాటలతోను, నుత - పద-బహు - గతులన్ = పొగడఁబడిన మాటలయొక్క పెక్కురీతులతోను - పొగడఁబడిన అడుగులయొక్క పెక్కురీతులైన గమనములతోను, అలంకార - భావ - కాంతి - రస + అర్థ + ఉన్నతిన్ = ఉపమాద్యలంకారములు, రత్యాది స్థాయిభావములు, కాంత్యాది గుణములు, శృంగారాది రసములు, అర్థములు అనువాని యౌన్నత్యము తోను, - భూషణములు, ప్రేమము, కాంతి, రసములు, అర్థములు అనువాని పెంపు తోను, వర - సతి - గతిన్ = ఉత్తమురాలయిన పతివ్రత విధమున, సౌభాగ్యము నన్=సుభగత్వముతో - మాంగల్యముతో, ఎఱిఁగింపన్ + వలదె = చెప్ప వలదా?

తాత్పర్యము :- మిక్కిలి సరసులైన కవులు నేర్పుతోడి మాటలతోను, పొగడఁబడు నడుగుల్ల పెక్కు నడలతోను, భూషణములు, అనురాగము, కాంతి.

రసము, అర్థము అనువాని యొక్క రీతులను గూడి సౌభాగ్యవతియగు నుత్తమ పతివ్రతను వలెఁ, నిరుపమమైన మాటలతోను, పదముల వివిధ గతులతోను, ఉపమాద్యలంకారములు, రత్యాది స్థాయిభావములు, శాంత్యాది గుణములు, శృంగారాది రసములు, అర్థములు సముచిత పెంపుతోను గూడి సుభగమై యుండునట్లు కావ్యమును జెప్పవలదా? చెప్పవలయు ననుట,

విశేషములు :- కృతిని పరసతిగతి నెఱిఁగింపవలదె యని కృతిని పరసతితోఁ బోల్చుటవలన నలంకారము ఉపమ. అది శ్లేషానుప్రాణితము. చతుర + ఉక్తులు = చతురోక్తులు-గుణసంధి. పద-కృత్యర్థమున శబ్దము లనియు, సత్యర్థమున నడుగు లనియు నర్థద్వయము - శ్లేషము. సౌభాగ్యము - సుభగస్య భావః.

మ. పదబంధంబుల నగ్గలించి, బుధశబ్దభ్రాజియై, సద్గుణా
స్పదమై, దుష్కవి హృత్సరోజ వనముల్ భంజించుచున్, భూరి స
మ్మద లీలన్ విలసిల్లి సత్కృతి జగన్మాన్యప్రభావంబునన్
మదనాగంబును బోలెఁ గ్రాలవలదా మా ఱెందు లే కున్నతిన్? 40

అర్థము :- సత్ + కృతి = సత్కావ్యము, పద-బంధంబులన్ = (కృతిపక్షమున) శబ్దముల కూర్పులతో (మదగజపక్షమున) అడుగుల కట్టులతో, అగ్గలించి = అతిశయించి, బుధ-శబ్ద-భ్రాజి + ఐ = (కృ.ప.) పండితుల శబ్దములతోఁ బ్రకాశించునది యయి - (గ.ప.) గొప్ప ఘీంకృతి ధ్వనితోఁ బ్రకాశించునదియయి, సత్ + గుణ + ఆస్పదము + ఐ = (కృ. ప.) మాధుర్యాదులైన యుత్తమ (కావ్య) గుణములకుఁ జోటయి, (గ.ప.) మంచి త్రాళ్ళకు స్థానమయినదయి, దుష్కవి-హృత్ + సరోజ-వనముల్ = (కృ. ప.) కుకవుల యొక్క, హృదయములనెడి తామరతోఁపులు భంజించుచున్ = నాశనము చేయుచు, భూరి - సమ్మద-లీలన్ = (కృ. ప.) అధికమైన సంతోషము యొక్క విలాసముతో, (గ. ప.) అధికమైన మదము యొక్క విలాసముతో, విలసిల్లి = ప్రకాశించి, జగత్ + మాన్య-ప్రభావంబునన్ = లోకముచే గౌరవింపఁదగిన మహిమతో, మద-నాగంబును + పోలెన్ = మదగజమువలె, మాఱు + ఎందున్ - లేక = ప్రతి యెచ్చటను లేక, ఉన్నతిన్ = గొప్పతనముతో, క్రాలన్ + వలదా = ఒప్పవలదా?

తాత్పర్యము :- సత్కావ్యము మదగజమువలె - శబ్దముల కూర్పులతో నతిశయించి- అడుగుల బంధనములతో నతిశయించి, పండితుల శబ్దములచేఁ బ్రకాశించి-గొప్పఘీంకృతులచేఁ బ్రకాశించి, మాధుర్యాద్యుత్తమ కావ్యగుణములకు స్థానమయి - మంచి త్రాళ్ళకుఁ జోటయి, సుకవుల హృదయము లనెడి పద్మములను భగ్నము చేయుచు, మిక్కిలి సంతోషముతో - అధిక మదముతో, విలసిల్లి, లోకమువే గౌరవింపఁదగిన ప్రభావముతో, నెందును బ్రతిలేక యౌన్నత్యముతో నొప్పవలదా? ఒప్పవలయు ననుట.

విశేషములు :- శ్లేషానుప్రాణితమైన ఉపమ. హృత్సరోజ = హృదయము లనెడి సరోజములు-రూపకము.

సత్+గుణ-హాళ్ళు (మృదుహల్లు) పరమగు చుండఁగా ఝల్లునకుఁ దృతీయ వర్ణాదేశము.సద్గుణ. హృద్ + సరోజ = హృత్సరోజ- ఖర్రులు (కఠినహల్లులు) పరమగుచుండఁగా ఝల్లులకు చర్రులు (వర్గప్రథమాక్షరములు) ఆదేశమగును జగత్ + మాన్య-రహాలుతప్ప మిగిలిన పదాంతగత హల్లులకు (యర్రులకు) అనునాసికము పరమగుచో వానికి సంబంధించిన అనునాసిక వర్ణము వైకల్పికముగా నాదేశమగును. జగన్మాన్య, జగద్మాన్య.

క. ముదమునఁ గవికృత కావ్యము
నదరున విలుకాని పట్టినమ్మును బర హృ
ద్భిదమై తల యూఁపును, బెఱ
యది కావ్యమె చెప్పఁ? బట్ట నదియున్ శరమే। 41

అర్థము :- ముదమునన్ = సంతోషముతో, కవి - కృత - కావ్యమున్ = కవి రచించిన కావ్యమును, అదరునన్ = భయముతో, విలుకాని - పట్టిన + అమ్మును = విలుకాఁడు పట్టిన బాణమును, పర - హృద్ + భిదము + ఐ = ఇతరుని హృదయమును భేదించునదియై, శత్రువు హృదయమును భేదించునదియై, తల + ఊఁపును = (సంతోషముతో) శిరః కంపనమును జేయించును. పెఱ+అది= అటు లూఁపింపనిది, చెప్పన్ = చెప్పుటకు, కావ్యము +ఎ = కావ్యమా ? పట్టన్ = పట్టుటకు, అదియున్ = తాల్చినట్టిదియును, శరము + ఏ = బాణమా ?

తాత్పర్యము :- సుకవి కావ్యము సంతోషమును గూర్చియు, విలుఁకాడు పట్టిన శరము భయము గొలిపియు, సతత హృదయమును - శత్రువు హృదయము

ఖేదించును. అట్లు శిరఃకంపము చేయింపనిచో నా కావ్యము కావ్యమా? ఆతఁడు పట్టిన బాణము బాణమా? అని భావము.

విశేషము లు:- సత్కవి కావ్యము మదమునను, విలుకాని పట్టినమ్ము అదరు నను పరహృద్భిదకై తలయూఁపింపనిచో- ఇందు వర్ణ్యమగు కావ్యమునకును, అవర్ణ్యమగు అమ్మునకును తలయూఁపించుట యను నేకధర్మాన్వయము చెప్పఁబడినది గనుక నలంకారము దీపకము. 'వదన్తి వర్ణ్యావర్ణ్యానాం ధర్మైక్యం దీపకం బుధాః. చన్ద్రా.

విలుకాని పట్టినమ్ము. విలుకాఁడు పట్టినమ్ము 'ధాతుజ విశేషణ భావార్థక పూర్వ వ్యవహితావ్యవహిత కర్తృ పదప్రథమకుఁ దఱచుగ యొక్కషష్ఠి యగు.' ప్రౌఢ. కారక. 15. విలుకానియొక్క పట్టినయమ్ము.' యొక్కకు లోపంబు బహుళంబు.' ప్రౌఢ. కారక. 16. విలుకాని పట్టినమ్ము, పట్టిన + అమ్ము = పట్టినమ్ము. 'అత్తునకు సంధి బహుళముగా నగు.' బాల, సంధి, 4. పట్టిన + అది = పట్టినది - అత్వసంధి. కావ్యము కావ్యమే? శరము శరమే? యని పౌనరుక్త్య మున్నను, కావ్యము శ్రేష్ఠమైన కావ్యము, శరము శ్రేష్ఠమైన శరము కాదని తాత్పర్యభేద ముండు టచే నలంకారము లాటానుప్రాసము. 'శబ్దార్థయోః పౌనరుక్త్యం యత్ర తాత్పర్య భేదవత్, స కావ్యే తాత్పర్యవిదాం లాటానుప్రాస ఇష్యతే,

ఈ పద్యమునకు మూల మనఁదగు సంస్కృతశ్లోక మొండు గలదు.
'కిం కవే స్తేన కావ్యేన కిం కాణ్డేన ధనుష్మతః।
పరస్య హృదయే లగ్నం న ఘూర్ణయతి యచ్ఛిరః॥'

క. ఓలిన కడచన నఱువది
నాలుగు విద్యలను నేర్పు నైసర్గికమై
వాలిన సుకవులకుం గా
కేల తరమె కృతులు చెప్ప నెవ్వరికైనన్? 42

అర్థము:- ఓలిన్+అ = బాగుగా, కడచనన్ = సమగ్రముగా, అఱువది-నాలుగు - విద్యలను = అఱువది నాలుగు కళలందును, నేర్పు, నైసర్గికము + ఐ = స్వాభావికముగా, వాలిన = అతిశయించిన, సుకవులకున్ + కాక = సుకవులకుఁగాక, ఎవ్వరికిన్ + ఐనన్ = మఱియెవ్వరికైనను, కృతులు-చెప్పన్ = కావ్యములు రచించుటకు, ఏల-తరము + ఎ = ఎందులకు సాధ్యపడును?

తాత్పర్యము:- చతుష్షష్టి కళలందును నేర్పు బాగుగా స్వాభావికమై యతిశయించిన సుకవులకే గాని యట్టి నైపుణ్యములేని యితరుల కెవ్వరికిని గావ్యములు రచింప సాధ్యపడదు.

వ. ఆది యెట్లనిన. 43

తాత్పర్యము ; అది యే విధముగా ననిన - పయి పద్యముతో నన్వయము.

క. వన జలకేళీ రవి శశి
తనయోదయ మంత్ర[1] గతి రత క్షితిప రణాం
బునిధి మధు ఋతు పురోద్వా
హ నగ విరహ దూత్యవర్ణ నాష్టాదశమున్. 44

అర్థము ;- వన-జల-కేళీ=ఉద్యానవనక్రీడ, జలక్రీడ, రవి=సూర్యుడు, శశి=చంద్రుడు, తనయ+ఉదయ=పుత్రజననము, మంత్ర=ఆలోచనము, గతి=యాత్ర, రత=సంభోగము, క్షితిప=రాజు, రణ=యుద్ధము, అంబునిధి=సముద్రము, మధు=మధుపానము, ఋతు=ఋతువులు, పుర= పురము, ఉద్వాహ=వివాహము, నగ=కొండ, విరహ=ఎడబాటు, దూత్య = దౌత్యము-రాయబారము, అనువాని, వర్ణన+అష్టాదశమున్=వర్ణనల పదునెనిమిదింటిని.

తాత్పర్యము :- 1. వనక్రీడ, 2. జలక్రీడ, 3. సూర్యుడు 5. పుత్రోత్పత్తి, 6. మంత్రము (రాజకీయమైన ఆలోచన), 7. గతి (యాత్ర), 8. రతిక్రీడ, 9. ప్రభువు, 10. యుద్ధము, 11. సముద్రము, 12. మద్యపానము, 13. ఋతువులు, 14. పురము, 15. వివాహము, 16. పర్వతము, 17. ఎడబాటు, 18. దౌత్యము, (రాయబారము) అను పదునెనిమిది వర్ణనలును. తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : ఈ వర్ణనల సంఖ్యలో మతభేదములు గలవు. అప్పకవి పదునెనిమిది కాక ఇరువదిరెండు వర్ణనలు కావ్యమున నుండవలయునని చెప్పినాడు.

వ. పరిపూర్ణంబై దశప్రాణంబుల సప్రాణంబై నవరస భావ భరితంబై షట్త్రింశదలంకారాలంకృతంబై రమణీయంబైన దివ్య కథారంభంబున కభిముఖుండనై 45

---

1. మూ. ప్ర. కరి.

అర్థము :- (అష్టావశ వర్ణనలతో) నిండినదయి, దశ-ప్రాణంబులన్ = పది గుణములతో, సప్రాణంబు + ఐ = ప్రాణవంతమై- సజీవమయి, నవ-రస-భావ-భరితంబు + ఐ = తొమ్మిది రసములతోను, భావములతోను, నిండినదయి, షట్-త్రింశత్ + అలంకార + అలంకృతంబు + ఐ = ముప్పది యాఱు అలంకారములతో అలంకరింపఁబడినదయి, రమణీయంబు + ఐన = మనోహరమైన, దివ్య-కథా + ఆరంభంబునకున్ = దేవ సంబంధమైన, కథయొక్క ప్రారంభమునకు, అభిముఖుఁడను + ఐ = ఉన్ముఖుఁడ నయి.

తాత్పర్యము :- పదునెనిమిది వర్ణనలతో నిండినదయి, పది కావ్య గుణములతో సజీవమయి, తొమ్మిది రసములతోను భావములతోను నిండినదయి, ముప్పది యాఱు అలంకారములచే నలంకరింపఁబడిన దయి మనోహరమైన దివ్య కథను ప్రారంభించుట కున్ముఖుఁడ నయి- పయి పద్యముతో నన్వయము.

విశేషములు :- దశ-ప్రాణములు దశగుణములు-శ్లేష, ప్రసాదము, సమత మాధుర్యము, సుకుమారత, అర్థవ్యక్తి, ఔదార్యము, ఓజస్సు, కాంతి, సమాధి. షట్త్రింశదలంకారములు-దండి కావ్యాదర్శము ననుసరించినది. నవరసములు-శృంగారము, హాస్యము, కరుణము, రౌద్రము, వీరము, భయానకము, బీభత్సము, అద్భుతము, శాంతము- ఇది భట్టోద్భటుని మతము; భరతుని మతమున రసము లెనిమిది. వానిలో 'శాంతము' లేదు.

ఉ. పూని మహాగ్రహార [1]వరపుత్త్ర సమున్నతి దేవతాల యో
ద్యాన తటాక సత్కృతి నిధానము లాశశితారకంబు సు
స్థానములై మహిం బరగు జంగమ మల్లయ పేర సప్తసం
తానము లొప్ప [2]నిల్పుదు ముదంబునఁ దత్ప్రభునాజ్ఞ పెంపునన్. 46

అర్థము :- మహత్ (మహా) + అగ్రహార = గొప్ప అగ్రహారము, వర-పుత్త్ర-సమున్నతి = శ్రేష్ఠుఁడైన పుత్త్రునియొక్క ఔన్నత్యము, దేవతా + ఆలయము = దేవాలయము, ఉద్యాన = విహారార్థమైన తోఁట, తటాక = చెఱువు, సత్ + కృతి = సత్కా-

---

1. పుర.

వ్యము, నిధానములు = నిధి యను నేడును, ఆ-శశి-తారకంబున్ = చంద్రుఁడు, నక్షత్రములు నుండునంత వఱకును, పూని = బాగుగా, సుస్థానములు + ఐ = మంచి స్థానములు గలవయి, మహిన్ = భూమియందు, పరగున్ = ఒప్పును, (నేడు), జంగమ మల్లయ-పేరన్ = జంగమమల్లికార్జునుని పేర, తద్ + ప్రభు + ఆజ్ఞ-పెంపునన్ = ఆ స్వామి యాన యొక్క గొప్పతనముచేత, సప్త-సంతానములు = ఏడు సంతతులు, ఒప్పన్ = ఒప్పునట్లు, ముదంబునన్ = సంతోషముతో, నిల్పుదున్.

తాత్పర్యము :- అగ్రహారము, పుత్త్రుఁడు, దేవాలయము, ఉద్యానవనము, సరస్సు, సత్కావ్యము, నిధి యనునవి యేడును చంద్రుఁడు, నక్షత్రములు ఉండు నంతవరకును భూమియందు సుస్థిరములై యుండును. అట్టి సప్త సంతానములను జంగమమల్లికార్జునుని పేర నా స్వామి యాన చొప్పున సంతోషముతో నిలుపుదును.

విశేషములు:- సప్తసంతానములు-క. తనయుఁడు చెఱువును గావ్యంబు నిధానము గుడి వనంబు భూదేవస్థాపనమును నను నియ్యేడును, జను శాస్త్రము, లందు సప్త సంతతు లనఁగన్" అప్ప. ఆ శశి తారకంబు-మర్యాదాభివిధులందుఁ బదాదియందు "ఆఙ్" వచ్చును. మర్యాదా = అవధి. ఇచట మర్యాదయందు 'ఆఙ్' వచ్చెను, అవ్యయీభావ సమాసము, శశితారకలు ఉండునంతవఱకును, తద్ + ప్రభు- అనునాసికాంతస్థభిన్నములైన హల్లులకు (ఝల్లులకు) కఠిన హల్లులు (ఖర్లు) పరము లగు నపుడు వాని వర్గములందలి ప్రథమ వర్ణములు (చర్లు) ఆదేశము లగును-తత్ప్రభు. ప్రభు + ఆజ్ఞ. షష్ఠీసమాసమునందు కార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' ప్రభు నాజ్ఞ. బాల, సం. 34. ఆజ్ఞ (ప్రకృతి)- ఆన (వికృతి).

వ. అందు నుత్కృష్ట సంతానంబు కృతియ కా నిశ్చయించి. 47

అర్థము :- అందున్ = ఆ సప్త సంతానములలో, ఉత్కృష్ట-సంతానంబు = ప్రశస్తమైన సంతతి, కృతి + అ = కావ్యమే, కాన్ = అగునట్లు, నిశ్చయించి = నిర్ణయించి.

తాత్పర్యము :- ఆ సప్త సంతానములలోఁ బ్రశస్తమైన సంతానము కావ్యమే యని నిర్ణయించి - మఱి పద్యముతో నన్వయము.

విశేషములు :- 'గీ. సప్త సంతానములలోఁ బ్రశస్తిఁగాంచి, ఖిలము గాకుండు నది ధాత్రిఁ గృతియ కాన.' మను, 1. 14.

ఉ. జంగమ మల్లికార్జును నిసర్గ కవిస్తవనీయ సూక్తి యు
క్తిం గొనియాడి తత్కరుణఁ[1] గేనములేక నురక్తయైన భా
షాంగనఁ దక్కనేలిన మహత్త్వము లోకమునం బ్రసిద్ధిగా
భంగిగ విస్తరించెదఁ బ్రబంధము సద్రసబంధురంబుగాన్. 48

అర్థము :- జంగమ మల్లికార్జునున్, నిసర్గ .... యుక్తిన్ : నిసర్గ = సహజులైన, కవి = కవులచే, స్తవనీయ = స్తుతింపఁదగిన, సు + ఉక్తి = మంచి మాటల యొక్క, యుక్తిన్ = కూడికతో, కొనియాడి = ప్రశంసించి, తద్ + కరుణన్ = ఆతని దయచేత, కేనము - లేక = కొఱఁత లేక, అనురక్త + ఐన = అనురాగము గలది యగు, భాషా + అంగనన్ = వాగ్దేవిని (సరస్వతిని), తక్కన్ + ఏలిన = మిక్కిలి పరిగ్రహించిన, మహత్త్వము = గొప్ప తనము, లోకమునన్ = లోకమునందు, ప్రసిద్ధి + కాన్ = ప్రసిద్ధముగా, భంగిగన్ = ఒప్పుగా, సత్ + రస - బంధురంబు + కాన్ = మంచి రసములచే నొప్పినదిగా, ప్రబంధమున్ = కావ్యమును, విస్తరించెదన్ = సవిశేషముగాఁ జెప్పెదను.

తాత్పర్యము :- జంగమ మల్లికార్జునుని సహజ కవులు గొనియాడు సూక్తులచేఁ బ్రశంసించి, ఆతని దయచేత, ఉత్తమ కవితయందుఁ గొఱఁతలేక అనురాగము గలిగియుండు వాగ్దేవిని మిక్కిలి వశపఱుచుకొనిన గొప్ప తనము లోకమునఁ బ్రసిద్ధముగా, సద్రసములతో నొప్పునట్లు ప్రబంధమును జక్కఁగా విశేషించి చెప్పెదను.

విశేషములు :- కేనము = కొఱఁత. ఇందే ఉ .... గా,ంగేయుఁడుఁ దారకాసురుఁడుఁ గేనములేక సని సేసి రీసునన్.' కు. సం. 12. 145. కేనము - కేణ (కన్నడము)

---

1. సా. తత్కరుణ.

సీ. శరధి నీరులు పయోధరములు కొనివచ్చి
కురిసి వారిధియందుఁ గూర్చినట్లు,
చేనఁ బండిన విత్తు చేనికే ఫలకాంక్షఁ
బేర్మిఁ గ్రమ్మఱ వెదవెట్టునట్లు,
రోహణాచలపతి కూహించి వరరత్న
సంచయంబున విభూషించు నట్లు,
తీర్థాళి కర్థిఁ దత్తీర్థోదకంబుల
నెసకంబుగా నర్ఘ్య మిచ్చినట్లు,

ఆ. నింగి ముట్టియున్న జంగమ మల్లయ
వరమునందుఁ గనిన వస్తుకవితఁ
దగిలి వారియంద నెగడింతు రవికి దీ
పమున నర్చ లిచ్చు పగిది వోలె. 49

అర్థము :- శరధి-నీరులు = సముద్రజలములు, పయోధరములు = మేఘములు, కొనివచ్చి = తీసికొని, కురిసి = వర్షించి, వారిధియందున్ = సముద్రమునందు, కూర్చిన + అట్లు + అ = కలిపిన విధముగనే,

చేనన్ = చేనియందు, పండిన, విత్తు = ధాన్యము, ఫల-కాంక్షన్ = పంటయందలి కోరికతో, పేర్మిన్ = ఆసక్తితో, క్రమ్మఱన్ = మరల, వెద + పెట్టు + అట్లు + అ = విత్తునట్లే.

రోహణ + అచల-పతికిన్ = రోహణమను పర్వత రాజమునకు, ఊహించి = ఆలోచించి, వర-రత్న-సంచయంబునన్ = శ్రేష్ఠములైన మణుల సమూహముతో, విభూషించు + అట్లు + అ = అలంకరించు విధముననే,

తీర్థ + ఆళికిన్ = పుణ్యప్రదములైన రేవుల వరుసకు, అర్థిన్ = కోరికతో, తత్ + తీర్థ + ఉదకంబులన్ = ఆ రేవులందలి జలములను, ఎసకంబుగాన్ = అధికముగా, అర్ఘ్యము + ఇచ్చిన + అట్లు + అ = పూజార్థమిచ్చినట్లుగనే,

7

నింగి-ముట్టి + ఉన్న = ఆకాశమునంటు - ఉన్నతమగు, జంగమ మల్లయ్య = జంగమ మల్లికార్జునునియొక్క, పరము + నందున్ = పర ప్రభావముచేత, కనిన = పొందిన, వస్తు-కవితన్ = వస్తుప్రధానమైన కవిత్వమును, రవికిన్ = సూర్యునకు, దీపమునన్ = దీపముతో, అర్చలు + ఇచ్చు-పగిది + పోలెన్ = పూజలొసఁగు విధమున, తగిలి = ఆసక్తితో, వారి + అందున్ + అ = ఆ జంగమ మల్లికార్జునులయందే, నెగడింతున్ = ప్రవర్తిల్లఁజేయుదును.

తాత్పర్యము :- సముద్రోదకములను మేఘములు తీసికొని మరల వర్షించి సముద్రమునందే కలిపినట్లును, చేనిలోఁ బండిన గింజలను ఫలకాంక్షతో మరలఁ జేనియందే విత్తినట్లును, రోహణాద్రిరాజమునకు శ్రేష్ఠములయిన రత్నముల సమూహముల నలంకారము చేసినట్లును, పుణ్యతీర్థములకు ఆ పుణ్యతీర్థములందలి జలములతోనే అర్ఘ్యమిచ్చినట్లును, ఉన్నతమగు జంగమ మల్లికార్జునుని వరప్రభావమునఁ గనిన వస్తుకవిత్వమును, సూర్యునకు దీపముతోఁ బూజలిచ్చునట్లు, ఆసక్తితో నా జంగమ మల్లికార్జునులవారికే అర్పింతును.

విశేషములు :- జంగమ మల్లికార్జునుల వరప్రభావమునఁ దాను గనిన వస్తుకవిత్వమును మరల వారికే అర్పించుటకు వివిధోపమానములు చెప్పఁబడినవి కావున నలంకారము మాలోపమ. రవికిన్ = సూర్యునకు - వేవెలుఁగునకు ఒక్క చిఱు దివ్వెతో నర్ఘ్యమిచ్చునట్లు మహాప్రభావ సంపన్నుఁడగు జంగమ మల్లికార్జునుల వరము వలనఁ గనిన వస్తుకవిత్వమును వారికే సమర్పింతు ననుట, రోహణాచలము - సింహళమునందలి యొక పర్వతము, ఇది వివిధ రత్నములకు నిలయము. పగిది, పోలె రెండును సమానార్థకములే, ఇట్లు ఒక ఉపమావాచకముపై నింకొక దానిని బ్రయోగించుట యార్షప్రయోగ లక్షణము,

చ, గురువున, కిష్టదైవమునకుం, బతికిం గృతి చెప్పి పుణ్యమున్,
వరమును, దేజముం బడయవచ్చు జగంబుల; నిశ్చయంబు; మ
ద్గురువును. నిష్టదైవమును, గూర్చు నిజేశుఁడుఁ దాన; నాకుఁ గా
కొరునకు నిట్లు సేకుఱునె యొక్కట లాభము లెన్నియన్నియున్? 50

అర్థము :- జగంబులన్ = లోకములందు, గురువునకున్, ఇష్ట-దైవము నకున్, పతికిన్ = ప్రభువునకును, కృతి - చెప్పి = కావ్యము నంకితమిచ్చి, పుణ్యమున్, పరమును, తేజమున్ = తేజస్సును, పడయన్ + వచ్చున్ = పొందవచ్చును, నిశ్చయంబు = ధ్రువము, మత్ + గురువును = నా గురువును, ఇష్ట-దైవమును-కూర్పు = ఇష్టుఁడైన, నిజ + ఈశుఁడున్ = నా ప్రభువును, తాను + అ = తానె, జంగమ మల్లికార్జునుఁడే, ఇట్లు, నాకున్ + కాక = నాకుఁ దప్ప, ఒరునకున్ = ఇతరునకు, ఒక్కటన్ = ఒక్కదాని చేతనే, లాభములు, ఎన్ని = ఎన్ని లాభములు పొందవీలగునో, అన్నియున్ = అన్నిలాభములును, చేకుఱునె = లభించునా ?

తాత్పర్యము :- లోకమున గురునకును, ఇష్టదైవమునకును, ప్రభువునకును గావ్యము నంకిత మిచ్చి పుణ్యమును, పరమును, తేజస్సును బొందవచ్చును. నిశ్చయము. ఇట్లు వేఱువేఱువారికిఁ గావ్యమును సమర్పించి వేఱువేఱు లాభములను బడయవచ్చును. కాని నా విషయమున నాకు గురువును, ఇష్టదైవమును, ప్రభువును శ్రీ జంగమ మల్లికార్జునుల వారే. ఒక్క శ్రీవారి నర్పించుట వలననే ఉన్న లాభము లన్నియును నాకు లభించుచున్నవి. ఇట్లు నాకుఁగాక యితరులకు సాధ్యముగాదు.

విశేషము లు :- దీనిచేఁ గృతికర్తయగు నన్నెచోడునికి జంగమ మల్లికార్జునులయెడఁగల భక్త్యతిశయము తెలియుచున్నది. అలంకారము యథాసంఖ్యము.

వ. అని యిట్లు మహోత్సాహంబున దివ్యకల్పం బుపకల్పించు మహా
కవి ముఖ్యుండ. 51

అర్థము :- అని, ఇట్లు, మహత్ (మహో) + ఉత్సాహంబునన్ = అధికమైన ఉత్సాహముతో, దివ్య-కల్పంబు = దేవతా సంబంధమైన రచనను, ఉపకల్పించు = నిర్మించునట్టి, మహత్ (మహో) - కవి - ముఖ్యుండన్ = మహాకవిశ్రేష్ఠుఁడను.

తాత్పర్యము :- అని యీవిధముగా నేను గొప్ప యుత్సాహముతో దేవ సంబంధమైన రచనను - కావ్యమును నిర్మించు మహాకవిశ్రేష్ఠుఁడను.

కృతి కర్తృ వంశ వర్ణనాదికము

సీ. కుతలంబు నడుకొనఁ గొలకొండగా నిల్పి
శరనిధి గ్రొచ్చిరి సగర సుతులు;
మిన్నులపైఁ బాఱుచున్నయే ఱిలఁదెచ్చి
వారాశి నించె భగీరథుండు;
గోత్రాచలము లెత్తికొని వచ్చి కడచన్న
రత్నాకరముఁ గట్టె రాఘవుండు;
జలధి మహీసతి మొలనూలుగాఁ జుట్టి
పాలించెఁ గలిఁ గరికాలచోడు.

ఆ. వరుస నిట్లు సూర్యవంశాధిపతు లంబు
నిధియ మేర గాఁగ నిఖిల జగము
నేలి చనిరి వారి కెనవచ్చు సుశ్లోక
ధనుఁడ నన్నెచోడ జనవిభుండ. 52

అర్థము :- సగర-సుతులు = సగరచక్రవర్తి కొడుకులు, కుతలంబు = భూతలముయొక్క, నడుకొనన్ = మధ్యభాగమును, కొల-కొండగాన్ = త్రవ్విన నేలలోఁతు తెలిసికొనుటకు విడిచిన దిబ్బగా, నిల్పి, శరనిధిన్ = సముద్రమును, గ్రొచ్చిరి = త్రవ్విరి.

భగీరథుఁడు, మిన్నులపైన్ = ఆకాశముపై, పాఱుచున్ + ఉన్న = ప్రవహించుచున్న, ఏఱు = నది-ఆకాశగంగను-మందాకినిని, ఇలన్ + తెచ్చి = భూమికిఁదెచ్చి, వారాశిన్ = సముద్రమును, నించెన్ = నిండించెను.

రాఘవుండు = రఘువంశము వాఁడైన రాముఁడు, గోత్ర + అచలములు = కుల పర్వతములు, ఎత్తికొనివచ్చి, కడచన్న = అపారమైన, రత్న + ఆకరమున్ = సముద్రమును, కట్టెన్,

కరికాలచోడు = కరికాలచోడుఁడు, జలధిన్ = సముద్రమును. మహీ-సతి = భూమి యనెడు స్త్రీయొక్క, మొల-నూలు + కాన్ = మొలనూలు + అగునట్లు, చుట్టి, కలిన్ = కలియుగమునందు, పాలించెన్ = ఏలెను.

ఇట్లు, వరుసన్ = క్రమముగా, సూర్య-వంశ + అధిపతులు = సూర్యవంశపు రాజులు, అంబునిధి + అ = సముద్రమే, మేర = హద్దు, కాఁగన్ = అగునట్లు, నిఖిల-జగమున్ = ఎల్లలోకమును, ఏలి = పాలించి, చనిరి = పోయిరి, వారికిన్ = ఆ పోయిన వారికి, ఎన-వచ్చు = సాటివచ్చునట్టి, సుశ్లోక-ధనుఁడన్ = మంచికీర్తియే ధనముగాఁ గలవాఁడను, నన్నెచోడ-జనవిభుండన్ = నన్నెచోడుఁ డను రాజను,

తాత్పర్యము :- సగరచక్రవర్తి కొడుకులు భూ మధ్యభాగమును గొలుచుటకైన దిబ్బగా నిల్పి సముద్రమును ద్రవ్విరి, భగీరథుఁడు ఆకాశమునఁ బ్రవహించుచున్న యేటిని మందాకినిని భూమికిఁ దెచ్చి సముద్రమున నింపెను, శ్రీరాముఁడు కులపర్వతముల నెత్తికొని వచ్చి యపారమగు సముద్రమును బంధించెను, కలికాలమునఁ గరికాలచోడుఁడు సముద్రమును భూమి యనెడు స్త్రీకి మొలనూలుగాఁ జుట్టి పాలించెను. ఇట్లు క్రమముగా సూర్యవంశపు రాజులు సముద్రమే హద్దుగా నెల్లలోకము నేలిరి. అట్టివారికి సాటివచ్చు సత్కీర్తిధనుఁడను నేను నన్నెచోడ ప్రభువను.

విశేషములు :- సగర సుతులు-సగర చక్రవర్తికి సుమతియందుఁ బుట్టిన యఱువదివేవురుకొడుకులు. తండ్రి యశ్వమేధ యాగమున విడిచిన యాగాశ్వము సముద్రమునఁ బ్రవేశింప, వీరు దాని నన్వేషించుటకు సముద్రమును ద్రవ్విరి. భగీరథుఁడు, సగర చక్రవర్తి ముమ్మనుమఁడు, సగరుని కొడుకైన అసమంజసుని పుత్రుఁడగు అంశుమంతుని కుమారుఁడు, కపిలుని కోపాగ్నిచే భస్మీభూతులైన తన పితృదేవతలకు త్తమగతులు కల్పించుటకై యీశ్వరుని గూర్చి తపస్సుచేసి దివిజగంగను భూమికిఁ గొనివచ్చి వారి భస్మరాశులపైఁ బ్రవహింపఁజేయ వారు సద్గతులను బొందిరి, గంగాజలముచే సముద్రము నిండెను, రాఘవుఁడు-శ్రీరాముఁడు. లంకలో రావణుఁడు చెఱఁబెట్టిన తన భార్యను సీతను గొనిరా సముద్రమును గులపర్వతములతో బంధించెను. కలియుగమునఁ గరికాలచోడుఁడు భూసతికి సముద్రము మొలనూలిఁగాఁజేసి యేలెను. అనఁగా సముద్రపర్యంతమైన భూమినేలె ననుట. నన్నెచోడుని వంశమునకు మూలపురుషుఁడు కరికాలచోడుఁడు, కరికాలచోడుఁడు సూర్యవంశము వాఁడగుటఁ దజ్జనితుఁ

వాఁడు వన్నె చోడుఁడను సూర్యవంశమువాఁడే యగును. 'కరి' యను ముద్రిత ప్రతి పాఠమునకు 'గిరి' యనునది శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి పాఠము, అది మేలనఁ బొసఁగుటచే స్వీకృతమైనది. కరిన్=నిదర్శనమును - అను పూర్వ వ్యాఖ్య వ్యర్థము లేదు. సుశ్లాఘ ధనుఁడు - శ్లాఘాశబ్దము ఆకారాంత స్త్రీ లింగము. సుశ్లాఘా ధనుఁడని యుండవలయును. కావున 'సుశ్లోక ధనుఁడ'నని మార్చుకొనఁబడినది, చిరకాలచోడుఁ డనుటకు చిరకాల చోడు అని యుజ్వర్ణక విరహితముగా వాడుట పొరపాటు,

చ. అరి నరపాల మౌళి దళితాంఘ్రియుగుండయి మేటి పాకనా
టిరువది యొక్క వేయిటి కధీశుఁడు నాఁ జను చోడబల్లికిం
జిరతరకీర్తి కగ్ర మహిషీ తిలకం బన హైహయాన్వయాం
బర శశిరేఖ యైన గుణభాసిని శ్రీసతికిం దనూజుఁడన్. 53

అర్థము :- అరి-నరపాల-మౌళి-దళిత+అంఘ్రి యుగుండు=శత్రువులైన రాజులయొక్క శిరస్సులచేత ఒరసింపఁజేయఁబడినపాదములయొక్క జంట గలవాఁడు, అయి, మేటి పాకనాటి+ఇరువదియొక్క-వేయిటికిన్=గొప్పదియగు పాకనాటఁగల యిరువదియొక్క వేయి గ్రామములకు, అధీశుఁడు=ప్రభువు, నాన్=అనఁగా, చను=తగునట్టి, చోడబల్లికిన్ + చిరతరకీర్తికిన్ = బహుకాలపుఁగీర్తిగల చోడబల్లి యను వానికి, అగ్ర-మహిషీ-తిలకంబు=శ్రేష్ఠురాలయిన పట్టపురాణి, అనన్, హైహయ+అన్వయ-అంబర-శశి-రేఖ=హైహయవంశమనెడి ఆకాశమునందుఁ జంద్రరేఖ, ఐన, గుణ-భాసిని=సద్గుణములచేఁ బ్రకాశించునట్టి, శ్రీ సతికిన్=శ్రీసతికిని, తనూజుఁడన్=కుమారుఁడను.

తాత్పర్యము :- శత్రురాజులు తమ శిరస్సు వంచి నమస్కరించుటచే ఒరసింపఁబడిన పాదపద్మముల జంట గలవాఁడయి, పాకనాటఁగల యిరువదియొక్క వేయి గ్రామములకుఁ బ్రభువైన గొప్ప చిరకాలయశస్కుఁడైన చోడబల్లికిని బట్టపురాణి యైన హైహయ వంశమనెడి ఆకాశమునందుఁ జంద్రరేఖవలెఁ బ్రకాశించునట్టియు, సద్గుణములచేఁ బ్రకాశించునట్టియు శ్రీసతికిని బుత్త్రుఁడను.

విశేషములు :- హైహయాన్వయాంబర శశిరేఖ - అనుచో నలంకారము రూపకము,

క. కలుపొన్న విరులఁ బెరుఁగఁగం,
గలుకోడి రవంబు దిశలఁ గలయఁగఁ జెలఁగన్
బొలుచు నొరయూరి కధిపతి
నలఘు పరాక్రముఁడఁ దెంకణాదిత్యుండన్. 54

అర్థము :- కలుపొన్న=ఒక జాతి పొన్నచెట్టు - జాతిపొన్న, విరులన్= పూవులతో, పెరుఁగన్ వృద్ధిపొందఁగా, కలుకోడి=ఒకజాతి కోడి-జాతికోడియొక్క, రవంబు=ధ్వని-కూఁత, దిశలన్=దిక్కులందు, కలయఁగన్=అంతటను,చెలఁగన్= మ్రోయఁగా, పొలుచు=ఒప్పునట్టి, ఒరయూరికిన్ = ఒరయూ రనెడి పురమునకు, అధిపతిన్=ప్రభుఁడను, అలఘు-పరాక్రముఁడన్ = తక్కువకాని-అధికమైన, పరాక్రమము గలవాఁడను, తెంకణ+ఆదిత్యుండన్=దక్షిణదేశమునకు సూర్యునివంటి వాఁడను.

తాత్పర్యము :- జాతిపొన్నచెట్టు పూలతో వృద్ధి చెందఁగను, జాతికోడి కూఁత దెసల మాఱుమ్రోయఁగను ఒప్పునట్టి ఒరయూరను పురమునకు నేను ప్రభుఁడను; అధిక పరాక్రమవంతుఁడను. దక్షిణదేశమునకు సూర్యునివంటివాఁ డను నర్థమిచ్చు 'తెంకణాదిత్యుఁ'డను బిరుదు గలవాఁడను.

విశేషములు :- ఈ ఒరయూరు నేఁడు తమిళనాడు రాష్ట్రమున తిరుచినాపల్లికి సమీపమున నున్న-చీరలకుఁ బ్రసిద్ధమైన ఒరయూరే, తానే ఒరయూరి కధిపతి నని యితఁడు కంఠోక్తిగాఁ జెప్పికొనుచుండఁగా, అది వంశపారంపర్యముగా వచ్చిన బిరుదమేకాని నిజముగా నొరయూరి ప్రభువు కాఁడని కొందఱు సందేహింతురో!

క. పాత్రుఁడ, నసదృశ కాశ్యప
గోత్రుఁడ, సచ్చరిత నుభయకుల శుద్ధుండన్,
మిత్రాన్వయ శేఖరుఁడఁ, బ
విత్రీకృత దేహుఁడను వివిధ యజ్ఞములన్. 55

అర్థము :- పాత్రుఁడన్ = యోగ్యుఁడను, అసదృశ-కాశ్యప-గోత్రుఁడన్ = సాటిలేని కాశ్యప గోత్రుఁడను, సత్ + చరితన్ = మంచినడవడిచేత, ఉభయ-కుల-పవిత్రుఁడన్ = పితృమాతృ వంశములను రెండింటిని బవిత్రముచేసినవాఁడను, మిత్ర + అన్వయ-శేఖరుఁడన్ = సూర్యవంశమునందు శ్రేష్ఠుఁడను, వివిధ-యజ్ఞములన్ = పెక్కు యజ్ఞములచేత, పవిత్రీ-కృత-దేహుఁడను = పావనముచేయఁబడిన శరీరము గలవాఁడను.

తాత్పర్యము :- నేను యోగ్యుఁడను. సాటిలేని కాశ్యపగోత్రుఁడను. సత్ప్రవర్తనచేఁ బితృమాతృ వంశములు రెంటిని బవిత్రముచేసినవాఁడను, సూర్య వంశమువారిలో శ్రేష్ఠుఁడను. వివిధ యజ్ఞము లొనరించుటచేతఁ బవిత్రముగాఁజేయఁబడిన శరీరము గలవాఁడను.

విశేషములు :- సత్+చరిత-సకార తవర్గములకు శవర్ణ చ వర్గములతో పూర్వమందైనను బరమందైనను కూడిక గలుగు నపుడు క్రమముగా శవర్ణ చవర్గ వర్ణము లాదేశమగును - సచ్చరిత.

వ. ఇట్లు విశిష్ట గుణ గణాలంకృతుండనై నెగడు నస్మదీయానూన
ప్రతిభార్ణ వోదీర్ణ రుచిర వస్తు విస్తారితోత్తమ కావ్యరత్న
విభూషణం బమృతాంశుభూషణావతారంబై విలసిల్లు జంగమ
మల్లికార్జునదేవు నిఖిల జన శిరో విభూషణామల దివ్య శ్రీపాదంబు
లాకల్పాంత స్థాయిగా విభూషించు టశేషజగజ్జేగీయమానంబు. 56

అర్థము :- ఇట్లు, విశిష్ట-గుణ-గణ + అలంకృతుండను + ఐ = గొప్ప గుణములయొక్క సమూహముచేత నలంకరింపఁబడినవాఁడనై, నెగడు = ఒప్పు, అస్మదీయా.................. విభూషణము : అస్మదీయ = నాదైన, అనూన = తక్కువ కాని (గొప్పదైన), ప్రతిభా = ప్రతిభయనెడి, అర్ణవ = సముద్రమునందు, ఉదీర్ణ = పుట్టిన, రుచిర = మనోహరమైన, వస్తు = వస్తువుచేత-కథచేత, విస్తారిత = విస్తరింపఁజేయఁబడిన, ఉత్తమ = శ్రేష్ఠమయిన, కావ్య = కావ్య మనెడి, రత్న-విభూషణంబు = రత్నాలంకారము, అమృత + అంశు-భూషణ + అవతారంబు + ఐ = చంద్రుఁ డలంకారముగాఁగల శివునియొక్క అవతారమయి, విలసిల్లు =

ప్రకాశించు, జంగమ మల్లికార్జున-దేవు = జంగమ మల్లికార్జున స్వామియొక్క, నిఖిల.... .... పాదంబులు; నిఖిల = ఎల్ల, జన=జనులయొక్క, శిరస్+విభూషణ = శిరోఽలంకారము, అమల = నిర్మలము, దివ్య=దివ్యము, అగు, శ్రీ పాదంబులు= శోభాకరములైన పాదములు, ఆ-కల్ప + అంత-స్థాయిగాన్ = ప్రళయకాలము వఱకు నుండునదిగా, విభూషించుట = అలంకరించుట, అశేష = సర్వ, జగత్ + జేగీయమానంబు = లోకములచే గానముచేయఁబడుచున్నది.

తాత్పర్యము :- ఈ విధముగా గొప్ప సుగుణముల సమూహములచే నలంకరింపఁబడినవాఁడనై యొప్పు నా అనల్పమైన ప్రతిభ యనెడి సముద్రమునం దుత్పన్నమైన మనోహరమైన కథచేత విపులీకరింపఁబడిన ఉత్తమకావ్యమనెడి రత్నాలంకారము-శివావతారుఁడై విలసిల్లు జంగమ మల్లికార్జున దేవుని ఎల్ల జనుల శిరోఽలంకారములు, నిర్మలములు, దివ్యములునైన శ్రీ పాదములను శాశ్వతముగా నలంకరించుట యెల్ల జగములచే గానము చేయఁబడుచున్నది.

విశేషములు ;- నెగడు + అస్మదీయ - ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమంబగు. నెగడు నస్మదీయ. బాల. సం. 33, నెగడు నస్మదీయా నూన ....విభూషణంబు-ఇందు నెగడు అను ధాతుజ విశేషణము అస్మదీయా దిగాఁ గల సిద్ధసమాసము నందలి 'అస్మదీయ' యను పద మొక్కదానితో నన్వయించు చున్నది- 'కొన్ని యెడల సిద్ధ సమాస మధ్యగత పదంబులతోఁ దద్భిన్న పదంబుల కన్వయంబు చూపట్టెడి.' ప్రౌఢ. సమాస. 35. ప్రతిభార్ణవ = ప్రతిభ యనెడి అర్ణవ, కావ్య రత్న విభూషణంబు - కావ్యమనెడి రత్నవిభూషణము - రూపకములు. జగత్ + జేగీయమానంబు- 'అనునాసికాంతస్థ వర్ణములు తప్ప మిగిలిన పదాంత గత హల్లులకు (ఝల్లులకు) మృదుహల్లులు (హశ్శులు) కాని, అచ్చులు కాని పరములగు నపుడు ఆ హల్లుల వర్గమునకుఁజెందిన తృతీయ వర్ణమాదేశమగును, జగద్ + జేగీయమాన. 'సకార త వర్గములకు శవర్గ చవర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్గ చ వర్గ వర్ణము లాదేశమగును. జగజ్జేగీయమానంబు.

చ. రవికులశేఖరుండు కవిరాజశిఖామణి కావ్యకర్త స
త్కవి భువి నన్నెచోడుఁ డటె! కావ్యము దివ్యకథం గుమార సం
భవ మటె! సత్కథాధిపతి భవ్యుఁడు జంగమ మల్లికార్జునుం
డవిచలితార్థయోగధరుఁ డట్టె! వినం గొనియాడఁ జాలదే! 57

అర్థము :- కావ్య-కర్త=కావ్యమును రచించినవాఁడు. భువిన్=భూమియందు, రవి-కుల-శేఖరుండు=సూర్యవంశశ్రేష్ఠుఁడును- కవిరాజ శిఖామణి=కవిశ్రేష్ఠులలోఁ దలమానికమైనవాఁడు, సత్+కవి=మంచికవి, నన్నెచోడుఁడు+అటె=నన్నెచోడుఁడట, కావ్యము, దివ్య-కథన్=దేవతా సంబంధి కథయందు, కుమారసంభవము+అటె=కుమారసంభవమట, సత్+కథా+అధిపతి=(అ) మంచి కథకు నాయకుఁడు, భవ్యుఁడు=తగినవాఁడు, (అగు) జంగమమల్లికార్జునుండు, అవిచలిత=అర్థ-యోగ-ధరుఁడు+అట్టె=నిశ్చలమైన అర్థమనెడి యోగమును ధరించినవాఁడటె, వినన్=వినుటకును, కొనియాడన్=ప్రశంసించుటకును, చాలదే=సమర్థము గాదా- అగు ననుట,

తాత్పర్యము :- కావ్యమును రచించినవాఁడు సూర్యవంశ శ్రేష్ఠుఁడును, కవిరాజ శిఖామణియును, సత్కవియును అగు నన్నెచోడుఁడట, కావ్యము దివ్యకథలోఁ గుమారసంభవమట, కథానాయకుఁడు-కృతిభర్త యోగ్యుఁడగు జంగమమల్లికార్జునుఁడు నిశ్చలార్థ మనెడి యోగమును ధరించినవాఁడట! ఇఁక, దానిని వినను, ప్రశంసింపను యోగ్యము కాదా! అగు నని భావము.

విశేషములు :- కావ్యము దివ్యకథయగు కుమారసంభవము. కవి కవిరాజ శిఖామణి, కృతిభర్త-నిశ్చలమైన అర్థయోగమును ధరించిన జంగమ మల్లికార్జున దేవుఁడు-ఇన్ని సల్లక్షణములు పట్టిన యీ కావ్యము ప్రశంసనీయ మనుట,

వ. కావునం బరమశ్రీ నగోత్తుంగ మణిశ్రీ సంగత మల్లికార్జున దేవ[1]
తాత్మకంబైన తేజంబు జగంబులం బ్రత్యక్షంబై ప్రవర్తిల్లుట
జంగమ మల్లికార్జున [1]దేవుండై, ప్రాణాయామాది షడంగోపాంగ

1. వా. పా. దేవతాకంబై.

సకల యోగిజనారాధితుం డగుటం బరమయోగీంద్రుండై, న్యాయ వైశేషికాది షట్తర్క కర్కశుం డగుటం బరవాది భయంకరుండై, జన్మమరణాది దుఃఖార్ణవోత్తీర్ణ స్తూయమానమానసుం డగుటనుం బర మానంద హృదయుండై, ఘోర సంసార పారావారోత్తరణ కారణా నూన వైరాగ్య నిరతుం డగుట సమ్యగ్జ్ఞాన స్వరూపుండై, వేద తదంగ శాస్త్ర పురాణేతిహాసాగమాది సకల కళా స్వరూపాపార వాణీ ధరుం డగుట నిఖిల విద్యాగురుండై, సకలజనాభీష్ట విమల జ్ఞానానూన ఫలప్రదాయకుం డగుటం బరమ స్వరూపుండై, సమస్త విద్వజ్జన మనో మానసకేళీలాలసుం డగుటం బరమహంస స్వరూపుండై, యత్యుత్తమ పురుషార్థ ప్రవర్తితుం డగుటం బురుషోత్తముండై, నిఖిల ముముక్షు జనైకధ్యేయాత్మకుం డగుటం బర బ్రహ్మ స్వరూపుండై, నిస్త్రైగుణ్యపదార్థ ప్రవర్తితుం డగుట గుణ గణాతీతుండై, సద్భక్త జనాత్మాలోకనైక హేతుభూతుం డగుట మునిజనముఖమణిముకురుండైన జంగమ మల్లికార్జున దేవునకు. 58

అర్థము :- కావునన్ = కాఁబట్టి, పరమ - శ్రీ నగ + ఉత్తుంగ - మణి-శ్రీ = గొప్పది యగు శ్రీశైలము నందలి, యెత్తయిన, మణుల సంపదతో, సంగత = కూడుకొన్న, మల్లికార్జున దేవతా + ఆత్మకంబు + ఐన = మల్లికార్జున దేవుని స్వరూపమైన, తేజంబు = తేజస్సు, జగంబులన్ = లోకములందు, ప్రత్యక్షంబు + ఐ = ఎదుటఁ దోఁచినదయి, ప్రవర్తిల్లుటన్ = ఉండుటచేత, జంగమ మల్లికార్జున-దేవుండు + ఐ, ప్రాణాయామ + ఆది - షట్ + అంగ + ఉపాంగ - సకల యోగి-జన + ఆరాధితుండు = ప్రాణాయామము మున్నగు ఆఱంగములు, ఉపాంగములు గల, ఎల్ల యోగిజనులచేఁ బూజింపఁబడినవాఁడు, అగుటన్ = అగుటచే, పరమ-యోగి + ఇంద్రుండు + ఐ = మహాయోగి శ్రేష్ఠుఁడయి, న్యాయ - వైశేషిక + ఆది - షట్ + తర్క - కర్కశుండు = న్యాయము, వైశేషికము మున్నగు ఆఱు తర్కములచేఁ గఠినుఁడు అనఁగా న్యాయాదులైన ఆఱు తర్కములను క్షుణ్ణముగాఁ జదివినవాఁడనుట, అగుటన్ = అగుటచే, పరవాది - భయంకరుండు + ఐ =

* త్రుప్పులైన వాదించువారికి వెఱపుఁగొలుపువాఁడయి, జన్మ = పుట్టుట, మరణ = చచ్చుట, ఆది = మొదలగు, దుఃఖ + అర్ణవ = దుఃఖమనెడి సముద్రమును, ఉత్తీర్ణ = దాఁటినట్టియు, (అందుచేతనే), స్తూయమాన = పొగడఁబడుచున్న, మానసుండు = మనస్సు గలవాఁడు, అగుటన్ = అగుటచేత. పరమ + ఆనంద-హృదయుండు + ఐ = మిక్కిలి సంతోషముతోఁగూడిన హృదయము గలవాఁడయి, ఘోర .... నిరతుండు : ఘోర = భయంకరమైన. సంసార - పారావార = సంసారమనెడి సముద్రము యొక్క, ఉత్తరణ = దాఁటుట అనెడి, కారణ = కారణముచేత, అనూన = తక్కువకాని, వైరాగ్య = వైరాగ్యమునందు, నిరతుండు = ఆసక్తి గలవాఁడు, అగుటన్, సమ్యచ్(క్) + జ్ఞాన - స్వరూపుండు + ఐ = లెస్సయైన జ్ఞానము యొక్క స్వరూపము గలవాఁడయి, వేద .... ధరుండు : వేద = నాలుగు వేదములు, తద్ + అంగ = వాని యంగములు, శాస్త్ర = ఆఱు శాస్త్రములు, పురాణ = పదునెనిమిది పురాణములు. ఇతిహాస = భారతాది పూర్వచరిత్ర ప్రతిపాదక గ్రంథములు. ఆగమ = ఆగమములు, ఆది = మొదలుగాఁగల, సకల = ఎల్ల, కళా = కళల యొక్క, స్వరూప = స్వరూపమయిన, అపార = అనంతమయిన, వాణీ = వాక్కుయొక్క, ధరుండు = తాల్చినవాఁడు, అగుటన్, నిఖిల - విద్యా - గురుండు + ఐ = ఎల్ల విద్యలకును గురుఁడయి, సకల = ఎల్ల, జన = మనుష్యులచేత, అభీష్ట = కోరఁబడిన, విమల = నిర్మలమైన, జ్ఞానమనెడి, అనూన = తక్కువ కాని, ఫల = ఫలముయొక్క, ప్రదాయకుండు = ఇచ్చువాఁడు, అగుటన్, పరమ - స్వరూపుండు + ఐ = ఉత్కృష్టమైన జ్ఞానము గలవాఁడయి, సమస్త = ఎల్ల, విద్వస్ (త్) + జన = విద్వాంసులైన జనులయొక్క, మనస్ + మానస = మనస్సులనెడి మానస సరస్సులందు, కేళీ = క్రీడలయందు, లాలసుండు = అధిక వాంఛగలవాఁడు, అగుటన్, పరమహంస - స్వరూపుండు + ఐ = ఉత్తమ పదము నొందిన సన్న్యాసి యొక్క - గొప్ప అంచయొక్క. స్వరూపము గలవాఁడయి, అతి + ఉత్తమ = మిక్కిలి శ్రేష్ఠమయిన, పురుష + అర్థ = పురుషార్థమైన మోక్షమునందు, ప్రవర్తితుండు = ప్రవర్తించినవాఁడు, అగుటన్, పురుష + ఉత్తముండు + ఐ = పురుష శ్రేష్ఠుఁడు అయి, విష్ణువయి, నిఖిల - ముముక్షు - జన + ఏక - ధ్యేయ + ఆత్మకుండు = ఎల్ల మోక్షకాంక్షులగు జనులకు ముఖ్యముగా, ధ్యానింపఁదగిన ఆత్మ గలవాఁడు, అగుటన్, పరబ్రహ్మ - స్వరూపుండు + ఐ = పరబ్రహ్మ యొక్క స్వరూపము గలవాఁడయి, నిస్త్రైగుణ్య-పదార్థ-ప్రవర్తితుండు = త్రిగుణములు

(సత్త్వరజస్తమములు) లేని పదార్థమునందు వర్తించువాఁడు, అగుటన్, గుణ - గణ+ అతీతుండు + ఐ = గుణముల యొక్క సమూహము కంటె వేఱయిన వాఁడయి, సత్ + భక్త = మంచి భక్తులైన, జన = జనుల యొక్క, ఆత్మ + ఆలోకన= మనస్సులయొక్క దృష్టులకు, ఏక=ప్రధానమైన, హేతు - భూతుండు=కారణమైన వాఁడు, అగుటన్, ముని - జన = మునుల సమూహము యొక్క, ముఖ = ముఖములకు, మణి - ముకురుండు = రత్న దర్పణము, ఐన, జంగమ మల్లికార్జున దేవునకు.

తాత్పర్యము : కావున గొప్పది యగు శ్రీశైలమునందలి మణి సంపదలతోఁ గూడిన మల్లికార్జున దేవుని స్వరూపమయి లోకములందుఁబ్రత్యక్షమయి ప్రవర్తిల్లుట చేత జంగమ మల్లికార్జున దేవుఁడయి, ప్రాణాయామము మున్నగు షడంగములు ఉపాంగములు గల యెల్ల యోగులచేఁ బూజితుఁడగుటచేఁ బరమయోగి శ్రేష్ఠుఁడయి, న్యాయము, వైశేషికము మున్నగు నాఱు తర్క శాస్త్రములను బాగుగాఁ జదివిన వాఁడగుటచేఁ బరవాది భయంకరుఁడయి, పుట్టుట గిట్టుట మున్నగు దుఃఖములనెడి సముద్రములను దాఁటి పొగడఁబడుచున్న మనస్సు గలవాఁడగుటచేఁ బరమానంద హృదయుఁడయి, భయంకర సంసార సముద్రమును దాఁటఁ గారణమైన వైరాగ్యమునం దాసక్తి గలవాఁడగుటచే సుజ్ఞాన స్వరూపుఁడయి, వేదములు, తదంగములు, శాస్త్రములు, పురాణములు, ఇతిహాసములు, ఆగమములు మున్నగు ఎల్ల విద్యల స్వరూపమైన అనంత వాక్కును ధరించినవాఁడగుటచే ఎల్ల విద్యలకును గురువయి, ఎల్ల జనులును గోరు నిర్మల జ్ఞాన మనెడి గొప్ప ఫలము నిచ్చువాఁడగుటచేఁ బరమ జ్ఞాన స్వరూపుఁడయి, ఎల్ల విద్వాంసుల మనస్సులనెడి మానస సరస్సులందు విహరించు కోరిక గలవాఁడగుటచే, పరమహంస స్వరూపుఁడయి, అత్యుత్తమమైన పురుషార్థమగు మోక్షమునందుఁ బ్రవర్తించువాఁడగుటచేఁ బురుషోత్తముఁడయి, ఎల్ల మోక్షకాంక్షి జనులకుఁబ్రధానమైన ఆత్మ గలవాఁడగుటచేఁ బరబ్రహ్మ స్వరూపుఁడయి, త్రిగుణ రహిత పదార్థమునందుఁ బ్రవర్తిల్లువాఁడగుటచే గుణగణమున కతీతుఁడై, సద్భక్తులైన జనుల ఆత్మాలోకనమునకు ముఖ్యకారణమైనవాఁడగుటచే మునిజనుల ముఖములకు మణి దర్పణము అగు జంగమ మల్లికార్జున దేవునకు - పయి గద్యముతో నన్వయము.

విశేషములు : ప్రాణాయామము - ప్రాణవాయువును-నాసికా ముఖములందు సంచరించు దానిని మంత్ర పూర్వకముగా నిరోధించుట. ఇది యోగాంగములగు

అష్టాంగములలో నొకటి. అవి యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి. వైశేషికము - షడ్దర్శనములలో నొకటి. అవి. న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, మీమాంసా, వేదాంతములు. కొందఱు యోగమునకు మాఱుగా పాణినీయమును దర్శనముగా గ్రహించిరి.

దుఃఖార్ణవ - దుఃఖమనెడి అర్ణవ - రూపకము. సంసార పారావార - సంసార మనెడి పారావార - రూపకము. పారావార - 'సముద్రోఽబ్ధి రకూపారః పారావార స్సరిత్పతిః' పారం అవృణోతీతి పారావారః - దరిని గప్పునది - సముద్రము-అమరము. జ్ఞానామాన ఫల - జ్ఞానమనెడి అమాన ఫల - రూపకము. విద్వస్ + జన-క్వసంత శబ్దములకు అసర్వనామస్థాన హలాది ప్రత్యయములు పరములగు నపుడును, నపుంసక లింగమునందు ప్రథమైక వచన ప్రత్యయము పరమగునపుడును సకారమునకు దకారా దేశ మగును. విద్వద్ + జన - సకార తవర్గములకు శవర్ణ చవర్గములతో పూర్వ మందైనను పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్ణ చవర్గ వర్ణము లాదేశమగును. విద్వజ్జన. సమ్యచ్ + జ్ఞాన-చవర్గాక్షరములకు ఝల్ (అనునాసికములు, అంతస్థములు తప్ప తక్కిన హల్లులు) పరమగునపుడును, పదాంతమునందును కవర్గాక్షరములు ఆదేశ మగును, సమ్యక్ + జ్ఞాన - అనునాసికాంతస్థ వర్ణములు తప్ప మిగిలిన పదాంత గత హల్లులకు (ఝల్లులకు) మృదు హల్లులు (హశ్శులు) కాని, అచ్చులు కాని పరమగునపుడు ఆ హల్లుల వర్గమునకుఁజెందిన తృతీయ వర్ణ మాదేశ మగును - సమ్యగ్జ్ఞాన. మనో మానస - మనస్సనెడి మానస - రూపకము. అతి + ఉత్తమ - యణాదేశసంధి - ఇ ఉ ఋ ౡ వర్ణములకు అసవర్ణము లయిన అచ్చులు పరములగునపుడు యణ్ణులు (య్, వ్, ర్, ల్) ఆదేశములగును - అత్యుత్తమ. పురుషోత్తముఁడు - విష్ణువు, పురుషులలో నుత్తముఁడు - శ్లేషము. ముముక్షు-మోక్ష మిచ్ఛుః - ముముక్షుః - మోక్షమును గోరువాఁడు, జన + ఏక - వృద్ధిసంధి - అ ఆ లకు ఏ ఐ లు పరములగునపుడు ఐ కారమును, ఓ ఔ లు పరములగునపుడు ఔ కారమును ఏకాదేశమగును - జనైక, త్రైగుణ్య-త్రిగుణానాం భావః-సత్త్వ రజస్తమో గుణములు - త్రిగుణములు. వాని భావము త్రైగుణ్యము. ముని జనముఖ మణి ముకురుండు - మునిజన ముఖములకు మణిముకురమైనవాఁడు-రూపకము. పురుషోత్తముండై, పరబ్రహ్మ స్వరూపుండై-అనుచో శ్లేష సామర్థ్యముచే జంగమ మల్లికార్జును నకు విష్ణు బ్రహ్మలతో నభేదము సాధింపఁబడినది. అలంకారము శ్లేషము.

షష్ఠ్యంతములు

క. శ్రీ కంఠమూర్తి, కమల
శ్లోకున, కనఘునకు, మితవచోనిధికి, సుధీ
లోకస్తుతునకు, విజ్ఞా
నాకారున, కమితమతికి, నచలాత్మునకున్. 59

అర్థము : శ్రీకంఠ - మూర్తికిన్ = శివ స్వరూపునకు, అమలశ్లోకునకున్= నిర్మలమైన కీర్తి గలవానికి, అనఘునకున్ = పాపము లేని వానికి, మిత - వచస్ - నిధికిన్ = మితములైన వాక్కులకు నిధానమైన వానికి, సుధీ - లోక-స్తుతునకున్= పండితుల సమూహముచేఁ బొగడఁబడు వానికి, విజ్ఞాన + ఆకారునకున్=విజ్ఞానము రూపుగాంచిన వానికి, అమిత - మతికిన్ = అధికమైన బుద్ధి గలవానికి, అచల + ఆత్మునకున్ = చలింపని మనస్సుగల వానికి.

తాత్పర్యము : శివ స్వరూపుఁడును, నిర్మలమైన కీర్తి గలవాఁడును, పాప రహితుఁడును, మిత వచన నిధియును, పండిత సమూహముచే స్తుతింపఁబడు వాఁడును, విజ్ఞాన స్వరూపుఁడును, అమితమైన బుద్ధి గలవాఁడును, చలింపని ఆత్మగలవాఁడును అగు జంగమ మల్లికార్జునునకు.

విశేషములు : షష్ఠ్యంతములు - షష్ఠీవిభక్తితో నంతమగునవి. ఇవి కృతి భర్తృ విశేషణములయి యుండును.

శ్రీకంఠ - 'ఉగ్రః కపర్దీ శ్రీకంఠ శ్శితికంఠః కపాలభృత్' - శ్రీః విషః కణ్ఠే యస్య సః - శ్రీకణ్ఠః - విషము కంఠమందుఁగలవాఁడు - శివుఁడు - లేదా కాలకూట ధరణజా శ్రీ శ్శోభా కణ్ఠే యస్య సః - కాలకూటమును ధరించుటవలనఁ గలిగిన శ్యామశోభ కంఠమందుఁ గలవాఁడు శివుఁడు - అమరము.

క. సద్గురుఁడనఁ జను నఖిల జ
గద్గురునకు, సంతతోపకారికి, ముని వి
ద్వద్గురునకుఁ, గవి బుధహిత
మద్గురున, కపారధర్మమతికిన్, యతికిన్. 60

అర్థము : సత్ + గురుఁడు = మంచి గురువు, అనన్ + చను = అనఁదగునట్టి, అఖిల - జగత్ + గురునకున్ = ఎల్ల లోకములకు గురువైన వానికిని, నిత్య + ఉపకారికిన్ = నిత్యము ఉపకారము చేయువానికిని, ముని - విద్వత్ + గురునకున్ = మునులైన విద్వాంసులకు గురువైన వానికి, కవి - బుధ - హిత - మత్ + గురునకున్ = కవులకు, బుధులకు హితుఁడనైన నా గురువునకు, అపార - ధర్మ - మతికిన్ = అనంతమైన ధర్మబుద్ధి గలవానికి, యతికిన్.

తాత్పర్యము : ఉత్తమ గురుఁ డనఁదగు సర్వలోక గురుఁడును, నిత్యోపకారుఁడును, ముని విద్వాంసులకు గురువైనవాఁడును, కవులకు, బుధులకు హితుఁడనైన నాకు గురువైనవాఁడును, అపారమైన ధర్మబుద్ధి గలవాఁడును, యతియును నగు జంగమ మల్లికార్జునునకు.

క. సంగా సంగ విదూరున,
కంగజ హర మూర్తి, కభిజనాభరణునకున్,
గంగా జల నిభ కీర్తికి,
జంగమ మల్లయకు విబుధ సంస్తుత్యునకున్. 61

అర్థము : సంగ + అసంగ - విదూరునకున్ = రాగద్వేష రహితునకును, అంగజ - హర - మూర్తికిన్ = మన్మథ సంహారకుఁడగు శివుని మూర్తియైన వానికి, అభిజన + అభరణునకున్ = కీర్తి నగగాఁ గలవానికి, గంగా - జల - నిభ - కీర్తికిన్ = గంగాజలముతో సమానమైన (తెల్లని) కీర్తి గలవానికి, విబుధ - సంస్తుత్యునకున్ = పండితులచే లేదా దేవతలచే మిక్కిలి పొగడఁదగిన వానికి, జంగమ మల్లయకున్ = జంగమ మల్లికార్జునునకు.

తాత్పర్యము : సంగా సంగములు లేని వాఁడును, శివమూర్తియు, కీర్తి భూషణుఁడును, గంగోదకమువలెఁ దెల్లని కీర్తి గలవాఁడును, దేవతలచేఁ బొగడఁదగు వాఁడును, అగు జంగమ మల్లికార్జునునకు.

క. అక్షయ మూర్తికి, నాశ్రిత
రక్షణ దక్షునకు, ధర్మ రతి మతికిఁ, గళా
దక్షునకు, నమితునకు, శుభ
లక్షణ లక్షితున, కిహలలాటేక్షునకున్. 62

అర్థము: అక్షయ - మూర్తికిన్ = నాశనములేని ఆకారము గలవానికి, ఆశ్రిత - రక్షణ - దక్షునకున్ = ఆశ్రయించిన వారియొక్క రక్షణమునందు సమర్థుఁడైన వానికి, ధర్మ - రతి - మతికిన్ = ధర్మమునం దాసక్తి గల బుద్ధి గల వానికి, కళా - దక్షునకున్ = కళలయందు సమర్థుఁడైన వానికి, అమితునకున్ = అధికుఁడైన వానికి, శుభ - లక్షణ - లక్షితునకున్ = మంగళకర లక్షణములకు లక్ష్యమైన వానికి, ఇహ - లలాట + ఈక్షునకున్ = భూలోక శివుఁడైన వానికి.

తాత్పర్యము: అక్షయమైన మూర్తి గలవాఁడును, ఆశ్రయించిన వారి రక్షణమందు సమర్థుఁడైనవాఁడును, ధర్మమునం దాసక్తి గల బుద్ధి గలవాఁడును, కళలయందు నేర్పుగలవాఁడును, అధికుఁడును, శుభ లక్షణములకు లక్ష్యభూతుఁడైన వాఁడును, భూలోక శివుఁడైనవాఁడును అగు జంగమ మల్లికార్జునునకు.

క. కుంద దరహాస సురకరి
చందన నీహార హార శరదంబుద పూ
ర్ణేందు నిభ కీర్తి పరున, క
నిందిత గుణ నిధికి, నధిక నిర్మల మతికిన్. 63

అర్థము: కుంద = మొల్లలు, దరహాస = చిఱునవ్వు, సుర-కరి = దేవ గజము - ఐరావతము, చందన = మంచి గంధము, నీహార = మంచు, హార = ముత్యాల పేరు, శరద్ + అంబుద = శరత్కాల మేఘము, పూర్ణ + ఇందు = నిండు చంద్రుఁడు, - అను వానితో, నిభ = సమానమైన, కీర్తి - పరునకున్ = కీర్తిచే నధికుఁడైనవానికి, అనిందిత-గుణ - నిధికిన్ = నిందింపఁబడని గుణములకు నిధియైన వానికి, అధిక - నిర్మల - మతికిన్ = మిక్కిలి స్వచ్ఛమైన మనస్సు గల వానికి.

తాత్పర్యము : మొల్లలు, చిఱునవ్వు, ఐరావతము, మంచి గంధము, మంచు, ముత్యాల పేరు, శరన్మేఘము, నిండు చంద్రుఁడు అనువానితో సమానమైన (తెల్లని) కీర్తిగలవాఁడును, సద్గుణనిధియైనవాఁడును, మిక్కిలి నిర్మలమైన మనస్సుగలవాఁడును అగు జంగము మల్లికార్జునునకు.

క. సత్త్వాది గుణ విభూతికి,
సత్త్వ దయాళునకు, నధిక సంతుష్టునకున్,
దత్త్వ ప్రకాశ మతికిం,
దత్త్వ ఫలప్రదున, కాత్మ తత్త్వజ్ఞునకున్. 64

అర్థము ; సత్త్వ + ఆది - గుణ - విభూతికిన్ = సత్త్వము మున్నగు గుణముల సంపద గలవానికి, సత్త్వ - దయాళునకున్ = ప్రాణులయెడ దయ గల వానికి, అధిక - సంతుష్టునకున్ = మిక్కిలి సంతోషించు వానికి, తత్త్వ - ప్రకాశ-మతికిన్ = తత్త్వముచేఁ బ్రకాశించు మనస్సుగల వానికి, తత్త్వ-ఫల - ప్రదునకున్ = తత్త్వమనెడి ఫలము నిచ్చువానికి, ఆత్మతత్త్వజ్ఞునకున్ = ఆత్మ తత్త్వము నెఱిఁగిన వానికి.

తాత్పర్యము : సత్త్వము మున్నగు గుణముల సంపద గలవాఁడును, సత్త్వములయెడ దయ గలవాఁడును, మిక్కిలి సంతుష్టుఁడైన వాఁడును, తత్త్వముచేఁ బ్రకాశించు మనస్సుగలవాఁడును, తత్త్వమనెడి ఫలము నొసఁగు వాఁడును, ఆత్మతత్త్వము నెఱిఁగినవాఁడును అగు జంగమ మల్లికార్జునునకు.

క. శుంభద్గుణ గణ నిలయున,
కంభోధి గభీరునకు, మితాలాపునకున్,
జంభారి భోగ భాగికి,
నంభోజాక్షునకు, సజ్జనాభరణునకున్. 65

అర్థము : శుంభత్ + గుణ - గణ - నిలయునకున్ = ప్రకాశించుచున్న, గుణముల సమూహమునకు స్థానమయిన వానికి, అంభోధి - గభీరునకున్ =

సముద్రమువలె గంభీరుఁడైన వానికి, మిత + ఆలాపునకున్=తక్కువ మాటాడు వానికి, జంభ + అరి - భోగ - భాగికిన్ = జంభుఁడను వాని శత్రువైన ఇంద్రుని యొక్క భోగములు పొందు వానికి, అంభోజ+అక్షునకున్=తామరలవంటి కన్నులు గల వానికి, సత్ + జన + ఆభరణునకున్=సుజనులు అలంకారముగాఁ గలవానికి.

తాత్పర్యము : సద్గుణముల సమూహమునకు స్థానమైనవాఁడును, సముద్రము వలె గంభీరుఁడైనవాఁడును, మితముగా మాటలాడు వాఁడును, ఇంద్ర భోగములు పొందిన వాఁడును, తామరల వంటి కన్నులు గలవాఁడును, సుజనులకు ఆభరణము అయిన వాఁడును అగు జంగమ మల్లికార్జునునకు,

క. వినుత బ్రహ్మర్షికి, న
త్యనుపమ సంయమికి. సజ్జనాభరణునకున్,
మనుజాకార మహేశున,
కనుపమ చరితునకు, మల్లికార్జున మునికిన్. 66

అర్థము : వినుత - బ్రహ్మర్షికిన్=విశేషముగాఁ బొగడఁబడిన బ్రహ్మర్షియైన వానికి, అతి + అనుపమ - సంయమికిన్ = మిక్కిలి సాటిలేని మునియైన వానికి, సత్ + జన + ఆభరణునకున్ = సుజనులు ఆభరణముగాఁ గలవానికి, మనుజ + ఆకార-మహేశునకున్ = మనుష్యుని రూపమున నున్న పరమేశ్వరునకు, అనుపమ - చరితునకున్ = సాటిలేని నడవడిగలవానికి, మల్లికార్జున - మునికిన్ = జంగమ మల్లికార్జునుఁ డను మునికి.

తాత్పర్యము : విశేషముగాఁ బొగడఁబడిన బ్రహ్మర్షియైనవాఁడును, మిక్కిలి సాటిలేని మునియైనవాఁడును, సుజనులు ఆభరణముగాఁగలవాఁడును, మనుష్యరూప శివుఁడైన వాఁడును, సాటిలేని చరితము గలవాఁడును, అగు మల్లికార్జునుఁ డను పేరు గల మునికి - తరువాతి గద్యము నందలి 'నా చెప్పం బూనిన' అనుదానితో నన్వయము.

వ. పరమభక్తియుక్తి నావర్జిత హృదయుండనై సకల భువన భవనా
వతార కారణుండైన పరమేశ్వరునవతారం బగుటయుం దదం
శావతారంబుగా వ్యావర్ణించి నా చెప్పం బూనిన దివ్యకథా సూత్రం
బెట్టి దనిన. 67

అర్థము: పరమ - భక్తి - యుక్తిన్ = ఉత్కృష్టమైన భక్తితోఁగూడుట చేత, ఆవర్జిత - హృదయుండను + ఐ = వశీకృతమైన హృదయము గలవాఁడనై, సకల - భువన - భవన + అవతార - కారణుండు + ఐన = ఎల్ల లోకములనెడి భవనముల యొక్క ఆవిర్భావమునకు హేతు వయిన, పరమేశ్వరు + అవతారంబు = పరమేశ్వరుని యొక్క అవతారము, అగుటయున్, తద్ + అంశ + అవతారంబుగాన్ = ఆతని అంశము యొక్క అవతారముగా, వ్యావర్ణించి = విశేషముగా వర్ణించి, నా - చెప్పఁగ + పూనిన = నేను జెప్పఁబూనిన, దివ్య - కథా - సూత్రంబు = దేవతా సంబంధమైన కథ యనెడు సూత్రము, ఎట్టిది + అనినన్ = ఎట్టి దనఁగా.

తాత్పర్యము: ఉత్కృష్టమైన భక్తితోఁగూడియుండుటచే వశీకృతమైన హృదయము గలవాఁడనై యెల్ల భువనము లనెడి భవనముల అవతారమునకుఁ గారణుఁ డైన పరమేశ్వరుని యవతారమగుటచేఁ దదంశముగా మిగుల వర్ణించి నేను జెప్పఁబూనిన దివ్యకథ యనెడి సూత్ర మెట్టి దనఁగా - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు; పరమేశ్వరు + అవతారంబు — 'షష్ఠీ సమాసమునం దుకార ఋకారముల కచ్చుపరమగునపుడు నుగాగమంబగు.' బాల. సంధి. 34. పరమేశ్వరు నవతారంబు. నా చెప్పంబూనిన - నేను జెప్పఁబూనిన — 'ధాతుజ విశేషణ భావార్థక ప్రాఙ్వ్యవహితావ్యవహిత కర్తృ పద ప్రథమకుఁ దఱచుగ యొక్క షష్ఠి యగు.' ప్రౌఢ. కారక. 15. నా యొక్క చెప్పం బూనిన. 'యొక్కకు లోపంబు బహుళంబు' - ప్రౌఢ. కారక. 16. నా చెప్పంబూనిన.

కథారంభము

మహాస్రగ్ధర

సతి జన్మంబున్, గణాధీశ్వరు జననము, దక్షక్రతు ధ్వంసముం, బా
ర్వతి జన్మంబున్, భవోగ్రవ్రతచరితయు, దేవద్విషత్క్షోభమున్, శ్రీ
సుత సంహారమ్ము, క్ష్మాభృత్సుత తపము, సుమాసుందరోద్వాహమున్, ద
ద్రతిభోగంబుం, గుమారోదయము, నతఁ డరిం దారకుం బోర[1] గెల్వన్. 68

1. వా. గెల్చెన్, గెల్వన్.

అర్థము : సతి - జన్మంబున్ = సతీదేవి పుట్టుకయును, గణ + అధి + ఈశ్వరు - జననమున్ = గణపతి యొక్క పుట్టుకయును, దక్ష-క్రతు-ధ్వంసమున్= దక్షుని యొక్క, యజ్ఞము యొక్క, నాశనమును, పార్వతి - జన్మంబున్ = పార్వతి యొక్క పుట్టుకయును, భవ + ఉగ్ర - వ్రత - చరితయున్ = ఈశ్వరుని యొక్క, భయంకరమైన, తపస్సు యొక్క, వృత్తాంతమును, దేవ - ద్విషత్ - క్షోభమున్ = దేవతల శత్రువైన తారకుని వలని, బాధయును, శ్రీ - సుత - సంహారమ్మున్ = లక్ష్మి కొడుకైన మన్మథుని వధయును, భూభృత్ + సుత - తపమున్ = కొండ కూఁతురైన పార్వతి యొక్క తపస్సును, ఉమా - సుందర + ఉద్వాహమున్ = పార్వతి యొక్క, మనోహరమైన, పెండ్లియును, తద్ + రతి - భోగంబున్ = పార్వతీశ్వరుల యొక్క సంభోగ సౌఖ్యమును, కుమార + ఉదయమున్ = కుమారస్వామి జననమును, అతఁడు = కుమారస్వామి, అరిన్ = శత్రువును, తారకున్ = తారకుని, పోరన్ = యుద్ధమునందు, గెల్వన్ = గెలుచుటయును.

తాత్పర్యము : సతీదేవి పుట్టుకయును, విఘ్నేశ్వరుని పుట్టుకయును, దక్షుని యజ్ఞనాశనమును, పార్వతి పుట్టుకయును, ఈశ్వరుని ఘోర తపస్సును, దేవతల శత్రువగు తారకాసురుని వలని యుపద్రవమును, మన్మథ సంహారమును, పార్వతి తపమును, పార్వతి కనువిందైన పెండ్లియును, పార్వతీశ్వరుల సంభోగ సౌఖ్యమును, కుమార జననమును, అతఁడు యుద్ధమునఁ దారకాసురుని గెల్చుటయు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : గెల్వ - గెలుచు ధాతు కృదంతరూపము. మహాస్రగ్ధర - నాలుగు పాదము లుండును. ప్రతిపాదమునను స త త న స ర ర గ అను గణము లుండును. మొదటి యక్షరమునకును, దొమ్మిదవ యక్షరమునకును, బదునాఱవ యక్షరమునకును యతిమైత్రి, ప్రాసనియమము గలదు.

వ. అనం బరగు సకలావయవములం బరిపూర్ణంబైన దివ్య కావ్యాంగనా సృష్టికిం బ్రధాన సృష్టికర్తయైన. 69

అర్థము : అనన్ = అనఁగా, పరగు = ఒప్పునట్టి, సకల + అవయవ ములన్ = ఎల్ల అంగములచేతను, పరిపూర్ణంబు = నిండినది, ఐన, దివ్య-కావ్య+

అంగనా - సృష్టికిన్ = దివ్యమైన కావ్యమనెడి స్త్రీ యొక్క సృష్టికి, ప్రధాన-సృష్టి-కర్త + ఐన = ముఖ్యమగు సృష్టికర్తయైన.

తాత్పర్యము: అనఁగా నొప్పునట్టి యెల్ల యంగములతోను నిండిన దివ్య కావ్యమనెడి స్త్రీ సృష్టికిఁ బ్రధానసృష్టికర్తయైన - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. విధి నియమంబున విశ్వంబు సృజియింప
దక్ష ప్రజాపతిఁ దలఁచి మఱియుఁ
బ్రకృతి స్వరూపమై పరగు మహామాయఁ
ద్రైలోక్యమాత నాధారశక్తి
భావించి సద్విధి నావహించుడు రూప
లావణ్య గుణ హావ భావకాంతి
సుందరాకార విస్ఫురణతోఁ బ్రత్యక్ష
మై "యేమి వలతు నీ వడుగు" మనిన,

ఆ. "నాకుఁ బుత్త్రివై పినాకికిఁ బత్నివై
మిథునచరితఁ దగిలి మీరు లోక
జననములకు బీజశక్తులై యుండంగ
వరముఁ గరుణ నొసఁగవలయు దేవి!" 70

అర్థము: విధి = బ్రహ్మ, నియమంబునన్=నియమముతో, విశ్వంబున్ = విశ్వమును, సృజియింపన్ = సృష్టించుటకు, దక్ష - ప్రజాపతిన్ = దక్షుఁడను ప్రజాపతిని, తలఁచి, మఱియున్,

ప్రకృతి - స్వరూపము + ఐ = ప్రకృతి యొక్క ఆకారమయి, పరగు = ఒప్పునట్టి, మహత్ (మహా) - మాయన్ = మహామాయను, త్రైలోక్య -మాతన్ = ముల్లోకములకుఁ దల్లియైనదానిని, ఆధారశక్తిన్ = ఆధార శక్తిని, భావించి, సత్ + విధిన్ = మంచి నిష్ఠతో, ఆవహించుడున్ = ఆవాహనము చేసినంతనే,

రూప - లావణ్య - గుణ - హావ - భావ - కాంతి - సుందర + ఆకార - విస్ఫురణతోన్ = సౌందర్యము, కాంతివిశేషము, సుగుణములు, మనోవికారము, భావము, కాంతి, అందమైన రూపము అనువాని ప్రకాశముతో, ప్రత్యక్షము + ఐ = ఎదురఁ దోఁచిన దయి, నీవు, ఏమి, వలతు (వు)=కోరుదువు, అడుగుము+అనినన్,

దేవి = దేవీ! నాకున్, పుత్రివి + ఐ = కూఁతురవయి, పినాకికిన్ = పినాక మనెడి ఆయుధము గలవానికి - శివునకు, పత్నివి + ఐ=భార్యవయి, మీరు, మిథున - చరితన్ - రతిక్రీడ యందు, తగిలి=ఆసక్తి గలిగి, లోక-జననములకున్= లోకముల పుట్టుకలకు, బీజ - శక్తులు + ఐ = బీజము, శక్తి అయి, ఉండంగన్, కరుణన్ = దయతో, వరమున్, ఒసఁగవలయుఁ = ఈవలయును.

తాత్పర్యము : బ్రహ్మ నియమముతో విశ్వమును సృజింప దక్ష ప్రజాపతిని దలఁచెను. అంత నతఁడు ప్రకృతియై యొప్పునట్టియు, మహామాయయైనట్టియు, ముల్లోకములకుఁ దల్లియు నైన ఆధారశక్తిని భావించి మంచి నిష్ఠతో నావాహనము చేసెను. వెంటనే ఆమె సుందరాకారముతోను, కాంతి విశేషముతోను, హావభావముల తోను గూడినదయి యెదురఁ బ్రత్యక్షమై 'నీ కేమి కావలయునో కోరుకొ'మ్మనెను. అందుల కతఁడు 'దేవీ! నీవు నాకుఁ గూఁతురవై, శివునకు భార్యవయి, మీరు రతి క్రీడలఁదగిలి లోకముల యుద్భవములకు బీజ శక్తులయి యుండునట్లు దయతో నాకు వరము నీవలయును.'

వ. అని యమ్మహాదేవివలన లబ్ధవరప్రసాదుఁడై యనేక విధ జప ధ్యాన సంస్తోత్రాదులం బరమేశ్వరుఁ బ్రత్యక్షంబు సేసి 71

అర్థము : అని, ఆ + మహత్ (మహా) - దేవి వలనన్ = ఆ మహాదేవి వలన, లబ్ధ - వర - ప్రసాదుఁడు + ఐ = పొందఁబడిన వరము యొక్క అను గ్రహము గలవాఁడయి - వరము పొందిన వాఁడయి, అనేక - విధ - జప - ధ్యాన - సంస్తోత్ర + ఆదులన్=పెక్కురీతులైన జపములు, ధ్యానము, సంస్తుతులు మున్నగు వానిచేత, పరమేశ్వరున్, ప్రత్యక్షంబు + చేసి = ప్రత్యక్షముచేసికొని.

తాత్పర్యము : అని యా మహాదేవివలన వరమును బొంది పెక్కురీతులైన జపములు, ధ్యానము, సంస్తుతులు అనువానిచేఁ బరమేశ్వరుని బ్రత్యక్షము చేసికొని - తరువాతి పద్యముతో నన్వయము

శా. "దేవాధీశ ! సమస్తముం బడయ నుద్దేశించి మున్ భక్తి నీ
దేవిన్ సర్వపదార్థమూర్తి నిఖిలస్త్రీరత్నమున్ నీకు నే
నావాహించితి; మీరు సన్మిథున చర్యాసక్తి మైకొన్న నా
కీ విశ్వోదయ కార్యసిద్ధి యగు వాణీంద్రామరేంద్రార్చితా! 72

అర్థము: దేవ + అధి + ఈశ = దేవాధినాథా ! వాణీ+ఇంద్ర+అమర + ఇంద్ర + అర్చితా = వాణీభర్తయగు బ్రహ్మచేతను, దేవేంద్రునిచేతను బూజింపఁబడువాఁడా ! సమస్తమున్ = అంతను, పడయన్ = పొందుటకు, ఉద్దేశించి = తలఁచి, మున్ = ముందుగా, భక్తిన్ = భక్తితో, ఈ - దేవిన్, సర్వ - పదార్థ-మూర్తిన్ = ఎల్ల పదార్థముల రూపమైన దానిని, నిఖిల - స్త్రీ - రత్నమున్ = ఎల్లస్త్రీలలో మణి వంటి దానిని, నీకున్, నేను, ఆవాహించితిన్ = ఆవాహనము చేసితిని, మీరు, సత్ + మిథున - చర్యా + ఆసక్తిన్ = దాంపత్య క్రీడ యందలి కోరికను, మైకొన్నన్ = సమ్మతించుచో, నాకున్, ఈ, విశ్వ + ఉదయ - కార్య సిద్ధి = లోకసృష్టి యను కార్యము నెఱవేఱుట, అగున్.

తాత్పర్యము: 'బ్రహ్మేంద్రులచేఁ బూజింపఁబడు నోదేవాధినాథా ! అన్నిటినిఁ బొందఁగోరి నేను ముందుగా భక్తితో నీ దేవిని సర్వ వస్తు స్వరూపిణియైన దానిని నిఖిల స్త్రీలలో శ్రేష్ఠురాలిని నీ కావాహనము చేసితిని. మీరు దంపతులై రతిక్రీడ నంగీకరించుచో నా కీ విశ్వసృష్టికార్యము ఫలించును.'

ఈ పద్యమున నున్నట్లే మొదటి పద్యమునఁగూడ 'శ్రీ వాణీంద్రామరేంద్రార్చిత ....' అనునదియే సరియైన పాఠముగాని, 'శ్రీవాణీంద్రామరేంద్రార్పిత....' అనునది సుష్ఠు పాఠముగాదని శ్రీనిడుదవోలు వేంకటరావుగారి యభిప్రాయము. చూ. వావిళ్ల ప్రతి - శ్రీ నిడుదవోలు వారి పీఠిక.

వ. అనినం బరమేశ్వరుండు సద్భక్తి యుక్తి కనురక్తుఁడై సతీ
రత్నంబగు సతిం బరిగ్రహించి తనకుం జతుర్విధ భూతగ్రామ
సృష్టికర్తగా వరంబిచ్చిన 'మహాప్రసాదం'బని. 73

అర్థము: అనినన్ = అని దక్షుఁ డనఁగనే, పరమేశ్వరుండు, (అతని), సత్ + భక్తి - యుక్తికిన్ = మంచి భక్తి కలిమికి, ప్రీతుఁడై, సతీ-రత్నంబు+అగు

సతిన్ = స్త్రీలలో శ్రేష్ఠురాలయిన సతీదేవిని, పరిగ్రహించి=స్వీకరించి, తనకున్= దక్షునకు, చతుర్విధ - భూత - గ్రామ - సృష్టి - కర్తగాన్ = జరాయుజ, అండజ, స్వేదజ, ఉద్భిజములనెడి నాలుగు విధములైన, ప్రాణుల సమూహముయొక్క సృష్టికిఁ, గర్త యగునట్లు, వరంబు, ఇచ్చినన్, మహాప్రసాదంబు, అని.

తాత్పర్యము: అని దక్షుఁడు కోరఁగనే పరమేశ్వరుఁడు వాని సద్భక్తికి సంతోషించి, స్త్రీరత్నమగు సతీదేవిని భార్యనుగా స్వీకరించి, యతనికి నాలుగు రీతులైన ప్రాణికోటిని సృష్టి చేయ వరమిచ్చెను. అతఁడు మహాప్రసాదమని, తరువాతి పద్యముతో నన్వయము.

సీ. దక్షుండు తత్క్రియా దక్షత జగములఁ
ప్రకటింపఁదలఁచి యేఁబంద్ర సుతలఁ
బడసి వారలలోనఁ బదుమువ్వు రువిదల
గారవంబున నిచ్చెఁ గశ్యపునకు;
జీవితేశ్వరునకు జీవితైశ్వర్యలు
నాఁ బదుంద్రను బరిణయము సేసె;
నెలమిత్తో మఱి యిర్వదేడ్గుర సుదతుల
సురుచిరంబుగ సుధాసూతి కిచ్చె;

తే. వరుస నిట్లు దగిన వరులకుఁ గూఁతుల
నిచ్చి సతియుఁదాను నిచ్చ మెచ్చి
తన్నుఁగన్న యా విధాతకంటెను దాన
శేషఁ గాంచె నఖిల సృష్టిలోన. 74

అర్థము: దక్షుండు, తద్ + క్రియా - దక్షతన్ = సృష్టికార్యమునందలి సామర్థ్యమును, జగములన్ = లోకములందు, ప్రకటింపన్ + తలఁచి=తెలుపనెంచి, ఏఁబంద్ర - సుతలన్ = ఏఁబదిమంది కూఁతులను, పడసి=పొంది, వారలలోనన్, పదుమువ్వురు + ఉవిదలన్=పదుమూవురు స్త్రీలను, కశ్యపునకున్, గారవంబునన్= ప్రీతితో, ఇచ్చెన్.

జీవిత + ఈశ్వరులనఁగన్ = యమునకు, జీవిత + ఐశ్వర్యులు + నాన్ = ప్రాణేశ్వరులనఁగా, పదుంద్రను = పదిమందిని, పరిణయము + చేసెన్ = పెండ్లి చేసెను.

ఎలమితోన్ = ప్రీతితో, మఱి - ఇర్వది + ఏడ్గుర - సుదతులన్ = తక్కిన యిరువదియేడుగురు స్త్రీలను, సురుచిరంబుగన్ = బాగుగా, సుధా - సూతికిన్ = చంద్రునకు, ఇచ్చెన్.

ఇట్లు, వరుసన్ = క్రమముగా, తగిన - వరులకున్, ఇచ్చి, సతియున్ + తానున్ = భార్యయును దానును, ఇచ్చన్ = మనసునందు మెచ్చి, తన్నున్, కన్న, ఆ - విధాత కంటెను = ఆ బ్రహ్మకంటెను, తాను + అ = తానే, అఖిల-సృష్టిలోనన్ = సర్వసృష్టిలోను, శేషన్ = ఉత్కర్షమును, కాంచెన్ = పొందెను.

తాత్పర్యము: దక్షుఁడు సృష్టికార్య సామర్థ్యమును లోకములకుఁ దెలుపఁ గోరి మేఁబదిమంది కూఁతులను బొంది, వారిలోఁ బదుమువ్వురను గశ్యపునకుఁ బ్రీతితో నిచ్చెను. యమునకుఁ బదిమందిని జీవితేశ్వరులనుగా నొసంగెను. తక్కిన యిరువదియేడుగురు పుత్రికలను జంద్రునకిచ్చి పెండ్లిచేసెను. ఇట్లు క్రమముగాఁ దగిన వరులకుఁ గూఁతుల నిచ్చి, భార్యయును దానును మనసునందు సంతసించి, తన్నుఁగన్న యా బ్రహ్మకంటెను ఎల్లసృష్టిలోను తానే వైశిష్ట్యమును గాంచెను.

విశేషములు: సతియుఁ దాను .... శేషఁగాంచె - 'ఆత్మార్థం బభిహితం బగుచోఁ బల్లింగ సంఖ్యాభిధాయి వచనంబు ధాతు విశేషణంబుల కగు.' బాల. క్రియా. 120. సుదతి - 'సు' శబ్దమునకుఁ బరమైన 'దంత' శబ్దమునకు బహువ్రీహి యందు 'దత్' ఆదేశమగును. సుదత్ - దీని స్త్రీలింగరూపము సుదతీ. శోభనాః దన్తాః యస్యాః సా - సుదతీ. మంచి దంతములు గల స్త్రీ - శేష - ఉత్కర్షము - సూ.వి.

సతీ పరమేశ్వరుల విహారము

వ. అంతట నప్పరమేశ్వరుండు దాక్షాయణీ మనోహరాకార నవయౌవన భావ హావ విలాస విభ్రమ సౌందర్యగుణంబుల కంతకంత కనురక్తుండై. 75

అర్థము: అంతటన్ = పిమ్మట, ఆ + పరమేశ్వరుండు, దాక్షాయణీ=దక్షుని కూఁతురైన సతీదేవియొక్క, మనోహర + ఆకార - నవ - యౌవన - భావ - హావ - విలాస - విభ్రమ - సౌందర్య - గుణంబులకున్ = సుందరమైన రూపము, క్రొత్తజవ్వనము, భావములు, మనోవికారములు, విలాసము, విభ్రమము, సౌందర్యము, గుణములు అను వానికి, అంతకున్ + అంతకున్ = క్రమ క్రమముగా, అనురక్తుండు + ఐ = అనురాగము గలవాఁడయి.

తాత్పర్యము: అంత నా పరమేశ్వరుఁడు సతీదేవి మనోహరాకారము, నవయౌవనము, భావహావములు, విలాస విభ్రమములు అనువానిచేఁ గ్రమక్రమముగా నామెయం దనురాగముగలవాఁడయి - తరువాతి పద్యముతో నన్వయము.

క. మాటలఁ జెయ్వుల బేటం
బేటముగా నలవరించె నెసఁగఁగ సతి లా
లాట తట నయనుఁ డింపగు
కూటముల కపూర్వ సురత గుణ కోవిదుఁడై. 76

అర్థము: లాలాట - తట - నయనుఁడు = లలాటతటమునందుఁ గన్ను గలవాఁడు - శివుఁడు, అపూర్వ - సురత-గుణ-కోవిదుఁడు + ఐ = అపురూపమునైన, రతిక్రీడలందు నేర్పుగలవాఁడయి, సతిన్ = సతీదేవిని, మాటలన్ = మాటలతోను, చెయ్వులన్ = చేఁతలతోను, బేటంబేటముగాన్ = అత్యంతానురాగముతో, ఇంపు + అగు = మనోహరములైన, కూటములకున్ = సంగమములకు, ఎసఁగఁగన్ = అతిశయముగా, అలవరించెన్ = అలవడఁజేసెను.

తాత్పర్యము: ఫాలాక్షుఁడగు శివుఁడు అబ్బురమైన రతిక్రీడలయందు నేర్పరియై మాటలతోను, చేఁతలతోను అత్యంతానురాగముగునట్లు మనోహరములైన సంగమములకు సతీదేవిని అతిశయముగా నలవడఁజేసెను.

వ. ఇట్లియ్యిరువురు నన్యోన్యానురాగాతిరేకంబునం గామ కేళీ లాలసు లగుచు. 77

అర్థము : ఇట్లు, ఆ+ఇరువురున్=ఆ సతీపరమేశ్వరులిద్దఱును, అన్యోన్య+అనురాగ+అతిరేకంబునన్ = పరస్పర ప్రేమ విజృంభణముచే, కామ-కేళీ-లాలసులు = రతిక్రీడయందాసక్తి గలవారు, అగుచున్.

తాత్పర్యము : ఈ విధముగా నా యిరువురును బరస్పర ప్రేమాతిశయముచే మన్మథక్రీడయందాసక్తిగలవారగుచు - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. కలహంస కలరవాకలిత నిర్ఝరముల,
సారసారావాబ్జ షండములను,
రోలంబ రుతి లతాందోలంబులను, శుక
మంజుల స్వన పుష్ప మండపములఁ,
గలకంఠ రణిత మాకంద వనములఁ, బా
రావత ధ్వని మందిర స్థలములఁ,
గేకి కల ధ్వాన గిరి కందరంబుల,
లావుక నినద లీలాతలముల,

తే. నప్పటప్పటి కనురాగ మగ్గలింపఁ,
గామరస మంతకంతకుఁ గడలుకొనఁగ,
నలి రమించిరి కైలాసనగముమీఁదఁ
బరమ సుఖలీల నా జగత్పతియు సతియు. 78

అర్థము : ఆ - జగత్ + పతియున్, సతియున్ = లోకేశుఁడైన ఆ శివుఁడును, సతీదేవియును,

కలహంస - కల - రవ + ఆకలిత - నిర్ఝరములన్=రాయంచల అవ్యక్త మధురధ్వనులతోఁ గూడిన సెలయేఱులందును, సారస+ఆరావ+అబ్జ-షండములను= బెగ్గురుపక్షుల ధ్వనులు గల తామరపూల సమూహములందును,

రోలంబ - రుతి - లతా + ఆందోలంబులను=తుమ్మెదలయొక్క, ధ్వనుల తోడి, తీఁగల ఊయెలలందును, శుక - మంజుల - స్వన - పుష్ప-మండపములన్= చిలుకల, మనోహరములైన, ధ్వనులతోడి, పూలమండపములందును,

కలకంఠ - రణిత - మాకంద - వనములన్ = కోకిలల కూఁతలతోడి మామిడి తోఁటలందును, పారావత - ధ్వని - మందిర-స్థలములన్ = పావురముల, కూఁతల తోడి, మందిర స్థలములందును,

కేకి - కల - ధ్వాన - గిరి - కందరంబులన్ = నెమిళ్లయొక్క, అవ్యక్త మధురములైన ధ్వనులతోడి, కొండగుహలందును, లావుక-నినద-లీలా-తలములన్ = పూరేడు పిట్టల ధ్వనులతోడి విలాస ప్రదేశములందును,

అప్పటప్పటికిన్ = నానాఁటికి, అనురాగము = ప్రేమము, అగ్గలింపన్ = అతిశయింపఁగా, అంతకంతకున్ = క్రమక్రమముగా, కామ - రసము = శృంగార రసము, కడలుకొనఁగన్ = అతిశయింపఁగా, పరమ - సుఖ - లీలన్ = అత్యధిక మైన సౌఖ్యముగల విలాసముతో, కైలాస - నగము - మీఁదన్ = కైలాస పర్వతముపై, నలిన్ = ఉత్సాహముతో, రమించిరి = సంభోగించిరి.

తాత్పర్యము : ఆ జగదీశ్వరుఁడును సతీదేవియును రాయంచల అవ్యక్త మధుర ధ్వనులతోఁగూడిన సెలయేఱులందును, బెగురుపక్షుల ధ్వనులు గల తామరతోఁపు లందును, తుమ్మెదల ఝంకారములతోడి ఆవెయూయలలందును, చిలుకల మనోహర ధ్వనులతోడి పూలమంటపములందును, కోకిలల కూఁతలతోడి మామిడితోఁటలందును, పావురముల ధ్వనులుగల మందిరములందును, నెమళ్ల కూఁతలతోడి కొండగుహలందును, పూరెడుపిట్టల కూఁతలతోడి విలాస ప్రదేశములందును నానాఁటికి అనురాగ మతి శయింపఁగా, శృంగార రసము క్రమక్రమముగా నధికము కాఁగా కైలాసపర్వతముపై మిక్కిలి సుఖము గలుగునట్లు ఉత్సాహముతో సంభోగించిరి.

విశేషములు: అప్పటప్పటికిన్-అప్పటికిన్ + అప్పటికిన్- 'ఆమ్రేడితంబు పరంబగునపుడు విభక్తిలోపంబు బహుళంబుగా నగు'. బాల. సంధి. 41,- అప్పటి + అప్పటికిన్ - 'అచ్చున కామ్రేడితంబు పరంబగునపుడు సంధి యగుచుగ నగు,' బాల. సంధి. 10, అప్పటప్పటికిన్ - (రూపాం.) అప్పటి కప్పటికిన్, రోలంబః - 'ఇన్దిన్దిర శ్చఞ్చరీకో రోలమ్బో బమ్భరశ్చ సః' - రౌతీతి రోలమ్బః - మ్రోయునది-తుమ్మెద - అమరము, పారావత - 'పారావతః కలరవః కపోతః' - పారేణ బలేన అవతతి పారావతః - బలముతోఁ బోవునది, పావురము. అమరము, కేకి - 'శిఖావల శ్శిఖీ కేకీ మేఘనాదానులాస్యపి.' కేకారవోఽస్యాస్తీతి - కేకారవము గలది - నెమలి, అమరము,

క. ఈ విధమున శివశక్తులు
భావజ కేళీ విలోల భావంబుల నా
పోవక విహరించిరి నా
నా విధములఁ దగిలి రజత నగ పార్శ్వములన్. 79

అన్వయము : ఈ - విధమునన్ = ఈ రీతిగా, శివ - శక్తులు = శివుఁడును శక్తియును, భావజ - కేళీ - విలోల - భావంబులన్ = మన్మథక్రీడలచే, మిక్కిలి చలించు, మనస్సులతో, నానా - విధములన్ = పెక్కురీతుల, తగిలి = ఆసక్తి వహించి, రజత - నగ-పార్శ్వములన్ = వెండికొండ (కైలాసము) యొక్క దరులందు, ఆపోవక = తృప్తిఁ జెందక, విహరించిరి = క్రీడించిరి.

తాత్పర్యము : శివుఁడును - సతియును ఈ విధముగా మన్మథక్రీడలచే మిక్కిలి చలించు మనస్సులతో ననేకవిధముల నాసక్తి వహించి కైలాసపర్వత దరులందుఁ దనివిసనక క్రీడించిరి.

వ. తదనంతరంబున. 80

తాత్పర్యము : తద్ + అనంతరంబునన్ = ఆ తరువాత-తరువాతి పద్యముతో నన్వయము.

సీ. అనురక్తి గడికొల్పు గొని మేయు సల్లకీ
కబళన కాషాయ గంధములును,
సల్లకీ పల్లవ సౌరభ్యమున కను
బలమైన మదగంధ పరిమళంబు,
మద గంధమునకుఁ దుమ్మెదపిండు సూరెల
బలసి ఘూర్ణిల్లు పే రులివు పెల్లు,
వలిగితి చెవిపెట్టి యాలించి విని సోలి
పరవశులై యుండు భద్రకరులు,

తే. భద్రకరులైన యూథాధిపతులు గావఁ
గలిసి సుఖలీల విహరించు కలభ కరిణి
గజ గణంబులఁ బొలుపొందు గజవన ప్ర
భాతిఁ గని మెచ్చు[1]తో జగత్పతియు సతియు. 81

అర్థము ; అనురక్తిన్ = అనురాగముతో - ప్రీతితో, గడికొమ్మ = చేరువనున్న చెట్టు కొమ్మను, కొని = పట్టుకొని, మేయు, సల్లకీ - కబళన - కాషాయ- గండములును = అందుగుయొక్క, మ్రింగుటచే, కషాయ (ఎఱుపు) వర్ణముగల గండ స్థలములును (చెక్కిళ్లను)

సల్లకీ - పల్లవ - సౌరభ్యమునకున్ = అందుగుఁజిగురులయొక్క, పరిమళ మునకు, అనుబలము + ఐన = తోడయిన, మద - గంధ-పరిమళంబున్= మదజల సంబంధమైన వాసనయు,

మద-గంధమునకున్ = మదము (జలము) యొక్క వాసనకు, తుమ్మెద - పిండు - తుమ్మెదల గుంపు, సూరెలన్ = పార్శ్వములందు, బలసి = చుట్టి, ఘూర్ణిల్లు = మ్రోయు, పేరు+ఉలివు - పెల్లున్=పెద్ద ధ్వని యొక్క ఆధిక్యమును,

అలి- గీతి = తుమ్మెదల గానము , చెవి - పెట్టి = చెవియొగ్గి, ఆలించి - విని = శ్రద్ధగా విని, సోలి = ఒరగి, పరవశులు + ఐ = ఒడలు తెలియనివై, ఉండు, భద్రకరులు = భద్రజాతి గజములు,

భద్రకరులు + ఐన = భద్రగజములగు, యూథ + అధిపతులు + ఏనుఁగుల గుంపునకు నాయకులు, కావన్ = కాచుచుండఁగా, కలిసి, సుఖలీలన్ = సౌఖ్యముతో, విహరించు = క్రీడించు, కలభ - కరిణి - గజ - గణంబులన్ = గున్నలైన ఆఁడేనుఁగులయు, (మగ) ఏనుఁగులయు, సమూహములతో, పొలుపు + ఒందు = ఒప్పునట్టి గజ - వన - ప్రభాతిన్ = ఏనుఁగుల అడవి యొక్క గొప్ప కాంతిని, కని = చూచి, జగత్ + పతియున్, సతియున్ = లోకేశ్వరుఁడైన శివుఁడును, సతి దేవియు, మెచ్చుతోన్ = ప్రశంసతో.

తాత్పర్యము ; ప్రీతితోఁ జేరువనున్న కొమ్మను బట్టుకొని మేయు అందుగు (చిగురుల) ను దినుటవలన నెఱ్ఱనైన చెక్కిళ్లను, అందుగుఁజివురుల పరిమళమునకుఁ

1. వా. తా.

గొప్పయైన మదజలసంబంధి పరిమళమును, మదజల పరిమళమునకుఁ దుమ్మెదల గుంపులు క్రిక్కిఱిసి చేయు రొద ఆధిక్యమును, తుమ్మెదల నాదమునకుఁ జెవి యొగ్గి విని విని ప్రాంతి పారవశ్యమునుఁ జెందు భద్రజాతి గజములును, భద్రజాతి గజముల యూథపతుల నాయకులుగాఁ గలిపి సుఖముతో విహరించు గున్నలైన ఆఁడేనుఁగులయు మగయేనుఁగులయు సమూహములతో నొప్పు నేనుఁగులయడవి కాంతిని జూచి జగత్పతియైన శివుఁడును, సతీదేవియు మెచ్చుతో - తరువాతి వచనముతో నన్వయము.

విశేషములు: 'గండములను' అను వా. ప్రతి పాఠము కంటె 'గండములును' అను సా. ప్రతి పాఠమే మే లనిపించినది. మదగంధ పరిమళంబు - ఇందుఁ బునరుక్తి లేకుండ గంధశబ్దమునకు సంబంధమను నర్థము చెప్పఁబడినది. ఆలించి, విని-రెండును సమానార్థకములు. అందుచే 'శ్రద్ధగావిని' యని యర్థముచెప్పఁబడినది. భద్రకరులైన యూథాధిపతులుగావ- కాఁగ అనుచో అన్వయము తృప్తిగాలేదు. కావున 'కావ' అను పాఠము స్వీకరింపఁబడినది. 'మెచ్చుతో జగత్పతియు సతియు' అను సా. ప్రతిపాఠము స్వీకరింపఁబడినది. 'మెచ్చుతా జగత్పతియు సతియు' అను వా. ప్రతిపాఠము 'మెచ్చుఁదా జగత్పతియు సతియు' అని యుండవలయును. మార్పు లెక్కువగాఁ జేయుటకు బదులు 'మెచ్చుతో' అనుపాఠమే సరియైనదని తోఁచినది, పరవశులై యుండు భద్రకరులు-ఇట కరులయందు మహత్త్వారోపము చేయఁబడినది. లేనిచో పరవశములై అని యుండ వలయును.

వ. తద్విశేషంబు లాలోకించుచున్నంత. 82

అర్థము: తద్ + విశేషంబులు = ఆ గజవనమునందలి విశేషములు, ఆలోకించుచున్ + ఉన్న + అంతన్ = చూచుచుండఁగాఁ దరువాత.

తాత్పర్యము: ఆ గజవనమునందలి విశేషములు చూచుచుండఁగా, నంత - తరువాతి పద్యముతో నన్వయము.

క. జంగమ కుత్కీలంబు ల
నంగ, మహీతల ఘనాఘనంబులు నా, ను
త్తుంగ తను నీలరుచి మా
తంగము లభిరామ మయ్యెఁ దద్వనభూమిన్. 83

అర్థము : తద్ + వన - భూమిన్ = ఆ యడవియందు, మాతంగములు = ఏనుఁగులు, జంగమ - కుత్కీలంబులు = నడగొండలు, అనంగన్, మహీతల - ఘనా - ఘనంబులు = భూమియందలి వర్షాకాలపు మేఘములు, నాన్ = అనఁగా, ఉత్తుంగ - తను = మిక్కిలి యెత్తైన శరీరముతోను, నీల - రుచిన్ = నల్లని కాంతితోను, అభిరామము + అయ్యెన్ = మనోహర మయ్యెను.

తాత్పర్యము : ఆ యేనుఁగుల యడవిలో నేనుఁగులు చలించుకొండ లను నట్లును. భూమియందుండు వర్షాకాలపు మేఘములో అనునట్లును, ఎత్తయిన శరీరము చేతను, నల్లని కాంతిచేతను మనోహరముగా నుండెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష. గజముల యుత్తుంగ తనుత్వముచేతఁ గుత్కీలములతోఁ బోలిక. వాని నీలరుచిచేత ఘనాఘనములకుఁ బోలిక.

మాతంగము లభిరామ మయ్యె. 'స్త్రీ సమంబులగు విశేషణంబులయు మువర్ణ కాంత విశేషణంబులయు బహువచనంబున కేకవచనంబు బహుళంబుగా నగు.' బాల, కారక 20. మాతంగ - 'సిన్ధుర స్సామజః కుమ్భీ మాతఙ్గశ్చ మదావళః' మతఙ్గా దృషే ర్జాతో మతఙ్గజః - మతంగుఁ డను ఋషివలనఁ బుట్టినది-ఏనుఁగు- అమరము.

గీ. ఉగ్రభాను కరాహతి కోడి పాఱి
వచ్చి తరు వన దుర్గంబు సొచ్చియున్న
తిమిర పటలంబు నాఁ గాననమునఁ గలయ
నిండి ఘూర్ణిల్లుచుండె వేదండ ఘటలు. 84

అర్థము : ఉగ్ర - భాను - కర + ఆహతికిన్ = తీక్ష్ణమైన. సూర్యుని యొక్క, కిరణములయొక్క దెబ్బకు, ఓడి = జంకి, పాఱి - వచ్చి = పరువిడి వచ్చి, తరు - వన - దుర్గంబు = చెట్లతోడి యడవి యనెడి దుర్గమును, చొచ్చి + ఉన్న = ప్రవేశించి యున్న, తిమిర - పటలంబు - నాన్ = చీఁకటుల గుంపు అనఁగా, వేదండ - ఘటలు = ఏనుఁగుల గుంపులు, కాననమునన్ = అడవియందు, కలయన్ + నిండి = అంతటను నిండి, ఘూర్ణిల్లుచున్ + ఉండెన్ = ఘీంకరించుచుండెను.

తాత్పర్యము : సూర్యుని తీక్ష్ణ కిరణముల దెబ్బకు జంకి పారిపోయి వచ్చి యడవి యను మృగ్గసమును బ్రవేశించిన చీఁకట్ల గుంపో యనునట్లు అడవిలో నేనుఁగుల గుంపులు అంతట నిండి ఘీంకరించుచుండెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష - వేదండ - వేద + అండ - ఇది శకంధ్వాది గణములోనిది, పరరూపసంధి జరిగినది, సవర్ణదీర్ఘసంధి కాదు. ఏనుఁగు సామవేదమునుండి పుట్టినది కావున సామజము - వేదండము అనఁబడుచున్నది,

వ. అందె మంద్ర మృగ భద్రజాతి గిరిచర నదీచరోభయచర దేవా సురాంశ కలభ రేణు ధేను వామన[1] భిక్ష పోతి కాది వన్యగజయూథంబు లందు. 85

అర్థము : అందున్ + అ = అందే, మంద్ర - మృగ - భద్రజాతి - గిరిచర - నదీచర - ఉభయచర, దేవ + అసుర + అంశ, కలభ, రేణు-ధేను-వామన-భిక్ష - పోతిక - ఇవి యన్నియు వివిధ గజ భేదములు - ఆది = మున్నగు, వన్య-గజ - యూథంబుల + అందున్ = అడవి యేనుఁగుల గుంపులందు.

తాత్పర్యము : ఆ యడవియందే మంద్రము, మృగము, భద్రజాతి, గిరిచరములు, నదీచరములు, ఉభయచరములు, దేవాంశములు, అసురాంశములు, కలభములు, రేణువులు, ధేనువులు, వామనములు, భిక్షములు, పోతికలు మున్నగు యడవి యేనుఁగుల గుంపులందు - తరువాతి పద్యముతో నన్వయము.

శా. గండాలిన్ మదసౌరభంబునకు బింకం బెక్కఁ, గ్రోధాగ్నికిం
గొండాటంబుగ దానసంపదకు నాఘోషంబుగాఁ, దీయమా
చండాలి వ్రజ గీతరావముల కుత్సాహంబుతో నొక్క వే
దండస్వామి మదంబు సేసెఁ గరిణీధామంబు లల్లాడఁగాన్. 86

అర్థము : మద-సౌరభంబునకున్ = మదజలముయొక్క పరిమళమునకు, గండ + అలిన్ = మగతనము నిండఁగా, క్రోధ + అగ్నికిన్ = కోపమనెడి

1. ము. ప్రతి. వమన,

అగ్నికి, బింకంబు + ఎక్కన్ = బిగు వతిశయింపఁగా, దాన-సంపదకున్ = మద జలమనెడి సంపదకు, కొండాటంబుగన్ = స్తుతిగా, తీయము + దా = ప్రియ మగు, చండ + అలి-వ్రజ-గీత-రావములకున్ = మిక్కిలి చులుకుగల, తుమ్మెదల, గుంపుయొక్క, గానముయొక్క, ధ్వనులకు, ఆఘోషంబుగాన్ = ప్రకటనముగా, ఒక్క-వేదండ-స్వామి = ఒక గజరాజు, కరిణీ-ధామంబులు = ఆఁడేనుఁగుల సమూహ ములు, అహ్లాదఁగాన్ = తహతహపడఁగా, ఉత్సాహంబుతోన్, మదంబు + చేసెన్ = మదించెను.

తాత్పర్యము : మద పరిమళమునకు మగతనము ప్రకాశింపఁగా, కోపమనెడి అగ్నికి బిగు వతిశయింపఁగా, మదజల సంపదకు స్తుతిగా, ప్రియమగు తుమ్మెదలగుంపు గానధ్వనులకుఁ బ్రకటనముగా నొక గజరాజు ఆఁడేనుఁగులు తహతహపడఁగా నుత్సాహముతో మదించెను.

విశేషములు : క్రోధ + అగ్ని-క్రోధ మనెడి అగ్ని-రూపకము.

వ. మఱియు నొక్కయెడ. 87

తాత్పర్యము : మఱియు నొక చోట - తరువాతి పద్యముతో నన్వయము.

క. కరి మద గంధమునకు మధు
కరములు పిండుకొని ముసరి కటతటముల భా
సుర మయ్యె నగతటంబులఁ
బరువడి మొగు లెఱఁగి పేరఁబడిన విధమునన్. 88

అర్థము : కరి-మద-గంధమునకున్ = ఏనుఁగుయొక్క మదజల పరిమళము నకు, మధుకరములు = తుమ్మెదలు, పిండుకొని = గుమిగూడి, కట-తటములన్ = చెక్కిళ్ల ప్రదేశములందు, ముసరి = వ్యాపించి, నగ-తటంబులన్ = కొండదరులందు, పరువడిన్ = అధికముగా, మొగులు = మేఘము, ఎఱఁగి = వ్రాలి, పేరఁబడిన విధమునన్ = దట్టమైనరీతిగా, భాసురము + అయ్యెన్ = ప్రకాశించెను.

తాత్పర్యము: ఒక ఏనుఁగు మదజల పరిమళమునకుఁ దుమ్మెదలు గుమికూడి దాని చెక్కిళ్ల ప్రదేశములందు ముసరి ప్రకాశించెను-అది కొండ దరులందు మేఘము లధికముగా దట్టమయినట్లుండెను.

విశేషములు: అలంకార ముపమ. కటతటములు నగతటములవలె నున్న వనఁగా నా యేనుఁగులు కొండలవలె నున్నవని భావము. మధుకరములు నల్లగా నుండును. అందుచేతనే నల్లని మేఘములకుఁ బోలిక.

పేరుఁబడు - 'పడుజీ కొను లోకానొకచో స్వార్థంబునం దనుప్రయుక్తంబు లగు.' బాల. క్రియ. 109. మధుకరములు భాసురమయ్యె - 'స్త్రీ సమంబులగు విశేషణంబులయు మువర్ణకాంత విశేషణంబులయు బహువచనంబున నేకవచనంబు బహుళంబుగా నగు.' బాల. కారక. 20,

మ. కరిణీబృందముఁ బాసి యొక్క మదనాగం బద్రిరత్నోరు కం
దర సంక్రాంత నిజప్రభాతిఁ బ్రతివేదండంబకాఁ జూచి దు
ర్ధర రోషంబునఁ బోరుచుండె నతిమాత్సర్యంబునం దా మహే
శ్వరు శైలేంద్రముతోడ నీలగిరి వెల్పం బోరున ట్లున్నతిన్. 89

అర్థము: ఒక్క - మద-నాగంబు = ఒక మత్తేభము, కరిణీ-బృందమున్ = ఆఁడేనుఁగుల గుంపును, పాసి = విడిచి, అద్రి - రత్న + ఉరు - కందర - సంక్రాంత - నిజ - ప్రభాతిన్ = కొండయొక్క, మణి మయములైన, పెద్ద, గుహల యందుఁ, దోఁచిన, తనదైన, పోలికను - ప్రతిబింబమును, ప్రతి వేదండంబు + అ- కాన్ = మాఱు ఏనుఁగే యనఁగా. చూచి, నీలగిరి = నల్లని కొండ, తాన్ = తాను, మహేశ్వరు - శైల + ఇంద్రముతోడన్ = పరమేశ్వరుని పర్వతరాజమగు కైలాసముతో, వెల్పన్ = అధికముగా, పోరు + అట్లు = పోరాడు విధమున, ఉన్నతిన్ = ఉన్నతితో, దుర్ధర-రోషంబునన్ = దుర్భరమైన కోపముతో, అతి-మాత్సర్యంబునన్ = మిక్కిలి అసూయతో, పోరుచున్ + ఉండెన్.

తాత్పర్యము: ఒక మదగజము ఆఁడేనుఁగుల గుంపును వీడి కొండ మణిమయ గుహయందుఁ దోఁచిన తన ప్రతిబింబమును జూచి మా తేనుఁగని భ్రమించి,

నల్లనైన కొండ పరమేశ్వరుని కైలాసపర్వతముతోఁ బోరువిధమున నధికమైన యసూయతో మిక్కిలి దుర్భరమైన కోపమునఁ బోరుచుండెను.

విశేషములు: ఏనుఁగునకుఁ దన ప్రతిబింబమునందుఁ బ్రతిగజభ్రాంతిగాన నలంకారము భ్రాంతిమంతము. నీలగిరి కైలాసముతోఁ బోరునట్లు మదనాగము తన ప్రతిబింబముతోఁ బోరుచుండె ననుటచే నుపమాలంకారమును.

మ. కరపాద స్తన రోమ కూప కట సత్కర్ణాక్షి కోశాలి శీ
కర మేఘా తతసిక్య ఘర్మజల రంగద్దాన సంపూర్ణ సా
గర సీధూన్మద సన్నుతాష్టమదముల్ గ్రమ్మం దదష్టాంగ బం
ధురమై సింధుర మొప్పుచుండె నలిగీతుల్ వించు సోలంబునన్. 90

అర్థము: కర - పాద - స్తన - రోమకూప - కట-సత్ + కర్ణ + అక్షి - కోశ + అలి = తొండము, పాదములు, స్తనములు, రోమ రంధ్రములు, చెక్కిళ్లు, మంచి చెవులు, కన్నులు, వృషణములు అనువానినుండి క్రమముగా, శీకర, మేఘ, ఆతత - సిక్య - ఘర్మ - జల, రంగత్ + దాన, సంపూర్ణ-సాగర, సీధు, ఉన్మద, = శీకరము, మేఘము, అధికమైన సిక్యము, చెమట నీరు, ఒప్పుచున్న మదజలము, నిండిన సాగరము, సీధువు, ఉన్మదము అనెడి, సన్నుత + అష్ట - మదముల్ = పొగడఁబడు నెనిమిది విధములైన మదములు, క్రమ్మన్=వ్యాపింపఁగా, సింధురము= ఏనుఁగు, తద్ + అష్ట + అంగ - బంధురము + ఐ=ఆ యెనిమిది అవయవములతో నొప్పినదయి, అలి -గీతుల్ = తుమ్మెదల గీతములు, వించున్ = వినుచు, సోలంబునన్ = పారవశ్యముతో, ఒప్పుచున్ + ఉండెన్,

తాత్పర్యము: తొండము, పాదములు, స్తనములు, రోమరంధ్రములు, చెక్కిళ్లు, చెవులు, కన్నులు, వృషణములు అనువానినుండి క్రమముగా శీకరము, మేఘము, సిక్యము, ఘర్మజలము, దానము, సాగరము, సీధువు, ఉన్మదము అనెడి యెనిమిది విధములైన మదములు వ్యాపించుచుండఁగా నొకయేనుఁగు ఆ యెనిమిది అవయవములతో నొప్పుచున్నదయి తుమ్మెదల గానమును వినుచుఁ బారవశ్యముతో నొప్పుచుండెను.

విశేషములు : కరము (తొండము) నుండి శీకరము, పాదములనుండి మేఘము, స్తనములనుండి సిక్యము (శిక్యము), రోమకూపములనుండి ఘర్మజలము, కటములనుండి దానము, కర్ణములనుండి సాగరము, అక్షులనుండి (సీధువు),కోశముల నుండి ఉన్మదము అను మదములు ఏనుఁగునకు స్రవించును,

అలంకారము యథాసంఖ్యము. స్వభావోక్తి. రంగత్ + దాన = రంగద్దాన-ములనుటకు హుశ్శు పరమగుచుండఁగాఁ దృతీయ వర్ణాదేశము, సోలము = పారవశ్యము. 'పొంపు రెక్కాఁడు సేయంగ, సోల మడరి' - నిర్వ. 8. 80.

వ. తదవసరంబున ఘర్మాంశు కరాహతి కులికి తదీయాప్త బంధులైన యరవిందంబుల కలిగి దండింపం జొచ్చునట్లు వేదండంబులు కమల షండంబుల కరుగుదెంచి మహోత్సాహంబున. 91

అర్థము ; తత్ + అవసరంబునన్ = ఆ సమయమున, ఘర్మ + అంశు-కర + ఆహతికిన్ = సూర్యునియొక్క కిరణములయొక్క దెబ్బకు. ఉలికి = భయపడి, తదీయ + ఆప్త-బంధులు + ఐన = ఆతని అనుఁగుఁజుట్టములైన, అరవిందంబులకున్ = తామరలకు, అలిగి = కోపించి, తామరలపైఁ గోపించి యనుట, దండింపన్ = శిక్షించుటకు, చొచ్చు + అట్లు = పూనువిధమున, వేదండంబులు = ఏనుఁగులు, కమల-షండంబులకున్ = తామరల సమూహములకు, అరుగుదెంచి=వచ్చి, మహత్ (మహా) + ఉత్సాహంబునన్ = గొప్పఅభిలాషతో,

తాత్పర్యము : ఆ సమయమున సూర్యకిరణముల తాపమునకు భయపడి యాతని యనుఁగుఁజుట్టములైన తామరలపైఁగోపించి వానిని శిక్షింపఁబూను విధమున నేనుఁగులు తామరలకడ కరుదెంచి గొప్ప యుత్సాహముతో-తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : ఒకఁ డపకారము చేసినప్పుడు వాని నేమియుఁజేయఁజాలని స్థితిలో బాధితుఁడు అపకారిబంధువులను బాధింపఁబూనుట లోకమున నున్నదే, ఇచ్చట సరిగా నదియే జరిగినది, ఏనుఁగులకు సూర్యునివలన బాధ గలిగినది. కాని యవి సూర్యు నేమియుఁజేయఁజాలక తద్బంధువులైన తామరలపై నెత్తిపోయును,

అలంకారము ప్రత్యనీకము. 'ప్రత్యనీకం బలవతశ్శత్రోః పక్షేపరాక్రమః'- చన్ద్రా. వేదండములు కమలషండముల కరుగుదెంచుటకుఁ గారణము వానిపై నలుగుట కాకున్నను, అది కారణముగా నుత్ప్రేక్షింపఁబడినది కావున హేతూత్ప్రేక్షాలంకారము.

దండి కావ్యాదర్శమునందలి యీ క్రింది శ్లోకము ఇందలిభావమున కాకరము. 'మధ్యందినార్క సంతప్తః సరసీం గాహతే గజః, మన్యే మార్తాండగృహ్యాణి పద్మాన్యుద్ధర్తు ముద్యతః,'

గీ. కొలను వన్యేభములు చొచ్చి కలయఁ గలఁపఁ
బులువు లుండక వెలువడి పోయెఁ; బోక
తగదె? మాతంగ దూషితం బగు సరోవ
రంబు సద్ద్విజ వర్జనీయంబు గాదె?. 92

అర్థము : వన్య + ఇభములు = అడవియేనుఁగులు, కొలను = సరసు, చొచ్చి = ప్రవేశించి, కలయన్ = అంతటను, కలఁపన్ = కలఁగింపఁగా, పులువులు = పక్షులు, ఉండక = ఆ సరస్సున నుండక, వెలువడి పోయెన్ = బయటికిఁ బోయెను. పోక = పోవుట, తగదె = తగదా? తగునని భావము, మాతంగ = ఏనుఁగులచే- చండాలురచే. దూషితంబు = నిందింపఁబడినది- మైలపఱుపఁబడినది, అగు, సరోవరంబు = కొలను, సత్ + ద్విజ = మంచి పక్షులచే-ఉత్తమ బ్రాహ్మణులచే, వర్జనీయంబు + కాదె = విడువఁదగినది కాదా? అగు ననుట.

తాత్పర్యము ; అడవి యేనుఁగులు కొలనిఁ బ్రవేశించి దానినంతను గలఁచివైవఁగా నందుండి పక్షులు వెడలిపోయెను, అట్లు పోవుట సహజమే కదా! మాతంగ దూషితమైన కొలను సద్ద్విజులకు విడువఁదగినదియే కదా!

విశేషములు : ఇందు వన్యేభములు కలఁచివైవఁగాఁ బులుఁగులు కొలని నుండి వెడలె నను విశేషాంశము మాతంగ దూషితమైన కొలను సద్ద్విజవర్జనీయము కదా యను సామాన్యాంశముచే సమర్థింపఁబడినది కావున నలంకార మర్థాంతరన్యాసము. 'ఉక్తి ర్థర్థాన్తరన్యాస స్స్యాత్ సామాన్య విశేషయోః'- చన్ద్రా. ఇందు మాతంగ, ద్విజ శబ్దములు శ్లిష్టములగుటచే శ్లేషాలంకారమును, 'నానార్థ సంశ్రయ శ్లేషః' చన్ద్రా. అర్థాంతరన్యాసము శ్లేషానుప్రాణితము.

వన్య + ఇభ = వన్యేభ - గుణసంధి; కలఁపన్ - కలఁగు ధాతువు ప్రేరణార్థకరూపము కలఁచు; దానికి 'నుజీ' పరమగుచుండఁగా కలఁచు + నుజీ పత్వాదేశము, పులువు - (రూపాం.) పులుఁగు. సత్ + ద్విజ - ఝల్లునకు హల్లు పరమగుచుండఁగాఁ దృతీయ వర్ణాదేశము. సద్విజ; పులుఁగు - పులువు 'అపవాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాష నగు.' బాల-అచ్చిక. 27.

వ. తదవసరంబున, 93

తాత్పర్యము : ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము.

క. పుష్కర షండములోఁ గల
పుష్కర మూలములు కబలములఁ గొనుచున్ స
త్పుష్కర తలముల మునుమిడి
పుష్కరములఁ బెటికిఁ బైచెఁ బుష్కరమునకున్. 94

అర్థము ; 92 వ పద్యము నందలి 'వన్యేభములు' కర్త.

పుష్కర షండములోన్ = తామరల సమూహముగల సరస్సులో - లేదా జల సమూహములో, కల = ఉన్న, పుష్కర మూలములు = తామరల దుంపలు, కబలములన్ = ముద్దలను (గా), కొనుచున్, సత్ + పుష్కర - తలములన్ = మంచినీటి ప్రదేశము నుండి, మునుమిడి = వరుసపెట్టి, పుష్కరములన్ = తొండముల కొనలతో, పుష్కరమునకున్ = ఆకాశమునకు, పెటికిపైచెన్ = త్రుంచి యెగురవేసెను.

తాత్పర్యము : జల సమూహము (సరస్సు) లోఁగల తామరదుంపలను గొనుచు నా వన్యేభములు జలముల నుండి తుండాగ్రములతో ఆకాశమునకు ఎగుర వైచెను.

విశేషములు : ఇందుఁ బుష్కర శబ్దము వివిధార్థములతోఁ బ్రయుక్త మైనది. కావున నలంకారము శ్లేషము. పుష్కరం కరిహస్తాగ్రే వాద్యభాణ్డముఖే

జలే, వ్యోమ్ని ఖడ్గఫలే పద్మే తీర్థౌషధి విశేషయోః' అమరము. పుష్కరము = ఏనుఁగు తొండము కొన, మద్దెల మున్నగు వాద్యముల ముఖము, నీరు, ఆకాశము, కత్తి వాఁదర, పద్మము, తీర్థభేదము, ఓషధి విశేషము. ఇంకను 'ద్వీపే సర్పే పుష్కర స్స్యాత్' ఇతిశేషః, అమరము, అలంకారము యమకము. కం, సమవర్ణయుగాధికమై యమరిన నియమమ్ముగఁబు యమక మగుఁ గృతులందు. కా. సం. 4.78

క. తన నీడ నీరి లోపలఁ
గని యది ప్రతిగజము సావి కడుకొని కోపం
బునఁ దాఁకి పోరఁ జొచ్చెనొ
యన నొక కరి నీరిలో రయంబునఁ గ్రుంకెన్. 95

అ ర్థ ము ; ఒక-కరి = ఒక యేనుఁగు, తన - నీడ = తనప్రతిబింబము. నీరిలోపలన్, కని = చూచి, అది, ప్రతి - గజము - సావి = శత్రుగజమని, కడుకొని = పూని, కోపంబునన్ = కోపముతో, తాఁకి = ఎదిర్చి, పోరన్ + చొచ్చెనొ = యుద్ధము చేయఁబూనెనో, అనన్ = అనఁగా, నీరిలోన్, రయంబునన్ = శీఘ్రముగా, క్రుంకెన్ = మునిఁగెను.

తా త్ప ర్య ము : ఒక యేనుఁగు తన ప్రతిబింబమును నీటఁజూచి యది శత్రు గజమని భ్రాంతి చెంది కోపముతో దానిని దాఁకి యుద్ధము చేయఁబూనెనా యనునట్లు నీట వేగముగా మునిఁగెను.

వి శే ష ము లు : కరికిఁ దన ప్రతిబింబమునందుఁ బ్రతిగజభ్రాంతి కావున భ్రాంతిమదలంకారము. కరి నీటఁ గ్రుంకుటకుఁ బ్రతిగజ మనుకొనుట కారణము కాదు. కారణము కానిదానిని గారణముగా నుత్ప్రేక్షించుటచే హేతూత్ప్రేక్షాలంకారము.

గీ. కరుల దానంబులకు మధుకరము లెఱఁగి
కుంజరమ్ములు నీరిలోఁ గ్రుంకి యున్న
మీఁద సుడియుచునుండెఁ దుమ్మెదలు వాయ
కుదధి కెఱఁగిన నీల నీరదము లనఁగ. 96

అర్థము: మధుకరములు = తుమ్మెదలు, కరుల - దానంబులకున్ = ఏనుఁగుల మదజలములకు, ఎఱఁగి = వ్రాలి, కుంజరమ్ములు = ఏనుఁగులు, నీరిలోన్, గ్రుంకి + ఉన్నన్ = మునిఁగియున్నను, తుమ్మెదలు, పాయక = విడువక, మీఁదన్, ఉదధికిన్ = సముద్రమునకు, ఎఱఁగిన = వ్రాలిన, నీల - నీరదములు = నల్లని మేఘములు, అనఁగన్, సుడియుచున్ + ఉండెన్ = తిరుగుచుండెను,

తాత్పర్యము: ఏనుఁగుల మదజలములచేఁ దుమ్మెద లాకృష్టములై వానిపై వ్రాలెను. ఏనుఁగులు నీటిలోఁ గ్రుంకినను, దుమ్మెదలు వానిని వీడక, సముద్రముపై వ్రాలిన నల్లని మేఘములో యనునట్లు నీటిపైఁ దిరుగుచుండెను.

విశేషములు: అలంకార ముత్ప్రేక్ష. కుంజర - 'మతఙ్గజో గజో నాగః కుఞ్జరో వారణః కరీ.' 'కుఞ్జౌ కుమ్భాధోగర్తౌ వస్య స్త ఇతి కుఞ్జరః' కుంజము లనఁగా కుంభస్థలములకు దిగువ నుండు గుంతలు. అవి గలిగినది - ఏనుఁగు, తుమ్మెదలు + పాయక = తుమ్మెదలు వాయక - గసడదవాదేశము, బాల. సం. 13.

వ. తత్ప్రస్తవంబున. 97

అర్థము: తద్ + ప్రస్తవంబునన్ = ఆ సమయమున.

తాత్పర్యము: అట్లు ఏనుఁగులు విహరించు సమయమున - తరువాతి పద్యములో నన్వయము,

విశేషములు: తద్ + ప్రస్తవము-ఝల్లులకు (అనునాసికాంతస్థ భిన్నములైన హల్లులకు) ఖరులు (కఠిన హల్లులు) పరమగునపుడు వాని వర్గము లందలి ప్రథమ వర్ణములు (పరులు) ఆదేశముగా వచ్చును. తత్ప్రస్తవము.

సీ. కడిపోవ నొడళులు గడిగి నవాశ్వత్థ
వల్కల రసములు వఱలఁ బూసి,
ధాతిలో నతి మృదుధాతురాగంబులు
గొమరారఁ గుంభస్థలములఁ బూసి,
నల్లరితాశోక పల్లవ నివహంబు
కర్ణావతంసంబుగా రచించి,
మానితంబగు నవమాలికా స్తబకముల్
బురుజలుగాఁ గంఠముల నమర్చి,

ఆ. కరము వేరవు మెఱసి కరిణులుఁ దారును
నభినవంబుగా మదాంధ గంధ
సింధురములు మెఱయ శృంగారములు చేసి
కామకేళి సలుపఁ గాతరిల్లె. 98

అర్థము : కడివోవన్ (కడి + పోవన్) = వాసనపోవునట్లు, ఒడళులు = శరీరములు, కడిగి, నవ + అశ్వత్థ - వల్కల - రసములు = క్రొత్త రావి చెట్టు పట్టల రసములు, వఱలన్ = ఒప్పునట్లు, పూసి = అలఁది.

భాతితోన్ = కాంతితో, అతి - మృదు - ధాతు - రాగంబులు = మిక్కిలి మెత్తని గైరికాది ధాతువుల యెఱ్ఱని రంగులు, కొమరారన్ (కొమరు + ఆరన్) = అందముగా, కుంభ - స్థలములన్ = కుంభస్థలములందు, పూసి.

సత్ + లలిత + అశోక - పల్లవ-నివహంబు = మిక్కిలి మనోహరము లయిన అశోకవృక్షముల చివురుల సమూహము, కర్ణ + అవతంసంబు + కాన్ = చెవి యలంకారముగా, రచించి,

మానితంబు + అగు = శ్రేష్ఠమగు, నవమాలికా - స్తబకముల్ = విరజాజి పూల గుత్తులు, బురుజులు + కాన్ = చిఱుగజ్జెలుగా. కంఠములన్, అమర్చి,

కరమున్ = మిక్కిలి, వెరవు = నేర్పు, మెఱసి, కరిణులున్ = ఆఁడేనుఁగులును, మద + అంధ - గంధ - సింధురములు = క్రొవ్వుచేఁ గన్నులు గానని మత్త గజములు, తారును = తామును, అభినవంబుగాన్ = క్రొత్తగా, మెఱయన్ = ప్రకాశించునట్లు, శృంగారములు - చేసి = సింగారించుకొని, కామ - కేళి = మన్మథ క్రీడ, చలుపన్ = చేయుటకు, కాతరిల్లెన్ = ఉత్సహించెను.

తాత్పర్యము : దుర్గంధము పోవునట్లు మేను గడిగి, క్రొత్తరావిచెట్ల పట్టల రసము లొప్పుగాఁబూసి, మిక్కిలి మృదువులైన గైరికాదిధాతువుల యెఱ్ఱని రంగులు అందముగాఁ గుంభస్థలములందు అలఁది. మిక్కిలి మనోహరములగు నశోక పల్లవముల సమూహములు కర్ణభూషణములుగా రచించి, అందమైన విరజాజిపూల గుత్తులు బురుజులుగాఁ గంఠముల ధరించి మిక్కిలి నేర్పు మెఱయ మదముచేఁ గన్నుగానని యేనుఁగులును, ఆఁడేనుఁగులును సింగారించుకొని రతిక్రీడ సలుప నుత్సహించెను.

విశేషములు : ఇందుఁ దిర్యక్కులగు నేనుఁగుల శృంగారము వర్ణింపఁ బడినది కావున నిది శృంగార రసాభాసము, దాని లక్షణము :

'ఏకత్రైవానురాగశ్చే త్తిర్యఙ్మ్లేచ్ఛగతోఽపి వా
యోషితో బహుసక్తిశ్చే ద్రసాభాస స్త్రిధా మతః' ప్ర.రు.

ముందు సతీశ్వరులు గజరూపములు ధరించుట కిది ప్రేరకముగాన నావశ్యక మయ్యెను. 'బురుజ' ఈ మాట కర్థము తెలియలేదు. 'చిఱుగజ్జె' లను పూర్వవ్యాఖ్యలోని యర్థమున కాకరమేమో యెఱుఁగరాదు. కంఠముల నమర్చునవి హారము లగునుగాని గజ్జె లెట్లగునో!

ఒడలు + లు = 'బహువచనము పరంబగునపు డసంయుక్తంబులయి యుకారాంతంబులయిన డ-ల-ర-ల కలఘు లకారంబు బహుళంబుగా నగు.' బాల, అచ్చుత, 13, ఒడళులు, బురుజలుగాఁ గంఠముల నమర్చి-మువిభక్తియతి,

వ. ఇట్లనేకప్రకారంబుల శృంగారంబు నేసి కామకేళీ లాలసులై కరి కరేణువు లత్యంతానురక్తి నొండొంటి నడరం దొడంగె నంత నందు. 99

అర్థము : ఇట్లు, అనేక-ప్రకారంబులన్ = పెక్కు విధములుగా, శృంగారంబు + చేసి = సింగారించుకొని, కామ-కేళీ-లాలసులు + ఐ = మన్మథక్రీడ యందుఁ దగిలినవారయి, కరి - కరేణువులు = మగ ఏనుఁగులును, ఆఁడేనుఁగులును, అత్యంత + అనురక్తిన్ = మిక్కిలి అనురాగముతో, ఒండు + ఒంటిన్ = ఒకదాని నొకటి, అడరన్ + తొడంగెన్ = అతిశయింప నారంభించెను, అంతన్, అందున్,

తాత్పర్యము : ఈ విధముగాఁ బెక్కురీతుల సింగారించుకొని మన్మథక్రీడ యందుఁ దగిలి మగయేనుఁగులును, ఆఁడేనుఁగులును మిక్కిలి యనురాగముతోఁ బరస్పరము మెఱ నారంభించెను, అంత వానిలో-తరువాతి పద్యముతో నన్వయము,

శా. బేటంబేటముగా నిభంబు కరిణిం బ్రేమంబుతోఁ జేరి లా
లాటం బొత్తు; లలాటపట్టమునఁ గేలంగేలు వేష్టించుఁ; గ్రి
గోటన్ మే యొరయున్; వరాంగమును సోఁకుం; బుష్కరాగ్రంబునం
దాటోపం బొనరించుఁ గూడఁ బ్రియఁ గామాసక్తి నాసక్తమై. 100

అర్థము : బేటంబేటముగాన్ = అత్యంతానురాగముతో, ఇభంబు = ఏనుఁగు. కరిణిన్ = పిడియేనుఁగును, ప్రేమంబుతోన్, చేరి, లాలాటంబు = నుదురు, ఒత్తున్, లలాట - పట్టమునన్ = ఫాల ఫలకమునందు, కేలన్ = తొండముతో, కేలు = తొండము, వేష్టించున్ = చుట్టును, క్రీగోటన్ = క్రిందుగోరితో, మే = శరీరము, ఒరయున్ = రాయును, పుష్కర + అగ్రంబునందున్ = తొండముకొనతో, వర + అంగమును = శ్రేష్ఠమయిన శరీరమును, సోఁకున్ = తాఁకును, కామ + ఆసక్తిన్ = కోరికయందలి తమకముతో, ఆసక్తము + ఐ = తగిలినదయి, ప్రియన్ = ప్రియురాలిని (పిడియేనుఁగును), కూడన్ = కూడుటకు - సంభోగించుటకు, ఆటోపంబు + ఒనరించున్ = సంభ్రమించును.

తాత్పర్యము : మగయేనుఁగు పిడియేనుఁగు నత్యంతానురాగముతో సమీపించి నుదుటి నొత్తును. ఫాలఫలకమునఁ దొండముతోఁ దొండమును జుట్టును, క్రిగోటితో శరీరమును గీఱును. తొండము కొనతో దాని శరీరమును దాఁకును. ప్రియురాలిని గూడ నది మన్మథోద్రేకమున సంరంభించును.

విశేషములు : అలంకారము స్వభావోక్తి. 'స్వభావోక్తి స్స్వభావస్య జాత్యాదిస్థస్య వర్ణనమ్.'- చన్ద్రా. క్రీగోటన్ - క్రింది + గోటన్ = సమాసంబునం బ్రాఁతాముల తొలియచ్చుమీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు. బాల. సంధి. 36. క్రి + గోటన్. బహుళగ్రహణముచేఁ గ్రింది శబ్దమునకు లుప్తశేషమునకు దీర్ఘంబు- క్రీగోటన్. క్రీగోరు + నన్ - 'టి వర్ణంబు గొన్నింటి యంతాక్షరంబున కాదేశంబును, గొన్నింటి కంతాగమంబును, గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగ నగు. బాల. ఆచ్ఛిక. 31. క్రీగోటి + నన్. ఔపవిభక్తికముల తృతీయా సప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు. బాల. ఆచ్ఛిక. క్రీగోటి + అన్. 'అంద్వగాగమంబులం దప్ప నపదాది స్వరంబు పరంబగునపు డచ్చునకు సంధియగు,

వా. సంధి. ॥ క్రియా. పుష్పరాగంబునందున్-పుష్కర మనఁగా గజతుండా
గ్రము. వానిపై మధ్యం ఆగ్రశబ్ద మనావశ్యకము, మీఁదై, మెయి, మయి. (రూపాం.)

మ. హృదయాహ్లాదముతోడఁ బాయక సదానేక ప్రకారంబులన్
మదనాసక్తిఁ బెనంగుచున్న విలసన్మత్తేభ విక్రీడితం
బది దాక్షాయణి చూచి కౌతుక రతైకాలీన భావాభిలా
ష దృగత్యుజ్జ్వలదీధితుల్ పఱపె నీశానాననాబ్జంబుపైన్. 101

అర్థము: హృదయము+ఆహ్లాదముతోడన్=మనస్సంతోషముతో. పాయక = విడువక, సదా = ఎల్లప్పుడును, అనేక - ప్రకారంబులన్ = పెక్కు విధములుగా, మదన + ఆసక్తిన్ = మన్మథక్రీడ యందలి కోరికతో, పెనంగుచున్ + ఉన్న = సంభోగించుచున్న, విలసత్ + మత్త + ఇభ - విక్రీడితంబు + అది = ఒప్పుచున్న మదించిన యేనుఁగుల యొక్క ఆ విశేషమైన క్రీడ, దాక్షాయణి = దక్షుని కూఁతురైన సతీదేవి, చూచి, కౌతుక .... దీధితుల్, కౌతుక = వేడుకతోడి, రత = సంభోగమునందు, ఏక = ముఖ్యముగా, ఆలీన = మిక్కిలి తగిలి యున్న, భావ = హృదయమునందలి, అభిలాష = కోరికతోడి, దృశ్ (క్) = చూపుయొక్క, అతి + ఉజ్జ్వల = మిక్కిలి ప్రకాశముగల, దీధితుల్ = కాంతులు, ఈశాన + ఆనన + అబ్జంబుపైన్ = ఈశ్వరుని ముఖపద్మముపై, పఱపెన్ = వ్యాపింపఁజేసెను,

తాత్పర్యము: మనస్సంతోషముతో విడువక యెల్లప్పుడు ననేకవిధములుగా సంభోగించుచున్న మదగజముల రతిక్రీడను జూచి సతీదేవి వేడుకతోఁగూడిన యా రతిప్రియమందే లగ్నమైన మనస్సునందలి కోరికతోడి దృష్టికాంతులను ఈశ్వరుని ముఖపద్మముపైఁ బఱపెను.

విశేషము లు: హృ .... సదానేక - అనుచో యతిభంగమైనదని తలంచి 'సదామైత' యని పూర్వవ్యాఖ్యలో మార్పుగావింపఁబడినది. కాని యది వ్యాఖ్యాత భ్రాంతిమాత్రమే. 'సదానేక' అని యున్నను యతిభంగము కాలేదు. నిత్యసమాస మ్మైనందున అనేక లోని 'అ' కుఁగాని 'నే' యను విశిష్టవర్ణమునకుఁగాని యతిమైత్రి పొసఁగును. ఎట్లనఁగా 'హృ' అనుదానికి 'ఏ' తో ఋత్వసంబంధవళి చొప్పున యతి

పై త్రిచెల్లి నిద్దష్టమగును, 'ఎనమంద్రఁట మోచువా ఁనేకప కిటికూ ...., పీడిపో సీని కపుంగిలింతలు నస్నేక విలాసములం జెలంగఁగాన్.' విలసత్ + మత్తేభ = 'రహాలుతప్ప మిగిలిన పదాంతగతహల్లులకు (య్రలకు) అనునాసికవర్ణము పరమగుచో వానికి సంబంధించిన అనునాసికవర్ణము వైకల్పికముగా ఆదేశమగును.' విలసన్మత్తేభ, విలసద్మత్తేభ, దృశ్ + అతి = దృక్ + అతి - ఝల్లునకు అచ్చు పరమగుచుండఁగాఁ దృతీయవర్ణాదేశము - దృగతి, అతి + ఉజ్జ్వల - యణాదేశసంధి - అత్యుజ్జ్వల, మత్తేభముల విక్రీడితమును మత్తేభవిక్రీడితముననే వర్ణించుట గమనింపఁ దగినది, ఒకవృత్తమున దాని నామము నిమిడ్చి రచించుట ముద్రాలంకారమగును. దీనిని దొలుతఁ బ్రవేశపెట్టినవాఁడు నన్నెచోడుఁడే,

వ. తదవసరంబునం బరమేశ్వరుండు నిజజీవితేశ్వరి కన్నెఱింగి దానికి సమ్మతించినం గని సంతోషించి. 102

అర్థము: తద్ + అవసరంబునన్ = ఆ సమయమున, పరమేశ్వరుండు, నిజ - జీవిత + ఈశ్వరి = తనదైన ప్రాణేశ్వరి యగు సతీదేవియొక్క, కన్ను + ఎఱింగి = మనోఽభిప్రాయముతెలిసి, దానికిన్, సమ్మతించినన్, (సతి), కని, సంతోషించి.

తాత్పర్యము: ఆ సమయమునఁ బరమేశ్వరుఁడు తనప్రాణేశ్వరియగు సతీదేవి మనోఽభిప్రాయము నెఱిఁగి దాని కంగీకరింపఁగా నామె సంతోషించి – .... తరువాతి పద్యముతో నన్వయము.

క. సతి కరిణి యగుడుఁ ద్రిజగ
త్పతి కరియై కూడె; సతులు భావించిన యా
కృతిఁ గూడ నేర్ప కాదే
యతిశయముగ నింగితజ్ఞులకు (గు) ఫలమెందున్ ? 103

అర్థము: సతి = సతీదేవి, కరిణి = ఆఁడేనుఁగు, అగుడున్ = అయినంతనే, త్రిజగత్ + పతి = మూఁడులోకములకుఁ బ్రభువు - ఈశ్వరుఁడు, కరి + ఐ = (మగ) యేనుఁగయి, కూడెన్ = సంభోగించెను, ఎందున్ = ఎచ్చటనైనను,

ఇంగితజ్ఞులకున్ = ఇతరుల యభిప్రాయము నెఱుఁగువారికి, ఫలము, అతి ఘనముగన్ = అధికముగా, సతులు = భార్యలు, భావించిన = ఇష్టపడిన, ఆస్థతోన్ = ఆదరముతో, కూడన్ = సంభోగించుటకు, నేర్పు + అ = నేర్పే, కాదే = కాదా! లేదా ఇంగితజ్ఞులు + అగు - ఫలము = ఇంగితజ్ఞులగు దాని ఫలము .... అని చెప్పనగును,

తాత్పర్యము; సతీదేవి పిడియేనుఁగు కాఁగానే యీశ్వరుఁడు మగ యేనుఁగయి యామెను గూడెను, ఎంతైనను ఇతరుల మనో౽భిప్రాయముల నెఱుఁగువారికిఁ దమ భార్యలు కోరిన యాకారముతో వారిని గూడఁగలుగుటయేకదా అధికమగు ఫలము!

విశేషములు ; ఇందు విశేషాంశము సామాన్యాంశముచే సమర్థింపఁబడి నది కావున నలంకార మర్థాంతరన్యాసము. అగుడున్ - 'అనంతర్యంబున డువర్ణకంబు ప్రయుక్తంబగు,' బాల. క్రియ. 42

గీ. ఆదిమూర్తులు శివశక్తు లచలమతులు
హరుఁడు సతియును సురతార్థులై విహీన
తరములగు మృగరూపముల్ దాల్చి రనినఁ
గాము మాయల నెవ్వారు నేమి కారు ! 104

అన్వయము : ఆది-మూర్తులు = ఆది స్వరూపులు, శివ శక్తులు = శివుఁడును శక్తియును, అచల - మతులు = నిశ్చల మనస్కులు (అగు), హరుఁడున్-సతియును = ఈశ్వరుఁడును, సతీదేవియును, సురత + అర్థులు + ఐ = రతిని గోరినవారలై, విహీన - తరములు + అగు = మిక్కిలి నీచములైన, మృగ - రూపముల్ = పశువుల రూపములను, తాల్చిరి + అనినన్ = తాల్చిరనఁగా, కాము , మాయలన్ = మన్మథుని మాయలచేత, ఎవ్వారున్ = ఎవ్వరయినను, ఏమి - కారు ?

తాత్పర్యము ; ఆది స్వరూపులు, శివశక్తులు, నిశ్చల మనస్కులు నైన శివుఁడును, సతియును రతిక్రీడ కొఱకు మిక్కిలి నీచములైన పశువుల రూపములను ధరించి రనఁగా, నిఁక మన్మథుని మాయలచే నెవరేమి కారు? ఎవరైనను ఏమి యైనను గావచ్చు ననుట.

విశేషములు : ఆది స్వరూపులు, అచల మనస్కులునైన సతీశ్వరులే రతినిమిత్తము విహీన మృగరూపములను ధరించి రనఁగా, నిఁక మన్మథుని మాయలచే నెవరేమి కారనుటచే నలంకారము కావ్యార్థపత్తి. 'కైముత్యే నార్థ సంసిద్ధిః కావ్యార్థాపత్తి రిష్యతే' యన్నారు.

క. హరుఁడును సతి రతిఁ దనుపఁగ
భరమై గజకేళిఁ గూడి పడసెను సుఖ; మిం
కొరు లెట్లు నేర్తు రొక మెయిఁ
గరణంబులు పెక్కు లేక కాంతలఁ దనుపన్? 105

అర్థము : హరుఁడును = ఈశ్వరుఁడు సైతము, సతిన్ = భార్యను, సతీదేవిని, రతిన్ = సంభోగమునందు, తనుపఁగన్ = తృప్తి పఱుచుటకు, భరము + ఐ = కష్టమయి, గజ-కేళిన్ = ఏనుఁగు క్రీడతో, కూడి = సంభోగించి, సుఖము, పడసెను = పొందెను, ఇంకన్, ఒరులు = ఇతరులు, కరణంబులు = సాధనములు, పెక్కు = అనేకము, లేక, ఒక మెయిన్ = ఒక్క దేహముతో, కాంతలన్ = భార్యలను, తనుపన్ = తృప్తి పఱుప, నేర్తురు = ఏరీతిగా సమర్థులగుదురు ?

తాత్పర్యము : ఈశ్వరుఁడు కూడ రతిలో భార్యను తృప్తి పఱుచుట కష్టమై యేనుఁగు రూపుధరించి సంభోగించి రతిసౌఖ్యమును బొందె ననఁగా నిఁక నితరులు పెక్కుసాధనములు లేనివారు ఒక్కదేహముతోఁ దమ భార్యలను రతిలోఁ దృప్తిపఱుప నెట్లు సమర్థులగుదురు ? కారని భావము,

విశేషములు :- అలంకారము కావ్యార్థాపత్తి.

వ. ఇట్లు పరమేశ్వరుండును సతీదేవియు సామజకేళీలాలసులై విహరించినంత సద్యోగర్భంబున. 106

అర్థము : ఇట్లు, పరమేశ్వరుండును, సతీదేవియున్, సామజ-కేళీ - లాలసులు + ఐ = ఏనుఁగుల రతిక్రీడలయందుఁ గోరిక గలవారయి, విహ

క్రీడించిన + అంతన్ = క్రీడింపఁగా, సద్యస్ (8) + గర్భంబునన్ = వెంటనే వచ్చిన చూలున.

తాత్పర్యము : ఇట్లు పరమేశ్వరుఁడును, సతీదేవియు గజరతిక్రీడయందాసక్తి గలవారలు క్రీడింపఁగా సతికి వెంటనే యైన చూలున - తరువాతి పద్యమునకు సంబంధము,

విశేషములు ; సద్యస్ + గర్భ - పదాంత సకారమునకు విసర్గాదేశము కాఁగా సద్యః + గర్భ, హ్రస్వ అకారము తరువాత వచ్చు విసర్గము నకు హ్రస్వ అకారము కాని, మృదుహల్లులు (హశ్శులు) కాని పరము లగునప్పుడు ఉ ఆదేశముగా వచ్చి పూర్వమందున్న అకారముతోఁగూడి గుణసంధి సమకూరి ఓ గా మారును, సద్య + ఉ + గర్భ = సద్యోగర్భ.

గజాననోత్పత్తి

క. పురుషాకారముఁ, బటుమద
కరి వదనముఁ, గుబ్జ పాద కరములు, లంబో
దరము, హరినీల వర్ణముఁ
గర మొప్పఁగఁ దాల్చి విఘ్నకరుఁ డుదయించెన్. 107

అర్థము : పురుష + ఆకారమున్ = పురుషుని రూపమును, - పటు - మద - కరి - వదనమున్ = మిక్కిలి మదించిన యేనుఁగు మోమును, కుబ్జ - పాద - కరములన్ = పొట్టివైన కాళ్లను, చేతులును, లంబ + ఉదరమున్ = వ్రేలాడు పొట్టయును, హరి - నీల - వర్ణమున్ = ఇంద్రనీలమణి వర్ణమును, కరము = మిక్కిలి, ఒప్పఁగన్, తాల్చి = ధరించి, విఘ్నకరుఁడు = విఘ్నేశ్వరుఁడు, ఉదయించెన్ = పుట్టెను.

తాత్పర్యము: పురుషుని రూపమును, మిక్కిలి మదించిన యేనుఁగు మోమును, పొట్టివైన కాళ్ళేతులును, వ్రేలు పొట్టయు, నింద్రనీలమణి వర్ణమును మిక్కిలి మొప్పఁగా ధరించి విఘ్నేశ్వరుఁడు పుట్టెను.

వ. ఇట్లు దాక్షాయణికిని సకల భువన భవనాధీశ్వరుండైన పరమేశ్వరు
నకును గణాధీశ్వరుం డుదయించిన మహోత్సాహంబున. 108

అర్థము ; ఇట్లు, దాక్షాయణికిని = సతికిని, సకల = ఎల్ల, భువన-భవన = లోకములయొక్క పుట్టుకకు, అధి + ఈశ్వరుండు + ఐన = ప్రభువైన, పరమేశ్వరునకును, గణ + అధి + ఈశ్వరుండు = గణపతి, ఉదయించినన్ = పుట్టఁగా, మహత్ (మహా) + ఉత్సాహంబునన్.

తాత్పర్యము : ఇట్లు సతీదేవికిని, సర్వలోక ప్రభువగు నీశ్వరునకును గణపతి పుట్టఁగా. గొప్ప వేడుకతో - తరువాతి పద్యముతో నన్వయము.

మ. సురవాద్యంబులు మ్రోసె; దిగ్వదనముల్ శోభిల్లె; గంధర్వ కి
న్నర గేయంబులు మించె; దేవ గణికల్ నర్తించి రింపారఁగాఁ;
గురిసెం బువ్వులవాన; దేవరవముల్ ఘూర్ణిల్లె; నా దివ్య సిం
ధుర యూథంబు మదంబు సేసె గణనాథుం డుర్వి జన్మించినన్. 109

అర్థము : గణనాథుండు = గణపతి, ఉర్విన్ = భూమియందు, జన్మించినన్ = పుట్టఁగా, సుర - వాద్యంబులు = దేవతల దుందుభులు మున్నగు వాద్యములు, మ్రోసెన్ = మ్రోఁగెను, దిశ్ (క్) + వదనముల్ = దిక్కుల ముఖములు, శోభిల్లెన్ = ప్రకాశించెను, గంధర్వ - కిన్నర - గేయంబులు = గంధర్వులయు, కిన్నరులయు గీతములు, మించెన్ = అతిశయించెను, ఇంపు + అరఁగాన్ = సంతోషము నిండఁగా, దేవ గణికల్ = దేవవేశ్యలు - అప్సరసలు, నర్తించిరి = నాట్యము చేసిరి, పువ్వుల - వాన, కురిసెన్, దేవ - రవముల్ = దేవతల ధ్వనులు, ఘూర్ణిల్లెన్ = మ్రోఁగెను, ఆ - దివ్య - సింధుర - యూథంబు = ఆ దేవగజముల గుంపు, మదంబు + చేసెన్ = మదించెను.

తాత్పర్యము: విఘ్నేశ్వరుఁడు భూమిలోఁబుట్టఁగా దేవదుందుభులు మ్రోసెను, దిఙ్ముఖములు ప్రకాశించెను. గంధర్వులు, కిన్నరులు పాడిరి. అప్సరసలు మనోహరముగా నాట్యము చేసిరి. పుష్పవృష్టి కురిసెను. దేవతల ధ్వనులు మ్రోసెను. దేవగజముల సమూహము మదించెను.

వ. తదవసరంబున హరి పరమేష్ఠి పురందరాద్యఖిల దేవర్షి రాజర్షి ప్రముఖాఖిల జగజ్జనంబులు రజతాచలంబున కరుదెంచి మహోత్సవము సేయుచుండిరి; రంతఁ దదీయప్రార్థితుండై పరమేశ్వరుండు గణనాథునకు శివగణ సురగణాది సమస్త గణాధిపత్యాఖిల క్రియారంభాధిపత్యంబులతో యువరాజ పట్టంబుఁ గట్టి పరమానంద రసాబ్ధి నోలలాడుచుండె; నంత నక్కడ దక్షప్రజాపతి సకల జగజ్జనంబుల నిర్మించి సంతోషిత హృదయుండై యొక్క నాఁడు. 110

అర్థము : తద్ + అవసరంబునన్ = ఆ సమయమున, హరి .... జనంబులు, హరి = విష్ణువు, పరమేష్ఠి = బ్రహ్మ, పురందర = ఇంద్రుఁడు, ఆది = మున్నగు, అఖిల = ఎల్ల, దేవ + ఋషి = దేవర్షులు, రాజ + ఋషి = రాజర్షులు, ప్రముఖ = మొదలైన, అఖిల = ఎల్ల, జగత్ + జనంబులు = లోకములందలి జనులు, రజత + అచలంబునకున్ = వెండికొండకు - కైలాసమునకు, అరుదెంచి = వచ్చి, మహత్ (మహో) + ఉత్సవము = గొప్ప వేడుక, చేయుచున్ + ఉండిరి, అంతన్, తదీయ - ప్రార్థితుండు + ఐ = వారిచేఁ గోరఁబడినవాఁడయి, పరమేశ్వరుండు, గణనాథునకున్ = గణపతికి, శివ - గణ = ప్రమథ గణములయు, సుర - గణ = దేవతా గణములయు, సమస్త = ఎల్ల, గణ = గణములయు, ఆధిపత్య = ప్రభుత్వము, అఖిల = ఎల్ల, క్రియా + ఆరంభ + ఆధిపత్యంబులతోన్ = పనుల ప్రారంభ ప్రభుత్వములతో, యువరాజ - పట్టంబు + కట్టి = యౌవరాజ్య పట్టాభిషేకము చేసి, పరమ + ఆనంద - రస + అబ్ధిన్ = గొప్ప ఆనందరసమనెడి సముద్రమునందు, ఓలలు + ఆడుచున్ + ఉండెన్ = క్రీడించుచుండెను, అంతన్, అక్కడన్, దక్ష ప్రజాపతి, సకల - జగత్ + జనంబులన్ = ఎల్ల లోకములందలి జనులను, నిర్మించి = పుట్టించి, సంతోషిత + హృదయుండు + ఐ = సంతోషపెట్టఁబడిన హృదయము గలవాఁడయి, ఒక్కనాఁడు.

తాత్పర్యము : ఆ సమయమున విష్ణు బ్రహ్మేంద్రాదులు, ఎల్ల దేవర్షి రాజర్షులు, ఎల్లలోకముల జనులు, కైలాసమునకు వచ్చి గొప్ప వేడుక చేయుచుండిరి. అంత వారిచేఁ బ్రార్థితుఁడై పరమేశ్వరుఁడు గణపతికిఁ బ్రమథ దేవతాది సర్వగణముల

ఆధిపత్యముతోను, ఎల్ల క్రియల ఆరంభాధిపత్యములతోను యౌవరాజ్యపట్టాభిషేకముఁ గట్టి, పరమానందరస సముద్రమునఁ గ్రీడించుచుండెను. అంత నక్కడ దక్షప్రజాపతి యెల్ల జగములందలి జనులను బుట్టించి సంతోషించిన హృదయము గలవాఁడై, ఒక నాఁడు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ఆది + అఖిల = ఆద్యఖిల - యణాదేశసంధి. దేవ + ఋషి = దేవర్షి, రాజ + ఋషి = రాజర్షి -గుణ సంధులు, ఆనంద రసాబ్ధి - ఆనంద రసమనెడి అబ్ధి-రూపకాలంకారము. జగత్ + జనములు = జగద్ + జనములు - జగజ్జనములు,

క. జలజా ర్యంతక కశ్యప
కులభామినులై నెగడ్త కుం జని బహు పు
త్రులఁ బడసి పేరుకొను కూఁ
తులఁ జూడఁగ నరిగె నతి కుతూహలబుద్ధిన్. 111

అర్థము; పయి గద్యమునందలి దక్షప్రజాపతి కర్త.

జలజ + అరి = తామరల విరోధియగు చంద్రుని యొక్కయు, అంతక = యముని యొక్కయు, కశ్యప = కశ్యపుని యొక్కయు, కుల - భామినులు + ఐ = కులస్త్రీలయి. నెగడ్తకున్ + చని = ప్రసిద్ధి కెక్కి. బహు - పుత్రులన్ = అనేక కుమారులను, పడసి = పొంది, పేరుకొను = కీర్తివహించు, కూఁతులన్ = పుత్రి కలను, చూడఁగన్ = చూచుటకు, అతి - కుతూహల - బుద్ధిన్ = మిక్కిలి కోరికగల మనస్సుతో, అరిగెన్ = వెడలెను,

తాత్పర్యము; దక్షప్రజాపతి చంద్రునకు, యమునకుఁ, గశ్యపునకు భార్యలయి ప్రసిద్ధి వహించు కూఁతులను జూడ మిక్కిలి వెడుకపడి వెడలెను.

విశేషములు: జలజారి + అంతక = జలజార్యంతక - యణాదేశసంధి, నెగడ్త - నెగడు ధాతు కృదంతరూపము,

వ. చని నిజాగమన ప్రయోజనంబు కశ్యపున కెఱింగించి పుచ్చిన. 112

అర్థము: విని, నిజ + ఆగమన - ప్రయోజనంబు = తనదైనరాక యొక్క ఉద్దేశము, కశ్యపునకున్, ఎఱింగించి - పుచ్చినన్ = తెలుపఁగా,

తాత్పర్యము: వెడలి తన వచ్చిన పనిని కశ్యపునకుఁ దెలుపఁగా-తరువాతి పద్యముతో నన్వయము.

మ. విని సంతోషముతోడ సంభ్రమముతో వేగంబునం బ్రీతితో
మునిసందోహముతోడ శిష్యతతితో మూర్తంబులై కొల్చు వే
ద నినాదంబులతోడ సంతత మహోత్సాహంబుతో వచ్చె ము
న్కొని తాత్పర్యముతోడఁ గశ్యపుఁడు దక్షుం గాన సద్భక్తితోన్. 113

అర్థము: కశ్యపుఁడు, విని, సంతోషముతోడన్, సంభ్రమముతోన్ = తొందరతో, వేగంబునన్, ప్రీతితోన్, ముని - సందోహముతోడన్ = మునుల యొక్క సమూహముతో, శిష్య - తతితోన్ = శిష్యులయొక్క సమూహముతో, మూర్తంబులు + ఐ = రూపుగాంచినవయి, కొల్చు = సేవించు, వేద - నినాదంబుల తోడన్ = వేదములయొక్క ధ్వనులతో, సంతత-మహత్ (మహా)+ఉత్సాహంబుతోన్ = ఎడతెగని గొప్ప పూనికతో, తాత్పర్యముతోడన్ = ఆసక్తితో, సత్+భక్తితోన్ = మంచి భక్తితో, మున్కొని = ఎదురుగఁబడి, దక్షున్ = దక్షుని, కానన్ = చూచుటకు, వచ్చెన్.

తాత్పర్యము: కశ్యపుఁడు విని సంతోషముతోను, సంభ్రమముతోను, వేగముతోను, ప్రీతితోను, మునుల సమూహముతోను, శిష్యుల సమూహముతోను, మూర్తి గొనినట్టివైన వేదముల నాదములతోను, ఎడతెగని మహోత్సాహముతోను, ఆసక్తితోను, సద్భక్తితోను ఎదురేఁగి దక్షునిఁ జూడ వచ్చెను.

వ. ఇట్లు సకళత్రంబుగాఁ జనుదెంచి సర్వాంగీణప్రణాముండై నిజ మందిరమునకుఁ దోడ్కొని చని యర్ఘ్యపాద్యాది విశేషార్చనల నర్చించి మణి కనకాది వస్తునిచయంబునం బూజించిన కశ్యప ప్రజాపతి భక్తి యుక్తి కావర్జిత హృదయుండై దక్షుం డాతని వీడ్కొని ధర్మరాజావలోకన కుతూహలపరుండై చని ముందట. 114

అర్థము: ఇట్లు, సకళత్రంబుగాన్ = భార్యాసహితముగా, చనుదెంచి = వచ్చి, సర్వాంగీణ - ప్రణాముండు + ఐ = సాష్టాంగ నమస్కారము గలవాఁడయి, నిజ - మందిరమునకున్ = తనదైన యింటికి, తోడ్కొని - చని = తీసికొని వెడలి, అర్ఘ్య - పాద్య + ఆది - విశేష + అర్చనలన్ = పూజా ద్రవ్యములు, పాద ప్రక్షాళనార్థమైన జలము మున్నగు విశేషములైన పూజలతోఁ బూజించి, మణి - కనక + ఆది - వస్తు - నిచయంబునన్ = రత్నములు, బంగారము మున్నగు, వస్తువుల, సమూహముతో, పూజించిన = పూజించినట్టి, కశ్యప - ప్రజాపతి - భక్తి - యుక్తికిన్ = కశ్యప ప్రజాపతియొక్క భక్తిమత్త్వమునకు, ఆవర్జిత - హృదయుండు + ఐ = ఆకృష్టమైన హృదయము గలవాఁడయి, దక్షుండు, ఆతనిన్ = ఆ కశ్యపుని, వీడ్కొని = వీడి, ధర్మరాజ + అవలోకన - కుతూహల - పరుండు + ఐ = యముని జూచుటయందలి వేడుక యందాసక్తి గలవాఁడయి, చని, ముందటన్ = ఎదుర.

తాత్పర్యము: ఇట్లు భార్యాసహితుఁడై వచ్చి, సాష్టాంగ నమస్కారము చేసి, తన యాశ్రమమునకుఁ దీసికొనిపోయి, అర్ఘ్యము, పాద్యము మున్నగు విశేష పూజలఁ బూజించి, రత్నములు, బంగారము మున్నగు వస్తువుల సమూహముతోఁ బూజ చేసిన కశ్యపుని భక్తికి వశమైన హృదయము గలవాఁడయి దక్షుఁడు ఆతనిని వీడి యముని జూడ వేడుక గలవాఁడయి పోయి ముందట - తరువాతి పద్యముతో నన్వయము.

మహాస్రగ్ధర

ఘనబృందానేక దేశాగత పథిక జనౌఘప్రపాపాంగు, నుగ్రా
శని భీతార్తోరుశైలాశ్రయు, నిఖిల నదీ స్వామిఁ, జంద్రాప్సరశ్రీ
జనకుం, గల్లోల మాలా చలిత నిజతటక్ష్మాజరాజీ విలాసుం
గనియెం దక్షుండు రత్నాకరు నిఖిల మహీ కామినీ మేఖలాభున్. 115

అర్థము; దక్షుండు (కర్త) ఘన....పాంగున్ : = మేఘములయొక్క, బృంద = సమూహ మనెడి, అనేక = పెక్కు, దేశ = దేశములనుండి. ఆగత = వచ్చిన, పథిక = బాటసారులయిన, జన = జనులయొక్క, ఓఘ = సమూహమునకు,

ప్రపా = చలిపందిరి యనెడి, అపాంగున్ = కడకన్నులుగలవాఁడును, ఉగ్రా..... శ్రయున్: ఉగ్ర = భయంకరమైన, అశని = వజ్రాయుధమువలన, భీత = భయపడినవయి, ఆర్త = దుఃఖమునొందిన, శైల = కొండలకు, ఆశ్రయున్ = ఉనికిపట్టయిన వాఁడును, నిఖిల .... స్వామిన్: నిఖిల = ఎల్ల, నదీ = నదులకును, స్వామిన్ = భర్తయైనవాఁడును, చంద్రా .... జనకున్: చంద్ర = చంద్రునకును, అప్సరస్ = అచ్చరలకును, శ్రీ = లక్ష్మికి, జనకున్ = తండ్రియైన వాఁడును, కల్లోల .... విలాసున్: కల్లోల = పెద్దయలలయొక్క, మాలా = వరుసలచేత, చలిత = కదలిన, నిజ = తనదైన, తట = ఒడ్డునందలి, క్ష్మాజ = చెట్లయొక్క, రాజీ = వరుసయొక్క, విలాసున్ = విలాసము గలవాఁడును, నిఖిల .... లాభున్; నిఖిల = ఎల్ల, మహీ = భూమియనెడు, కామినీ = స్త్రీకి, మేఖలా = మొలనూలియొక్క, ఆభున్ = శోభ గలవాఁడును, అగు, రత్న + ఆకరున్ = సముద్రుని, కనియెన్ = చూచెను.

తాత్పర్యము ; దక్షుఁడు మేఘముల గుంపనెడు పలు దేశములనుండి వచ్చిన బాటసారులకుఁ జలిపందిరియైన కడకన్నులుగలవాఁడును, భయంకరమైన వజ్రాయుధము వలని భయమున దుఃఖితములైన పర్వతముల కాశ్రయమైనవాఁడును, ఎల్లనదులకు భర్తయైన వాఁడును, చంద్రుఁడు, అచ్చరలు, లక్ష్మియనువారికిఁ దండ్రియైనవాఁడును, పెద్దయలల వరుసలచేఁ జలించిన తీరస్థవృక్ష పంక్తుల విలాసము గలవాఁడును, సకల భూమియనెడు కామినికి మొలనూలి శోభగలవాఁడును, అగు, రత్నాకరుని జూచెను.

విశేషములు: ఘనబృందా .... పాంగు. = ఘనబృందమనెడి .... పథికజనౌఘము - రూపకము. ప్రపాపాంగున్ - ప్రప యనెడు అపాంగము గలవానిని - రూపకము, మహీకామిని - రూపకము, ఘనబృందా .... పాపాంగున్ అను విశేషణముచే సముద్రుని దానగుణము, 'ఉగ్రాశని .... శ్రయు' అను విశేషణముచే సముద్రుని ఆర్తరక్షా పరాయణత్వము, 'నిఖిలనదీస్వామి' అనువిశేషణముచే సముద్రుని దక్షిణనాయకత్వము, 'చంద్రా.... .... జనకు' అనువిశేషణముచే నతని అభిజనమును, 'నిఖిలమహీకామినీమేఖలాభున్' అను విశేషణముచేతను, 'రత్నాకరున్' అను విశేషణముచేతను నతని ఆఢ్యత్వము తెలియుచున్నవి. ఛందస్సు - చూడు, 1.68 వ పద్యమును వ్యాఖ్య.

వ. కని యమ్మహాఋషి మహాపరుష వజ్రి వజ్రపాత భీతాయాత క్షోణీధర పక్ష విక్షేప క్షుభితానేక నక్ర చక్ర తిమి తిమింగిల తద్గిల కుంభీర కుంభీనసాద్యనేక జలచర కులాకులిత లులితాలోల కల్లోలానూన ఫేనాయమాన శుక్తిముక్తాఫలాభిరామంబైనయ్యది యని మెచ్చి మఱియును విశేషించుచు. 116

అర్థము ; కని = చూచి, ఆ + మహత్ (మహా) ఋషి = ఆ గొప్ప ఋషియైన దక్షుఁడు, మహాపరుష.........రామంబు: మహత్ (మహా) + పరుష = మిక్కిలి క్రూరమైన, వజ్రి - వజ్ర = ఇంద్రుని వజ్రాయుధముయొక్క, పాత = పాటువలన, భీత = భయపడినవయి, ఆయాత = వచ్చిన, క్షోణీధర = పర్వతముల యొక్క, పక్ష = ఱెక్కలయొక్క, విక్షేప = ఆడించుటచే, క్షుభిత = కలఁగిన, అనేక = పెక్కు, నక్ర = మొసళ్లయొక్క, చక్ర = సమూహములు, తిమి = నూఱు యోజనముల పొడుగుగల చేఁపలు, తిమింగిల = తిమిని మ్రింగెడు చేఁపలు, తద్గిల = తిమింగిలమును మ్రింగెడు చేఁపలు, కుంభీర = మొసళ్లు, కుంభీనస = పాములు, ఆది = మున్నగు, అనేక = పెక్కు, జలచర = నీటి జంతువుల యొక్క, కుల = సమూహముచే, ఆకులిత = కలఁతపెట్టఁబడినవై, లులిత = కదలినవైన, ఆలోల = అంతటఁ జలించు, కల్లోల = అలలచేత, అనూన = తక్కువ కాని, ఫేనాయమాన = నురుగు అగుచున్న, శుక్తి = ముత్తెపుఁజిప్పలందలి, ముక్తాఫల = ముత్యములచేత, అభిరామంబు = మనోహరము, ఐన + అది = ఐనది, అని, మెచ్చి, మఱియును, విశేషించుచున్ = వర్ణించుచు,

తాత్పర్యము; దక్షుఁడు సముద్రమును జూచి యది మిక్కిలి క్రూరమైన యింద్రుని వజ్రాయుధపాతమువలన భయపడివచ్చిన పర్వతముల ఱెక్కల ఆర్పులచేఁ గలఁగిన పెక్కు మొసళ్ల. సమూహములు, తిములు, తిమింగిలములు. తిమింగిలగిలములు, అను పెక్కు జలచరముల అలజడిచేఁగలఁగి చలించిన అలలచే నురుగగుచున్న శుక్తులందలి ముత్యములచే మనోహరమైనది యని ప్రశంసించి యింకను వర్ణించుచు - తరువాతి పద్యముతో నన్వయము,

విశేషములు : ఇంతపెద్దసమాసము సముద్రము గాంభీర్యాయతత్వములను సూచించును,

క. శరనిధి రత్నంబులు దివి
కరిగెనొ యని తారకముల నతులోర్మి కరో
త్కరములు తెమల్చి తెచ్చిన
పరుసున నవ విపుల ఫేనపంక్తులు వెలుఁగున్. 117

అర్థము : శరనిధి-రత్నంబులు=సముద్రమునందలి రత్నములు, దివికిన్ = ఆకాశమునకు, అరిగెనొ = వెడలెనో, అని, తారకములన్ = నక్షత్రములను, అతుల + ఊర్మి - కర + ఉత్కరములు = సాటిలేని, అలలనెడి, చేతుల, సమూహములు, తెమల్చి = పెఱికి, తెచ్చిన - పరుసునన్ = తెచ్చిన విధమున, నవ - విపుల - ఫేన - పంక్తులు = క్రొత్తవియు, సమృద్ధములునైన నురుగుల గుంపులు, వెలుఁగున్ = ప్రకాశించును,

తాత్పర్యము : సముద్రములోని రత్నములు ఆకాశముమీఁదికిఁ బోయెనో యని నక్షత్రములను సముద్రుని అలలనెడి చేతుల సమూహములు పెఱికి తెచ్చిన విధమునఁ గ్రొత్తవియు, సమృద్ధములునైన నురువుల పంక్తులు ప్రకాశించును.

విశేషములు : ఊర్మికరములకు నక్షత్రములందు రత్నభ్రాంతి, కావున భ్రాంతిమంత మలంకారము, ర్మి-కరములు - ఊఊర్ములనెడి కరములు - రూపకాలంకారము, ఫేన పంక్తులు ఊర్మికరములు తారకములను దెమల్చి తెచ్చెనా యను నట్లుండెననుటచే నలంకార ముత్ప్రేక్ష. సముద్రుఁడు తన రత్నములన్నియుఁ బైకిఁ బోఁగా వానిని మరలఁ దన యలలచేతులతోఁ బెఱికి తెచ్చుకొనినట్లు నురువు లుండె ననుట.

క. వనధిఁగల నగము లన్నియు
ననిమిషపతిమీఁద నడువ నని యెగసెనొకో
యన నాకాశముఁ దాఁకఁగఁ
దనరఁగ నత్యున్నతోర్మితతి విలసిల్లెన్. 118

అర్థము : వనధిన్ = సముద్రమునందు, కల = ఉన్నట్టి, నగములు = కొండలు, అన్నియున్, అనిమిష - పతి - మీఁదన్ = దేవతాభర్తయైన ఇంద్రునిపైకి, నడువన్ + అని = దండెత్తుటకని, ఎగసెన్ + ఒకో=లేచెనా, అనన్=అనఁగా, అతి + ఉన్నత + ఊర్మి - తతి = మిక్కిలి, యెత్తైన, అలల. సమూహము, ఆకాశమున్ = ఆకాశమును, తాఁకఁగన్ = తాఁకునట్లు, తనరఁగన్ = ఒప్పుగా, విలసిల్లెన్ = ప్రకాశించెను.

తాత్పర్యము : ఇంద్రుఁడు తమఱెక్కలను వజ్రాయుధముతోఁ దెగఁగొట్టి నందులకుఁ గొండల కింద్రునిపైఁగోపము, ఆ కసిఁదీర్చుకొనుటకు సముద్రమునందలి కొండలన్నియు నింద్రునిపై దండెత్త లేచెనా యనునట్లు సముద్రమునందలి మిక్కిలి యెత్తైన అలల గుంపు ఆకాశమునంటుచు నొప్పెను.

విశేషములు : సముద్రమునందలి యలలు కొండలవలె నత్యున్నతము లని భావము. కొండల వంటి అలలు ఆకాశము నంటుటకు ఇంద్రునిపైఁగల కోపము హేతువు కాదు, పైకిలేచుట అలల స్వభావము, హేతువు కానిదానిని హేతువుగాఁ జెప్పుటచే నలంకారము హేతూత్ప్రేక్ష. అలలకును ఆకాశమునకును సంబంధములేదు, సంబంధము లేనిపట్టుల సంబంధమున్నట్లు వర్ణించుటచే సంబంధాతిశయోక్తియు.

చ. ఉడుగని నీరిలోనఁబడియుండఁగ నోపక బాడబాగ్ని వె
ల్వడి వరతీర భూరుహకులంబులపై మొగిఁ గప్పునట్లు దం
దడి నరుణ ప్రవాళక లతల్ తరుసంహతిమీఁదఁ బర్వ చె
ల్వడరి తటాటవుల్ తనరు నబ్ధి బహిర్గత రత్నదీప్తులన్. 119

అర్థము : ఉడుగని = తగ్గని, నీరిలోనన్ = నీటిలోపల, పడి + ఉండఁగన్ + ఓపక = పడియుండలేక, బాడబ + అగ్ని = బడబాగ్ని, వెల్వడి (వెలువడి)= వెలికివచ్చి, వర - తీర - భూరుహ - కులంబులపైన్ = శ్రేష్ఠమైన యొడ్డులందలి చెట్లసమూహములపై, మొగిన్ = పూనికతో, కప్పు + అట్లు = కప్పు విధమున, దందడిన్ = మొత్తముగా, తరు-సంహతి - మీఁదన్ = చెట్ల సమూహముమీఁద, అరుణ-ప్రవాళక - లతల్ = ఎఱ్ఱని పగడపుఁదీఁగలు, పర్వ (పరువు) = వ్యాపించు

పట్టి, వెల్వు (వెలువు) = విధము, అడరి = అతిశయించి, తట + అటవుల్ = తటములందలి అడవులు, అబ్ధి - బహిః + గత - రత్న - దీప్తులన్ = సముద్రమునకు వెలుపల వ్యాపించిన రత్నములయొక్క కాంతులతో, తనరున్ = ఒప్పును.

తాత్పర్యము : ఎప్పటికిని తగ్గని నీటిలోపల నుండఁజాలక బడబాగ్ని పైకివచ్చి యొడ్డుననున్న చెట్ల సమూహములపై వ్యాపించునట్లు, చెట్లగుంపులపై నెఱ్ఱని పగడపుఁదీఁగెలు దట్టముగా వ్యాపించువిధమొప్పఁ దీరస్థారణ్యములు సముద్రమునకు వెలుపల వ్యాపించిన రత్నముల కాంతులతో నొప్పెను.

విశేషము : సముద్రగర్భమున నుండు నగ్నికి బడబాగ్నియని పేరు. అది బడబ (ఆఁడుగుఱ్ఱము) ఆకారమున నుండును గనుక దానికి బడబాగ్ని, బాడబాగ్ని యనుపేరు. అగ్నికి నీరు శత్రువు, బడబాగ్ని ఎంతకాలమని శత్రువైన నీరిలో నడఁగి యుండఁగలదు ? అందుచే నది పైకివచ్చి తీరభూరుహకులములపైఁ బర్వెనా యనునట్లు ఎఱ్ఱని పగడపుఁదీఁగలు దట్టముగాఁ జెట్లపై వ్యాపించెను. అది సముద్రమునకు వెలుపల వ్యాపించు రత్నకాంతులతోఁ దీరస్థారణ్యము లొప్పినట్లుండెను. ఎఱ్ఱని పగడముల కాంతులచేత నడవులు సముద్రబహిర్గత రత్నకాంతులతో నొప్పెను. రత్నముల యెఱ్ఱని కాంతులు వ్యాపించిన యడవులు, సముద్రమున నడఁగియుండఁజాలక పైకివచ్చిన బడబాగ్నిచేఁ గప్పఁబడినట్లుండెను.

బడబాగ్ని తటతరుభూరుహకులంబులపైఁగప్పునట్లు, అబ్ధిబహిర్గతరత్నదీప్తులన్ దీరాటవుల్ తనరు - అలంకార ముత్ప్రేక్ష. బహిస్ + గత - బహిః + గత - పదాంత సకారమునకు విసర్గాదేశము, అ, ఆలు తప్ప మిగిలిన అచ్చుల తరువాత వచ్చు విసర్గమునకు అచ్చులుగాని మృదుహల్లులుగాని పరములగునపుడు రేఫ మాదేశమగును. బహిర్గత.

గీ. వనధి నీరల్లఁ గొనిపోవఁ గని సహింప
కబ్ధి తటి గిట్ట పట్టిన నరుగ నోప
కోలి దొంతులు గొని పడియున్న కారు
మొగుళు లనఁ బూచి తటభూమి మొగళు లమరె. 120

అర్థము; వనధి - నీరు = సముద్రముయొక్క నీరు, అల్లన్ = మెల్లఁగా, కొనిపోవన్ = తీసికొనిపోవఁగా, కని = చూచి, సహింపక = ఓర్వక, అబ్ధి - తటి సంద్రపుటొడ్డు, గిట్ట-పట్టినన్ = ఆ మేఘముల గిట్టలను - వానకాళ్ళను పట్టుకొనఁగా, అరుగన్ + ఓపక = వెడలఁజాలక, ఓలిన్ = క్రమముగా, దొంతులు + కొని = అధికమయి, పడి + ఉన్న, కారు - మొగుళులు = నల్లని మబ్బులు - వర్షాకాలపు మేఘములు, అనన్ = అనునట్లు, మొగిళులు = మొగలులు - గేదఁగులు, పూచి = పుష్పించి, తట - భూమిన్ = తీరభూమియందు, అమరెన్ = ఒప్పెను.

తాత్పర్యము: సముద్రపునీటిని మెల్లఁగాఁగొనిపోవుచుండఁగా సంద్రపుటొడ్డు చూచి, యోర్వక, మేఘముల సమూహము గిట్టలను పట్టుకొనఁగా, వెడలలేక వరుసగా దొంతరలయి పడియున్న నల్లనిమబ్బులనఁగాఁ దీరభూమిని గేదఁగులు పుష్పించి యొప్పెను.

విశేషములు: క్రమక్రమముగాఁ దననీటిని హరించుకొనిపోవు మేఘములను జూచి సముద్రపుటొడ్డు సహింపలేక వాని గిట్టలను బట్టుకొనఁగా దొంతరలై పడియున్న ఆ మేఘములా యనఁ దీరముల మొగళ్లు లున్నవనుటచే నలంకారముత్ప్రేక్ష.

మొగులు + లు, 'బహువచనంబు పరంబగునపు డసంయుక్తంబులై యుదంతంబు లయిన డ ల ర ల కలఘులకారంబు బహుళంబుగా నగు,' మొగుళులు. బాల. అచ్చిక. 13. మొగళులు - మొగలి + లు = 'ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వంబగు' బాల, తత్సమ, 45. మొగలులు. పయి - అచ్చిక 13 చే మొగళులు, రూపాం. మొగలులు, మొగళ్లు. మొగులు (వికృతి) - మేఘము (ప్రకృతి). మొగుళులు - (రూపాం) మొగులులు, మొగుళ్లు, మొగిలులు, మొగిళులు, మొగిళ్లు, మొయిలులు, మొయిళులు, మొయిళ్లు, మొయులులు, మొయుళులు, మొయుళ్లు.

క. సురగిరి కర్ణికగా వి
స్తరితములగు మండలములు దళములుగా న
వ్వారిదమ్ముఁబోలి క్రాలుచు
శరనిధిలో నిఖిలధరణిచక్రము వొలుచున్. 121

అర్థము: సుర - గిరి = దేవతల కొండ - మేరువు, కర్ణిక + కాన్ = తామరదుద్దుగా, విస్తరితములు = వ్యాపించినవి, అగు, మండలములు = దేశములు, దళములు, + కాన్ = రేకులుగా, ఆ + విరి - తమ్మిన్ = ఆ వికసించిన తామర పువ్వును, పోలి, క్రాలుచున్ = ఒప్పుచు, శరనిధిలోన్ = సముద్రములో, నిఖిల - ధరణీ - చక్రము = ఎల్ల, భూవలయము, పొలుచున్ = ఒప్పును.

తాత్పర్యము ; మేరుపర్వతము దుద్దుగాను, వ్యాపించిన దేశములు రేకులుగాను వికసించిన తామరపువ్వువలె సముద్రమునందలి యెల్ల భూవలయము నొప్పును.

విశేషములు: ధరణీచక్రము విరిదమ్మివోలెఁ బొలుచుననుటచే నలంకార ముపమ. సురగిరి కర్ణికయు, మండలములు దళములుగా. నయ్యెననుటచే నా యుపమ రూపకానుప్రాణితము. చక్రము + పొలుచున్ - చక్రమువొలుచున్ - గసడదవాదేశము, బాల. సంధి. 13.

క. హరిఁ దన గర్భమునఁ జరా
చరమయవిశ్వంబు దాల్చి చనువాని సితే
తరమణి వోలె ధరించిన
శరనిధి పెంపేరికైనఁ జనునే పొగడన్? 122

అర్థము: తన - గర్భమునన్ = తన కడుపులో. చర + అచర-మయ - విశ్వంబు = జడములు, అజడములు అనువానితో నిండిన విశ్వము, తాల్చి=ధరించి, చను - వానిన్ = ఒప్పు వానిని, హరిన్ = విష్ణువును, సిత + ఇతర - మణి + పోలెన్ = నల్లని మణి వలె - ఇంద్రనీలమణివలె, ధరించిన = తాల్చిన, శరనిధి - పెంపు = సముద్రము గొప్పతనము, ఏరికిన్ + ఐనన్=ఎవ్వరికైనను, పొగడన్= ప్రశంసించుటకు, చనునే = శక్యమగునా?

తాత్పర్యము: తన కడుపులోఁ జరాచరమయమగు విశ్వముమ ధరించిన విష్ణువును ఇంద్రనీలమణివలెఁ దాల్చిన సముద్రము గొప్పతన మెవరికైనను బొగడఁ దరమా? కాదనుట.

విశేషములు : అలంకార మనుప్రాస. మణి వ్రోలె - మణి + ప్రోలె - గసడదవాదేశము. బాల. సంధి, 13.

వ. అని యనేకవిధ రత్న నికరాకరంబైన రత్నాకరాశేషవిశేషంబులు
బహుప్రకారంబుల విశేషించుచు ధర్మాధర్మ ఫలభోగాస్పదంబైన
ధర్మరాజపురంబున కరిగె నంత. 123

అర్థము: అని, అనేక - విధ - రత్న - నికర + ఆకరంబు = పెక్కు రీతులైన, రత్నముల యొక్క, సమూహమునకు, స్థానము ఐన, రత్నాకర + అశేష - విశేషంబులు = సముద్రము యొక్క, ఎల్ల, ప్రత్యేకతలు, విశేషించుచున్ = స్తుతించుచు. ధర్మ + అధర్మ - ఫల - భోగ + ఆస్పదంబు = ధర్మములు, అధర్మములు అను వాని యొక్క, ఫలముల యొక్క, అనుభవములకుఁ జోటు, ఐన, ధర్మరాజ - పురంబునకున్ = యముని ప్రోలికి, అరిగెన్, అంతన్,

తాత్పర్యము: అని పెక్కు రీతులైన రత్నముల సమూహమునకు స్థానమైన సముద్రము ప్రత్యేకతలను అనేకవిధముల, స్తుతించుచు దక్షుఁడు ధర్మాధర్మముల ఫలముల అనుభవమునకుఁ జోటయిన యముని పురమునకు వెడలెను. అంత - తరువాతి పద్యముతో నన్వయము.

ఉ. అర్మిలితో నగస్త్యముని యాదిగ దివ్యమునీంద్రులున్, మహా
ధర్మ సమేతులై పితృపితామహవర్గముఁ బ్రేతయూథముం,
గర్మములున్, జరారుజలుఁ, గాలములుం దనుఁ గొల్చి పొల్చి రా
ధర్ముఁడు వచ్చె లోకగురు, దక్షుఁ, గళాగమదక్షుఁ గానఁగాన్. 124

అర్థము: అగస్త్య - ముని + ఆదిగన్ = అగస్త్యుఁ డను ముని మొదలుగా. దివ్య - ముని + ఇంద్రులున్ = దేవసంబంధమైన మునిశ్రేష్ఠులును, మహత్ (మహా) + ధర్మ - సమేతులు + ఐ = గొప్పదియగు ధర్మముతోఁ గూడిన వారయి. పితృ - పితామహ - వర్గమున్ = తండ్రులయుఁ, దాతలయు సమూహమును, ప్రేత,

యూథమున్ = నరకమందుండు జీవభేదముల సమూహమును, కర్మములున్ = పుణ్య పాపముల కర్మములను, జరా - రుజలున్ = ముసలితనము, రోగములును, కాల ములున్, తనున్ = తన్ను, కొల్చి = సేవించి, పొల్చి = ఒప్పి, రాన్ = రాఁగా, ధర్ముఁడు = యముఁడు, లోక - గురున్ = లోకములకు గురువైనవాఁడును, కళా + ఆగమ - దక్షున్ = కళలయందును, శాస్త్రములందును సమర్థుఁడైనవాఁడును, అగు, దక్షున్ = దక్షుని, కానఁగాన్ – చూచుటకు, అర్మిలిన్ = ప్రీతితో, వచ్చెన్.

తాత్పర్యము: అగస్త్యుఁడు మున్నుగాఁగల దివ్యులైన మునిశ్రేష్ఠులును, మహాధర్మసహితులై పితృపితామహుల సమూహమును, ప్రేతముల సమూహ మును, పుణ్యపాపములైన కర్మములును, జరా వ్యాధులును, కాలములును దన్నుఁగొలిచి రాఁగా యముఁడు లోకగురుఁడును, గళాశాస్త్రములందు సమర్థుఁడును అగు దక్షునిఁ జూడఁ బ్రీతితో వచ్చెను.

విశేషములు: కొల్చి - పొల్చి, దక్షున్ – కళాగమ దక్షున్ - అలంకారము అనుప్రాసము.

వ. ఇట్లెదురువచ్చి భార్యా సమేతంబుగా వినయ వినమితోత్త మాంగుండై కశ్యపుకంటె విశేషార్చనలం బరితోషితుంజేసిన ధర్మ రాజు వీడ్కొని చంద్రమండలంబున కరిగిన. 125

అర్థము: ఇట్లు, ఎదురువచ్చి, భార్యా - సమేతంబుగాన్ = భార్యలైన ధూమోర్ణ, విజయ యనువారితోఁగూడి. వినయ - వినమిత - ఉత్తమాంగుండు = అడఁకువతో మిక్కిలి వంపఁబడిన శిరస్సు గలవాఁడు, అయి, కశ్యపు - కంటెన్, విశేష + అర్చనలన్ = అధికములయిన పూజలచేత. పరితోషితున్ = సంతోష పెట్టఁబడినవానిని, చేసిన = చేసినట్టి, ధర్మరాజున్ = యముని, వీడ్కొని = వీడి, చంద్ర - మండలంబునకున్, అరిగినన్ = వెడలఁగా.

తాత్పర్యము: ఈ విధముగా నెదురువచ్చి తన భార్యలగు ధూమోర్ణ, విజయ యనువారితోఁగూడి యడఁకువతో శిరస్సు వంచి కశ్యపునికంటెను అధికము

లైన పూజలతో సంతుష్టునిగాఁజేసిన యముని వీడి దక్షుఁడు చంద్రమండలమునకు వెడలఁగా - తరువాతి పద్యముతో నన్వయము,

చ. కువలయబాంధవుండు హిమ గోనికరావృతుఁజేసి మామ కు
త్సవ మొనరంగ ముందటఁ బథశ్రమ మార్చుచువచ్చెఁ దారకా
నివహ నిజౌషధీ కుముదినీ పరివేష్టితుఁడై సుధా సము
ద్భవుఁ డమలాంగుఁ డెంతయు ముదంబున దక్షునిఁగాన నెమ్మితోన్. 126

అర్థము : తారకా - నివహ - నిజ + ఓషధీ - కుముదినీ-పరివేష్టితుఁడు= నక్షత్రముల సమూహము, తనవైన ఓషధులు, కలువతీఁగ అనువానిచేఁ జుట్టఁబడిన వాఁడయి - కూడినవాఁడయి, సుధా - సముద్భవుఁడు = అమృతముతోఁబుట్టినవాఁడు, అమల+అంగుఁడు=నిర్మలమైన శరీరము గలవాఁడు, అగు, కువలయ-బాంధవుండు= కలువ చుట్టము - చంద్రుఁడు, హిమ - గో - నికర+ఆవృతున్=చల్లని కిరణముల సమూహముచే నావరింపఁబడినవానినిగా, చేసి, మామకున్ = మామయైన దక్షునకు, ఉత్సవము = సంతోషము. ఒనరంగన్=కలుగఁగా, పథ-శ్రమము=మార్గాయాసము, ఆర్చుచున్ = పోఁగొట్టుచు, దక్షునిన్, కానన్ = చూచుటకు, నెమ్మితోన్=ప్రీతితో, ఎంతయున్ - ముదంబునన్ = మిక్కిలి సంతోషముతో, ముందటన్ - వచ్చెన్ = ఎదురు వచ్చెను.

తాత్పర్యము : అమృతముతోఁ బుట్టినవాఁడును, నిర్మలమైన శరీరము గలవాఁడును, అగు, కువలయముల చుట్టమైన చంద్రుఁడు తారకల సమూహము, తనయోషధులు, కుముదిని అనువానితోఁ గూడినవాఁడయి, చల్లని కిరణముల సమూహముచే నావరింపఁబడినవానినిగాఁజేసి మామకు సంతోషమును గలుగఁజేసి మార్గాయాసము నపనయించి ప్రీతితో, నెంతయు సంతోషముతో దక్షునిఁజూడ నెదురువచ్చెను.

విశేషములు : గో - 'స్వర్గేషు పశు వాగ్వజ్ర దిఙ్నేత్ర ఘృణి భూ జలే లక్ష్య దృష్ట్యా స్త్రియాం పుంసి గౌః' అమరము. గోశబ్దమునకు స్వర్గము, బాణము, పశువు, వాక్కు, వజ్రాయుధము, దిక్కు, నేత్రము, కిరణము, భూమి, నీరు అను నర్థములు గలవు. నిజ + ఓషధీ = నిజౌషధీ - వృద్ధిసంధి.

వ. ఇట్లెదురువచ్చి కశ్యప ధర్మజుల కంటె విశేషార్చనలు గావించిన సుధాకరు వీడ్కొని సతీ పరమేశ్వరావలోకనార్థియై యనేక దివ్య ఋషి పరివేష్టితుండై చనుదెంచి. 127

అర్థము: ఇట్లు, ఎదురు వచ్చి, కశ్యప ధర్మజుల కంటెన్, విశేష + అర్చనలు=అధికమైన పూజలు, కావించినన్=చేయఁగా, (దక్షుఁడు), సుధాకరున్ = అమృతకిరణుని - చంద్రుని, వీడ్కొని = వీడి, సతీ - పరమేశ్వర + అవలోకన+ అర్థి + ఐ = సతీదేవీపరమేశ్వరులఁ జూడఁగోరినవాఁడయి, అనేక - దివ్య - ఋషి - పరివేష్టితుండు = పెక్కండ్రు దివ్యమునులచేఁ జుట్టఁబడినవాఁడు, ఐ, చను దెంచి = వచ్చి.

తాత్పర్యము: ఈ విధముగా నెదురువచ్చి చంద్రుఁడు కశ్యప ధర్మరాజుల కంటెను నధికముగాఁ బూజింపఁగా, దక్షుఁడు చంద్రుని వీడి. సతీ పరమేశ్వరులను జూడఁగోరి, పెక్కురు దివ్యమునులతోఁ గూడినవాఁడయి వచ్చి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: దివ్య + ఋషి - అకారాద్యచ్చులకు ఋకారము పరమగు నేని సంధి వికల్పము. గుణసంధి యగుచో దివ్యర్షి, కానిచో దివ్యఋషి.

క. ధరణీధరుఁ, బార్థివ శే
ఖరు, సంయుత రాజవంశ కమలార్కుఁ, రథ
ద్విరద హయ భట పరీవృతు,
నరపతిగతిఁ బొలుచు రజతనగపతిఁ గనియెన్. 128

అర్థము: దక్షుఁడు కర్త. ధరణీ-ధరున్ = ధరణిని ధరించువాఁడును-రాజును, పర్వతమును, పార్థివ-శేఖరున్ = రాజశ్రేష్ఠుఁడును, పృథా(భూ)సంబంధమైన శిఖరముతోఁగూడినవాఁడును, సంయుత-రాజ-వంశ-కమల + అర్కున్ = కూడుకొన్న రాజవంశములనెడి పద్మములకు సూర్యుఁడును-సూర్యవంశమువాఁడును, మేలయిన వెదురులనెడి పద్మములకు సూర్యుఁడును, రథ-ద్విరద-హయ-భట- పరీవృతున్ = రథములు, ఏనుఁగులు, గుఱ్ఱములు, బంటులు అనువానితోఁగూడిన వాఁడును, తినిశవృక్షములతోను,

నాగకేసరవృక్షములతోను, (అడవియేనుఁగులతోను), ఆటవికభటులతోను, గుల్మముల తోను గూడినవాఁడును, అగు, నరపతి-గతిన్ = రాజువిధమున, పొలుచు = ఒప్పునట్టి, రజత-నగ-పతిన్ = వెండికొండతేనిని, కైలాసమను పర్వతశ్రేష్ఠమును, కనియెన్ = చూచెను.

తాత్పర్యము : భూమిని భరించువాఁడును-రాజును, పర్వతమును, రాజశ్రేష్ఠులతోఁగూడుకొన్నవాఁడును, పృథివీ (భూ) సంబంధమైన శిఖరములతోఁగూడుకొన్న వాఁడును, రాజవంశములనెడి పద్మములకు సూర్యుఁడైనవాఁడును, శ్రేష్ఠములైన వెదురులనెడి పద్మములకు సూర్యుఁడైనవాఁడును. రథ. గజ. తురగ, పదాతులతోఁగూడినవాఁడును, తినిశవృక్షములతోను. నాగకేసరవృక్షములతోను. (అడవి యేనుఁగులతోను), ఆటవికభటులతోను, గుల్మములతోను గూడినవాఁడును అగు కైలాసపర్వతరాజును జూచెను.

విశేషములు : శ్లేషానుప్రాణితమైన ఉపమ. రాజవంశకమలార్కు-అనుచో రూపకము.

వ. కని తదీయమాహాత్మ్యంబున కాశ్చర్యహృదయుండగుచుం దద్గిరి పాలకానుజ్ఞాతుండై పరమేశ్వరాస్థానంబున కరిగి. 129

అర్థము : కని = చూచి, తదీయ- మాహాత్మ్యంబునకున్ = దానిగొప్పతనమునకు, ఆశ్చర్య-హృదయుండు=ఆశ్చర్యముతోఁగూడిన హృదయముగలవాఁడు, అగుచున్, తద్ + గిరి-పాలక + అనుజ్ఞాతుండు + ఐ = ఆ కొండను రక్షించువానిచే అనుమతింపఁబడినవాఁడయి, పరమేశ్వర + ఆస్థానంబునకున్ = పరమేశ్వరుని యొక్క కొలువునకు, అరిగి = వెడలి.

తాత్పర్యము : దక్షుఁడు కైలాస పర్వతమును జూచి, దాని గొప్పతనమున కచ్చెరువందుచు నా గిరిని రక్షించువాని యనుమతితోఁబరమేశ్వరుని కొలువునకేఁగి-ద్వితీయాశ్వాసమునందలి రెండవ పద్యముతో నన్వయము.

ఆశ్వాసాంతము

ఉ. మారమదప్రహారు, గుణమండనమండితు, సుందరాంగు, దు
ర్వార భవాబ్ధిపారగు, సువర్ణ సవర్ణ శరీరు, సజ్జనా
ధారుఁ, గవీంద్రగాయకబుధస్తుతుఁ, గాశవికాసహాస ది
క్పూరితచారుకీర్తి, మునిపుంగవు, జంగమ మల్లికార్జునున్. 130

అర్థము: మార-మద-ప్రహారున్ = మన్మథునియొక్క గర్వమును హరించినవాఁడును, గుణ-మండన-మండితున్ = సుగుణములనెడి అలంకారములచే, నలంకరింపఁబడినవాఁడును, సుందర + అంగున్ = అందమైన శరీరము గలవాఁడును, దుర్వార-భవ + అబ్ధి-పారగున్ = వారించుటకు శక్యముకాని సంసారమనెడి సముద్రముయొక్క తీరమును బొందినవాఁడును, సువర్ణ-సవర్ణ-శరీరున్ = బంగారముతో సమానమైన శరీరముగలవాఁడును. సత్ + జన + ఆధారున్ = సుజనులకు ఆధారమైనవాఁడును, కవి + ఇంద్ర-గాయక-బుధ-స్తుతున్ = కవిశ్రేష్ఠులచేతను, గాయకులచేతను, పండితులచేతను పొగడఁబడువాఁడును, కాశ-వికాస-హాస-దిశ్ (క్)-పూరిత-చారు-కీర్తిన్ = తెల్లపూల వికాసమువలెను, నవ్వువలెను, దిక్కులందు నిండిన, మనోహరమైన, కీర్తిగలవాఁడును, ముని-పుంగవున్ = మునిశ్రేష్ఠుఁడును, అగు, జంగమ మల్లికార్జునున్.

తాత్పర్యము: మన్మథుని గర్వ మడఁచినవాఁడును, గుణములనెడి అలంకారములచే నలంకరింపఁబడినవాఁడును, అందమైన శరీరముగలవాఁడును, వారించుటకు శక్యముగాని సంసారసముద్రమును దాఁటినవాఁడును, బంగరుచాయతో సమానమైన చాయగల శరీరము గలవాఁడును, సుజనుల కాధారమైనవాఁడును, కవిశ్రేష్ఠులచేతను, గాయకులచేతను, పండితులచేతను నుతింపఁబడువాఁడును, తెల్లపూల వికాసమువలెను, నవ్వువలెను దిక్కుల నిండిన మనోహరమైన కీర్తిగలవాఁడును, మునిశ్రేష్ఠుఁడును అగు జంగమ మల్లికార్జునుని-134వ పద్యములోని 'పొగడఁదగు' నను క్రియతో నన్వయము.

విశేషములు: ఆశ్వాసాంత పద్యములు కృతిభర్త నుద్దేశించినవి సాధారణముగా సంబోధనాంతములుగా నుండుట ఆచారము. కాని యిందు ద్వితీయాంతములుగా నుండుట విశేషము. ఇందు జంగమ మల్లికార్జుననకును శివునకును అభేదము చెప్పఁబడుట గమనింపఁదగినది.

క. భవ మరణాంభః పూరిత
భవ సాగర తరణ సేతు పద్ధతిఁ, జేతో
భవ నిశిత కుసుమ బాణో
ద్భవ రాగ విముక్తుఁ, గమలభవ కులతిలకున్. 131

అర్థము ; భవ .... పద్ధతిన్ భవ = పుట్టుక, మరణ = చావుఅనెడి, అంభస్ (ః) = నీటిచేత, పూరిత = నిండిన, భవ = సంసారమనెడి, సాగర = సముద్రముయొక్క, తరణ = దాఁటుటకు, సేతు = వంతెనయొక్క, పద్ధతిన్ = మార్గము అయినవాఁడును, చేతస్ (ః) + భవ - నిశిత - కుసుమ - బాణ+ఉద్భవ-రాగ-విముక్తున్ - మనసిజునియొక్క (మన్మథునియొక్క), వాఁడియైన, పుష్పబాణములవలనఁబుట్టుకగల, అనురాగమునుండి విడుపుగలవాఁడును, కమల-భవ - కుల తిలకున్ = తమ్మిచూలి (బ్రహ్మ) యొక్క వంశమునందు - బ్రాహ్మణ వంశము నందు శ్రేష్ఠుఁడును, అగు, జంగమ మల్లికార్జునుని పొగడఁదగున్.

తాత్పర్యము ; జననమరణములనెడు నీటితో నిండిన సంసారసముద్రమును దాఁట సేతుమార్గమైనవాఁడును, మన్మథుని వాడియైన పుష్పబాణములనుండి పుట్టిన అనురాగమునుండి విముక్తిఁబొందినవాఁడును, బ్రహ్మవంశ - బ్రాహ్మణవంశ శ్రేష్ఠుఁడును అగు జంగమ మల్లికార్జునుని, (పొగడఁదగును.)

చ. గత మద మత్సరేంద్రియవికార మమత్వ సమస్త సంగతా
గత వసులోభ మోహ భయ కల్మష దుర్వ్యస నాసదీషణా
త్రితయ మనోజ మార్గణుఁ, బ్రదీపితు, నిర్మలినాంతరంగు, నా
నత మునినాథ మస్తు, సుజనస్తుతు, జంగమ మల్లికార్జునున్. 132

అర్థము : గత .... మార్గణున్; గత = పోయిన, మద = గర్వము, మత్సర = అసూయ, ఇంద్రియ - వికార = ఇంద్రియ వికారము, మమత్వ = అహంకారము, సమస్త - సంగత + ఆగత=ఎల్ల సంగతములు, ఆగతములు (తెచ్చి పెట్టుకొన్నవి, వచ్చినవి). వసు-లోభ = ధనాశ, మోహ = మోహము, భయ = వెఱపు, కల్మష = పాపము, దుర్వ్యసన = చెడ్డఅలవాట్లు, అసత్ + ఈషణా - త్రితయ = చెడ్డవియైన ధనేషణ దారేషణ, పుత్త్రేషణ అను మూఁడును, మనోజ -

మార్గణున్ = మన్మథబాణములు గలవాఁడును, ప్రదీపితున్ ప్రకాశించువాఁడును- నిర్మలిన + అంతరంగున్ = స్వచ్ఛమైన మనస్సు గలవాఁడును, ఆనత - ముని - నాథ-మస్తున్= వంపఁబడిన, మునిశ్రేష్ఠులయొక్క శిరస్సులు గలవాఁడును, సుజన - స్తుతున్=మంచివారిచేఁ బొగడఁబడువాఁడును, అగు, జంగమ మల్లికార్జునున్=జంగమ మల్లికార్జునుని, (పొగడఁదగున్,)

తాత్పర్యము : మదము, మాత్సర్యము, ఇంద్రియవికారము, మమత్వము ఎల్ల సంగతానేకములు, ధనాశ, మోహము, భయము. కల్మషము, దుర్వ్యసనములు, పెద్దవియగు ధనేషణ, దారేషణ పుత్రేషణ అనుమూఁడును, మన్మథబాణములు నశించిన వాఁడును, ప్రకాశించువాఁడును, స్వచ్ఛమనస్కుఁడును, శిరసువంచిన మునిశ్రేష్ఠులచే నమస్కరింపఁబడువాఁడును, సజ్జనులచే స్తుతింపఁబడువాఁడును అగు జంగమ మల్లి కార్జునుని. (పొగడఁదగును)

క. అక్షయ నిఖిల కళాగమ
దక్షు, మహోదారు, ధీరుఁ, దత్త్వజ్ఞు, లలా
టాక్ష జనితోగ్ర శిఖి ముఖ
భక్షిత పంచేషుదేహుఁ, బరమోత్సాహున్. 133

అర్థము : అక్షయ....దారున్; అక్షయ=నాశనములేని, నిఖిల = సమస్తమైన, కళా=కళలయందును, ఆగమ=శాస్త్రములందును, దక్షున్ = సమర్థుఁడును మహత్ (మహో)+ఉదారున్=మిక్కిలి గొప్పవాఁడును, ధీరున్=ధైర్యవంతుఁడును, తత్త్వజ్ఞున్=తత్త్వము తెలిసినవాఁడును, లలాట....దేహున్: లలాట+అక్ష= నొసటి కంటినుండి, జనిత=పుట్టిన, ఉగ్ర = తీక్ష్ణమైన, శిఖి = అగ్నియొక్క, ముఖ = కొనచేత, భక్షిత = భక్షింపఁబడిన, పంచ + ఇషు = అయిదుబాణములు గలవాని- మన్మథునియొక్క, దేహున్ = శరీరముగలవాఁడును, పరమ + ఉత్సాహున్ = గొప్ప పూనిక గలవాఁడును, అగు, జంగమ మల్లికార్జునుని, (పొగడఁదగున్).

తాత్పర్యము : నాశనములేని యెల్ల కళలయందును, శాస్త్రములందును సామర్థ్యముగలవాఁడును మహోదారుఁడును, ధీరుఁడును, తత్త్వజ్ఞుఁడును, నొసటి

కంటి మంట కొనచే మన్మథుని శరీరమును భక్షించినవాఁడును, పరమోత్సాహుఁడును అగు జంగమ మల్లికార్జునుని, పొగడఁదగున్,

మాలిని. విగత సకల రాగద్వేషు, నిర్ముక్త దోషున్,
త్రిగుణ పథ చరత్వాతీతుఁ, బ్రజ్ఞా సమేతున్,
సగుణు, నచలు, మోక్షాసక్తు, సంసారముక్తున్,
బొగడఁదగుఁ దురాషాడ్భోగి, నిర్వాణ యోగిన్. 134

అర్థము : విగత - సకల-రాగ - ద్వేషున్ = పోయినయెల్ల రాగద్వేషములు గలవాఁడును, నిర్ముక్త-దోషున్=విడువఁబడిన పాపములు గలవాఁడును, త్రిగుణ - పథ-చరత్వ + అతీతున్ = సత్త్వరజస్తమోగుణముల మార్గమున నడచుటచే, నతిక్రమించినవాఁడును, ప్రజ్ఞా-సమేతున్=బుద్ధితోఁ గూడుకొన్నవాఁడును, సగుణున్= శబ్దాదిగుణములు గలవాఁడును, అచలున్ = నిశ్చలుఁడును, మోక్ష + ఆసక్తున్ = మోక్షమునందుఁ గోరికగలవాఁడును, సంసార-ముక్తున్ = సంసారమునుండి విడువఁబడినవాఁడును, తురాషాహ్ (ట్)+భోగిన్=ఇంద్రుని భోగములవంటి భోగములు గలవాఁడును, నిర్వాణ - యోగిన్ = మోక్షసన్న్యాసి యైనవాఁడును, అగు, జంగమ మల్లికార్జునుని, పొగడన్ + తగున్ = పొగడఁదగును,

తాత్పర్యము : ఎల్ల రాగద్వేషములు నశించినవాఁడును, దోషరహితుఁడును, త్రిగుణరహిత మార్గమున నడచుటచే నతీతుఁడైనవాఁడును, ప్రజ్ఞానముతోఁ గూడినవాఁడును, సగుణుఁడును, స్థిరమైనవాఁడును, మోక్షమునందుఁ గోరిక గలవాఁడును, సంసారమునుండి విడువఁబడినవాఁడును, ఇంద్రభోగములు గలవాఁడును, మోక్షసన్న్యాసియును అగు జంగమ మల్లికార్జునుని బ్రస్తుతింపఁదగును,

విశేషములు : ద్వేషు - దోషు, (అ) తీతు - (స) మేతు, (అ) సక్తు, ముక్తు, భోగి - యోగి- అంత్యానుప్రాసము. తురాషాహ్ - 'సంక్రన్దనో దుశ్చ్యవన స్తురాషా ణ్మేఘవాహనః' 'తురం శత్రువేగం సహత ఇతి తురాషాట్' శత్రువేగమును సహించువాఁడు, ఇంద్రుఁడు. అమరము,

తురాషాహ్ + భోగి-హకారమునకు ఝల్లు (అనునాసికాంతస్థ వర్ణములు తప్ప మిగిలిన హల్లులు) పరమగునపుడును, పదాంతమందును, ఢకారాదేశమగును,

తురాషాఢ్ + భోగి. ఝల్లులకు మృదుహల్లులు (హాళ్ళులు) కాని, అచ్చులుకాని పరములగునపుడు ఆ హల్లుల వర్గమునకుఁ జెందిన తృతీయవర్ణ మాదేశమగును. తురాషాడ్భోగి.

మాలినీ వృత్తమున నాలుగుపాదములందును, ప్రతిపాదమునను న, న, మ, య, య అనుగణము లుండును, 1-9 అక్షరములకు యతిమైత్రి, ప్రాసనియమము గలదు.

గద్యము

ఇది శ్రీమజ్జంగమ మల్లికార్జునదేవ దివ్యశ్రీపాదపంకజ భ్రమరాయమాణ కవిరాజ శిఖామణి నన్నెచోడ ప్రణీతంబైన కుమారసంభవం బను కథయందుఁ బ్రథమాశ్వాసము.

అర్థము : ఇది, శ్రీమత్ + జంగమ మల్లికార్జున దేవ = శ్రీమంతుఁడైన జంగమ మల్లికార్జునదేవునియొక్క, దివ్య = దివ్యములైన, శ్రీపాద-పంకజ = శోభాకరములైన పాదములనెడి పద్మములకు, భ్రమరాయమాణ = తుమ్మెదగా నగుచున్న, 'కవిరాజశిఖామణి' అను బిరుదుగల, నన్నెచోడ - ప్రణీతంబు = నన్నెచోడునిచే రచింపఁబడినది, ఐన, కుమారసంభవంబు, అను, కథ + అందున్, ప్రథమ + ఆశ్వాసము = మొదటి యాశ్వాసము.

తాత్పర్యము :ఇది శ్రీ జంగమ మల్లికార్జున దేవుని దివ్యములైన శ్రీపాదములనెడి పద్మములకుఁ దుమ్మెదగా నగుచున్న 'కవిరాజశిఖామణి' యను బిరుదు గల నన్నెచోడుఁ డనువానిచే రచింపఁబడిన కుమారసంభవ మనెడి కథయందు మొదటి యాశ్వాసము.

విశేషములు : శ్రీపాద పంకజ భ్రమరాయమాణ నన్నెచోడ - రూపకము. శ్రీమత్ + జంగమ - ఝల్లునకు హాళ్ళు పరమగుచుండఁగాఁ దృతీయవర్ణాదేశము. శ్రీమద్ + జంగమ - తవర్గాక్షరములకు చవర్గాక్షరములు పరమైనచో చవర్గవర్ణము లాదేశమగును.

కుమార సంభవము

ద్వితీయాశ్వాసము

క. శ్రీకంఠమూర్తిఁ బుణ్య
శ్లోకు, మహాభాగు, నిఖిల లోకారాధ్యున్,
నాకేశభోగి, సత్య గు
ణాకరు, నచలాత్మ్కు, మల్లికార్జునదేవున్. 1

అర్థము : శ్రీకంఠ-మూర్తిన్ = శివ స్వరూపుఁడును, పుణ్య-శ్లోకున్ = పవిత్రమైన యశస్సుగలవాఁడును, మహాభాగున్ = మహానుభావుఁడును, నిఖిల - లోక + ఆరాధ్యున్ = ఎల్లలోకములచేతఁ బూజింపఁదగినవాఁడును, నాక+ఈశ - భోగిన్ = స్వర్గప్రభువగు నింద్రుని భోగములు గలవాఁడును, సత్య-గుణ + ఆకరున్ = సత్యమనెడి గుణమునకు స్థానమైనవాఁడును, అచల + ఆత్మన్ = స్థిరమైన మనస్సు గలవాఁడును, అగు, మల్లికార్జున దేవున్ = జంగమ మల్లికార్జున స్వామిని.

తాత్పర్యము : శివస్వరూపుఁడును, పవిత్రయశస్కుఁడును, మహానుభావుఁడును, సకలలోక పూజితుఁడును, ఇంద్రభోగియును, సత్యమనెడి గుణమునకు స్థానమైనవాఁడును, స్థిరమైన మనస్సు గలవాఁడును అగు మల్లికార్జునదేవుని.

విశేషములు : ఆశ్వాసాదిపద్యములు కృతిభర్తృ సంబోధనాంతములుగా నుండుట యాచారము, కాని యిందు ద్వితీయాంతములుగా నుండుట విశేషము.

మ. అతి నీలాభ్రవిలంబియై పొలుచు నీహారాద్రియుంబోలె స[1]
త్సుతు సామోద్భవవస్త్రి నెత్తికొని సంతోషంబుతోఁ జూచుచున్
సతి నవ్వించుచు నవ్వుచున్న పరమున్ సర్వేశు దక్షప్రజా
పతి కాంచెన్ సితహాస[2] భా విచలిత బ్రహ్మాండభాండోదరున్. 2

1. వ్రా. ప్ర. సీతాద్రి. 2. వ్రా. ప్ర. హసిత ప్రభా.

అర్థము ; అతి-నీల + అభ్ర-విలంబి + ఐ = మిక్కిలి నల్లనైన మేఘము యొక్క వ్రేలాడుట గలదియై. పొలుచు = ఒప్పునట్టి, నీహార + అద్రియున్ + పోలెన్ = మంచుఁగొండవలె, సత్ + సుతున్ = మంచి కొడుకు, అగు. సామ + ఉద్భవ-వక్త్రున్ = ఏనుఁగుముఖమువంటి ముఖముగలవానిని-గజాననుని, ఎత్తికొని, సంతోషంబుతోన్, చూచుచున్, సతిన్ = సతీదేవిని, నవ్వించుచున్, నవ్వుచున్ + ఉన్న, పరమున్ = గొప్పవానిని, సర్వ + ఈశున్ = సర్వేశ్వరుని-శివుని, సిత-హాస-భా-విచలిత-బ్రహ్మాండ-భాండ + ఉదరున్ = తెల్లని, నవ్వుయొక్క, కాంతిచేత, మిక్కిలి చలించిన, భాండముల వంటి బ్రహ్మాండములు కుక్షిలోఁగలవానిని, దక్ష-ప్రజాపతి, కాంచెన్,

తాత్పర్యము : మిక్కిలి నల్లని మేఘము వ్రేలాడుచున్న మంచుఁగొండవలెఁ గొడుకైన గజానను నెత్తికొని సంతోషముతోఁజూచుచు, సతీదేవిని నవ్వించుచుఁదాను నవ్వుచున్నగొప్పవానిని, సర్వేశ్వరుని, తెల్లని నవ్వుకాంతిచేత మిక్కిలి చలించిన బ్రహ్మాండభాండములు కడుపులోఁగలవానిని దక్షప్రజాపతి చూచెను.

విశేషములు : గజానను నెత్తికొన్న శివుఁడు నల్లనిమేఘము వ్రేలాడు మంచుఁగొండవలె నున్నాఁడు. మేఘము నలుపు, గజాననుఁడు నలుపు, మంచుఁగొండ తెలుపు. శివుఁడు తెలుపు. కుక్షిస్థములైన బ్రహ్మాండభాండములు కదలుచున్న వనఁగా నది అట్టహాసమన్నమాట. అలంకార ముపమ.

వ. కని సర్వాంగాలింగితమహీతల పునఃపునః ప్రణామ సంస్తోత్రాది సత్కారంబులు చేయక దురభిమానంబున నహంకరించియున్న దక్షునింగని విరూపాక్షుం డాక్షేపించి విముఖుండైనం గని దక్షుండు తన యల్లురందఱు చేసిన సత్కారంబులను మొదలియల్లుండైన పరమేశ్వరుండు సేయమికి మనఃక్షుభితుండై క్రమ్మఱ నిజనివాసంబున కరిగి తద్వృత్తాంతం బాత్మేశ్వరి కెఱింగించి మనఃఖేదంబున నున్న దక్షప్రజాపతికిఁ దద్ధర్మపత్ని యిట్లనియె, 3

అర్థము : కని = చూచి, సర్వాం.............సత్కారంబులు: సర్వ = ఎల్ల, అంగ = అవయవములచే, ఆలింగిత = కౌఁగిలింపఁబడిన, మహీ-తల = భూతలము గల, పునః-పునః = మరల మరల, ప్రణామ = నమస్కారములు, సంస్తోత్ర = సంస్తుతులు. ఆది = మున్నగు, సత్కారంబులు = మన్ననలు, చేయక, దురభిమానంబునన్ = దుర్గర్వముతో, అహంకరించి=గర్వించి, ఉన్న = ఉన్నట్టి, దక్షునిన్, కని, విరూపాక్షుండు = వికారముగల కన్నులు గలవాఁడు-శివుఁడు, ఆక్షేపించి = తిరస్కరించి, విముఖుండు + ఐనన్ = పెడమొగము గలవాఁడుకాఁగా, దక్షుండు, కని = చూచి, తన, అల్లురు, అందఱు-చేసిన = అందఱునుజేసిన, సత్కారంబులను, మొదలి + అల్లుండు + ఐన, పరమేశ్వరుండు, చేయమికిన్ = చేయకుండుటకు, మనస్ (ః) + క్షుభితుండు + ఐ = మనసు కలఁగినవాఁడయి, క్రమ్మఱన్ = మరల, నిజ-నివాసంబునకున్=తనదైనగృహమునకు, అరిగి, తద్ + వృత్తాంతంబు, ఆత్మ + ఈశ్వరికిన్ = ప్రాణేశ్వరికి-భార్యకు, ఎఱింగించి, మనస్ (ః) + ఖేదంబునన్ = మనోవిచారముతో, ఉన్న, దక్ష-ప్రజాపతికిన్, తద్ + ధర్మపత్ని = ఆతని భార్య, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: చూచి సాష్టాంగ నమస్కారములు, స్తోత్రములు చేయక దుర్గర్వమున గర్వించియున్న దక్షునిఁజూచి యీశ్వరుఁడు తిరస్కరించి పెడమొగము గలవాఁడయ్యెను. దక్షుఁడు అది చూచి తన యల్లురందఱును జేసిన మర్యాదలు తన మొదలియల్లుఁడగు పరమేశ్వరుఁడు చేయకుండుటకు మనసు కలఁగ మరలఁ దన గృహమునకేఁగి జరిగిన వృత్తాంతమును భార్యకుఁజెప్పి మనోవిచారముతోనున్న దక్షప్రజాపతితో ఆతని భార్య యిట్లు పలికెను.

గీ. 'తల్లిదండ్రులఁ బూజించి తగ వెఱింగి
మన్న పాదవైననే యుత్తమాను లనియుఁ
ప్రియ మెఱుంగు; నం[1] దిచ్చిన బిడ్డ మనకుఁ
బాసె నని యుండుఁడింక నా పలుకులేల ?' 4

[1] ము. ప్ర. నాఁడిచ్చిన.

అర్థము : తల్లిదండ్రులన్, పూజించి, తగవు = ధర్మము, ఎఱింగి, మన్న = మనినట్టి-జీవించినట్టి, వాడవు = ఉన్నతుఁడు, ఐనసే = అయినసే. అత్తమామలు + అనియున్, ప్రియము = మరియాద, ఎఱుంగున్ = తెలియును, అందున్ = అక్కడ, ఇచ్చిన, బిడ్డ, మనకున్-పాసెన్ = మనలను వీడెను-మనది కాదు, అని, ఉండుఁడు + ఇంకన్, ఆ-పలుకులు + ఏల ?

తాత్పర్యము ; 'తల్లిదండ్రులను బూజింపవలయునను ధర్మము నెఱిఁగిన యున్నతుఁడయినసే యత్తమామలను గౌరవింపవలయునని యెఱుఁగఁగలఁడు. శివునకుఁ దల్లిదండ్రులు లేరుగావున నతనికిఁ దల్లిదండ్రులను బూజించుటయే తెలియదు. ఇఁక నత్తమామలను బూజింపవలయునను ధర్మ మతనికెట్లు తెలియును? అచ్చోట నిచ్చిన బిడ్డ మనది కాదని యూరకుండవలయును. అల్లుఁడు గౌరవింపలేదను పలుకు లెందులకు ?'

దక్షయజ్ఞము

వ. అనిన నెండియు నవమానానలోద్దీపిత మనస్తాపంబు సహింపనోపక తదపకారంబునకుం బ్రత్యపకారంబు సేయ నుద్యుక్తుండై యిట్లనియె.౫

అర్థము : అనినన్ = అని భార్యపలుకఁగా, వెండియున్ = మరల, అవమాన + అనల + ఉద్దీపిత - మనస్ + తాపంబు = పరాభవమనెడి అగ్నిచేత ఎక్కువచేయఁబడిన, మనస్ + తాపంబు = మనస్సునందలి సంతాపము, సహింపన్ = ఓర్చుటకు, ఓపక = సమర్థుఁడు గాక, తద్ + అపకారంబునకున్ = ఆతఁడు చేసిన యపకారమునకు, ప్రతి + అపకారంబు = మా అపకారము, చేయన్ = చేయుటకు, ఉద్యుక్తుండు = పూనినవాఁడు, ఐ, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము : అని భార్య యనఁగనే యింకను బరాభవమనెడి అగ్నిచేత నెక్కువచేయఁబడిన మనస్తాపమును సహింపఁజాలక యా యపకారమునకుఁ బ్రత్యపకారముఁ జేయఁబూనినవాఁడయి యిట్లు పలికెను.

విశేషములు : అవమానానల - అవమానమనెడి అనలము - రూపకాలంకారము. ప్రతి + అపకారము - ప్రత్యపకారము - యణాదేశసంధి.

తరువోజ

భువనంబు లన్నియుఁ బుట్టించు కశ్యపుఁడు, వానిఁ గైకొని ప్రోచు చంద్రుండు.
నవయవంబుల వాని నడఁచు ధర్ముంతు నతిభక్తి నా కిచ్చి రర్చన లర్థి
నివి; వారిలోనఁ దా నే పెద్ద[1] పొంది యీశానుఁ డేఁ దనయింటికిఁ జన్న
నవమాన్యుఁ జేసె ? నా యల్లురు నేనునై తన్నుఁ జేయుదు నాగమబాహ్యు, 6

అర్థము: భువనంబులు = లోకములు, అన్నియున్. పుట్టించు = పుట్టించునట్టి, కశ్యపుఁడున్, వానిన్ = ఆ భువనములను, కైకొని = స్వీకరించి, ప్రోచు = రక్షించునట్టి, చంద్రుండున్ = చంద్రుఁడును, అవయవంబులన్ = అవయవములతో, అంతర్భాగములతోఁగూడ - సంపూర్ణముగా ననుట, వానిన్ = ఆ భువనములను- అడఁచు = నశింపఁజేయునట్టి, ధర్ముండున్ = యముఁడును. అతి-భక్తిన్=మిక్కిలి భక్తితో, అర్థిన్ = కోరికతో, నాకున్, అర్చనలు - ఇవి = ఈ పూజలు, ఇచ్చిరి, వారిలోనన్ = ఆ కశ్యపచంద్రధర్ములలో, ఈశానుఁడు = ఈశ్వరుఁడు, తాను, ఏ-పెద్ద - పొంది = ఏమిగొప్పతనమును బొంది, ఏన్ = నేను, తన + ఇంటికిన్, చన్నన్ = వెడలఁగా, అవమాన్యున్ = అవమానింపఁదగినవానినిగా, చేసెన్, నా+ అల్లురున్ + ఏనున్ + ఐ=నా తక్కిన అల్లురును, నేనును, ఒక్కటయి,తన్నున్= ఈశ్వరుని, ఆగమ - బాహ్యున్ = వేదములకు వెలియైనవానినిగా, చేయుదున్.

తాత్పర్యము: భువనముల నన్నిటిని బుట్టించు కశ్యపప్రజాపతియును, ఆ భువనములను అంగీకరించి రక్షించు చంద్రుఁడును, వాని నంతర్భాగములతో నడఁచు ధర్ముఁడును. అతిభక్తితోఁ గోరి నా కీ యర్చన లిచ్చిరి. వారిలోఁ దా నే ఘనత పొంది యీశ్వరుఁడు, నేను దనయింటికి వెడలఁగా న న్నవమానించెను ? నేను దక్కిన యల్లురను గూడి యతని నాగమబాహ్యునిగాఁ జేయుదును.

విశేషములు: ఏ పెద్ద పొంది = ఏ గొప్పతనము-ఘనత పొంది-సూ. వి.

1. వాఁడె

చన్నన్ = చనినన్ - 'పద్వాదుల నవర్ణకంబున కత్వంబును గడహల్లునకు ద్విత్వంబును విభాష నగు.' బాల. క్రియ. 51. అల్లురు - 'పగతాదుల బహువచన లకారంబునకు రేఫం బగు.' బాల. ఆచ్ఛిక. 5. నా యల్లురు నేను నై తన్నుఁ జేయుదును అని కాక చేయుదుము అనుట సరియైనఁదగునేమో !

తరువోజ-నాలుగుపాదము లుండును. ప్రతిపాదమునను మూఁ డింద్రగణములు, నొక సూర్యగణము, పరల మూఁ డింద్రగణములు నొక సూర్యగణము నుండ వలయును. మొదటి యక్షరమునకును, మూఁడవగణము మొదటి యక్షరమునకును, అయిదవగణము మొదటి యక్షరమునకును, ఏడవగణము మొదటి యక్షరమునకును యతిమైత్రి. ప్రాసనియమము గలదు.

వ. అని విచారించి కృతనిశ్చయుండై మహాధ్వరప్రారంభాభిముఖుండై
చతుర్దశభువనాంతరానేకజనంబుల రావించినం దదీయాజ్ఞాప్రేరితులై. 7

అర్థము: అని, విచారించి = ఆలోచించి, కృత - నిశ్చయుండు + ఐ = చేయఁబడిన నిశ్చయముగలవాఁడై - నిశ్చయించుకొన్నవాఁడై, మహత్ (మహా) + అధ్వర - ప్రారంభ + అభిముఖుండు + ఐ = గొప్పయజ్ఞముయొక్క పూనికకు సిద్ధపడినవాఁడయి, చతుర్ + దశ - భువన + అంతర + అనేక - జనంబులన్ = పదునాలుగులోకములందలి పెక్కండ్రు జనులను, రావించినన్ = రప్పింపఁగా తదీయ + ఆజ్ఞా-ప్రేరితులు + ఐ = ఆతనిదైన ఆనచేఁ బ్రేరేపింపఁబడినవారయి.

తాత్పర్యము: అని యాలోచించి నిశ్చయించుకొన్నవాఁడయి గొప్ప యజ్ఞమును బ్రారంభించుటకు సిద్ధపడి పదునాలుగు భువనములందలి పెక్కండ్రు జనులను రప్పింపఁగా వారు ఆతని యాజ్ఞచేఁ బ్రేరేపింపఁబడినవారయి. తరువాతి పద్యముతో నన్వయము.

సీ. హరి పితామహ పురందర లోకపా లార్క
వసు రుద్ర సురవైద్య వరమునీంద్ర
చారణ గరుడ ప్రజాపతి కిన్నర
గంధర్వ రాక్షస ఖచర సిద్ధ
సాధ్య సు రాహి పిశాచ మరు ద్గ్రహ
విద్యాధరో ఽప్సరో విప్ర మనుజ
ది క్కులశైల నదీ సాగ రాగమ
ధర్మ వేద పురాణ తర్క శాస్త్ర

తే. నిచయ మాది గాఁగ సచరాచరాత్మకం
బగు పదార్థ మెల్ల నా క్షణంబ
తగు విభూతి మెఱసి దక్షప్రజాపతి
యజ్ఞమునకు వచ్చె నతి ముదమున. 8

అర్థము : హరి = విష్ణువు, పితామహ = బ్రహ్మ, పురందర = ఇంద్రుఁడు, లోక - పాల = లోకపాలకులు, అర్క = సూర్యుఁడు, వసు = ఎనమండ్రు వసువులు, రుద్ర = ఏకాదశ రుద్రులు, సుర - వైద్య = దేవతలవైద్యులైన అశ్వినీదేవతలు, వర = శ్రేష్ఠులైన, ముని + ఇంద్ర = మునిశ్రేష్ఠులును,

చారణ = చారణులు, గరుడ = గరుడులు, ప్రజాపతి = ప్రజాపతులు, కిన్నర = కిన్నరులు, గంధర్వ = గంధర్వులు, రాక్షస = రాక్షసులు, ఖచర = ఖేచరులు, సిద్ధ = సిద్ధులు.

సాధ్య = సాధ్యులు, సుర = దేవతలు, అహి = నాగులు, పిశాచ = పిశాచులు, మరుత్ = మరుత్తులు, గ్రహ = గ్రహములు, విద్యాధర = విద్యాధరులు, అప్సరస్ = అచ్చరలు, విప్ర = బ్రాహ్మణులు, మనుజ = మనుష్యులు,

దిశ్ (క్) = దిక్కులు, కుల-శైల = కులపర్వతములు, నదీ = నదులు, సాగర = సముద్రములు, ఆగమ = శాస్త్రములు, ధర్మ = ధర్మములు, వేద = దములు

పురాణ = పురాణములు, తర్క = తర్కశాస్త్రము, శాస్త్ర-నిచయము=శాస్త్రముల సమూహము, ఆది - కాఁగన్ = మొదలుగాఁగల, స-చర + అచర + ఆత్మకంబు = చరములు, అచరములు అనువానితోఁ గూడినది, అగు, పదార్థము + ఎల్లన్ = వస్తు సమూహమంతయు, ఆ - క్షణంబు + ఆ = ఆ క్షణమే, తగు = తగునట్టి, విభూతి = ఐశ్వర్యము, మెఱపి = ప్రకటించి, అతి - ముదమునన్ = మిక్కిలి సంతోషముతో, దక్ష - ప్రజాపతి = దక్షప్రజాపతియొక్క, యజ్ఞమునకున్, వచ్చెన్.

తాత్పర్యము: విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు, లోకపాలురు, సూర్యుఁడు, వసువులు, రుద్రులు, అశ్వినీదేవతలు, శ్రేష్ఠులైనమునీంద్రులు, చారణులు, గరుడులు, ప్రజాపతులు, కిన్నరులు, గంధర్వులు, రాక్షసులు, ఖచరులు, సిద్ధులు, సాధ్యులు, దేవతలు, నాగులు, పిశాచులు, మరుత్తులు, గ్రహములు, విద్యాధరులు, అప్సరసలు, విప్రులు, మనుష్యులు, దిక్కులు, కులపర్వతములు, నదులు, సముద్రములు, ఆగమములు, ధర్మములు, వేదములు, పురాణములు, తర్కశాస్త్రము, శాస్త్రముల సమూహము మున్నుగాఁగల చరములు, అచరములు అనువానితోఁగూడిన సర్వ పదార్థమును ఆ క్షణమే ఉచితమైన ఐశ్వర్యమును ప్రకటించుచు మిక్కిలి సంతోషముతో దక్షప్రజాపతి యజ్ఞమునకు విచ్చేసెను.

విశేషములు: పితామహ - 'బ్రహ్మాత్మభూః సురజ్యేష్ఠః పరమేష్ఠీ పితామహః'- పితౄణాం పితా - తండ్రులకుఁ దండ్రి-బ్రహ్మ- అమరము. పురందర - 'వృద్ధశ్రవాః సునాసీరః పురుహూతః పురందరః' - 'పురు భూయిష్ఠం హూయతే యజ్ఞేషు' యజ్ఞములందు మిక్కిలి పిలువఁబడువాఁడు - లేదా 'పురు నామానం అసురం హతవా నితి వా' - పురువనెడి రాక్షసునిఁ జంపినవాఁడు లేదా పురాణి అరీణాం దారయతీతి పురందరః-శత్రుపురములను నశింపఁజేయువాఁడు - ఇంద్రుఁడు. అర్కులు=పండ్రెండుగురు, వసువులు = ఎనమండ్రు, రుద్రులు = పదునొకండుగురు, సురవైద్యులు = ఇద్దఱు, గ్రహములు = తొమ్మిది, దిక్కులు = ఎనిమిది, కులశైలములు = ఏడు, మహేంద్రము, మలయము, సహ్యము, శుక్తిమంతము, గంధమాదనము, వింధ్యము, పారియాత్రము, సాగరములు = ఏడు, లవణ, ఇక్షు, సురా, సర్పిస్ (నేయి), దధి, క్షీర, జల సముద్రములు. వేదములు = నాలుగు - ఋక్కు, యజుస్సు, సామము, అథర్వము, పురాణములు=పదునెనిమిది- బ్రాహ్మము, పాద్మము, వైష్ణవము, శైవము

భాగవతము, నారదీయము, మార్కండేయము, ఆగ్నేయము, భవిష్యత్తు, బ్రహ్మ కైవర్తము, లైంగము, వారాహము, స్కాందము, వామనము, కౌర్మము, మాత్స్యము, గారుడము, బ్రహ్మాండము, శాస్త్రములు = ఆఱు. తర్క, వ్యాకరణ, ధర్మ, మీమాంసా, వైద్య, జ్యోతిషములు.

వ. తదనంతరంబ నిజ కులపాలికా సమన్వితులై కశ్యప యమ చంద్రులు తమ తమ విభవంబులు మెఱసి మహోత్సాహంబునం జనుదెంచి; రంత నఖిల భువనాధీశ్వ రాకీర్ణంబై, కనక రౌప్యాది సమస్త వస్తు సంపూర్ణంబై, యతి రమణీయంబగు నిజ పుర్యోత్సవంబు గని పరమానందహృదయుండై దక్షప్రజాపతి బృహస్పతి దత్త ముహూర్తంబునం గ్రతుదీక్షితుండై పటు పటహ పణవ ఝంఝ తుత్తుంభ మృదంగ శంఖ కాహళ కాంస్య వేణు వీణా తత విపంచికా ఘన సుషిరా ద్యాతోద్య ధ్వానంబుల నధఃకరించి మంగళ పాఠక పఠనానూన గాన వేదాశీర్వాదాది నాదంబులు నిర్మథ్యమాన సముద్రఘోషంబు నధఃకరించి మ్రోయు ఘనగర్జన రవంబులుం బోలె రోదసీ వివరాపూరితంబులై మహాధ్వని చెలంగుచుండ. 9

అర్థము ; తద్ + అనంతరంబు + అ = ఆ పిమ్మటనే, నిజ - కుల పాలికా - సమన్వితులు + ఐ = తమ కులస్త్రీలతోఁ గూడినవారయి, కశ్యప యమ చంద్రులు = కశ్యపుఁడును, యముఁడుమ, చంద్రుఁడును, తమ - తమ - విభవంబుల = తమ తమ యైశ్వర్యములు, మెఱసి = ప్రకటించి, మహత్ (మహో) + ఉత్సాహంబునన్ = గొప్ప పూనికతో, చనుదెంచిరి = వచ్చిరి.

అంతన్, అఖిల - భువన + అధి + ఈశ్వర + ఆకీర్ణంబు + ఐ = ఎల్ల లోకముల ప్రభువులచే వ్యాప్తమయి, కనక-రౌప్య + ఆది - సమస్త - వస్తు - సంపూర్ణంబు + ఐ = బంగారము, వెండి మున్నగు నెల్ల వస్తువులతో, నిండినదయి, అతి - రమణీయంబు = మిక్కిలి మనోహరము, అగు, నిజ-పుర + ఉత్సవంబు = తన దైన నగరముయొక్క వేడుక, కని, పరమ + ఆనంద - హృదయుండు + ఐ = గొప్ప సంతోషముతోఁగూడిన హృదయము, గలవాఁడయి, దక్షప్రజాపతి, బృహస్పతి-

దత్త - ముహూర్తంబునన్ = బృహస్పతిచేతఁ పెట్టఁబడిన ముహూర్తమునందు, క్రతు - దీక్షితుండు + ఐ = యజ్ఞమునందు దీక్ష వహించినవాఁడయి,

పటు .... ధ్వానంబులన్ : పటు=పెద్దదియగు, పటహ=తప్పెట, పణవ = చర్మవాద్యవిశేషము, ఝంఝ = ఝంఝమను వాద్యవిశేషము, తుత్తుంభ = తుత్తుంభ మనుపేరుగల వాద్యము, మృదంగ = మద్దెల, శంఖ, కాహళ = బాకా, కాంస్య= కంచు వాద్యము, వేణు=పిల్లనగ్రోవి, వీణా, తత=వీణలోనగువాద్యవి. విపంచికా = వీణ, ఘన=కంచుతాళమువంటి వాద్యవి. సుషిర=బెజ్జములుగలవాద్యవిశేషము, ఆది= మున్నుగాఁగల, ఆతోద్య = వాద్యిత్రము - తతము, ఆనద్ధము, సుషిరము, ఘనము అను వాద్యచతుష్టయము, అనువానియొక్క. ధ్వానంబులన్=ధ్వనులను, అధఃకరించి= క్రిందుచేసి, మంగళ .... నాదంబులు : మంగళ = శుభకరములగు, పాఠక = చదువువారియొక్క, పఠన = చదువుటయందలి, అనూన = తక్కువకాని, గాన = గానముతోడి, వేద + ఆశీర్వాద = వేదాశీస్సులు, ఆది = మున్నగు, నాదంబులు= ధ్వనులు, నిర్మథ్యమాన = మథింపఁబడుచున్న, సముద్ర = సముద్రముయొక్క, ఘోషంబున్ = ధ్వనిని, అధఃకరించి = తిరస్కరించి, మ్రోయు = ధ్వనించు, ఘన-గర్జన-రవంబులున్ + పోలెన్ = మేఘముల ఉఱుముల ధ్వనులవలె, రోదసీ - వివర + ఆపూరితంబులు + ఐ = భూమ్యాకాశముల నడిమి ప్రదేశపు టవకాశము నందు అంతట నిండినవయి, మహత్ (మహా) + ధ్వని=పెద్ద ధ్వని, చెలంగుచున్+ ఉండన్ = మ్రోయుచుండఁగా,

తాత్పర్యము ; ఆ పిమ్మటనే తమభార్యలతోఁ గూడినవారయి కశ్యపుఁడు, యముఁడు, చంద్రుఁడు తమ తమ యైశ్వర్యములు ప్రకటించి గొప్ప పూనికతో వచ్చిరి. అంత నెల్ల లోకపాలకులతో వ్యాపించినదయి, బంగారు వెండి మున్నగు నెల్ల వస్తువులతో నిండినదయి, మిక్కిలి మనోహరమగు తన నగరము వేడుకను·జూచి, మిక్కిలి సంతోషించినవాఁడయి దక్షుఁడు బృహస్పతి నిర్ణయించిన ముహూర్తమున యజ్ఞదీక్ష వహించి, పటహ, పణవ, ఝంఝ, తుత్తుంభ, మృదంగ, శంఖ, కాహళ, కాంస్య, వేణు, వీణా, తత, విపంచికా, ఘన, సుషిరములు మున్నగు నాతోద్యధ్వనులను గ్రిందుపఱిచి మంగళపాఠకులు పఠించు వేదాశీర్వాదములు. మథింపఁబడుచున్న సముద్రఘోషమును గ్రిందుచేసి మ్రోయు నుఱుముల చప్పుడులవలె భూమ్యాకాశముల

నడిమి ప్రదేశమున నిండినవై గొప్పధ్వని మ్రోయుచుండఁగా - తరువాతి పద్యముతో నన్వయము.

వి శే ష ము లు : పటహాది వాద్యధ్వనులను గ్రిందుచేయు మంగళపాఠకులు పఠించు వేదాశీర్వాదములు మథింపఁబడుచున్న సముద్రఘోషమును గ్రిందుపఱుచు నుఱుముల చప్పుడులవలె నున్న వనుట. అలంకార ముపమ.

క. బ్రహ్మరథ మెక్కి విష్ణు
బ్రహ్మామరపాది దేవ పరివృతుఁడై యా
బ్రహ్మఋషినుతుఁడు దక్ష
బ్రహ్మ లసద్యాగమంటపంబున కరిగెన్. 10

అ ర్థ ము : ఆ - బ్రహ్మ+ఋషి - నుతుఁడు = ప్రసిద్ధులైన, బ్రహ్మర్షులచేఁ బొగడఁబడువాఁడగు, దక్ష-బ్రహ్మ = దక్ష ప్రజాపతి, బ్రహ్మ-రథము=బ్రాహ్మణులు మోయురథము, ఎక్కి, విష్ణు - బ్రహ్మ + అమరప+ఆది - దేవ - పరివృతుఁడు+ ఐ= విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు మున్నగు దేవతలతోఁ గూడినవాఁడయి, లసత్ + యాగ - మంటపంబునకున్ = ప్రకాశించుచున్న యజ్ఞమంటపమునకు, అరిగెన్ = వెడలెను.

తా త్ప ర్య ము : ప్రసిద్ధులైన బ్రహ్మర్షులచేఁ బొగడఁబడు దక్షప్రజాపతి బ్రాహ్మణులుమోయురథము నెక్కి విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు మొదలుగాఁగల దేవతలతోఁ గూడినవాఁడయి యజ్ఞమంటపమున కేతెంచెను.

వి శే ష ము లు : అమరప - అమరాన్ పాతీతి అమరపః - అమరులను పాలించువాఁడు - ఇంద్రుఁడు, బ్రహ్మ + ఋషి - అకారాద్యచ్చులకు 'ఋ' కారము పరమగునేని సంధి వికల్పము. బ్రహ్మఋషి - బ్రహ్మర్షి. లసత్ + యాగ = ఝల్లులకు హశ్శులు పరము లగునపుడు తృతీయవర్ణాదేశము. లసద్యాగ

వ. ఇట్లధికతర విభూతితో ధర్మపత్నీసమేతుఁడై యజ్ఞోపకరణద్రవ్యాద్యనేకద్రవ్య పరిపూర్ణంబై నానావిధాలంకృతంబై యతిరమణీయంబైన

యజ్ఞశాల ప్రవేశించి యజమానస్థానంబు నలంకరించుచుండె; నంత విధి విహిత విధానంబుగ ఋత్విగ్గణంబులు త్రికుండంబుల జాతవేదాహ్వానంబు చేసి యథాక్రమంబున హోమంబు చేయందొడంగి రంత నక్కడ. 11

అర్థము: ఇట్లు, అధికతర - విభూతితోన్ = మిక్కిలిగొప్పదియగు. సంపదతో, ధర్మపత్నీ - సమేతుండు + ఐ = భార్యాసహితుఁడయి, యజ్ఞ + ఉపకరణ - ద్రవ్య + ఆది + అనేక - ద్రవ్య - పరిపూర్ణంబు + ఐ = యజ్ఞసాధనములైన వస్తువులు మున్నగు పెక్కు పదార్థములతో నిండినదయి, నానా- విధ + అలంకార + అలంకృతంబు + ఐ = పెక్కు రీతులైన అలంకారములచేత, అలంకరింపఁబడినదయి, అతి - రమణీయంబు = మిక్కిలి రమ్యము, ఐన, యజ్ఞశాల, ప్రవేశించి, యజమాన - స్థానంబున్ = యజ్ఞకర్తయొక్క స్థానమును, అలంకరించుచున్ + ఉండెన్. అంతన్, విధి - విహిత - విధానంబుగన్ = వేదోక్తపుగురీతిని, ఋత్విజ్ + గణంబులు = యాజకుల సమూహములు, త్రి - కుండంబులన్ = మూఁడు కుండములందు, జాతవేద + ఆహ్వానంబు చేసి = అగ్ని నాహ్వానించి, యథాక్రమంబునన్ = క్రమము నతిక్రమింపక, హోమంబు, చేయన్ + తొడంగిరి = చేయమొదలిడిరి. అంతన్, అక్కడ.

తాత్పర్యము: ఇట్లు మిక్కిలి అధికమైన సంపదతో భార్యాసహితుఁడై యజ్ఞసాధనములతో నిండినదయి, పెక్కురీతులైన అలంకారములచే నలంకరింపఁబడినదయి, మిక్కిలి మనోహరమైన యజ్ఞశాలను ప్రవేశించి దక్షుఁడు యజ్ఞకర్తృస్థానము నలంకరించుచుండెను. అంత వేదోక్తప్రకారమున యాజకసమూహములు మూఁడుకుండములందు అగ్ని నాహ్వానించి క్రమముఁ దప్పక హోమముచేయ నారంభించిరి. అంత నక్కడ- తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ఆది + అనేక = ఆద్యనేక- యణాదేశసంధి, ఋత్విజ్ + గణ . చవర్గాక్షరములకు ఝల్ వర్ణములు (అనునాసికములు, అంతస్థములు తప్ప తక్కిన వర్ణములు) పరమగునపుడును. పదాంతమునందును కవర్గాక్షరములు ఆదేశము లగును, ఋత్విక్ + గణ - ఝల్లులకు హశ్శులు పరములగునపుడు తృతీయ వర్ణాదేశము- ఋత్విగ్గణ. జాతవేదస్ : 'కృపీటయోని ర్జ్వలనో జాతవేదా స్తనూనపాత్ - జాతాః

వేదాః యస్మాత్ సః జాతవేదాః - ఇతనివలన వేదములు పుట్టినవి. - అగ్ని, అమరము. యథాక్రమము - క్రమ మనతిక్రమ్య - క్రమము నతిక్రమింపక - అవ్యయీభావ సమాసము. జాతవేదస్ + ఆహ్వానము = జాతవేద ఆహ్వానము కావలయునే కాని జాతవేదాహ్వానమగుట విచార్యము. హ్రస్వ - అకారము తరువాత వచ్చు విసర్గము, హ్రస్వ - అకారభిన్నమైన అచ్చుపరమగునపుడు లోపించును. విసర్గము లోపింపఁగా నన్నిహితమైన యచ్చులకు సంధి లేదు.

క. తన విభవము దక్షుఁడు త్రిణ
యను దేవికిఁ జూపి మెఱయ నని ముందఱ వం
చిన వనితలు కైలాసం
బునకు నరిగి కనిరి సకలభువనాధీశున్. 12

అర్థము: దక్షుఁడు. తన - విభవమున్ తనయైశ్వర్యమును, త్రిణయను - దేవికిన్ = ముక్కంటి (శివుని) భార్యకు - సతికి, చూపి, మెఱయన్ + అని = ప్రకాశించుటకని. ముందఱ = ముందుగా, పంచిన = పంపినట్టి, వనితలు = స్త్రీలు, కైలాసంబునకున్, అరిగి, సకల - భువన + అధి + ఈశున్ = ఎల్లలోకముల ప్రభువును - శివుని, కనిరి = చూచిరి.

తాత్పర్యము: దక్షుఁడు తన యైశ్వర్యమును ముక్కంటిభార్యయైన సతీదేవికిఁ జూపి వారిని బరిహసించుటకై ముందుగాఁ బంపిన స్త్రీలు కైలాసమున కేఁగి యెల్ల లోకముల ప్రభువగు శివునిఁ జూచిరి.

విశేషములు: త్రిణయన, త్రినయన రూపములు రెండును గలవు. ముందఱ + పంచిన - గసడదవాదేశము. బాల. సంధి. 13. ముందఱ వంచిన.

వ. కని సర్వాంగీణ ప్రణామలై నిజాగమనప్రయోజనం బెఱింగించి పరమేశ్వరానుజ్ఞాతలై సతీదేవిం దోడ్కొని దివ్యవిమానారూఢలై మనోజవంబునం జనుదెంచి రంత. 13

అర్థము : కని = చూచి, సర్వాంగీణ - ప్రణామములు + ఐ = సాష్టాంగ నమస్కారము గలవారయి, నిజ + ఆగమన - ప్రయోజనంబు = తమదైన రాకకు ఫలము, ఎఱింగించి = తెలిపి, పరమేశ్వర + అనుజ్ఞాతలు + ఐ=పరమేశ్వరునిచే ననుమతింపఁబడినవారయి, సతీ - దేవిన్, తోడ్కొని = తీసికొని, దివ్య - విమాన+ ఆరూఢులు + ఐ = దేవసంబంధమైన విమానము నెక్కినవారయి, మనస్ (ః) + జవంబునన్ = మనోవేగముతో, చనుదెంచిరి = వచ్చిరి, అంతన్.

తాత్పర్యము : చూచి సాష్టాంగదండప్రణామముచేసి తాము వచ్చిన పని తెలిపి పరమేశ్వరుని యనుమతిఁ బొంది సతీదేవిని దోడ్కొని దివ్యవిమానము నధిరోహించి మనోవేగముతో వచ్చిరి. అంత-తరువాతి పద్యముతో నన్వయము.

క. ఆతత మణి రుచి నభ ము
ద్ద్యోతింపఁగ, నతులగతి రయోద్గత రుచి ను
ర్వీతల మద్రువఁగ, నుల్కా
పాతం బను కడఁకఁ దత్సభాసదు లులుకన్. 14

అర్థము : ఆతత - మణి - రుచిన్ = అధికమైన, మణులకాంతిచేత, నభము = ఆకాశము, ఉద్ద్యోతింపఁగన్ = మిక్కిలి ప్రకాశింపఁగా, అతుల - గతి - రయ + ఉద్గత - రుచిన్ = సాటిలేని గమనముయొక్క వేగమువలన వెలువడిన కాంతిచేత, ఉర్వీతలము = భూతలము, అద్రువఁగన్ = అదురఁగా, తద్ - సభా సదులు = ఆ దక్షుని సభలోనివారు, ఉల్కా - పాతంబు = కొఱకచ్చుయొక్క పడుట, అను కడఁకన్ = అను యత్నముతో - తలఁపుతో, ఉలుకన్ = భయ పడఁగా -

తాత్పర్యము : అధికమైన మణుల కాంతిచే నాకాశము మిక్కిలి ప్రకాశింపఁగను, సాటిలేని గమనవేగమువలన వెలువడిన కాంతిచే భూతలము అదురఁగను- దక్షుని సభలోనివారు ఉల్క పడినదేమో యని భయపడఁగను - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు ; అద్రువఁగన్ - ఇందు 'అ' గురువు కాదు. అదురుచు- 'చుక్పరక రు వర్ణంబునకు ముందఱి దువర్ణంబు నుత్వంబునకు లోపంబు విభాష నగు నగుచోఁ దత్పూర్వంబు గురువు కాదు.' బాల. ప్రకీర్ణ. 20. అద్రుచు - 'తుమర్థభావ లక్షణంబులందు నుజీ యగు.' బాల. క్రియ. 40. అద్రుచు + నుజీ - 'అగమాన్య చకారంబుల కద్విరుక్తంబులకు ముత్తు పరంబగునపుడు ప వ లగు.' బాల. క్రియ. 88. అద్రువు + నుజీ 'జీత్తు వరంబగునప్పుడుత్వంబున కత్వంబగు' బాల. క్రియ. 20. అద్రువను - 'నుజ్యంతంబగు నగు ధాతువు క్రియావిశేషణంబుల కప్రయుక్తం బగు నుజీకి విభాష నగు,' బాల. క్రియ. 115, 'దానికి హ్రస్వంబు విభాష నగు.' బాల. క్రియ. 116. అద్రువఁగను. ఉల్కాపాతం బను కడఁకన్ - అలంకారము భ్రాంతిమంతము,

క. జానఱి పశుపతి నుఱక వి
తాన మహారంభుఁడైన దక్షుం డను న
జ్ఞానికి మునుకొని వచ్చు వి
మానం బన నమరి సతి విమానము వచ్చెన్. 15

అర్థము : జాను + అఱి = ఒప్పుతప్పి, పశుపతిన్ = ఈశ్వరుని, ఉఱక = గణింపక, వితాన - మహత్ (మహా) + ఆరంభుఁడు = యజ్ఞముయొక్క గొప్ప పూనికగలవాఁడు, ఐన, దక్షుండు + అను + అజ్ఞానికిన్ - దక్షుఁ డను తెలివిమాలిన వానికి, మునుకొని = ముందుగా, వచ్చు విమానంబు + అనన్ = వచ్చెడి యవమానమో యనునట్లు. అమరన్ = ఒప్పఁగా, సతి - విమానము = సతీదేవియొక్క విమానము, వచ్చెన్.

తాత్పర్యము : ఒప్పు తప్పి యీశ్వరుని లక్ష్యపెట్టక యజ్ఞము నారంభించిన దక్షుఁడనెడి యజ్ఞానికి ముందు రానున్న యవమానమో యనునట్లు సతీదేవి విమానము వచ్చెను,

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష. అను + అజ్ఞానికిన్ 'ఉదంతమగు తద్ధర్మార్థవిశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' అను నజ్ఞానికిన్. బాల. సంధి. 33, వితానము - (నానా.) యజ్ఞము, చాందిని, దిండు, సమూహము, అదను.

సతీదక్షుల వివాదము

వ. వచ్చి ముఖమంటపోపకంఠంబున విమానావతరణంబు సేసిన దాక్షాయణికిం జంద్రరేఖ[1] ననేకవిద్యుల్లేఖానికరంబునుం బోలె శివగణికా సహస్రంబు పరివేష్టించి. 16

అర్థము : వచ్చి, ముఖ - మంటప+ఉపకంఠంబునన్= ద్వారమండపమునకు సమీపమున, విమాన + అవతరణంబు + చేసిన = విమానమునుండి దిగిన, దాక్షాయణికిన్ = దక్షునికూఁతురైన సతికి, చంద్ర - రేఖన్ = చంద్రకళను, అనేక - విద్యుత్ + లేఖా - నికరంబునున్ + పోలెన్=పెక్కు మెఱపుతీఁగల సమూహము వలె, శివగణికా - సహస్రంబు=శివునివేశ్యల వేయి-వేవురు శివవేశ్యలు, పరివేష్టించి= చుట్టి - పరివేష్టింప అని యుండుట లెస్స - చుట్టఁగా.

తాత్పర్యము : వచ్చి ద్వారమండపమునకు దగ్గఱగా విమానమును దిగిన సతీదేవిని జంద్రకళను పెక్కుమెఱపుతీఁగల సమూహమో యనునట్లు వేవురు శివవేశ్యలు చుట్టుముట్టఁగా - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: అలంకార ముత్ప్రేక్ష. మంటపము (వికృతి) - మండపము (ప్రకృతి) - కొందఱు మంటపమును సంస్కృతపదముగా వాడిరి. ఇచ్చట సశ్లే జరగినది. విద్యుత్ + లేఖా - తవర్గ వర్ణములకు లకారము పరమగుచోఁ బరసవర్ణ మాదేశమగును. విద్యుల్లేఖా.

సీ. కనదపాంగావలోకన దీప్త లుత్ఫుల్ల
 కమలపుష్పోపహారములు గాఁగ,
నలస దోదూయమా నామోద నిశ్శ్వాస
 పవనంబు లగరు ధూపములు గాఁగ,
మహనీయ జాజ్వల్యమాన భూ షామల
 రత్నప్రభాతు లారతులు గాఁగ,
మణిమయ మంజీర ఝణఝణత్కారాది
 రుతము లింపారు సంస్తుతులు గాఁగ,

1. వా. ప్ర. చంద్రరేఖావృతానేక.

ఆ. అభవమూ ర్తియైన యాగాధిపతి కర్చ
లిచ్చు కరణి వినుతు లెసకమెసఁగ
నెలమి జన్నసాల కేతెంచి రా సభా
సదులు కౌతుకమున సంభ్రమించి. 17

అర్థము: కనత్ + అపాంగ + అవలోకన - దీప్తులు = ప్రకాశించుచున్న, క్రీఁగంటిచూపుల కాంతులు, ఉత్ఫుల్ల-కమల-పుష్ప + ఉపహారములు + కాఁగన్ = వికసించిన తామరపూల కానుకలు కాఁగా,

అలస - దోధూయమాన + ఆమోద - నిశ్వాస - పవనంబులు = మెల్లఁగాఁ జలించుచున్న పరిమళవంతములైన నిట్టూర్పుగాలులు, అగరు-ధూపములు + కాఁగన్ = మంచిగంధపుఁబొగలు కాఁగా,

మహనీయ - జాజ్వల్యమాన - భూషా + అమల - రత్న - ప్రభాతలు = కాంతిమంతముగాఁ బ్రకాశించుచున్న, అలంకారముల, నిర్మలములైన, మణుల విశేష ప్రకాశములు, ఆరతులు + కాఁగన్ = హారతులు కాఁగా,

మణి - మయ - మంజీర-ఝణఝణత్కార + ఆది - రుతములు = రత్నములతో నిర్మింపఁబడిన, కాలియందెల ఝణఝణ అను మున్నగు ధ్వనులు, ఇంపు + ఆరు = మనోజ్ఞములైన, సంస్తుతులు + కాఁగన్ = స్తోత్రములు కాఁగా,

అభవ - మూర్తి + ఐన = శివుని యష్టమూర్తులలో నొక మూర్తి యగు, యాగ + అధిపతికిన్ = యజమానునకు. అర్చలు = పూజలు, ఇచ్చు - కరణిన్ = ఇచ్చు విధమున, వినుతులు = స్తోత్రములు, ఎసకము + ఎసఁగన్ = అతిశయింపఁగా,

ఆ - సభాసదులు = ఆ సభలోనివారు, కౌతుకమునన్ = వేడుకతో, సంభ్రమించి = వేగిరపాటుచెంది, ఎలమిన్ = సంతోషముతో, జన్నసాలకున్ = యజ్ఞశాలలోనికి, ఏతెంచిరి = వచ్చిరి.

తాత్పర్యము: ప్రకాశించుచున్న క్రీఁగంటిచూపులకాంతులు వికసించిన తామరపూల కానుకలు కాఁగా, మందముగాఁ జలించుచున్న పరిమళవంతములైన

నిట్టూర్పుగాలులు మంచిగంధపుఁబొగలు కాఁగా, కాంతిమంతముగాఁ బ్రకాశించుచున్న అలంకారముల నిర్మలములైన మణులకాంతులు హారతులు కాఁగా, రత్ననిర్మితములైన కాలియందెల ఝణఝణలు మున్నగు ధ్వనులు మనోజ్ఞములైన సంస్తుతులు కాఁగా, అష్టమూర్తియైన యీశ్వరుని మూర్తులలో నొక మూర్తి యగు యజమానునకుఁ బూజలిచ్చునట్లు స్తోత్రము లతిశయింపఁగా, నా దక్షుని సభలోనివారు వేడుకతో వేగపడి ప్రీతితో యజ్ఞశాలలోఁ బ్రవేశించిరి.

విశేషములు: సీసపద్యపాదము లన్నింటను అలంకారము రూపకము- ఆట వెలఁదిలోని 'అభవమూర్తి .... మెసఁగ' అనుదానియందు అలంకార ముపమ. యజ్ఞశాల (ప్రకృతి) - జన్నసాల (వికృతి) అభవమూర్తులు - పంచభూతములు, సూర్యచంద్రులు, యజమానుఁడు,

వ. ఇట్లు చనుదెంచు పరమేశ్వరు మహాదేవిం గని హరిపరమేష్ఠి పురందరాద్యఖిలసభాసదు లాలోకనమాత్రఁ బ్రస్తుతించుచు మస్తకన్యస్త కరకమలముకుళు లగుచుండ వచ్చి వినయంబున దక్షప్రదత్త మహాసనాసీనయై జగజ్జనకుండైన నిజజనకు మహత్త్వ విభుత్వంబునకు మెచ్చుచు సురవరులనెల్లను రావించి పరమేశ్వరు రావింప భయస్థుండై నిజపుత్త్రి స్నేహంబున రావించె నని సంతోషించి సతీదేవి దక్షునకుఁ బ్రియసంభాషణభావంబున నిట్లనియె. 18

అర్థము: ఇట్లు, చనుదెంచు = వచ్చునట్టి, పరమేశ్వరు - మహాదేవిన్ = పరమేశ్వరుని భార్య యగు సతీదేవిని, కని = చూచి, హరి - పరమేష్ఠి-పురందర + ఆది + అఖిల - సభాసదులు = విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు మొదలుగాఁగల యెల్లసభ్యులు, ఆలోకన - మాత్రన్ = చూచుటతోడనే, ప్రస్తుతించుచున్=స్తోత్రము చేయుచు, మస్తక - న్యస్త - కర - కమల-ముకుళులు=శిరస్సులందు, ఉంపఁబడిన, తామరమొగ్గలవంటి చేతులుగలవారు, అగుచున్ + ఉండన్, (సతి), వచ్చి, వినయంబునన్ = అణఁకువతో, దక్ష - ప్రదత్త + మహాత్ (మహా) + ఆసన+ఆసీన+ఐ = దక్షునిచే నొసఁగఁబడిన యున్నతాసనమునందుఁ గూర్చున్నదయి, జగత్ +

జనకుండు = లోకపిత, ఐన, నిజ - జనకు = తన తండ్రియొక్క, మహా_త్వ - విభుత్వంబునకున్ = గొప్పతనముతోడి ప్రభుత్వమునకు, మెచ్చుచున్, సుర-వరులన్ = దేవతాశ్రేష్ఠులను, ఎల్లను, రావించి, పరమేశ్వరున్, రావింపన్, భయస్థుండు + ఐ = భయపడినవాఁడయి, నిజ - పుత్రిన్ = తనకూఁతును, స్నేహంబునన్ = ప్రీతితో, రావించెన్, అని, సంతోషించి, సతీదేవి, దక్షునకున్, ప్రియ-సంభాషణ-భావంబునన్ = ప్రీతిపూర్వక సంభాషణముతో, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము : ఇట్లు వచ్చు సతిని జూచి విష్ణుబ్రహ్మేంద్రాదులైన యెల్ల సభ్యులును జూచుటతోడనే స్తోత్రముచేయుచు, శిరస్సున నంజలి ఘటింప, నామె దక్షుఁ డొసఁగిన యున్నతాసనమున వినయముతోఁ గూర్చుండి, లోకపితయైన తనతండ్రి మహాప్రభుత్వమునకు మెచ్చుచు, దేవతల నందఱను రావించి యీశ్వరుని రావింప వెఱచి పుత్రిప్రేమమునఁ దన్ను మాత్రము రావించె నని సంతోషించి దక్షునితోఁ బ్రీతి పూర్వకముగా నిట్లు పలికెను.

విశేషములు : పరమేష్ఠి - 'బ్రహ్మాత్మభూః సురజ్యేష్ఠః పరమేష్ఠీ పితామహః' - పరమే ఉత్కృష్టే పదే బ్రహ్మలోకాఖ్యే తిష్ఠతీతి పరమేష్ఠీ - ఉత్కృష్ట స్థానమం దుండెడువాఁడు - బ్రహ్మ - అమరము, జగత్ + జనకుఁడు - ఋల్లునకు హాళ్ళు పరమగుచుండఁగాఁ దృతీయవర్ణాదేశము - జగద్ + జనకుఁడు. తవర్గాక్షరము లకు చవర్గాక్షరములు పరములైనచోఁ జవర్గాక్షరము లాదేశము లగును. జగజ్జనకుఁడు.

గీ. ¹హరి పితామహ దివిజేశ్వరాది దిగధి
పతుల సుర ముని ద్విజుల రాఁ బనిచి వరదు
నభవుఁ బరమేశు రావింపవైతి నిపు
డలఁచి పిలిచిన భక్తవత్సలుఁడు రాఁడె?' 19

అర్థము : హరి - పితామహ - దివిజ + ఈశ్వర + ఆది - దిశ్ (క్) + అధిపతులన్ = విష్ణువును, బ్రహ్మను, ఇంద్రుఁడు మొదలగు దిక్పాలురను, సుర - ముని - ద్విజులన్ = దేవతలను, మునులను, బ్రాహ్మణులను, రాన్ + పనిచి = రావించి,

---

1, గా: దె.

వరదున్=వరములు నిచ్చువానిని, అభవున్ = ఈశ్వరుని, పరమేశున్=పరమేశ్వరుని, రావింపవు + ఐతి = రావించినవాఁడవుకావు, నీవు, తలఁచి, పిలిచినన్, భక్త - వత్సలుఁడు = భక్తులయెడ వాత్సల్యము గలవాఁడు, అగు శివుఁడు, రాఁడె = రాకుండెడివాఁడా? తప్పక వచ్చియుండెడివాఁ డనుట.

తాత్పర్యము: 'విష్ణుని, బ్రహ్మను, ఇంద్రాదిదిక్పాలురను, దేవతలను, మునులను, బ్రాహ్మణులను రావించి వరదుఁడును, అభవుఁడును అగు పరమేశ్వరుని రావింపవైతివి. నీవు తలఁచి పిలిచినచో భక్తవత్సలుఁడైన శివుఁడు, రాకుండెడివాఁడా?'

విశేషములు: దిశ్ + అధిపతులు - 'దిశ్' శబ్దమునందలి శవర్ణమునకు అచ్చులును, హల్లులును పరము లగునపుడు గకార మాదేశ మగును, దిగ్ + అధిపతులు-దిగధిపతులు. రావింపవైతి-వచ్చు-'సర్వంబునకుం బ్రేరణంబునం దించుక్కగు.' బాల, క్రియ. 70. వచ్చు + ఇంచు - 'ఇంచు క్పు క్పుగాగమంబులు పరము లగునపు డాగమాదేశలోపంబులు పెక్కుదెఱంగులం గానంబడియెడి.' బాల. క్రియ, 77. రావించు. 'వ్యతిరేకంబున లజీ యగు' - బాల. క్రియ. 7. రావించు + లజీ - 'ఆగమాన్య వికారంబుల కద్విరుక్తంబులకు ముత్తు పరంబగునపుడు పవ లగు.' బాల. క్రియ. 88. రావింపు + లజీ. 'ఇత్తు పరంబగునపు డుత్వంబున కత్వంబగు.' బాల. క్రియ. 20. రావింప + లజీ. 'లకారంబునకు డు ఱ వు రు ను ముఙ్గు.' - బాల. క్రియ, 8. మధ్యమపురుషైకవచనమున - రావింపవు. 'భూతంబున లజీకి లిడంతంబగు నగుధాతు వనుప్రయుక్తం బగు.' బాల, క్రియ. 114. రావింపవు + ఐతివి (అగుధాతు లిట్ మధ్యమపురుషైకవచనము) 'ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధి యగు.' బాల. సంధి. 1. రావింపవైతివి. 'లిఙ్లోట్టుల వకారంబునకు లోపంబు విభాష నగు.' బాల. క్రియ, 24. రావింపవైతి + ఇ. 'మధ్యమపురుష క్రియలయం దిత్తునకు సంధి యగు,' బాల, సంధి. 7. రావింపవైతి.

వ. అనినం బరమేశ్వరుఁ డను పలుకు సహింపక దక్షుం డాక్షేపించి. 20

తాత్పర్యము: అని సతి పలుకఁగాఁ బరమేశ్వరుఁ డను మాట సహింపక దక్షుఁ డధిక్షేపించి . తరువాతి పద్యముతో నన్వయము.

శా. 'ఈ లక్ష్మీశ్వరుఁ, డీ జగజ్జనకుఁ డీ యింద్రాది దిక్పాలు, రిం
దీ లేఖావళి, యిమ్మునీశ్వరగణం, బీ విప్రసంఘంబు, వే
దాలంకారులు; వీరిలోనికి విరుద్ధాచార కంకాల కా
పాలో గ్రాహి జటాజి నాస్థి ధరుఁ డా భస్మాంగి రా నర్హుఁడే?' 21

అర్థము: ఇందున్=ఇచ్చట - ఈ సభలో, ఈ-లక్ష్మీ + ఈశ్వరుఁడు = ఈ లక్ష్మీపతి - విష్ణువు, ఈ - జగత్ + జనకుఁడు = ఈ లోకపిత - బ్రహ్మ, ఈ + ఇంద్ర + ఆది - దిశ్(క్) + పాలురు = ఈ యింద్రుఁడు మున్నగు దిక్పతులు, ఈ లేఖ + ఆవళి =ఈ దేవతలయొక్క సమూహము. ఈ + ముని+ ఈశ్వర - గణంబు = ఈముని శ్రేష్ఠుల సమూహము, ఈ + విప్ర-సంఘంబు = ఈ బ్రాహ్మణుల సమూహము, వేద + అలంకారులు = వేద మలంకారముగాఁ గలవారు, వీరిలోనికిన్, విరుద్ధా చార .... ధరుఁడు, విరుద్ధ = విపరీతమైన,ఆచార= నడవడిగలవాఁడును, కంకాల= అస్థిపంజరమును, కాపాల = పుఱ్ఱెలను. ఉగ్ర + అహి = భయంకరసర్పములను, జటా = జడలను, అజిన = లేడిచర్మమును. అస్థి = ఎముకలను, ధరుఁడు = ధరించినవాఁడును, అగు, ఆ - భస్మ +అంగి= ఆ బూది శరీరమునందుఁ గలవాఁడు అగు ఈశ్వరుఁడు, రాన్ + అర్హుఁడే = వచ్చుటకు యోగ్యుఁడా?

తాత్పర్యము: 'ఈ సభలో నీ విష్ణువు, ఈ జగత్పితయైన బ్రహ్మ, ఈ యింద్రుఁడు మున్నగు దిక్పాలకులు, ఈ దేవతల సమూహము, ఈ మునిశ్రేష్ఠుల సమూహము, ఈ బ్రాహ్మణుల సమూహము, వేదము లలంకారముగాఁ గలవారుగలరు. వీరిలోనికి విపరీతమైన ఆచారము గలవాఁడును. అస్థిపంజరమును. పుఱ్ఱెలను, భయంకర సర్పములను, జడలను, చర్మమును ఎముకలను ధరించువాఁడును, బూది శరీరమునఁ బూసికొనువాఁడును అగు ఆ శివుఁడు వచ్చుటకు యోగ్యుఁడా?' - కొఁ దనుట.

విశేషములు; జగత్ + జనకుఁడు = జగద్+జనకుఁడు=జగజ్జనకుఁడు, చూడు పూర్వవ్యాఖ్య. 18, దిశ్ + పాల = దిశ్ శబ్ద శ వర్ణమునకు ఖరులు (కఠిన హల్లులు) పరము లగునపుడు కకార మాదేశమగును - దిక్పాల+లు. 'అదంతంబయి దీర్ఘపూర్వలోపధంబయిన మహత్తుమీఁది విభక్తిలకారంబునకు రేఫం బగు,' బాల, తత్సమ, 38, దిక్పాల + లు - 'పుంలింగంబయి, మహద్వాచకంబయిన నామంబు

ఉది యత్వంబున కుత్వం బగు.' బాల, తత్సమ, 21. దిక్పాలురు, లేఖ - ప్రాణీనాం శుభాశుభఫలం లిఖ స్తీతి- లేఖాః, ప్రాణుల శుభాశుభ ఫలమును వ్రాసెడువారు - దేవతలు - అమరము, భస్మాంగి-కర్మ ధారయము పై మత్వర్థీయప్రత్యయములు రావని కొందఱుమతము. కాని సుకేశి - హిరణ్యకేశీ వంటి భాష్యోదాహరణములు గలవు.

వ. అనిన విని నవఘనాఘనధ్వని వినిన కమలలక్ష్మియుం బోలె
సుదరిపడి లగ్గ నోసి దాక్షాయణి దక్షున కిట్లనియె. 22

అర్థము ; అనినన్, విని, నవ - ఘనా - ఘన-ధ్వనిన్=తొలకరి మేఘము ధ్వనిని, వినిన, కమల - లక్ష్మియున్ + పోలెన్ + పద్మమనెడి లక్ష్మివలె, ఉదరి పడి = అదరిపడి, లగ్గ - నోపి = మిక్కిలి బాధపడి, దాక్షాయణి=దక్షునికూఁతురు- సతి, దక్షునకున్, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము : అని దక్షుఁడు పలుకఁగా విని క్రొక్కాఁరు మొగిలు చప్పుడు వినిన పద్మమనెడి లక్ష్మివలె నదరిపడి మిక్కిలిబాధపడి సతీదేవి దక్షున కిట్లు పలికెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష.

మ. 'త్రిజగన్నాథుఁ, బవిత్రగాత్రుఁ, గ్రతుమూర్తిం, బాత్రు సత్పూజ్యుఁడే
యజినాఖిలకపాలశల్యధరుఁ డీ యజ్ఞాదులం దంటి; వీ
ద్విజ దేవాదులకుం గపాల కవ చాస్థివ్రాతముల్ మేనులన్
నిజమై యున్నవి రుద్రచిహ్నా లివె; వీనిం బుచ్చి రా నేర్చిరే?' 23

అర్థము : త్రిజగత్ + నాథున్ = ముల్లోకములకుఁ బ్రభువును, పవిత్ర - గాత్రున్ = పావనమైన శరీరముగలవానిని, క్రతు - మూర్తిన్ = యజ్ఞస్వరూపుని, పాత్రున్ = అర్హుని, ఈ - అజిన + అఖిల - కపాల - శల్య - ధరుఁడు = ఈ చర్మము, భయంకరమైన పుఱ్ఱెలు, ఎముకలు, తాల్చినవాఁడు, ఈ - యజ్ఞ+ఆదులం దున్ = ఇట్టి యజ్ఞములు మున్నగువానియందు, సత్ + పూజ్యుఁడే = బాగుగాఁ బూజింపఁదగినవాఁడా ?-లేక పండితులచే-మంచివారిచేఁ బూజింపఁదగినవాఁడా? అంటివి, ఈ-ద్విజ-దేవ + ఆదులకున్ = ఈ బ్రాహ్మణులు, దేవతలు మున్నగువారికిఁగూడ, కపాల - కవచ + అస్థి - వ్రాతముల్ = పుఱ్ఱెలు, చర్మములు, ఎముకలు అనువాని సమూహములు, మేనులన్=శరీరములందు, నిజము+ఐ, ఉన్నవి, రుద్ర-చిహ్నాలు= ఈశ్వరుని గుఱుతులు, ఇవె,వీనిన్, పుచ్చి = విడిచి, రాన్ + నేర్చిరే=రాఁగలిగిరా

తాత్పర్యము : "ముల్లోకములకు అధిపతియైనవాఁడును, పవిత్రమయిన శరీరముగలవాఁడును, యజ్ఞస్వరూపుఁడును, యోగ్యుఁడు నైన శివుని, 'ఈతోలు భయంకరములైనపుర్రెలు ఎముకలు దాల్చిన యీతఁడు ఇట్టి యజ్ఞములు మున్నగువానియందు పూజింపఁదగినవాఁడా?' యని పలికితివి. కాని యీ బ్రాహ్మణులు దేవతలు మున్నగు వారికిఁగూడఁ బుఱ్ఱెలు, చర్మములు, ఎముకలసమూహములు శరీరములందు నిజములై యున్నవి. ఇవి రుద్రచిహ్నములే కదా! వారు వానిని దీసిపెట్టి రాఁగలిగిరా?" లే దనుట.

విశేషములు : దాక్షాయణి వాక్చమత్కారము ప్రశంసనీయముగా నున్నది. 'ప్రతిమనుష్యునకును గపాలాదు లుండునే కదా! పైఁగా నవి తీసివేయరానివి, అవి యన్నియు రుద్రుని చిహ్నములే. వా రందఱును ఆహూతు లయినప్పుడు వానిని దాల్చినాఁడని శివు నేల పిలువకుంటి' వని యామె యభియోగము.

చిహ్న - చిహ్నము రూపద్వయము గలదు. చిహ్న (ము) (ప్రకృతి) - చిన్నె (వికృతి) అంటివి. అను ధాతువు 'భూతంబున లిట్టగు,' బాల. క్రియ, 3, అను + లిట్, 'లకారంబునకు డు ్రు వు రు ను ము ఙ్గు' - బాల. క్రియ. 8. అను + వు 'లిట్టు వుఙ్ఞు పరంబగునపుడు తి వర్ణకం బగు,' బాల. క్రియ, 18. అను + తి + వు. - 'తి దు ట లు పరంబులగునపు డన్వాదుల నుస్థానంబున సున్నయు నుండు డులోపంబును విభాష నగు,' బాల. క్రియ. 58, అంతి + వు. 'ఇట బిందువుమీఁది త దలకు నిత్యవైకల్పికంబు లయి ట డ లగు.' బాల. క్రియ, 59, అంటి + వు. 'ఇకారంబుమీఁది కు ను వు క్రియా విభక్తుల యుత్వంబున కిత్వం బగు.' బాల. తత్సమ. 26, అంటివి.
ద్విజ - (నానా:) బ్రాహ్మణుఁడు, పక్షి; దంతము.

గీ. 'వీరి కెల్లను దేవతా విభవ మొసఁగు
చున్న పరమేశు రావింప నొల్ల ననియె;
దింక నీ యజ్ఞఫలము నీ కిచ్చు నట్టి
పెద్ద లెవ్వ రీ వచ్చిన పేళ్లయందు ?' 24

అర్థము : వీరికిన్, ఎల్లను, దేవతా_విభవము=దివ్యత్వసంపద, ఒసఁగుచున్ + ఉన్న = ఇచ్చుచున్న, పరమేశున్=ఈశ్వరుని, రావింపన్=రప్పించుటకు, ఒల్లన్=అంగీకరింపను, అనియెదు = అందువు, ఇంకన్. నీ - యజ్ఞ ఫలమున్ = నీవు

చేయుచున్న యజ్ఞముయొక్క ఫలమును, నీకున్, ఇచ్చు + అట్టి, పెద్దలు, ఈ - వచ్చిన - పేళ్లయందున్ = ఇప్పటికి వచ్చిన పేళ్లలో-వచ్చిన వారిలో ననుట, ఎవ్వరు ?

తా త్ప ర్య ము: 'ఈ వచ్చినవారి కందఱకును దివ్యత్వసంపదనిచ్చు పరమేశ్వరుని నీవు రావింప నంగీకరింప నందువు. మఱి నీ యజ్ఞఫలమును నీ కిచ్చునట్టి గొప్పవారు ఈ వచ్చినవారిలో నెవరు?' ఎవరును లే రనుట.

వి శే ష ము 'లు : అనియెదు - అనుధాతువు, 'తద్ధర్మాదులందు లాట్టగు.' బాల. క్రియ. 5. అను + లాట్. 'లకారంబునకు డు జు వు రు ను ముజ్ఞగు.' అను + వు (మధ్యమపురుషైకవచనము), 'లాట్లు రుజ్లు పరంబగునపు డెదగాగమంబును ప్రథమ ను వ్యంకంబు పరంబగునపు డెడు గెడి గాగమంబులును బహుళంబుగా నగు.' బాల. క్రియ. 23. అను + ఎద + వు. 'గురువిరహితంబు లయి యయాంతంబులయిన యేకస్వర ద్విస్వరంబుల యించుగ్వ్రకంబుల కియుడాగమంబు విభాష నగు.' బాల. క్రియ. 50. అను + ఇయ్ + ఎద + వు - 'అంద్వవగాగమంబులందప్పు నపదాది స్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు.' బాల. సం॥ అనియెదవు 'లిఙ్లాట్లుల వకారంబునకు లోపంబు విభాష నగు.' బాల. క్రియ. 24. అనియెద + ఉ. అంద్వవగా గమ సంధిచే అనియెదు, పేళ్లు - పేరు శబ్దము బహువచనరూపములు పేరులు, పేర్లు, పేళులు కాని పేళ్లు కాదు. కాని బహుప్రయుక్తమగుటచే నీతఁడు నట్లు ప్రయోగించినాఁ డనవలయును, పేడిశబ్దమునకు బహువచనము పేళ్లు కావచ్చును. కాని యది యెంత వఱకు సమంజస ? మనునది ఆలోచనీయము. పేళ్లు = నపుంసకులు.

సీ. 'ధరణీతలంబెల్ల నరదంబు. చంద్రార్క
బింబముల్ చక్రముల్, పృథుజవాశ్వ
ములు వేదములు, పగ్గములు చతుస్స్వరములు,
ప్రణవంబు గసగోల, బ్రహ్మ సూతుఁ,
డగపతి విల్లు, పన్నగపతి గొనయంబు,
హరి గోల, గఱి గరు, దనల మమ్మ.
పవనంబు వేగంబు, దివిజ గణంబులు
నెరవులై, యాశుండు పురము లేయుఁ

తే. దలఁచినంతన భోరనఁ దమకుఁ దార
వచ్చి కెలసంబు సేసినవారె కారె?
వీరిఁ బట్టి పరేశుని విడుతు ననఁగ
వలదు నీ కీశుఁ డేలినవాఁడు కాఁడె?' 25

అర్థము : ధరణీ - తలంబు + ఎల్లన్ = భూతలమంతయు, అరదంబు = రథము, చంద్ర + అర్క - బింబముల్ = చంద్రుని సూర్యుని మండలములు, చక్రముల్ = ఆ రథము చక్రములు, పృథు - జవ + అశ్వములు = అధికవేగము గల గుఱ్ఱములు, వేదములు, పగ్గములు, చతుః + స్వరములు = నాలుగు స్వరములు, (ఉదాత్తము, అనుదాత్తము, స్వరితము, ప్రచయము), ప్రణవంబు = ఓంకారము, కస + కోల = కొరడాకఱ్ఱ, బ్రహ్మ, సూతుఁడు = రథము తోలువాఁడు,

అగపతి = కొండలఱేఁడు - మేరువు, విల్లు, పన్నగ - పతి = పాఁపఱేఁడు- వాసుకి, గొనయంబు = వింటిత్రాడు, హరి = విష్ణువు, కోల = బాణము, గఱి = బాణపుఱెక్క, గరుడి = గరుత్మంతుఁడు, అనలము = అగ్ని, అమ్ము = బాణము,

పవనంబు = వాయువు, వేగంబు, దివిజ-గణంబులు- వేల్పుల సమూహములు, ఎరవులు = పరివారము, ఐ, ఈశుండు, పురములు=రాక్షసుల మూఁడు పురములు, ఏయన్ = కొట్టుటకు, తలఁచిన + అంతన్ + అ = తలఁచినంతనే, భోరనన్= శీఘ్రముగా, తమకున్ + తారు + అ = తమంతఁదామే, వచ్చి. కెలసంబు=సేవ, చేసిన - వారు + ఎ - కారు + ఎ = చేసినవారే కారా?

వీరిన్ + పట్టి = వీరిని బట్టుకొని, పరేశునిన్=పరమేశ్వరుని, విడుతున్ + అనఁగన్ - వలదు = విడిచిపెట్టెద ననరాదు, నీకున్, ఈశుఁడు, ఏలినవాఁడు = ప్రభువు, కాఁడె = కాఁడా?

తాత్పర్యము : 'భూతలమంతయు రథముగా, చంద్రసూర్యులు చక్రములుగా, వేదములు మంచివేగముగలగుఱ్ఱములుగా, ఉదాత్తానుదాత్త స్వరిత ప్రచయము లనెడి నాలుగు స్వరములను పగ్గములుగా. ఓంకారము కొరడాకఱ్ఱగా, బ్రహ్మ సారథిగా;

మేరువు విల్లుగా, వాసుకి అల్లెత్రాడుగా, విష్ణువు బాణముగా, గరుడుఁడు బాణపు తెక్కగా, అగ్ని బాణముగా, వాయువు వేగముగా, దేవతల సమూహములు పరివారముగా, నీశ్వరుఁడు త్రిపురములను గొట్టనెంచఁగనే శీఘ్రముగాఁ దమంతఁదాముగా వచ్చి సేవించినవారు కారా వీరు అందఱును? అట్టివీరిని బట్టుకొని పరమేశ్వరుని విడుతు ననరాదు. నీ కీశ్వరుఁడు ప్రభువు కాఁడా?'

విశేషములు: త్రిపురాసుర సంహారకార్యమున నీశ్వరునకైన సాధన సామగ్రి యంతయు నిందు వివరింపఁబడినది. అరదము (వికృతి) - రథము (ప్రకృతి), పగ్గము (రూ.) ప్రగ్గము, (వికృతి) - ప్రగ్రహము (ప్రకృతి), కస (వికృతి) - కశ (ప్రకృతి), గొనయము (వికృతి) - గుణము (ప్రకృతి) - గొనము (రూ.), పురము (ప్రకృతి) - ప్రోలు (వికృతి), బోరన - (రూ.) బోరన,

క. 'నెఱయఁగ నిది కాదే నీ
యెఱుఁగమి? నీ దేవగణము నేలినవానిం
గొఱగాఁ డని కైకొన కిం
దఱిఁ దెచ్చితి వీర లీశు దాసులు గారే?' 26

అర్థము: నెఱయఁగన్ = వెలయఁగా, నీ + ఎఱుఁగమి = నీ అజ్ఞానము, ఇది, కాదే = కాదా?, నీ - దేవ - గణమున్ = నీ దేవతల, సమూహమును, ఏలిన - వానిన్ = పాలించువానిని, కొఱ - కాఁడు + అని = పనికిమాలినవాఁడని, కైకొనక = లక్ష్యపెట్టక, ఇందఱిన్ = ఇంతమందిని, తెచ్చితి (వి), వీరలు=వీరు. ఈశు = శివునియొక్క, దాసులు + కారే = దాసులు కారా?

తాత్పర్యము: 'నీ యజ్ఞానము ఇదికాదా? నీ దేవతల సమూహము నేలిన వానిని బనికిమాలినవాఁడని గణింపక యింతమందిని దీసికొని వచ్చితివి. వీర లందఱును శివుని కింకరులు కారా?' అగుదు రనుట.

విశేషములు: నీ యెఱుఁగమి-నీవు ఎఱుఁగమి - 'ధాతుజవిశేషణ భావార్థక పూర్వావ్యవహితావ్యవహిత కర్తృపదప్రథమకుఁ దఱచుగ యొక్కషష్ఠి యగు,' నీ

యొక్క- ఎఱుఁగమి. ప్రౌఢ. కారక. 15. 'యొక్క-కు లోపంబు బహుళంబు' ప్రౌఢ. కారక. 16. నీ యెఱుఁగమి.

వ. అని పరమేశ్వరు సమస్తసురాధీశ్వరుల కధీశ్వరుండుగాఁ బలికిన విని దక్షుండు సహింపక. 27

అర్థము : అని, పరమేశ్వరున్, సమస్త - సుర + అధి+ఈశ్వరులకున్= ఎల్ల దేవతాప్రభువులకు, అధీశ్వరుండు + కాన్ = ప్రభువుగా. పలికినన్, విని, దక్షుండు, సహింపక.

తాత్పర్యము : అని సతి పరమేశ్వరు నెల్లదేవతాశ్రేష్ఠులకును అధినేతగాఁ బలుకఁగా విని దక్షుఁడు ఓర్వక - తరువాతి పద్యముతో నన్వయము.

ఉ. 'అన్నిన యట్ల యిమ్మునిసురాధిపులం జెడనాడుచున్న నీ
యున్నతికంటె నాకు మొగమోడి సహించిరిగాక వీరిలో
నెన్నిన నిన్ను రుద్రుని సహింతురె దేవత ?' లన్న నల్క-తోఁ
గన్నుల నిప్పులొల్కు- హరు గాదిలి దక్షునిఁ జూచి యిట్లనున్. 28

అర్థము ; అన్నిన + అట్లు+అ= మదించినదానివలె, ఈ + ముని-సుర+ అధిపులన్ = ఈ మునిశ్రేష్ఠులను, దేవతాశ్రేష్ఠులను, చెడన్ + ఆడుచున్+ఉన్న= నిందించుచున్న. నీ + ఉన్నతికంటెన్ = నీ గొప్పతనముకంటె, నాకున్, మొగ మోడి = మోమోటపడి, సహించిరి + కాక = ఓర్చిరి కాని, వీరిలోన్, ఎన్నిన = నిందించిన, నిన్నున్, రుద్రునిన్, దేవతలు, సహింతురె, అన్నన్ = అనఁగా, అల్క-తోన్ = కోపముతో, కన్నులన్, నిప్పులు. ఒల్కు- = రాలునట్లు, హరు - గాదిలి = ఈశ్వరుని భార్య - సతి, దక్షునిన్, చూచి, ఇట్లు, అనున్.

తాత్పర్యము : 'మదించినదానివలె నీ మునిపతులను, దేవతాశ్రేష్ఠులను నిందించుచున్న నీ గొప్పతనమును నా మొగముచూచి సహించిరి గాని వీరిని నిందించిన నిన్నును, రుద్రుని దేవతలు సహింతురా?' యనఁగాఁ గోపముతోఁ గన్నుల నిప్పులు రాల సతి దక్షునిఁ జూచి యిట్లు పలికెను.

విశేషములు: హరు గాదిలి - హరుని భార్య. గాదిలి = భార్య యని సూ. ని. ఈ యుదాహరణమునే యిచ్చినది.

సీ. 'నీకంటె హరి బుద్ధి లేకయె నిజనేత్ర
కమలంబు పూన్చి చక్రంబు వడసెఁ?
బరమేష్ఠి నీకంటెఁ బరువిఁడియే శిర
మొప్పించి నిత్యుఁడై యున్నవాఁడు ?
మఘవుండు నీకంటె మరులైయె క్రతుతతి
నర్చించి దేవేంద్రుఁడై వెలింగె ?
నిఖిల దేవాలియు నీకంటె నవివేకు
లయియె సేవించి భోగాత్ము లైరి ?

తే. వీర లిందఱికంటెను వెరవు మిగుల
నెఱుక నీ కిప్పు డెందుండి దొఱకిపడియె ?
నగణితైశ్వర్యు శివుఁ బరమాత్ము నెఱిఁగి
యెఱిఁగి దూషింప నీకు నో రెట్టు లాడె ?' 29

అర్థము: హరి=విష్ణువు, నీకంటెన్, బుద్ధిలేకయె. నిజ-నేత్ర-కమలంబు = తనదైన కనుదమ్మిని, పూన్చి = సమర్పించి, చక్రంబు = సుదర్శనాయుధమును, వడసెన్ = పొందెను?

పరమేష్ఠి=బ్రహ్మ, నీకంటెన్, పరువిఁడియే (పరువు + ఇఁడి) = గౌరవహీనుఁడయియే, శిరము, ఒప్పించి = అర్పించి, నిత్యుఁడు + ఐ = శాశ్వతుఁడై, ఉన్నవాఁడు?

మఘవుండు = ఇంద్రుఁడు, నీకంటెన్, మరులైయె=మరులయ్యె (సూ. నిపాతము)=అజ్ఞానము అయి యే, క్రతు-తతిన్=యజ్ఞసమూహమునందు, అర్చించి = పూజించి, దేవేంద్రుఁడు + ఐ = దేవతలకు భర్తయై. వెలింగెన్ = ప్రకాశించెను?

నిఖిల - దేవ + ఆలియున్ = ఎల్ల దేవతల సమూహమును, నీకంటెన్, అవివేకులు + అయియె = జ్ఞానశూన్యులయియే. సేవించి, భోగ + ఆత్మలు = సౌఖ్యవంతులు, ఐరి ?

వీరలు + ఇందఱికంటెను, వెరవు - మిగులన్ = నే ర్పతిశయింపఁగా, ఎఱుక = జ్ఞానము, నీకున్, ఇప్పుడు, ఎందున్ + ఉండి, దొఱకిపడియెన్ = లభించెను ? తొఱకి పడియెన్ = దిగివచ్చెను, (మా. రా. కవి పాఠము)

అగణిత + ఐశ్వర్యున్ = లెక్కలేనంత ఐశ్వర్యము గలవాఁడు అగు. శివున్ = శివుని. పరమ + ఆత్మున్ = మహాత్ముఁడై నవానిని, ఎఱిఁగి ఎఱిఁగి, దూషింపన్ = నిందించుటకు, నీకున్, నోరు, ఎట్టులు + ఆడెన్ = ఎట్లు వచ్చెను ?

తాత్పర్యము: 'నీకంటె విష్ణువు బుద్ధిలేనివాఁడయియే తన నయనపద్మమును శివునికిచ్చి సుదర్శనమును పొందెనా ? బ్రహ్మ నీకంటె గౌరవహీనుఁ డయియే తన శిరస్సు నర్పించి శాశ్వతుఁడై యున్నాఁడా ? ఇంద్రుఁడు నీకంటె నజ్ఞాని యయియే యజ్ఞములందుఁ బూజించి దేవేంద్రుఁ డయి ప్రకాశించెనా ? దేవత లందఱును నీకంటె వివేకరహితులయియే సేవించి సౌఖ్యవంతులయిరా ? వీరి యిందఱికంటెను నీకు ఇప్పుడు తెలివి యెందుండి యూడిపడినది ? లెక్కింపరాని యైశ్వర్యము గలవాఁడును, పరమాత్ముఁడును అగు శివుని తెలిసితెలిసి దూషించుటకు నీకు నో రెట్లు వచ్చెను ?'

విశేషములు: 'నీకంటెహరి .... పడసె,' విష్ణువు శివుని వేయితామరలతోఁ బూజింపఁబూని, అం దొక్కటి తక్కువ కాఁగా, తన నేత్రపద్మమునే పెఱికి శివునకు సమర్పించెను. అందులకుఁ బ్రతిఫలముగా నతఁడు సుదర్శనాయుధమును బొందెను. 'పరమేష్ఠి .... యున్నవాఁడు.' బ్రహ్మకు మొదట నైదుశిరస్సు లుండెడివి. అతఁడును, విష్ణువును ఆధిక్యముకొఱకుఁ బోరాడుచుండఁగా శివుఁడు వచ్చి వారిని వైరము మానుఁ డనెను. విష్ణువు మానినను బ్రహ్మ పంచమశిరము మానక శివుని దూషించెను. శివుఁడు కాలభైరవుని బుట్టించి యాతని పంచమశిరస్సును ఖండింపు మనియెను. బ్రహ్మ భయపడి తన పంచమశిరము శివుని దగ్గఱ పడునట్లును, ఆ కపాలముతో శివుఁడు భిక్షాటనము చేయునట్లును గోరెను, శివుఁ డనుగ్రహించెను.

పరువిఁడి - పరువు + ఇఁడి. 'ముక్కు లోనగు వానికిం ద దభావద్యోతకం బయి మతుబర్థంబునం దిఁడి వర్ణకం బగు.' బాల. తద్ధిత. 24. పరవిడి = వాచాటుఁడు అని మా. రా. కవి పాఠము. ఐయె = అయి + ఎ = యడాగమముచే అయియె, 'అచ్చికంబులం దయి యవులకు వక్రతమంబులు బహుళంబుగా నగు.' బాల. క్రియ. 103. - ఐయె. అగణిత + ఐశ్వర్య = అగణితైశ్వర్య - వృద్ధిసంధి.

క. 'వాదున నీ హరి వేధయుఁ[1]
గాదే యురులింగమూర్తి కడ గానక నాఁ[2]
డాదిగ వెదకెద ? రట్టి మ
హాదేవుఁ డపూజ్యుఁ డనఁగ నగునే నీకున్ ?' 30

అర్థము: ఈ - హరి - వేధయున్ + కాదె = ఈ విష్ణువును, బ్రహ్మయును, గాదా, వాదునన్ = వాదముతో, ఉరు - లింగ - మూర్తి = గొప్పదియగు లింగము స్వరూపముయొక్క, కడ = అంతు, కానక = కనుఁగొనలేక, నాఁడు + ఆదిగన్ = అప్పటినుండియు, వెదకెదరు, అట్టి, మహాదేవుఁడు, అపూజ్యుఁడు + అనఁగన్ = పూజింపఁదగనివాఁ డన, నీకున్, అగునే ?

తాత్పర్యము: 'ఈ విష్ణువును బ్రహ్మయుఁ గదా వాదమున శివలింగము నంతమును గనుఁగొనలేక యప్పటినుండియు వెదకులాడుచున్నారు ? అట్టి మహాదేవుఁడు, పూజార్హుఁడు కాఁడన నీకు భావ్యమా ?'

విశేషములు: శివలింగము నాద్యంతములు చూడ బ్రహ్మ హంసరూపమునఁ బైకివెడల, విష్ణువు వరాహరూపమునఁ గ్రిందికి వెడలెను. కాని వారు ఇప్పటికిని గృతకృత్యులు కాలేక వెదకుచునేయున్నా రనుట. వాదు (వి.) - వాదము (ప్ర.)

1. ప్రాఁతప్ర - ల, 2. వా. ప్ర. నే.

చ. 'హరుఁ జెడనాడి వీరిఁ గొనియాడెదు పెద్దయు నీవు చూడఁగా
గరళము మ్రింగి. త్రిభువనకంటకులైన గజాసురాదులం
బరువడి నోర్చి, విశ్వము శుభస్థితి నిల్పినవాఁడు తొల్లి నీ
హరియె? పితామహుండె? దివిజాధిపుఁడే? సురలే? మునీంద్రులే?' 31

అర్థము; హరున్ = ఈశ్వరుని, చెడన్ + ఆడి = నిందించి, వీరిన్, పెద్దయున్ = మిక్కిలియును. కొనియాడెదు = ప్రశంసింతువు, నీవు, చూడఁగాన్, గరళము = హాలాహలము, మ్రింగి, త్రిభువన - కంటకులు = ముల్లోకములకు శత్రువులు, ఐన, గజ + అసుర + ఆదులన్ = గజాసురుఁడు మొదలగు వారిని, పరువడిన్ = శీఘ్రముగా, ఓర్చి = ఓడించి, విశ్వమున్ = విశ్వమును, శుభ-స్థితిన్ = శుభమైనయునికియందు, నిల్పినవాఁడు, తొల్లి = పూర్వము, నీ - హరి + ఎ = నీ విష్ణువా? పితామహుండు + ఎ = బ్రహ్మయా?, దివిజ + అధిపుఁడు + ఏ = దేవేంద్రుఁడా? సురలు + ఏ = దేవతలా?, ముని + ఇంద్రులు + ఏ = ముని శ్రేష్ఠులా?

తాత్పర్యము: 'ఈశ్వరుని దూలనాడి వీరిని మిక్కిలి ప్రశంసింతువు. నీవు చూచుచుండఁగా హాలాహలమును మ్రింగి, ముల్లోకములకు శత్రువులైన గజాసురుఁడు మున్నగువారిని శీఘ్రముగా నోడించి లోకమును శుభస్థితియందు నిల్పినవాఁడు ఈశ్వరుఁడుగాక నీ విష్ణువా, బ్రహ్మయా, సురేంద్రుఁడా, దేవతలా. మునిశ్రేష్ఠులా?' ఎవరును గారనుట.

విశేషములు: క్షీరసముద్రమును దేవదానవులు అమృతముకొఱకు మథించి నపుడు తొలుత హాలాహలము పుట్టి లోకములను గాల్పనుండఁగా, నీశ్వరుఁడు దానిని మ్రింగి కంఠమున నుంచెను. గజాసురుఁడు - మహిషాసురుని కుమారుఁడు. ఇతఁడు దేవతలను హింసించుచుండ నీశ్వరుఁ డితనిని శిక్షింపవచ్చెను. అంత నితఁడు వానితో 'నీచేతఁ జావవలయుననియే నే నిట్లు చేయుచున్నాను. నేను జచ్చినపిమ్మట నా చర్మమును నీవు ధరింపు'మన శివుఁడట్లే చేసెను. త్రిభువన - త్రయాణాం భువనానాం సమాహారః-త్రిభువనమ్. - సమాహారద్విగుసమాసము. నీ హరియె .... నీవు గొప్ప వారనిచెప్పు హరియా .... అని దెప్పిపొడుచుట.

మ. ‘హరు నిర్మించిన వేదమార్గములు గాక యాగముల్ సేయఁగా
వెరవొం డెయ్యది ? సద్విధిం గ్రతుసమాప్తిం బొందినన్ మిట్టి నా
వరదుం డొక్కఁడు దక్కఁ దత్ఫలము లెవ్వం డీ సమర్థుండు నీ
సురసంఘంబుల లోన?’ నంచు సతి దక్షుం దూలఁబోఁ బల్కుచున్. 32

అర్థము : హరు - నిర్మించిన = శివుఁడు ఏర్పఱిచిన, వేద-మార్గములు + కాక = వైదికపద్ధతులుగాక, ఆ - యాగముల్, చేయఁగాన్, వెరవు = ఉపాయము, ఒండు = ఇంకొకటి, ఎయ్యది = ఏది ?, సత్ + విధిన్ = మంచివిధితో, క్రతు-సమాప్తిన్ = యజ్ఞపూర్తిని, పొందినన్ = పొందినను, మిట్టి = మీఱి, నా - వరదుండు = నా వరమునిచ్చువాఁడు - భర్త, ఒక్కఁడు + తక్కన్ = ఒక్కఁడు తప్ప, తత్ + ఫలములు = ఆ యజ్ఞఫలములు. ఈన్ = ఇచ్చుటకు, నీ - సుర - సంఘంబులలోనన్ = నీ దేవతల సమూహములలో, ఎవ్వండు, సమర్థుండు ?, అంచున్, సతి, దక్షున్, తూలన్ + పోన్ + పల్కుచున్ = తూలనాడుచు.

తాత్పర్యము ; ‘శివుఁడు ఏర్పఱిచిన వేదమార్గములుగాక ఆ యజ్ఞములు చేయుటకు మఱియొక యుపాయమేది ? ఒకవేళ యథావిధిగా యజ్ఞము సమాప్తమయినను, నా భర్త తప్ప నీ దేవతానమూహములో మఱియొక్కఁ డెవ్వఁడా యజ్ఞఫలము నొసఁగఁజాలును ?’ అని సతి దక్షుని నిందించుచు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : హరు - నిర్మించిన - హరుఁడు నిర్మించిన. ‘ధాతుజవిశేషణ భావార్థక పూర్వవ్యవహితావ్యవహిత కర్తృపద ప్రథమకుఁ దఱచుగ యొక్కషష్ఠి యగు.’ ప్రౌఢ. కారక. 15. హరుయొక్కనిర్మించిన, ‘యొక్కకు లోపంబు బహుళంబు.’ ప్రౌఢ. కారక. 16, హరునిర్మించిన. తనభర్త వరదుఁడు కావుననే యజ్ఞఫలము నీఁగలుగునుట.

‘వెరవొండెయ్యది సద్విధిం గ్రతుసమాప్తిం బొందినన్’-అనుపాఠముగాక, వన్నెచోటను పదలకు యతిమైత్రిని పాటింపలేదుకావున ‘తెరువొండెయ్యది....

సమాప్తిం బొందినన్' అనునదియే సరియైన పాఠమనియు, అదియే ప్రకరణానుగుణము
ననియు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు. చూడు వా. ప్రతిపీఠిక.

వ. ఇట్లు పరమేశ్వరు వేదకర్తయు సకలకర్మఫలదాతయుఁగాఁ బల్కిన
దక్షుండు దుర్మదంబున సహింపక వెండియు నిట్లనియె. 33

అర్థము: ఇట్లు, పరమేశ్వరున్, ద-కర్తయున్ = వేదములుచేయువాఁడును. సకల-కర్మఫల-దాతయున్ = ఎల్ల కర్మములయొక్క ఫలముల నిచ్చువాఁడును, కాన్ = అగునట్లు, పల్కినన్, పలుకఁగా, దక్షుండు, దుర్మదంబునన్ = దుర్గర్వముతో. సహింపక = ఓర్వక, వెండియున్ = మరల, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: ఇట్లు సతి పరమేశ్వరుని వేదకర్తనుగా. నెల్లకర్మముల ఫలముల నొసఁగువానినిగాఁ బలుక, దక్షుఁడు దుర్గర్వముతో సైఁపక మఱియు నిట్లు పలికెను.

ఉ. 'ఎన్నఁడుఁ దొల్లి చర్మములు నెమ్ములు భూతియుఁ దాల్చి తాపసుల్
జన్నములందుఁ జొత్తురె విచారములేక ? సురేశ్వరాదులం
బన్నములాడి నీ మగని పక్షము పల్కెదుగాక బేల ! నీ
కొన్న మరుల్ జగజ్జనులు గొందురె ? వ్రాత్యులఁ బూజ్యులందురే?' 34

అర్థము: ఎన్నఁడున్ = ఎప్పుడైనను, తొల్లి = పూర్వము, తాపసుల్ = మునులు, విచారము-లేక = ఆలోచనలేక, చర్మములున్ = తోళ్లను. ఎమ్ములున్ = ఎముకలును, భూతియున్ = బూదియును, తాల్చి = ధరించి.జన్నములందున్ = యజ్ఞములలో, చొత్తురె = ప్రవేశింతురా ? సుర + ఈశ్వర + ఆదులన్ = దేవతల ప్రభువు-ఇంద్రుఁడు మున్నగువారిని, బన్నములు + ఆడి = నిందావాక్యములు పలికి, నీ-మగని-పక్షము + పల్కెదు + కాక = నీ భర్త మాట మాటాడుదువు కాని, బేల = వెఱ్ఱిదాన !, నీ-కొన్న-మరుల్ = నీవుపొందినఅనురాగము, జగత్ + జనులు = లోకమునందలిజనులు, కొందురె ? = పూనుదురా ?, వ్రాత్యులన్ = నీచులైనవారిని, పూజ్యులు = పూజింపఁదగిన వారు, అందురే ?

తాత్పర్యము : 'పూర్వ మెప్పుడైనను మునులు తోళ్లను, ఎముకలను, బూదిని దాల్చి యజ్ఞములందు సంకోచములేక ప్రవేశించిరా ? దేవేంద్రాదులను నిందించి నీ మగని పక్షమును వహింతువు కాని, యో వెఱ్ఱిదానా ! నీవు నీ మగనిపైఁ బూనిన వలప్ర లోకమునందలి జనులు పూనుదుర్గా ? నీచులైనవారిని బూజనీయు లందుర్గా ?' అని భావము.

విశేషములు : చొత్తురె-చొచ్చుధాతువు. 'తద్ధర్మాదులందు లాట్టగు.' బాల. క్రి.6.చొచ్చు+లాట్.'లంకారంబునకు డు ్రు వు రును మ్ము ్లగు.' చొచ్చు+రు. బాల. క్రియ.8. 'లాట్టు రుజ్ఞు పరంబగు నపుడు దుగాగమంబగు.' చొచ్చు+దు + రు.బాల. క్రియ.22. 'చువర్ణంబుతోడ దుద్దకారంబు తకారంబగు.' బాల.క్రియ. 108. చొత్తురు. చొత్తురు+ఎ, 'అంద్వవగాగమంబులందప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు,' చొత్తురె. బాల.సంధి.11. పక్షము+వల్కెదు. 'ప్రథమమీఁది పరుషములకు గ స డ ద వ లు బహుళముగానగు, పక్షమువల్కెదు, బాల.సంధి.13.పల్కెదవు, 'లిడ్లా ట్టుల వకారంబునకు లోపంబు విభాషనగు.' పల్కెద+ఉ. బాల.క్రియ. 24. అపదాదిస్వర సంధిచే(బాల.సంధి.11)పల్కెద.కొన్న-కొనిన-'పద్యాదులనవర్ణకంబున కత్వంబును గడ హల్లునకు ద్విత్వంబును విభాషనగు.' బాల.క్రియ.51. జగత్+జములు-జగద్+జములు, జగజ్జములు. కొందురె-కొను+దు+రు+ఎ-'తి దు ట లు పరంబులగునపు డన్వాదుల మస్థానంబున సున్నయు నుండు డు లోపంబును విభాషనగు,' బా.క్రి.58.కొందురు+ఎ-అపదాదిస్వరసంధి. బాల. సంధి. 11,

వ. అనిన విని సతీదేవి కోపోద్దీపితచిత్తయై. 35

అర్థము: అనినన్=అని.దక్షుఁడనఁగా, విని, సతీదేవి, కోప+ఉద్దీపిత-చిత్త+ఐ=కోపముచేత, మిక్కిలిప్రజ్వలించిన, మనస్సుగలదియై.

తాత్పర్యము : అని దక్షుఁడు పలుకఁగా సతీదేవి విని కోపముచేఁ బ్రజ్వలించు మనస్సుగలదియై -తరువాతి పద్యముతో నన్వయము,

చ. 'అఱిముఱి రుద్రు నెంతచెడనాడెదు ? సోమముఁ ద్రాగియున్కి మై
యెఱుఁగక బిట్టెదో ? కలయ నిమ్మఖధూమము గప్పికొన్నఁ దు
త్తుఱుగొని ప్రేలెదో ? ముదిసి దుర్మతివై కడు విభ్రమించి మై
మఱచితొ ? కాలకాలు నజమస్తకసంహరు నిట్లు పల్కెదే !' 36

అర్థము : అఱిముఱి=అనాలోచితముగా, రుద్రున్=శివుని, ఎంత,చెడన్+అడెదు=ఎంతగా నిందింతువు, సోమమున్=సోమరసమును, త్రాగి+ఉన్కిన్=త్రాగియుండుటచేత, మై=ఒడలు, ఎఱుఁగక, బిట్టెదు+ఓ=గర్వించెదవో, కలయన్=అంతటను, ఈ+మఖ-ధూమము=ఈ జన్నపుఁబొగ, కప్పికొన్నన్=క్రమ్ముకొనఁగా, తుత్తుఱు + కొని = కలుషిత మయి, గొంతుకట్టుకొని (సూ. రా. కవి.) ప్రేలెదో, ముదిసి = ముసలివాఁడవయి, దుర్మతివి + ఐ=దుర్బుద్ధి వయి, కడున,=మిక్కిలి విభ్రమించి=మిక్కిలి భ్రాంతిఁజెంది, మై - మఱచితొ=ఒడలు మఱచితివో, కాల-కాలున్=యమునకు యముఁడైన వానిని- శివుని. అజ- మస్తక-సంహరున్ = బ్రహ్మ శిరస్సును ఖండించినవానినిగూర్చి, ఇట్లు, పల్కెదే- (పల్కెదవు + ఏ) = ఇట్లు మాటాడుదువా ?

తాత్పర్యము : 'అనాలోచితముగా రుద్రు నెంత నిందించితివి ? సోమరసమును ద్రాగియుండుటచే నొడలుతెలియక గర్వింతువా ? ఈ జన్నపుఁబొగ యంతట వ్యాపించి వికలమనస్కుఁడ వయి ప్రేలెదవో ! ముసలితనమున దుర్బుద్ధిగలిగి మిక్కిలి భ్రాంతిఁ జెంది యొడలు మఱచితివో ! యమునకు యముఁడైనవానిని, బ్రహ్మపంచమశిరస్సును ఖండించినవానిని ఈ రీతిగా నిందింతువా ?'

విశేషములు ; బిట్టు ధాతువు సూ.ని.లోఁ గానరాలేదు. ప్రకరణము ననుసరించి యర్థము చెప్పఁబడినది. చెడనాడెదు, బిట్టెదో, ప్రేలెదో, మఱచితితో, -పల్కెదే అన్నిటను లిఙ్లాటుల వకారమునకు లోపము (బాల.క్రియ.24.)

మ. 'అమృతాంభోధి మథింప మందర మనంతాహీశుఁ దేఁ బంచె, శై
లముఁ దాల్పన్ హరిఁ బంచె, మీఁద నజు నిల్వం బంచె, వాసుక్యుఁ గ
వ్వము త్రాడై గిరిఁజుట్టఁబంచె, వడిఁ దివ్వంబంచె దేవాసురౌ
ఘము, సర్వేశుఁడు రాజుగాఁడె? యెఱుఁగంగా రాదె నీ కెమ్మెయిన్ ? '37

అర్థము: సర్వ+ఈశుఁడు=సకలాధీశుఁడైన యీశ్వరుఁడు, అమృత+అంభోధిన్=క్షీరసముద్రమును, మథింపన్=చిలుకుటకు. అనంత+అహి+ఈశున్=శేషుఁ డను నాగరాజును, మందరము=మందరపర్వతము, తేన్=తెచ్చుటకు, పంచెన్=ఆదేశించెను, హరిన్=విష్ణువును, శైలమున్=కొండను. తాల్పన్=వహించుటకు, పంచెన్, అజున్=బ్రహ్మను, మీఁదన్=ఆ కొండమీఁద. నిల్వన్, పంచెన్, వాసుక్యున్=వాసుకేయుని,(వాసుకిని,)కవ్వము-త్రాడు+ఐ=తరిత్రాడయి,గిరి=కొండ, చుట్టన్=చుట్టుటకు, పంచెన్, దేవ+అసుర+ఓఘమున్=దేవతలయు, రాక్షసులయు సమూహమును, వడిన్=వేగముగా, తివ్వన్=లాగుటకు, పంచెన్, (అట్టి యతఁడు), రాజు, కాఁడే, నీకున్, ఏ+మెయిన్=ఏ విధముగను, ఎఱుఁగంగాన్, రాదె=తెలియరాదా?

తాత్పర్యము: 'క్షీరసముద్రమును మథింప మందరపర్వతమును దీసికొని రా శేషుఁ డను నాగరాజును ఆదేశించెను. హరిని గొండను దాల్పఁబంచెను. అది యిటునటు పొరలకుండ దానిపై బ్రహ్మ నుండఁబంచెను. వాసుకిని గవ్వపుఁద్రాడయి కొండను జుట్టఁ బంచెను. దానిని వడిగాఁ ద్రిప్ప దేవాసురసమూహమును బంచెను. అట్టి సర్వేశ్వరుఁడు రాజు కాఁడా? నీ కాతఁ డే విధముగను తెలియరాఁడా?'

విశేషములు: వాసుక్యుఁడు-వసుకుఁ డనువాని కొడుకు-వాసుకి, గిరి+చుట్టన్- 'ప్రథమమీఁది పరుషములకు గ స డ ద వ లు బహుళముగా నగు.' బా.సం.13-గిరిఁ జుట్టన్. దేవ+అసుర-సవర్ణదీర్ఘసంధి, దేవాసుర+ఓఘము=దేవాసురౌఘము = వృద్ధిసంధి. సర్వ+ఈశుఁడు=సర్వేశుఁడు-గుణసంధి. ఏ+మెయిన్=ఎమ్మెయిన్. త్రికసంధి. తిగుచు+నుజీ=తివ్వన్. 'తిగుచు ధాతువు నన్నంతరూపములు తివ్వఁ దివ నగును.' ప్రౌఢ.క్రియ.20.

సీ. 'విశ్వంబు కావింప విశ్వాత్ముఁడై యష్ట
తనువులు సేకొని తనరు వాని,
నురులింగరూపమై హరివేధలకుఁ దన
కడ గానరాకున్న పొడవువాని,
శరణార్థులకు దయావరము లీ నైశ్వర్య
మూర్తి సేకొనియున్న కీర్తివాని,
వారక నేకావతారముల్ హరి కురు
కల్పంబు లజునకుఁ గఱపువానిఁ

తే. దా నచింత్యుఁ డనంతుఁ డనూనదాన
నిరతుఁ డక్షయుఁ డన నున్న పరముఁ బరమ
యోగి నిశ్చల నిర్మల యోగ బుద్ధి
నెఱుఁగఁగా కీశు మహిమ నీ కెఱుఁగ లావె ?' 38

అర్థము ; విశ్వంబు, కావింపన్, విశ్వ+ఆత్ముఁడు+ఐ=సర్వాత్ముఁడై, అష్ట-తనువులు=ఎనిమిది శరీరములు (పంచభూతములుఁ సూర్యచంద్రులు, యజమానుఁడు), చేకొని=స్వీకరించి, తనరువానిన్=ఒప్పువానిని,

ఉరు-లింగ-రూపము+ఐ=పెద్ద లింగము నాకారమయి, హరి-వేధలకున్=విష్ణువునకును, బ్రహ్మకును. తన, కడ=అంతము, కాన-రాక+ఉన్న=కనఁబడని యట్టి, పొడవు-వానిన్=రూపము గలవానిని,

శరణ+అర్థులకున్=శరణు గోరువారికి, దయా-వరములు=అనుగ్రహముతోడి వరములు, ఈన్=ఇచ్చుటకు, ఐశ్వర్య-మూర్తి=ఈశ్వరభావముయొక్క స్వరూపము, చేకొని+ఉన్న=స్వీకరించియున్న, కీర్తివానిన్=కీర్తి గలవానిని,

వారక=తప్పక, అనేక+అవతారముల్=పెక్కవతారములు, హరికిన్=విష్ణువునకు, ఉరు-కల్పంబులు=గొప్ప సంకల్పములు, అజునకున్=బ్రహ్మకు, కఱపువానిన్=బోధించువానిని,

దాసు, అచింత్యుఁడు=చింతింపరానివాఁడు, అనంతుఁడు=అంతములేనివాఁడు, అమోఘ-దాన-నిరతుఁడు=తక్కువకాని దానమునందు ఆసక్తి గలవాఁడు, అక్షయుఁడు=నాశనములేనివాఁడు, అనన్, ఉన్న, పరమున్=ఉత్కృష్టుని, పరమ-యోగిన్=గొప్పయోగిని, నిశ్చల-నిర్మల-యోగ-బుద్ధిన్=స్థిరము, స్వచ్ఛము నైన యోగముతోడి మనస్సుతో, ఎఱుఁగన్+కాక=తెలియుటకు శక్యముకాని. ఈశ-మహిమ=ఈశ్వరుని గొప్పతనము, నీకున్, ఎఱుఁగన్=తెలియుటకు, లావె=తరమా ?

తాత్పర్యము : 'లోకమును సృజింప విశ్వాత్ముఁడై యెనిమిది శరీరములు స్వీకరించి యుండువాఁడును, గొప్ప లింగము నాకారముయి విష్ణువునకు బ్రహ్మకుఁ దన అంతు తెలియరాని రూపము గలవాఁడును, శరణన్నవారికి దయతో వరము లిచ్చుట యీశ్వరరూపమును గైకొన్న కీర్తి గలవాఁడును, విష్ణునకుఁ బెక్కవతారములను, బ్రహ్మకు గొప్ప సంకల్పములును దప్పక బోధించువాఁడును, చింతింపరానివాఁడును- ఇంతటివాఁడని ఊహింప శక్యముగానివాఁడును, అంతము లేనివాఁడును, గొప్ప దాన గుణమునం దాసక్తి గలవాఁడును, నాశనరహితుఁడును అన నొప్పు పరముని=ఉత్కృష్టుని, గొప్ప యోగిని నిశ్చలము, నిర్మలము నైన యోగబుద్ధితో నెఱుఁగ శక్యముగాని, యీశ్వరుని మహిమ నీకుఁ దెలియశక్యమా;' శక్యము కాదని భావము.

వ. అనిన విని దక్షప్రజాపతి పశుపతి వేదబాహ్యుం డని తన పట్టిన
ప్రతినయ పట్టి క్రాలుచు వెండియు ననేకప్రకారంబుల దూషించు
చున్న విని సతీదేవి హరి పరమేష్ఠి పురందర బృందారక ముని
బృందంబుల వేదంబుల నసిలంబులం జూచి 'పరమేశ్వరుండు మఖం
బులం దపూజ్యుండే?' యనిన విని భయంబున నడునడునడుంకుచు
దక్షు నిరాకరించి సమస్త లోకాగమంబులకుం గర్తయుం గర్మఫల
ప్రదాతయు మఖప్రయోగాద్యఖిల పూజాస్థానంబులయందు నీశ్వ
రుండు పూజ్యుండుగాఁ బ్రతిష్ఠించి బ్రహ్మవిష్ణువు లిట్లనిరి. 39

అర్థము : అనినన్, విని, దక్షప్రజాపతి, పశుపతి=ఈశ్వరుఁడు, వేద-బాహ్యుండు=వేదములకు వెలిమైనవాఁడు, అని, తన పట్టిన=తాను పట్టిన, ప్రతిన+అ=ప్రతిజ్ఞయే, పట్టి=పట్టుకొని, క్రాలుచున్=ఒప్పుచు, వెండియున్=మఱియును,

అనేక-ప్రకారంబులన్ = పెక్కురీతుల. దూషించుచున్ + ఉన్నన్ = నిందించుచుండ, విని, సతీ-దేవి, హరి-పరమేష్ఠి-పురందర-బృందారక, ముని-బృందబులన్ = విష్ణువును, ఇంద్రుని, దేవతలయు మునులయు సమూహములను, వేదంబులన్ = వేదములను, అనలంబులన్ = అగ్నులను, చూచి, పరమేశ్వరుండు, మఖంబులందున్ = యజ్ఞములందు, అపూజ్యుండు + ఏ = పూజింపఁదగనివాఁడా, అనినన్, విని, భయంబునన్ = వెఱపుతో, నడునడు నడుంకుచున్ = నడునడమని వణఁకుచు, దక్షున్ = దక్షుని, నిరాకరించి = కాదని, సమస్త-లోక + ఆగమంబులకున్ = ఎల్లలోకముల రాకకు, కర్తయున్ = చేయువాఁడును-ఎల్లలోకములను నిర్మించువాఁడును, కర్మ-ఫల-ప్రదాతయున్ = పుణ్యపాప కర్మముల ఫలముల నిచ్చువాఁడును, మఖ-ప్రయోగ + ఆది + అఖిల-పూజా-స్థానంబుల యందున్ = యజ్ఞముల నాచరించుట మున్నగు నెల్ల గౌరవస్థానములందును. ఈశ్వరుండు, పూజ్యుండు + కాన్ = పూజింపఁదగినవాఁడుగా, ప్రతిష్ఠించి = స్థాపించి. బ్రహ్మవిష్ణువులు, ఇట్లు + అనిరి.

తాత్పర్యము : అని సతీదేవి పలుకఁగా దక్షుఁడు విని యీశ్వరుఁడు వేదములకు వెలియైన వాఁడను తన భర్త పట్ల పీడక యంకను పెక్కురీతుల నిందించుచుండఁగా, విని సతీదేవి విష్ణుని, బ్రహ్మను, ఇంద్రుని, దేవతలను, మునులను, వేదములను, అగ్నులను జూచి 'పరమేశ్వరుఁడు యజ్ఞములందుఁ బూజింపరానివాఁడా?' యని యడుగ, బ్రహ్మ విష్ణువులు భయమున వణఁకుచు, దక్షునిఁ గాదని, యీశ్వరుఁడు సమస్తలోకములకు సృష్టికర్తయు, కర్మ ఫలముల నిచ్చువాఁడును, యజ్ఞాదులైన యెల్ల గౌరవ స్థానములందుఁ బూజనీయుఁడును, అని స్థాపించి యిట్లు పలికిరి.

విశేషములు : నడునడు-నడుఁకుట = వణఁకుట యందలి యనుకరణము, ఆది + అఖిల = ఆద్యఖిల-యణాదేశ సంధి-ఇ, ఉ, ఋ, ౡ లకు అసవర్ణములైన అచ్చులు పరము లగునపుడు వరుసగా య్, వ్, ర్, ల్ వర్ణములు ఆదేశము లగును.

క. 'ఏ మాదిమూర్తి దక్షిణ
వామాంగములందుఁ బుట్టి వారక జననో
ద్దామ పరిపాలనాది మ
హా మహిమలు వొందఁగంటి మా శివు కరుణన్.' 40

అర్థము: ఏము=మేము, ఆ-శివు-కరుణన్=ఆ శివుని దయచేత, ఆది-మూర్తి=మొదటిమూర్తియొక్క, దక్షిణ-వామ+అంగముల+అందున్=కుడి ఎడమ మేనులందు, పుట్టి, వారక=తప్పక, జనన=సృష్టి, ఉద్దామ=గొప్ప, పరిపాలన+ఆది-మహత్ (మహా) - మహిమలు=పరిపాలించుట మున్నగు గొప్ప ప్రభావములు, పొందన్+కంటిమి=పొందఁగలిగితిమి.

తాత్పర్యము: 'మేము ఆ శివుని దయచే మొదటి మూర్తి కుడి యెడమ భాగములందుఁ బుట్టి సృష్టిచేయుట, బాగుగాఁ బరిపాలించుట మున్నగు గొప్ప మహిమలు పొందఁగలిగితిమి.'

విశేషములు: బ్రహ్మ విష్ణువులు క్రమముగా దక్షిణ వామాంగములందు, అని క్రమమును జెప్పుటచే యథాసంఖ్యాలంకారము.

సతీదేవి దహనము

వ. అని యందఱుం బ్రత్యేకంబ యివ్విధంబునం బలికిన విని దక్షుం డందఱ నాక్షేపించి 'మీరు భిక్షువలని భయంబున దాక్షాయణి పక్షంబునం బలికినం గర్మబాహ్యుండైన పాషండుండు పూజ్యుం డగునే?' యని యెవ్వరిం గైకొనక మీఁదులేక పలికిన సతీదేవి కోపోద్దీపిత హృదయయై. 41

అర్థము: అని, అందఱున్, ప్రత్యేకంబు + అ = ఒక్కొక్కరే, ఈ + విధంబునన్, పలికినన్ = పలుకఁగా, విని, దక్షుండు, అందఱన్, ఆక్షేపించి, మీరు భిక్షువలని = మొదటి భిక్షువైన శివుని వలని, భయంబునన్, దాక్షాయణి-పక్షంబునన్= సతి వైపున. పలికినన్ = పలికినచో, కర్మ - బాహ్యుండు = యజ్ఞాది కర్మములకు వెలిపైనవాఁడు, ఐన, పాషండుండు = వేదబాహ్యుఁడు, పూజ్యుండు, అగునే, అని, ఎవ్వరిన్, కైకొనక = లెక్కచేయక, మీఁదు - లేక=ఎదురులేక, పలికినన్= పలుకఁగా, సతీదేవి, కోప+ ఉద్దీపిత - హృదయ + ఐ = కోపముచేత, మండిన హృదయము గలదియై,

తాత్పర్యము: అని యందఱును ప్రత్యేకముగా నీ విధమునఁ బలుకఁగా దక్షుఁడు విని, యందఱ నధిక్షేపించి, మీరు ఆదిభిక్షువైన శివునివలని భయమున సతి కనుకూలముగాఁ బలికినను, 'యజ్ఞాదికర్మములకు వెలియైన వేదబాహ్యుఁడు పూజ సేయఁదగునా ?' యని యెవ్వరిని లెక్కచేయక, ఎదురులేక పల్కఁగా, సతీదేవి కోపమున మండుచున్న హృదయము గలదియై,

తే. ....

.... దక్ష నాహుతి గొన నెగయునట్లు
నడరి మేనిలోఁ దనరు కోపాగ్ని ధూమ
సమితి ముడివడి వదనరంధ్రముల వెడలె. 42

అర్థము: ఈ పద్యము వా, ప్రతిలో 41 వ గద్యముననే గద్యముగా నున్నది.

దక్ష + ఆహుతి = దక్షుఁ డొనరించు నాహుతిని, కొనన్ = గ్రహించుటకు, నెగయు + అట్లున్ = ఎగురు విధమునను, అడరి = విజృంభించి, మేనిలోన్ = శరీరమునందు, తనరు = ఒప్పునట్టి, కోప + అగ్ని = కోపమనెడి అగ్నియొక్క, ధూమ-సమితి = పొగల గుంపు, ముడి + పడి = వ్యాపించి, వదన-రంధ్రములన్ = ముఖరంధ్రములనుండి, వెడలెన్ = వెలికివచ్చెను.

తాత్పర్యము; దక్షుఁ డొనరించు నాహుతిని గ్రహించుటకుఁ బైకి వచ్చునట్లు, విజృంభించి శరీరములో నొప్పు కోపమనెడి యగ్ని పొగల గుంపు వ్యాపించి ఆమె ముఖరంధ్రములనుండి పైకి వెడలెను.

విశేషములు: దక్ష నాహుతిగొన నెగయునట్లు - అలంకార ముత్ప్రేక్ష. కోపాగ్ని - కోపమనెడి యగ్ని - రూపకము.

దక్ష + ఆహుతి - 'షష్ఠీసమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగు నపుడు నుగాగమంబగు,' బాల. సంధి- 34. దక్షునాహుతి. నెగయు + అట్లు-'ఉదంత

మగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' బాల. సంధి. 33. వదనరంధ్రముల వెడలె - వదనరంధ్రములవలన నుండి వెడలె. 'అపాయ భయ జుగుప్సా పరాజయ ప్రమాద గ్రహణ భవన త్రాణ విరామాంతర్ధి వారణంబు లర్థంబు లగు దానికి వలన వర్ణకం బగు.' బాల. కారక. 9. 'ఉండి పదం బొకానొకచో వలన వర్ణకంబున కనుప్రయుక్తంబగు.' బాల. కారక. 10. 'ఉండి శబ్దము పరం బగు నప్పుడు వలనకు ద్వితీయా సప్తములు ప్రాయికంబుగ నగు.' బాల. కారక. 11. 'వలన కాదేశంబగు ద్వితీయా సప్తముల మీఁది యుండికి లోపంబు బహుళంబుగా నగు' ప్రౌఢ. కారక. 11.

ఆ. అధిపుఁ బలుకఁ బలుక నడరి యాకాశంబు
దాఁకి సతి మనమునఁ దరతరంబ
మాన కగ్నిలోన మలఁగ నే వోసిన
మాడ్కిఁ గోపవహ్ని మండి యెగసె. 43

అర్థము: అధిపున్ = భర్తను, పలుకన్ + పలుకన్ = నిందింపఁగా నిందింపఁగా, కోపవహ్ని = కోపమనెడి అగ్ని, అడరి = అతిశయించి, ఆకాశంబు - తాఁకి = మిన్నంటి - విజృంభించి, మానక = విడువక. అగ్నిలోనన్ = అగ్నిలో, మలఁగన్ = ప్రజ్వలించుటకు, నే + పోసిన - మాడ్కిన్=నేయి పోసిన విధమున, సతి-మనమునన్ = సతీదేవి మనస్సునందు, తరతరంబు + అ=మిక్కిలి, మండి, ఎగసెన్ = మీఁదికి వ్యాపించెను.

తాత్పర్యము: భర్తను నిందింపఁగా నిందింపఁగాఁ గోపాగ్ని మిన్నంటి, ప్రజ్వలించుట కగ్నిలో నెయి పోసిన విధమున, సతి మనస్సున మిక్కిలి మండి యెగసెను.

విశేషములు; కోపవహ్ని = కోపమనెడి వహ్ని-రూపకాలంకారము, అగ్నిలోన మలఁగ నే వోసిన మాడ్కి మండి యెగసె-అలంకార ముపమ. తన భర్తను ఓడువరేవనిచే సతి మనమునఁ గోపవహ్ని యుండెను, అతనిని మిక్కిలి నిందించుటచే నది నేయి పోసినట్లు ఇంకను మండి యెగసెను.

నేయి, నెయ్యి, నే - రూపాంతరములు, 'నే' యను రూపము ప్రథమైకవచన మందును, సమాసమునందును గాన్పించుచున్నది. - సూ. ని, నే + పోసిన - నే

పోసిన - గ స డ ద వాదేశము - బాల. సంధి, 13. మనము - మనస్సు - మనసు, రూపాంతరములు, 'సాంతంబుల తుది సకారంబునకు లోపంబు బహుళంబుగా నగు.' బాల, తత్సమ. 80. మన. 'అమహన్నపుంసకముల కదంతంబులకు ముపర్ణకం బగు.' మనము. బాల. తత్సమ. 39.

క. తన పతిఁ జెట్టలు వలికిన
జనకుం గని కోపవహ్ని సతి దేహము భో
రన మండె భానుఁ గని కెం
పున మండెడు సూర్యకాంతపుత్త్రిక వోలెన్. 44

అర్థము ; తన - పతిన్ = తన భర్తను, చెట్టలు = నిందలు, పలికిన = పలికినట్టి, జనకున్ = తండ్రిని - దక్షుని, కని = చూచి, కోప - వహ్నిన్ = కోప మనెడి యగ్నిచేత, సతి - దేహము = సతీదేవి మేను, భానున్ = సూర్యుని, కని, కెంపునన్ = ఎఱ్ఱఁదనముతో - కైఁపునన్ అని పాఠాంతరము గలదు. అప్పుడు - విజృంభణముతో, మండెడు = మండునట్టి, సూర్యకాంతపుత్త్రిక + పోలెన్=సూర్య కాంతమణిమయమైన బొమ్మవలె, భోరనన్ = శీఘ్రముగా, మండెన్.

తాత్పర్యము : తన భర్తను నిందించిన తండ్రిని జూడఁగా సతీదేవి శరీరము కోపాగ్నిచే - సూర్యునిఁజూడ నెఱ్ఱగాఁ (మిక్కిలిగా) గాలిపోవు సూర్యకాంతిమణి మయమైన బొమ్మవలెఁ - గాలిపోయెను.

విశేషములు : అలంకార ముపమ. కోపవహ్ని = కోపమనెడి వహ్ని - రూపకము. పుత్త్రిక + పోలెన్ - గసడదవాదేశము-పుత్త్రికవోలెన్. బాల. సంధి. 13.

ఆ. అధిపుఁ జెట్టలాడె నని దక్షుఁ గని సతి
కదరు కోపవహ్ని నొడలు గాలెఁ;
వగవ నట్టె[1] యెట్టి వారికిఁ బ్రియ నిరా
కరులఁ గాంచి యొడలు గాలకున్నె? 45

---

1. సా. ప్రతి. నట్ల.

అర్థము : అధిపున్ = భర్తను, చెట్టలు + ఆడెన్ = నిందించెను, అని పలికెన్ = పలికెను, కని = చూచి, సతికిన్ = సతీదేవికి, అడరు = అతిశయించునట్టి కోప - వహ్నిన్ = కోపమనెడి అగ్నిచే, ఒడలు = శరీరము, కాలెన్, వగవన్ = చింతింపఁగా, అట్టు + ఎ = అట్లే, ఆలోచింపఁగా నది యట్లే యగు ననుట, ఎట్టి వారికిన్ = ఎంతటివారికైనను, ప్రియ - నిరాకరులన్ = ఇష్టులను నిరాకరించు వారిని, కాంచి = చూచినచో, ఒడలు = మేను, కాలక + ఉన్నె = కాలకుండునా? తప్పక కాలునని భావము,

విశేషములు ; కోపవహ్ని-రూపకము, ఇందు విశేషాంశము సామాన్యాంశముచే సమర్థింపఁబడుచున్నది కావున నలంకార మర్థాంతరన్యాసము. కాంచి = కాంచినచో - 'ఒక్కొకచో భూతార్థకాసమాపకక్రియ హేత్వర్థకంబు నగు.' ప్రౌఢ, క్రియా. 15, ఉన్నె - ఉండునె - 'ఒకానొకచోఁ దద్ధర్మార్థకంబులగు నుండు, చను, మొదలగునవి ప్రశ్నార్థకైకారాంతకంబు లగునపుడు వాని కడ యచ్చులకు లోపంబు విభాష నగు. అగుచో నుండు డకారంబునకు నకారంబగు - ఉండు + ఎ = ఉన్నె. ప్రౌఢ. క్రియ. 2.

చ. పొలయు నశోకవల్లి విరిపువ్వుల గుత్తులమీఁదఁ గ్రాలు కెం
దలిరులొ నాఁగ మై నడరి దండడి వహ్నిశిఖాకలాపముల్
గలగొనఁ బ్రేలి దూలికొని కాలె రయంబున లక్కబొమ్మ న
గ్గల మగు వహ్ని చుట్టుకొని కాలు రయంబున నిస్తుషంబుగాన్. 46

అర్థము : పొలయు = ఒప్పునట్టి, అశోక-వల్లి - విరి - పువ్వుల - గుత్తుల మీఁదన్ = అశోకలతయొక్క వికసించిన పూలగుత్తులపై, క్రాలు = ప్రకాశించునట్టి, కెందలిరులు + ఒ (కెంపు+తలిరులు) = ఎఱ్ఱని చిగురులో, నాఁగన్ = అనునట్లు, మైన్ = శరీరమునందు, వహ్ని-శిఖా-కలాపముల్ = అగ్నిజ్వాలల సమూహములు, దండడిన్ = అధికముగా, అడరి = విజృంభించి, కలగొనన్ = వ్యాపింపఁగా, ప్రేలి = వేఁగి బ్రద్దలయి, దూలి - కొని = వ్రాలి - లక్క బొమ్మన్ = లక్కతోఁ జేయఁబడిన బొమ్మను, అగ్గలము + అగు = అధికమైన, వహ్ని = అగ్ని, చుట్టుకొని, నిస్తుషంబుగాన్ = ఊఁకగూడ లేకుండునట్లుగా, కాలు - రయంబునన్ = కాలునట్టి వేగముతో, రయంబునన్ = వడితో, కాలెన్,

తాత్పర్యము : అశోకలత పూచిన పూలగుత్తులపైఁ బ్రకాశించు నెట్టని చిగురులో యన సతీదేవి శరీరమున అగ్నిజ్వాలల సమూహములు మిక్కిలి యెక్కువగా వ్యాపింపఁగాఁ బ్రేలి వ్రాలి లక్కబొమ్మను అధికమగు నిప్పు చుట్టుకొని ఊఁకకూడ లేకుండునట్లుగాఁ గాలెడి వేగముతో వడిగాఁ గాలెను.

విశేషములు : అశోకవల్లి.... కెందలిరులో నాఁగ.... అలంకార ముత్ప్రేక్ష, లక్కబొమ్మ నగ్గలమగు .... నిస్తుషంబుగన్-అలంకార ముపమ. కాలు రయంబున-కాలె రయంబున - 'రయంబున' అనునది పునరుక్తమయినది. రయంబునన్ అను దానికి పూర్వవ్యాఖ్యలో నున్న 'అట్లు' అను నర్థము కానరాదు. అందుచే లక్కబొమ్మ కాలు వేగముతో - సతి మేను వేగముతోఁ గాలె నని యర్థము చెప్పఁబడినది. తూలి కొను = వ్రాలు, పడు. 'కొను' స్వార్థమునఁ బ్రయుక్తము.

కెందలిరులు - కెంపు+తలిరులు - 'సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చు మీఁది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.' కె + తలిరులు. బాల. సంధి. 36, 'లుప్తశేషంబునకుం బరుషములు పరము లగునపుడు నుగాగమంబగు. బాల. సంధి, 37. కె+ను+తలిరులు. పిమ్మట ద్రుతకార్యము, బాల. సంధి. 16.17. కెందలిరులు.

వ. త దవసరంబున. 47

అర్థము : తద్ + అవసరంబునన్ = ఆ సమయమునందు. తరువాతి పద్యముతో నన్వయము.

క. ఘోరస నుడుగక చెలఁగు త్ర
యీరవముల పెల్లు సెడి మహీసుర ముని బృం
దారక తతి దెస నురు హా
హారవములు సెలఁగెఁ దన్మఖాగారములన్. 48

అర్థము : తద్ + మఖ + అగారములన్ = ఆతని (దక్షుని), యజ్ఞ గృహములందు. మహీసుర - ముని - బృందారక-తతి-దెసన్ = బ్రాహ్మణులయు, మునులయు, దేవతలయు సమూహము విషయమున, ఘోరసన్ = ఎక్కువగా, ఉడుగక =

మానక, చెలఁగు = మ్రోయు, త్రయీ - రవముల - పెల్లు = ఋగ్యజుస్సామము లనెడి మూఁడు వేదముల ఘోషాతిశయము, చెడి = పోయి, ఉరు-హాహా-రవములు = గొప్ప హాహాకారములు, చెలఁగెన్ = మ్రోసెను.

తాత్పర్యము : దక్షుని యజ్ఞవాటికలలో బ్రాహ్మణులును, మునులును, దేవతలును ఋగ్యజుస్సామము లనెడు మూఁడు వేదములను పఠించుట మాని అధికముగా హాహాకారములు చేయఁదొడఁగిరి.

విశేషములు : తద్ + మఖ = యత్రులకు (రహాలు తప్ప మిగిలిన పదాంతగత హల్లులకు) అనునాసిక వర్ణము పర మగుచో వానికి సంబంధించిన అనునాసిక వర్ణము వైకల్పికముగా ఆదేశ మగును. - తన్మఖ - తద్మఖ, పెల్లుసెడి = పెల్లు + చెడి, రవములు సెలఁగె .... రవములు + చెలఁగెన్ - గసడదవాదేశములు. బాల. సంధి - 13. త్రయి - ఋగ్యజుస్సామము లనెడు మూఁడువేదములు.

వ. అంతక మున్న కృతాంతాంతకుండు తద్వృత్తాంతంబంతయు నారదు
వలన విని సకల భువన సంహారకారణాఖీల కాలాగ్ని రుద్రోద్రేకంబు
నభినయించువాఁడునుం బోలెఁ గోపానలోద్దీపితావేష్టితాతిభయంకరా
కారంబు దాల్చిన. 49

అర్థము : అంతకున్ + అ - మున్న = అంతకుముందే, కృతాంత + అంతకుండు = యమాంతకుఁడు - శివుఁడు, తద్ + వృత్తాంతంబు + అంతయున్ = ఆ వృత్తాంత మంతయును, నారదువలనన్, విని, సకల .... రుద్రోద్రేకంబునన్, సకల = ఎల్ల, భువన = లోకములయొక్క, సంహార + నాశనమునకు, కారణ = హేతువయిన, అఖీల = భయంకరమైన, కాల + అగ్ని = ప్రళయ సమయమునందలి అగ్నియొక్కయు, రుద్ర = ఏకాదశరుద్రులయొక్కయు, ఉద్రేకంబున్ = ఆవేశమును, అభినయించువాఁడునున్ + పోలెన్ = నటించువాని విధమున, కోప + అనల + ఉద్దీపిత + ఆవేష్టిత + అతి - భయంకర + ఆకారంబు = కోపమనెడి అగ్నిచే మిక్కిలి ప్రకాశించు నావేశపూరితమగు మిక్కిలి భయంకరమైన రూపము; దాల్చినన్ = ధరింపఁగా.

తా త్ప ర్య ము : అంతకుముందే శివుఁడు వృత్తాంతమునంతను నారదునివలన విని యెల్ల భువనముల నాశనమునకుఁ గారణమయిన ప్రళయాగ్నిరుద్రుల యావేశము గలవాఁడో యనఁ గోపాగ్నిచేఁ బ్రజ్వలించు నతిభయంకరాకారమును దాల్పఁగా . తరువాతి పద్యముతో నన్వయము.

వి శే ష ము లు : వాఁడునుం బోలె-'కొన్నియెడల ద్రుతంబుమీఁద నకారంబు గానంబడియెడి,' బాల. సంధి. 21, కోపానల . రూపకము. కోపమనెడి అనల.

మహాస్రగ్ధర

వివిధాస్త్రానీకజాతావిరల బహు లసద్విస్ఫులింగాగ్నియుం, ద
త్పవమానాహార వక్త్ర ప్రకటిత విష విభ్రాజితోగ్రానలంబున్,
సవికారాత్మాతికోపోజ్జ్వలతర విపుల జ్వాలియుం గూడి పర్వెన్
భవ ఫాలాభీల నేత్రోద్భవ శిఖి శిఖలన్ బద్మజాండంబు దాఁకన్. 50

అ ర్థ ము : వివిధా .... గ్నియున్ : వివిధ = అనేక విధములైన, అస్త్ర = అస్త్రములయొక్క, అనీక = సమూహమునుండి, జాత = పుట్టిన, అవిరల = అధికమైన, బహు = మిక్కిలి, లసత్ = ప్రకాశించుచున్న, విస్ఫులింగ = నిప్పు కణములతోడి, అగ్నియున్ = అగ్నియును, తత్పవమానా .... నలంబున్ : తద్ = ఆ, పవమాన + ఆహార = వాయు వాహారముగాఁ గలవాని - పాములయొక్క, వక్త్ర = ముఖముల నుండి, ప్రకటిత = బయలువెడలిన, విష = విషమనెడి, విభ్రాజిత = ప్రకాశించు, ఉగ్ర = భయంకరమైన, అనలంబున్ = అగ్నియును, సవికారా .... జ్వాలియున్ : స - వికార = వికారముతోఁ గూడిన, ఆత్మ = తన యొక్క, అతి=అధికమైన, కోప = కోపమనెడి, ఉజ్జ్వలతర మిక్కిలి ప్రకాశించు, విపుల = విస్తారమైన, జ్వాలియున్ = అగ్నియును, భవ .... శిఖలన్ : భవ = ఈశ్వరుని యొక్క, ఫాల = నొసటియందలి, ఆభీల = భయంకరమైన, నేత్ర = కంటినుండి, ఉద్భవ = పుట్టుకగల-పుట్టిన, శిఖి=అగ్నియొక్క, శిఖలన్=జ్వాలలతో, కూడి = కలిసి, పద్మజ + అండంబు=బ్రహ్మాండము, తాఁకన్=స్పృశించునట్లు, పర్వెన్ = వ్యాపించెను.

తాత్పర్యము: అనేకవిధములైయున అస్త్రసముదాయమునుండి పుట్టిన మిక్కిలి ప్రకాశించు నిప్పుకణములతోడి అగ్నియును, సర్పముఖములనుండి వెలువడు విషమనెడి భయంకరాగ్నియును, తనకోపమనెడి ప్రకాశించు నగ్నియును శివుని నొసటి కంటి నుండి పుట్టిన అగ్నిజ్వాలలతోఁగూడి బ్రహ్మాండమును స్పృశింప వ్యాపించెను.

విశేషములు: అస్త్రజాతాగ్ని, సర్పముఖప్రకటితాగ్ని, నిజకోపాగ్ని - ఈ మూఁడగ్నులును శివుని ఫాలోద్భవాగ్నితోఁ గూడినవి. ఇందొక్కొక్కటియే బ్రహ్మాండమును కాల్చ సమర్థములు, అన్నియుఁ గూడిన వేళ చెప్పవలయునా? ఫాల-భాల - రూపాంతరములు. జ్వాలలు గలది జ్వాలి = అగ్ని. మహాస్రగ్ధర లక్షణమునకు పూర్వవ్యాఖ్య చూచునది.

వ. తదవసరంబునన్ = ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము. 51

చ. ఖురపదఘట్టనన్ ధరణి క్రుంగ, ఫణీంద్రుఁడు నుగ్గునుగ్గుగాఁ,
బరువడి సుడ్వాలం[1] దెరలి పాఱఁ బయోనిధులుం, గులాద్రులుం
బొరిఁబొరిఁ[2] ద్రుంగ, శృంగహతిఁ బొంద దివంబు నజాండమున్, మహే
శ్వరు వృషభంబు నా క్షణమ వచ్చెఁ ద్రిలోకభయంకరాకృతిన్. 52

అర్థము: ఖుర - పద - ఘట్టనన్ = గిట్టలతోడి కాళ్ల రాయిడిచే, ధరణి = భూమి, క్రుంగన్ = అడఁగఁగా, ఫణి + ఇంద్రుఁడున్ = సర్పరాజగు ఆదిశేషుఁడును, నుగ్గునుగ్గు + కాన్ = పిండిపిండికాఁగా, పయోనిధులున్ = సముద్రములును, పరువడిన్ = వేగముగా. సుడ్వాలన్ = సుడుఁగులతో, తెరలి = పొంగి, పాఱన్ = ప్రవహింపఁగా, కుల + అద్రులున్ కులపర్వతములును. పొరిఁబొరిన్ = అత్యంతము, త్రుంగన్ = తునుకలు కాఁగా, దివంబున్ = స్వర్గమును, అజాండమున్ = బ్రహ్మాండమును, శృంగ - హతిన్ = కొమ్ముల దెబ్బను, పొందినన్ = పొందఁగా, మహేశ్వరు - వృషభంబు = శివుని యెద్దు, త్రిలోక - భయంకర + ఆకృతిన్ = ముల్లోకములకు భయము గలిగించు రూపముతో, ఆ క్షణము + అ = ఆ నిముసమునందే, వచ్చెన్.

1. సా. ప్రతి, సూఫ్పులం. 2 సా. ప్రతి. దుంగ,

తాత్పర్యము : గిట్టలతోడి పాదముల త్రొక్కుడిచే భూమి అడఁగఁగా, సర్పరాజగు నాదిశేషుఁడు పిండిపిండికాఁగా, సముద్రములు వేగముగా నురుగులతోఁ బొంగి ప్రవహింపఁగా, కులపర్వతములు మిక్కిలి తునుకలు కాఁగా, స్వర్గమును, బ్రహ్మాండమును కొమ్ముల దెబ్బను బొందఁగా మహేశ్వరుని వాహనమైన యెద్దు ముల్లోకములకు వెఱపు గలిగించు రూపముతో నా క్షణమే వచ్చెను.

విశేషములు: కులాద్రులు - మహేంద్రము, మలయము, సహ్యము, శుక్తిమంతము, గంధమాదనము, వింధ్యము, పారియాత్రము అని యేడు.

వ. అంతఁ బుష్పదంత భృంగిరిట ఘంటాకర్ణ మహాకర్ణ విభోగ వీర
 శంకర వీరభద్ర రుద్ర గణాధినాథు లొండొరులఁ గడవ నుద్రేకించి. 53

అర్థము : అంతన్, పుష్పదంతుఁడు, భృంగిరిటుఁడు, ఘంటాకర్ణుఁడు, మహాకర్ణుఁడు, విభోగుఁడు, వీరుఁడు, శంకరుఁడు, వీరభద్రుఁడు, రుద్రుఁడు, అను, గణ + అధినాథులు = గణాధిపతులు, ఒండొరులన్ = ఒకరినొకరు, కడవన్ = అతిశయించునట్లు, ఉద్రేకించి = విజృంభించి.

తాత్పర్యము ; పిమ్మటఁ బుష్పదంతుఁడు, భృంగిరిటుఁడు, ఘంటాకర్ణుఁడు, మహాకర్ణుఁడు, విభోగుఁడు, వీరుఁడు, శంకరుఁడు, వీరభద్రుఁడు, రుద్రుఁడు అను గణనాయకులు ఒకరినొకరు అతిశయించునట్లు విజృంభించి. తరువాతి పద్యముతో నన్వయము,

మ. 'హరి మర్దింతుమొ, బ్రహ్మఁ బట్టుదుమొ, యింద్రాద్యష్టదిక్పాలురం
 బరిమారన్ వధియింతుమో, త్రిదశులన్ భంజింతుమో. లోకసం
 హరణం బిప్పుడ చేయ నెత్తుదుమొ విశ్వాధీశ్వరుం డీశుఁ డె
 వ్వరిపై నల్గెనొ చూడుఁ' డంచుఁ బ్రమథవ్రాతంబు రౌద్రాకృతిన్. 54

అర్థము : హరిన్ = విష్ణువును, మర్దింతుమొ = చిదుకఁగొట్టుదుమో, బ్రహ్మన్ = బ్రహ్మను, పట్టుదుమొ = బంధింతుమో, ఇంద్ర + ఆది + అష్ట- దిశ్ (క్) + పాలురన్ = ఇంద్రుఁడు మున్నగు నెనమండ్రు దిక్పాలకులను, పరి

చూచిన + చప్పునట్లు, వధియింతుమో = చంపుదుమో, త్రిదశులన్ = దేవతలను, శిక్షింతుమో = సంహరింతుమో, ఇప్పుడు + అ = ఇప్పుడే, లోక - సంహార కరంబు = లోకసంహారము. చేయన్, ఎత్తుదుమొ = దండెత్తిపోవుదుమో, విశ్వ+ అధి + ఈశ్వరుండు = విశ్వేశ్వరుఁడు, అగు. ఈశుఁడు, ఎవ్వరిపైన్, అగ్గెనో = కోపించెనో, చూడుఁడు, అంచున్, ప్రమథ- వ్రాతంబు = ప్రమథుల సమూహము, ఘోర + ఆకృతిన్ = భయంకరమైన రూపముతో.

తాత్పర్యము : 'విష్ణువును మర్దింతుమో, బ్రహ్మను బంధింతుమో ఇంద్రుఁడు మున్నగు ఎనమండ్రు దిక్పాలకులను జంపుదుమో, దేవతలను సంహరింతుమో, ఇప్పుడే లోకనాశనమునుజేయ దండెత్తిపోవుదుమో విశ్వేశ్వరుఁడైన యీశుఁ డెవ్వరిపై, గోపించెనో చూడుఁ' డనుచుఁ బ్రమథగణము భయంకరాకారముతో వెడలి గర్జించిరని యన్వయము,

విశేషములు : అష్టదిక్పాలురు - ఇంద్రుఁడు, అగ్ని, యముఁడు, వరుణుఁడు, వాయువు, నిరృతి, కుబేరుఁడు, ఈశానుఁడు అని ఎనమండ్రు,

దిక్పాలురు - దిక్పాల + లు - 'అదంతంబయి దీర్ఘపూర్వలోపధంబయిన మహత్తుమీఁది విభక్తి లకారంబునకు రేఫం బగు' దిక్పాల + రు. బాల. తత్సమ, 38, 'పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబునకుత్వంబగు.' బాల తత్సమ, 21, దిక్పాలురు.

వ. సంక్షోభించి విరూపాక్షుండు దక్షు నాక్షేపించు తెఱంగి పొంగుచు నతిరభసంబునం బరమేశ్వరు ముందఱికి వచ్చి మహాబ్రహ్మప్రళయ వ్యవసాయంబునకు. మరుతరాఘాతసంప్లవోపక్రమంబునకు, ననేక బ్రహ్మాండఖండ విఖండన వ్యాపారంబునకు నే మేమ చాలుదు మనుచున్న గణంబులందు గణముఖ్యులు దలతల మని వెడలి విన్నవించి. 55

అర్థము : సంక్షోభించి = కలఁతపడి, విరూపాక్షుండు = వికృతమువైన కన్నులు గలవాఁడు - శివుఁడు, దక్షున్, ఆక్షేపించుట = తిరస్కరించుట, ఎఱింగి,

పొంగుచున్ = గర్వించుచు, అతి-రభసంబునన్=మిక్కిలి కోపముతో, ముందటికిన్, వచ్చి, మహత్ (మహా) + బ్రహ్మ - ప్రళయ - వ్యవసాయంబునకున్ = గొప్పది యగు బ్రహ్మప్రళయమునకైన ప్రయత్నమునకును, ఉరుతర - ఆఘాల - సంప్లవ+ ఉపక్రమంబునకున్ = మిక్కిలి గొప్పదియగు చంపుట గల మునుఁగుటయొక్క ఆరంభమునకును, అనేక - బ్రహ్మాండ - ఖండ - విఖండన-వ్యాపారమునకున్= పెక్కు బ్రహ్మాండభాగములను ముక్కలుగాఁ జేయు పనికిని, ఏము + ఏము+అ = మేముమేమే, చాలుదుము=సమర్థులము, అనుచున్+ఉన్న, గణంబుల+అందున్= ప్రమథులందు, గణ - ముఖ్యులు = ప్రమథులలోఁ బ్రధానులు, తలతలమని = తొలఁగుము తొలఁగుము అని, వెడలి, విగుర్వించి = గర్వించి.

తాత్పర్యము: (ప్రమథులు) కలఁగి ముక్కంటి దక్షుని దిరస్కరించుటెఱిఁగి పొంగుచు. మిక్కిలి కోపమునఁ బరమేశ్వరు నెదుటికి వచ్చి మహాబ్రహ్మప్రళయమును గావింపను, సర్వనాశనమును గలిగించు మహాప్రళయము నారంభింపను, బ్రహ్మాండ ఖండనము నొనరింపను మేమే చాలుద మనుచున్న ప్రమథగణములలోఁ బ్రధానులు తొలఁగుము తొలఁగు మని వెడలి గర్వించి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: తలతలమని - తలము - తలఁగుము. 'ఏలాచు మొదలగు వానికి ముత్తు పరంబగునపుడు కడవ్రాయి బహుళంబుగ లోపించు,' బాల. క్రియ. 101. తలము + తలము - 'ఆమ్రేడితంబు పరంబగునపుడు మధ్యమ ము ముజ్ఞులకు లోపంబు విభాష నగు.' తలతలము బాల. సంధి. 49.

చ. 'జలజభవాండ మంతయును జర్జరితం బగుచుండ వ్రచ్చి, మున్
గులగిరు లుర్వీమీఁద వడిఁ గూలఁగఁ ద్రోచి, జగంబు లబ్ధులం
గలిపి, మహాబ్ధు లన్నియును గంజభవాండము మేర కక్కడన్
వెలువడఁ జల్లి, రౌద్రగతి విశ్వము నిప్పుడ సంహరించెదన్.' 56

అర్థము: జలజభవ+అండము=బ్రహ్మాండము, అంతయును,జర్జరితంబు=తుని యలుచేయఁబడినది,అగుచున్ +ఉండన్=అగుచుండఁగా. వ్రచ్చి=ఛేదించి, మున్= ముందుగా, కుల - గిరులు = కులపర్వతము లేడును, ఉర్వీమీఁదన్ = భూమిపై, వడిన్ = వేగముగా, కూలఁగన్ = కూలునట్లు, త్రోచి, జగంబులు = లోకములు, అబ్ధులన్=సముద్రములందు, కలిపి, మహత్ (మహా) + అబ్ధులు+అన్నియును =

మహాసముద్రము లన్నియును, కంజభవ + అండము - మేరకున్ = బ్రహ్మాండము వఱకు, అరుగుదెన్, వెలువడన్=అక్కడనుండి వెలువడునట్లు. చల్లి, రౌద్ర-గతిన్ = భయంకరమగు విధమున, ఇప్పుడు + అ = ఇప్పుడే, విశ్వమున్ = ప్రపంచమును, సంహరించెదన్ = నశింపఁజేయుదును,

తాత్పర్యము : 'బ్రహ్మాండమంతయుఁ దూంట్లు పడునట్లు ఛేదింతును, కుల పర్వతములు భూమిపైఁబడి కూలునట్లు త్రోయుదును, లోకములు సముద్రములందుఁ గలుపుదును, మహాసముద్రము లన్నియును బ్రహ్మాండము వఱకును వెలువడునట్లు చల్లి విశ్వము నిప్పుడే భయంకరముగా సంహరింతును,'

క. 'పంకజనాభాద్యమరులఁ
బొంకం బఱఁ బట్టి తెత్తు భూరిబలమునం
గింక జగంబుల మ్రింగుచు
శంకర ! యేఁ గలుగ నీకుఁ జనునే యలుగన్ ?' 57

అర్థము : కింకన్=కోపముతో, జగంబులన్=లోకములను, మ్రింగుచున్, భూరి - బలమునన్ = అధికమైన బలముతో, పంకజనాభ + ఆది + అమరులన్ = విష్ణువు మొదలగు దేవతలను, బొంకంబు = గర్వము, అఱన్ = పోవునట్లు, పట్టి - తెత్తున్ = బంధించి పట్టుకొనివత్తును, శంకర = ఓ శివా !, ఏన్=నేను, కలుగన్= ఉండఁగా, నీకున్, అలుగన్ = కోపింపఁగా, చనునే = తగునా ?

తాత్పర్యము : 'నేను లోకములను కోపమున మ్రింగుచు, నధికబలముతో విష్ణువు మొదలగు దేవతలను గర్వము నుడిపి బంధించి తెత్తును. శంకరా ! నే నుండఁగా నీవు కోపింపఁదగునా ?' అని యనుట.

విశేషములు : పంకజనాభ - పంకజము నాభియందుఁ గలవాఁడు - విష్ణువు, బహువ్రీహి సమాసము. బహువ్రీహి సమాసమందు 'నాభి' శబ్దముయొక్క 'ఇ' కారమునకు బహుళముగా అ ప్రత్యయాదేశము వచ్చును. పంకజనాభ + ఆది = పంకజనాభాది - సవర్ణదీర్ఘసంధి, పంకజనాభాది + అమరులన్ = పంకజనాభాద్యమరులన్ - యణాదేశసంధి. కినుక-కిన్క, కింక (రూపాంతరములు).

గీ. 'ఎలుకతోఁడి కోపమున ని ల్లేర్చునట్లు
దక్షుపై నల్గి జగమెల్ల నీ క్షణంబ
సంహరింపంగఁ దలఁచుట సన్నె ? వానిఁ
బట్టి తెచ్చెద వడి నన్నుఁ బనుపు దేవ !' 58

అర్థము : దేవ !, ఎలుకతోడి - కోపమునన్ = ఎలుకమీఁది కోపముతో, ఇల్లు, ఏర్చు + అట్లు = కాల్చు విధమున, దక్షుపైన్, అల్గి = కోపించి, జగము + ఎల్లన్ = లోకమంతయు, ఈ క్షణంబు + అ = ఈ క్షణముననే, సంహరింపంగన్ = నశింపఁజేయ, తలఁచుట, చన్నె = చనునా ? తగునా ;, వానిన్, పట్టి. తెచ్చెదన్, వడిన్, నన్నున్, పనుపు = పనుపుము - ఆజ్ఞాపింపుము.

తాత్పర్యము : 'ఎలుకపైఁ గోపమున నిల్లు కాల్చు విధమున, దక్షునిమీఁది కోపమున లోకమునంతను నీ క్షణమే నశింపఁజేయ నెంచుట నీకుఁ దగునా ? దేవా ! వానిని బట్టి తెత్తును. వేగముగా నన్నుఁ బంపుము.'

విశేషములు : ఎలుకతోడి కోపమున నిల్లేర్చునట్లు .... అలంకార ముపమ. ఏర్చు + అట్లు - 'ఉదంతమగు తద్ధర్మార్థవిశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమంబగు,' బాల, సంధి. 33, ఏర్చునట్లు. చన్నె - చనునె. 'ఒకానొకచోఁ దద్ధర్మార్థకంబులగు నుండు, చను, చేరుకొనులు ప్రశ్నార్థకైకార పరకంబు లగునపుడు వాని కడ యచ్చులకు లోపంబు విభాష నగు, అగుచో నుండు డకారంబునకు నకారంబగు,' ప్రౌఢ. క్రియ, 2, పనుపు - పనుపుము. 'మధ్యమపురుష మువర్ణకంబునకు హలవసానంబులు పరంబు లగునపుడు లోపము విభాష నగు.' బాల, సంధి. 47.

పయి పాట లన్నియుఁ బ్రమథు లొక్కొక్కరే యన్నవి. కావుననే యందలి క్రియ లేకవచనమున నున్నవి.

వ. అని యనేకప్రకారంబులం బ్రత్యేకంబ పలుకుచున్న గణాధిపతుల వారించి గణాధీశ్వరుండు పరమేశ్వరున కభిముఖుండై ప్రళయకాల నీలఘనాఘనంబునుం బోలె మహాధ్వని గర్జిల్లుచు. 59

అర్థము: అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కురీతుల, ప్రత్యేకంబు + ఆ = ప్రత్యేకమైనదే, పలుకుచున్ + ఉన్న = పలుకుచున్నట్టి, గణ+అధిపతులన్= గణనాయకులను, పాలించి = ఆఁపి, గణ + అధి + ఈశ్వరుండు = గణపతి, పరమేశ్వరునకున్, అభిముఖంబు + ఐ = ఎదురయి, ప్రళయ - కాల-నీల-ఘనా - ఘనంబునున్ + పోలెన్ = ప్రళయసమయమునందలి నల్లని వర్షాకాలపు మేఘము వలె, మహాత్ (మహా) + ధ్వనిన్ = గొప్ప ధ్వనితో, గర్జిల్లుచున్ = ఉఱుముచు.

తాత్పర్యము: అని పెక్కురీతుల వేఱువేఱుగాఁ బలుకుచున్న గణనాయకులను వారించి గణపతి పరమేశ్వరున కభిముఖుఁడై ప్రళయకాలమునందలి నల్లని వర్షాకాల మేఘమువలె, మహాధ్వనితో నుఱుముచు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ప్రళయకాల నీలఘనాఘనంబునుంబోలె-అలంకార ముత్ప్రేక్ష

ఉత్సాహ 'బలిమిఁ బట్టు కలిగి పాశుపతము దొడుగ నేటి? క
గ్గలిక ములుకకాయ కెత్తు గల్లు గొనఁగ నేల? ము
న్నెలుక వేఁట కుఱుముతిండి యేల? నీకు నలుగఁగాఁ
దలము గలదె? నన్నుఁ బనుపు దక్షుఁ బట్టి తెచ్చెదన్.' 60

అర్థము: పట్టుబడి + అలిగి = పట్టుపట్టఁ గోపించి, బలిమిన్=బలముతో, పాశుపతము = పాశుపతాస్త్రము, తొడుగన్ + ఏటికి = వింట సంధించుట యెందులకు? పిల్లికి బ్రహ్మాస్త్రము వేయనేల? యనుట. అల్పుని దండింప నింతయత్నమేల? అని భావము. కగ్గలికన్=అధిక్యముతో, ములుక కాయకున్ = కంటకికి, ముల్లుపండునకు, ఎత్తు + కల్లు = ఎత్తు ఱాయి - ఎత్తునకయి పెట్టుకొను ఱాయి. కొనఁగన్ + ఏల? = తీసికొను టెందులకు? సులభముగా నందుఁబాటులోనున్న దానికయి యెత్తు కొఱకు ఱాయి పెట్టుకొననేల? యనుట. వృథాప్రయత్నమని భావము, మున్ను = ముందుగా, ఎలుక- వేఁటకున్ =ఎలుకను వేఁటాడుటకు, ఉఱుముతిండి = ఉఱుముపిల్లి (ఉఱుములనగువానిని దిను పక్షి), ఏల?, నీకున్, అలుగఁగాన్ = కోపించుటకు, తలము + కలదె = స్థానముకలదా? ఆవశ్యకత యున్నదా? లేదనుట, నన్నున్, పనుపు = పనుపుము - పంపుము, దక్షున్, పట్టి, తెచ్చెదన్,

తాత్పర్యము: 'చిన్నపిట్టకై గోపించి పాశుపతాస్త్రమును వింట సంధింపనేల? క్రిందనే యుండు ములగవంకాయను గోయుట కెత్తు టాయి కొననేల? ఎలుకను పేటాడుట కుడుపకుక్క యెందులకు? నీ కోపమున కిట స్థానము లేదు, నన్నుం బంపుము, దక్షుని బంధించి తీసికొనివత్తును.'

విశేషములు: అలంకారము దృష్టాంతము - మొదటి మూడుపాదము లందును మూడు దృష్టాంతములు గలవు. 'చే ద్బింబప్రతిబింబత్వం దృష్టాన్త స్తదలఙ్కృతిః' చన్ద్రా. ములక - ములక=కంటకి, వార్తాకము, ములగవంగ (సూ.ని.) 'కంటకి చను ములుక యన' ఆం,భా?.59, ఉఱుము = ఉడుము, ఉఱుముతిండి - ఉడుములను దిను కుక్క - ఉడుప కుక్క, పనుపు - పనుప్పము - హల్లు పరమగుచుండ మధ్యమపురుష ముపర్ణక లోపము, బాల. సంధి. 47.

ఉత్సాహ వృత్తము - నాలుగుపాదము లుండును. ఒక్కొక్క పాదమున నేడు సూర్యగణములు నొక గురువు నుండును. మొదటి గణము మొదటి యక్షరమునకును అయిదవగణము మొదటి యక్షరమునకును యతిమైత్రి, ప్రాసనియమము గలదు.

వ. అస్మదీయ జననీ పరాభవం బింతయుం గావున నవశ్యంబుగ నిప్పని నాకు దయసేయవలయు నని పన్నువడం బలుకుచున్న గణాధీశ్వరు తెగువ యెఱింగి దక్షాధ్వరధ్వంసంబు చేసి దక్షుం బట్టి తెమ్మని పరమేశ్వరుండు నియమించిన మహాప్రసాదం బని వీడుకొనియె నంత నా క్షణంబ. 61

అర్థము; ఇంతయున్ = ఇదియంతయును, అస్మదీయ - జననీ - పరాభవంబు = నా తల్లి(సతి) యవమానము, కావునన్ అవశ్యంబుగన్ = తప్పక, ఈ + పని = దక్షబంధన మను నీ పని, నాకున్, దయ + చేయవలయున్, = అనుగ్రహింపవలయును, అని, పన్నువడన్ = ఒప్పునట్లు, పలుకుచున్ + ఉన్న, గణ + అధి + ఈశ్వరు = గణపతియొక్క, తెగువ = సాహసము. ఎఱింగి, దక్ష + అధ్వర - ధ్వంసంబు = దక్షయాగనాశనము, చేసి, దక్షున్, పట్టి - తెమ్ము + అని, పరమేశ్వరుండు, నియమించినన్ = ఆజ్ఞాపింపఁగా, మహత్(మహా) + ప్రసా

దంబు = గొప్ప యనుగ్రహము, అని, పేడుకొనియెన్ = వేడెను, అంతన్, ఆ.
క్షణంబు + అ = వెంటనే.

తాత్పర్యము : 'ఇది యంతయు నా తల్లి యగు సతీదేవికైన యవమానమే.
కావున దక్షుని బట్టితెచ్చు నీ పనిని దప్పక నా కనుగ్రహింపుము,' అని యొప్పుగాఁ
బలుకుచున్న గణపతి సాహసము నెఱిఁగి దక్షయజ్ఞనాశనము చేసి దక్షుని బట్టితెమ్మని
పరమేశ్వరుఁడు నియోగింపఁగా మహాప్రసాద మని యతఁడు వేడెను. అంత నా క్షణమే.
తరువాతి పద్యముతో నన్వయము.

ఉ. స్థూలసమున్నతాంగులు, చతుర్భుజ ఫాలతలాక్ష శూల కా
పాల కఠోర కార్ముక కృపాణ ధరుల్, ప్రమథాధినాథు, లా
భీలపరాక్రముల్, నిఖిల భీకరమూర్తులు వచ్చి రోలిఁ గం
కాలసమేతులై భువనకంపముగా గణనాథు పాలికిన్. 62

అర్థము : స్థూల - సమున్నత + అంగులు = లావయిన, ఎత్తయిన శరీ
రములు గలవారును, చతుః + భుజ, ఫాలతల + అక్ష - శూల - కాపాల - కఠోర -
కార్ముక - కృపాణ - ధరుల్ = నాలుగుభుజములు, నొసటికన్నులు, శూలములు,
కపాలములు, కఠినములైన విండ్లు, ఖడ్గములు ధరించినవారును, ఆభీల -పరాక్రముల్ =
భయంకరమైన పరాక్రమము గలవారును, నిఖిల - భీకరమూర్తులున్ = ఎల్లరకు వెఱపు
గలిగించు నాకారములు గలవారును, అగు, ప్రమథ + అధినాథులు = ప్రమథనాయ
కులు. కంకాల - సమేతులు + ఐ = అస్థిపంజరములతోఁ గూడినవారయి, గణ -
నాథు - పాలికిన్ = గణపతి యొద్దకు, ఓలిన్ = క్రమముగా, భువన - కంపము +
కాన్ = లోకములు చలించునట్లు, వచ్చిరి.

తాత్పర్యము : లావయినట్టియు. మిక్కిలి యెత్తయినట్టియు శరీరములు గల
వారును, నాలుగుభుజములు, నొసటి కన్నులు. శూలములు. పుఱ్ఱెలు, కఠినములైన
విండ్లు. ఖడ్గములు ధరించినవారును, భయంకర పరాక్రమము గలవారును, ఎల్లరకు
వెఱపుగొలుపు రూపములు గలవారును అగు ప్రమథనాయకులు అస్థిపంజరములతోఁ
గూడినవారయి లోకము లదరునట్లు గణపతి యొద్దకు వరుసగా వచ్చిరి.

వ. తదవసరంబున దేవగణాధీశ్వరి నిఖిల శాకినీ డాకినీ కూశ్మాండ యోగినీ గణ పరివృతయై. 63

అర్థము : తద్ + అవసరంబునన్ ఆ సమయమున, దేవ-గణ + అధి + ఈశ్వరి = మహాకాళి, నిఖిల .... పరివృతయై ; నిఖిల=ఎల్ల, శాకినీ = యక్షిణులు, డాకినీ = పిశాచస్త్రీలు, కూశ్మాండ = పిశాచములు, యోగినీ = దుర్గ పరిచారికలు, అనువారియొక్క, గణ = సమూహముతో, పరివృత + ఐ = కూడుకొన్నదయి.

తాత్పర్యము : ఆ సమయమున దేవగణముల కధీశ్వరి యైన మహాకాళి ఎల్ల శాకినులు, డాకినులు, కూశ్మాండులు, యోగినులు ననువారి సమూహములతోఁ గూడినదయి - తరువాతి పద్యముతో నన్వయము.

క. లోకాలోకములోఁ గల
చీఁకటి యెల్ల నొకపొడవు సేకొనియెనొ నా
నాకాశ మడరి వచ్చె మ
హాకాళి మహాభయంకరాకారముతోన్. 64

అర్థము : లోకాలోకములోన్ = చక్రవాళపర్వతములో, కల = ఉన్న, చీఁకటి + ఎల్లన్ = చీఁకటియంతయు, ఒక - పొడవు = ఒక రూపము, చేకొని యెనొ=స్వీకరించెనో, నాన్=అనఁగా, మహాకాళి, మహత్ (మహా) - భయంకర+ ఆకారముతోన్ = మిక్కిలి వెఱపు గొలుపు రూపముతో, ఆకాశము + అడరి - విజృంభించి - ఆక్రమించి, వచ్చెన్,

తాత్పర్యము : చక్రవాళ పర్వతములోఁ గల చీఁకటి యంతయు నొక రూపమును ధరించెనో యనునట్లు మహాకాళి మిక్కిలి భయంకరమైన ఆకారముతో నాకాశమంతయు నాక్రమించి వచ్చెను.

విశేషములు ; అలంకార ముత్ప్రేక్ష. లోకాలోకము - చక్రవాళ పర్వతము. దీనికిఁ జీఁకటికొండ యనియుఁ బేరు. దీని కొక పార్శ్వమున సూర్యకిరణస్పర్శ

ముండును. ఒక పార్శ్వమున నుండదు. చీఁకటిరో నర్ధానుస్వార మున్నదను విషయమున రెండు మతములు గలవు, ఉండు నను మతమున నిది ఖండాఖండప్రాస మగును. శ. ర. నబిందుకముగాను, చి. ని. నిర్బిందుకముగాను గ్రహించెను. నబిందుక మనుటకు భారతేతర ప్రాచీన గ్రంథములు కొన్ని నిర్ధారకములుగాఁ గలవు.

వ. ఇట్లఖిల గణ పరివృతుండై గణాధీశ్వరుం డతిరయంబున దక్ష ప్రజాపతిపైఁ బరిగొని దక్షాధ్వరావాసంబు గని కోపించి నిజగణంబు లకుం జేయివీచిన నా క్షణంబ. 65

అర్థము: ఇట్లు, అఖిల - గణ-పరివృతుండు+ఐ=ఎల్ల ప్రమథగణములతోఁ గూడఁబడినవాఁడయి, గణ + అధి + ఈశ్వరుండు =గణపతి, అతి-రయంబునన్= మిక్కిలి వేగముతో, దక్ష - ప్రజాపతిపైన్, పరిగొని=దండువెడలి, దక్ష+అధ్వర + ఆవాసంబు = దక్షుని యజ్ఞవాటిక, కని = చూచి, కోపించి, నిజ - గణంబులకున్= తనవైన ప్రమథగణములకు, చేయి - వీచినన్ = చేసన్న చేయఁగా, ఆ-క్షణంబు+ అ = ఆ క్షణమే,

తాత్పర్యము ; ఇట్లు ఎల్ల గణములతోఁ గూడినవాఁడయి గణపతి మిక్కిలి వేగముతో దక్షప్రజాపతిపై దండువెడలి యతని యజ్ఞవాటికను జూచి కోపించి తన గణములకుఁ జేసన్న చేయఁగా నా క్షణమే - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. క్రతు రక్షకులఁ దాఁకి కనుకనిఁ బోఁ దోలి,
చూపఱ విదిశలు సొరఁగఁ దోలి,
వడి జన్నసాల నివాసంబు గొని వేది
కలు గ్రొచ్చి గుండముల్ గవియఁద్రోచి.
ఋత్విగ్గణంబులఁ జత్వాలమునఁ బాఁతి,
బలిమి సదస్యుల నలియ మోఁది,
యుపదర్శి మెడ నుల్మి యూపంబుతోఁ గట్టి
పరిచారకులఁ బట్టి బారిసమర్చి,

ఆ. వహ్ని జిహ్వ రెండు ప్రయ్యలుగాఁ గోసి,
పరిజనముల నేలపాలు చేసి,
యా క్షణంబ ముట్టి దక్షాధ్వరం బశ్ర
మమునఁ జెఱిచి యార్చెఁ బ్రమథగణము. 66

అర్థము : ప్రమథ - గణము = ప్రమథుల సమూహము, (కర్త). క్రతు - రక్షకులన్ = యజ్ఞమును గాపాడువారిని, తాఁకి, కనుకనిన్ = సంభ్రమముతో, పోన్ + తోలి = పోవునట్లు తోలి, - తఱిమి, చూపఱన్ = చూచువారిని, విదిశలు = మూలలు, చొరఁగన్ = చొచ్చునట్లు, తోలి,

వడిన్ = వేగముతో, జన్న - సాల = యజ్ఞశాల, నివాసంబు + కొని = స్థానముగా నేర్పఱుచుకొని, వేదికలు = అరుగులు, గ్రొచ్చి = త్రవ్వి, గుండములన్ = కుండములు, కవియన్ + త్రోచి = పడఁద్రోసి,

ఋత్విక్ + గణంబులన్ = ఋత్విజుల సమూహములను, చత్వాలమునన్ = హోమాగ్ని కొఱకు కేర్పఱిచిన గోతియందు, పాఁతి, సదస్యులన్ = యజ్ఞ సహాయకులగు ఋత్విజులను, బలిమిన్ = బలముతో, నలియన్ + మోఁది = నలఁగఁగొట్టి,

ఉపదర్శి = యజ్ఞకార్య పర్యవేక్షకునియొక్క, మెడన్, సుల్కి = మెలిపెట్టి, యూపంబుతోన్ = యజ్ఞపశువును గట్టఁబాఁతిన కొయ్యతో, కట్టి, పరిచారకులన్ = సేవకులను, పట్టి, బారిసమరి = హింసించి,

వహ్ని - జిహ్వన్ = అగ్ని నాలుకను, రెండు - ప్రయ్యలుగాన్ = రెండు చీలికలుగా, కోసి, పరిజనములన్ = పరివారమును, నేలపాలు - చేసి = నేలఁ బడ, గొట్టి, దక్ష + అధ్వరంబు = దక్షుని యజ్ఞము, ఆ - క్షణంబు + అ = ఆ క్షణమే, ముట్టి = ఆవరించి, అశ్రమమునన్ = అనాయాసముగా, చెఱిచి = చెడఁగొట్టి, ఆర్చెన్ = అఱచెను.

తాత్పర్యము : ప్రమథుల సమూహము యజ్ఞరక్షకులను దాఁకి సంభ్రమముతోఁ బాఱఁద్రోలి, చూచువారిని మూలలకుఁ బోఁద్రోలి, వేగముగా యజ్ఞశాలను స్థానముగా నేర్పఱుచుకొని వేదికలు త్రవ్వి, గుండములను బడఁద్రోసి, ఋత్వి

స్థసమూహమును హోమాగ్ని కేర్పఱిచిన గోతియందుఁబాఁతి, యజ్ఞసహాయకులగు ఋత్విక్కులను బలముగాఁ జిదుకఁగొట్టి, యజ్ఞకార్య పర్యవేక్షకుని మెడ నులిమి యూపస్తంభమునకుఁ గట్టి, పరిచారకులను బంధించి హింసించి, అగ్ని నాలుకను రెండు పిలకలుగాఁ గోసి, పరిజనమును నేలఁబడవైచి, దక్షయజ్ఞము నా క్షణముననే ఆవరించి అనాయాసముగాఁ జెఱిచి యఱచెను.

విశేషములు ; కుండము (ప్రకృతి) - గుండము (వికృతి). ఋత్విజ్ + గణము - పదాన్తఝలములకు ఝల్ (అనునాసికములు, అంతస్థములు తప్పఁదక్కిన హల్లులు) పరమగునపుడును, పదాంతమునందును కవర్గాక్షరము లాదేశము లగును. ఋత్విగ్గణము. గ్రొచ్చు - ఇది పరుషాదిగాఁ గూడ నున్నదని శ. ర. చత్వాలము = A hole in the ground prepared for an oblation or for the sacrificial fire, Apte. ప్రయ్యు - కృదంతము-ప్రయ్యి. 'అవర్గకంబు గిత్త్వాదుల కగు.' బాల. కృ. 18. చెఱచి - 'చెయునకుం జుక్పాగమంబులును డా కలఘురేఫంబు నగు.' బాల. క్రి. 81. చెఱుచు. 'సమానాశ్రయంబులం బూర్వకాలంబునం దివర్ణకం బగు.' [1] బాల. క్రి. 38. చెఱుచు+ఇ. 'ఇత్వంబుగాని యెత్వంబుగాని కూడుచో ననాద్యంబయిన యుత్వంబున కిత్వం బగు.' బాల. క్రి. 85. అపదాదిస్వరసంధి-బాల,సంధి, 11.చెఱిచి.

వ. అట్టి సంకులంబున. 67

అర్థము : ఆ దొమ్మి యుద్ధమున - తరువాతి పద్యముతో నన్వయము.

ఉ. ఆ యవనీసురామరచయం బురుసత్త్వుల నుగ్రులన్ మహా
కాయులఁ దద్గణాధిపులఁ గాంచుచు మీఁదికి మీఁద జీవముల్
వోయిరి కొంద, ఱోడి చెడిపోయిరి కొందఱు, చుట్టుముట్టినం
గూయిడఁ జొచ్చి రుక్కడఁగి కొంద ఱలందురి భీతచిత్తులై 68

అర్థము : ఆ + అవనీసుర + అమర - చయంబు = ఆ బ్రాహ్మణులయు, దేవతలయు సమూహము, ఉరు-సత్త్వులన్ = గొప్ప బలముగల వారును, ఉగ్రులన్ = భయంకరులును, మహత్ (మహా) - కాయులన్ = గొప్ప శరీరము గలవారును, అగు, తత్ + గణ + అధిపులన్ = ఆ గణనాయకులను, కాంచుచున్ = చూచుచు, కొందఱు,

మీఁదికిన్ - మీఁదన్ + జీవముల్ + పోయిరి = పయిప్రాణములు పయినే కోల్పోయిరి, చుట్టుముట్టినన్, కొందఱు, ఓడి, చెడిపోయిరి = నశించిరి, కొందఱు, భీత-చిత్తులు + ఐ = భయపడిన మనస్సులు గలవారయి, అందురి = కలఁతఁజెంది, ఉక్కు + అడఁగి = బలము నశించి, కూయిడన్ + చొచ్చిరి = భయముచే నఱవఁజొచ్చిరి.

తాత్పర్యము : ఆ బ్రాహ్మణులయు దేవతలయు సమూహము గొప్ప బలము గలవారును, భయంకరులును, పెద్ద శరీరములుగలవారును అగు ఆ ప్రమథనాయకులను జూచుచుఁ గొందఱు పయిప్రాణములను పయినే కోలుపోయినవారయిరి. ప్రమథులు చుట్టుముట్టఁగా గొందఱు ఓడి నశించిరి. కొందఱు భయపడిన మనస్సులు గలవారయి కలఁతఁజెంది, బలము నశించి మొఱపెట్టఁగాఁజొచ్చిరి.

వ. ఇట్లతిభీషణశాసనులైన గణాధీశ్వరుల కవిదల కబ్బగింపక సురవరు లతిసంభ్రమంబునం బరిమొగంబు దప్పం గనుకనిం జను నవసరంబున. 69

అర్థము ; ఇట్లు, అతి - భీషణ-శాసనులు + ఐన = మిక్కిలి భయంకరమైన ఆజ్ఞగలవారగు, గణ + అధి + ఈశ్వరుల = గణనాయకులయొక్క, కవిదలకున్ = తాఁకునకు, అబ్బగింపక = సహింపక, సుర - వరులు = దేవతాశ్రేష్ఠులు, అతి - సంభ్రమంబునన్ = మిక్కిలి వేగముతో, పరిమొగంబు + తప్పన్ = సేనాముఖము తప్పునట్లు, కనుకనిన్ = సంభ్రమముతో, చను + అవసరంబునన్ = పోవు సమయము నందు.

తాత్పర్యము ; ఇట్లు మిక్కిలి భయంకరమైన ఆజ్ఞగల ప్రమథనాయకుల తాఁకున కోర్వక దేవతాశ్రేష్ఠులు మిక్కిలి వేగమున సేనాముఖము దప్పించి పోవు సమయమునందు - తరువాతి పద్యముతో నన్వయము.

ఆ. వాహనంబు నెక్కి వచ్చి భయంబున
వడఁకి నేలఁ బడ్డ వనజగర్భుఁ
గమిచికొని మరాళకము వాఱెఁ జెందమ్మిఁ
గఱచికొని రయమునఁ బఱచినట్లు. 70

అర్థము : వాహనంబున్ – తన వాహనమైన హంసను, ఎక్కన్+వచ్చి= ఎక్కఁబోయి, భయంబునన్ = భయముతో, వడఁకి, నేలన్ + పడ్డ=నేలపైఁబడిన, వనజ - గర్భున్ = తమ్మిచూలిని-బ్రహ్మను, కమిచికొని=పట్టుకొని, మరాళకము = హంస, చెందమ్మిన్ (చెన్ను+తమ్మిన్) =కెందామరను, కఱచికొని, రయమునన్= వేగముతో, పఱచు + అట్లు = పరువెత్తు విధమున, పాఱెన్ = పరువెత్తెను.

తాత్పర్యము: తన వాహనమైన హంస నెక్కఁబోయి భయమున వణఁకి నేలపైఁబడిన బ్రహ్మను హంస పట్టుకొని కెందామరను నోటఁగఱచికొని వేగముగాఁ బాఱునట్లు పాఱెను.

విశేషములు ; అలంకారము స్వభావోక్తి. మరాళకము - మరాళము - స్వార్థమున క ప్రత్యయము.

చెందమ్మి-చెన్ను + తమ్మి - 'సమాసంబున నంత్యాదుల తొలియచ్చుమీఁది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.' బాల. సంధి. 36. చె + తమ్మి, 'లుప్తశేషంబునకుం బరుషములు పరము లగునపుడు నుగాగమంబగు.' బాల. సంధి. 37. చె + ను + తమ్మి. 'ద్రుతప్రకృతికముమీఁది పరుషములకు సరళము లగు.' బాల. సంధి. 16. చె + ను+దమ్మి, 'ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాష నగు.' చెందమ్మి. బాల. సంధి. 17.

ఆ. గరుడి నడుము మెడయుఁ గాలను గేలను
నిఱికికొనుచుఁ జక్రి వెఱచి వఱచె
ఘర్మజలము లొడలఁ గ్రమ్మంగ వర్షేంద్ర
చాప జలద ఘాతిఁ జదలఁ బొదల. 71

అర్థము : చక్రి = సుదర్శనమను చక్రము గలవాఁడు - విష్ణువు, గరుడి = గరుత్మంతునియొక్క, నడుమున్, మెడయున్, కాలను+కేలను=కాలియందును, జేతియందును, ఇఱికికొనుచున్ = బిగియఁబట్టుకొనుచు, ఘర్మ - జలములు = చెమట నీరులు, ఒడలన్ = శరీరమునందు, క్రమ్మంగన్=వ్యాపింపఁగా, వర్ష+ఇంద్రచాప.

జలద - ఛాతిన్ = వర్ష సమయమునందు ఇంద్రధనుస్సుతోడి, మేఘము విధమున, చదలన్ = ఆకాశమునందు, పొదలన్ = ఒప్పుఁగా, వెఱచి = భయపడి, పఱచెన్ = పాఱెను.

తా త్ప ర్య ము : విష్ణువు తన వాహనమైన గరుత్మంతుని నడుమును, మెడను, కాళ్లను, కేలను బిగియఁబట్టి, భయపడి, చెమటనీరు మేనఁ గ్రమ్మ, వర్ష సమయమున నింద్రధనుస్సుతోడి మేఘమువలె ఆకాశమున నొప్పుఁగాఁ బాఱెను.

వి శే ష ము లు : ఇందు గరుడి యింద్రధనుస్సుతోను, విష్ణువు మేఘముతోను బోల్పఁబడిరి. కావున నలంకార ముపమ. 'ఛాతి' కి విధమను నర్థము తెనుఁగుననే కనఁబడుచున్నది. (సూ. ని.) నడుము - మెడయు, కాలను - గేలను, వెఱచి-పఱచె, చదలఁ - బొదలె - ఛేకానుప్రాసము.

ఆ. వేఁటకాఁఱు ముట్టి వెనుకొనఁగా శ్వేత
నగము చఱికిఁ దారు నమిలివోలె
నభ్రగజము మీఁదికా సహస్రాక్షుండు
ప్రాఁకి పాఱెఁ బ్రమథరాజి యార్వ. 72

అ ర్థ ము : వేఁటకాఁఱు = వేఁటకాండ్రు, ముట్టి = తాఁకి, వెనుకొనఁగాన్ = వెన్నాడఁగా, శ్వేత - నగము - చఱికిన్ = వెండికొండ (కైలాసము) చఱియమీఁదికి, తారు = పోవునట్టి, నమిలి + పోలెన్ = నెమలివలె, ప్రమథ - రాజి = ప్రమథ గణము, ఆర్వన్ = అఱవఁగా, ఆ-సహస్ర + అక్షుండు = ఆ వేయి కన్నులవాఁడు - ఇంద్రుఁడు, అభ్ర - గజము - మీఁదికిన్ = ఆకాశమునందు సంచరించు నేనుఁగు - (ఐరావతము) మీఁదికి, ప్రాఁకి, పాఱెన్.

తా త్ప ర్య ము : వేఁటకాండ్రు తాఁకి వెన్నాడఁగా వెండికొండ చఱియమీఁదికిఁ బోవు నెమలివలెఁ, బ్రమథగణములు అఱవఁగా నా వేయికన్నులవేల్పు వెల్ల యేనుఁగు మీఁదికిఁ బ్రాఁకి పాఱెను.

వి శే ష ము లు : అలంకార ముపమ. ప్రమథులు-వేఁటకాండ్రు, అభ్రగజము-శ్వేతనగము, సహస్రాక్షుఁడు - నమిలి - ఇవి ఉపమేయోపమానములు. అభ్రగజము-

శ్వేతనగము రెండును దెలుపే. ఇంద్రుఁ డనక సహస్రాక్షుఁడనుట చిత్రవర్ణములైన పెక్కు కన్నులుగల నమిలితోడి పోలికకు. నమిలి నమలి, నమ్మి, నమ్మిలి, నెమలి, నెమిలి, నెమ్మి, నెమ్మిలి రూపాంతరములు. పజి - పజియ (రూపాం.)

వేఁటకాఁడు-వేఁట కా + లు. 'కాప్రత్యయంబుమీఁది బహువచన లకారంబునకు లఘ్వలఘురేఫంబులును లఘురేఫంబునకు ముందు పూర్ణబిందుపూర్వక డకారంబు నగు.' బాల. ఆచ్ఛి. 7. వేఁటకాండ్రు, వేఁటకాఁడు.

ఆ. ఇక్కు ముట్టి చక్కి నెక్కంగ మఱచి సం
భ్రమముఁ బొంది పిఱుఁదఁ బ్రమథగణము
లార్వఁ బోతుమీఁద నడ్డంబు పడి యుప్పుఁ
బెటికవోలె వెఱచి పఱచె జముఁడు. 73

అర్థము : పిఱుఁదన్ = వెనుక, ప్రమథ - గణములు, ఆర్వన్ = అఱవఁగా, జముఁడు = యముఁడు, ఇక్కు = నడుము, ముట్టి = పట్టుకొని, చక్కిన్ = తన వాహనమైన దున్నపోతును, ఎక్కంగన్ - మఱచి = ఎక్కుట మఱచిపోయి, సంభ్రమమున్ + పొంది = భయపడి, పోతు మీఁదన్, ఉప్పు + పెటిక + పోలెన్ = ఉప్పు గోనె వలె, అడ్డంబుపడి = అడ్డముగాఁబడి. వెఱచి = భయపడి, పఱచెన్ = పాఱెను.

తాత్పర్యము : వెనుకఁ బ్రమథులు తఱిమి యఱవఁగా యముఁడు భయపడి తన వాహనమైన దున్నపోతును నడుము పట్టుకొని యెక్కురీతిని మఱచి దానిపై నుప్పుగోనెవలె నడ్డముగాఁ బడి పాఱెను.

విశేషములు : అలంకార ముపమ. స్వభావోక్తి.

ఉప్పుఁబెటిక-ఉప్పు+పెటిక. 'సమాసంబుల నుదంతంబులగు స్త్రీసమంబులకుం బుంప్రులకుం బరుష సరళంబులు పరంబులగునపుడు నుగాగమం బగు.' బాల, సంధి. 25. ఉప్పు+ను+పెటిక. ద్రుతకార్యము. బాల, సంధి. 16,17. ఉప్పుఁబెటిక-ఉప్పుఁబెటిక + పోలె - గసడదవాదేశము - బాల. సంధి. 13. ఉప్పుఁబెటిక వోలె. యముఁడు (ప్రకృతి) - జముఁడు (వికృతి).

గీ. ఉరుతరాబ్ధీశుఁ డయ్యును నోడి పాఱె
వరుణుఁ డలుకుచు నోడిక వాఁగువోలెఁ;
గలుము లెడరైన నేమియు నిలువ వనుట
తగ భయాతురుఁడై నోరఁ దడియు లేక. 74

అర్థము: కలుములు = సంపదలు, ఎడరు + ఐనన్ = భంగపడఁగా, ఏమియున్, నిలువవు, అనుట, తగన్ = ఒప్పఁగా, వరుణుఁడు, ఉరుతర + అబ్ధి + ఈశుఁడు = మిక్కిలి గొప్పవియగు సముద్రముల కధిపతి, అయ్యును = అయినను, అలుకుచున్ = భయపడుచు, భయ + ఆతురుఁడు + ఐ - భయముచేఁ పీడితుఁడయి, నోరన్ = నోటియందు, తడియున్ + లేక = తడికూడ లేక, ఓడికన్ = ప్రవహించుటచే, వాఁగు + పోలెన్ = సెలయేఱు వలె, ఓడి - పాఱెన్ = వెఱచి పఱచెను.

తాత్పర్యము: సంపదలు పోయినచో నేమియు నిలువవనుట సరిపడునట్లు వరుణుఁడు తాను సముద్రముల కధిపతియైనను భయముచే - ప్రవాహముచే సెలయేఱు వలె, నోరఁ దడికూడ లేక, ఓడి పాఱెను.

విశేషములు: ఓడికవాఁగువోలె - అలంకార ముపమ, కలుము లెడరైన నేమియు నిలువ వనుట తగన్ - విశేషము సామాన్యాంశముచే సమర్థింపఁబడుటచే నర్థాంతరన్యాసము. ఉరుతరాబ్ధీశుఁ డయ్యును-నోరఁ దడియులేక-ఇందలి చమత్కారము ప్రశంసనీయము- ఓడి = భయపడి - వరుణుఁడు జలాధిదేవుఁ డగుటచే 'స్రవించి' యనియు స్వారస్యము.

క. తన యెక్కిన మానిసిఁ దా
ననయము నెక్కంగ మఱచి యాతనిఁ దన మూఁ
పున నిడికొని పఱచె భయం
బున ధనపతి తన్నుఁ బిఱుఁద భూతము లార్వన్. 75

అర్థము: ధనపతి = కుబేరుఁడు. తన్నున్, పిఱుఁదన్ = వెనుక, భూతములు = పిశాచగణములు, ఆర్వన్ = బొబ్బరింపఁగా, భయంబునన్ = భయముతో, తన +

ఎక్కిన - మానిసిన్ = తా నెక్కిన మనుష్యుని, తాను, అనయమున్ = అత్యంతము, ఎక్కొంగనన్ - మఱచి = ఎక్కుట మఱచి, ఆతనిన్ = తన వాహనమైన ఆతనినే తన - భుజాగ్రమునన్ = తన భుజమునందు, ఇడికొని = ఉంచుకొని, పఱచెన్ = పాఱెను.

తాత్పర్యము : కుబేరుఁడు నరవాహనుఁడు. అతనిని దఱుముచు వెనుకఁ వీరభద్రగణములు బొబ్బరింపఁగా నతఁడు భయమునఁ దా నెక్కుమనుష్య నెక్కుట మఱచి యాతనినే తన భుజమున నెక్కించుకొని పఱచెను.

విశేషములు : 'కిన్నరేశో వైశ్రవణః పౌలస్త్యో నరవాహనః' - కుబేరుఁడు, అమరము.

తన యెక్కిన - 'ధాతుజ విశేషణ భావార్థక పూర్వవ్యవహితావ్యవహిత కర్తృపద ప్రథమకుఁ దఱచుగ యొక్కషష్ఠి యగు.' ప్రౌఢ. కారక. 15. తనయొక్క- యెక్కిన. 'యొక్కకు లోపంబు బహుళంబు' - ప్రౌఢ. కారక. 16. తన యెక్కిన.

వ. తదవసరంబునం బ్రజాపతి నికరంబు దక్షప్రజాపతిం బరిమొగంబుఁ దప్పించుకొని బ్రహ్మాండఖండంబున కరిగిన గణాధీశ్వరు లెల్ల కడలను శోధించి దక్షుం డున్న పట్టెప్పట్లను గానక కాందిశీకులై కనుకనిం జని సకలభువనాధీశ్వరులపైఁ బరిగొని. 76

అర్థము : తత్ + అవసరంబునన్ = ఆ సమయమునందు, ప్రజాపతి - నికరంబు = ప్రజాపతుల సమూహము, దక్షప్రజాపతిన్, పరిమొగంబున్ = సామ్ముఖ్యమును, తప్పించుకొని = తప్పునట్లు చేసి, బ్రహ్మాండ ఖండంబునకున్ = బ్రహ్మాండ భాగమునకు, అరిగినన్ = వెడలఁగా, గణ + అధి + ఈశ్వరులు = ప్రమథనాయకులు, ఎల్ల కడలను = ఎల్ల దిక్కులను, శోధించి = వెదకి, దక్షుండు, ఉన్న, పట్టు = చోటు, ఎప్పట్లను (ఏ + పట్లను) = ఎక్కడను, కానక, కాందిశీకులు + ఐ = ఏ దిక్కునకుఁ బోవుటకు తోఁచనివారయి, కనుకనిన్ = సంభ్రమముతో, చని, సకల-భువన + అధి + ఈశ్వరులపైన్ = ఎల్లలోకముల ప్రభువులపై, పరిగొని = కవిసి - పడి.

తాత్పర్యము : ఆ సమయమునఁ బ్రజాపతుల సమూహము దక్షప్రజాపతిని ఎదుట లేకుండఁజేసి బ్రహ్మాండభాగమున కరుగఁగాఁ, బ్రమథనాయకు లన్ని దిక్కు-

లను వెదకి దక్షుఁ డున్నచోటు నెక్కడను గానక యే దిక్కునకుఁ బోద మనువారయి సంభ్రమముతోఁ జని యెల్లలోకముల ప్రభువుపై దండెత్తి - తరువాతి పద్యముతో నన్వయము.

క. వల విచ్చినట్లు జగములఁ
గల విప్పును గలయ నొక్క కవిఁ జని కోలా
హలముగ సురాసురోరగ
కులముల నా గణము ముంచికొని వచ్చి వడిన్. 77

అర్థము : ఆ - గణము = ఆ ప్రమథగణము, వల - విచ్చిన + అట్లు = వల అంతటను బఱచినట్లు, జగములన్ = లోకములందు, కల = ఉన్న, విప్పును = వైశాల్యమును, కలయన్ = అంతటను, ఒక్క - కవిన్ = ఒక్కపెట్టున, చని, కోలాహలముగన్ = పెద్ద రొద యగునట్లు, సుర + అసుర + ఉరగ-కులములన్ = దేవతలయు, రాక్షసులయు, నాగులయు సమూహములను, ముంచికొని = ఆక్రమించు కొని, వచ్చి, వడిన్ = వేగముగా.

తాత్పర్యము : ఆ ప్రమథగణము వలను బఱచినట్లు లోకములం దంతటను ఒక్కపెట్టఁ జని పెద్దరొద యగునట్లు దేవతలయు, రాక్షసులయు, నాగములయు గుంపులను ఆక్రమించుకొని వచ్చి వేగముగా - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : అలంకార ముపమ. కవి = పెట్టు - ఈ శబ్దము ఒక్క-శబ్ద పూర్వకముగానే కనుపట్టుచున్నది. - సూ. ని.

చ. ముని మను జాసు రాహి సురముఖ్యుల వీఁపుల తోళు లెత్తఁగా
మును గుదిగట్టి మోపియును, ముందల కట్టులు గట్టి కొట్టియున్,
జనఁ బెడకేలు గట్టియును, జర్మపటంబులు డిగ్గ నొల్చియున్,
జెనసి మసంగి కారసము నేసిరి తత్ప్రమథాధినాయకుల్. 78

అర్థము : తద్ + ప్రమథ + అధినాయకుల్ = ఆ ప్రమథనాయకులు, ముని - మనుజ - అసుర + అహి - సుర-ముఖ్యుల = మునులు, మనుష్యులు, రాక్షసులు,

నాగులు, దేవతలు అనువారిలో శ్రేష్ఠులయొక్క, పీఁపుల-తోళులు=పీఁపుల చర్మములు, ఎత్తఁగాన్ = ఊడఁగా, మును గుది గట్టి మోపియును = ముందు గుదిబండఁగట్టి వహింపఁజేసియును, ముందలకట్టులు (ముందు + తలకట్టులు) = తలల ముందు భాగములు, కట్టి. కొట్టియున్, చనన్ = ఒప్పఁగా, పెడ - కేలు = పెడజెక్కలు, కట్టియును, చర్మ పటంబులు = వస్త్రముల వంటితోళ్లు, డిగ్గన్ + ఒల్చియున్ = ఊడునట్లు ఒలిచియును, చెనసి=తాఁకి, మసంగి = చెలరేఁగి, కారసము+చేసిరి= విరసము గావించిరి.

తాత్పర్యము : ఆ ప్రమథనాయకులు మునులను, మనుజులను, రాక్షసులను, నాగులను, దేవతలను పీఁపుల చర్మము లూడఁదీసియు, గుదిబండఁ గట్టి వహింపఁ జేసియు, తలల ముందు భాగములు కట్టి కొట్టియును, పెడచేతులు కట్టియును, చర్మము లొలిచియు విజృంభించి విరసము చేసిరి.

చ. ఖలుఁ డని వజ్రి చేయి విఱుగంగ వడిం బడ మోఁది రెత్తి దో
ర్బలమునఁ దాఁకి; యజ్ఞు తల పందల యెత్తిరి తద్గణాధిపుల్;
కలుషముతోడ ముట్టి భగు క న్నొకఁ డచ్చినవుచ్చి రుగ్రులై;
బలువిడిఁ జుట్టి పూషు మునిపండులు డుల్లఁగ వ్రేసి రీసునన్. 79

అర్థము; తద్ + గణ + అధిపుల్ = ఆ ప్రమథనాయకులు, ఎత్తి = దండెత్తి, దోస్ (ః) + బలమునన్ = భుజబలముతో, తాఁకి, ఖలుఁడు=దుష్టుఁడు, అని, వజ్రి = ఇంద్రునియొక్క, చేయి, విఱుగంగన్ = విఱుగునట్లు, వడిన్ = వేగముగా, బడన్ + మోఁదిరి = పడబాఁదిరి, యజ్ఞు = యజ్ఞపురుషునియొక్క, తల - పందల + ఎత్తిరి = తలపుత్తె ఊడఁగొట్టిరి, కలుషముతోడన్=కోపముతో, ముట్టి = తాఁకి, భగు = భగుఁ డను నాదిత్యునియొక్కకన్ను, ఒకఁడు=ఒకదానిని, ఉగ్రులు + ఐ = భయంకరు లయి, అచ్చిన + పుచ్చిరి = ఊడఁదీపి విసరివేసిరి ఈసునన్ = కోపముతో, బలువిడిన్=పరాక్రమముతో, చుట్టి=చుట్టుముట్టి, పూషు= పూషుఁ డను నాదిత్యునియొక్క, ముని పండులు = ముందటి పండ్లు, డుల్లఁగన్+ వ్రేసిరి=రాలఁగొట్టిరి.

తాత్పర్యము : ఆ ప్రమథనాయకులు దండెత్తి భుజబలముతోఁ దాఁకి దుర్మార్గుఁడని యింద్రుని చేయి విఱుగునట్లు వేగముగాఁ బడ బాఁదిరి. యజ్ఞపురుషుని

తలపుత్తె నూడఁగొట్టిరి. భయంకరులై కోపముతోఁ దాఁకి భగుని యొక కన్ను పెకలించిరి. కోపముతో బలము మెఱయఁ దాఁకి పూషుని పుందటిపండ్లు రాలఁగొట్టిరి.

విశేషములు : దోర్బలము - దోస్ + బలము. పదాంత సకారమునకు విసర్గాదేశము. దోః + బలము. 'అ ఆ లు తప్ప మిగిలిన అచ్చుల తరువాత వచ్చు విసర్గమునకు అచ్చులు కాని, మృదుహల్లులు కాని పరము లగునపుడు రేఫ మాదేశ మగును. దోర్బలము. పందల = పుత్తె. ఈశబ్దము నీ కవి యొకఁడే ప్రయోగించెను,. సూ. ని. అచ్చనపుచ్చు - ఇది నిఘంటువులందుఁ గానరాలేదు.

స్రగ్ధర

కోపోద్రేకంబునం జేకొన కజు హరితోఁ గూడ బంధించి, దేవా

శాపా లేంద్రాదులం దత్క్షణమ పరిభవాసక్తులం జేసి, దక్షుం,

బాపాచారున్, వధా ద్యాపదల కరుహుఁ, దద్బ్రహ్మబంధున్, దురాత్మున్

జూపుం డెచ్చోట[1] నంచున్ సురలను బ్రమథుల్ చుట్టి దండించి రల్కన్. 80

అర్థము : ప్రమథుల్, కోప + ఉద్రేకంబునన్ = కోపావేశముతో, చేకొనక = మన్నింపక, అజున్ = బ్రహ్మను, హరితోన్ = విష్ణువుతో, కూడన్ = కూడునట్లు, బంధించి = కట్టి, దేవ + ఆశాపాల + ఇంద్ర + ఆదులన్ = దేవతలు, దిక్పాలురు, ఇంద్రుఁడు మున్నగు వారిని, తద్ + క్షణము + అ = ఆ క్షణముననే, పరిభవ + ఆసక్తులన్ = అవమానమునఁ దగిలినవారిని, చేసి, పాప + ఆచారున్ = పాప కార్యములను జేసినవాఁడును, వధ + ఆది + ఆపదలకున్ = చంపుట మున్నగు నాపదలకు, అరుహున్ = తగినవాఁడును, తద్ + బ్రహ్మబంధున్ = ఆ నింద్యబ్రాహ్మణుఁడును, దురాత్మున్ = దుష్టుఁడును, అగు, దక్షున్ = దక్షుని, ఎచ్చోటన్ (ఏ + చోటన్) = ఎక్కడ, చూపుండు, (ఎచ్చోటిఁ దంచున్ అనుపాఠమునకు - ఎచ్చటివాఁ డనుచు), అంచున్ = అనుచు, సురలను = దేవతలను, చుట్టి = చుట్టుకొని, అల్కన్ = కోపముతో, దండించిరి = శిక్షించిరి.

తాత్పర్యము : ప్రమథులు కోపావేశముతో మన్నింపక బ్రహ్మను విష్ణువుతోఁ జేర్చి బంధించి దేవతలను, దిక్పాలురను, ఇంద్రాదులను వెంటనే అవమానపఱిచి పాప

1. టిఁదంచున్.

ధర్మ్యుఁడును, వధాదుల కర్హుఁడును, నింద్యబ్రాహ్మణుఁడును, దుష్టుఁడును అగు దక్షుని ఎచ్చట నున్నాఁడో చూపుఁ' డనుచుఁ గోపముతో దేవతలను జుట్టుముట్టి దండించిరి.

విశేషములు : స్రగ్ధరాలక్షణమునకు 1-1 పద్యవ్యాఖ్యఁ జూచునది. వధ+ఆది = వధాది, - సవర్ణదీర్ఘసంధి. వధాది + ఆపదలకున్ = వధాద్యాపదలకున్ - యణాదేశసంధి. 'అర్హున్' అనుటకు 'అరుహున్' అని ప్రయుక్తము. అల్కు-అలుగు ధాతువు. 'కవర్గకం బలుగ్వాదుల కగు.' బాల. కృ. 3. అలుగు + క. 'ఇటం గృత్కగ రవ వేఁకుల పరంబు లగునపుడు క గ చ య వ లకు లోపం బగు.' బాల. కృ. 2, అయిక. 'అచ్చికంబులం బదమధ్యంబుల నలడరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బాల. ప్ర. 17. అల్కు.

వ. తదవసరంబున 'శివద్రోహుండైన దక్షుం డను నీదురాత్మునకై
మహోగ్రాక్ష గణాగ్రణులచే విగ్రహంబు వడు టేమిపని?' యని
సురముని జనంబు లొండొరులం గడవ. 81

అర్థము : తద్ + అవసరంబునన్, శివ-ద్రోహుండు=శివునకు ద్రోహము చేసినవాఁడు, ఐన, దక్షుండు, అను, ఈ + దురాత్మునకై = ఈ దుర్మార్గునికొఱకు (మనము), మహోగ్రాక్ష - గణ + అగ్రణులచేన్=మహేశ్వరుఁడు (ఉగ్రములైన కన్నులుగలవాఁడు = ఈశ్వరుఁడు), ప్రమథముఖ్యులు అనువారితో, విగ్రహంబు + పడుట = విరోధపడుట, ఏమి - పని = ఏమి ప్రయోజనము, అని, సుర - ముని - జనంబులు = దేవతల, మునుల సమూహములు. ఒండొరులన్ = ఒకరి నొకరు, కడవన్ = అతిశయించునట్లు.

తాత్పర్యము : ఆ సమయమున శివునకు ద్రోహముచేసిన దక్షుఁ డను నీ దుష్టునకై మహేశ్వరునితోడను, ప్రమథముఖ్యులతోను విరోధించుటవలన నేమి ప్రయోజన మని దేవతలును, మునులును ఒకరినొక రతిశయించునట్లు - తరువాతి పద్యముతో నన్వయము.

క. కనుగీఁటి చూపువారును,
గనుమఱచెడి పట్టుఁ జూపఁ గడఁగెడు వారుం,
గని కడపి పుచ్చువారును,
గనుమఱుపడువారుఁ, బరులఁ గనుఁగొనువారున్. 82

అర్థము : కనుగీఁటి చూపువారును = కనుసన్నచేసి దక్షుఁ డున్నచోటు చూపువారును, కను మఱచెడి పట్టున్ = కనుమఱుఁగైన స్థానమును, చూపన్=చూపుటకు, కడఁగెడువారున్ = ప్రయత్నించువారును, కని = చూచి, కడపి పుచ్చువారును = ఉపేక్షించువారును, కనుమఱుపడువారున్=కనుచాటగువారును, పరులన్=ఇతరులను, కనుఁగొనువారున్ = చూచువారును,

తాత్పర్యము : కనుసన్నచేసి దక్షుఁ డున్నచోటు చూపువారును, అతఁడు డాఁగిన కనుమఱుఁగైన చోటిని జూప యత్నించువారును, కని ఉపేక్షించువారును, కనుచాటగువారును, ఇతరులను జూచువారును - తరువాతి పద్యముతో నన్వయము.

వ. త దవసరంబున నతిభయభ్రాంతుండై కన్నవారలక మ్రొక్కుచు స్రుక్కుచు లోఁగుచు డాఁగుచు గోమేధిక సదనంబులో బెదరి చూచు చున్న దక్షునిం గని గణముఖ్యు లెఱింగి పట్టుకొని. 83

అర్థము : తద్ + అవసరంబునన్ = ఆ సమయమున, అతి - భయ - భ్రాంతుండు+ఐ=మిక్కిలి భయముచే భ్రాంతినొందినవాఁడయి, కన్నవారలకున్ + అ = తన్నుఁజూచినవారలకే, మ్రొక్కుచున్ = నమస్కరించుచు, స్రుక్కుచున్ = భయపడుచు, లోఁగుచున్ = క్రుంగుచు, డాఁగుచున్ = దాఁగికొనుచు, గోమేధిక - సదనంబులోన్ = యజ్ఞశాలలో, బెదరి = భయపడి, చూచుచున్+ఉన్న, దక్షునిన్, కని, గణ - ముఖ్యులు = ప్రమథనాయకులు, ఎఱింగి = తెలిసి, పట్టుకొని.

తాత్పర్యము : ఆ సమయమున మిక్కిలి భయముచే భ్రాంతినొందినవాఁడయి తన్నుఁ జూచినవారలకే నమస్కరించుచు. భయపడుచు, క్రుంగుచు, దాఁగికొనుచు యజ్ఞశాలలో బెదరిచూచుచున్న దక్షునిఁ జూచి ప్రమథనాయకులు తెలిసి పట్టుకొని - తరువాతి పద్యముతో నన్వయము.

ఉ. వీండె ఖలుండు దక్షుఁ డను వీఱిఁడి పాఱుఁడు; వీఁడు సర్వ వ
ధ్యుం; డెడ సేయకుండు; శివదూషకు నాలుక గోసి యుప్పు నిం
పుండు; త్రపుద్రవం బొడలఁ బూయుఁడు; లోహము గాఁచి నోరఁ బో
యుండు; దురాత్ము చర్మపట మొల్వుఁడు; కన్నులు మీఁటుఁ
డుక్కఱన్. 84

అర్థము : వీండె = వీఁడే, ఖలుండు = దుర్మార్గుఁడు, దక్షుఁడు + అను, వీఱిఁడి - పాఱుఁడు = దక్షుఁ డను పేరుగల అవివేకియైన బ్రాహ్మణుఁడు, వీఁడు, సర్వ - వధ్యుండు = ఎల్లరకును వధింపఁదగినవాఁడు, ఎడ + చేయకుండు = ఆలస్యము చేయకుఁడు, శివ - దూషకు = శివుని నిందించువానియొక్క, నాలుక + కోసి, ఉప్పు, నింపుండు = కూరుఁడు, త్రపు-ద్రవంబు = సీసపు ద్రవమును, ఒడలన్ = మేనియందు, పూయుఁడు, లోహమున్ = ఇనుమును, కాఁచి, నోరన్ = నోటియందు, పోయుండు, దురాత్మ = దుర్మార్గునియొక్క, చర్మ - పటము = వస్త్రమువంటి తోలును, ఒల్వుఁడు, ఉక్కఱన్ (ఉక్కు + అఱన్) = బలము నశించునట్లు, కన్నులు, మీఁటుఁడు = పీఁకివేయుఁడు.

తాత్పర్యము : 'ఈతఁడే దుష్టుఁడు. దక్షుఁ డను నవివేకిబ్రాహ్మణుఁడు. వీఁ డెల్లరకును వధింపఁదగినవాఁడు. జాగుసేయకుఁడు, శివుని దూషించు వీని నాలుకను గోసి యుప్పు కూరుఁడు. సీసమును గరఁగించి యా ద్రవమును మేనఁ బూయుఁడు. ఇనుమును గాఁచి నోటియందుఁ బోయుఁడు. ఈ దుర్మార్గుని చర్మము నొలువుఁడు. వీని బలము నశించునట్లు కన్నులను బెఱికివేయుఁడు.'

విశేషములు : 'వీఁడె' అనుటకు 'వీండె' అను పూర్ణబిందు సహిత రూపమును బ్రయోగించుట నన్నెచోడుని ప్రాచీనతకు నిదర్శన మందురు. త్రపుః - 'త్రపుః పిచ్చటం రజ్జ వజ్గే' త్రపతే అగ్ని సన్నిధౌ ద్రవతీతి త్రపుః-అగ్నిసమీపమందు సిగ్గుపడునది. అనఁగాఁ గరఁగునది - తగరము, సీసము. అమరము.

ఒల్వుఁడు - ఒలుచు + లోట్. 'ఆశీ ర్యాప సంప్రార్థన విధులందు లోట్టగు' బాల. క్రియ. 6. 'లకారంబునకు డు ఙు వు రు ను మున్నగు.' బాల. క్రియ. 8

ఒలుచు + రు (మధ్యమపురుష బహువచనము). 'యుష్మన్మధ్యమ పురుషలకు ముజ్జు లగు.' బాల. క్రియ. 29. ఒలుచు + డుజ్ - 'మధ్యమ పురుషలు ముజ్జు నాఁబడు' బాల. క్రియ. 31. 'ముజ్జీత్తులు ముత్తు నాఁబడు.' బాల. క్రియ. 86. ఒలుచు+ముత్తు. 'ఆగమాన్యచకారంబుల కద్విరుక్తంబులకు ముత్తు పరం బగునపుడు ప వ లగు.' బాల. క్రియ. 88. ఒలువు + డుజ్. 'జిత్తు బిందుపూర్వం బగు.' బాల. తత్సమ. 19. ఒలువుఁడు. 'అచ్చికంబులం బదమధ్యంబుల న ల డ రల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు. బాల. ప్రకీర్ణ. 17. ఒల్వుఁడు.

వ. అని యనేక ప్రకారంబులం బలుకుచు నారకోచితదండంబుల దండించి
నిజాధీశ్వరుండైన గణాధీశ్వరున కొప్పించి తన్నియోగంబున. 85

అర్థము : అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కు విధముల, పలుకుచున్, నారక + ఉచిత - దండంబులన్ = నరకలోకమునకుఁ దగిన శిక్షలతో, దండించి= శిక్షించి, నిజ + అధి+ ఈశ్వరుండు + ఐన = తమ ప్రభువయిన, గణ + అధి+ ఈశ్వరునకున్ = గణపతికి, ఒప్పించి = అర్పించి, తద్ +నియోగంబునన్=ఆతని యాజ్ఞచే -

తాత్పర్యము : అని పెక్కురీతులఁ బలుకుచు నరకలోకమున కర్హమైన శిక్షలతో శిక్షించి, తమ ప్రభువైన గణపతి కర్పించి వాని యాజ్ఞచేత - తరువాతి పద్యముతో నన్వయము,

విశేషములు : తద్ + నియోగము = తన్నియోగము-అనునాసిక సంధి.

ఆ. ప్రమథగణము దక్షుఁ బడఁగొట్టి కట్టుచుఁ
గాలుఁజేయు బడియఁ గావడించి
మను మృగంబు గట్టికొని వచ్చు బలు వేఁట
కాఁడువోలె వచ్చి కనిరి శంభు. 86

అర్థము : ప్రమథ-గణము, దక్షున్, పడన్+కొట్టి, కాలున్, చేయున్=చేయియును, కట్టుచున్, బడియన్ = కట్టతో, కావడించి = కావడిలోఁ బెట్టి, మను-మృగంబున్=

జీవన్మృగమును - బ్రదికియున్న లేడిని, కట్టికొని వచ్చు, బలు-వేఁటకాఁడు + పోలెన్ = బలిష్ఠుఁడైన వేఁటకాండ్రవలె, వచ్చి, శంభున్ = శివుని, కనిరి = చూచిరి.

తాత్పర్యము: ప్రమథులు దక్షునిఁ బడఁగొట్టి, కాలుసేతులు కట్టి పెద్ద దుడ్డు కఱ్ఱతోడి కావడిలోఁ బెట్టి, బ్రదికియున్న లేడిని గట్టుకొని వచ్చు బలవంతులైన వేఁని కాండ్రవలె వచ్చి శివునిఁ జూచిరి.

విశేషములు: పసు - మృగంబు = ఒకజాతి జింక. దీనికంటె దక్షుట జీవగ్రాహముగాఁ బట్టుకొనిరి కావున 'పసు' అనుదానికి బ్రదికియున్న అనునర్థమే సముచితమని తోఁచినది.

వేఁట - 'కా కత్తియ వర్ణకంబులు పుంస్త్వస్త్రీత్వంబుల మతుబర్థంబునం దాటాదుల కగు.' బాల. తద్ధిత, 11. వేఁటకా. 'ఉవర్ణంబు బహువచనంబు.' బాల. తత్సమ. 12. 'కాఁ ప్రత్యయంబుమీఁది బహువచనలకారంబునకు లఘ్వలఘురేఫంబులును లఘురేఫంబునకు ముందు పూర్ణబిందుపూర్వక దకారంబు నగు. 'బాల. అచ్చిక. 7. వేఁట కాండ్రు - వేఁటకాఁడు - అలంకార ముపమ.

వ. తదవసరంబున. 87

అర్థతాత్పర్యములు: తద్ + అవసరంబునన్ = ఆ సమయమునందు. తరువాతి పద్యముతో నన్వయము.

సీ. ఉరుశోకరసవార్ధి యుప్పొంగె నన మేన
ఘర్మాశ్రు జలములు గడలుకొనఁగఁ,
గడిసన్న తమ్మిఁ బాఁ కడరెనో యన దీన
వదనంబుపై నెఱుల్ సెదరి తూల,
ముఖలక్ష్మి భీతిఁ దమోవీథిఁ జొచ్చె నా
జాలియ విరివేణి వ్రేలుచుండఁ,
గవ వాసి యలఁదురు కలహంసరుతము నా
నాక్రందనారావ మతిశయిల్లఁ

ఆ. దొడరఁ నడుగు లిడుచు దుఃఖాతిశయమునఁ
దల్లడిల్లుచున్న దక్ష ధర్మ
పత్ని వచ్చి పురుషభైక్షంబు వేఁడుచు
జాలి దవుల నభవు ౹మోలఁ బడియె. 88

అర్థము: ఉరు - శోక - రస - వార్ధి=గొప్ప దుఃఖరస మనెడి సముద్రము, ఉప్పొంగెన్ + అనన్=ఉప్పొంగెనా యనునట్లు, మేనన్=శరీరమునందు, ఘర్మ + అశ్రు - జలములు = చెమటనీరును, కన్నీరును, కదలుకొనఁగన్ = వ్యాపింపఁగను,

కడి + చన్న = సువాసనపోయిన, తమ్మిన్=తామరపువ్వునందు, పాఁకు= నాఁచు, అడరెనో + అనన్ = వ్యాపించెనో యనునట్లు. దీన - వదనంబుపైన్ = దుఃఖితమైన ముఖముమీఁద, నెఱుల్ = వెండ్రుకలు, చెదరి, తూలన్=చలింపఁగను

ముఖ - లక్ష్మి = ముఖమనెడు లక్ష్మి, భీతిన్=భయముతో, తమస్ (ః) + వీథిన్ = చీఁకటి వీథియందు, చొచ్చెన్+నాన్=ప్రవేశించెనా యనునట్లు, జాలియ=, యజ్ఞము సేయునపుడు సోమిదమ్మ తలపై నుంచుకొను వల, విరి - వేణిన్=విరిసిన- విప్పారిన జడయందు, వ్రేలుచున్ + ఉండన్ = వ్రేలాడుచుండఁగను,

కవ + పాసి = జతవిడిచి, అలఁదురు = దుఃఖించు, కలహంస=రాయంచ యొక్క, రుతము - నాన్ = ధ్వనియో యన, ఆక్రందన + ఆరావము = రోదన ధ్వని, అతిశయిల్లన్ = అధికము కాఁగను,

తొడరన్ = తొట్రుపడునట్లు, అడుగులు + ఇడుచున్=అడుగులు వేయుచు దుఃఖ + అతిశయమునన్=శోకాధిక్యముచే, తల్లడిల్లుచున్+ఉన్న=బాధపడుచున్న, దక్ష - ధర్మపత్ని = దక్షుని కులసతి, వచ్చి, పురుష - భైక్షంబున్=భర్తృభిక్షమును, వేఁడుచున్ = కోరుచు, జాలి+తవులన్=దుఃఖము కలుగఁగా, అభవు-మ్రోలన్ = శివుని యెదుట, పడియెన్.

తాత్పర్యము ; శోకరస మనెడి సముద్రము పొంగెనా యనునట్లు శరీరమునఁ జెమటనీరును, కన్నీరును వ్యాపింపఁగను, సువాసన యెడలిన తామరపై నాఁచు వ్యాపించెనో యనునట్లు దీనముఖముపై శిరోజములు చెదరి పడఁగను, ముఖమనెడి

లక్ష్మి భయపడి చీఁకటి వీథిలోఁ బ్రవేశించెనా యనునట్లు జాలియ విప్పారిన వ్రేణి యందు బ్రేలుచుండఁగను, జంటను బాసి దుఃఖించు రాయంచ కూఁతయా యనునట్లు రోదన ధ్వని యతిశయిల్లఁగను, తొట్రుపడ నడుగులిడుచు దుఃఖాతిశయమునఁ దల్లడిల్లుచున్న దక్షునిభార్య వచ్చి భర్తృభిక్షను గోరుచు శోకించుచు శివుని సమక్షమునఁ బడియెను.

విశేషములు: సీసపద్యమునందలి ప్రతిపాదమునను ఉత్ప్రేక్షాలంకారము గలదు. స్వభావోక్తి.

వ. ఇట్లనాథవృత్తి ననన్యశరణ్యయై శరణువేఁడు దక్షాంగనం గని కరుణాకరుండైన పరమేశ్వరుండు కారుణ్యదృష్టిం జూచిన కన్నెఱింగి, 89

అర్థము: ఇట్లు, అనాథ-వృత్తిన్= దిక్కులేని వర్తనముతో, అనన్య-శరణ్య+ ఐ- మఱియొకరు శరణుపొందఁదగినవారు లేనిదయి, శరణు-వేఁడు= రక్షణము కోరు, దక్ష+ అంగనన్= దక్షుని భార్యను. కని=చూచి, కరుణా+ ఆకరుండు= దయకు స్థానమైనవాఁడు, ఐన, పరమేశ్వరుండు, కారుణ్య-దృష్టిన్= దయతోడి చూపుతో, చూచిన-కన్ను+ ఎఱింగి= చూచిన జాడ తెలిపి,

తాత్పర్యము: ఇట్లు దిక్కులేనిదయి, శివునికంటె వేఱెవ్వరును శరణుపొందఁ దగినవారు లేనిదయి, రక్షణము కోరు దక్షుని భార్యను జూచి దయామయుఁడైన పరమేశ్వరుఁడు దయాదృష్టితోఁ జూడవలయునను నాతని యింగిత మెఱిఁగి - తరువాతి పద్యముతో నన్వయము,

చ. హరి కమలాసనాదు లభయం బభయంబు భయాతురార్తిసం
హర! కరుణాత్మ! విశ్వభువనాధిప! మా కని చక్కఁ జాఁగ ని
ర్జరపతి మ్రొక్కియున్నఁ గని శంకరుఁ డంతన తద్దయారసా
భరిత విశాలనేత్ర శతపత్రదళంబులఁ గప్పె నందఱన్. 90

అర్థము: హరి- కమలాసన+ ఆదులు= విష్ణువు, బ్రహ్మ మున్నగువారు, భయ+ఆతుర +ఆర్తి-సంహర=వెఱపుచేఁబీడింపఁబడువారి బాధను బోఁగొట్టువాఁడా! కరుణా+ఆత్మ=దయాహృదయా, విశ్వ-భువన+అధిప=ఎల్లలోకములకుఁ బ్రభువైన

వా(డా! ఈశ్వరా! మాకున్, అభయంబు + అభయంబు = శరణు శరణుఅని, చక్క_న్ + చా(గన్ = సాష్టాంగ నమస్కారము చేయ(గా, నిర్జర-పతి = దేవతల ప్రభువు-ఇంద్రు(డు, మ్రొక్కి + ఉన్నన్ = నమస్కరించియుండ(గా, కని = చూచి, శంకరు(డు = శివు(డు, అంతన్ + అ = వెంటనే, తద్ + దయా-రస + ఆభరిత-విశాల-నేత్ర-శతపత్ర-దళంబులన్ = ఆ కరుణారసముతో(బూర్ణములైన తామరరేకులవలె విశాలములైన కన్నులతో, అందఱన్ = ఎల్లరను, కప్పెన్-

తా త్ప ర్య ము : విష్ణువు, బ్రహ్మ మున్నగువారు 'భయార్తుల భయమును బో(గొట్టు వా(డా! దయాహృదయా! సర్వలోకప్రభూ! మాకు శరణు శరణు' అని సాష్టాంగ నమస్కారము చేయ(గా. ఇంద్రు(డు మ్రొక్కియుండ(గా(జూచి శంకరు(డు వెంటనే తన దయారసపూరిత దృగబ్జదళములతో నెల్లరను గప్పెను.

విశేషములు ; చక్క(జా(గి యను పాఠముకంటె, సా. ప్రతిలోని 'చక్క(జా(గ' అనుపాఠము అన్వయసౌగమ్యము గలిగియుండుటచే నది స్వీకృతము.

వ. ఇట్లు పరమేశ్వర దయావలోకనామృత రస ప్రవాహాపగత భయసంతాపహృదయులైన సురవరులం దఖిల సురజ్యేష్ఠుం డైన సురజ్యేష్ఠు(డు కరకమల ముకుళ విన్యస్త మస్తకుండై సమస్త వేదస్తుతులం బ్రస్తుతించి చతుర్ముఖుండు పంచముఖున కభిముఖుండై 91

అ ర్థ ము : ఇట్లు పరమేశ్వర ....హృదయులు ; పరమేశ్వర = పరమేశ్వరుని యొక్క, దయా = దయతో(గూడిన, అవలోకన = చూపులనెడి, అమృత-రస = అమృత రసముచేత, అపగత = పోయిన, భయ-సంతాప = భయము, పరితాపము అనువానితో(గూడిన, హృదయులు = హృదయములు గలవారు, ఐన, సుర-వరులన్ = దేవతాశ్రేష్ఠులను, అఖిల-సుర-జ్యేష్ఠుండు = ఎల్లదేవతలలో(బెద్దవా(డు, ఐన, సుర-జ్యేష్ఠుండు = బ్రహ్మ, కర ....మస్తకుండు + ఐ = కర-కమల-ముకుళ = తామరమొగ్గలవంటి చేతుల చేత, విన్యస్త = ఉంప(బడిన, మస్తకుండు + ఐ = శిరస్సు గలవా(డయి, సమస్త-వేద-స్తుతులన్ = ఎల్లవేదములయొక్క స్తోత్రములచేత, ప్రస్తుతించి = పొగడి, చతుర్ముఖుండు = బ్రహ్మ, పంచ-ముఖునకున్ = అయిదుమొగములు గలవా(డు అగు శివునకు, అభిముఖుండు + ఐ = ఎదు రయి,

తాత్పర్యము : ఇట్లు ఈశ్వరుని దయాదృష్టి లనెడి అమృత రసప్రవాహము చేత హృదయములందు భయసంతాపములు పోయినవారయిన దేవతాశ్రేష్ఠులను ఎల్ల సురలకుఁ బెద్దవాఁడైన బ్రహ్మ పద్మముకుళములవంటి హస్తములను శిరస్సుననుంచి సర్వవేదములందలి స్తోత్రములచేతను నుతించి అయిదుమొగముల వేల్పగు శివున కభిముఖుఁడయి-తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు ; సురజ్యేష్ఠుఁడను కర్త యొకఁ డుండఁగా మరలఁ చతుర్ముఖుఁ డను నింకొక కర్త యనావశ్యకము.

చ. తనరఁ గ్రియాతిదక్షుఁ డగు దక్షుఁడు తత్క్రతువల్లభుండు, స
న్మునితతి ఋత్విజుల్, సురసమూహి సదస్యులు, తత్ఫలంబు నిం
దనిశమునిచ్చు నీ వడఁచి తట్టె మఖం బిది కర్త భక్తిమైఁ
దనరని యజ్ఞమైనఁ దుదిఁ దా నభిచారము గాకపోవునే? 92

అర్థము: తనరన్ ఒప్పునట్లుగా, క్రియా+అతి- దక్షుఁడు=యజ్ఞాది విధు లందు మిక్కిలి సమర్థుఁడు, అగు దక్షుఁడు, తద్+క్రతు - వల్లభుండు=ఆ యజ్ఞము యొక్క యజమానుఁడు, సత్+ముని-తతి=యోగ్యులగు మునులయొక్క సమూహము, ఋత్విజుల్=యాజకులు, సుర-సమూహి=దేవతలసమూహము, సదస్యులు = యాగ సదస్సునందు సభ్యులు, తద్ + ఫలంబులు=ఆ యజ్ఞముయొక్క ఫలము= ఇందున్ = ఇక్కడ, అనిశమున్ = ఎల్లప్పుడును, ఇచ్చు, నీవు, మఖంబు + ఇది=ఈ యజ్ఞము, అడఁచితి (వి) + అట్టె = నశింపఁ జేసితి వఁట, కర్త లు యజమానునియొక్క, భక్తిమైన్=శ్రద్ధతో, తనరని=ఒప్పని, యజ్ఞము+ఐనన్ = యజ్ఞమయినచో, తుదిన్ = చివరకు, తాను, అభిచారము = అనర్థకరము కాకపోవునే = కాకుండునా?

తాత్పర్యము : యజ్ఞాదివిధులందు మిక్కిలి సమర్థుఁడగు దక్షుఁడు ఆ యజ్ఞమునకు యజమానుఁడు. యోగ్యులైన మునుల సమూహము యజ్ఞనిర్వాహకులగు ఋత్విక్కులు, దేవతల సమూహము యజ్ఞసదస్యులు. ఆ యజ్ఞఫలముల నెల్లప్పుడు

నొసఁగు నీవు ఆ యజ్ఞమును నశింపఁజేసితివఁట! యజమానునకుఁ గ్రతుఫలదాత వైన నీయందు భక్తిశ్రద్ధలు లేనిచో, నా యజ్ఞము చివరకు అనర్థహేతుకము కాకుండునా? తప్పక అగు నని భావము,

విశేషములు : ఈ పద్యము పుష్పదంతకృత మగు శివమహిమ్నః స్తోత్రము నందలి యీ దిగువ శ్లోకమున కించుమించుగా నాంధ్రీకరణ మగుట చూడనగును.

క్రియాదక్షో దక్షః క్రతుపతి రధీశ స్తనుభృతా
మృషీణా మార్త్విజ్యం శరణద సదస్యాః సురగణాః,
క్రతుభ్రేష స్త్వత్తః క్రతుఫల విధాన వ్యసనినో
ధ్రువం కర్తుః శ్రద్ధావిధుర మభిచారాయ హి మఖాః.

మూల శ్లోకమునందలి పదములే పద్యమునందుఁబ్రయుక్తము లగుట చూడ నగును. క్రియాదక్షః - క్రియాతిదక్షుఁడు, సదస్యాః సురగణాః - సుర సమూహి సదస్యులు, కర్తుః - కర్త (యొక్క), అభిచారాయ-అభిచారము,

సన్ముని = సత్ + ముని - అనునాసికసంధి, సమూహి = సమూహ మను టకు సమూహి యని శైవకవుల కృతులయందే ప్రయుక్తము. 'ద్వి, పస గొని, సకల భక్త సమూహి చూడ' - బస. పురా, 205 పు, 26 పం- అడఁచి తట్టె - అడఁచి తివి+ అట్టె - 'లిడ్డాటుల వకారంబునకు లోపంబు విభాష నగు' బాల, క్రియ. 16. అడఁచితి+ఇ+అట్టె. అపదాదిస్వరసంధి, బాల, సంధి,॥, అడఁచితి+అట్టె, 'మధ్యమ పురుషక్రియలయం దిత్తునకు సంధి యగును,' బాల. సంధి. 7. అడఁచితట్టె, భక్తి మైన్-'జడపదంబులమీఁది జోడకు మెయి మైలు వికల్పంబుగ నగు.' ప్రౌఢ. శబ్ద. 18.

వ. అదియునుంగాక సకల భువన స్వామి యైన నిన్నుం గులస్వామి యని తలంపక సంబంధ బంధు కృత్యంబున నితరజన సామాన్యుం డని యెల్లిదించి. 93

అర్థము : అదియునున్ + కాక, సకల - భువన - స్వామి = ఎల్ల లోక ములయొక్క ప్రభువు, ఐన, నిన్నున్, కుల - స్వామి = కుల దైవము, అని,

తలంపక, సంబంధ - బంధు - కృత్యంబునన్ = వివాహ సంబంధముచే_అల్లుఁ డను చుట్టఱికమ్ముఁ(జనిచేత, ఇతర - జన - సామాన్యుండు = ఇతరులైన జనులవలెనే సాధారణమైనవాఁడు, అని, ఎల్లిదించి = ఎల్లిదము (అవమానము) చేసి,

తాత్పర్యము : అదియును గాక ఎల్లలోకములకుఁ బ్రభువవైన నిన్నుఁ గుల దైవమని యెంచక అల్లుఁడనెడి చుట్టఱికమువలన నితరజనులతో సమానుఁడ వని యవమానించి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : అదియునుంగాక - 'కొన్నియెడల ద్రుతంబుమీఁద నకారంబు గానంబడియెడి,' బాల. సంధి. 21. ఎల్లిదించి - ఎల్లిదము అను నామమునకు ధాతుత్వ వివక్షయం దించుగాగమ మయినది, 'సంస్కృతంబున కంగలాదుల కించుక్కగు,' బాల. క్రియా. 63. ఎల్లిద + ఇంచు, అపదాది స్వరసంధి బాల. సంధి. ౧౧, ఎల్లిదించు.

క. బంధుఁ డని నిన్నుఁ దలఁచి స
బంధుం డయి పడుట తనకుఁ బాడియె మఱి ని
ర్బంధుఁ డగు నిన్నుఁ గనియు స
బంధుండై దక్షుఁ డునికి పాడియె దేవా ! 94

అర్థము: దేవా! = ప్రభూ ! . బంధుఁడు + అని = చుట్ట మని - అల్లుఁడ వని, నిన్నున్, తలఁచి = భావించి, సబంధుండు + అయి = చుట్టములతోఁ గూడిన వాఁడయి, పడుట = పతనము చెందుట, తనకున్, పాడియె = ధర్మమే, నిన్నున్, బంధుఁడు=సంసారబంధనములతోఁ గూడిన వాఁడు, అని, తలఁచి. సబంధుండు+ అయి=బంధములతోఁ గూడినవాఁడయి, పడుట, తనకున్ = దక్షునకు, పాడియె, మఱి=కాని, నిర్బంధుఁడు=బంధరహితుఁడు అగు, నిన్నున్, కనియున్=చూచియును, సబంధుండు+ఐ = బంధసహితుఁడయి. దక్షుఁడు, ఉనికి = ఉండుట, పాడియె = ధర్మమా?

తాత్పర్యము ; దేవా! నీలోకేశ్వరత్వము మఱచి నిన్ను అల్లునిగనే భావించి తాను బంధుసహితుఁడై పతితుఁ డగుట ధర్మమేయగును. నీవు సంసారబంధము గల్లవాఁడవని యెంచి తాను బంధసహితుఁడై పతనముఁ జెందుట దక్షునకు ధర్మమే యగును. కాని

బంధరహితుఁడ వయిన నిన్నుఁ జూచియుఁ దాను బంధయుక్తుఁ డయి యుండుట దక్షునకు ధర్మమా?- ధర్మము కాదనుట

విశేషములు; సబంధుఁడు- బంధు సహితుఁడు, బంధసహితుఁడు నను నర్థద్వయముచే శ్లేషాలంకారము. మీఁదివచనమునందలి 'చతురాననుచతురోక్తు లనుటకు-ఆతని ఉక్తిచాతుర్య మిదియే.

వ, అనిన చతురానను చతురోక్తులకుం బరమేశ్వరుండు ప్రహృష్ట మనస్కుండై దక్షు నీక్షించి దాక్షాయణిపైఁ బ్రణయభావాకలిత హృదయుండై యున్న గంగాధరు నింగితం బెఱింగి పద్మయోని వెండియు ని ట్లనియె. 95

అర్థము; అనిన=అనినట్టి, చతుర్ (ః)+ఆనను=చతుర్ముఖుని యొక్క, చతుర+ఉక్తులకున్=నేర్పుతోడి మాటలకు, పరమేశ్వరుండు, ప్రహృష్ట-మనస్కుండు+ఐ=మిక్కిలి సంతోషించిన మనస్సుగలవాఁడయి, దక్షున్, ఈక్షించి=చూచి. దాక్షాయణిపైన్= సతీదేవిపై, ప్రణయ-భావ+ఆకలిత-హృదయుండు + ఐ=ప్రేమభావముతోఁ గూడిన హృదయము గలవాఁడయి, ఉన్నన్=ఉండఁగా, గంగాధరు+ ఇంగితంబు=శివుని యభిప్రాయము, ఎఱింగి, పద్మయోని=పద్మము జన్మస్థానముగాఁ గలవాఁడు-తమ్మిచూలి-బ్రహ్మ, వెండియున్=మరల, ఇట్లు, అనియెన్.

తాత్పర్యము; అని పలికిన చతుర్ముఖుని ఉక్తిచాతుర్యమునకుఁ బరమేశ్వరుఁడు సంతోషించి దక్షునిఁజూచి, సతీదేవియెడఁ బ్రేమభావముతో నుండఁగా. శివు నభిప్రాయమును సతిమృతికి దక్షుఁడే కారణ మనుదానిని తెలిసి బ్రహ్మ మరల శివునితో నిట్లు పలికెను.

క, 'ఆ నెపమున ద్రోహమునకు
వానిన కా దరసి యతని వంశం బెల్లన్
గానువునఁ బెట్టి యార్చిన
నేనియుఁ జాలః దిది పెద్దయే దక్షునకున్?' 96

అర్థము ; ఆ నెపమున-ద్రోహమునకున్ = ఆ విధమైన ద్రోహమునకు, వానిన్+అ-కాదు=ఆ దక్షునే కాదు, అరసి=చూచి, అతని, వంశంబు+ఎల్లన్= ఆతనివంశము నంతను, గానువునన్— గానుఁగులో, పెట్టి, ఆర్చినన్+ ఏనియున్= ఆడించినప్పటికిని, చాలదు=సరిపోదు, ఇది= ఈ శిక్ష, దక్షునకున్, పెద్ద+ ఏ= ఎక్కువా?

తాత్పర్యము ; 'ఆ విధమైన ద్రోహమునకు ఆ దక్షు నొక్కనినే కాదు -వెదకి యతని కులమునంతను గానుఁగులోఁబెట్టి యాడించినను జాలదు. దక్షున కీ శిక్ష యెక్కువయా!' కాదనుట.

విశేషములు : గానువు-గానుఁగు, గాను, గానుఁగ (రూపాం,) ఆర్చినన్- ఆడు ధాతువు, 'మగాగమం బాచ్ఛికంబున కనంయుక్తన ల డ రాంతంబునకుం బ్రేరణంబున బహుళంబుగా నగు' ఆడు+ చు. బాల.క్రియ. 73. 'ఆ దోడు కూడుల డకారంబునకుం జుక్క పరం బగునపుడు రేఫంబగు.' బాల, క్రియ, 80, ఆరుచు. 'ఆచ్ఛికంబులం బద మధ్యంబుల న ల డ ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు,' బాల. ప్రకీర్ణ. 17, ఆర్చు. 'చేదర్థంబునందు వృత్తంబగు భావలక్షణంబునందు నవర్ణకంబు ద్రుతాంతం బగు,' ఆర్చు + నన్. బాల. క్రియ. 41, 'భూతంబునం ఙగాగమం బగు' ఆర్చు + ఇనన్ బాల. క్రియ. 17, అపదాదిస్వరసంధి. బాల, సంధి. 11. ఆర్చినన్.

ఆ. ఎంత ద్రోహుఁ డయ్యు నితఁడు వధార్హుఁడే?
యభవ! నీపు[1] దీని నవధరింపు;
మవని "బ్రాహ్మణో న హన్తవ్య" యను పలు
కీపు నిలుపకున్న నేల నిల్చు[2]? 97

అర్థము : అభవ= ఈశ్వరా! ఎంత ద్రోహుఁడు + అయ్యున్= ఎంతటి ద్రోహి యయినను, ఇతఁడు=ఈ దక్షుఁడు, వధ+అర్హుఁడే = వధింపఁదగినవాఁడా?

1. పా. ప్రతి, నీని నీవ, 2. వా, ప్రతి. తప్పు,

నీవు, దీనిన్ = ఈ విషయమును, అవధరింపుము = చిత్తగింపుము, అవనిన్ = భూమియందు, బ్రాహ్మణః + న- హన్తవ్యః = బ్రాహ్మణుఁడు చంపఁదగినవాఁడు కాఁడు, అను, పలుకు, ఈవు, నిలుపక + ఉన్నన్ = నిలుపకపోయినచో, ఏల_నిల్చున్=ఎందులకు నిలుచును? నిలువ దనుట.

తాత్పర్యము: 'ఈశ్వరా! ఎంతటి ద్రోహి యైనను, ఈ దక్షుఁడు వధింపఁదగిన వాఁడా? ఈ విషయమును నీవు బాగుగా నాలోచింపుము, భూమియందు బ్రాహ్మణుఁ డెట్టి పాపకర్ముఁ డైనను జంపఁదగినవాఁడు కాఁడను మాట యున్నది కదా; దానిని నీవే నిలుపకున్నచో నది యేల నిలుచును?' నిలువదని భావము.

విశేషములు : ద్రోహి యనుటకు ద్రోహుఁ డని ప్రయోగింపఁబడినది, పాపి-పాపుఁడు వలె. బ్రాహ్మణో న హన్తవ్యః + అను - 'విసర్గంబున కనుకరణంబున లోపం బగు.' బాల. సంధి. 50. బ్రాహ్మణో న హన్తవ్య + అను, 'సంధిలేనిచోట స్వరంబుకంటెం బరం బయిన స్వరంబునకు యడాగమం బగు.' బాల. సంధి. 3. బ్రాహ్మణో న హన్తవ్య యను.

వ. అని పరమేశ్వరు ననుమతంబునం బ్రజాపతి బంధమోక్షంబు సేసి యమృతాత్మకు శ్రీపాదంబులపైఁ బెట్టినఁ దదీయ స్పర్శంబున దక్షుండు తత్క్షణంబ సచేతనుండై భక్త్యావేశంబునం బ్రణుతింప నభిముఖుండై. 98

అర్థము : అని, పరమేశ్వరు + అనుమతంబునన్ = పరమేశ్వరునియొక్క-అనుమతిచే, ప్రజాపతి - బంధ - మోక్షంబు + చేసి = దక్ష ప్రజాపతి యొక్క-బంధములను విప్పి, అమృత + ఆత్మకు = అమృతస్వరూపుఁడైన ఈశ్వరుని యొక్క-, శ్రీపాదంబులపైన్ = దివ్యములైన పాదములమీఁద, పెట్టినన్ =

పెట్టఁగా, తదీయ - స్పర్శంబునన్ = ఆతనిదైన తాఁకుచేత, దక్షుండు, తద్ + క్షణంబు + అ = ఆ క్షణమే, సచేతనుండు + ఐ = సజీవుఁడయి, భక్తి + ఆవేశంబునన్ = భక్తియొక్క ఉద్రేకముచేత, ప్రణుతింపన్ = ప్రస్తుతించుటకు, అభిముఖుండు + ఐ = ఎదురయినవాఁడయి,

తాత్పర్యము : అని బ్రహ్మ పరమేశ్వరుని అనుమతి చొప్పున దక్షుని బంధవిముక్తుని జేసి యమృతస్వరూపుఁడైన యీశ్వరుని దివ్యపాదములపైఁ బెట్టఁగా నాతని స్పర్శముచే దక్షుఁడు ఆ క్షణమే ఒడలు తెలిసి భక్త్యుద్రేకముతో శివుని బ్రస్తుతించుట కభిముఖుఁడై - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: పరమేశ్వరు + అనుమతంబునన్ - 'షష్ఠీసమాసంబునం దుకారఋకారంబుల కచ్చు పరంబగునపుడు నుగాగమంబగు.' బాల, సంధి, 34. పరమేశ్వరు నసుమతంబునన్. తద్ = క్షణము - అనునాసికాంతస్థభిన్నములైన హల్లులకు (ఝల్లులకు) కఠినహల్లులు (ఖర్రులు) పరమగునపుడు వానివర్గము లందలి ప్రథమవర్ణములు (పర్రులు) ఆదేశములగును, తత్ క్షణము, భక్తి + ఆదేశము - ఇ ఉ ఋ ౡ లకు అసవర్ణములైన అచ్చులు పరములగునపుడు క్రమముగా య్, వ్, ర్, ల్ (యణ్ణులు) ఆదేశము లగును - యణాదేశసంధి.

లయగ్రాహి

'ఫాలతల విస్ఫురిత లోలతర భాసుర వి
శాల భయ దాసుర కరాళ నయనాగ్ని
జ్వాల లొకొ? పింగళ జటాళి యొకొ? నా బెరసి
తూలి, దివి భూషణ చయాలుళితదీర్ఘ
వ్యాళ నికరం బొకొ? కరాళియొకొ? నాఁ దనర
క్రాల, వర నృత్య పరిలోలుఁ డగు శ్రీకం
ఠాలధరు, నుజ్జ్వలకపాలధరు, సన్నిశిత
శూలధరు, నీశ్వరు, దయాళు నుతియింతున్.' 99

అర్థము: ఫాలతల....జ్వాలలొకొ : ఫాల - తల = నొసటి యందు, విస్ఫురిత = తోఁచుచున్నవియు, లోలతర = మిక్కిలి చలించునట్టియు, భాసుర = ప్రకాశించుచున్నట్టియు , విశాల = విరివియైనట్టియు, భయద = భయము గలిగించునట్టి, అసుర - కరాళ = రాక్షసులకు భయంకరము లయినట్టియు, నయన + అగ్ని - జ్వాలలు + ఒకొ = కంటి మంటలా? పింగళ - జటా + ఆళి + ఒకొ = పింగళ వర్ణము (గోరోచనపువర్ణము) గల, జడలయొక్క వరుసయా? నాన్ = అనునట్లు, పెరసి = వ్యాపించి, తూలి = చలించి, దివిన్ = ఆకాశమునందు, భూషణ - చయ = అలంకారములమొత్తమయి, ఆలుళిత = కదలిన, దీర్ఘ = పొడవైన, వ్యాళ - నికరంబు + ఒకొ = పాముల సమూహమా? కర + ఆళి + ఒకొ = చేతుల మొత్తమా? నాన్ అనునట్లు, తనరి = ఒప్పి, క్రాలన్ = ప్రకాశింపఁగా, వర - నృత్య = మేలైన నాట్యమునందు, పరిలోలుఁడు = మిక్కిలి యాసక్తి గలవాఁడు, అగు, శ్రీ - కంకాల - ధరున్ = శ్రీకరమైన అస్థిపంజరమును దాల్చినవాఁడును, ఉజ్జ్వల - కపాల - ధరున్ = ప్రకాశించు పుఱ్ఱెలను ధరించినవాఁడును, సన్నిశిత = మిక్కిలి వాఁడియైన, శూల - ధరున్, శూలాయుధమును దాల్చినవాఁడును, దయాళున్ = దయాస్వభావుఁడును, (అగు) ఈశ్వరున్, నుతియింతున్ = స్తుతింతును.

తాత్పర్యము: 'నొసటఁ దోఁచునట్టియుఁ, జలించునట్టియుఁ, బ్రకాశించునట్టియు, విరివియైనట్టియు, ఘోర రాక్షస భయంకరము లయినట్టియు కంటి మంటలా? పింగళవర్ణముగల జడల సమూహమా యన వ్యాపించి చలించి, ఆకాశమున నలంకారములై కదలు పొడవైన పాముల మొత్తమా? చేతుల మొత్తమా? యననొప్పి ప్రకాశింపఁగా, మేలయిన నాట్యమునందు మిక్కిలి యాసక్తి గల శ్రీకంకాలధరుఁడును, కపాలధరుఁడును, శూలధరుఁడును దయాస్వభావుఁడును అగు నీశ్వరుని స్తుతింతును.

విశేషములు : అలంకారము సందేహము, లయగ్రాహి - నాలుగు పాదము లుండును. ఒక్కొక్కపాదమున ముప్పదితొమ్మిది మాత్రలుండును. ముప్పది యక్షరము లుండును. భ, జ, స, న ,భ, జ, స, న, భ, య గణము లుండును. 1 - 9 - 17 - 25 స్థానములఁ బ్రాసయతి చెల్లవలయును. ప్రాసనియమము గలదు.

లయగ్రాహి

'ఉర్వర చలింపఁ, గులపర్వతచయం బదరఁ,
బర్వ భువి నంబునిధు, లౌర్వశిఖి యాడన్,
బార్వపుర నాగ సుర పూర్వదిగధీశ యమ
వార్విభు ధనేశ్వరుల గర్వము లడంగన్,
సర్వగణముఖ్యులును, సర్వగణ భూతములు
నార్వ, నహిభూషణము లార్వ, దిశలం గం
ధర్వతతి పాడఁగ, నపూర్వనటనాదిగురు,
సర్వగతు, సర్వమయు, శర్వు నుతియింతున్.' 100

అర్థము: ఉర్వర = భూమి, చలింపన్ = వణఁకఁగా, కుల - పర్వత -చయంబు = కులపర్వతముల సమూహము, అదరన్ = అదరఁగా, అంబునిధులు = సముద్రములు, భువిన్=భూమియందు, పర్వన్ = వ్యాపింపఁగా, ఔర్వ - శిఖి= బడబాగ్నిఁ ఆడన్=ఆడఁగా, పూర్వ సుర - నాగ-సుర-పూర్వ - దిశ్ + అధి + ఈశ - యమ- వార్విభు, ధన + ఈశ్వరుల = రాక్షసులయు, నాగులయు, దేవతలయు, ప్రాగ్దిశాధిపతియైనయింద్రునియొక్కయు. యమునియొక్కయు, జలప్రభువైన వరుణునియొక్కయు, ధనపతియైన కుబేరునియొక్కయు, గర్వములు, అడంగన్ = నశింపఁగా, సర్వగణ - ముఖ్యులును = ఎల్ల గణనాయకులును, సర్వ - గణ - భూతములున్ = ఎల్ల గణములందలి పిశాచములును, ఆర్వన్ = అఱవఁగా, అహి - భూషణములు = సర్పాలంకారములు, ఊర్వన్ = ఊర్పులు పుచ్చఁగా, దిశలన్= దిక్కులందు, గంధర్వ - తతి = గంధర్వుల సమూహము, పాడఁగన్, అపూర- నటన +ఆది - గురున్ = అపూర్వమైన నటనమునకు మొదటి గురువైనవాఁడును, సర్వ - గతున్ = అన్నిటిని బొందినవాఁడును, సర్వ - మయున్ = అన్నిట నిండినవాఁడును, అగు, శర్వున్ = ఈశ్వరుని, నుతియింతున్,

తాత్పర్యము : 'భూమి చలింపఁగను, గులపర్వతము లేడును అదరఁగను, సముద్రము లేడును భూమిపై వ్యాపింపఁగను, బడబాగ్ని యాడఁగను, రాక్షసుల, నాగుల, దేవతల, ఇంద్రుని, యముని, వరుణుని, కుబేరుని గర్వము లడఁగఁగను, ఎల్ల

గణాధీశ్వరులును, ఎల్ల భూతగణములును ఆర్వఁగను. సర్వాభరణములు ఊర్పులు పుచ్చఁగను, దిశల గంధర్వుల సమూహము పాడఁగను అపూర్వ నటనముచేఁతకు మొదటి గురువైనవాఁడును, సర్వమును బొందినవాఁడును, అన్నిట నిండినవాఁడును. అగు నీశ్వరుని స్తుతింతును.'

విశేషములు : ఊర్వన్ - ఊర్చు + నుజీ. 'తుమర్థ భావలక్షణంబులందు నుజీ యగు' బాల. క్రియ. 40, 'ముజీతులు ముత్తు నాఁబడు' బాల. క్రియ. 86. 'ఆగమాన్యచకారంబుల కద్విరుక్తంబులకు ముత్తు పరం బగునపుడు ప వ లగు.' ఊర్వన్, బాల, క్రియ. 88.

లయగ్రాహి

'తాళరుతి గీతిరుతి మేలి తత వాద్యరుతి
 చాల రసవంత మయి యోలి నులియం, ద
త్తాలగతి మెట్టుచును గేలఁ జరు లిచ్చుచును
 జాలి యనురాగమునఁ గ్రాలుచు సుఖాబ్ధిం
దేలుచును మే మఱచి వ్రాలుచును గెత్తుచును
 లోలగతి నేత్ర భుజ చాలనతోఁ బ్రే
తాలయమునందు సుఖలీల నెఱసంజ నను
 కూలగతి నాడు శివు శూలి నుతియింతున్.' 101

అర్థము: తాళ-రుతి=తాళధ్వని, గీతి-రుతి=గీతధ్వని, మేలి - తత - వాద్య - రుతి=మేలయిన వీణాదివాద్యధ్వని, చాలన్=మిక్కిలి, రసవంతము+అయి, ఓలిన్= క్రమముగా, ఉలియన్= ధ్వనింపఁగా, తద్ + తాల - గతిన్ = ఆ తాళముల కనుగుణమగు విధమున, మెట్టుచును = అడుగులువేయుచు, కేలన్ = చేతులతో, చరులు + ఇచ్చుచును = చఱపులు చఱచుచు, చాలి = తగియుండి, అనురాగమునన్ = ప్రేమముతో, క్రాలుచును = ఒప్పుచును, సుఖ - అబ్ధిన్ = సుఖమనెడి సముద్రమునందు, తేలుచును, మే - మఱచి ఒడలు తెలియక, వ్రాలుచును = తూలుచును, గెత్తుచును = గంతులువేయుచు, లోల - గతిన్ = చలించు విధమున, నేత్ర - భుజ - చాలనలతోన్ = కన్నులయు, భుజములయు, కదలించు

టలతో, ప్రేత + ఆలయమునందున్ = శ్మశానభూమియందు, సుఖ - లీలన్ = సుఖముగా, సెజ - సంజన్ = నిండైన సంధ్యాసమయమునందు, అనుకూల - గతిన్ = తగిన విధముగా, ఆడు = నృత్యముచేయునట్టి, శూలిన్ = శూలము ఆయుధముగాఁగలవాఁడు (అగు), శివున్ = శివుని, సుతియింతున్ = పొగడుదును.

తాత్పర్యము : 'తాళధ్వని, గీతిధ్వని, మేలయిన వీణాదివాద్యధ్వని మిక్కిలి సంతమై నినదింపఁగా, నా తాళమునకు ననుగుణముగా నడుగులు వేయుచుఁ, జేతులతోఁ జఱపులు చఱచుచు, ప్రేమతో నొప్పుచు, సౌఖ్యాంబుధిలోఁ దేలుచు, పై పుఱచి సోలుచు, గంతులువేయుచు, కన్నుల భుజముల కదలించుటలతో శ్మశాన భూమియందు సుఖముగా సంధ్యావేళ ననుకూలమైన రీతితో నృత్యముచేయు శూలాయుధుని శివుని నుతింతును.

విశేషములు; సుఖాబ్ధి - సుఖ మనెడి అబ్ధి - రూపకము అలంకారము. స్వభావోక్తి, చఱలు, గెత్తు శబ్దములు నిఘంటువులలోఁ గానరావేమ,

లయహారిణి

'కఱ గళము ఘనఘనము తెఱఁగనఁగ, నుఱికలును
గఱడియలు ద్రిపుదలును గిఱిడియలుఁ బెల్లై
యుఱుము లన వడిఁ జెలఁగఁ, గొఱ నెలయుఁ దనురుచులు
మెఱుఁగు లన దశదిశల మెఱవఁ, దలమీఁదన్
వఱలు సురనది దొలఁకి నెఱిఁ జినుకులను గురియఁ
దఱిమికొని తొలుమొగులు తఱి యనఁగ, నృత్యం
బొఱ వమరు లలితగతి మెఱయు శివుఁ డజుఁ డమరుఁ
దుఱుఫలము లొసఁగు నని యెఱిఁగి నుతియింతున్.' 102

అర్థము : కఱ - గళము - నల్లని కంఠము, ఘన - ఘనము - తెఱఁగు = దట్టమగు మేఘముయొక్క విధము, అనఁగన్, ఉఱికలును, - కఱడియలున్ - త్రిపుదలను-కిఱిడియలున్ = ఆ పేళ్లుగల వాద్యములును, పెల్లు + ఐ = అధికమయి, ఉఱుములు + అనన్, వడిన్ = వేగముగా, చెలఁగన్ = ధ్వనింపఁగా, కొఱ-

నెలయున్ = చంద్రకళయును, తను - రుచులున్ = శరీరకాంతులును, మెఱుఁగులు + అనన్, దశ - దిశలన్ = పది దిక్కులందును, మెఱవన్ = ప్రకాశింపఁగా, తల - మీఁదన్, వఱలు = ఒప్పునట్టి, సుర - నది = దేవనది - ఆకాశగంగ, తొలఁకి = చింది, నెఱిన్ = అందముగా, చినుకులను, కురియన్, తఱిమికొని = వేగముగా, తొలు - మొగులు - తఱి + అవఁగన్ = తొలకరి సమయము అనునట్లు, నృత్యంబు, ఒఱపు + అమరు = అందమై యుండు, లలిత - గతిన్ = మనోహరమైనవిధమున, మెఱయు = ప్రకాశించు, అజుఁడు = పుట్టుకలేనివాఁడు, అమరుఁడు = మృత్యువులేనివాఁడు, అగు, శివుఁడు, ఉఱు - ఫలములు = తగినఫలములు, ఒసఁగున్ + అని = ఇచ్చునని, ఎఱిఁగి, నుతియింతున్.

తాత్పర్యము : 'నల్లని కంఠము దట్టమైనమేఘమనఁగను, ఉఱికలు, కఱడియలు త్రిపుదలు, కిఱిడియలు అను వాద్యవిశేషము లధికమై ఉఱుము లనునట్లు ధ్వనింపఁగను, చంద్రకళయు, శరీరకాంతులు మెఱుఁగులనఁ బదిదిక్కులందును బ్రకాశింపఁగను, తలమీఁదనున్న ఆకాశగంగ తొనఁకి చినుకులను గురియఁగను, తొలకరి సమయమో యన నృత్య మమరు శివుఁడు, అజుఁడు అమరుఁడు నైనవాఁడు సముచితములైన ఫలము లొసఁగునని తెలిసి వానిని నుతింతును.'

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష, ఇందు శివుఁడు తొలకరిమేఘమువలె నుత్ప్రేక్షింపఁబడినాఁడు. అతని కంఠనైల్యము మేఘనైల్యముగను, వివిధవాద్యధ్వనులు మేఘ నినదముగను, చంద్రకళయు శరీరకాంతులును మెఱపులుగను, శిరస్సుమీఁది గంగానది చిలుకు చినుకులు మేఘము కురియు వానచినుకులుగను, నృత్యసమయము తొలకరి సమయముగను, శివుఁడు మేఘముగను నుత్ప్రేక్షింపఁబడెను, పద్యము చాలవఱ కచ్చతెనుఁగు మాటలతోనిండియుండుట గమనింపఁదగినది.

లయహారి (ణి) లక్షణము, నాలుగుపాదము లుండును, ప్రతిపాదమునను ముప్పదితొమ్మిదిమాత్రలుగల ముప్పదియేడు వర్ణము లుండవలయును. ప్రతిపాదమునను పదునొకండు నగణములు, ఒక సగణము దాని పై నొక గురువు నుండవలయును. 1 - 11 - 21 - 31 స్థానములఁ బ్రాసయతి చెల్లవలయును, ప్రాసనియమము గలదు,

లయహారిణి.

కరనికర ముఱు విటపవరము లనఁ, గరతలము
లరుణరుచిఁ దలిరు లనఁ, గరజములు పుష్పో
త్కర మనఁగ, వనరుహజ హరి దనుజ ముని మనుజ
సుర గగనచర భుజగ గరుడ గణ యక్షే
శ్వరుల కతిదయ నొసఁగు వరఫలము లనిశమును
భరిత మయి మధుసమయ సురవరమహీజ
స్ఫురణ కెన యనఁ, దనరు వరదు, హితనటనరతుఁ,
బరమపరుఁ, బరమగురుఁ, బరము నుతియింతున్. 103

అర్థము : కర - నికరము=చేతుల మొత్తము, ఉరు - విటప - వరములు= మేలైన గొప్ప కొమ్మలు, అనన్, కర - తలములు = అఱచేతులు, అరుణ - రుచిన్ = ఎఱ్ఱని కాంతిచే, తలిరులు = చిగుర్లు, అనన్, కరజములు = గోరులు, పుష్ప + ఉత్కరము= పూల సమూహము, అనఁగన్, వనరుహజ .... యక్షేశ్వరులకున్, వనరుహజ = బ్రహ్మ, హరి = విష్ణువు, దనుజ = రాక్షసులు, ముని = మునులు, మనుజ = మనుష్యులు, సుర = దేవతలు, గగన - చర = ఖేచరులు, భుజగ = నాగులు, గరుడ = గరుత్మంతుఁడు, గణ = ప్రమథగణములు, యక్ష + ఈశ్వరులకున్ = కుబేరుఁడు అనువారికి, అతి దయన్=మిక్కిలి దయతో, ఒసఁగు = ఇచ్చునట్టి. వర - ఫలములు = వరము లనెడి పండ్లు, అనిశమును = ఎల్లప్పుడును, భరితము + అయి = నిండి, మధు - సమయ - సుర - వర - మహీజ - స్ఫురణకున్=వసంతకాలమునందలి కల్పవృక్ష స్ఫూర్తికి, ఎన = సాటి, అనన్, తనరు = ఒప్పునట్టి, వరదున్ = వరముల నొసఁగు వాఁడును, హిత నటన - రతున్ = ప్రియమగు నాట్యమునం దాసక్తుఁడును, పరమ - పరున్= పరాత్పరుఁడును, పరమ - గురున్ = ఉత్కృష్టుఁడైన గురువును, పరమున్ = గొప్పవాఁడును - అగు శివుని, నుతియింతున్ = స్తుతింతును.

తాత్పర్యము : చేతులమొత్తము మేలయిన గొప్పకొమ్మ లనఁగను, అఱచేతు లెఱ్ఱని కాంతిచేఁ జివురు లనఁగను, గోరులు పూలమొత్త మనఁగను, బ్రహ్మ, విష్ణువు, రాక్షసులు, మునులు, మనుష్యులు, దేవతలు, ఖేచరులు, నాగులు, గరుత్మంతుఁడు, ప్రమథగణములు, కుబేరుఁడు ననువారికిచ్చు వరములనెడి ఫలముల

ఎప్పుడును నిండి వసంతకాలకల్పవృక్షమును స్ఫురింపఁజేయు వరదుఁడును, నాట్యరతుఁడును, పరాత్పరుఁడును, పరమగురువును, పరముఁడును అగు శివుని స్తుతింతును.

విశేషములు : అలంకారము రూపకానుప్రాణితోపమ.

క. 'సురపానలాంతకాసుర
వరుణానిల ధనద రుద్ర వందిత చరణున్,
ధరణి జల వహ్ని మరుదం
బర రవి సోమాత్మమూర్తిఁ, బరము నుతింతున్.' 104

అర్థము : సురపా .... చరణున్ : సురప = ఇంద్రుఁడు, అనల = అగ్ని: అంతక = యముఁడు, అసుర=నిరృతి. వరుణ=వరుణుఁడు, అనిల = వాయువు ధనద = కుబేరుఁడు, రుద్ర = ఈశానుఁడు - అనువారిచేత, వందిత = నమస్కరింపఁబడిన, చరణున్ = పాదములు గలవాఁడును, ధరణి .... మూర్తిన్ : ధరణి= భూమి, జల = నీరు, వహ్ని = అగ్ని, మరుత్ = వాయువు, అంబర = ఆకాశము, రవి, = సూర్యుఁడు, సోమ = చంద్రుఁడు, ఆత్మ - మూర్తిన్ = యజమానుఁడు అనువారి స్వరూపము గలవాఁడును, అగు, పరమున్ = గొప్పవానిని-శివుని నుతింతున్ = పొగడుదును.

తాత్పర్యము : 'ఇంద్రాగ్ని యమ నిరృతి వరుణ వాయు కుబేరేశాను లనెడి అష్టదిక్పాలురచే నమస్కరింపఁబడు పాదములు గలవాఁడును, పృథివ్యప్తేజో వాయ్వాకాశ సూర్య చంద్ర యజమాను లనెడి అష్టమూర్తుల స్వరూపమైనవాఁడును అగు పరమేశ్వరుని నుతింతును.'

విశేషములు : మరుత్ + అంబర - అనునాసికాంతసవర్ణములు తప్ప మిగిలిన పదాంతగతహల్లులకు (ఝల్లులకు) మృదుహల్లులు (హాశ్శులు) కాని, అచ్చులు కాని పరము లగునపుడు ఆ హల్లుల వర్గమునకుఁ జెందిన తృతీయవర్ణ మాదేశముగా వచ్చును, మరుదంబర.

వ. అని యనేకప్రకారంబులం బరమభక్తియుక్తిం బ్రస్తుతింప దక్షునకుం ద్ర్యక్షుండు ప్రత్యక్షంబై తదీయాధ్వరఫలంబు సఫలంబుగాఁ బ్రసాదించి దక్షుం బ్రజాపతి నియోగంబునంద నియోగించి. 105

అర్థము : అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కువిధముల, పరమ - భక్తి - యుక్తిన్ = గొప్పభక్తితోడి కూడికతో, ప్రస్తుతింపన్ = నుతింపఁగా, దక్షునకున్, త్ర్యక్షుండు = ముక్కంటి - ఈశ్వరుఁడు, ప్రత్యక్షంబు + ఐ = ఎదురఁదోఁచినవాఁడయి, తదీయ + అధ్వర - ఫలంబు = ఆతనిదైన యజ్ఞముయొక్క ఫలము. సఫలంబుగాన్ = ఫలవంతమగునట్లు, ప్రసాదించి = అనుగ్రహించి, దక్షున్, ప్రజాపతి - నియోగంబు నందున్ + అ = ప్రజాపతి పదవియందే, నియోగించి = ఏర్పాటుచేసి.

తాత్పర్యము : అని పెక్కువిధములఁ బరమభక్తితోఁ బ్రస్తుతింపఁగా దక్షునకు ముక్కంటి ప్రత్యక్షమై వాని యజ్ఞమును ఫలవంతముగా ననుగ్రహించి, దక్షునిఁ బ్రజాపతిపదవియందె నియమించి - తృతీయాశ్వాసములోని మొదటి వచనముతో నన్వయము.

ఉ. ధర్మచరిత్రతా కలిత తత్త్వమయాధిక దీప్తి దీపికా
నిర్మలిన ప్రభాపటల నిర్గళితాఖిలలోకపూరితో
త్కర్మ తమిస్రుఁ, డర్థిజన కల్పమహీరుహ కల్పుఁ, డూర్జితాం
తర్ముఖముఖ్యుఁ, డత్యధిక దర్పక దర్పహరుండు సన్మతిన్. 106

అర్థము, ధర్మ .... తమిస్రుఁడు: ధర్మ - చరిత్రతా = ధర్మవర్తనముతో, కలిత = కూడిన, తత్త్వ - మయ = తత్త్వపూర్ణమైన, అధిక - దీప్తి = ఎక్కువ కాంతితోడి, దీపికా = దీపముయొక్క నిర్మలిన = స్వచ్ఛమైన, ప్రభా - పటల = కాంతుల సమూహముచేత, నిర్గళిత = పోయిన, అఖిల - లోక - పూరిత = ఎల్ల లోకములందు నిండిన, ఉత్కర్మ = పాపములనెడి, తమిస్రుఁడు = చీఁకట్లుగలవాఁడును, అర్థి - జన - కల్పమహీరుహ-కల్పుఁడు = యాచకులైన జనులకుఁ గల్పవృక్షముతో సమానుఁడును, ఊర్జిత + అంతర్ముఖ - ముఖ్యుఁడు = ప్రసిద్ధులైన అంతర్ముఖులలోఁ బ్రధానుఁడును, అతి + అధిక - దర్పక - దర్ప - హరుండు = మిక్కిలి

యొక్కువైన మన్మథుని గర్వమును నశింపఁజేసినవాఁడు, సత్ + మతిన్ = మంచి మనస్సు గలవాఁడును,

తాత్పర్యము : ధర్మవర్తనముతోఁ గూడిన తత్త్వపూర్ణమైన యధిక కాంతితోడి దీపపు స్వచ్ఛకాంతిచేఁ బోగొట్టఁబడిన యెల్లలోకములందు నిండిన పాపములనెడి చీఁకట్లు గలవాఁడును, అర్థిజనులకుఁ గల్పవృక్షమైనవాఁడును, అంతర్ముఖవరేణ్యుఁడును, అత్యధికమైన మన్మథుని గర్వము నణఁచినవాడును, మంచి మనస్సుగలవాఁడును. ఇవి యన్నియుఁ గృతిభర్తయైన జంగమమల్లికార్జునుని విశేషణములు,

విశేషములు : రూపకాలంకారము, కల్ప - ఈ ప్రత్యయము ఈషదసమాప్తిని సూచించును. కల్పమహీరుహమున కించుక తక్కువయైనవాఁడని యర్థము. అంతర్ముఖ = బాహ్యవిషయములను విడిచి పరమాత్మయందుఁ బ్రవేశించిన చిత్తము గలవాఁడు. సన్మతియున్ - అనుటకు సన్మతిన్ - సముచ్చయార్థమునందు ను శబ్దము యువర్ణ విరహితముగా నైనది. 'నామసర్వనామంబులకును గిళలగు నవ్యయంబులకును గడపల సముచ్చయార్థవిశేష పాదపూరణములయందు ను శబ్దంబు తఱుచుగ నగు. కళలగు ననుదంత శబ్దంబులమీఁద నయ్యది యువర్ణపూర్వకంబుగ విభాష నగు'. ప్రౌఢ. శబ్ద. 116

క. ఇష్టానిష్ట విముక్తుఁడ
భీష్ట ఫలప్రదుఁడు, సన్మునీంద్రారాధ్యుం,
డష్టతను పరమ తనుమయుఁ,
డష్టార్థ ముఖాన్వయాబ్జ హరితేజమునన్, 107

అర్థము : ఇష్ట + అనిష్ట - విముక్తుఁడు = రాగద్వేషములనుండి విడువఁబడినవాఁడు - రాగద్వేషరహితుఁడు, అభీష్ట - ఫల - ప్రదుఁడు = కోరిన ఫలముల నొసఁగువాఁడు, సత్ + ముని + ఇంద్ర + ఆరాధ్యుండు = ఉత్తములైన మునిశ్రేష్ఠులచేఁ బూజింపఁదగినవాఁడు, అష్ట - తను - పరమ - తను - మయుఁడు = శివునియొక్క ఉత్కృష్టమైన శరీరముతోఁ గూడినవాఁడును, తేజమునన్ = తేజస్సునందు, అష్ట + అర్ధ - ముఖ = చతుర్ముఖునియొక్క - బ్రహ్మ

యొక్క, అన్వయ = వంశమనెడి - బ్రాహ్మణవంశ మనెడి, అబ్జ = తామరపూవు నకు, హరి = సూర్యుఁడైనవాఁడును.

తాత్పర్యము : రాగద్వేష రహితుఁడును, అభీష్టఫలప్రదాతయును, సన్ముని శ్రేష్ఠులకుఁబూజనీయుఁడును, శివుని గొప్పశరీరముతోఁ గూడినవాఁడును - శివ స్వరూపుఁడును, తేజస్సునందు బ్రాహ్మణ వంశమనెడి తామరపువ్వునకు సూర్యుఁడైన వాఁడును,

విశేషములు : అలంకారము రూపకము. 'యమానిలేన్ద్రచన్ద్రార్క విష్ణు సింహాంశు వాజిషు శు కాహి కపి భేకేషు హరిః. అమరము. హరి శబ్దము వీని యన్నిటి యందును వర్తించును.

చ. భవ మరణాతురాంబునిధిపారుఁడు, ఘోరమహోగ్ర సత్వ సం
భవ గత సాగరోత్తరణ బంధుర భూచర సేతు భూత స
త్ప్రవిమలితాత్మతత్త్వ పద పారగుఁ, డాదిమునీశ్వరుండు స
త్కవి గమకిప్రశంసితుఁ, డకారణమిత్రుఁడు, పాత్రుఁ.

డిమ్మహిన్. 108

అర్థము : భవ....పారుఁడు : భవ=పుట్టుక, మరణ= చావు అనెడి, ఆతుర=బాధలనెడి, అంబునిధి=సముద్రముయొక్క, పారుఁడు=అవలియొడ్డు గల వాఁడు-చావుపుట్టుక లనెడు సముద్రమును దాఁటినఁ వాడనుట, ఘోర....పారగుఁడు: ఘోర=భయంకరములు, మహత్ (మహా)+ఉగ్ర = మిక్కిలిక్రూరములు నైన, సత్వ=జంతువులయొక్క, సంభవ=పుట్టుకను, గత=పొందిన, సాగర = సముద్రముయొక్క, ఉత్తరణ = దాఁటుటకు, బంధుర = ఒప్పిదమైన , భూ - చర = భూమియందుఁ, జరించువారికి, సేతు - భూత = వంతెన - యైన, సత్ + ప్రవిమలిత = మిక్కిలి నిర్మలముగాఁ జేయఁబడిన, ఆత్మ - తత్త్వ = పరమాత్మతత్త్వము గల, పద = పాదములచే, పారగుఁడు = అవలియొడ్డును ముట్టినవాఁడును, ఆది-ముని + ఈశ్వరుండు = ఆదిమునులలో శ్రేష్ఠుఁడును, సత్ + కవి - గమకి - ప్రశంసితుఁడు = ఉత్తములైన కవులచేతను, గాయకులచేతను ప్రశంసింపఁబడిన, వాఁడును, అకారణ - మిత్రుఁడు = కారణములేకయే హితుఁడైనవాఁడును,

ఈ + మహిన్ = ఈ భూమియందు, పాత్రుఁడు = అర్హుఁడైనవాఁడును, - జంగమ మల్లికార్జునుని విశేషణములు.

తాత్పర్యము : జనన మరణ బాధ లనెడు సముద్రమును దాఁటిన వాఁడును, మిక్కిలి భయంకరములు క్రూరములు నైన జలజంతువులుగల సముద్రమును దాఁటుటకు భూచరులకు వంతెనయైన మిక్కిలినిర్మలముగాఁ జేయఁబడిన పరమాత్మతత్త్వముగల పాదములచేఁ బారమును బొందినవాఁడును, ఆదిమునీశ్వరుఁడును, సత్కవిగాయకులచేఁ బ్రశంసింపఁబడినవాఁడును, అకారణమిత్రుఁడును, ఈ భూమియందు అర్హుఁడును - జంగమమల్లికార్జునుని విశేషణములు,

విశేషములు : అలంకారము రూపకము. గమకి = గమకము(స్వర విశేషము) గలవాఁడు = గాయకుఁడు,

క. రమణీ రమణీయ సురూ
ప మయాంగజ శస్త్ర వజ్రపంజర నిభ స
ద్విమల శివయోగ తత్పరుఁ,
డమలచరిత్రుండు మల్లికార్జునుఁ డెలమిన్. 109

అర్థము: రమణీ .... తత్పరుఁడు: రమణీ = స్త్రీలయొక్క, రమణీయ అందమైన, సురూప - మయ = సౌందర్యరూపమైన, అంగజ - శస్త్ర = మన్మథుని బాణములకు, వజ్ర - పంజర - నిభ = వజ్రనిర్మితమైన పంజరముతో, సమానమైన, సత్ + విమల - శివయోగ-తత్పరుఁడు = మిక్కిలి నిర్మలమైన శివధ్యానయోగమునందు ఆసక్తిగలవాఁడు, అమల - చరిత్రుండు = నిర్మలమైన నడవడి గలవాఁడు, మల్లికార్జునుఁడు, ఎలమిన్ = సంతోషముతో.

తాత్పర్యము : స్త్రీల మనోహరమైన సౌందర్యమనెడి మన్మథాస్త్రములకు అభేద్యమైన వజ్రపంజరమువంటి నిర్మలమైన శివధ్యానయోగమునం దాసక్తి గలవాఁడును, స్వచ్ఛమైన నడవడిగలవాఁడును అగు జంగమమల్లికార్జునుఁడు సంతోషముతో,

విశేషములు : అలంకారము రూపకానుప్రాణితోపమ.

మాలిని. విశదయశుఁడు, ముక్తోద్వేగుఁ, డస్పృష్టరాగుం,
డశుభగతి నివృత్తుం, డార్యుఁ, డార్యౌఘవర్యుం
డశనిధర విలాసాయత్తుఁ, డధ్యాత్మచిత్తుం,
డి శర కమలినీ పూర్ణేందుఁ, డానందుఁ డెందున్. 110

అర్థము : విశద - యశుఁడు = నిర్మలమైన కీర్తి గలవాఁడును, ముక్త + ఉద్వేగుఁడు = విడువఁబడిన ఉద్రేకము గలవాఁడును, అస్పృష్ట - రాగుండు = తాఁకఁబడని రాగము గలవాఁడును - విరాగియును, అశుభ - గతి - నివృత్తుండు = అశుభమైన పోకడనుండి మఱలినవాఁడును, ఆర్యుఁడు = పూజ్యుఁడును, ఆర్య + ఓఘ - వర్యుండు = ఆర్యుల సమూహమునందు శ్రేష్ఠుఁడును, అశనిధర - విలాస + ఆయత్తుఁడు = వజ్రి (ఇంద్రుని) భోగములకు వశమైనవాఁడును, అధ్యాత్మ - చిత్తుండు = ఆత్మస్వరూపజ్ఞానముగల మనస్సు గలవాఁడును, ఇ - శర - కమలినీ - పూర్ణ + ఇందుఁడు = మన్మథునియొక్క, బాణమైన, తామరతీగకు, నిండు చంద్రుఁడైనవాఁడును, ఎందున్, ఆనందుఁడు = ఆనందించువాఁడును.

తాత్పర్యము : నిర్మలినమైన కీర్తి గలవాఁడును ఉద్రేకరహితుఁడును, రాగమును స్పృశింపనివాఁడును, అశుభగతినుండి మరలినవాఁడును, ఆర్యుఁడును, ఆర్యుల సమూహములో శ్రేష్ఠుఁడును, ఇంద్రభోగముల కధీనమైనవాఁడును, ఆత్మస్వరూప జ్ఞానముగల మనస్సు గలవాఁడును, మన్మథాస్త్రములగు తామరలకు నిండుచంద్రుఁడైన వాఁడును, ఎందైన నానందించువాఁడును - కృతిభర్త యగు జంగమ మల్లికార్జునని విశేషణములు.

విశేషములు : ఇ శర కమలినీ పూర్ణేందుఁడు_రూపకాలంకారము, ఇ = మన్మథుఁడు - దీనికిఁ దెలుఁగున వ్యస్తప్రయోగము లేదు. (సూ.ని.) మాలినీ లక్షణమునకు చూడు పూర్వవ్యాఖ్య - 1 - 134.

గద్య

ఇది శ్రీమజ్జంగమ మల్లికార్జునదేవ దివ్య శ్రీపాద పంకజ భ్రమరాయమాణ కవిరాజశిఖామణి నన్నెచోడదేవ ప్రణీతం బైన కుమారసంభవంబను కథయందు ద్వితీయాశ్వాసము.

అర్థ తాత్పర్య విశేషములు ప్రథమాశ్వాసాంతగద్యకు వలెనే.

మ. ఇది శ్రీజొన్నలగడ్డ వంశమణియౌ మృత్యుంజయాఖ్యుండు స
మ్మద మొప్పారఁ గుమారసంభవము శ్రీమన్నన్నెచోడాఖ్యవి
ద్వదధీశోక్తము శాబ్దికార్థ వివిధస్వారస్య తాత్పర్యముల్
చదు వొప్పన్ వచియించి మన్చు విలసత్ సంజీవనీవ్యాఖ్యయా.

కుమారసంభవము

తృతీయాశ్వాసము

క. శ్రీకంధర పరతత్త్వా
లోకన తత్పరుఁడు, నిశ్చలుం, డఖిల సుధీ
లో కాభీష్టద కల్పా
నోకహుఁ డగు మల్లికార్జునుండు నెగడ్తన్. 1

అర్థము : మల్లికార్జునుండు = జంగమ మల్లికార్జునుఁడు, నెగడ్తన్ = ప్రసిద్ధితో, శ్రీ కంధర - పర - తత్త్వ + ఆలోకన - తత్పరుఁడు = గరళ కంఠుఁడైన శివునియొక్క పరతత్త్వముయొక్క చూచుటయం దాసక్తి గలవాఁడును, నిశ్చలుండు = స్థిరుఁడును, అఖిల - సుధీ - లోక + అభీష్టద - కల్ప + అనోకహుఁడు = ఎల్లవిద్వత్సమూహముయొక్క కోరికల నిచ్చునట్టి కల్పవృక్షమైనవాఁడు, అగున్.

తాత్పర్యము : జంగమ మల్లికార్జునుఁడు ప్రసిద్ధితో శివుని పరతత్త్వమును దర్శించుటయం దాసక్తి గలవాఁడును, స్థిరుఁడును, ఎల్ల విద్వల్లోకమునభీష్టముల నిచ్చునట్టి కల్పవృక్షమును అగును.

విశేషములు : సుధీలోకా.... కల్పానోకహుఁడు - రూపకము. 'అనోకహము.అనోకహః కుట స్సాలః పలాశీ ద్రు ద్రు మాగమాః' అనసః శకటస్య అకం గమనం హన్తీతి అనోకహః. బండియొక్క గమనమును ఆఁపునది - చెట్టు - అమరము.

వ. సకల భువనాధీశ్వరుండైన పరమేశ్వరుండు హరి పరమేష్ఠి పురంద రాద్యఖిల సురవర పరివృతుండై నిఖిల కులాచల ప్రభావ

1 సా. ప్రతి. విజిత.

విచిత రజత శిఖరి శిఖర మణి రమ్యహర్మ్యతలాలంకృతోత్తుంగ
సింహాసనాసీనుండై భృంగిరిటి పరిహాస పేశలాలాప హాస్యాలాప
వ్యాకులిత లలిత హాస్యరస రసాయన పూరితాస్థానమందిరుండై
పరమానందంబున నుండె నంత నక్కడ. 2

అర్థము : సకల - భువన + అధి + ఈశ్వరుండు = ఎల్ల లోకము లకును ప్రభువు, ఐన, పరమేశ్వరుండు, హరి - పరమేష్ఠి - పురందర + ఆది + అఖిల - సుర - వర - పరివృతుండు = విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు, మున్నగు నెల్ల దేవతాశ్రేష్ఠులచేఁ జుట్టఁబడినవాఁడు, ఐ, నిఖిల .... సీనుండై : నిఖిల = ఎల్ల, కుల + అచల = కులపర్వతములయొక్క, ప్రభావ = మహిమతోను, విచిత = పరిశీలింపఁబడిన, కూడిన, రజత - శిఖరి = వెండికొండ (కైలాసము) యొక్క, శిఖర = శృంగమనెడి, మణి = మణులచే, రమ్య = అందమైన, హర్మ్య - తల = ప్రాసాదమునందలి, అలంకృత = అలంకరింపఁబడిన, ఉత్తుంగ = మిక్కిలి యెత్తైన, సింహాసన + ఆసీనుండు + ఐ = సింహాసనమునందుఁ గూరుచున్న వాఁడయి, భృంగిరిటి = భృంగిరిటి యనుపేరుగల శివపరిచారకునియొక్క, పరిహాస = నవ్వులాటతోఁ గూడిన, పేశల = మృదువైన, ఆలాప = మాటల చేతను, హాస్య + ఆలాప = హాస్యపుసంభాషణములచేతను, వ్యాకులిత = మిక్కిలి నిండిన, లలిత = మనోహరమైన, హాస్యరస = హాస్యమనెడి రసము అను రసా యనముతో, పూరిత = నింపఁబడిన, ఆస్థాన - మందిరుండు = కొలువుభవనము గలవాఁడు, ఐ, పరమ + ఆనందంబునన్ = మిక్కిలి సంతోషముతో, ఉండెన్, అంతన్, అక్కడన్.

తాత్పర్యము : ఎల్లలోకములకుఁ బ్రభువైన పరమేశ్వరుఁడు విష్ణు బ్రహ్మేంద్రాదులైన యెల్ల దేవతలచేతను బరివేష్టితుఁడై సర్వకులపర్వతముల ప్రభావ ముతోఁ గూడిన వెండికొండ శిఖర మనెడి మణిరమ్యహర్మ్యమునం దలంకరింపఁబడిన ఉన్నతసింహాసనమునఁ గూరుచున్నవాఁడయి భృంగిరిటి చేయు పరిహాససంభాషణము లందలి హాస్యరసముతోడి రసాయనముతో నిండిన కొలువుకూటము గలవాఁడయి మిక్కిలి ఆనందముతో నుండెను. అంత నక్కడ - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : రజత శిఖరి శిఖర మణి రమ్య హర్మ్యతల .... రూపకము. భృంగిరిటి - (రూపాం) భృంగిరిట.

సీ. రోహణాచల మను రూఢిగా కం దింత
మహనీయ రత్న సామగ్రిగలదె?
వింధ్యాద్రితో సురల్ విరస మెత్తిరిగాక
గ్రహచక్ర మది యింత గడచియున్నె?
హాటకరుచియ కా కమరేంద్రుగిరి కింత
పరమౌషధీప్రభా భాతి యెత్తె?
హరుఁ డర్థపతి చెలిమి కం దుండెఁగా కింత
రమ్యమే వసియింప రజతశైల?

తే. మఱఁడు తనవిద్య మెఱయఁ గులాద్రు లొండ్లు
వడసెఁ గా కుర్వి తాల్పంగ భరమె దీని?
కనఁగ నగచక్రవర్తి మాహాత్మ్య వైభ
వాలయం బగు పేర్మి హిమాలయంబు. 3

అర్థము : రోహణ + అచలము రోహణ పర్వతము (లంకలోని పర్వత విశేషము), అను, రూఢి = ప్రసిద్ధి, కాక, అందున్ = ఆ కొండయందు, ఇంత = ఇంతటి, మహనీయ - రత్న - సామగ్రి = గొప్పది యగు, రత్నములయొక్క, సముదాయము, కలదె = ఉన్నదా?

వింధ్య + అద్రితోన్ = వింధ్యపర్వతముతో, సురల్ = దేవతలు, విరసము ఎత్తిరి + కాక = ద్వేషము వహించిరి కాని, అది = ఆ వింధ్యపర్వతము, గ్రహ - చక్రము = గ్రహవలయము, ఇంత = హిమవత్పర్వతమంత, కడచి + ఉన్నె = అతిక్రమించియుండునా?

హాటక - రుచి + అ - కాక = బంగరు కాంతియే కాని, అమర + ఇంద్రు గిరికిన్ = దేవేంద్రుని పర్వతమునకు - మేరుపర్వతమునకు, ఇంత = ఇంతటి,

+రమ + ఓషధీ - ప్రభా - భాతి = గొప్ప ఓషధుల కాంతియొక్క తళతళ, ఎత్తె = సమానమా?

హరుఁడు = ఈశ్వరుఁడు, అర్థపతి - చెల్మికిన్ = కుబేరునితోడి స్నేహము నకు. అందున్ = కైలాసమునందు, ఉండెన్ + కాక = ఉండెనుగాని, రజత - శైలము = వెండికొండ - కైలాసము. వసియింపన్ = నివసించుటకు, ఇంత, రమ్యమే = అనుకూలమా?

అజుఁడు = బ్రహ్మ, తన-విద్య = తన సృష్టివిద్య, మెఱయన్ = ప్రకా శింపఁజేయుటకై, కుల + అద్రులు = కులపర్వతములు, ఒండ్లు = ఇతరములు, పడసెన్ = పొందెను, కాక = కాని, దీనికిన్ = ఈ కొండకు హిమవత్పర్వతము నకు, ఉర్వి = భూమిని, తాల్పంగన్ = ధరించుటకు, భరమె = బరువా?

అనఁగన్, హిమ + ఆలయంబు = మంచుకొండ, మాహాత్మ్య - వైభవ + ఆలయంబు = గొప్పతనముతోడి ప్రభుత్వమునకు స్థానము, అగు - పేర్మిన్ = అగునట్టి గౌరవముతో, నగ - చక్రవర్తి = పర్వతరాజు.

తాత్పర్యము : రోహణ పర్వత మను పేరేకాని, ఆ పర్వతమున హిమవ త్పర్వతమున నున్నంత రత్నముల సముదాయము కలదా? వింధ్యపర్వతమును దేవతలు ద్వేషించిరి కాని ఆ కొండ గ్రహావలయమును హిమవత్పర్వత మంత యతిక్రమించి యుండునే? మేరుపర్వతమునకు బంగారుకాంతియే కలదు కాని దానికింతటి పరమౌష ధుల కాంతి యేది? ఈశ్వరుఁడు కుబేరునితోడి మైత్రిచే నందు నివసించెనుగాని కైలా సము హిమవంతమునంతగా నివాసయోగ్యమా? బ్రహ్మ తన సృష్టివిద్య ప్రకాశింపఁగా నితర కులపర్వతములను సృజించెను గాని భూభారమున కిది యొక్కటి చాలదా? అనునట్లు హిమాలయము గొప్పతనముతోడి ప్రభుత్వమునకు నిలయ మనెడిగౌర వముచే పర్వతచక్రవర్తి.

విశేషములు: ఇందు వర్ణ్యమైన హిమాలయమునందు నగచక్రవర్తి త్వము నారోపించుటకై యితరపర్వతములను గా దనుటచే నపహ్నవాలంకారము. 'శుద్ధాపహ్నుతి రన్యస్యారోపార్థో ధర్మనిహ్నవః స ఏవ యుక్తిపూర్వశ్చే దుచ్యతే

హేత్వపహ్నుతిః' - చన్ద్రా. హిమవత్పర్వత నగచక్రవర్తిత్వము అను సమర్థనీయాంశము సమర్థింపఁబడినది కావునఁ గావ్యలింగాలంకారము. సమర్థనీయ స్యార్థస్య కావ్యలిఙ్గం సమర్థనమ్' - చన్ద్రా.

మెఱయ = మెఱయింప - 'కరఁగు మెఱ య్యాదు లంతర్భావితప్రేరణంబులు, ప్రౌఢ. క్రి.34

చ. సురవర వాహినీధరుఁడు, శుభ్ర శరీరవిభాసి, నీలకం
ధర పరిశోభితుండు, గుణధాముఁడు, తుంగతనుండు భూధరా
భరణుఁ డుమాసమన్వితుఁ, డపార విభూతి సమేతుఁడై మహే
శ్వరుఁడునుబోలె నొప్పు హిమవంతుఁ డనంత మహత్త్వ సంపదన్ 4

అర్థము : సుర-వర - వాహినీ-ధరుఁడు = దేవతాశ్రేష్ఠుల నదిని-ఆకాశగంగను, ధరించినవాఁడు. శివ హిమవంతు లిరువురును గంగను ధరించినవారే, శుభ్ర - శరీర - విభాసి = తెల్లని శరీరముచేఁ బ్రకాశించువాఁడు - శివుని మేనివర్ణము తెలుపు. హిమవంతుఁడును సతతహిమాచ్ఛాదితుఁ డగుటచేఁ దెలుపే. నీల కంధర - పరిశోభితుండు = నల్లనికంఠముచేఁ బ్రకాశించువాఁడు - శివుఁడు. నల్లని మేఘములచే లేదా నెమళ్లచేఁ బ్రకాశించువాఁడు హిమవంతుఁడు, గుణ-ధాముఁడు = సుగుణములకు స్థానమయినవాఁడు, ఇది ఉభయత్ర సమానమె, తుంగ-తనుండు = ఎత్తయిన శరీరము గలవాఁడు - ఇదియును శివ హిమవంతుల కుభయులకును దుల్యమె, భూధర + ఆభరణుఁడు = కొండ (కైలాసము) ఆభరణముగాఁ గలవాఁడు లేదా భూధర = భూమిని ధరించు పాములు, ఆభరణుఁడు = ఆభరణములుగాఁ గలవాఁడు - శివుఁడు, కొండలకు ఆభరణమైనవాఁడు-హిమవంతుఁడు, ఉమా-సమన్వితుఁడు = ఉమతోఁ (పార్వతితోఁ) గూడినవాఁడు - శివుఁడు, ఉమతోఁ (కూఁతురుగావున) గూడినవాఁడు, అపార - విభూతి - సమేతుఁడు + ఐ = అధికమైన భస్మముతోఁగూడినవాఁడు - శివుఁడు, అధికమైన యైశ్వర్యముతోఁ గూడినవాఁడు హిమవంతుఁడు, అయి, హిమవంతుఁడు, అనంత - మహాత్త్వ - సంపదన్ = అపారమైన గొప్పతనమనెడి సంపదతో, మహేశ్వరుఁడును + పోలెన్ = పరమేశ్వరుని, విధమున, ఒప్పున్,

తాత్పర్యము : శివుఁడు గంగాధరుఁడు, అట్లే హిమవంతుఁడును గంగాధరుఁడే. శివుఁడు తెల్లని శరీరముచేఁ బ్రకాశించువాఁడు. అట్లే హిమవంతుఁడును నిరంతర హిమాచ్ఛాదితుఁ డగుటచేఁ దెల్లనివాఁడు. శివుఁడు నీలకంధర (కంఠ) ముచేఁ బ్రకాశించువాఁడు. హిమవంతుఁడును నీలకంధర (మేఘ)ములచేఁ బ్రకాశించువాఁడు, లేదా నీలకంఠముల (నెమళ్ల) చేఁ బ్రకాశించువాఁడు. ఇరువురును సద్గుణములకు నిలయమైన వారే. ఇరువురును తుంగతనులే. శివుఁడు భూధరము (కైలాసపర్వతము) ఆభరణముగాఁ గలవాఁడు. హిమవంతుఁడు భూధరకులమునకు ఆభరణమైనవాఁడు - పర్వతశ్రేష్ఠుఁ డనుట. భార్య యగుటచే శివుఁ డుమాసమన్వితుఁడు. కూఁతు రగుటచే హిమవంతుఁ డుమాసమన్వితుఁడు. శివుఁడు అపారమైన విభూతి (భస్మము) తోఁ గూడినవాఁడు. హిమవంతుఁడు అపారమైన విభూతి (సంపద) తోఁగూడినవాఁడు, ఇట్లు హిమవంతుఁ డనంతమైన మహత్తరసంపదచే మహేశ్వరునివలె నొప్పును.

విశేషములు : అలంకారము శ్లేషానుప్రాణితమైన ఉపమ. హిమవంతమున నెమళ్లు గల వనుటకు - 'నట నానుకూల పరిఫుల్ల కలాప కలాపిజాలమున్'. - మనుచ. 2 - 3

సీ. హేమాద్రి విస్తార మెంత? సప్తాశ్వుండు
నిచ్చలు నొరల వచ్చు నట్టె;
తారాచలము ప్రేఁకఁదన మెంత? వింశతి
బాహునిచే నెత్తువడియె నట్టె;
పెరిఁగిన వింధ్యాద్రి పెంపెంత? కలశజుం
డెడగాల మెట్టిన నడఁగె నట్టె;
నెగడు మందరగిరి నిలు పెంత? కఱభోగి
దిర్చిన జిఱ్ఱునఁ దిరిగె నట్టె;

తే. యనఁగ విస్తారమున ప్రేఁకఁదనమునందుఁ
బెంపునందునుఁ నిలుపునఁ బెఱ నగముల
నుఱక తనలోన నవ్వుచు నున్న కరణి
వెలుఁగు శీతాద్రి ప్రాలేయ విమల రుచుల. 5

అర్థము : హేమ + అద్రి = బంగారు కొండ - మేరువు యొక్క, విస్తారము = విరివి, ఎంత = ఏమాత్రము, సప్త + అశ్వుండు = ఏడుగుఱ్ఱములు గలవాఁడు - సూర్యుఁడు, నిచ్చలున్ = నిత్యమును, ఓరలన్ - వచ్చున్ + అట్టె = ప్రక్కలను వచ్చునఁట.

తార + అచలము = వెండికొండ (కైలాసము) యొక్క ప్రేంకఁదనము = దుర్భరత్వము, ఎంత, వింశతి-బాహునిచేన్ = ఇరువది చేతులుగల (రావణుని) చేత, ఎత్తు + పడియెన్ + అట్టె = ఎత్తుటను బొందెనఁట - ఎత్తఁబడెనఁట - బలహీనమయ్యెనఁట.

పెరిఁగిన = వృద్ధిపొందినట్టి, వింధ్య + అద్రి వింధ్యపర్వతముయొక్క పెంపు = వృద్ధి - గొప్పతనము, ఎంత, కలశజుండు = కుండయందుఁబుట్టినవాఁడు - అగస్త్యుఁడు, ఎడ + కాలన్ = ఎడమకాలితో, మెట్టినన్ = తన్నఁగా, అడఁగెన్ + అట్టె = క్రుంగెనఁట.

నెగడు = ఒప్పునట్టి, మందర - గిరి = మందరపర్వతముయొక్క, నిలుపు = స్థైర్యము - నిలుకడ, ఎంత, ఫణి - భోగి = నల్లత్రాచు - వాసుకి, తిర్చినన్ = త్రిప్పఁగా, జిఱ్ఱనన్, తిరిగెన్ + అట్టె = తిరిగెనఁట.

అనఁగన్, విస్తారమునన్ = విరివియందును, ప్రేంకఁదనము నందున్ = బరువునందును, పెంపునందును = గొప్పతనమునందును, నిలుపునన్ స్థైర్యమునందును, పెఱ - నగములన్ = ఇతరపర్వతములను, ఉఱక = లక్ష్యపెట్టక, తనలోనన్. నవ్వుచున్ + ఉన్న-కరణిన్ = వానిని దనలోఁ బరిహసించు చున్నవిధమున, శీత + అద్రి = మంచు కొండ - హిమవత్పర్వతము, ప్రాలేయ - విమల - రుచులన్ = మంచుయొక్కనిర్మలములైన కాంతులతో, వెలుఁగున్ = ప్రకాశించును,

తాత్పర్యము : మేరుపర్వతము విరివి యేపాటిది? సూర్యుఁడు నిత్యమును దాని పార్శ్వముల నంటి వచ్చునఁట. కైలాసము దుర్భరత్వ మేపాటిది? రావణువిచే నది యెత్తుపడెనఁట. పెరిఁగిన వింధ్యపర్వతము పెంపే మాత్రము? అగస్త్యుఁడు దాని

నెడమకాలఁ దన్నఁగా నడఁగెనఁట. మందరపర్వతము స్థైర్యమే పాటిది? ఒక నల్లని పాఁపపురుగు (వాసుకి), త్రిప్పఁగా జిత్తునఁ దిరిగెనఁట. ఇట్లు విరివియందును, బరువు నందును, పెంపునందును స్థైర్యమునందును ఇతరపర్వతములను దనలోఁ బరిహసించు చున్నదా యనునట్లు హిమవత్పర్వతము మంచు తెల్లనికాంతులతోఁ బ్రకాశించును.

విశేషములు: మేర్వాదుల విస్తారాదులను నహేతుకముగా నపహ్నవించుటచే నలంకారము హేత్వపహ్నుతి. పెఱనగముల నుఱక తనలోన నవ్వుచు నున్న కరణి....ఉత్ప్రేక్ష. (సీసపాదములందలి ఒక్కొక్కదానికి సరిపడునట్లు ఎత్తుగీతియందుఁ గ్రమముగా ఒక్కొక్కగుణముఁ జెప్పుటచే నలంకారము యథాసంఖ్యము.) నవ్వుచు-నవ్వు తెలుపని కవిసమయము. మంచు తెలుపు గావున దానితోఁ గూడినహిమవంతమితరపర్వతములను నవ్వుచున్నట్లే యుండును. ఎత్తువడు = ఎత్తుట గలిగియుండు. భంగపడు - కలశజుఁడు = అగస్త్యుఁడు, (నానా.) ద్రోణుఁడు, ఎడగాలన్ అనాయాసముగా ననుట. కఱభోగి = నల్లత్రాచు - ఒక చిన్నపాఁపపురుగని చులుకఁదనము. ప్రాలేయ - 'అవశ్యాయ స్తు నీహార స్తుషార స్తుహినం హిమం ప్రాలేయం మిహికా చ.' ప్రళయా చ్ఛరదంతా దాగత మితి ప్రాలేయమ్. శరత్కాలాంతమున వచ్చునది - మంచు - అమరము. పెరిఁగిన వింధ్యాద్రి పెం పెంత కలశజుం డెడగాల మెట్టిన నడఁగెనట్టె - వింధ్యపర్వతము గర్వించి సూర్యగమనము నడ్డునంతగాఁ బెరిఁగిపోవుచుండ, దేవతల ప్రార్థనమున నగస్త్యుఁడు దాని నడఁచెను. నెగడు మందర గిరి నిలుపెంత .... దేవదానవులు అమృతము కొఱకు క్షీరసముద్రమును ద్రచ్చఁబూని మందరపర్వతమును గవ్వముగాఁజేసి దానికిఁద్రాడుగా వాసుకినిఁజేసి త్రిప్పిరి. ఒక చిన్న పాఁపపురువుచేఁ ద్రిప్పుట నందిన మందరపర్వతము స్థైర్యమే పాటి దనుట.తారాచలము ....ఈశ్వరుఁడు-పార్వతీసమేతుఁడై కైలాసమున నుండఁగా, రావణుఁడు దానిని వ్రేలి కొనతో నెత్తెను. అట్టిచో దానిదుర్భరత్వ మే పాటి దనుట.

చ. సురపుర రమ్య హర్మ్య మణి శుభ్ర తలాగ్ర విలాస హాసియై
యురు కనకాగ్రశృంగమున నొందిన తారకపంక్తి శీతభూ
ధరపతి చూడఁజూడ విదితంబగు నిర్మలినాంగభాతితోఁ.
నురగ ఫణాగ్రరత్న రుచిరోరు కపర్ద ధ రేశ్వరాకృతిన్. 6

అర్థము : శీత - భూధర - పతి - = హిమవత్పర్వతరాజు, చూడన్ + చూడన్ = చూడఁగాఁజూడఁగా ఉరు - కనక - అగ్ర-శృంగమునన్ = గొప్పదియగు బంగారు కొనగల శిఖరమునందు, ఒండిన = కలిగిన, తారక - సంకీర్తిన్ = నక్షత్రముల వరుసతో, సుర .... హాసియై: సుర - పుర = దేవతల నగరమైన అమరావతియందలి, రమ్య = అందమైన, హర్మ్య = మేడలయొక్క, మణి = రత్నములచే, శుభ్ర = నిర్మలమైన, తల = ప్రదేశముయొక్క అగ్ర = కొనయొక్క, విలాస = అందమును, హాసి = పరిహసించునది, ఐ,నిర్మలిన + అంగ - భాతితోన్ = స్వచ్ఛమైన శరీరముయొక్క కాంతితో, ఉరగ .... రాకృతిన్: ఉరగ - పాములయొక్క, ఫణా = పడగల యొక్క, అగ్ర = కొనలయందలి, రత్న = మణులయొక్క. రుచిర = మనోహరమైన, ఉరు = గొప్పదియగు, కపర్ద = జటాజూటమును, ధర = ధరించినట్టి, ఈశ్వర = శివునియొక్క, ఆకృతిన్ = ఆకారముతో, విదితంబు + అగున్ = తెలియఁబడినది - ప్రసిద్ధమైనది యగును.

తాత్పర్యము : హిమవత్పర్వతరాజము పెద్దదియగు బంగారు కొనగల శిఖరమునందలి నక్షత్రకాంతితో నమరావతియందలి రమ్యములైన హర్మ్యముల రత్న శుభ్ర తలాగ్రముల విలాసమును బరిహసించునదై, స్వచ్ఛమైన దేహకాంతితోఁ బాముల పడగలకొనలందలి మణులచే మనోహరమైన పెద్దజటాజూటమును ధరించిన యీశ్వరుని యాకారముతోఁ జూడఁగాఁ జూడఁగా నొప్పెను.

విశేషములు : హిమవత్పర్వత శిఖరము స్వర్ణమయము. అది నక్షత్రమండలమువఱకు వ్యాపించెను. నక్షత్రములకాంతితో నది యమరావతియందలి రమ్య హర్మ్యముల రత్నశుభ్రములైన ప్రదేశముల కొనలను బరిహసించుచుండెను. మఱియు నది తన స్వచ్ఛమైన దేహకాంతితో - భూషణములైన సర్పముల పడగలందలి మణులకాంతులచే మనోహరమైన పెద్దజటాజూటమును ధరించిన శివుని యాకారము గలిగి యొప్పెను, హిమవంతుఁడు శివునిఁ బోలియుండెను. హిమవంతుఁడు నిర్మలినాంగుఁడు. అట్లే శివుఁడును నిర్మలినాంగుఁడే. హిమవంతుని కనకాగ్రశృంగము శివుని జటాజూటమును బోలియుండెను. శివుని జటాజూటము పాముల పడగలందలి మణులచే నొప్పినట్లే, హిమవంతుని ఆ శృంగముగూడ నక్షత్రముల కాంతితో నొప్పుచుండెను. నక్షత్రమండలమువఱకు వ్యాపించిన ఆ కనకాగ్రశృంగము నక్షత్రముల కాంతిచే

నమరావతియందలి రమ్యహర్మ్యముల మణిశుభ్రతలాగ్రవిలాసమును బరిహసించు చుండెను. కనకాద్రి యనఁగా మేరువు. దాని ప్రసక్తి యిట అనావశ్యకముగాపున కనకాద్రి యను పాఠముగాక కనకాగ్ర అనుపాఠమే స్వీకరింపఁబడినది. అలంకారము సంబంధాతిశయోక్తి – 'సంబన్ధాతిశయోక్తిస్స్యా దయోగేయోగకల్పనమ్' - చన్ద్రా. కపర్ద - కపర్దో౽స్య జటాజూటః – శివుని జటాజూటమునకుఁ గపర్ద మనిపేరు - అమరము. నిర్మలినాంగభాతితో .... కపర్దధరేశ్వరాకృతిన్ – అలంకార మిపము.

తే. శీతగిరిమీఁద మదకరుల్ సీవరించు
నెలుఁగు నవ ఘనారవ మని యెసఁగి యాడు
నమ్మిపదుపులు గడునొప్పు నగవిభునకు
బలసి పట్టిన పింఛాతపత్ర భాతి. 7

అ ర్థ ము : శీత - గిరి - మీఁదన్ = మంచుకొండమీఁద, మద - కరుల్ మద గజములు, సవరించు = సీత్కారముచేయు, ఎలుఁగున్ = ధ్వనిని, నవ - ఘన + ఆర వము = క్రొత్త మేఘముల ధ్వని, అని, ఎసఁగి = విజృంభించి, ఆడు = నృత్యము చేయునట్టి, నమ్మి - పదుపులు = నెమళ్లగుంపులు, నగ-విభునకున్ = పర్వతరాజునకు, బలసి = పరివేష్టించి, పట్టిన, పింఛ + ఆతపత్ర - భాతిన్ = పింఛము లనెడి గొడు గుల విధమున, కడున్ = మిక్కిలి, ఒప్పున్.

తా త్ప ర్య ము : హిమవత్పర్వతముమీఁద మదపుటేనుఁగులు సీత్కారము చేయఁగా, నా ధ్వనిని క్రొమ్మొయిళ్ల ధ్వనియనిభ్రమించి విజృంభించి నృత్యముచేయు నెమిళ్ల గుంపులు ఆ పర్వతరాజునకుఁ బరివేష్టించి పట్టిన పింఛములనెడి గొడుగుల విధమున మిక్కిలి యొప్పెను.

వి శే ష ము లు : హిమవంతుఁడు నగవిభుఁడు (పర్వతరాజు) అని చెప్పఁ బడుటచే, వానికి ఆతపత్రమును బట్టుటయను రాజోపచారము వర్ణింపఁబడినది. నెమిళ్లు మేఘధ్వనిని వినినంతనే యుత్సాహమున నృత్యముచేయును. వాని కేనుఁగుల సీత్కార ధ్వనియందు మేఘధ్వనిభ్రాంతి, అందుచే నలంకారము భ్రాంతిమంతము. పింఛాతపత్ర - రూపకాలంకారము, నమ్మి పదుపులు పింఛాతపత్రభాతిఁ గడు నొప్పును. ఉపమవలె నున్నను నిది యుత్ప్రేక్షయే యని చెప్పవలయును, నమ్మి - నెమ్మి - నమలి - నెమలి

నమిలి - నెమలి - రూపాంతరములు, ఘన - ఆకారాంతస్త్రీలింగ మయినచో వర్షాకాలము. అకారాంతపుంలింగ మయినచో మేఘము, విశేషణ మయినచో గొప్పది.

తే. శిశిరభూమీధరోద్దామ శిఖర మణులఁ
గదిసి తారాగణంబులు గలిసియున్న
మణిగణాన్వేషణులు కీడు మణులు సావి
పాయఁ ద్రోతు రం దవి గనుపట్టకున్న. 8

అర్థము : శిశిర .... మణులన్: శిశిర = చల్లని, భూమీధర = కొండ - హిమవత్పర్వతముయొక్క, ఉద్దామ = అధికమైన, [1]శిఖర = శిఖరములందలి, మణులన్ = మణులను, కదిసి = సమీపించి, తారా - గణంబులు = నక్షత్రముల సమూహములు, కలిసి + ఉన్నన్ = కూడియుండఁగా, మణి - గణ + అన్వేషణులు = మణుల సమూహములను వెదకువారు, అందున్ = ఆ మణులలో, అవి = తారలు, కనుపట్టక + ఉన్నన్ = తక్కువకాంతి కలవగుటచేఁగనఁబడకపోఁగా, కీడు - మణులు - సావి = కృత్రిమములైన మణు లని, పాయన్ + త్రోతురు = తొలఁగఁద్రోయుదురు.

తాత్పర్యము : హిమవత్పర్వతపు గొప్ప శిఖరములందలి మణులను సమీపించి వానితో నక్షత్రముల సమూహములు కలిసియుండఁగా మణులను వెదకువారు ఆ మణులలో నక్షత్రములు తక్కువకాంతి గలవగుటచేఁ గనఁబడకపోఁగా, నవి కృత్రిమ మణులని వానిని దొలఁగఁద్రోయుదురు.

విశేషములు : హిమవత్పర్వతశిఖరములు నక్షత్రమండలమును దాఁటి యున్నవని భావము. సంబంధాతిశయోక్త్యలంకారము. మణిగణాన్వేషణులకుఁ దారాగణమునందు మణిభ్రాంతి కావున నలంకారము భ్రాంతిమంతము.

త్రోచుధాతువు. త్రోచు + లాట్టు-తద్ధర్మాదులందు లాట్టగు.' బాల. క్రియ. ౯. త్రోచు + లాట్టు.' లకారంబునకు దుఌవురునుముఌగు.' ప్రథమపురుష బహువ

---

[1] సా. పతి। సీవరించు,

చనమున - త్రోచు + రు. 'లాట్టు రుఙ్ఞు పరంబగునపుడు చుగాగమంబగు.' బాల. క్రియ. 22 త్రోచు + దు + రు. 'చువర్ణంబుతోడ దుగ్ధకారంబు తకారంబగు.' బాల. క్రియ. 108. త్రోతురు.

తే. సన్నుతంబుగ నా హిమవన్నగంబు
కాంచనాద్రీంద్రు మెచ్చదు కంపు లేని
కనకరుచి యేల యని చంపకప్రసూన
పరిమళాకీర్ణసౌవర్ణభాతి మిగిలి. 9

అర్థము: ఆ - హిమవత్ + నగంబు = ఆ హిమవత్పర్వతము, చంపక - ప్రసూన - పరిమళ + ఆకీర్ణ - సౌవర్ణ - భాతి = సంపఁగి పూలయొక్క, సువాస నతో, వ్యాపించిన, బంగరు, కాంతి, మిగిలి = అతిశయించి, సన్నుతంబుగన్ = పొగడఁబడినదిగా, బాగుగా. కంపు = పరిమళము, లేని, కనకరుచి = బంగరు కాంతి, ఏల = ఎందులకు, అని, కాంచన + అద్రి + ఇంద్రున్ = శ్రేష్ఠమగు బంగరు కొండ (మేరువు) ను. మెచ్చదు = ప్రశంపింపదు.

తాత్పర్యము: హిమవత్పర్వతమునఁ జంపక వృక్షములు గలవు. ఆ పూవుల పరిమళముతో వ్యాపించిన బంగరుకాంతి యతిశయించి అది పరిమళములేని వట్టి బంగరుకాంతి యెందులకని బంగరుకొండను (మేరువును) బాగుగా మెచ్చదు.

విశేషములు: మేరువు బంగరుకొండగావున బంగరుకాంతు లీనుచుండును. కాని దానికిఁ బరిమళ ముండదు. హిమవంతమున సంపఁగి వృక్షము లుండును. సంపఁగి వర్ణము బంగారువర్ణమును బోలియుండును, అంతేకాదు కాంచనశబ్దమునకు బంగార మనియే కాక సంపఁగి యనియు నర్థము గలదు. కావున, హిమవంతమునకు సంపఁగి తావితోపాటు బంగరుకాంతు లుండును. ఆ కారణముననే హిమవంతము సువాసనా రహితమగు వట్టి బంగరుకాంతిగలమేరువును మెచ్చ దనుట. 'కంపు' శబ్దము కావ్యము లలో సుగంధ మను నర్థమునను బ్రయుక్తమయినది. 'కంపు రూపుఁ దెలుపుఁ గలిగి యకంటక, భూరుహాదులందుఁ బుట్టె నట్టి, పుష్పముల .... భార, అను. 4.5. నేఁటి వాడుకలో మాత్రము దుర్గంధముననే పరిమితమయినది. హిమవంతము మేరువును

మెచ్చుమికి అది వాసనారహిత పగుట కారణముగాదు. కారణముకానిదానిని గారణముగాఁ జెప్పుటచే నలంకారము హేతూత్ప్రేక్ష.

తే. విలసి తోత్తుంగ శశికాంతశిలలఁ గదిసి
యరుగు శశిఁ గని శిల లెల్లఁ గరఁగి పెరిఁగి
తెరలి పఱతెంచు వఱ్ఱోడిఁ దేలి పాఱు
నుడుగణేశుండు వెండి పేరోడ వోలె. 10

అర్థము: విలసిత + ఉత్తుంగ - శశికాంత - శిలలన్ = ప్రకాశించినట్టియు, మిక్కిలి యెత్తయినట్టియుఁ జంద్రకాంతపుఱాలను, కదిసి = చేరి, అరుగు = పోవునట్టి, శశిన్ = చంద్రుని, కని = చూచి, శిలలు + ఎల్లన్ = చంద్రకాంతశిల లన్నియు, కరఁగి, పెరిఁగి = పెద్దదయి, తెరలి = పొంగి, పఱతెంచు = ప్రవహించునట్టి, వఱ్ఱోడిన్ = ప్రవాహమునందు, ఉడు - గణ + ఈశుండు = నక్షత్రముల సమూహమునకుఁ బ్రభువు — చంద్రుఁడు, వెండి - పేరు + ఓడ + పోలెన్ = వెండితో నిర్మితమైన పెద్దయోడవలె, తేలి - పాఱున్ = తేలి కొట్టుకొనిపోవును.

తాత్పర్యము: హిమవత్పర్వతముపైఁ జంద్రకాంతశిలలు గలవు. చంద్రుఁ డాకాశమునఁ బయనించుచు వానిని జేరెను. చంద్రునిఁ జూడఁగనే ఆ శిలలన్నియుఁ గరఁగి పెద్దయేఱుయి పొంగి పాఱుచుండెను. ఆ ప్రవాహమునఁ జంద్రుఁడు వెండితోఁ జేయఁబడిన పెద్దయోడవలెఁ దేలి కొట్టుకొనిపోవుచుండెను.

విశేషములు: చంద్రకాంతశిలలు హిమవంతమునఁ జంద్రమండలమును దాఁటియున్నవనుటచే సంబంధాతిశయోక్త్యలంకారము. ఉడుగణేశుఁడు వెండిపేరోడ వోలెఁదేలివాఱు - ఉపమవలె నున్నను ఉత్ప్రేక్షయనిచెప్పుటయే యుచితము. వఱ్ఱోడి, వఱ్ఱాడి, వఱ్ఱొడ్డి - రూపాంతరములు.

పేరోడ = పేరు + ఓడ, 'కర్మధారయంబునందుఁ జేర్వాదిశబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాషనగు. బాల. సంధి. 29. టుగాగమము రానిచో, ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధియగు. పేరోడ. టుగాగమముగుచో - పేరుటోడ.

తే. సలలితంబగు శశికాంత శిలల రుచులు,
నింద్ర నీలోపలద్యుతు లెనసి వెడలఁ
బక్షులెల్ల సితాసిత పక్షయుగళ
సహితమై చూడనొప్పు మాసములవోలె. 11

అర్థము : సలలితంబు + అగు = మనోహరమయిన. శశికాంత - శిలల = చంద్రకాంతపుఱాలయొక్క, రుచులున్ = కాంతులును. ఇంద్రనీల + ఉపల - ద్యుతులున్ = ఇంద్రనీలమణుల కాంతులును. ఎనసి = కూడుకొని. వెడలన్ = పైకివ్యాపింపఁగా. పక్షులు + ఎల్లన్ = పక్షులన్నియును. సిత + అసిత - పక్ష-యుగళ - సహితము + ఐ = తెల్లని,నల్లని. ఱెక్కలజంటతోఁగూడినవయి. మాసములు + పోలెన్ = నెలలవలె. చూడన్ + ఒప్పున్ = చూడఁదగియుండును.

తాత్పర్యము : హిమవంతమునఁ జంద్రకాంతశిలలును, ఇంద్రనీలమణులును - రెండునుగలవు. మనోహరములైన చంద్రకాంతశిలలకాంతులును, ఇంద్ర నీలమణుల కాంతులును గూడి వ్యాపింపఁగా, నచ్చటి పక్షులన్నియును దెల్లని నల్లని ఱెక్కల జంటలతోఁగూడి మాసములవలెఁ జూడనొప్పును.

విశేషములు : చంద్రకాంతశిలల కాంతులు తెల్లఁగను, ఇంద్రనీల మణుల కాంతులు నల్లగను నుండును. పక్షికి రెండు ఱెక్కలుండును. ఒక ఱెక్క చంద్ర కాంతశిలల కాంతులతోఁ దెల్లగను, రెండవది ఇంద్రనీల మణులకాంతులతో నల్లగను అయి, శుక్లపక్షము, కృష్ణపక్షమునను రెండుపక్షములుగల మాసమువలె నున్నవి. ఇట్లు ఒక్కొక్క పక్షి యొక్కొక్క మాసమువలెనుండును. పక్షము = ఱెక్క, పదునైదు దినముల కాలము. శ్లేషానుప్రాణితమైన ఉపమాలంకారము, యథాసంఖ్యము - శశి కాంత - ఇంద్రనీల - సితాసిత. శశికాంత శిలలరుచులచేఁ దెల్లగను, ఇంద్రనీల ద్యుతులచే నల్లగను బక్షములు మాఱెననుటచే నలంకారము తద్గుణము. 'తద్గుణ స్స్వగుణ త్యాగా దన్యదీయ గుణగ్రహః.' చన్ద్రా.

సలలితంబు .... రుచులు.' పక్షులు .... సహితము.' 'త్రిసమంబులగు విశేష ణంబులయు, మువర్ణకాంత విశేషణంబులయు బహువచనంబున కేకవచనంబు బహు ళంబుగా నగు' బాల, కారక. 20.

ఆ. నెగసి సుడిసి తావి మిగులుచుఁ దరులతా
కలిత పుష్ప రజము గాలిఁ దూలి
పొలుచు నగవిభునకుఁ బొంబట్టుచేల నా
కసము మేలుకట్టు గట్టినట్లు. 12

అ ర్థ ము : తరు - లతా - కలిత - పుష్ప - రజము = చెట్లయందును, తీఁగలయందును, ఉన్న, పుప్పొడి, గాలిన్ = గాలిచేత, తూలి = చలించి, నెగసి= పై కిలేచి, సుడిసి = వ్యాపించి, తావి = పరిమళము, మిగులుచున్ = అతిశ యించుచు, నగ-విభునకున్=పర్వతరాజునకు-హిమవంతునకు, ఆకసము=ఆకాశము, పొంబట్టు = (పొన్ను + పట్టు)- చేలన్ = బంగారు పట్టుబట్టతో, మేలుకట్టు = చాందినీ, కట్టిన + అట్లు = కట్టినవిధమున, పొలుచున్ = ఒప్పును.

తా త్ప ర్య ము : హిమవంతముమీఁది చెట్లయుఁ, దీఁగలయుఁ బుప్పొడి గాలిచేఁ జలించి, పై కెగిరి, వ్యాపించి, పరిమళ మతిశయించుచు, నా కొండలఱేనికి ఆకాశము బంగారుపట్టుబట్టతోఁ జాందినీ కట్టెనా యనునట్లు ఒప్పును.

వి శే ష ము లు: పుప్పొడి బంగరువన్నెగలదగుటచే 'పొంబట్టు చేలమేలుకట్టు' అనుట, అలంకార ముత్ప్రేక్ష.

పొంబట్టు - పొన్ను + పట్టు. 'సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చుమీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు.' పొ + పట్టు. బాల. సంధి. 36. లు ప్తశేషంబునకుం బరుషములు పరము లగునపుడు ముగాగమం బగు.' పొ+ ము + పట్టు. బాల. సంధి. 37. ద్రుతకార్యములు - బాల. సంధి. 16, 17. పొంబట్టు, చేలము (ప్రకృతి) - చేల (వికృతి)

తే. పాయక గిరితటముసన మేయుచుండు
నున్నత ద్విరదేంద్రంబు లొప్పుఁ జూడఁ
బర్వతాధీశుఁ దగుట నప్పర్వతంబు
బలసి కులగిరుల్ కొలువున్నభంగి పోలె. 13

అర్థము : పాయక = విడువక, గిరి - తటమునన్ + అ = కొండ చఱియయందే, మేయుచున్ + ఉండు, ఉన్నత - ద్విరద + ఇంద్రంబులు = ఎత్తయిన గజశ్రేష్ఠములు, పర్వత + అధి + ఈశుఁడు = పర్వతరాజు, అగుటన్ = అగుటచే, ఆ + పర్వతంబున్ = ఆ పర్వతమును, బలసి = పరివేష్టించి, కుల - గిరుల్ = కులపర్వతములు, కొలువు + ఉన్న - భంగి + పోలెన్ = కొలువున్నరీతివలె, చూడన్ + ఒప్పున్.

తాత్పర్యము: హిమవత్పర్వతపుఁ జఱియలందే విడువక మేయుచుండునట్టి యెత్తయిన గజేంద్రములు హిమవంతుఁడు పర్వతప్రభువగుటచే వానిని బరివేష్టించి కులపర్వతములు కొలువుదీర్చినవా యనునట్లు చూడనొప్పును.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష, ద్విరద - 'దన్తీ దన్తావళో హస్తీ ద్విరదో ఽనేకపో ద్విపః.' ద్వౌ రదౌ యస్య ద్విరదః, రెండు దంతములు గలది - ఏనుఁగు - అమరము.

సీ. సవిలాసగతిఁ గ్రాలు జంగమ లతలలో
నడపాడు సురగకన్యకల చెలువు,
వెలుఁగొందు మణిపుత్త్రికల గెడ విహరించు
వర నిధానాధిదేవతల చెన్ను,
సాను సంగత మేఘ సౌదామనులఁ గూడి
పొలసాడు ఖచరాంగనల బెడంగు,
మందార చందన నందన సంగతి
నెలసిన వనదేవతల నయంబు,

ఆ. మనసు లురులుకొల్ప మందనాంగానోక
హములఁ బొంది చూచు నమర సిద్ధ
చారణాది వర కుమారాంగ భూషణ
ద్యుతుల హిమనగేంద్ర మతిశయిల్లు.

అర్థము : స - విలాస - గతిన్ = ఒయ్యారముతోఁ గూడిన విధమున, క్రాలు = ఒప్పునట్టి, జంగమ - లతలలోన్ = చలించు తీఁగలలో, నడపాడు = సంచరించునట్టి, ఉరగ - కన్యకల - చెలువున్ = నాగకన్యల అందమును,

వెలుఁగొందు (వెలుగు + ఒందు) = ప్రకాశించునట్టి, మణి - పుత్రికల - కెడన్ = రత్నాలబొమ్మలప్రక్క, విహరించు = తిరుగునట్టి, వర - నిధాన + అధి దేవతల = శ్రేష్ఠములైన. నిధుల అధిష్ఠాన దేవతాస్త్రీలయొక్క, చెన్నున్ = అందమును,

సాను - సంగత - మేఘ - సౌదామనులన్ = చఱియలందుఁ గూడుకొన్న మేఘములందలి విద్యుల్లతలను, కూడి, పొలసాడు = సంచరించు, ఖచర + అంగ నల = ఖేచరస్త్రీల, బెడంగున్ = అందమును,

మందార - చందన - నందన - సంగతిన్ = మందారము, చందనము అను వానితోడి ఉద్యానవనముల కలయికచే, ఎలసిన = ఒప్పిన, వనదేవతల = వనదేవతల యొక్క, నయంబున్ = అందమును,

మనసులు = మనస్సులు, ఉరులుకొల్పన్ = వశపఱుచుకొనఁగా, మండన + అంగ + అనోకహములన్ = అలంకరణోపాయములైన చెట్లను పొంది, చూచు, అమర - సిద్ధ - చారణ + ఆది - వర - కుమార + అంగ - భూషణ - ద్యుతులన్ = దేవతలు, చారణులు, మున్నగు, శ్రేష్ఠులైన, యువకులయొక్క శరీరములందలి, అలంకారములయొక్క కాంతులతో, హిమ - నగ + ఇంద్రము = హిమవత్పర్వత శ్రేష్ఠము, అతిశయిలున్ = మించును,

తాత్పర్యము : విలాసముతో నొప్పు చలించు తీఁగలలో సంచరించు నాగ కన్యల యందమును, ప్రకాశించు రతనాల బొమ్మలప్రక్క విహరించు నిధ్యధిష్ఠాన దేవతాస్త్రీల యందమును, చఱియలనున్న మేఘములందలి విద్యుల్లతలతోఁగూడి సంచరించు ఖేచరస్త్రీల యందమును, మందారములు చందనవృక్షములు అనువానితోడి ఉద్యానముల సాంగత్యమునయున్న వనదేవతల యందమును, మనస్సులను వశపఱుచు కొనఁగా నలంకరణోపాయములైన వృక్షములపైనుండి చూచునట్టి అమరులు

సిద్ధులు, చారణులు మున్నగువారి యువకుల శరీరములందలి యలంకారముల కాంతులతో హిమవత్పర్వతరాజ మతిశయిల్లును.

విశేషములు : సౌదామని - 'తడిత్సౌదామనీ విద్యు చ్చఞ్చలా చపలా అపి.' సుదామ్నా ఐరావతేన సహ వర్తత ఇతి సౌదామనీ - సుదామ మనఁగా నైరావతము. దానితోఁగూడి యుండునది - మెఱుపు, అమరము. అనోకహము - అనోకహః కుట స్సాలః పలాశీ ద్రు ద్రు మాగమాః - అనసః శకటస్య అకం గమనం హన్తీతి అనోకహః. బండి గమనమును అఁపునది - చెట్టు, అమరము. మండనాంగానోకహములు - జైనసంప్రదాయమున భోగభూమియం దుండువారికిఁ గల్పవృక్షములు వలసిన పదార్థము లిచ్చుచుండునని ప్రసిద్ధి. వానిలో భూషణాంగవృక్ష మిట్లు వర్ణితము.

'తులాకోటిక కేయూర రుచకాంగద వేష్టకాన్
హారాన్ మకుటభేదాంశ్చ సువతే భూషణాంగకాః.'

ఈ సంప్రదాయము పంపాదికన్నడకవుల జైనకావ్యములలో వర్ణితము. వాని నుండియే నన్నెచోడుఁ డీ విషయమును గ్రహించియుండును.

చ. అరుదుగఁ జంద్రకాంతనిలయంబులలో విహరింతు రర్థిఁ దా
రరయఁగ నెల్లవారికి బయల్పడి తోఁపఁగ; నందు కొంద ఱ
చ్చెరువుగ నింద్రనీలరుచి చీఁకటిలో రమియింతు రొప్పు న
త్యురుతరలీలలతో బయల నుండియు నెవ్వరుఁ గానకుండఁగన్. 15

అర్థము : తారు = వారు, అరయఁగన్ = చూడఁగా, ఎల్లవారికిన్ = అందఱకును, బయల్పడి - తోఁపఁగన్ = బయలుపడికనఁబడునట్లు, అరుదుగన్ - ఆశ్చర్యకరముగా, చంద్రకాంత - నిలయంబులలోన్ = చంద్రకాంత గృహములలో, అర్థిన్ = కోరికతో, విహరింతురు = క్రీడింతురు, అందున్ + అ = అందే - ఆ హిమవత్పర్వతమునందే, కొందఱు, అచ్చెరువుగన్ = ఆశ్చర్యముగా, బయలన్ + ఉండియు = బయటనుండికూడ, ఎవ్వరున్, కానక + ఉండఁగన్ - చూడకుండు లాగున, ఒప్పు = ఒప్పునట్టి, అతి + ఉరుతర - లీలలతోన్ = మిక్కిలి గొప్పదియగు

విలాసముతో, ఇంద్రనీల - రుచి - చీఁకటిలోన్ = ఇంద్ర నీలమణులకాంతి యను చీఁకటిలో, రమియింతురు = సంభోగింతురు.

తాత్పర్యము : ఆ హిమవత్పర్వతమునందలి చలువఱాతియిండ్లలో నందఱు బయలుపడ కనఁబడునట్లు ఆశ్చర్యకరముగా వారు విహరింతురు. కొందఱు ఆ పర్వతమునందే బయలుపడియు నెవ్వరికిని గనఁబడకుండులాగున మిక్కిలి విలాసముతో నాశ్చర్యకరముగా నింద్రనీలమణుల నల్లనికాంతి యనెడి చీఁకటిలో సంభోగింతురు.

మ. సరసచ్ఛత్త్ర మహీరుహావళి నిజచ్ఛత్త్రాళిగా నొప్ప ఖే
చరరాజన్యులు బాల పల్లవ లసచ్ఛత్త్రావళిం బొల్చు నా
మరుఁ గ్రేడింతురు లీల జంగమలతామధ్యంబునం గ్రాలు త
ద్వరకాంతల్ వనలక్ష్మి చెన్నుఱరు నా వర్తింతు రం దిమ్ములన్. 16

అర్థము : ఖేచర - రాజన్యులు = గగనచరు లనెడి రాజులు, సరస + ఛత్త్ర - మహీరుహ + ఆవళి = అందమైన, ఎండనుండి కాపాడు, చెట్ల, వరుస, నిజ - ఛత్త్ర + ఆళి + కాన్ = తమ పైన రాజలాంఛనమగు గొడుగుల వరుసగా, ఒప్పన్ = ఒప్పఁగా, బాల - పల్లవ - లసత్ + ఛత్త్ర + ఆవళిన్ = లేఁజివురు లనెడి ప్రకాశించు గొడుగులవరుసతో, పొల్చు = ప్రకాశించునట్టి, ఆ - మరున్ = ఆ మన్మథుని, క్రేడింతురు = పరిహసింతురు, లీలన్ = విలాసముతో, జంగమ - లతా - మధ్యంబునన్ = చలించు తీఁగల నడుమ, క్రాలు = ఒప్పునట్టి, తద్ + వర - కాంతల్ = ఆ ఖేచరుల స్త్రీలు (భార్యలు,) వన - లక్ష్మి = వనమనెడి లక్ష్మియొక్క, చెన్ను = అందమును, ఉఱురు = లక్ష్యపెట్టరు, నాన్ = అనునట్లు, అందున్ = ఆ పర్వతమునందు, ఇమ్ములన్ = సుఖముగా. వర్తింతురు = ఉందురు.

తాత్పర్యము : ఆ హిమవత్పర్వతమునందు గగనచరు లనెడి రాజులు అందమైనట్టియు, ఎండనుండి కాపాడునట్టియు వృక్షముల వరుస తమగొడుగుల వరుసగా నొప్పుచుండఁగా లేఁజివురు లనెడి గొడుగుల వరుసతో నొప్పు నా మన్మథుని

1. సా. ప్రతి. వచు.

బరిహసింతురు. పలించు తీఁగలనడుమ విలాసముతో నొప్పు వారి ప్రియురాండ్రు వనలక్ష్మి యందమును లక్ష్యపెట్ట రనునట్లు సుఖముగా వర్తిల్లుదురు.

విశేషములు : ఖేచరు లనెడి రాజులకు ఎండనుండి కాపాడు చెల్లే రాజ చిహ్నమగు గొడుగులు. వానితో వారు లేఁజివురు లనెడి గొడుగులతో నొప్పు మన్మథుని లక్ష్యపెట్టరు. వారి ప్రియురాండ్రు సైతము విలాసమున వనలక్ష్మిని లక్ష్యపెట్టరు. అలంకారము రూపకము,ఉత్ప్రేక్ష.

మ. కలయం గిన్నరగీతిఁ గూడ మృదురేఖం బాడు మత్తాళిసం
కులముల్; కింపురుషాంగనాతతి యెలుంగుల్ వించు భావించి మా
ఱెలుఁగుల్ నింపుగ నిచ్చుఁ గోవిలలు; దేవేంద్రాంగనా మంజుభా
షలతోడం దగు మాఱుమాట లెలమిన్ సంధించుఁ జిల్కల్ మొగిన్. 17

అర్థము : మొగిన్ = ఉత్సాహముతో, మత్త + అళి - సంకులముల్ = మదించిన, తుమ్మెదల, గుంపులు, కలయన్ = అంతటను, కిన్నర - గీతిన్ = కిన్నరులపాటను, కూడన్ = కూడునట్లు, అనుసరించునట్లు, మృదు-రీతిన్ = మెత్తగా. పాడున్; కింపురుష + అంగనా - తతి = కింపురుషస్త్రీల సమూహముయొక్క, ఎలుంగుల్ = కంఠధ్వనులు, వించున్ = వినుచు, భావించి, కోవిలలు = కోకిలలు, మాఱు + ఎలుఁగుల్ = ప్రతిధ్వనులు, నింపుగన్ = నిండుగా, ఇచ్చున్; చిల్కల్ = చిలుకలు, దేవ + ఇంద్ర + అంగనా = దేవతాశ్రేష్ఠులయొక్క స్త్రీలయొక్క, మంజు = మనోహరమునైన, భాషలతోడన్ = వాక్కులతో, తగు = తగినట్టి, మాఱు - మాటలు = ప్రతివచనములు, ఎలమిన్ = సంతోషముతో, సంధించున్ = కూర్చును.

తాత్పర్యము : మదించిన తుమ్మెదల గుంపులు కిన్నరులపాట ననుస రించుచు మృదువుగాఁ బాడును. కోకిలలు కింపురుషస్త్రీల కంఠధ్వనులు విని

---

1. వా. ప్రతి. భావించు.

నిండుగాఁ బ్రతిధ్వనుల నిచ్చును. చిలుకలు దేవతాస్త్రీల మనోహరములైన వాక్కులకుఁ దగినరీతిని బ్రతిధ్వనులను బ్రీతితోఁ గూర్చును.

విశేషములు: వా. ప్రతి. లోని 'భావించు' అను పాఠముకంటె, సా. ప్రతిలోని 'భావించి' యను పాఠము అన్వయయోగ్యముగా నున్నది. కింపురుషాంగనాతతి యెలుంగులు, దేవేంద్రాంగనామంజుభాషలు అనునట్లే, కిన్నరాంగనల గీతి యని యున్నచో బాగుగా నుండెడిది. అప్పుడు కిన్నరీగీతి యని స్త్రీలింగశబ్ద ముండవలయును. కాని కిన్నరగీతి యని పుంలింగశబ్ద మున్నది. కోవిల - కోవెల శబ్దమే కాని 'కోవిల' శబ్దము నిఘంటువులఁ గానరాదు. కోవిలలు అనుదానికి బదులు కోవెలలు అనియున్నను ఛందోభంగము కాదుగదా! కోకిలము (ప్రకృతి) - కోయిల, కోవెల, కోగెల (వికృతులు.)

సీ. ఉరు తమః పటలంబు నుక్కఁప ట్టిది యని
    నెఱి నిరుల్గొను నింద్రనీల రుచులుఁ,
బున్నమ వెన్నెల ప్రోదిప ట్టిది యని
    కాంతంబు లగు శశికాంత రుచులు,
వెలుఁగొందు రేయెండ వీడుఁబ ట్టిదియని
    రాజితం బగు పద్మరాగరుచులుఁ,
గ్రొక్కారు మెఱుఁగుల యిక్కఁప ట్టిది యని
    తార ముక్తాఫల తరళ రుచులుఁ,

తే. భ్రమర మాఘవోద్యానంబు పసిమికెల్ల
నాటప ట్టిది యని గరుడాండరుచులు
మెచ్చి చూచుచు వేమఱుఁ బిచ్చలింతు
రమరకన్యక లతుల హిమాచలమున. 18

1. పా ప్రతి. హార.

అర్థము : అమర - కన్యకలు = దేవతాస్త్రీలు, అతుల - హిమాచలమునన్ = సాటిలేని హిమవత్పర్వతమునందు, ఇది = ఈ చోటు, ఉరు - తమస్(ః) + షట్టలంబు + ఉక్కిపట్టు = గొప్పదియగు చీఁకటిగుంపుయొక్క స్థావము, అని, నెఱిన్ = పూర్ణముగా, ఇరుల్ + కొను + ఇంద్రనీలరుచులున్ = చీఁకట్లను జేయు నింద్రనీలమణుల కాంతులును,

ఇది, పున్నమ - వెన్నెల - ప్రోదిపట్టు = పున్నమ వెన్నెలల పోషణస్థానము, అని, కొంతంబులు + అగు = మనోహరములయిన, శశికాంత - రుచులున్ = చంద్రకాంతశిలల కాంతులును,

ఇది, వెలుఁగొందు (వెలుఁగు + ఒందు) = ప్రకాశించునట్టి, రేయెండ = లేఁతయెండయొక్క, పీడుఁబట్టు = (పీడు + పట్టు) స్థానము, అని, రాజితంబు + అగు = ప్రకాశించునట్టి, పద్మరాగ - రుచులున్ = పద్మరాగమణుల కాంతులును,

ఇది, క్రొక్కారు (క్రొత్త + కారు) - మెఱుఁగుల - తొలకరిమెఱుపుల, ఇక్కపట్టు = స్థానము, అని, తార - ముక్తాఫల - తరళ - రుచులున్ = నిర్మలము లయిన, ముత్యములయొక్క, ప్రకాశించు కాంతులును,

ఇది, ప్రచుర - మాధవ + ఉద్యానంబు - పసిమికిన్ + ఎల్లన్ = అధిక మైన, వసంతోద్యానముయొక్క, పచ్చఁదనమువకంతకును, ఆటపట్టు = స్థానము, అని, గరుడాండ - రుచులున్ = గరుడపచ్చల కాంతులును,

మెచ్చి, చూచుచున్, వేమఱున్ = పలుమాఱులు, పిచ్చలింతురు = ఆనందింతురు.

తాత్పర్యము : గొప్పది యగు హిమవత్పర్వతమునందు దేవతాస్త్రీలు ఈ చోటు దట్టమైన చీఁకటిగుంపునకు స్థానమని నిండుగాఁ జీఁకట్లను జేయు నింద్రనీల మణుల కాంతులను, ఇది పున్నమివెన్నెలను బోషించు స్థానము అని మనోహరము లయిన చంద్రకాంతశిలల కాంతులను, ఇది ప్రకాశించు లేఁతయెండకు స్థానమని ప్రకాశించు పద్మరాగ మణుల కాంతులను, ఇది తొలకరిమెఱపులకు స్థానమని నిర్మలములైన ముత్యముల తళతళమను కాంతులను, ఇది అధికమైన వసంతో

ద్యానపుఁబచ్చదనమునకు స్థానమని గరుడపచ్చల కాంతులను ప్రశంసించి చూచుచు పలుమాఱు ఆనందింతురు.

విశేషములు: హిమవత్పర్వతమున నింద్రనీలమణులు, చంద్రకాంతశిలలు పద్మరాగమణులు, ముత్యములు, గరుడపచ్చలుగలవు గావున నందు వేర్వేఱుకాలము లలోనగు చీఁకట్లు, వెన్నెలలు, లేయెండ, తొలకరిమెఱపులు, పసిమి ఒకేకాలమునఁ గలుగుచున్నవి. కావుననే దేవతాకన్య లా యా చోటులను జూచి ప్రశంసింతు రనుట. ఇంద్రనీలమణులు నల్లనివి కావునఁ జీఁకట్ల నీనును, చంద్రకాంతశిలలు తెల్లగానుండును గావునఁ బున్నమవెన్నెలల నీనును. పద్మరాగమణుల కాంతులు ఎఱ్ఱగానుండి లేయెండ కాంతుల నీనును, ముత్యాలు తొలకరిమెఱపులవలెనే తళతళ కాంతులను వ్యాపింపఁ జేయును. గరుడపచ్చలు పచ్చనివై వసంతోద్యానపుఁబసిమిని బ్రసరింపఁజేయును. చేమఱు - ఒకమాఱు చూచిన వారికిఁ దృప్తి లేదు.

క్రొక్కారు - క్రొత్త + కారు, 'క్రొత్తశబ్దమున కాద్యక్షరశేషంబునకుం గొన్నియెడల మగాగమంబునుం గొన్నియెడల మీఁదిహల్లునకు ద్విత్వంబు నగు, బాల. సంధి. 38.

వ. అని వర్ణింపఁదగిన వర్ణనలం గడచి సకల గుణమణి గణంబులు నిజ ఘన మణి గణంబులతో బన్నసరంబులై వెలుంగ నజాండ కరండ పూరిత కర్పూర పాలీ శలాకయుం బోలెఁ దేజరిల్లు ప్రాలేయ కుత్కీల చక్రవర్తి నిఖిల స్త్రీ రత్నంబైన మేనక నిజాగ్రమహిషిఁగాఁ బరమసుఖలీలఁ బ్రవర్తిల్లుచుండు నంతఁ బరమేష్ఠి వరప్రసాదంబున. 19

అర్థము :- అని, వర్ణింపన్ + తగిన, వర్ణనలన్ = వర్ణనలను, కడచి = అతిక్రమించి, సకల - గుణ-మణి - గణంబులున్ = ఎల్ల గుణములునుగల మణుల సమూహములును- నిజ-ఘన-మణి- గణంబులతోన్ + తనవైన, గొప్పవియగు, మణుల, సమూహములతో, బన్నసరంబులు + ఐ = పలువిధములగు మణులు గ్రుచ్చిన హారములయి, వెలుంగన్ = ప్రకాశింపఁగా, అజాండ .... శలాకయుం

బోలెన్: అజాండ-కరండ = బ్రహ్మాండమనెడు బరిణెయందు, పూరిత = నిండిన, కర్పూర-పాలీ-శలాకయున్ + పోలెన్ = కప్పురపు బ్రోవునందలి చిన్నకట్టవలె, తేజరిల్లు = ప్రకాశించునట్టి, ప్రాలేయ - కుత్కీల - చక్రవర్తి = హిమవత్పర్వతరాజు, నిఖిల-స్త్రీ-రత్నంబు = ఎల్ల యింతులలో మణివంటిది - శ్రేష్ఠురాలు, ఐన, మేనక = మేనక, నిజ + అగ్ర-మహిషి + కాన్ = తనదైన పట్టపురాణిగా, పరమ-సుఖ-లీలన్ = మిక్కిలి సౌఖ్యముతోడి విలాసముతో, ప్రవర్తిల్లుచున్ + ఉండెన్, అంతన్, పరమేష్ఠి - వర - ప్రసాదంబునన్ + బ్రహ్మయొక్క వరమనెడి అనుగ్రహముచేత.

తాత్పర్యము ; అని వర్ణించుట కెన్ని వర్ణన లున్నవో అన్నిటిని అతిక్రమించి, ఎల్లగుణములును గల మణుల సమూహములు తన గొప్పవియగు మణుల సహాయముతో రకరకములమణులు గ్రుచ్చిన హారము లయి ప్రకాశింపఁగా, బ్రహ్మాండమనెడి బరిణెయందు నిండిన కప్పురపుఁ బ్రోవునందలి చిన్నపుడకవలె నొప్పునట్టి హిమవత్పర్వతప్రభువు ఎల్ల యింతులలో మణివంటిదైన మేనక తన పట్టపురాణిగా మిక్కిలిసౌఖ్యముతోఁ బ్రవర్తిల్లుచుండెను. అంత బ్రహ్మవరమున - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : అజాండ - కరండ - రూపకము. అజాండమనెడికరండము. అజాండకరండ .... శలాకయుంబోలె - ఉత్ప్రేక్ష - రూపకానుప్రాణితము. కాళిదాసు కుమారసంభవమున హిమవంతుని భార్య మేన యనియే కలదు. 'మేనాం మునీనా మపి మాననీయామ్,' కుమార 1.18. కాని యిందు మేనక యని కలదు. 1 . 18.

క. మేనకకు నా హిమాద్రికి
మైనాక నగంబు పుట్టె మణి కనక మయూ
ఖానూన భాస హాసిత
భానుద్యుతి. విదిత దివిజపతి గిరి పేర్మిన్. 20

అర్థము : మేనకకున్, ఆ హిమ + అద్రికిన్ = ఆ హిమవత్పర్వతమునకు, మణి .... ద్యుతి: మణి = రత్నములయు, కనక = బంగారమునుయొక్కయు,

మయూఖ = కిరణములచే, అనూన= తక్కువకాని, భాస =ప్రకాశముచేత, భాసిత= వెగటుచేయఁబడిన, భాను = సూర్యునియొక్క, ద్యుతి = కాంతిగలది, అయి, విదిత - దివిజ - పతి - గిరి - పేర్మిన్ = తెలియఁబడిన - ప్రసిద్ధమైన, ఇంద్రుని యొక్క కొండ - మేరువుయొక్క - గొప్పతనముతో, మైనాక - నగంబు = మైనాక మను పేరుగల కొండ, పుట్టెన్.

తాత్పర్యము : మేనకకును, ఆ హిమవంతునకును మణుల సువర్ణముల కిరణముల అధికమైన కాంతిచేఁ బరిహసింపఁబడిన సూర్యకాంతిగలదియై ప్రసిద్ధమైన మేరుపర్వతపు గొప్పతనముతో మైనాకపర్వతము పుట్టెను.

వ. ఇట్లుదయించిన మైనాక నగంబు కులిశి కులిశ పాత భీతిం బయోనిధి నిమగ్నం బైన నపగత పుత్త్రావలోకన సుఖతత్పరులై చింతించి. 21

అర్థము : ఇట్లు, ఉదయించిన = పుట్టిన, మైనాక పర్వతము, కులిశి - కులిశ - పాత - భీతిన్ = వజ్రి (ఇంద్రుని) యొక్క, వజ్రాయుధముయొక్క పాటువలని, భయముతో, పయోనిధి -నిమగ్నంబు=సముద్రమునందు మునిఁగినది,ఐనన్ = కాఁగా, అపగత-పుత్త్ర + అవలోకన-సుఖ-తత్పరులు + ఐ = పోయిన, కొడుకుయొక్క, చూచుటవలని సుఖమునం దాసక్తి గలవారయి, - కొడుకును జూచుటవలని సౌఖ్యము పోయి. అం దాసక్తి గలవారయి, చింతించి = దుఃఖించి.

తాత్పర్యము : ఇట్లు పుట్టిన మైనాకపర్వతము ఇంద్రుని వజ్రాయుధము పడునేమో యను భయమున సముద్రమున మునుఁగఁగా కొడుకు ముఖదర్శన సౌఖ్యము పోవుటచే నం దాసక్తి గలవారయి-తరువాత పద్యముతో నన్వయము.

విశేషములు : కులిశి = కులిశముగలవాఁడు-కులిశః అస్య అస్తి ఇతి కులిశీ-ఇంద్రుఁడు.

క. వారిరువురు సద్విధి శ
క్త్యారాధన సేసి రతిశయ స్థిరభక్తిం
గోరిక వదలక తమ కడు
పార సతీదేవి కూఁతురై జన్మింపన్. 22

అర్థము : వారు + ఇరువురున్ = ఆ మేనకాహిమవంతు లిద్దఱును, సత్ + విధిన్ = మంచి నియమముతో, అతిశయ-స్థిర-భక్తిన్ = మించిన, నిలుకడ గల భక్తితో, కోరిక, వదలక, తమ కడుపారన్ = తమ కడుపునిండుగా, సతీదేవి కూఁతురు + ఐ, జన్మింపన్ = పుట్టుటకు, శక్తి + ఆరాధన + చేసిరి = శక్తి యొక్క పూజ చేసిరి.

తాత్పర్యము : ఆ మేనకాహిమవంతు లిరువురును మిక్కిలి స్థిరమైన భక్తితోఁ, గోరికను వీడక, తమ కడుపునిండుగా సతీదేవి కూఁతురయి పుట్టునట్లు శక్తి నారాధించిరి.

వ. ఇట్లు పరమభక్తియుక్తి నారాధించినం గరుణించి నిజదేహ విదాహకరంబైన కోపానలంబునకుఁ బరమేశ్వరు వియోగానలంబునకు శిశిరోపచారంబు సేయందలంచినదియునుంబోలె హిమవంతంబునకుం జనుదెంచి దాక్షాయణి ప్రత్యక్షంబై వారి కోరిన వరంబు దయసేసి పరము దేహార్థంబు మెయిమెయిఁ గయికొనం దలంచి పరమపవిత్ర క్షేత్రంబైన మేనకాదేవి గర్భంబునం దవతరించె నంత మేనకకుఁ గ్రమక్రమంబున. 23

అర్థము : ఇట్లు, పరమ-భక్తి-యుక్తిన్ = గొప్పభక్తితోడి కూడికతో, ఆరాధించినన్ = పూజింపఁగా. కరుణించి = దయఁబూని నిజ-దేహ-విదాహ-కరంబు = తనదైన శరీరముయొక్క కాలుటను జేసినది. ఐన, కోప + అనలంబునకున్ + కోపమనెడి అగ్నికిని, పరమేశ్వరు = ఈశ్వరునియొక్క, వియోగ + అనలంబునకున్ = విరహమనెడి అగ్నికిని, శిశిర + ఉపచారంబు = చలువఁజేయు సేవ, చేయన్ + తలంచిన + అదియును + పోలెన్ = చేయఁ గోరినదా యనువట్లు. హిమవంతంబునకున్, చనుదెంచి = వచ్చి, దాక్షాయణి = సతి, ప్రత్యక్షంబు + ఐ = ఎదుటఁ దోఁచిన దయి, వారి-కోరిన = వారు కోరినట్టి వరంబును, దయ + చేసి = ప్రసాదించి. పరము = గొప్పవాఁడైన యీశ్వరుని యొక్క, దేహ + అర్థంబు = మేని సగము. మెయిమెయిన్ = అనాయాసముగా.

కయికొనన్ = తీసికొన, తలంచి = ఎంచి, పరమ-పవిత్రక్షేత్రంబు + ఐన = మిక్కిలి పావనమైన క్షేత్రము, ఐన = అయిన. మేనకా-దేవి-గర్భంబునన్ = మేనకాదేవియొక్క కడుపునందు, అవతరించెన్, అంతన్, మేనకయున్, క్రమక్రమంబునన్ = మెల్లమెల్లఁగా.

తాత్పర్యము : ఇట్లు గొప్పభక్తితో నారాధింపఁగా, దయఁబూని, తన శరీరమును గాల్చినట్టి కోపమనెడి అగ్నికిని, పరమేశ్వరుని విరహమనెడి అగ్నికిని శీతలోపచారము చేయ నెంచెనా యనుదానివలె సతి హిమవంతమున కరుదెంచి ప్రత్యక్షమయి వారు కోరిన వరము ననుగ్రహించి గొప్పవాఁడైన శివుని శరీరమునం దర్ధభాగము ననాయాసముగా స్వీకరింప నెంచి మిక్కిలి పావనమైన మేనకాదేవి గర్భమునందుఁ బ్రవేశించెను. అంత మేనకయుఁ గ్రమక్రమముగా- తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : నిజదేహ .... దలంచినదియుంబోలె - అలంకారము హేతూత్ప్రేక్ష.

ఆరాధింపన్-'భావవిశేషణ భావార్థక పూర్వవ్యవహిత తావ్యవహిత కర్తృపద ప్రతిపత్తిఁ దంతముగ యొక్కషష్ఠి యగు.' ప్రౌఢ. కారక. 15. 'యొక్కటి లోపంబు బహుళంబు' ప్రౌఢ. కారక 16, కోపానలము, వియోగానలము-రూపకములు.

ఉ. తోరము లయ్యెఁ జన్నుఁగవతోన తొడల్; తనుకాంతితోన తె
ల్లారె విలోకనంబులు; కుచాగ్రతలంబులతోన యారు గ
ప్పారెఁ; గచంబుతోన వళు లల్లన డిగ్గఁబడం దొడంగెఁ; శృం
గారముతోన బాల్పడరె గర్భవిలాసము మందహాసమున్. 24

అర్థము : తొడల్ = తొడలు, చన్నుఁగవ-(చన్ను+కవ)+తోన్+అ= చనుదోయితోపాటే, తోరములు + అయ్యెన్=స్థూలములయ్యెను; విలోకనంబులు= చూపులు, తను-కాంతి-తోన్ + అ=శరీరకాంతితోపాటే, తెల్లారెన్ (తెల్పు+ ఆరెన్) = తెల్లనయ్యెను, ఆరు = నూఁగారు, కుచ + అగ్ర-తలంబులతోన్ + అ = చన్నులమొనలతోపాటే, కప్పారెన్ (కప్పు + ఆరెన్) = నలుపెక్కెను.

వళులు = కడుపుమీఁది ముడుతలు, కచంబులోన్ + అ = రలవెంట్రుకలతోపాటే, అల్లనన్ = మెల్లఁగా, దిగ్గఁబడన్ + తొడంగెన్ = పోఁజొచ్చెను, గర్భ-విలాసమున్, = చూలుయొక్క అందమును, మంద-హాసమున్ = చిఱునగవును, శృంగారముతోన్ + అ = శృంగారముతోపాటే, పొల్పు + అడరెన్ = అంద పతిశయించెను.

తాత్పర్యము : గర్భవతియగు మేనకకుఁ దొడలు చనుదోయితోపాటే స్థూలము లయ్యెను. చూపులు మేనికాంతితోపాటే తెల్లనయ్యెను. నూఁగారు చనుమొనలతోపాటే నల్లనయ్యెను. కడుపుమీఁది ముడుతలు కేశములతోపాటే అడఁగఁజొచ్చెను. చూలు అందమును, చిఱునగవును శృంగారముతోపాటే 'అందగించెను.

విశేషములు : అలంకారము సహోక్తి. 'సహోక్తి స్సహభావశ్చే ద్భాసతే జనరఞ్జనః' దణ్డి.

ఉ. ఆ ధవళాయతాక్షి విషమాక్షు సదాశివు నిచ్చ మెచ్చ నా
రాధన సేయఁగోరు; నుడురాజశిఖామణిఁ జూడఁ దారభూ
మీధర మెక్కఁగోరు నెడ; మేనక మానక భక్తియుక్తి గం
గాధరుఁ గొల్వఁగోరు మది;గౌరి మనంబున కోర్కి గూడఁగాన్.25

అర్థము : గౌరి-మనంబున - కోర్కి = సతీదేవియొక్క మనస్సునందలి కోరిక, కూడఁగాన్ = కలియఁగా, ఆ-ధవళ + ఆయత + అక్షి = తెల్లనివియు, దీర్ఘములును అయిన కన్నులుగల ఆ మేనక, విషమ + అక్షున్ = బేసికంటివానిని (శివుని), సదాశివున్ = పరమేశ్వరుని, ఇచ్చన్ = మనస్సునందు, మెచ్చన్ = ప్రశంసింపఁగా, ఆరాధన + చేయన్ + కోరున్ = పూజింపఁగోరును; ఉడు-రాజశిఖా-మణిన్ నక్షత్రేశుఁడగు చంద్రుఁడు తలమానికముగాఁ గలవానిని-ఈశ్వరుని, చూడన్ = చూచుటకు, ఎడన్ = మనస్సునందు, తార-భూమీధరము = వెండికొండ-కైలాసమును, ఎక్కన్ + కోరున్ = ఎక్కఁగోరును, మేనక, మానక = వదలక, భక్తియుక్తిన్ = భక్తితోఁగూడినట్లు గంగా-ధరున్ = గంగనుధరించినవానిని-శివుని, కొల్వన్ + కోరున్ = సేవింపఁగోరును.

తాత్పర్యము : సతీదేవి మనస్సునందలి కోరిక ననుసరించి, ఆమెను గర్భమున ధరించిన మేనకయు శివుని నెచ్చుమెచ్చి యారాధింపను, శివునిఁ జూచుటకుఁ గైలాస మెక్కను, భక్తితో శివునిఁ గొలువను మనస్సునఁ గోరును.

విశేషములు : గర్భస్థశిశువు కోరికల కనుగుణముగాఁ దల్లికిఁగూడ నట్టి కోరికలే కలుగుట ప్రసిద్ధము. మనంబునకోర్కి. 'కొన్నియెడల సప్తమీతత్పురుషము నందు నపర్ణకంబు నగు.' ప్రౌ.సమాస. 37 37

సీ. తపసకొత్తు మిన్నేటి తరఁగలఁ గ్రమ్మ క్రొ
న్నురువులఁ గురులపై విరులఁ బెనుప,
మెఱుఁగుల గ్రిక్కొను కొఱనెలఁ గేతకి
దళములతో వేణి నెలపుకొలుపఁ,
జెలువొందు పులితోలుఁ జిత్రితాంబరవస్త్ర
కాంచిదామకముతోఁ గటి నమర్పఁ,
దలతల వెలుఁగు వే దలల రత్నము లొప్పు
నహినాథ మణిహారయష్టితోడఁ,

తే. గదియ సురమునం దెడఁ గోరు గర్భపంజ
రమున వసియించియును నిజ రమణుఁడైన
యీశు నర్ధాంగ మెక్కటి యెక్కనెత్తు
నగజ కోర్కులఁ బెనఁగి మేనకయు నెలమి. 26

అర్థము : గర్భ-పంజరమునన్ = మేనకా గర్భ మనెడి పంజరమునందు వసియించియును = ఉన్నను, నిజ-రమణుఁడు + ఐన = తన భర్త యగు, ఈశు + అర్ధ + అంగము = ఈశ్వరుని సగము శరీరము, ఎక్కటి = ఒక్కతెయే, ఎక్కన్ = ఎక్కుటకు, ఎత్తు = కోరునట్టి, అగజ - కోర్కులన్ = సతీదేవి కోరికలతో, పెనఁగి = కూడి, మేనకయున్ + మేనకకూడ, ఎలమిన్ = ప్రీతితో,

తళుకొత్తు = ప్రకాశించునట్టి, మిన్నేటి - తరఁగలన్ = ఆకాశముయొక్క అలలయందు, క్రమ్మి = వ్యాపించు, క్రొన్నురువులన్ (క్రొత్త + నురువులన్) = క్రొత్త నురుఁగులచే, కురులపైన్ = శిరోజములమీఁద. విరులన్ = పూవులను, పెనుపన్ = వృద్ధిపొందింపఁగను,

మెఱుఁగులన్ = కాంతులతో, క్రిక్కిఱిసు = నిండియుండు, కొలనెలన్ = చంద్రకళను, కేతకి - దలములతోన్ = మొగలి ఱేకులతో, వేణిన్ = జడయందు, నెలవుకొలుపన్ = పెట్టఁగను,

చెలువొందు(చెలువు + ఒందు) = ఒప్పునట్టి, పులితోలున్ = పులితోలును, చిత్రిత + అంబర - వస్త్ర - కాంచి దామకముతోన్ = చిత్రవర్ణములు గల వస్త్రము నందలి బంగారుమొలనూలితో, కటిన్ = మొలయందు, అమర్పన్ = ధరింపఁగను,

తలతల - వెలుఁగు = తళతళమని ప్రకాశించునట్టి, వేదలలన్ (వే+ తలలన్) = వేయి తలల (పడగల) యందు; రత్నములు, ఒప్పు = ఒప్పునట్టి, అహి - నాథున్ = సర్పరాజును - వాసుకిని, మణి - హార - యష్టితోడన్ = రత్నాల హారపుఁబేటతో, ఉరమునన్ = వక్షమునందు, కదియన్ = కూడఁగా - కూర్పఁగా ఎడన్ = మనస్సునందు, కోరున్.

తాత్పర్యము: మేనకా గర్భమనెడి పంజరమునం దుండియును దన భర్తయైన యీశ్వరుని సగముమేని నొకతెయే యాక్రమింపఁగోరు సతీదేవి కోరికల ననుసరించి మేనకయుఁ బ్రీతితో - నీశ్వరుని తలపైనుండు నాకాశగంగ యలలందు వ్యాపించు క్రొన్నురుఁగులచేఁ దన శిరోజములపైఁ బూవులను వృద్ధిపొందింపను, శివుని శిరస్సునందుఁగాంతులతో నిండియుండు చంద్రకళను మొగలిపూఱేకులతో జడయందు నిలుపఁగను, ఈశ్వరుని శరీరమున నొప్పు పులితోలును జిత్రవర్ణములుగల వస్త్రము నందలి బంగారుమొలనూలితో మొలయందుఁ దాల్పఁగను, శివుని అవయవములందుఁ దళతళ ప్రకాశించు వేయిపడగలమణులొప్పు వాసుకిని దన మణిహారపుఁబేటతో వక్షమున ధరింపను - గోరును.

విశేషములు: క్రొన్నురువులు - క్రొత్త + నురువులు. 'క్రొత్త శబ్దమున కాద్యక్షర శేషంబునకుం గొన్నియెడల నుగాగమంబునుం గొన్నియెడల మీఁదిహల్లునకు

ద్విత్వంబు నగు' బాల. సంధి. 38. గర్భ పంజరము - గర్భమనెడి పంజరము - రూపకము. ఈశు + అర్ధాంగము - 'షష్ఠీసమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు' బాల. సంధి. 34. ఈశునర్ధాంగము. ఎత్తు + అగజ = 'ఉదంతమగు తద్ధర్మార్థవిశేషణమున కచ్చు పరమగునప్పుడు నుగాగమంబగు.' బాల. సంధి. 33.

పార్వతి జననము.

క. తరుణ విధూదయమునకుం
బరిపూర్ణంబగు సుధాబ్ధి పరుసున నా సుం
దరికిఁ గ్రమంబున గర్భము
పరిపూర్ణం బయ్యె నిష్టఫలసంపదతోన్. 27

అర్థము : తరుణ - విధు + ఉదయమునకున్ = నిండుచంద్రుని పొడుపునకు, పరిపూర్ణంబు + అగు = నిండునట్టి - పొంగునట్టి, సుధా + అబ్ధి - పరుసునన్ = క్షీరసముద్రము విధమున. ఆ - సుందరికిన్ - ఆ అందగత్తెకు - మేనకకు, ఇష్ట - ఫల - సంపదతోన్ = కోరినఫలములనెడి సంపదతో, క్రమంబునన్ = కాల క్రమమున, గర్భము = చూలు, పరిపూర్ణంబు + అయ్యెన్ = నిండెను.

తాత్పర్యము : నిండుచంద్రుని పొడుపునకుఁ బరిపూర్ణమైన పాలసంద్రము విధమున మేనకకు పార్వతీజననరూపమైన ఇష్టఫలసంపదతోఁ గ్రమముగాఁ జూలు పరిపూర్ణ మయ్యెను.

విశేషములు : అలంకార ముపమ.

వ. తదవసరంబున శుభముహూర్తంబున. 28

అర్థతాత్పర్యములు : ఆ సమయమునందు శుభముహూర్తమున - తరువాతి పద్యములో నన్వయము.

సీ. వేళావనమునందు విలసిల్లు విద్రుమ
వల్లిక యుదయించు వడువు వోలెఁ
బూర్వదిక్సతి కతిస్ఫురణతో నుత సుధా
కర రేఖ యుదయించు కరణివోలెఁ,
ద్రిదివంబునందు సమ్మద మొందఁ గల్ప ల
తాంకుర ముదయించునట్లు వోలె,
దేవతానదికి శోభావహమ్ముగ హేమ
రాజీవ ముదయించు రమణ వోలె,

ఆ. వర విదూరభూమి[1] వై[2] దూర్య ముదయించు
తెఱఁగు వోలె దిశలు తేజరిల్ల
మానినీ లలామ మేనక కుదయించె
రాజవదన శైలరాజకన్య. 29

అర్థము : వేలా - వనమునందున్ = సముద్ర తీరమునందలి వనములో, విలసిల్లు = ప్రకాశించునట్టి విద్రుమ - వల్లిక = పవడపుఁదీఁగ, ఉదయించు - వడువు + పోలెన్ = పుట్టురీతివలెను,

పూర్వ - దిశ్ (క్) + సతికిన్ = తూర్పుదిక్కనెడి స్త్రీకి, అతి - స్ఫురణ తోన్ = మిక్కిలి, ప్రకాశముతో, నుత - సుధాకర - రేఖ= పొగడఁబడిన చంద్ర కళ, ఉదయించు - కరణి + పోలెన్ = పుట్టురీతివలెను,

త్రిదివంబునందున్ = స్వర్గమునందు, సమ్మదము + ఒందన్ = సంతోషము గలుగునట్లు, కల్ప - లతా + అంకురము=కల్పలతయొక్క మొలక, ఉదయించు+ అట్లు + పోలెన్,

1. వా.ప్రతి. దూ. 2. వా. ప్రతి.దూ.

దేవతా - నదికిన్ = ఆకాశగంగకు, శోభా + ఆవహమ్ముగన్ = ఒప్పు గలుగునట్లు, హేమ - రాజీవము = బంగరుతామర, ఉదయించు తెఱఁగు + పోలెన్ = పుట్టు విధమువలెను,

వర - విదూర - భూమిన్ = శ్రేష్ఠమైన విదూరపర్వతమునకుఁ జెంగటి భూమియందు, వైదూర్యము = వైదూర్యమనెడి రత్నము. ఉదయించు తెఱఁగు + పోలెన్ - పుట్టు విధమువలెను. దిశలు = దిక్కులు, తేజరిల్లన్ = ప్రకాశింపఁగా, మానినీ - లలామ - మేనకకున్ = శ్రేష్ఠురాలగు స్త్రీ యయిన మేనకకు, రాజ - వదన = చంద్రునివంటి ముఖముగలది యగు, శైల - రాజ - కన్య = పర్వతరాజగు హిమవత్పుత్రిక - పార్వతి, ఉదయించెన్ = పుట్టెను.

తాత్పర్యము : తీరోద్యానమునందుఁ బవడపుఁదీగ పుట్టునట్లును, తూర్పు దిక్కునెడు స్త్రీకి మిక్కిలి ప్రకాశముతోఁ జంద్రకళ పుట్టునట్లును, స్వర్గమునందు సంతోషమును గలిగించునట్లు కల్పలతిక మొలకపుట్టునట్లును, ఆకాశగంగకు శోభ గలిగించునట్లు బంగరుఁదామర పుట్టునట్లును, విదూరపర్వతప్రాంతభూమియందు వైదూర్య రత్నము పుట్టునట్లను స్త్రీరత్నమైన మేనకకుఁ జంద్రముఖి యగు పార్వతి పుట్టెను.

విశేషములు : అలంకార మువమ, ఉపమలు పెక్కులు గలవు కావున మాలోపమ, అన్నిచోట్లను ఇవార్థక శబ్దములపై మరల నివార్థక శబ్దములు గలవు, వడువు వోలె, కరణివోలె, అట్లువోలె, రమణవోలె, తెఱఁగువోలె - ఇది నన్నెచోడుని పద్ధతి. విద్రుమవల్లిక, సుధాకరరేఖ అనునుపమానములలో లింగసామ్యము గలదు. కాని కల్పలతాంకురము, హేమరాజీవము, వైదూర్యము అనువానిలో ఉపమేయమ్ములింగము (స్త్రీ) కంటె భేదించినవి. వరవిదూరభూమి వైదూర్య ముదయించు తెఱఁగు వోలె. ఇది కాళిదాసునను గలదు.

'తయా దుహిత్రా సుతరాం చకాసే స్ఫురత్ప్రభామణ్డలయా సవిత్రీ,
విదూరభూమి ర్నవమేఘశబ్దా దుద్భిన్నయా రత్నశలాక యేవ, కుమార. 1 - 24

విదూరపర్వతప్రాంతభూమియందు నవమేఘశబ్దమువలన రత్నము మొలచును.

మ. వివిధామోదవిమిశ్రితానిల మొగిన్ వీచెన్; మరుద్దుందుభుల్
డివిరెన్; ఘోరనఁ బుష్పవృష్టి గురిసెన్; దేవాంగనాగాన ము
త్సవలీలన్ వినిచెన్; సమస్తభువనోత్సాహంబు సంధిల్లె; ది
గ్వివరంబుల్ వెలిఁగెన్; నిధుల్ దెఱచె నుర్విం గౌరి జన్మించినన్. 30

అర్థము : ఉర్విన్ = భూమియందు, గౌరి = పార్వతి, జన్మించినన్ = పుట్టఁగా, వివిధ + ఆమోద - విమిశ్రిత + అనిలము = నానాప్రకారములైన పరిమళములతోఁ గూడిన వాయువు, ఒగిన్ = చక్కఁగా, వీచెన్: మరుత్ + దుందుభుల్ = దేవతలయొక్క భేరులు, తివిరెన్ = మ్రోసెను, ఘోరనన్ = ఘోరుమని - అధికముగా, పుష్ప - వృష్టి = పూలవాన, కురిసెన్, దేవ + అంగనా - గానము = దేవతాస్త్రీల గానము, ఉత్సవ లీలన్ = సానందముగా, వినిచెన్ = వినిపించెను, సమస్త - భువన + ఉత్సాహంబు = ఎల్ల లోకముల వేడుక, సంధిల్లెన్ = కలిగెను, దిశ్ (క్) + వివరంబుల్ = దిక్కులయొక్క రంధ్రములు. వెలిఁగెన్ = ప్రకాశించెను, నిధుల్, తెఱచెన్ = బయలుపడెను.

తాత్పర్యము: పార్వతి భూమియందు జన్మించినంతనే నానావిధములైన పరిమళములతోఁగూడిన వాయువు వీచెను. దేవతల భేరీనినాదము మ్రోసెను. పూలవాన ఘోరనఁ గురిసెను, దేవతాస్త్రీల గానము సానందముగా విననయ్యెను. ఎల్లలోకము లందును వేడుక గలిగెను, దిక్కుల తెఱపులు ప్రకాశించెను. నిధులు బయలుపడెను.

విశేషములు : పార్వతి పుట్టినప్పుడు గలిగిన శుభశకునము లిందు వివరింపఁబడినవి.

మరుత్ + దుందుభుల్ - ద్రుతమునకు హల్లు పరమగుచుండఁగాఁ ద్రుతేయు వర్ణాదేశము. దిశ్ + వివరంబుల్ - దిక్ + వివరంబుల్ - దిగ్వివరంబుల్.

కాళిదాసు కుమారసంభవమునఁ బార్వతి జన్మదిన మిట్లు వర్ణింపఁబడినది.
ప్రసన్నదిక్ పాంసువివిక్తవాతం శఙ్ఖస్వనానంతరపుష్పవృష్టి,
శరీరిణాం స్థావరజఙ్గమానాంసుఖాయ తజ్జన్మదినం బభూవ, 'కుమారసం 1, 23

వ. అంత హిమవంతుం డంతఃపురసహితం బనంత సంతోష రసాపూరి తాంతరంగుం డగుచు నిజోత్సవంబుతోన పురోత్సవంబు నొనర్చుచు, దీనానాథ విద్వజ్జనంబుల నపార వసు ధారాసారంబులం దేల్చుచు, నమందానందుం డగుచు నుండె; నంతం బార్వతి శరచ్చంద్రరేఖ యుంబోలె సకల జన నయనేందీవరానందకరంబై వెలుంగుచుం గ్రమక్రమంబున. 31

అర్థము: అంతన్, హిమవంతుండు, అంతఃపుర - సహితంబు = అంతిపురముతోఁగూడ, అనంత - సంతోష - రస + ఆపూరిత + అంత రంగుండు = అంతములేని సంతోషరసముతో బాగుగా నిండిన మనస్సుగలవాఁడు, అగుచున్, నిజ+ఉత్సవంబు+తోన్+అ = తన ఆనందముతోనే, పుర+ఉత్సవంబున్ = నగరమునఁ బండువును, ఒనర్చుచున్ = చేయుచు, దీన + అనాథ-విద్వస్(ద్)+జనంబులన్ = దీనులను, దిక్కులేనివారిని, పండితులైన జనులను, అపార-వసు-ధారా + ఆసారంబులన్ = అధికమైన ధనముయొక్క ప్రవాహములయొక్క జడులచే, తేల్చుచున్ = సంతోషపెట్టుచు, అమంద-ఆనందుండు = తక్కువకాని ఆనందము గలవాఁడు-అధికమైన ఆనందము గలవాఁడు, అగుచున్. ఉండెన్, అంతన్, పార్వతి, శరత్+చంద్ర-రేఖయున్+పోలెన్ = శరత్కాలమునందలి చంద్రకళవలె, సకల-జన-నయన+ఇందీవర+ఆనందకరంబు+ఐ = ఎల్ల జనులయొక్క కన్నులనెడి నల్లకలువలకు ఆనందమును గలిగించునదియై, వెలుంగుచున్ = ప్రకాశించుచు, క్రమక్రమంబునన్ = మెల్లమెల్లఁగా.

తాత్పర్యము: అంత హిమవంతుఁడు రాణివాసముతోఁగూడ కడలేని సంతోషరసముతో నిండిన మనస్సుగలవాఁ డగుచు, తన వేడుకతోపాటు నగరమునందును వేడుకచేయుచు, దీనులను, దిక్కుమాలినవారిని, విద్వాంసులను అధికధన ప్రవాహములచే నానందింపఁజేయుచు, అధికమైన ఆనందము గలవాఁ డగుచుండెను. అంతఁ బార్వతి శరత్కాల చంద్రకళవలె నెల్లజనుల కనుఁగలువలకు ఆనందమును గలిగించునదియై ప్రకాశించుచుఁ గ్రమక్రమమున- తరువాతి పద్యముతో నన్వయము.

విశేషము లు: అంత హిమవంతుం డంతఃపుర .... డగుచు- పూర్ణబిందుపూర్వకతకార పునఃపునరావృత్తిచే వనుప్రాసాలంకారము, సంతోషసూచకము,

విద్వస్+జనంబులు = 'క్వసంతశబ్దములకు అసర్వనామ హలాదిప్రత్యయములు పరములగునపుడును, నపుంసకలింగమునందు ప్రథమైకవచనప్రత్యయము పరమగునపుడును సకారమునకు దకారాదేశమగును. విద్వద్ + జనంబులు-సకార తవర్గములకు శవర్గ చవర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్గ చవర్గవర్ణము లాదేశ మగును-విద్వజ్జనంబులు, శరచ్చంద్ర-శరత్+చంద్ర, పయి సూత్రమే. పార్వతి శరచ్చంద్రరేఖయుంబోలె - ఉపమాలంకారము. నయనేందీవర - నయనములనెడి ఇందీవరములు - రూపకము. చంద్రుఁడు కలువల కానందమును గలిగించును.

సీ. పరమేశు మన ముద్దపరి ముట్టి సాధింప
నెత్తిన గతిఁ దల యెత్తఁ దొడఁగె,
హారు నూరుపీఠంబునం దుండు వెర విట్టి
దను గతిఁ గూర్చుండు ననువు వడసె,
నొక ధాత్రి తనుఁ దాల్ప నోప దన్ గతి ధాత్రి
పై నిజధాత్రి చే పట్టి నిలిచెఁ,
గలహంస కుల మంద గమనంబు నయ మిట్టి
దని చూపు గతి నడపాడఁ దొడఁగె,

ఆ. రాజకీరములకు రసవంతముగఁ బల్కు
మెలపు దెలుపు కరణిఁ బలుకఁ గఱచె,
హిమనగేంద్రు నింట నీడితైశ్వర్యంబు
పెరుఁగునట్టు లగజ పెరుఁగఁదొడఁగె. 32

అర్థము. అగజ=పార్వతి, పరమేశు-మనము = పరమేశ్వరుని మనసును ఉద్దపరి = మిక్కిలి, ముట్టి = తాఁకి, సాధింపన్ = సాధించుటకు. ఎత్తిన-గతిన్ = ఎత్తిన విధమున. తల, ఎత్తన్ + తొడఁగెన్ = ఎత్త నారంభించెను.

హర + ఊరు-పీఠంబునందున్ = ఈశ్వరుని తొడ యనెడి పీఠమునందు. ఉంతు, వెరవు = ఉపాయము, ఇట్టిది. అను-గతిన్=అనువిధమున, కూర్చుండు+ అనువు = కూర్చుండునట్టి రీతి, పడసెన్ = పొందెను.

ఒక-ధాత్రి = ఒకభూమి-ఒకతల్లి యని యర్థాంతరము, తనున్ = తన్ను, తాల్పన్ = తాల్చుటకు. ఓపదు = చాలదు, అన్ + గతిన్ = అను విధమున, ధాత్రిపైన్ = భూమిమీఁద, నిజ-ధాత్రి = తన దాది, చే పట్టి = చేయిపట్టు కొని, నిలిచెన్.

కలహంస-కుల-మంద-గమనంబు - నయము = రాయంచల గుంపుయొక్క మెల్లని, నడకయొక్క, విధము, ఇట్టిది + అని - చూపు-గతిన్ = ఈ రీతిది అని చూపు విధమున, నడవాడన్ + తొడఁగెన్ = నడవ నారంభించెను.

రాజ - కీరములకున్ = రాచిలుకలకు, రసవంతముగన్ = సరసముగా, పల్కు-మెలపు = పలుకునట్టి నేర్పు, తెలుపు-కరణిన్=తెలుపువిధమున, పలుకన్ + కఱచెన్ = పలుక నేర్చెను.

హిమ-నగ + ఇంద్రు + ఇంటన్ = హిమవత్పర్వతరాజు నింటియందు, ఈడిత+ఐశ్వర్యంబు = పొగడఁబడిన సంపద, పెరుఁగు+అట్టులు = వృద్ధిపొందు విధమున, అగజ=పార్వతి, పెరుఁగన్+తొడఁగెన్ = పెద్దది కాఁజొచ్చెను.

తాత్పర్యము : పార్వతి పరమేశ్వరుని మనస్సును మిక్కిలి గ్రహించి సాధించుట కైనా యనునట్లు తల యెత్తఁదొడఁగెను. ఈశ్వరుని తొడపై నుండు విధ మిది యని తెలుపుటకా యనునట్లు ఆమె కూర్చుండు రీతిని గాంచెను, ఒక తల్లి తన్ను వహింపలే దను విధమున నామె ధాత్రిపైఁ దన దాదిచేయి పట్టుకొని నిలిచెను. రాయంచల మందగమనము రీతి యిట్లుండు నని చూపుటకో యన నామె నడవఁ దొడఁగెను. రాచిలుకలకు సరసముగాఁ బలుకు నేర్పును దెలుపుటకా యనునట్లు ఆమె పలుకనేర్చెను. హిమవత్పర్వతరాజు నింట నైశ్వర్యము పెరుఁగునట్లు ఆమె పెద్దది కాఁజొచ్చెను.

విశేషములు :- పద్యమునందలి ప్రతిపాదమునను హేత్వుత్ప్రేక్షాలంకారముగలదు, ఒకధాత్రి యనుచో శ్లేషము.

కూర్చుండు+అనువు- 'ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరంబగు నపుడు నుగాగమం బగు.' బాల. సంధి. 33. కూర్చుండు ననువు. అన్‌గతి-అను+గతి-'అను, కొను లోనగు ధాతుజవిశేషణముల యంత్యాకారమునకు హల్లు పరంబగు నపుడు లోపంబు వైకల్పికంబు.' ప్రౌఢ. సంధి. 13. చే-చేయి రూపాంతరము హిమనగేంద్రు+ఇంట-'షష్ఠీసమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' బాల. సంధి. 34. హిమనగేంద్రునింట. ఈడిత+ఐశ్వర్యంబు= వృద్ధి సంధి. అ ఆలకు ఏ ఐలు పరము లగునపుడు ఐకారమును, ఓ ఔలు పరము లగునపుడు ఔకారమును ఏకాదేశమగును. ఈడితైశ్వర్యంబు-

మ. స్ఫురదాలోకన దీప్తు లంగణములం బొల్పొందఁగాఁ జూచుచున్.
దరహాసద్యుతు లాననాంబుజముపైఁ దళ్కొత్తఁగా నవ్వుచున్.
చరణాంభోరుహరాగదీధితు లిలన్ సంధిల్లఁ దట్టాడు న
గ్గిరిరాజాత్మజ తల్లిదండ్రు లనురాగిల్లన్ మదిన్ దాదితోన్. 33

అర్థము : ఆ+గిరి-రాజ+ఆత్మజ = ఆ కొండలఱేని కూఁతురు-పార్వతి, తల్లిదండ్రులు = జననీజనకులు-మేనకా హిమవంతులు, మదిన్ = మనస్సునందు, అనురాగిల్లన్ = అనురాగము నొందఁగా, దాదితోన్, స్ఫురత్+ఆలోకన-దీప్తులు = ప్రకాశించుచున్న, చూపుల, కాంతులు, అంగణములన్ = చుట్టుపట్టుల ప్రదేశములందు పొల్పు+ఒందఁగాన్ = ఒప్పునట్లుగా, చూచుచున్, దర-హాస-ద్యుతులు = చిఱునవ్వుకాంతులు, ఆనన+అంబుజముపైన్ = ముఖపద్మముమీఁద, తళ్కొత్తఁగాన్ = ప్రకాశింపఁగా, నవ్వుచున్, చరణ+అంభోరుహ-రాగ-దీధితులు = పాదపద్మముల యెఱ్ఱని కాంతులు, ఇలన్ = నేలపై, సంధిల్లన్ = ఏర్పడఁగా, తట్టాడున్ = తప్పటడుగులు వేయుచు నడచును.

తాత్పర్యము : ఆ కొండలఱేనికూఁతురు తల్లిదండ్రులు మనస్సున ననురాగము నొందఁగా దాదితోఁ బ్రకాశించు చూపులకాంతులతో నంగణముల నొప్పంగాఁ

జూచుచు, చిఱునవ్వుకాంతులు ముఖపద్మముపైఁ బ్రకాశింపఁగా నవ్వుచు, పాదపద్మముల యెఱ్ఱని కాంతులు నేలపైఁ బర్వఁగాఁ దప్పటడుగులు వేయుచు నడుచును,

విశేషములు: తల్లి-తండ్రి- 'ద్వంద్వంబునం బరంబుపయి పరుషములకు గసడదవ లగు' తల్లిదండ్రులు, బాల, సం, 15, అనురాగిల్లన్ - 'రంజాదుల యించుక్ప్రకారంబునకు సబిందుకంబున కప్రేరణంబున ద్విరుక్తలకారం బగు' బాల, క్రియ, 71, అనురాగ + ఇంచు = అనురాగ + ఇల్లు, అపదాదిస్వర సంధి, (బాల, సంధి, 12)చే అనురాగిల్లు, 'తుమర్థ భావలక్షణంబులందు నుఱి యగు' బాల-క్రియ,40 అనురాగిల్లు+నుఱి, 'జీత్తు పరంబగునపు డుత్వంబున కత్వం బగు.' బాల,క్రియ,20 అనురాగిల్లన్. అగ్గిరిరాజాత్మజ, ఆ+గిరిరాజాత్మజ,' త్రికంబుమీఁది యసంయుక్తహల్లునకు ద్విత్వంబు బహుళంగా నగు,' బాల, సమాస, 14 ఆ+గ్గిరిరాజాత్మజ, 'ద్విరుక్తం బగు హల్లు పరంబగునపు డాచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు' బాల, సమాస, 13. అగ్గిరిరాజాత్మజ.

క. గిరిసుత తొలుపలుకుల సు
స్వర మొదవఁగ 'నోం నమశ్శివాయ స దాస్మ
ద్వరదాయ నమః శంకర
శరణు మహాదేవ నీవ శరణ'నఁ జొచ్చెన్. 54

అర్థము: గిరి-సుత=కొండకూఁతురు- పార్వతి, తొలు-పలుకులన్=మొదటి మాటలతో - చిన్ననాఁటిమాటలతో, సు-స్వరము = మంచి యెలుఁగు, ఒదవఁగన్+ కలుగఁగా, ఓం నమః + శివాయ = శివునకు నమస్కారము అను పంచాక్షరీ మంత్రమును, సదా = ఎల్లప్పుడును, అస్మద్+వరదాయ=నా వరదునకును, నమః= నమస్కారము, శంకర, శరణు, మహాదేవ, నీవు+అ = నీవే, శరణు, అనన్+ చొచ్చెన్=అనఁ దొడఁగెను.

తాత్పర్యము: పార్వతి శైశవమునందలి పలుకులతో మంచి కంఠధ్వని కలుగఁగా ఓం నమ శ్శివాయ - అస్మద్వరదాయ సదా నమః' అనియు, శంకరా! శరణు. మహాదేవా! నీవే శరణు' అనియుఁ బలుక నారంభించెను.

విశేషములు : 'ఓం నమశ్శివాయ' 'సదాసమ్మదృశదాయ నమః' అను, రెండును సంస్కృతవాక్యములు, ఈ రెండును వ్యస్తముగా నున్న 'అనన్' అను దానితో ననుకరింపఁబడినవి, శంకర! శరణు. మహాదేవ! శివ శరణు' అనునవి తెలుఁగువాక్యములే. 'నమశ్శివాయ' అనునది శివపంచాక్షరీమంత్రము, 'ఓం'తోఁ గూడు కొన్నది కావున షడక్షరి యగును.

వ. మఱియు శైశవ క్రీడా వినోదంబులయందు. 35

అర్థము : మఱియున్, శైశవ-క్రీడా-వినోదంబుల+అందున్ = బాల్యమునందలి ఆటల వేడుకలందు,

తాత్పర్యము : మఱియును బాల్యక్రీడలందలి వేడుకలందు-రఘువాతి పద్యముతో నన్వయము,

చ. తరుణులు చిల్కబొమ్మలును దంతపుబొమ్మలు మేలిగాజు బ
న్నరులును గ్రామని చొప్పికలు నల్గడ నోలిన పేర్చి లీల చే
కుర బొమరిండ్లఁ జేయనగు కూళ్లును వండుచు బొమ్మపెండ్లి మా
సరముగఁ జేసి యాడ నగజాత శివార్చన సేయు నయ్యెడన్. 36

అర్థము : తరుణులు = స్త్రీలు-చెలికత్తెలు, చిల్క-బొమ్మలును = చిలుకల బొమ్మలును, దంతపుబొమ్మలున్ = దంతములతోఁ జేసిన బొమ్మలును, మేలి-గాజు-బన్నరులును = మంచి గాజుతోఁ జేసిన బన్నసరులును-పలువిధములగు మణులు గ్రుచ్చిన హారములును, గ్రామని-చొప్పికలున్ = కొయ్య బొమ్మలును, నల్గడన్ = నాలుగు వైపులను, ఓలిన్+అ = వరుసగా, పేర్చి = అమర్చి, లీల = అందము, చేకురన్ = కలుగఁగా బొమరిండ్లన్ = బొమ్మరిండ్లయందు, చేయన్+అగు = చేయనగు, కూళ్ళును = కూడులును, వండుచున్, బొమ్మ-పెండ్లి = బొమ్మల పెండ్లి, మాసరముగన్ = అధికముగా, చేసి, ఆడన్, నగ-జాత = కొండ కూఁతురు-పార్వతి, అయ్యెడన్. (ఆ+ఎడన్) = ఆ సమయమున, శివ+అర్చన = శివుని పూజ, చేయున్.

తాత్పర్యము ; పార్వతి చెలికత్తెలు చిలుకలబొమ్మలును, దంతపు బొమ్మలును, మేలి గాజుపూసలు గ్రుచ్చిన హారములును, కొయ్యబొమ్మలును

నాలుగు వైపుల నందముగా నమర్చి బొమ్మరిండ్లలోఁ జేయు కూడులు వండుచు బొమ్మలపెండ్లిండ్లు విశేషముగాఁ జేసియాడఁగాఁ, బార్వతి యా సమయమున శివ పూజఁ జేయును.

విశేషములు ; దంతపుబొమ్మ - దంతము+బొమ్మ-'కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపు లగు' బాల, సంధి. 32. నల్గడ-నలుగడ-'పదాంతంబులయి యసంయుక్తంబులయిన ను లు రు ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు' బాల. ప్రకీర్ణ, 16. నలు+కడలు- 'ద్విగువున కేకవచనంబు ప్రాయికంబుగా నగు మిశ్రంబునకుఁ గాదు,' బాల, సమాస. 18. అ+ఎడ-యడాగమము- బాల. సంధి. 3 అ+మొద-త్రికసంధి, బాల. సమాస, 14, 13 అ+య్యెడ=అయ్యెడ.

వ. ఆ సుకుమారి కౌమారంబునందు. 37

అర్థ తాత్పర్యములు: ఆ-సుకుమారి=ఆ అందమైన స్త్రీ-పార్వతి, కౌమారంబునందున్=బాల్యమునందు-ఆ సుకుమారి యగు పార్వతి బాల్యమునందు-తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు :- కౌమారము-అయిదేండ్లవఱకు నుండు వయస్సు. మూఁడు మొదలెనిమిదేండ్లవఱకు నుండు వయస్సని కొందఱును, పదునాఱు వత్సరములవఱకు నుండు వయస్సని కొందఱును,ముప్పదేండ్లవఱకు నుండు వయస్సని మఱికొందఱును.

సీ. హరు మ్రోల నద్భక్తి నాడుచోటన నాట్య
విషయమ్ము లన్నియు వెలయఁ గఱచె,
లీల నీశ్వరు నంకమాలిక ల్పాడుచో
గీతభేదంబుల రీతు లెఱిఁగె,
శివురూపు పల్మఱుఁ జిత్రించి చూచుచో,
వినుతంబుగాఁ జిత్రవిద్య వడసె,
శశిమౌళిఁ జిత్రపూజలు సేయుచోటఁ బ
త్రచ్ఛేద కుసుమబంధములు నేర్చె,

ఆ. మఱియు నఖిలలోకమాన్యంబు లగు విద్య
లెల్ల నివ్విధమున నెసకమెసఁగ
నభ్యసించె నీశ్వరార్చనా బలమున
హరుఁడు గురుఁడు గాఁగ నగతనూజ, 38.

అర్థము : అగ - తనూజ = కొండ కూఁతురు - పార్వతి, హరుఁడు = ఈశ్వరుఁడు, గురుఁడు, కాఁగన్, ఈశ్వర + అర్చనా - బలమునన్ = శివపూజ వలని బలముచేత,

హర - మ్రోలన్ = శివుని సమక్షమున, సత్ + భక్తిన్ = మంచి భక్తితో, ఆడు - చోటన్ + అ = ఆడుచోటనే, నాట్య - విషయమ్ములు = నాట్యమునకు సంబంధించిన సంగతులు, అన్నియున్, వెలయన్ = ప్రకటముగా, కఱచెన్ = నేర్చెను.

లీలన్ = అందముగా, ఈశ్వరు + అంకమాలికల్ = శివస్తోత్రములు, పాడు చోన్ = పాడునప్పుడు, గీత-భేదంబుల - రీతులు = వివిధగీతముల ప్రకారములు, ఎఱిఁగెన్ = నేర్చెను.

శివు - రూపు = శివుని యాకారము, పల్మఱున్ = పలుసారులు, చిత్రించి= వ్రాసి, చూచుచోన్ = చూచునప్పుడు, వినుతంబుగాన్ = పొగడఁబడినదిగా, చిత్ర-విద్య = చిత్రలేఖన, విద్య, పడసెన్ = పొందెను.

శశి - మౌళిన్ = చంద్రుఁడు శిరమునఁ గలవానిని - శివుని, చిత్ర - పూజలు = చిత్రవర్ణములపూలతోఁ జేయు పూజలు, చేయుచోటన్, పత్ర + ఛేద - కుసుమ - బంధములు = ఆకులముక్కలతోను, పూలతోను మాలలు కట్టుటలు, నేర్చెన్.

మఱియున్, ఈ + విధమునన్, అఖిల - లోక-మాన్యంబులు = ఎల్లలోకము లందును ఆదరింపఁదగినవి, అగు, విద్యలు + ఎల్లన్ = విద్య లన్నియు, ఎసక మెసఁగన్ - ఎసకము + ఎసఁగన్ = ఒప్పుగా, అభ్యసించెన్ = నేర్చెను.

తాత్పర్యము : పార్వతి, శివుఁడు గురువుగా, శివపూజాబలమున, శివుని యెదుట నృత్తమాడుచోటనే నాట్యసంబంధివిషయము లన్నియు నేర్చెను. శివస్తోత్రములు చక్కఁగాఁ బాడుచో గీతభేదములు రీతు లెఱిఁగెను. శివుని రూపును బలుమాఱులు లిఖించి చూచుచోఁ జిత్రలేఖనవిద్యను జక్కఁగా నేర్చెను. శివునిఁ జిత్రవర్ణముల పూలచేఁ బూజించుచోఁ బత్రఖండములతోను, పూలతోను మాలలు గ్రుచ్చుట నేర్చెను. ఇంకను నీ రీతిగా నామె లోకములందెల్ల నాదరింపఁదగు విద్యల నెల్లఁ జక్కఁగా నభ్యసించెను.

విశేషములు : ఈశ్వర + అంకమాలికల్ - 'షష్ఠీసమాసమునం దుకార ఋకారములకు నచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' బాల. సంధి. 34 మాలికల్ + కూడుచో- 'ప్రథమమీఁది పరుషములకు గసడదవలు బహుళముగా నగు.' బాల. సంధి. 13. మాలికల్గూడుచో. పత్ర + ఛేద - పత్త్రచ్ఛేద – హ్రస్వమునకుఁ బరమైన ఛకారము ద్విరుక్తమగును. ఇవ్విధమున – ఈ + విధమున – త్రికసంధి, బాల. సమాస, 14, ఈ + వ్విధమున. బాల. సమాస, 13. ఇవ్విధమున,

వ. మఱియుం గౌమారానంతరంబున లేఁదీఁగెకు మవ్వం బెక్కినట్లు, పువ్వునకుఁ దావి పొందినట్లు, చిత్రరూపంబునకు మెఱుంగెక్కిన విధంబున నిఖిల జన మనోఽభిరామం బగుచు. 39

అర్థము : మఱియున్, కౌమార + అనంతరంబునన్ = కౌమారదశ తరువాత, లేఁదీఁగెకున్ (లేఁత + తీఁగెకున్), మవ్వంబు = మృదుత్వము, ఎక్కు + అట్లు = కలుగువిధమున, పువ్వునకున్, తావి = వాసన, పొందు + అట్లున్ = కల్గుగు విధమున, చిత్ర - రూపంబునకున్ = చిత్తరువునందలి యాకారమునకు, మెఱుంగు = కాంతి, ఎక్కు - విధంబునన్, నిఖిల - జన - మనస్ (ః) + అభిరామంబు = ఎల్ల జనుల మనస్సులకు మనోహరము, అగుచున్,

తాత్పర్యము: మఱియును గౌమారదశ దాఁటిన పిమ్మట, లేఁతతీఁగకుఁ గోమలత్వము గలుగునట్లును, పువ్వునకుఁ బరిమళ మబ్బునట్లును, జిత్రగతరూపమునకుఁ గాంతి కలుగునట్లును నెల్లజనుల మనస్సులకును బ్రీతిగా. తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : అలంకారము మాలోపమ. ఈ సందర్భమునఁ గాళిదాసు కుమారసంభవశ్లోకము అరయఁదగినది. 'అసంభృతం మణ్డన మఙ్గయష్టే రనాసవాఖ్యం కరణం మదస్య, కామస్య పుష్పవ్యతిరిక్త మస్త్రం బాల్యాత్పరం సాథ వయః ప్రపేదే. కుమార, 1 - 31

మనోఽభిరామము - మనస్ + అభిరామము, సకారమునకు విసర్గాదేశము - మనః + అభిరామము - హ్రస్వ అకారముతరువాత వచ్చు విసర్గమునకు హ్రస్వ అకారముకాని, మృదుహల్లులు (హళ్ళులు) కాని పరము లగునపుడు 'ఉ' ఆదేశముగా వచ్చి పూర్వమందున్న అకారముతోఁగూడి గుణసంధియై ఓ గా మాఱును. మన + ఉ + అభిరామము - మనోఽభిరామము, లేఁదీఁగె - లేఁత + తీఁగె - ప్రాఁతాదిసంధి, బాల. సంధి, 37, 16, 17. 'నిఖిలజనమనోఽభిరామ' యగుచు అని యుండుట లెస్స.

చ. మలఁపఁగనున్న కల్పలత, మన్మథు నారి నమర్పనున్న కో
మలతర పుష్పబాణ, మహిమద్యుతిఁ జూడఁగనున్న పద్మకు
ట్మల, మలరంగనున్న మధుమంజరి నా మదజృంభితాంగ దో
హల రుచి నొప్పె గౌరి నవయౌవనసంగమలీల డాయఁగాన్. 40

అర్థము : గౌరి = పార్వతి, నవ - యౌవన - సంగమ - లీల = నూత్న యౌవనము యొక్క కూడికవలని విలాసము, డాయఁగాన్ = సమీపింపఁగా, మలఁపఁగన్ + ఉన్న = పుష్పింపనున్న, కల్పలత, మన్మథు - నారిన్ = మన్మథునియొక్క వింటి త్రాటియందు, అమర్పన్ + ఉన్న = అమర్చుటకు సిద్ధముగా నున్న, కోమలతర - పుష్ప - బాణము = మిక్కిలి మృదువైన పూవుటమ్ము, అహిమ - ద్యుతిన్ = వేఁడికాంతులుగలవానిని - సూర్యుని, చూడఁగన్ + ఉన్న, పద్మ - కుట్మలము = తామర మొగ్గ, అలరంగన్ + ఉన్న = వికసింపనున్న. మధు - మంజరి = మనోహర మైన పూలగుత్తి, నాన్ = అనునట్లు, మద - జృంభిత + అంగ - దోహల - రుచిన్ = యౌవనమదముచే, అతిశయించిన, మేని, యుత్సాహమువలని కాంతితో, ఒప్పెన్,

తాత్పర్యము : పార్వతి నూతనయౌవనవిలాసము సమీపింపఁగాఁ బుష్పింపనున్న కల్పలత యనఁగను, మన్మథుని వింటి యల్లెత్రాటియం దమర్పనున్న

మృదుతరమైన పూపుటమ్మనఁగను, సూర్యుని జూడనున్న తామరమొగ్గ యనఁగను, వికసింపనున్న సుందరపుష్పగుచ్ఛ మనఁగను, యౌవనమదవిజృంభణముతోడి మేని యుత్సాహపుఁగాంతితో నొప్పెను.

విశేషములు: అలంకార ముపమ. ఉపమలు పెక్కు లుండుటచే మాలో పమ. ఉపమానము లన్నిటియందును వికసనసంపిద్ధత చూడనగును. ఉపమేయమైన పార్వతియందును యౌవనసంపిద్ధతయే కలదు.

వ. ఇ ట్లభినవమధుసంగతిం దనరు ప్రద్యుమ్నునుద్యానంబునుంబోని యౌవనమదాభ్యుదయంబున. 41

అర్థము: ఇట్లు, అభినవ - మధు - సంగతిన్ = నూత్నవసంతాగమముచే, తనరు = ఒప్పునట్టి, ప్రద్యుమ్న + ఉద్యానంబునున్ + బోని = మన్మథోద్యానము వంటి, యౌవన - మద + అభ్యుదయంబునన్ = యౌవనమువలని మదము వృద్ధిచే,

తాత్పర్యము: ఇట్లు నూతనవసంతాగమముచే నొప్పునట్టి మన్మథోద్యానము వంటి యౌవనమదాభ్యుదయమున - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: అలంకార ముపమ. ప్రద్యుమ్నునుద్యానంబు = ప్రద్యుమ్న + ఉద్యానంబు - షష్ఠీసమాసమునందుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమం బగు. బాల, సంధి, 34.

పార్వతీ యౌవన వర్ణనము.

క. మెలుపును గెంపును సుస్థితిఁ
దలిరులయందేని లేదు తమ కమ వలనన్
నిలుకడ యగు నని తత్పద
తలముల నెలసె ననఁ బాదతలములు వొల్చున్. 42

అర్థము: మెలుపును = మృదుత్వమును, కెంపును = ఎఱుపును, సుస్థితిన్ = మంచినిలుకడతో, తలిరులయందున్ + ఏని = చిగురులయందయినను

లేదు, తమకున్, ఉమవలనన్ = పార్వతివలన, నిలుకడ + అగున్ = స్థిరత్వ అగును, అని, తద్ + పద - తలములన్ = ఆమె అఱకాళ్లను, ఎలసెన్ = చేరెను, అనన్ = అనునట్లు, పాద - తలములు = అఱకాళ్లు, పొల్చున్ = ఒప్పును.

తాత్పర్యము : మృదుత్వమును, ఎఱుపును 'దమకు నిలుకడ చివురులం దయినను లేదు, తమకుఁ బార్వతివలన నిలుకడ కలుగు' నని యామె పదతలములను జేరెనా యనునట్లు ఆమె పాదతలము లొప్పును.

విశేషములు : మృదుత్వారుణత్వములకుఁ దలిరులయందు స్థిరత్వ మ్ముండదు. తలిరులు ముదిరినచో నవి నశించును. అందుచే నవి పార్వతి యఱకాళ్ళను జేరె నని భావము, చివురులవలెఁ గొంతకాలమే కాక పార్వతి యఱకాళు లెప్పటికి మృదుత్వారుణత్వములను గలిగియుండె ననుట. హేతువుకాని దానిని హేతువుగా నూహించుటచే నలంకారము హేతూత్ప్రేక్ష.

తద్ + పద - అనునాసికాంతస్థభిన్నములైన హల్లులకు (యుల్లులకు) కఠిన హల్లులు (ఖరులు) పరమగునపుడు వాని వర్గములందలి ప్రథమ వర్ణములు (చరులు) ఆదేశములగును- తత్పద, పాదతలములు+పొల్చున్ - 'ప్రథమమీఁది పరుషములకు గసడదవలు బహుళముగా నగు' బాల. సంధి. 13 - పాదతలములువొల్చున్,

'దేవతానాం రూపం పాదాఙ్గుష్ఠప్రభృతి వర్ణ్యతే, మానుషాణాం కేశా దారభ్యేతి ధార్మికాః' అనుటచేఁ గవి దేవతామూర్తి యగు పార్వతి యంగవర్ణనను బాదతల ములనుండి కచపర్యంతము ముప్పదియొక్క పద్యములోఁ గావించుచున్నాఁడు.

క. సరస ప్రవాళములపై
సరసిజరాగమణు లోలి సంధిల్లెనో, సుం
దర రాగ లతా కందాం
కురములో నా నుంగుటములు కోమలి కమరున్. 43

అర్థము : సరస-ప్రవాళములపైన్ = లేఁజివురులపై, సరసిజ-రాగ-మణులు = పద్మరాగమణులు, ఓలిన్ = క్రమముగా, సంధిల్లెనో = కూడెనో;

సుందర-రాగ-లతా-కంద + అంకురములో = అందమైన ఎఱ్ఱనితీఁగయొక్క దుంప యొక్క మొలకలో, నాన్ = అనఁగా, కోమలికిన్ = చక్కఁదనముగల యింతికి, పార్వతికి, ఉంగుటములు = అంగుటములు- బొట్టనవ్రేళ్ళు, అమరున్ = ఒప్పును.

తాత్పర్యము : లేఁతవి యగు చివురులపైఁ బద్మరాగమణులు కూడెనో, లేక మనోహరములైన అనురాగలత దుంప మొలకలో యనునట్లు పార్వతికి బొట్టన వ్రేళ్ళు ఒప్పును.

విశేషములు : ప్రవాళ శబ్దమునకుఁ బగడమనియు నర్థము గలదు, సరసములైన పగడములపైఁ బద్మరాగమణులు కూడెనో యనియుఁ జెప్పవచ్చును. ఆమె పాదములు సరస ప్రవాళముల (చిగురుల, పవడముల) వలెను, అందలి అంగుష్ఠములు పద్మరాగమణులవలెను నున్నవని భావము. అలంకార ముత్ప్రేక్ష. సుందరరాగలతా కందాంకురములో – అలంకార ముత్ప్రేక్ష. ఆమె యంగుష్ఠములు పద్మరాగమణులా, రాగలతా కందాంకురములా-అని సందేహించుటచే సందేహాలంకారమును. ఉంగుటము- అంగుటము రూపాంతరములు, ఉంగుటము (వికృతి) - అంగుష్ఠము (ప్రకృతి).

క. అరుణాంబుజ దళములలోఁ
బరఁగు తటిత్త్విషలు నించి పై నభ్రకముల్
పొరలెత్తి కదియ మూసిన
కరణి నుమాదేవి పద నఖంబులు వెలుఁగున్. 44

అర్థము: అరుణ + అంబుజ - దళములలోన్ = ఎఱ్ఱ తామర రేకులలో, పరఁగు = ఒప్పునట్టి, తటిత్ + త్విషలు = మెఱపుల కాంతులు, నించి = నిండించి- పైన్ = మీఁద, అభ్రకముల్, పొరలు+ఎత్తి = పొరలుతీసి, కదియన్-మూసిన, కరణిన్ = కూడునట్లు మూఁతపెట్టిన విధమున, ఉమా - దేవి = పార్వతీదేవి. పద- నఖంబులు = కాలిగోరులు, వెలుఁగున్ = ప్రకాశించును.

తాత్పర్యము: ఎఱ్ఱతామర రేకులలో మెఱపుల కాంతులు నిండించి వాని పై నభ్రకపుఁబొరలను మూఁతపెట్టినట్లు పార్వతి కాలిగోరులు ప్రకాశించును.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష.

తటిత్-'తటిత్సౌదామనీ విద్యుచ్చఞ్చలా చపలా అపి,' ప్రథయా తమాంసి తాడయ తీతి తడిత్-తటిత్, అంధకారమును బోఁగొట్టునది- మెఱపు- అమరము. త్విష-'స్యుః ప్రభా రు గ్రుచి స్త్విడ్భా భా శ్ఛవి ద్యుతి దీప్తయః,' - త్వేషతే త్విట్. కాంతియుక్తమైనది-ప్రకాశించునది.కాంతి. అమరము.

క. తన నీచయోని [1]విడనగు
నని సకళత్రమును నుమ పదారాధన కొం
దిన విష్ణు కమఠరూపమొ
యనఁ దగి మీఁగాళు లగజ కందం బొందున్. 45

అర్థము : తన = తనయొక్క, నీచ-యోనిన్ = హీనమైన జన్మమును, విడన్ + అగున్ + అని = విడువ వీలగు నని - తాను నీచమైన జన్మమును (తాఁబేటిరూపును) విడుచుటకు వీలు గలుగునని, స-కళత్రమును = భార్యాసహిత ముగా, ఉమ=పార్వతియొక్క, పద + ఆరాధనకున్ = అడుగులయొక్క పూజకు, ఒందిన = చేరిన, విష్ణు = విష్ణునియొక్క. కమఠ - రూపమొ = తాఁబేటిరూపమో, అనన్ = అనునట్లు, తగి = ఒప్పి, అగజకున్ = పార్వతికి, మీఁగాళులు = పాదో పరిభాగములు, అందంబు + ఒందున్ = అందగించును.

తాత్పర్యము : తన హీనమైన జన్మమును వీడుటకు వీలగునని భార్యా సహితముగాఁ బార్వతి పాదపూజకుఁ జేరిన విష్ణుని తాఁబేటిరూపమో అనునట్లొప్పి పార్వతి మీఁగాళ్లు అందగించును.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష. మీఁగాళ్ళను దాఁబేటితోఁ బోల్చుట కవి సమయము.

సకళత్రమయిన కమఠ రూపమనుట రెండుమీఁగాళ్ళకును బోలిక సిద్ధించుట కొఱకు. మీఁగాళులు-మీఁదు + కాళులు 'సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చుమీఁది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు' బాల. సంధి. 36. మీ + కాళులు, 'లుప్తశేషంబునకుం బరుషములు పరము లగునపుడు నుగాగమంబగు.' బాల. సంధి.37

1. వా. ప్రతి.' పడుచే-లని

మీ + ను+కాళులు, 'ద్రుతప్రకృతికముమీఁది పరుషములకు సరళము లగు.' మీ + ను + గాళులు, బాల, సంధి. 16, 'ఆదేశసరళములకు ముందున్న ద్రుతము నకు బిందుసంశ్లేషములు విభాషనగు.' మీఁగాళులు. బాల. సంధి. 17. కాళులు. కాలు + లు, 'బహువచనము పరంబగునపు డసంయుక్తంబులయి యుదంతంబు లయిన డ-ల-ర-ల కలఘులకారంబు బహుళంబుగా నగు.' బాల-ఆచ్ఛిక. 13. కాళులు, కాళ్లు, కాలులు రూపాంతరములు.

క. సిందూర పిండములో, మరు
కందుకములో, సత్ప్రవాళకఫలంబులో నా
నందములై రాగ లతా
కందము లన మడమ లచలకన్యక కొప్పున్. 46

అర్థము : సిందూర-పిండములో = చెందిరపుముద్దలో, మరు = మన్మథునియొక్క, కందుకములో = బంతులో. సత్+ప్రవాళక - ఫలంబులో = మేలయిన పవడపుఁబండ్లో, నాన్ = అనఁగా, అందములు + ఐ = సుందరము లయి. రాగ-లతా-కందములు = ఎఱ్ఱని తీఁగయొక్క దుంపలు, అనన్ = అనఁగా, అచల - కన్యకకున్ = కొండ కూఁతునకు -పార్వతికి, మడమలు = చీలమండక్రింది భాగములు - పార్ష్ణులు, ఒప్పున్,

తాత్పర్యము : చెందిరపుముద్దలో, మన్మథుని బంతులో, మేలయిన పగడపుఁబండ్లో యన సుందరములయి ఎఱ్ఱని తీఁగ దుంప లనఁ బార్వతి మడమ లొప్పును.

విశేషములు ; అలంకార ముత్ప్రేక్ష, సందేహము.

క. అతనుం డోఁవని శివు వశ
గతుఁ జేయ భవాని మదను కవ దొన లోకో
న్నతి నాఁచికొనియెనో యను
గతిఁ జిఱుదొడ లమరు ప్రీహిగర్భాభములై. 47

అర్థము : అతనుండు = అనంగుఁడు - మన్మథుఁడు, ఓఁపని = చాలని- మన్మథుఁడు సాధింపలేని యనుట, శివున్ = శివుని, వశ - గతున్ = లోఁబడిన వానినిగా, చేయన్ = చేయుటకు, భవాని = పార్వతి, మదను = మన్మథునియొక్క- కవ-దొనన్ = అంపపొదుల జంటను, లోక + ఉన్నతిన్ = లోకమునందలి గొప్ప తనముతో, ఆఁచికొనియెనో = అపహరించెనో, అను-గతిన్ = అను విధమున, చిఱు + తొడలు = పిక్క-లు-జంఘలు, వ్రీహి - గర్భ + ఆభములు + ఐ =వరి పొట్టలవంటి వయి, అమరున్ = ఒప్పును.

తాత్పర్యము : మన్మథుఁడు సాధింపలేని శివునిఁ దాను వశపఱుచుకొనఁ బార్వతి లోకోన్నతితో నతని యంపపొదుల జంట నపహరించెనా యనునట్లు వరిపొట్ట లను బోలిన పిక్క-లు పార్వతి కొప్పును.

విశేషములు : మన్మథుఁడు తన యంపపొదుల జంటచే సాధింపలేని శివునిఁ దాను సాధింపఁ బార్వతి దానినే తన పిక్క-ల రూపమునఁ గైకొనె ననుట. అదే తూణములజంట యనెడి తన జంఘలచే శివుని సాధింప నెంచె ననుటచే మన్మథుని కంటెఁ బార్వతి సమర్థతర యని తెలియుచున్నది. అలంకార ముత్ప్రేక్ష. వ్రీహి గర్భాభములు - అలంకార ముపమ.

దొన-(వికృతి) - తూణము (ప్రకృతి) . భవాని - భవుని భార్య - పార్వతి. 'తస్య స్త్రీ' వాని యాఁడుది యను నర్థమున అకారాంత పుంలింగ 'భవ' శబ్దమునకు భవానీ' రూప మగును, ఇట్లే ఇంద్రాణీ, వరుణానీ, శర్వాణీ.

క. స్మర మందిరమ్ము శోభా
కరముగ మెఱుఁగారు పసిఁడి కంబము లనఁగాఁ
గర మొప్పు నగ తనూజకుఁ
గరభోరులు వొలుచు మదన కరి కర లీలన్, 48

అర్థము : స్మర-మందిరమ్ము = మన్మథుని ఆలయము, శోభా-కరముగన్ = శోభిల్లునట్లుగా, మెఱుఁగారు = ప్రకాశించునట్టి, పసిఁడి-కంబములు = బంగరు స్తంభ ములు, అనఁగాన్, అగ-తనూజకున్ = కొండకూఁతునకు - పార్వతికి, కరభ +

ఊరులు = కరభములవంటి తొడలు-మనికట్టు మొదలు చిటికెనవ్రేలి మొదటిదాఁకఁ గల చేతి వెలుపలి భాగమునకుఁ గరభ మనిపేరు. స్త్రీ తొడను కరభముతోఁ బోల్చుట కవిసమయము, పొలుచు = ఒప్పునట్టి, మదన - కరి-కర-లీలన్ = మన్మథుని యేనుఁగుయొక్క తొండము విధమున, కరము + ఒప్పున్ = మిక్కిలి యొప్పును. 'కర మొప్పు' అనుదానిని అగతనూజకు విశేషణము చేసి, 'పొలుచు' అను దానిని సమాపకక్రియగాఁ జేసియు నన్వయింపవచ్చును,కరమొప్పు - అగతనూజకున్ = మిక్కిలి యొప్పునట్టి పార్వతికి, కరభోరులు, మదనకరికరలీలన్. పొలుచున్ అని యైనను అన్వయింపనగును.

తాత్పర్యము : మన్మథుని భవనము శోభిల్లుటకుఁ బెట్టఁబడిన ప్రకాశించు బంగరు కంబములా యనఁ బార్వతికి మన్మథుని యేనుఁగుతొండములవంటి కరభము లను పేరు తొడలు మిక్కిలి యొప్పును.

విశేషములు : పార్వతి తొడలు పసిఁడికంబములవలెను, కరభముల వలెను ఏనుఁగు తొండములవలెను నున్నవని భావము. మదన కరి కర లీలన్ - అలంకార మువమ, పసిఁడికంబము లనఁగాఁ గర మొప్పున్ - అలంకార ముత్ప్రేక్ష.

కరభ - మణిబన్ధా దాకనిష్ఠం కరస్య కరభో బహిః-అమరము, కరే భాతి కరభః - కరమందుఁ బ్రకాశించునది. కరము-(నానా) తొండము, చేయి, చేయునది; (తెలుఁగు)-మిక్కిలి, స్మరుఁడు (ప్రకృతి)-మరుఁడు (వికృతి).

క. గురు కుచ వహన భరంబునఁ
బొరిఁబొరిఁ బేద కవు నడిగిపోఁబోయినఁ ద
ద్భర వహనమునకు భరపడు
కరణిని జఘనంబు సతికి ఘనమై యమరున్. 49

అర్థము : గురు-కుచ - వహన - భరంబునన్ = పెద్దవి యగు స్తనముల యొక్క మోయుటయొక్క అతిశయముచేత, పొరిఁబొరిన్ = క్రమక్రమముగా, పేద - కవును = సన్నని నడుము, అడిగిపోన్ + పోయినన్ = అడిగిపోవనుండఁగా, తత్ + భర - వహనమునకున్ = ఆ స్తనములయొక్క బరువుయొక్క మోఁతకు,

భరపడు - కఱణిన్ = పూఁటపడు విధమున, జఘనంబు = మొల, సతికిన్ = పార్వతికి, ఘనము + ఐ = గొప్పది యై - పెద్దదియై, అమరున్ = ఒప్పును.

తాత్పర్యము: పెద్దవయిన స్తనముల మోఁత ఆధిక్యముచే సన్నని నడుము క్రమక్రమముగా నళిగిపోఁబోఁగా వానిబరువును మోయుటకుఁ దాను పూఁటపడినట్లు పార్వతి మొల పెద్దదియై యొప్పును.

విశేషములు: స్త్రీ కుచములు పెద్దవిగాను, నడుము సన్ననిదిగాను, జఘనము పెద్దదిగాను వర్ణింపఁబడును. అలంకార ముత్ప్రేక్ష.

జఘనము - స్త్రీ శ్రోణి పురోభాగము - జఘనం పురః - అమరము. హన్యతే పురుషేణ తాడ్యత ఇతి జఘనమ్. పురుషునిచేఁ బీడింపఁబడునది - స్త్రీ మొల ముందరిచోటు. శ్రోణి పశ్చాద్భాగమునకును జఘన మనిపేరు, కవును - (సూపాం.) కౌను. భరపడు - భరము + పడు-'పద్వాదులు పరంబు లగునపుడు మువర్ణకంబునకు లోప పూర్ణబిందులు విభాష నగు.' బాల. సంధి. 46.

భరపడు = పూఁచిపడు, ఒకరు చేయవలసిన పని తాను జేసెదనని పూను. పేదవి, క్రమక్రమముగా నళిగిపోవుచున్నది యగు కౌను పనిని నేను జేయుదు నని జఘనము పూఁటపడె ననుట.

క. కనుఁగొన నీశ్వరు దృగ్రుచు
లను విపుల వహిత్రముల నపాంగజలాబ్ధిం
జనఁ దిగిచి ముంచు సుడి యిది
యన్నఁదగి యావర్తనాభి యద్రిజ కొప్పున్. 50

అర్థము: కనుఁగొనన్ = చూడఁగా, ఈశ్వరు = శివునియొక్క, దృక్(క్)+రుచులు = చూపుల కాంతులు, అను = అనెడి, విపుల - వహిత్రములన్ = పెద్ద ఓడలను, అపాంగ - జల + అబ్ధిన్ = క్రీఁగన్ను లనెడి జలార్ణవమునందు చనన్ = పోవుచుండఁగా, తిగిచి = లాగి, ముంచు = మునుఁగఁజేయునట్టి, సుడి, ఇది

అనన్, తగి = ఒప్పి, ఆవర్త - నాభి = నీటిసుడివంటి నాభి, అద్రిజకున్ = కొండ కూఁతునకు-పార్వతికి, ఒప్పున్.

తాత్పర్యము : పరమేశ్వరుఁడు చూడఁగా నతని చూపులకాంతు లనెడి పేరోడలు దన్నుఁగున్న లనెడి జలార్ణవములోఁ దేలియాడును. వానిని దిగలాగి ముంచునట్టి సుడియె యది యనఁదగి పార్వతి నీటిసుడివంటినాభి యొప్పును.

విశేషములు : పార్వతీపరమేశ్వరులు పరస్పరము వీక్షించుకొనుచుండఁగా అతని నేత్రకాంతులు ఆమె క్రీఁగంటిచూపులయందుఁ దేలియాడుచుఁ దటాలున నామె బొడ్డుసుఁడికిఁ బ్రసరించుటను సముద్రమునందుఁ బయనించెడి పెద్దయోడలను దనలోని కాకర్షించి ముంచెడి సుడిగుండముతోఁ బోల్చుచున్నాఁడు కవి.

దృగ్రుచు లను విపులవహిత్రములన్ - రూపకాలంకారము, అపాంగజలాబ్ధిన్ అనునదియు రూపకమే. మొత్తముమీఁద నుత్ప్రేక్ష. అది రూపకానుప్రాణితము.

దృశ్ + రుచులు - దృక్ + రుచులు, ఝల్లు నకు హాశ్శ పరమగుచుండఁగాఁ దృతీయవర్ణాదేశము,దృగ్రుచులు, ఆవర్త నాభి - ఆవర్తమువంటి నాభి. నాభ్యావర్తమని యుపమానోత్తరముగా నుండవలయును. 'ఉపమానోత్తరపదంబులు గలవు కాని విపరీతంబులు సిద్ధంబులు లేవని యెఱుంగునది,' బాల. సమాస. 3.

క. మారు మఖ వేది మధ్యమొ,
యా రతి యద్దంబుపిడియొ యన నెంతయుఁ బొ
ల్పారుఁ గడు నలికమై సుకు
మారికి మధ్యంబు సింహమధ్యము వోలెన్. 51

అర్థము : మారు = మన్మథునియొక్క, మఖ - వేది - మధ్యమొ = యజ్ఞవేదికయొక్క నడిమి భాగమో, ఆ - రతి = ఆ రతిదేవియొక్క, అద్దంబు = అద్దముయొక్క, పిడియొ,అనన్, కడున్ = మిక్కిలి, నలికము+ఐ=సన్ననిదయి, సుకుమారికిన్ = సుందరికి-పార్వతికి, మధ్యంబు=నడుము, సింహ - మధ్యము + పోలెన్ = సింహముయొక్క నడుమువలె, ఎంతయున్ = మిక్కిలి, పొల్పారున్ (పొల్పు + అరున్) = ఒప్పును.

తాత్పర్యము : సుందరాంగియైన పార్వతికి నడుము సింహము నడుమువలె మన్మథుని యజ్ఞవేది నడిమిభాగమో, ఆ రతి అద్దము పిడియో అన సూక్ష్మమయి మిక్కిలి యొప్పును.

విశేషములు : సింహ మధ్యము వోలెన్ - ఉపమ. మారుమఖ వేది మధ్యమొ, ఆ రతి యద్దంబు పిడియొ - ఉత్ప్రేక్ష, సందేహము.

క. ఉదరము పలుచఁదనంబున
హృదయాంభోజాతనాళ మేర్పడి కొ
ప్పొదవి వెలిఁ దోఁచెనో యన
సుదతికి నూఁగారుఁదీఁగె సుందర మయ్యెన్. 52

అర్థము : ఉదరము = నడుముయొక్క, పలుచఁదనంబునన్ = సూక్ష్మత్వముచేత, హృదయ + అంభోజాత- నాళము = హృదయమనెడి పద్మముయొక్క కాడ, ఏర్పడి = బయల్పడి, తనకున్, ఒప్పు + ఒదవి = అందము గలిగి, వెలిన్ + తోఁచెనో = బయటికిఁ గనఁబడెనో, అనన్ = అనునట్లు, సుదతికిన్ = స్త్రీకి- పార్వతికి, నూఁగారుఁదీఁగె = తీఁగవంటి రోమావళి, సుందరము + అయ్యెన్= అందముగా నుండెను.

తాత్పర్యము: నడుము సూక్ష్మముగా నుండుటచేత నందుఁబుట్టిన హృదయమనెడి పద్మముకాడ బయల్పడి పైకిఁ గనఁబడుచున్నదా యనునట్లు పార్వతికి తీఁగవంటి రోమావళి సుందరముగా నుండెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష.

పలుచఁదనము- 'పలుచ + తనము - ఉదంత స్త్రీసమంబులకును బుంపులకు నదంతగుణ వాచకంబులకును దనంబు పరంబగునపుడు నుగాగమంబగు.' బాల. సంధి. 35. పలుచ + ను + తనము, 'ద్రుత ప్రకృతికముమీఁది పరుషములకు సరళము లగు.' బాల. సంధి. 16. పలుచ + ను + దనము. 'ఆదేశసరళములకు ముందున్న ద్రుతమునకు బిందుసంశ్లేషములు విభాష నగు.' బాల, సంధి. 17. పలుచఁదనము.

నూఁగారుఁదీఁగె -నూఁగారు + తీఁగె- 'సమాసంబుల నుదంతంబులగు స్త్రీ సమంబుల కుం బుంప్వులకుం బరుషసరళంబులు పరంబులగు నప్పుడు నుగాగమం బగు' బాల. సంధి. 25. నూఁగారు + ను + తీఁగె. ద్రుతకార్యము - బాల. సంధి. 16. 17. నూఁగారుఁదీఁగె, నూఁగారుఁదీఁగె-తీఁగెవంటి నూఁగారు - ఉపమానోత్తరపద కర్మధారయము.

క. పొరి దలముం గొను జవ్వన
సిరి కుచముల కెక్కఁ నడవఁ జేసిన కార్త
స్వర సోపానము లన ము
త్తరఁగలు దగు నంగజాబ్ధి తరఁగలు వోలెన్. 53

అర్థము: పొరిన్ = ప్రసముగా, దలమున్ + కొను = అధికమగు, జవ్వన - సిరి = యౌవనమనెడి లక్ష్మి, కుచములకున్ = స్తనముల పైకి, ఎక్కన్ = ఎక్కుటకు. నడవన్ + చేసిన = నడచునట్లు చేసిన, కార్తస్వర సోపానములు = బంగరు మెట్లు, అనన్ = అనఁగా, ముత్తరఁగలు (మూఁడు + తరఁగలు) = ముప్పాళులు-వళిత్రయము, అంగజ + అబ్ధి-తరఁగలు + పోలెన్ = మన్మథుఁ డనెడి సముద్రపు టలలవలె, తగున్ = ఒప్పును.

తాత్పర్యము ; నానాఁటికి అధిక మగుచున్న యౌవనలక్ష్మి స్తనముల మీఁదికి ఎక్కుటకు నడచుట కేర్పఱిచిన బంగారు మెట్లన వళిత్రయము పార్వతికి మన్మథ సముద్ర తరంగములవలె నొప్పెను.

విశేషములు: అంగజాబ్ధి-అంగజుఁడనెడి అబ్ధి-రూపకము. అంగజాబ్ధి తరఁగలు వోలెన్-ఉపమాలంకారము, జవ్వనసిరి-జవ్వన మనెడి సిరి-రూపకము. జవ్వనము + సిరి = జవ్వనపు సిరి అని యుండవలెను. జవ్వనసిరి....సోపానము లన-ఉత్ప్రేక్ష. అది రూపకానుప్రాణితము.

ముత్తరఁగలు-మూఁడు + తరఁగలు- 'సమానాధికరణం బగు నుత్తరపదంబు పరంబగునపుడు మూఁడు శబ్దము డు వర్ణంబునకు లోపంబును మీఁది హల్లునకు ద్విత్వంబు నగు' మూ + త్తరఁగలు. బాల. సమాస, 17. 'ద్విరుక్తంబగు హల్లు పరంబగునపు డాచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు.' ముత్తరఁగలు, బాల.

సమాస. 13. 'ద్విగువున కేకవచనంబు ప్రాయికంబుగా నగు మిశ్రంబునకుఁ గాదు.' బాల. సమాస. 18. చే ముత్తరఁగ కావలసియుండఁగా నిట ముత్తరఁగలు అని బహువచనాంతముగాఁ బ్రయోగింపఁబడినది. తరఁగ (వికృతి)-తరంగము (ప్రకృతి)

క. ఆంధ్రీ స్తనాపహాసులు
సంధృత మధుపాబ్జ ముకుళ సదృశము లతి నీ
రంధ్రములు కుచము లఖిల పు
రంధ్రీ జన తిలక మచలరాజాత్మజకున్. 54

అర్థము ; అఖిల-పురంధ్రీ-జన-తిలకము = ఎల్ల స్త్రీల సమూహము నందు శ్రేష్ఠురాలు, అగు. అచల-రాజ+ఆత్మజకున్ = కొండలఱేని కూఁతునకు-పార్వతికి. కుచములు = స్తనములు. ఆంధ్రీ-స్తన+ అపహాసులు = ఆంధ్రస్త్రీల స్తనములను బరిహసించునవి. సంధృత-మధుప+ అబ్జ-ముకుళ-సదృశములు = బాగుగా ధరింపఁబడిన తుమ్మెదలు గల తామరమొగ్గలతో సమానములు. అతి-నీరంధ్రములు = మిక్కిలి యెడము లేనివి.

తాత్పర్యము : ఎల్ల యింతులలో శ్రేష్ఠురాలగు పార్వతి స్తనములు ఆంధ్రస్త్రీల స్తనములను బరిహసించునవి. కొనలఁ దుమ్మెదలను ధరించిన తామరమొగ్గలను బోలినవి. నడుమఁ గొంచెముకూడ నెడము లేనివి. కుచము లబ్జముకుళములు. వాని నల్లని చూచుకము లా తామరమొగ్గలపై వ్రాలు నల్లని తుమ్మెదలు.

విశేషములు : సంధృత....సదృశములు-అలంకార ముపమ.

నిర్+రంధ్ర-రేఫమునకు రేఫము పరమగునపుడు లోపము గలుగును.అప్పుడు పూర్వమందుండు అ, ఇ, ఉ అను హ్రస్వములు దీర్ఘము లగును - నీరంధ్ర- అఖిలపురంధ్రీజనతిలక మచలరాజాత్మజకున్-'ఒకానొకచో విశేషణంబుల షష్ఠికిం బ్రథమ విభాష నగు.' బాల. కారక. 27.

ఇందుఁ బూర్ణబిందుపూర్వక దకారరేఫ సంయుక్తమునకుఁ బూర్ణబిందు పూర్వక 'ధృ'తోఁ బ్రాసము కూర్పఁబడినది. సంయుతాసంయుతప్రాసము.

తే. ర ల ళ తమక్రింద జడ్డలై క్రాలు వ్రాళ
ప్రాసవర్ణంబులై వానిఁ బాసియైనఁ
గూడి యైనను దెలి యడుగులను నిలుచు.
సంయుతాసంయుతప్రాస సంజ్ఞఁ దనరి. (అప్పకవీయము.)

క. కేళీవర్త్మము లన, రతి
కేళీ సదనంబు లనఁగఁ, గింశుక కళికా
మూలము లనఁ, గామ లతా
మూలము లన గౌరి బాహుమూలము లమరున్. 55

అర్థము :- గౌరి-బాహుమూలములు=పార్వతి చంకలు, కేళీ-వర్త్మములు+అనన్=మన్మథ క్రీడలకు మార్గము లనఁగను. రతి-కేళీ-సదనంబులు+అనఁగన్=రతిదేవి క్రీడాగృహములు అనఁగను, కింశుక - కళికా-మూలములు + అనన్ = మోదుగు మొగ్గలకు మాతృకలు అనఁగను, కామ-లతా-మూలములు + అనన్=కామ మనెడి తీఁగయొక్క వేరులు అనఁగను, అమరున్=ఒప్పును.

తాత్పర్యము :- పార్వతి చంకలు మన్మథక్రీడా మార్గము లనఁగను. రతిదేవి క్రీడాగృహము లనఁగను, మోదుగు మొగ్గలకు మాతృక లనఁగను, కామ లతకు వేరులు అనఁగను అమరును.

విశేషములు :- అలంకార ముపమ. కామ లతా మూలములు=కామమనెడి లతయొక్క మూలములు-రూపకాలంకారము.

వర్త్మము-అయనం వర్త్మ మార్గాధ్వ పన్థానః పదవీ సృతిః. వర్తన్తే అనేనేతి వర్త్మ.దీనిచేత నడచెదరు-మార్గము. అమరము. (నానా.)కను తెప్ప.

క. శివు నంగయష్టి నిఱియఁగ
నవిరళముగఁబట్టి ప్రాఁక నని కడునెమ్మిన్
నివుడు నవ కల్పలతికల
పవిదిని మృదు బాహులతలు పార్వతి కొప్పున్. 56

అర్థము :- పార్వతికిన్, మృదు-బాహు-లతలు = తీఁగలవంటి కోమలము లయిన చేతులు, శివు+అంగ-యష్టిన్=శివునియొక్క కఱ్ఱవంటి శరీరమును, ఇఱియఁగన్=అంటియుండునట్లు, అవిరళముగన్=అధికముగా, పట్టి=పట్టుకొని, ప్రాఁకన్+అని=ప్రాఁకుటకని, కడున్+నెమ్మిన్=మిక్కిలి మైత్రితో, నివుడు_నిగుడునట్టి, చాఁగునట్టి, నవ-కల్ప-లతికల-పవిదిని=నూతన కల్పలతల విధమున, ఒప్పున్.

తాత్పర్యము:- శివుని దేహయష్టి నంటియుండునట్లు గట్టిగాఁ బట్టుకొని ప్రాఁకుటకొఱకు మిక్కిలి మైత్రితోఁ జాఁగునట్టి కల్పవృక్షపుఁ గ్రొందీఁగల విధమునఁ బార్వతికిఁ గోమలములైన లతలవంటి బాహువు లొప్పును.

విశేషములు:- శివుని యంగము యష్టి (కఱ్ఱ) వంటిది. పార్వతి బాహువులు కల్పలతల వంటివి. లత కఱ్ఱనంటి ప్రాఁకునట్లు పార్వతి బాహువులు శివుని యంగమునంటియుండు ననుట. అలంకారము ఉత్ప్రేక్షానుప్రాణితోపమ.

నివుడు-నిగుడు, పవిది-పగిది రూపాంతరములు 'అపదాద్యం బయి యసంయుక్తం బయిన గకారంబునకు వకారంబు విభాష నగు,' బాల, ఆచ్ఛిక, 27. శివు+అంగ-షష్ఠీ సమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' 'బాల. సంధి. 34.

క. రుచిరాశోక దల ద్యుతి
నచలజ కరతలము లొప్పు నతిశయ రాగో
పచిత రతిరాజ పల్లవ
రచితోభయ మేఘడంబరంబుల పోలెన్. 57

అర్థము : అచలజ-కర - తలములు = పర్వతపుత్త్రియొక్క అరచేతులు, రుచిర + అశోక-దల-ద్యుతిన్ = మనోహరము లయిన అశోకపు పూరేకులయొక్క కాంతిలో, అతిశయ.... డంబరంబులపోలెన్; అతిశయ = అధికమైన, రాగ = ఎఱ్ఱదనముచే, ఉపచిత = కూడిన, రతిరాజ = మన్మథునియొక్క, పల్లవ=చిగురుటాకులచేత, రచిత = కూర్పఁబడిన, ఉభయ=రెండు, మేఘడంబరంబుల+పోలెన్= గొడుగులవలె, ఒప్పున్.

తాత్పర్యము : అశోకపుష్పదళములవలె నెఱ్ఱనికాంతులు గలిగి పార్వతి అరచేతులు ఎఱ్ఱని చిగురుటాకులతోఁ గూర్పఁబడిన మన్మథుని జంటగొడుగులవలె నుండెను.

విశేషములు : మేఘడంబరము = గొడుగు, మేఘమువలె వ్రేలాడుచుండునది. ఈయర్థమున నీ పదము కన్నడమునందు విశేషముగాఁ బ్రయుక్తమయినది. నన్నె చోడునిదె మఱియొక ప్రయోగము-'కరులపై మేఘడంబరములలో సంధ్యానురాగ మేఘాడంబరమ్ములొక్క'-11-77.

క. మరు చేత నుండి హరు గె
ల్వరు; దుమ చే నుండి గెల్వ నౌ నని సుమనః
శరములు కరముల నెలసిన
తరిణిఁ గరాంగుళము లచలకన్యక కొప్పున్. 58

అర్థము : మరు - చేతన్ + మన్మథునిచేతియందు, ఉండి, హరున్, = శివుని, గెల్వ = గెల్చుట. అరుదు = అశక్యము, ఉమ - చేన్ = పార్వతి చేతి యందు, ఉండి, గెల్వన్ + ఔన్ = గెల్వనగును, అని, సుమనస్ + శరములు = పుష్పబాణములు, కరములన్ = చేతులందు, ఎలసిన - కరణిన్ = చేరిన విధమున, కర + అంగుళములు = చేతివ్రేళ్లు, అచల - కన్యకకున్ = కొండ-కూఁతునకు. పార్వతికి, ఒప్పున్,

తాత్పర్యము ; 'మన్మథుని చేత నున్నచో శివుని జయించుట యసాధ్యము. పార్వతి చేతి నున్నయెడల శివుని గెలుచుట సులభమని పుష్పబాణము లామె చేతు లందుఁ జేరిన విధమునఁ జేతివ్రేళ్లొప్పును,

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష.

సుమనస్ (నానా.) దేవత, పుష్పము, విద్వాంసుఁడు, మాలతి. గోధుమ. గెల్వ- గెల్చు కృదంతరూపము. తారకుం బోర గెల్వన్ అని ప్రథమాశ్వాసమున నితనిదే ప్రయోగాంతరము,

క. వరదము లగు కల్పలతాం
కురములొ, విషమాస్త్ర నిశిత కోరక విశిఖో
త్కరమొ యనఁ గరజములు సుం
దరి కగు నరుణోత్పలాగ్రదలముల పోలెన్. 59

అర్థము : వరదములు = వరముల నిచ్చునవి, అగు, కల్ప - లతా + అంకురములో = కల్పలతయొక్క మొలకలో, విషమ + అస్త్ర - నిశిత - కోరక - విశిఖ + ఉత్కరమో = మన్మథునియొక్క వాఁడియైన మొగ్గలనెడి బాణముల సమూహమో, అనన్, కరజములు = చేతిగోర్లు, అరుణ + ఉత్పల + అగ్ర - దల ముల - పోలెన్ = ఎఱ్ఱకలువ కొనఱేకుల వలె, సుందరికిన్ = అందగత్తెకు పార్వతికి, అగున్.

తాత్పర్యము : అందగత్తె యగు పార్వతికి - వరముల నిచ్చు కల్పలత అంకురములో, మన్మథుని వాఁడిమొగ్గలబాణముల సమూహమో యనఁగాఁ జేతి గోరులు ఎఱ్ఱకలువ కొనఱేకులవలె నొప్పును,

విశేషములు : అరుణోత్పలాగ్రదలముల పోలెన్ - అలంకార ముపమ, కల్పలతాంకురములో, విషమాస్త్ర .... విశిఖోత్కరమొ - అలంకారము సందేహము.

క. వినుతరుచిఁ బొల్చు నానన
మను నాదర్శంబు పిడియొ యతి మృదులీలం
జను పోఁకబోదెయో యన
ఘనరుచి నగసుతకుఁ గంబుకంధర మమరున్. 60

అర్థము : వినుత - రుచిన్ = పొగడఁబడిన కాంతితో, పొల్చు = ఒప్పు నట్టి, ఆననము + అను + ఆదర్శంబు = ముఖమనెడి అద్దముయొక్క, పిడియొ, - అతి - మృదు - లీలన్ = మిక్కిలి మృదువైన రీతితో, చను = ఒప్పునట్టి, పోఁక - బోదెయో =

పోఁక(మాని బోదెయో, అనన్, నగ - సుతకున్ = కొండ కూఁతునకు - పార్వతికి, ఘన - రుచి = గొప్ప కాంతి గలది, అగు, కంబు - కంధరము = శంఖమువంటి కంఠము, అమరున్ = ఒప్పును.

తాత్పర్యము: మంచి కాంతితో నొప్పు ముఖమనెడి అద్దముపిడియో, మిక్కిలి మృదుపైనపోఁక(మాని బోదెయో యనునట్లు పార్వతికి గొప్పకాంతి గల శంఖమువంటి కంఠ మొప్పును.

విశేషములు : అలంకారము సందేహము. ఉత్ప్రేక్ష.

కంబుకంధరము - ఇందు కంబు వుపమానము. కంధర ముపమేయము. ముఖపద్మ మనురీతి ఉపమానపూర్వపదకర్మధారయములే కాని, విపరీతములు సిద్ధము లుండవు, పూర్వముగూడ (50వ పద్యములో) ఆవర్తనాభి యని యిట్టిదే యీ కవి ప్రయోగించెను.)

క. అమృతోద్భవు లగు మీలో
నమరదు పగ యని సుధాకరాబ్జములకుఁ గూ
టము దన ముఖమునఁ జేసెనొ
యుమ యన వదనాంశు గండ యుగ గతి వొల్చున్. 61

అర్థము : అమృత + ఉద్భవులు = పాలనుండి, నీటినుండి పుట్టుక గలవారు, అగు, మీలోన్, పగ = విరోధము, అమరదు = తగదు, అని, ఉమ = పార్వతి, సుధాకర + అబ్జములకున్ = చంద్రునకును, తామరకును (చంద్రుఁడు క్షీరసముద్రమునుండి పుట్టెను. అబ్జము - నీటినుండి పుట్టెను. అప్ = నీటినుండి, జ = పుట్టినది - తామర.) కూటము = పొందు, తన, ముఖమునన్ = ద్వారమున, మోముచేత, చేసెనొ, అనన్ = అనునట్లు, వదన + అంశు - గండ - యుగ-గతి = ముఖకాంతి, చెక్కిళుల జంటయొక్క తీరు, పొల్చున్ = ఒప్పును.

తాత్పర్యము ; చంద్రునకు పద్మమునకు విరోధము, ఇరువురును అమృతోద్భవులే, చంద్రుఁడు అమృతము = క్షీరమునుండి పుట్టినవాఁడు, పద్మముగూడ

అమృతము = నీటినుండి పుట్టినదే, ఇట్లు ఏకోద్భవులగు మీ కిరువురికిని విరోధము తగ దని పార్వతి వానికిఁ దన ముఖమున (ద్వారమున, మోమున) సఖ్యము చేసెనో యనునట్లు ఆమె ముఖకాంతియు, చెక్కిళ్లజంటయు నొప్పును.

వి శే ష ము లు : అలంకార ముత్ప్రేక్ష. అది శ్లేషానుప్రాణితము. అమృతము = క్షీరము, నీరము, ముఖము = ద్వారము, మోము అని శ్లేషము. ఆమె ముఖము చంద్రునివలెను, గండయుగము శాఖఁ వలెను నున్నవని భావము.

క. మానితమగు గుడరసమున
నూనిన తుండీర ఫలమొ, యొగిఁ దేనెతెలెన్
నాని మృదువైన పవడమొ
నా నద్రిజ తోపు మోవి నయమై యొప్పున్. 62

అ ర్థ ము : మానితము + అగు = మన్నింపఁబడినది యగు, గుడ - రస మునన్ = బెల్లపుఁబాకమునందు, ఊనిన = తాల్చిన, తుండీర - ఫలమొ = దొండ పండో, ఒగిన్ = బాగుగా, తెనె తెలెన్ = తేనె నింపిన పాత్రమునందు, నాని, మృదువు + ఐన = మెత్తనయిన, పవడమొ = పగడమో, నాన్ = అనునట్లు, అద్రిజ = కొండకూఁతురైనపార్వతియొక్క, తోపు - మోవి = ఎఱ్ఱని పెదవి, నయము + ఐ = బాగయి, ఒప్పున్.

తా త్ప ర్య ము : మంచి బెల్లపుఁబాకమున నుంచిన దొండపండో, తేనెయందు బాగుగా నాని మెత్తనైన పగడమో యనునట్లు పార్వతి యెఱ్ఱని పెదవి సుందరమయి యొప్పును.

వి శే ష ము లు : అలంకారము సందేహము, ఉత్ప్రేక్ష.

తేనెతలన్ = తేనెయందు, 'తల' సప్తమ్యర్థక మిచ్చునని సూ.ని. తేనె తెలెన్ అని పాఠాంతరము. తెలె యన భోజనపాత్రము. సూ.ని. 'తేనెతల', అను పాఠమునే గ్రహించెను. తొప్ప మోవి-ఇది సూ.ని.గృహీత పాఠము. తోపు మోవి యని వా.

సా. ప్రతులందుఁ గలదు, పవడము - పగడము (రూపాం.) (వికృతి) - ప్రవాళము (ప్రకృతి)

క. కులిశ ద్యుతి కెన, ముక్తా
ఫల తరల విభాతితోడఁ బ్రతి యనఁ, దుహినా
చల తనయకు గౌరికిఁ దల-
తల వెలుఁగుచు శిఖర రుచిర దశనము లొప్పున్. 63

అర్థము : కులిశ - ద్యుతికిన్ = వజ్రము కాంతికి, ఎన = సాటి, ముక్తా ఫల - తరల - విభాతితోడన్ = ముత్యముయొక్క, చంచలమైన, కాంతితో, ప్రతి = సాటి, అనన్, తుహిన + అచల - తనయకున్ = మంచుకొండ కూఁతురు, అగు, గౌరికిన్ = పార్వతికి, తలతల - వెలుఁగుచున్ = తళతళ ప్రకాశించుచు, శిఖర - రుచిర - దశనములు = మల్లెమొగ్గవలె మనోహరమైన దంతములు, ఒప్పున్.

తాత్పర్యము : వజ్రము కాంతికిని, ముత్యముల చంచలమగు కాంతికిని సాటియనఁ బార్వతికిఁ దళతళ ప్రకాశించుచు మల్లెమొగ్గలవలె మనోహరమైన దంతము లొప్పును.

విశేషములు : అలంకార ముపమ. శిఖర = అరేబియాదేశపు మల్లెమొగ్గ యని సూ.ని. శిశిరరుచిర - యని పాఠాంతరము. శిశిర=మంచువలె (తెల్లఁగా) మనోహరములయిన అని అర్థము చెప్పనగును కాని శిఖరరుచిర, మేలు.

క. వదనాంబుజ మను వాణీ
సదనము మణి భిత్తి యుగళ సంకాశములై
మదన కర ముకుర యుగ రుచి
ముదితకు మృదుతర కపోలములు చెలువొందున్. 64

అర్థము : వదన+ అంబుజము = ముఖపద్మము, అను, వాణీ - సదనము= సరస్వతీనిలయముయొక్క, మణి - భిత్తి - యుగళ - సంకాశములు + ఐ = మణులచే నిర్మింపఁబడిన గోడల జంటతో సమానము, ఖ మదన - కర - ముకుర

యుగ - రుచిన్ = మన్మథునియొక్క చేతి యద్దముల జంటయొక్క కాంతితో, ముది తకున్ = స్త్రీకి - పార్వతికి, మృదు - తర - కపోలములు = మిక్కిలి కోమలము లయిన చెక్కిళ్లు, చెలువు + ఒందున్ = అందగించును.

తాత్పర్యము : ముఖపద్మ మనెడి వాగ్దేవీనిలయము మణిమయములైన గోడలజంటతో సమానము లయి, మన్మథుని చేతి యద్దములజంట కాంతితోఁ బార్వతి మృదుతర కపోలము లందగించెను.

విశేషములు : వదనాంబుజ మను వాణీసదనము - రూపకము, వాణీ సదన .... సంకాశములై - అలంకార ముపమ.

క. మనసిజ వారిధిఁ గట్టిన
కనకాచలసేతు వనఁగఁ గమలానన కాం
చన కర్ణిక నా నయనా
నన మధ్యమునందు గౌరి నాసిక యొప్పున్. 65

అర్థము : మనసిజ - వారిధిన్ = మన్మథుఁడనెడి సముద్రమునందు, కట్టిన = కట్టినట్టి, కనక + అచల - సేతువు = మేరుపర్వతమనెడి వంతెన, అనఁ గన్, కమల + ఆనన, - కాంచన - కర్ణిక - నాన్ = పద్మమువంటి ముఖముయొక్క బంగారుదుద్దు అనునట్లును, నయన + ఆనన - మధ్యమునందున్ = కన్నులకును ముఖమునకును నడుమ, గౌరి = పార్వతియొక్క, నాసిక = ముక్కు, ఒప్పున్.

తాత్పర్యము ; పార్వతి ముక్కు మన్మథుఁ డనెడి సముద్రమునందుఁ గట్టిన మేరుపర్వత మనెడి సేతు వనఁగను, ముఖమనెడి పద్మము బంగరు దుద్దు అనఁ గను కన్నులకును, ముఖమునకును నడుమ నొప్పును.

విశేషములు : మనసిజవారిధిన్ = మనసిజుఁ డనెడి వారిధిని - రూపకా లంకారము, కనకాచల - సేతువు = కనకాచలమనెడి సేతువు - రూపకాలంకారము, మనసిజవారిధిఁ గట్టిన .... సేతువనఁగన్, కమలానన కాంచన కర్ణిక నా .... అలంకార ముత్ప్రేక్ష. అది రూపకానుప్రాణితము.

క. తెలి మొగమునందు లోలా
క్షుల పొలపం బమరు నా చకోరము లతులా
మల శశిబింబములోఁ బడి
వెలలక చెలరారుచుండు విధమున సతికిన్. 66

అర్థము : సతికిన్ = స్త్రీకి - పార్వతికి, తెలి - మొగమునందున్ = నిర్మలమైన ముఖమునందు, లోల + అక్షుల = చంచలములయిన కన్నులయొక్క, పొలపంబు = ప్రకాశము, ఆ - చకోరములు = ఆ వెన్నెలపులుఁగులు, అతుల + అమల - శశి - బింబములోన్ = సాటిలేని నిర్మలమగు చంద్రుని బింబమునందు, పడి, వెలలక = వెడలక, చెలరారుచున్ = ఒప్పుచు, ఉండు విధముగన్ = ఉండు రీతిని, అమరున్ = ఒప్పును.

తాత్పర్యము : పార్వతి నిర్మలమైన ముఖమునందలి చంచలములయిన కన్నుల ప్రకాశము వెన్నెలపులుఁగుల జంట మిక్కిలి నిర్మలమైన చంద్రబింబములోఁ బడి వెడలక ఒప్పుచుండు విధమున నొప్పును.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష. పార్వతి ముఖము శశిబింబము వలెను, లోలాక్షులు చకోరములవలెను నున్న వని భావము. చకోరములకు వెన్నెల యనినఁ బరమప్రీతి. వానికి వెన్నెలపులుఁగు లని పేరు. అవి చంద్రబింబములోఁ బడి వెడలకుండుటకు వానికి వెన్నెలయందుఁ గల యాప్రీతియే హేతువు. వెలలు - వెడలు రూపాంతరము.

క. [1]హారము, లాశ్రిత భాషా
సారము, లాసకల వస్తు సంపూర్ణాలం
కారంబులు, శ్రీ వర్ణా
కారంబులు చెవులు సుకవి కావ్యము వోలెన్. 67

1. పా. ప్రతి. సారము

అర్థము : చెవులు = పార్వతిచెవులు, సుకవి - కావ్యము + పోలెన్ = సత్కవియొక్క కావ్యము వలె, హారములు = మనోహరములు (సారములు = సారవంతములు), - (ఇది ఉభయత్ర సమానము). ఆశ్రిత - భాషా - సారములు = ఆశ్రయించిన భాషయొక్క సారము గలవి, (ఇదియు నుభయత్ర సమానమే). ఆ - సకల - వస్తు - సంపూర్ణ + అలంకారంబులు = (కావ్య.) సమస్తమైనవస్తుకవిత్వ ముతో నిండిన శబ్దార్థాలంకారములు గలవి, (చెవులు) ఎల్లబంగారుతో సంపూర్ణము లైన అలంకారములు గలవి, శ్రీ - వర్ణ + ఆకారంబులు = (కావ్య.) శ్రీ యను వర్ణముయొక్క పిలుపుగలవి, (చెవులు) శ్రీ అను వర్ణమువంటి యాకారము గలవి.

తాత్పర్యము : పార్వతి చెవులు సుకవి కావ్యమువలె - మనోహరములు, ఆశ్రయించిన వాక్సారముగలవి, ఎల్ల వస్తుకవిత్వమునందు నిండిన శబ్దార్థాలంకారములు గలవి - ఎల్ల బంగరుతో నిండిన భూషణములు గలవి, శ్రీయనువర్ణము తోడి ఆరంభము గలవి - శ్రీయనువర్ణము నాకారము వంటి యాకారము గలవి.

విశేషములు : ఉపమాలంకారము. శ్లేషానుప్రాణితము.

క. ఆ ముఖలక్ష్మికిఁ బెట్టెడు
చామర లన, దృఙ్మరీచి జలనిధి లహరీ
స్తోమ మనఁ, బొలుచు నగజకుఁ
గాము ధనుఃఖండ భాతిఁ గటి వంక బొమల్. 68

అర్థము : అగజకున్ = పార్వతికి, కటి - వంక - బొమల్ = నల్లనివి, వంకర యైనవి అగు కనుబొమలు, ఆ - ముఖ - లక్ష్మికిన్ = ఆమె ముఖ మనెడి లక్ష్మికి, పెట్టెడు, చామరలు = వింజామరములు, అనన్ = అనునట్లును, దృశ్ (క్) + మరీచి - జలనిధి - లహరీ - స్తోమము = చూపులయొక్క కాంతి కిరణము లనెడి సముద్రపు టలల సమూహము, అనన్ = అనునట్లును, కాము - ధనుస్ (ః) + ఖండ - భాతిన్ = మన్మథునియొక్క వింటి భాగముల విధమున. పొలుచున్ = ఒప్పును.

తాత్పర్యము : పార్వతికి నల్లనివి, వంకర యైనవి యగు కనుబొమలు, మన్మథుని వింటి భాగముల విధమున, నామె ముఖలక్ష్మికిఁ బెట్టిన వింజామరము లనునట్లును, చూపుల కాంతికిరణము లనెడి సముద్రపు టల లనునట్లును నొప్పును.

విశేషములు: ముఖలక్ష్మి-ముఖమనెడి లక్ష్మి - రూపకాలంకారము.-చామర లన, లహరీస్తోమ మనఁ బొలుచు-ఉత్ప్రేక్ష. కాము దనుఃఖండ భాతి - ఉపమ.

చామర - చామరా అను ఆకారాంత స్త్రీలింగశబ్ద తత్సమ రూపము. దృశ్+ మరీచి - దృక్ + మరీచి - రహలుతప్ప మిగిలిన పదాంతగత హల్లులకు (యరులకు) అనునాసికవర్ణము పరమగుచో వానికి సంబంధించిన అనునాసికవర్ణము వైకల్పికముగా నాదేశ మగును. దృఙ్మరీచి, దృగ్మరీచి. - అనునాసిక సంధి. దృఙ్మరీచి జలనిధి-దృఙ్మరీచు లనెడి జలనిధి - రూపకము.

క. కొఱ నెల సుధారసంబునఁ
గఱ వోవఁగ నొరసి కడిగి కౌముదితోఁ గ్రొ
మ్మెఱుఁగుల విదల్చికొని పై
మెఱుఁగిడు నట్లొప్పు నగజ మృదునిటలరుచుల్. 69

అర్థము: అగజ = పార్వతియొక్క, మృదు - నిటల రుచుల్ = కోమల మైన నొసటి కాంతులు, కొఱ నెలన్ = చంద్రకళను, సుధా - రసంబునన్ = అమృత ద్రవముతో, కఱ = నలుపు, పోవఁగన్ = పోవునట్లు, ఒరసి = రాపి, కడిగి, కౌముదితోన్=వెన్నెలతో, క్రొమ్మెఱుఁగులన్ (క్రొత్త + మెఱుఁగులన్) = నూతన కాంతులను, విదల్చికొని = చల్లుకొని, పైన్ = మీఁద, మెఱుఁగు + ఇడు + అట్లు = మెఱుఁగుపెట్టునట్లు, ఒప్పున్.

తాత్పర్యము: పార్వతి కోమలమైన నొసటి కాంతులు - చంద్రకళను అమృతద్రవమున నలుపు పోవునట్లు రాపి, కడిగి, వెన్నెల క్రొత్త మెఱుఁగులు చల్లుకొని పైని మెఱుఁగుపెట్టినట్లు ఒప్పును.

విశేషములు: అలంకార ముత్ప్రేక్ష.

క్రొమ్మెఱుఁగులు - క్రొత్త + మెఱుఁగులు - 'క్రొత్తశబ్దమున కాద్యక్షర శేషంబునకుం గొన్నియెడల ముగాగమంబునుం గొన్నియెడల మీఁదిహల్లునకు ద్విత్వంబు నగు.' బాల. సంధి. 38.

క. అప్పొలఁతి కురులు శివు మన
సొప్పటి తనుఁ దగులఁబెట్టు నురు లన నెఱులై
కప్పారి కొదమతుమ్మెద
లుప్పయనము సేసినట్టి యొఱపున నొప్పున్. 70

అర్థము: అప్పొలఁతి (అ + పొలఁతి) = ఆస్త్రీ - పార్వతియొక్క, కురులు = వెండ్రుకలు, శివు-మనసు = శివునియొక్క మనస్సు, ఒప్పు + అఱి = ఒప్పుచెడి - నిశ్చలత్వము గోల్పోయి, తనున్ = తన్ను, తగులన్ + పెట్టు = తవులునట్లు చేయునట్టి - తనయం దాసక్తి గలవానినిగాఁ జేయునట్టి, ఉరులు=ఉచ్చులు, అనన్ = అనునట్లు, నెఱులు + ఐ = చక్కనివయి, కప్పారి (కప్పు + ఆరి) = నలుపెక్కి, కొదమ - తుమ్మెదలు = పిల్లతుమ్మెదలు, ఉప్పయనము + చేసిన + అట్టి = బసచేసినట్టి, ఒఱపునన్ = విధమున, ఒప్పున్,

తాత్పర్యము: ఆ పార్వతి శిరోజములు శివుని మనస్సు నైశ్చల్యమును గోలుపోయి తనయం దాసక్తి గలవానినిగాఁ జేయునట్టి యుచ్చు లనునట్లు సుందరములయి, నలుపెక్కి పిల్లతుమ్మెదలు పయనించుచు బసచేసినవిధమున నొప్పును,

విశేషములు: అలంకార ముత్ప్రేక్ష.

తగులఁబెట్టు + ఉరులు - 'ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' బాల. సంధి. 33. తగులఁబెట్టు నురులు. ఉప్పయనము- (ప్రయాణ మాఁపుట - బసచేయుట. ఇంకను విచార్యము,) (ప్రయోగాంతరము లేదని సూ. ని,) కన్నడము - ఉప్పయణ = యుద్ధప్రయాణమునకై చేయు బస,

క, చమరీతతియుఁ గలాపులు
నుమ కేశ తమాల తరు లతోఁ గ్రాటవిలో
రమియింపఁగఁ దగు ననఁ దగి
నమ మగు హరి నవ్య నీల చల దలి సమమై. 71

అర్థము : చమరీ - తతియున్ = ఆఁడు చమరమృగముల గుంపును, కలాపులున్ = నెమిళ్లును, ఉమ = పార్వతియొక్క, కేశ - తమాల - తరు - లతా + ఉగ్ర + అటవిలోన్ = శిరోజములనెడి చీఁకటిమ్రాఁకులతోను దీఁగలతోను భయంకరమైన అడవిలో, రమియింపఁగన్ = క్రీడించుటకు - విహరించుటకు, తగున్ + అనన్ + తగి = తగు ననఁగా నొప్పి, హరి-నవ్య-నీల-చలత్ + అలి-సమము + ఐ = క్రొత్త యింద్రనీలములతోను, చలించుచున్న తుమ్మెదలతోను సమానమయి, సమము + అగున్ = ఒప్పును.

తాత్పర్యము : పార్వతి కేశపాశము చమరీమృగముల గుంపును, నెమళ్లును అది యనెడి చీఁకటిమ్రాఁకులతీఁగలచే భయంకరమైన అడవిలో విహరింపఁదగియుండు నన నొప్పి క్రొత్త యింద్రనీలమణులకును, చలించు తుమ్మెదలకును దుల్యమయి సుందరముగా నుండును.

విశేషములు : ఉమ కేశపాశము చీఁకటిమ్రాఁకులతీఁగలచే భయంకరమైన అరణ్యమువలె నుండి చమరీమృగములును, నెమిళ్లును విహరింప యోగ్యముగా నున్నదనుట. శిరోజములను చమరీవాలములతోను, కలాపి కలాపముతోను బోల్చుట కవిసమయము. చీఁకటిమ్రాఁకుల తీగలచే నుగ్రమైన యడవి యననేల యన, చీఁకటిమ్రాఁకులవలెనే శిరోజములు నల్లగా నుండును. హరి నవ్య నీల - నవ్య శబ్దము హరి నీల - శబ్దముల నడుమ నున్నది, హరి నీలములు నలుపు, క్రొత్తవి యింకను నలుపు, అళులుకూడ నలుపే. హరి నవ్యనీల చలదలి సమమై - అలంకార ముపమ, కేశ తమాల తరులతోగ్రాటవిలో - కేశములనెడి తమాలతరులతోగ్రాటవి-రూపకాలంకారము. మొత్తముమీఁద నుత్ప్రేక్ష. ఇందు తగి, అగు, అను క్రియలకుఁ గర్తలుగా ఉమకేశములను అధ్యాహార్యము చేసికొనవలయును.

క. స్మరకలహంబునఁ బతి దెస
గిరిసుత పిఱుఁదైన నఖకేళి మహేశున్
మరుఁడుతగిలించి గెలువఁగఁ
గర మమరిన నెత్తపలకగతి వీఁ పొప్పున్. 72

అర్థము: ప్మర - కలహంబునన్ = ప్రణయకలహముచే, గిరి-సుత= కొండ కూఁతురు - పార్వతి, పతి - దెసన్ = భర్తనుండి, పిఱుఁదు + ఐనన్ = వెనుకకుఁ దిరుగఁగా, మరుఁడు = మన్మథుఁడు, మహేశున్ = మహేశ్వరుని, అక్ష-కేళిన్ = ద్యూతక్రీడయందు, తగిలించి = ఆసక్తినొందఁజేసి, గెలువఁగన్ = జయింప, కరము = మిక్కిలి, అమరిన = ఒప్పినట్టి, నెత్తపలక - గతిన్ = జూదమాడుట కుపయోగించు పలకవలె, వీఁపు + ఒప్పున్ = వీఁపు అందగించును.

తాత్పర్యము: పార్వతి ప్రణయకలహమున భర్తనుండి వెనుకకుఁ దిరిగియుండఁగా, మన్మథుఁడు శివుని ద్యూతక్రీడయందాసక్తి గలవానినిగాఁజేసి గెలుచుటకు మిక్కిలి యొప్పిన నెత్తపలకవలె నామె వీఁపు అందగించును.

విశేషములు: అలంకార ముత్ప్రేక్ష, వీఁపును నెత్తపలకతోఁ బోల్చుట కవిసమయము.

వ. అని యనేకప్రకారంబుల వర్ణింపందగిన వర్ణనల కమరి. 78

అర్థము: అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కురీతుల, వర్ణింపన్ + తగిన, వర్ణనలకున్, అమరి=ఒప్పి.

తాత్పర్యము: ఈ రీతిగాఁ బెక్కువిధముల వర్ణనీయ వర్ణనలకొప్పి- తరువాతి పద్యముతో నన్వయము.

సీ. మధు సమాకలితమై మవ్వమారిన మారు
నవలత నా మేన నవక మెక్కెఁ,
దరణి చే సోఁకినఁ దావి పొంపిరిపోవు
తమ్మి నాఁ దగు సుగంధంబు సుడిసె,
మది శరత్సంగతి మత్తిల్లి క్రాలు రా
యంచ నా మద మందయాన మమరె,
దాలిమి రసనేవ సోలి ముద్దాడు రా
చిలుక నా పెడ దొక్కుఁబలుకు లొప్పె.

తే. మరుఁడు శృంగారలక్ష్మిఁ జిత్తరువు నెరయ
వ్రాసి తెమ్మెర లాయువు వోసినట్లు
సుందరాకృతిఁ దైలోక్యసుభగ యయ్యె
శైలనందన యౌవన సంగమమున. 74

అర్థము : శైల-నందన = కొండ-కూఁతురు-పార్వతి, యౌవన - సంగమమునన్ = జవ్వనముతోడి కూడికచే -

మధు- సమాకలితము + ఐ = వసంతునితోఁ గూడినదయి, మవ్వమారిన = కోమలమయిన, మారు-నవ-లత-నాన్ = మన్మథుఁడనెడి క్రొత్త తీఁగ, అనునట్లు, మేనన్ = శరీరమునందు, నవకము + ఎక్కెన్ = మృదుత్వ మతిశయించెను.

తరణి - చే - సోఁకినన్ = సూర్యుని, చేయి (కిరణము), తాఁకఁగా, తావి = పరిమళము, పొంపిరివోవు - (పొంపిరి + పోవు) = అతిశయించు, తమ్మి - నాన్ = తామర యనునట్లు, తగు = ఒప్పునట్టి, సుగంధంబు = సువాసన, సుడిసెన్ = వ్యాపించెను.

మది = మనస్సు, శరద్ + సంగతిన్ = శరత్కాల సాంగత్యముచే, మత్తిలి = మదించి, క్రాలు = సంచరించు, రాయంచ-నాన్ = రాజహంసము అనఁగా, మద-మంద-యానము = మదమువలని మెల్లని గమనము, అమరెన్ = ఒప్పెను,

దాలిమి-రస-సేవన్ = దానిమ్మపండు రసముయొక్క ఆస్వాదముచే, సోలి = పరవశించి, ముద్దాడు (ముద్దు + ఆడు) = ముద్దుగాఁబలుకు, రాచిలుక-నాన్ = రాజకీర మన, వెద దొక్కుఁ బలుకులు = ఇంచుక అవ్యక్తమధురములైన మాటలు, ఒప్పెన్.

మరుఁడు = మన్మథుఁడు, శృంగార-లక్ష్మిన్ = శృంగార మనెడి లక్ష్మిని, చిత్తరువు = చిత్రపటము, నెరయన్ = నిండుగా, వ్రాసి = లిఖించి, తెమ్మెరలు = దక్షిణ

మారుతము, ఆయువు+పోసిన+అట్లు=ఊపిరిపోసినట్లు - ప్రాణముపోసినవిధమున, సుందర+ఆకృతిన్=అందమయిన ఆకారముతో, త్రైలోక్యసుభగ = ముల్లోకము ళందును, అందమయినది, అయ్యెన్,

తాత్పర్యము: పార్వతి యౌవనవతి కాఁగా-వసంతునితోఁగూడినదై కోమల మైన మన్మథుఁడనెడి క్రొత్తతీఁగయా యనునట్లు ఆమె మేన మృదుత్వ మతిశయించెను. సూర్యకిరణము సోఁకఁగాఁ బరిమళ మతిశయించు తామరయా యనునట్లు ఆమె మేన సుగంధము వ్యాపించెను. శరత్కాలము రాఁగా మదించి సంచరించు రాయంచయా యనునట్లు ఆమెకు మందగమన మొప్పెను. దానిమ్మపండు రసము నాస్వాదించుటచేఁ బరవశించి ముద్దుగాఁబలుకు రాచిలుకయా యనునట్లు ఆమె అవ్యక్తమధురముగా మాట లాడఁదొడఁగెను. మన్మథుఁడు శృంగారమనెడి లక్ష్మిని చిత్రపటమున లిఖించి దక్షిణ మారుతము నూపిరిపోసెనా యనునట్లు ఆమె సుందరాకారముతోఁ త్రిలోకసుందరి యయ్యెను.

విశేషములు: మారు నవలత-మారుఁడనెడి నవలత-రూపకము. మార నవలత యని యున్నచో బాగుగానుండెడిది. పద్యమునందలి పాదము లన్నింటను నలంకార ముత్ప్రేక్ష. 'మరుఁడు శృంగారలక్ష్మి.... ....వోసినట్లు - రూపకానుప్రాణి తోత్ప్రేక్ష. 'దాలిమి-వా.ప్రతిలో 'దా'కు ముం దరసున్న గలదు, అప్పుడు తాలిమియై అర్థము పొసఁగదు. సూ.ని.లో 'దాళిమి' గలదు. దాడిమి=దాళిమి=దాలిమి.'లడయో రభేదః.'

యౌవనము (ప్రకృతి)-జవ్వనము (వికృతి). ఆయువు వోసినట్లు-ఆయువు+ పోసినట్లు-గసడదవాదేశము బాల. సంధి.13. చిత్తరువు (వికృతి)-చిత్రము (ప్రకృతి).

క. మెఱుఁగుల కచిరత, శశికిం
గఱయును, మణి కనకములకుఁ గాఠిన్యము, లేఁ
బొఱకుం గాష్ఠము దక్కఁగ
మెఱుఁగెల్లను వచ్చి గిరిజ మేనన నిల్చెన్. 75

అర్థము: మెఱుఁగులకున్=మెఱపులకు. అచిరత=అచిరత్వమును-క్షణికత్వ మును-అచిరద్యుతి యనఁగా మెఱపు, శశికిన్=చంద్రునకు, కఱయును=మచ్చయును,

మణి-కనకములకున్=మణికిని, బంగారమునకును, కాఠిన్యము=గట్టితనము, లేఁబొఱకున్ (లేఁత+పొఱ)=లేఁతపొఱకు-చిగురుటాకునకు, కాష్ఠమున్=కఱ్ఱయును, (ఈనెయును), లకన్ఁగన్=పోఁగా, మెఱుఁగు+ఎల్లను=కాంతి యంతయు, వచ్చి, గిరిజ, మేనన్+అ=పార్వతి మేనియందే, నిల్చెన్.

తాత్పర్యము: మెఱుఁగులకు క్షణికత్వము, చంద్రునకు మచ్చయును, మణికిని కనకమునకును గఠినత్వమును, లేఁజిగురుటాకునకు ఈనెయును బోఁగా మిగిలిన మెఱుఁగంతయు వచ్చి పార్వతి మేనియందే నిలిచెను.

విశేషములు: మెఱుఁగు మున్నగువానికిఁ గాంతి యున్నది గాని యొక్కొక్కదాని కొక్కొక్క దోషము గలదు. వాని మెఱుగు లన్నియు నాత్మదోషవిరహితములై పార్వతి మేనిఁ జేరె ననిభావము. పొఱ=చిగురుటాకు.

పవ్వంపుఁబొఱలు - నన్నెచోడుని ప్రయోగాంతరము (9-113). లేఁబొఱ=లేఁత + పొఱ - ప్రాఁతాదిసంధి బాల.సంధి. (36), మగాగమము (37). ద్రుతకార్యము (16,17).

చ. తలతలఁ బ్రజ్వరిల్లు సితధామ కలంకముఁబాచి వక్త్రమం
డలరుచి పర్వె దిక్కులఁ గడల్కొని చూపఱు సంచలించి బి
ట్టులుకఁగ వాణియు న్నెరసి యొందొక భంగి సురంగ మయ్యెఁ; జూ
పులు పొలపంబు గై కొనియె భ్రూలత లంతకుఁ జెన్ను వింతగాన్. 76

అర్థము: వక్త్ర-మండల-రుచి=ముఖమండలముయొక్క కాంతి, దిక్కులన్=దిక్కులందు, కడల్కొని=వ్యాపించి, చూపఱు=చూచువారు, సంచలించి=మిక్కిలి చలించి, బిట్టు=మిక్కిలిగా, ఉలుకఁగన్=భయపడఁగా, తలతల=తలతలమని, ప్రజ్వరిల్లు = ప్రకాశించునట్టి, సితధామ-కలంకమున్=తెల్లనికిరణములు గలవాఁడగు చంద్రుని మచ్చను, పాచి=తొలఁగించి, పర్వెన్=వ్యాపించెను, వాణియున్=మాటయును-కంఠస్వరమును, నెరపి=నిండుఁదనమునొంది, ఒందొకభంగిన్=ఒకరీతిగా, సురంగము=అందమయినది,అయ్యెన్, భ్రూలతలు=బొమతీవలు , అంతకున్=మును

పటికంచెను, చెన్ను=అందము, వింత+కాన్=క్రొత్తదిగాఁగా, చూపులు, పొలుపంబు=కాంతి, కైకొనియెన్=గ్రహించెను.

తాత్పర్యము: పార్వతి ముఖమండలకాంతి చంద్రునిలోని కళంకమును గూడ తొలఁగించి దిక్కుల వ్యాపించెను, అది చూచి చూపఱు విభ్రమ చెందిరి. ఆమె కంఠస్వరముగూడ నింపుఁదనమును బొంది యొకవిధమైన యందమును సంతరించుకొనెను, బొమతీవలకు మునుపటికంటె నొక వింతయందమేర్పడఁగా నామె చూపులు కాంతిమంతము లయ్యెను.

విశేషములు: సురంగము=అందము. దీనికి నన్నెచోడునివే ప్రయోగాంతరములు-అపాంగావలోకనంబు సురంగంబై-5-120./ పసిండి యాయుధంబున సురియ సురంగంబుగా-9-25.

వ. మఱియును. 77

సీ. శశిబింబ మణిహేమ సౌదామనీ చయో
త్కర కాంతు లన్నియు నరసి తెచ్చి,
నవ లతా పుష్ప పల్లవ బిస కోమల
విభవంబు లన్నియు వెదకి తెచ్చి,
కర్పూర చందన కాశ్మీర మృగమ దా
మోదంబు లన్నియు మొంచి తెచ్చి,
పరివాదినీ శుక పరపుష్ట మధుక రా
రావంబు లన్నియు రాచి తెచ్చి,

ఆ. హావ భావ రూప లావణ్య సారముల్
త్రిభువనముల నేర్చి తెచ్చి నేర్పు
సూపఁదలఁచి యాఁడు రూపుఁ జేసె దోసరించె
నని నుతింప నొప్పు నగతనూజ. 78

అర్థము : అజుఁడు=బ్రహ్మ.

శశిబింబ......కాంతులు; శశిబింబ=చంద్రబింబముయొక్కయు, మణి= మణులయొక్కయు. హేమ = బంగారముయొక్కయు, సౌదామనీ = మెఱపుల యొక్కయు, ఓఘ = సమాహారములయొక్క, ఉత్కర = సమూహముయొక్క. కాంతులు, అన్నియున్, అరసి=వెదకి, తెచ్చి.

నవ......విభవంబులు; నవ=క్రొత్తవియగు, లతా = తీఁగలయొక్కయు, పుష్ప=పూవులయొక్కయు, పల్లవ = చివురులయొక్కయు, బిస = తామరతూండ్ల యొక్కయు, కోమల=మృదువులైన, విభవంబులు సంపదలు, అన్నియున్, వెదకి, తెచ్చి.

కర్పూర......మోదంబులు: కర్పూర=కప్పురముయొక్కయు, చందన = మంచిగంధముయొక్కయు, కాశ్మీర=కుంకుమపువ్వుయొక్కయు, మృగమద=కస్తూరి యొక్కయు. ఆమోదంబులు=పరిమళములు, అన్నియున్, ముంచి=యత్నించి, తెచ్చి,

పరివాదినీ......రావంబులు: పరివాదినీ = ఏడుతంతుల వీణెలయొక్కయు, శుక=చిలుకలయొక్కయు, పరపుష్ట=కోకిలలయొక్కయు, మధుకర = తుమ్మెదల యొక్కయు, ఆరావంబులు=ధ్వనులు, అన్నియున్, రాచి=విచారణచేసి, తెచ్చి.

హావ .... సారముల్ : హావ = భ్రూనేత్రాదివికారములచేఁ గొంచెము తెలియఁదగిన మనోవికారములయొక్కయు, భావ=మనోఽభిప్రాయములయొక్కయు, రూప = అందముయొక్కయు, లావణ్య=కాంతివిశేషములయొక్కయు, సారముల్ = సంపదలు, త్రిభువనములన్ = ముల్లోకములయందును, ఏర్చి = ఎన్ని, తెచ్చి, నేర్పు. మీఱఁగ + పరఁచి, ఆఁడురూపు=స్త్రీ రూపము, ఒనరించెన్=చేసెను, అని, నుతింపన్ = పొగడునట్లు, అగ - తనూజ = కొండ - కూఁతురు - పార్వతి, ఒప్పెన్.

తాత్పర్యము : చంద్రబింబము, మణులు, బంగారము, మెఱపులు అనువాని సమూహముయొక్క కాంతు లన్నియుఁ బరిశీలించి తెచ్చియు, క్రొత్త తీఁగలు, పూవులు, చివురులు, తూండ్లు అనువాని మృదుసంపద లన్నియు, వెదకితెచ్చియు, కర్పూరము, మంచి

గంధము, కుంకుమపువ్వు, కస్తూరి అనువాని పరిమళము లన్నియుఁ బూనితెచ్చి, ఏడు తంతులవీణలు, చిలుకలు, కోకిలలు, తుమ్మెదలు అనువాని ధ్వనులన్నియు ఏరాటజేసితెచ్చి, హావములు, భావములు, రూపము, లావణ్యము అనువాని నిగ్గులు ముల్లోకములందును ఎన్ని తెచ్చి, తన నైపుణ్యమును జూపెంచి బ్రహ్మ స్త్రీరూపమును జేసెనని పొగడునట్లు పార్వతి యొప్పును.

విశేషములు: పార్వతి దేహకాంతి, మార్దవము, పరిమళము, కంఠస్వరము, హావభావాది మనోవికారములు ముల్లోకములందును శ్రేష్ఠములై యున్న వనుట. అలంకారము హేతూత్ప్రేక్ష.

వ. మఱియు నఖిల లావణ్య పుణ్యాధిదేవతయు, నశేష సౌభాగ్య లక్ష్మియు, నపార గుణ మణి గణ భూషణానర్ఘ నాయక మణియు, నిఖిల భర్తృదారికా విమల ముక్తాఫల హార తరల సరసీరుహరాగ రత్నంబునుం బూర్ణయౌవనాలంకృతయునై యొప్పుచున్న పార్వతిం జూచి హిమవంతుఁ డనంత సంతోష రసాపూరితాంతరంగుండై. 79

అర్థము: మఱియున్, అఖిల - లావణ్య - పుణ్య + అధిదేవతయున్ = ఎల్ల సౌందర్యము అనెడి పుణ్యమునకు అధిష్ఠాన దేవతయు, అశేష - సౌభాగ్య - లక్ష్మియున్ = ఎల్ల వైభవములకు లక్ష్మియు, అపార .... మణియున్: అపార = అనంతములైన, గుణ = సద్గుణము లనెడి, మణి = మణులయొక్క, గణ = సమూహముగల, భూషణ = అలంకారములందు, అనర్ఘ = అమూల్యమయి, నాయక మణియున్ = హారమధ్యమణి యైనదియు, నిఖిల .... రత్నంబునున్: నిఖిల = ఎల్ల, భర్తృదారికా = రాజకుమారికలనెడి, విమల = స్వచ్ఛమైన, ముక్తాఫల - హార = ముత్యాలపేరునందలి, తరల = నాయకమణి యైన, సరసీరుహరాగరత్నంబునున్ = పద్మరాగమణియును, పూర్ణ - యౌవన + అలంకృతయున్ = నిండుజవ్వనముచే నలంకరింపఁబడినదియు, ఐ, ఒప్పుచున్ + ఉన్న, పార్వతిన్, చూచి, హిమవంతుఁడు, అనంత - సంతోష - రస + ఆపూరిత + అంతరంగుండు + ఐ = అంతములేని సంతోషరసముచేత బాగుగా నింపఁబడిన మనస్సు గలవాఁడయి.

తాత్పర్యము : మఱియును సర్వసౌందర్యము లనెడి పుణ్యములకు అధిష్ఠానదేవతయు, ఎల్ల వైభవములకు లక్ష్మియు. అపారమునైన సుగుణము లనెడి మణుల సమూహముగల యలంకారమునందలి అమూల్యమైన మధ్యమణియైనదియు, రాజకుమారిక లనెడి నిర్మలమునైన ముత్యాలహారములో నాయకమణియైన పద్మరాగమణియైనదియును, నిండుజవ్వనముచే నలంకరింపఁబడినదియు నయి యొప్పుచున్న పార్వతిని జూచి హిమవంతుఁ డపారసంతోషముచే నిండిన మనస్సు గలవాఁడయి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : అలంకారము రూపకము.

క. పేద నిధానము గన్నట్లాదరితమునం దనూజ నగ్గించుచు నా
హ్లాదమునఁ దగిన వరుఁ డిం
ద్రాది సురులలోన నెవ్వఁ డగునో యనుచున్. 80

అర్థము : పేద = పేదవాఁడు, నిధానము = నిధిని, కన్న + అట్లు = చూచిన విధమున, ఆదరితమునన్ = ఆదరముతో, తనూజన్ = కూఁతును, అగ్గించుచున్ = పొగడుచు, ఆహ్లాదమునన్ = సంతోషముతో, తగిన - వరుఁడు = యోగ్యుఁడయిన పెండ్లికొడుకు, ఇంద్ర + ఆది - సురులలోనన్ = ఇంద్రుఁడు మున్నగు దేవతలలో, ఎవ్వఁడు, అగునో, అనుచున్.

తాత్పర్యము : పేదవాఁడు పెన్నిధిని జూచిన విధమునఁ గూఁతు నాదరమ్మునఁ గొనియాడుచు. సంతోషముతో, నింద్రాదిదేవతలలో నిమెకుఁ దగిన పెండ్లికొడు కెవ్వఁ డగునో యనుచు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : వ్రాఁతప్రతులలో ఇంద్రాదిసురలలోన అని కలదు. సురశబ్దము సంస్కృతసమాసమున ఋతుల్యము గా దనుటచే (బాల. తత్సమ. 60) ఇంద్రాది సురులలోన, అని మార్పఁబడినది. పేద నిధానము గన్నట్లు ...., అలంకార ముపమ.

వ. దోలాయమానమానసుఁ డగుచున్నయెడ. 81

అర్థము : దోలాయమాన = ఊయలవలె నగుచున్న, మానసుండు = మనస్సుగలవాఁడు, అగుచున్ + ఉన్న + ఎడన్ = అగుచుండఁగా.

తాత్పర్యము : మనస్సు ఊయెలవలె నూఁగులాడుచుండఁగా - తరువాతి పద్యముతో నన్వయము.

నారదాదేశము

చ. గొనకొని సామగానమునకున్ మెఱుఁగిచ్చు జతిస్వరంబులం
దెనకొని మ్రోయ వీణె మొరయించుచు రాగరసప్రవాహమో
యనఁగఁ బిశంగజూటరుచు లంబుదమార్గమునందుఁ బర్వ భో
రనఁ జనుదెంచె నారద మహాముని తద్గిరిపాలు పాలికిన్. 82

అర్థము : గొనకొని = అతిశయించి. సామగానమునకున్ = సామవేదగానమునకు, మెఱుఁగు + ఇచ్చు = మెఱుఁగుపెట్టునట్టి, జతి - స్వరంబులందున్ = గీతభేదస్వరములందు, ఎనకొని = పోటీయయి, మ్రోయన్ = మ్రోయునట్లు, వీణెన్ = వీణను, మొరయించుచున్ = వాయించుచు, రాగ - రస - ప్రవాహమో = గానమనెడిరసముయొక్క ప్రవాహమో, (ఎఱ్ఱనిద్రవముయొక్క ప్రవాహమో అని అర్థాంతరము) అనఁగన్ = అనునట్లు, పిశంగ - జూట - రుచులు = కపిలవర్ణముగల జడముడియొక్క కాంతులు, అంబుద - మార్గమునందున్ = ఆకాశమున, పర్వన్ = వ్యాపింపఁగా, నారద - మహత్ (మహా) + ముని, తద్ + గిరి - పాలు - పాలికిన్ = ఆ కొండలఱేని కడకు, భోరనన్ = శీఘ్రముగా, చనుదెంచెన్ = వచ్చెను.

తాత్పర్యము : సామగానమునకు మెఱుఁగులు దిద్దు గీతస్వరములతో వీణ వాయించుచు, సంగీతరసప్రవాహమా యనునట్లు కపిలవర్ణపు జడముడి కాంతు లాకాశమున వ్యాపింపఁగా నారదమహాముని కొండలఱేఁడగు నా హిమవంతునికడ కరుదెంచెను.

విశేషములు : నారదుఁడు సామగానమునకు మెఱుఁగులు దిద్దునట్లు గీతభేదస్వరములతో వీణను వాయించుచుండెను, రాగరసప్రవాహమో యనఁగ-ఉత్ప్రేక్ష, స్వభావోక్తి.

వ. ఇట్లు చనుదెంచు నారదమహామునిం గని యతిసంభ్రమంబున నెదురువచ్చి వినయవినమితోత్తమాంగుండై యాసన పాద్యాద్యశేషార్చనా విధి నభ్యర్చితుం జేసిన గిరిపతికి నమ్మునిపతి కరుణించి హితోపదేశంబు సేయందలంచి శివశక్తిభేదంబులు దెలిపి పార్వతీ పూర్వప్రపంచంబు విశేషించి యెఱింగించి మఱియు నాతనికి మనో నిశ్చయంబు సేయ నభిముఖుండై. 83

అర్థము: ఇట్లు, చనుదెంచు = వచ్చు, నారద-మహామునిన్, కని, అతి-సంభ్రమంబునన్ = మిక్కిలి వేగిరపాటుతో, ఎదురువచ్చి, వినయ-వినమిత-ఉత్తమాంగుండు+ఐ=అడఁకువచే వంపఁబడిన శిరస్సు గలవాఁడయి, ఆసన-పాద్య-ఆది+అశేష+అర్చనా-విధిన్=ఆసనము, పాద్యము (కాళ్లుకడుగనీరు) మొదలగు నెల్ల పూజావిధానముతో, అభి + అర్చితున్=పూజింపఁబడినవానిని, చేసినన్=చేయఁగా, గిరి-పతికిన్ = కొండల ఱేనికి, ఆ+ముని-పతి = ఆ మునిశ్రేష్ఠుఁడు-నారదుఁడు, కరుణించి=దయఁజూచి, హిత+ఉపదేశంబు + చేయన్+తలంచి=హితవునుపదేశింప నెంచి, శివ-శక్తి-భేదంబులు=శివునకును, శక్తికిని గల భేదములు, తెలిపి, పార్వతీ-పూర్వ-ప్రపంచంబున్ = పార్వతియొక్క పూర్వజన్మవృత్తాంతమును, విశేషించి= ముఖ్యముగా, ఎఱింగించి, మఱియున్, ఆతనికిన్=హిమవంతునకు, మనస్ (ః)+ నిశ్చయంబు+చేయన్= మనస్సు నిర్ణయమును జేయుటకు, అభిముఖుండు+ఐ= సంసిద్ధుఁడయి.

తాత్పర్యము: ఇట్లు వచ్చునట్టి నారదమహామునిని జూచి మిక్కిలి వేగిరపాటుతో నెదురువచ్చి వినయముతో శిరస్సువంచి, ఆసనము, పాద్యము మున్నగు నెల్ల పూజావిధానములచేఁ బూజితునిజేయఁగా, నా హిమవంతుని నారదుఁడు కరుణించి, హితవుఁ గఱప నెంచి, శివునకును, శక్తికిని గల భేదములు తెలిపి, పార్వతి పూర్వ జన్మవృత్తాంతమును ముఖ్యముగా నెఱిఁగించి, మఱియు నతనికి మనోనిశ్చయము చేయ సంసిద్ధుఁడయి- తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: గిరిపతికి కరుణించి- ఇందలి షష్ఠీకారకము గమనార్హము. ద్వితీయ యిప్పటి వాడుక.

క. ఈ దేవి లోకజనని మ
హాదేవున కగ్రమహిషియై పేర్మి సురేం
ద్రాదుల కర్చిత యగు నని
యాదేశము చేసి యమ్మహాముని చనియెన్. 84

అర్థము: ఈ-దేవి=ఈ పార్వతీదేవి, లోక-జనని=జగన్మాత, మహాదేవునకున్=శివునకు, అగ్ర-మహిషి+ఐ=పట్టపుదేవియయి, పేర్మిన్=గొప్పతనముతో, సుర+ఇంద్ర+ఆదులకున్=దేవేంద్రుఁడు మున్నగువారికి, అర్చిత=పూజింపఁబడినది, అగున్, అని, ఆదేశము-చేసి = ఆనతిచ్చి, ఆ+మహత్ (మహా)-ముని =ఆ గొప్ప ముని-నారదుఁడు, చనియెన్=వెడలెను.

తాత్పర్యము: 'ఈ దేవి జగన్మాత. ఈమె యీశ్వరునకుఁ బట్టపుదేవియై గొప్పతనముతో నింద్రాదులచేఁ బూజింపఁబడినది యగునని యానతిచ్చి నారదుఁ డరిగెను,

క. హిమవంతుఁ డెలమిఁ ద్రైలో
క్యము నలవడ నేలినంతకంటె మనోరా
గమున నిజతనయఁ గులదై
వము కాఁ గొనియాడుచుండె వదలక నెమ్మిన్. 85

అర్థము; హిమవంతుఁడు, ఎలమిన్=సంతోషముతో, త్రైలోక్యము = ముల్లోకములను, అలవడన్=స్వాధీనమయినట్లు, ఏలిన+అంత-కంటెన్=పరిపాలించి నంతకంటెను, మనస్ (ః) + రాగమునన్=మనస్సునందలి ప్రేమముతో, నిజ-తనయన్=తన కూఁతును, వదలక=వీడక-ఉపేక్షింపక, నెమ్మిన్=ప్రీతితో, కుల దైవము + అ = కులదేవతయే, కాన్ = అగునట్లు, కొనియాడుచున్+ఉండెన్= ప్రశంసించుచుండెను.

తాత్పర్యము: హిమవంతుఁడు సంతోషముతో ముల్లోకములను బరిపాలించి నంతకంటెను హృదయానురాగముతోఁ దన పుత్త్రిక యగు పార్వతిని ఉపేక్షింపక ప్రీతితోఁ గులదేవతయే అనునట్లు ప్రశంసించుచుండెను.

విశేషములు: మనస్+రాగము-పదాంత సకారమునకు విసర్గాదేశము, మనః+రాగము. హ్రస్వ అకారము తరువాతవచ్చు విసర్గమునకు హ్రస్వఅకారము కాని, మృదువ్యంజనములు (హశ్శులు) కాని పరమగునపుడు ఉ ఆదేశముగా వచ్చి పూర్వ మందున్న అకారముతోఁగూడి గుణసంధి ననుసరించి ఓ గా మారును. మన+ఉ+రాగము-మనోరాగము.

పార్వతిని హిమవంతుఁ డీశ్వరుని యుపచారమునకు నియమించుట

వ. తదవసరమ్మున. 86

అర్థతాత్పర్యములు: తద్+అవసరమ్మునన్=ఆ సమయమునందు. తరువాతి పద్యముతో నన్వయము.

గీ. సతి వియోగాగ్ని మనములో సంతతంబుఁ
దగిలికొని రాల దానికిఁ దనుపు సేయఁ
దలఁచియో – కాదు నిక్కమ తపము సేయ
వలచియో హిమగిరికి నీశ్వరుఁడు వచ్చె. 87

అర్థము: సతి-వియోగ + అగ్ని = సతీదేవితోడి విరహమనెడి అగ్ని, మనములోన్=మనస్సులో, సంతతంబున్=ఎల్లప్పుడును, తగిలికొని = బద్ధమయి, రాలన్=రగులఁగా.దానికిన్=ఆ అగ్నికి. తనుపు+చేయన్=చల్లఁదనము గలిగింపఁగా, తలఁచియో = ఎంచియో, కాదు, నిక్కము+అ = నిజముగనే, తపము+చేయన్, వలచియో=కోరియో, ఈశ్వరుఁడు, హిమ-గిరికిన్=మంచుకొండకు, వచ్చెన్.

తాత్పర్యము; సతీదేవివలని విరహమనెడి అగ్ని నిరంతరము మనస్సున లగ్నమయి రగులుచుండఁగా దానికిఁ జల్లఁదనము గలిగింప నెంచియో-కాక నిజముగానే తపము చేయఁగోరియో ఈశ్వరుఁడు హిమవత్పర్వతమునకు వచ్చెను.

విశేషములు: అలంకార మాక్షేపము. 'ఆక్షేప స్స్వయ ముక్తస్య ప్రతిషేధో విచారణాత్.' చన్ద్రాలోకం. మొదట నొక విషయమును జెప్పి, విచారించి, మరల దానికిఁ బ్రతిషేధము చెప్పుటయేని ఆక్షేపాలంకారమగును.

రౌలన్- రగులన్ - రవులన్ - 'అసమాప్యంబయి అసంయుక్తంబగు గకారంబునకు వకారంబు విభాష నగు.' బాల. అచ్చిక. 27. 'అచ్చికంబులం దయి యవులకు వక్రతమంబులు బహుళంబుగా నగు.' బాల. క్రియ.103-రౌలన్.

వ. ఇట్లు చనుదెంచి త దుపకంఠప్రదేశంబున నవతరించి. 88

అర్థము: ఇట్లు, చనుదెంచి=వచ్చి, తద్+ఉపకంఠ-ప్రదేశంబునన్=దానికి సమీపస్థలమున, అవతరించి=దిగి.

తాత్పర్యము; ఇట్లు వచ్చి దానికి దాపయినచోట దిగి-తరువాతి పద్యముతో నన్వయము.

సీ. రస రసాయన నిర్ఝర ప్రవాహానూన
గంగాప్రవాహ శీకరము లడరఁ,
దనుపార నెలరారు ఘనసార సురదారు
మందార చంపక చందనముల,
లలిత సర్వర్తుక ఫల పుష్ప పల్లవ
భరిత లతా గుల్మ తరు వనముల,
సురుచిర శశికాంత సూర్యకాంతానర్ఘ
మణి హేమమయ కుట్టిమస్థలముల,

తే. వంశ రుద్రాక్ష మాలూర కింశుకముల,
హంస కీర మయూర విహంగమముల,
ఋష్య సారంగ మృగ చమరీ మృగములఁ,
బావనంబగు దివ్య తపోవనంబు. 89

అర్థము :- రస-రసాయన......శీకరములు. రస-రసాయన=ఔషధములగు నిర్ఝర-ప్రవాహ=సెలయేఱులు గల, అనూన=తక్కువకాని, గంగా-ప్రవాహ=గంగానదీప్రవాహముయొక్క, శీకరములు=నీటిబిందువులు, అడరన్=అతిశయింపఁగా,

తనుహార్దన్ = తృప్తియగునట్లు, ఎలరారు = పుష్పించునట్టి, ఘనసార = కర్పూరము, సురదారు = దేవదారు, మందార, చంపక = సంపంగి, చందనములన్ = మంచిగంధము అనువృక్షములచేతను.

లలిత = అందమైన, సర్వర్తుక (సర్వ + ఋతుక) = అన్ని ఋతువులయందుండునట్టి, ఫల = పండ్లతోను, పుష్ప = పూలతోను, పల్లవ = చివురులతోను, భరిత = నిండిన, లతా = తీఁగల, గుల్మ = పొదల, తరు – వనములన్ = చెట్ల తోఁటలచేతను.

సురుచిర .... స్థలములన్ : సురుచిర = మిక్కిలి మనోహరములైన, శశికాంత = చంద్రకాంతశిలలతోను, సూర్యకాంత = సూర్యకాంతశిలలతోను, అనర్ఘ = అమూల్యములైన, మణి = మణులతోను, హేమ = బంగారముతోను, మయ = నిండిన, కుట్టిమ - స్థలములన్ = నెలకట్టుచోటులచేతను.

వంశ = వెదురులచేతను, రుద్రాక్ష = రుద్రాక్షవృక్షములచేతను, మాలూర = మారేడుచెట్లచేతను, కింశుకములన్ = మోదుగుచెట్లచేతను.

హంస - కీర - మయూర - విహంగమములన్ = హంసలు, చిలుకలు, నెమిళ్లు అను పక్షులచేతను.

ఋష్య - సారంగ - సృగ - చమరీ - మృగములన్ = మనుఁబోతులు, జింకలు, లేళ్లు, ఆఁడుసవరపుమెకములు అను పవిత్రమైన, దివ్య - తపస్ (ః) + వనంబు = గొప్ప తపోవనమును.

తాత్పర్యము : జలౌషధములగు సెలయేఱులుగల అధికమైన గంగాప్రవాహముల సీటిబిందువు లతిశయింపఁగాఁ దృప్తికరముగాఁ బుష్పించు కర్పూర దేవదారు, మందార, చంపక, చందన వృక్షములచేతను, మనోహరములైన సార్వకాలికములైన పండ్లు, పూవులు, అనువానితో నిండిన తీఁగలు, పొదలు, చెట్లు గల తోఁటలచేతను, మిక్కిలి మనోహరములైన చంద్రకాంతశిలలతోను, సూర్యకాంతశిలలతోను, అమూల్యములగు మణులతోను, బంగారుతోను నిర్మింపఁబడిన నెలకట్టులుగల ప్రదేశములచేతను, వెదురులు, రుద్రాక్షలు, మారేడులు, మోదుగులు అను వృక్షములచేతను,

హంసములు, చిలుకలు, నెమిళ్లు అను పక్షులచేతను, మనుఁబోతులు, ఇఱ్ఱులు, లేళ్లు, ఆఁబోతుపసరపుమెకములు అను జంతువులచేతను విచిత్రమైన విస్మయమగు తపోవనమును- తరువాతి వచనమునందలి 'కని' అనుదానితో నన్వయము.

విశేషములు : ఋష్య – ఋశ్య (రూపాం.)

వ. కని యంత సహకార కర్పూర నారికేళ నమేరు దేవదారు మందార పారిజాత జంబూ జంబీరాశోకానోకహలతామందిరాంతరంబున హిమవంతు నిరంతరోపార్జితానంతపుణ్యఫలంబునుంబోలె నవదాత శిశిర ద్యోతిత శశికాంత శిలాతలంబు సమాధిస్థానంబుగా స్వీకరించి నంది మహాకాళాది గణముఖ్యుల నిజ నియోగంబులంద నియమించి. 90

అర్థము : కని = చూచి, అంతన్, సహకార .... రాంతరంబునన్; సహకార = తియ్యమామిడి, కర్పూరము, నారికేళ = కొబ్బరి, నమేరు = సురపొన్న, దేవదారు, మందారము, పారిజాతము, జంబూ = నేరేడు, జంబీర = నిమ్మ, అశోకము, (అను). అనోకహ = చెట్లు, లతా = తీఁగలు, మందిర + అంతరంబునన్ = ఇంటి లోపలిభాగమున, హిమవంతు = హిమవంతునియొక్క, నిరంతర + ఉపార్జిత + అనంత - పుణ్య - ఫలంబున్ + పోలెన్ = ఎడతెగక, సంపాదింపఁబడిన, అంతములేని, పుణ్యముయొక్క, ఫలమువలె, (ఉండు), అవదాత - శిశిర - ద్యోతిత - శశికాంత శిలా - తలంబు = స్వచ్ఛమైన, చల్లని, ప్రకాశించు, చంద్రకాంతశిలలప్రదేశము; సమాధి-స్థానంబు - కాన్ = ధ్యానస్థలముగా, స్వీకరించి = అంగీకరించి, నంది, - మహాకాళ + ఆది - గణ - ముఖ్యులన్ = నందీశ్వరుఁడు, మహాకాళుఁడు మున్నగు ప్రమథగణప్రధానులను, నిజ - నియోగంబుల + అందున్ + అ = తమతమ విధులందె, నియమించి.

తాత్పర్యము : చూచి పిమ్మట తియ్యమామిడి, కర్పూరము, కొబ్బరి, సురపొన్న, దేవదారు, మందారము, పారిజాతము, నేరేడు, నిమ్మ, అశోకము అను వృక్షముల తీఁగల మందిరములోపలిభాగమున హిమవంతుఁడు నిరంతరము సంపాదించిన పుణ్యమునకు ఫలమో అన నున్న స్వచ్ఛము, శీతలము అయి ప్రకాశించు చంద్రకాంతశిలా

నిర్మలమైన ప్రదేశమును ధ్యానస్థానముగాఁ జేసికొని, నంది, మహాకాళుఁడు మున్నగు ప్రమథగణశ్రేష్ఠులను దమదమ విధులందు నియోగించి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : హిమవంతు నిరంతరోపార్జితానంత .... బోలె - ఉత్ప్రేక్షాలంకారము, ఇందు హిమవంతు అనునది నిరంతరోపార్జితా .... ఫలంబు అను విద్ధసమాసమధ్యగతమైన 'ఉపార్జిత' అను పదముతో నన్వయించుచున్నది. 'కొన్నిచోట్ల విద్ధసమాసమధ్యగతపదంబులతోఁ దద్భిన్నపదంబుల కన్వయంబు చూపట్టెడి,' ప్రౌఢ. సమాస. 35.

గీ. హిమనగంబుపైఁ బొలుపొందు హేమశిఖర
మనఁగఁ దనరారు కెంజడల్ పెనఁచి కట్టి
యందుఁ జుట్టిన దివిజాపగామలప్ర
వాహ మన నహిబంధంబు వఱల బిగిచి. 91

అర్థము : హిమ - నగంబుపైన్ = హిమవత్పర్వతముమీఁద, పొలుపొందు (పొలుపు + ఒందు) = ఒప్పునట్టి, హేమ - శిఖరము = బంగారు శృంగము, అనఁగన్, తనరారు = ఒప్పునట్టి, కెంజడల్ (కెంపు + జడల్) = ఎఱ్ఱని జడలు, పెనచి = మెలిపెట్టి, కట్టి, అందున్ = ఆ హిమపర్వతమునందు, చుట్టిన = చుట్టుకొనియున్న, దివిజ + ఆపగా + అమల - ప్రవాహము + అనన్ = ఆకాశగంగానదియొక్క నిర్మలమైనప్రవాహము అనునట్లు, అహి - బంధంబు = పాఁపకట్టు, వఱలన్ = ఒప్పునట్లు, బిగిచి = బిగించి.

తాత్పర్యము : హిమవత్పర్వతముపై నొప్పు బంగరుశృంగమన నొప్పు నెఱ్ఱనిజడలను మెలిపెట్టి కట్టి, ఆ కొండయందుఁ జుట్టును బ్రవహించు నాకాశగంగా విమలప్రవాహ మన సర్పబంధమును ఒప్పుగా బిగించి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : అలంకార ముపమ, తెల్లని శరీరముగల శివుఁడు హిమవత్పర్వతమువలెను, అతని శిరస్సు మీఁది కెంజడలు ఆ పర్వతము మీఁది హేమశిఖరము

వఱెను నుండెననుట. మఱియు నతఁడు తన కెంజడలచుట్టును జుట్టిన నాగబంధము హేమశిఖరమును జుట్టి ప్రవహించెడి యాకాశగంగవలె నొప్పుచుండెననుట.

కెంజడలు - కెంపు + జడలు-'సమాసంబున నంత్రాంతాదుల తొలియచ్చుమీఁది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.' బాల సంధి. 36 - కె+ జడలు. ఇట లుప్తశేషమునకుఁ బరుషము పరము గాకున్నను నుగాగమ మయి, ద్రుత కార్యము జరిగినట్లు భావింపవలయును. చిన్నయ దీనినే 'కెందామర కెంజడ లను ప్రయోగంబులు గానంబడియెడి'-బాల. సంధి. 38. అని వృత్తిలోఁ జేర్కొనియెను. పెనఁగు - ప్రేరణార్థకము పెనఁచు. 'అట్లుచుక్కుగాగమంబు లచంగ్వాది మాయ్యాదుల కగు నగుచో వాని కద్రాలు లోపించు,' బాల. క్రియ. 76. బిగిచి-బిగియు ధాతు ప్రేరణార్థక రూపము. బిగియు + చు = బిగుచు. పయి 76 వ సూత్రముచేతనే బిగియు+చు అని యేర్పడఁగా, 'చువర్ణంబులు పరంబులగునపు డిత్వంబున కుత్వం బగు.' - బాల క్రియ. 75 సూత్రముచే 'బిగుచు' అని యగును. 'సమానాశ్రయంబులం బూర్వకాలంబునం దివర్ణకం బగు' బిగుచు + ఇ-బాల.క్రియ. 38. 'అంద్వవగాగమంబులం దప్ప నపదాది స్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు,' బాల. సంధి. 11, 'ఇత్వంబుగాని యెత్వంబుగాని కూడుచో ననాద్యంబయిన యుత్వంబున కిత్వం బగు'-బాల.క్రియ. 85 - బిగిచి.

గీ. క్షీరవారాశి కెఱఁగిన కారు మొగులు
కరణి శశికాంతవేదిపై గౌరు తోలు
పఱచి విలసిల్ల నందుండి పరమపరుఁడు
పొలిచె నొగి మొగుల్పైఁ దటిత్పుంజ మనఁగ. 92

అర్థము: క్షీర - వారాశికిన్ = పాలసముద్రముమీఁదికి, ఎఱఁగిన = వ్రాలిన, కారు - మొగులు - కరణిన్ = నల్లని (వర్షాకాలపు)మబ్బువలె, శశికాంత - వేదిపైన్ = చంద్రకాంతపు టరఁగుమీఁద, గౌరు - తోలు = ఏనుఁగుచర్మము, పఱచి, విలసిల్లన్ = ప్రకాశింపఁగా, పరమ - పరుఁడు = పరాత్పరుఁడు - శివుఁడు, అందున్ = ఆ గజచర్మముమీఁద, ఉండి, మొగుల్పైన్ = మేఘముపై, తటిత్ + పుంజము + అనఁగన్ = మెఱుపుల సమూహము, అనఁగన్, ఒగిన్ = చక్కఁగా, పొలిచెన్ = ఒప్పెను.

తాత్పర్యము : పాలసంద్రముపై ప్రాలిన నల్లని మబ్బువలెఁ జంద్రకాంత మయవేదిపై నేనుఁగుతోలు పఱచి, పరమేశ్వరుఁడు దానిపైఁ గూర్చుండి మబ్బుపై మెఱుపుల గమి యమరునట్లు ప్రక్కఁగా నొప్పెను.

విశేషములు : అలంకార ముపమ.

గొరు - (రూపాం.) గవుదు, = ఏనుఁగు. 'ఏనుఁగు హత్తి గొ రేనుఁ గేన్గు నాఁగ దంతావళ నామ మౌ.' అం.భా. 2. 194. (నానా.) కాహళి. మొగులు - మొగిలు, మొయిలు, మొయులు (రూపాం.).

సీ. పద్మాసనస్థుఁడై భావించి శోషణ
దాహన ప్లావన తర్పణముల,
దేహోదయాత్మప్రతిష్ఠలు విధియించి,
యాగమరీతి బ్రహ్మాంగ వర్ణ
విన్యాసములు దీర్చి విమలాత్మదీపంబు
ప్రణవ సంపుటముగాఁ బ్రజ్వలించి,
వడి బాహ్యవర్తన ల్విడిచి ప్రత్యాహార
గతి మన స్సంతర్ముఖమ్ము సేసి,

ఆ. తన్నుఁదానె కాంచి తనయందుఁ జేతో ల
యంబు చేసి నిశ్చలాత్మయోగ
మయ సుధామృతాబ్ధిమగ్నుఁడై వరదుండు
నిరతిశయ సమాధినిష్ఠ నుండె. 93

అర్థము : పద్మ + ఆసనస్థుఁడు + ఐ = పద్మాసనమునందున్నవాఁడు, ఐ, భావించి = ధ్యానించి, శోషణ .... తర్పణములన్: శోషణ = ఎండుట, దాహన = కాలుట, ప్లావన = స్నానముచేయుట, తర్పణములన్ = తనుపుట అను వానిచే, దేహ + ఉదయ-ఆత్మ-ప్రతిష్ఠలు = దేహముయొక్క ఉదయము ఆత్మ యొక్క ప్రతిష్ఠలు, విధియించి = జరుగునట్లు చేసి, ఆగమ-రీతిన్ = వేదోక్త

ప్రకారముగా, బ్రహ్మాం .... నములు: బ్రహ్మ = బ్రహ్మయొక్క, అంగ = శరీరముయొక్కయు, వర్ణ = వర్ణములయొక్కయు, విన్యాసములు = అంగన్యాస కరన్యాసములు, తీర్చి = చేసి,

విమల + ఆత్మ-దీపంబు = నిర్మలమైన ఆత్మ అనెడి దీపమును, ప్రణవ-సంపుటముగాన్ = ఓంకార మనెడి సంపుటి కాఁగా, ప్రజ్వలించి = వెలిఁగించి,

వడిన్ = వేగముగా, బాహ్య వర్తనన్ = బాహ్యచేష్టలు, విడిచి = వదలి, ప్రత్యాహార-గతిన్ = ప్రత్యాహార మనెడి పద్ధతిలో, మనస్సు = మనస్సును, అంతర్ముఖమ్ము = లోనికిఁజూచునదిగా, చేసి, తన్నున్ + తాను + ఎ, కాంచి = చూచి, తనయందున్, చేతస్ (ః) + లయంబు = మనస్సుయొక్క-లయము చేసి,

నిశ్చల + ఆత్మ-యోగ..........మగ్నుఁడు: నిశ్చల = నిశ్చలమైన, ఆత్మ-యోగ-మయ = ఆత్మయోగవికార మయిన, సుఖ = ఆనంద మనెడు, అమృత + అబ్ధి = అమృత సముద్రమునందు, మగ్నుఁడు =మునిఁగినవాఁడు, ఐ, వరమందు = వరముల నిచ్చువాఁడగు నీశ్వరుఁడు, నిరతిశయ..........నిష్ఠన్ ; నిరతిశయ = మిక్కిలి గొప్పదయిన, సమాధి-నిష్ఠన్ = ధ్యాననిష్ఠయందు, ఉండెన్.

తాత్పర్యము; పరమేశ్వరుఁడు పద్మాసనము పైచికొని కూర్చుండి మనస్సునందు భావించి శోషణము, దాహనము, ప్లావనము, తర్పణము అను వానిచే దేహోదయాత్మ ప్రతిష్ఠలు గావించి, వేదోక్తవిధానమున అంగన్యాసకరన్యాసములను దీర్చి, ప్రణవసంపుటమునందు ఆత్మదీపమును వెలిఁగించి, బాహ్యచేష్టలు దక్కి మనస్సునంతర్ముఖముచేసి, తన్నుఁదానే చూచి తనయందుఁ జేతోలయమును జేసెను, ఇట్లు ఆత్మయోగరూపమయిన ఆనందామృతసముద్రమునందు నిమగ్నుఁడై ధ్యాననిష్ఠలో నుండెను.

విశేషములు: అలంకారము స్వభావోక్తి. రూపకము. ఈ పద్యమునందుఁ బరమేశ్వరుని ధ్యాననిష్ఠాప్రకార మభివర్ణింపఁబడినది.

క. అధ్యాత్మమూర్తి బ్రహ్మ హ
రి ధ్యేయాత్మకుఁడు సురవరేణ్యుఁడు సకలా
రాధ్యుఁ డయి తనరు తాను స
మాధ్యవహిత లీయమాన మానసుఁ డయ్యెన్. 94

అర్థము : అధ్యాత్మమూర్తి = పరమాత్మస్వరూపుఁడు, బ్రహ్మ-హరి. ధ్యేయ + ఆత్మకుఁడు = బ్రహ్మచేతను, విష్ణువుచేతను ధ్యానింపఁదగిన ఆత్మ గలవాఁడు, సుర-వరేణ్యుఁడు = దేవతలలో శ్రేష్ఠుఁడు, సకల + ఆరాధ్యుఁడు = ఎల్లరచేతను ఆరాధింపఁదగినవాఁడు, అయి, తనరు + ఒప్పునట్టి. తాను, సమాధి + అవహిత-లీయమాన-మానసుఁడు = నిరంతరధ్యానమునందు, ఉంపఁబడినదయి లయమగుచున్న మనస్సుగలవాఁడు, అయ్యెన్.

తాత్పర్యము : పరమాత్మస్వరూపుఁడును, బ్రహ్మవిష్ణువులచేత ధ్యానింపఁ దగిన ఆత్మగలవాఁడును. దేవతాశ్రేష్ఠుఁడును, ఎల్లరకుఁ బూజనీయుఁడును అయి యొప్పు తాను నిరంతరధ్యానమున నుంపఁబడినదయి అందు లీనమగుచున్న మనస్సు గలవాఁడయ్యెను.

గీ. తనకుఁ బర మొండు లే దనఁ దనరి వెలుఁగు
చుండు పరమేశ్వరుండు దా నుగ్రతపము
చేసె భక్తులు తనుఁ బ్రీతిఁ జేరవచ్చు
తెరువుఁ దాఁ దీర్చి చూపెడు తెఱఁగు వోలె. 95

అర్థము : తనకున్, పరము = ఉత్కృష్ట మయినది, ఒండు = ఒకటి. లేదు, అనన్ + తనరి = అన నొప్పి, వెలుఁగుచున్ + ఉండు = ప్రకాశించు చుండునట్టి, పరమేశ్వరుండు, భక్తులు, తనున్, ప్రీతిన్, చేరన్+వచ్చు, తెరువున్= మార్గమును, తాన్ = తాను, తీర్చి = ఏర్పఱిచి, చూపెడు, తెఱఁగు + పోలెన్ = రీతి వలె, తాను, ఉగ్ర-తపము = భయంకరమైన తపస్సు, చేసెన్.

తాత్పర్యము : తనకంటె నుత్కృష్టమైనది ఇంకొకటి లేదన నొప్పు పరమేశ్వరుఁడు - భక్తులు తన్నుఁ బ్రీతితోఁ జేరవచ్చు విధమును వారికి స్పష్టపఱుచు టకో యున ఘోరతపస్సు చేసెను.

విశేషములు: పరమేశ్వరుఁడు పరాత్పరుఁ డగుటచే నతనికంటెఁ బరమైనది యింకొకటి లేదు. అయినను అతఁడు తపోనియమమును జేయుట లోకరీతికిఁ గాను. తన భక్తులు తన్నుఁ జేరు నుపాయమును వారికిఁ దెలియఁజెప్పుటకు. అందుచే నిది హేతూత్ప్రేక్ష. కాళిదాసు కుమారసంభవమున 'స్వయం విధాతా తపసః ఫలానాం, కేనాపి కామేన తప శ్చచార' కుమా. 1.57. తాను స్వయముగాఁ దపఃఫలములనిచ్చువాఁడయ్యు నేదో కామమున (కేనాపికామేన) తపస్సు నాచరించెనని చెప్పఁగా, నన్నెచోడుఁడు ఆ కామ మిదియని సముచితముగా నుత్ప్రేక్షించి చెప్పుట గమనింపఁ దగినది.

ఉ. అంతకు మున్న సన్మతిఁ బురాంతకు రాకయు, వచ్చియున్న వృ
త్తాంతము మేలుగా నెఱిఁగి, యా హిమవంతుఁ డనంత సంభ్రమా
త్యంత మనోఽనురాగమున నప్పుడ వాజి వరూథ దంతి సా
మంత విలాసినీ స్వజన మంత్రి పురోహిత భృత్య యుక్తుఁడై. 96

అర్థము: అంతకున్ + మున్ను + అ = అంతకు ముందే, హిమవంతుఁడు, సత్ + మతిన్ = మంచి మనస్సుతో, పుర + అంతకు = శత్రుపురముల నంతమొందించినవాని - ఈశ్వరునియొక్క, రాకయున్, వచ్చి + ఉన్న - వృత్తాంతమున్, మేలుగాన్ = బాగుగా, ఎఱిఁగి, అనంత-సంభ్రమ + అత్యంత - మనన్ (ః) + అనురాగమునన్ = అంతములేని వేగిరపాటు, మిక్కిలి మనఃప్రీతి అనువానితో, అప్పుడు + అ = అప్పుడే, వాజి .... యుక్తుఁడై: వాజి=గుఱ్ఱములయొక్క, వరూథ = సమూహము, దంతి = ఏనుగులు, సామంత = సామంతులు, విలాసినీ = స్త్రీలు, స్వజన = బంధువులు, మంత్రి = మంత్రులు, పురోహిత = పురోహితులు, భృత్య = సేవకులు (అనువారితో), యుక్తుఁడు + ఐ = కూడినవాఁడయి,

తాత్పర్యము: అంతకుముందె హిమవంతుఁడు ఈశ్వరుని రాకనుగూర్చియు, నతఁడు వచ్చియున్న వృత్తాంతమును గూర్చియు నెఱిఁగి మిక్కిలి వేగిరపాటుతోను, మనఃప్రీతితోను వెంటనే గుఱ్ఱముల సమూహము, ఏనుఁగులు, సామంతరాజులు, స్త్రీలు, బంధువులు, మంత్రులు, పురోహితులు, సేవకులు అనువారితోఁ గూడినవాఁడయి - తరువాతి వచనముతో నన్వయము.

విశేషములు: సన్మతి - సత్ + మతి - అనునాసికసంధి - ర,హాలు తప్ప మిగిలిన వర్గాక్షరముల హల్లులకు (స్పర్శములు) అనునాసిక వర్ణము పరమగునపుడు వానికి సంబంధించిన అనునాసికవర్ణము వైకల్పికముగా నాదేశమగును. మనోఽనురాగము = మనస్ + అనురాగము - సకారాంత సకారమునకు విసర్గాదేశము. మనః + అనురాగము. హ్రస్వ అకారము పూర్వమందుండఁగా విసర్గమునకు హ్రస్వ అకారము గాని, మృదుహల్లులు (హశ్శులు) గాని పరము లగునపుడు ఉ ఆదేశముగా వచ్చి పూర్వ అకారముతో గుణ సంధియై ఓ గా మారును. మన + ఉ + అనురాగము = మనోఽనురాగము.

వ. నిజాశేష కుల కళత్ర పుత్త్ర సమేతుండై చనుదెంచి పరమేశ్వరునిం
గని ముహుర్ముహుర్మహీతలాలంకృత సర్వాంగుండై నిజదేహాది
సమస్త రాజ్యవిభవంబులు నీశ్వరు శ్రీపాదంబులకు నివేదించి. 97

అర్థము: నిజ + అశేష – పుత్త్ర - సమేతుండు + ఐ = తన యెల్ల కులమువారితో, భార్యలతో, పుత్రులతోఁ గూడినవాఁడయి, చనుదెంచి = వచ్చి, పరమే శ్వరునిన్, కని, ముహుః + ముహుః + మహీతల + అలంకృత - సర్వ + అంగుండు + ఐ = మాటిమాటికి భూతలము నలంకరించిన యెల్ల అవయవములు గలవాఁడయి - మాటిమాటికి సాష్టాంగనమస్కారములు చేసినవాఁడయి, నిజ - దేహ + ఆది - సమస్త - రాజ్య - విభవంబులున్ = తనదైన శరీరము మున్నుగాఁగల యెల్ల రాజ్యవైభవములును, ఈశ్వరు = శివునియొక్క, శ్రీపాదంబులకున్ = శోభాయుక్తము లైనపాదములకు, నివేదించి = సమర్పించి.

తాత్పర్యము: (హిమవంతుఁడు)తన యెల్లకులమువారును, భార్యాపుత్త్రులును గూడ రా వచ్చి పరమేశ్వరునిఁ జూచి మాటిమాటికి సాష్టాంగనమస్కారములు చేసి తన శరీరము మున్నుగా నెల్ల రాజ్యవైభవములు నీశ్వరుని శ్రీపాదములకు నివేదించి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ముహుర్ముహుర్మహీతల - ముహుః + ముహుః + మహీతల - అఆలు తప్ప మిగిలిన అచ్చుల తరువాత వచ్చు విసర్గమునకు అచ్చులు గాని, మృదుహల్లులు (హశ్శులు) గాని పరము లగు నపుడు రేఫ మాదేశ మగును.

క. వినుతించుచున్న గిరిపతిఁ
గని గిరిశుఁడు సన్మనమునఁ గారుణ్యాలో
కన వార్ధి సుధారస వా
రి నిమగ్నునిఁ జేసి సురవరేణ్యునిఁ జేసెన్. 98

అర్థము : వినుతించుచున్ + ఉన్న = స్తోత్రముచేయుచున్న, గిరి - పతిన్ = కొండల ఱేనిని, కని, గిరిశుఁడు = కొండపైఁబరుండువాఁడు శివుఁడు, సత్ + మనమునన్ = మంచి మనస్సుతో, కారుణ్య .... నిమగ్నునిన్ : కారుణ్య+ ఆలోకన = దయతోడి చూపనెడి, వార్ధి = సముద్రమునందలి, సుధారస - వారి = అమృతరసమనెడి నీటియందు, నిమగ్నునిన్ = మునిఁగినవానిని,చేసి, సుర - వరేణ్యునిన్ = దేవతాశ్రేష్ఠుని, చేసెన్.

తాత్పర్యము : స్తోత్రము చేయుచున్న హిమవంతునిఁ జూచి ఈశ్వరుఁడు మంచి మనసుతో దయాదృష్టి యనెడు సముద్రమునందలి యమృతరస మనెడి నీట మునిఁగినవానిని జేసి దేవతాశ్రేష్ఠునిగాఁ జేసెను.

విశేషములు : గిరిశుఁడు - గిరి (కైలాసము) యందుఁ బరుండువాఁడు- శివుఁడు. సత్ + మనమునన్ - అనునాసికసంధి, కారుణ్యాలోకవార్ధి సుధారస వారి నిమగ్నుని - రూపకాలంకారము.

వ. ఇట్లచలాధీశ్వరుం డీశ్వరు కరుణామృతరసప్రవాహాప్లావితుం డగుచు నీశ్వరారాధనానంతసంతోషితాంతరంగుండగుచు నుండు; నంతఁ గొంతకాలంబునకు రుద్రుండు గిరీంద్రున కనేకవరంబు లొసంగి నిజపురంబున కరుగు మని నియోగించిన. 99

అర్థము : ఇట్లు, అచల + అధి + ఈశ్వరుండు = కొండల ఱేఁడు - హిమవంతుఁడు, ఈశ్వరు = శివునియొక్క. కరుణా + అమృత - రస-ప్రవాహ+ ఆప్లావితుండు=దయయనెడి అమృతరసముయొక్క ప్రవాహమునందు మునిఁగినవాఁడు, అగుచున్, ఈశ్వర + ఆరాధన + అనంత-సంతోషిత + అంతరంగుండు = శివుని పూజచే నధికముగా సంతోషించిన మనసుగలవాఁడు, అగుచున్ + ఉండున్, అంతన్,

కొంత కాలంబునకున్, పురహరుఁడు = ఈశ్వరుఁడు, గిరి + ఇంద్రునకున్ = పర్వతశ్రేష్ఠునకు - హిమవంతునకు, అనేక-వరంబులు = పెక్కు వరములు, ఒసంగి= ఇచ్చి, నిజ-పురంబునకున్ = స్వనగరమునకు, అరుగుము = పొమ్ము, అని, నియోగించినన్ = నియమింపఁగా.

తాత్పర్యము: ఇట్లు హిమవంతుఁ డీశ్వరుని దయారసప్రవాహమున మునిఁగి యీశ్వరారాధనముచే మిక్కిలి సంతోషించినవాఁడయియుండఁగాఁ గొంత కాలమునకు నీశ్వరుఁడు పర్వతరాజునకుఁ బెక్కువరము లిచ్చి స్వనగరమున కరుగుమని నియమింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ఈశ్వరు కరుణామృతరసప్రవాహాప్లావితుఁడు, -' కొన్ని యెడల సిద్ధసమాస మధ్యగత పదంబులతోఁ దద్భిన్నపదంబుల కన్వయంబుచూపఁబడెడి' ప్రౌఢ. సమాస. 35.

క. విని కాని యెన్నఁడును నినుఁ
గని యెఱుఁగరు హరి సరోజగర్భామర స
న్మును; లిట్టి నీ స్స్వరూపముఁ
గని యియ్యెడఁ బాసి పోవఁగా నోపుదునే? 100

అర్థము: హరి-సరోజగర్భ + అమర-తతి + మునులు = విష్ణువు, బ్రహ్మ, దేవతలు, మునిశ్రేష్ఠులు. నినున్, విని కాని. ఎన్నఁడును,కని, ఎఱుఁగరు, ఇట్టి, నీ, స్వరూపమున్, కని, ఈ + ఎడన్ = ఈ చోటును, పాసి=విడిచి, పోవఁ గాన్ + ఓపుదునే = పోవఁజాలుదునా?

తాత్పర్యము: విష్ణువు, బ్రహ్మ, దేవతలు, మునివరులు, నిన్ను వినుటయే కాని ఎప్పుడును జూచి యెఱుఁగరు. ఇట్టి నీ స్వరూపమును జూచి నే నీ ప్రదేశమును విడిచిపోఁగలనా? పోలే ననుట.

విశేషములు: ఈ+ఎడ, 'సంధిలేనిచోట స్వరంబుకంటెం బరంబయిన స్వరంబునకు యడాగమంబగు' బాల. సంధి. 3. ఈ+యెడ, 'త్రికంబుమీఁది యసం

యుక్తహల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు.' బాల. సమాస. 14. ఈ + వ్వోడ, 'ద్విరుక్తంబగు హల్లు పరంబగునప్పు డాచ్ఛికంబగు దీర్ఘంబునకు హ్రస్వంబగు.' బాల. సమాస. 13. ఇవ్వోడ. సన్మునులు - సత్ + మునులు - అనునాసిక సంధి.

వ. అని కరంబులు మొగిచి దీనాననుండై యున్న వాని భక్తి యుక్తికిం
గరుణించి సకలలోకాభీష్ట ఫల వృద్ధి కేదారాత్మకుండ నగుటం
గేదారేశ్వరుం డన నిప్పురంబున వసియించెద నోడకుండు మనిన
దానికిం బ్రసాదం బని. 101

అర్థము :అని, కరంబులు = చేతులు, మొగిచి = ముడిచి, దీన + ఆనను౦డు + ఐ=దీనమైన ముఖము గలవాఁడయి, ఉన్నన్, వాని, భక్తి-యుక్తికిన్= భక్తితోఁ గూడియుండుటకు, కరుణించి = దయఁజూచి, సకల........త్మకుండన్; సకల = ఎల్ల, లోక = లోకములందలి జనులయొక్క-. అభీష్ట = కోరిక లనెడి, ఫల=పంటయొక్క-, వృద్ధి = పెరుఁగుటగల, కేదార+ ఆత్మకుండన్ = పొలము వంటి మనస్సు గలవాఁడను, అగుటన్ = అగుటచే. కేదారేశ్వరుండు+అనన్, ఈ+ పురంబునన్, వసియించెదన్, ఓడక+ఉండుము = భయపడకుము, అనినన్, దానికిన్ = ఆ మాటకు, ప్రసాదంబు+అని = అనుగ్రహ మని.

తాత్పర్యము : అని చేతులు జోడించి దీనముఖుఁడయి యున్న వాని భక్తికిఁ గరుణించి 'సకలలోకముల అభీష్టములనెడి ఫలముల వృద్ధికి నేను గేదారాత్మకుఁడ నగుటచేఁ గేదారేశ్వరుఁ డనుపేర నీ పురమున నివసింతును. శంకింపకు 'మనిన నందులకుఁ బ్రసాద మని - తరువాతిపద్యముతో నన్వయము.

విశేషములు : 'సకల లోకాభీష్టఫలవృద్ధి కేదారాత్మకుండను'-రూపకము. ఇప్పురము - ఈ + పురము + త్రికసంధి.

సీ. ఈ బాల తన్నుఁ దా నెఱిఁగినగోలె న
నన్యశరణ్యయై యహరహంబు
నిన్న కొల్చుచు నుండు నీ విందు మా పుణ్య
మ్మునఁజేసి వచ్చుట విని ముదమునఁ

జూడంగ వచ్చె నిన్ జూచినగోలె భ
క్త్యావేశమునఁ జేసి జీవ మెడలఁ
బాసిన మీ పొందు వాయనోపదు పాసి
తలరఁ గావున నిచ్చఁ దగిన వరవుఁ

ఆ. బనులు సేయుచుండుఁ; బార్వతి యునికికి
వరద! యిచ్చగింపవలయు ననిన
నతని విన్నపమున నంతకు భక్తవ
త్సలుఁడు నెమ్మనమున సంతసించి. 102

అర్థము : ఈ-బాల, తన్నున్ + తాను + ఎఱిఁగినగోలెన్=తనకు జ్ఞానము వచ్చినది మొదలుకొని, అనన్య-[illegible]ణ్య + ఐ = నీకంటె నితరుఁడు శరణు పొందఁ దగినవాఁడు లేనిదయి. అహ-[illegible]హంబున్ = ప్రతిదినమును,

నిన్నున్ + అ = నిన్నే, కొల్చుచున్ + ఉండున్ = సేవించుచుండును, నీవు, ఇందున్ = ఇచ్చటికి. మా - పుణ్యమునన్ + చేసి = మేముచేసినపుణ్యము చేత, వచ్చుట, విని, ముదమునన్ = సంతోషముతో,

నిన్ = నిన్ను, చూడంగన్ + వచ్చెన్, చూచినగోలెన్ = చూచినదిమొదలు కొని, భక్తి+ఆవేశమునన్ +చేసి=భక్తియొక్క-ఉద్రేకముచేత, జీవము = ప్రాణము, ఒడలన్ + పాసినన్ = మేనియందుండి పోయినను,

మీ - పొందు, పాసి = విడిచి, తలరున్ + కావునన్ = చలించును గావున, పాయన్ + ఓపదు = విడువఁజాలదు, ఇచ్చన్ = కోరికతో, తగిన, వరవు + పనులు=సేవాకృత్యములు, చేయుచున్+ఉండున్, పార్వతి + ఉనికికిన్ = పార్వతి ఉండుటకు, వరద = వరములనిచ్చువాఁడా! ఇచ్చగింపవలయును, = అంగీకరింప వలయును. అనినన్, అతని-విన్న[illegible]మునన్ = అతని మనవిచేత, అంతకున్=దానికి, భక్త-వత్సలుఁడు =భక్తులయెడ వాత్సల్యము గలవాఁడు - శివుఁడు, నెమ్మనమునన్= (నెఱ + మనమునన్) = నిండుమనసునందు, సంతసించి,

తాత్పర్యము: 'ఈ బాల తనకు జ్ఞానము వచ్చినది మొదలుకొని నిన్నే శరణుపొందినది. ప్రతిదినమును నిన్నే కొలుచుచుండును. మేము చేసిన పుణ్యముచేత నీ విప్పటికి విచ్చేసితివని విని సంతోషముతో నిన్నుఁ జూడ వచ్చెను. చూచినవాడిగా భక్తి యుద్రేకించి, ప్రాణము పోయినను మీ పొందు విడుచుచోఁ జలించిపోవును గావున విడువఁజాలదు. కావునఁ గోరికతోఁ దగిన సేవాకృత్యములు చేయుచుండును. దయచే పార్వతి యుండుటకు సమ్మతింపవలయు' ననిన నతని మనవి నాలించి వానికి భక్తవత్సలుఁడైన శివుఁడు మనసులో సంతోషించి, తరువాతి వచనముతో నన్వయము.

విశేషములు: ఎఱిఁగినగోలె-ఎఱిఁగిన + కోలె- ఎఱిఁగినది మొదలుకొని. కోలె-కొలె (రూపాం.) అహరహము-అహన్ + అహన్-అహన్శబ్దమునందలి నకారమునకు విభక్తిప్రత్యయము పరము గానిచో, నెల్లయెడల రేఫాదేశ మగును. అహర్ + అహర్ = అహరహః, భక్తి + ఆవేశము = భక్త్యావేశము - యణాదేశసంధి. ఇ ఉ ఋ ౡ లకు అసవర్ణాచ్చులు పరములగుచోఁ గ్రమముగా య్ వ్ ర్ ల్ అనునవి ఆదేశము లగును. భక్త్యావేశమునఁజేసి' కొన్నియెడలఁ జేతవిభక్త్యర్థక వర్ణకంబులకును వలన వర్ణకంబునకును దఱచుగఁజేసి యనుప్రయుక్తం బగు.' ప్రౌఢ.కారక. 4. వరవుఁ బనులు-వరవు + పనులు-'సమాసంబుల నుదంతంబులగు స్త్రీసమంబులకుం బుంపులకుం బరుషసరళంబులు పరంబు లగునపుడు నుగాగమంబగు.' బాల, సంధి.25.వరవు + ను + పనులు. 'ద్రుతప్రకృతికముమీఁది పరుషములకు సరళము లగు.' బాల. సంధి. 16. వరవు + ను + బనులు. 'ఆదేశసరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాష నగు.' బాల సంధి. 17. వరవుఁబనులు. విన్నపము (వికృతి) - విజ్ఞాపనము (ప్రకృతి). నెమ్మనము - నెఱ + మనము. 'అన్యంబులకు సహిత మిత్వాకార్యంబులు కొండొకచోఁ గానంబడియెడి.' బాల,సంధి.39.

ఈ పద్యమునందలి వరద, భక్తవత్సలుఁడు అనుపదములు సాభిప్రాయములు.

వ. అదత్తప్రతివచనుం డైన దానికి మహాప్రసాదం బని యనేక మాణిక్యాకల్పలేపాంబరాలంకృతంబైన కన్యాంతఃపురంబులోన.
103

అర్థము : ఆదత్త - ప్రతివచనుండు = ఈఁబడని సమాధానముగలవాఁడు - సమాధానమీనివాఁడు, ఐనన్ = కాఁగా, దానికిన్, మహత్ (మహా) + ప్రసాదంబు + అని = గొప్ప యనుగ్రహ మని, అనేక-మాణిక్య + ఆకల్ప-లేప + అంబర + అలంకృతాంబు = పెక్కు మాణిక్యభూషణములతోను, మైపూఁతలతోను, వస్త్రముల తోను, అలంకరింపఁబడినది, ఐన, కన్యా + అంతఃపురంబుతోన్ + అ = అంతః పురకన్యలతోనే,

తాత్పర్యము : ఈశ్వరుఁడు హిమవంతునకు సమాధానము చెప్పకపోఁగా హిమవంతుఁడు ఆతని మౌనము నంగీకారముగా భావించి గొప్ప యనుగ్రహమని పెక్కు మణిభూషణములతోను, మైపూఁతలతోను, వస్త్రములతోను అలంకరింపఁబడిన అంతఃపురకన్యలతో-తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : కన్య (ప్రకృతి)-కన్నె,కన్నియ (వికృతి), అంతఃపురము (ప్రకృతి) అంతిపురము (వికృతి)

క. ఆ క్షితిధరపతి శివుఁ బ్ర
త్యక్షముగాఁ గొలుచుచుండు మని తత్పరుఁడై
శిక్షించి గౌరి నందు సు
రక్షితముగ నునిచి నిజపురంబున కరిగెన్. 104

అర్థము : ఆ-క్షితిధర-పతి = ఆ కొండల ఱేఁడు, శివున్ = శివుని, ప్రత్యక్షము గాన్ = ఎదురుగా నుండి, కొలుచుచున్ + ఉండుము + అని = సేవించుచుండుమని, తత్పరుఁడై = ఆసక్తి గలవాఁడయి, శిక్షించి = బోధించి, గౌరిన్, అందున్ = ఈశ్వరు నాశ్రమమునందు, సురక్షితముగన్ = క్షేమముగా, ఉనిచి = ఉంచి, నిజ-పురంబునకున్ = తన పురమునకు, అరిగెన్.

తాత్పర్యము : ఆ హిమవంతుఁడు 'శివునిఁ బ్రత్యక్షముగాఁ గొలుచుచుండు మని బోధించి పార్వతిని శివునాశ్రమమునందు సురక్షితముగా నుంచి తన నగరమున కరిగెను.

వ. అంతం బార్వతియు నీశ్వరారాధనాసక్తియుక్తయై భక్తియు నను రక్తియు నంతకంత కగ్గలించుచుండ. 105

అర్థము: అంతన్, పార్వతియున్, ఈశ్వర+ఆరాధన+ఆసక్తి-యుక్త+ఐ=శివపూజయం దాసక్తితోఁ గూడినదయి, భక్తియున్, అనురక్తియున్=ప్రీతియు, అంతకున్+అంతకున్=క్రమక్రమముగా, అగ్గలించుచున్+ఉండన్=అధిక మగుచుండఁగా.

తాత్పర్యము: అంతఁ బార్వతియు శివుని బూజించుటయం దాసక్తిఁ గలదియై భక్తియు అనురక్తియుఁ గ్రమక్రమముగా అధికమగుచుండఁగా - తరువాతి పద్యములో నన్వయము,

సీ. చమరీజ బర్హా మార్జనులఁ బరీక్షించి
నయమున సమ్మార్జనంబు సేయుఁ ;
గర్పూరతైలార్ద్రకస్తూరికాకర్ద
మంబుల ననులేపనంబు సేయుఁ ;
గాశ్మీర మాంజిష్ఠ గరుడాండ హరినీల
ముక్తాఫలంబుల ముగ్గువెట్టుఁ ;
గుసుమ పల్లవ లతా కోరకంబులఁ జిత్ర
దామంబు లొనరించుఁ దావి మిగులఁ ;

తే. బుష్పమందిర మొనరించుఁ ; బుణ్యవారి
సౌరభము లించు మణికలశముల నించు;
నచలపతిసుత మది నిట్టు లహరహంబు
శివున కనురక్తిఁ బరిచర్య చేయుచుండె. 106

అర్థము, చమరీజ-బర్హ-మార్జనులన్=చమరీమృగముల వాలములతోఁ జేసిన చీఁపురులతో. పరీక్షించి=చక్కఁగాఁ జూచి. నయమునన్=బాగుగా. సమ్మార్జనంబు+చేయున్=తుడుచును.

కర్పూర-తైల + ఆర్ద్ర-కస్తూరికా-కర్దమంబులన్ = కప్పురపుఁదైలముతోఁ, దడిసిన కస్తూరి పంకములతో, అనులేపనంబు + చేయున్ = పూఁతపెట్టును.

కాశ్మీర-మాంజిష్ఠ-గరుడాంశ-హరినీల-ముక్తాఫలంబులన్ = కుంకుమపువ్వు, ఎఱుపుమించినపసుపువన్నె, గరుడపచ్చలు, ఇంద్రనీలములు, ముత్యములు అనువానితో, ముగ్గు + పెట్టున్.

కుసుమ-పల్లవ-లతా-కోరకంబులన్ = పూలు, చివురులు, తీఁగలు, మొగ్గలు ననువానితో, తావి-మిగులన్ = పరిమళ మతిశయింపఁగా, చిత్ర-దామంబులు = రంగు రంగుల మాలికలు, ఒనరించున్.

పుష్ప-మందిరము = పూల యిల్లు, ఒనరించున్; పుణ్య-వారిన్ = పవిత్ర జలమును, సౌరభములు + ఇంచు = పరిమళము లతిశయించు, మణి - కలశములన్ = మణిమయములైన పాత్రములను, నించున్ = నింపించును.

అచల-పతి-సుత = కొండలఱేని కూఁతురు-పార్వతి, మదిన్ = కోరికతో, ఇట్టులు, అహరహంబున్ = ప్రతిదినమును, శివునకున్, అనురక్తిన్ = అనురాగముతో-ఇష్టముతో, పరిచర్య = సేవ, చేయుచున్ + ఉండెన్.

తాత్పర్యము: చమరీమృగముల వాలములతోఁ జేసిన చీఁపురులతోఁ జక్కఁగాఁ జూచి బాగుగాఁ దుడుచును. కప్పురపుఁదైలముతోఁ దడిసిన కస్తూరీపంకములతోఁ బూఁతపెట్టును. కుంకుమపువ్వు, మాంజిష్ఠము, గరుడపచ్చలు, ఇంద్రనీలములు, ముత్యములు అనువానితో ముగ్గు లిడును. పూలు, చివురులు, తీఁగలు, మొగ్గలు కూర్చి పరిమళ మతిశయించునట్లుగనుఁ జిత్రవర్ణముల దండలు గ్రుచ్చును. పూలతో మందిరము కట్టును. పవిత్రజలములో సౌరభ మతిశయించు మణిమయ పాత్రములను నించును. పర్వతరాజపుత్త్రిక యీ రీతిగాఁ గోరికతోఁ బ్రతిదినమును శివున కనురాగముతో సేవ చేయుచుండెను.

విశేషములు: కాళిదాసు కుమారసంభవమునఁ బార్వతీ పరిచర్య యిట్లు వర్ణింపఁబడెను.

'అవచిత బలిపుష్పా వేది సమ్మార్గ దక్షా
నియమవిధి జలానాం బర్హిషాం చోపనేత్రీ,
గిరిశ ముపచచార ప్రత్యహం సా సుకేశీ,
నియమిత పరిఖేదా తచ్ఛిరశ్చన్ద్ర పాదైః,' కుమార. 1-60

చ. పొలుపుగఁ జంద్రశేఖరు తపోవన మంగజచక్రవర్తి దో
ర్బలమున ముట్టి చూఱకొనఁ బంచిన దం డొకొ నాఁగఁ బొల్చి క
న్యలు తనుఁ గొల్చి రా నచలనందన సుందరలీల నిచ్చలుం
గొలుచుచునుండె భక్తి నహికుండల మండిత గండమండలున్. 107

అర్థము: పొలుపుగన్=ఒప్పుగా, చంద్రశేఖరు-తపస్(ః)+వనము=శివుని తపోవనమును, అంగజ-చక్రవర్తి=మన్మథుఁ డను రాజు, దోస్(ః)+బలమునన్=భుజబలముతో, ముట్టి=ముట్టడించి, చూఱకొనన్=కొల్లగొట్టుటకు, పంచిన=పంపిన, దండు+ఒకొ=సేనయా, నాఁగన్=అనునట్లు, పొల్చి=ఒప్పి, కన్యలు=పడుచులు-చెలికత్తెలు, తనున్=తన్ను, కొల్చి-రాన్=సేవించుచు రాఁగా, అచల-నందన=కొండ కూఁతురు-పార్వతి, సుందర-లీలన్=అందమగు రీతిని, నిచ్చలున్=ఎల్లప్పుడును, భక్తిన్=భక్తితో, అహి-కుండల-మండిత-గండ-మండలున్=పాములనెడు, చెవి కమ్మలతో, నలంకరింపఁబడిన, చెక్కిళ్ల ప్రదేశము గలవానిని-శివుని, కొలుచుచున్+ఉండెన్.

తాత్పర్యము: శివుని తపోవనమును మన్మథుఁడనెడి చక్రవర్తి భుజబలము తో ముట్టడించి కొల్లగొట్టుటకుఁ బంపిన సేనయా యనునట్లు ఒప్పి చెలికత్తెలు తన్నుఁ గొల్చుచురాఁగాఁ బార్వతి మనోహరముగా నిత్యమును భక్తితో సర్పకుండలములతో నలంకరింపఁబడిన చెక్కిళ్లుగలవానిని-శివునిఁ గొల్చుచుండెను.

విశేషములు: అంగజ - చక్రవర్తి-అంగజుఁ డనెడి చక్రవర్తి - రూపకము. ముట్టిచూఱకొనఁ బంచిన దండొకొ నాఁగ-ఉత్ప్రేక్ష. అహికుండల - అహులనెడు కుండల-రూపకము. కుండల మండితగండమండలున్ - వృత్త్యనుప్రాసము.

దోస్ + బలమున. సకారాంతసకారమునకు విసర్గాదేశము. దోః + బలమున. అ ఆలు తప్ప మిగిలిన అచ్చుల పిదప వచ్చు విసర్గమునకు అచ్చులుగాని మృదుహల్లులుగాని పరము లగునపుడు రేఫ మాదేశ మగును, దోర్బలమున.

సీ. మొన లావులించి వాసన చల్లఁ బసిగొని
  లేఁదేఁటి గమి యెంగిలింపకుండ,
సెద నూఱుకొని వేచి సుడియు తెమ్మెరలచేఁ
  బొడము పుప్పొడి పొలివోవకుండఁ,
దరణి కూటమున మే యెరలి పద్మిని మేన
  మొలతెంచు మధుమద మొలుకకుండ.
మేల్కాని గోమిని మెలఁగి మై మురిసినఁ
  బొదిగొన్న యకరువు చెదరకుండఁ

తే. దెలిసి జక్కవ లొండొంటిఁ గలయఁ దారు
కలకలంబున రేకులు గదలకుండ,
మున్న కొనివచ్చి గణికాసమూహితోడ
గిరిజ పూజించెఁ బసిఁడితామరల వరదు. 108

అర్థము : మొనలు = కొనలు, అవులించి = విచ్చి, వాసన-చల్లన్ = పరిమళమును వ్యాపింపఁజేయఁగా, పసిగొని = ఆఘ్రాణించి, లేఁదేఁటి-గములు (లేఁత + తేఁటి-గములు) = కొదమతుమ్మెదల గుంపులు, ఎంగిలింపకుండన్ = ఎంగిలి చేయకుండను,

ఎడ . చూఱుకొని = అవకాశమును జూచుకొని, వేచి, సుడియు = వ్యాపించు, తెమ్మెరలచేన్ = గాలిచే, పొడము = పుట్టునట్టి, పుప్పొడి, పొలి + పోవక + ఉండన్ = నవకము తప్పకుండను,

తరణి-కూటమునన్ = సూర్యుని సంసర్గమున. మే = శరీరము, ఎరలి = వేఁడియెక్కి, పద్మిని-మేనన్ = పద్మలత శరీరమున, మొలతెంచు = పుట్టునట్టి మధు-మదము = మకరందమనెడి మదము, ఒలుకక + ఉండన్ = ఒలుకకుండ కను పే.

మేల్కని = నిద్రనుండి మేలుకాంచి, గోమిని = లక్ష్మీదేవి, మెలఁగి = కదలి, మైన్ = శరీరమును, ముఱిసినన్ = విఱుదుకొనఁగా. పొదిగొన్న = గుత్తిగా నున్న, అకరువు = కింజల్కము, చెదరక + ఉండన్ = మున్న + అ = చెదరిపోవుటకు ముందే,

తెలిసి = (సూర్యోదయమగుటచే) తేరుకొని, జక్కవలు = చక్రవాకపక్షులు, ఒండొంటిన్ = ఒకదానితో నొకటి, కలయన్ = కలిపికొనుటకై, తారు-సమీపించు కలకలంబున్ = సందడిచేత, రేకులు= దళములు, కదలక + ఉండన్+ మున్న + అ = కదలుటకు మునుపే,

కొనివచ్చి = తీసికొనివచ్చి, గిరిజ = పార్వతి, గణికా - సమూహితోడన్= గణికల మొత్తముతో, పసిఁడి - తామరలన్ = బంగారు తామరపూలతో, వరదున్= కోరికలనిచ్చువాఁడగు పరమేశ్వరుని. పూజించెన్.

తాత్పర్యము : మొగ్గల కొనలు విచ్చి పరిమళము ప్రసరించినంతనే దాని నాఘ్రాణించి కొదమతుమ్మెదలు ఎంగిలిచేయుటకు మునుపే, అవకాశము చూచుకొని వేచి వ్యాపించు గాలులచే పుట్టు వుప్పొడి నవకముతప్పుటకు మునుపే, సూర్యునితోడి సంసర్గమున శరీరము వేఁడెక్కి పద్మలత శరీరమున పుట్టు మధుమదము ఒలుకుటకు మునుపే, యందుండి నిద్రించుచున్న లక్ష్మీదేవి మేలుకొని యటునటు కదలి యొడలు విఱుచుకొనఁగా గుత్తులుగానున్న కింజల్కములు చెదరిపోవకమున్నే, సూర్యోదయ మయినంతనే తమ జంటపక్షులున్నచోటు తెలిసి చక్రవాకములు పరస్పరము గలియుటకై పోవు సంభ్రమమున రేకులు కదలిపోక మునుపే పార్వతి గణికలమొత్తముతోఁ గలిసి పోయి తీసికొనివచ్చి బంగరు తామరపూవులతోఁ బరమేశ్వరునిఁ బూజించెను.

విశేషములు : తుమ్మెదలుగూడ ముట్టని పూవులతోఁ బూజించుట శైవులకు మిక్కిలి విహితమైన కార్యము. అలంకారము స్వభావోక్తి.

ఆశ్వాసాంతము

ఉ. చారుతరావదాత నుత శాశ్వతకీర్తి రసప్రవాహ సం
పూరిత రోదసీకుహరుఁ, బుణ్యు, సనాతనమూర్తి, సజ్జనా
ధారు, సమస్తలోకజనతా నుత పాదసరోజపీఠు, శృం
గారభవారి, సర్థిజన కల్పమహీజము, మల్లికార్జునున్.

అర్థము : చారు......కుహరున్; చారు తర = మిక్కిలి మనోహరము, అనవాత = నిర్మలము, నుత = పొగడఁబడినది, శాశ్వత = స్థిరము, (అగు), కీర్తి-రస = కీర్తియనెడు రసముయొక్క, ప్రవాహ = ప్రవాహముచేత, సంపూరిత= బాగుగా నింపఁబడిన, రోదసీ-కుహరున్ = భూమ్యాకాశముల మధ్యభాగము గలవాఁడును, పుణ్యున్ = పవిత్రుఁడును, సనాతన-మూర్తిన్ = శాశ్వతమయిన యాకారము గలవాఁడును, సత్ + జన + ఆధారున్ = మంచిజనుల కాధారమయినవాఁడును, సమస్త-లోక-జనతా-నుత-పాద-సరోజ-పీఠున్ = ఎల్లలోకములందలి, జనసమూహము చే, స్తుతింపఁబడిన, పాదపద్మముల పీఠము గలవాఁడును, శృంగార-భవ + అరిన్= మన్మథునకు శత్రువైనవాఁడును. అర్థి-జన-కల్పమహీజమున్ = యాచకజనులకుఁ గల్పవృక్షమైనవాఁడును-యాచకులు కోరినకోర్కెలు దీర్చువాఁడును, అగు మల్లికార్జునున్ = జంగమ మల్లికార్జునుని.

తాత్పర్యము : మనోహరము, నిర్మలము, సన్నుతము,శాశ్వతమునైన కీర్తియనెడు రసముప్రవాహముచే బాగుగా నింపఁబడిన భూమ్యాకాశమధ్య ప్రదేశము గలవాఁడును, పవిత్రుఁడును, శాశ్వతమైనమూర్తి గలవాఁడును, సుజనుల కాధారమైన వాఁడును, ఎల్లలోకములందలి జనసమూహముచే స్తుతింపఁబడిన పాదపద్మముల పీఠము గలవాఁడును, మన్మథునకు శత్రువయినవాఁడును, యాచకజనుల కోరికలను దీర్చు కల్పవృక్షమైనవాఁడును, అగు మల్లికార్జునుని.

విశేషములు : కీర్తిరస – రూపకము. అర్థిజన కల్పమహీజము - రూపకము.

సజ్జన - సత్ + జన - అనునాసికాంతస్థవర్ణములుతప్ప మిగిలిన పదాంతగత హల్లులకు (ఝల్లులకు) మృదుహల్లులు (హశ్శులు) కాని అచ్చులుకాని పరమగునపుడు ఆ హల్లుల వర్గమునకుఁ జెందిన తృతీయవర్ణ మాదేశముగా వచ్చును. సద్ + జన-సకార తవర్గములకు శవర్గ చవర్గములతో పూర్వమందైనను పరమందైనను కూడిక గలుగునపుడు క్రమముగా శవర్గ చవర్గ వర్ణము లాదేశమగును. సజ్జన.

క. అనవరత దాన రతుఁ, బా
వనతర శుభమూర్తి, భక్తవత్సలు, జనతా
వినుత మతి క్రము, భవ సం
గ నివృత్తు, మునీంద్ర వర శిఖామణి, ననఘున్. 110

అర్థము : అనవరత - దాన - రతున్ = నిరంతరదానమునం దాసక్తి గలవాఁడును, పావనతర - శుభ - మూర్తిన్ = మిక్కిలి పవిత్రము శుభము నైన ఆకారము గలవాఁడును, భక్త - వత్సలున్ = భక్తులమీఁద దయగలవాఁడును, జనతా - వినుత - మతి - క్రమున్ = జనసమూహముచే బాగుగాఁ బొగడఁబడిన బుద్ధియొక్క సామర్థ్యము గలవాఁడును, భవ - సంగ - నివృత్తున్ = సంసారముతోడి సంబంధమునుండి మరలినవాఁడును, ముని + ఇంద్ర - వర - శిఖామణిన్ = మునిశ్రేష్ఠులలోఁ దలమానికమైన (శ్రేష్ఠుఁడైన) వాఁడును, అనఘున్ = పాపరహితుఁడైనవాఁడును అగు జంగమ మల్లికార్జునుని,

తాత్పర్యము : నిరంతరదానమునం దాసక్తిగలవాఁడును, పావనతరము శుభము నైన మూర్తి గలవాఁడును, భక్తవత్సలుఁడును, జనులు నుతించు బుద్ధివైభవము గలవాఁడును, సంసారసంగతినుండి మరలినవాఁడును, మునిశ్రేష్ఠులలోఁ దలమానికమైనవాఁడును, పాపరహితుఁడును అగు జంగమ మల్లికార్జునుని.

ఉ. సత్యవిలాసు, నాదిముని, సచ్చరితుం, గవి గాయకాది సం
స్తుత్యు, ననూన దాన నిరతుం, గరుణాకరు, సజ్జనాంబుజా
దిత్యు, వినిర్జితాంగభవుఁ, దీర్ణ భవార్ణవు, శేముషీ సురా
మాత్యు, సదాత్మ యోగిజనమండను, జంగమమల్లికార్జునున్. 111

అర్థము : సత్య - విలాసున్ = సత్యముయొక్క చక్కఁదనము గలవాఁడును, ఆది - ముని - సచ్చరితున్ = ఆద్యులైన మునులయొక్క మంచి నడవడి గలవాఁడును, కవి - గాయక + ఆది - సంస్తుత్యున్ = కవులు, గాయకులు మున్నగు వారిచే లెస్సగాఁ బొగడఁదగినవాఁడును, అనూన - దాన - నిరతున్ = తక్కువకాని (అధికమైన) దానమునందు ఆసక్తి గలవాఁడును, కరుణాకరున్ = దయను జేయువాఁడును, (దయకు గనియైనవాఁడును). సత్ + జన + అంబుజ + ఆదిత్యున్ = సుజనులనెడి పద్మములకు సూర్యుఁడైనవాఁడును (సుజనులను సంతోషపెట్టువాఁడును). వినిర్జిత + అంగభవున్ = జయింపఁబడిన మన్మథుఁడు గలవాఁడును, తీర్ణ - భవ + అర్ణవున్ = దాఁటఁబడిన సంసారసముద్రముగలవాఁడును, శేముషీ - సుర + అమాత్యున్ = బుద్ధియందు దేవమంత్రి (బృహస్పతి) యైనవాఁడును, సత్ + ఆత్మ - యోగి - జన - మండనున్ = మంచి మనస్సుగల యోగిజనుల కలంకారమైనవాఁడును, అగు జంగమమల్లికార్జునున్,

తాత్పర్యము : సత్యము చక్కగ గలవాఁడును, ఆద్యులైన మునుల పంచి నడవడి గలవాఁడును, కవులు గాయకులు మున్నగువారిచే మిక్కిలి స్తుతింపఁదగిన వాఁడును, అధికమైన దానగుణమునందాసక్తి గలవాఁడును, కరుణకు గనియైనవాఁడును, సుజను లనెడి పద్మములకు సూర్యుఁడైనవాఁడును, జయింపఁబడిన మన్మథుఁడు గలవాఁడును, (మన్మథుని జయించినవాఁడును), సంసారసముద్రమును దాఁటిన వాఁడును, బుద్ధియందు బృహస్పతి యైనవాఁడును, మంచిమనస్సుగల యోగిజనులకలంకారమైనవాఁడును అగు జంగమ మల్లికార్జునుని.

విశేషములు : సజ్జనాంబుజాదిత్య - రూపకము. తీర్ణభవార్ణవు - రూపకము, శేముషీసుధామాత్య - రూపకము.

క. ధీమణి, నాశ్రితజన ర
క్షామణిఁ, గవి గమకి వాగ్మి గాయక నట చిం
తామణి, సన్ముని గణ చూ
డామణి, నిహలోక వర నిటలతట నయనున్. 112

అర్థము : ధీమణిన్ = బుద్ధియనెడిమణిగలవాఁడును, ఆశ్రిత-జన-రక్షా-మణిన్ = ఆశ్రయించిన జనుల రక్షణమందు మణియైనవాఁడును, కవి - గమకి - వాగ్మి - గాయక-నట-చింతామణిన్ = కవులు, గమకులు (స్వరవిన్యాసము గలవారు) వక్తలు, గానముచేయువారు, నట = నటులు, అనువారికిఁ చింతామణి (కోరిన కోరికలుదీర్చువాఁడు) అయినవాఁడును, సత్ + ముని-గణ-చూడామణిన్ = మంచి మునుల సమూహమునకుఁ దలమానికమైనవాఁడును (వారిలో శ్రేష్ఠుఁడును అనుట,) ఇహ-లోక-వర-నిటల-తట-నయనున్ = భూలోకమునందు శ్రేష్ఠుఁడైన నొసటికంటి వాఁడును (శివుఁడును) అగు జంగమమల్లికార్జునుని.

తాత్పర్యము : బుద్ధి యను మణి గలవాఁడును, ఆశ్రితజనులరక్షణము నందు మణియైనవాఁడును, కవులు, గమకులు, వక్తలు, గాయకులు, నటులు అనువారికిఁ గోరిన కోరికలు దీర్చు చింతామణి యైనవాఁడును, సన్మునిగణమునకుఁ దలమానికమైనవాఁడును, ఈ లోకమున శ్రేష్ఠుఁడైన శివుఁడైనవాఁడును అగు జంగమ మల్లికార్జునుని.

విశేషములు : కవి గనుక వాగ్మి ప్రశంస లేమి సాహిత్యము సమర్థించి చేయఁబడెను. ఈ పరిగణనమును తెలుఁగులో నిరంకుశవృత్తమను చేయుచేము.

వనమయూరము

మేరునగధీరు, నిరమిత్రు, సుచరిత్రున్,
వారిధి గభీరు, నిరవద్యు, జనవంద్యున్,
చారుతరమూర్తి, నతిశాంతు, గుణవంతున్,
మారహరు, సర్వజనమాన్యు, మునిమాన్యున్. 113

అర్థము : మేరు-నగ-ధీరున్ = మేరుపర్వతమువలె ధీరుఁడైన వాఁడును, నిరమిత్రున్ = శత్రువులులేనివాఁడును, సుచరిత్రున్ = మంచినడవడి గలవాఁడును, వారిధి-గభీరున్ = సముద్రమువలె లోఁతయినవాఁడును. నిరవద్యున్ = అనింద్యుఁడును, జన-వంద్యున్ = జనులచే నమస్కరింపఁదగినవాఁడును, చారు-తర-మూర్తిన్ = మనోహరమైన రూపము గలవాఁడును, అతి-శాంతున్ = మిక్కిలి శాంతము గలవాఁడును, గుణవంతున్ = మంచిగుణములు గలవాఁడును, మార-హరున్ = మన్మథుని హరించినవాఁడును, సర్వ-జన-మాన్యున్ = ఎల్లజనులచే గౌరవింపఁదగినవాఁడును, ముని-మాన్యున్ = మునులచే మన్నింపఁదగినవాఁడును అగు జంగమ మల్లికార్జునుని.

తాత్పర్యము : మేరుపర్వతమువలె ధైర్యము గలవాఁడును, శత్రువులు లేనివాఁడును, మంచి నడవడి గలవాఁడును, సముద్రమువలె గంభీరుఁడును, అనింద్యుఁడును, జనులచే నమస్కరింపఁదగినవాఁడును, మనోహరమైన రూపము గలవాఁడును, మిక్కిలి శాంతగుణము గలవాఁడును, గుణవంతుఁడును, మన్మథుని హరించినవాఁడును (శివుఁడైనవాఁడును), జనులకందఱకును గౌరవింపఁదగినవాఁడును, మునులకు సమ్మానింపఁదగినవాఁడును - అగు జంగమ మల్లికార్జునుని,

విశేషములు : అంత్యప్రాసము. వనమయూరము - నాలుగు పాదము లుండును. ప్రతిపాదమునను భ-జ-స-న-గగ అను గణము లుండును. మొదటి

యక్షరమునను తొమ్మిదవయక్షరమునను యతిమైత్రి చెల్లనగును. ప్రాస నియమము గలదు.

గద్యము

ఇది శ్రీమజ్జంగమ మల్లికార్జునదేవ దివ్యశ్రీపాదపంకజ భ్రమరాయమాణ కవిరాజశిఖామణి నన్నెచోడదేవ ప్రణీతంబయిన కుమారసంభవం బను కథయందుఁ దృతీయాశ్వాసము

దీనికి వ్యాఖ్య ప్రథమాశ్వాసాంత గద్యమునకువలెనే.

మ. ఇది శ్రీ బొన్నలగడ్డ వంశమణియౌ మృత్యుంజయాఖ్యుండు స
మ్మద మొప్పారఁ గుమారసంభవము శ్రీమన్నన్నెచోడాఖ్య వి
ద్వదధీశోక్తము శాబ్దికార్థ వివిధస్వారస్య తాత్పర్యముల్
చదురొప్పన్ వచియించి మన్చు విలసత్ సంజీవనీ వ్యాఖ్యయౌ.

కుమార సంభవము

చతుర్థాశ్వాసము

క. శ్రీమ దశేష మునీంద్ర
గ్రామణి, నుత చరితు, విగత కల్మషు. శివత
త్త్వామల మతిప్రకాశు, ద
యామృత సరసీశు, మల్లికార్జునదేవున్. 1

అర్థము : శ్రీమత్ + అశేష - ముని + ఇంద్ర - గ్రామణి - నుత-చరితున్ = శ్రీమంతులైన ఎల్ల మునిశ్రేష్ఠులలో ముఖ్యులైనవారిచేతఁ బొగడఁబడిన నడవడిగలవాఁడును, విగత-కల్మషున్ = పోయిన పాపముగలవాఁడును, శివ-తత్త్వ + అమల-మతి-ప్రకాశున్ = శివుని తత్త్వముచే నిర్మలమైన మనస్సుయొక్క ప్రకాశము గలవాఁడును, దయా + అమృత-సరసీశున్ = దయ యనెడి అమృతమునకు సముద్రుఁడైనవాఁడును, (అగు) మల్లికార్జునదేవున్ = జంగమ మల్లికార్జున దేవుని.

తాత్పర్యము : ఎల్ల మునిశ్రేష్ఠులును గొనియాడు మంచి నడవడి గల వాఁడును, కల్మషము (పాపము) లేనివాఁడును, శివతత్త్వమువలనఁ బ్రకాశించు మనస్సుగలవాఁడును, దయ యనెడి యమృతమునకు సముద్రుఁడైనవాఁడును అగు జంగమ మల్లికార్జున దేవుని.

విశేషములు : దయామృత సరసీశు-రూపకము.

వ. ఇట్లు పార్వతి పరమభక్తియుక్తిం దగిలి నిరంతర శుశ్రూషాతత్పర యగుచుండె నంత. 2

అర్థము : ఇట్లు, పార్వతి. పరమ-భక్తి-యుక్తిన్ = గొప్ప భక్తితోడి కూడికతో, తగిలి = ఆసక్తి వహించి, నిరంతర - శుశ్రూషా-తత్పర = ఎడతెగని సేవయందు ఆసక్తిగలది, అగుచున్ + ఉండెన్, అంతన్.

తాత్పర్యము ; ఈ విధముగాఁ బార్వతి గొప్పభక్తితో నాసక్తి వహించి ఎడతెగని సేవయందుఁ దత్పర యగుచుండెను. అంత - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : శుశ్రూషా = విన నిచ్ఛ. శ్రోతుమిచ్ఛా. సేవ. (నానా.)

క. వినుతింపఁ గామసుఖ సా
ధన మగు నా గౌరిఁ జంద్రధరుఁడు తప స్సా
ధనముగఁ జరించె; నుత్తము
లనయము విపరీతచరితు లైనను జనదే ? 3

అర్థము ; వినుతింపన్ = పొగడఁగా, కామ-సుఖ-సాధనము + అగు= కామభోగములకు సాధనము అగు, ఆ-గౌరిన్ = ఆ పార్వతిని, చంద్ర-ధరుఁడు = చంద్రుని ధరించినవాఁడు-శివుఁడు, తపస్ + సాధనముగన్ = తపస్సునకు సాధనమగునట్లు, చరించెన్=ప్రవర్తింపఁజేసెను. ఉత్తములు = శ్రేష్ఠులైనవారు. అనయమున్ = మిక్కిలి, విపరీత-చరితులు = విరుద్ధ వర్తనులు, ఐనను = అయినప్పటికిని, చనదే = తగదా ?

తాత్పర్యము : శివుఁడు సన్నుతముగాఁ గామభోగసాధనమగు పార్వతిని దపస్సాధనముగాఁ జేసికొనెను. ఉత్తములైనవారు మిక్కిలి విరుద్ధవర్తనులైనను దగదా ? తగు ననుట,

విశేషములు : ఉత్తముఁడైన శివుఁ డిప్పుడు తపస్సు నాచరించువేళఁ గామసుఖసాధనమగు నొక కన్యను దపస్సాధనముగాఁ జేసికొనుటయే యాతఁడు విపరీతచరితుఁ డగుట, అయినను అతని కది తగు ననుట.

విశేషాంశము సామాన్యాంశముచే సమర్థింపఁబడుచున్నది, కావున నర్థాంతరన్యాసాలంకారము.

ఇంద్రాదిదేవతలు తారకాసురునివలని బాధలను బ్రహ్మకుఁ దెలుపుట.

వ. ఇట్లు పరమేశ్వరుండు తపోవృత్తిం దగిలి జగద్వ్యాపారంబు లారయకునికింజేసి తారకాసురుం డను ఘోరాసురుం డేచి హరి పరమేష్ఠి పురందరాదుల కజేయుండై సకలజగజ్జనంబుల కనేకోప ద్రవంబులు చేయందొడంగిన. 4

అర్థము: ఇట్లు, పరమేశ్వరుండు, తపస్ (ః)+ వృత్తిన్ = తపః మాచ రించుటయందు. తగిలి = ఆసక్తిగలవాఁడయి, జగత్+వ్యాపారంబులు = లోక కార్యములు, ఆరయక + ఉనికిన్ + చేసి = చూడకపోవుటచేత, తారక + అసు రుండు + అను, ఘోర + అసురుండు = తారకుఁ డను భయంకర రాక్షసుఁడు, ఏచి = విజృంభించి, హరి- పరమేష్ఠి - పురందర+ ఆదులకున్ =విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుఁడు మొదలగువారికి, అజేయుఁడు + ఐ = జయింపరానివాఁడయి, సకల- జగత్+జనంబులకున్ =ఎల్ల లోకములందలి జనులకును, అనేక+ఉపద్రవంబులు = పెక్కు కీడులు, చేయన్ + తొడంగినన్ = చేయ నారంభింపఁగా.

తాత్పర్యము: ఇట్లు పరమేశ్వరుఁడు తపోనిమగ్నుఁడై లోకకార్యములు గమనింపకపోవుటచేతఁ దారకుఁ డను భయంకరరాక్షసుఁడు విజృంభించి విష్ణుబ్రహ్మేం ద్రాదులకు జయింపరానివాఁడయి యెల్లలోకములవారికి ననేకహానులు చేయ నారంభిం పఁగా.-తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు; తపోవృత్తి-తపస్ + వృత్తి-తపః + వృత్తి-తపోవృత్తి. జగద్వ్యాపారము - జగత్ + వ్యాపారము. ఘోరాసురుఁడు = ఘోర+అసురుఁడు- సవర్ణదీర్ఘ సంధి. జగజ్జనములు - జగత్ + జనములు. అనేకోపద్రవములు= అనేక+ ఉపద్రవములు - గుణసంధి.

క. వాని పటు దండముల కమ
రానీకము లబ్బగింప కపగత రాజ్య
శ్రీ నిలయులై పితామహుఁ
గానఁగఁ జని రెండుఁ బొందు గానక భీతిన్. 5

అర్థము : వాని = ఆ తారకుని యొక్క. పటు-దండములకున్ = తీవ్రమైన శిక్షలకు, అమర + అనీకములు = దేవతల సమూహములు, అబ్బగింపక = సహింపక, అపగత - రాజ్య-శ్రీ-నిలయములు + ఐ = పోయిన రాజ్యసంపద, నివాసము గల వారయి, ఎందున్ = ఎచ్చటను, పొందు = శరణము, కానక, భీతిన్ - భయముతో, పితామహున్ = బ్రహ్మను, కానఁగన్ + చనిరి = చూడఁబోయిరి.

తాత్పర్యము : ఆ తారకాసురుని తీవ్రశిక్షలకు దేవతలు సహింపక రాజ్య సంపద, నివాసము గోలుపోయి యెచ్చటను దిక్కులేక భయముతో బ్రహ్మను జూడ నేఁగిరి.

విశేషములు : అబ్బగించు-ఈ పద మీ గ్రంథమునందే వ్యతిరేక క్త్వార్థకము గానే కనిపించుచున్నది - సూ. ని.

వ. తదవసరంబున. 6

అర్థ తాత్పర్యములు : ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. మొగిఁ దముఁ బడసిన మునుల మూర్తుల మీఱి
ధర్మశాస్త్రములు మూర్తములు తనర,
మణి దీధితుల పెంపు మాయించి సాలోక్య
ముక్తులు తను తేజముల వెలుంగ,
వాణి వీణారుచి వారించి సామగా
నంబుల రుతులు తియ్యంబుఁ బెంప,
మృగమదాదుల తావి మగిడించి సుడిసి ని
జాననాంబుజగంధ మతిశయిల్లఁ,

తే. చామరగ్రాహిణీ కర చారు రత్న
రుచుల వెలుఁగఁజేయక పాశరుచులు వొలయఁ,
గనకమయ పద్మ కర్ణికాగ్రమున విశ్వ
కర్త సుఖలీలఁ పేరోలగమున నుండె. 7

అర్థము : మెఱిగిన్ = పూనికతో, తమున్ = తమ్ము, పడసిన=పొందిన, మునుల - మూర్తులన్ = మునులరూపములను, మీఱి = అతిక్రమించి, మూర్తములు = రూపుధరించినవి, అగు, ధర్మశాస్త్రములు, తనరన్ = ఒప్పఁగా,

మణి - దీధితుల - పెంపు = మణుల కాంతులయొక్క అధిక్యము, మాయించి = నశింపఁజేసి, సాలోక్య - ముక్తులు = సాలోక్యముక్తి నొందినవారు, తను - తేజములన్ = మేని తేజస్సులతో, వెలుఁగన్ = ప్రకాశింపఁగా,

వాణీ - వీణా - - రుచిన్= సరస్వతియొక్క, వీణయొక్క, కాంతిని, ('రుచి' కాక 'రుతి =ధ్వని' అయి యుండునా?) వారించి= అడ్డగించి - తిరస్కరించి, సామ - గానంబుల = సామవేదగానములయొక్క, రుతులు = ధ్వనులు, తియ్యంబున్ = మాధుర్యమును, పెంపన్ = వృద్ధిపొందింపఁగా,

మృగమద + ఆదుల = కస్తూరి మున్నగువానియొక్క, తావిన్ = పరిమళమును, పగిడించి = పరలఁజేసి - తిరస్కరించి, సుడిసి=వ్యాపించి, నిజ+ఆనన+అంబుజ - గంధము = తనదైన ముఖపద్మముయొక్క పరిమళము, అతిశయిల్లన్= మించఁగా,

చామర - గ్రాహిణీ - కర-చారు - రత్న - రుచులన్ = వింజామరలను గొను స్త్రీల చేతుల- మనోహరమైన రత్నముల కాంతులను, వెలుఁగన్ + చేయక = ప్రకాశింపనీక - వానిప్రకాశమును మించి యనుట, పాశ - రుచులు = కుండలముల కాంతులు, వొలయన్ = వ్యాపింపఁగా,

విశ్వ-కర్త = విశ్వస్రష్ట-బ్రహ్మ, కనక - మయ-పద్మ - కర్ణికా + అగ్రమునన్ = బంగరు తామరయొక్క దుద్దు కొనయందు, సుఖ - లీలన్ = సుఖముగా, పేరు + ఓలగమునన్ = నిండు కొలువునందు, ఉండెన్,

తాత్పర్యము : తమ్ముఁ బొందిన మునుల ఆకారములను మించి ధర్మశాస్త్రములు రూపుగాంచినవై యొప్పఁగను, మణులకాంతుల ఆధిక్యమును మాపి సాలోక్యముక్తినొందినవారు తమ మేనుల తేజస్సుతోఁ బ్రకాశింపఁగను, సరస్వతీ వీణారావమును దిరస్కరించి తన సామవేదగానధ్వనులు మాధుర్యమును పెంపఁగను, కస్తూరి మున్నగు వాని పరిమళమును దిరస్కరించి తన ముఖపద్మగంధ మతిశయింపఁ

గను, చామరగ్రాహిణుల కరములందలి రత్నముల కాంతులను ప్రకాశింపనీక తన కుండలముల కాంతులు వ్యాపింపఁగను విశ్వస్రష్ట బంగరు చామర దుద్ధ కొనయుండ సుఖముగా పేరోలగమున్నుండెను,

విశేషములు : పేరు + ఓలగము - 'కర్మధారయంబునందుఁ బేర్యాది శబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాష నగు' బాల, సంధి. 29, పేరు బోలగము, పేరోలగము,

వ. ఇట్లు శతానందుండు సదానంద కందళిత హృదయారవిందుం డగు చున్నంత బృందారకబృందంబు కాందిశీకులై కంది తదీయాసనార వింద మకరందంబుల కెఱఁగు నలిసందోహంబునుంబోలె నెఱఁగి నానావిధ స్తుతి రవంబు లులియ నభయ మభయ మనుచున్న దేవేంద్రాదిగణంబులం గని విరించి కరుణించి బెగ్గడక లెండని. 8

అర్థము : ఇట్లు, శతానందుండు = బ్రహ్మ, సదా + ఆనంద - కందళిత హృదయ + అరవిందుండు + అగుచున్ + ఉన్న + అంతన్ = ఎల్లప్పుడును ఆనందముచే వికసించిన హృదయపద్మము గలవాఁడగుచున్నంత, బృందారక - బృందంబు = దేవతల సమూహము, కాందిశీకులు + ఐ = ఏ దిక్కునకుఁ బోదు మని యనుకొనువారయి, కంది = దుఃఖించి, తదీయ + ఆసన + అరవింద - మకరందంబులకున్ = ఆతనిదైన పీఠమగు పద్మముయొక్క మకరందమునకు, ఎఱఁగు = వ్రాలునట్టి, అలి - సందోహంబునున్ + పోలెన్ - తుమ్మెదల సమూహమువలె, ఎఱఁగి = వ్రాలి, నానా-విధ- స్తుతి- రవంబులు = పెక్కురీతు లయిన స్తోత్రధ్వనులు, ఉలియన్ = మ్రోయఁగా, అభయము అభయము = రక్షణము రక్షణము, అనుచున్ + ఉన్న, దేవేంద్ర + ఆది - గణంబులన్ = దేవేంద్రుఁడు మున్నగువారి సమూహమును, కని, విరించి = బ్రహ్మ, కరుణించి, ఓడక = భయపడక, లెండు, అని,

తాత్పర్యము: ఇట్లు బ్రహ్మ నిత్యానందముచే వికసించిన హృదయ పద్మము గలవాఁడగుచుండఁగా దేవతాసమూహము దిక్కుతోఁచక దుఃఖించి బ్రహ్మ ఆసనమైన పద్మము మకరందములకు వ్రాలు తుమ్మెదలగుంపువలె వ్రాలి పెక్కురీతు

లయిన స్తోత్రత్వములు ప్రాయముగా అభయ మభయ మనుచున్న దేవేంద్రుండు మున్నగు వారిని జూచి బ్రహ్మ దయచేసి భయపడక లెం డని. [illegible] నన్వయము.

విశేషములు : తదీయాననారవిందమకరందంబుల రెఁగు నళిసందోహంబునుంబోలె నెఱఁగి నానావిధస్తుతివచనంబు లతియ - [illegible] ప్రాణితోత్ప్రేక్ష.

విరించి - 'ధాతాబ్జయోని ద్రుహిణో విరిఞ్చిః కమలాసనః' - విరచయతి భూతాని విరిఞ్చిః 'భూతములను సృజించువాఁడు' లేక విభిః పక్షిభిః హంసైః రిచ్యతే ఉహ్యత ఇతి - హంసలచేత వహింపఁబడువాఁడు - బ్రహ్మ - అమరము.

క. మీ కింత వంది కంది భ
యాకులతం బొంది నిర్గతైశ్వర్యులరై
రాకకుఁ గారణ మేమి? త్రి
లోకాహిత దనుజతతికి లోఁబడరు గదే? 9

అర్థము : మీకున్, ఇంత, వంది = దుఃఖించి, కంది = బాధపడి. భయ + ఆకులతన్ + పొంది = వెఱపువలని కలఁత పొంది, నిర్గత + ఐశ్వర్యులరు + ఐ = పోయిన సంపద గలవారయి, రాకకున్ = వచ్చుటకు, కారణము + ఏమి, త్రిలోక + అహిత - దనుజ - తతికిన్ = ముల్లోకములకు శత్రువులైన రాక్షససమూహమునకు, లోఁబడరు + కదే = వశపడరుగదా!

తాత్పర్యము : మీ రింతగా దుఃఖించి బాధపడి భయమువేఁ గలఁతచెంది యైశ్వర్యమును గోలుపోయి వచ్చుట కేమి కారణము? ముల్లోకములకుఁ గంటకులైన రాక్షసులకు వశపడరుగదా?

విశేషములు : నిర్గతైశ్వర్యులరు-నిర్గత+ఐశ్వర్యులరు-వృద్ధిసంధి. అ ఆ లకు ఏ ఐ లు పరములగునపుడు ఐకారమును, ఓ ఔ లు పరములగునపుడు ఔకారమును ఏకాదేశ మగును. 'ప్రథమాంతంబులగు యుష్మదస్మద్విశేషణంబుల కేకత్వంబున వు ను లును బహుత్వంబున రు ము లు నంత్యాగమంబులు ప్రాయికంబుగ నగు.' 'ఈ యాగమంబులు పరంబులగునపు డుత్వంబున కత్వం బగు.' బాల. కారక. 33, 34.

వ. అని తమువచ్చిన కార్యస్వరూపంబున కనురూపంబుగా నానతి యిచ్చిన వాక్పతికి బృహస్పతి నిటలతట ఘటిత కరకమల ముకుళపుట విలసితుండై తారకాసురు బారింబడి తమ బ్రదికివచ్చిన వృత్తాంత మెల్ల నెఱింగించి వాని దోష విశేషంబులు విజ్ఞాపింపందలంచి యి ట్లనియె. 10

అ ర్థ ము : అని, తమువచ్చిన = తాము వచ్చిన, కార్య - స్వరూపంబునకున్ = పనియొక్క స్వరూపమునకు, అనురూపంబుగాన్ = తగినరీతిని, ఆనతి + ఇచ్చిన = సెలవిచ్చిన, వాచ్ (క్) + పతికిన్ = సరస్వతి భర్తకు - బ్రహ్మకు, బృహస్పతి, నిటల - తట - ఘటిత - కర - కమల - ముకుళ - పుట - విలసితుండు + ఐ = ఫాలప్రదేశమునందుఁ గూర్పఁబడిన తామరమొగ్గలదొప్పలవంటి చేతులతోఁ బ్రకాశించు వాఁడయి - నమస్కరించినవాఁడయి, తారక + అసురు - బారిన్ + పడి = తారకాసురునకుఁ జిక్కి, తమ - బ్రదికివచ్చిన - వృత్తాంతంబు + ఎల్లన్ = తాము బ్రదికివచ్చిన విషయ మంతయు, ఎఱింగించి = తెలిపి, వాని = తారకునియొక్క, దోష - విశేషంబులు = తప్పుల వివరములు, విజ్ఞాపింపన్ + తలంచి = విన్నవింపఁ దలఁచి, ఇట్లు + అనియెన్.

తా త్ప ర్య ము ; అని తామువచ్చినపనికిఁ దగినరీతిని సెలవిచ్చిన బ్రహ్మకు బృహస్పతి నమస్కరించి తారకాసురునకుఁ జిక్కి తాము బ్రదికిబయటఁబడిన వృత్తాంతమెల్లఁ దెలిపి ఆ రక్కసుని దుండగముల వివరములు విన్నవింపనెంచి యిట్లు పలికెను.

వి శే ష ము లు : తమ వచ్చిన - తమ బ్రదికి వచ్చిన - ధాతుజవిశేషణ కోవార్తిక పూర్వవ్యవహి తావ్యవహిత కర్తృపద ప్రథమకు దఱచుగ యొక్క షష్ఠి యగు' ప్రౌఢ. కారక. 15. తాము + వచ్చిన, తాము + బ్రదికివచ్చిన - తమయొక్క వచ్చిన. తమయొక్క బ్రదికివచ్చిన - 'యొక్కకు లోపంబు బహుళంబు.' ప్రౌఢ. కారక. 16. విజ్ఞాపించు (ప్రకృతి) - విన్నవించు (వికృతి).

సీ. వేళ్లతోడుతఁ గల్పవృక్షముల్ పెఱికించి
కొనిపోయి తన కుపవనముఁ జేసెఁ,
గనకాద్రిఁ గొనిపోయి తన కెక్కియాడ ని
జారామభూమిఁ గ్రీడాద్రిఁ జేసె,
నమరారి దనపేరి యచ్చులు వెట్టించి
సురధేనుసమితిఁ గీలరము సేసె,
గరుడోరగామరతరుణుల నందఱఁ
జేకొని తన విలాసినులఁ జేసె,

ఆ. వేద విహిత వృత్తి విప్రుల నుడిచెఁ ద
త్పతులఁ బురుషభక్తి సలుపు డుడిచెఁ,
బుణ్యకర్మ ముడిచె, భువి నిట్లు నిఖిలాప
కారకుండు బలిమిఁ దారకుండు. 11

అర్థము : నిఖిల + అపకారకుండు = ఎల్లరకు అపకారము చేయువాఁడు, అగు, తారకుండు, బలిమిన్ = బలముతో, భువిన్ = భూమియందు, ఇట్లు = ఈ విధముగా .

కల్పవృక్షముల్, వేళ్లతోడుతన్ = సమూలముగా, పెఱికించి = పెకలించి, కొనిపోయి = తీసికొనిపోయి, తనకున్, ఉపవనమున్ + చేసెన్ = ఉద్యానవనమును చేసికొనెను.

కనక + అద్రిన్ = బంగరుకొండను - మేరువును, కొనిపోయి, తనకున్, ఎక్కి + ఆడన్, నిజ + ఆరామ - భూమిన్ = తనదైన ఉద్యాన ప్రదేశమున క్రీడా + అద్రిన్ = విహారపర్వతమును, చేసెన్.

అసుర + అరి = దేవతలకు శత్రువు - తారకుఁడు, తన పేరి, అచ్చులు = ముద్రలు, పెట్టించి = వేయించి, సుర - ధేను - సమితిన్ = దేవతల ఆవుల సమూహమును - కామధేనువులను, కీలరము + చేసెన్ = మందగా జేసెను.

గరుడ + ఉరగ + అమర - తరుణులన్ = గరుడ నాగ దేవతా యువతులను, అండజన్, చేకొని = తీసికొనిపోయి, తన - విలాసినులన్ = భోగస్త్రీలనుగా, చేసెన్.

వేద - విహిత - వృత్తిన్ = వేదములందు విధింపఁబడిన అనుష్ఠానమును, విప్రులన్ = బ్రాహ్మణులను, ఉడిపెన్ = మానిపించెను.

తత్ + సతులన్ = ఆ బ్రాహ్మణుల భార్యలను, పురుష - భక్తి + సముష్టను = భర్తలయందు భక్తి చేఁత, ఉడిపెన్ = ఉడిగించెను.

పుణ్య - కర్మము = పుణ్యకార్యమును, ఉడిపెన్ = నశింపఁజేసెను.

తాత్పర్యము : వేల్పులకు అపకారము చేయువాఁడైన తారకాసురుఁడు భూమియందు బలము నుపయోగించి కల్పవృక్షములను వేఱులతోఁ బెకలించి తన యుద్యానమున నాటించెను, మేరువును గొనిపోయి తా నెక్కియాడుటకుఁ దన యుద్యానవనమున విహారపర్వతమునుగాఁ జేసెను, తనపేరుగల ముద్రలు వేయించి కామధేనువులను దన యాలమందగాఁ జేసెను. గరుడ, నాగ, దేవతాయువతుల నెల్లఁ గొనిపోయి తన భోగస్త్రీలను గావించెను. బ్రాహ్మణులను దమ వేదవిహితానుష్ఠానములను మానునట్లు చేసెను. వారి యిల్లాండ్రను పతిభక్తిని ఉడుగునట్లు చేసెను. పుణ్యకార్యములను జెడఁగొట్టెను.

విశేషములు : వేళ్ళతోఁ బెకలన్ - వేఱు శబ్దమునకు వేఱులు - వేళ్లు, వేరులు అను రూపములే గాని వేళ్ళు అనురూపము బాలవ్యాకరణముచే సిద్ధింపదు, 'ఒకానొకచోఁ దోఁటకుఁ దోఁటలనని రూపాంతరమును గలదు' ప్రౌఢ. కారక. 8. కీలరము - కీలారము, కిలరము కిలారము, కీలడు - రూపాం. ఉఱుచు - ఉఱు ప్రేరణరూపము, ఉడుచు - ఉడుగు ప్రేరణరూపము. 'అట్లు చుప్పనాగపుంబు లడంగ్వాది మాయ్వాదుల కగు నగుచో వాని కద్రాలు లోపించు' బాల, క్రియ, 76, ఉడుచు - ఉడుపు - ఉడిగించు - (రూపాం.) చిన్నయసూరి ఉడుగు ధాతువును మాయ్వాదులలోఁ బఠించి, దానికి ఉడుపు అను ప్రేరణార్థకరూపమునే సాధించెను. కాని దానికి ఉడుచు అను ప్రేరణరూపముగూడఁ బ్రామాణికప్రయోగములందుఁ గనుపట్టుచున్నది, 'వాదిత్రశబ్దంబు లుడిచి' - భార. ఆది. 6-15. 'ఒక్కట నిఖిలంబు నుడిచి యదఁచు.' నృసిం. 1-65.

మ. తన తేజం బహిమాంశుడై, తన మహత్త్వం బా వసుస్తోమమై,
తన కోపోన్నతి రుద్రులై, తన మహోత్సాహంబు సిద్ధాదులై,
తన చెన్నశ్వినులై వెలుంగఁ, దన దోర్దర్పంబు దిక్పాలురై
తనరం, గీర్వాణ నియోగముల్గొని నిజేచ్ఛన్ దాన పాలించెడున్, 12

అర్థము : తారకుఁడు-కర్త, తన-తేజంబు, అహిమాంశువు + ఐ = సూర్యుఁడయి - సూర్యుని యుద్యోగమగు కాంతినిచ్చుటను దన తేజస్సే చేయఁగా- అనుట, ఇట్లే అన్నిట గ్రహించునది, తన - మహత్త్వంబు = తనగొప్పతనము, ఆ - వసు - స్తోమము + ఐ = ఆ వసువుల సమూహము - అష్టవసువులు, అయి, తన-కోప + ఉన్నతి = తన కోపాతిశయము, రుద్రులు + ఐ, తన మహత్ (మహో) + ఉత్సాహంబు. సిద్ధ + ఆదులు + ఐ = సిద్ధులు మున్నగువారయి, తన - చెన్ను = తన అందము, అశ్వినులు + ఐ = అశ్వినీదేవత లయి, వెలుంగన్ = ప్రకాశింపఁగా, తన - దోస్ (ః) + దర్పంబు = తన భుజబలగర్వము,దిశ్ (క్) + పాలురు + ఐ = దిక్పాలకు లయి, తనన్ = తగఁగా, గీర్వాణ- నియోగముల్ = దేవతల విధులను, కొని, తాను+అ=తానే, నిజ+ఇచ్ఛన్ = తన యిష్టప్రకారము, పాలించెడున్,

తాత్పర్యము ; తారకాసురుఁడు తన తేజస్సు సూర్యుఁడయి. తన మహత్త్వ మష్టవసువులయి, తన కోపాతిశయము రుద్రులై, తన మహోత్సాహము సిద్ధులు మున్నగువారయి; తన యంద మశ్వినీదేవతలయి, తన భుజబలగర్వము దిక్పాలకు లయి యొప్పఁగా దేవతల విధుల నిట్లు తానే కొని తన యిష్టప్రకారము పాలించును.

విశేషములు : సూర్యుఁడు తేజోనిధి. వసువులు మహిమాన్వితులు, రుద్రులు కోపిష్ఠులు. సిద్ధాదు లుత్సాహవంతులు. అశ్వినులు అందమయినవారు. దిక్పాలకులు బలసంపన్నులు. ఇట్లు వారివారి యుద్యోగముల నతఁడు తన వేర్వేఱువానిచేఁ జేయించుచుండె ననుట.

దిక్పాలురు-దిశ్ + పాలురు-దిక్ + పాలురు. 'అదంతంబయి దీర్ఘపూర్వ లోపధంబయిన మహత్తుమీఁది విభక్తి లకారంబునకు రేఫంబగు.' బాల. తత్సమ, 38, దోర్దర్పంబు - దోస్ + దర్పంబు - దోః + దర్పంబు - దోర్దర్పంబు.

క. అనిమిష పురముల నెల్లం
దన బలునాయకుల నిల్పఁ దలఁచినవాఁడై
దనుజేంద్రుఁడు గోల్కొన నీ
కనిశముఁ బోఁదోలుచుండు నమరగణంబున్. 13

అర్థము : దనుజ + ఇంద్రుఁడు = రాక్షసశ్రేష్ఠుఁడు. అనిమిష-పురములన్ + ఎల్లన్ = దేవతాపురముల నన్నిటను, తన- బలు_నాయకులన్ = తన బలముగల నాయకులను, నిల్పన్ = నిలుపుటకు, తలఁచినవాఁడు + ఐ = ఎంచినవాఁడయి, అమర-గణంబున్ = దేవతల సమూహమును, కోల్కొనన్ + ఈక = స్వస్థతనంద నీక, అనిశమున్ = ఎల్లప్పుడును, పోన్ + తోలుచున్ + ఉండున్ = పోవఁద్రోలు చుండును.

తాత్పర్యము : తారకాసురుఁడు దేవతల నగరములం దన్నిటను దన బలముగల నాయకులను నిలుపనెంచి దేవతలను దేఱుకొననీక యెల్లప్పుడును దఱిమి వేయుచుండును.

విశేషములు : అనిమిషులు = నిమిషము (ఱెప్పపాటు) లేనివారు - దేవతలు. అనిమిషము-చేఁప.

క. ఇలఁ జిత్రము తారక కర
తల సంగతమైన ఘోరతరవారి సొరన్
నిలు పగుఁ దనుఁ జొర కడరినఁ
దలమునుక యగు న్విరోధితతి కబ్జభవా! 14

అర్థము : అబ్జ-భవా! = తమ్మిచూలీ-బ్రహ్మ! ఇలన్ = భూమియందు చిత్రము = ఆశ్చర్యము. ఇలన్ = భూమియందు, విరోధి-తతికిన్ = శత్రుసమూహము నకు, తారక-కరతల_ సంగతము + ఐన = తారకాసురుని యఱచేతనున్నదియగు, ఘోర-తరవారి = భయంకర ఖడ్గము (ను), చొరన్ = ప్రవేశింపఁగా.-శరణుచొచ్చుచో, నిలుపు + అగున్ = బ్రతు కగును. తనున్ = తన్ను, చొరక = ప్రవేశింపక, శరణుచొరక, అడరినన్ = విజృంభించినచో, తలమునుక + అగున్ = తలమునుఁగుట అగును,

తాత్పర్యము : ఇక్కడ ఆశ్చర్యము ; తారకుని కరతలమందలి ఘోర తరవారిని శరణన్నచో శత్రువులకు బ్రదుకగును, బ్రతికిపోదురు, శరణనక విజృంభించుచో వారికి ఆ ఖడ్గము తల మున్గుట యగును.

విశేషములు ; ఘోరతరవారి - ఘోరమైన తరవారి (ఖడ్గము). విరోధి తతికిఁదలమునుక యగు ననుచున్నాఁడు గావున ఘోరతర-వారి = ఘోరతరమైన వారి (జలము)అను స్వారస్యమును జెప్పవచ్చును, అలంకారము సభంగశ్లేషము, ఇటఁ జిత్ర మేమన- నీటిని జొచ్చుచోఁ దలమునుక కావలయును, చొరకున్నచో నిలువు గావలయును, కాని యిట ఘోరతర - వారిని జొచ్చుచో నిలువయి, ఘోర తరవారిని జొరకున్నచోఁ దలమునుక యగు ననుట, ఇట్లు విపరీతముగా నగుటయే చిత్రము, ఇ ట్లేర్పడిన విరోధము ఘోర-తరవారి అని విఱుచుచోఁ బోవుచున్నది, కావున నలంకారము విరోధాభాసము, 'ఆభాసత్వే విరోధస్య విరోధాభాస ఉచ్యతే' చన్ద్రా.

చ. పలుమఱుఁ దారకుండు సురపాలపురంబులు గాల్చు ధూమ పం
క్తులు పయిఁ గప్పుచున్నఁ బెను ధూపటమై పొగ సోఁకి కందెఁ దా
నల రవి; వానితోడి వగ నబ్జుఁడుఁ గందఁగ, నీ యలంతి వీ
రులె మొగపెట్టి నా సురవిరోధికి నోడినవార పోరులన్. 15

అర్థము : తారకుండు, పలుమఱున్ = పెక్కుపర్యాయములు, సుర-పాల-పురంబులు = దేవప్రభువుల నగరములు, కాల్చు = దహించు, ధూమ-పంక్తులు= పొగలయొక్క వరుసలు, పయిన్=తనమీఁద, కప్పుచున్+ఉన్నన్= కప్పుచుండఁగా, పెను-ధూపటము+ఐ = గొప్పదియగు ధూప పటము - పొగ యనెడు వస్త్రము అయి, పొగ- సోఁకి, అల-రవి = ఆ సూర్యుఁడు, తాన్ = తాను, కందెన్ = కంది పోయెను, వానితోడి - వగన్ = అతని రీతిగనే, అబ్జుఁడున్ = చంద్రుఁడును, కందఁగన్=కందిపోఁగా, మొగపెట్టన్ =ఎదుర్కొనుటకు, ఈ + అలంతి వీరులె= ఈ యల్ప వీరులా? నాన్ = అనునట్లు, పోరులన్ = యుద్ధములందు, అ-సుర-విరోధికిన్ = దేవతలకు శత్రువగు ఆ తారకాసురునికి, ఓడిన-వారు + అ = ఓడి పోయినవారే.

తాత్పర్యము : తారకాసురుఁడు పెక్కుమాఱులు దేవతాప్రభువుల పురము లను గాల్పించెను. అప్పుడు వెలువడిన పొగమొత్త మొక ధూప పటముగా నలు దిక్కుల గప్పఁగా సూర్యుఁడు కందిపోయెను. అటనిటీలగనే చంద్రుఁడును గంది పోయెను. 'ఈ దుర్బలులా తారకు నెదుర్కొనువారు?' అనునట్లు వారు యుద్ధము నందుఁ దారకాసురునకోడిపోయినవారే మైరి.

విశేషములు : అలంకార మతిశయోక్తి, ఉత్ప్రేక్ష.

మొగపెట్టు = ఎదుర్కొను - దీని కిందే ప్రయోగాంతరము. 'కట్టెదురఁ దాఁకి పవఁజెట్టు మొగపెట్టు.' 12-173. ధూపటము-ధూపపటము - ధూపరూప పట మని భావము.

తే. పోరఁ దన కోడి పాఱు నీహారరోచిఁ
బట్టుకొని పోయి దానవప్రభుఁడు పిఱికి
వారికెల్లను నోఁగులవానిఁ గాఁగ
నురముపై జీడి నిఱ్ఱి యచ్చొత్తి విడిచె. 16

అర్థము : దానవ-ప్రభుఁడు = రాక్షసరాజు - తారకుఁడు, పోరన్ = యుద్ధమునందు, తనకున్.ఓడి = ఓడిపోయి, పఱువెత్తు = పాఱు, నీహార-రోచిన్ = మంచు కిరణములుగలవానిని-చంద్రుని, పట్టుకొనిపోయి = తీసికొనిపోయి, పిఱికివారికిన్ + ఎల్లను = పిఱికివారందఱిలోను, ఓఁగులవానిన్ + కాఁగన్ = అధమునిగా, ఉరము పైన్ = రొమ్ముమీఁద, జీడిన్ = జీడితో, ఇఱ్ఱి + అచ్చు + ఒత్తి = లేడిముద్రవేసి, విడిచెన్.

తాత్పర్యము: తనతోడియుద్ధమున నోడిపోయి పాఱిపోవు చంద్రుని బంధించి కొనిపోయి తారకుఁడు పిఱికివారందఱిలోను అధముఁడుగా రొమ్ముపై లేడి ముద్రవేసి విడిచెను.

విశేషములు : జీడి నిఱ్ఱి యచ్చొత్తి - పిఱికివారందఱిలోను నధముఁ డెవ్వఁడన వెంటనే గుఱుతించుటకు వీలుగా, ఇఱ్ఱి పిఱికిజంతువు కనుక నిఱ్ఱి

ఉత్ప్రేక్షింపఁబడి, చంద్రునిలోని మచ్చ నిక్షిప్తమైయుండును. కావున నీ కారణముచేఁ జంద్రుఁడు, చంద్రునిలోని మచ్చ చేత యశమునఁ గాదనుచు నూహించి చెప్పుచున్నాఁడు గావున నుత్ప్రేక్షాలంకారము,

క. ఆలమున నసుర చిచ్చును
గాలియుఁ గొని కవియు ననుట గల; దెదిరి రిపుల్
గాలుదురు వీనిఁ గనుకనిఁ;
దూలుదు రెందేని నర్కతూలము వోలెన్. 17

అర్థము : ఆలమునన్ = యుద్ధమునందు, అసుర = రాక్షసుఁడు, చిచ్చు = అగ్నిని, గాలియున్, కొని, కవియున్ = తలపడును, అనుట, కలదు, రిపుల్ = శత్రువులు, వీనిన్ = రాక్షసుని, ఎదిరి = మార్కొని, కనుకనిన్ = సంభ్రమముతో, కాలుదురు = కాలిపోవుదురు; అర్కతూలము + పోలెన్ = జిల్లేడు దూదివలె, ఎందేనిన్ = ఎందున్ + ఏనిన్ = ఎచ్చటనైనను. తూలుదురు = ఎగిరిపోవుదురు,

తాత్పర్యము : రాక్షసుఁడు యుద్ధమున అగ్ని వాయు సాయమునఁ దలపడు ననుట లోకమునఁ గలదు, కావుననే శత్రువులు రాక్షసు నెదిరించినప్పుడు కాలిపోవుటయు, అర్కతూలమువలె నెందైనఁ దూలిపోవుటయుఁ గలుగుచున్నది.

విశేషములు : అర్కతూలము వోలెన్ - ఉపమాలంకారము. చిచ్చును గాలియుఁగొని - కాలుదురు - తూలుదురు - క్రమము పాటింపఁబడినది కావున యథాసంఖ్యము, అసుర చిచ్చును గాలియుఁ గొని కవియు ననుట సామాన్యాంశము దానికి నెదిరించిన రిపులు కాలుదురు తూలుదురు అను విశేషాంశముచే సమర్థింపఁ బడినది కావున నర్థాంతరన్యాసాలంకారమును. అసుర- అసుర శబ్దము వైకల్పికముగా స్త్రీతుల్యమగును, బాల. తత్సమ. 60.

క. సుర గరు డోరగ విద్యా
ధర పురవర సతులతోడ దనుజేశ్వరు కిం
కరులు రమింతురు; దోషా
చరులకు వెలి లోపు గలదె చతురాననుఁడా ? 18

అర్థము : చతురాననుఁడా! (చతుః + ఆననుఁడా), నాలుగుముఖములు గలవాఁడా!, సుర - గరుడ + ఉరగ - విద్యాధర - పుర - వర - సతులతోడన్ = దేవతల, గరుడుల, నాగుల, విద్యాధరుల పురశ్రేష్ఠములందలి స్త్రీలతో, దనుజ + ఈశ్వరు - కింకరులు = రాక్షసశ్రేష్ఠుఁడగు తారకుని భటులు, రమింతురు = సంభోగింతురు, దోష + ఆచరులకున్ = తప్పులు చేయువారికి, దోషా-చరులకున్ = రాత్రులందుఁ దిరుగువారికి - నిశాచరులకు - రాక్షసులకు, వెలి-లోపు = పెఱ, తన యనునది, కలదె = ఉన్నదా?

తాత్పర్యము ; ఓయి బ్రహ్మా! తారకాసురుని సేవకులు దేవతల, గరుడుల, నాగుల, విద్యాధరుల నగరములందలి స్త్రీలతో సంభోగింతురు, తప్పు చేయువారికి - నిశాచరులకు పెఱ, తన యను భావము గలదా; లే దనుట.

విశేషములు : విశేషాంశము సామాన్యాంశముచే సమర్థింపఁబడుటచే నర్థాంతరన్యాసాలంకారము, దోషాచర శబ్దమున శ్లేషము.

క. ఇప్పుడు నీ కే మిన్నియుఁ
జెప్పిన నందేమి దనుజుఁ జేకొని దయతో
నెప్పుడు వర మిచ్చితి నీ
వప్పుడ మది నీడవిడిచితమరుల నెల్లన్. 19

అర్థము : ఇప్పుడు, నీకున్. ఏము = మేము, ఇన్నియున్ = ఇవి యన్నియును - తారకునిచే మేము పడు బాధలన్నియును, చెప్పినన్ = చెప్పినచో, అందున్ + ఏమి? = దానివలనఁ బ్రయోజన మేమి? నీవు, దయతోన్, దనుజున్ = రాక్షసుని - తారకుని, చేకొని = ఆదరించి, ఎప్పుడు, వరము + ఇచ్చితివి + అ = వరమునిచ్చితివో, అప్పుడు + అ = అప్పుడే, అమరులన్ + ఎల్లన్ = దేవతల నందఱను, మదిన్ = మనస్సునందు, ఈడవిడిచితి (వి) = దిగవిడిచితివి - ఉపేక్షించితివి.

తాత్పర్యము : ఇప్పుడు నీకు మే మివియన్నియుఁ జెప్పి యేమి ప్రయోజనము? నీవు రాక్షసు నాదరించి దయతో నెప్పుడు వరమిచ్చితివో, అప్పుడే దేవతల నెల్లరను మనసులో నుపేక్షించితివి.

విశేషములు; ఇచ్చితివి + అ, ఈడవిడిచితివి + అమరులన్ - 'ఇద్వాదుల వకారంబునకు లోపంబు విభాష నగు,' బాల. క్రియ. 14. ఇచ్చితి + ఇ + అ, అపదాదిస్వరసంధి - బాల-సంధి. 117 చే ఇచ్చిత, ఈడవిడిచితి + అమరులన్, 'మధ్యమపురుషక్రియలయం దిత్తునకు సంధి యగును,' బాల. సంధి, 7 ఈడవిడిచి తమరులన్.

క. కాలవశంబున దనుజుఁడు
 కాలునిఁ గీడ్పఱిచెఁ; బలిమిఁ గాలుని నోర్చెన్;
 గాలుని తేజ మడంచెన్;
 గాలుఁడ తా నయ్యె నెల్లకడలును బేర్మిన్. 20

అర్థము: కాల - వశంబునన్ = కాలమువలన లోఁబడి, దనుజుఁడు = రాక్షసుఁడు - తారకాసురుఁడు, కాలునిన్ = యముని, కీడ్పఱిచెన్ = కీడుపడఁజేసెను - లొంగఁదీసెను, బలిమిన్ = బలముతో, కాలునిన్ = యముని, ఓర్చెన్ = ఓడించెను, కాలుని - తేజము = యముని తేజస్సును, అడంచెన్ = అణఁగునట్లు చేసెను, తాను, పేర్మిన్ = గొప్పతనము, ఎల్ల - కడలను = అన్నిదిక్కులను, కాలుఁడు + అ = యముఁడే, అయ్యెన్,

తాత్పర్యము: తారకాసురుఁడు కాలమహిమచే యముని లొంగఁదీసికొనెను. బలముతో యముని నోడించెను, యముని తేజస్సు నడఁచెను. అతఁడు గొప్పతనముతో నన్నిదిక్కులను యముఁడే అయ్యెను.

విశేషములు: తారకుఁడు యముని గీడుపఱుపఁగలుగుట కాలమహిమ వలన. యముని గీడుపఱుచుటయే కాక ఓడించుటయే కాక, యముని తేజస్సును గూడఁ దారకుఁ డడఁచెను. అంతేకాదు తాను గాలుఁడే అయ్యెను.

కీడుపడు - 'అచ్చికంబులం బదమధ్యంబుల న ల డ ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు,' బాల. ప్రకీర్ణ 17. కీడ్పడు, 'పడునకుం జుక్కాను దా కలఘురేఫంబు నగు' బాల-క్రియ, 82. కీడ్పఱుచు. దీని లిట్టు ప్రథమ పురుషైకవచన రూపము - కీడ్పఱిచెన్. ఓర్చెన్ - 'ఆ దోడు కాదుల డకారంబునకుం జుక్కా పరంబగునపుడు రేఫంబగు,' బాల. క్రియ, 80.

క. గోపాలక ! విను మిప్పుడు
గోపాలకు లాది గాఁగఁ గుత్సితమతులై
గోపాలకు లెల్లను జెడి
గోపాలు రైరి తారకున కతి భీతిన్. 21

అర్థము : గోపాలక = వాక్పాలకుఁడవగు ఓ బ్రహ్మ !, వినుము, ఇప్పుడు, గో - పాలకులు + ఆది - కాఁగన్ = దిక్పాలకులు మొదలుగా, గోపాలకులు + ఎల్లను = దేవత లందఱును, కుత్సిత - మతులు + ఐ = కీడుపడిన మనస్సులు గలవారయి, చెడి, అతి - భీతిన్ = మిక్కిలి భయముతో, తారకునకున్, గోపాలకులు = ఆవులను గాచువారు, ఐరి,

తాత్పర్యము : వాక్పాలకుఁడవైన ఓ బ్రహ్మ! వినుము. ఇప్పుడు దిక్పాలకులు మొదలుగాఁ గల దేవతలందఱును మనస్సులు కలఁగి చెడి మిక్కిలి భీతితోఁ దారకునకుఁ బశుపాలకులైరి.

విశేషములు : ఇందు గో శబ్దమునకుఁ గల వివిధార్థములు లెస్సగా నుపయోగించుకొనఁబడినవి. 'స్వర్గేషు పశు వాగ్వజ్ర దిఙ్నేత్ర ఘృణి భూ జలే లక్ష్య దృష్ట్యా స్త్రియాం పుంసి గౌః' అమరము. గోశబ్దము స్వర్గమునకు, బాణమునకు, పశువునకు, వాక్కునకు, వజ్రాయుధమునకు, దిక్కునకు, నేత్రమునకు, కిరణమునకు, భూమికి, నీళ్ళకుఁ బేరు. అలంకార మనుప్రాసము. ఇందుఁ జతుష్ప్రాసము గలదు.

ఐరి - అగుధాతువు, 'ధాతంబున లిట్టగు ' బాల, క్రియ, 3. అగు + లిట్టు, 'లకారంబునకు డు ర్రు వు రు ను ము ఙ్గగు, బాల. క్రియ, 8. ప్రథమపురుష బహువచన మగుటచే - అగు + రు. 'ధాతంబునం దిగాగమం బగు.' బాల. క్రియ, 17. అగు + ఇ + రు, 'అగు పోవుల కడ త్రవాల కిద్వ్యక్రంబులు పరంబు లగునపుడు యకారం బగు' బాల, క్రియ. 99. అయు + ఇ + రు. 'అంద్వవగాగమంబులం దప్ప నపదాదిస్వరంబు పరం బగునపు డచ్చునకు సంధి యగు,' బాల. సంధి. 11. అయి + రు. 'ఇకారంబుమీఁది కు ను వు క్రియావిభక్తుల యుత్వంబున కిత్వం బగు' బాల. తత్సమ. 26. అయిరి. 'అచ్చితంబులం దయి యవులకు వక్రతమంబులు బహుళంబుగా నగు.' బాల. క్రియ. 103. ఐరి.

క. విషధరుఁడు హరియుఁ దక్కఁగ
విషధర సుర గరుడ యక్ష విద్యాధర త
ద్విషధర పదచరు లాదిగ
విషధరులై రిప్డు దసురవీరు నగళ్లన్. 22

అర్థము : విషధరుఁడు = విషమును ధరించినవాఁడు - శివుఁడు, హరి యున్ = విష్ణువును, తక్కఁగన్ = కాక, విషధర .... చరులు : విషధర = నాగులు, సుర = దేవతలు, గరుడ = గరుడులు, యక్ష = యక్షులు, విద్యాధర = విద్యాధరులు, తద్ + విషధర - పదచరులు = ఆ మేఘమార్గము (ఆకాశము) న సంచరించువారు - ఖేచరులు, ఆదిగన్ = మొదలుగా, ఇప్డు, అసుర - వీరు - నగళ్లన్ = రాక్షసవీరుఁడైన తారకుని యంతఃపురములలో, విషధరులు = జలవాహకులు - నీళ్ల మోయువారు, ఐరి.

తాత్పర్యము : ఈశ్వరుఁడు, విష్ణువు తప్పఁ దక్కిన నాగ సుర గరుడ యక్ష విద్యాధర ఖేచరులు మున్నుగాఁ దారకుని యంతఃపురములో నీళ్లకావిళ్లు మోయువారైరి.

విశేషములు ; ఇందు విషధరశబ్దము వివిధార్థములలోఁ బ్రయుక్తమగుట చూడనగును. విషధర = పాము, శివుఁడు, మేఘము, నీళ్లమోయువాఁడు. నగళ్లు - నగరులు, నగళులు. నగర్లు (రూపాం.) 'నగళ్లు' రూపము బాలవ్యాకరణ సాధ్యము గాదు.

సీ. మృడునెద్దుఁ గాని గాడ్పుమృగము బందఁగిఁజేసి
యెలయించి నెలలోని యిఱ్ఱి నేయు,
గౌరివాహనము దిగ్గజముల కుసికొల్పి
విడిచి సింహముఁ బట్టి వేఁటలాడు,
హరిఁ ద్రోచికొనిపోయి గరుడుండు దేగ గా
వించుచు భేరుండాది విహగములకు,
జముపోతుఁ దెచ్చి ఖాస్కారు తేరిమావుల
నెగిచి నుగ్గాడ బ్రేయించి చూచు

ఆ. చండు రేయుఁ బగలు నొండు వినోదముల్
విడిచి సురలమీఁది వేఁటఁ దగిలి
తారకుండు రిపు విదారకుం డనివార్య
విక్రముండు దనుజ చక్రవర్తి. 23

అర్థము : రిపు - విదారకుండు = శత్రువులను హింపించువాఁడును, అనివార్య - విక్రముండు = అడ్డగింపరాని పరాక్రమము గలవాఁడును, దనుజ - చక్రవర్తి = రాక్షస చక్రవర్తియు, అగు, తారకుండు, రేయున్ + పగలున్ = రాత్రియును, పగలును, ఒండు - వినోదముల్ = ఇతరమునైన వేడుకలు, విడిచి, సురల మీఁది = దేవతలపై, వేఁటన్ = వేఁటయందు - దేవతలను వేఁటాడుటయందు, తగిలి = ఆసక్తిగలవాఁడయి -

మృడు + ఎద్దున్ = శివుని వాహనమగు నెద్దును - కొని, గాడ్పు - మృగమున్ = వాయువు వాహనమగు జింకను, బండఁగిన్ + చేసి = దీమఁ జేసి, నెలలోని = చంద్రునిలోనున్న, ఇఱ్ఱిన్ = లేడిని, ఎలయించి = తీసికొనిపోయి, ఏయున్ = కొట్టును.

గౌరి - వాహనమున్ = పార్వతి వాహనమును - సింహమును, దిశ్ (క్)+ గజములకున్ = దిక్కులందలి యేనుఁగులపైకి, ఉసికొల్పి = ప్రేరించి, విడిచి, సింహమున్, పట్టి = బంధించి, వేఁటలు + ఆడున్ = వేఁటాడును.

హరిన్ = విష్ణువును, త్రోచికొనిపోయి = నెట్టుకొనిపోయి, గరుడుండు = అతని వాహనమగు గరుత్మంతుఁడు, డేగ+ కాన్ = డేగగా, భేరుండ + ఆది - విహగములకున్ = భేరుండము మున్నగు క్రూర పక్షులకు, విడుచున్,

జము - పోతున్ = యముని వాహనమగు దున్నను, తెచ్చి, భాస్కరు - తేరి - మావులన్ = సూర్యుని రథము గుఱ్ఱముల నేడింటిని, ఎగిచి = లేవఁగొట్టి, నుగ్గాడన్ = వధింపనట్లు ప్రేయించి - చూచుచున్ + ఉండున్ = కొట్టించి చూచు చుండును,

తాత్పర్యము : శత్రువులను హింసించువాఁడును, అగణించరాని పరాక్రమము గలవాఁడును, రాక్షసప్రముఖుఁడు నగు రావణుఁడు దేవతలమీఁద దండెత్తి విడిపెట్టి, దేవతలను వేటాడుచుండ దానికి సంతసించి శివునివాహన మగు వృషభమును గొని వాయువు వాహనమగు మృగమును దీసుకొని పట్టి పెంచుకొని పోయి చంద్రునిలోని జింకను గొట్టెను. గౌరివాహనమగు సింహమును విఘ్నరాజుకై ఉసిగొలిపి విడిచి సింహమును బట్టి వేటాడెను. విష్ణువును నెట్టుకొనిపోయి అతని వాహనమగు గరుత్మంతుఁడు దేగగా భేరుండము మున్నగు భయంకరపక్షులకు విడిచెను. యముని వాహనమగు దున్నను దెచ్చి సూర్యరథాశ్వములను దేవఁగొట్టి మృగాదు నట్లు కొట్టించి చూచుచుండెను.

విశేషములు : భేరుండము - రెండు తలలును, మూఁడు కన్నులును గల పక్షివిశేషము-గండభేరుండము. మావు = గుఱ్ఱము, 'ఒరగు నశ్వంబు వాజి వామ్మనము వారువము జక్కి- తత్తడి మావు గుఱ్ఱ మనఁ' .... ఆం.నా.2.198. రేయి, రెయి, రే. (రూపాం.) బంతఁగి = దీము. వేఁటకాఁడు మరుమృగములను బట్టుకొనుటకై పెంచిన మృగము.

మృడునెద్దు - మృడు + ఎద్దు. 'షష్ఠీసమాసమునం దుకారాంతశబ్దముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు.' బాల. సంధి. 34.

క. ఇన శశి తేజంబుల జగ
మనిశము విధి నడపు నెంత యని వాని మహిన్
జననీక తారకప్రభఁ
జన నడపెడి మిమ్ము మిగిలి సామర్థ్యమునన్. 24

అర్థము : విధి - బ్రహ్మ, ఇన - శశి - తేజంబులన్ = సూర్యచంద్రుల తేజస్సులతో, జగము = లోకమును, అనిశమున్ = ఎల్లప్పుడును, నడపుట = ప్రవర్తింపఁ జేయుట, ఎంత + అని = ఏమి గొప్ప యని, వానిన్ = ఆ సూర్యచంద్రుల తేజస్సులను, మహిన్ = భూమియందు, జననీక - జనన్ + ఈక = పోలిక,

సామగ్ర్యమునన్ = సమగ్రతయందు, మిమ్మున్ = సృష్టికర్తలగు మిమ్ము. మిగిలి = అతిక్రమించి. తారక - ప్రభన్ = తారకుని తేజస్సుతో - నక్షత్రకాంతితో, జగన్ = ప్రపంచమును. నడపెడిన్ = నడపును.

తాత్పర్యము : బ్రహ్మ! సూర్యచంద్రుల తేజస్సులతో లోకమును ఎల్లప్పుడును నడపుట యేమి విశేషమని తారకుఁడు వారితేజస్సులను భూమిని జనసీక సామగ్ర్యమున సృష్టికర్తలగుమిమ్ము మించి తారక ప్రభతో- తారకాసురునితేజస్సుతో, నక్షత్రకాంతితో లోకమును నడపును.

విశేషములు : సూర్యచంద్రుల ప్రభకంటె నక్షత్రముల ప్రభ తక్కువ, తారకప్రభతోనే జగమును నడపుచుఁ దారకుఁడు బ్రహ్మదేవునే మించె ననుట. తారక ప్రభతో జగమును నడపుట యసాధ్య మగుటచే విరోధ మేర్పడుచున్నది. తారకపదమునకు తారకాసురుఁడను నర్థము చెప్పుచో నా విరోధమున కాభాసత్వమేర్పడును. కావున నలంకారము విరోధాభాసము. అది శ్లేషానుప్రాణితము.

క. కోపించి సురల వెలువడఁ
ద్రోపించె సురారి; బలిమి ధూర్జటి నీళ్లన్
మోపించె; విష్ణుఁ బసులన్
గాపించెను; మీకు నొరయుగడ దాపించెన్. 25

అర్థము : సుర + అరి= దేవతలకు శత్రువగు - రాక్షసుఁడగు తారకుఁడు, సురలన్=దేవతలను, కోపించి=కోపపడి, వెలువడన్=వెలువడునట్లు, ద్రోపించెన్= గెంటించెను, దేవతలు గగనచరు లగుట యిట్లు చమత్కరింపఁబడెను. బలిమిన్ = బలవంతముగా, ధూర్జటిన్ =శివుని, నీళ్లన్ - మోపించెన్ నీళ్లు=మోయునట్లు చేసెను- శివుఁడు గంగను నెత్తిపై మోయువాఁ డగుట యిట్లు చమత్కరింపఁబడెను, విష్ణున్= విష్ణువును, పసులన్ = పశువులను, కాపించెన్ = కాయునట్లు చేసెను, విష్ణువు కృష్ణావతారమున గోపాలకుఁ డగుట యిట్లు చమత్కరింపఁబడెను. మీకున్, ఒరయుగడ = ఒరయుట - దాపిడి - కష్టము, దాపించెన్ = సమీపింపఁజేసెను.

తాత్పర్యము : తారకాసురుఁడు దేవతలందఱిఁ గొట్టి పని బలుమాఱు గెంటించెను. శివునిచే నీళ్లు మోయించెను. విష్ణునిచేఁ బసుపులను నూరించెను. ఇంకఁ గష్టము చేరువయ్యెను.

విశేషములు : మోపించు - మోయించు (రూపాం.)

మ. హరుఁ డా దైత్యునకోడి చన్న నతి వాయంగాక మోక్షార్థమై
పరమంబైన తపంబు సేయఁదొడఁగెన్? విష్ణుండు తద్బాహు భీ
కర దండాహతి దీర్ఘనిద్ర చనియెం గాకెంతకాలంబు సా
గర మధ్యంబున నిద్రసేయునె జగత్కల్యాణ కాంక్షాత్ముఁడై? 26

అర్థము ; హరుఁడు = ఈశ్వరుఁడు, ఆ - దైత్యునకున్ = ఆ రాక్షసునకు - తారకునకు, ఓడి = పరాజితుఁడయి, చన్న = పొందిన, నతి = నింద. వాయన్ + కాక = పోఁగొట్టుకొనుటకుఁగాక. మోక్ష + అర్థమే - ముక్తికొఱకా. పరమంబు + ఐన = ఘోరమైన, తపంబు = తపస్సు, చేయన్ + తొడఁగెన = చేయ నారంభించెనా? విష్ణుండు, తత్ + బాహా - భీకర - దండ + ఆహతిన్ = ఆతని (ఆ తారకుని) చేతియందలి, భయంకరమైన, కఱ్ఱయొక్క దెబ్బచే, లేక ఆతని బాహువనెడి భయంకరదండాహతిచే నని యైనఁ జెప్పవచ్చును, దీర్ఘ - నిద్ర = చిరకాలపు నిద్ర - మరణము, చనియెన్ + కాక = పొందెనుగాని, జగత్ + కల్యాణ - కాంక్ష + ఆత్ముఁడు + ఐ = లోకకల్యాణమునందలి కోరిక గలవాఁడయి - ఇంత - కాలంబు = ఇంత సుదీర్ఘ కాలము, సాగర - మధ్యంబునన్ = సముద్రము నడుమ, నిద్ర + చేయునె = నిద్రించునా ?

తాత్పర్యము : ఈశ్వరుఁడు తారకాసురునిచేఁ బరాజితుఁ డయినాఁడన్న నిందను బోఁగొట్టుకొనుటకే గాని మోక్షము నిమిత్తమా ఘోరమైన తపముచేయుట ? విష్ణువు తారకుని బాహువనెడి భీకరదండముచే దెబ్బతిని దీర్ఘనిద్ర పొందెనుగాని లోక కల్యాణకాంక్షతో నింతకాలము సముద్రమధ్యమున నిద్రపోవునా ?

విశేషములు : తద్బాహాభీకరదండాహతి .... రూపకము. తద్బాహు వనెడి భీకరదండము నాహతి. దీర్ఘనిద్ర = పెద్ద నిద్దుర - మరణము.

క. మందారార్కాలయములు
మందారార్క వనీజమయ మయ్యె; సదా
నందన వనజావాసము
నందన వనజారాభినందిత మయ్యెన్. 27

అర్థము : మంద + ఆర + అర్క + ఆలయములు = శని, అంగారక, సూర్యగ్రహ నివాసములు, మందార + అర్క + అవనీజమయము (లు) = ఉమ్మెత్త, జిల్లేడు చెట్లతో నిండినవి, అయ్యెన్, సదా = ఎల్లప్పుడును, నందన - వనజ + ఆవాసము = నందనోద్యానమునందలి పద్మములకు నిలయమయిన సరోవరము, నందన - వనజ + ఆర - అభినందితము = కప్పలకును, తుంగముస్తలకును, నిలయముగా నుతింపఁబడినది, అయ్యెన్.

తాత్పర్యము : శని, అంగారక, సూర్యగ్రహముల నిలయము లుమ్మెత్త జిల్లేడుచెట్లతో నిండిన వయ్యెను. ఆ నందనోద్యానమునందలి పద్మములకు నిలయమైన సరస్సు కప్పలకును, తుంగముస్తలకును నిలయముగా నుతింపఁబడిన దయ్యెను.

విశేషములు : అలంకారము శ్లేషము, అర్క - సూర్య. అర్కపర్ణ (జిల్లేడు) 'అర్కో ఽర్కపర్ణే స్ఫటికే రవౌ తామ్రే దివస్పతౌ - విశ్వప్రకాశః

సీ. అనిమిషపతి పుర మనిమిషాస్పద మయ్యె,
నసుర ప్రహో ల్లెల్లను నసులమయము.
ప్రేతాధిపతి వీడు ప్రేతసంగతము, వ
లాశను నెలవు పలాశయుతము,
వనధిప నగరంబు వనచరాకీర్ణంబు,
మారుతాలయము భీమారుతంబు,
కనకాధిపతి వీడు కనకోద్గతంబు, శి
వావాస మెల్ల శివాన్వితంబు,

ఆ. చేసెఁ గానఁ దారకాసురుదెస విప
రీతవృత్తి లేక రిత్తమాఱు
లేటి కనిన నా సురేశరామాత్యు వ
క్రోక్తి విని సరోజయోని నగుచు. 28

అర్థము ; అనిమిష - పతి - పురము = దేవతల ప్రభువైన ఇంద్రుని నగరము అమరావతి, అనిమిష + ఆస్పదము = దేవతలకు నిలయము, అయ్యెన్, అనలు - ప్రోలు + ఎల్లన్ = అగ్ని పురమంతయు, అనల - మయము = అగ్నితో నిండినదిగాను,

ప్రేత + అధిపతి - వీడు = ప్రేతములకు (పీనుఁగులకు) ప్రభువు అగు యమునియొక్క పట్టణము, ప్రేత - సంగతము = పీనుఁగులతోఁ గూడినదిగాను, పల + అశను - నెలవు = రాక్షసుని (నిరృతి) యొక్క (మాంసము ఆహారము గాఁగలవాఁడు - రాక్షసుఁడు). స్థానము. పలాశ - యుతము = మోదుగుచెట్లతోఁ గూడినది గాను,

వనధి + ఈశు = సముద్రాధిపతియొక్క, - వరుణునియొక్క, నగరంబు = పురము. వనచర + ఆకీర్ణంబు = వనచరములతో - శరభమృగములతో - లేదా వనమనఁగా నీరు - జలచరములతో, వ్యాప్తమయినదిగాను, మారుత + ఆలయము = వాయువు నిలయము, భీమా + రుతంబు = కొరడాల ధ్వని గలది - దుర్గాదేవి గర్జనలు (?) గలది గాను

కనక + అధిపతి - వీడు = బంగారమునకు (ధనమునకు) అధిపతి యగు కుబేరునియొక్క పట్టణము, కనక + ఉద్గతంబు = ఉమ్మెత్తల మొలకలుగలదిగాను, శివ + ఆవాసము + ఎల్లన్ = ఈశానుని నిలయమంతయు, శివా + అన్వితంబు = నక్కలతోఁ గూడినదిగాను,

చేసెన్ + కానన్ = చేసెను గావున, తారక + అసురుదెసన్ = తారకాసురుని విషయమున, విపరీత - వృత్తి - లేక = వైరుద్ధ్యము లేక, రిత్త - మాఱులు = వ్యర్థములైన నిందలు, ఏటికన్ = ఎందులకు, అనినన్ = అనఁగా, అ - సుర +

గీష్పతి + అమాత్య = దేవేంద్రుని మంత్రి యగు ఆ బృహస్పతియొక్క, వక్ర + ఉక్తిన్ = వక్రోక్తిని - వంకరవాక్యమును. విని, సరోజ - యోని = తమ్మిచూలి - బ్రహ్మ, నగుమున్ = నవ్వును.

తా త్ప ర్య ము : 'అనిమిషపతియైన దేవేంద్రుని పుర మనిమిష నిలయ మయ్యెను. అగ్నిదేవుని పురమెల్ల నగ్నిమయముగను, యముని నగరము ప్రేత యుక్తమ్ముగను, నిరృతి పురమును మోదుగుచెట్లతోఁ గూడుకొనినదిగను, వరుణుని పత్తనమును పసవరములతోఁ గూడుకొనినదిగాను, వాయుదేవుని యాలయము ఘనాఘనములతోఁ గూడినదిగాను, కుబేరుని పై డుమ్మెత్తలు మొలచినట్లుగను, ఈశానుని యావాస మంతయు నక్కలతోఁ గూడినదిగాను దారుణము చేసెను. కావున నరుని విషయమున వైరుధ్యములేని వ్యర్థమైన నింద లేటికి?, అనఁగా ఆ బృహస్పతి వక్రోక్తిని బ్రహ్మ విని నవ్వెను - తరువాతి గద్యముతో నన్వయము.

వి శే ష ము లు : బృహస్పతి పలుకులు వక్రోక్తులని కవియే సూచించినాఁడు గావున నిందు వక్రోక్త్యలంకారము గలదని భావింపవచ్చును. దాని లక్షణము: 'వక్రోక్తి శ్లేషకాకుభ్యా మపరార్థప్రకల్పనమ్' అన్నారు. శ్లేషముచేతఁ గాని కాకుస్వరముచేతఁ గాని యర్థాంతరము కల్పించినయెడల వక్రోక్త్యలంకార మగును. ఇం దనిమిషాస్పద మనుచో శ్లేషముగలదు, అనిమిష శబ్దమునకు దేవత, చేఁప యని రెండర్థములు గలవు. ఇట్లే పలాశశబ్దమునకు రాక్షసుఁడు, మోదుగ నని యర్థద్వయము గలదు, అట్లే కనక శబ్దమునకు ధనమనియు, నుమ్మెత్త యనియు రెం డర్థములు. శివాన్విత మనుచో శివ + అన్వితము అనిగాక శివా + అన్వితము అని విడఁదీసి యర్థము చెప్పవలయుటచే నచ్చటను సభంగశ్లేషము గలదు. ఈ రీతిగా వక్రోక్త్యలంకారము గలదని చెప్పవచ్చును. మఱియు నరకాసురునిదెస రిత్తమాటలుగాక, విపరీతవృత్తి గలవని కవియే సూచించు చున్నాఁడు. కావుననిందు బృహస్పతి యుక్తులకు సామాన్యార్థమును గాక తద్విరుద్ధార్థమును జెప్పవలయు ననుట. ఇందు దిక్పాలకుల పురములను జెప్పుటలోఁ గ్రమమును బాటించుట గమనింపఁదగియున్నది.

వ. నిజ వరప్రభావంబునఁ దారకుండు ప్రబలుం డగుటకు సంతోషించియు నిఖిల జగ దపకారుం డగుటకుం గోపించి తద్వధోపాయంబు విచారించి కని.

అర్థము ; నిజ - వర - ప్రభావంబునన్ = తనది యగు వరముయొక్క, మహిమచేత. తారకుండు, ప్రబలుండు = మిక్కిలి బలము గలవాఁడు, అగుటకున్, సంతోషించియున్, నిఖిల - జగత్ + అపకారుండు = ఎల్లలోకములకు అపకారము గలవాఁడు - ఎల్లలోకములకు అపకారము చేయువాఁడు, అగుటకున్, కోపించి, తత్ + వధ + ఉపాయంబున్ = అతని వధకు ఉపాయమును, విచారించి = ఆలోచించి కని = కనుఁగొని.

తాత్పర్యము : తన యిచ్చిన వరము మహిమచేఁ దారకుఁడు మిక్కిలి బలముగలవాఁ డగుటకు బ్రహ్మ సంతోషించియు, నతఁడు లోకముల కన్నిటికి నపకారము చేయుచుండుటకుఁ గోపపడువాని యాతనిని వధింప నుపాయము నాలోచించి, కనుఁగొని - తరువాతి పద్యముతో నన్వయము.

చ. వెలయ నుమామహేశ్వరుల వీర్యమునం దుదయించునట్టి దో
ర్బలకలితుండు గాని సురపాలకవిద్విషుఁ దారకాసురున్
గెలువఁడు పోరిలో; మకరకేతనుఁ బంపుఁడు; వారికిం దప
శ్చలనము సేసి మైవడిఁ బ్రసంగము సేయు జగద్ధితంబుగాన్. 30

అర్థము : వెలయన్ = ఒప్పునట్లుగా, ఉమా - మహేశ్వరుల = పార్వతీ పరమేశ్వరులయొక్క, వీర్యమునందున్ = వీర్యమువలన, ఉదయించు + అట్టి = పుట్టునట్టి, దోస్ (ః) + బల - కలితుండు = భుజబలముతోఁ గూడినవాఁడు, కాని, సుర - పాలక - విద్విషున్ = దేవేంద్రుని శత్రువగు, తారక + అసురున్ = తారకుఁడను రాక్షసుని, పోరిలోన్ = యుద్ధములో, గెలువఁడు = జయింపఁడు, మకర - కేతనున్ = మొసలి ధ్వజచిహ్నముగాఁ - గలవానిని - మన్మథుని, పంపుఁడు, (అతఁడు) వారికిన్ = పార్వతీపరమేశ్వరులకు, తపస్ + చలనము = తపోభంగము, చేసి, మైవడిన్ = అనుకూల్యముతో, జగత్ + హితంబు + కాన్ = లోకములకు మేలగునట్లు, ప్రసంగము + చేయున్ = ప్రకృష్టమయిన సంగమమును జేయును.

తాత్పర్యము : ఉమాగర్భమున నొప్పునట్లుగా శివతేజమైన పరమేశ్వరుని వీర్యమువలనఁ బుట్టు భుజబలసంపన్నుఁడు గాని యింద్రశత్రువగు తారకాసురుని యుద్ధ

మున గెలువఁజాలఁడు. మీరు మన్మథుని వారికడకుఁ బంపుఁడు. అతఁడు వారితపస్సును భగ్నముచేసి వాని కీశ్వరునికిని లోకోపకారకముగా సంగమమును గలిగించును.

విశేషములు : వీర్యము మహేశ్వరునిది. అది ఉమాగర్భనిక్షిప్తమైనది యనుటకు ఉమామహేశ్వరుల వీర్య మనఁబడినది.

దోస్ + బల - పదాంతసకారమునకు విసర్గాదేశము - దోః+బల. అ ఆ లు తప్ప మిగిలిన అచ్చుల తరువాత వచ్చు విసర్గమునకు అచ్చుగాని, మృదుహల్లులుగాని పరములగునపుడు రేఫ మాదేశ మగును. దోర్బల. జగద్ధితము-జగత్ + హితము -వర్గముల మొదటి నాలుగక్షరముల (ఝయ్యుల) కంటె పరమగు హకారమునకు పూర్వసవర్ణాదేశము (ఆ వర్గములకుఁ జెందిన చతుర్థవర్ణాదేశము) వైకల్పికముగానగును. జగత్ + ధితము, జగత్ + హితము. అనునాసికాంతస్థ వర్ణములు తప్పమిగిలిన పదాంతహల్లులకు (ఝల్లులకు) మృదు హల్లులు (హశ్శులు) గాని అచ్చులుగాని పరము లగునపుడు ఆహల్లులవర్గముకుఁ జెందిన తృతీయవర్ణ మాదేశముగావచ్చును. జగద్ధితము, జగద్హితము, తపశ్చలనము-తపస్ + చలనము. పదాంత సకారమునకు విసర్గాదేశము. తపః + చలనము. ఊష్మ పరకములు గాని చ ఛ, ట ఠ, త థలు పరము లగునపుడు విసర్గము సకారముగా మాఱి చ ఛలు పరమగునపుడు శ్చుత్వమును, ట ఠలు పరమగునపుడు ష్టుత్వమును బొందును. తపశ్చలనము.

వ. అని తమకుం గరుణించి చతుర్ముఖుండు హితోపదేశంబు చేసిన
దానికి మహాప్రసాదం బని వీడుకొని. 31

అర్థము : అని, తమకున్ = తమ్ము, కరుణించి = దయఁజూచి, చతుర్ముఖుండు = నాలుగుమోములవాఁడు - బ్రహ్మ, హిత + ఉపదేశంబు + చేసినన్ = మేలుగలిగించు మాట ఉపదేశింపఁగా, దానికిన్, మహత్ (మహా) + ప్రసాదంబు + అని = గొప్పయనుగ్రహము అని, వీడుకొని = సెలవు పుచ్చుకొని.

తాత్పర్యము : అని తమ్ము దయఁదలఁచి బ్రహ్మ హితము నుపదేశింపఁగా దానికి మహాప్రసాదమని వారిని వీడ్కొని-తరువాతి పద్యముతో నన్వయము.

క. తమ కప్పుడు త్రిభువన రా
జ్యము చేకుఱినంతకంటె సంతోషముతో
నమరతతి గొల్వ చనుదే
నమరేంద్రుఁడు వచ్చెఁ బేర్మి నమరావతికిన్. 32

అర్థము : తమకున్, అప్పుడు, త్రిభువన - రాజ్యము = ముల్లోకముల రాజ్యము, చేకుఱిన + అంతకంటెన్ = లభించినదానికంటె, సంతోషముతోన్, అమర - తతి = దేవసమూహము, కొల్వ = సేవించి, చను + తేన్ = రాఁగా, అమర + ఇంద్రుఁడు = దేవేంద్రుఁడు, పేర్మిన్ = గౌరవముతో, అమరావతికిన్, వచ్చెన్.

తాత్పర్యము : దేవతల కప్పుడు ముల్లోకములరాజ్యము లభించినదానికంటె సంతోషము గలుగఁగా వారు సేవించుచురాఁగా నింద్రుఁడు సగౌరవముగా నమరావతి కరుదెంచెను.

విశేషములు : చేకూరు - చేకుఱు, దీర్ఘపూర్వకమగు లఘురేఫము హ్రస్వపూర్వక మగుచో నలఘురేఫం బగు, చను + తేన్. 'అభ్యాగతి నధ్యాహ్నాదుల కయ్యది (తెంచుధాతువు) యనుప్రయుక్తంబగు నగుచో గువర్ణంబు విభాషను లోపించు,' బాల. క్రియ. 111. చను + తెంచు 'ఉత్వంబునయిని దాని తకారంబు దకారంబు కాఁగా (110 చే) చనుదెంచు, 'తుమర్థభావలక్షణంబులందు నుజీ యగు.' బాల. క్రియ. 40. చనుదెంచు + నుజీ. 'ముజ్జీత్తులు ముత్తు నాఁబడు.' బాల. క్రియ. 86. 'అద్దానికి ముత్తుపరంబగునప్పుడు తే చేరు లగు.' బాల. క్రియ. 113. చనుదేన్, చనుదేరన్.

ఇంద్రాదులు పార్వతీపరమేశ్వరుల సంయోగమునకు మన్మథునిఁ బ్రోత్సహించుట

వ. ఇట్లు వచ్చి పచ్చవిల్తు రావింపం బుచ్చినం దదాజ్ఞాప్రేరితుండై కుసుమాయుధుఁ డా క్షణంబ కదలి. 33

అర్థము: ఇట్లు, వచ్చి, పచ్చవిల్తున్ = చెఱకువింటివానిని-మన్మథుని, రావింపన్ + పుచ్చినన్ = రాఁబంపఁగా, కుసుమ + ఆయుధుఁడు = పుష్పబాణుఁడు.

మన్మథుఁడు, తద్ + ఆజ్ఞా - ప్రేరితుండు + ఐ = ఆతని ఆదేశముచేఁ బ్రేరింపఁ బడినవాఁడయి, ఆక్షణంబు + అ= తత్క్షణమే, కదలి.

తాత్పర్యము : ఇట్లు వచ్చి మన్మథుని రావింపఁగా నతఁడు వానియాజ్ఞచేఁ బ్రేరేపింపఁబడినవాఁడయి తత్క్షణమే కదలి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : పచ్చవిల్తుఁడు - పచ్చని విల్లు కలవాఁడు - బహువ్రీహి సమాసము. 'బహువ్రీహిని సమాసాంతకార్యంబులుం గానంబడియెడి.' బాల.సమాస. 22. పచ్చవిలుతుఁడు : ఆచ్ఛికంబులం బదమధ్యంబుల న ల డ ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' పచ్చవిల్తుఁడు.బాల. ప్రకీర్ణ. 17. రావింపంబుచ్చినన్ - వచ్చు ధాతువు. 'సర్వంబునకుం బ్రేరణంబునం దించుక్కగు.' బాల.క్రియ.70. వచ్చు + ఇంచు. 'ఇంచు క్కు క్కుగాగమంబులు పరంబులగునపు డాగమాదేశ లోపంబులు పెక్కుదెఱంగులం గానంబడియెడి.' బాల.క్రియ.77-రావించు. 'తుమర్థభావ లక్షణంబులందు నుజీ యగు.' బాల.క్రియ. 40. రావించు + నుజీ. 'ముజ్జీత్తులు ముత్తు నాఁబడు.' బాల.క్రియ. 86. 'ఆగమాన్యచకారంబుల కద్విరుక్తంబులకు ముత్తు పరంబగునపుడు ప వ లగు.' బాల.క్రియ. 88. రావింపన్. పోవు ధాతువు. 'సర్వంబు నకుం బ్రేరణంబునం దించుక్కగు.' బాల.క్రియ.70. పోవు + ఇంచు. 'ఇంచు క్కు క్కుగాగమంబులు పరంబు లగునపు డాగమాదేశలోపంబులు పెక్కుదెఱంగులం గానంబడియెడి.' బాల.క్రియ.77. పుచ్చు.' చేదర్థంబునందు వృత్తంబగు భావలక్షణంబు నందు నవర్ణకంబు ద్రుతాంతం బగు.' బాల.క్రియ.41. పుచ్చు + నన్.'భూతంబునం దిగాగమం బగు.' పుచ్చు + ఇ + నన్. బాల.క్రియ.17. 'అంద్వవగాగమంబులం దప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు.'బాల.సంధి.11. పుచ్చినన్. రావింపన్ + పుచ్చినన్. 'ద్రుతప్రకృతికముమీఁది పరుషములకు సరళము లగు.' బాల.సంధి.16. రావింపన్ + బుచ్చినన్. 'ఆదేశసరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాష నగు.' బాల.సంధి.17. రావింపంబుచ్చినన్. అ క్షణంబ - అనుటకు అక్షణంబ అని నన్నెచోడుఁడు పలుచోట్లఁ బ్రయోగించెను. 4-82 11-76.

ఉ. పూవులతేరు జక్కవలు పూన, వసంతుఁడుఁ దాను నెక్కి, కీ
రావళి కోకిలాళి మలయానిలముం దనుఁగొల్చి పొల్చి రాఁ
గా, వర మీనకేతనము గ్రాల, నలివ్రజ శంఖ కాహళా
రావములుం జెలంగ నమరావతికిం జనుదెంచె నున్నతిన్. 34

అర్థము: పూవుల - తేరు = పుష్పరథము, జక్కవలు = చక్రవాకములు, పూనన్ = వహింపఁగా, వసంతుఁడున్, తానున్, ఎక్కి, కీర + అవళి = చిలుకల వరుస, కోకిల + ఆళి = కోకిలముల వరుస, మలయ + అనిలమున్ = మలయ పర్వతమునుండి వచ్చు గాలియును - దక్షిణపు గాలియును, తనున్+తన్ను, కొల్చి = సేవించి, పొల్చు = ఒప్పు, రాఁగాన్, వర - మీన - కేతనము = శ్రేష్ఠమయిన చేఁపయును ధ్వజచిహ్నము, క్రాలన్ = ఒప్పఁగా. అలి - వ్రజ - శంఖ - కాహళా + ఆరావములన్ = తుమ్మెదలగుంపు అనెడి శంఖములయు, కాహళ (పెద్దతక్క) లయు ధ్వనులు, చెలంగన్ = మ్రోయఁగా. ఉన్నతిన్ = గొప్పతనముతో, అమరావతికిన్, చనుదెంచెన్ = వచ్చెను.

తాత్పర్యము: పుష్పరథమును జక్రవాకములు వహింపఁగా, దానిపై వసంతుఁడును దానునుఎక్కి, చిలుకలు, కోకిలములు, మలయవాయువు తన్ను సేవించి వచ్చుచుండఁగా, మత్స్యధ్వజము ఒప్పఁగా, తుమ్మెదలగుంపనెడి శంఖములయు, కాహళలయు ధ్వనులు మ్రోయఁగా మన్మథుఁడు గొప్పతనముతో నమరావతి కరుదెంచెను.

విశేషములు: జక్కవలు, వసంతుఁడు, కీరములు, కోకిలములు, మలయ వాయువు, తుమ్మెదలు మన్మథుని పరివారము, వసంతుఁ డాతని మిత్రుఁడు. అలివ్రజ మనెడి శంఖకాహళ లనుటచే రూపకాలంకారము.

వసంతుఁడు దాను నెక్కి .... అమరావతికిం జనుదెంచె ....' ఆత్మార్థం బభిహితం బగుచోఁ దల్లింగసంఖ్యాభిధాయి వచనంబు ధాతువిశేషణంబుల కగు.' బాల. క్రియ. 120

వ. ఇట్లు శృంగారయోని శృంగారరసప్రవాహంబు మేరదప్పి కప్పిన ట్లప్పురంబు సొత్తెంచునప్పు డతిసంభ్రమంబునఁ బుష్పాయుధుం గనుంగొని. 35

అర్థము: ఇట్లు, శృంగారయోని = మన్మథుఁడు, శృంగార-రస-ప్రవాహంబు = శృంగారమనెడిరసముయొక్క ప్రవాహము, మేర + తప్పి = హద్దుమీఱి, కప్పు + అట్లు = వ్యాపించువిధమున, ఆ + పురంబు = ఆ నగరము - అమరావతి చొత్తెంచు + అప్పుడు = ప్రవేశించు సమయమున, అతి - సంభ్రమంబునన్ = మిక్కిలి వేగిరపాటుతో. పుష్ప + ఆయుధున్ = పూవుటమ్ములవానిని, మన్మథుని కనుంగొని = చూచి.

తాత్పర్యము: ఇట్లు మన్మథుఁడు శృంగారరసప్రవాహము పట్టణమున వ్యాపించునట్లు ఆ పురమును ప్రవేశించినప్పుడు మిక్కిలి సంరంభముతో మన్మథుని జూచి - రతిపతి పద్యమునకు నన్వయము.

విశేషములు: శృంగారయోని - శృంగారయోనిః శ్రీపుత్త్రః ఝాప్పకారాతిః. శృంగారమునకుఁ గారణమైనవాఁడు - మన్మథుఁడు, అమరము.

చొత్తెంచు - చొచ్చు ధాతువు, 'తెంచుధాతువగ్వాదుల కనుప్రయుక్తం బగు.' బాల. క్రియ. 110. చొచ్చు + తెంచు. 'అయ్యది పరంబగునపుడు చువర్ణంబు లోపించు.' బాల. క్రియ. 112. చొచ్ + తెంచు. (చొచ్ + చు = చొచ్చు). ఒక హల్లునకు విజాతీయమగు హల్లుతో సంయోగ మెప్పుడునప్పు డా హల్లు పరహల్లుగా మాఱునని నిర్దేశానుసారముగ గ్రహింపఁదగును. కాన చకారము పరహల్లుగా మాఱి చొత్ + తెంచు = చొత్తెంచు సిద్ధించును. చొత్తెంచు + అప్పుడు - 'ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' బాల. సంధి. 33. చొత్తెంచు నప్పుడు. శృంగార - రస = శృంగారమనెడి రస - రూపకము.

ఆ. పడఁతు లెల్లఁ గామపరవశలై; రది
తగు; మనోజుఁ జూచి మగలు గరముఁ
బ్రీతిఁ దగిలి గండపేటంబు కొని సుర
పురి జనంబు లెల్ల విరలి గొనిరి. 38

అర్థము: పడఁతులు + ఎల్లన్ = స్త్రీలందఱును, కామ - పరవశలు = మన్మథునకు లోఁబడినవారు, ఐరి = అయిరి, అది, తగున్ = ఒప్పును, మనోజున్ = మన్మథుని, చూచి, మగలున్ = పురుషులుకూడ, కరమున్ = మిక్కిలి, ప్రీతిన్ = ప్రేమముతో, తగిలి = ఆసక్తినొంది, గండపేటంబు = పురుషులయం దనురాగము, కొని = పూని, (ఇట్లు), సుర - పురి - జనంబులు + ఎల్లన్ = అమరావతియందలి జనులందఱును, విరలి + కొనిరి = వలపుగొనిరి.

తాత్పర్యము: మన్మథుఁ డమరావతికి వచ్చినప్పుడు స్త్రీ లందఱును మన్మథపరవశ్యము చెందిరి. అది యొప్పును. కాని అతనినిఁ జూచి పురుషులుగూడ

యొక్కొక్క ప్రేమయుతో ఆసక్తి వహించి పురుషులం దనురాగము వహించిరి, ఇట్లు ఆ పురమునందలి జనులెల్లరును వలపు వహించిరి.

విశేషములు: స్త్రీలు కాముకులగుట సహజమే కావున నది యొప్పును, కాని పురుషులు పురుషులపై ననురక్తి వహించుట విశేషము. విరలి - విరాళి, జనంబులు - అమరావతి గాన దేవతలని భావము.

వ. ఇట్లఖిల జన సమ్మోహనాకారుం డగు సమ్మోహనాయుధుండు వజ్రా
యుధు నాస్థానరంగంబు దఱియం జొత్తెంచి. 37

అర్థము: ఇట్లు, అఖిల-జన-సమ్మోహన + ఆకారుండు = ఎల్ల జనులకు మోహమును బుట్టించు రూపము గలవాఁడు, అగు, సమ్మోహన + ఆయుధుండు = సమ్మోహన మనెడి ఆయుధము గలవాఁడు-మన్మథుఁడు, వజ్ర + ఆయుధు = వజ్ర మాయుధముగాఁ గలవాని (ఇంద్రుని) యొక్క, ఆస్థాన - రంగంబున్ + కొలువు ప్రదేశమును, తఱియన్+చొత్తెంచి=ప్రవేశించి.

తాత్పర్యము: ఇట్లు ఎల్లజనులకు మోహమును బుట్టించు సౌందర్యము గలవాఁడగు మన్మథుఁడు ఇంద్రుని కొలువుకూటమును బ్రవేశించి- తరువాతి పద్యముతో నన్వయము.

వజ్రాయుధు నాస్థానరంగంబు-వజ్రాయుధు + ఆస్థానరంగంబు- 'షష్ఠీసమాసము నం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' బాల.సంధి.34.

శా. రంభాద్యప్సర ఓఘ లాస్య రస పూర స్ఫార నేత్రామలో
జ్జృంభాంభోజ సహస్ర భోగఫల భాసిం దారకోన్మాలనా
రంభాయత్త సుచిత్తు నిర్జరధునీ రాజీవ మాలాధరున్
జంభారాతిఁ బురందరుం గని మనోజాతుండు ప్రీతాత్ముఁడై 38

అర్థము: రంభా .... భాసిన్: రంభా = రంభ. ఆది = మొదలుగాఁగల, అప్సరస్(ః)=అచ్చరల యొక్క ఓఘ-సమూహము యొక్క, లాస్య-రస = నాట్యమనెడి, రసము యొక్క, పూర = ప్రవాహముచే, స్ఫార = విస్తరించిన, నేత్ర=కన్ను లనెడి,

అమల = నిర్మలములైన, ఉజ్జృంభ = బాగుగా వికసించిన, అంభోజ = పద్మముల యొక్క, సహస్ర = వేయిటియొక్క, భోగ = సౌఖ్యమనెడి, ఫల = ఫలముచే, భాసిన్=ప్రకాశించువాఁడును, తారకో....సుచిత్తున్; తారక = తారకాసురునియొక్క, ఉన్మూలన=నాశనమనెడి. ఆరంభ = ప్రయత్నమునకు, ఆయత్త=అధీనమైన, సు-చిత్తున్=మంచి మనస్సుగలవాఁడును, నిర్జర,,ధుని=నిర్జర-ధునీ=దివ్యగంగయందలి, రాజీవ=తామరల, మాలా ధరున్= దండలను దాల్చినవాఁడును, జంభ+అరాతిన్= జంభుఁడను రాక్షసునకు శత్రువైనవాఁడును, అగు, పురందరున్ = ఇంద్రుని, కని, మనోజాతుండు=మనసిజుఁడు-మన్మథుఁడు, ప్రీత+ఆత్ముఁడు+ఐ= సంతోషించిన మనస్సు గలవాఁడయి.

తా త్ప ర్య ము : మన్మథుఁడు-రంభ మున్నగు నప్సరల సమూహముయొక్క నృత్య మనెడి రసము ప్రవాహముచే విస్తరించిన కన్ను లనెడి నిర్మలములైన మిక్కిలి వికసించిన వేయిపద్మముల సౌఖ్య మనెడి ఫలముచేఁ బ్రకాశించువాఁడును, తారకనాశనప్రయత్నమున కధీనమైన మనస్సు గలవాఁడును, ఆకాశగంగానదియందలి తామరల మాలలను దాల్చినవాఁడును, జంభుఁ డను రాక్షసునకు శత్రువైనవాఁడును అగు దేవేంద్రుని జూచి సంతోషించినవాఁడయి-తరువాతి పద్యముతో నన్వయము.

వి శే ష ము లు : రంభాదుల నాట్యమే యగు రసప్రవాహమున విస్తరించిన నేత్రములే యగు వేయిపద్మములచేఁ బ్రకాశించువాఁడు-రూపకాలంకారము. పురందర- 'వృద్ధశ్రవాః సునాసీరః పురుహూతః పురందరః'-పురాణి అరీణాం దారయతీతి-పురన్దరః- శత్రుపురములను వ్రక్కలించినవాఁడు-ఇంద్రుఁడు, అమరము.

రంభా+ఆది=రంభాది-సవర్ణదీర్ఘ సంధి. రంభాది+అప్సరస్=రంభాద్యప్సరస్- యణాదేశసంధి. అప్సరస్+ఓఘ=అప్సరః+ఓఘ-పదాంతసకారమునకు విసర్గాదేశము. హ్రస్వ అకారము తరువాత వచ్చు విసర్గము హ్రస్వాకారభిన్నమైన అచ్చు పరమగు నపుడు లోపించును. అప్సరఓఘ. అంభోజ సహస్ర-ఇంద్రుఁడు సహస్రాక్షుఁడు. నేత్ర+అమల+ఉజ్జృంభ-నేత్రామలోజ్జృంభ-సవర్ణదీర్ఘ, గుణసంధులు.

తే. తన్నుఁగని యనిమిషులైరో మున్న యైరొ
నాఁగ ననిమిషదృష్టిని నాకి సమితి
దగిలి కనుఁగొన వారి చిత్తములు తనకు
నెఱఁగ నమరేశునకును రతీశుఁ డెఱఁగె. 39

అర్థము : తన్నున్+కని=తన్నుఁజూచి, అనిమిషులు=ఱెప్పపాటు లేనివారు, ఐరో=అయిరో, మున్ను+అ = ముందే, ఐరొ, నాఁగన్ = అనునట్లు, అనిమిష-దృష్టిని= ఱెప్పపాటులేని చూపులో, నాకి-సమితి=దేవతల గుంపు, తగిలి=ఆసక్తితో, కనుఁగొనన్=చూడఁగా, వారి-చిత్తములు = వారి మనస్సులు, తనకున్, ఎదుఁగన్= అభిముఖములు కాఁగా, రతి + ఈశుఁడు = రతి భర్త - మన్మథుఁడు, అమర = ఈశునకును=దేవప్రభునకు-ఇంద్రునకు, ఎఱఁగెన్=నమస్కరించెను.

తాత్పర్యము : తన్నుఁజూచి దేవతలు ఱెప్పపాటులేనివారయిరో లేక తన్నుఁజూచుటకుముందే ఱెప్పపాటు లేనివారయిరో కాని దేవతల సమూహము ఱెప్పపాటులేని చూపుతో నాసక్తి వహించి చూడఁగా, వారి మనస్సులు తన కభిముఖములు కాఁగా మన్మథుఁ డింద్రునకు నమస్కరించెను.

విశేషములు : నిమిషము = ఱెప్పపాటు. అది లేనివారు అనిమిషులు - దేవతలు, నాకి-నాకః అస్య అస్తీతి నాకిన్- నాకము గలవాఁడు-దేవుఁడు, అలంకార ముత్ప్రేక్ష.

వ. ఇట్లు సురరాజు వలరాజు సుందరాకారంబుఁ గని ముదితహృదయుం
డగుచు సముచితాసన తాంబూలదాన సన్మానాదులం బ్రహృష్ట
మనస్కుం జేసిన సురపతికి రతిపతి నిజ భుజా కలిత పుష్ప
కోదండకౌశలోన్నతి నెచ్చి మహోత్సాహంబున ని ట్లనియె. 40

అర్థము : ఇట్లు. సుర-రాజు = దేవతలప్రభువు-ఇంద్రుఁడు, వలరాజు = (వలపు + రాజు) = మన్మథునియొక్క, సుందర + ఆకారంబున్ = మనోహర రూపమును, కని=చూచి, ముదిత-హృదయుండు = సంతోషించిన హృదయము గల వాఁడు, అగుచున్, సముచిత .... సన్మానాదులన్; సముచిత=తగిన, ఆసన=పీఠము, తాంబూల=తాంబూలము, దాన=ఇచ్చుట, అను, సన్మాన = గౌరవము, ఆదులన్= మున్నగువానిచేత, ప్రహృష్ట-మనస్కున్=మిక్కిలి సంతోషించిన మనస్సుగలవానిని, చేసినన్ = చేయఁగా, సుర-పతికిన్ = ఇంద్రునకు, రతి-పతి = రతిదేవి భర్త - మన్మథుఁడు. నిజ....లోన్నతిన్; నిజ=తనదైన. భుజా = భుజమునందు, కలిత = ధరింపఁబడిన, పుష్ప-కోదండ=పువ్వువింటియొక్క, కౌశల=నేర్పుయొక్క, ఉన్నతిన్=

గొప్పతనముచేత, ఎచ్చి = విజృంభించి, మహత్ (మహా) + ఉత్సాహంబునన్ = గొప్ప యుత్సాహముతో, ఇట్లు, అనియెన్.

తాత్పర్యము ; ఇట్లు ఇంద్రుఁడు మన్మథుని మనోహరరూపమును జూచి సంతోషించి, అతనిని సముచితముగా ఆసనము, తాంబూలము మున్నగు గౌరవములచే సంతుష్టుని జేయఁగా, నింద్రునకు మన్మథుఁడు తనభుజమునందలి పూవింటి నేర్పు పెంపుచే విజృంభించి మహోత్సాహముతో ని ట్లనియెను.

మన్మథుని ప్రతిజ్ఞ

మ. అతినిష్ఠాపరులై సురేంద్రవిభవాప్త్యాసక్తి నుగ్రాధిక
వ్రతముల్ చేకొని ధీరులై నడతు మ న్వా రెవ్వరై నన్ శుభ
స్థితి నెందేనియుఁ గల్గినం బనుపు నన్ శీఘ్రంబ పుష్పాస్త్రసం
హతి విచ్ఛిన్నమనస్కులన్ విషయమాయాగ్రస్తులన్ జేసెదన్. 41

అర్థము : అతి-నిష్ఠా-పరులు + ఐ = అధికనిష్ఠయందు దాసక్తిగలవారయి, సుర+ఇంద్ర-విభవ+ఆప్తి+ఆసక్తిన్ = దేవేంద్రవైభవముయొక్క ప్రాప్తియందలి కోరికతో, ఉగ్ర + అధిక - వ్రతముల్ = భయంకరములైన పెక్కు వ్రతములు, చేకొని, = స్వీకరించి - చేసి, ధీరులు + ఐ = ధైర్యవంతులమయి, నడతుము, అన్ + వారు = అనువారు, ఎవ్వరు + ఐనన్, శుభ-స్థితిన్ = శుభమైన ఉనికితో, ఎందున్ + ఏనియున్ = ఎచ్చటనైనను, కల్గినన్ = ఉన్నచో, నన్ = నన్ను, శీఘ్రంబు + అ = వెంటనే, పనుపు = పంపుము, పుష్ప + అస్త్ర-సంహతిన్ = పూవుటమ్ముల దెబ్బచే, విచ్ఛిన్న - మనస్కులన్ = విఱిగిన మనస్సుగలవారినిగను, విషయ - మాయా - గ్రస్తులన్ = ఇంద్రియములనెడి మాయచే లోఁగొనఁబడిన వారినిగను, చేసెదన్.

తాత్పర్యము : మిక్కిలి నియమపరులయి దేవేంద్రవైభవమును బొందఁగోరి తీవ్రవ్రతములుచేసి ధైర్యముతోఁ బ్రవర్తించుచునువా రెవరైన శుభములతో నెచ్చటనైన నున్నచో నన్ను వెంటనే పంపుము. నేను పూవుటమ్ముల దెబ్బచే వారిని కలఁగిన మనస్సుగలవారినిగను. ఇంద్రియములనెడిమాయలకుఁ జిక్కినవారినిగను జేసెదను.

విశేషములు: విధవ + ఆప్తి = విధవాప్తి. సవర్ణదీర్ఘసంధి. విధవాప్తి + ఆసక్తి = విధవాప్త్యాసక్తి. యణాదేశసంధి, ఇ ఉ ఋ ఌ లకు అసవర్ణములైన అచ్చులు పరము లగునప్పుడు క్రమముగా య్, వ్, ర్, ల్ అనునవి ఆదేశము లగును. ధీరులై - ధీరులమై - 'ప్రథమాంతంబులగు యుష్మదస్మద్విశేషణంబుల కేకత్వంబున వు ను లును, బహుత్వంబున రు ము లు నంతాగమంబులు ప్రాయికంబుగ నగు.' బాల. కారక. 33. 'ఈ యాగమంబులు పరంబు లగునపుడు దుత్వంబున కత్వంబగు.' బాల. కారక. 34. ధీరులు + ము. ధీరుల + ము + ఐ అని కావలసియుండఁగా నట్లు కామికి ప్రాయికశబ్దము శరణము. అన్వారు = అను + వారు 'అను కొను లోనగు ధాతుజవిశేషణముల యంత్యాకారమునకు హల్లు పరంబగునపుడు లోపంబు వైకల్పికంబు.' ప్రౌఢ. సంధి. 13, పనుప + ము + నన్ = పనుప నన్. 'మధ్యమ పురుష మువర్ణకంబునకు హలపసానంబులు పరంబు లగునప్పుడు లోపము విభాష నగు.' బాల. సంధి. 47. నన్ - నన్ను - 'ఉకారంబు క్రింది నకారంబునకుం బది ను లు ం క్రింది న ల ల కు లోపంబు బహుళంబుగ నగు.' బాల. ప్రకీర్ణ. 7. నను, 'పదాంతంబులయి యసంయుక్తంబులయిన ను లు రుల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బాల. ప్రకీర్ణ, 16. నన్.

ఇది కాళిదాసు కుమారసంభవమునందలి శ్లోకమునకు సన్నిహితముగా నుండుట చూడనగును.

కే నాభ్యసూయా పదకాంక్షిణా తే
నితాన్త దీర్ఘై ర్జనితా తపోభిః,
యావద్భవ త్యాహితసాయకస్య
మత్కార్ముక స్యాస్య నిదేశవర్తీ॥ కుమా. 3. 1.

సంస్కృత శ్లోకమునకుఁ దెలుఁగుపద్య మించుక విస్తరముగా నున్నది.

క. పరమపతివ్రతలై సుర
పురమును సాధింప నున్న పుణ్యస్త్రీ లె
వ్వరు గలరు చూపు చూతాం
కుర శరహతిఁ దిరులుమరులు గొలిపెద వారిన్. 42

అర్థము: పరమ - పతివ్రతలు + ఐ = గొప్ప సాధ్వులయి, సుర - పురమును = దేవతల నగరమును-అమరావతిని, సాధింపన్ + ఉన్న = సాధింపఁ బోవు, పుణ్య - స్త్రీలు + ఎవ్వరు + కలరు = పవిత్రస్త్రీలు ఎవ రున్నారు?, చూపు = చూపుము, వారిన్, చూత + అంకుర - శర - హతిన్ = మామిడిచిగురుటంపదెబ్బచే, తిరుగులుపడన్ + కొనిపెదన్ = వెఱ్ఱి వలపు పుట్టించి బాధించెదను.

తాత్పర్యము: పరమసాధ్వులయి దేవతల నగరమగు నమరావతిని సాధింపఁబోవు పుణ్యాత్మలగు స్త్రీ లెచ్చట నున్నారు? చూపుము. వారిని మావిచివురు టంపదెబ్బచే వెఱ్ఱివలపు పుట్టించి బాధింతును.

విశేషములు: చూపుము + చూతాంకుర....మధ్యమపురుషమువర్ణకము నకు హల్లు పరమగుచుండఁగా లోపము. బాల, సంధి. 47. చూపు చూతాంకుర ....

ఉ. అనుపమ రూప యౌవన మహాగుణవైభవలీల నెవ్వరిం
గనుఁగొని మెచ్చకున్న వరకన్యక గల్గిన దానిఁ జెప్పు నీ
పనిచినవాని వేలగొని పైఁబడఁజేసెద; నీవు తన్నుఁ గ
ల్చిన నొరుఁ దాను గల్చి చను చేడియ గల్గినఁ జూపు తెచ్చెదన్. 48

అర్థము: అనుపమ - రూప - యౌవన - మహత్ (మహా) - గుణ - వైభవ - లీలన్ = సాటిలేని సౌందర్యము, పడుచుఁదనము అనెడి గొప్ప గుణము లనెడి సంపదయొక్క విలాసముచే, ఎవ్వరిన్ = ఎవ్వరినైనను, కనుఁగొని = చూచి, మెచ్చక + ఉన్న = ఇష్టపడని, వర - కన్యక = శ్రేష్ఠురాలయిన పడుచు, కల్గినన్ = ఉన్నచో, దానిన్ = ఆమెను, చెప్పు = చెప్పుము, నీ - పనిచినవాని = నీవు పంపినవానియొక్క, వేల + కొని = దాస్యముచేసి, పైన్ + పడన్ + చేసెదన్ = మీఁదఁబడునటు చేసెదను, నీవు, తన్నున్, కల్చినన్ = మోహింపఁగా, తాను, ఒరున్ = ఇంకొకరిని, కల్చి = మోహించి, చను = వర్తిల్లు, చేడియ = స్త్రీ, కల్గినన్ = ఉన్నయెడల, చూపు = చూపుము, తెచ్చెదన్.

తాత్పర్యము: తన సాటిలేని సౌందర్యము యౌవనము అను విశిష్టగుణముల వైభవముచే నెవరినైనను జూచి మెచ్చకుండు యువతి యున్నచోఁ జెప్పుము,

ఆమె నీ పంపినవానికి దాస్యము చేసి మీఁదఁబడునట్లు చేసెదను. నీవు మోహింపఁగాఁ దా నింకొకరిని మోహించు స్త్రీ యున్నచోఁ జూపుము తెచ్చెదను.

విశేషములు : ఈ పద్యము

'కా మేకపత్నీవ్రత దుఃఖ శీలాం
లోలం మన శ్చారుతయా ప్రవిష్టామ్,
నితమ్బినీ మిచ్ఛసి ముక్తలజ్జాం
కణ్ఠే స్వయంగ్రాహ నిషక్తబాహుమ్.' కుమార.3-7.

అను కుమారసంభవ శ్లోకమునకు దగ్గఱగా నున్నది.

చెప్పు నీపనిచిన, చూపు తెచ్చెదన్ - షష్ఠ్యుత్తమపురుషైకవచనమునకు హల్లు పరమగుచుండఁగా లోపము. బాల. సంధి.47 నీ పనిచినవాని-నీవు పనిచినవాని-'ధాతుజ విశేషణ భావార్థక పూర్వ వ్యవహితావ్యవహితకర్తృపదప్రథమకుఁ దఱచుగ యొక్క-షష్ఠి యగు,' ప్రౌఢ.కారక. 15. నీయొక్క-పనిచినవాని - 'యొక్కకు లోపంబు బహుళంబు.' ప్రౌఢ.కారక16, నీ పనిచినవాని. కలుచు = ప్రేమించు-ఈ యర్థమున నన్నెచోడుని ప్రయోగాంతరములు- 7-20, 8-145, 8-151, 8-163. వేల= దాస్యము- ఇతనివే ప్రయోగాంతరములు -6-17,10-164.

చ. వలయు జనాలి నెల్ల మును వశ్యులఁ జేసితిఁ బుష్పబాణకౌ
శలమున;శూర్పకాది రిపు సంహతినోర్చితిఁ దీవ్రసాయకా
వలిఁ;ద్రిజగంబులందు వశవర్తులు భీతులు గాని నాకు న
గ్గల మెవరు లెందు లేరు; విను కౌశిక! నేర్పున విక్రమంబునన్. 44

అర్థము : కౌశిక = ఇంద్రా!, విను = వినుము, వలయు - జన + ఆలిన్ + ఎల్లన్ = కావలసిన జనుల సమూహమునంతను, పుష్ప - బాణ - కౌశలమునన్ = పూవుటమ్ముల నేర్పుతో, మును = పూర్వము, వశ్యులన్ = వశపడినవారినిగా, చేసితిన్, తీవ్ర - సాయక + ఆవలిన్ = తీవ్రములైన - భయంకరములైన బాణముల వరుసచే, శూర్పక + ఆది - రిపు - సంహతిన్ = శూర్పకుఁడు మున్నగు శత్రువుల సమూహమును, ఓర్చితిన్ = ఓడించితిని, త్రిజగంబుల + అందున్ = మూఁడు లోకములందును, నేర్పునన్ = నేర్పునందును, విక్రమంబునన్ = పరాక్రమము

నంబినను. నాకున్, వశ్యులన్ = లోఁబడినవారును, భీతులన్ = భయపడిన వారును, కాని, ఒరులు = ఇతరులు, అగ్గలము = అధికముగా, ఎందున్ = ఎచ్చటను, లేరు.

తాత్పర్యము : ఇంద్రా! వినుము, కావలసినవారి నందఱిని నా పూవు టమ్ముచే సమ్మోహముంచి నీకు వశపడునట్లు చేసితిని. క్రూరములైన బాణములచే శూర్పకుఁడు మున్నగు శత్రువులను ఓడించితిని, ముల్లోకములందును నేర్పునను, పరాక్రమమునను నాకు వశపడినవారును, భయపడువారును గాక నన్ను మీఱువా రెందును లేరు.

విశేషములు : నాకు నగ్గలము - నాకంటె నగ్గలము. 'షష్ఠిస్థానికంబగు పంచమీకం బొక్కొకచో ద్వితీయాది విభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులం జూపట్టెడి.' ప్రౌఢ.కారక 12. అగ్గలము అన్యార్థాదిగణగణ్యమని యెఱుంగవలయును. ఓర్చితిన్. ఓడు ధాతువు. 'ఙుగాగమం బాచ్ఛికంబున కసంయుక్త నలడరాంతంబునకుం బ్రేరణంబున బహుళంబుగా నగు,' ఓడు+చు. బాల.క్రియ.73, 'ఆ దోడు కూడుల డకారంబునకుం జుక్కు పరంబగునపుడు రేఫంబగు.' బాల.క్రియ.80, ఓరుచు. 'ఆచ్ఛికంబులం బద మధ్యంబుల న ల డ ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు' బాల.ప్రకీర్ణ.17. ఓర్చు. 'భూతంబున లిట్టగు,' బాల.క్రియ.3, ఓర్చు + లిట్. 'లకారంబునకు డు మ్రు వు రు ను ము న్లగు.' బాల.క్రియ.8. ఉత్తమపురుషైకవచనమగుటచే - ఓర్చు + ను. 'లిట్టు పుష్టి పరంబగునపుడు తివర్ణకం బగు.' బాల.క్రియ.18, ఓర్చు + తి + ను. 'భూతంబునం దిగాగమం బగు.' బాల.క్రియ.17. ఓర్చు + ఇ + తి + ను. 'అంద్వవగాగమంబులం దప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు.' బాల.సంధి.11 ఓర్చితి + ను, 'అవసానంబునందు ద్రుతస్వరంబునకేని ద్రుతంబునకేని లోపంబు బహుళంబుగా నగు.' బాల.సంధి.20, ఓర్చితిన్.

సీ. జలశాయి ననుఁగన్న జనకుండు హరి చక్రి
యైనను స్వామికార్యంబు గాఁగ,
వేదజడుండైన విధి పాశసంయుక్తుఁ
డైనను నాదుమాహాత్మ్య మమరఁ,

పరమతపోనిధి పరమేశు నుగ్రాక్షు
డైన నపారశౌర్యంబు వెలయ,
మఱియు నమర్త్యాహిమర్త్యాధిపతు లెంత
శుచులయ్యు నాయుధశూరులైన,

ఆ. నీ క్షణంబ సతుల కెఱఁగింతుఁ బుష్పాస్త్ర
కౌశలమున నదియుఁగాక పోర
నీవు దక్క నీకు నెఱఁగింతు నత్యుగ్ర
బాణశక్తిఁ దన్నుఁ బంపు దేవ! 45

అర్థము : ననున్ + కన్న - జనకుండు = నన్నుఁగన్నతండ్రి, జల - శాయి = నీటఁ బరుండువాఁడు, హరి = విష్ణువు, చక్రి = సుదర్శనమను చక్రాయుధముగాఁ గలవాఁడు, ఐనను, స్వామి - కార్యంబు + కాఁగన్ = ప్రభువ వగు నీ పనికయి, (ఎఱఁగింతు నను క్రియతో నన్వయము.)

వేద - జడుండు + ఐన = వేదపఠనముచే మందుఁడు అయిన, విధి = బ్రహ్మ, పాశ - సంయుక్తుడు = పాశమనెడి శస్త్రముతోఁ గూడినవాఁడు (బ్రహ్మదేవుని శస్త్రమునకును, వరుణుని శస్త్రమునకును పాశ మని పేరు.), ఐనను, నాదు మాహాత్మ్యము = నా మహిమ, అమరన్ = ఒప్పఁగా .... ఎఱఁగింతున్.

పరమ - తపస్ (స్) + నిధి = గొప్ప తపస్సునకు నిధి, (అగు), పరమేశుఁడు = ఈశ్వరుఁడు, ఉగ్ర + అక్షుఁడు = భయంకరమైన నేత్రముగలవాఁడు, ఐనన్ = అయినను, అపార - శౌర్యంబు = (నా) అధికమైన పరాక్రమము, వెలయన్ = ప్రకాశింపఁగా, ... ఎఱఁగింతున్,

మఱియున్ = వారేకాక యింకను, అమర్త్య + అహి - మర్త్య + అధిపతులు = దేవతల, నాగుల, మనుష్యుల ప్రభువులు, ఎంత - శుచులు = పరిశుద్ధులు, అయ్యున్ = అయినను, ఆయుధ - శూరులు + ఐనన్ = సాయుధులైన పరాక్రమవంతులైనను.

పుష్ప + అస్త్ర - కౌశలమునన్ = పూవుటమ్ములందలి నేర్పుచే, ఈ క్షణంబు + అ = ఇప్పుడే, సతులకున్ = స్త్రీలకు, ఎఱఁగింతున్, = లొంగునట్లు చేయుదును.

అదియున్ + కాక, పోరన్ = యుద్ధమునందు, ఈసు + తక్కన్ = కోప ముడుగునట్లు, అతి + ఉగ్ర - బాణ - శక్తిన్ = మిక్కిలి భయంకరమైన బాణముల శక్తితో. నీకున్, ఎఱఁగింతున్=నమస్కరింపఁజేయుదును, దేవ=ప్రభూ!, తన్నున్= నన్ను, పంపు =పంపుము.

తాత్పర్యము : శ్రీసముద్రశయనుఁడును, నన్నుఁగన్న తండ్రియుఁ, జక్రియు నగు విష్ణుని స్వామికార్యముగను, వేదజుఁడైన బ్రహ్మ పాశాయుధసంయుక్తుఁడైనను నా మహిమ మెప్పఁగను, పరమతపోనిధి యగు పరమేశ్వరుఁ డుగ్రాక్షుఁడైనను నా మహాపరాక్రమము వెలయఁగను, మఱియు దేవ నాగ మనుష్యాధిపతు లెంత పరిశుద్ధులైనను, వారిని ఈ క్షణమే నేను నా పూవుటమ్ముల నేరుపున స్త్రీలకు వశపడునట్లు చేయుదును, అదియునుగాక యుద్ధమున నతిభయంకరములైన నా బాణముల శక్తిచేఁ గోపముడిగి వారు నీకు నమస్కరించునట్లు చేయుదును, దేవా! నన్నుఁబంపుము.

విశేషములు : నన్నుఁ గన్నతండ్రినిగూడ స్త్రీలకు వశపడునట్లు చేయుటలో నా స్వామికార్యపరత్వము తెలియు ననుట. పరమేష్ఠి పాశాయుధయుక్తుఁడైనను వాని నట్లు చేయుటలో నా మహిమ తెలియు ననుట. పరమేశ్వరుఁ డుగ్రాక్షుఁడు, పైఁగాఁ బరమతపోనిధి. అట్టివాని నట్లు చేయుటలోఁ దన యపారశౌర్యము ప్రకటమగు ననుట.

నాదు మాహాత్మ్యము - నా + మాహాత్మ్యము. 'యుష్మదస్మదాత్మార్థకంబుల కుత్తరపదంబు పరంబగునపుడు దుగాగమంబు విభాష నగు.' నాదు మాహాత్మ్యము. బాల.సమాస.11. ఉగ్ర + అక్షి - దేహావయవార్థకమైన అక్షి, సక్థిన్ శబ్దముల తుది యచ్చునకును హల్లుతోఁగూడిన తుది యచ్చునకును అ అను ప్రత్యయ మాదేశముగా వచ్చును. ఉగ్రాక్షుఁడు. ఈసు - (వికృతి) - ఈర్ష్య (ప్రకృతి). తన్ను = నన్ను. ఇట్టి ప్రయోగము ప్రాచీనకవులలోఁ గలదు. 'వాని నగతనైనఁ దనకుఁ దెమ్మనిన' -రంగ. ఆరణ్య. తనకు = నాకు. పంపు దేవ - పంపుము దేవ, హల్పరముగా మధ్యమపురుష మువర్ణక లోపము. బాల. సంధి.47.

క. వెరవున భుజశౌర్యంబున
సురవల్లభ! పసుపు! నీవ చూడఁగఁ బరమే
శ్వరునైన నోర్తుఁ; బెఱ సుర
నర ఫణి దివిజాధిపతులు నా కెదురుదురే! 46

అర్థము : సుర-వల్లభ = దేవపతి : ఇంద్రా! పనుప = పనుపుము-పంపుము, నీవు + అ = నీవే, చూడఁగన్ = చూచుచుండఁగా, వెరవునన్ = ఉపాయము నను, భుజ-శౌర్యంబునన్ = బాహు పరాక్రమమునను, పరమేశ్వరున్ + ఐనన్ = పరమేశ్వరుడైనను, ఓర్తున్ = ఓడింతును, పెఱ = ఇతరులైన, సుర-నర-ఫణి-దివిజ + అధిపతులు = దేవతల, మనుష్యుల, నాగుల, దివిజుల ప్రభువులు, నాకున్ = నన్ను, ఎదురుదురే = ఎదిరింతురా !

తాత్పర్యము : దేవేంద్రా ! నన్నుఁ బంపుము. నేను నీవే చూచుచుండఁగా నా యుపాయముచేతను, బాహు పరాక్రమముచేతను బరమేశ్వరునైన నోడింతును. ఇతరులైన దేవ మనుష్య నాగాధిపతులు న న్నెదిరింపఁగలరా ? ఎదురలే రనుట.

విశేషములు : పనుపుము + దేవ-హల్లు పరమగుచుండఁగా మధ్యమ పురుష మువర్ణకలోపము. పనుప దేవ, బాల. సంధి. 47. ఓర్తున్ - ఓడు + చు = ఓర్చు. చూడు పూర్వపద్య 'ఓర్చితిన్' వ్యాఖ్య. 'తద్ధర్మాదులందు లాట్టగు.' బాల. క్రియ. 5. ఓర్చు + లాట్. 'లకారంబునకు దు ద్రు వు రు ను ముఙ్ఞగు.' బాల. క్రియ. 8. ఉత్తమ పురుషైకవచనమున-ఓర్చు + ను-' లాట్టు దుఙ్ఞు పరంబగునపుడు దుగాగమం బగు.' బాల. క్రియ. 22. ఓర్చుదును. 'చవర్ణంబుతోడ దుగ్దకారంబు తకారం బగు.' బాల. క్రియ. 108. ఓర్తును. 'అవసానంబునందు ద్రుతస్వరంబునకేని ద్రుతంబునకేని లోపంబు బహుళంబుగా నగు.' బాల. సంధి. 20. ఓర్తున్.

పరమేశ్వరునైన నోర్తును, పెఱవారు నా కెదురుదురే యనుటచే నలంకారము కావ్యార్థాపత్తి, 'కైముత్యే నార్థసంసిద్ధిః కావ్యార్థాపత్తి రిష్యతే,' చన్ద్రా. నా కెదురుదురే నన్ను నెదురుదురే అనుటకు, 'షష్ఠీ స్థానికంబగు కువర్ణకం బొక్కొకఛో ద్వితీయాది విభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులం జూపట్టెడి.' ప్రౌఢ. కారక. 13. ఇచట ద్వితీయకు షష్ఠి.

సుర.... పతులు - సుర అని యుండఁగా- మరల దివిజ అని యుండుట అనా వశ్యకము, అది 'దితిజ' కానోపునా ?

వ. అని నెనరు ముట్టం బూనిన కుసుమాయుధు పూనికి వజ్రాయుధుండు ఘనంబుగ మెచ్చి తాను తారకాసురుచేతం బరాజితులై పరమేష్ఠి మఱువుఁ

జొచ్చిన విధంబును, విధి తద్వధ కుపాయం బయ్యుమామహేశ్వ
రుల వీర్యసంభవుండైన కుమారుండగునని హితోపదేశంబు సేయు
టయు నెఱింగించి హరిగిరిజలు నైష్ఠికానుష్ఠానులై హిమవంతంబున
నున్నవారు వారికి సంగమంబు సేసి జగద్ధితంబు చేయు మిది
యనన్యవిషయంబు నీ వలనన కాని యొరునకు సాధ్యంబు గాదు
కావున నిన్నుం బ్రార్థించితి మెట్లనిన, 47

అ ర్థ ము : అని, నెనరు = ప్రీతి, ముట్టన్ = కలుగ, పూనిన = కడఁ
గిన, కుసుమ + ఆయుధు - పూనికి = పుష్పబాణుని - మన్మథుని ప్రయత్నము,
వజ్ర + ఆయుధుండు = వజ్ర మాయుధముగాఁ గలవాఁడు - ఇంద్రుఁడు, ఘనంపఱిచి
(ఘనము + పఱిచి) = అధికముచేసి, - దృఢపఱిచి, తారు = తాము, తారక + అసుర
చేతన్, పరాజితులు + ఐ = ఓడింపఁబడినవారయి, పరమేష్ఠి = బ్రహ్మయొక్క,
ముఖువున్ + చొచ్చిన - విధంబును = శరణుఁజొచ్చిన రీతియు, విధి = బ్రహ్మ,
తద్ + వధకున్ = అతని వధమునకు, ఉపాయంబు, ఆ + ఉమా - మహేశ్వరుల =
ఆ పార్వతీపరమేశ్వరుల, వీర్య - సంభవుండు = వీర్యమువలనఁ బుట్టినవాఁడు, ఐన,
కుమారుండు = కుమారస్వామి, అగున్ + అని, హిత + ఉపదేశంబు, చేయుట
యున్, ఎఱింగించి = తెలిపి, హరగిరిజలు = హరుఁడును, గిరిజయును, నైష్ఠిక + అనుష్ఠా
నులు + ఐ = నియమముతోడి ఆచరణము గలవారయి, హిమవంతంబునన్, ఉన్న
వారు, వారికిన్, సంగమంబు + చేసి = కూడిక చేసి, జగత్ + హితంబు (జగద్ధి
తంబు) - లోకశ్రేయము, చేయుము, ఇది, అనన్య - విషయంబు = ఇతరులది కాని
విషయము, నీవనలన్ + అ = నీవనలనే, కాని, ఒరునకున్ = ఇతరునకు, సాధ్యంబు
+ కాదు, కావునన్, నిన్నున్, ప్రార్థించితిమి, ఎట్లు + అనినన్,

తా త్ప ర్య ము : అని ప్రీతితోఁ బూనిన మన్మథుని పూనికను ఇంద్రుఁడు
దృఢపఱిచి తాము తారకాసురునిచే నోటమి పొంది బ్రహ్మను శరణుచొచ్చిన విధమును,
బ్రహ్మ అతని వధ కుపాయము ఆ పార్వతీపరమేశ్వరుల వీర్యమువలనఁ బుట్టు కుమార
స్వామి యగు నని హిత ముపదేశించుట తెలిపి, పార్వతీపరమేశ్వరులు నియమపరులై
హిమవత్పర్వతమున నున్నారు, వారికిఁ గలయిక కావించి లోకమునకు మేలు చేయుము,
ఇది నీకేగాని యితరులకు సాధ్యముగాని పని కావున నిన్నుఁ బ్రార్థించితిమి. ఎట్లనిన-
తరువాతి పద్యముతో నన్వయము,

విశేషములు: నెనరు, 'పేర్మి యర్మిలి మక్కువ కూర్మి నెమ్మి, నెనరు నానిరి గారాము నెయ్య మింపు, ప్రేమంబి యనంగు మున్ దనర (ప్రియమునకును నామధేయంబు లయ్యె' - ఆం.నా.3, కుసుమాయుధుడు ప్రాణసఖిని తాను వజ్రాయుధు నగుటచేతనే ఘనమ్మై నని స్వారస్యము.

ఘనంపఱిచి-ఘనము+పఱిచి- 'పద్యాదులు పరంబులగునప్పుడు మువర్ణకంబునకు లోపపూర్ణబిందులు విభాష నగు.' బాల.సంధి.48.వర్ణ-రూపాం, పర్ణము, ఇది చరిత్రాదుల లోనిది. 'చరిత్రాదుల మువర్ణకంబునకు లోపంబు బహుళంబుగా నగు.' బాల.తత్సమ. 58, అయ్యుమా .... అ+ఉమా-యడాగమము. బాల.సంధి.3. త్రికసంధి. బాల.సమాస. 14, 13. అయ్యుమామహేశ్వరుల వీర్యసంభవుండు.' కొన్నిచోటుల సిద్ధసమాసమధ్య గతపదంబులతోఁ దద్భిన్నపదంబుల కన్వయంబు చూపఁబడియెఁ.' ప్రౌఢ.సమాస.35. హర గిరిజలు - హరుఁడును, గిరిజయును- ద్వంద్వము. భావిపరిణామదృష్టితో నిట హరగిరిజ అని ద్వంద్వముచేయుట సముచితము. జగద్ధితము - జగత్ + హితము, వర్గముల మొదటి నాలుగక్షరముల (ఝయ్యల) కంటెఁ బరమగు హకారమునకుఁ బూర్వసవ ర్ణాదేశము (ఆ వర్గములకుఁ జెందిన చతుర్థవర్ణాదేశము) పైకల్పికముగా నగును. జగత్+ ధితము, జగత్ + హితము. అనునాసికాంతస్థవర్ణములుతప్ప మిగిలిన పదాంత గత హల్లులకు (ఝల్లులకు) మృదుహల్లులు (హశ్శులు) కాని, అచ్చులుకాని పరమగునప్పుడు ఆ హల్లుల వర్గమునకుఁ జెందిన తృతీయవర్ణ మాదేశముగా వచ్చును. జగద్ధితము, జగద్హితము. అనన్యవిషయము-అన్యవిషయము కానిది. నఞ్ తత్పురుషము. మఱుఁగు- మఱువు. 'అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాష నగు' బాల. అచ్చిక,27,

మ. ధర నత్యుత్తములైన ధీరుల మనస్తాపంబు పాప న్మహా
పురుషానీకమ యోపుఁగాక మహి నల్పుం డోపునే? యుద్ధరా
ధర నైదాఘ నితాంత దాహ ముడుపన్ ధారాధరానర్గళో
త్కర ధారావళిఁగాక యార్ప నగునే గండూషతోయంబులన్? 48

అర్థము: ధరన్ = భూమియందు, అతి + ఉత్తములు + ఐన = మిక్కిలి శ్రేష్ఠులయిన, ధీరుల = ధైర్యవంతుల, మనస్ + తాపంబు = మనోవ్యథ, పాపన్ = పోఁగొట్టుటకు, మహత్ (మహా) + పురుష+అనీకము + అ = గొప్ప

పురుషుల సమూహమే, ఓపన్ + కాక = సమర్థమగునుగాని, మహిన్ = భూమియందు, అల్పుండు = నీచుఁడు, ఓపునే = సమర్థుఁడగునా? కాఁడనుట, అద్రిధర .... దాహము = అ + ధరాధ్ర = ఆ కొండలయందలి, నైదాఘ = నిదాఘ (వేసవి) సంబంధమైన, నితాంత = అధికమైన, దాహము = తాపము, ఉడుపన్ = పోఁగొట్టుటకు, ధారాధర.... ధారావళి : ధారాధర = మేఘములయొక్క, అనర్గళ = అడ్డులేని, ఉత్కర = సమూహముయొక్క, ధారా + ఆవళిన్ = ప్రవాహముల వరుసచేత, కాక, గండూష - తోయంబులన్ = పుక్కిటి నీళ్లతో, ఆర్పన్ + అగునే = ఆర్పుట సాధ్యమా? సాధ్యము గాదనుట.

తాత్పర్యము : ఉత్తములగు ధీరుల మనస్తాపమును బోఁగొట్టుటకు మహాపురుషులే చాలుదురుగాని అల్పులకు సాధ్యము గాదు. కొండలయందలి గ్రీష్మతాపమును మాన్ప మేఘముల జలప్రవాహముచే సాధ్యమగునుగాని పుక్కిటిజలములచే నార్ప సాధ్యపడునా? సాధ్యపడదని భావము.

విశేషములు : అలంకారము దృష్టాంతము. 'చేద్బిమ్బప్రతిబిమ్బత్వం దృష్టాన్తస్తదలఙ్కృతిః' చన్ద్రి. అతి + ఉత్తములు = అత్యుత్తములు-యణాదేశ సంధి.

వ. అని తన్ను నగ్గించుచున్న సురవల్లభుం జూచి రతివల్లభుండు
విజృంభించి. 49

అర్థము : అని, తన్నున్, అగ్గించుచున్ + ఉన్న = పొగడుచున్న, సురవల్లభున్ = సురపతిని - ఇంద్రుని చూచి, రతి- వల్లభుండు=రతిపతి-మన్మథుఁడు,' విజృంభించి.

తాత్పర్యము : అని తన్నుఁ బ్రశంసించుచున్న యింద్రుని జూచి మన్మథుఁడు విజృంభించి - తరువాతి పద్యముతో నన్వయము.

చ. 'పరము తపం బడంచి మఱి పార్వతియం దనురక్తుఁ జేయు మా
యిరువురకుం గుమారుఁ డుదయించిన మా పగ దీఱునంచు న
చ్చెరువుగ నన్నిదొంతులును జెప్పఁగ నేటికి? వానిపై సురే
శ్వర! ననుఁబంపు మీ క్షణమ చంపెద మీ పగదీఱఁ దారకున్.' 50

అర్థము: పరము - తపంబు = శ్రేష్ఠుని (ఈశ్వరునియొక్క), తపస్సు, అఱంచి = అణఁచి, మఱి = అంతేగాక, పార్వతియందున్, అనురక్తున్ = అనురాగము గలవానినిగా, చేయుము, ఆ + ఇరువురకున్ = ఆ యిద్దఱకును, కుమారుఁడు = కొడుకు-కుమారస్వామి, ఉదయించినన్ = పుట్టినచో, మా-పగ = మా విరోధము, తీఱున్, అంచున్, అచ్చెరువుగన్ = ఆశ్చర్యముగా, అన్ని దొంతులను = అన్ని వాక్పరంపరలను, చెప్పఁగన్ + ఏటికిన్, సుర+ఈశ్వర = దేవపతీ - ఇంద్రా!, వానిపైన్ = వానిమీఁదికి, ననున్ = నన్ను, పంపుము. మీ - పగ, తీఱన్, తారకున్, ఈ - క్షణము + అ = ఇప్పుడే. చంపెదన్.

తాత్పర్యము: 'ఈశ్వరుని తపస్సు భంగపఱిచి వానిని పార్వతియం దను రక్తునిగాఁ జేయుము. ఆ యిద్దఱకుఁ గుమారుఁడు పుట్టినచో మా పగ తీఱును. అని ఆశ్చర్యముగా నన్నిపలుకులు చెప్పనేటికి? దేవేంద్రా! ఆ తారకునిమీఁదికి నన్నుఁ బంపుము. మీ పగ తీఱునట్లు వాని నిప్పుడే చంపెదను.'

క. తారకు నోర్వఁగ, వేఱ కు
మారకుఁ బడయంగ సంగమము సేయను మున్
వారలపైఁ బంపనినాఁ
డా రిపుపైఁ బంపు మాతఁ డధికుఁడె నాకున్? 51

అర్థము: తారకున్ = తారకుని, ఓర్వఁగన్ = ఓడించుటకును, వేఱు + అ = వేఱే, కుమారకున్, పడయంగన్ = పొందుటకు, సంగమము - చేయను = పొందుచేయుటకును, మున్ = ముందు, వారలపైన్ = పార్వతీశ్వరులపైకి, పంపని నాఁడు = పంపనిచో, ఆ - రిపు - పైన్ = ఆ శత్రువుపైకి - తారకునిమీఁదికి, పంపుము, అతఁడు, నాకున్ = నాకంటె, అధికుఁడు + ఎ = గొప్పవాఁడా?

తాత్పర్యము: తారకాసురు నోడింపఁ గుమారునిఁ బొందునట్లు కూర్పుటకుఁ బార్వతీశ్వరులపైఁ బంపక ఆ శత్రువగు తారకునిమీఁదికే నన్నుఁ బంపుము. అతఁడు నాకంటె నధికుఁడా యేమి? కాఁ డనుట. అనఁగా, తారకాసురు నోడించుటకుఁ గుమారునిఁ బుట్టింపఁ బార్వతీశ్వరులకు సంగమము చేయుమని నన్నుఁ బంపనేల? నన్నుఁ దారకునిమీఁదికే పంపినచో నే నాతనిని గెలువలేనా? నాకంటె వాఁడు గొప్ప

వాఁడా? అని భావము. దానికి నోప్పుటకుఁ గుమారస్వామి పుట్టుటయు, నతఁడు పుట్టుటకుఁ బార్వతీశ్వరులకు సంగతి గలిగించుట - ఇట్టి చుట్టు పద్ధతియేల? నన్నే వానిపైఁ బంపినచో నేను వానిని మట్టుపెట్టలేనా? నాకంటె వాఁ డధికుఁడా? యనుట.

విశేషములు: నాకున్ అధికుఁడె, నాకంటె నధికుఁడె - పంచమ్యర్థమున షష్ఠికము, ప్రౌఢ. కారక, 13. ఓర్వఁగన్ - ఓర్చు ధాతువు. ఓర్చు + చు - బాల. క్రియ. 73. ఓర్చుచు - బాల. క్రియ. 80. ఓర్చి. బాల. ప్రకీర్ణ. 17. ఓర్చు + నుడి. బాల. క్రియ. 40. ఓర్చ + నుడి. బాల, క్రియ, 20. బాల, క్రియ, 86. ఓర్వను - బాల. క్రియ. 88. ఓర్వఁగన్ - బాల. క్రియ. 115.

వ. అనిన సురేంద్రుండు 'నీ కసాధ్యం బెందును లే దైనను బరమేష్ఠి వచనం బలంఘనీయం బగుట నిదియ మనకుఁ గర్తవ్యంబు. దీని కొడంబడవలయు' నని ప్రార్థించిన నప్పని గైకొని 'నా కిది యేమి గహనం?' బని దర్పకుండు దర్పించి. 52

అర్థము: అనినన్ = అని మన్మథుఁడు పలుకఁగా, సుర+ఇంద్రుండు = దేవేంద్రుఁడు, నీకున్, అసాధ్యంబు = సాధింపరానిది, ఎందును, లేదు, ఐనను, పరమేష్ఠి = బ్రహ్మయొక్క, వచనంబు = మాట, అలంఘనీయంబు = దాఁటరానిది, అగుటన్ = అగుటచే, ఇది + అ = ఇదియే, మనకున్, కర్తవ్యంబు = చేయఁదగినది, దీనికిన్, ఒడంబడవలయును = అంగీకరింపవలయును, అని, ప్రార్థించినన్, ఆ+పని, కైకొని, నాకున్ + ఇది, ఏమి, గహనంబు = గగనము-దుర్లభము, అని, దర్పకుండు = మన్మథుఁడు, దర్పించి = గర్వించి.

తాత్పర్యము: అని మన్మథుఁ డనఁగా, నింద్రుఁడు 'నీ కసాధ్యమెందును లేదు, అయినను బ్రహ్మ మాట దాఁటరానిది కావున మన కదియే కర్తవ్యము. దీని నంగీకరింపు' మని ప్రార్థింపఁగా, మన్మథుఁడు ఆ పనిని గైకొని 'నా కిదియేమి దుర్లభ?' మని గర్వించి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: దర్పకుఁడు - 'కన్దర్పో దర్పకో ఽనఙ్గః కామః పఞ్చశరః స్మరః' 'కుత్సితో దర్పో యస్య సః కన్దర్పః' - కుత్సితమైన దర్పము గలవాఁడు.

చమత్కారము - అపూర్వము. అలంకారము పరికరాంకురము - 'సాభిప్రాయే విశేష్యే తు భవేత్ పరికరాంకురః' - చంద్రా. దర్పకుఁ డను విశేష్యము సాభిప్రాయమైనది కనుక పరికరాంకురాలంకారము.

తే. హాలి సెకొన్న తపమెల్ల నాలిసేసి
యతని దేహంబునందు సామాలిఁజేసి
కామకింకరుఁ జేసి నా కడిమి నెఱపఁ
గంటి నీ ప్రస్తవము దీర్పఁగంటి నెలమి. 53

అర్థము: హాలి = హాలముగలవాఁడు - శివుఁడు, సెకొన్న = కైకొన్న, తపము + ఎల్లన్ = తపమునంతను, ఆలి + చేసి = నాలిచేసి = పరిహాసముచేసి, అతని - దేహంబు + అందున్ = అతని శరీరమునందు, సామ + ఆలిన్ + చేసి = సగము స్త్రీని (భార్యను) జేసి, కామ - కింకరున్ + చేసి = కోరికలకు - మన్మథునకు - దాసునిగాఁజేసి, నా - కడిమి = నా పరాక్రమము, నెఱపన్ + కంటిన్ = ప్రకటింపఁగంటిని, నీ - ప్రస్తవము = నీ యవసరము, ఎలమిన్ - సంతోషముతో, తీర్పన్ + కంటిన్ = తీర్పఁగంటిని - నెఱవేర్పఁగంటిని.

తాత్పర్యము: 'ఈశ్వరుఁడు పొందిన తపమునంతను పరిహాసముచేసి, యతని శరీరమున సగము స్త్రీని (భార్యను) జేసి, కోరికలకు దాసుఁడైనవానినిగాఁ జేసి నా పరాక్రమమును బ్రకటించుకొనుట కవకాశము లభించినది. నీ యవసరమును బ్రీతితోఁ దీర్పఁగలిగితిని.'

విశేషములు: సామాలిన్ = సామ + ఆలిన్ = సగము + ఆలు + ను. 'అర సామి సగము సవము నాఁగ నర్థాహ్వయంబులౌ.' ఆం. నా. సం. మానవవర్గ. ఆలు-స్త్రీ, భార్య. ప్రస్తవము = ప్రయోజనము, కార్యము. ఇతనిదె ప్రయోగాంతరము. 11-135.

వ. 'నాకుం దగిన కెలసంబుఁ గంటి దీని కింతకు మెకొంటిఁ దాంబూలంబు దయసేయు' మని వసంతసహితంబుగా వలరాజు సురరాజుచేత నపారసత్కారంబులు గొని వీడుకొని చనుదెంచునంత నిక్కడ. 54

అర్థము : నాకున్, తగిన, కెలసంబున్ = పనిని, కంటిన్ = పొందితిని. దీనికిన్, ఇంతకున్, మైకొంటిన్ = అంగీకరించితిని, తాంబూలంబు, దయ + చేయుము + అని = ఇమ్మని, వసంత - సహితంబుగాన్ = వసంతునితోఁ గూడికొని, వలరాజు = మన్మథుఁడు, సుర - రాజుచేతన్ = దేవపతి-ఇంద్రునిచేత, అపార-సత్కారంబులు = ఎన్నో గౌరవములు, కొని = పొంది, వీడుకొని = సెలవుపుచ్చుకొని, చనుదెంచు + అంతన్ = వచ్చునంత, ఇక్కడన్.

తాత్పర్యము : 'నాకుఁ దగిన పనిని గంటిని. దీని కంతకు నంగీకరించితిని, తాంబూలమును దయచేయు' మని వసంతునితోఁగూడి మన్మథుఁడు ఇంద్రునిచే నెన్నియో సమ్మానములు పొంది రాఁగా, ఇక్కడ. తరువాతి పద్యముతో నన్వయము.

చ. రతి మతిఁ దల్లడిల్లి పతి రాకయ వార్చుచు నంతకంత క
ద్భుతములు దుర్నిమిత్తములు పుట్టుచు నోలి నిజాంగసంగతో
ర్జిత భయదాసురాద్యశుభచేష్టల కెంతయు **వెంగ**లించి దుః
ఖిత యగుచున్నచో మకరకేతన మంబరవీథిఁ గ్రాలఁగన్. 55

అర్థము : రతి = మన్మథునిభార్య, మతిన్ = మనస్సునందు, తల్లడిల్లి = కలఁగి, పతి - రాక + అ = భర్త రాకయే, వార్చుచున్ = ఎదురుచూచుచు, అంతకున్ + అంతకున్ = క్రమక్రమముగా, అద్భుతములు = ఆశ్చర్యకరములు. దుర్నిమిత్తములు = అపశకునములు, పుట్టుచున్, ఓలిన్ = క్రమముగా, నిజ + అంగ - సంగత + ఊర్జిత - భయద + అసుర + ఆది + అశుభ-చేష్టలకున్ = తనదైన శరీరమునందుఁ గలిగిన, ఎక్కువైన, భయంకరములయిన అసురములు (అసుర=రాక్షస) సంబంధమైనవి, మున్నగు అమంగళకరములైన పనులకు, - తన శరీరమునఁ గలిగిన అపశకునములకు, ఎంతయున్ = మిక్కిలి, వెంగలించి = యుక్తి లేనిదయి, దుఃఖిత = దుఃఖించినది, అగుచున్ + ఉన్నచోన్ = అగుచున్నప్పుడు, మకర - కేతనము = మొసలిటెక్కెము, అంబర-వీథిన్ = ఆకాశవీథిలో, క్రాలఁగన్ = ఒప్పఁగా.

తాత్పర్యము : రతిదేవి మనస్సునందుఁ గలఁతజెంది, భర్త ఆగమనమును నెదురుచూచుచుఁ, గ్రమక్రమముగా, నచ్చెరువు గలిగించు నపశకునములు పుట్టుచుఁ

చూచినఁగలుగు వెఱపుఁగొలుపు అశుభములైన అమంగళములను మిక్కిలి యుక్తిలేనివని భావించుచున్న, [illegible] ఆకాశములో వ్యాపించుచుండఁగా. [illegible]

క. అలి గానము, మదకోకిల
కలనాదాతోద్యమును, శుకస్వన ఘన మం
గల పాఠరవము ఘోరనఁ
జెలఁగఁగ రతిఁగానవచ్చెఁ జిత్తజుఁ డెలమిన్. 56

అర్థము: అలి - గానమున్ = తుమ్మెదల సంగీతమును, మద - కోకిల - కల - నాద + ఆతోద్యమును = మదించిన కోకిలలయొక్క అవ్యక్తమధురమైన ధ్వని యనెడు వాద్యమును, - శుక - స్వన - ఘన - మంగల-పాఠ - రవమున్ = చిలుకల ధ్వనులనెడు గొప్ప శుభకరములైన పఠనముయొక్క ధ్వనియు, ఘోరనన్ + చెలఁగఁగన్ = ఎక్కువగా శబ్దింపఁగా, చిత్తజుఁడు = మన్మథుఁడు, ఎలమిన్ = ప్రీతితో, రతిన్, కానన్ + వచ్చెన్ = చూడ వచ్చెను,

తాత్పర్యము : తుమ్మెదల సంగీతము, మత్తకోకిలముల ధ్వనులనెడి వాద్యమును, చిలుకల పలుకులనెడి మంగళపాఠముల ధ్వనియు శబ్దింపఁగా మన్మథుఁడు ప్రీతితో రతిని జూడవచ్చెను,

విశేషములు : అలులు, కోకిలములు, శుకములు మన్మథుని పరివారము లోనివి. వాని ధ్వనులు సంగీతముగను, మంగళవాద్యములుగను నుండె ననుట.

క. పతిఁ జూచి రతి నిజాంత
ర్గతఖేదం బెలమి మఱపుగా నిడి కాలో
చిత వచనాంతరముల 'సుర
పతి కడు వెస నిన్ను నేమి పని రాఁ బనిచెన్'? 57

అర్థము: రతి, పతిన్ + చూచి = భర్తను జూచి, నిజ + అంతర్గత - ఖేదంబు = తనదైన మనసులోని దుఃఖము, ఎలమిన్ = సంతోషములో, మఱపు గాన్ + ఇడి=దాఁచి, కాల + ఉచిత - వచన + అంతరములన్ = సమయమునకుఁ

దగిన వేళమాటలతో. సురపతి = ఇంద్రుఁడు, కడున్ = వేగన్ = మిక్కిలి శీఘ్రముగా, నిన్నున్, పిలువనిన్ = పంపుకొఱకు, రాన్ + పనిచెన్ = పిలిపించెను.

తాత్పర్యము : రతి భర్తనుజూచి తన మనస్సులోని దుఃఖము గానరాకుండ సంతోషమును నటించి సమయోచితమైన వేళ మాటలతో - 'ఇంద్రుఁ డంత శీఘ్రముగా నిన్నెందులకుఁ బిలిపించెను?'

వ. అని తఱిమి యడుగుచున్న రతి ముఖవికారంబు గని మనసిజుండు మనంబునం గుసురుకొనుచుఁ జిఱునవ్వు నవ్వుచు నిట్లనియె. 58

అర్థము: అని, తఱిమి - అడుగుచున్ + ఉన్న = నిర్బంధించి (మఱిమఱి) అడుగుచున్న, రతి - ముఖ - వికారంబు = రతిదేవియొక్క ముఖమునందలి మార్పు, కని = చూచి, మనసిజుండు = మన్మథుఁడు, మనంబునన్ = మనస్సులో, కుసురుకొనుచున్ = ఉపేక్షించుచు, చిఱు - నవ్వు, నవ్వుచున్, ఇట్లు + అనియెన్,

తాత్పర్యము : అని మఱిమఱి యడుగుచున్న రతి మోము మార్పుచూచి మన్మథుఁడు మనస్సులో నుపేక్షవహించుచుఁ జిఱునవ్వు నవ్వుచు నిట్లు పలికెను.

విశేషములు: తఱిమి=నిర్బంధించి,' ఇత్తెఱంగున నూరార్చి యింతిఁదఱిమి యల్లనల్లన దోకొని' - నిర్వ. ఆ. 9. కుసురుకొను = ఉపేక్షించు - కుసూర్ (త)= ఉపేక్ష, అలక్ష్యము.

చ. 'బెదరుచు నంతరంగమున భీతికిఁ గండవడంబుసుట్టి ప
ల్కెదు; పొరపొచ్చెమున్, వెఱపుఁ, గేనముఁ జెయ్యుల కోలి నెత్తువె
ట్టెదు; వడి మోవియుం గరువటిల్లెడు; నీ మది నింత దల్లడం
బొదవు డిదేమి కారణమొ యుగ్మలి! నా కెఱిఁగింపు మేర్పడన్.' 59

అర్థము : బెదరుచున్=భయపడుచు, అంతరంగమున - భీతికిన్=మదిలోని వెఱపునకు, (అంతరంగమునన్ బెదరుచున్ అనియే నన్వయింపవచ్చును,) కండవడంబు + చుట్టి = తెరవైచి - కప్పిపుచ్చి యనుట, పల్కెదు=పల్కెదవు, పొరపొచ్చెమున్= కపటమును, వెఱపున్ = భయమును, కేనమున్ = వంచనమును, చెయ్యులకున్ =

చేష్టలకు, వరిన్ = క్రమముగా, పట్టు + పెట్టెడు = [illegible], వలెన్ = వే గముగా, మోవి మడున్ = పెదవియును, కదలకుండున్ = [illegible], ఓ . ఇంతీ = ఓ ఇంతి, తల్లడంబు = తల్లడము, ఎదుర్కొను + అవి + ఏమి . కారణము + ఓ = ఎట్టిది కిది యేమికారణమో। ఉర్వరి = ఇంతీ!, నాకున్, విస్పష్టమున్ = స్పష్ట ముగా, ఎఱింగింపుము = తెలుపుము.

తాత్పర్యము : ఇంతీ! భయపడుచు మదిలోని వెఱపును గప్పిపుచ్చుచుఁ బలి కెదవు. కపటమును, భయమును, వంచనయును నీ చేష్టలకుఁ గూడినవి. నీ పెదవి వేగ ముగా వడఁకుచున్నది. నీకు మనసులో నింత కలఁత పుట్టుట కేమికారణమో; నాకు స్పష్టముగాఁ జెప్పుము.

విశేషములు : వచ్చెదు = వచ్చెదవు, పెట్టెదు = పెట్టెదవు . లాక్షణికమునకు లోపము. బాల.క్రియ.24. ఒవవు = ఓపవు. వాక్యార్థ మవ్యయము నకు మాఱుగా 'ము'వర్ణము.

వ. అనిన దివ్యాంతరిక్షభౌమాంగికాద్యనేకదుర్నిమిత్తంబులు నిర్నిమిత్తంబు పుట్టు టెఱింగించి దీనానన యగుచు నీ వోయివచ్చిన కార్యం బెఱింగింపుమనినం బెద్దయు విశేషంబులే దయ్యెమామ హేశ్వరుల తపోభంగంబు సేయుమనిన దానికి మెయికోలు వచ్చితి ననిన విని రతి యుదరిపడి యుల్లంబునం దల్లడిల్లుచు. 60

అర్థము : అనినన్, దివ్యాం .... దుర్నిమిత్తంబులు : దివ్య = దేవ సంబంధములు, అంతరిక్ష = ఆకాశసంబంధములు, భౌమ = భూసంబంధములు, ఆంగిక = శరీరావయవసంబంధములు, ఆది = మున్నగు. అనేక = పెక్కైన,దుర్నిమిత్తం బులు . దుర్నిమిత్తంబులు = అపశకునములు, నిర్నిమిత్తంబు + అ. నిర్నిమిత్తంబు + అ = నిష్కారణముగానే, పుట్టుట. ఎఱింగించి, దీన + ఆనన = దీనమైన ముఖముగలది, అగుచున్, నీ వోయివచ్చిన . కార్యంబు = నీవు పోయివచ్చినపని, ఎఱింగింపుము, అనినన్, పెద్దయున్ = ఎక్కువ, విశేషంబు, లేదు, అ + ఉమామహేశ్వరుల, తపస్ (స) + భంగంబు = తపస్సునకు ఆటంకము, చేయుము + అనినన్,

దానికిన్, మెయికొని = అంగీకరించి, వచ్చితిన్, అనినన్, విని, రతి, ఉదరిపడి = అదరిపడి, ఉల్లంబునన్ = మనసునందు, తల్లడిల్లుచున్ = కలఁగుచు.

తాత్పర్యము : అనిన దివ్యములు, అంతరిక్షములు, భూసంబంధములు, అవయవసంబంధములు మున్నగు పెక్కు అపశకునములు నిష్కారణముగనే పుట్టుట తెలియఁజేసి, దీనముఖి యగుచు, 'నీవు పోయి వచ్చినపని తెలుపు'మనిన 'నెక్కువ విశేషము లేదు. ఆ పార్వతీపరమేశ్వరుల తపస్సున కాటంకము గలుగఁజేయు'మనిన దానికి సమ్మతించి వచ్చితి'ననిన విని రతి యదరిపడి మనస్సునఁ గలఁతచెందుచు. తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: నీ పోయివచ్చిన కార్యంబు - నీవు పోయి వచ్చిన కార్యంబు 'ధాతుజవిశేషణ భావార్థక పూర్వవ్యవహి తావ్యవహిత కర్తృపద ప్రథమకుఁ దఱచుగ యొక్కషష్ఠి యగు.' ప్రౌఢ.కారక. 15. నీయొక్కపోయివచ్చినకార్యంబు, 'యొక్కకు లోపంబు బహుళంబు'-ప్రౌఢ.కారక. 16. నీ పోయివచ్చిన కార్యంబు. ఆ+ ఉమా.... ఆ + యుమా. యడాగమము, బాల, సంధి, 3. అయ్యుమా.... త్రికసంధి. బాల.సమాస. 14.13. తపోభంగము - తపస్ + భంగము - పదాంతసకారమునకు విసర్గాదేశము. తపః + భంగము. హ్రస్వ అకారము పూర్వమందుఁగల విసర్గమునకు హశ్శు పరమగు చుండఁగా 'ఉ' ఆదేశము. గుణసంధి. తపోభంగము. ఉమామహేశ్వరులు - ఉమయును, మహేశ్వరుఁడును - ద్వంద్వము, మెయికొను - మేకొను - మయికొను - మైకొను - రూపాం.

సీ. మన కులదైవ మన్ మన్నన లేదేనిఁ
త్రిభువనారాధ్యుఁ డన్ తెంక లేక,
పరమయోగాత్ముఁ డన్ భక్తి లేదేనియు
సర్వేశ్వరుం డను శంక లేక,
యజశిరోదళనుఁ డన్నదరు లేదేనియుఁ
గాలారి యను నోటకండ లేక,
విషమాంబకుం డను వెఱపు లేదేనియుఁ
బ్రళయాగ్నిరుద్రుఁ డన్ భయము లేక,

ఆ. పంచె నట్టి యుగ్రుపైఁ నిన్ను నది మీఁదఁ
బోయి తనకు లగ్గఁబోయి లగ్గ
వచ్చునే ప్రధానవైరాన మరణంబు
ధ్రువ మనంగ వినఁడె దివిజవిభుఁడు ? 61

అర్థము : మన-కుల-దైవము, అన్ = అను, మన్నన = గౌరవము, లేమి + ఎనెన్ = లేకున్నను, త్రిభువన + ఆరాధ్యుఁడు = ముల్లోకముల (వారి) చేతను, పూజింపఁదగినవాఁడు, అన్ = అను, తెంక = సందేహము, లేక.

పరమ-యోగ + ఆత్ముఁడు = గొప్ప సమాధిగల మనస్సుగలవాఁడు, అన్ = అను, భక్తి, లేమి + ఎనయున్, సర్వ + ఈశ్వరుండు = సర్వమునకుఁ బ్రభువు, అను, శంక = జంకు లేక,

అజ-శిరస్ (శి) ఛేదనుఁడు = బ్రహ్మ శిరస్సును ఖండించినవాఁడు - అన్ + అదుటు- లేదా అన్న + అదరు = అన్న భయము, లేమి+ఎనియున్, కాల + అరి = యమునకు శత్రువు- మృత్యుంజయుఁడు, అను+ఉటకంపు = అనెడి భయము, లేక,
విషము + అంబకుండు = వేసికంటివాఁడు - త్రినేత్రుఁడు అను, వెఱపు = భయము, లేమి + ఎనయున్. ప్రళయ + అగ్ని-రుద్రుఁడు = ప్రళయకాలమునందలి అగ్నివలె భయంకరుఁడు, అన్, భయము, లేక.

అట్టి, ఉగ్రుపైన్ = శివునిపైకి - భయంకరునిమీఁదికి, నిన్నున్, పంచెన్ + పంపెను. (పంచెనట్టి యుగ్రుపైన్ = శివునిపైఁ బంపెనఁట), అది-మీఁదన్ + పోయి = ఆ పనిమీఁదఁ బోయి, తనకున్ = ఆ యింద్రునకు, లగ్గన్ + పోయి = మేలుచేయఁబోయి. లగ్గు + అ = లగ్గ-మేలె, వచ్చునే = వచ్చునా? రాదనుట, దివిజ-విభుఁడు = దేవేంద్రుఁడు, ప్రధాన-వైరానన్ = ముఖ్యులతోడివిరోధముచే, మరణంబు = చావు, ధ్రువము = నిశ్చయము, అనంగన్, వినఁడె ?

తాత్పర్యము : శివుఁడు మన కులదైవమనెడి గౌరవములేకున్నను, నతఁడు ముల్లోకములకు నారాధ్యుఁ డను సందేహమయినను లేకుండ, నతఁడు గొప్ప సమాధిగల మనస్సుగలవాఁడనెడి భక్తి లేకున్నను, సర్వేశ్వరుఁడనెడి శంకలేకుండ, బ్రహ్మశిరస్సును ఖండించినవాఁ డను భయములేకున్నను, నతఁడు యమునకు

నైరి - మృత్యుంజయుఁ డనెడి భయము లేకుండ, నరుఁడు త్రినేత్రుఁ డనెడి భయము లేకున్నను, త్రైయంబకుఁ డనెడి భయములేకుండ ఇంద్రుఁ డుగ్రునిపైకి నన్నుఁ బంపెను. అతని మీఁదఁబోయి మేలు చేయఁబోయినప్పుడు మేలే కలుగునని యేమున్నది? ప్రభావంతునితోడి విరోధముచే మరణము నిశ్చయమనుమాట దేవేంద్రుఁ డెఱుఁగఁడా?

విశేషములు: 'అది మీఁదఁ, బోయి తనకు లగ్గఁబోయి లగ్గవచ్చునే'.దీని తాత్పర్యము లక్ష్య ప్రయోగము. ఇంకను విచార్యము.

అన్న + అదరు - 'సమాసంబులఁ గర్మధారయసమాసంబునం దన్వాదుల కరహల్లున కచ్చు పరంబగునపుడు ద్విత్వంబు గానంబడియెడి. - ప్రౌఢ. సంధి. 9. అన్న (అనిన) + అదరు అని పదచ్ఛేదము చేయుచో నత్వసంధిచే అన్నదరు అగును. పైరాన-పైరమున్-'ఉలం నలు పరంబు లగునపు డొకానొకచో ముగాగమంబునకు లోపంబును దత్పూర్వస్వరంబునకు దీర్ఘంబును విభాష నగు.' బాల. తత్సమ. 43.

చ. ఎదపక పంచె నొక్కఁ; డొక యేలినవాఁ డని పూన్కికాఁడవై
పొదువఁగఁబోయె దీవు నొక పోటరిమూఁటవ; నీకు నక్కడన్
మృడుఁ డొక యెల్లిదుం డకట! మెచ్చక సింగపువేఁటలాడఁగాఁ
గడఁగెద రిట్లయైనఁ దుదిగా కెడ నింద్రుఁడు నీవుఁ దక్కుటే? ౬౨

అర్థము: అరిఁడు = ఇంద్రుఁడు, ఎదపక = విడువక, పంచెన్ = పంపెను, ఒక-ఏలినవాఁడు + అని = ఒక ప్రభువని, పూన్కికాఁడవు + ఐ = పూనిక (ప్రయత్నము) గలవాఁడవయి, ఈవున్ = నీవును, పొదువఁగన్ + పోయితి = నిర్వహింపఁబోయితివి, ఒక-పోటరిమూఁటవ = పొదుచుటలో నేర్పరివి, అక్కడన్ = నీకున్, మృడుఁడు = శివుఁడు, ఒక-ఎల్లిదుండు = ఒక అసమర్థుఁడు, అకట = అయ్యో; మెచ్చక = లక్ష్యపెట్టక, సింగపువేఁటలాడఁగాన్ = సింహమును వేఁటాడుటకు- మనుష్యకార్యమును చేయుటకు, కడఁగెదరు = పూనుదురు, ఇట్లు + అ = ఇట్లే, ఐనన్ = అయినచో, తుది + కాక = చావుగాక, ఎడన్ = అందు - ఆ ప్రయత్నమున, ఇంద్రుఁడున్, నీవున్, తక్కుటే = తక్కుటయా? మిగులుటయా? . అసంభవ మని భావము.

తాత్పర్యము : అనేకసారు నిన్నింద్రుఁడు పంపెను. ఒక ప్రభువని ఖ్యాతి నీవును నిర్వహింపఁబోయెదవు. మంచి పోయినావే, నీకు అర్థమైన ఖ్యాతిఁడు ఒక అనుష్ఠుఁడు, అయ్యో! లక్ష్యపెట్టక సింహమును వేఁటాడుటవంటి దుష్కరకార్యమును చేయుచున్నాను. ఇట్టే యయినచో నీ విషయమునఁ జావుగాక యింద్రుఁడు నీవు మెచ్చుటయే? అసంభవ మనుట,

విశేషములు : పోయెదీవు - పోయెదవు + ఈవు. లాటు వకారమునకు లోపము. బాల. క్రియ. 24, పోయెద+ఉ+ఈవు-అపదాది స్వరసంధి-బాల. సంధి, 11, పోయెదు + ఈవు. ఉకారసంధి, బాల. సంధి. 1, పోయెదీవు. సింగము + వేఁటలు 'కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బు ంపు లగు.' బాల, సంధి. 32, సింగపు వేఁటలు,

క. ఆ నాకంబునఁ గల య
మ్మానిను లందఱును నీకు మనమిడియున్నన్
దాని సహింపక సురవిభుఁ
డీ నెపమునఁ జంపఁ దలఁచి యీ పనిఁ బంచెన్. 63

అర్థము : ఆ - నాకంబునన్ = ఆ స్వర్గలోకమున, కల = ఉన్న, ఆ + మానినులు = ఆ స్త్రీలు, అందఱును, నీకున్ = నీయందు, మనము + ఇడి = మనసుపెట్టి - నిన్ను వలచి యుండుట, ఉన్నన్ = ఉండఁగా, సుర - విభుఁడు + దేవపతి - ఇంద్రుఁడు, దానిన్, సహింపక + ఓర్వక, ఈ - నెపమునన్ = ఈ వ్యాజమున, చంపన్ + తలఁచి, ఈ - పనిన్+పంచెన్ = ఈ పనికి నియోగించెను

తాత్పర్యము : ఆ స్వర్గలోకమునఁ గల యా స్త్రీ లందఱును నీపై మనసులు గొనియుండుటచే నింద్రుఁడు దానిని జూచి సహింపలేక యీ వ్యాజమున నిన్నుఁ జంప నెంచి యీ పనికి నియోగించెను.

విశేషములు ; నీకు మనమిడి - నీయందు మనమిడి - సప్తమికి షష్ఠి, 'షష్ఠీ స్థానికంబగు కువర్ణకం బొక్కొకచో ద్వితీయాదివిభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులం జూపట్టెడి.' ప్రౌఢ, కారక. 13,

క. నినుఁ జూచిన కన్నులఁ సుర
వనితలు తనుఁ జూడకున్న వాసవుఁ డలుకం
జని చా నని పంచినఁ జాఁ
జనునే యాతని చలంబు సాధ్యము గాఁగన్ ? 64

అ ర్థ ము : నినున్ = నిన్ను, చూచిన - కన్నులన్ = చూచినకన్నులతో, సుర - వనితలు = దేవతాస్త్రీలు, తన్నున్ = తన్ను, చూడక + ఉన్నన్=చూడక పోవుటచే, వాసవుఁడు = ఇంద్రుఁడు, అలుకన్=కోపముతో, చని=పోయి. చాన్ + అని = (నీవు) చచ్చుట కని, పంచినన్ = ఆజ్ఞాపించినచో, ఆతని - చలంబు = ఆ యింద్రుని పట్టుదల, సాధ్యము + కాఁగన్ = సాధ్యమగునట్లు - నెఱవేఱునట్లు, చాన్ + చనునె = చావఁదగునా ?

తా త్ప ర్య ము : నిన్నుఁ జూచినకన్నులతో దేవతాస్త్రీ లింద్రుని జూడక పోవుటచే నతఁ డలిగి, నీవు చచ్చుటకని పంపఁగా, నాతనికోరిక నెఱవేఱునట్లు నీవు చావఁదగునా? తగదని భావము.

వి శే ష ము లు : చాన్, చచ్చు ధాతువు. 'తుమర్థ భావలక్షణంబులయిన నుటి యగు.' బాల. క్రియ.40, చచ్చు + నుటి. 'ముజ్జీవులు ముత్తు నాఁబడు.' బాల. క్రియ.86. 'చావు నోవులు చచ్చు నొచ్చులకగు.' బాల. క్రియ.94, చావు + నుటి. 'జీత్తు పరంబగు నపుడు వాని పువర్ణంబు విభాషను లోపించు.' బాల. క్రియ.95. చాను (న్).

చ. త్రిదశులు విల్చి పంపు డొకతేజముగాఁ గొని దేవదేవు నె
ల్లిదముగఁ జేసి యింత గొని లేవడి లేచెదు; ప్రాణగొడ్డ మా
డెదు; మది నోటకంద నెడి డెప్పతికంబులు సేసె; దిట్టి క్రొ
వ్వదములుదక్కఁ; మీ పలుకు విష్ణుఁడు లక్ష్మియు విన్న మెత్తురే? 65

అ ర్థ ము : త్రిదశులు = దేవతలు, విల్చి = విలిచి - పిలిచి, పంపుడు = పంపుట, ఒక. తేజము + కాన్ = ఒక ఘనతగా, కొని = తలఁచి, దేవదేవున్ = దేవతలకు దేవుఁడైన శివుని, ఎల్లిదముగన్ = అసమర్థునిగా, చేసి, ఇంత + కొని = ఇంచుక కొని, లేవడిన్ = దారిద్ర్యముతో, లేచెదు=లేచెదవు-బయలుదేఱుదువు, ప్రాణ

గొడ్డము = ప్రాణాంతకము (గా), ఆడెదు = పలికెదవు, మదిన్ = మనస్సునందు. ఓటకంద = భయము, చెడి = పోయి, దెప్పుడికంబులు = ఆపత్తులు, చేసెదు = చేసెదవు, ఇట్టి, క్రొవ్విదములు = దుశ్చేష్టలు, తక్కు_ము = విడువుము, ఈ-పలుకు = ఈ మాట, విష్ణుఁడున్, లక్ష్మియున్ = నీ తండ్రియును, తల్లియును, విన్నన్ = విన్నచో, మెత్తురే = ప్రశంసింతురా?

తాత్పర్యము: దేవత లాహ్వానించి పంపుట ఒక ఘనతగా నెంచి, దేవ దేవుఁడైన యీశ్వరు నసమర్థునిగా నెంచి. స్వల్పముగాని దారిద్ర్యముతో లేచెదవు. ప్రాణాంతకమునైన మాటలు పలికెదవు. మనస్సున భయములేక యాపత్కారముగాఁ బ్రవర్తింతువు. ఇట్టి దుశ్చేష్టలు మానుము. ఈ మాట నీ తండ్రి విష్ణువును, నీ తల్లి లక్ష్మియును విన్నచో మెత్తురా? మెచ్చ రని భావము.

విశేషములు: త్రిదశులు-అమరా నిర్జరా దేవా స్త్రిదశా విబుధా స్సురాః. త్రిదశపరిమాణం వయో యేషాం తే = ముప్పదేండ్లకు లోఁబడిన వయస్సు గలవారు. దేవతలు, పిల్చు - విలుచు = పిలుచు. 'వెలయు విలిచె ననఁగఁ బిలిచె ననుట.' ఆం. భా.3-184 ఇంతగాని లేవడి లేచెదు - అంత తృప్తికరముగా లేదు. ప్రాణగొడ్డము - అనింద్యగ్రామ్యమని చిన్నయ, తద్భవము (ప్రాణకుట్టకశబ్దభవము) అని ప్రౌఢవ్యాకరణము, లేచెదు = లేచెదవు, ఆడెదు = ఆడెదవు - 'లాఘవకారమునకు లోపము - బాల.క్రియ.24. అపవాదిస్వరసంధి - బాల.సంధి.11, పంపుదు = పంపుట, భావార్థక టవర్ణకమునకు డువర్ణమును వాడుట యితనిలోఁ బెక్కుచోట్లఁ గలదు.

తే. హరుఁడు నెవ మల్గి చూచుడు నా క్షణంబ
యఖిలజగములు సంహార మగు రయమున;
నట్టి యుగ్రుపైనటె పోయె దకట! లగ్గ
మేలు మే లెంత మీ లెంత మీలఁ ద్రాగు? 66

అర్థము; హరుఁడు = ఈశ్వరుఁడు, నెపము + అల్గి = ఏదో నెపమునఁ గోపించి, చూచుడున్ = చూచినంతనే, ఆక్షణంబు + అ = వెంటనే, రయమునన్ = వేగముగా, అఖిల - జగములున్ = ఎల్ల లోకములును, సంహారము + అగున్ = నశించును, అట్టి + ఉగ్రుపైన్ + అటె = అట్టి యుగ్రుని (శివుని,భయంకరుని)

మీఁదికా, పోయెదు = దండెత్తుదువు, అకట !, లగ్గ = మిక్కిలి, మేలు మేలు = బాగు బాగు; (విపరీతార్థకము.) ఎంత - మీలు = ఎంతటి చేఁపలు, ఎంత - మీలన్ = ఎంతటి చేఁపలను, త్రాగున్ = మ్రింగును?

తాత్పర్యము : 'హరుఁ డేదేని నెపమునఁ గోపించి చూచినంతనే యెల్ల లోకములును వేగముగా నశించును. అయ్యో! అట్టి యుగ్రునిమీఁదికా నీవు దండెత్తి పోయెదవు; మిక్కిలి మేలు మేలు; చేఁపలను మ్రింగుచేఁప లెంతటివై యుండవల యును? ఈశ్వరుని గెలువఁబోవు నీ వెంతటివాఁడ వయి యుండవలయును? నీ కంతటి సామర్థ్య మేదీ? యనుట.

విశేషములు : 'హరుఁడు' శబ్దప్రయోగ మిట సార్థకము. అలంకారము పరికరాంకురము. సాభిప్రాయే విశేష్యే తు భవే త్పరికరాఙ్కురః చన్ద్రా. ఉగ్రుపైన్. భయంకరునిపై - శివునిపై. 'ఉగ్ర'అను శివుని విశేషణ మిట సాభిప్రాయముగాఁ బ్రయుక్తము గావున నలంకారము పరికరము. 'అలఙ్కారః పరికర స్సాభిప్రాయ విశేషణైః.' చన్ద్రా.

పోయెదు - పోయెదవు- లాట్టు వకారమునకు లోపము, అపదాదిస్వరసంధి. లగ్గ = మిక్కిలి. ఈ యర్థమున నీ శబ్దము ఈ గ్రంథముననే పెక్కుచోట్లఁ బ్రయుక్త మైనది. (సూ.ని.) 'కొ నసియాడు లగ్గ నమ్మెలఁతకు' - కు.సం.5.133.' అగ్గిరినందనం గని లగ్గ బెగ్గిలి.' - కు.సం.5.132. - మీను (ఏకవ.) - మీలు (బహువ.)' బహు వచనంబు పరంబగునపుడు చేను పేను మీను శబ్దంబుల నువర్ణంబు లోపించు.' బాల. అచ్చిక.20.

క. కనుకిట్టిన నిట్టిక నమ
లిన విధమున దేవతావలికిఁ బూనితి నే
నని రుద్రు నుఱక పైఁజని
చెనయుట శిఖిశిఖల మిడుత చెనయుట గాదే; 67

అర్థము : కను - కిట్టినన్ = కన్నుగిఁటినంతనే, - ప్రోత్సహించినంతనే. ఇట్టికన్ = ఇటుకను, నమలిన - విధమునన్, నేను+ అని, దేవతా + ఆవలికిన్ = దేవతల సమూహమునకు, పూనితి = పూనితివి, రుద్రున్ = శివుని, ఉఱక = లక్ష్యపెట్టక,

పైన్ + పడి = దండెత్తిపోయి, పెనయుట = ఎదిరించుట, శిఖి - శిఖలన్ = అగ్ని జ్వాలలను, మిడుత, పెనయుట + కాదే? = ఎదిరించుటకాదా? - ఆపదనుట,

తాత్పర్యము : కనుగీటినంతనే - ప్రేరేపించినంతనే యిటుకను నమలిన విధమున దేవతలపనికి నేనని పూనితివి, రుద్రుని లెక్కచేయక యెదిరించుట అగ్ని జ్వాలలపై మిడుత దుముకుట కాదా!

విశేషములు : కనుకిట్టినన్ - కనుసన్న చేసినంతనే - ఎక్కువగాఁ జెప్పనక్కఱలేకయే - ఇంచుక సూచించినంతనే యనుట. ఇట్టిక నమలిన విధమున - ఆ కార్యము తనకు లాభములేనిది, దుష్కరము అని యెంచకయే. రుద్రు నుఱక .... గాదే, అలంకారము నిదర్శనము. 'వాక్యార్థయో స్సదృశయో రైక్యారోపో నిదర్శనా'- చన్ద్రా. ఉపమానవాక్యార్థమునకు ఉపమేయవాక్యార్థమునకు ఐక్యారోపణము చేసినచో నిదర్శనాలంకార మగును. ఇట్టిక - ఇటిక, ఇటుక, ఇట్టుక (వి) - ఇష్టకా (ప్ర). రుద్రున్ - విశేష్యము సాభిప్రాయ మగుటచే నలంకారము పరికరాంకురము. 'సాభిప్రాయే విశేష్యే తు భవే త్పరికరాఙ్కురః' - చన్ద్రా.

వ. అని పరమేశ్వరు నెఱింగించి తను భంగించుచున్న రతిం గనుంగొని. 68

అర్థము : అని, పరమేశ్వరున్, ఎఱింగించి = పరమేశ్వరుఁ డెంతటివాఁడో తెలియఁజెప్పి, తనున్ = తన్ను, భంగించుచున్ + ఉన్న = నిరుత్సాహపఱుచుచున్న, రతిన్, కనుంగొని.

తాత్పర్యము ; అని పరమేశ్వరుని గొప్పతనమును స్పష్టపఱచి తన్ను నిరుత్సాహపఱుచుచున్న రతిని జూచి - తరువాతి పద్యముతో నన్వయము.

ఉ. 'ఏ నలరమ్ము లొడ్డఁ బరమేశ్వరుచిత్తము గౌరిచిత్తమున్
దానఁ గరంగి కూడు; మఱి దానికి సందియ మేల? వెండియుం
బూనెద మూఁడులోకములఁ బుట్టని పూనికి; వారి మేనులన్
మానుగఁ గూర్తు నొక్కటిగ మార్గణకౌశలనావ మేర్పడన్, 69

అర్థము : నేను - నేను, అలరమ్ములు (అలరు + అమ్ములు) = పుష్పబాణములు, ఒనన్ = ప్రయోగింపఁగా, పరమేశ్వరు - చిత్తమున్ = శివుని మనస్సును, గౌరి - చిత్తమున్ = పార్వతి మనస్సును, దానన్ = దానిచే (ఆ నా ప్రయోగముచే,) కరంగి, కూడున్ = కలియును, మఱి = ఇఁక, వెండియున్ = మరల, దానికిన్ = నా బాణప్రయోగముచే వారి మనసులు కూడు ననుటకు, సందియము + ఏల = సందేహమేల?, మూఁడు - లోకములన్ = ముల్లోకములందును, పుట్టని - పూనికిన్ = ఇంతవఱకును గలుగని ప్రయత్నమును, పూనెదన్, మార్గణ - కౌశల - భావము = బాణప్రయోగనైపుణ్యము, ఏర్పడన్ = స్పష్టపడునట్లు, వారి - మేనులన్ = వారి శరీరములను, మానుగన్ = ఒప్పునట్లు, ఒక్కటిగన్ ఒక్కటియగునట్లు, కూర్తున్ = కలుపుదును,

తాత్పర్యము : 'నేను పుష్పబాణములను బ్రయోగింపఁగాఁ బరమేశ్వరుని చిత్తమును, పార్వతి చిత్తమును గరఁగి కలియును. దానికిఁక సందేహ మక్కఱలేదు. నేను ముల్లోకములందును ఇంతదనుకఁ బుట్టని పనికిఁ బూనెదను, అది యేమన నా బాణప్రయోగనైపుణ్యము స్పష్టపడునట్లు నేను వారి శరీరములను ఒక్కటిగాఁ గలుపుదును.

విశేషములు : అలరమ్ములు - అలరు + అమ్ములు. 'కర్మధారయంబునందుఁ జేర్వాదిశబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాష నగు,' బాల. సంధి.29. టుగాగమ మయినచో అలరుటమ్ములు. కానిచో, అలరు + అమ్ములు - 'ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధి యగు,' బాల.సం. 1. అలరమ్ములు.

ముందు వారి చిత్తములను, దరువాత వారి మేనులను ఒక్కటిగాఁ గూర్తుననుట.

తే. జగము లెల్లను నా యాజ్ఞ మిగులకునికిఁ
గనియు వినియు నెఱుంగుదు వనజనేత్ర!
యింత భయమునఁ బొంద నీ కేల మది భు
జంగభూషణు నొకపోటుగొంగఁజేసి? 70

అర్థము : వనజ - నేత్ర - తామరలవంటి కన్నులు గలదానా! రతీ! జగములు + ఎల్లను = లోకము లన్నియు, నా + ఆజ్ఞన్ = నా ఆనను, మిగులక +

[illegible] = అతిక్రమింపకుండుటను, [illegible] = చూచియును, వినియున్ = వినియును, ఎఱుంగుదు = ఎఱుఁగుదువు, మదిన్ = మనసునందు, [illegible] = [illegible] అధి వికములుగాఁ గలవానిని, శివుని, ఒక - సోమయగాంగన్ + చేసి = ఒక శూరుఁడైన విరోధి యని యెంచి, నీకున్, ఇంత - భయమునన్ + పొందవన్ = భయము పొంద, ఏల?

తాత్పర్యము: రతీ! లోకములన్నియు నా యాజ్ఞనతిక్రమింపమి నీవు కనియు, వినియు నెఱుఁగుదువు. నీవు మనస్సున శివు నొక శూరుఁడైనవిరోధినిగా భావించి యింతగా భయపడనేల?

విశేషములు: ఎఱుంగుదు (వు) - లాక్షు వకారమునకు లోపము. బాల. క్రియ.24. అపవాదిస్వరసంధి. బాల.సంధి.11. భయమునఁబొందవన్-భయమును పొందవన్ అనుటకు.

వ. అని మనసిజుండు భీఁదులేక పలికిన విని రతి పరమేశ్వరుమాహా
త్మ్యంబు దలంచి వెండియు నిట్లనియె. 71

అర్థము: అని, మనసిజుండు = మన్మథుఁడు, భీఁదు - లేక = భయముఁడు లేక, పలికినన్, విని, రతి, పరమేశ్వరు - మాహాత్మ్యంబు = పరమేశ్వరుని గొప్ప తనము, తలంచి = భావించి, వెండియున్ = మరల, ఇట్లు + అనియెన్.

తాత్పర్యము: అని మన్మథుఁడు తనకంటె నధికుఁడులేనియట్లు పలుకఁగా విని రతి పరమేశ్వరుని గొప్పతనము భావించి మరల నిట్లు పలికెను.

విశేషములు: మనసిజుఁడు - అలుక్సమాసము.

చ. అతనిశరాసనంబు కనకాచల, మిక్షుశరాసనంబు నీ;
కతనికి నమ్ము శౌరిపత, మంటినఁ గందెడు పూవుటమ్ము నీ;
కతఁడు పురాపహారి, విరహాతుర పంకజనాపహారి నీ;
వతనికి నీకు హస్తిమశకాంతర మెమ్మెయి నెన్నిచూచినన్. 72

అర్థము: అతని - శరాసనంబు = శివుని విల్లు, కనక + అచలము = బంగారుకొండ - మేరువు, మిక్కిలి దృఢమైన దనుట, నీకున్, ఇక్షు - శరాసనంబు =

చెఱకువిల్లు, అల్పమైనదనుట. అతనికిన్ = శివునకు, అమ్మ = బాణము, పాశుపతము-అప్రతిహతమనుట. నీకున్, అంటినన్ = తాఁకినచో, కందెడు = కందిపోవునట్టి, పూవుటమ్ము (పూవు+అమ్ము) = పుష్పబాణము. ముప్పలి మనుట. అరుఁడు = శివుఁడు, పుర + అపహారి = త్రిపురములను నాశనముచేసినవాఁడు. మహాపరాక్రమవంతుఁ డనుట, నీవు, విరహ + ఆతుర - పాంథ - జన + అపహారి = ఎడఁబాటుచే బాధపడు బాటసారులైన (విరహులైన) జనులను క్షయింపఁజేయువాఁడవు, నిర్వీర్యుఁడ వనుట. ఎమ్మెయిన్ (ఏ + మెయిన్) = ఏ విధముగను, ఎన్ని - చూచినన్ = గణించిచూచినను, అతనికిన్ = శివునకును, నీకున్, హస్తి - మశక + అంతరము = ఏనుఁగునకును, దోమకునుగల భేదము - అతఁ డేనుఁగువంటివాఁడు, నీవు దోమవంటివాఁడ వనుట.

తా త్ప ర్య ము : శివుని విల్లు మేరువు. నీకు విల్లు చెఱకు, అతనికిఁ బాశుపతము బాణము. నన్నుఁ దాఁకినఁ గందిపోవుపువ్వు బాణము. అతఁడు త్రిపురాంతకుఁడు, నీవు ఎడఁబాటుచే బాధపడువారిని క్షీణింపఁజేయువాఁడవు. ఏ విధముగా నెన్నిచూచినను, అతనికిని నీకును ఏనుఁగునకును దోమకును గలభేదము.

వి శే ష ము లు : అతనికి నీకు హస్తిమశకాంతరము. - యథాసంఖ్యము, ఎమ్మెయి-ఏ + మెయి. త్రికసంధి. బాల,సమాస. 14.13. నీవు విరహాతురపాంథ జనాపహారి. 'ప్రథమాంతంబులగు యుష్మదస్మద్విశేషణంబుల కేకత్వంబున వు నులను బహుత్వంబున రు ములు నంతాగమంబులు ప్రాయికంబుగ నగు.' బాల.కారక.33.అను సూత్రముచే .... జనాపహారి + వు - 'ఇకారంబుమీఁది కు ను వు క్రియావిభక్తుల యుత్వంబున కిత్వంబగు.' బాల,తత్సమ. 26. అనుసూత్రముచే .... జనాపహారివి అని కావలసియుండఁగా 33 - సూత్రమునందలి ప్రాయికగ్రహణముచే రక్షితమగు చున్నది. పూవుటమ్ము - పూవు + అమ్ము-'కర్మధారయంబులం దుత్తున కచ్చు పరంబగునపుడు టుగాగమం బగు,' బాల.సం. 28.

తే. ఈశుఁ దలఁచు మహాత్ముల హృదయములను
గాఁడ నోపని నీ పుష్పకాండ నికర
మతని భేదింప నోపునే యంగజన్మ!
తమ తసాధ్యుల సాధింపఁ దలఁప నగునె? 73

అ ర్థ ము : అనంతున్ - [illegible] = [illegible], [illegible] = [illegible], [illegible] ([illegible]) + [illegible] = [illegible], [illegible] = [illegible], [illegible] + [illegible] = [illegible], [illegible] - నిచయము = సమ్మోహనాస్త్రసమూహము, అతనిన్ = అతని, భేదింపన్ + ఉన్నే = భేదింపఁజాలునా? - [illegible], [illegible], అసాధ్యుఁడు = సాధింపరాని వాఁడు, సాధింపన్ + వలయు = సాధింపవలయువాని [illegible], అగునె = కాదుగా, కాదనుట.

తా త్ప ర్య ము : మన్మథా! 'అనన్తుఁడు స్మరించు మహాయుధాధిప్రస్ఫూర్తియు అనుగొనిన నాయకుఁ డెవఁ డైన సమ్మోహనాస్త్రసమూహము అతనిని భేదింపఁగలదా? తనకు సాధింప వలసినవానిని సాధింపఁజాలుట మంచిది కాదు,

వి శే ష ము లు : అలంకారము కావ్యార్థాపత్తి. 'కైముత్యే నార్థసంసిద్ధిః కావ్యార్థాపత్తి రిష్యతే.' లక్షణ. విష్ణువు సమ్మోహ....నిగా అతనిని స్మరించువారిని భేదింప లేని పరిని నన్ను భేదించు ననుట. విశేషమును సామాన్యముచే సమర్థించుటచే నర్థాంతర న్యాసాలంకారము. 'ఉక్తి రర్థాంతరన్యాసః స్యాత్ సామాన్యవిశేషయోః' లక్షణ. అంగజన్ముఁడు = అంగజుఁడు.

తే. ఆఁడుదాన నబల నైన నే నించుక
యలిగి చూచుడును భయమునఁ దలఁకు;
దుగ్రు నుగ్రలోచనోద్భూతవహ్నికి
నెదిరి నిలువ నీకు నెంత కొలఁది? 74

అ ర్థ ము : ఆఁడుదానన్ = ఆఁడుదానను, అబలన్ = బలములేనిదానను (స్త్రీని), ఐన. నేను, ఇంచుక = కొంచెము, అలిగి = కోపించి, చూచుడును = చూచి నంతనే, భయమునన్ = భయముచేత, తలఁకుదు (వు) = వణఁకుదువు, ఉగ్రు + ఉగ్ర-లోచన + ఉద్భూత - వహ్నికిన్ = శివుని యొక్క భయంకరమైన కంటినుండి పుట్టిన అగ్నికి, ఎదిరి - నిలువన్ = ఎదిరి నిలఁబడుటకు, నీకున్, ఎంత - కొలఁది = ఎంత శక్తి: నీ శక్తి ఏమాత్ర మనుట.

తా త్ప ర్య ము : ఆఁడుదానను, బలహీనను అయిన నేను ఇంచుక అలిగి చూచినంతనే భయపడి వణఁకిపోవు నీవు ఉగ్రుని ఉగ్రనేత్రాగ్ని కెదురు నిలఁబడుటకు నీ కేమాత్రము శక్తిగలదు? లే దనుట.

విశేషములు: అబల - స్త్రీ అనియు బలములేనిదనియు. అబలాశబ్దము సాభిప్రాయమగుటచే పరికరాలంకారము. ఇంతటిదైన అలుకకే వలంచు నీవు ఉగ్రుని మహాకోపమున కెట్లు నిలువఁగల వనుట, అలంకారము కావ్యార్థాపత్తియును. చూచుటను చూచినంతనే - చూచినవిమ్మట వ్యవధిలేకుండఁగనే - అని ఆనంతర్యార్థకప్రయోజనము. నే నాఁడుదానను, అబలను - అతఁడుగ్రుఁడు, నాది యంతక అలుకతోడిచూపు. అత నిది ఉగ్రలోచనము. నిప్పులు గ్రక్కునట్టిది. ఈ భేదములు మన్మథునిది దుస్సాహసమని తెలుప సమర్థము లగుచున్నవి. శివుని కుగ్రశబ్దమును ప్రయోగించుటయు సాభిప్రాయమై పరికరాంకురాలంకార మగుచున్నది. ఉగ్రు + ఉగ్ర - ఉగ్రునుగ్ర. 'షష్ఠీ సమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు.' బాల,సంధి.34

సీ. కొని బాలురైనను దిని పిప్పి యుమిసెడు
 చెఱకువి ల్లనినమ్మి చేతఁబట్టి,
మెలఁతల తలవెంట్రుకలఁ బొంది కందెడు
 నలరుపుష్పము లమ్ము లని తలంచి,
తలిరాకులైనఁ గదల్పనోపని మంద
 పవనుండు నొక పెనుప్రాపు గాఁగ,
నబలలు సోపిన నాకాశమునఁబాఱు
 నలి శుకములు మూలబలము గాఁగ,

తే. నెంత వేసవి ముట్టిన నెండఁ గమరు
నను వసంతుండు దగు సహాయంబు గాఁగఁ,
గాకిపిల్లల కోడు పికములఁ బోటు
మగలుగా నుగ్రుపైఁ బోవఁదగునె మదన? 75

అర్థము: మదన = మన్మథుఁడా! బాలురు + ఐనను = చిన్నపిల్లవాం డ్రయినను, కొని = పట్టుకొని, తిని, పిప్పి, ఉమిసెడు, చెఱకు, విల్లు + అని, నమ్మి, చేతన్ + పట్టి,

మెలఁతల = స్త్రీలయొక్క, తలవెంట్రుకలన్ = శిరోజములను, పొందీ = కూడి, కందెడు = నలఁగిపోయెడు, అలరు-పుష్పములు = విచ్చు పువ్వులు, అమ్ములు = బాణములు, అని, తలంచి,

తలిరాకులు = చిగురాకులు, ఐనన్ = చివురుటాకులనుగూడ, కదల్పన్ + ఓపని = కదల్పఁజాలని, మంద - సమీరుండున్ = మెల్లని గాలియు - మందుం డైన = తెలివిమాలినవాఁడైన వాయువును, ఒక, పెద్ద - ప్రాపు = పెద్ద అండ, కాఁగన్.

అబలలు = స్త్రీలు (బలహీనులు), తోచినన్ = త్రోలినచో, ఆకాశమునన్, పాఱు, అలి - చరములు = తుమ్మెదలును, చిలుకలును, మూఁడుదళము + కాఁగన్ = ప్రధాన సేన కాఁగా,

ఎంత - వేసవి = ఏమాత్రపువేసవి, ముట్టినన్ = తగిలినను, ఎండన్ = ఎండచేత, కమరున్ = వాడిపోవును, అను = అనునట్లుండు, వసంతుండు, తగు - సహాయుండు = తగిన తోడు, కాఁగన్,

కాకిపిల్లలకున్, ఓడు = భయపడు, పికములున్ = కోకిలములును, పోటు - మగలు + కాన్ = యుద్ధవీరులుగా, ఉగ్రుపైన్ = శివునిపైకి, పోవన్ + తగునె = దండెత్తి పోవఁదగునా?

తాత్పర్యము : మన్మథా! చిన్నపిల్లవాండ్రయినను బట్టుకొని తిని పిప్పి యుమియునట్టి చెఱకువిల్లని నమ్మి చేఁదాల్చి, స్త్రీల శిరోజములను గూడి నలఁగిపోయెడు విచ్చుపూలు అమ్ములని తలఁచి, చివురుటాకులనుగూడఁ గదలింపఁజాలని మందవాయువును ఒక పెద్దయండ కాఁగా, అబలలుసైతము త్రోలఁగా నాకాశమునకుఁ బరువెత్తుకొనిపోవు తుమ్మెదలును, చిలుకలును ప్రధానసేనకాఁగా, ఏ మాత్రము వేసవితాఁకినను ఎండచే వాడిపోవుననునట్లుండు వసంతుఁడు తగినతోడు కాఁగా, కాకిపిల్లలకే భయపడు కోకిలములు యుద్ధవీరులుగా నుగ్రునిమీఁదికి దండెత్తి పోఁదగునా!

విశేషములు : బాలురైనను - చెఱకువింటి యల్పత్వమును సూచించును. పిప్పి-ఆ వింటిలో నిస్సారమైన పదార్థ ముండుననుట. తలవెంట్రుకలకే కందిపోవు పూవులు బాణములని నమ్ముకొనుట యవివేక మనుట. తలిరాకులనుగూడఁ గదల్పఁజాలని మెల్లఁడు, మందుఁడు నగు పవనుఁడుకూడ నొక పెద్దదండయని హేళన. అబలలు = ఆఁడువారు - బలహీనులు - ఆకాశమునఁబాఱు = నేలపైనిలువనివి భయపడిపాఱు నవి యనుట. ఎంతవేసవి = ఏమాత్రపువేసవి. వసంతము చైత్ర-వైశాఖములనే వచ్చును. - ఎండ లప్పటికి ముదురవు. ఎండలు ముదురునప్పటికి వసంతముపోవు

గ్రీష్మము వచ్చును. కాకిపిల్లకే జంకిపోవునవి యేటి మూలబలము లనుట. ఇట్టి సాధన సామగ్రితో దండెత్తిపోవునది యుగ్రునిపైకి. ఉగ్రశబ్దము సాభిప్రాయమై పరికరాంకు రాలంకార మగుచున్నది.

పాఱు + అలికులములు - పాఱునలికులములు - 'ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' పాఱు నలి కులములు-బాల.సంధి. 33,తలిరాకులు - తలిరు + ఆకులు - 'కర్మధారయంబునందుఁ బేర్వాదిశబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాషనగు' బాల,సంధి.29.

చ. చిరముగ నొల్వ్వవడ్డ నరసింహునికంటెను బెద్దవే? శిరం
బురలఁగ నాటువడ్డ జలజోద్భవుకంటెను బెద్దవే? పెనుం
గరిగొనఁ గాల్పువడ్డ జముకంటెను బెద్దవె? నీవు విశ్వసం
హరు నుఱకెత్తి పోయి కలహంబున నోర్వఁగ నీ యలంతియే? 76

అర్థము : చిరముగన్ = బహుకాలముగా, ఒల్వు+వడ్డ=తోలు ఒలువఁబడిన. నరసింహునికంటెను, పెద్దవే = గొప్పవాఁడవా? శిరంబు=తల, ఉరలఁగన్ = దొరలునట్లు, అటు + వడ్డ = దెబ్బ తినిన, జలజ + ఉద్భవు కంటెను= తమ్మిచూలి (బ్రహ్మ)కంటెను, పెద్దవే, పెనుంగరిగొనన్ = మిక్కిలి యతిశయించునట్లు, కాల్పు + వడ్డ = కాలిన, జముకంటెను= యమునికంటెను, పెద్దవె, నీవు, విశ్వ - సంహరున్ = విశ్వమునే సంహరించువానిని - శివుని, ఉఱక = లక్ష్యపెట్టక, ఎత్తిపోయి=దండెత్తి, కలహంబునన్=యుద్ధమునందు, ఓర్వఁగన్ = ఓడించుటకు, నీ + అలంతియే = నీ తరమా?

తాత్పర్యము : పరమేశ్వరునిచే నెప్పుడో తోలు ఒలువఁబడిన నరసింహుని కంటెను నీవు గొప్పవాఁడవా? శిరస్సు నేల దొరలునట్లు దెబ్బతిన్న బ్రహ్మకంటెను గొప్పవాఁడవా? అతిశయముగాఁ గాలిపోయిన యమునికంటెను గొప్పవాఁడవా? నీవు జగత్సంహరుమీఁదికి దండెత్తిపోయి యుద్ధమున నతని నోర్చుట నీకు శక్యమా? కాదనుట.

విశేషములు : ఒల్వువడ్డనరసింహుని .... విష్ణువు నరసింహరూపమున నున్నప్పుడు శివుఁడు శరభరూపుఁడై యతని నెదిరించి, సంహరించి, యతని చర్మము నొలిచి కంకాళమును ధరించెనని ఉక్తనారసింహపురాణకథ, శిరం బురలఁగ నాటువడ్డ

జలజోద్భవుఁడంచెను - బ్రహ్మకుఁ [illegible] ఉండెను. బ్రహ్మ [illegible] గోరెను. స్కాం. క. 26. ఒలుపు = ఒల్చు, అనుదు క్రియాదంతరూపము అగు. పెను + గరాసు = మిక్కిలి యతిశయించు. - 'గరిగొన్న పెనుమేఁక పంతకత్తముగన్'. పం.రా.యు. 365, 'విశ్వసంహార' అను ఈవ విశేషణము సార్థ ప్రాయమై [illegible] చున్నది. పట్టు - పటిన - [illegible]

చ. హరి కంకాలము చేతిముద్ర; దివిజేంద్రాస్థుల్ సుభూషావళుల్;
గరళం బభ్యవహార; మంతక తనుక్షారంబు మైపూఁత; పం
కరుహాసీన శిరఃకపాల ము రుభిక్షాపాత్రగా విశ్వసం
హరు వర్తించు మహావ్రతోపహతి చేయంబూన నీ ప్రాప్తమే?

అర్థము : హరి = విష్ణువు యొక్క, కంకాలము = ఎముకలగూడు, చేతిముద్ర, దివిజ + ఇంద్ర + అస్థుల్ = దేవేంద్రుని ఎముకలు, సు - భూషా + ఆవళుల్ = మంచి అలంకారముల సమూహములు, గరళంబు = హాలాహలము, అభ్యవహారము = ఆహారము, అంతక - తను - క్షారంబు = యముని శరీరపు బూడిద, మై - పూఁత = శరీరమునందలిపూఁత, పంకరుహ + ఆసీన - శిరః (శ) + కపాలము = కమలాసనుని (బ్రహ్మ) యొక్క, తల పుఱ్ఱె, ఉరు - భిక్షా - పాత్ర + కాన్ = పెద్ద భిక్షాపాత్రము కాఁగా, విశ్వ - సంహరు = జగల్లయముచేయువాని - శివుని, వర్తించు = చేయునట్టి, మహత్ (మహా) + వ్రత + ఉపహతి = మహా వ్రతము యొక్క విఘ్నము, చేయన్ + పూనన్ = చేయ యత్నించుట, నీ. ప్రాప్తమే = నీ తరమా? కా దనుట.

తాత్పర్యము : విష్ణుని (నరసింహుని) కంకాలము చేతిముద్రగను, దేవేంద్రుని అస్థులు అలంకారములుగను, హాలాహలము ఆహారముగను, యముని మేని బూడిద మైపూఁతగను, బ్రహ్మ తలపుఱ్ఱె భిక్షాపాత్రముగను గల జగత్సంహారుఁడు చేయు మహావ్రతమునకు విఘ్నముచేయుట నీ తరమా?

విశేషములు : గరళం బభ్యవహారము - దేవదానవు లమృతముకొఱకు క్షీరసముద్రమును మథింపఁగా నందుండి పుట్టిన హాలాహలమును లోకక్షేమముకయి యీశ్వరుఁడు మ్రింగెను. పాశుపతము, కాలాముఖము, వామనము, భైరవము, మహావ్రతము - అనునవి శైవాగమభేదములు. అందు మహావ్రతమునం దాచరింపఁదగిన నియమములు, చిహ్నములు ఈ పద్యమునఁ బేర్కొనఁబడినవి. విశ్వసంహరు వర్తించు - 'ధాతుజవిశేషణ భావార్థక పూర్వవ్యవహితావ్యవహిత కర్తృపదప్రథమకుఁ దఱుచుగ యొక్కషష్ఠి యగు' ప్రౌఢ.కారక,15. విశ్వసంహరునియొక్కవర్తించు, 'యొక్కకు లోపంబు బహుళంబు,' ప్రౌఢ.కారక, 16. విశ్వసంహరు వర్తించు మహావ్రతోపహతి - 'కొన్నియెడల సిద్ధసమాసమధ్యగతపదంబులతోఁ దద్భిన్న పదంబుల కన్వయంబు చూపట్టెడి.' ప్రౌఢ.సమాస.35. 'విశ్వసంహరు' అను శివవిశేషణము సాభిప్రాయమై పరికరాలంకార మగుచున్నది.

వ. అనిన విని "బలపరాక్రమాతిధైర్య శౌర్య మంత్ర తంత్ర ధ్యాన ధారణైశ్వర్యాద్యశేషదివ్యశక్తు లెంతవిశేషంబు లయ్యును జంద్రకాంతోపలంబులు చంద్రకిరణస్పర్శనంబునఁ గరంగునట్లు లతికోమలం బైన కామశక్తికి లోపై మృదుభావంబునం బొందు నిది జగంబునం దనుభవసిద్ధం బది యెట్లనిన. 78

అర్థము : అనినన్ = అని రతి యనఁగా, విని = మన్మథుఁడు విని, బల .... శక్తులు : బల, పరాక్రమ, అతిధైర్య, శౌర్య, మంత్ర, తంత్ర, ధ్యాన, ధారణ + ఐశ్వర్య, ఆది = మొదలగు, అశేష=సమస్తమునైన, దివ్య-శక్తులు = గొప్ప శక్తులు. ఎంత - విశేషంబులు=ఎంతగొప్పవి, అయ్యును=అయినను, చంద్రకాంత+ఉపలంబులు=చంద్రకాంతశిలలు, చంద్ర-కిరణ-స్పర్శనంబునన్ = చంద్రుని యొక్క, కిరణములయొక్క, తాఁకిడిచేత, కరంగు + అట్లు = కరఁగు రీతిని, అతి - కోమలంబు = మిక్కిలి మృదువు, ఐన, కామశక్తికిన్ = మన్మథునిశక్తికి, లోపు + ఐ = లోపడి, మృదు - భావంబునన్ = మార్దవమును, పొందున్, ఇది, జగంబునన్=లోకమునందు, అనుభవ - సిద్ధంబు = అనుభవముచే నేర్పడినది, అది, ఎట్లు + అనినన్,

తాత్పర్యము : అని రతి యనఁగా మన్మథుఁడు విని 'బలము, పరాక్రమము, గొప్పధైర్యము, శౌర్యము, మంత్రము, తంత్రము, జ్ఞానము, ధారణ, ఐశ్వర్యము మున్నగు సర్వదివ్యశక్తులు ఎంతగొప్పవియైనను, చంద్రకాంతశిలలు చంద్రకిరణములు సోఁకఁగనే కరఁగువిధమున, మిక్కిలి కోమలమైన మన్మథశక్తికి లోఁబడి మార్దవమును బొందును. ఇది లోకమున ననుభవముచే నేర్పడినది. అది యెట్లనఁగా - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : చంద్రకాంతోపలంబులు చంద్రకిరణస్పర్శనంబునఁ గరంగునట్టులు - అలంకారము ఉపమ. ధారణ + ఐశ్వర్య - వృద్ధిసంధి. అ ఆ లకు ఏ ఐలు పరము లగునపుడు ఐకారమును, ఓ ఔలు పరములగునపుడు ఔకారమును ఏకాదేశము లగును. ధారణైశ్వర్య. ఆది + అశేష - యణాదేశసంధి. ఇ ఉ ఋ ౠ లకు అసవర్ణములైన అచ్చులు పరము లగునపుడు య్ వ్ ర్ ల్ అనునవి ఆదేశము లగును - ఆద్యశేష. చంద్రకాంత + ఉపలంబులు = గుణసంధి. అ ఆ లకు ఇ ఉ ఋ ౠలు పరములగునపుడు వరుసగా ఏ ఓ అర్ అల్ అనునవి ఏకాదేశములగును. చంద్రకాంతోపలంబులు. కరంగు + అట్టులు. 'ఉదంతమగు తద్ధర్మార్థవిశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' బాల.సంధి.33. కరంగునట్టులు.

తే. అదిమిపట్టినఁ గరులైనఁ బదియునట్టి
కడిఁదిబలులగు మగ లొత్తి కౌఁగిలింపఁ
గుసుమకోమలు లగు సతుల్ కొసరుచునికి
గనియు నెఱుఁగవె విపరీతకామశక్తి? 79

అర్థము : అదిమి - పట్టినన్ = నొక్కిపట్టినచో, కరులు + ఐనన్ = ఏనుఁగులయినను, పదియు + అట్టి = నలఁగిపోవునట్టి, కడిఁది - బలులు + అగు = మిక్కిలి బలముగలవారగు, మగలు = పురుషులు, ఒత్తి = నొక్కి-బిగ్గ, కౌఁగిలింపన్ = కౌఁగిలింపఁగా, కుసుమ-కోమలులు + అగు = పువ్వువలె మృదువులైన, సతుల్ = స్త్రీలు, కొసరుచున్ + ఉనికి = మఱిమఱి కావలయు ననుచుండుట, కనియున్ = చూచియు, విపరీత - కామ - శక్తి = వ్యత్యస్తమైన మన్మథబలము, ఎఱుఁగవె = ఎఱుఁగవా?

తాత్పర్యము : వాసనాక్షిణోక్తి పట్టినచో నేనుఁగునైన నలఁగిపోవునట్టి గొప్పబలముగల పురుషులు దగ్గ కౌఁగిలింపఁగాఁ బూవులవలె మృదువులగు స్త్రీలు మఱి మఱి కావలయు ననుటయు జూచియు విపరీతమైన మన్మథశక్తి తెలియదా?

విశేషములు : అదిమినప్పుడు ఏనుఁగులనైన నలఁగఁగొట్టునది పురుషుల బలము. అట్టి బలముగలవారు స్త్రీలను బిగియారఁగౌఁగిలించినప్పుడు వారు పూవులవలెఁగాక, కసుగందినను నలఁగరు సరిగదా ఇంకను అట్టిది కావలయునని కోరుచుందురు, దానికిఁ గారణము మన్మథుని బలము. అదియే దాని వైపరీత్యము. కడిఁదిబలులు - బహువ్రీహి కాదు. విశేషణపూర్వపద కర్మధారయము - మిశ్రసమాసము, బలముగలవాఁడు బలి. దాని బహువచనము బలులు, కడిఁదియైన బలులు-కడిఁది బలులు. అదిమి పట్టినఁ గరులైనఁ జదియునట్టి కడిఁది బలులు - కడిఁదిబలులు అదిమి పట్టినఁ గరులైనఁ జదియునట్టి - 'ధర్మాదులకుఁ బ్రాధాన్యవివక్షయందు ధాతువిశేషణంబులు కర్తతోడంబోలె వానితోడ సమసించు.' బాల.సమాస.26. కొసరు చునికి - కొసరుచున్ + ఉనికి - 'ప్రథమేతర విభక్తి శత్రర్థకవర్ణంబులందున్న యుకారమునకు సంధి వైకల్పికముగా నగును.' బాల. సం.2.

వ. దానికిం గారణం బేమి యందేని. ౪౭

అర్థము : దానికిన్, కారణంబు, ఏమి, అందు (వు) + ఏని = అందువేని.

తాత్పర్యము : దానికిఁ గారణ మే మందువేని - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు ; అందేని - అందువు+ఏని. అనుధాతువు, 'తద్ధర్మార్థములందు లొట్టగు.' అను + లొట్టు, బాల.క్రియ.5 'లకారంబునకు డు ద్రు వు రు ను ము లగు.' బాల.క్రియ. 8. మధ్యమపురుషైకవచనము - అను + వు. 'లొట్టు రుక్షు పరంబగునపుడు మగాగమం బగు.' బాల.క్రియ,22. అనుదువు. 'త దు టలు పరంబు లగునపు వర్ణాదుల సస్థానంబున నున్నయు నుండు డు లోపంబును విభాష నగు.' బాల. క్రియ.23, అందువు. 'లిట్లాట్టుల వకారంబునకు లోపంబు విభాష నగు.' బాల.క్రియ,24. అందు+ఉ. 'అంద్వవగాగమంబులం దప్ప నపదాదిస్వరంబు పరంబగునపు దచ్చునకు సంధి యగు.' అందు. బాల.సంధి.11. 'ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధి యగు.' బాల. సంధి. 1. అందేని.

క. ఆరయఁగా స్త్రీపురుషా
కారములై చిత్తవృత్తి గలిగినఁ జాలున్
వా రెల్లఁ గామవశులగు
వారని నియమించి నాకు వర మజుఁ డిచ్చెన్. 81

అ ర్థ ము : ఆరయఁగాన్ = పరిశీలింపఁగా, స్త్రీ - పురుష + ఆకారము లు + ఐ = స్త్రీయొక్కయు, పురుషునియొక్కయు ఆకారములుగలవి యయి, చిత్త - వృత్తి = మనోవ్యాపారము, కలిగినన్ = ఉన్నచో, చాలున్ = సరిపోవును, వారు + ఎల్లన్ = వా రందఱును, కామ - వశులు = మన్మథునకు లోబడినవారు, అగు వారు, అని, నియమించి = ఏర్పాటుచేసి, నాకున్, అజుఁడు = బ్రహ్మ, వరము, ఇచ్చెన్.

తా త్ప ర్య ము : చూడఁగా స్త్రీపురుషుల ఆకృతిగలవయి మనోవ్యాపారము గలిగియున్నచోఁ జాలును. వా రందఱును మన్మథవశులు అగుదురని యేర్పాటుచేసి నాకు బ్రహ్మ వరమిచ్చెను.

వ. అని యాదిసృష్టికిని గారణంబైన కామతత్త్వమహత్త్వంబుఁ దెలిపి రతి నొడంబఱిచి రతీశ్వరుండు పరమేశ్వరుపైఁ బోవ నుద్యుక్తుం డగుడు నక్షణంబ. 82

అ ర్థ ము : అని, ఆది - సృష్టికిని = తొలిసృష్టికిఁగూడ, కారణంబు + ఐన, కామ - తత్త్వ - మహత్త్వంబున్ = మన్మథుని స్వరూపముయొక్క గొప్పతనమును, తెలిపి, రతిన్, ఒడంబఱిచి = సమ్మతింపఁజేసి, రతి + ఈశ్వరుండు = రతిభర్త - మన్మథుఁడు, పరమేశ్వరుపైన్, పోవన్ = దండెత్తిపోవుటకు, ఉద్యుక్తుండు = ప్రయత్నించినవాఁడు - సిద్ధపడినవాఁడు, అగుడున్ = అయినంతనే, ఆ - క్షణంబు + అ = అప్పుడే,

తా త్ప ర్య ము : అని తొలిసృష్టికిఁగూడఁ గారణమైన మన్మథస్వరూప మహిమను దెలిపి రతిని సమ్మతింపఁజేసి మన్మథుఁడు పరమేశ్వరునిపైకి దండెత్తిపోవ నుద్యమించినంత ఆ క్షణమే - తరువాతి పద్యముతో నన్వయము,

వి శే ష ము లు : అగుడున్ - అగుధాతువు, బాల. క్రి.42. 'అనంతర్యంబున డువర్ణకంబు ద్రుతాంతం బగు.' అగుడున్. అవుడున్, పోడున్, కావుడున్ (రూపాం.)

కామవశులగుటకు స్త్రీ పురుష లయినంతమాత్రమునఁ జాలదు. వారికిఁ జిత్తవృత్తి గూడ నుండుట ముఖ్యము. మన్మథుఁడు చిత్తజుఁడుగదా! అక్షణంబు-ఆక్షణంబు అనుటకు - నన్నెచోడుఁడు దీనిని పెక్కుచోట్లఁ బ్రయోగించెను - 4 - 33, 11 - 76

సీ. పంకరుహంబులు బండికండులు, చన్ప
కంబులు నొగ, లుత్పలంబు లిరుసు,
కరవీరములు బలు గాఁడి, జాదులు చనుఁ
గొయ్య, లశోకముల్ గోడి పీఁట,
సిందువారంబులు సీలలు, గేతకుల్
మెట్టులు, మొల్లలు మెట్టు గుదెలు,
పొగడలు వలుపులు, పున్నాగములు పగ్గ
ములు, సహకారముల్ పూను గాఁడి

తే. కురవకానీక మాలంపుఁగోల, కైర
వములు మునుకోల, కోకముల్ వాహనములు
గా వసంతుండు సూతుఁడై పూవుఁదేర
నెరయఁ గుసుమాయుధంబులు నినిపి తెచ్చె. 83

అర్థము : పంకరుహంబులు = తామరపుష్పములు, బండి - కండులు = బండి కట్టులు, చన్పకంబులు = సంపెఁగలు, నొగలు = బండికాఁడికట్టుఁగట్టులు - యుగంధరములు, ఉత్పలంబులు = కలువలు, ఇరుసు,

కరవీరములు = గన్నేరుపూవులు. బలు + కాఁడి = బలమైన కాఁడి, జాదులు = జాజిపూలు, చను + కొయ్యలు = బండి చట్టమునకు రెండుప్రక్కలను నాటెడు కొయ్యలు, అశోకముల్, కోడిపేఁట = బండి పోలుగట్టుచివరఁ గ్రింద ఎత్తుగా నుంచెడు మోపుడుకొయ్య - అనుకర్షము,

సింధువారంబులు = వావిలిపూలు, సీలలు = మేకులు, కేతకుల్ = గేదఁగులు - మొగలిపూలు, మెట్టులు = బండి యిటునటుఁ గదలకుండ బండిక్రిందఁ గట్టెడు తట్టులు, మొల్లలు = మొల్లపూలు, మెట్టు గుదెలు,

పొగడలు = పొగడపూలు. పలుపులు = పశువుల మెడఁ గట్టెడు త్రాడు. పలుగులు, పున్నాగములు = సురపొన్నలు, పగ్గములు. చూతావళుల్ - తీయ మామిడులు. పూను + కాఁడి = ఎద్దు మున్నగు వాని మెడ మీఁద నుంచు బండి ముందుగువాని కాఁడి,

కురవక + అనీకము = ఎఱ్ఱగోరంటల సమూహము, అలంప్తఁగోల = ముల్లు దండము, కైరవములు = తెల్లకలువలు, మునుకోల = మునికోల - కొరడా - కఱ్ఱ, కోకముల్ = చక్రవాకములు, వాహనములు = గుఱ్ఱములు, కాన్ = కాఁగా, వసంతుండు, పూవుఁదేరన్ = పుష్పరథమునందు, సూతుఁడు + ఐ = సారథియై, నెరయన్ = నిండుగా, కుసుమ + ఆయుధంబులు = పూవుటమ్ములు నినిపి = నింపి, తెచ్చెన్.

తాత్పర్యము: పద్మములు బండి కండ్లుగను, సంపెంగలు నొగలుగను, కలువలు ఇరుసుగను, గన్నేరులు బలమైన కాఁడిగను, జాజిపూలు బండిపట్టునకు రెండుప్రక్కల నాఁటెడు కొయ్యలుగను, అశోకములు బండిపోలుగట్టుచివరఁ గ్రింద ఎత్తుగా నుంచెడు మోపుదుకొయ్యగను, వావిలిపూలు సీలలుగను, గేదఁగులు మెట్లుగను, మొల్లలు మెట్టు గుదెలుగను, పొగడలు పలుపులుగను, పున్నాగములు పగ్గములుగను, తీయమామిడులు కాఁడులుగను, కురవకములు అలప్తఁగోలలుగను, తెల్లకలువలు మునికోలగను, చక్రవాకములు గుఱ్ఱములుగను కాఁగా వసంతుఁడు పుష్పరథముపై సారథియై నిండుగాఁ బూవుటమ్ములు నింపి తెచ్చెను.

విశేషములు: ఒక రాజకవి కిట్లు బండి వివిధావయవము లన్నియుఁ దెలియుట విశేషము.

పూవుఁదేరన్ - పూవు + తేరు + అందున్ = 'సమాసంబుల నుదంతంబు లగు స్త్రీసమంబులకుం, బుంపులకుం బరుషసరళంబులు పరంబు లగునపుడు నుగాగమం బగు.' బాల. సంధి. 25. పూవు + ను + తేరు + అందున్. 'ద్రుతప్రకృతికము మీఁది పరుషములకు సరళము లగు' బాల. సంధి. 16. పూవు + ను + దేరు + అందున్. 'ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందుసంశ్లేషలు విభాష నగు.' బాల. సంధి. 17. పూవుఁదేరు + అందున్. 'షష్ఠీవిభక్తికంబుల తృతీయా సప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు.' బాల. ఆచ్ఛిక. 38. పూవుఁదేరు +

అన్. 'అంద్వగాగమంబులందప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు.' బాల.సంధి.11. పూవుఁదేరన్. నినిపి-నినుపు ధాతువు నిఘంటువులఁ గానరాదు. నినుపు విశేష్యముగానే కనవచ్చుచున్నది. నింపు ధాతువు గలదు. కండులు - కల్లు + లు - 'సౌపవిభక్తికంబు లిక్కు సల లుమ్ణంబులకు బహువచనంబు పరంబగునప్పుడు ప్రాణ్ణిండుపూర్వక ద్విత్వంబు బహుళంబుగా నగు.' బాల.అచ్చిక.16.

వ. అంత రతిసమేతంబు పుష్పాయుధుండు పుష్పరథారూఢుండై నిజ సామ్రాజ్యవిభవైశ్వర్యంబులతో నతిరయంబున హిమవంతంబున కరిగి పరమేశ్వరు తపోవనంబు సొత్తెంచెఁ దత్క్షణంబ. 84

అర్థము : అంతన్, రతి - సమేతంబు=రతితోఁ గూడినవాడై, పుష్ప + ఆయుధుండు = పూవులు బాణములుగాఁ గలవాఁడు - మన్మథుఁడు, పుష్ప - రథ+ ఆరూఢుండు + ఐ = పూవుఁదేరెక్కినవాఁడయి, నిజ - సామ్రాజ్య - విభవ + ఐశ్వర్యంబులతోన్ = తనదైన సామ్రాజ్యముయొక్క వైభవముతోను, ఐశ్వర్యము తోను, అతిశయంబునన్ = మిక్కిలి వేగముతో, హిమవంతంబునకున్, అరిగి, పరమేశ్వరు = పరమేశ్వరునియొక్క, తపస్ (ః) + వనంబు, చొత్తెంచెన్ = ప్రవేశించెను, తద్ + క్షణంబు + అ = ఆ క్షణమే,

తాత్పర్యము : అంత మన్మథుఁడు రతి సహితుఁడై పూవుఁదేరి నెక్కి తన సామ్రాజ్యవైభవైశ్వర్యములతో మిక్కిలి వేగమున హిమవంతమున కేఁగి పరమేశ్వరుని తపోవనమును బ్రవేశించెను. ఆ క్షణమే - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు ; పుష్పరథారూఢుఁడు - పుష్పరథమును ఆరూఢుఁడు (ఆరోహించినవాఁడు) - ద్వితీయా తత్పురుషము. తపస్ + వనము = తపః + వనము - తపోవనము. చూడు పూర్వవ్యాఖ్య. చొత్తెంచె- చొచ్చు + తెంచె-చూడు పూర్వవ్యాఖ్య.

మ. వలరాజానతిఁ బిల్చి' వేగమెయి నీ వాసంతికానంద దో
హల మీ కాననలక్ష్మి కిమ్మనుడు నాహ్లాదంబుతో నెయ్య మ
గ్గలమైయుండ వసంతకుండు దమపైఁ గన్విడ్డఁ గారాకు గెం
ధలిరాకయ్యెనొ నాఁ చలిర్చె పడిఁ గాంతారాంతరోర్వీజముల్. 85

అర్థము : వలరాజు = వలపు + రాజు = మన్మథుఁడు, ఆమనిన్ = వసంతుని, పిల్చి, వేగమెయిన్ = వేగముగా, నీ వాసంతిక + ఆనంద + ఉత్సాహము = నీయొక్క, వసంతసంబంధమైన ఆనందోత్సాహమును, ఈ వనవ - లక్ష్మికిన్ = ఈ వనలక్ష్మికి, ఇమ్ము, అనుడున్ = అనినంతనే, వసంతుండును = వసంతుఁడును, ఆహ్లాదంబుతోన్ = సంతోషముతో, నెయ్యము = స్నేహము, అధికము + ఐ = అధికము, ఉండఁగన్ = ఉండఁగా, తనపైన్, కన్ను + ఇడఁగన్ = కన్నువెట్టఁగా, కారాకు = పండుటాకు, కెందలిరాకు = ఎఱ్ఱని చివురాకు, అయ్యెనా, నాన్ = అనఁగా, వడిన్ = వేగముగా, కాంతార + అంతర + ఉర్వీజములు = వనము లోపలి చెట్లు, తలిర్చెన్ = చివురించెను.

తాత్పర్యము : మన్మథుఁడు వసంతుని, పిలిచి 'శీఘ్రముగా నీ వనలక్ష్మికి నీ వాసంతానందోత్సాహము ని' మ్మనినంతనే యతఁడు సంతోషముతో స్నేహ మధికముకాఁగాఁ దనపైఁ గన్నువెట్టఁగా పండుటాకు కెంజిగురాకయ్యెనా యనునట్లు వేగముగా వనమునందలిచెట్లు చివురించెను.

విశేషములు : వేగ - (వికృతి) - వేగము (ప్రకృతి) - వేగమెయిన్. 'జడపదంబులమీఁది తోడకు మెయి పై లు వికల్పంబుగ నగు.' ప్రౌఢ.శబ్ద.18. నెయ్యము (వికృతి) - స్నేహము (ప్రకృతి), కెందలిరాకు-కెంపు + తలిరు + ఆకు, 'సమాసంబునం బ్రాంతాదుల తొలియచ్చుమీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు.' బాల.సంధి, 36. కె + తలిరు + ఆకు. 'లుప్తశేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమం బగు.' బాల.సం.37 కె+ ను + తలిరు + ఆకు. ద్రుతకార్యము (బాల.సంధి.16,17) చే కెందలిరు + ఆకు. 'కర్మధారయంబునందుఁ బేర్వాదిశబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాష నగు' బాల.సంధి.29. కెందలిరాకు, కారాకు కెందలిరాకయ్యెనొ నాన్-అలంకారము ఉత్ప్రేక్ష, ఇడన్-'పద్యాదుల నవర్ణకంబున కత్వంబును గసడదవలకు ద్విత్వంబును విభాష నగు.' బాల.క్రియ.51.

క. తన సూడగు ధనదదిశాం
గన నిముఁ డొడఁగూడఁ బోక గని యామ్యదిశాం
గన నొచ్చి వెచ్చనూర్చెనొ
యన శిశిర విముక్త దక్షిణానిల మెసఁగెన్. 86

అర్థము : తన - సూడు + అగు = తన శత్రువగు, ధనద - దిశా + అంగనన్ = కుబేరుని దిక్కగు ఉత్తర దిక్కనెడుస్త్రీని, ఇనుఁడు=సూర్యుఁడు, భర్త, ఒడఁగూడన్+పోక = కలియఁబోవుట, కని = చూచి, యామ్య - దిశా + అంగన= దక్షిణదిక్కనెడు స్త్రీ, నొచ్చి = బాధపడి, వెచ్చన్ + ఊర్చెనో = వేఁడిగా నిట్టూర్చెనో, అనన్, శిశిర - విముక్త - దక్షిణ + అనిలము = శిశిరర్తువుచే - చల్లఁదనముచే - విడువఁబడిన, దక్షిణపు గాలి - మలయమారుతము, ఎసఁగెన్ = అతిశయించెను.

తాత్పర్యము: అంత ఉత్తరాయణము వచ్చుటయు, మలయమారుతమువీవఁ దొడఁగుటయు జరగెను. అప్పుడు సూర్యుఁడు దక్షిణాయనకాలమును విడిచి ఉత్తర దిక్కునకుఁబోవఁదొడఁగఁగానే, దక్షిణదిక్కు మలయమారుతమును ప్రేరణచేసెను, అది - ఒక నాయకుఁడు తన నాయికయగు దక్షిణదిగంగనను విడిచి, కుబేరుని (ధనవంతుని) దిక్కనెడు ఉత్తర దిగంగనను గూడఁబోవుట చూచి దక్షిణదిక్సతి బాధపడి వేఁడినిట్టూర్పు విడ్చెనా యనునట్లుండెను.

విశేషములు : తన సూడు=దక్షిణదిక్సతికి సపత్నిగావున నుత్తర దిక్సతి పగతురాలు. ధనద-దిశాంగన-కుబేరదిక్కు-ఉత్తరదిక్కు, ఉత్తరదిక్కనెడుస్త్రీ.ధనవంతుఁడైన అన్యుని స్త్రీ. ఇనుఁడు=సూర్యుఁడు-నాయకుఁడు, యామ్య=యమసంబంధమైన. దక్షిణదిక్కు, వెచ్చనూర్చెనో. - వేఁడిగా నిట్టూర్చెనో శిశిరర్తువుపోయి వసంతము రాఁగానే గాలి చల్లఁదనములేక యించుక వేఁడిగా నుండును. ధనద - ఇనశబ్దములలో నలంకారము శ్లేషము, దిశాంగన - దిశ యనెడు అంగన - రూపకము. వీనిచే నుత్ప్రేక్షాలంకార ముత్థాపితమైనది. ప్రస్తుతమైన - దక్షిణాయనము ముగిసి ఉత్తరాయణము వచ్చె నని చెప్పినప్పు డప్రస్తుతమైన తన నాయికనువిడిచి యన్యనాయికయం దాసక్తుఁడైన యొక నాయకుని వృత్తాంతము తెలియుచున్నది. కావున సమాసోక్తియు. ఈ పద్యము భావము కాళిదాసకుమారసంభవమునందలి శ్లోకముభావము ననుసరించినది -

'కుబేరగుప్తాం దిశ ముష్ణరశ్మౌ
గన్తుం ప్రవృత్తే సమయం విలఙ్ఘ్య,
దిగ్దక్షిణా గన్ధవహం ముఖేన
వ్యలీక నిశ్వాస మి వోత్ససర్జ.' కుమా.3.25.

వ. మలయసమీరణాభిహతి భ్రూజముల నాకులు డుల్లిడుల్లి, క్రొమ్మొలకలు సాఁగిసాఁగి, విరిమోసులఁ గెందలి రొత్తియొత్తి, కుట్మలములు క్రమ్మిక్రమ్మి, కుసుమంబులు వాసనకెక్కియెక్కి, గుత్తులుగొని పండిపండి, వినుతులఁ దగ నారము లొప్పె నామనిన్. 87

అర్థము: మలయ - సమీరణ + అభిహతిన్ = మలయమారుతము యొక్క (దక్షిణానిలము) దెబ్బచేత, భ్రూజములన్ = చెట్లయందు, ఆకులు డుల్లి డుల్లి = రాలిరాలి, క్రొమ్మొలకలు (క్రొత్త + మొలకలు) = నూతనాంకురములు, సాఁగి సాఁగి = మిక్కిలి వ్యాపించి, విరి - మోసులన్ = పూలమొక్కలయందు, కెందలిరు (కెంపు + తలిరు) = ఎఱ్ఱనిచివురు, ఒత్తి - ఒత్తి = మిక్కిలి దట్టమయి, కుట్మలములు = మొగ్గలు, క్రమ్మి - క్రమ్మి = మిక్కిలివ్యాపించి, కుసుమంబులు = పుష్పములు, వాసనకున్ = పరిమళమునకు, ఎక్కి - ఎక్కి - పరిమళము అతిశయించి, గుత్తులు + కొని, పండి - పండి = గుత్తులుగా మిక్కిలి పండి, వినుతుల్ = పొగడ్తలు, తగన్ = ఒప్పఁగా, ఆమనిన్ = వసంతమున, ఆరములు = ఆరామములు, ఒప్పెన్.

తాత్పర్యము: మలయమారుతపుదెబ్బచేఁ జెట్లయం దాకులు రాలి రాలి, నూతనాంకురములు సాఁగిసాఁగి, పూలమొలకలఁ జివురాకులు ఒత్తి యొత్తి, మొగ్గలు క్రమ్మిక్రమ్మి, పూవులు వాసన యెక్కియెక్కి, గుత్తులు పండిపండి వసంతమునఁ బొగడ్తకుఁ దగినట్లు ఆరామము లొప్పెను.

విశేషములు: డుల్లిడుల్లి, సాఁగిసాఁగి మున్నగు ద్విరుక్తులు అత్యంతార్థమున నైనవి. 'అత్యంతార్థంబునందు నగు.' ప్రౌఢ.శబ్ద. 112, భ్రూజములు - భ్రూజము + లు. 'కలన్వాదుల నువర్ణంబు లుప్తంబగు; బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు.' బాల. అచ్చిక. 18. భ్రూ + కుజ్ + లు - '[illegible]' బాల. తత్సమ. 19. భ్రూఁకులు. క్రొమ్మొలకలు - క్రొత్త + మొలకలు - 'సమాసంబునం బ్రాంతాదుల తొలియచ్చుమీఁది వర్ణంబులెల్ల లోపంబు బహుళంబుగా నగు.' బాల. సంధి. 36. క్రొ + మొలకలు. 'క్రొత్తశబ్దమున కాద్యక్షర శేషంబునకుం గొన్నియెడల ముగాగమంబునుం గొన్నియెడల మీఁదిహల్లునకు ద్విత్వంబు నగు.' బాల. సంధి. 38. క్రొమ్మొలకలు. ఆరము (వికృతి) - ఆరామము (ప్రకృతి) ఈ శబ్దమున కిందే ప్రయోగాంతరము - 5 - 82.

క. ఘోరన నంకుర పల్లవ
కోరక పుష్ప ఫల వితతిఁ గొమ రమరి మనో
హారములై సారములై
యారామము లొప్పె మధు సమాగమ వేళన్. 88

అర్థము : మధు - సమాగమ - వేళన్ = వసంతాగమసమయమున, ఆరామములు = వనములు. ఘోరనన్ = శీఘ్రముగా (బోరనన్), అంకుర - పల్లవ - కోరక - పుష్ప - ఫల - వితతిన్ = మొలకలయు, చివురులయు, మొగ్గలయు, పూవులయు, పండ్లయు సమూహముతో, కొమరు = అందము, అమరి = ఒప్పి, మనస్ (ః) + హారములు + ఐ = మనస్సును హరించునవియై - మనసు నాకర్షించునవియై, సారములు + ఐ = శ్రేష్ఠములయి, ఒప్పెన్.

తాత్పర్యము : వసంతాగమసమయమున శీఘ్రముగా మొలకలయు, చివురులయు, మొగ్గలయు, పూవులయు, ఫలములయు సమూహముతో, సుందరములయి మనస్సును హరించునవియై శ్రేష్ఠములై వనము లొప్పెను.

విశేషములు : ఆరామము లొప్పె మధుసమాగమవేళన్ - ప్రాదియతి.

సీ. వేదన విరహులు వేదలు వేడీ సంధి
లెడలంగఁ బల్లాకు లెడలెఁ దరుల;
కౌగిల్లు కవల మేఁదీగలఁ బులకంబు
లంకురింపఁగఁ దరు లంకురించె;
సమ్మదంబునఁ గామిజనుల చిత్తంబులు
చిగురొత్తఁ దరులందుఁ జిగురు లొత్తె;
రతి దోహలముల దంపతుల ముఖాబ్జముల్
వికసిల్ల వికసిల్లె విరులు తరుల;
ఆ. నెలమిఁ బులకపిండు తొలుమేనఁ జేసిన,
తపము పండఁ బండెఁ దరు వనంబు;
లువిద లింపు మిగుల నోయల పాటలు
వాత మధు మదమునఁ బాడె నళులు. 89

అర్థము : విరహులు = వియోగులు, వేదనన్ = బాధచే, వేఁడలు + చెడి = అలసట లతిశయించి, సంధులు = కీళ్లు, ఎడలంగన్ = సడలఁగా, తరులన్ = చెట్లనుండి, పల్లాకులు = పండుటాకులు, ఎడలెన్ = రాలెను.

రాగిల్లు = అనురక్తినొందు, కవల = దంపతులయొక్క, మేఁదీగలన్ = తీఁగెలవంటి మేనులందు, పులకంబులు = గగురు, అంకురింపఁగన్ = పుట్టఁగా, తరులు = చెట్లు, అంకురించెన్ = మొలకెత్తెను.

కామి - జనుల - చిత్తంబులు = కాముకులైన జనుల మనస్సులు, సమ్మదంబునన్ = సంతోషముతో, చిగురు + ఒత్తన్ = పల్లవింపఁగా - సంతసింపఁగా, తరులందున్ = చెట్లయందు, చిగురులు + ఒత్తెన్ = చివురులు కలిగెను.

రతి - దోహలములన్ = సంభోగోత్సాహములచేత, దంపతుల, ముఖ + అబ్జముల్ = తామరలవంటి ముఖములు, వికసిల్లన్ = వికాసమునొందఁగా, తరులన్, విరులు = పూలు, వికసిల్లెన్ = వికసించెను.

ఎలమిన్ = ప్రీతితో, చిలుక - పిండు = చిలుకల గుంపు, తొలి - చేసన్ = పూర్వజన్మమున, చేసిన, తపము, పండన్ = ఫలింపఁగా, తరు-వనంబులు = చెట్ల తోఁటలు, పండెన్.

ఉవిదలు = యువతులు, ఇంపు - మిగులన్ = ఆనంద మతిశయింపఁగా, ఓయల - పాటలు, = శృంగారపుఁబాటలు, పాడన్. అలులు = తుమ్మెదలు, మధు-మదమునన్ = పూఁదేనె (మద్యము) వలని - క్రొవ్వుచే, పాడెన్.

తాత్పర్యము : వియోగులు విరహవేదనచే నలసట నతిశయించి కీళ్లు సడలఁగాఁ జెట్లనుండి పండుటాకులు రాలెను. అనురక్తులైన దంపతుల మేఁదీవలందు గగురుపాటు పుట్టఁగాఁ జెట్లు మొలకలెత్తెను. కాముకజనుల మనస్సులు సంతోషమునఁ బల్లవింపఁగాఁ జెట్లయందుఁ జివురులు గలిగెను. సంభోగోత్సాహములచే దంపతుల మోముఁదామరలు వికసింపఁగాఁ జెట్లయందుఁ బూలు వికసించెను. చిలుకలగుంపు ప్రీతితోఁ బూర్వజన్మమునందుఁజేసిన తపము ఫలింపఁగాఁ జెట్లతోఁటలు పండెను. యువతు లానందాతిశయముతో నోయలపాటలు పాడఁగా, మధుమదముతోఁ దుమ్మెదలు పాడెను.

విశేషములు : సేద (వికృతి) - స్వేదము (ప్రకృతి). సేదలుసెడి-చెడు ధాతువు తుమున్నంత మయినప్పుడు 'మిక్కిలి' యనునర్థము నిచ్చును. (సూ.ని) అంయచే నిటఁ డుముస్నంతముగా కున్నను అతిశయించి యను నర్థము చెప్పఁబడినది. అలంకారము సహోక్తి. తరులు - తరువులు - 'వువర్ణకేతర విభక్తి పరమగుచో సుకారాంతంబులకు బహుళంబుగా గోశబ్దంబునకు నిత్యంబుగా వుగాగమంబగు.' బాల. తత్సమ.49. పల్లాకు లెడలెఁ దరుల - తరులవలన నుండి పల్లాకు లెడలె- 'ఉండిశబ్దము పరంబగు నప్పుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగ నగు' - బాల. కారక. 11. వలన కాదేశంబగు ద్వితీయాసప్తములమీఁది యుండికి లోపంబు బహుళంబుగా నగు, ప్రౌఢ.కారక. 11.

క. మదను తలిరెల్లులో యనఁ
బొదిగొని కెందలిరు లెసఁగె భూరుహములపైఁ;
నొదవెడు రాగాంబుధి బు
ద్బుదములు నా నెసఁగె ముకుళములు తోరములై. 90

అర్థము : మదను = మన్మథునియొక్క, తలిరు + ఎల్లులో + అనన్= చివురుగొడుగులో యనఁగా, భూరుహములపైన్ = చెట్లమీఁద, పొదిగొని = చుట్టుకొని. కెందలిరులు (కెంపు + తలిరులు) = ఎఱ్ఱని చివురులు, ఎసఁగెన్ = అతిశయించెను, ఒదవెడు = పుట్టునట్టి, రాగ + అంబుధి-బుద్బుదములు - నాన్ = అను రాగమనెడి సముద్రముయొక్క బుడగలు అనఁగా, ముకుళములు = మొగ్గలు, తోరములు + ఐ = ఎక్కువయి, ఎసఁగెన్ = ఒప్పెను.

తాత్పర్యము ; మన్మథుని చివురుగొడుగులో యనునట్లు చెట్లపై నంతటను ఎఱ్ఱనిచివురు లతిశయించెను. అనురాగమనెడి సముద్రపు బుడగలో యనునట్లు మొగ్గలు అధికముగా నొప్పెను.

విశేషములు : మదను .... భూరుహములపై - ఉత్ప్రేక్ష. ఒదవెడు .... బుద్బుదములు నాన్ - ఉత్ప్రేక్ష. రాగాంబుధి = రాగమనెడి అంబుధి యనుటచే రూపకానుప్రాణితము. తలిరెల్లులు - తలిరు + ఎల్లి + లు = 'కర్మధారయంబునందుఁ బేర్వాదిశబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాష నగు.'

బాల. సంధి. 33. 'ఉత్తున కచ్చు పరంబగునప్పుడు సంధి యగు' బాల. సంధి. 1. దరిద్రెన్ + ఉ. 'ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వం బగు.' బాల. ప్రత్య. 45. దరిచెల్లలు. కెంపదిపలు - కెంపు + తలిరులు 'సమాసంబులం బ్రాంతాదుల తొలియచ్చుమీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు.' బాల. సంధి. 64. కె + తలిరులు. 'లుప్తశేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమం బగు.' బాల. సంధి. 37. కె + ను + తలిరులు - ద్రుతకార్యముచే (బాల. సంధి. 16, 17) కెందళిరులు, తోరము (వికృతి) - స్థూలము (ప్రకృతి).

ఉ. పొన్నలు పూచెఁ, బొన్న లొగిఁ బూవకముందఱఁ బూచె గోఁగు, లా
పొన్నలుఁ గొండగోఁగులును బూవకముందఱఁ బూచె బూరువుల్,
పొన్నలుఁ గొండగోఁగులును బూరువు లొప్పుగఁ బూవకుండఁగా
మున్న వనంబునం గలయ మోదుగు లొప్పుగఁ బూచె నామనిన్. 91

అర్థము : ఆమనిన్ = వసంతమునందు, పొన్నలు = పున్నాగములు, పూచెన్, పొన్నలు, ఒగిన్ = క్రమముగా, పూవకముందఱన్ = పూచుటకు ముందు, గోఁగులు=కొండగోఁగులు - కర్ణికారములు, పూచెన్, ఆ - పొన్నలున్, కొండగోఁగులును, పూవక - ముందఱన్, బూరువుల్ = బూరుగులు - శాల్మలులు, పూచెన్, పొన్నలున్, కొండగోఁగులును, బూరువులున్, ఒగిన్, పూవక + ఉండఁగాన్, మున్న + అ = ముందే, వనంబునన్ = వనమునందు, కలయన్ = అంతటను, మోదుగులు = కింశుకములు, ఒప్పుగన్, పూచెన్.

తాత్పర్యము : వసంతమునఁ బొన్నలు పూచెను. పొన్నలు పూచుటకు ముందు కొండగోఁగులు పూచెను. పొన్నలును, కొండగోఁగులును పూచుటకు ముందు బూరువులు పూచెను. పొన్నలును కొండగోఁగులును, బూరువులును పూచుటకుముందు వనమునందంతటను మోదుగులు పూచెను.

విశేషములు : మోదుగులు, బూరువులు, కొండగోఁగులు, పొన్నలు- ఇది అవి పూచిన క్రమము. అన్నిటికంటెఁ జివరఁ బూచినవానితో మొదలిడి క్రమముగా మొదటఁ బూచినవానిని జెప్పిన పద్ధతి రమ్యముగా నున్నది.

పూవక, పూచు ధాతువు. 'కజీ వ్యతిరేక క్త్వార్థంబునం దగు.' బాల. క్రియ, 39. పూచు + కజీ, 'ముజ్జీత్తులు ముత్తు నా(బడు,' బాల. క్రియ. 86. 'ఆగమాన్యచతా రంబులి కద్విరుక్తంబులకు ముత్తు పరంబగునప్పుడు ప వ లగు' బాల, క్రియ. 88. పూవు + కజీ, 'జీత్తు పరంబగునప్పు డుత్వంబున కత్వంబగు.' బాల. క్రియ. 20. పూవక. పూవక ముందఱ, 'కజీ వర్ణకంబు పురార్థయోగంబున విభాషను భావంబునం దగు.' బాల. క్రియ, 36.

క. భావజవిభుఁ డలి శుక పిక
సేవకతతి కెడరు దీర జీతము సేయం
గా వెలిఁ బోసిన పసిఁడుల
ప్రోవులు నాఁ దమ్మి లెలమిఁ బూచె బెడంగై. 92

అర్థము : భావజ - విభుఁడు = మన్మథుఁడను రాజు, అలి - శుక - పిక - సేవక - తతికిన్ = తుమ్మెదలు, చిలుకలు- కోకిలములు అనెడి సేవకుల సమూహము నకు, ఎడరు - తీరన్ = కష్టము తీఱునట్లు, జీతము + చేయంగాన్ = వేతన మిచ్చుటకు, వెలిన్ = బయట, పోసిన—పోసినట్టి. పసిఁడుల - ప్రోవులు - నాన్ = బంగరుల రాశులు అనఁగా, తమ్ములు = తామరలు, ఎలమిన్ = ప్రీతితో, బెడంగు + ఐ = అందమయి, పూచెన్ = వికసించెను.

తాత్పర్యము : మన్మథుఁ డనెడి ప్రభువు తుమ్మెదలు, చిలుకలు, కోకిల ములు అను సేవకుల సమూహమునకుఁ గష్టము తీఱునట్లు వేతన మిచ్చుటకు బయటఁ బోసిన బంగరురాశులో యనఁ దామరలు ప్రీతితో నందముగా వికసించెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష, అది - భావజ - విభుఁడు - భావజుఁ డనెడి విభుఁ డనుటచేతను, అలి - శుక - పిక - సేవక తతికిన్ - అలులు, శుకములు, పికములు అను సేవకతతికి అనుటచేతను రూపకానుప్రాణితము.

క. నలి మొగ్గలు విరిపువ్వులు
సలలితమయి చూడనొప్పెఁ జనుపక మత్యు
జ్జ్వలరుచి రేవగ లాఱక
వెలిఁగెడు నుద్దీప దీపవృక్షము వోలెన్. 93

అర్థము : నలినన్ = ఒప్పుగా, మొగ్గలు, వికచ - పుష్పములు = వికసించిన పుష్పములు, సలలితము + అయి = మనోహరమయి, చంపకము - సంపెఁగిచెట్టు, అతి + ఉజ్జ్వల - రుచిన్ = మిక్కిలి ప్రకాశించు కాంతితో, రేపగలు = రే + పగలు = రేయుంబవళ్లు, ఆఱక = ఆఱిపోవక, వెలిఁగెడు = ప్రకాశించునట్టి, ఉద్దీప - దీప - వృక్షము + పోలెన్ = వెలుఁగునట్టి దీపమనెడి వృక్షమువలె, చూడన్, ఒప్పెన్,

తాత్పర్యము : మొగ్గలు. వికసించిన పుష్పములు మనోహరమయి, సంపెఁగ వృక్షము మిక్కిలి ప్రకాశించుకాంతితో రేయుంబవళ్లు ఆఱిపోవక వెలుఁగు దీపమనెడి వృక్షమువలెఁ జూడ నొప్పెను,

విశేషములు : దీప వృక్షము - దీపమనెడి వృక్షము - రూపకము, రూపకాను ప్రాణితమైన ఉత్ప్రేక్ష, చనుపకము (వికృతి) - చంపకము (ప్రకృతి) అతి+ఉజ్జ్వల- అత్యుజ్జ్వల - యణాదేశసంధి.

తే. పొలిచె మధువేళఁ గంకేళి పూచి భృంగ
పరివృతమ్మై మనోజుండు పాంథతతికి
నాభిచారంబు వేల్చు కుండాంతరమునఁ
దగిలి కామాగ్ని పొగలతో నెగయునట్లు. 94

అర్థము ; మధు , వేళన్ = వసంతసమయమున, కంకేళి = అశోకము, పూచి = పుష్పించి, భృంగ - పరివృతమ్ము + ఐ = తుమ్మెదలచేఁ జుట్టుకొనఁబడినదయి, మనోజుండు = మన్మథుఁడు, పాంథ - తతికిన్ = విరహుల సమూహమునకు. అభిచారంబు - వేల్చు = శత్రుమారణ వశీకరణాదులకు సాధనముగా హోమముచేయునట్టి, కుండ + అంతరమునన్ = గుండములోపల, తగిలి = సక్తమయి, కామ + అగ్ని = మన్మథుఁడనెడి అగ్ని, పొగలతోన్, నెగయు + అట్లు = పైకి వచ్చునట్లు, పొలిచెన్ = ఒప్పెను.

తాత్పర్యము : వసంతసమయమున అశోకవృక్షము పుష్పించి తుమ్మెదలతోఁ జుట్టుకొనఁబడినదయి, మన్మథుఁడు వియోగిజనుల హింపింప హోమముచేయు కుండము లోపలనుండి మన్మథుఁడనెడి అగ్ని పొగలతోఁ బైకి వచ్చుచున్నదా యనునట్లు ఒప్పెను.

విశేషములు: అలంకారము—ఉత్ప్రేక్ష. అశోకము పూచి యెఱ్ఱగా నగ్నివలెను, దానిని జుట్టుకొన్న తుమ్మెదలు నల్లనిపై పొగలవలెను నుండెను, కామాగ్ని - కాముఁడనెడి అగ్ని - రూపకము. రూపకానుప్రాణితోత్ప్రేక్ష. కుండము (ప్రకృతి)- గుండము (వికృతి) = నిప్పుల గుంట.

క. విరహుల హృదయంబులు జ
ర్జరితంబులు చేసి మరుఁడు శరశస్త్రము లా
సురవృత్తిఁ బెఱికి పట్టిన
కరణిం గర మొప్పె నయణ కరవీరంబుల్. 95

అర్థము: మరుఁడు = మన్మథుఁడు, విరహుల - హృదయంబులు = వియోగుల హృదయములను, జర్జరితంబులు + చేసి = తూంట్లు పడినవిగాఁజేసి, శర - శస్త్రములు = బాణములను, శస్త్రములను, ఆసుర - వృత్తిన్ = రాక్షసముగా-క్రూరముగా, పెఱికి = ఊడలాగి, పట్టిన, కరణిన్ = విధమున, అయణ - కరవీరంబుల్ = ఎఱ్ఱ గన్నేరులు అనెడు కత్తులు, కరము + ఒప్పెన్ = మిక్కిలి ఒప్పెను.

తాత్పర్యము: మన్మథుఁడు వియోగిజనుల హృదయములను చిల్లులుపడఁజేసి, అంప గ్రుచ్చుకొన్న అస్త్రశస్త్రములను క్రూరముగా నూడఁబెఱికి పట్టినవిధమున నెఱ్ఱగన్నేరులు అనెడి కత్తులు మిక్కిలి యొప్పెను.

విశేషములు: అలంకారము—ఉత్ప్రేక్ష. కరవీరములు = గన్నేరులు, కత్తులు - శ్లిష్టరూపకము. మరుఁడు (వికృతి) - స్మరుఁడు (ప్రకృతి)

క. నునుపగు నలిగానము విని
వనదేవత కరము మెచ్చి వానికి నొసఁగం
జనఁ బైఁడుల విడియలు పు
చ్చిన విధమునఁ బొన్న లెలమిఁ జెలువుగఁ బూచెన్. 96

అర్థము: నునుపు + అగు = మనోహరమైన, అలి-గానము = తుమ్మెదల సంగీతము, విని, వన - దేవత, కరమున్ = మిక్కిలి, మెచ్చి, వానికిన్ =

[illegible], పరఁగన్ = ఒప్పుటకు, [illegible] = [illegible], [illegible] విడియము = బంగారుపూతి తాంబూలములు. [illegible] = [illegible], [illegible] = [illegible], [illegible] = [illegible], [illegible] = [illegible], [illegible] = అందముగా, పూచెన్.

తాత్పర్యము: మనోహరమగు [illegible] మెప్పి [illegible] బంగారుపూతి తాంబూలము ([illegible]) పంపిన విధమునఁ బున్నాగములు అందముగాఁ బూచెను.

విశేషములు: అలంకారము ఉత్ప్రేక్ష, [illegible] = [illegible] తాంబూలము. 'విడియంతో [illegible]' [illegible] తాంబూల మనుటకు - 'అడిగిన మాటల విడియము [illegible]'. [illegible].

క. సురపొన్నలపైఁ బ్రాఁకిన
గురువిందలు ననలఁ బెరిఁగి కొమ రమరె రతీ
శ్వరునకు వసంతుఁ డను నొస
పరి చేసిన ముత్తియంపు పందిరి వోలెన్, 97

అర్థము: సురపొన్నలపైన్ = సురపొన్నలను పేరుగల వృక్షముల మీఁద, ప్రాఁకిన = అల్లుకొన్న, గురువిందలు = గురువింద తీఁగలు, ననలన్ = పూలతో, పెరిఁగి, రతి + ఈశ్వరునకున్ = రతి భర్తయైన మన్మథునకు, వసంతుఁడు + అను = వసంతుఁడనెడి, ఒసపరి = శిల్పి, చేసిన, ముత్తియము - పందిరి + పోలెన్ = ముత్యాలపందిరి వలెను, కొమరు + అమరెన్ = అందగించెను.

తాత్పర్యము: సురపొన్నచెట్లపై ప్రాకిన గురువిందలు పూలతో వృద్ధిచెంది మన్మథునకు వసంతుఁ డను శిల్పి చేసిన ముత్యాల పందిరి వలె నందగించెను.

విశేషములు: వసంతుఁడను నొసపరి - వసంతుఁడనెడి ఒసపరి - రూపకము. రూపకానుప్రాణితమైన ఉత్ప్రేక్షాలంకారము.

క. మారు జయలక్ష్మి. మలయ స
మీరుని పైఁ బూఁత, మధుసమృద్ధికి నురు శృం
గారం బనఁదగు నన సహ
కారముఁ గురవకముఁ గర్ణికారముఁ బూచెన్. 98

అర్థము : మారు - జయ లక్ష్మి = మన్మథుని విజయమనెడు లక్ష్మి, మలయ - సమీరుని పైన్ = మలయానిలుని పై, పూఁత = అంగరాగము, మధు - సమృద్ధికిన్ = వసంతుని సమృద్ధికి, ఉరు - శృంగారంబు = గొప్ప యలంకారము, అనన్ + తగున్ + అనన్ = అనఁదగునట్లు, సహకారమున్ = తియ్యమామిడియును, కురవకమున్ = ఎఱ్ఱగోరంటయును, కర్ణికారమున్ = కొండగోఁగును, పూచెన్ = పుష్పించెను

తాత్పర్యము : మన్మథుని విజయలక్ష్మి, మలయానిలుని పైఁబూఁత, వసంతుని సామ్రాజ్యమున కలంకారముగా నుండుననఁ, దియ్యమామిడియు, ఎఱ్ఱగోరంటయుఁ, గొండగోఁగును బూచెను.

విశేషములు : అలంకారము యథాసంఖ్యము. సహకారము పూచుట మారు జయలక్ష్మివలెను, కురవకము పూఁత మలయానిలుని మైపూఁతవలెను, గర్ణికారము పూచుట వసంతున కలంకారమువలెను నుండెనని భావము.

చ. మొగడలు వజ్రముల్, విరులు ముత్తెము, లింపగు నున్నుఁగెంపు లేఁ
జిగురులు పద్మరాగములు, చిల్కలు వైరిజరాజి. తుమ్మెదల్
నగరిపునీలజాలములు, నాఁ దలరారె వసంతవల్లభుం
డగు వలరాజు పంచమణిహర్మ్యములో యనఁ జూతభూజముల్. 99

అర్థము : మొగడలు = మొగ్గలు, వజ్రముల్, విరులు = పూలు, ముత్తెములు = ముత్యములు, ఇంపు + అగు = ప్రియమగు, నున్న + కెంపు = మనోహరమైన యెఱుపుగల, లేఁజిగురులు (లేఁత + చిగురులు), పద్మరాగములు = పద్మరాగమణులు, చిల్కలు = చిలుకలు, వైరిజ-రాజి = వైడూర్యములయొక్క సమూహము, (గరుడపచ్చల సమూహము) తుమ్మెదల్, నగ-రిపు-నీల- జాలములు = ఇంద్రనీలమణుల సమూహములు, నాన్ = అనఁగా, చూత - భూజముల్ = మామిడి

చెట్టు, వసంత - వల్లభుండు = వసంత ప్రియుఁడు, అగు. వలరాజు = మన్మథుని యొక్క, పంచ - మణి - హర్మ్యములు + కిన్ + అనన్ = అయిదు మణులచే (వజ్రములు, ముత్యములు, పద్మరాగములు, గరుడపచ్చలు, ఇంద్రనీలములు) నిర్మింపఁబడిన, మేడలో యనునట్లు, తలరారెన్ = తనరారెను - ఒప్పెను.

తాత్పర్యము: మొగ్గలు వజ్రములును, పూలు ముత్యములును, మనోహరములైన లేఁజివురులు పద్మరాగములును, పిందెలు గరుడపచ్చలును, తుమ్మెదలు ఇంద్రనీలములును గాఁగా మామిడిచెట్టు వసంత ప్రియుఁడగు మన్మథుని పంచమణినిర్మిత హర్మ్యములో యనున ట్లొప్పెను.

విశేషములు : మొగడలే వజ్రములు, విరులే ముత్తెములు, లేఁజివుళ్లే పద్మరాగములు. పిందెలే గరుడపచ్చలు, తుమ్మెదలే యింద్రనీలమణులు అయినట్లు చెప్పుటచే రూపకము. మామిడులు మన్మథుని పంచమణిహర్మ్యములో యనునట్లున్నవని చెప్పుటచే రూపకానుప్రాణితమైన ఉత్ప్రేక్షాలంకారము. పైఁడిరాయి = గరుడపచ్చల సమూహము. లేఁజిగురులు - లేఁత + చిగురులు. తాఁతాదిసూత్రముచే (బాల. సంధి. [illegible]) తొలియచ్చుమీఁది వర్ణములకు లోపము. లే + చిగురులు, [illegible] సరళ ములు పరమగా నుగాగమప్రాప్తి (బాల. సంధి. 67) లే + ను + చిగురులు [illegible] కార్యము (బాల. సంధి. 16, 17) చేత లేఁజిగురులు.

క. చను నున్మదన, మదన, మో
హన, సంతాపన, వశీకరాస్త్రము లన హృ
జ్జనునకు నంకుర పల్లవ
ఘనకోరక పుష్ప ఫల నికర మామ్రములన్. 100

అర్థము : ఆమ్రములన్ = మామిడులందు, అంకుర .... నికరము, అంకుర = మొలకలయు, పల్లవ = చివురులయు, ఘన - కోరక = పెద్ద మొగ్గలయు, పుష్ప = పూవులయు, ఫల = పండ్లయు, నికరము = సమూహము, హృజ్జనునకున్ (హృద్ + జనునకున్) = మన్మథునకు, ఉన్మాదనము - మదన - మోహన - సంతాపన - వశీకర + అస్త్రములు = ఉన్మాదమును గలిగించునవియు, మత్తుగలిగించునవియు, మోహమును బుట్టించునవియు, అధికతాపమును గలిగించునవియు, వశముచేసికొనునట్టియు బాణములు, అనన్ = అనఁగా, చనున్ - ఒప్పును,

తాత్పర్యము: ఆమ్రవృక్షమునందలి అంకురములు, పల్లవములు, మొగ్గలు, పూవులు, ఫలములు మన్మథునకు - ఉన్మాదమును గలిగించునట్టియు మత్తుగలిగించునట్టియు, మోహమును బుట్టించునట్టియు, అధికతాపమును గలిగించునట్టియు. వశము చేసికొనునట్టియు అస్త్రములు.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష.

హృచ్ఛయము = హృత్ + శయము. సకార తవర్గములకు శవర్గ టవర్గము లతో పూర్వమందైనను పరమందైనను యోగిక గలుగునపుడు క్రమముగా శవర్గ టవర్గ వర్ణము లాదేశము లగును. యథాసంఖ్యాలంకారమును. అంకురములు ఉన్మాదనాస్త్రములు, పల్లవములు మదనాస్త్రములు, కోరకములు మోహనాస్త్రములు, పుష్పములు సంతాపనాస్త్రములు, ఫలములు వశీకరాస్త్రములు అని క్రమాన్వయము.

సీ. పలఁకెపు కారాకు లలితాస్థి చయముగా.
సోలుకొమ్మలు పలుకేలు గాఁగ,
వాల పల్లవములు వ్రేలు కెంజెఁగలుగాఁ,
బెనఁగు తీఁగలు వొడ్డ ఫణులు గాఁగఁ,
గలకంఠ నికరంబు గళమున కప్పుగాఁ,
బుప్పొడి మేని విభూతి గాఁగ,
ఫలములు వరదానఫలములుగా, నలి
మాలికల్ రుద్రాక్షమాలికలుగ,

ఆ. శంభుమూర్తిఁ దాల్చి సహకార భూరుహ
చక్రవర్తి నవ వసంతవేళ
నతిశయిల్లుచుండె నక్కడఁ గని మది
నుదరిపడి మనోజుఁ డోసరింప. 101

అర్థము : పలఁకెపు = వివర్ణమగు, కారాకు = పండుటాకు, లలిత + అస్థి-చయము + కాన్ = అందమైన ఎముకలప్రోవు కాఁగా, సోల - కొమ్మలు = వాలు కొమ్మలు, పలు - కేలు + కాఁగన్ = పెక్కు చేతులు కాఁగా,

నాలి - పల్లవములు = లేఁజివుళ్లు, వ్రేలు - కెంజెవలు + కాన్ = వ్రేలాని నట్టి మొగ్గని జవలు కాఁగా, పెనఁగొ - తీఁగలు = పెనవైచుకొను తీఁగలు. పెద్ది - పాములు + కాఁగన్ = పెద్ది పాములు కాఁగా.

కలకంఠ - నినదంబు = కోకిలముల సమూహము, నినము - కప్పురాన్ = కంఠమునందలి పుప్పి కాఁగా. పుప్పొడి, పూర - పరాగ + కాఁగన్ = శరీరము నందలి బూది కాఁగా.

ఫలములు = పండ్లు, పరి - పాక - ఫలములు + కాన్ = పరిపాక యాప్యంపలిని ఫలములు కాఁగా, అలి - మాలికల్ = తుమ్మెదల పంక్తులు, రుద్రాక్ష - మాలికలు + కన్ = రుద్రాక్షమాలలు కాఁగా,

అక్కజ - వనిన్ = శివుని తపోవనమున, నవ - వసంత - వేళన్ = నూతన వసంత సమయమున, మనోజుఁడు = మన్మథుఁడు, చని = పోయి, మనిన్ = [illegible], ఉదరిపడి = ఉలికిపడి, ఊరింపన్ = [illegible] కాంతిగాఁ, సమాధి - నిరూఢ - వర్తనిన్ = తపమాచరించుచున్న వర్తనిన్, శంభు - మూర్తిన్ = శివుని యాకారమును, తాల్చి = ధరించి, అరయుచుండెన్ + ఉండెన్ = చూచుచుండెను.

తాత్పర్యము : శివుని తపోవనమున నూతన వసంతకాలమున మన్మథుఁడు చూచి మనసునం దులికిపడి ప్రకాశించి [illegible], తపమాచరించుచున్న వర్తనిన్ - వంటి విష్ణుము లగుచున్న సంయమీశులు అలరుచున్నట్టి పమును ప్రోవ్వగను, వాలు కొమ్మలు పలుచెపలుగాను, లేఁజివుళులు వ్రేలు కెంజవలుగను, పెనవైచుకొను తీఁగలు పెద్దపాములుగను, కోకిలముల సమూహము కంఠమునందలి పుప్పిగను, పుప్పొడి మేని బూదిగను, పండ్లు పరిపాకఫలములుగను, తుమ్మెదలపంక్తులు రుద్రాక్షమాలలుగను. కాఁగా శివుని ఆకారము ధరించి చూచుచుండెను.

విశేషములు : అలంకారము. రూపకము కెంజెవలు = కెంపు + జెవలు - ప్రాంతాదిసూత్రము (బాల, సంధి. 38.) చే తొలియచ్చుమీఁది వర్ణములకెల్ల లోపము కాఁగా - కె + జెవలు, ఇచ్చట లుప్తశేషమునకుఁ బిందుషమును [illegible]ములగునప్పుడు మాత్రమే రావలసిన సున్నాయము నరకము [illegible] 'వర్ణయుక్తరేఫములు పరములగునప్పు డొకానొకచో ద్రుతమునకుఁ బూర్ణబిందువగును గానంబడియెడి.' (బాల,

సంధి,19) అనుసూత్రమువే కెంజెడలు అనియేర్పడెను, జడయను శబ్దమేగాని, జెడ యనునది నిఘంటువులఁ గానరాదు. పెనఁగు తీగలు దొత్త ఫణులు గాఁగ- న-జలకుఁ బ్రాసమైత్రి గమనింపఁదగినది. శివుఁ డెప్పటినో యుందు ననుకొనుచుండఁగా ఎదుటఁ గలమామిడిచెట్టే శివుఁడుగాఁ గనఁబడినరికి మన్మథుఁ డులికిపడి యోసరిల్లెను. గళ మున కష్టం - 'షష్టీతత్పురుషంబులందు నగాగమంబు విభాష నగు.' ప్రౌఢ.స.మాస, 1·

చ. అలరుల మందహాసమున, నన్నిన షట్పద మంజుగీతి, రా
చిలుకల ముద్దుమాటలను, చెందలిరాకుల రాగలీలఁ, గో
కిల నినదంబులన్, బరిహికేశభరంబున, ముక్త పర్ణ మే
ఖల నభిరామమయ్యె సహకారలతాంగి మధుప్రసంగతిన్. 102

అర్థము; సహకార-లతా + అంగి = తియమామిడి చెట్టనెడు స్త్రీ, మధు-ప్రసంగతిన్ = వసంతునితోటి సాంగత్యముచే. అలరుల - మంద - హాసమునన్ = పూవుల చిఱునవ్వుచేతను, అన్నిన = మత్తిల్లిన, షట్పద - మంజు - గీతిన్ = తుమ్మెదల మనోహర సంగీతముచేతను, రాచిలుకల - ముద్దుమాటలను = రాజకీరముల ముద్దు పలుకులచేతను, చెందలిరాకుల - రాగ - లీలన్ = ఎఱ్ఱని చివురుటాకుల యొప్పుచేతను, కోకిల - నినదంబులన్ = కోకిలల కూజితధ్వనులచేతను, బరిహి - కేశ-భరంబునన్ = బర్హి (నెమలి) కేశపాశముచేతను, ముక్త - పర్ణ - మేఖలన్ = విడువఁబడిన పండుటాకులనెడి మొలనూలిచేతను, అభిరామము + అయ్యెన్ = మనోహర మయ్యెను.

తాత్పర్యము : తియమామిడి యనెడు స్త్రీ వసంతాగమమున పూల చిఱునవ్వులచేతను, మదించిన తుమ్మెదల మనోహరసంగీతముచేతను, రాచిలుకల ముద్దుమాటలచేతను, కెంజివురుటాకుల యెఱ్ఱఁదనముచేతను, కోకిల కూజితముల ధ్వనుల చేతను, నెమిళ్ల కేశపాశముచేతను, విడువఁబడిన పండుటాకుల గలగల లనెడి మొలనూలి నవ్వడుల చేతను మనోహర మయ్యెను.

విశేషములు : అలంకారము రూపకము. చెందలిరు = చెన్ను + తలిరు. ప్రాఁతాదిసూత్రము (బాల.సంధి.36.) చే - చె+తలిరు, లుప్తశేషమునకుఁ బరుషము పరముగా (బాల.సంధి.37) నుగాగమము, పిమ్మట ద్రుతకార్యము (బాల. సంధి,16.17)

జరిగి వెంపరలు వేర్పడును. వెంపరిక = వట్టి తలపు. 'విస్మృతార్థము స్మృతి ప్రోక్తార్థకంబు.' (విస్మయ.) బచ్చి (ప్రస్మృతి) - బరిహా (విస్మృతి) బరిహా శబ్దము వికృతులుగా గానరాదు.

క. తలిరెల్లిఁ, బూవుటమ్ముల,
బలసిన పిక కీర భృంగ పరివారముతో
వలరాజుఁ బోలి మామిడి
సలలితగతి నుత వసంత సంగతి నొప్పెన్. 103

అర్థము : మామిడి, నుత - వసంత - సంగతిన్ = పొగడఁబడిన వసంత సాంగత్యముచేత - వసంతమురాకచే, తలిరెల్లిన్ = (తలిరు + ఎల్లిన్) = చిగురనెడు గొడుగుతోను. పూవుటమ్ములన్ (పూవు + అమ్ములన్) = పూలనెడు బాణములం తోను, బలసిన = చుట్టుకొనియున్న, పిక - కీర - భృంగ - పరివారముతోన్ = కోకిలలు, చిలుకలు, తుమ్మెదలు అనెడి పరివారముతోను, వలరాజున్ = మన్మథుని, పోలి, సలలిత-గతిన్ = మనోహరమైన విధమున, ఒప్పెన్.

తాత్పర్యము : మామిడి వసంతాగమమున చివురనెడు గొడుగుతోను, పూవులనెడు బాణములతోను, బలసియున్న కోకిలలు, చిలుకలు, తుమ్మెదలు అను పరివారముతోను మన్మథునిబోలి మనోహరముగ నొప్పెను.

విశేషములు : మామిడి వలరాజును బోలె ననుటచే మామిడికి రాజచిహ్నములు గలవనుట. అవి ఛత్రము, అమ్ములు, పరివారము. మామిడిరాజువానికిఁ జివురే యెల్లి, పూవులే అమ్ములు, పిక కీర భృంగములే బలసియుండు పరివారము. అలంకార ముపమ, అది రూపకానుప్రాణితము. తలిరెల్లి ప్రథమాంతముగాఁ గాక, తృతీయార్థక ద్వితీయాంతముగానున్న అన్వయము సుకరముగా నుండును గావున 'తలిరెల్లిఁ బూవుటమ్ముల' అని మార్పఁబడినది. తలిరు + ఎల్లి - 'కర్మధారయంబునందుఁ జేర్వాది శబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాష నగు.' బాల, సంధి. 29. 'ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధి యగు.' బాల. సంధి. 1. పూవు + అమ్మ - 'కర్మధారయంబునం దుత్తున కచ్చు పరంబగునపుడు టుగాగమం బగు.' బాల. సంధి. 28. పూవుటమ్మ.

చ. మలయసమీర మర్థి సుకుమార లసత్సహకార నందనా
వలి నలిఁ జొచ్చుఁ, జుట్టుకొనివచ్చుఁ; గుజాలికి మెచ్చు; నీరికల్
వెలుపొనరించుఁ; గెందలిరు వెంచు, ననల్ విరియించుఁ, దావి న
ర్మిలిఁ గబళించు; నాదట రమించుఁ; దమిన్ విహరించు నామనిన్. 104

అర్థము ; ఆమనిన్ = వసంతమునందు, మలయ - సమీరము = మలయానిలము - దక్షిణపుగాలి, అర్థిన్ = కోరికతో, సుకుమార .... వలిన్ : సుకుమార = అందమైన, లసత్ = ప్రకాశించుచున్న, సహకార = తీయమామిడి, నందన + ఆవలిన్ = వనసముదాయమును, నలిన్ = ఉత్సాహముతో, చొచ్చున్ = ప్రవేశించును, చుట్టుకొనివచ్చున్, కుజ + ఆలికిన్ = చెట్ల వరుసకు. మెచ్చున్, ఈరికల్ = మొలకలు, వెలుపు + ఒనరించున్ = వెడలుపుచేయును, కెందలిరు = ఎఱ్ఱని చిగురు(ను), పెంచున్ = వృద్ధిపొందించును, ననల్ = మొగ్గలను, విరియించున్ = వికసింపఁ జేయును, అర్మిలిన్ = ప్రీతితో, తావిన్ = పరిమళమును, కబళించున్ = మ్రింగును, ఆదటన్ = ప్రేమముతో. రమించున్ = క్రీడించును, తమిన్ = ఆసక్తితో, విహరించున్.

తాత్పర్యము : మలయానిలము వసంతమున మనోహరములైన తీయ మామిడి వనములను ఉత్సాహముతోఁ బ్రవేశించును. వానిని జుట్టుకొనివచ్చును. అందలి చెట్లను మెచ్చును, మొలకలను వెడలుపొనరించును. కెంజివురులను పెంచును, మొగ్గలను విరియునట్లు చేయును. తావిని లోఁగొనును. ప్రీతితోఁ గ్రీడించును. ఆసక్తితో విహరించును.

విశేషములు : కెందలిరు = కెంపు + తలిరు. ప్రాఁతాదిసూత్రముచే (బాల. సంధి. 36.) కె + తలిరు, లుప్తశేషమునకుఁ బరుషము పరముగా నుగాగమ మయి (బాల. సంధి. 37.) కె + ను + తలిరు = ద్రుతకార్యము (బాల. సంధి. 16, 17) చే కెందలిరు అగును. కుజాలికి మెచ్చు - ద్వితీయకు షష్ఠి.

చ. అలు లొడఁగూడుఁ, బింకఁగొని యాడు, మృదుధ్వనిఁ బాడు, నోలి దొం
తులుగొని పాఱు, జొంపములు దూఱు, సుగంధముమీఱు పువ్వు గు
త్తులపయి మూఁగుఁ, బుప్పొడులఁ ద్రోపువడిం దనివోవు, మంజరుల్
వెలువడ నేఁగు, దర్పమున వీఁగు, మదిన్ నలిరేఁగు నామనిన్. 105

అర్థము : ఆమనిన్ = వసంతమునందు, అలులు = తుమ్మెదలు, చదఁ గాదున్ = గుమిగూడున్, మిం + కొని + ఆడున్ = గుంపులుగా కూడి ఆడును, ఝుమ్ము - ఝ్వనిన్ = ఝుమ్మనుపైన ధ్వనితో, పాడున్, పాడున్ = పాడును, దొంతులు + కొని = వరుసలుకట్టి, పాఱున్ = పరువెత్తును, పొదరిండ్లు = పొదలు, దూఱున్ = ప్రవేశించును, మకరందము = ..., మిగుల = అతిశయముగనుండు, నెత్తావి - గుత్తులయున్ = పూలగుత్తులమీఁద, మూఁగున్ = మూఁగును, పుష్పాళులన్ = పుష్పాళులను, ప్రోవు - పడిన్ = ప్రోవుపడియుండు. వెడఁగొట్టు వడిచే, తనివోవున్ (తనివి + పోవున్) = తృప్తిపొందును, మంజరిన్ = పూలగుత్తులనుండి, వెలువడన్ + ఏఁగున్ = వెలువడునట్లు వెడలును, దర్పమునన్ = గర్వముతో, వీఁగున్ = ఉత్సహించును, మదిన్ = మనస్సునందు, రేఁగున్ = విజృంభించును.

తాత్పర్యము : వసంతమునఁ దుమ్మెదలు మూఁగును. గుంపులుగా కూడి ఆడును. ఝుమ్మనుపైనధ్వనితోఁ బాడును. వరుసలుకట్టి పరువెత్తును. పొదలఁ దూఱును. పరిమళ మధికముగా నుండు పూలగుత్తులపై మూఁగును. పుష్పాళుల వెడఁగొట్టు వేగముచేఁ దృప్తిఁ బొందును. పూలగుత్తులనుండి వెడలును. గర్వముతో నుత్సహించును. మనస్సున విజృంభించును.

విశేషములు : అలంకారము స్వభావోక్తి.

పుష్పాళులు - పుష్పాళి + లు, 'ఇత్తునకు బహువచనంబు పరంబగునప్పు డుత్వం బగు,' బాల.తత్సమ.45. పుష్పాళులు. 'బహువచనంబు పరంబగునప్పు డసంయుక్తంబు లయి యుదంతంబులయిన ద ల ర ల కళలకు లకారంబు బహుళంబుగా నగు.' బాల. అచ్చిక. 13. పుష్పాళులు. పాడు - ఆడు - పాడు, పాయు - పాఱు - ..., మూఁగు - మూవు - ప్రోవు పోవు, ఏఁగు - వీఁగు - రేఁగు అనువానియందలి అనుప్రాసము గమనింపఁదగినది. మూఁగు - మూవు - 'అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాష నగు,' బాల.అచ్చిక.27.

చ. చెలఁగుచుఁ దాఁటి, యొక్కొకటిఁ జేఁటి, వసంతులు దాఁటి, చిల్కుచుఁ బిం
తెలఁబొఱఁ ద్రొక్కి, రెందలిప చెక్కి, తెలంపుల నిక్కి చూచి, రా
యలు గని, మ్రానిపండ్ల రసమాని, ముదంబున నూని, పల్కుఁ; దున్
పొలుపడరంగ దంపతులు పొంగ, వియోగులు క్రుంగ నామనిన్. 106

అర్థము : ఆమనిన్ = వసంతమునందు, మున్ = ముందు, పొలుపు = ఉల్లాసము, అడరంగన్ = అతిశయింపఁగా, దంపతులు, పొంగన్ = ఆనందింపఁగా, వియోగులు = విరహులు, క్రుంగన్ = బాధపడఁగా, చిలుకపిండు = చిలుకల గుంపు, చెలఁగుచున్ = మిక్కిలి ఉత్సహించుచు, పాఱి, ఒక్కొకటిన్ = ఒకదాని నింకొకటి, చీఱి = పిలిచి, వనంబులు = తోఁటలు, తూఱి = ప్రవేశించి, ఎలఁజొంపన్ = చిగురును, త్రొక్కి, కెందలిరులు (కెంపు + తలిరులు) = ఎఱ్ఱని చివురులు, ఎక్కి = ఇష్టమయి, కెలంకులన్ = పార్శ్వములను, నిక్కి - చూచి, కాయలు, కని, మ్రానిపండ్ల-రసము = చెట్టుపండ్లయందలి రసము, ఆని = త్రావి, ముదంబునన్ + ఊని = సంతోషమును పొంది, పల్కున్.

తాత్పర్యము : వసంతమున దంపతులు ఉల్లాస మతిశయింప ఆనందింపఁగను, విరహులు క్రుంగిపోవఁగను, చిలుకలగుంపు మిక్కిలి యుత్సహించుచుఁ బాఱి, ఒకదానినొకటి పిలిచి, తోఁటలు చొచ్చి, చిగురుల నదిమి, ఎఱ్ఱని చివురుల నిష్టపడి, పార్శ్వములను మెడలెత్తి చూచి, కాయలు గని, చెట్ల పండ్లరసముఁ గ్రోలి, సంతోషమును బొంది పలుకును.

అలంకారము : ఇందుఁ జిలుకల చేష్టలను సహజసుందరముగా వర్ణించుటచే నలంకారము స్వభావోక్తి. 'స్వభావోక్తి స్స్వభావస్య జాత్యాదిస్థస్య వర్ణనమ్.' చన్ద్రా, కెందలిరులు - కెంపు + తలిరులు-చూడు పూర్వవ్యాఖ్య, కెలంకులు- కెలను + లు, 'కలన్వాదుల నువర్ణంబు కుఙగు; బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు' బాల.ఆచ్ఛిక,18. కెల + కుఙ్ + లు - 'ఙిత్తు బిందుపూర్వంబగు' కెలంకులు. బాల. తత్సమ. 19. ఈ పద్యమునందునుగల అనుప్రాసము గమనార్హము .

చ. గుమురులుగట్టి. యీరికలుగుట్టి, ప్రవాళమువట్టి, కింకతో
నమలకమ్రింగి, మొగ్గలఁ బెనంగి, విరుల్ గని, పొంగి, పూఁప లు
త్తమ మని చావి, యుద్దవడిఁ ద్రావికొను న్నెలమావియందుఁ గూ
రిమి వడిఁజేయు నామనిని రేయుఁబవల్ వడిఁ గూయుఁ గోవిలల్. 107

అర్థము : కోవిలల్ = కోకిలములు, ఆమనిని = వసంతమునందు. గుమురులు + కట్టి = గుంపులుకూడి, ఈరికలు = మొలకలు, కుట్టి = పొడిచి, ప్రవా

గము = చిగురు, పట్టి, కింకతోన్ = కోపముతో, నములుచు, ద్రుంచి, మెక్కి, మెసంగి, ఏపున్ = పూవులు, కని = చూచి, పొంగి = సంతోషించి, పూచలు = పూఁచెలు, ఉత్తమము + అని = శ్రేష్ఠములని చాటి = చాటి, తిరిగి = తిరిగి, ఉద్దవిడిన్ = శీఘ్రముగా, త్రావికొనున్ = భక్షించును, ఎలమావియందున్ = లేఁత మామిడియందు. హారిమి - నరిన్ = ప్రీత్యతిశయమును, రేయున్, రేయున్ + పవల్ = రాత్రియును పగలును, వడిన్ = వేగముగా, కూయున్.

తాత్పర్యము : వసంతమునఁ గోకిలలు గుంపులుగూడి, మొలకలు పొడిచి, చిగురులు పట్టుకొని కోపమున నములుచుండఁగనే ద్రుంచి, మెక్కియుఁ బెనఁగులాడి, పూలు చూచి పొంగి, పూఁచెలు శ్రేష్ఠములని తిరిగి, శీఘ్రముగా భక్షించును. లేఁతమామిడియందుఁ బ్రీత్యతిశయమును జేయును. రేఁబవళ్లు వేగముగాఁ గూయును.

విశేషములు : అలంకారము స్వభావోక్తి, కింక-కినుక, పిక్కు-(రూపాం) పూచ ఉత్తమ పని - 'స్త్రీసమంబులగు విశేషణంబులయు సమర్థ్యాంబగు విశేషణంబులయు బహువచనంబున కేకవచనంబు బహుళంబుగా నగు.' బాల.కారక. 2?. చాగి - చాఁగి - 'అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాష నగు.' బాల.అచ్చిక.27. ఉద్దవడి - ఉద్దవిడి (రూపాం.), త్రావికొనున్ - త్రాగికొనున్. ఇచ్చటను గకారమునకు వకారాదేశము. ఇందు కొను స్వార్థమున నుప్రయుక్తమయి నది. 'నములి కొను లోనగుకడ స్వార్థంబునం దుప్రయుక్తంబు లగు.' బాల. క్రియ 109. త్రావికొనున్నెలమావియందు - త్రావికొనున్ + ఎలమావియందు. 'కొన్ని మొదలఁ బ్రామాణికప్రయోగంబులం బ్రుతంబుని దిప్పి సంధి ద్విత్వంబు చూపఁ బడె.' ప్రౌఢ.సంధి 3. రేయుఁబవల్ - రేయి + ను + పవల్ - 'సకారాంత నపుంసక శబ్దంబుమీఁద నయ్యెడి (సుశబ్దము) 'ము' వర్ణలోపంబు విభాష నగు.' ప్రౌఢ. శబ్ద. 116. ఈ విభాగమున సుశబ్దము యుక్తము కాకపోయిన నదియును. రే + యును + పవల్. అని విభజించినచో సుశబ్దము యుక్తమగుట కొనవలయును. పిమ్మట ప్రుతకార్యముచే - రేయుఁబవల్. (బాల. సంధి. 16, 17). పవల్ - పగల్ గకారమునకు వకారాదేశము. (బాల. అచ్చిక 27.) పవల్ - పవలు - 'పదాంతంబులయి యసంయుక్తంబులయిన సు లు వుల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.'బాల.ప్రకీర్ణక.16. ఇందును అనుప్రాసము గలదు, కోవిల - కోవెల - కోయిల, కోకిల (రూపాం.)

మత్తకోకిల 'మెత్త మెత్తన క్రాలుదీవు సమీరణుండ! మనోభవుం
డెత్తకుండఁగ వేగకాడఁగనెత్తు; మెత్తక తక్కినన్,
జత్తు సుమ్ము వసంతుచే' నని చాటునట్లు చెలంగె నా
మత్తకోకిల లారమిం గడు మాసరంబగు నామనిన్. 108

అర్థము : కడున్ = మిక్కిలి, మాసరంబు + అగు = మనోజ్ఞమగు, ఆమనిన్ = వసంతమునందు, ఆరమిన్ = ఆరామమున, ఆ - మత్త - కోకిలలు = ఆ మదించిన కోకిలలు, సమీరణుండ ! = ఓ వాయువా !, ఈవు = నీవు, మెత్త మెత్తన = మందమందముగా, క్రాలుదు (వు) = సంచరింతువు, మనోభవుండు = మన్మథుఁడు. ఎత్తక + ఉండఁగన్ = దండెత్తకుండ, ఎత్తుము = దండెత్తుము, ఎత్తక - తక్కినన్ = (అ విధముగా నీవు దండెత్తకపోయినచో, వసంతుచేన్ = వసంతునిచేత, చత్తు (వు) - సుమ్ము = చత్తువు సుమా, అని, చాటు + అట్లు = చాటు రీతిని, చెలంగెన్ = ధ్వనించెను - కూసెను.

తాత్పర్యము : మిక్కిలి మనోజ్ఞమగు వసంతమున ఆరామములో నా మత్తకోకిలములు 'మలయానిలుఁడా ! నీవు మందమందముగా సంచరింతువు. మన్మథుఁడు నీపై దండెత్తకుండఁగనే నీవు వేగముగా నతనిపై దండెత్తుము. అట్లు దండెత్తకపోయినచో నీవు వసంతునిచేఁ జత్తువుసుమా !' యని ప్రకటించుచున్నవా యను నట్లు కూసెను.

విశేషములు : అలంకారము ఉత్ప్రేక్ష. మత్తకోకిలముల కూజితమును మత్తకోకిలచ్ఛందముననే వర్ణించుట గమనార్హము. వసంతమున వాయువు మందమంద ముగా వీచుననియు, కోకిలలు కూయుననియు, మన్మథవసంతులు విజృంభింతు రనియు నభిప్రాయము. క్రాలుదు (వు), చత్తు (వు) - లందు వకారమునకు లోపము. (బాల. క్రియ. 24.) ఆరమి = ఆరామము. ఆరమి, మత్తకోకిల - నాలుగు పాదము లుండును. ప్రతిపాదమునను ర, స, జ, జ, భ, ర అను గణము లుండును. మొదటి యక్షరమునకును, పదునొకండవ అక్షరమునకును యతిమైత్రి. ప్రాసనియమము గలదు.

సీ. ఆరగ్వధార్క జంబీర కర్కోల మం
దార చందన నారికేర సింధు
వార కంకేళి ఖర్జూర శాల్మలి ఘన
సార చంపక బీజపూర దేవ
దారు సల్లకి కరవీర గుగ్గులు పీత
సార పున్నాగ నమేరు కర్ణి
కార ధాత్రీ త్వచిసార పటల సహ
కార భల్లాతక పారిజాత

తే. భూరుహారూఢ పిక రాజకీర మద మ
యూర మధుకర మృదు మధురారవములఁ
జారుతరమైన భూరి కాంతార మహిమ
గారవింపుచుఁ జనుదెంచె మారుతంబు. 109

అర్థము : ఆరగ్వధ = రేల, అర్క = జిల్లేడు, జంబీర = నిమ్మ, కర్కోల = తక్కోలపుఁజెట్టు, మందార = మందారవృక్షము, చందన = చందనము, నారికేర = కొబ్బరి, సింధువార = వావిలి, కంకేళి = అశోకము, ఖర్జూర = ఖర్జూరము, శాల్మలి = బూరుగు, ఘనసార = కర్పూరము, చంపక = సంపెఁగ, బీజపూర = మాదీఫలము, దేవదారు = దేవదారువు, సల్లకి = అందుగు, కరవీర = గన్నేరు, గుగ్గులు = గుగ్గిలము, పీతసార - వేగిస - ఊడుగు, పున్నాగ = సుర పొన్న, నమేరు = సురపొన్న - రుద్రాక్ష, కర్ణికార = కొండగోఁగు, ధాత్రి = ఉసిరిక, త్వచిసార = వెదురులయొక్క, పటల = సమూహము, సహకార = తియ్య మామిడి, భల్లాతక = జీడి, పారిజాత = పారిజాతము. అను, భూరుహ = చెట్లను, ఆరూఢ = ఎక్కిన, పిక = కోకిలములు, రాజకీర = రాచిలుకలు, మద-మయూర = మదించిన నెమళ్లు, మధుకర = తుమ్మెదలు, అనువానియొక్క, మృదు = మెత్తని, మధుర = తీయని, ఆరవములన్ = ధ్వనులచేత, చారుతరము = మనోజ్ఞము, ఐన, భూరి - కాంతార - మహిమన్ = పెద్దదైన - వనముయొక్క - గొప్పతనమును, గార వింపుచున్ = ఆదరించుచు, మారుతంబు = వాయువు, చనుదెంచెన్ = వచ్చెను.

తాత్పర్యము : జేల, జిల్లేడు, నిమ్మ, తక్కోలము, మందారము, చందనము, కొబ్బెర. వావిలి, అశోకము, ఖర్జూరము, మారుగు, కర్పూరము, సంపెంగ, మాది ఫలము, దేవదారువు, అంకుగు. గన్నేరు, గుగ్గిలము, వేగిస, (ఊడుగు), పొన్న, సురపొన్న, రుద్రాక్ష, కొండగోంగు ఉసిరిక, వెదురు, తియమామిడి, జీడి, పారిజా తము అను చెట్లనెక్కిన కోకిలములు, రాచిలుకలు, మదించిన నెమళ్లు, తుమ్మెదలు అనువాని మృదుమధురమైన ధ్వనులచే మనోజ్ఞమైన వనము మహిమ నాదరించుచు వాయువు వీతెంచెను.

విశేషములు : సర్వలఘుప్రాసనీసము.

క. మధుసంగమునఁ ద్రిలోకీ
వధు వనురాగమునఁ గామవశగతిఁ జేతో
విధుర విధి నడరె; నట్టిద;
మధుసంగతి జనులు రాగమయు లగు దరుదే? 110

అర్థము ; త్రిలోకీ - వధువు = లోకత్రయసమాహార మనెడు స్త్రీ, మధు-సంగమునన్ = వసంతునితోడి కూడికచేత- వసంతము వచ్చుటచేత, అనురాగమునన్ = అనురక్తితో, కామ-వశ-గతిన్ = మన్మథునకు లోపడిన విధమున- కోరికలకు లోపడిన విధమున. చేతస్ (ః) + విధుర- విధిన్ = మనోవిచారస్థితితో, అడరెన్ = అతిశయించెను, అట్టిది+అ=అది యటువంటిదే, జనులు, మధు - సంగతిన్ = వసంతాగమముతో - మద్యసాంగత్యముతో, రాగ-మయులు = అనురాగముతో నిండిన వారు, - అగుదు = అగుట, అరుదే = ఆశ్చర్యమా ? కా దనుట,

తాత్పర్యము : ముల్లోకముల సమాహారమనెడి స్త్రీ వసంతునితోడి సంగమమున - వసంతకాలాగమమున అనురాగముతో మన్మథునకు లోపడినదయి, - కోరికలకు లోపడినదయి మనోవిచారము గలిగియుండెను. అది యట్టిదే. వసంతసాంగత్యముచే - మద్యసంగతిచే జనులు అనురక్తియుక్తులగుట - మాత్సర్యపూరితులగుట ఆశ్చర్యమా ? - కా దనుట.

విశేషములు : అలంకారము శ్లేషానుప్రాణితరూపకము. విశేషము సామాన్యముచే సమర్థింపఁబడుటచే అలంకారము అర్థాంతరన్యాసము. త్రిలోకీ-

త్రయాణాం లోకానాం సమాహారః - సమాహార ద్విగుసమాసము. చేతోవిధుర - చేతస్ + విధుర - షష్ఠీతత్పురుషసమాసము. విసర్గాదేశము. చేతః + విధుర, హ్రస్వ అకారము పరమైన వచ్చు విసర్గమునకు హ్రస్వ అకారముగాని, మృదుహల్లులు (హశ్శు) గాని పరములగునప్పుడు ఉ ఆదేశముగా వచ్చి పూర్వమందున్న అకారముతో గూడి గుణసంధినొందించి ఓ గా మారును. చేత + ఉ + విధుర. చేతోవిధుర. అంటు పడదే = అంటున్ + అడదే. భావార్థక ఉపపర్దకమును సవర్ణాదేశము నీ కవి మెప్పుపోట్లఁ జేసెను.

సీ. నెలఁతల పరిమళ నిశ్వాసపవనంబుఁ
        దలఁపించె దక్షిణానిల విలాస;
    మింతుల దరహాసకాంతి సంభావనఁ
        గావించెఁ జంద్రప్రభావిభాతి;
    రమణుల రక్తాధరభ్రాంతి నొదవించె
        లాలితాశోక ప్రవాళ లీల
    వనితల మంజుల స్వనశంకఁ బుట్టించెఁ
        గలకంఠ మదకీర కలరవంబు;

ఆ. కామినీ విలోల కర్ణాంత విశ్రాంత
    లోచనప్రశంస లోలబుద్ధిఁ
    బడసె దళిత పత్ర పద్మ విభ్రమము వి
    యోగులందు మధుసమాగమమున. 111

అర్థము: మధు - సమాగమమునన్ = వసంతము రాకచే. వియోగుల + అందున్ = విరహులయందు.

దక్షిణ + అనిల-విలాసము = దక్షిణమునుండి వీచుగాలి (మలయానిలము) యొక్క విలాసము. నెలఁతల = స్త్రీలయొక్క. పరిమళ నిశ్వాస - పవనంబున్ = సుగంధముతోడి నిట్టూర్పుగాలిని, తలఁపించెన్ = తలఁపునకు వచ్చునట్లు చేసెను,

చంద్ర-ప్రభా-విభాతి = చంద్రునికాంతి (వెన్నెల) యొక్క ప్రకాశము. ఇంతుల = స్త్రీలయొక్క, దర-హాస-కాంతి-సంభావనన్ = చిఱునగవు కాంతియొక్క తలంపును, కావించెన్.

లాలిత + అశోక-ప్రవాళ-లీల = మనోహరమైన అశోక పల్లవములయొక్క, విలాసము, రమణుల = స్త్రీలయొక్క. రక్త + అధర-విభ్రాంతిన్ - ఎఱ్ఱని క్రింది పెదవియొక్క విభ్రమమును. ఒదవించెన్ = పుట్టించెను.

కలకంఠ-మద - కీర-కల-రవంబు = కోకిలములయొక్కయు. మదించిన చిలుకలయొక్కయు, అవ్యక్తమధురధ్వని, వనితల = స్త్రీలయొక్క, మంజుల-స్వన-శంకన్ = మనోహరమైన ధ్వనియొక్క సందేహమును, పుట్టించెన్.

దలిత - పత్ర-పద్మ-విభ్రమము = వికసించినఱేకులుగల తామరల విలాసము, కామినీ.... బుద్ధిన్: కామినీ = స్త్రీలయొక్క, విలోల=చంచలములగు, కర్ణ+అంత-విశ్రాంత = చెవులకొనల విశ్రమించిన-చెవుల కొనలవఱకు విస్తరించిన, లోచన= కన్నులయొక్క, ప్రశంస = పొగడ్తయందు, లోల = ఆసక్తమైన, బుద్ధిన్ = తలంపును, పదసెన్= పొందెను - కలిగించెను.

తాత్పర్యము : వసంతసమయమున వియోగులకు మలయానిల విలాసము స్త్రీల సురభిళనిశ్వాసవాయువును స్ఫురింపఁజేసెను. వెన్నెలకాంతి స్త్రీల చిఱునగవు కాంతిని తోఁపించెను. మనోహరమైన అశోక పల్లవము లీల స్త్రీల యెఱ్ఱని క్రిఁదిపెదవిభ్రాంతిని పుట్టించెను. కోకిలములయు, మదించిన చిలుకలయు అవ్యక్తమధురధ్వని స్త్రీల మనోహరకంఠధ్వనిశంకను బుట్టించెను, వికసించిన ఱేకులుగల తామరల విలాసము స్త్రీల చంచలములు, చెవులకొనలవఱకు వ్యాపించినవి అగు కన్నులని ప్రశంసించుబుద్ధిని గలిగించెను.

విశేషములు : అలంకారము ఉత్ప్రేక్ష, భ్రాంతిమంతము.

క. సోలుచు సమ్మదరసమునఁ
గ్రాలుచు వనపాలబాలికలు నవ లతికాం
దోలముల వేడ్క సలుపుచు
నాలతు లొగిఁ జేసి పాడి రభినవలీలన్. 112

అర్థము : పవమాన - చలితల = గాలిచేత కదలిన చిగుళ్లు, సోఁకన్ = సోఁకినంతనే, నవ్యధ - నిపుణునన్ = మందమతియైన. గ్రాలుచున్ = ఒప్పుచు, నవ - లతికా + ఆందోళమున్ = క్రొత్తదైన తీగల ఉయ్యాల చేయుచు. సలుపుచున్ = చేయుచును. అంచలు = రాయంచలు, చేరి = దగ్గఱగా, చేరి, అధిప - కిరణ్ = సూర్య కిరణముల - గ్రొత్త యందముల్, పొడిచె.

తాత్పర్యము : తోఁట చిగురుటాకులు సవరించుచు, సంతోషమునకు నొప్పుచు, క్రొంకీరు యూథముల చేరు చేయుచు, రాగమునను జక్కఁగా నటించుచుఁ గ్రొత్తయందము కలుగఁ జాలె.

విశేషములు : అంచలు = అంచలు, ఇందే ఈ పదమునకుఁ బ్రమాణాంతరము - 9,135.

సీ. కరి యిచ్చె నరమేని కరిణికి కల్లికి
పల్లవ ముల్లంబు పల్లవింప;
మృగ మర్థిఁ గబళించి మృగికిచ్చె సన్ను ద
ర్భాంకురంబులు చిత్త మంకురింప;
హంస పెక్కువ నిచ్చె హంసికి నోరోర
నెలదూఁడు మొగముల నెలమి మిగుల;
భృంగము గ్రావి తా భృంగికి దయ నిచ్చె
[1] వికసితాబ్జమధువు వికసితముగఁ;

ఆ. కిన్నరుండు గ్రోల్చెఁ గిన్నరి వీనుల
రాగరసము మేన రాగ మెసఁగ;
మధు విడంబనమున మగలును మగువలు
విరలిగొనిరి మదన పరవశమున. 113

1. వా.ప్రతి.మధుధార ముఖరాగమదము దలఁకఁ

అర్థము : కరి = మగయేనుఁగు, అర - మేసి = సగము తిని. కరిణికిన్ = ఆఁడేనుఁగునకు; ఉల్లంబు = మనస్సు. పల్లవింపన్ = చివురింపఁగా, పల్లకీ - పల్లవము = అంమగుఁజివురు, ఇచ్చెన్.

మృగము = మగలేడి, మృగికిన్ = ఆఁడులేడికి, చిత్తము = మనస్సు, అంకురింపఁగన్ = మొలకెత్తఁగా-ఆనందింపఁగా, నవ్వు-దర్భ + అంకురంబులు = చిగురించు దర్భల మొలకలు, కబళించి = తిని-కొఱికి, అర్థిన్ = కోరికతో, ఇచ్చెన్.

హంస = మగ యంచ, హంసికిన్ = అంచపెట్టకు, మొగములన్ = ముఖము లందు, ఎలమి = సంతోషము, మిగులన్ = అతిశయింపఁగా, నోర్నోరన్ = నోటిలో నుండి నోటిలోనికి. ఎల-తూఁడు = లేఁదూఁడు, పెక్కువన్ = ఎక్కువగా, ఇచ్చెన్.

భృంగము = మగతుమ్మెద, భృంగికిన్ = ఆఁడుతుమ్మెదకు, వికసితముగన్ = వికాసముగలుగునట్లు-ఆనందముగలుగునట్లు, వికసిత + అబ్జ-మధువు = వికసించిన తామర యందలి మకరందము, తాన్-త్రావి = తాను త్రాగి, దయన్ = ఆదరముతో, ఇచ్చెన్.

కిన్నరుఁడు, కిన్నరి - మోములన్ = కిన్నరాంగన పెదవులందు, రాగ - రసము = గానరసము, మేనన్ = శరీరమున, రాగము = అనురక్తి, ఎసఁగన్ = అతిశయింపఁగా, క్రోల్చెన్ = పాడెను,

(ఇట్లు) మధు - విడంబనమునన్ = వసంతుని మాయచే, మగలును - మగువలున్ = పురుషులును, స్త్రీలును, మదన - పరవశమునన్ = మన్మథపారవశ్యముతో, విరతి - కొనిరి = మోహపడిరి,

తాత్పర్యము : మగయేనుఁగు పిడియేనుఁగునకు హృదయానందము గలుగ నంటుగుచిగురును దాను సగము తిని మిగత నిచ్చెను. మగలేడి ఆఁడులేడికి మనస్సు సంతోషింపఁగాఁ జివురించు దర్భలమొలకలను దాను దిని మిగిలినవి కోరికతో నిచ్చెను. మగ యంచ పెంటి యంచకు ముఖముల వికాస మతిశయింపఁగా లేఁదూఁటిని నోటి లోనుండి నోటిలోనికి ఎక్కువగా నందిచ్చెను. మగతుమ్మెద ఆఁడుతుమ్మెదకు వికాసము గలుగ వికసిన తామరతేనెను దాను గొంత త్రావి యాదరముతో నిచ్చెను. కిన్నరుఁడు కిన్నరాంగన పెదవులందు గానరసము, మేన ననురాగము అతిశయింప గానము చేసెను. వసంతుని మాయచే పురుషులును స్త్రీలును మన్మథపారవశ్యమునొంది మోహము నొందిరి.

విశేషములు : ఇందుఁ దిక్పాలకుల శృంగారము వర్ణింపఁబడినది. వాస్తవ మిది శృంగారరసాభాసము. దానిలక్షణము: 1.38 పద్యము వ్యాఖ్య. ఇందలి భావములు కాళిదాసు కుమారసంభవమునందలి శ్లోకములభావముల ననుసరించినవి.

కరియువ్వె...పల్లవింప. 'దదౌ రసాత్ పంకజరేణుగన్ధి గజాయ గణ్డూషజలం కరేణుః.' కుమార. 3.37. సంస్కృతమున గండూషజలమని యుండఁగా ఇట పల్లవమని యున్నది.

మృగమర్త్తి .... చిత్తమంకురింప. 'శృఙ్గేణ సంస్పర్శనిమీలితాక్షీం మృగీ మకణ్డూయత కృష్ణసారః.' కుమార.3.36. సంస్కృతశ్లోకమునందలి భావమునుమాత్రమే పొందినది. అందుచేఁ దెలుఁగునందలి భావములు సంస్కృతమునందలి వాని కనువాదములు గావు యనుటకు ఇది.

హంసవిభుఁడు .... నెలయుచుండఁ. 'అర్ధోపభుక్తేన బిసేన జాయాం సమ్భావయామాస రథాఙ్గనామా.' (కుమార. 3. 37.) సంస్కృతమునందలి చక్రవాకము తెలుఁగున హంస మైనది.

భృంగము తాను .... మిసిమియుచు. 'మధు ద్విరేఫః కుసుమైకపాత్రే పపౌ ప్రియాం స్వా మనువర్తమానః' కుమార. 3.36.

కిన్నరుఁడు గ్రోల్చు .... మోదము. 'గీతాన్తరేషు శ్రమవారిలేశైః కిఞ్చిత్సముచ్ఛ్వాసితపత్రలేఖమ్, పుష్పాసవాఘూర్ణితనేత్రశోభి ప్రియాముఖం కింపురుషశ్చుచుమ్బే' కుమార. 3.38. సంస్కృతాంధ్రములందలి భావములు వేర్వేరుగా ప్రకటిత సామ్యముచేఁ బ్రకల్పింపఁబడినవి.

ననుఁ - నవ్వు. 'అప్పటియుద్ధ [illegible] వలె తోఁచుచు విహారించుచుండగ నగు.' రాం.ప్రకీర్ణ.17.

క. ఆమని నెలమి విపులా
రామంబుల పొల్పు చూచి రాగోత్కటుఁడై
కాముఁడు రతిఁ గని తానును
గామాతురుఁడై మనోవికారముఁ బొందెన్. 114

అర్థము : ఆమనిని = వసంతమునందు, ఎలమిన్ = సంతోషముతో, విపుల + ఆరామంబుల = విస్తారములైన యుద్యానములయొక్క, పొల్పు - పొలుపు = అందము, చూచి, రాగ + ఉత్కటము + ఐ = అనురాగ మతిశయించి, కాముఁడు = మన్మథుఁడు, రతిన్ = రతిని, కని = చూచి, తాను = తానుసైతము, కామ + ఆతురుఁడు + ఐ = కోరికచేఁ బీడితుఁడయి, మనస్ (ః) + వికారమున్ = చిత్త వికారమును, పొందెన్.

తాత్పర్యము ; వసంతమున విశాలములైన యుద్యానముల యందమును సంతోషముతోఁ జూచి, యనురాగ మతిశయింప, మన్మథుఁడు సైతము రతిదేవిని జూచి కామపీడితుఁడయి చిత్తవికృతిని బొందెను.

విశేషములు : ఎల్లరకును మనోవికారమును బుట్టించు మన్మథుఁడే వసంతమునఁ గామాతురుఁడై మనోవికారమును బొందె ననుటచే వసంతుని శక్తి యెంతటిదో తెలియుచున్నది.

పొలుపు - పొల్పు - పదమధ్య 'ల' యందలి యుత్వమునకు లోపము. బాల. ప్రకీర్ణక. 17. విపుల + ఆరామము = విపులారామము, కామ + ఆతురుఁడు = కామాతురుఁడు - సవర్ణదీర్ఘ సంధులు. రాగ + ఉత్కట = రాగోత్కట - గుణసంధి. మనోవికారము - మనస్ + వికారము - మనః + వికారము - మన + ఉ + వికారము - మనోవికారము - విసర్గసంధి.

సీ. లత్తుకరసమున జొత్తిల్లఁ బదతల
ముల నరచేతుల మోవిఁబూసి,
నవకుసుమంబుల నానా విధంబుల
తొడవులు రచియించి తొడివి వేడ్క,
రాజీవ పుష్ప పరాగంబుఁ గబళించి
పిలసిల్లు సీమంతవీథిఁ బోసి,
యరవిరి సురపొన్న యకరువు వరుసతో
నలకలఁ జిన్నిపు వ్వలికి కలయ,

తే. సలలితంబగు పుప్పొడి చల్లి పిఁదపఁ
జన్నుఁగవమీఁదఁ దోయుచుఁ జెన్ను మిగుల,
సుదతిఁ గై సేసి ప్రీతితోఁ జూచుచుండె
భావజన్ముండు వచ్చిన పనియు మఱచి. 115

అర్థము: భావజన్ముండు = మన్మథుఁడు.

చిత్త-లాలసమునన్ = లాలసముతో, ... = ..., పద-తలములన్ = పాదములందును, అరచేతులన్ = అరచేతులందును; మోవిన్ = పెదవియందును, వ్రాసి,

నవ-కుసుమంబులన్ = క్రొంబూలతో, నానా-విధములన్ = పెక్కువిధముల, తొడవులు = అలంకారములు, రచియించి = నిర్మించి, వేడ్కన్ = వేడుకతో, తొడిగి = తాల్చి.

రాజీవ-పుష్ప-పరాగంబున్ = తామరపూల పుప్పొడిని, పట్టి = గ్రహించి, పిలసిల్లు = ప్రకాశించునట్టి, సమంచత్-చేలన్ = పావడను, దాల్చి.

అలరు-పరి = చిగురు చిలికించిన, ఘనసారము = పచ్చకర్పూరము, అకరువు-వరుసలోన్ = కేసరముల వరుసతో, అలరారన్ = ప్రకాశించునట్లు, విన్నిఘషట్టు, కలయన్ = అంతటను, అదరి = చెదిరి ప్రోచ్చి,

సలలితంబు + అగు = మనోహరమైన, పుప్పొడిన్. చల్లి = చాల్చి, పిఁదపఁజన్నుఁగవమీఁదన్ (పిఁదప + చన్ను + కవ) = పెద్ద చనుదోయిమీఁద. తోయుచున్, చెన్ను = అందము. మిగులన్ = అతిశయించఁగా, సుదతిన్ = స్త్రీని (రతిని), కై సేసి = అలంకరించి, వచ్చిన-పనియున్ = తాను వచ్చిన పనినైనను, మఱచి, ప్రీతితోన్ = ప్రేమతో, చూచుచున్ + ఉండెన్.

తాత్పర్యము: మన్మథుఁడు లాలసముతో నెట్టుకొనినట్లు పాదములందును అరచేతులందును, పెదవియందును వ్రాసి, క్రొంబూలతోఁ బలువిధముల భూషణముల రచించి వానిని వేడుకతోఁ దాల్పఁజేసి, తామరపూలపుప్పొడిని గ్రహించి మెప్పునట్టి

పాపటను బోసి. సగము విచ్చిన సురపొన్నపూల కేసరములతో ముంగురులయందుఁ జిన్నిపువ్వు చెరివి, పుప్పొడిని రాల్చి నిక్కుచనుదోయిపైఁ బోసి, యంద మతిశ యించునట్లు రతి నలంకరించి, వచ్చినపనిని మఱచి, ప్రీతితోఁ జూచుచుండెను.

విశేషములు : అలక్తక (వికృతి) - లాక్ష (ప్రకృతి). వీఁగుఁజన్నుఁగవ = వీఁగు + చన్ను + కవ. 'సమాసంబుల నుదంతంబులగు స్త్రీ సమంబులకును, బహువచనంబులకును పరుషసరళంబులు పరంబు లగునపుడు నుగాగమం బగు.' వీఁగు + ను + చన్ను + ను + కవ, బాల. సంధి. 25. 'ద్రుతప్రకృతికముమీఁది పరుషములకు సరళము లగు.' బాల. సంధి. 16. వీఁగు + ను + జన్ను + ను + గవ. 'ఆదేశసరళములకు ముందున్న ద్రుతమునకు బిందుసంశ్లేషములు విభాష నగు.' బాల. సంధి, 17. వీఁగుఁజన్నుఁగవ. అలంకారము స్వభావోక్తి.

వ. ఇట్లఖిల భువన భవనాపూరితంబై సకల జనానందకరంబై యతి రమణీయంబైన వసంతోత్సవంబునం దత్కాలోచిత క్రీడా పరవశుండై కంతుండు బెదరి నిజాగమనప్రయోజనంబు దలంచి యక్షణంబ. 116

అర్థము: ఇట్లు, అఖిల - భువన - భవన + ఆపూరితంబు + ఐ = ఎల్ల లోకము లనెడి యిండ్లయం దంతట నిండినదయి, సకల-జన + అనందకరంబు + ఐ = ఎల్ల జనులకు నానందమును గూర్చునదియై, అతి- రమణీయంబు + ఐన = మిక్కిలి సుందరమైన. వసంత + ఉత్సవంబునన్, తద్ + కాల + ఉచిత- క్రీడా- పరవశుండు + ఐ = ఆ కాలమునకుఁ దగిన యాటలచే నొడలు తెలియనివాఁడయి. కంతుండు = మన్మథుఁడు, బెదరి. నిజ + ఆగమన- ప్రయోజనంబు = తనదైన రాకవలని ప్రయోజనమును, తలంచి, అక్షణంబు + అ = వెంటనే.

తాత్పర్యము : ఇట్లు ఎల్లభువనములనెడి భవనములందంతటను నిండినదయి. జనులకందఱ కానందమును గూర్చునదయి మిక్కిలి మనోహరమైన వసంతోత్సవము నందు ఆ కాలమునకుఁ దగిన క్రీడలచే నొడలుతెలియనివాఁడయి మన్మథుఁడు భయపడి తన వచ్చినపనిని దలఁచి. వెంటనే - తరువాతి పద్యముతో నన్వయము.

మ. దళితాంభోజదళాంగుళీతలతనుత్రాణంబులుం, గోమలే
క్షుల సచ్చాపము, నబ్జసూత్రగుణముం, జూతాంకురాశోకకు
ట్మల జాతిప్రసవాస్త్ర పూర్ణశరధుల్, మంత్రించి వశ్యాక్షతా
ముల సన్నాహము సేసి, మారుఁడు జగత్క్షోభంబు సంధిల్లఁగాన్. 117

అర్థము ; మారుఁడు = మన్మథుఁడు, దళితాం .... త్రాణంబులున్: దళిత = వికసించిన, అంభోజ = పద్మముయొక్క, దళ = రేకు లనెడి, అంగుళీ-తల = వ్రేళ్ల, తనుత్రాణంబులున్ = కవచములును, కోమల + ఇక్షు = మనోహరమైన చెఱకు అనెడి, సత్ + చాపమున్ = మంచి విల్లును, అబ్జ-సూత్ర-గుణమున్ = తామరతూఁడినారయనెడి అల్లెత్రాటిని, చూతాం .... శరధుల్: చూత + అంకుర = మామిడి మొలకలు, అశోక-కుట్మల = అశోకపుష్పములమొగ్గలు, జాతి-ప్రసవ = జాజిపూలు అనెడి, అస్త్ర = బాణములతో, పూర్ణ = నిండిన, శరధుల్ = అమ్ముల పొదులను, మంత్రించి, వశ్య + అక్షత + అములన్ = వశముచేసికొనుటకైన అక్షతలు మున్నగువానిచే, సన్నాహము = యుద్ధప్రయత్నము, చేసి, జగత్ + క్షోభంబు = లోకవ్యాకులత, సంధిల్లఁగాన్ = కలుగఁగా.

తాత్పర్యము : మన్మథుఁడు వికసించిన తామరరేకులనెడి వ్రేళ్లకవచము లను, చెఱకనెడివిల్లును, తామరతూఁడినారనెడి నల్లెత్రాటిని, మామిడిమొలకలు, అశోకపుష్పముల మొగ్గలు, జాజిపూలు అనెడిబాణములతో నిండిన యమ్ములపొదు లను, మంత్రించిన వశీకరణాక్షతలను - అనువానితో లోకములు గలఁగునట్లు యుద్ధప్రయత్నము చేసి - తరువాతి వచనముతో నన్వయము.

విశేషములు : అలంకారము రూపకము. శరధి = అమ్ములపొది. (నానా.) సముద్రము.

---

1. వా. ప్రతి. శీ తను శిరస్త్రాణంబులుం.

వ. ఇట్లసమశరుండు సమరసన్నద్ధుండై సకలజనంబులు నభినవ వసంతోత్సవంబున ననురాగరసపూరితహృదయులై పరవశులై యున్నం గని హరగిరిజల కంతకుం దమయంతన సంగమం బగు. నా వచ్చిన కెలసంబు వసంతువలనన తీరకున్నె యని పరమేశ్వరావా సంబున కనతిదూరంబుగాఁ జని ముందట. 118

అర్థము : ఇట్లు, అసమ-శరుండు = బేసిసంఖ్యగల (అయిదు) బాణములు గలవాఁడు - మన్మథుఁడు, సమర-సన్నద్ధుండు + ఐ = యుద్ధసంసిద్ధుఁడయి, సకల-జనంబులున్ = ఎల్లజనులును, అభినవ- వసంత + ఉత్సవంబునన్ = నూతన వసంతోత్సవమునందు, అనురాగ-పూరిత- హృదయులు + ఐ = ప్రేమపూర్ణములైన హృదయములు గలవారయి, పరవశులు + ఐ = ఒడలుతెలియనివారయి, ఉన్నన్ = ఉండఁగా, కని = చూచి, హర - గిరిజలకున్ = శివునకును, పార్వతికిని, అంతకున్, తమ + అంతన్ + అ = స్వయముగానే - తన ప్రయత్నము లేకయే, సంగమంబు = కలయిక, అగున్, నా వచ్చిన - కెలసంబు = నేను వచ్చిన పని, వసంతు-వలనన్ + అ = వసంతునివలననే, తీరక + ఉన్నె = నెఱవేఱకుండునా, అని, పరమేశ్వర + ఆవాసంబునకున్ = శివుని స్థానమునకు, అనతి దూరంబుగాన్ = కొలఁది దూరముగా, చని, ముందటన్ = ఎదుర.

తాత్పర్యము : ఈ రీతిగా మన్మథుఁడు యుద్ధమునకు సంసిద్ధుఁడై యెల్ల వారును నూతన వసంతోత్సవమునందుఁ బ్రేమపూరితహృదయములు గలవారయి యొడలుతెలియనిస్థితిలో నుండుట చూచి, 'శివునకును బార్వతికిని దన ప్రయత్నము లేకయే కలయిక గలుగును. నేను వచ్చిన పని వసంతునివలననే నెఱవేఱకుండునా?' యని పరమేశ్వరుఁడున్నచోటి కించుకదూరముగాఁ బోయి, ఎదుట - మీఁది పంచ మాశ్వాసమునందలి పద్యముతో నన్వయము.

విశేషములు : నా వచ్చిన, నేను వచ్చిన. 'ధాతుజవిశేషణ భావార్థక పూర్వ వ్యవహితావ్యవహిత కర్తృపద ప్రథమకుఁ దఱచుగ యొక్క-షష్ఠి యగు.' ప్రౌఢ. కారక. 15. నాయొక్క-వచ్చిన. 'యొక్క-కు లోపంబు బహుళంబు.' ప్రౌఢ. కారక. 16. నా వచ్చిన. వచ్చిన కెలసంబు - 'కర్మాదులకుఁ బ్రాధాన్యవివక్షయందు ధాతుజ విశేషణంబులు కర్తతోడంబోలె వానితోడ సమసించు.' బాల. కారక. 26.

ఆశ్వాసాంతము

మహాస్రగ్ధర

హర హా సాకాశగంగాత్యమలజల మరాళాబ్జ హిమానీధరా
ధర కర్పూ రేందు కాకోదరవరపతి దిగ్దంతి పక్షీర నీరా
కర ముక్తాహార కుందోత్కర రజత శరత్కౌముదీ ప్రోద్యత్కీర్తీ
శ్వరు, నాత్మారాము. వాక్పతు, వరగుణు, సర్వజ్ఞు నజ్ఞానదూరున్.' 19

అర్థము: హర ... స్ఫూర్తీశ్వరున్: హర = శివుని, హాస = నవ్వు, ఆకాశగంగా = ఆకాశగంగయందలి, అమల = నిర్మలమైన, జల=నీరు, మరాళ= హంస, అబ్జ=తెల్లతామర, హిమానీ-ధరాధర = మంచుకొండ, కర్పూర=కర్పూరము, ఇందు = చంద్రుడు, కాకోదర - వరపతి = నాగరాజు, దిక్ (క్) + దంతి = దిగ్గజప్రముఖు - ఐరావతము, క్షీర-నీరాకర = క్షీరసముద్రము, ముక్తా-హార=ముత్యాల పేరు, కుంద + ఉత్కర = మొల్లల సమూహము, రజత = వెండి, శరత్-కౌముదీ = శరత్కాలపు వెన్నెల - అనువానివలె, ప్రోద్యత్ = ప్రకాశించు, కీర్తి + ఈశ్వరున్ = కీర్తిగల ప్రభువును, ఆత్మారామున్ = ఆత్మ యందే రమించువాని యందే తృప్తుఁడై యుండువానిని - యోగిని, వాక్ - పతిన్ = విద్యలచే శ్రేష్ఠుఁడైనవానిని, సర్వజ్ఞున్ = అన్నియుఁ దెలిసినవానిని, అజ్ఞాన-దూరున్ = అజ్ఞానమునకు దవ్వయిన వానిని - కృతిపతి యగు జంగమమల్లికార్జునుని విశేషణములు.

తాత్పర్యము: శివుని నవ్వు, ఆకాశగంగ నిర్మలజలము, హంస, తెల్ల తామర, మంచుకొండ, కర్పూరము, చంద్రుఁడు, ఫణిరాజు, ఐరావతము, పాల సంద్రము, ముత్యాలపేరు, మొల్లల సమూహము, వెండి, శరత్కాలపు వెన్నెల - అనువాని వలెఁ దెల్లఁగాఁ బ్రకాశించు కీర్తికిఁ బ్రభువైనవాఁడును, ఆత్మారాముఁడును, విద్యాశ్రేష్ఠుఁడును, సర్వజ్ఞుఁడును, అజ్ఞానమునకు దవ్వయినవాఁడును - అగు కృతిపతి - జంగమ మల్లికార్జునుని.

విశేషములు: అతి + అమల - అత్యమల - యణాదేశసంధి. మరాళ + అబ్జ = మరాళాబ్జ - సవర్ణదీర్ఘ సంధి. కర్పూర + ఇందు = కర్పూరేందు - గుణసంధి. దిశ్ + దంతి - దిక్ + దంతి - దిగ్దంతి. శరద్ + కౌముదీ - శరత్కౌముదీ.

అనునాపికాంతస్థభిన్నములైన హల్లులకు (ఝల్లులకు) కఠినహల్లులు (ఖరులు) పరము లగునప్పు వాని వర్గమునందలి ప్రథమవర్ణములు (చరులు) ఆదేశముగా వచ్చును.

క. దీపిత విమల జ్ఞాన సు
దీపిత సుఖ దళిత మోహ తిమిరాపహర
వ్యాపారు, సర్వ సుజన ద
యాపరు, నచలాత్ము, మల్లికార్జునదేవున్. 120

అర్థము : దీపిత .... వ్యాపారున్: దీపిత = ప్రకాశించిన, విమల = నిర్మలమైన, జ్ఞాన = జ్ఞానముచేత, సుదీపిత = మిక్కిలి ప్రకాశింపఁజేయఁబడిన, సుఖ = సౌఖ్యముచే, దళిత = చీల్పఁబడిన - నశింపఁజేయఁబడిన, మోహ-తిమిర = అజ్ఞానమనెడిచీఁకటిని, అపహర = పోఁగొట్టునట్టి, వ్యాపారున్ = పనిగలవాఁడును, సర్వ - సుజన - దయా-పరున్ = ఎల్ల మంచివారియెడను దయగలవాఁడును, అచల + ఆత్మున్ = చలింపని మనస్సుగలవాఁడును, అగు, మల్లికార్జునదేవున్ = దేవుఁడైన జంగమమల్లికార్జునుని - కృతిపతిని.

విశేషములు ; అలంకారము రూపకము.

మహాస్రగ్ధర

శివధర్మార్థప్రవీణున్, సితయశుఁ, ద్రిజగత్సేవ్యు, వేదాంతవేద్యు న్
భవభావాభావదూరున్, బ్రవిమలగుణు, నభ్రాంతచేతస్కుఁ, సంగో
ద్భవ వాణాఘోరతాపాపహరు, నచలు, నిష్పాపు, నీశాంఘ్రితోయో
ద్భవసద్భృంగాయమానోత్తమహృదయు, మహోత్సాహు, నానంద
దేహున్. 121

అర్థము : శివ - ధర్మ + అర్థ - ప్రవీణున్ = శివధర్మములయొక్క అర్థమునందు నేర్పరియైనవాఁడును, సిత - యశున్ = తెల్లనికీర్తిగలవాఁడును, త్రిజగత్ + సేవ్యున్ = ముల్లోకములవారిచే సేవింపఁదగినవాఁడును, వేదాంత -

1. వా. ప్రతి నిర్భగ్ను.

[illegible]

[illegible]

విశేషములు : [illegible] అటు + ఈదు = [illegible] — [illegible]. ఆహారి = [illegible] అది. - [illegible]. సూ. ని. త్వంగాయమాన-ఉపమానమునైన అజంత [illegible] 'యమాన' ప్రత్యయము [illegible]. ఈ ప్రత్యయము పరమగునప్పుడు పూర్వాక్షరమునకు దీర్ఘము వచ్చును. [illegible]. త్వంగ+యమాన - త్వంగాయమాన.

క. దురిత ఘనాఘన మారుతు,
నరిషడ్వర్గాటవీదవానలుఁ, గర్మాం
బురుహ సుధాకరు, భవసా
గర కుంభజు, దివ్యమునిశిఖామణి, ననఘున్. 122

అర్థము: దురిత - ఘనా-ఘన - మారుతున్ = పాపములనెడి వర్షాకాలపు మేఘములకు వాయువైనవాఁడును, అరి - షట్ + వర్గ + అటవీ - దవ + అనలున్ = శత్రువులైన ఆఱుగురి సమూహము (కామము, క్రోధము, లోభము, మోహము మదము, మాత్సర్యము) అనెడి అడవికిఁ గార్చిచ్చు అయినవాఁడును, కర్మ + అంబురుహ - సుధాకరున్ = కర్మములనెడి పద్మములకుఁ జంద్రుఁడైనవాఁడును, భవ - సాగర - కుంభజున్ = సంసారమనెడి సముద్రమునకు అగస్త్యుఁడైనవాఁడును, దివ్య - ముని - శిఖామణిన్ = దేవమునులలోఁ దలమానికమైనవాఁడును (శ్రేష్ఠుఁడును,) అనఘున్ = పాపములేనివాఁడును - అగు జంగమమల్లికార్జునుని.

తాత్పర్యము: పాపములనెడి వర్షాకాలపు మేఘములకు వాయువైనవాఁడును, కామాదులగు ఆఱుగురు శత్రువులనెడి యడవికిఁ గార్చిచ్చు అయినవాఁడును, కర్మములనెడి పద్మములకుఁ జంద్రుఁడైనవాఁడును, సంసారమనెడి సముద్రమునకు అగస్త్యుఁడైనవాఁడును, దేవమునులలోఁ దలమానికమైనవాఁడును, పాపరహితుఁడును అగు జంగమమల్లికార్జునుని.

విశేషములు: అలంకారము రూపకము.

వసంతతిలకము

సాహిత్యవేది, గుణశక్తు, వివేకయుక్తున్,
మోహాదిదోషపథముక్తు, బుధానురక్తున్,
మాహేశ్వరప్రకరమాన్యు, సదా వదాన్యున్,
దేహేంద్రియౌఘజయధీరు, సుమేరుసారున్. 132

అర్థము: సాహిత్య - వేదిన్ = సారస్వతము తెలిసినవాఁడును, గుణ-శక్తున్ = గుణములచేత సమర్థుఁడైనవాఁడును, వివేక - యుక్తున్ = వివేకముతోఁ

గూఢినవాఁడును, మోహ + ఆది. దోష . పద . ముష్టిన్ = మోహము మొదలుగు దోషముల మార్గమునే పిడికిలియందుంచినవాఁనిని . మోహాదిదోషమార్గము విడిచిన వాఁడును. దమ + ఆదియుక్తున్ = ఇంద్రియదమనము మొదలగువానిఁ గలవాఁడును, మహోర్జిత. ప్రదీప్త . మాన్యున్ = గొప్పదైన తేజస్సుచే ప్రకాశించినవాఁడును. సదా. సమాన్యున్ = ఎల్లప్పుడు సమానుఁడయినవాఁడును, దేహ + ఇంద్రియ + క్షమ . జయ . క్షమున్ = దేహమునందలి ఇంద్రియముల సమూహమును జయించుటయందు సమర్థుఁడై . ఇంద్రియములను గెలుచుటచే . క్షమయైనవాఁడును, సు . మద . సారున్ = మేలయినవారియందు సారము గలవాఁడును, అగు, జంగమమల్లికార్జునుని.

తాత్పర్యము : సాహిత్యము చదివినవాఁడును, గుణములచే సమర్థుఁడైన వాఁడును, వివేకవంతుఁడును, మోహము మొదలగు దోషముల మార్గమును విడిచిన వాఁడును, ఇంద్రియదమనము మొదలగువానిఁ గలవాఁడును, మహోర్జితమగు తేజస్సుచే ప్రకాశించిన వాఁడును, ఎల్లప్పుడు సమానుఁడయినవాఁడును, దేహేంద్రియములు జయించుటచే క్షమయైనవాఁడును, మేలయినవారియందు సారము గలవాఁడును అగు జంగమమల్లికార్జునుని.

విశేషములు : గుణశక్తున్ . వివేకయుక్తున్ . ముక్తున్, యుక్తున్, మాన్యున్ . సమాన్యున్, క్షమున్ . సారున్ . అంత్యప్రాసము, ఇంద్రియ + ఉష = ఇంద్రియోష . వృద్ధిసంధి. వసంతతిలకవృత్తలక్షణము: నాలుగు పాదములుండును. ప్రతిపాదమునకు త, భ, జ, జ, గగ అను గణములుండును. మొదటి యక్షరమునకును ఎనిమిదవ యక్షరమునకును యతిమైత్రి. ప్రాసనియమము గలదు.

గద్యము

ఇది శ్రీమజ్జంగమ మల్లికార్జునదేవ దివ్యశ్రీపాదపద్మ ప్రసాదాసాదిత కవిరాజశిఖామణి నన్నెచోడదేవ ప్రణీతంబైన కుమారసంభవం బను కథయందుఁ చతుర్థాశ్వాసము

పూర్వవ్యాఖ్య ఇతనే.

మ. ఇది శ్రీజొన్నలగడ్డ వంశమణి యామ్నాయ్యంజయాఖ్యుండు స
మ్మదవ మొప్పారఁ గుమారసంభవము శ్రీమన్నన్నెచోడాఖ్య వి
ద్వదధీశోక్తము శాబ్దికార్థ వివిధ స్వారస్య తాత్పర్యముల్
చదువొప్పన్ వచియించి మన్చు విలసత్సంజీవనీ వ్యాఖ్యయా.

కుమారసంభవము

పంచమాశ్వాసము

శ్రీ భాషాశ్రిత సన్నుత
బాభాసిత విమలవదనపంకరుహా(, తపః
శ్రీ భామా విభు, గుణర
త్నాభరణాభరణు, మల్లికార్జునదేవున్. 1

అర్థము : శ్రీ .... పంకరుహాన్ : శ్రీ = శోభాయుక్తమైన, భాషా = వాక్కునకు, ఆశ్రిత = ఆశ్రయమైనది, సన్నుత = మిక్కిలి పొగడఁబడినది. సత్ + నుత = పండితులచేఁ బొగడఁబడినది, బాభాసిత = మిక్కిలి ప్రకాశించినది, విమల = నిర్మలమయినది, అగు, వదన — పంకరుహాన్ = పద్మమువంటి ముఖము గలవాఁడును, తపస్ + శ్రీ - భామా - విభున్ = తపస్సు అనెడు లక్ష్మీదేవికిఁ బ్రభువైనవాఁడును, గుణ .... భరణున్ : గుణ - రత్న + ఆభరణ = గుణములనెడు, రత్నభూషణములు, ఆభరణున్ = ఆభరణములుగాఁ గలవాఁడును, అగు, మల్లికార్జునదేవున్ = కృతిభర్తయగు జంగమ మల్లికార్జునదేవుని.

తాత్పర్యము : శ్రీకరమైన వాక్కునకు ఆశ్రయమయినది, పండితులచేఁ బొగడఁబడినది, మిక్కిలి ప్రకాశించినది, నిర్మలమయినది అగు ముఖపద్మము గలవాఁడును, తపోలక్ష్మికిఁ బ్రభువైనవాఁడును, సద్గుణములనెడు రత్నభూషణములు అలంకారములుగాఁ గలవాఁడును అగు కృతిభర్త జంగమమల్లికార్జునదేవుని,

విశేషములు : తపః శ్రీభామా - రూపకము. గుణరత్నాభరణ - రూపకము.

చ. అమరఁగ నింద్రియాళి విషయంబులతో విషయంబు లన్నియుం
గ్రమమున గాడ్పులం దడఁచి, గాడ్పులఁ గూర్చి మనంబునందు, సం
యమమతిఁ దన్మనం బొనర నాత్మనియం దొడఁగూర్చి, యాత్మయో
గమునఁ జలింపకున్న శివుఁ గాంచె మనోజుఁడు దవ్వుదవ్వులన్. 2

అర్థము : ఇంద్రియ + ఆళి = ఇంద్రియముల సమూహము, విషయంబులతోన్ = ఇంద్రియగోచరమగు శబ్దాదికముతో, అమరఁగన్ = ఒప్పియుండఁగా, విషయం బుల + అన్నియున్ = ఇంద్రియార్థము లన్నియును, క్రమమునన్ = క్రమముగా, గాడ్పులందున్ = వాయువులందు, అడఁచి = అణఁచివైచి, గాడ్పులన్ = వాయువు లను, మనంబునందున్ = మనస్సునందు, కూర్చి = కూడునట్లుచేసి, నియమ-మతిన్ = నియమముతోఁగూడిన బుద్ధితో, తత్ + మనంబు = ఆ మనస్సు, ఒనరన్ = ఒప్పునట్లు, ఆత్మనియంమన్ = పరమాత్మయందు, ఉనఁగూర్చి = ఉండునట్లుచేసి, ఆత్మ-యోగమునన్ = పరమాత్మధ్యానమునందు, నిలిచి + ఉన్న = కదలకున్న. శివున్ = ఈశ్వరుని, మనోజుఁడు = మన్మథుఁడు. దవ్వు దవ్వులన్ = దూరదూరమున, కాంచెన్ = చూచెను.

తాత్పర్యము : ఇంద్రియముల ఇంద్రియగోచరమగు శబ్దాదులతో ఒప్పి యుండఁగా, ఆ యింద్రియార్థముల నన్నిటిని వాయువులం దణఁచివైచి, ఆ వాయువు లను మనస్సునందుఁ గూర్చి, నియమబుద్ధితో ఆ మనస్సును పరమాత్మయం దుండు నట్లుచేసి, పరమాత్మధ్యానమునఁ గదలకున్న పరమేశ్వరుని మన్మథుఁడు దూరదూర ముననే చూచెను.

విశేషములు : ఆత్మ- ఆత్ముఁడు 'ఆత్మేమనిజంతంబులకు, నాంతంబులగు మనుజసంజ్ఞలకు డుత్వంబు బహుళంబుగా నగు.' బాల. తత్సమ. 77.

క. హరుఁ గని ప్రాణము లుల్లని
విరిసిన మెయిమఱచి పచ్చవిల్తుఁడు దగఁ జి
త్తరువున వ్రాసిన కాముని
కరణి నచైతన్యవృత్తిఁ గదలక నిల్చెన్. 3

అర్థము : పచ్చవిల్తుఁడు = పచ్చనివిల్లు గలవాఁడు - చెఱకువిల్లు గలవాఁడు— మన్మథుఁడు, హరున్ = శివుని, కని = చూచి, ప్రాణము, ఉల్లు + అని = ఝల్లుమని, విరిసినన్ = పోఁగా, మెయి- మఱచి = ఒడలు మఱచి, తగన్ = ఒప్పునట్లు, చిత్తరువునన్ = పటమునందు, వ్రాసిన, కాముని - కరణిన్ = మన్మ థుని విధమున, అచైతన్య-వృత్తిన్ = నిర్జీవమైన వర్తనముతో, కదలక, నిల్చెన్.

తాత్పర్యము : మన్మథుఁడు శివునిఁ జూడఁగనే ప్రాణముపోయినంతపనియై, ఒడలు మఱచి, చిత్రపటమునఁ జిత్రింపఁబడిన మన్మథుని విధమున జీవములేక కదలక నిలిచెను.

విశేషములు ; అలంకారము ఉత్ప్రేక్ష. పచ్చవిల్తుఁడు - పచ్చనివిల్లు గలవాఁడు- బహువ్రీహి. 'బహువ్రీహిని సమాసాంతకార్యంబులుం గానంబడియెడి.' బాల. సమాస. 22.

వ. ఇట్లు నిలిచి యా క్షణంబ రతిప్రబోధితుండై త్రిణయను సమాధి వైకల్యంబు సేయ నుపక్రమించి నిజమూలబలంబుల నవలోకించిన. 4

అర్థము : ఇట్లు, నిలిచి, ఆ- క్షణంబు + అ = వెంటనే, రతి- ప్రబోధితుండు + ఐ = రతిచే మేల్కొలుపఁబడినవాఁడయి, త్రిణయను = త్రినేత్రుని- (శివుని) యొక్క-, సమాధి- వైకల్యంబు = ధ్యానభంగము, చేయన్, ఉపక్రమించి= పూని, నిజ - మూల - బలంబులన్ = తనపైన ప్రధానసేనలను, అవలోకించినన్ = చూడఁగా.

తాత్పర్యము : ఈ రీతిగా నిలిచి ఆ క్షణమే రతిచే మేలుకొలుపఁబడినవాఁడయి ముక్కంటి ధ్యానమును భంగపఱుపఁబూని తన మూలబలములను జూడఁగా- తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : త్రి + నయను- త్రిణయను, త్రినయను - రెండురూపములును గలవు. త్రిణయను సమాధివైకల్యంబు - సమాధివైకల్యమను సిద్ధసమాసము నందలి యేకదేశమైన సమాధిశబ్దముతో 'త్రిణయను' శబ్ద మన్వయించుచున్నది. •కొన్నియెడల సిద్ధసమాస మధ్యగతపదంబులతోఁ దద్భిన్నపదంబుల కన్వయంబు చూపట్టెడి.' ప్రౌఢ. సమాస. 35.

మ. అలి ఝుంకారముఁ, గీచకస్వనముఁ, గీరాలాపముల్, మత్తకో
కిల నాదంబులు, శారికా రవములుం, గేకీ నినాదంబులుం
గలయన్ ఖోరన మంజుగానములతో గంధర్వగీతంబు ల
గ్గలమై ఖోరన మ్రోసె నీశ్వరు లతాగారంబు ఘూర్ణిల్లఁగన్ . 5

అర్థము : అలి - ఝంకారములన్ = తుమ్మెదలయొక్క ఝుమ్మను ధ్వనియును, కీచక - స్వనములన్ = బొంగువెదుళ్ళ ధ్వనియును, కీర + ఆలాపములన్ = చిలుకల పలుకులను, మత్త-కోకిల - నాదంబులన్ = మదించిన కోకిలల ధ్వనులను, శారికా - రవములన్ = గోరువంకల ధ్వనులను. కేకి - నినాదంబులన్ = ఆడునెమళ్ల ధ్వనులను, ఏకమున్ = ఏకీభవింపఁగా, భూరిగాన్ = అధికముగాఁగా, గంధర్వ - గీతంబులు = గంధర్వుల పాటలు, మంజు - గానములతోన్ = మనోహరములైన గానములతో, అగ్గలము + ఐ = అధికమును, శివుని = శివునియొక్క, లతా + అగారంబు = తీవెయిల్లు మార్మ్రోఁగఁగన్ = ప్రతిధ్వనించఁగా, భోరన్ + మ్రోసెన్ = భోరుమని ధ్వనించెను.

తాత్పర్యము : తుమ్మెదల ఝంకారము, బొంగువెదుళ్ళ ధ్వని, చిలుకల పలుకులు. మదించిన కోకిలల ధ్వనులును, గోరువంకల ధ్వనులును, ఆడునెమళ్ళ కేకలును, ఏకీభవించి అధికముగాఁగా, గంధర్వులపాటలు మనోహరములైన గానములతో సరియై శివుని తీవెయిల్లు కలగుండుపడఁగా భోరుమని మ్రోసెను.

వ. ఇట్లు విపరీత మధుజృంభణంబు గని విస్మితుండగుచు. ౮

అర్థము : ఇట్లు, విపరీత - మధు - జృంభణంబు = ప్రతికూలమైన - అసత్యమైన, వసంతముయొక్క, అతిశయమును, కని = చూచి, (నంది), విస్మితుండు + అగుచున్ = ఆశ్చర్యమునొందినవాఁడగుచు.

తాత్పర్యము : ఇట్లు ప్రతికూలమైన - అకాలికమగుటచే అసత్యమైన వసంతుని విజృంభణమును జూచి నంది ఆశ్చర్యపడినవాఁడగుచు - తరువాతిపద్యముతో నన్వయము.

క. శంభు సమాధికి విఘ్నా
రంభములై యురియు వనచరములకు జిహ్వా
స్తంభ గతిస్తంభ మనః
స్తంభములుగ నంది హస్తసంజ్ఞ యొనర్చెన్.

అర్థము : శంభు - సమాధికిన్ = ఈశ్వరుని ధ్యానమునకును, విఘ్న + ఆరంభములు + ఐ = విఘ్నముగలిగించు పూనికగలవై, ఉరియు = మ్రోయునట్టి,

వనచరములకున్ = అడవియందుఁ జరించు పశుపక్ష్యాదులకు, జిహ్వా - స్తంభ - గతి - స్తంభ - మనస్ (శ) - స్తంభములు + కన్ = నాలుక పడిపోవుట, గమన మాఁగిపోవుట, మనస్సు నిలిచిపోవుట అగునట్లు, నంది, హస్త - సంజ్ఞన్ = చేసన్నను, ఒనర్చెన్ = చేసెను.

తాత్పర్యము : ఈశ్వరుని ధ్యానమునకు విఘ్నము గలిగించనివియై మ్రోయు వనచరములకు నాలుక, గమనము, మనస్సు స్తంభించునట్లు నంది చేసన్న గావించెను.

విశేషములు ; సంస్కృత కుమారసంభవమునందును 'నన్దీ ముఖార్పితైకాఙ్గుళిసంజ్ఞయైవ, మా చాపలా యేతి గణాన్ వ్యనైషీత్' అని కలదు. కుమార. సం. 3,41

వ. అంతం ద దాజ్ఞాప్రభావంబున. 8

అర్థము : అంతన్ = తరువాత, తద్ + ఆజ్ఞా - ప్రభావంబునన్ = ఆతని (నంది) ఆనయొక్క మహిమచే.

తాత్పర్యము : అంత నంది యాజ్ఞాశక్తిచే-తరువాతి పద్యముతో నన్వయము.

క. మెలఁగక మృగములు, విహగము
లులియక, లేఁబొలలఁ జిగుళు లొత్తక, మలయా
నిలుఁడు సలింపక, నెలవుల
నలవడి వన మమరెఁ జిత్రితాటవి వోలెన్. 9

అర్థము : మృగములు = జంతువులు, మెలఁగక = చరింపక, విహగములు = పక్షులు, ఉలియక = ధ్వనిచేయక, లేఁబొలలన్ (లేఁత + పొలలన్) = లేమొలకలందు, చిగుళులు = చివుర్లు, ఒత్తక = బయలుదేఱక, మలయ + అనిలుఁడు = మలయపవనుఁడు - దక్షిణపు గాలి, చలింపక = కదలక, నెలవులన్ = ఉన్నచోటులందే, అలవడి = ఉండి, వనము = అడవి, చిత్రిత + అటవి + పోలెన్ = చిత్తరువున లిఖింపఁబడిన అడవివలె, అమరెన్ = ఒప్పెను.

తాత్పర్యము : జంతువులు చరింపక, పక్షులు ధ్వనిచేయక, లేమొలకలఁ జివురులు బయలుదేఱక, మలయపవనుఁడు కదలక ఉన్నచోటులందే ఉండుచు నా వనము చిత్తరువున లిఖింపఁబడినదా యనునట్లు ఒప్పెను.

విశేషములు: అలంకార ముత్ప్రేక్ష. లేఁబొఅలఁ జిగుళు లొత్తుటయు సమాధిభంగకారణముగాఁ జెప్పుట గమనింపఁదగినది.

చిగుళులు - చిగురు + లు. 'బహువచనము పరంబగునపు డసంయుక్తంబులయి యుదంతంబులయిన డ - ల - ర ల కలఘు లకారంబు బహుళంబుగా నగు,' బాల. ఆచ్ఛిక.13, చిగుళులు. మలయానిలుఁడు సలింపక - మలయానిలుఁడు + చలింపక. 'తెనుఁగులమీఁది సాంస్కృతిక పరుషములకు గ స డ ద వలు రావు.' బాల.సంధి.14. ఇచ్చట 'చలింపక'లోనిది సాంస్కృతికపరుషమైనను సాదేశమగుట విశేషము. మల యానిలుఁడు చలింపక యన్నను నిర్బాధమే. కాని యన్ని ప్రతులందును నిట్లే యుండుటచే మార్పలేదు.

'నిష్కమ్పవృక్షం, నిభృత ద్విరేఫం
మూకాణ్డజం, శాన్త మృగ ప్రచారమ్,
తచ్ఛాసనాత్ కానన మేవ సర్వం
చిత్రార్పితారమ్భ మి వావతస్థే.'

అను కాళిదాస కుమారసంభవ శ్లోకమునకు (3- 42) ఇది అనుకరణము.

వ. అంత మనసిజుండు త్రినయనాభిముఖుం డగుడును. 10

అర్థము: అంతన్, మనసిజుండు = మన్మథుఁడు, త్రినయన + అభి ముఖుండు = ముక్కంటి కెదురై నవాఁడు, అగుడును = అయినంతనే.

తాత్పర్యము: అంతట మన్మథుఁడు ముక్కంటివైపు తిరిగినంతనే - తరువాతి పద్యముతో నన్వయము.

క. మృడుపై ముంగలి సని తల
పడి మలయానిలుఁడు పోరు భరమై మదనుం
బడలువడఁ బఱచుక్రియఁ దడఁ
బడ ధూళియు గాడ్పు వీచెఁ బ్రతికూలంబై. 11

అర్థము : మలయ + అనిలుఁడు = మలయపవనుఁడు - దక్షిణపు గాలి, మృడుపైన్ = ఈశ్వరునిమీఁదికి, మ్రుంగలి + చని = ముందున్నవాఁడయి పోయి, తలపడి = ఢీకొని, పోరు = యుద్ధము, భరము + ఐ = అతిశయమై, మదనున్ = మన్మథుని, బడలువడన్ - బడలు + పడన్ = శ్రమపడునట్లు, పఱచు - క్రియన్ = బాధపెట్టు విధమున, ధూళియున్ = దుమ్మును, గాడ్పున్ = గాలియును, తడఁబడన్ = తొట్రుపడునట్లు, ప్రతికూలంబు + ఐ = అననుకూలమయి, వీచెన్.

తాత్పర్యము : మలయపవనుఁడు శివునిపైకి ముందు వెడలి, యతనితో ఢీకొని, యుద్ధము దుర్భరముకాఁగా, మన్మథుఁడు శ్రమపడునట్లు దుఃఖపెట్టు విధమున, దుమ్మును గాలియుఁ దొట్రువడఁ బ్రతికూలముగా వీచెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష. గాలి ప్రతికూలముగా వీచుట దుశ్శకునము.

వ. ఇట్లు సద్యోమరణసూచకంబులగు నపశకునంబులు గని మనంబునం గుసురుకొనుచుం జనిచని. 12

అర్థము : ఇట్లు, సద్యస్ (ః) + మరణ - సూచకంబులు + అగు = తత్క్షణమృతిని సూచించునవి యగు, అపశకునంబులు = దుశ్శకునములు, కని, మనంబునన్, కుసురు + కొనుచున్ = అలక్ష్యముచేయుచు, చని చని = పోయి పోయి.

తాత్పర్యము : ఈ రీతిగాఁ దత్క్షణమృతిని సూచించునట్టి యపశకునములు చూచి మనస్సున నలక్ష్యముచేయుచుఁ బోయి పోయి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : సద్యస్ + మరణ - పదాంతసకారమునకు విసర్గాదేశము. సద్యః + మరణ, హ్రస్వ అకారపూర్వక విసర్గమునకు హ్రస్వఅకారముకాని, మృదు హల్లులు (హశ్శులు) కాని పరములగునపుడు ఉకారాదేశము. పూర్వ అకారముతోఁ గూడి గుణసంధియు నయి సద్య+ఉ+మరణ - సద్యోమరణ అగును, అగు నపశకునంబులు - అగు + అపశకునంబులు. 'ఉదంతమగు తద్ధర్మార్థవిశేషణమున కచ్చు- పరమగునపుడు నుగాగమం బగు.' బాల.సంధి.33, అగు నపశకునంబులు, కుసురుకొను ఇతనిదేప్రయోగాంతరము - 4 - 55.

క. లోఁగుఁ దరమైన పొదరుల;
నాఁగిన శకునంబ తలఁచు నడుగడుగునకున్;
డాఁగఁ గెల నరయుఁ బ్రాణము
లీఁగుట కొడఁబడక మదనుఁ డెంతయు భీతిన్. 13

అర్థము : మదనుఁడు = మన్మథుఁడు, ప్రాణములు, ఈఁగుటకున్ = పోఁగొట్టుకొనుటకు, ఒడఁబడక = ఇష్టపడక, ఎంతయున్ = మిక్కిలి, భీతిన్ = వెఱపుతో, తరము + ఐన = దట్టమైన, పొదరులన్ = పొదలందు, లోఁగున్ = అడఁగును, అడుగు + అడుగునకున్ = మాటిమాటికిని, ఆఁగిన = అడ్డగించిన, శకునంబు + అ = శకునమే, తలఁచున్, డాఁగన్ = డాఁగికొనుటకు, కెలను = పార్శ్వము, అరయున్ = వెదకును.

తాత్పర్యము : మన్మథుఁడు ప్రాణములు పోఁగొట్టుకొనుట కిష్టపడక గొప్ప వెఱపుతో దట్టమైన పొదలలో నడఁగును - మాటిమాటికిని దన్నడ్డగించిన దుశ్శకునమునే తలఁచును, డాఁగికొనుటకుఁ బ్రక్కల నరయును.

క. తరు గుల్మాదుల మఱువునఁ
దరతరమ చలించి గడికిఁ దారుచుఁ బురసం
హరు నెయిదఁ జొచ్చెఁ గాముఁడు
కరివైరికిఁ జొచ్చు వేఁటకాఁడును బోలెన్. 14

అర్థము ; కాముఁడు = మన్మథుఁడు, కరివైరికిన్ = ఏనుఁగునకు శత్రువగు సింహమునకు, చొచ్చు = కడఁగు, వేఁటకాఁడును + పోలెన్ = వేఁటకాని విధమున, తరు-గుల్మ + ఆదుల = చెట్లు పొదలు మొదలగువానియొక్క, మఱువునన్ = మఱుఁగున, తరతరము + అ = క్రమముగా, చలించి, గడికిన్ = సమీపమునకు, తారుచున్ = పోవుచు, పుర - సంహరున్ = త్రిపురములను నశింపఁజేసినవానిని, శివుని, ఎయిదన్ + చొచ్చెన్ = వెంటాడఁబూనెను.

తాత్పర్యము : మన్మథుఁడు సింహమును వేఁటాడు వేఁటకాని విధమునఁ జెట్లు పొదలు మొదలగువాని చాటునఁ గ్రమముగాఁ గదలి దరిఁజేరుచు శివుని వెంటాడఁ బూనెను.

విశేషములు : అలంకార ముపమ.

వ. ఇ ట్లెట్టకేనియుం బరమేశ్వరావాసంబు చొత్తెంచి దహనాంబకు దృష్టిఁ దప్పించి కెలనం దమాలలతావేష్టితాశోకసహకారంబు నోలంబు గొని త్రినయనుం గనుంగొని. 15

అర్థము : ఇట్లు, ఎట్టకేనియున్ = ఎట్టకేలకు. పరమేశ్వర + ఆవాసంబు = శివుఁడున్నచోటు, చొత్తెంచి = ప్రవేశించి. దహన + అంబక - దృష్టిన్ = అగ్ని నేత్రుని - శివుని చూపును, తప్పించి = తప్పునట్లుచేసి - శివున కెదురుగా నుండక, కెలనన్ = పార్శ్వమున. తమాల - లతా - వేష్టిత + అశోక - సహకారంబున్ = చీఁకటిమ్రానితీవచేఁ జుట్టుకొనఁబడిన అశోకవృక్షముయొక్క తోడ్పాటును, ఓలంబు + కొని = చాటుచేసికొని, త్రినయనున్ = ముక్కంటిని - శివుని. కనుంగొని = చూచి.

తాత్పర్యము : ఇట్లు ఎట్టకేలకు శివుఁ డున్నచోటు ప్రవేశించి యతని కెదురుగా నుండక పార్శ్వమునఁ జీఁకటిమ్రానితీవ యల్లుకొనిన అశోకవృక్షమును జాటు చేసికొని ముక్కంటిని జూచి- తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : చొత్తెంచు = చొచ్చు + తెంచు. 'తెంచుధాతు వగ్వాదుల కనుప్రయుక్తం బగు.' బాల. క్రియ. 110. 'అయ్యది పరంబగునపుడు చువర్ణంబు లోపించు.' బాల. క్రియ. 112. చొచ్ + తెంచు- ఒకహల్లునకు విజాతీయమగు హల్లుతో సంయోగ మేర్పడునప్పు డా హల్లు పరహల్లుగా మాఱునని నిర్దేశానుసార ముగ గ్రహింపఁదగును. కాన చకారము పరహల్లుగా మాఱి చొత్ + తెంచు = చొత్తెంచు అగును.

మ. స్ఫురదాధార సరోజపీఠ హృదయాంభోజాత రంధ్రార్పిత
స్మరణాయత్త సముత్థితోజ్జ్వలతరాత్మజ్యోతిరిద్ధాంగరు
క్స్ఫురస స్ఫాటిక హర్మ్య మధ్య కనకస్తంభంబొ నాఁ బర్వు న
త్యురుజూటాకృతి నున్న శంభుదెస వో నుల్కెన్ మనోజుం డెదన్. 16

అర్థము : స్ఫురదాధార .... స్తంభంబో : స్ఫురత్ = ప్రకాశించుచున్న. ఆధార - సరోజ - పీఠ = మూలాధారపద్మమనెడి పీఠమునందలి, హృదయ + అంభోజాత = అనాహత పద్మము (చక్రము) వంటి హృదయముయొక్క, రంధ్ర = రంధ్రమునందు అర్పిత = అర్పింపఁబడిన, స్మరణ + ఆయత్త = స్మరణమునకు అధీనమైన, సముత్థిత = బాగుగా లేచిన, ఉజ్జ్వలతర = మిక్కిలి ప్రకాశించునట్టి, ఆత్మ-జ్యోతిః=ఆత్మ యను తేజస్సుచే, ఇద్ధ=ప్రకాశించిన, అంగ-రుచ్ (క్)=శరీర కాంతి యనెడి, సరస=వికాసముగల. స్ఫాటిక=స్ఫటిక శిలామయమైన, హర్మ్య= భవనము నందలి, మధ్య=నడుమనున్న, కనక - స్తంభంబో-నాన్ = బంగారుకంబమో అనఁగా, పర్వు = వ్యాపించునట్టి, అతి + ఉరు - జూట + ఆకృతిన్ = మిక్కిలి గొప్పది యగు జడముడి రూపముతో, ఉన్న, శంభు - దెస=ఈశ్వరునివైపు, పోన్ = పోవుటకు, మనోజుండు = మన్మథుఁడు, ఎదన్ = హృదయమునందు, ఉల్కెన్ = భయపడెను.

తాత్పర్యము : ప్రకాశించుచున్న మూలాధారపద్మమనెడి పీఠమునందలి హృదయపద్మరంధ్రమునం దర్పింపఁబడిన స్మరణాధీనము. సముత్థితము. ఉజ్జ్వలతరము నైన అత్మజ్యోతిచేఁ బ్రకాశించు దేహకాంతి యను సరసము. స్ఫటికశిలామయము నైన హర్మ్యమునడుమ బంగారుకంబమా యన వ్యాపించు మిక్కిలి గొప్ప జడముడిరూపముతో నున్న శివునివైపు పోవ మన్మథుఁడు హృదయమున భయపడెను.

విశేషములు : అలంకారము రూపకానుప్రాణితమైన ఉత్ప్రేక్ష.

దెసవోన్ - దెస + పోన్ - గసడదవాదేశము,

వ. ఇట్లున్న పరమేశ్వరు శాంతరూపంబు తనకుం గ్రూరరూపంబైనం గని వనంబుఁ జొర నుల్కి వన్యేభంబున కోజవిడి నడ్డంబు సేర్చి సొత్తెంచు హాస్తిపకోత్తముండునుం బోలె మరుండు గౌరి రాకయ వార్చుచునుండె నంత నిజేశ్వరు కన్నెఱింగి రతి మతి నిట్లని తలంచె. 17

అర్థము : ఇట్లు, ఉన్న, పరమేశ్వరు=శివునియొక్క, శాంత -రూపంబు= కామాదివికారముల క్షోభలేని యాకారము, తనకున్, (మన్మథునకు,) క్రూర - రూపంబు = క్రూరమైన ఆకారము, ఐనన్ = కాఁగా, కని, వనంబున్ = తపో

వనమును, చొరన్ = చొచ్చుటకు, ఉల్కి = భయపడి, వన్య + ఇభంబునకున్ = అడవియేనుఁగునకు, ఓజ = క్రమముగా, పిడిన్ = ఆఁడేనుఁగును, అడ్డంబు + చేర్చి = అడ్డముగాఁబెట్టి, చొత్తెంచు = ప్రవేశించు, హాస్తిపక + ఉత్తముండునున్ + పోలెన్ = శ్రేష్ఠుఁడైన మావటివానివలె, మరుండు = మన్మథుఁడు, గౌరి = పార్వతి యొక్క, రాక + అ = రాకయ = రాకనే, వార్చుచున్ + ఉండెన్ = వేచి యుండెను, అంతన్, నిజ + ఈశ్వరు = తనభర్త యొక్క, కన్నెఱింగి (కన్ను + ఎఱింగి) = అభిప్రాయ మెఱిఁగి, రతి, మతిన్ = మనసునందు, ఇట్లు + అని = ఈ రీతిగా, తలంచెన్ = తలపోసెను,

తాత్పర్యము : ఇట్లున్న శివుని శాంతాకారము తనకుఁ గ్రూరరూపము కాఁగాఁ జూచి, ప్రవేశింప భయపడి అడవియేనుఁగునకు ఆఁడేనుఁగు నడ్డముగాఁ బెట్టి వచ్చు మావటివానివిధమున మన్మథుఁడు గౌరి రాకను వేచియుండెను. అంతఁ దనభర్త యభిప్రాయ మెఱిఁగి రతి మనసులో నిట్లు తలంచెను.

విశేషములు : వన్యేభంబున కోజవిడి .... హాస్తిపకోత్తముండునుం బోలె - అలంకార ముపమ.

క. కామినులు లేక లోకులఁ
గామని కెట్లగు మనోవికారులఁ జేయన్?
గామవికారము లేకయుఁ
గామినులకు జనుల నెట్లు గలిపింప నగున్? 18

అర్థము: కామినులు = స్త్రీలు, లేక, లోకులన్ = జనులను, మనస్ (ః) + వికారులన్ = మనోవికారము గలవారినిగా, చేయన్ = చేయుటకు, కామునికిన్ = మన్మథునకు, ఎట్లు + అగున్ = ఎట్లు సాధ్యపడును? సాధ్యపడ దనుట, కామ-వికారము = మన్మథ వికారము, లేకయున్ = లేకుండఁగనే, కామినులకున్ = స్త్రీలకు, జనులన్ = జనులను. ఎట్లు, కలిపింపన్ + అగున్ = వలపింప సాధ్య పడును? - సాధ్యపడ దనుట.

తాత్పర్యము: స్త్రీలు లేకుండ లోకులను మనోవికారము గలవారినిగాఁ జేయుటకు మన్మథునకు సాధ్యపడదు. మన్మథవికారము లేకుండ స్త్రీలకు జనులను వలపింప సాధ్యపడదు.

విశేషములు: కామినులులేక కామునకును, కాముఁడులేక కామినులకును లోకులకు వలపుఁబుట్టింప సాధ్యము గాదు. కామినీకాము లిట్లు పరస్పరాశ్రయు లనుట. కలిపింపన్ - కలుచు (= వలచు) ధాతువు ప్రేరణతుమున్నంతరూపము. కలుచు - 'సర్వంబునకుం బ్రేరణంబునం దించు క్కగు.' బాల.క్రియ.70. కలుచు + ఇంచు. 'ప్రేరణేంచుక్కు పరంబగునపుడు చకారంబు పకారంబున కగు.' బాల.క్రియ. 87. కలుపు + ఇంచు. 'అంద్వవగాగమంబులం దప్ప నపవాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు.' బాల.సంధి.11. 'ఇత్వంబుగాని యెత్వంబుగాని కూడుచో ననాద్యంబయిన యుత్వంబున కిత్వం బగు.' బాల.క్రియ.85. కలిపించు.' తుమర్థ భావలక్షణంబులందు నుజ్ యగు.' బాల.క్రియ. 40. కలిపించు + నుజ్. 'అగమాన్య చకారంబుల కద్విరుక్తంబులకు నుత్తు పరంబగునపుడు పవ లగు.' బాల.క్రియ.88, కలిపింపన్.

వ. అని కాముక కామినీ జనంబు లితరేతరాశ్రయంబుల కా భావించుచుండె నంత. 19

అర్థము; అని, కాముక - కామినీ - జనంబులు = కాముఁడును, కామినులును, ఇతర + ఇతర ఆశ్రయంబులు + అ = పరస్పరాశ్రయులే - ఒకరిపై నొకరాధారపడువారు, కాన్ = అగునట్లు, భావించుచున్ + ఉండెను = తలపోయుచుండెను, అంతన్.

తాత్పర్యము: అని రతి కాముఁడును గామినులును పరస్పరాశ్రయులే యని తలపోయుచుండెను. అంత - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. కరవీర రచిత నూపురములు చెలువొందఁ
గాంచన పుష్ప మేఖలలు గట్టి,
పున్నాగమయ హారములు వెట్టి నవకర్ణి
కార శోభిత కటకములు వెలుఁగ,

గేసర రాజీవ కేయూరములు దొడి,
రాజీవ కర్ణపూరము లమర్చి,
తిలకాభినుతహేమతిలకంబు లుప్పొంగఁ,
జంపకమాలికాసమితిఁ దాల్చి,

ఆ. మధు లతాంత మయ విమండన మండిత
లైన కన్యకాచయంబు నడుమఁ
బొలిచె నద్రితనయ పుష్పితజంగమ
లతల నడుమఁ గల్పలతయుఁ బోలె. 20

అర్థము : కర వీర - రచిత - నూపురములు = గన్నేరుపూలతో, నిర్మింపఁబడిన అందెలు, చెలువొందన్ (చెలువు + ఒందన్) = ఒప్పఁగా, కాంచన - పుష్ప - మేఖలలు = సంపఁగి (ఉమ్మెత్త) పూల మొలనూళ్లు, కట్టి,

పున్నాగ - మయ - హారములు = పొన్నపూలతోఁ జేయఁబడిన హారములు, పెట్టి = ధరించి, నవ - కర్ణికార - శోభిత - కటకములు = క్రొత్త కొండగోఁగు పూలతో నొప్పిన కడియములు, వెలుఁగన్ = ప్రకాశింపఁగా,

కేసర - రాజీవ - కేయూరములు = పొగడలు, తామరలు - అకరువులతోడి తామరపూలు అనెడి బాహుపురులు, తొడి = ధరించి, రాజీవ - కర్ణపూరములు = తామరపూలనెడి చెవికమ్మలు, అమర్చి = పెట్టి,

తిలక + అభినుత - హేమ - తిలకంబులు = బొట్టుగుపూలతో నొప్పిన, బంగరు బొట్టులు, ఉప్పొంగన్ = అతిశయింపఁగా, చంపక - మాలికా - సమితిన్ = సంపెఁగదండల సమూహమును, తాల్చి = ధరించి,

అద్రి - తనయ = కొండ కూఁతురు - పార్వతి, మధు - లతాంత - మయ - విమండన - మండితలు = ఇప్పపూలతోఁ జేయఁబడిన అలంకారములచే నలంకరింపఁబడినవారు, ఐన, కన్యకా - చయంబు - నడుమన్ = కన్నియల సమూహము నడుమ, పుష్పిత - జంగమ - లతల = పుష్పించిన సంచరించు తీవలయొక్క, నడుమన్ = నడుమను, కల్ప - లతయున్ + పోలెన్ = కల్పవృక్షపుఁదీగవలె, పొలిచెన్ = ఒప్పెను.

తా త్ప ర్య ము : పార్వతి - గన్నేరుపూల అందెలు ఒప్పఁగను, ఉమ్మెత్త పూల మొలనూలులు కట్టి, పొన్నపూలహారములు ధరించి, క్రొత్తకొండగోఁగు పూలతోఁ బ్రకాశించు కడియములు ఒప్పఁగా, పొగడలు, తామరలు అనెడి బాహుపురులు తొడిగి, తామరపూలనెడి చెవికమ్మలు పెట్టి, బొట్టుగుపూలతో నొప్పిన బంగరు బొట్టులు అతిశయింపఁగా, సంపెఁగదండల సమూహమును ధరించి, ఇప్పపూల ఆభరణములచే నలంకరింపఁబడిన కన్యకాసమూహమునడుమఁ బుష్పించిన సంచరించుతీవల నడుమనున్న కల్పవృక్షపుఁదీఁగవలె నొప్పెను.

వి శే ష ము లు ; కవి పార్వతిని తత్రత్యములయిన పూలతోడనే అలంకరింపఁబడినదానినిగా వర్ణించుట గమనింపఁదగినది. అలంకారము స్వభావోక్తి. పుష్పమేఖలలు, రాజీవకేయూరములు, రాజీవకర్ణపూరములు అనుచోట్ల రూపకము. కల్పలతయుఁబోలె - ఉపమ. కాళిదాసుకూడ తన కుమారసంభవమున నిదే సందర్భమున పార్వతి నిట్లే వర్ణించుట చూడనగును.

అశోక నిర్భర్త్సిత పద్మరాగ, మాకృష్ట హేమద్యుతి కర్ణికారమ్,
ముక్తాకలాపీకృత సిన్దువారం, వసన్తపుష్పాభరణం వహన్తీ,
ఆవర్జితా కించి దివ స్తనాభ్యాం, వాసో వసానా తరుణార్కరాగమ్,
పర్యాప్తపుష్పస్తబకావనమ్రా, సంచారిణీ పల్లవినీ లతేవ,
స్రస్తాం నితమ్బా దవలమ్బమానా పునఃపునః కేసరదామకాఞ్చీమ్.

కుమార.సం.3.53.54.55.

వ. ఇట్లకాలవసంతలతాంతాపచయకేళీలాలసయై ప్రాలేయకుత్కీలాత్మజ యా క్షణంబ. 21

అ ర్థ ము : ఇట్లు, అకాల - వసంత - లతాంత+అపచయ - కేళీ - లాలస+ఐ= అసమయమైన వసంతర్తువునందలి పూలను గోయుట యనెడి క్రీడయం దాసక్తి కలదయి హిమవత్పర్వతపుత్త్రిక ఆ క్షణమే.

తా త్ప ర్య ము : ఇట్లు పార్వతి అకాలవసంతర్తుపుష్పములను గోయు క్రీడయం దాసక్తిగలదయి యాక్షణమే - తరువాతి పద్యముతో నన్వయము.

క. అతిసంభ్రమమునఁ ద్రిజగ
త్పతి నర్చనసేయఁ దలఁచి పరిమళ మంద
స్మిత కుసుమ మృదుల పల్లవ
తతిలో మే లేఱికొని ముదం బొదవు మదిన్. 22

అర్థము : అతి - సంభ్రమమునన్ = మిక్కిలి గౌరవముతో, త్రిజగత్ + పతిన్ = ముల్లోకముల యేలిక యగు శివుని, అర్చన + చేయన్ + తలఁచి = పూజింపఁదలఁచి, పరిమళ - మంద - స్మిత = సువాసనతోడి చిఱునవ్వుఁగలది-పార్వతి, కుసుమ - మృదుల - పల్లవ - తతిలోన్ = పూలయు, మెత్తని చివురులయు సమూహమున, మేలు = మంచివి, ఏఱికొని, ముదంబు = సంతోషము, ఒదవు - మదిన్ = పుట్టునట్టి మనస్సుతో-

తాత్పర్యము : సుగంధముతోడి చిఱునవ్వుగల పార్వతి మిక్కిలి గౌరవముతో ముల్లోకములయేలికయగు శివునిఁ బూజింపఁదలఁచి పూలలోను, మెత్తని చివురులలోను మంచివి యేఱుకొని సంతోషించు మనస్సుతో - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. మెలపారు నెలమావి తలిరుల నొకకొన్ని
రమణీయమగు చంపకములు వొదివి,
లాలితాశోకపల్లవముల నొకకొన్ని
కమనీయమగు కుర్వకములు వెట్టి,
మాసరంపు టరంటిమోసుల నొకకొన్ని
కొమరారు కర్ణికారములు నించి,
తరుణాంబుజాతపత్త్రంబుల నొకకొన్ని
యమరిన సరసోత్పలములు సుట్టి,
ఆ. చెలువ లెల్ల నొంటు చిగుళులుఁ బువ్వులుఁ
గలయఁ దాల్చి పొల్చి బలసి రాఁగ,
శైలరాజతనయ చనుదెంచె నందన
వనము గాఁపువచ్చు వడువ వోలె. 23

అర్థము : మెలపారు = మెత్తనగు. ఎల - మావి - లలితములన్ = లేమామిడి చివురులందు. ఒక - కొన్ని. రమణీయము + అగు = అందమైన. చంపకములు = సంపెఁగలు. పొదివి = కప్పి.

లాలిత + అశోక - పల్లవములన్ = మనోహరములైన. అశోకపుఁజివురులందు. ఒక - కొన్ని. కమనీయము + అగు = మనోహరమయిన. కురవకములు = ఎఱ్ఱగోరంటపూలు. పెట్టి. మానసరంజకరంటి = మానసము + అరంటి = మనోజ్ఞములైన అరఁటిమొవ్వులలో. ఒక - కొన్ని. కొమరారు - కొమరు + ఆరు = అందమైన. కర్ణికారములు = కొండగోఁగుపూలు. నించి = నిండించి.

తరుణ + అంబుజాత - పత్రంబులన్ = లేఁదామరపాకులందు. ఒక-కొన్ని. అమరిన = ఒప్పిన. సరస + ఉత్పలములు = అందమైన కలువలు. చుట్టి.

చెలువలు + ఎల్లన్ = స్త్రీలు (చెలికత్తెలు) అందఱును. ఒండు-చిగుళులున్ = వేఱు చివురులును. పువ్వులున్. కలయన్ = బాగుగా. తాల్చి = ధరించి. పొల్చి = ఒప్పి. బలసి - రాఁగన్ = పరివేష్టించి రాఁగా.

శైల - రాజ - తనయ = కొండలతేని - హిమవంతుని కూఁతురు-పార్వతి. నందన - వనము = నందనమనెడివనము. కాఁపు - వచ్చు = కాఁపురమువచ్చు. వడువు + అ - పోలెన్ = విధమునే పోలునట్లు. చనుదెంచెన్ = వచ్చెను.

తాత్పర్యము : పార్వతి మెత్తనైన లేమావిచిగురులలో నొకకొన్ని అందమైన సంపెఁగలు కప్పి. మనోహరములైన అశోకవృక్షపుఁజిపురులలో ఒకకొన్ని. రమణీయములయిన యెఱ్ఱగోరంటపూలు పెట్టి, అందమైన అరఁటిమొవ్వులలో నొకకొన్ని సుందరములైన కొండగోఁగుల నిండించి, లేఁదామరపాకులలో నొకకొన్ని ఒప్పిన సుందరములైన కలువలను చుట్టి. చెలికత్తెలందఱును వేఱు చివురులు, పువ్వులు బాగుగాఁదాల్చి ఒప్పి పరివేష్టించిరాఁగా, నందనవనము కాఁపురమువచ్చుచున్నదా యనువిధమున వచ్చెను.

విశేషములు: అలంకారము స్వభావోక్తి, ఉత్ప్రేక్ష.

ఉ. ఆ లలితాంగి, భూషిత లతాంత విభూషణజాలగాత్ర, హం
సాలస మందయాన, వికచామల కోమల నీరజాస్య, బా
లాలికులాళి నీలకుటిలాలక, లోల విశాలనేత్ర, కు
త్క్షీల తనూజ వచ్చె మరుదీమము పోలెఁ బినాకి పాలికిన్. 24

అర్థము: ఆ - లలిత + అంగి = ఆ మనోహరమైన శరీరముగలది, భూషిత - లతాంత- విభూషణ - జాల- గాత్ర = అలంకరింపఁబడిన పుష్పాభరణముల సమూహముతోడి అవయవములు గలది, హంస + అలస - మంద - యాన = అంచలవలె అలసము, మందము నైన గమనము గలది, వికచ + అమల - కోమల -నీరజ + ఆస్య = వికసించిన, నిర్మలమైన, మనోహరమైన తామరపూవువంటి ముఖముగలది, బాల + అలి - కుల + ఆళి - నీల - కుటిల + అలక = కొదమ తుమ్మెదల గుంపుల వరుసలవలె నల్లనివి, వంకరయైనవి యైన ముంగురులు గలది, లోల - విశాల - నేత్ర = చంచలములు, విరివియైనవి యైన కన్నులుగలది, అగు, కుత్క్షీల - తనూజ = కొండకూఁతురు - పార్వతి, మరు - దీమము + పోలెన్ = మన్మథుని దీమము వలె, (దీమము - పశుపక్ష్యాదులను బట్టుకొనుటకై యేర్పఱిచిన పశు పక్ష్యాదికము), పినాకి - పాలికిన్ = శివుని (పినాక మనునాయుధముగలవాఁడు) దగ్గఱకు, వచ్చెన్.

తాత్పర్యము: మనోహరమైన శరీరము గలదియు, పూవులచే నలంక రింపఁబడిన అవయవములు గలదియు, అంచవలె మందమైన గమనముగలదియు, విరిసినది, నిర్మల మయినది, అందమైనది అగు పద్మమువంటి ముఖముగలదియు, కొదమ తుమ్మెదలగుంపువలె నల్లనివి, వంకరయైనవి యగు ముంగురులు గలదియు, చంచల ములు, విరివియైనవి అగు కన్నులు గలదియు అగు ఆ పార్వతి మన్మథుఁ డను వేఁటకాఁ డేర్పఱిచిన దీమమువలె శివుని దగ్గఱకు వచ్చెను.

విశేషములు: అలంకారము రూపకానుప్రాణితోత్ప్రేక్ష. హంస+అలస- మందయాన - అలస, మంద అనునవి రెండును సమానార్థకములే. అట్లే, బాల + అలి + కుల + ఆళి - నీల - కుటిల + అలక - అను సమాసములో కుల ఆళి శబ్ద ములు సమానార్థకములు. పినాకి - 'పినాకీ ప్రమథాధిపః' పినాక ఇతి ధను రస్యాస్తీతి పినాకీ, పినాకమనెడివిల్లు గలవాఁడు - శివుఁడు, మన్మథుఁ డనువేఁటకాఁడు శివుని వశ పఱుచుకొన నేర్పఱిచిన దీమమా యనునట్లు పార్వతి వచ్చె ననుట.

వ. అంతం బరమేశ్వరుండు తుర్యావస్థితంబులైన మనఃప్రాణంబులు జాగ్రదవస్థావ్యవస్థితంబులు చేసి సంప్రసన్నుండైన కన్నెఱింగి గౌరి నందిమహాకాలానుజ్ఞాతయై లతామందిరాంతరంబున కరిగి హరచరణసరసీరుహంబులకుం బుష్పాంజలి యిచ్చి కృతాంజలి యైన. 25

అర్థము : అంతన్, పరమేశ్వరుండు, తుర్య + అవస్థితంబులు = నాలవదగు సమాధ్యవస్థయందు - బ్రహ్మమునందున్నవి, ఐన, మనఃప్రాణంబులు = మనస్సును, ప్రాణమును, జాగ్రత్ + అవస్థా - వ్యవస్థితంబులు = మేలుకొన్న స్థితియందున్నవి, చేసి, సంప్రసన్నుండు = మిక్కిలి ప్రసన్నత నొందినవాఁడు, ఐన - కన్నెఱింగి = అయిన జాడతెలిపి, గౌరి = పార్వతి, నంది - మహాకాల + అనుజ్ఞాత + ఐ = నందీశ్వరుఁడు, మహాకాలుఁడు అనువారిచే ననుమతింపఁబడినదయి, లతా - మందిర + అంతరంబునకున్ = తీవెయింటిలోపలికి, అరిగి = వెడలి, హర - చరణ సరసీరుహంబులకున్ = శివుని పాదపద్మములకు, పుష్ప + అంజలి = పూలదోయిలి, ఇచ్చి, కృత + అంజలి = నమస్కరించినది, ఐనన్ = కాఁగా.

తాత్పర్యము ; అంత శివుఁడు జాగ్రత్స్వప్నసుషుప్తులనెడి మూఁడవస్థలకంటె భిన్నమై నాల్గవదియగు సమాధ్యవస్థయందున్న - బ్రహ్మమునందున్న మనస్సును ప్రాణమును మేలుకొలిపి సుప్రసన్నుఁడైన జాడతెలిసి పార్వతి నంది మహాకాలుఁడు అనువారి అనుమతిని గైకొని తీవెయింటిలోపలి కరిగి, శివుని పాదపద్మములకు పూలదోయిలి సమర్పించినది కాఁగా- తరువాతి పద్యముతో నన్వయము.

ఉ. ఆ వనజాస్య హస్తతలజారుణదీప్తులఁ గూడివచ్చు పు
ష్పావలిమీఁద నీళ్లు తసుజామలరోచులు గప్పి యొప్పె సం
ధ్యావిరళోద్గతప్రకటితారుణదీప్తులలోనఁ బొల్చు తా
రావళిమీఁదఁ బర్వు నమృతాంశు కర ప్రకరాభిరామమై. 26

అర్థము : ఆ - వనజ + ఆస్య = తామరవంటి ముఖముగల ఆ పార్వతి యొక్క, హస్త - తలజ = అఱచేతులనుండి పుట్టిన, అరుణ - దీప్తులన్ = ఎఱ్ఱని కాంతులతో, కూడి - వచ్చు = కలిసివచ్చునట్టి, పుష్ప + ఆవలి - మీఁదన్ = పూల

వరుసపై. ఈశు = ఈశ్వరునియొక్క, తనుజ + అమల-రోచులు = శరీరమునుండి పుట్టిన నిర్మలములయిన కాంతులు, కప్పి = క్రమ్మి, సంధ్యా.... ....లోనన్: సంధ్యా= సంజయందు, అవిరళ = పలుచనకాని - దట్టముగా, ఉద్గత = పైకివెడలినవైన, ప్రకటిత = ప్రకటింపఁబడిన. అరుణ = ఎఱ్ఱని, దీప్తులలోనన్ = కాంతులలో, పొల్చు = ప్రకాశించు, తారా + అవళిమీఁదన్ = నక్షత్రముల వరుసపై, పర్వు= ప్రసరించునట్టి, అమృత + అంశు - కర - ప్రకర = చంద్రుని కిరణములయొక్క సమూహమువలె, అభిరామము + ఐ = మనోహరమయి, ఒప్పెన్.

తాత్పర్యము : ఆ పార్వతి శివునకుఁ బుష్పాంజలి సమర్పించునప్పుడు, ఆమె అఱచేతుల యెఱ్ఱని కాంతులతోఁ గూడిన పుష్పములపై నీశ్వరునిమేని నిర్మల కాంతులు క్రమ్మి సంధ్యాసమయమునందు సాంద్రములైన యెఱ్ఱనికాంతులలోఁ బ్రకాశించు నక్షత్రములపైఁ జంద్రకిరణములు ప్రసరించునట్లు మనోహరమై యొప్పెను.

విశేషములు : పార్వతి యఱచేతుల యెఱ్ఱనికాంతులు సంధ్యారుణ కాంతులవలెను, పుష్పములు నక్షత్రములవలెను, ఈశ్వరుని మేని నిర్మలకాంతులు చంద్రకిరణములవలెను నున్నవని భావము. అలంకార ముపమ.

'వనజాస్య' అను పదము 'హస్తతలజారుణదీప్తులు' అను సిద్ధసమాసమునందలి 'హస్తతల' అను నేకదేశముతో నన్వయించుచున్నది. అట్లే 'ఈశు' అను పదము 'తనుజామలరోచులు' అను సిద్ధసమాసమునందలి 'తను' అను నేకదేశముతో నన్వయించుచున్నది. 'కొన్నియెడల సిద్ధసమాస మధ్యగత పదంబులతోఁ దద్భిన్నపదం బుల కన్వయంబు చూపఁబడె.' ప్రౌఢ. సమాస. 35.

వ. తదవసరంబున. 27

అర్థ తాత్పర్యములు: తద్ + అవసరంబునన్ = ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము.

చ. మరునభివృద్ధి, పుష్పశర మండన, మంగజ రాజ్యలీల, శం
బరరిపు శక్తి, చిత్తభవు పట్టము, మారు మదేభ, మిందిరా
వర సుతు నాజ్ఞ, కాము కరవా, లసమాయుధు దర్ప, మా రతీ
శ్వర జయలక్ష్మి నాఁ బొలిచి శైలజ నిల్చె మహేశు ముందటన్. 28

అర్థము : శైలజ = కొండకూఁతురు - పార్వతి. మరు + అభివృద్ధి = మన్మథుని పెంపు. పుష్ప - శర - మండనము = సుమాస్త్రుని (మన్మథుని) అలంకారము. అంగజ - రాజ్య - లీల = మన్మథుని రాచఱికపు విలాసము. శంబర - రిపు - శక్తి = శంబరాసురవిరోధి (మన్మథుని) శక్తి. చిత్తభవు - పట్టము = మనసిజుని (మన్మథుని) రాజ్యము. మారు - మద + ఇభము=మన్మథుని మదించిన యేనుఁగు. ఇందిరా - వర - సుతు + ఆజ్ఞ=లక్ష్మియొక్క శ్రేష్ఠుఁడైన కుమారుని (మన్మథుని) ఆనతి. కాము - కరవాలు = మన్మథుని కత్తి. అసమ + ఆయుధు - దర్పము = విషమబాణుని (మన్మథుని) గర్వము. ఆ . రతి + ఈశ్వర - జయలక్ష్మి = ఆ రతి భర్త (మన్మథుని) జయలక్ష్మి. నాన్ = అనునట్లు. పొలిచి = ఒప్పి. మహేశు = ఈశ్వరునియొక్క. ముందటన్ = ఎదుర. నిల్చెన్.

తాత్పర్యము : పార్వతి మన్మథుని అభివృద్ధి, అతని అలంకృతి, అతని రాచఱికపు విలాసము, అతని శక్తి, అతని పట్టము, అతని మత్తేభము, అతని ఆనతి, అతని కత్తి, అతని దర్పము, అతని జయలక్ష్మి యన నొప్పి శివునియెదుర నిలిచెను.

విశేషములు : పార్వతి పలువస్తువులతో నుపమింపఁబడుటచే మాలోపమ. ఆ వస్తువులన్నియు మన్మథసంబంధులే యగుట గమనింపఁదగినది. కరవాలు (వికృతి) -కరవాలము (ప్రకృతి.) మరు నభివృద్ధి - మరు + అభివృద్ధి, సుతునాజ్ఞ - సుతు + ఆజ్ఞ-'షష్ఠీ సమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' బాల.సంధి.34.

వ. అంతం గంతుండు నిజవశ్యాధిదేవత ప్రసన్నం బైనంతియ సంతోషించి యద్దేవికిం గామాధికారంబు నేసి పరమేశ్వరున కెఱింగించి పక్కగొన నేయుదునని తలంచి గౌరి హృదయం బున్మదనాస్త్రంబున భేదించిన నా క్షణంబ. 29

అర్థము : అంతన్, కంతుండు = మన్మథుఁడు. నిజ - వశ్య + అధిదేవత= తనదైన వశీకరణమనెడి అధిదేవత. ప్రసన్నంబు + ఐన + అంతియ - ప్రసన్నురాలయినంతే. సంతోషించి. ఆ + దేవికిన్=ఆ దేవతకు. కామ + అధికారంబు+ చేసి = కోరిక యను నధికారమునిచ్చి. పరమేశ్వరునకున్. ఎఱింగించి. పక్క + కొనన్ = బీఁటలువాఱునట్లు. ఏయుదున్ - కొట్టుదును. అని. తలంచి. గౌరి - హృద

యంబు = పార్వతి హృదయమును, ఉన్మదన + అస్త్రంబునన్ = ఉన్మదనమనెడి యస్త్రముచే, భేదించినన్ - భేదింపఁగా, ఆ - క్షణంబు + అ = వెంటనే.

తాత్పర్యము : అంతట మన్మథుఁడు తన వశీకరణ శక్తి యను నధిదేవత ప్రత్యక్షమైనంతే సంతోషించి, యా దేవతకుఁ గామాధికారము నిచ్చి, పరమేశ్వరున కెదిఁగించి బీఁటలువాఱునట్లు కొట్టుమని తలఁచి పార్వతి హృదయమును ఉన్మదన మను నస్త్రముచే భేదింపఁగా నా క్షణమే - తరువాతిపద్యముతో నన్వయము.

మ. అలికాగ్రంబునఁ గ్రాలి యాడె బొమ; లాహ్లాదింపఁ గన్గోనలన్
దలఁకెన్ సమ్మదవారి; మోవి యదరెన్; దన్వంగి మైనొత్తె ము
త్పులకల్; కంపముఁగూడె నూర్పు; లెలమిం బొందెన్ మనం; బాత్మలో
నొలసెన్ రాగము; మోమునం దొలసె గండోల్లాసహాసప్రభల్. 30

అర్థము ; అలిక + అగ్రంబునన్ = నొసటిపై, బొమలు = కనుబొమలు, క్రాలి + ఆడెన్ = చెదరియాడెను, ఆహ్లాదింపన్ = సంతోషింపఁగా, కన్ + కోనలన్ = కంటితుదలందు, సమ్మద - వారి = హర్షాశ్రువులు, తలఁకెన్ = తొనఁకెను, మోవి = పెదవి, అదరెన్ = చలించెను, తను + అంగి (తన్వంగి) = సన్నని శరీరముగలది - స్త్రీ - పార్వతియొక్క, మైన్ = శరీరమునందు, ముద్ + పులకల్ = సంతోషమువలని గగుర్పాటు, ఒత్తెన్ = పుట్టెను, ఊర్పులు = శ్వాసములు, కంపమున్ = వణఁకును, కూడెన్ = కలిసెను, మనంబు = మనస్సు, ఎలమిన్ = సంతోషమును, పొందెన్, ఆత్మలోన్ = మనసులో, రాగము = ప్రేమము, ఒలసెన్ = ప్రవేశించెను, మోమునన్ = ముఖమునందు, గండ + ఉల్లాస - హాస - ప్రభల్ = చెక్కిళ్లయందలి సంతోషముతోడి నవ్వుల కాంతులు, పొలసెన్ = వ్యాపించెను.

తాత్పర్యము: కనుబొమలు ఆమెనుదుటఁ జెదరియాడెను. సంతోషింపఁగాఁ గనుతుదలందు హర్షాశ్రుజలము తొనఁకెను. పెదవి యదరెను. శరీరమున సంతోషము వలని గగుర్పాటు గలిగెను. శ్వాసములు కంపమును గూడెను. మనస్సు సంతోషమును బొందెను. ఆత్మలో ననురాగము ప్రవేశించెను. చెక్కిళ్లయందలి యుల్లాసముతోడి నవ్వుల కాంతులు ముఖమునఁ బ్రసరించెను.

విశేషములు: మన్మథుఁడు మదనాస్త్రముచేఁ బార్వతిహృదయమును భేదింపఁగనే యామెకు అనురాగోదయమై అశ్రువు, రోమాంచము, వేపథువు మున్నగు సాత్త్వికభావములు గలిగెను.

కన్గోనలు = కన్ను + కోనలు - 'అకారంబు క్రింది ఉకారంబునకుం దుది నులు క్రింది నలలకు లోపంబు బహుళంబుగ నగు.' బాల. ప్రకీర్ణ.7. కను + కోనలు. 'పదాంతంబులయి యసంయుక్తంబులయిన ను లు రు ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బాల. ప్రకీర్ణ.16. కన్ + కోనలు. 'ద్రుతప్రకృతికముమీఁది పరుషములకు సరళము లగు' బాల. సంధి. 16. కన్గోనలు. తను + అంగి = తన్వంగి. యణాదేశ సంధి. ఇ ఉ ఋ ఌ లకు అసవర్ణములయిన అచ్చులు పరములగునపుడు య్ వ్ ర్ ల్ అనునవి క్రమముగా ఆదేశము లగును. ముద్ + పులకలు - అనునాసికాంతస్థభిన్నములైన హల్లులకు (ఝల్లులకు) కతినహల్లులు (ఖరులు) పరములగునపుడు వాని వర్గములందలి ప్రథమవర్ణములు (చరులు) ఆదేశము లగును. ముత్పులకలు. గండ + ఉల్లాస - గుణసంధి. అ ఆ లకు ఇ ఉ ఋ ఌలు పరములగునపుడు వరుసగా ఏ ఓ అర్ అల్ అనునవి యేకాదేశము లగును. గండోల్లాస.

వ. ఇట్లు మదనప్రేరితయై. 31

అర్థము: ఇట్లు, మదన - ప్రేరిత + ఐ = మన్మథునిచేఁ బ్రేరేపింపఁబడినదయి.

తాత్పర్యము: ఇట్లు మన్మథునిచేఁ బ్రేరింపఁబడినదయి - తరువాతి పద్యముతో నన్వయము.

క. ప్రణుతాపాంగవిలోలే
క్షణదీప్తుల నగజ గలయఁ గప్పిన నసమే
షణుఁ డుత్పలదళములఁ బూ
రణ సేసిన కరణి నతివిరాజితుఁ డయ్యెన్. 32

అర్థము: అగజ + పార్వతి, ప్రణుత + అపాంగ - విలోల + ఈక్షణ - దీప్తులన్ = మిక్కిలి నుతింపఁబడిన క్రీఁగన్నులయొక్క మిక్కిలి చంచలములైన

చూపుల కాంతులను, కలయన్ = అంతను, కప్పినన్ = కప్పఁగా, అసమ + ఈక్షణుఁడు = బేసికన్నులవాఁడు - శివుఁడు, ఉత్పల - దళములన్ = కలువరేకులను, పూరణ + చేసిన - కరణిన్ - పూరించిన విధమున, అతి - విరాజితుఁడు + అయ్యెన్ = మిక్కిలి ప్రకాశించినవాఁడయ్యెను.

తాత్పర్యము : పార్వతి మిక్కిలి సుందరములైన క్రీఁగన్నుల చంచల దృష్టులను అంతటను గప్పఁగా, నీశ్వరుఁడు కలువరేకులను పూరించినవిధమున మిక్కిలి ప్రకాశించెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష.

వ. మఱియును. 33

ఉ. ఆ లలితస్మితాస్య లలితామల కోమల చంచలాలసా
లోల విశాల సంస్ఫురిత లోచన దృష్టిరసప్రవాహ మం
దోలిన పర్వి వెల్లిగొని యొక్కటఁ గ్రక్కున మించి మీఁదికిం
దేలఁగ నెత్తెఁ జుట్టె హరుఁ ద్రిప్పులఁబెట్టె మనోజుఁ డుబ్బఁగాన్. 34

అర్థము : ఆ - లలిత - స్మిత + ఆస్య = ఆ - మనోహరమైన నవ్వు మొగముగల పార్వతియొక్క, లలితా .... ప్రవాహము; లలిత = మనోహరములు, అమల = నిర్మలములు, కోమల = సుందరములు, చంచల = చలించునవి, అలస = మందములు, ఆలోల = చంచలములు, విశాల = పెద్దవి, సంస్ఫురిత = మిక్కిలి ప్రకాశించునవి, అగు, లోచన = కన్నులయొక్క, దృష్టి = చూపులనెడి, రస-ప్రవాహము = జలప్రవాహము - శృంగారరసప్రవాహము, అందున్ = అచ్చట, ఓలిన్ + ఆ = క్రమముగా, - నిండుగా, పర్వి = వ్యాపించి, వెల్లి + కొని = ప్రవహించి, మనోజుఁడు = మన్మథుఁడు, ఉబ్బఁగాన్ = సంతోషింపఁగా, హరున్ = ఈశ్వరుని, ఒక్కటన్ = ఒక్కమాఱుగా, క్రక్కునన్ = శీఘ్రముగా, మించి, మీఁదికిన్ = పైకి, తేలఁగన్ + ఎత్తెన్ = తేలునట్లు ఎత్తెను, చుట్టెన్ = చుట్టుకొనెను, త్రిప్పులన్ + పెట్టెన్ = చిక్కులఁబెట్టెను.

తాత్పర్యము : ఆ సుందరమైన నవ్వుమొగముగల పార్వతి లలితములు, నిర్మలములు, కోమలములు, చంచలములు, మందములు, ఆసక్తములు, విశాలములు,

ప్రకాశవంతములు అగుకన్నుల చూపులనెడి శృంగారరసప్రవాహము అచ్చట నిండుగాఁ బ్రవహించి, వెల్లువకట్టి, మన్మథుఁడు సంతోషింపఁగా నీశ్వరు నొక్కమాఱుగా శీఘ్రముగా ముంచి పైకిఁదేల్చెను, చుట్టుముట్టెను, చిక్కువఱిచెను.

విశేషములు : దృష్టిరసప్రవాహము = దృష్టియనెడి రసప్రవాహము-రూపకాలంకారము. 'ఆ లలితస్మితాస్య....దృష్టిరసప్రవాహము'-ఇందలి సమాసవచనబిదము లాలంకారికపరిభాషకు సంబంధించినవి - వా. ప్రతి పీఠిక - శ్రీనిడుదవోలు వేంకటరావుగారు.

వ. ఇట్లు త్రినయనుం దన నయనవాగురులకు లోపుసేయుచు. 35

అర్థము : ఇట్లు, త్రినయనున్ = ముక్కంటిని - శివుని, తన, నయన-వాగురులకున్ = కన్నులనెడి - చూపులనెడి, వలలకు, లోపు + చేయుచున్ = లోపడునట్లు చేయుచు.

తాత్పర్యము : ఈ విధముగా బార్వతి ముక్కంటిని దనచూపులనెడి వలలలోఁ జిక్కువడునట్లు చేయుచు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : నయన వాగురులు - నయనములనెడి వాగురులు - రూపకాలంకారము.

సీ. నగరాజతనయ పన్నగరాజధరు మ్రోల
నిలువుడు మదనుఁ డేటలవి నిలిచె;
నెలనాఁగ కరిబొమల్ వొలయింప నెత్తుడుఁ
జిత్తజుఁ డించువి ల్లెత్తుకొనియె;
హరిణాక్షి లసదపాంగాలోకనము నూలు
కొలుపుడు న మ్మరిగొలిపె మరుఁడు;
పతి నెఱి నూరఁ బార్వతి సూచు నుఱుచూడ్కు-
లాడుడు నలరమ్ము లాడె నీశుఁ;

ఆ. గంతుఁ డేయఁదొడఁగె నంత నీశ్వరునకు
నచలవృత్తిఁ జలుపు నాత్మ విమల
యోగభావ మెడపి రాగోత్కటంబున
గౌరియందు నిలిపెఁ గన్నుఁ, మనము. 36

అర్థము : నగ - రాజ - తనయ = పర్వతరాజపుత్త్రి - పార్వతి, పన్నగ-రాజ - ధరు = పాముఁ దాల్చినవాని - శివుని, మ్రోలన్ = ఎదుర, నిలువుడున్ = నిలిచినంతనే, మదనుఁడు = మన్మథుఁడు, ఏటలవి - నిలిచెన్ = ఏటునకు అందునంతదూరమున నిలిచెను, పార్వతి నిలిచినంతనే మన్మథుఁడును నిలిచె ననుట. అన్నిట నిట్లే గ్రహించునది.

ఎలనాఁగ = స్త్రీ - పార్వతి, కరి - బొమల్ = నల్లని కనుబొమలు, పొల యింపన్ = ప్రసరింపఁజేయునట్లు, ఎత్తుడున్ = ఎత్తినంతనే, చిత్తజుఁడు = మనో జుఁడు - మన్మథుఁడు, ఇంచు - విల్లు = చెఱకువిల్లు, ఎత్తుకొనియెన్ = ఎత్తెను.

హరిణ + అక్షి = లేడికన్నులవంటి కన్నులుగలది - పార్వతి, లసత్ + అపాంగ + ఆలోకనమున్ = ప్రకాశించుచున్న క్రీఁగంటిచూపును, నూలుకొలుపుడున్ = ప్రసరింపఁజేసినంతనే. మరుఁడు = మన్మథుఁడు, అమ్ము = బాణము, అరిన్ + కొలిపెన్ = నారియందుఁదొడిగెను.

పతి = భర్త, నెఱన్ + ఊరన్ = పూర్తిగా ఆసక్తి గలవాఁడగునట్లు, పార్వతి-చూచు, ఉఱు + చూడ్కులు = ఒప్పిన చూపులు, ఆడుడున్ = ప్రసరించినంతనే, అలరు + అమ్ములు = పుష్పబాణములు, ఈశున్ = ఈశ్వరుని, ఆడెన్ = నాటుకొనెను.

కంతుఁడు = మన్మథుఁడు, ఏయన్ + తొడంగెన్ = కొట్ట నారంభించెను.

అంతన్, ఈశ్వరునకున్, అచల - వృత్తిన్ = నిశ్చలమైన వర్తనముతో. చలుపు = చేయునట్టి, ఆత్మ - విమల - యోగ - భావము = తనదైన నిర్మలమైన తపస్సమాధి, ఎడపి = పోఁగొట్టి, రాగ + ఉత్కటంబునన్ = అనురాగాతిశయమున, కన్ను, మనము = మనస్సు, గౌరి + అందున్ = పార్వతిపై, నిలిపెన్ = నిలుచు నట్లు చేసెను.

తాత్పర్యము : పార్వతి శివునియెదుట నిలిచినంతనే, మన్మథుఁ డేటున కందునంతదూరమున నిలిచెను. పార్వతి నల్లనికనుబొమ లెత్తినంతనే, మన్మథుఁడు చెఱకువింటి నెత్తెను. ఆమె క్రీఁగంటిచూపును బ్రసరింపఁజేసినంతనే, మన్మథుఁడు బాణమును వింటఁదొడిగెను. భర్తృ పూర్తిగా నాసక్తిగలవాఁడగునట్లు ఆమె చూపులు ప్రసరింపఁజేసినంతనే, మన్మథుని పూవుటమ్ములు ఈశ్వరుని నాటుకొనెను. మన్మథుఁ డీశ్వరు నేయఁదొడఁగినంతనే, యీశ్వరుఁడు నిశ్చలతఁ జేయు తపస్సమాధిని భంగ పఱిచి అనురాగాతిశయమునఁ బార్వతియందుఁ గన్నుఁ, మనస్సు నిలిపెను.

విశేషములు : అలంకారము సహోక్తి. ఎలనాఁగ కరిబొమల్ వాలయింప నెత్తుడుఁ జిత్తజుఁ డించువి ల్లెత్తుకొనియె. - పార్వతి కనుబొమలు మన్మథుని యించు వింటివలె నున్నవను నౌపమ్యము గ్రహించునది. అట్లే ఆమె 'లసదపాంగావలోకనము' నకును, 'అమ్మ'నకును ఔపమ్యము సిద్ధించుచున్నది. అట్లే ఆమె 'ఉఱుచూడ్కులు' 'మన్మథుని అలరమ్ముల'వలె నున్నవని గ్రహింపఁదగును.

లసదపాంగ - లసత్ + అపాంగ - ఝల్లానకు అచ్చుపరమగుచుండఁగాఁ దృతీయవర్ణాదేశము. చూచు + ఉఱు = చూచునుఱు, చలుపు + ఆత్మ - చలుపునాత్మ. 'ఉదంతమగు తద్ధర్మార్థవిశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమం బగు' బాల. సంధి.33. అలరు + అమ్ములు = అలరమ్ములు. 'కర్మధారయంబునందుఁ బేర్వాదిశబ్ద ముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాష నగు,' బాల.సంధి. 29. 'ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధి యగు' బాల.సంధి.1. అలరమ్ములు. టుగాగమ మగుచో అలరుటమ్ములు, నిలుచుడున్ అనుటకు నిలువుడున్ అనుట విశేషము.

క. గిరిజ లలితాంగములు పొరిఁ
బొరిఁ గనుఁగొని సొగసి, యినుకబొమ్మలు జలముల్
దెరలఁగ విరిసినగతిఁ బొది
విరిసి మహేశ్వరు మనంబు వికలం బయ్యెన్. 37

అర్థము : గిరిజ = పార్వతియొక్క, లలిత + అంగములు = మనోహ రములైన అవయవములు, పొరిఁబొరిన్ = మాటిమాటికి, కనుఁగొని = చూచి, సొగసి = పరవశత్వముచెంది, మహేశ్వరు - మనంబు = ఈశ్వరుని మనస్సు, జల

ముల్ = నీళ్లు, తెరలఁగన్ = పాఱఁగా, ఇసుక - బొమ్మలు = ఇసుకతో నిర్మింపఁబడిన బొమ్మలు, విరిసిన - గతిన్ = విచ్చినరీతిని, పొదివిరిసి = బిగిచెడి - ధైర్య హీనమయి, వికలంబు + అయ్యెన్ = కలఁత చెందెను.

తా త్ప ర్య ము : పార్వతి మనోహరావయవములను మాటిమాటికిఁ జూచి, పరవశమయి, యీశ్వరుని మనస్సు నీళ్లు పాఱఁగనే యిసుకతోఁజేసిన బొమ్మలు విచ్చిపోవు విధమున బిగిచెడి కలఁగెను.

వి శే ష ము లు : అలంకార ముపమ.

గీ. వరదు ముఖదీప్తి వెడలి పార్వతి ముఖంబు
ప్రీతి విలసిల్లెఁ గలయఁ బేర్చిందు లెసఁగి,
వెలఁదివెన్నెలఁ దెలుపారి విరిసి మీఁద
మంచు పేరిన చెందొవ మాడ్కి వోలె. 38

అ ర్థ ము : వరదు = వరములనిచ్చువాని - భగవంతుని - ఈశ్వరునియొక్క, ముఖ - దీప్తి = ముఖకాంతి, వెడలి = వెడలుటచే, పార్వతి - ముఖంబు = పార్వతి మోము, కలయన్ = అంతటను, పేర్చిందులు=చెమట బొట్టులు, ఎసఁగి= అతిశయించి, ప్రీతిన్ = అనురాగముతో, వెలఁది - వెన్నెలన్ =స్వచ్ఛమైన వెన్నెలచేత, తెలుపారి = తెల్లనయి, విరిసి = వికసించి, మీఁదన్ = పైని, మంచు, పేరిన = అతిశయించిన, చెందొవ (చెన్ను + తొవ) = ఎఱ్ఱకలువ, మాడ్కి + పోలెన్ = విధమున, విలసిల్లెన్ = ప్రకాశించెను.

తా త్ప ర్య ము : ఈశ్వరుని ముఖకాంతి వ్యాపించుటచేఁ బార్వతి మోము అంతటను జెమటబొట్టు లతిశయించి, - స్వచ్ఛమైన వెన్నెలచేఁ దెల్లనయి, వికసించి, పైని మంచుకురిసిన యెఱ్ఱకలువవిధమునఁ బ్రీతితోఁ బ్రకాశించెను.

వి శే ష ము లు : అలంకార ముపమ. పార్వతి ముఖము చెందొవవలెను, వరదు ముఖదీప్తి వెలఁదివెన్నెలవలెను, పేర్చిందులు మంచువలెను ఉండెనని తెలియవలయును.

చెందొవ.చెన్ను+తొవ 'సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చుమీఁది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.' బాల.సంధి.36. చె + తొవ.' లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమం బగు.' బాల.సంధి 37. చె+ ను + తొవ. 'ద్రుత ప్రకృతికముమీఁది పరుషములకు సరళము లగు.' బాల.సంధి.16. చె+ను+దొవ. 'ఆదేశసరళములకు ముందున్న ద్రుతమునకు బిందుసంశ్లేషములు విభాష నగు.' బాల. సంధి. 17, చెందొవ. చెందొవ = ఎఱ్ఱకలువ. 'చెన్నుశబ్దము వృత్తిని శోణార్థకంబు,' బాల.సంధి.37, వృత్తి.

క. మెఱుఁగు లగు వాఁడిచూడ్కులు
నెఱఁకులు గాఁడఁగొన నగజ నెరవిడిఁ జూడం
దెఱపిగొనుకతనఁ గా కెదఁ
బెఱనాఁ డమ్మరుశరంబు భేదించు హరున్. 39

అర్థము: మెఱుఁగులు + అగు = తీక్ష్ణములగు, వాఁడి = పదనైన, చూడ్కులు = చూపులు, నెఱఁకులు = ఆయువుపట్టులు, కాఁడఁగొనన్ = గ్రుచ్చుకొనునట్లు, అగజ = పార్వతి, నెరవిడిఁజూడన్ = నిండుగాఁ జూడఁగా, తెఱపి- కొను - కతనన్ + కాక = సం దేర్పడినకారణమునఁగదా. పెఱనాఁడు = ఇంకొక దినమున, ఆ + మరు - శరంబు = ఆ మన్మథుని బాణము, హరున్ ఈశ్వరుని. ఎదన్ = హృదయమును, భేదించున్ = బ్రద్దలుచేయును.

తాత్పర్యము: పార్వతి తన తీక్ష్ణములు. నిశితములు నైన చూపులు శివుని ఆయువుపట్టులను గ్రుచ్చుకొనునట్లు నిండుగాఁ జూడఁగా సందేర్పడినకారణముచేతఁ గదా ఇంకొకనాఁడు ఆ మన్మథుని బాణము హరుని హృదయమును భేదించును.

విశేషములు: అలంకార ముత్ప్రేక్ష, నెఱను-ఏకవచనము. నెఱఁకులు - బహువచనము, 'కలన్వాదుల నువర్ణంబు కుజగు బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు.' బాల.అచ్చి.18 నెఱ + కుజ్ + లు. 'జిత్తు బిందుపూర్వం బగు.' బాల.తత్సమ.19. నెఱఁకులు. ఎదఁ బెఱనాఁ డమ్మరుశరంబు భేదించు హరున్ - 'క్రియాన్వయంబున రెండుపదంబులకు స్వస్వామిసంబంధంబు గలచో సంబంధి పదంబు షష్ఠికి ద్వితీయ యగు.' ప్రౌఢ.కారక. 23. పెఱనాఁడు - 'కాలాధ్వములకుం బ్రాయికంబుగాఁ బ్రథమ యగు.' బాల.కారక.25.

వ. మఱియు నత్యాసక్తి నసురాగిల్లి. 40

అర్థము : మఱియున్, అతి + ఆసక్తిన్ = మిక్కిలికోరికతో, అను రాగిల్లి = అనురాగమునొంది.

తాత్పర్యము : మఱియును బార్వతి మిక్కిలికోరికతో నసురాగముచెంది. తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : అతి + ఆసక్తి - అత్యాసక్తి - యణాదేశసంధి. అసురా గిల్లు + అనురాగ + ఇంచు - 'సంస్కృతంబున కంగలాపుల కించు క్కగు.' బాల. క్రియ.63. 'రంజాదుల యించుకప్రకారంబునకు సబిందుకంబున కప్రేరణంబున ద్విరుక్తలకారం బగు.' బాల. క్రియ.71. అసురాగ + ఇల్లు. 'అంద్వవగాగమంబులం దప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు.' బాల.సంధి.11. అసురాగిల్లు.

సీ. ఎలనారు కనుఁగవ బొలయించుఁ గ్రేవల
నెఱిఁగొని మెఱుఁగులు తుఱఁగలింపఁ,
గ్రొవ్విరి చిఱునవ్వు నవ్వు వాతెఱకాంతి
రంగిల్లి సితరుచుల్ తొంగలింపఁ,
గుదుటఁ గ్రక్కదరినఁ గదియుంచు గుడువిల్లు
నుడిసి ముత్తరఁగంబుఁ గదలుకొనఁగ,
సోలంబు నెఱనూరు సోగియు నుంజెమటపై
వదలి మేఁదీఁగ మవ్వంబు మిగుల

ఆ. నొత్తలించుఁ, దఱుమ నూఁకించుఁ, దాలిమి
కగ్గలించు, నెఱయ నప్పలించు
మదనశర విభిన్న హృదయాబ్జయై మహా
దేవుఁ జూచి గౌరిదేవి తివుట. 41

అర్థము : గౌరిదేవి = పార్వతీదేవి, మదన - శర - విభిన్న - హృదయ+ అబ్జ + ఐ = మన్మథుని బాణములచే విశేషముగా భేదింపఁబడిన తామరవంటి హృదయముగలదియై, తివుటన్ = కోరికతో, మహా - దేవున్ = శివుని, చూచి.

ఎలరారు = ప్రకాశించు, కనుఁగవ = కనుదోయి, కొలయించు=ప్రసరింపఁ జేయునట్టి, క్రేవలన్ = పార్శ్వములందు, నెఱిగొని = అందమయి, మెఱుఁగులు= కాంతులు, తుఱఁగలింపన్ = అతిశయింపఁగా,

క్రొవ్విరి (క్రొత్త+విరి)=క్రొత్తపూవుయొక్క, చిఱు-నవ్వున్=ఇంచుకైన వికాసమును, నవ్వు = పరిహసించు, వాతెఱ-కాంతిన్ = పెదవికాంతిచేత, రంగిల్లి= ప్రకాశించి, పిత - రుచుల్ = తెల్లని కాంతులు, తొంగలింపన్ = ప్రకాశింపఁగా,

కుదుటన్ = మొదట, క్రక్కదరినన్ =మిక్కిలి చలింపఁగా, కదియించు= బిగించు, గుడు - విల్లు = గుడుసు - విల్లు - గుంఁడ్రనివిల్లు, సుడిసి = చుట్టుకొని- క్రమ్మి, ముత్తరఁగలున్ (మూఁడు+తరఁగలు)=మూఁడువళులును, కడలుకొనఁగన్= కలుగఁగా,

సోలంబు = పరవశత్వము. నెఱన్ + ఊరు = నిండుగా స్రవించు నట్టి, సొగియు = ఆనందపడు, నుంజెమటపైన్ (నునుపు + చెమట) = లేఁజెమటపై, వదలి, మేఁదీఁగ (మే + తీఁగ)=దేహలత, మవ్వంబు=మృదుత్వము, మిగులన్= అతిశయింపఁగా,

ఒత్తలించున్ = ఒత్తరించున్ = వెడలఁగొట్టును, సమీపింపఁజూచును. తఱుమన్ + ఊఁకించున్ = తఱుముటకుఁ బూనును, తాలిమికిన్ =సహనమునకు, అగ్గలించున్ = అతిశయించును. నెఱయన్ = పూర్ణముగా, అప్పలించున్ = ఆక్ర మించును,

తాత్పర్యము : పార్వతి మన్మథబాణములచే విశేషముగా భేదింపఁబడిన హృదయము గలదియై, కోరికతో శివునిఁజూచి, కనుదోయి ప్రసరింపఁజేయుకాంతులు పార్శ్వములందు అతిశయింపఁగను. క్రొంబూవు నీషద్వికాసమును బరిహసించు పెదవి కాంతిచేఁ బ్రకాశించి తెల్లనికాంతులు వెలుఁగొందఁగను, మొదట మిక్కిలి చలింపఁగా బిగించు గుండ్రనివిల్లు చుట్టుకొని మూఁడువళు లేర్పడఁగను, పారవశ్యముచే నెక్కు

వగాఁబట్టు లేఁజెమటపై వదలి దేహలత మృదుత్వము మీఱఁగను, వెడలఁగొట్టును, తఱుమ నుంకించును. ఓరిమిపట్టలేకపోవును. పూర్ణముగా నాక్రమించును.

వ. ఇట్లు మదనపరవశ యగుచున్న పార్వతి ముఖాలంకారంబు గనుం
గొని సొగిసి యా క్షణంబ. 42

అర్థము : ఇట్లు, మదన - పరవశ =మన్మథునకు లోనైనది, అగుచున్ + ఉన్న = అగుచున్నయట్టి. పార్వతి, ముఖ + అలంకారంబు = మొగముకైసేఁత, కనుంగొని, సొగిసి = ఆనందపడి, ఆ - క్షణంబు + అ = వెంటనే,

తాత్పర్యము: ఇట్లు మన్మథునకు లోనగుచున్న పార్వతి మోముకైసేఁతను జూచి శివుఁ డానందపడి వెంటనే - తరువాతి పద్యముతో నన్వయము.

ఉ. ఆ రుచిరాననాబ్జ దరహాస విలాస వికాస భాసి నీ
హారకరాతిభాతి నమలాంగ శరీర తుషారదీప్తి కాం
తోరునగంబు సమ్మదరసోత్కట ఘర్మజలంబు పర్వి పొ
ల్పారె హిమాచలంబు నమరాధిపవాహిని గప్పినట్టిదై. 43

అర్థము : ఆ రుచిరాననాబ్జ .... భాతిన్ : ఆ - రుచిర = ఆ మనోహరమైన, ఆనన + అబ్జ = ముఖచంద్రునియొక్క, దర - హాస - చిఱునవ్వుయొక్క, విలాస = చక్కఁదనముయొక్క, వికాస = వికసనమువలె, భాసి= ప్రకాశించునట్టి, నీహార - కర + అతి - భాతిన్ = చంద్రుని మిక్కిలికాంతిచే - వెన్నెలచే, అమలాంగ .... నగంబు : అమల + అంగ = నిర్మలమైన (తెల్లని) శరీరముగలవానియొక్క, శరీర = మేననెడి, తుషార - దీప్తి - కాంత = చంద్రకాంతపు, ఉరు- నగంబు = పెద్దకొండ, సమ్మద .... జలంబు - సమ్మద - రస = సంతోషరసమనెడి, ఉత్కట = అధికమైన, ఘర్మ - జలంబు = చెమటనీరు, పర్వి = వ్యాపించి, హిమ + అచలంబున్ = హిమవత్పర్వతమును, అమర + అధిప - వాహిని= ఇంద్రనది - అకాశగంగ, కప్పిన + అట్టిది + ఐ = క్రమ్మిన విధముననై, పొల్పారెన్ = ఒప్పెను.

తాత్పర్యము : పార్వతి ముఖచంద్రుఁడు కాయు చిఱునవ్వు అనెడి వెన్నెల కాంతిచే శివుని శరీరమనెడి చంద్రకాంతశిలాపర్వతము, సంతోషరసము అనెడి చెమట నీరు వ్యాపించి, హిమవత్పర్వతమును ఆకాశగంగ కప్పినట్లు ఒప్పెను.

విశేషములు : పార్వతి ముఖము చంద్రబింబమువలె నున్నది. అందలి చిఱునవ్వు వెన్నెలవలె నున్నది. వెన్నెలకాంతిచే శివుని శరీరమనెడి చంద్రకాంతశిలా పర్వతము సంతోషరసమనెడి చెమటనీరు వ్యాపించి హిమవత్పర్వతమును ఆకాశగంగ కప్పినట్లుండెను. అలంకారము రూపకానుప్రాణితమైన ఉపమ.

వ. మఱియుం గనుబేటంబై నఁ దావగొనక. 44

అర్థము : మఱియున్, కనుబేటంబు = కనుకలివలని అనురాగము. ఐనన్ = కాఁగా, తావ - కొనక = తాళలేక.

తాత్పర్యము : మఱియును గనుకలిచే ననురాగమునుబొంది శివుఁడు తాళ లేక - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. పులకాంకురంబులు దలలెత్తి మేను కం
పింపఁ గోమలిఁ గౌఁగిలింపఁ దలఁచు;
రాగోత్కటమున సైరణలేక మానినిఁ
గాయ్వునఁ బైపడి కవయఁదలఁచు,
లలితాంగి యవయవంబులు సూచి మదిఁ దని
వోవక చూడ్కులఁ ద్రావఁదలఁచు;
నధరోష్ఠ మదరంగ నంతఃస్మితాంశులు
దలుకొత్త నేమేనిఁ బలుకఁదలఁచుఁ;

తే. దన మహత్త్వంబుఁ దలఁపక తరుణిపొందు
వడయఁ గీడ్పడి తేఁకువ వాపఁదలఁచు;
భావజాస్త్రాభిహతి మహాదేవుఁ డొక్క
వ్రేలిమిడిఁ జెంపునెడి కడు విరలిగొనియె. 45

అర్థము : శివుఁడు కర్త.

పులక + అంకురంబులు = గగ్గురుల మొలకలు, తలలు + ఎత్తి = పొటమరించి, మేను = శరీరము, కంపింపన్ = వడఁకఁగా, కోమలిన్ = సుందరాంగిని-పార్వతిని, కౌఁగిలింపన్ + తలఁచున్.

రాగ + ఉత్కటతను = అనురాగాతిశయమున, సైరణ-లేక = ఓర్పులేక, మానినిన్ = స్త్రీని - పార్వతిని, కాయ్మునన్ = కాంక్షతో, పైపడి, కవయన్ = కూడ, తలఁచున్.

లలిత + అంగి = సుందరాంగి - పార్వతియొక్క, అవయవంబులు, చూచి' మదిన్ = మనస్సునందు, తనివోవక - (తని + పోవక) = తృప్తిఁజెందక, చూడ్కులన్ = చూపులతో. త్రావన్ + తలఁచున్.

అధర + ఓష్ఠము = క్రిందిపెదవి, అదరంగన్=కంపింపఁగా, అంతస్(ః)+ స్మిత + అంశులు = లోని నవ్వు వెలుఁగులు, తలుకొత్తన్ = ప్రకాశింపఁగా. ఏమి + ఏని=ఏమయినను. పలుకన్ + తలఁచున్.

తన - మహత్త్వంబున్ =తన గొప్పతనమును, తలఁపక, తరుణి -పొందు= యువతియైన పార్వతిపొందు, పడయన్ = పొందుటకు, కీడ్పడి = తక్కువపడి, తేఁకువ = భయము, పాపన్ + తలఁచున్ = పోఁగొట్టుకొన నెంచును.

మహాదేవుఁడు, భావజ + అస్త్ర + అభిహతిన్ = మన్మథుని బాణముల దెబ్బచే, ఒక్క - వ్రేలిమిడిన్ = ఒక్క చిటికలో, పెంపు + చెడి = ఆధిక్యము నశించి, కడున్. విరలి + కొనియెన్ = మోహము నొందెను.

తాత్పర్యము : శివుఁడు గగ్గురుల మొలకలు పొటమరించి శరీరము వడఁకఁ బార్వతిని గౌఁగిలింపఁగోరును. అనురాగాతిశయమున ఓర్పునశించి యామెను గాంక్షతోఁ బైపడి కూడఁగోరును. ఆమె మనోహరావయవములు చూచి మనసునఁ దృప్తిఁజెందక చూపులతోఁ ద్రావనెంచును. క్రిందిపెదవి యదర లోనగవు వెలుఁగులు ప్రకాశింప నేమయినను బలుకఁగోరును. అతఁడు తన గొప్పతనము నెంచక యువతి పొందుఁ గాంచుటకుఁ దక్కువతనమునొంది భయమును బోఁగొట్టుకొన నెంచును. ఇట్లు మహాదేవుఁడు మన్మథాస్త్రముల దెబ్బచే నొక్కచిటికలోఁ బెంపుచెడి మోహపడెను.

విశేషములు: ఎంత మహాదేవుఁడైనను మన్మథాస్త్రహతిచే సామాన్యుని వలెనే ప్రవర్తించుననుట కిట్లు వర్ణింపఁబడినది. అధరోష్ఠము = అధర + ఓష్ఠము- సమాసమున అకారాంతపదములకు ఓతుః, ఓష్ఠః అను పదములు పరములగునపుడు వృద్ధ్యాదేశము వైకల్పికము. వృద్ధి రానపుడు పరరూప మేకాదేశమగును.

వ. ఇ ట్లచలాత్ముండు చంచలాకులితహృదయుండై నిర్నిమిత్తంబ
మనోవికారం బగుటకు నేమి కారణంబో యని నలుగడలుం బరికించి
చూచునప్పు డసమాంబకు దృష్టిగోచరుండై. 46

అర్థము: ఇట్లు, అచల + ఆత్ముండు = నిశ్చలమైన ఆత్మకలవాఁడు -శివుఁడు, చంచల + ఆకులిత - హృదయుండు + ఐ= చంచలము, కలఁగినది యైన హృదయము గలవాఁడయి, నిర్నిమిత్తంబు + అ = కారణము లేకుండఁగనే, మనస్ (ః) + వికారంబు = మానసికమైన మార్పు, అగుటకున్, ఏమి, కారణంబు + ఓ, అని, నలుగడలున్ = నాలుగుదిక్కులును, పరికించి, చూచు + అప్పుడు, అసమ + అంబకు = (అసమాంబకుఁడు అని ప్రథమాంతము గా నుండుట అన్వయసుకరముగా నుండును.) మన్మథుఁడు, దృష్టి - గోచరుండు+ ఐ = కంటఁబడినవాఁడయి.

తాత్పర్యము: ఇట్లు నిశ్చలమనస్కుఁడగు శివుఁడు చంచలము, ఆకులితము నైన మనస్సుగలవాఁడయి, నిష్కారణముగాఁ దనకు మనోవికారము ఏలగలిగెనో యని నాలుగుదిక్కులు చూచినప్పుడు మన్మథుఁడు కంటఁబడినవాఁడయి - తరువాతి పద్యముతో నన్వయము.

తే. నవ తమాల లతా తతి నడుమఁ బుష్ప
చాప మండనహస్తుఁడై శంబరారి
తనరె నీలాభ్రపటలమధ్యమున నింద్ర
చాపహస్తుఁడై వెలుఁగు పర్జన్యులీల. 47

అర్థము: శంబరారి (శంబర + అరి) = శంబరుఁ డను రాక్షసునకు శత్రువైనవాఁడు - మన్మథుఁడు, నవ - తమాల - లతా-తతి - నడుమన్ = క్రొత్తదైన చీఁకటిమ్రాని తీఁగలగుంపు నడుమ, పుష్ప-చాప- మండన - హస్తుఁడు+ఐ=పూవిలు

అను అలంకారము చేతియందుఁగలవాఁడయి, నీల+అభ్ర - పటల - మధ్యమునన్ = నల్లని మేఘముల గుంపు నడుమ, ఇంద్ర - చాప-హస్తుఁడు + ఐ = ఇంద్రధనుస్సు చేతియందుఁగలవాఁడయి, వెలుఁగు = ప్రకాశించు, పర్జన్య - లీలన్ = ఇంద్రుని విధమున, తనరెన్ = ఒప్పెను.

తాత్పర్యము: మన్మథుఁడు క్రొత్త చీఁకటిమ్రాని తీవలగుంపునడుమఁ బూవిల్లనెడి యలంకారమును జేతఁ దాల్చి, నల్లనిమేఘముల నడుమ నింద్రధనుస్సును జేతఁదాల్చి వెలుఁగునింద్రునివలె నొప్పెను.

విశేషములు: అలంకార ముపమ.

మన్మథదాహము

వ. అంతకాంతకుండు కంతుం గనుంగొని కోపించి ప్రళయకాలాగ్ని రౌద్రోద్రేకంబునం బెరిఁగి దహనాంబకంబు విచ్చి చూచిన. 48

అర్థము: అంతక + అంతకుండు = యముని అంతమొందించినవాఁడు-శివుఁడు, కంతున్ = మన్మథుని, కనుంగొని = చూచి, కోపించి, ప్రళయ - కాల+ అగ్ని- రౌద్ర + ఉద్రేకంబునన్ = ప్రళయసమయమునందలి అగ్నియొక్క క్రోధాతిశయమున, పెరిఁగి = వృద్ధిచెంది, దహన + అంబకంబున్ = అగ్నినేత్రమును, విచ్చి = విప్పి, చూచినన్ = చూడఁగా.

తాత్పర్యము: శివుఁడు మన్మథుని జూచి కోపించి ప్రళయసమయమునందలి యగ్ని విజృంభణముతోఁ బెరిఁగి యగ్నినేత్రమును దెఱచి చూడఁగా - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: ఇచ్చట 'అంతకాంతకుఁ' డను విశేష్యము సాభిప్రాయము, అంతకునే అంత మొందించినవానికిఁ గంతుఁ డెంత? యని భావము. అలంకారము పరికరాంకురము. 'సాభిప్రాయే విశేష్యే తు భవేత్పరికరాఙ్కురః. - చన్ద్రా' కావ్యార్థాపత్తియు. 'కైముత్యేనార్థసంసిద్ధిః కావ్యార్థాపత్తి రిష్యతే.' చన్ద్రా. అంబకము = (నానా.) కన్ను, బాణము.

చ. పొగయక రాఁజ కొక్కెమొగి భోరన మంటలు విస్ఫులింగముల్
నెగసి రయంబునం గలయ నిండి ఛటచ్ఛట భుగ్భుగ ద్ధగ
ద్ధగ యని మండి పంచశరు దగ్ధము సేయుచ యా క్షణంబులో
మగిడి పురారినేత్రశిఖి మల్చె మహాశనిపాతభీమమై. 49

అర్థము: పుర+అరి - నేత్ర - శిఖి = త్రిపురములకు శత్రువగు ఈశ్వరునియొక్క కంటిమంట, పొగయక = పొగచిమ్మక, రాఁజక = రగులు కొనక, ఒక్కమొగిన్ = ఒక్కపెట్టున, భోరనన్ = శీఘ్రముగా, మంటలు, విస్ఫులింగముల్ = మిడుఁగుఱులు, నెగసి=పైకి లేచి, రయంబునన్= వేగముతో, కలయన్ = అంతటను, నిండి, ఛట+ఛట=ఛట ఛట యనుధ్వనితో, భుగ్భుగత్= భుగ భుగమనుచు, ధగత్ +ధగ + అని = ధగధగ అని, మండి, పంచశరున్ = అయిదుబాణములు గలవానిని - మన్మథుని. దగ్ధము + చేయుచున్ + అ = కాల్చు చునే, ఆ - క్షణంబులోన్ = అప్పుడే, మహత్ (మహా) + అశని - పాత- భీమము + ఐ = గొప్ప పిడుగుపాటువలె భయంకరమయి, మగిడి = మరలి, మల్చెన్ = ఉపశమిల్లెను.

తాత్పర్యము: శివుని కంటిమంట పొగలు చిమ్మక, రగులుకొనక ఒక్క పెట్టున శీఘ్రముగా మంటలు, మిడుఁగుఱులు పైకిలేచి వేగముగా అంతటనునిండి ఛటఛట, భుగభుగ, ధగధగ యని మండి మన్మథుని గాల్చుచునే, ఆ క్షణములోనే గొప్ప పిడుగుపాటువలె భయంకరమై తిరిగివచ్చి ఉపశమిల్లెను.

విశేషములు: మహాశనిపాతభీమమై - అలంకార ముపమ. ఛటఛట, భుగభుగ, ధగధగ - మండుటలోని ధ్వన్యనుకరణ శబ్దములు. ప్రకరణసముచితమైన శబ్దప్రయోగమునఁ గవి మన్మథదాహమును బఠితల కన్నులకుఁగట్టించినవిధ మతి హృద్యము.

చేయుచ - చేయుచున్ + అ='ప్రథమేతరవిభక్తి శత్రర్థకవర్ణంబులందున్న యుకారమునకు సంధి వైకల్పికముగా నగును.' బాల.సంధి.2. ఇది సంధియైన రూపము. సంధి కానిచో 'చేయుచున' అగును.

క. నిటలాక్ష వహ్ని కడు ను
త్కటమై తరతరమ మీఁదఁగప్పిన మదనుం
డిట యట మెదలఁగనేరక
పటుతరశిఖిశిఖలఁ గాలి భస్మం బయ్యెన్. 50

అర్థము : నిటలాక్ష - వహ్ని = నొసటికంటియగ్గి. కడున్ = మిక్కిలి, ఉత్కటము + ఐ = ఉగ్రమయి, తరతరమ = క్రమముగా. మీఁదన్ + కప్పినన్ = పయిని గ్రమ్మఁగా. మదనుండు = మన్మథుఁడు. ఇట - అట = ఇటునటు, మెదలఁగన్ + నేరక = కదలఁజాలక, పటు - తర - శిఖి - శిఖలన్ = తీవ్రతరము లైన అగ్నిజ్వాలలచే, కాలి, భస్మంబు + అయ్యెన్ = బూడిద అయ్యెను.

తాత్పర్యము : నొసటికంటి యగ్గి మిక్కిలి ఉగ్రమయి క్రమక్రమముగాఁ బైనిగ్రమ్మఁగా మన్మథుఁడు ఇటునటు కదలలేక తీవ్రతరాగ్నిజ్వాలలచేఁ గాలి బూది యయ్యెను.

విశేషములు : నిటలాక్షవహ్ని - బహువ్రీహిసమాసమయినచో నిటలాక్షవహ్ని అనియుండును. అప్పుడు శివునివహ్ని అని యర్థము. అట్లుగాక నిటలమునందలి కంటి వహ్ని అని తత్పురుషమయినచో నిటలాక్షివహ్ని అని యుండనగును. ఇట, అట - ఇచ్చటఁ గళలుగా వాడఁబడినవి.

క. కని కోపించెనొ, కానక
మును కోపించెనొ, మహోగ్రముగ నుగ్రుఁడు చూ
చినఁ గాలెనొ, చూడక యట
మును గాలెనొ, నాఁగ నిమిషమున నఱఁ గాలెన్. 51

అర్థము : ఉగ్రుఁడు = శివుఁడు, మహత్ (మహా) + ఉగ్రముగన్ = మిక్కిలి భయంకరముగా, కని = చూచి, కోపించెనొ, కానక - మును = చూడక ముందు, కోపించెనొ, చూచినన్ = చూచినపిమ్మట, కాలెనొ, చూడక + అట - మును = చూచుటకుముందు, కాలెనొ, నాఁగన్ = అనఁగా, నిమిషమునన్ = రెప్పపాటుకాలములో, అఱన్ = నశించునట్లు, కాలెన్.

తాత్పర్యము : ఉగ్రుఁడు మిక్కిలి భయంకరముగాఁజూచి కోపపడెనో, చూడకముందు కోపపడెనో, చూచినపిమ్మట మన్మథుఁడు కాలెనో, చూచుటకుముందు కాలెనో యన నతఁడు ఱెప్పపాటుకాలములో నశించునట్లు కాలెను.

విశేషములు : ఉగ్రుఁడు సాభిప్రాయ విశేష్యము గావున నలంకారము పరికరాంకురము. కాలుట యను కార్యము ముందును, చూచుట యను కారణము తరువాతను జరగినట్లు సందేహించుటచే సందేహానుప్రాణితమైన అత్యంతాతిశయోక్త్యలంకారము. 'అత్యన్తాతియోక్తి స్స్యాత్పౌర్వాపర్యవ్యతిక్రమే - చన్ద్రా. అఱన్-అఱు ధాతు తుమున్నంతరూపము.

క. గిరిసుతమైఁ గామాగ్నియు,
హరుమై రోషాగ్నియుం, దదంగజుమైను
ద్ధురకాలాగ్నియు, రతిమై
నురు శోకాగ్నియును రగిలి యొక్కట నెగసెన్. 52

అర్థము: గిరి - సుత - మైన్ = కొండకూఁతురైన పార్వతి శరీరమున, కామ + అగ్నియున్ = మన్మథాగ్నియును, హరు - మైన్ = శివుని శరీరమున, రోష + అగ్నియున్ = కోపమనెడి అగ్నియును, తద్ + అంగజు - మైన్ = ఆ మన్మథుని శరీరమున, ఉద్ధుర = తీవ్రమైన, కాల + అగ్నియున్ = ప్రళయాగ్నియును, రతి - మైన్ = రతి శరీరమున, ఉరు - శోక + అగ్నియును = గొప్ప దుఃఖమనెడి అగ్నియును, రగిలి = రాఁజుకొని, ఒక్కటన్ = ఒక్కమాఱుగా, నెగసెన్ - ఎగసెన్ = పైకి లేచెను.

తాత్పర్యము: పార్వతి శరీరమున మన్మథాగ్నియు, ఈశ్వరుని శరీరమునఁ గోపాగ్నియు, ఆ మన్మథుని శరీరమునఁ దీవ్రమైన కాలాగ్నియు, రతి శరీరమున గొప్ప దుఃఖాగ్నియు రాఁజుకొని యొక్కమాఱుగాఁ బైకిలేచెను.

విశేషములు : కామాగ్ని, రోషాగ్ని, శోకాగ్ని - రూపకములు.

చ. అనలశిఖాలిఁ గాంచి యభయం బభయం బని దేవతల్ నభం
బునఁ జెలరేఁగి చీఱుటకుమున్న మనోభవు నీఱుచేసి పో
యినఁ గని దిక్పతుల్ సురలు నింద్రుఁడు శోకభయార్తులై మరుం
బనవుచుఁ బాఱి రొండొరుల పట్టులు గానక భీ వికారులై. 53

అర్థము : అనల - శిఖా + ఆలిన్ = అగ్నిజ్వాలల వరుసను, కాంచి= చూచి, అభయంబు + అభయంబు = శరణు శరణు, అని, దేవతల్, నభంబునన్ = ఆకాశమున, చెలరేఁగి=విజృంభించి, చీఱుటకున్+మున్ను +అ=పిలుచుటకుముందే, (శివుఁడు,) మనోభవున్ = మనసిజుని - మన్మథుని. నీఱు - చేసి = బూదిచేసి, పోయినన్ = పోఁగా, కని, దిశ్ (క్) + పతుల్ = దిక్పాలకులు, సురలు = దేవతలు, ఇంద్రుఁడు, శోక - భయ + ఆర్తులు + ఐ = దుఃఖముచేతను, భీతిచేతను పీడితులయి, మరున్ = మన్మథునిగూర్చి, పనవుచున్ = పేర్కొని దుఃఖించుచు, భీ-వికారులు + ఐ = భయమువలన వికృతి చెందినవారయి, ఒండొరుల-పట్టులు= ఒక్కొక్కరి స్థానములు. కానక, పాఱిరి = పరువెత్తిరి.

తాత్పర్యము : అగ్నిజ్వాలలవరుసను జూచి శరణుశరణని దేవతలు ఆకాశమున విజృంభించి పిలుచుటకుముందే యీశ్వరుఁడు మన్మథుని బూదిచేసిపోఁగా, దిక్పాలకులు, దేవతలు, ఇంద్రుఁడు చూచి దుఃఖముతోను, వెఱపుతోను పీడితులై, మన్మథుని పేర్కొని యేడ్చుచు భయముచే వికృతిని పొందినవారయి, యొక్కొక్కరి స్థానములు కానక పాఱిపోయిరి.

విశేషములు : నీఱు - బూడిద, నీరు = జలము.

వ. తదనంతరంబ. 54

అర్థతాత్పర్యములు : తద్ + అనంతరంబు + అ = ఆ పిమ్మటనే - తరువాతి పద్యముతో నన్వయము.

క. తన కగసుతపై రాగము
మనసిజుపై ద్వేషముం గ్రమంబున నైనం
జనియెఁ దప ముడిగి ; శివుఁ డెడ
పని రాగద్వేషములఁ దపము సెడు దరుదే ? 55

అర్థము : తనకున్, అగ - సుత - పైన్ = కొండకూఁతుపై - పార్వతిపై, రాగమున్ = ప్రేమమును, మనసిజుపైన్ = మన్మథునిమీఁద, ద్వేషమున్ =కోపమును, క్రమంబునన్ = వరుసగా, ఐనన్ = కాఁగా, శివుఁడు, తపము, ఉడిగి =

మాని, చనియెన్ = పోయెను, ఎడపని = విడువని, రాగ - ద్వేషములన్ = రాగముచేతను, ద్వేషముచేతను, తపము, చెడుట = చెడుట, అరుదే = ఆశ్చర్యమా?

తాత్పర్యము : తనకుఁ బార్వతిపై ననురాగము, మన్మథునిపైఁ గోపము క్రమముగాఁ గాఁగా, శివుఁడు తపముమాని పోయెను. విడువని రాగద్వేషములచేఁ దపము భంగపడుట ఆశ్చర్యమా? కా దనుట.

విశేషములు : విశేషమును సామాన్యముచే సమర్థించుటచే నలంకార మర్థాంతరన్యాసము. భావార్థక టవర్ణకమునకు బదులుగా డువర్ణమును ప్రయోగించుట యీ కవికిఁ బరిపాటి.

వ. ఇట్లు గిరిశుండు రజతగిరి కరిగిన గిరిజ హరవిరహతాపంబునం బరవశయై పడియుండె నంత నంతవృత్తాంతంబు హిమవంతుం డెఱింగి రయంబునం జనుదెంచి యా క్షణంబున. 56

అర్థము : ఇట్లు, గిరిశుండు = కొండపై (కైలాసమున) పరుండువాఁడు-ఈశ్వరుఁడు, రజత-గిరికిన్ = వెండికొండకు - కైలాసమునకు, అరిగినన్ = వెడలఁగా, గిరిజ = పార్వతి, హర - విరహ - తాపంబునన్ = ఈశ్వరునితోడి ఎడఁబాటువలని దుఃఖముచే, పరవశ + ఐ = ఒడలుతెలియని దయి, పడి + ఉండెన్, అంతన్, అంత-వృత్తాంతంబున్, హిమవంతుండు, ఎఱింగి, రయంబునన్ = వేగముగా, చనుదెంచి= వచ్చి, ఆ - క్షణంబునన్.

తాత్పర్యము : ఇట్లు శివుఁడు కైలాసమున కేఁగఁగాఁ, బార్వతి శివవియోగ బాధచే నొడలు తెలియక పడియుండెను. అంత నంతవృత్తాంతమును హిమవంతుఁ డెఱిఁగి వేగమే వచ్చి ఆ క్షణమునందు-తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : గిరిశుఁడు - గిరౌ శేతే ఇతి గిరిశః - గిరి యందుఁ బరుండువాఁడు - శివుఁడు. 'భూతేశః ఖణ్డపరశు ర్గిరీశో గిరిశో మృడః.' అమరము.

తే. కీలు ప్రిదిలి తటిల్లత నేలఁబడిన
పరవసంబున శారదాభ్రంబు మగుడ
నెత్తికొనిపోవుగతి నుమ హిమనగేంద్రుఁ
డెత్తుకొని నిజపురమున కేఁగె నంత. 57

అర్థము: అంతన్ = కీలు - ప్రిదిలి = అతుకు ఊడి, తటిల్లత (తటిత్ + లత) = మెఱపుఁదీఁగ, నేలన్ + పడినన్ = నేలపైఁబడఁగా, శారద + అభ్రంబు = శరత్కాలపుమేఘము, మగుడన్ = మరల, బరవసంబునన్ = పట్టుదలతో, ఎత్తికొని - పోవు - గతిన్ = ఎత్తుకొనిపోవు విధమున, హిమ - నగ + ఇంద్రుఁడు = హిమవత్పర్వతశ్రేష్ఠుఁడు, ఉమన్ = పార్వతిని, ఎత్తుకొని, నిజ - పురమునకున్ = తన పురమునకు, ఏఁగెన్.

తాత్పర్యము: అంత అతుకు ఊడుటచే మెఱపుఁదీఁగ నేలఁబడఁగా దానిని శరన్మేఘము మరలఁ బట్టుదలతో నెత్తుకొనిపోవు విధమున పర్వతశ్రేష్ఠుఁడగు హిమవంతుఁడు ఉమను ఎత్తుకొని తన నగరమున కరిగెను.

విశేషములు; అలంకార ముత్ప్రేక్ష. శరత్కాలమునఁ బుట్టినది శారదము.

'దుహితర మనుకమ్ప్యా మద్రి రాదాయ దోర్భ్యామ్
సురగజ ఇవ బిభ్రత్ పద్మినీం దన్తలగ్నామ్'.

అని కాళిదాసు, సాధారణముగా నన్నెచోడుఁడు కాళిదాసుచెప్పినభావము నెచ్చటను ఆంధ్రీకరింపఁడు. అట్టి రమ్యభావమునే వేఱొకదానిని స్వతంత్రించి చెప్పును. హిమవంతుఁడు మంచుచేఁ గప్పఁబడి తెల్లగానుండుటచే నతనికి శారదాభ్రముతోఁ బోలిక, పార్వతి హిమవత్తనూజ కావున నభ్రసంగతతటిల్లతతో నామెకుఁ బోలిక.

తటిల్లత - తటిత్ + లత = తవర్గ వర్ణములకు లకారము పరమగుచో పరసవర్ణము ఆదేశమగును.

రతివిలాపము

వ. ఇట్లు రతి పతి నగ్నిశిఖలు గప్పుడు భయరసావేశంబునం దల్లడిల్లి. 58

అర్థము: ఇట్లు, రతి, పతిన్ = భర్తను, అగ్ని - శిఖలు = అగ్నిజ్వాలలు, కప్పుడున్ = క్రమ్మినంతనే, భయ - రస + ఆవేశంబునన్ = భయరసోద్రేకముచే, తల్లడిల్లి = కలఁగి.

తాత్పర్యము: ఇట్లు రతి తనభర్తను అగ్నిజ్వాలలు క్రమ్మినంతనే భయాతిశయముచేఁ గలఁగి - తరువాతి పద్యముతో నన్వయము.

క. పరవశయై పడి రతి చె
చ్చెరఁ దెప్పిలి లేచి చూచి శిఖిపొడవు నిజే
శ్వరు పొడవుఁ గాన కచ్చటఁ
బురుషాకృతి నున్న భస్మపుంజముఁ గాంచెన్. 59

అర్థము : రతి, పరవశ + ఐ = ఒడలుతెలియనిదయి, పడి, చెచ్చెరన్= శీఘ్రముగా, తెప్పిలి = తేఱుకొని, లేచి, చూచి, శిఖి - పొడవు = అగ్నిజాడ, నిజ+ ఈశ్వరు - పొడవున్ = తనభర్త యాకృతిని, కానక=చూడక, అచ్చటన్, పురుష+ ఆకృతిన్=పురుషుని ఆకారముతో, ఉన్న, భస్మ - పుంజమున్=బూదిరాశిని, కాంచెన్.

తాత్పర్యము : రతి యొడలుతెలియనిదయి పడి వెంటనే తెప్పిఱిల్లి లేచి చూచి అగ్నిజాడగాని, తనభర్త ఆకారముగాని చూడక అచ్చటఁ బురుషుని యాకారమునమన్న బూదిరాశిని జూచెను.

విశేషములు : 'అచ్చటఁ, బురుషాకృతినున్న భస్మపుంజముఁ గాంచెన్'- కాళిదాసీయమునను ఇట్లే కలదు, 'దదృశే పురుషాకృతి క్షితౌ హర కోపానల భస్మ కేవలమ్.'

వ. కని కలవలించుచు. 60

అర్థతాత్పర్యములు : కని = చూచి, కలవలించుచున్ = కలవరించుచు- కలఁతనొందుచు- చూచి కలఁతనొందుచు - తరువాతి పద్యముతో నన్వయము.

తరువోజ. కాయజుఁ డా యగ్నిఁ గాలెనో! నెఱయఁ
గాలంగ నెడ యెద్ది? కడు భీతిఁ బాఱి
పోయెనో? నను(బెట్టి పోవునే? కడచి
పోయిన నీ భస్మపుంజ మెక్కడిది?
మాయయో యిది? యని మది యఱఁ బొదల
మ్రాఁకుల చెట్టుల మఱువునఁ గలయ
నా యింతి భ్రమఁగొని యడలడి సంశ
యాకులచిత్తయై యాత్మేశు రోసె. 61

అర్థము ; కాయజుఁడు = అంగజుఁడు - మన్మథుఁడు. ఆ + అగ్నిన్ = ఆ యగ్నియందు, కాలెనొ, నెఱయన్ = పూర్తిగా, కాలంగన్ = కాలుటకు, ఎడ = వ్యవధి, ఎద్ది = ఏది?, కడున్ + భీతిన్ = మిక్కిలి భయముతో, పాఱిపోయెనో, ననున్, పెట్టి = దిగవిడిచి, పోవునే, కడచి - పోయినన్ = పాఱిపోయినచో, ఈ - భస్మపుంజము = ఈ బూడిదప్రోవు, ఎక్కడిది? ఇది, మాయయో, అని, మది = మనస్సు, అఱన్ = సందేహముతో, పొదల, మ్రాఁకుల = పెద్దచెట్లయొక్క, మఱుఁవునన్ = చాటున, కలయన్ = అంతటను, ఆ + ఇంతి = ఆ స్త్రీ (రతి), భ్రమ + కొని = భ్రాంతిగొని, అడలడిన్ = దుఃఖముతో, సంశయ + ఆకుల-చిత్త + ఐ = సందేహముచేఁ గలఁగిన, మనస్సుగలదయి, ఆత్మ + ఈశున్ = తన భర్తను, రోసెన్ = వెదకెను.

తాత్పర్యము : 'మన్మథుఁడు ఆ యగ్నిలోఁ గాలెనో? పూర్తిగాఁ గాలి పోవుటకు అవకాశమేది? మిక్కిలి భయమునఁ బాఱిపోయెనో? నన్ను విడిచిపెట్టి పోవునా? విడిచిపోయినచో నీ బూదిరాశి యెక్కడిది? ఇది మాయయో?' అని మనస్సందేహముతోఁ బొదల, చెట్ల మాటున నంతటను ఆమె భ్రాంతితో, దుఃఖముతో, సందేహముతోఁ గలఁగిన మనస్సుతోఁ దన భర్తను వెదకెను.

అలంకారము హేత్వపహ్నవము.

విశేషములు : మ్రాఁకులు - మ్రాను + లు, 'కలన్వాదుల నువర్ణంబు కుఙ్గు, బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు.' బాల, ఆచ్ఛిక. 8. మ్రా + కుఙ్ + లు 'ఙిత్తు బిందుపూర్వం బగు.' బాల, తత్సమ. 19. మ్రాఁకులు. తరువోజ లక్షణము: నాలుగుపాదము లుండును. ప్రతిపాదమునను మూఁడింద్రగణములు, ఒక సూర్యగణము, మరల మూఁడింద్రగణములు, ఒక సూర్యగణము ఉండవలయును, మొదటిగణము మొదటియక్షరమునకును, మూఁడవగణము మొదటి యక్షరమునకును, మరల నైదవగణము మొదటి యక్షరమునకును, ఏడవగణము మొదటి యక్షరమునకును యతిమైత్రి. ప్రాసనియమము గలదు.

వ. వెండియు నన్వేషించి ప్రలాపించుచు. 62

అర్థతాత్పర్యములు ; వెండియున్ = మరల, అన్వేషించి = వెదకి, ప్రలాపించుచున్ = ఏడ్చుచు - మరల వెదకియేడ్చుచు - తరువాతి పద్యముతో నన్వయము.

తే. నన్ను నొరయంగఁ బాడియే నాథ! యిచటఁ
బొడవుసూపక డాఁగితి పొదలలోన
నిన్నుఁబాసి జీవింతునే నిమిషమైనఁ
గామరహితంబుగా రతి గలదె యెందు? 63

అర్థము : నాథ, ఇచటన్, నన్నున్, ఒరయంగన్ + పాడియే=పరీక్షించుట న్యాయమా? పొడవు + చూపక = ఆకారమును జూపక, పొదలలోనన్, డాఁగితి = దాఁగుకొంటివి, నిన్నున్, పాసి = విడిచి, నిమిషము + ఐనన్, జీవింతునే = బ్రదుకుదునా?, ఎందున్ = ఎచ్చటనైనను, రతి = రతిదేవి, సంభోగసౌఖ్యము, కామ-రహితంబుగాన్ = మన్మథుఁడు లేకుండ, కోరికలేకుండ, కలదే?

తాత్పర్యము : 'నాథా! నన్ను ఇచ్చటఁ బరీక్షించుట న్యాయమా?' నీవు నాకుఁ గనఁబడక పొదలలో డాఁగుకొంటివి. నేను నిన్ను విడిచి ఒకనిమిషమైనను బ్రదుకఁగలనా? ఎచ్చటనైనను గామవిరహితముగా రతి యుండునా?

విశేషములు : అలంకారము శ్లేషానుప్రాణితమైన అర్థాంతరన్యాసము.

డాఁగితి = డాఁగితివి. 'లిఙ్లాటుల వకారంబునకు లోపంబు విభాష నగు.' బాల.క్రియ.24. డాఁగితి+ఇ. 'అంద్వవగాగమంబులందప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు.' బాల.సంధి.11. డాఁగితి.

క. రతిహితుఁడ వనఁగ నెప్పుడు
రతిసంగతి నుండుదీవు; రతి నిప్పుడు దుః
ఖితఁజేసి పోయి తక్కటా!
రతి వంచనచేసి పోక రసికుల గుణమే! 64

అర్థము : ఈవు = నీవు, రతి - హితుఁడవు = రతిదేవికి - సంభోగానందమునకు, ఇష్టుఁడవు, అనఁగన్, ఎప్పుడున్. రతి - సంగతిన్ = రతిదేవితోఁ గూడ, ఆనందముతోఁగూడ, ఉండుదు = ఉండుదువు, అక్కటా! = అయ్యో! ఇప్పుడు, రతిన్ = రతిదేవిని - రతియందు, దుఃఖితన్ + చేసి = దుఃఖించినదానినిగాఁ జేసి, పోయితి = పోయితివి, రతిన్ = రతిని - సంభోగమునందు, వంచన- చేసి= మోసగించి, పోక = పోవుట, రసికుల - గుణమే = సరసులయినవారి లక్షణమా?

తాత్పర్యము : నీవు రతికి హితుఁడ వనఁగా నెప్పుడును రతితోనే యుందువు. అయ్యో! ఇప్పుడు రతిని దుఃఖితురాలినిజేసి పోయితివి. ఇట్లు రతిని వంచించిపోవుట సరసులైనవారి లక్షణమా? కా దనుట.

విశేషములు : అలంకారము శ్లేషము. అర్థాంతరన్యాసము. రతి వంచనచేసి-ఇట రతిన్ అనుదానికి మన్మథభార్యార్థమున 'రతిని' అని ద్వితీయార్థమును, సంభోగార్థమున 'రతి యందు' అని సప్తమ్యర్థమును జెప్పనగును.

ఉండుదు-ఉండుదువు. లాద్యకారలోపము, బాల. క్రియ. 24. అపదాదిస్వరసంధి. బాల.సంధి.11. పోక - పోవు ధాతువు. 'కవర్గకం బలుగ్వాదుల కగు.' బాల.కృ.3. పోవు+క. 'ఇటం గృత్కగ తప వేములు పరంబు లగునపుడు క గ చ య వలకు లోపంబగు.' బాల. కృ.2. పోక, పోయితి - లిద్వకారలోపము, అపదాదిస్వర సంధి. పోయితక్కట. పోయితి + అక్కట, 'మధ్యమపురుషక్రియలయం దిత్తునకు సంధి యగును.' బాల.సంధి.7. పోయితక్కట.

తే. అబలఁ, గడు నెడ యెఱుఁగని యాఁటదాన,
మెలఁత, నతిభీత నన్ను నమ్మించి తెచ్చి
కాననంబులోఁ గన్నులుకట్టి కాడు
పఱచి నీ కిట్లు పోఁ జన్నె భావజన్మ? 65

అర్థము : భావజన్మ = మనసిజుఁడా! మన్మథుఁడా!, అబలన్ = స్త్రీని - బలహీనను, కడున్ = మిక్కిలి, ఎడ = లోకవ్యవహారము, ఎఱుఁగని = తెలియని, ఆఁట దానన్ = ఆఁడుదానను, మెలఁతన్ = స్త్రీని, అతి - భీతన్ = మిక్కిలి భయపడినదానను, నన్నున్, నమ్మించి, తెచ్చి, కాననంబులోన్ = అడవిలో, కన్నులు - కట్టి = కన్నులుకప్పి- మోసగించి, కాడుపఱచి = క్షోభపెట్టి, ఇట్లు. పోన్ = పోవుటకు, చన్నె = చనునె- తగునే?

తాత్పర్యము: మన్మథా! నేను అబలను, వ్యవహారజ్ఞాన మేమాత్రము లేని యాఁడుదానను. మిక్కిలి భయపడినదానను. నన్ను నమ్మించి తెచ్చి యడవిలోఁ గన్నులుగప్పి క్షోభపెట్టి, యిట్లు పోవుట నీకుఁ దగునా? తగ దనుట.

విశేషములు ; మన్మథుఁడు తన్ను విడిచిపోఁగూడమికి అబలను, కడు నెడ యెఱుఁగని యాఁటదానను, అతిభీతను అనువానిని గారణములుగాఁ జెప్పి సమర్థించుటచే నలంకారము కావ్యలింగము, 'సమర్థనీయ స్యార్థస్య కావ్యలిఙ్గం సమర్థనమ్.' చన్ద్రా.

పోఁజన్నె - పోన్ + చన్నె - పోవుధాతువు, 'తుమర్థ భావలక్షణంబులందు నుజీ యగు' బాల, క్రియ.40, పోవు + నుజీ. 'ముజ్జీత్తులు ముత్తు నాఁబడు.' బాల. క్రి. 86. 'పోవునకు దుజ్ముత్తులు ముజ్జుం బరంబులగునపుడు వులోపంబుం బొదపదలును విభాష నగు. బాల, క్రియ.98. పోను + చన్నె. చనునె - చను + ఎ, 'ఒకానొకచోఁ దద్ధర్మార్థకంబులగు నుండు. చను, చేరుకొనులు ప్రశ్నార్థకైకారపరకంబు లగునపుడు వాని కడయచ్చులకు లోపంబు విభాష నగు.' ప్రౌఢ. క్రియ.2. చన్నె, పోను + చన్నె- ద్రుతకార్యము. బాల.సంధి. 16,17. పోఁజన్నె. కాననము (ప్రకృతి)- కాన (వికృతి).

వ. అని ప్రలాపించుచు మగుడం జనుదెంచి పుష్పకోదండ పల్లవ చ్ఛత్ర మకరకేతనంబుల నచ్చుపడియున్న మరు భస్మాకారంబుఁగని త్రినయన నయనానలాహతుం డగుట నిశ్చయించి శోకపరవశయై పడి మెల్లన చేతరించుచు. 66

అర్థము : అని, ప్రలాపించుచున్ = దుఃఖముతోఁ గేకలు వేయుచు, మగుడన్ = మరల, చనుదెంచి = వచ్చి, పుష్ప-కోదండ, పల్లవ + ఛత్ర - మకర - కేతనంబులన్ = పూవిల్లు, చివురుగొడుగు, మొసలిటెక్కెముల తో, అచ్చుపడి + ఉన్న = ముద్రపడియున్న, మరు భస్మ + ఆకారంబున్ = మన్మథుని బూది రూపును, కని, త్రినయన - నయన + అనల + ఆహతుండు = ముక్కంటి కంటి మంటచేఁ గొట్టఁబడినవాఁడు, అగుటన్, నిశ్చయించి, శోక - పరవశ + ఐ = దుఃఖముచే నొడలుతెలియనిదయి, పడి, మెల్లన, చేతరించుచున్ = చైతన్యముకలది యగుచు.

తాత్పర్యము ; అని దుఃఖముతోఁ గేకలు వేయుచు రతి మరలవచ్చి పూవిల్లు, చివురుగొడుగు, మొసలిటెక్కెము అనువానితో ముద్రితమైన మన్మథుని బూది రూపును జూచి ముక్కంటి కంటిమంటచేఁ జచ్చినవాఁడని నిశ్చయించి మెల్లఁగాఁ జైతన్యము గలదియగుచు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: పల్లవచ్ఛత్ర - పల్లవ + ఛత్ర - 'హ్రస్వమునకుఁ బరమైన ఛకారము ద్విరుక్త మగును' పల్లవచ్ఛత్ర.

మ. ప్రణుతాంగోద్గత ఘర్మకంకణములన్ బాహుద్వయాకీర్ణ కం
కణముల్ ఖోరన ధారుణిం దొరఁగ నాకంపించుచున్ లేచి భూ
షణరత్నప్రభతోన పర్వుచు సితాక్షద్యోతు లందంద ది
గ్గణికాక్షుల్ మిఱుమిట్లువోవఁ బొలయంగాఁ జూచు విభ్రాంతయై. 67

అర్థము: ప్రణుత + అంగ + ఉద్గత - ఘర్మ - కంకణములన్ = మిక్కిలి నుతింపఁబడిన, అవయవములనుండి, పైకివచ్చిన, చెమట నీటిబిందువులును, బాహు-ద్వయ + ఆకీర్ణ - కంకణముల్ = రెండుచేతులనుండి విసరివేయఁబడిన, కడియములును, ఖోరన=శీఘ్రముగా, ధారుణిన్ = నేలపై, దొరఁగన్ = పడఁగా, ఆకంపించుచున్ = మిక్కిలి వడఁకుచు, లేచి, భూషణ-రత్న - ప్రభ - తోన్ + అ= అలంకారములందలి రత్నములకాంతితోనే, పర్వుచున్ = వ్యాపించుచు, సిత+ అక్ష-ద్యోతులు = తెల్లనైన యింద్రియముల కాంతులు, అందంద = మిక్కిలి, దిశ్ (క్) + గణికా + అక్షుల్ = దిక్కులనెడి వేశ్యల కన్నులు, మిఱుమిట్లు+ పోవన్ = మిఱుమిట్లుగొనఁగా - చెదరఁగా, విభ్రాంత + ఐ = మిక్కిలి భ్రాంతిఁ జెందినదయి, పొలయంగాన్ + చూచున్ = ప్రసరించునట్లు చూచును.

తాత్పర్యము: మిక్కిలి నుతింపఁబడిన అవయవములనుండి పైకి వెడలిన చెమటనీటిబొట్లులును, రెండుచేతులనుండి జాఱిపడిన కడియములును, వెంటనే నేలపైఁబడఁగా రతి మిక్కిలి కంపించుచు లేచి, యలంకారములందలి రత్నముల కాంతితోనే వ్యాపించుచుఁ దెల్లనైన యింద్రియములకాంతులు మిక్కిలిగా దిక్కులనెడి వేశ్యల కన్నులు మిఱుమిట్లుగొనునట్లు విశేషముగా భ్రాంతినొందినదయి ప్రసరించునట్లు చూచును.

విశేషములు: అలంకారము స్వభావోక్తి.

మిఱుమిట్లు - మిట్లు + మిట్లు 'అందుకు ప్రభృతులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు.' బాల. సంధి. 42.

క. ఏ యెడఁ బతిఁ బొడగానక
హా యని యెలుఁగెత్తి దిక్కు లద్రువఁగ నఱచున్,
గూయిడు, మొఱయిడుఁ, బలుమఱు
వా యుడుపక చీఱు, నేడ్చు, వడి వాపోవున్. 68

అర్థము : రతి - కర్తృపదము, ఏ + ఎడన్ = ఎచ్చటను, పతిన్ = భర్తను, పొడగానక = కానక, హా + అని, ఎలుఁగు + ఎత్తి = కంఠమెత్తి - బిగ్గఱఁగా, దిక్కులు, అద్రువఁగన్ = అదరఁగా, అఱచున్, కూయి + ఇడున్ = (కూ + ఇడున్ - సూ - ని. ౪) = భయదుఃఖాదులచే నఱచును, మొఱ+ఇడున్= మొఱపెట్టును, పలుమఱున్ = చాలసారులు, వా + ఉడుపక = నోరుకట్టక, చీఱున్ = పిలుచును. ఏడ్చున్, వడిన్ = వేగముతో, వాపోవున్ = దుఃఖించును.

తాత్పర్యము : రతి యెచ్చటను భర్తను గానక హా యని బిగ్గఱగా దెసలు అదరునట్లు అఱచును. కూయిడును. మొఱపెట్టును. పలుమాఱులు నోరుకట్టక పిలుచును, ఏడ్చును. వడిగా వాపోవును.

విశేషములు : అద్రువఁగన్ - అద్రుచు - 'చుక్పరక రువర్ణంబునకు ముందఱి దువర్ణంబు నుత్వంబునకు లోపంబు విభాష నగు నగుచోఁ దత్పూర్వంబు గురువు గాదు.' బాల. ప్రకీర్ణ. 20. అద్రుచు. 'తుమర్థ భావలక్షణంబులందు నుజీ యగు,' బాల. క్రియ. 40. అద్రుచు + నుజీ. 'ముజ్జీతులు ముత్తు నాఁబడు.' బాల. క్రియ. 36. 'ఆగమాన్య చకారంబుల కద్విరుక్తంబులకు ముత్తు పరంబగునపుడు పవ లగు.' బాల. క్రి. ౩౩ అద్రువు+నుజీ. 'జీత్తు పరంబగునపు డుత్వంబున కత్వంబగు.' బాల. క్రియ. 20. అద్రువన్ + కాను, 'నుజ్యంతంబగు నగుధాతువు క్రియావిశేషణంబుల కనుప్రయుక్తం బగు నుజీకి విభాష నగు.' బాల. క్రియ. 115, అద్రువన్+ కాను. 'దానికి హ్రస్వంబు విభాష నగు.' బాల, క్రియ. 1 16. అద్రువన్ + కను. ద్రుతకార్యము - బాల. సంధి. 16, 17. అద్రువఁగన్.

వ. తదనంతరంబ. 69

అర్థతాత్పర్యములు : తద్ + అనంతరంబు+ అ = ఆ పిమ్మటనే. తరువాతి పద్యముతో నన్వయము.

సీ. 1. ఉలియు నిట్టూర్పుల కలకలంబులతోన
యార్తరవంబు మి న్నద్రువఁజెలఁగ,
దండడిఁ దొరుఁగు పేర్బిందులతోడన
కన్నీరు తారలఁ గడలుకొనఁగ,
నిరుగడఁ బొదివిచ్చి విరియు వేనలితోన
మోహాంధతమసంబు ముంచుకొనఁగ,
వెడ బీటవాఱి నెవ్వడవడు మోవితో
ముడిఁగి వాడినయెల్గు వడఁకుచూప,

తే. తలము లెద మోఁదఁ బెరిగిన తారహార
భాతితో మోమువెన్నెల పలకఁబాఱ,
బిట్టు వెసఁదాఁకు చిచ్చుఱపిడుగువోలె
నడలు రతిఁ దాఁకు మెయి ముచ్చుముడిఁగి పడఁగ. 70

అర్థము : ఉలియు = ధ్వనించు, నిట్టూర్పుల (నిడు + ఊర్పుల) = దీర్ఘనిశ్శ్వాసములయొక్క, కలకలంబులతోన్ + అ = కలకలధ్వనులతోపాటే, ఆర్తరవంబు = రోదనధ్వని, మిన్ను = ఆకాశము, అద్రువన్ = అదరునట్లు, చెలఁగన్ = ధ్వనింపఁగను.

దండడిన్ = అధికముగా, తొరుఁగు = స్రవించునట్టి, పేర్బిందులతోడన్ + అ = చెమటబొట్టులతోపాటే, కన్నీరు, తారలన్ = కంటినల్లగ్రుడ్డులయందు, కడలుకొనఁగన్ = అతిశయింపఁగను.

ఇరుగడన్ = రెండుప్రక్కలను, పొదివిచ్చి = చెదరి, [1]విరియు = విప్పారు, వేనలితోన్ + అ = కేశపాశముతోపాటే, మోహ + అంధతమసంబు = మూర్ఛ యను చీఁకటి, ముంచుకొనఁగన్ = అతిశయింపఁగను.

వెడ = కొంచెము, బీటవాఱి = పగిలి, నెవ్వడవడు (నెఱ + వడ + పడు) = మిక్కిలి తాపమునుబొందు, మోవితోన్ = పెదవితో, ముడిఁగి = క్షీణించి, వాడిన = శుష్కించిన, ఎల్గు = కంఠధ్వని. వడఁకుచూపన్ = వణఁకఁగను.

1. వా. ప్రతి.పొలయు.

తలములు = చేతులు. ఎదన్ = గుండెమీఁద, మోఁదన్ = బాదఁగా, పెరిగిన = త్రెగిపోయిన, తార - హార - భాతితోన్ = ముత్యాలపేరికాంతితో, మోము-వెన్నెల = ముఖకాంతి, పలకఁబాఱన్ = తెల్లఁబాఱఁగను.

బిట్టు - వెసన్ = మిక్కిలి వేగముతో, తాఁకు = మీఁదఁబడునట్టి, చిచ్చుఱ పిడుగు + పోలెన్=అగ్గిపిడుగువలె, అడలు = శోకము, రతిన్ = రతిని, మెయి= శరీరము, ముచ్చముడిఁగిపడఁగన్ = మిక్కిలి ముడిఁగికొనఁగా, తాఁకున్=తగులును.

తాత్పర్యము : ధ్వని చేయు నిట్టూర్పుల కలకలధ్వనులతోపాటే రోదన ధ్వని ఆకాశ మదరునట్లు శబ్దింపఁగను, అధికముగాఁగాఱు చెమట బిందువులతో పాటే కనుగ్రుడ్లఁ గన్నీరు నిండఁగను, రెండుప్రక్కలను విప్పారి చెదరు కేశపాశము తోపాటే మూర్ఛయను చీఁకటి వ్యాపింపఁగను, ఇంచుక బీటవాఱి యధికతాపమునొందు పెదవితోపాటే క్షీణించి ఖుష్కించిన కంఠస్వరము వడఁకఁగను, చేతులు గుండెపై బాదఁగాఁ ద్రెగిపోయిన ముత్యాలపేరి కాంతితో ముఖకాంతి తెల్లఁబాఱఁగను, మిక్కిలి వేగముతోఁబడు నగ్గిపిడుగువలె శోకము రతిని శరీరము మిక్కిలిముడిఁగికొనఁ దాఁకును.

విశేషములు : అలంకారము సహోక్తి. 'సహోక్తి స్సహభావశ్చే ద్భాసతే జనరఞ్జనః' - చన్ద్రా. స్వభావోక్తి. 'స్వభావోక్తి స్స్వభావస్య జాత్యాదిస్థస్య వర్ణనమ్.' చన్ద్రా.

నిట్టూర్పు - నిడు + ఊర్పు - 'కుఱు చిఱు కడు నడు నిడు శబ్దముల ఱడల కచ్చు పరంబగునపుడు ద్విరుక్తటకారం బగు.' బాల.సంధి.12 నిట్టు + ఊర్పు 'ఉత్తున కచ్చుపరంబగునపుడు సంధి యగు.' బాల.సంధి.1. నిట్టూర్పు. అద్రువన్-చూడు పూర్వపద్యవ్యాఖ్య. మోహాంధతమసంబు - మోహమనెడి అంధతమసంబు - రూప 'ము. నెవ్వడ - నెఱ + వడ - 'అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచోఁ గానంబడియెడి.' బాల.సంధి.39. ముచ్చముడుఁగు - ముడుఁగు + ముడుఁగు -అందదుకు ప్రభృతులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు.' బాల.సంధి 42.

వ. ఇట్లు చలచలంబగు నడలడింబడి కదలి పతి వలను గనుంగొని 71

అర్థము : ఇట్లు, చలచలంబు=మిక్కిలి చలించునది. అగు, అడలడిన్= దుఃఖమున, పడి, కదలి, పతి - వలను = భర్తదిక్కు, కనుంగొని.

తాత్పర్యము : ఇట్లు మిక్కిలి చలించు దుఃఖమునఁబడి కదలి భర్తవైపు చూచి - తరువాతి పద్యముతో నన్వయము.

చ. సలలిత సాంద్ర కుంకుమము చన్నులపై మెయిఁ బ్రీతి నాకు నీ
వలఁదిన చందనంబు తడి యాఱదు నేనియు నంగజన్మ! నీ
విలసిత చారు రూప తను విభ్రమ సంపద లీ క్షణంబులోఁ
బొలుపఱఁ గాలి యాఱె నహిభూషణు కోప దవానలాహతిన్. 72

అర్థము : అంగజన్మ = ఓయి అంగజుఁడా ! - మన్మథుఁడా!, చన్నుల పైన్, సలలిత - సాంద్ర - కుంకుమము = మనోహరము, దట్టమునైన కుంకుమము, మెయిన్ = శరీరమునందు, ప్రీతిన్ = ప్రేమముతో, నాకున్, నీవు, అలఁదిన = పూసిన, చందనంబు = మంచిగంధము, తడి - అఱదు నేనియున్ = తడియాఱక పోయినను, నీ - విలసిత - చారు - రూప - తను - విభ్రమ - సంపదలు = నీ ప్రకాశించునట్టియు, మనోహరమయినట్టియు సౌందర్యము, శరీరవిలాససంపదలు, ఈ-క్షణంబులోన్, అహి-భూషణు = సర్పములు ఆభరణములుగాఁగల శివునియొక్క, కోప - దవ + అనల + ఆహతిన్ = కోపమనెడి కార్చిచ్చుయొక్క దెబ్బచే, పొలుపు + అఱన్ = ఒప్పు నశింపఁగా, కాలి, ఆఱెన్.

తాత్పర్యము ; ఓయి మన్మథుఁడా ! నాకు నీవు ప్రేమముతో స్తనముల పై నలఁదిన మనోహరము, దట్టమునైన కుంకుమము, శరీరమున నలఁదిన మంచి గంధము తడియాఱకపోయినను, నీ ప్రకాశించునట్టియు, మనోహరమయినట్టియు రూపము, శరీర విలాససంపదలు ఈ క్షణములో శివుని కోపమనెడి కార్చిచ్చుచే నొప్పు నశించునట్లు కాలి యాఱిపోయెను.

విశేషములు ; కోప దవానల = కోపమనెడి దవానల-రూపకము.

గీ. గిరిజ నొడఁగూర్చి వరదుచే వరము పడయ
నోపుఁ బొమ్మని నమ్మి యే నున్నచోట
నెట్టి విడుమర వచ్చె నీ కెట్టి చావు
సంభవించెనె మనసిజ చక్రవర్తి! 73

అర్థము ; మనసిజ - చక్రవర్తి = ఓయి మన్మథసార్వభౌమా ! గిరిజన్ = పార్వతిని, ఒడఁగూర్చి = సంధించి, వరముచేన్ = శివునిచేత, వరము, పడయన్ + ఓపున్ + పొమ్ము = పొందఁగలఁడు లెమ్ము' అని, నమ్మి, ఏను, ఉన్నచోటన్ = ఉండఁగా, ఎట్టి, విడుమర = ఎడఁబాటు, వచ్చెన్ = కలిగెను, నీకున్, ఎట్టి, చావు, సంభవించెనె.

తాత్పర్యము : ఓయి మన్మథసార్వభౌమా ! పార్వతిని సంధానపఱిచి శివునిచే వరము పొందఁగలఁడులెమ్మని నమ్మి నే నుండఁగా నెట్టి వియోగము సంభవించెను ! నీ కెట్టి చావు గలిగెను ?

సీ. ప్రీతిని వినుకలి బేటంబు గొనియున్న
వెలఁదుల బేటంబు వృథయ కాఁగఁ,
గర మర్థి నినుఁ జూచి కనుకలిఁ గలిచిన
పడఁతుల కల్పు నిష్ఫలము కాఁగఁ,
దివుటతో నిను డాసి కవయంగఁగోరెడు
వనితల కోరికి వమ్ము కాఁగ,
ననురక్తి నినుఁగూడి మనఁగంటి మంటి నే
నను రతి మనుపు మాయంబు కాఁగ,

తే. జగములందు నీ ప్రాపుచే నెగడి నెఱయఁ
బ్రబలుఁడైన వసంతకు ప్రాపు చెడఁగఁ,
దగునె వలరాజ! నీ కింత తెగఁదలంచి
పరము కోపాగ్నిలోఁ బడి యెరిసిపోవ? 74

అర్థము ; వలరాజ = మన్మథుఁడా !

ప్రీతిని = ఇష్టముతో, వినుకలిన్ = వినుటచే, బేటంబు = ప్రేమము, కొని - ఉన్న = పొందియున్న, వెలఁదుల = స్త్రీలయొక్క, బేటంబు = అనురాగము వృథ + అ- కాఁగన్ = వ్యర్థమేకాఁగా,

కరము + అర్థిన్ = మిక్కిలి కోరికతో, నినున్ + చూచి, కనుకలిన్ = చూపుచే. కలిచిన = వలచిన, పడఁతుల = స్త్రీలయొక్క, కల్పు = ప్రేమము, నిష్ఫలము - కాఁగన్ = వ్యర్థము కాఁగా,

తివుటతోన్ = కోరికతో, నినున్, డాసి = సమీపించి, కవయంగన్ = కూడుటకు, కోరెడు, వనితల = స్త్రీలయొక్క, కోరికి, వమ్ము - కాఁగన్ = వ్యర్థము కాఁగా,

ఏను = నేను, అనురక్తిన్ = అనురాగముతో. నినున్, కూడి. మనన్ + కంటిన్ = బ్రదుకఁగలిగితిని, మంటిన్ = బ్రదికితిని. అను, రతి = రతిదేవి యొక్క, మనువు = జీవనము, మాయంబు + కాఁగన్ = నశించిపోఁగా,

జగములందున్, నీ - ప్రాపుచేన్ = నీ యండచే, నెగడి = వృద్ధిపొంది, నెఱయన్ = బాగుగా, ప్రబలుఁడు + ఐన = బలవంతుఁడైన, వసంతకు - ప్రాపు= వసంతుని దిక్కు, చెడఁగన్ = నశింపఁగా,

ఇంత, తెగన్ + తలంచి = నశింపఁగోరి, పరము = శివునియొక్క, కోప + అగ్నిలోన్ = కోపమనెడి అగ్నిలో, పడి, ఎరిసిపోవన్ = కాలిపోవ, నీకున్, తగునె ?

తాత్పర్యము ; ఓయి మన్మథుఁడా ! వినికిచే వలపుగొనియున్న స్త్రీల వలపు వ్యర్థమగునట్లును, కోరికతో నిన్నుఁజూచుకొని చూపుచే వలచిన స్త్రీలవలపు నిష్ఫలమగునట్లును, కోరికతో నిన్ను సమీపించి కూడఁగోరెడి స్త్రీలకోరిక వమ్మగునట్లును, నిన్ను అనురాగముతోఁగూడి మనఁగలిగితి నను రతి మనువు నశించునట్లును, లోకములో నీ యండవలన మిక్కిలి బలవంతుఁడైన వసంతుని దిక్కు నశించునట్లును, నీవు ఈశ్వరుని కోపమనెడి అగ్నిలోఁబడి కాలిపోవఁదగునా ?

విశేషములు : వలరాజు - వలపు + రాజు, కోపాగ్ని - కోప మనెడి అగ్ని-రూపకము.

ఉ. తప్పనదారులేసి పెఱ తాపసులన్ వెఱపించునట్లు నీ
వప్పరమేశు నేయు టనయంబు భరంబనిచెప్పఁజెప్ప నా
చెప్పుట యాఁడుకజ్జమని చేకొన కొయ్యనవచ్చి; తీశు పెం
పిప్పు డెఱింగితే కడవ నేచిన నీ కిది యింత పెద్దయే? 75

అర్థము ; తప్పనదారులు + ఏసి=తప్పుదారులు పట్టించి, పెఱ - తాపసులన్ = ఇతర మునులను, వెఱపించు + అట్లు = భయపెట్టునట్లు, నీవు, ఆ + పరమేశున్ = ఆ శివుని, ఏయుట = పట్టించుట, అనయంబున్ = మిక్కిలి, భరంబు = కష్టము, అని, చెప్పన్ + చెప్పన్ = చెప్పఁగాఁ జెప్పఁగా, నా-చెప్పుట, ఆఁడు-కజ్జము = ఆఁడుదానిపని, అని, చేకొనక = గ్రహింపక, ఒయ్యనన్ = ఒప్పుగా, వచ్చితి (వి), ఈశు- పెంపు = ఈశ్వరుని గొప్పతనము, ఇప్పుడు, ఎఱింగితే (ఎఱింగితివి + ఏ), కడవన్ + ఏచినన్ = తప్పుకొన విజృంభించినచో, నీకున్, ఇది, ఇంత, పెద్దయే = అసాధ్యమా ?

తాత్పర్యము : తప్పుదారులు పట్టించి యితర మునులను భయపెట్టునట్లు ఆ పరమేశ్వరుని పట్టించుట మిక్కిలి కష్టమని నేనెంతచెప్పినను ఆఁడుది చెప్పుటయా యని కైకొనక తగుదునమ్మా యని వచ్చితివి. ఈశ్వరుని గొప్పతన మిప్పుడు నీకుఁ దెలిసినదా ? నీవు తప్పుకొన విజృంభించినచో నీ కిది యింత అసాధ్యమా ?

విశేషములు : కజ్జము (వికృతి) - కార్యము (ప్రకృతి), వచ్చితీశు- వచ్చితివి + ఈశు • లిడ్వకారమునకు లోపము. బాల. క్రియ. 24, అపదాదిస్వర సంధి. బాల, సంధి, 11, మధ్యమపురుషేకారసంధి. బాల. సంధి. 7, అట్లే - ఎఱింగితే - ఎఱింగితివి + ఏ.

మత్తకోకిల

ఇందిరాప్రియపుత్త్ర! సద్వినుతేక్షుకార్ముకహస్త! గో
విందనందన! రూపసద్గుణవిశ్రుతా! వలరాజ! నీ
సుందరాకృతి నాకు నిప్పుడు చూపనొల్లక డాఁగ నీ
వెందుఁబోయితి చెప్పవే రతి కేది దిక్కు? మనోభవా! 76

అర్థము : ఇందిరా-ప్రియ-పుత్త్ర = లక్ష్మి అనుఁగుఁగొడుకా!, సత్ + వినుత + ఇషు - కార్ముక - హస్త = బాగుగాఁ బొగడఁబడు చెఱకువిల్లు చేతియందుఁ గలవాఁడా !, గోవింద - నందన = విష్ణుని పుత్త్రుఁడా, రూప - సద్గుణ - విశ్రుతా! = సౌందర్యముచేతను, మంచిగుణములచేతను, ప్రసిద్ధుఁడా!, వలరాజ = మన్మథుఁడా, నీ - సుందర + ఆకృతిన్ = నీ సుందరమైన రూపమును, నాకున్, ఇప్పుడు, చూపన్ + ఒల్లక = చూపుట కంగీకరింపక, డాఁగి, నీవు, ఎందున్ = ఎచ్చటికి, పోయితి = పోయితివి ?, చెప్పవే, మనోభవా ? = మన్మథా!, రతికిన్, దిక్కు, ఏది?,

తాత్పర్యము : లక్ష్మీదేవి అనుఁగుఁగొడుకా ! చేత మంచిచెఱకువిల్లు దాల్చినవాఁడా! విష్ణుని పుత్త్రుఁడా ! రూపముచేతను, మంచిగుణములచేతను బ్రసిద్ధుఁడా! వలరాజా ! నీవు నీ సుందరాకారమును నా కిప్పుడు చూపనొల్లక దాఁగికొని యెచ్చటికిఁ బోయితివో చెప్పుము. రతి కిఁక నేది దిక్కు ?

విశేషములు : మత్తకోకిల లక్షణము-నాలుగు పాదము లుండును. ప్రతి పాదమునను ర, స, జ, జ, భ, ర అను గణము లుండును. మొదటి యక్షరమునకును పదునొకొండవ అక్షరమునకును యతిమైత్రి. ప్రాసనియమము గలదు.

ఉ. నీ పరిరంభణంబు ధరణీపరిరంభణమయ్యె; సమ్మదా
రోపిత శుష్కరోదనము రోదన మయ్యె; రతిక్రియారసా
లాపము లాత్మచేష్టిత విలాసము లయ్యె; మనోజ! నేనియుం
జూపవు నిన్ను; నన్నొరసిచూచుడొ! నా కిది దప్పఁజూచుదో! 77

అర్థము : మనోజ = మన్మథా !, నీ- పరిరంభణంబు = నీ కౌఁగిలి, ధరణీ - పరిరంభణము = భూమిని గౌఁగిలించుకొనుట, అయ్యెన్. నిన్నుఁగౌఁగిలించు టకు బదులు నేలను గౌఁగిలించుకొంటి ననుట, సమ్మద + ఆరోపిత - శుష్క - రోదనము = సంతోషముతోఁ దెచ్చుకొనఁబడిన వట్టియేడుపు - ప్రణయకలహమునఁ దెచ్చుకోలు ఏడుపు, రోదనము = నిజమైన యేడుపు, అయ్యెన్, రతి-క్రియా-రస+ ఆలాపములు = సంభోగక్రియలును, రసవంతమైన మాటలును, ఆత్మ చేష్టిత - విలాసములు = మానసికములైన చేష్టల విలాసములు - అయ్యెన్, రతిక్రియలును,

శృంగారరస భాషణములును కేవల మానసికలీల లయ్యెనమట, నేనియున్ = అయినను, నిన్నున్, చూపవు, నన్నున్, ఒరసి - చూచుడో = పరీక్షించి చూచుటయో!, నాకున్. ఇది, తప్పన్ + చూచుడో = అనాదరించుటయో!

తాత్పర్యము : మన్మథా! నిన్నుఁ గౌఁగిలించుకొనుటకుఁబదులు నేనిప్పుడు నేలనుగౌఁగిలించుకొంటిని. ప్రణయసమయమునందలి వట్టియేడుపు నిజమైన యేడు పయ్యెను. సంభోగక్రియలును, శృంగారరసభాషణములును కేవల మానసిక విలాసము లయ్యెను. అయినను నిన్నుఁ జూపవు. ఇది నీవు నన్నుఁ బరీక్షించుటయా లేక ఉపే క్షించుటయా?

గీ. తగిలి నా జీవమునకు నాధారమైన
నీవు నను(బెట్టిపోఁజన్నె భావజన్మ?
కట్ట యవియుడు నీరులు కల్వ వాసి
బయలువడ డించిపోయిన భంగి వోలె. 78

అర్థము : భావజన్మ = మనసిజుఁడా!, తగిలి = ఆసక్తిగలిగి, నా - జీవము నకున్ = నా బ్రదుకునకు, ఆధారము + ఐన, నీవు, కట్ట = గట్టు, అవియుడున్ = త్రెగిపోయినంతనే, నీరులు, కల్వ = కలువ, వాసి = నశించి, బయలు + పడన్ = బయటఁబడునట్లు, డించిపోయిన - భంగి + వోలెన్ = దిగవిడిచిపోయిన విధమున, ననున్ = నన్ను, పెట్టి = విడిచిపెట్టి, పోన్ + చన్నె = పోఁదగునా?

తాత్పర్యము : మన్మథా! నన్నంటియుండి నా మనుగడ కాధారమైన నీవు, కట్ట త్రెగినంతనే నీరు కలువ నశించి బయలుపడ దిగవిడిచిపోవు విధమున నన్ను విడిచిపెట్టి పోఁదగునా?

విశేషములు : అలంకార ముపమ. ఈ పద్యము కాళిదాస కుమారసంభవ శ్లోకమున కించుమించు తెనుఁగు.

క్వ ను మాం త్వ దధీన జీవితాం
వినికీర్య క్షణ భిన్న సౌహృదః,
నలినీం క్షతసేతు బన్ధనో
జలసఙ్ఘాత ఇ వాపి విద్రుతః. కుమార.సం.4 - 6.

భంగివోలె. ఒక ఉపమావాచకము పై నింకొక ఉపమావాచకమును నన్నెచోడుఁడు తఱచుగాఁ బ్రయోగించును.

ఉత్సాహ. పోరి చూచి సత్తకన్నుఁ బొత్తకన్ను నింగితా
కారముల నెఱుంగు దీవు కావలుండవై యహం
కారవృత్తి నీశు నల్క కన్నెఱింగి తప్పఁ బో
నేరవైతి కాలమైన నేర్పు సెప్పు సేయునే? 79

అర్థము : సత్తకన్నున్ (సంతకన్నున్ -పాఠాం.) =నిలుకడలేని కన్నును, పొత్తకన్నున్ (పొంతకన్నున్ - పాఠాం.) = పొందికగల కన్నును, పోరి - చూచి= పరిశీలించి, ఇంగిత + ఆకారములన్ =మనోఽభిప్రాయమును, రూపమును, ఈవు= నీవు, ఎఱుంగుదు (వు). కావలుండవు + ఐ= గర్వముగలవాఁడవయి, అహంకార-వృత్తిన్ = అహంభావవర్తనముతో, ఈశు + అల్క - కన్నెఱింగి = ఈశ్వరుని యొక్క కోపము యొక్క జాడ తెలిసి, తప్పన్ + పోన్ + నేరవు + ఐతి (వి)= తప్పించుకోలేకపోయితివి, కాలము + ఐనన్ = పోఁగాలము వచ్చినచో, నేర్పు = తెలివి, చెప్పు + చేయునే - చెప్పినట్లు చేయునా? - చేయ దనుట.

తాత్పర్యము : అన్నివిధములఁ బరిశీలించి నీవు మనోరూపములను తెలిసికొనఁగలవాఁడవు. అయినను నీవు గర్వివయి, అహంభావముతో నీశ్వరుఁ డెంతటి కోపముగలవాఁడో తెలిసియు, అతనినుండి తప్పించుకోలేకపోయితివి. పోఁగాలము దాపురించుచో, తెలివి చెప్పినట్లు చేయదుగదా!

విశేషములు : సత్తకన్ను, పొత్తకన్ను అననేమో విచార్యము. పొంత పొందుధాతువు కృదంతము. వందు - వంత, చెందు-చెంత ఇట్లే. - వా. ప్రతిపీఠిక- శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు. అలంకారము - విశేషాంశము సామాన్యాంశముచే సమర్థింపఁబడుచున్నది కావున అర్థాంతరన్యాసము. చెప్పు - చెప్పుధాతువు కృదంతము. "ఉవర్ణకం బడుక్త్వాదుల కగు." బాల.కృ.21. చెప్పు + ఉ - అపదాదిస్వరసంధి. బాల.సంధి.11.

ఉ. అక్కట! వేల్పులార! కుసుమాయుధు నాఱడిచావు చూచి మీ
రెక్కడ మాయమైతి, రసమేక్షణ! మన్మథు నీఱుచేసి నీ
వెక్కడ పోయితయ్య! పొడ వెవ్వరుఁ జూపర కానలోన; నే
నెక్కడ సొత్తు; నాకు దెస యెయ్యది నా వలరాజ! చెప్పవే! 80

అర్థము ; అక్కట = అయ్యో!, వేల్పులార = దేవతలారా! కుసుమ + ఆయుధు + ఆఱడి - చావు = పుష్పబాణుని (మన్మథుని) వ్యర్థమైన చావు, చూచి, మీరు, ఎక్కడ, మాయము + ఐతిరి, అసమ + ఈక్షణ = బేసికంటివాఁడా! ఈశ్వరా!, మన్మథున్, నీఱు + చేసి = భస్మముచేసి, నీవు, ఎక్కడ, పోయితి (వి) + అయ్య, కానలోనన్ = అడవిలో, ఎవ్వరున్, పొడవు = (మన్మథుని) రూపు (జాడ,) చూపరు + అ = చూపుటలేద, నేను, ఎక్కడ, చొత్తున్ = పోవుదును, నా వలరాజ = నా మన్మథా! నాకున్, దెస = దిక్కు, ఎయ్యది, చెప్పవే = చెప్పుమా,

తాత్పర్యము : అయ్యో! దేవతలారా! మన్మథుని రిత్తచావు చూచి మీ రెక్కడ మాయమైతిరి? ఈశ్వరా? మన్మథుని బుగ్గిచేసి నీ వెక్కడ పోయితివి? ఈ యడవిలో నెవ్వరును మన్మథునిజాడ చెప్పువారే లేరు. నే నెక్కడ పోవుదును! మన్మథా ! నాకు దిక్కెవ్వరో చెప్పుము.

విశేషములు : పోయితయ్య - పోయితివి + అయ్య. 'తద్ధర్మభూత క్రియ లార్థ్యద్యర్థపరకంబులయి ప్రశ్నార్థకంబు లగు.' ప్రౌఢ.క్రియ.3. లిద్వకారము నకు లోపము (బాల.క్రియ.24.) అపదాదిస్వరసంధి. (బాల.సంధి.11.) మధ్యమ పురుషేకారసంధి. (బాల.సంధి.7). కుసుమాయుధునాఱడిచావు - కుసుమాయుధు + ఆఱడిచావు. 'షష్ఠీసమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' బాల.సంధి.34.

వ. అని యనాథవృత్తి దీనానన యగుచు భీతిం గాంతారాంతరంబు గనుంగొనునప్పుడు. 81

అర్థము : అని, అనాథవృత్తిన్ = నాథుఁడులేని వర్తనముతో - దిక్కులేని వర్తనముతో, దీన + ఆనన = దీనమైనముఖముగలది, అగుచున్, భీతిన్ = భయ

63

ముతో, కాంతార + అంతరంబు = అడవినడిమిభాగము. కనుంగొను + అప్పుడు = చూచునప్పుడు.

తాత్పర్యము: అని దిక్కులేనివర్తనమున దీనమైనముఖముగలది యగుచు భయముతో నడవి నడిమిప్రదేశమును జూచుసమయమున - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: చెప్పవే. చెప్పుధాతువు. 'ఆశీర్వ్యాపసంప్రార్థనవిధులందు లూట్టగు.' బాల.క్రియ.6. చెప్పు + లూట్టు. 'లకారంబునకు డు ౦జు వు రు ము ముఙ్ఞగు.' బాల.క్రియ.8. చెప్పు + వు. 'లూణ్మధ్యమ వు రు లకు ముడుఙ్ఞు లగు.' బాల.క్రియ.29. చెప్పుము. 'మధ్యమ ముడుఙ్ఞులు ముఙ్ఞు నాంబు.' బాల.క్రియ.31. 'సంప్రార్థనంబుల ముఙ్ఞున కదాదులు విభాష ననుప్రయుక్తంబు లగు.' బాల.క్రియ.33. చెప్పుము + ఏ. 'ఏదాదు లనుప్రయుక్తంబు లగునపుడు ముఙ్ఞునకు వుజీ రుజీ యగు.'. బాల.క్రియ.34 చెప్పు + వుజీ + ఏ - జిత్తు పరంబగునపు డుత్వంబున కత్వంబగు. బాల.క్రియ.20. చెప్పవు + ఏ' 'అంద్వవగాగమంబులం దప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు,' బాల.సంధి.11. చెప్పవే.

సీ. మేలిల్లు నీలతమాలముల్ ధూమసం
 హతులనఁ దనరు నత్యసితభాతి,
శోభిల్లు పుష్పితాశోకంబు లెసఁగు తీ
 వ్రానల మనఁ దగు నరుణరుచులఁ,
బొలుపారఁ బూచిన పొన్నలు నునుఁ గాలి
 యాఱిన నీఱన నమలదీప్తి,
శివు కోపశిఖి శిఖల్ చిత్తజు నేర్చి త
 త్పరివారమగు శుకపరభృతాలి

ఆ. సమితిఁ గూర్చికొని వసంతుండు వనములోఁ
 జొచ్చియున్నఁ గాంచి చుట్టుముట్టి
యొలసి కాల్పఁ గాలుచున్నట్టి వయ్యె నా
రములు శోకదృష్టి రతికిఁ జూడ. 82

అర్థము : శోక - దృష్టిన్ = దుఃఖముతోడి చూపుతో, చూడన్ = చూడఁగా, రతికిన్, మేలిల్లు = ఒప్పునట్టి, నీల - తమాలముల్ = నల్లని చీఁకటిమ్రాఁకులు, అతి + అసిత - భాతిన్ = మిక్కిలి నల్లని కాంతితో, ధూమ - సంహతులు = పొగలగుంపులు. అనన్. తనరున్ = ఒప్పును.

శోభిల్లు = ప్రకాశించునట్టి, పుష్పిత + అశోకంబులు = పూచిన అశోక వృక్షములు, అరుణ - రుచులన్ = ఎఱ్ఱనికాంతులతో ఎసఁగు = అతిశయించు, తీవ్ర + అనలము = తీక్ష్ణమైన అగ్ని, అనన్ + తగున్.

పొలుపారన్ (పొలుపు + ఆరన్) = ఒప్పారఁగా, పూచిన - పొన్నలు, అమల - దీప్తిన్ = స్వచ్ఛమైన (తెల్లని) కాంతితో, కాలి - ఆఱిన - నీఱు + అనన్ = కాలి ఆఱిపోయిన బూడిదయనఁగా, చనున్ = ఒప్పును.

ఆరములు = ఆరామములు, శివు - కోప - శిఖి - శిఖల్ = శివునికోపమనెడి, అగ్నిజ్వాలలు, చిత్తజున్ = మన్మథుని, ఏర్చి = కాల్చి, తద్ + పరివారము + అగు = అతని పరివారమైన, శుక - పరభృత + అలి - సమితిన్ = చిలుకల, కోకిలల వరుసల సమూహమును, కూర్చికొని, వసంతుండు, వనములోన్, చొచ్చి + ఉన్నన్ = ప్రవేశించియుండఁగా, కాంచి, చుట్టుముట్టి. ఒలసి = వ్యాపించి, కాల్పన్ = కాల్పఁగా, కాలుచున్ + ఉన్న + అట్టి । అవి = కాలుచున్నట్టివి, అయ్యెన్.

తాత్పర్యము : ఏడ్పుచుఁజూచు రతికి ఒప్పునట్టి నల్లనిచీఁకటిమ్రాఁకులు మిక్కిలి నల్లనికాంతితోఁ బొగలగుంపు లన నొప్పును. ప్రకాశించు పూచిన అశోక వృక్షములు ఎఱ్ఱనికాంతులతో అతిశయించు తీక్ష్ణమైనఅగ్ని యనఁదగును. అందముగాఁ బూచిన పొన్నచెట్లు నిర్మలమైన (తెల్లని) కాంతితోఁ గాలియాఱిపోయిన బూడిద యనఁజనును, ఆరామములు - శివుని కోపానలజ్వాలలు మన్మథునిఁగాల్చి, యతని పరివారమగు చిలుకలు,కోకిలలు అనువానిని గూర్చికొని వసంతుఁడు వనములోఁ జొచ్చి యుండుట చూచి, చుట్టుముట్టి, వ్యాపించి, కాల్పఁగాఁ, గాలుచున్నట్టివి అయ్యెను.

విశేషములు : మొదటి మూఁడుపాదములందును అలంకార ముత్ప్రేక్ష. కోప - శిఖి - రూపకము. శివుకోపశిఖిశిఖల్ .... కాలుచున్నట్టివయ్యె నారములు - ఇదియు నుత్ప్రేక్ష, రూపకానుప్రాణితము. కాలుచున్నట్టివి_కాలుచున్ + ఉన్న =

కాలుచున్న - 'ప్రథమేతరవిభక్తి శత్రర్థ చువర్ణంబులందున్న యుకారమునకు సంధి వైకల్పికముగా నగును,' బాల.సంధి.2. అట్టి + అవి = అట్టివి. 'అది యవి శబ్దంబుల యత్తునకు వృత్తిని లోపంబు బహుళంబుగ నగు.' బాల.సంధి.45. కాలుచున్న + అట్టివి - 'అత్తునకు సంధి బహుళముగా నగు.' బాల.సంధి4. కాలుచున్నట్టివి.

వ. అనిశముఁ గ్రమ్ము పుష్పమధు వశ్రుజలంబుగఁ గొమ్మలెక్కి ఘో
రనఁ జెలరేఁగు పక్షిరవ మార్తరవంబుగ, మీఁద నోలిమూఁ
గిన యలిమాలికల్ వివృతకేశభరంబుగఁ, జుట్టునుండి పే
ర్చున రతితోడ సంబెరము చూపు విధంబునఁ బొల్చె భూజముల్. 83

అర్థము ; అనిశమున్ = ఎల్లప్పుడును, క్రమ్ము = వ్యాపించు, పుష్ప మధువు = పూఁదేనె, అశ్రు - జలంబుగన్ = కన్నీరుగా, కొమ్మలు + ఎక్కి - ఘోరనన్ = ఘోరు + అనన్ = ఘోరుమన, చెలరేఁగు = విజృంభించు, పక్షి - రవము= పక్షులధ్వని. ఆర్త - రవంబుగన్ = దుఃఖధ్వనిగా, మీఁదన్ = పైని, ఓలిన్ = వరుసగా, మూఁగిన, అలి - మాలికల్ = తుమ్మెదల వరుసలు, వివృత- కేశ - భరంబుగన్ = విప్పారిన కేశపాశముగను, భూజముల్ = చెట్లు, చుట్టున్ + ఉండి = చుట్టుఁజేరి, పేర్చునన్ = అతిశయముగా, రతితోడన్, సంబెరము = సానుభూతి, చూపు - విధంబునన్, పొల్చెన్ = ఒప్పెను.

తాత్పర్యము : ఎల్లప్పుడును వ్యాపించు పూఁదేనె కన్నీరుగను, కొమ్మలెక్కి ఘోరుమని విజృంభించు పక్షులధ్వని దుఃఖధ్వనిగను, పైని వరుసలుగా మూఁగిన తుమ్మెదల వరుసలు విప్పారిన కేశపాశముగను, చెట్లు చుట్టునుజేరి మిక్కిలిగా రతితో సానుభూతి చూపుచున్నవా యనునట్లు ఒప్పెను.

విశేషములు : రూపకానుప్రాణితోత్ప్రేక్షాలంకారము.

వ. ఇట్లు నిస్సహాయయైన రతి మతి నిరంతరానంతశోకరసం బుత్కటంబై
వెలివిరియం దొడంగిన. 84

అర్థము : ఇట్లు, నిస్సహాయ = దిక్కులేనిది, ఐన, రతి, మతిన్ = మనస్సునందు, నిరంతర + అనంత - శోక - రసంబు = ఎడతెగని, అంతులేని

దుఃఖరసము, ఉత్కంఠము + ఐ = ఉవ్విళ్ళూరినదియై, వెలివిరియన్ + తొడంగిన్ = పొంగ నారంభింపఁగా.

తాత్పర్యము : ఇట్లు అసహాయయైన రతి మనస్సులో నెడతెగని అంతులేని దుఃఖరసమూరి పొంగ నారంభింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : శోకరసంబు = శోకమనెడి రసము-రూపకము.

తే. తలఁకి కనుఁగవఁ గన్నీరు ధార లొలుక
మేనఁ బేర్చిందు లురులంగ మెలఁత పొలిచెఁ
గీలు ప్రిదిలిన జలధార లోలిఁ గలయఁ
గ్రమ్మి చెదరెడు ధారాగృహమ్ము వోలె. 85

అర్థము : మెలఁత = స్త్రీ (రతి), తలఁకి = దుఃఖించి, కనుఁగవన్ = కనుదోయినుండి, కన్నీరు, ధారలు + ఒలుకన్ = ధారలుగాఁగాఱఁగా, మేనన్ = శరీరమునుండి, పేర్చింపులు = చెమటబొట్టులు, ఉరులంగన్ = స్రవింపఁగా, కీలు = మర, ప్రిదిలినన్ = సడలఁగా, జల-ధారలు = నీటిధారలు, ఓలిన్ = క్రమముగా, కలయన్ = అంతటను, క్రమ్మి = వ్యాపించి, చెదరెడు = చెదరునట్టి, ధారా-గృహమ్ము + పోలెన్ = ధారాయంత్రమువలె, పొలిచెన్ = ఒప్పెను.

తాత్పర్యము : రతి దుఃఖించుటచే నామెకనులజంటనుండి కన్నీరు ధార లొలుకఁగను, శరీరమునుండి చెమటబొట్టులు స్రవింపఁగను, మర సడలఁగా జల ధారలు క్రమముగా నంతటను గ్రమ్మి చెదరెడు ధారాయంత్రమువలె నొప్పెను.

విశేషములు ; అలంకార ముపమ.

తే. మెఱసి క్రొవ్వేణి వెంటిపై నెఱసి పొలయ
నడలు దరికొని వావిరి నఱచుచుండెఁ
గాన నెల్లఁ జెలంగ గ్రక్కదల మదము
దగిలి కేకించు పురినమ్మి పగిది వోలె. 86

అర్థము : క్రొవ్వేణి (క్రొత్త + వేణి) = క్రొత్తజడ, మెఱపి = ప్రకాశించి. వెంటిపైన్ = వెన్నుమీఁద-వీపుపై, నెఱపి = చెదరి, పొలయన్ = వ్యాపింపఁగా, (రతి), అడలు = దుఃఖము, దరికొని = విజృంభించి, కొనన్ + ఎల్లన్ = అడవియందంతటను, చెలంగన్ = మ్రోయఁగా, గ్రక్కదలన్ = అదరఁగా, మదము + తగిలి = మత్తెక్కి, కేకించు = క్రేంకారారవము చేయు, పురి-నమ్మి-పగిది + పోలెన్ - పురిగల నెమలి విధమున- వావిరిన్ = అత్యంతముగా, అఱచుచున్ + ఉండెన్ = రోదించుచుండెను.

తాత్పర్యము : రతి జడ చెదరి వీపుపై వ్యాపింపఁగా, దుఃఖము విజృంభించి, అడవియందంతటను మ్రోయ నదరునట్లు మత్తెక్కి క్రేంకారారవముచేయు పురిగల నెమలివిధమున మిక్కిలి రోదించెను.

విశేషములు : అలంకార ముపమ. ఇందు ఉపమేయోపమానములకు లింగభేదము గలదు. రతి ఆఁడుది. పురినమ్మి మగది. అఱచుటపటుకే ఔపమ్యము. మఱియు రతి యఱచుట దుఃఖాతిశయముచే. నమ్మి యఱచుట మదాతిరేకమున.

క్రొవ్వేణి-క్రొత్త + వేణి. ప్రాఁతాదికార్యముచే (బాల, సంధి. 36) క్రొ + వేణి. 'క్రొత్తశబ్దమున కాద్యక్షరశేషంబునకుం గొన్నియెడల నుగాగమంబునుం గొన్నియెడల మీఁది హల్లునకు ద్విత్వంబు నగు' వేణి తత్సమ మగుట గమనించునది. 'సమాసమందుఁ దత్సమంబు పరంబగునపుడును నుమాగమాదులు గానంబడియెడి' ప్రౌఢ-సంధి, 12. వెన్ను ఔపవిభక్తికము గావున టివర్ణమంతాదేశమయినది. (బాల. అచ్చిక 31. పదాంత్యమగు హ్రస్వముమీఁదిది గావునఁ బూర్ణబిందుపూర్వకముగా నైనది. వెంటిపై- గ్రక్కదలు- కదలు + కదలు- 'అందుకు ప్రభృతులు యథా ప్రయోగంబుగ గ్రాహ్యంబులు,' బాల. సంధి. 42. కేకించు - కేకా శబ్దభవము కేక. దానిపై నించుక్కు వచ్చి నామధాతువేర్పడినది.

వ. ఇట్లపారఘోరకాంతారాంతరాపూరితంబై చెలంగు రతి రోదనధ్వని వసంతకు చెవులం జిలికిన నులికిపడి యద్దెస యాలించి విని. 87

అర్థము : ఇట్లు, అపార-ఘోర - కాంతార + అంతర + ఆపూరితంబు + ఐ = మితిలేని, భయంకరమైన, అడవిలోపల నెల్ల నిండినదయి, చెలంగు =

శబ్దించు, రతి = రతియొక్క, రోదన - ధ్వని = ఏడుపుధ్వని, వసంతకు = వసంతుని, చెవులన్, చిలికినన్ = ప్రవేశింపఁగా, ఉలికిపడి = భయపడి, ఆ + దెస= ఆవైపు, ఆలించి - విని = బాగుగా విని.

తాత్పర్యము : ఇట్లు మితిలేనట్టియు, భయంకరమయినట్టియు నడవిలోపలి ప్రదేశమంతయు నిండినదయి ధ్వనించు రతి యేడ్పు వసంతుని చెవులఁబడఁగా భయపడి. యావైపు శ్రద్ధగా విని - తరువాతి పద్యముతో నన్వయము,

తే. రతి యెలుంగగు నది వలరాజు పేరు
సెప్పి పనవెడు నది యేమి చిత్ర ముగ్రు
నెయిదఁ దడ వెద్ది ? మరుఁడు దండెత్తిపోవఁ
బోవ నడుమను బిందంబు పుట్టెనొక్కొ 88

అర్థము : అది = ఆ ధ్వని, రతి, ఎలుంగు = కంఠధ్వని, అగున్, వలరాజు = మన్మథుని, పేరు + చెప్పి, పనవెడున్ = ఏడ్చెడుసు, అది, ఏమి, చిత్రము = ఆశ్చర్యము, ఉగ్రున్ = శివుని, ఎయిదన్ = సమీపింప, తడవు + ఎద్ది = వ్యవధి యేది : మరుఁడు = మన్మథుఁడు. దండెత్తి పోవన్ + పోవన్= దండెత్తి పోఁగాఁబోఁగా, నడుమను = మధ్యముననే, బిందంబు = ఆపద, పుట్టెన్= ఒక్కొ = పుట్టెనాయేమి ?

తాత్పర్యము : అది రతి కంఠధ్వని యగును. మన్మథుని బేర్కొనుచు దుఃఖించెడును- అదేమివింత?. మన్మథుఁ డుగ్రుని సమీపింప నెడమేది? అతఁడు శివునిపై దండెత్తిపోఁగా నడుమనే యపాయము పుట్టెనా యేమి ?

విశేషములు : బిందము భేదశబ్దభవము.

వ. అనుచు నతిసంభ్రమంబునం బఱతెంచిన వసంతకుం గనుంగొని
రతి మతి నడలు నూర్మడించినఁ దావగొనక. 89

అర్థము : అనుచున్, అతి-సంభ్రమంబునన్ = మిక్కిలి వేగముగా, పఱతెంచిన = పరువెత్తుకొని వచ్చిన, వసంతకున్ = వసంతుని, కనుంగొని = చూచి, రతి, మతిన్ = మనస్సునందు, అడలున్ = శోకమును, ఊర్మడించినన్ =

ఊరడించినన్ (సూ. ని. పాఠము) = ఓదార్పఁగా. తావగొనక = స్థైర్యము నొందక - నిలుపోపక,

తాత్పర్యము : అనుచు మిక్కిలి వేగముతోఁ బరువిడి వచ్చిన వసంతునిఁ జూచి రతిదేవి మనస్సునందు శోకము నోదార్పఁగా, నిలుపోపక-తరువాతి పద్యముతో నన్వయము.

తే. అలిగి పూవైన నలఁప లే దబల దాను
శోక బలమునఁ జోఁకినచోటఁ దోలు
తెరలి జర్జరమై పోవఁ గరతలములు
మీఁది కందంద రతి యెత్తి మోఁదికొనియె. 90

అర్థము : అబల = స్త్రీ - రతి, తాను, అలిగి = కోపించి, పూవు + ఐనన్ = పూవునుసైతము, నలఁపన్ + లేదు = నలఁగఁగొట్టఁజాలదు - రతి అంత సౌకుమార్యముగలది యనుట. శోక - బలమునన్ = దుఃఖబలముచేత, చోఁకిన - చోటన్ = తాఁకినచోట, తోలు = చర్మము, తెరలి = ఊడిపోయి, జర్జరము + ఐ = పోవన్ = శిథిలమయిపోఁగా, రతి, కర - తలములు = అరచేతులు, మీఁదికిన్ = పైకి, అందంద = మాటిమాటికి, ఎత్తి, మోఁదికొనియెన్ = బాఁదుకొనెను.

తాత్పర్యము : అబలయగు రతి కోపముచేఁ బూవునైనను నలఁపఁజాలని సౌకుమార్యవతి, శోకబలముచేఁ దాఁకినచోటనెల్లఁ దోలూడిపోయి శిథిలమగునట్లు అఱచేతులు మాటికి మీఁదికెత్తి బాఁదుకొనెను.

విశేషములు : కోపముతోఁ బూవునైన నలఁపలేని అబల రతి, అతి సుకుమార. అట్టి యామె అఱచేతులతో బాఁదుకొనినపుడు తోలూడిపోవుటకు శోక బలమే కారణమనుట. అలంకారము స్వభావోక్తి. అతిశయోక్తి.

వ. అంత వసంతుం డనంత శోకాకులిత హృదయుండై మూర్ఛిల్లిపడి, క్రమ్మఱ సచేతనుండై తన్నుందాన సవరించుకొని తనయడుగులం బడి విలాపించుచున్న రతి ననేకోపాయంబుల సంతరించి యూఱడం బలికిన నడలు డిందుపడి నిజాధీశ్వరు నెచ్చెలియైన వసంతకుం గనుంగొని. 91

అర్థము : అంతన్, వసంతుండు, అనంత-శోక + ఆకులిత - హృదయుండు + ఐ = అంతములేని దుఃఖముచేఁ గలఁగిన హృదయముగలవాఁడయి, మూర్ఛిల్లి పడి, క్రమ్మఱన్ = మరల, సచేతనుండు + ఐ = తెలివివచ్చినవాఁడయి, తన్నున్ + తాను + అ = తన్నుఁదానే, సవరించుకొని, చక్కఁబఱుచుకొని, తన - అడుగులన్ + పడి = తన పాదములమీఁదఁబడి, విలాపించుచున్ + ఉన్న = ఏడ్చుచున్న, రతిన్, అనేక + ఉపాయంబులన్ = పెక్కు ఉపాయములతో, సంతరించి= చక్కఁబఱిచి, ఊఱడన్ + పలికినన్ = ఊఱటచెందునట్లు పలుకఁగా, అడలు = శోకము, డిందు + పడి = ఉపశమించి, నిజ + అధి + ఈశ్వరు = తన భర్త యొక్క, నెచ్చెలి = మిత్రుఁడు, ఐన, వసంతకున్, కనుంగొని,

తాత్పర్యము : అంత వసంతుఁ డంతులేనిశోకముచేఁ గలఁగిన హృదయము గలవాఁడయి, మూర్ఛిల్లి, మరలఁ దెప్పఱిల్లి, తన్నుఁదానే చక్కఁబఱుచుకొని, తన పాదములపైఁబడి యేడ్చు రతి ననేకోపాయములచేఁ జక్కఁబఱిచి యూఱట చెందునట్లు పలుకఁగా నామె శోక ముపశమిల్లి తన భర్తమిత్రుఁడైన వసంతునిఁజూచి- తరువాతి పద్యముతో నన్వయము,

ఆ. ప్రాణవల్లభుండు భస్మపుంజముగ నా
యెదురఁ జూడఁజూడ నెరిసిపోక
కనియు నొడలఁబాసి చనదయ్యె నగ్గడి
జీవ మింక నేమి సేయుదాన? 92

అర్థము : ప్రాణ - వల్లభుండు = ప్రియమైనభర్త, భస్మ - పుంజముగన్= బూదిరాశియగునట్లు, నా + ఎదురన్, చూడన్ + చూడన్ = చూచుచుండఁగా, ఎరిపి + పోక = కాలిపోవుట, కనియున్ = చూచియును, అగ్గడి - జీవము =సిగ్గులేనిప్రాణము. ఒడలన్ = శరీరమును, పాసి = విడిచి, చనదు + అయ్యెన్ = పోదాయెను, ఇంకన్, ఏమి, చేయుదానన్.

తాత్పర్యము : ప్రాణప్రియుఁడు బూదిదయగునట్లు నా యెట్టయెదుటఁ జూచుచుండఁగాఁ గాలిపోవుట చూచియు సిగ్గులేనిప్రాణము శరీరమును విడిచి పోదాయెను, ఇంకేమిచేయుదును ?

విశేషములు ; పోక = పోవుట, పోవుధాతువు. 'కవర్ణకం బలుగ్వాదుల కగు.' బాల. కృ. 3, పోవు + క. 'ఇటం గృత్కగతపవేములు పరంబులగునపుడు కగచయవలకు లోపంబగు,' బాల. కృ. 2. పోక, అగ్గడి యనుశబ్దమునకు సూ.ని.లో ముందట, అగ్రభాగము అను నర్థము లీఁబడినవి. అప్పుడు 'జీవము అగ్గడి నొడలఁబాపి చనదయ్యె' నని యన్వయము - ప్రాణము ముందట మేను విడిచిపోదాయె నని భావము. 'పిగ్గులేని' అనునర్థము మా. రా. ప్రతిలో నీఁబడినది.

తే. అంత పొచ్చెంబులేని నెయ్యమునఁగూడి
యున్న పతిఁ బాసి తెగువ లేకున్నదాన
నేను మొదలుగ, నింక నొండేల ?, యాఁడు
వారు సిక్కని డెందంబువారు జగతి. 93

అర్థము : అంత + పొచ్చెంబు = అంత కపటము లేని, నెయ్యమునన్ + కూడి + ఉన్న + స్నేహముతోఁ (ప్రేమముతో) గూడియున్న. పతిన్ = భర్తను, పాపి = విడిచి, తెగువ - లేక + ఉన్నదానన్ = సాహసము (మరణము) లేకున్న దానను, ఇంకన్, ఒండు + ఏల? = మఱియొకమాటయేల? జగతిన్ = లోకమున ఏను- మొదలుగన్ = నేను మొదలుకొని, ఆఁడువారు = స్త్రీలందఱును, చిక్కని - డెందంబు - వారు = కఠినమైన హృదయము గలవారు.

తాత్పర్యము : అంత నిష్కపటమైన ప్రేమముతోఁ గూడియున్న భర్తను విడిచి సాహసముచేయకున్నదానను. ఇఁక వేఱుమాట యేల? లోకమున నేను మొదలు గాఁగల యాఁడువారందఱును గఠినహృదయలు.

విశేషములు : 'అంత నొచ్చెంబు' అనుపాఠము గలదు. 'నొచ్చె' మను పదములేదు. పొచ్చెము, ఒచ్చెము గలవు. ఒచ్చెమయినచో నుగాగమ మెట్లువచ్చినది? అందుచే అంతపొచ్చెమనుపాఠమే స్వీకృతము, స్నేహము (ప్రకృతి) - నెయ్యము (వికృతి), తెగువ = సాహసము. దాతృత్వము. సాహసమనఁగా నిక్కడ మరణ మని భావము, ఎక్కు (ఎక్కు - ఎగు + వ) దిగువ (దిగు + వ) లవలె నిదియు తెగు (=చచ్చు) ధాతుకృదంతమా ? తెగువ=చావు, ఆఁడువారు చిక్కని డెందంబు వారు.-'న విదీర్యే, కఠినాః ఖలు స్త్రియః' - కాళిదాసు కుమారసంభవము, కుమార.4.5.

వ. అని తన్నుఁదాను నిరాకరించుచుం బతిసహవృత్తిలేదేనిం గులపా
లికా ధర్మవృత్తినైనం బురుషుతోడం బరలోకంబున కరుగవలయు
నవశ్యం బగ్నిప్రవేశంబు సేయుదునని రతి మరణనిశ్చయంబు
సేసిన. 94

అర్థము : అని, తన్నున్ + తాను, నిరాకరించుచున్ = త్రోసిపుచ్చుచు, పతి - సహ - వృత్తి = భర్తతోడివర్తనము, లేదు + ఏనిన్ = లేకపోయినచో, కులపాలికా - ధర్మ - వృత్తిన్ + ఐనన్ = కులస్త్రీయొక్క ధర్మవర్తనముచేనైనను, పురుషుతోడన్ = భర్తతో, పర - లోకంబునకున్, అరుగవలయున్, అవశ్యంబు = తప్పక, అగ్ని - ప్రవేశంబు, చేయుదును + అని, రతి, మరణ - నిశ్చయంబు + చేసినన్ = చచ్చుటకు నిర్ణయింపఁగా.

తాత్పర్యము : అని తన్నుఁదాను త్రోసిపుచ్చుచు, 'భర్తతోడిజీవనము లేకున్నను, కులస్త్రీధర్మము ననుసరించియైనను మగనితోఁ బరలోకమున కరుగవలయును, తప్పక అగ్నిప్రవేశము చేయుదు'నని రతి చచ్చుటకు నిర్ణయింపఁగా - తరువాతి పద్యముతో నన్వయము.

క. ఆకాశవాణి మృదురుతు
లాకాశమునందుఁ జెలఁగ 'నంగజు దయతో
నీకిచ్చు నిక్కువముగఁ ద్రి
లోక హితార్థమ్ముగాఁ ద్రిలోచనుఁ' డనినన్. 95

అర్థము : ఆకాశవాణి, మృదు - రుతులు = మృదువులైనధ్వనులు, ఆకాశమునందున్, చెలఁగన్ = ధ్వనింపఁగా, త్రిలోచనుఁడు = ముక్కంటి, నిక్కువముగన్ = నిజముగా, త్రి - లోక - హిత + అర్థమ్ముగాన్ = ముల్లోకములకు మేలు అగునట్లు, దయతోన్, నీకున్, అంగజున్ = మన్మథుని ఇచ్చున్, అనినన్,

తాత్పర్యము : ఆకాశవాణి మృదుధ్వను లాకాశమున ధ్వనింపఁగా, 'ముక్కంటి నిజముగా ముల్లోకముల మేలుకొఱకు నీకు దయతో మన్మథు నిచ్చు' నని పలుకఁగా-తరువాతి గద్యముతో నన్వయము.

వ. సంభ్రమించి వియత్తలంబు గనుంగొని యాలించి మఱుమాటలేమికిం దురపిల్లుచు నుగ్రు కోపానలాహతుండయ్యును గ్రమ్మఱునే యనుచున్నదానికి గగనసరస్వతి నిశ్చయంబుగ వెండియు నిట్లనియె. 96

అర్థము : సంభ్రమించి = వేగపడి, వియత్ + తలంబున్ = ఆకాశ ప్రదేశమును, కనుంగొని = చూచి, ఆలించి = విని, మఱు - మాట = మఱియొక మాట, లేమికిన్ = లేకపోవుటకు, దురపిల్లుచున్ = విచారించుచు, ఉగ్రు - కోప + అనల + ఆహతుండు + అయ్యును = శివుని కోపాగ్నిచేఁ గొట్టఁబడినవాఁడు సైతము, క్రమ్మఱునే = తిరిగివచ్చునా?, అనుచున్ + ఉన్నదానికిన్ = అనిపలుకుచున్న రతికి, గగన - సరస్వతి = ఆకాశవాణి, నిశ్చయంబుగాన్ = నిశ్చయ మేర్పడునట్లు వెండియున్ = మరల, ఇట్లు + అనియెన్,

తాత్పర్యము : వేగిరపాటుతో నాకాశము చూచి విని మఱియొక మాట లేకుండుటకు విచారించుచు 'నుగ్రుని కోపాగ్నిచే దగ్ధుఁడైనవాఁడుఁగూడఁ దిరిగి వచ్చునా;' యని సంశయించుచున్నరతికి నిశ్చయముగలుగునట్లు ఆకాశవాణి మరల నిట్లనియెను.

విశేషములు : లేమి - కలుగు ధాతువు. 'వ్యతిరేకభావంబున మిఁజియగు.' బాల.క్రియ.37. కలుగు + మిఁజి. 'కలుగుస కస్త్యర్థంబునకు లజీ మి క ని వడి వర్ణకంబులు పరంబు లగునపుడు లే యగు.' బాల.క్రియ.106. లేమి. లేమి- వ్యతి. కలిమి.

ఉ. 'అట్టి మహోగ్రకోపదహనాంబకుఁడట్టె దయాగుణంబు దాఁ
బుట్టి మనోజు నిచ్చునటె; పోలదు నాఁజన; దభ్రపంక్తిలోఁ
బుట్టె నిరమ్మదాగ్నియును, భూరితరామృతవృష్టి దీని చొ
ప్పిట్టిది నాఁగ నెవ్వరికి నీశ్వరుతత్త్వ మెఱుంగఁబోలునే ? 97

అర్థము ; అట్టి = అటువంటి, మహత్(మహా) + ఉగ్ర - కోప - దహన + అంబకుఁడు + అట్టె - మిక్కిలి భయంకరమైనకోపముగల అగ్నినేత్రుఁడు (శివుఁడు) అట;, దయా - గుణంబు = దయ యను గుణము, తాను, పుట్టి, మనోజున్ = మన్మథుని, ఇచ్చున్ + అటె = ఇచ్చునట; నాకున్, పోలదు =

సరిపడదు, నాన్ = అనఁగా, చనదు = తగదు, అభ్ర పంక్తి - లోన = మేఘముల వరుసలో, ఇరమ్మద + అగ్నియును = మేఘజ్యోతి యను నగ్నియును. భూరితర + అమృత - వృష్టి (యును) = మిక్కిలి జల వర్షమును, పుట్టెన్, దీని - చొప్పు = దీని విధము, ఇట్టిది - నాఁగన్ - ఇటువంటిది యనఁగా, ఎవ్వరికిన్ = ఎవరికైనను, ఈశ్వరు తత్త్వము = భగవంతుని నిజస్వరూపము, ఎఱుంగన్ + పోలునే = తెలియ నగునా ?

తా త్ప ర్య ము : 'అంతటి మహాభయంకర కోపముగల అగ్నినేత్రుఁడట; దయపుట్టి మన్మథు నిచ్చునట; ఇది నాకు సరిపడదు అనరాదు. మేఘపంక్తిలో మేఘజ్యోతి యనునగ్నియు, అధికతరమైన జలవర్షము - అన్యోన్యవిరుద్ధములైన యీ రెండును బుట్టినవి దీని విధ మిట్లుండునన ఈశ్వరుని తత్త్వము ఎవ్వరికిని తెలియ రాదు.'

వి శే ష ము లు : అలంకారము దృష్టాంతము. 'చే ద్బిమ్బప్రతిబిమ్బత్వం దృష్టాన్త స్తదలఙ్కృతిః.' చన్ద్రా. అర్థాంతరన్యాసము, విశేషము సామాన్యముచేత సమర్థింపఁబడినది. భూరితరామృతవృష్టి - భూరితరామృతవృష్టియును - 'నామ సర్వ నామంబులకును గళలగు నవ్యయంబులకును గడపల సముచ్చయార్థవిశేషపాదపూర ణంబులయందు ను శబ్దంబు తఱచుగ నగు. కళలగు నసుదంత శబ్దంబులమీఁద నయ్యది యువర్ణపూర్వకంబుగ విభాష నగు' ప్రౌఢ. శబ్ద.116. ఇరమ్మదము - 'మేఘ జ్యోతి రిరమ్మదమ్; 'ఇరయా జలేన మాద్యతి దీప్యతే ఇతి ఇరంమదః' ఇర యనఁగా జలము. దానిచేత వృద్ధిఁబొందునది - వజ్రాగ్ని. అమరము. అమృత = నీరు. అప్పుచ ఘృతామృతే' అమృతశబ్దము నీళ్లకును. అమృతమునకును పేరు. అమరము.

వ. అనిన నట్టి దివ్యవచనంబులు విని నమ్మి రతి మరణపరిచ్ఛేదంబు విచ్ఛేదంబుచేసి పతిం దలంచి కమలించి. 98

అ ర్థ ము: అనినన్, అట్టి, దివ్య-వచనంబులు = దేవసంబంధములయిన మాటలు, విని, నమ్మి, రతి, మరణ - పరిచ్ఛేదంబు = మరణ నిశ్చయము, విచ్ఛేదంబు - చేసి = ఖండితముచేసి - విరమించి, పతిన్, తలంచి, కమలించి = కంది.

తాత్పర్యము : అని ఆకాశవాణి పలుకఁగా ఆ దివ్యములైన మాటలు విని నమ్మి రతి తన మరణనిశ్చయమును విరమించి భర్తను దలఁచి కంది - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : కమలించి = ఇందలి ఇంచుక్కన కేమియర్థమో ఇంచుక్క స్వార్థమున సంస్కృతమునకును, అంగలాగులకును మాత్రమే వచ్చును. కమలు ధాతువుగదా : దానిపై నించుక్కచేరి ప్రేరణార్థకమయి కమలఁజేయు అను నర్థము వచ్చును.

క. కరువునఁ బూరితమై లో
హరసము లోఁగాలునట్లు లంగజ శోకో
ద్ధురశిఖి రతి తను నిమ్ముగఁ
గరఁగియుఁ బొడ వఱక లోనఁ గాలుచునుండెన్. 99

అర్థము : లోహ - రసము = కరఁగిన యినుపద్రవము, కరువునన్ = పోఁతపోయు అచ్చులో, పూరితము + ఐ = నిండినదయి, లోన్ = లోపల, కాలు + అట్టులు = కాలువిధమున, రతి - తనువు = రతియొక్క శరీరము, అంగజ - శోక + ఉద్ధుర - శిఖిన్ = మన్మథుని కొఱకైన దుఃఖ మనెడి అధికమైన అగ్నియందు, ఇమ్ముగన్ = ఒప్పుగా, కరఁగియున్, పొడవు + అఱక = రూపు నశింపక, లోనన్ = లోపల, కాలుచున్ + ఉండెన్.

తాత్పర్యము : ఇనుము కరఁగినద్రవము అచ్చులో నిండినదయి లోపలఁ గాలు విధమున. రతిదేవిశరీరము మన్మథుని కొఱకైన దుఃఖమనెడి అధికమైనఅగ్నిచేఁ గరఁగియు రూపుచెడక లోపలఁ గాలుచుండెను.

విశేషములు : రూపకానుప్రాణితమైన ఉపమ.

వ. ఇట్లెడ యుడుగని యడలడిం బడి. 100

అర్థము: ఇట్లు, ఎడ = హృదయము, ఉడుగని = మానని, అడలడిన్ = దుఃఖమున, పడి (ఎడ + ఉడుగని = విరామములేని.)

తాత్పర్యము ; ఈ రీతిగా రతి హృదయము దుఃఖమునుబొంది - నిర్వి రామమైన దుఃఖమునుబొంది - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. అలమట నెడియుండె నిలువమ చిత్తంబు
మూర్ఛిల్లి వెడఁబాసి పోవ దొండె
నూఱటఁ గొనియుండె నాఱదు శోకాగ్ని
పొరిమాలఁ గొని కాలిపోవదొండె
ఘర్మాశ్రుజలము లొక్కట కట్టుకొనవొండెఁ;
బొడవంతయుఁ గరంగిపోవ దొండెఁ
బర్వు నిట్టూర్పులు పట్టునఁ బడవొండె;
బొం దిమ్మెగాఁ బాసిపోవ దొండె;

తే. నిట్టి కడలేని దుఃఖాబ్ధిఁ బెట్టి ముంపఁ
దలఁచియో కాక పోనీక బలిమి నాడు
ప్రాణ మొడలిలో నాకాశవాణి దెచ్చి
మగుడఁ జెఱబెట్టె నని రతి మఱుఁగుచుండె. 101

అర్థము : అలమట = దుఃఖము,చెడి = పోయి, చిత్తంబు = మనస్సు, నిలువదు + ఒండెన్ = నిలువనైన నిలువదు, మూర్ఛిల్లి = మూర్ఛచెంది, పెడఁ బాపి - పోవదు + ఒండెన్ = విడిచిపోవనైనఁ బోవదు.

శోక + అగ్ని = దుఃఖమనెడి అగ్ని. ఊఱటఁగొని = విరామమునొంది, ఆఱదు + ఒండెన్ = ఆఱిపోవనైన అఱిపోవదు, పొరిమాలన్ + కొని = నశించి, కాలిపోవదు + ఒండెన్ = కాలిపోవనైనఁ గాలిపోదు,

ఘర్మ + అశ్రు - జలములు = చెమటనీరు, కన్నీరు, ఒక్కట = ఒక్క మాఱుగా, కట్టుకొనవు + ఒండెన్ =ఆఁగనైన ఆఁగవు, పొడవు + అంతయున్= శరీర మంతయు, కరంగి - పోవదు + ఒండెన్ = కరఁగిపోవనైనఁ గరఁగిపోవదు.

పర్వు = వ్యాపించు, నిట్టూర్పులు (నిడు + ఊర్పులు) = దీర్ఘ నిశ్వాస ములు, పట్టునన్ + పడవు + ఒండెన్ = నిలువనైన నిలువవు, బొంది = దేహము,

ఇమ్ముగాన్ = చక్కఁగా, పాసిపోవదు + ఒండెన్ = విడిచిపెట్టిపోవనైనఁ బోవదు.

ఇట్టి - కడ - లేని = ఇట్టి అంతులేని. దుఃఖ + అబ్ధిన్ = దుఃఖమనెడి సముద్రమునందు. పెట్టి. = పడవైచి, ముంపన్ + తలఁచియో → ముంచివేయఁ గోరియో, కాక, పోన్ + ఈక = పోవనీక, బలిమిన్ = బలవంతముగా, ఆకాశ వాణి, నాదు - ప్రాణము = నాప్రాణము, ఒడలిలోన్ = శరీరములో, తెచ్చి, మగు డన్ = మరల, చెఱన్ + పెట్టెన్ = బంధించెను, అని, రతి, మఱుఁగుచున్ + ఉండెన్ = సంతపించుచుండెను.

తాత్పర్యము : 'మనస్సు దుఃఖముపోయి నిలువనైన నిలువదు. మూర్ఛ చెంది విడిచి పోవనైనఁబోవదు. దుఃఖమనెడి అగ్ని విరమించి ఆఱనైన నాఱదు. నశించి కాలిపోవనైనఁగాలిపోదు. చెమటనీరు, కన్నీరు ఒక్కమాఱుగా ఆఁగనైన నాఁగవు, మేనెల్లఁ గరఁగిపోవనైనఁ గరఁగిపోదు. తఱచైన నిట్టూర్పులు నిలువనైన నిలువవు. బొంది విడిచి పోవనైనఁబోదు, ఇట్టి అంతులేని దుఃఖసముద్రమునఁ బడ వైచి ముంచివేయఁగోరియే ఆకాశవాణి నా ప్రాణమును బోనీక బలవంతముగా శరీ రములోనికిఁ దెచ్చి మరల బంధించెను' అని రతి సంతపించుచుండెను.

విశేషములు : శోకాగ్ని, దుఃఖాబ్ధి రూపకములు. ఇట్టి కడలేని దుఃఖాబ్ధిఁ బెట్టి ముంపఁదలఁచియోకాక బలిమి నాదు ప్రాణ మొడలిలో నాకాశవాణి దెచ్చి మగుడఁ జెఱఁబెట్టె.' ఉత్ప్రేక్ష 'పర్వు, నిట్టూర్పులు పట్టునఁ బడవాండె బొం దిమ్మగా ....' అది పొంది' కాక 'బొంది' (= శరీరము) అయియుండును. అట్టిచో 'ఒండె'కుఁ బిమ్మట అరసున్న ఉండరాదు. నిట్టూర్పు = నిడు + ఊర్పు. 'కుఱు చిఱు కడు నడు నిడు శబ్దముల ఱ డల కచ్చు పరంబగునపుడు ద్విరుక్త టకారంబగు.' బాల. సంధి. 12. నిట్టు + ఊర్పు. 'ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధి యగు.' బాల. సంధి. 1. నిట్టూర్పు. చిత్తము నిలువకుండుట, శోకాగ్ని ఆఱకుండుట. ఘర్మాశ్రు జలములు కట్టువడకుండుట, నిట్టూర్పు లాఁగకుండుట అను దేహబాధ లుడుగకుండుట కంటె దేహమే పోవుట లెస్స యనిభావము. నాదు ప్రాణము - నా + ప్రాణము. 'యుష్మదస్మదాత్మార్థకంబుల కుత్తరపదంబు పరంబగునపుడు దుగాగమంబు విభాష నగు,' బాల. సమాస. 11.

వ. అంత వసంతకుం డక్కుసుమకోమలి నూరార్చి 'కుసుమాయుధు
పునరవతారంబునకు నుద్యోగింపు' మని మైవడి నూలుకొలిపి. 102

అర్థము : అంతన్, వసంతకుండు, ఆ + కుసుమ - కోమలిన్ = పూవు వలె మనోజ్ఞాంగాలయిన రతిని, ఊరార్చి = ఓదార్చి. కుసుమ + ఆయుధు = పుష్ప బాణుని - మన్మథునియొక్క. పునః + అవతారంబునకున్ = పునర్జన్మమునకు, ఉద్యోగింపుము = ప్రయత్నింపుము, అని, మైవడిన్ = సమ్మతితో, నూలుకొలిపి = అంగీకరింపఁజేసి,

తాత్పర్యము : అంత వసంతుఁడు రతి నోదార్చి 'మన్మథుని పునర్జన్మము నకుఁ బ్రయత్నింపు' మని అందులకు సమ్మతింపఁజేసి - తరువాతి పద్యముతో నన్వయము,

విశేషములు : పునర్ + అవతారము = పునరవతారము, పునర్ - రేఫాంతావ్యయము, నూలుకొలుపు - నూలుకొను ప్రేరణరూపము.

చ. 'అమిత సురాసురేంద్రవరు లాదిగ నెవ్వనిఁ గొల్చి తత్ప్రసా
దమున నభీష్టముల్ వడసి తద్దయుఁ బేర్మి వెలుంగుచున్నవా
రమరఁగ నీవు నాతని దయాపరు నీశ్వరు భక్తియుక్తి సం
యమమతిఁ గొల్చుచుండు కమలాననః నీకు నభీష్టసిద్ధిగాన్. 103

అర్థము : కమల + అనన ః = పద్మముఖీ ! రతీః అమిత - సుర + అసుర + ఇంద్ర - వరులు = పెక్కండ్రు శ్రేష్ఠులైన దేవతలు, రాక్షసులు, అదిగన్ = మున్నుగా, ఎవ్వనిన్ = ఏ యీశ్వరుని. కొల్చి = సేవించి, తద్ + ప్రసాదమునన్ = ఆతని యనుగ్రహమున, అభీష్టముల్ = కోరికలు, వడసి = పొంది, తద్దయున్ + పేర్మిన్ = మిక్కిలి గొప్పతనముతో, వెలుంగుచున్ + ఉన్నవారు = ప్రకాశించు చున్నవారో, అమరఁగన్ = ఒప్పునట్లు, నీవున్ = నీవుకూడ, అతనిన్, దయా - పరున్ = దయయందాసక్తి గలవానిని, ఈశ్వరున్ = శివుని, నీకున్, అభీష్ట - సిద్ధి + కాన్ = కోరిక నెఱవేఱఁగా, భక్తి - యుక్తిన్ = భక్తితో, సంయమ - మతిన్ = నియమముతోడి మనస్సుతో, కొల్చుచున్ + ఉండు = సేవించుచుండుము,

తాత్పర్యము : 'పద్మముఖీ ? పెక్కండ్రు దేవతాశ్రేష్ఠులును. రాక్షసశ్రేష్ఠులును మున్నుగాఁగలవారు ఎవ్వనిని సేవించి యాతని యనుగ్రహమునఁ గోరికలు పొంది మిక్కిలి గొప్పతనముతోఁ బ్రకాశించుచున్నారో. నీవును దయామయుఁడైన అ యీశ్వరుని నీ కోరిక సిద్ధించునట్లు భక్తితో, నియతచిత్తముతో సేవించుచుండుము.

విశేషములు : తద్ + ప్రసాదము - 'అనువాపికాంతస్థ భిన్నములైన హల్లులకు (ఝల్లులకు) కఠినహల్లులు (ఖర్రులు) పరములగునపుడు వాని వర్గము లందలి ప్రథమవర్ణములు (చర్రులు) ఆదేశము లగును.' తత్ప్రసాదము. కొల్చుచుండుము + కమలానన-'మధ్యమపురుషమువర్ణకంబునకు హలవసానంబులు పరంబులగునపుడు లోపము విభాష నగు,' కొల్చుచుండు కమలానన. బాల, సంధి. 47.

వ. అని హితోపదేశంబు సేసినం గైకొని రతి నిరతిశయభక్తిం బరమేశ్వరారాధనంబు సేయుచుండె నట గిరిజ శిశిరోపచారంబుగా నెచ్చిఁటి కన్యాంతఃపురావర్తియగుచు నంతకాంతకు నిజాంతరంగంబునం జింతించుచుండు నంత నంతకంత కగ్గలించుచు. 104

అర్థము : అని. హిత + ఉపదేశంబు + చేసినన్ = హిత ముపదేశింపఁగా, కైకొని = స్వీకరించి. రతి- నిరతిశయ - భక్తిన్ = అధికమైన భక్తితో, పరమేశ్వర + ఆరాధనంబు = ఈశ్వరపూజ, చేయుచున్ + ఉండెన్. అటన్ = అక్కడ, గిరిజ = పార్వతి, శిశిర + ఉపచారంబుగాన్ = తాప మువశమించునట్లు శీతలక్రియలు కాఁగా, ఎచ్చిఁటి = తెలిసికొని, కన్యా + అంతఃపుర - అవర్తి = కన్యల అంతిపురమునందే తిరుగునది, అగుచున్, అంతక + అంతకున్ = యముసంతమొందించినవానిని - శివుని. నిజ + అంతరంగంబునన్ = తనదైన మనమ్మునందు. చింతించుచున్ + ఉండున్ = ధ్యానించుచుండును, అంతన్, అంతకున్+ అంతకున్ = క్రమక్రమముగా, అగ్గలించుచున్ = అతిశయించుచు-

తాత్పర్యము : అని హిత ముపదేశింపఁగా స్వీకరించి రతి యధికభక్తితోఁ బరమేశ్వరునిఁ బూజించుచుండెను. అక్కడ పార్వతి తాప ముపశమిల్ల శీతలక్రియలు జరుగఁగాఁ దెలిసికొని కన్యాంతఃపురమునందే యుండుచు, శివుని ధ్యానించుచుండెను. అంతఁ గ్రమక్రమముగా నతిశయించుచు - తరువాతి పద్యముతో నన్వయము,

చ. తలఁపుల తిట్ట, భావముల తానక. మాసల పుట్టినిల్లు కో
ర్కుల నెలవీడు. పల్వగల కూట, మవస్థల జన్మదేశ, ము
మ్మలికల [1]పేఁట, వేదనల [2]మంద, మనోభవు [3]వేఁటపట్టు, మూ
ర్ఛల సహవాస మన్విరహసంతతతాపము వొందెఁ బార్వతిన్. 105

అర్థము : తలఁపుల - తిట్ట = ఆలోచనల గుట్ట, భావముల - తానకము= భావముల నెలవు, ఆసల-పుట్టిన+ఇల్లు=కోరికలపుట్టినయిల్లు, కోర్కుల - నెలవీడు = కోరికల ఉనికిపట్టగు పురము, పల్ + వగల - కూటము = పెక్కుచింతల, చావడి - (స్థానము), అవస్థల జన్మ-దేశము=బాధలు పుట్టినదేశము, ఉమ్మలికల=దుఃఖముల, పేఁట = నగరము, (అంగడి), వేదనల - మంద = బాధల పల్లె, మనోభవు - వేఁట - పట్టు = మన్మథుని వేఁటాడుచోటు, మూర్ఛల - సహవాసము = మూర్ఛల, కలిసియునికి, అన్ = అను. విరహ - సంతత - తాపము = ఎడఁబాటు వలని నిరంతర తాపము, పార్వతిన్, పొందెన్.

తాత్పర్యము : తలఁపుల గుట్ట, భావముల నెలవు, ఆశల పుట్టినిల్లు, కోరికల ఉనికిపట్టు, పలుచింతల చావడి, బాధల పుట్టినదేశము, దుఃఖముల పేఁట, వేదనల పల్లె, మన్మథుని వేఁటాడుచోటు, మూర్ఛల సహవాసము అనెడి విరహనిరంతరతాపము పార్వతిని బొందెను.

విశేషములు : ఒక్క విరహతాపమునే యనేకవిధములుగా నుల్లేఖించుటచే నలంకార ముల్లేఖము. ఆస (వికృతి) - ఆశ (ప్రకృతి). పేర్మి - పేరు. 'పేర్వాదుల కిమివర్ణకంబగు' పేరు + ఇమి. బాల. తద్ధిత. 5. 'అంద్వవగాగమంబులం దప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు.' బాల.సంధి.11. పేరిమి. 'లాఁతియచ్చునకు సహిత మొకానొకచో నుడి నడుమలోపంబు గానంబడియెడి.' బాల.ప్రకీర్ణ 18 - పేర్మి. అన్విరహ - అను + విరహ - 'అను కొను లోనగు ధాతుజవిశేషణముల యంత్యోకారమునకు హల్లు పరంబగునపుడు లోపంబు వైకల్పికంబు.' ప్రౌఢ. సంధి. 13.

1. వా. ప్రతి. పెంట. 2. వా. ప్రతి.మందు. 3. వా. ప్రతి. వేఁటమంద.

వ. ఇట్లుల్లంబున నడరు నాయల్లకభరంబునం దురపిల్లుచు. 106

అర్థము : ఇట్లు, ఉల్లంబునన్ = మనసునందు, అడరు = అతిశయించు నట్టి, ఆయల్లక - భరంబునన్ = విరహమువలనఁగలుగు తహతహయొక్క అతి. శయముచే, దురపిల్లుచున్ = దుఃఖించుచు.

తాత్పర్యము : ఇట్లు మనసున విజృంభించు విరహోత్కంఠచే దుఃఖించుచు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : అడరు నాయల్లక - అడరు + ఆయల్లక - 'ఉదంతమగు తద్ధర్మవిశేషణమునకచ్చు పరంబగుపుడు నుగాగమంబగు.' బాల.సంధి.33. భరంబునం దురపిల్లుచు - భరంబునన్ + దురపిల్లుచు-'వర్గయుక్సరళములు పరము లగునపు డొకానొకచో ద్రుతమునకుఁ బూర్ణబిందువును గానంబడియెడి' బాల.సంధి, 19.

చ. అలులకు నుల్కు మందమలయానిలుఁ డన్న భయంబునొందుఁ గో
యిలలకు బెగ్గలించుఁ, గడునేచిన మామిడి సూడనోడు, రా
చిలుకల కల్కుఁ, గాముఁ డనిచెప్పినఁ దల్లడమందు, నిండువె
న్నెలఁ గని సొమ్మఁబోవు, ధరణీధరనందన కామవేదనన్. 107

అర్థము : ధరణీధర - నందన = కొండకూఁతురు - పార్వతి, కామ - వేదనన్ = మన్మథబాధచే, అలులకున్ = తుమ్మెదలకు, ఉల్కున్ = భయ పడును, మంద - మలయ + అనిలుఁడు + అన్నన్ = మెల్లఁగా వీచు మలయ పర్వతపుగాలి యన్నచో, భయంబున్ + ఒందున్ = వెఱచును, కోయిలలకున్, బెగ్గలించున్ = బెదరును, కడున్ = మిక్కిలి, ఏచిన = విజృంభించిన, మామిడి = మామిడిచెట్టు, చూడన్ = చూచుటకు, ఓడున్ = వెనుదీయును, రాచిలుకలకున్, అల్కున్ = భయపడును. కాముఁడు + అని - చెప్పినన్ = మన్మథునిపేరు చెప్పినచో, తల్లడము + అందున్ = కలఁతచెందును, నిండు - వెన్నెలన్, కని, సొమ్మఁబోవున్ =మూర్ఛిల్లును.

తాత్పర్యము : పార్వతి మదనతాపముచేఁ దుమ్మెదలకు భయపడును. మందమలయపవనుఁ డన్నచో భీతిల్లును, కోకిలములకు బెదరును. బాగుగాఁ బూచిన

మామిడిని జూడవెఱచును. రాచిలుకలకు భయముచెందును. మన్మథునిపేరుచెప్పి నంతనేఁ గలఁతచెందును. వెండువెన్నెలను జూచి మూర్ఛిల్లును.

క. వగచిన చిత్తము, నలఁదురి
మొగిచిన కనుఁగవయు. నుదుట మోపిన కేలున్,
వెగచిన కంఠము, నుడుగక
నెగసిన నిశ్వాసతతియు నీరజముఖికిన్. 108

అర్థము : నీరజ - ముఖికిన్ = పద్మముఖికి - పార్వతికి, వగచిన - చిత్తమున్ = దుఃఖించిన మనస్సును, అలఁదురి = ఏడ్చి, మొగిచిన = మూసిన, కను + కవయున్ = కనులజంటయును, నుదుటన్ = నొసటియందు, మోపిన - కేలున్ = ఉంచినచేయియును, వెగచిన - కంఠమున్ = వెక్కుచు ధ్వనించు కంఠమును, ఉడుగక = మానక, నెగసిన = బయలువెడలిన, నిశ్వాస - తతియున్ = నిట్టూర్పుల సమూహమును.

తాత్పర్యము : పద్మముఖియైనపార్వతికి దుఃఖితమనస్సును, ఏడ్చి మూసిన కనుదోయియును, నొసటనుంచిన చేయియును, వెక్కుకంఠమును, బయలు వెడలిన నిట్టూర్పులును (అయ్యెను).

విశేషములు ; అలంకారము స్వభావోక్తి.

తరువోజ వెలడు నిట్టూర్పుల వెస నుచ్చలించు
వెలుపున నగలు నెవ్వేఁగు వలిసను
తెలరార నెఱకల నెగయ నుంకించు
నెలమి జక్కవబోద లివి నాఁగఁబోలు ;
బలువిడిఁగొని జాఱుబాష్పోదకముల
బాల కన్గవ వేఁడి వరవాఱు లొప్పు
దలఁపించెఁ; గెంగేలుఁదమ్మిపైఁ దోఁడి
తమ్మి నాఁ దగి మోముఁదమ్మి పొల్పారె. 109

అర్థము : వెలఁకు = పైకి వచ్చునట్టి, నిట్టూర్పులన్ (నిడు + ఊర్పులన్) = దీర్ఘనిశ్వాసములచే, వెసన్ = శీఘ్రముగా, ఉచ్చలించు - మీఁదికెగయు, వెలుపునన్ విస్తారముచే, అగలు = పగులు, నెవ్వీఁగు = మిక్కిలినిక్కు, కంపించు వలి + చనులు = చల్లనిచన్నులు, ఎలరారన్ = ఒప్పఁగా. ఎఱకలన్ = ఱెక్కలతో. నెగయన్ = ఎగురుటకు, ఉంకించు = పూను, ఎలమి = పెంపుతోడి, జక్కవ - బోదలు + ఇవి = చక్రవాకపక్షులపిల్లలు ఇవి, నాఁగన్ + పోలున్ = అన నొప్పును.

బలువిడి + కొని = అతిశయించి - ఎక్కువగా, జాలు, బాష్ప + ఉదకములన్ = కన్నీళ్లతో, బాల = పార్వతియొక్క, కన్గవ = (కను + కవ) = కనుదోయి, వేఁడి - వరవాళులొప్పు (వేఁడి వరవాళుల + ఒప్పు)= వేఁడినీటిప్రవాహముల యొప్పును, తలఁపించెన్ = స్ఫురింపఁజేసెను.

తమ్మిపైన్ = తామరపువ్వుమీఁద, తోడి - తమ్మి - నాన్ = తోడి తామర పువ్వు అనఁగా, తగి = ఒప్పి, కెంగేలు (కెంపు + కేలు) = ఎఱ్ఱనిచేయి మోముఁదమ్మిన్(మోము + తమ్మిన్) = ముఖపద్మమునందు, పొల్పారెన్ (పొల్పు + ఆరెన్) = అందగించెను.

తాత్పర్యము : బహిర్గతములగు దీర్ఘనిశ్వాసములచే వేగముగా మీఁది కెగయునట్టియు, విస్తారముచేఁ బగులు, మిక్కిలి కంపించు చల్లని చన్నులు, ఱెక్కలతో నెగురుటకుఁబూను చక్రవాకపక్షుల పిల్లలను బోలుసు. అధికముగా జాలు కన్నీటితోఁ బార్వతి కనుదోయివేఁడినీటిప్రవాహముల యొప్పును దలఁపించెను. ఒక తామరపువ్వుమీఁద నింకొక తామరపు వ్వుండువిధమున ఆమె ఎఱ్ఱనిచేయి ముఖపద్మము నందుఁ బొల్పారెను.

విశేషములు : అలంకారము స్వభావోక్తి. అది ఉపమానుప్రాణితము. నిట్టూర్పు - నిడు + ఊర్పు - ద్విరుక్తటకారాదేశము (బాల.సంధి.12). నిట్టు + ఊర్పు - ఉకారసంధి. బాల. సంధి. 1.; నెవ్వీఁగు-నెఱ+వీఁగు, వరవాళు లొప్పు. వరవాళుల + ఒప్పు - అకారసంధి. బాల.సంధి.4. కెంగేలు - కెంపు + కేలు - ప్రాఁతాదిసంధి. బాల.సంధి.36, కె + కేలు - నుగాగమము (బాల.సంధి.37)- ద్రుతకార్యము. బాల. సంధి. 16,17. మోముఁదమ్మి-మోము + తమ్మి - ఉదంతస్త్రీ

సమమునకుఁ బరుషము పరముగా నుగాగమము. బాల.సంధి.25, ద్రుతకార్యము-బాల. సంధి.16, 17. ఇది తరువద అనిసా.ప్రతియందుఁ గలదు. తరువోజయని వా.ప్రతి యందును, మా.రా. ప్రతియందును గలదు. తరువదకును, తరువోజకును భేదమేమియుఁ గనుపట్టలేదు. తరువోజ లక్షణము. నాలుగుపాదము లుండును, ఒక్కొక్క పాదమున మూఁ డింద్రగణములు నొకసూర్యగణము. మరల మూఁ డింద్రగణములు నొక సూర్యగణము నుండును, మొదటిగణము మొదటియక్షరమునకును, మూఁడవగణము మొదటియక్షరమునకును, మరల నాల్గవగణము మొదటియక్షరమునకును, ఏడవ గణము మొదటియక్షరమునకును యతిమైత్రి, ప్రాసనియమము గలదు.

సీ. ఎలమి ముఖాంభోజ మలరు నొక్కొక్కమాటు;
 వలవంత నప్పుడ వంది కందు;
నెలరాయ కనుఁగవ పొలయు నొక్కొక్కమాటు:
 కన్నీరు లప్పుడ కలయఁ గప్పుఁ;
బులకలు మైఁదీఁగఁ బొలయు నొక్కొక్కమాటు;
 ముచ్చిరి యప్పుడ ముచ్చముడుఁగుఁ;
బేర్పెందు లొడలిపైఁ బేర్చు నొక్కొక్కమా;
 టప్పుడ మీఁదఁ గామాగ్ని నెగయు;

తే. మనసులోఁ గూడి యొక్కొక్కమాటు సూచుఁ;
జూచి పొదగాన కప్పుడ సొమ్మసిల్లు ;
నొనర భావజహరుల సంయోగవృత్తి
తగి యెఱుంగక యుండు నా నగతనూజ. 110

అర్థము : ఒక్కొక్కమాటు = ఒక్కొక్కసారి, ఎలమిన్=సంతోషముతో, ముఖ + అంభోజము = పద్మమువంటి ముఖము, అలరున్=వికసించును, అప్పుడు +అ = వెంటనే, వలవంతన్ = మన్మథవ్యథచే, వంది = సంతాపించి. కందున్= వివర్ణత నొందును.

ఒక్కొకమాటు, ఎలరారు - (ఎలరు + ఆరు) = ఒప్పునట్టి, కను + కవ = కన్నులజంట, పొలయున్ = ప్రకాశించును, అప్పుడు + అ, కన్నీరులు = బాష్ప జలములు, కలయన్ = అంతటను, కప్పున్ = క్రమ్మును.

ఒక్కొకమాటు, మైఁదీఁగస్ = (మై + తీఁగస్) = దేహలతయందు - తీఁగవంటి దేహమునందు, పులకలు = గగ్గురులు, పొలయున్ = వ్యాపించును, అప్పుడు + అ. ముచ్చిరి = దుఃఖించి, ముచ్చముడుఁగున్ = మిక్కిలి ముడుఁగును.

ఒక్కొకమాటు, ఒడలిపైన్ = శరీరమునందు , పేర్చిందులు = చెమట బొట్టులు, పేర్చున్ = అతిశయించును, అప్పుడు + అ, మీఁదన్ = పైని - దేహముపై, కామాగ్ని (కామ + అగ్ని) = మన్మథుఁడనెడి అగ్ని, నెగయున్ = బయలుదేఱును.

ఒక్కొకమాటు. మనసులోన్, కూడి, చూచున్, చూచి, పొడగానక = కనఁబడక. అప్పుడు + అ, సొమ్మసిల్లున్ = మూర్ఛిల్లును.

ఆ - నగ - తనూజ = ఆ కొండ కూఁతురు = ఆ పార్వతి, ఒనరన్ = ఒప్పునట్టు, భావజ - హరుల = మన్మథునియొక్కయు. ఈశ్వరునియొక్కయు, సంయోగ-వృత్తి = కూడియునికి, తగి, ఎఱుంగక + ఉండున్ = పారవశ్యము నొందును.

తాత్పర్యము ; పార్వతికి ఒక్కొక్కమాటు సంతోషముతో ముఖపద్మము వికసించును. వెంటనే మన్మథవ్యథచే సంతప్తమయి వివర్ణమగును. ఒక్కొక్కమాటు ఒప్పెడు కనుదోయి ప్రకాశించును, వెంటనే కన్నీరు అంతట నిండును. ఒక్కొక్కమాటు దేహలతనిండ గగ్గురు వ్యాపించును. వెంటనే దుఃఖముతో మిక్కిలి ముడుఁగును. ఒక్కొక్కమాటు శరీరమునఁ జెమటబొట్లు అధికమగును, వెంటనే దేహముపై మన్మథాగ్ని పైకిలేచును, ఒక్కొక్కమాటు భావమునఁ జూచును. చూచి కనఁబడమి వెంటనే మూర్ఛిల్లును. ఇట్లు మన్మథుఁడును, ఈశ్వరుఁడును గూడియునికి తగి ఆ పార్వతి పారవశ్యము నొందును.

విశేషములు : ఇందు భావజ హరుల పరస్పర విరోధమునకుఁ దగిన సాత్త్వక వికారములు వర్ణింపఁబడెను. ముఖాంభోజము = అంభోజము వంటి

ముఖము, మైఁదీఁగ = తీఁగవంటి మై - ఉపమిత సమాసములు. కామాగ్ని - కామ మనెడి అగ్ని - రూపకము. ముచ్చముడుఁగు - ముడుగు + ముడుఁగు - 'అందదుకు ప్రభృతులు యథాప్రయోగంబుగ గ్రాహ్యంబులు.' బాల. సంధి. 42, భావజహరులు - భావజుఁడును, హరుఁడును - ద్వంద్వము.

క. భావజ శరహతి జీవము
పోవఁగ వచ్చుటయు నగజ పురహరు నెదలో
భావించి తెలిసి మగుడు, శు
భావహు శివుఁ దలఁప మృత్యుహర మగు టరుదే! 111

అర్థము : భావజ - శర - హతిన్ = మన్మథబాణముల దెబ్బచే, జీవము = ప్రాణము, పోవఁగన్ + వచ్చుటయున్ = పోవ సిద్ధపడియు, అగజ = పార్వతి, పుర-హరున్ త్రిపురములను హరించినవానిని - శివుని, ఎదలోన్ = హృదయములో, భావించి = తలఁచి, తెలిసి, మగుడున్ = (ప్రాణము) మరలును, శుభ + ఆవహున్ = శుభకరుని. శివున్ = శివుని, తలఁపన్ = స్మరింపఁగా, మృత్యు - హరము = చావులేకుండుట, అగుట, అరుదే = ఆశ్చర్యమా ?

తాత్పర్యము : మన్మథ బాణహతిచేతఁ బ్రాణము పోవనుండియుఁ బార్వతి శివుని హృదయములో భావింపఁగాఁ దెలిసి యది మరలివచ్చును. మృత్యుంజయుఁ డయి శుభావహుఁడైన శివుని స్మరింప మృత్యువు హరించుట ఆశ్చర్యమా ? కా దనుట.

విశేషములు : విశేషము సామాన్యముచే సమర్థింపఁబడుటచే నలంకార మర్థాంతరన్యాసము.

వ. ఇ ట్లసాధారణంబైన రణరణకవ్యథ కబ్బగింవక పొలయుచు. 112

అర్థము : ఇట్లు, అసాధారణంబు+ఐన=సాధారణముకాని - విశిష్టమైన, రణరణక - వ్యథకున్ = మన్మథబాధకు విరహబాధకు, అబ్బగింపక = ఓర్వక, పొలయుచున్ = మిక్కిలి యలసట నొందుచు.

తాత్పర్యము : ఇట్లు అసామాన్యమైన మన్మథవ్యథకుఁ దాళలేక మిక్కిలి యలసట నొందుచు - తరువాతి పద్యముతో నన్వయము,

మ. ఇదిగాకేమి వియోగతాప మనఁగా, నిట్లేర్చుఁగాకేమి కౌ
ముది ? యోషిత్తతి కింత బెట్టిదుఁడె కాముం ? డంగనా రాజికిన్
హృదయాధీశులఁ బాసియున్న విరహం బింత్ తేచుదే ? యింత తు
మ్మెదరుం జిల్కకు గండుఁగోయిలకు మేల్మేలంచు విభ్రాంతయై 113

అర్థము : వియోగ-తాపము + అనఁగాన్ = విరహతాప మనఁగా, ఇది-కాక + ఏమి? = ఇదికాక మరేమి? ఇదియే యనుట, కౌముది = వెన్నెల, ఇట్లు, ఏర్చున్ + కాక + ఏమి = దహించునకదా ; కాముండు = మన్మథుఁడు యోషిత్ + తతికిన్ = స్త్రీజనమునకు, ఇంత, బెట్టిదుఁడు + ఎ = విర్దయుఁడా, అంగనా - రాజికిన్ = స్త్రీలసమూహము నకు, హృదయ + అధి + ఈశులన్ = ప్రాణేశ్వరులను, పాసి + ఉన్నన్ = విడిచియున్నచో, విరహంబు = వియోగము, ఇంత + ఏచుదే = ఇంతగా బాధించుటయా ? తుమ్మెదకున్, చిల్కకున్, గండుఁగోయిలకున్ (గండు + కోయిలకున్) = కోకిలమునకు. ఇంత = ఇంతయా ? ఇంతపొగరా ? యనుట, మేల్మేలు (మేలు + మేలు) = బాగుబాగు, అంచున్, విభ్రాంత + ఐ = విభ్రమము చెందినదయి.

తాత్పర్యము : విరహతాపమనఁగా ఇట్టిది యౌనేకదా ; వెన్నెల యిట్లు దహించునేకదా ; స్త్రీజనమునకు మన్మథుఁ డింతక్రూరుఁడా ? స్త్రీలు ప్రాణేశ్వరులను విడిచియున్నచో వియోగ మింతబాధించునా ? తుమ్మెదకుఁ, జిల్కకు, గండుఁగోయిలకు ఇంత పొగరా ? అనుచుఁ గలవరపడినదయి - తరువాతి వచనముతో నన్వయము.

విశేషములు : కోకిలము (ప్రకృతి)-కోయిల, కోపెల (వికృతి), గండుఁ గోయిల = పుంస్కోకిలము, గండు + కోయిల - 'సమాసంబుల నుదంతంబులగు స్త్రీసమంబులకుం బుంపులకుం బరుషసరళంబులు పరంబు లగునపుడు నుగాగమం బగు.' బాల. సంధి. 25, ద్రుతకార్యము (బాల, సంధి. 16, 17-) గండుఁగోయిల, తుమ్మెదలు, చిలుకలు, గండుఁగోయిలలు మన్మథుని పరివారము. చిల్క - చిలుక - 'అచ్చికంబులం బదమధ్యంబుల న ల డ ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు. బాల. ప్రకీర్ణక, 17, మేల్మేలు-మేలు + మేలు - 'పదాంతంబులయి యసం

యుక్తంబులయిన ను లు రు ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బాల. ప్రకీర్ణక. 16

వ. కళవళించి పరమేశ్వరుం దలఁచి మనంబున నువ్విళ్లూరుచు. 114

అర్థము : కళవళించి = కలఁతపడి, పరమేశ్వరున్, తలఁచి, మనంబునన్ = మనస్సునందు, ఉవ్విళ్లూరుచున్ = తహతహపడుచు,

తాత్పర్యము : కలఁతపడి, యీశ్వరుని స్మరించి మనస్సునఁ దహతహపడుచు - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. సురనది నురువులు జూటాంతరంబునఁ
 క్రొవ్విరిజాదుల కొమరు గాఁగఁ
బావకాంబకరుచి ఫాలతటంబునఁ
 గాశ్మీర మయతిలకంబు గాఁగ
గరళాసితప్రభ గళమున వ్రాసిన
 కస్తూరి పత్రభంగంబు గాఁగ
భాసురంబగు నిజ పాండురాంగద్యుతి
 సదమల చందనచర్చ గాఁగఁ

తే. చారుతరమైన సహజ శృంగారరూప
విభవ సౌభాగ్య సంపద విస్తరిల్ల
నా మహాదేవుతోఁ జిత్తమార వెలసి
కలిసి రమియింప నెన్నఁడు గాంతు నొక్కొ. 115

అర్థము : సుర - నది - నురువులు = ఆకాశగంగ నురుఁగులు. జూట + అంతరంబునన్ = జడముడిలోపల, క్రొవ్విరి (క్రొత్త + విరి) = క్రొత్తగా వికసించిన, జాదుల = జాజిపూల, కొమరు = అందము, కాఁగన్.

పావక + అంబక - రుచి = అగ్నినేత్రముయొక్క కాంతి, ఫాల - తటంబునన్ = నొసటిప్రదేశమున, కాశ్మీర - మయ - తిలకంబు = కుంకుమపు బొట్టు కాఁగన్,

గరళ + అసిత - ప్రభ = విషముయొక్క నల్లని, కాంతి, గళమునన్ = కంఠమునందు, వ్రాసిన = లిఖించిన, కస్తూరి - పత్రభంగంబు = కస్తూరితో వ్రాసిన మకరికాపత్రము కాఁగన్.

భాసురంబు + అగు = ప్రకాశించునట్టిది యగు, నిజ - పాండుర + అంగ ద్యుతి = తనదైన తెల్లని శరీరకాంతి, సత్ + అమల - చందన - చర్చ = మిక్కిలి నిర్మలమైన గంధపుఁబూఁత, కాఁగన్.

చారు - తరము + ఐన = మిక్కిలి మనోహరమైన, సహజ - శృంగార - రూప - విభవ - సౌభాగ్య - సంపద = స్వభావసిద్ధమైన శృంగారరూపముయొక్క వైభవము. సౌభాగ్యము అనెడి సంపద, విస్తరిల్లు = వ్యాపించునట్టి, ఆ - మహా దేవుతోన్ = ఆ శివునితో, చిత్తమారన్ (చిత్తము + ఆరన్) = మనసార, వెలపి = ప్రకాశించి, కలిపి = కూడి, రమియింపన్ = కవయుటకు, ఎన్నఁడు = ఎప్పుడు, కాంతున్ + ఒక్కొ = చూతునో.

తాత్పర్యము: తలమీఁది ఆకాశగంగ నురుఁగులు జడముడిలోని క్రొత్తగా విరిసిన జాజిపూల యందము పంతరించుకొనఁగను. అగ్నినేత్రకాంతి నుదుటదిద్దిన కుంకుమపుబొట్టు కాఁగను. విషపు నల్లనికాంతి కంఠమున వ్రాసిన మకరికాపత్రము కాఁగను, ప్రకాశించు తన తెల్లనిదేహకాంతి స్వచ్ఛమైన మంచిగంధపుఁబూఁత కాఁగను మిక్కిలి మనోహరమైన సహజ శృంగారరూపవైభవము గల ఆ శివునితో మనసార నెన్నఁడు రమింపఁగందునో !

విశేషములు: అలంకారము రూపకము. క్రొవ్విరి - క్రొత్త + విరి - 'సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చుమీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు.' బాల.సంధి.36. క్రొ + విరి - 'క్రొత్తశబ్దమున కాద్యక్షరశేషంబునకుం గొన్నియెడల నుగాగమంబునుం గొన్నియెడల మీఁదిహల్లునకు ద్విత్వంబు నగు.' బాల. సంధి. 38. క్రొవ్విరి.

వ. అని గద్దించి కాలుకొనక లీలోద్యానంబున కేకాంతంబునఁ జని విరహ
దహనదాహంబు సహింపనోపక. 116

అర్థము : అని, గద్దించి, = అదలించి. కాలుకొనక = నిలువక, లీలా + ఉద్యానంబునకున్ = క్రీడావనమునకు, ఏకాంతంబునన్ = ఒంటరిగా, చని, విరహ - దహన - దాహంబు = వియోగమనెడి యగ్నితాపము. సహింపన్ + ఓపక = ఓర్వఁజాలక,

తాత్పర్యము : అని యదలించి నిలువక క్రీడోద్యానమునకు ఒంటరిగాఁ బోయి వియోగమనెడి యగ్నితాపము నోర్వక - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : విరహ - దహన - విరహమనెడి దహన రూపకము. కాలుకొను = కాలుమోపు - నిలుచు.

తే. రుచిర శశికాంత రచిత సరోవరంబు
నెలఁత సొచ్చిన మెయివేఁకి నీరులెల్ల
వింకె; వదనేందురుచి శిలలెల్లఁ గరఁగి
నిండెఁ దోడ్తోన కొల నతనుండు విసువ. 117

అర్థము : రుచిర - శశికాంత - రచిత - సరోవరంబున్ = మనోహరమైన, చంద్రకాంతశిలలతో, నిర్మింపఁబడిన సరస్సును. నెలఁత = స్త్రీ - పార్వతి, చొచ్చినన్ = ప్రవేశింపఁగా, మెయి-వేఁకిన్ = శరీరతాపముచే నీరులు + ఎల్లన్ = జలము లన్నియు, ఇంకెన్, తోడ్తోన్ + అ = వెంటనే, అతనుండు = మన్మథుఁడు, విసువన్ = విసువుచెందఁగా, వదన + ఇందు - రుచిన్ = ముఖమనెడు చంద్రుని కాంతితో, శిలలు + ఎల్లన్ = చంద్రకాంతపుఱాలు అన్నియును, కరంగి, కొలను = సరస్సు, నిండెన్.

తాత్పర్యము : మనోహరములైన చంద్రకాంతశిలలతో నిర్మింపఁబడిన సరస్సు పార్వతి ప్రవేశింపఁగా, నామె శరీరతాపముచే నందలి నీరులన్నియు నింకిపోయెను, కాని మరల వెంటనే మన్మథుఁడు విసువుచెందఁగా, నామె ముఖమనెడి చంద్రునికాంతిచే నా చంద్రకాంతశిలలు కరఁగి కొలను నిండెను,

విశేషములు: సంబంధాతిశయోక్త్యలంకారము. 'సంబన్ధాతిశయోక్తి స్స్యాదయోగే యోగకల్పనమ్,' చన్ద్రా. అతనుండు విసువ – మన్మథుఁడు విసువుకొనుట యెందులకనఁగా. నామెను సంతప్తురాలినిజేయు తనప్రయత్నమున విఫలుఁడయినందులకు, వదన + ఇందు = రూపకము.

వ. అంతం దనుసంతాపంబు వాపనోపక పరమేశ్వరురూపు చిత్రించి చూచినన్నైన నూఱట యగునోయని చిత్రసాధనంబులు గొని పలక ఘట్టించి మెఱుంగిడి త్రివటించి తిట్టంబు కొలఁదికిందెచ్చి ఋజ్వాగతంబున రేఖ నూల్కొలిపి పత్రక బిందుక నిమ్నోన్నతాపాంగ మానోన్మానంబు లలవఱిచి సలక్షణంబుగాఁ జిత్రించి వన్నువ గొలిపి కందెఱ తెఱచిన. 118

అర్థము: అంతన్, తను - సంతాపంబు = మేనివేఁడిమి, పాపన్ + ఓపక = పోఁగొట్టుకొనలేక, పరమేశ్వరు - రూపు, చిత్రించి, చూచినన్ + ఐనన్ = చూచుటచేతనైనను, ఊఱట = స్వస్థత, అగునో, అని, చిత్ర - సాధనంబులు = రూపచిత్రణోపకరణములు, కొని, పలక = చిత్రఫలకము, ఘట్టించి = స్థిరముగానుండునట్లుచేసి, మెఱుంగు + ఇడి = మెఱుఁగుపెట్టి, త్రివటించి = మూఁడు సమభాగములుగాఁజేసి, తిట్టంబు-కొలఁదికిన్ + తెచ్చి = చిత్రప్రారంభమునందు స్థూలాకారముఁ వ్రాసి, ఋజ్వాగతంబునన్ = చిత్రశాస్త్రమున రేఖలువ్రాయు నైదుమార్గములలో నొకటియైన దీనిచే, రేఖన్ = గీఁతను, నూల్కొలిపి = సరిచేసి, పత్రక - బిందుక - నిమ్నోన్నత - అపాంగ - మాన + ఉన్మానంబులు = ఈ పేర్లు గల లేఖనమార్గములు, అలవఱిచి = చేసి, సలక్షణంబుగాన్ = లక్షణయుక్తముగా, చిత్రించి = లిఖించి, వన్నువ + కొలిపి = వర్ణము ఉండునట్లుచేసి, కందెఱ = గవుసెన, తెఱచినన్ = తీయఁగా,

తాత్పర్యము: అంత మేనితాపమును బోఁగొట్టుకొనలేక యీశ్వరుని రూపమును జిత్రించి చూచుటవలననైనను స్వాస్థ్యము గలుగునేమోయని చిత్రమునకు వలయు నుపకరణములు తీసికొని, చిత్రఫలకమును స్థిరముగా నుండునట్లుచేసి, మెఱుఁగుపెట్టి, మూఁడుసమభాగములుచేసి, స్థూలాకారము వ్రాసి ఋజ్వాగతమనెడిరేఖామార్గ

మున రేఖను సరిచేసి, పత్త్రకము, బిందుకము, నిమ్నోన్నతము, అపాంగము, మానము, ఉన్మానము అను రేఖనమార్గములు సరిచేసి, లక్షణమునకు సరిపోవునట్లు లిఖించి వర్ణమువేసి, గవుసెన తీయఁగా - తరువాతిపద్యమునందు నన్వయము.

విశేషములు : ఋజ్వాగతము - చిత్రశాస్త్రమున రేఖలు వ్రాయు పంచమార్గములలో నొకటి, తక్కినవి: అర్ధఋజువు, సాచి, ద్వ్యర్ధాక్షి, పార్శ్వాగతము. చిత్రపటరూపములు మనలఁజూచు దృష్టిభేదములఁ జూపురేఖలే యీ యైదును. పత్త్రక, బిందుక, నిమ్నోన్నత, మాన, నీలక, భ్రమావర్తక, ఉద్వర్తన, చిత్రప్రవర్తనము అను నెనిమిదియు. క్రమముగా సకల, స్వస్తిక, సర్వతోభద్ర, శశిక, కంటక, త్రిభంగ, శిశునిరీక్షణ, వర్ధమానము అను నెనిమిదివిధములగు చిత్రరూపములకు రేఖనమార్గములు.

చ. కలకల నవ్వునట్లు, తమకంబునఁ గన్గవ విచ్చి భ్రూలతల్
వొలయఁగఁ జూచునట్లు, తనివోవఁగఁ దెల్పియుఁ గౌఁగిలింపఁజే
తులు పచరించున, ట్లడటుతో రతికేలికి నప్పలించున
ట్లెలమి నటించుచుండె సతి కీశ్వరురూ పెదురం బ్రసన్నమై. 119

అర్థము : ఈశ్వరు - రూపు = ఈశ్వరుని ఆకారము, సతికిన్ = స్త్రీకి - పార్వతికి, ఎదురన్, ప్రసన్నము + ఐ = సరియైనదయి, కలకల - నవ్వు + అట్లు = కలకల నవ్వునట్లును, తమకంబునన్ = తహతహతో, కన్గవ (కను + కవ) = కనులజంట, విచ్చి = విప్పి, భ్రూ - లతల్ = తీఁగలవంటిబొమలు, పొలయఁగన్ = పొసఁగఁగా, చూచు + అట్లు - చూచునట్లును, తనివోవఁగన్ = తృప్తితీఱఁగా, తెల్పియున్ = తేర్చియు, కౌఁగిలింపన్ = కౌఁగిలించుటకు, చేతులు, పచరించు + అట్లు = చాఁచునట్లును, అడటుతోన్ = ఉద్రేకముతో, రతి - కేలికిన్ = సంభోగ క్రీడకు, అప్పలించు + అట్లు = ఉత్సహించునట్లును, ఎలమిన్ = ఇంపుగా, నటించుచున్ + ఉండెన్ = తోఁచుచుండెను.

తాత్పర్యము : ఈశ్వరునిరూపము పార్వతి కెదుటఁ బ్రసన్నమయి, కలకల నవ్వునట్లును, తహతహతోఁ గనుదోయి విప్పి బొమతీవలు పొసఁగఁజూచునట్లును, తృప్తి తీఱఁ దేర్చియుఁ గౌఁగిలించుకొనుటకుఁ జేతులు చాఁచునట్లును, ఉద్రేకముతో సంభోగక్రియకు ఉత్సహించునట్లును ఇంపుగా వర్తిలుచుండెను.

వి శే ష ము లు : ఈ పద్యము పింగళిసూరనకృత ప్రభావతీప్రద్యుమ్నము నందలి యీ క్రిందిపద్యమును స్ఫురింపఁజేయుచున్నది.

చ. కలకల నవ్వినట్ల తెలిగన్నుల నిక్కము చూచినట్ల తోఁ
బలుకఁ గడంగినట్ల కడు భావగభీరత లబ్బినట్ల పెం
పొలయఁ దనర్చి జీవకళ యుట్టిపడన్ శివవ్రాసినట్టి యా

చెలువునకాభిముఖ్యము భజింపఁ దలంకెను దాను బోటియున్. ప్రభా. 1.138.
ఇదియును పార్వతి చిత్తరువునవ్రాసిన ప్రద్యుమ్నునిరూపవర్ణనము. భ్రూలతల్ = లతవంటిభ్రువులు - ఉపమిత సమాసము, తెల్చి - తెలుపుధాతుక్త్వార్థరూపము, అలంకారము స్వభావోక్తి.

వ. అంత నంతయు నిక్కువంబ కాఁదలంచి లజ్జించి మే యోసరించుచు నపాంగావలోకనంబు సురంగంబై పొలయం దదాసక్త యగుచు నంత నక్కడం జతురిక యను ప్రియవయస్య కన్యాంతఃపురంబునం దగసుతం గానక లీలోద్యానంబునం దన్వేషించుచు వచ్చి వచ్చి. 120

అ ర్థ ము : అంతన్, అంతయున్, నిక్కువంబు + అ = నిజమే, కాన్= అగునట్లు, తలంచి, లజ్జించి = సిగ్గుపడి, మే = శరీరము. ఓసరించుచున్ = తొలఁగఁజేయుచు, అపాంగ + అవలోకనంబు = క్రీఁగంటిచూపు. సురంగంబు + ఐ= ప్రకాశమయి, పొలయన్ = వర్తిలఁగా, తద్ + ఆసక్త = ఆతనియందు శివుని యందుఁ, గోరికగలదై, అగుచున్ + ఉండన్ = అగుచుండను, అంతన్, అక్కడన్, చతురిక, అను, ప్రియ - వయస్య = అనుఁగుఁజెలి, కన్యా + అంతఃపురంబునందున్, అగ -సుతన్ = కొండకూఁతును-పార్వతిని, కానక = చూడక, లీలా + ఉద్యానంబు నందున్ = క్రీడోపవనమునందు. అన్వేషించుచున్ = వెదకుచు, వచ్చి - వచ్చి.

తా త్ప ర్య ము : అంతఁ దానుజూచునదియంతయు నిజమేయని తలఁచి, సిగ్గుఁజెంది, శరీరము అపసరిల్లఁజేయుచుఁ, గ్రీఁగంటి చూపు ప్రకాశమయి వర్తిలఁగా శివునియందుఁ గోరికగలది యగుచుండెను. అంత నక్కడఁ జతురిక యను ననుఁగుఁ జెలి కన్యాంతఃపురమునఁ బార్వతిని గానక క్రీడావనమున వెదకుచు వచ్చివచ్చి. - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. జలజాతముల కింత చన వెవ్వరిచ్చిరి
దరహాసరుచిఁబొల్పు తావిఁ బెనఁగ ?
హిమరుచి కీ మెయి యెందుండి వచ్చె ని
తాంత సుధాపూర్ణ కాంతిఁ దనర ?
మలయానిలుం డింత చలిమిరితోఁ గ్రాలి
నడపాడు నోజ యెన్నండు వడసె ?
రాజకీరము లింత రసవంత మగుమాట
చొప్పు లేరీతి నెచ్చోటఁ బడసెఁ ?

తే. దగు నెఱింగితిఁ బ్రాలేయ నగ తనూజ
మదనవేదనఁ దన్నుఁ దా మఱచియున్న
యవసరంబుల నా బాల యవయవముల
చెలువు గిల్కొడుకొనిరి గావలయు నేఁడు. 121

అర్థము : దర - హాస - రుచిన్ = చిఱునవ్వుకాంతితోఁ పొల్పు = ఒప్పు. తావిన్ = పరిమళముతో, పెనఁగన్ = కూడియుండుటకు. జలజాతములకున్ = పద్మములకు, ఇంత = ఇంతటి, చనవు = పరిచయము, ఎవ్వరు, ఇచ్చిరి ?

నితాంత - సుధా - పూర్ణ - కాంతిన్ = అధికమైన, అమృతముతో నిండిన కాంతితో, తనరన్ = ఒప్పుటకు, హిమ - రుచికిన్ = చల్లని కిరణములు గలవానికి - చంద్రునకు. ఈ - మెయి = ఈ రీతి, ఎందున్ + ఉండి = ఎచ్చటినుండి, వచ్చెన్.

మలయ + అనిలుండు = మలయపవనుఁడు - దక్షిణపుగాలి, ఇంత, చలిమిరితోన్ = శైత్యముతో, క్రాలి = ఒప్పి, నడపాడు + ఓజ = సంచరించు విధము, ఎన్నండు = ఎప్పుడు, పడసెన్ = పొందెను.

రాజ - కీరములు = రాచిలుకలు, ఇంత, రసవంతము + అగు - సరసములగు - మాట - చొప్పులు = మాటరీతులు, ఏ రీతిన్ = ఏ విధముగా, ఎచ్చోటన్ (ఏ + చోటన్) = ఎచ్చట, పడసెన్.

తగున్ = అవును, ఎఱింగితిన్ = తెలిసికొంటిని.

ప్రాలేయ - నగ - తనూజ - మంచుఁగొండ కూఁతురు - పార్వతి, మదన - వేదనన్ = మన్మథబాధతో. తన్నున్ + తాన్ = తన్నుఁదాను, మఱచి + ఉన్న+ అవసరంబులన్ = మఱచియున్న సమయములందు, ఆ - బాల = ఆ కన్య - పార్వతి యొక్క, అవయవముల = అవయవములయొక్క, చెలువు = అందము, నేఁడు, గిల్మాడుకొనిరి కావలయున్ = అపహరించిరికాఁబోలును.

తాత్పర్యము : పద్మములకుఁ జిఱునవ్వుకాంతితో నొప్పు పరిమళముతోఁ గూడియుండుట కింతపరిచయ మెవ్వరిచ్చిరి ? చంద్రునకు అధికమైన అమృతముతో నిండినప్రకాశముతో నొప్పుటకు ఈ రీతి యెందుండి వచ్చెను ? మలయవాయువు ఇంత శైత్యముతో నొప్పి సంచరించు విధ మెప్పుడు పొందెను ? రాచిలుక లింత రసవంతము లైన మాటరీతు లే విధముగా నెచ్చటఁబొందెను ? అవును. తెలిసికొంటిని ; హిమవత్పర్వతపుత్రి, మన్మథతాపముచే మైమఱచియున్న సమయములందు ఆమె యవయవముల అందమును నేఁ డపహరించియుండవలయును.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష- ప్రాలేయ - 'ప్రాలేయం మిహికా చ. ప్రళయా చ్ఛరదంతాదాగత మితి ప్రాలేయమ్' - శరత్కాలాంతమున వచ్చునది - మంచు - అమరము. గిల్మాడు , గిల్బాడు - గిలుబాడు = అపహరించు - అనువదియే కాని 'గిల్మాడు' నిఘంటువులఁ గనుపట్టదు.

వ. అనుచు గిరిజ హరునం దాసక్త యగు టెఱింగినదై చంచలించుచు నరుగుదెంచి శశికాంత సరోవరతీర కర్పూర లతామందిరంబున విందుశేఖరు సుందరాకారంబు చిత్రించుచున్న గిరినందనం గని డాయం జనుదెంచి చతురిక సమంచితాలాపంబులఁ దన్నుంగలిసికొని యమ్మెలంతం గనుంగొని. 122

అర్థము : అనుచున్, గిరిజ = పార్వతి, హరునందున్, ఆసక్త+అగుడు= కోరికగలది యగుట, ఎఱింగినది + ఐ = తెలిసినదయి, చంచలించుచున్ = మిక్కిలి చలించుచు, అరుగుదెంచి = వచ్చి, శశికాంత - సరోవర - తీర - కర్పూర - లతా - మందిరంబునన్ = చంద్రకాంత శిలానిర్మితమైన సరస్సుయొక్క ఒడ్డునందలి

కప్పురపుఁదీవయింట. ఇందుశేఖరు = చంద్రుఁడు శిరోభూషణముగాఁ గలవాని - (శివుని) యొక్క, సుందర + ఆకారంబు = అందమైనరూపము, చిత్రించుచున్ + ఉన్న = గీయుచున్న, గిరి - నందనన్ = కొండకూఁతును - పార్వతిని, కని. డాయన్ + చనుదెంచి = సమీపింపవచ్చి, చతురిక, సమంచిత + ఆలాపంబులన్= ఒప్పిన మాటలతో, తన్నున్ = ఆమెను, కలిసికొని. అ + మెలంతన్ = ఆ స్త్రీని- పార్వతిని, కసుంగొని - చూచి.

తాత్పర్యము : అనుచుఁ బార్వతి యీశ్వరునియందుఁ గోరికగలదియగుట తెలిపినదయి చతురిక మిక్కిలి చలించుచు వచ్చి చంద్రకాంత శిలానిర్మితమైన సరస్తీరమునందలి కప్పురపుఁదీవయింట నీశ్వరుని సుందరరూపమును జిత్రించుచున్న పార్వతినిజూచి సమీపించి సమంచితములైన పలుకులతో నామెను గలిసికొని చూచి - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. ఎలమి నీ మ్రోఁదీఁగె నెలకొన్న సుకుమార
వాసంతలక్ష్మి పొం దోసరించి,
మరిగి నీ జిహ్వానుసుంజరి విహరించు
భాషాశుకంబులఁ బాఱఁజోఁపి,
సంధిల్లు నీ ముఖచంద్రుతో రమియించు
దరహాస చంద్రికఁ బొరపుచేసి,
నెఱిలేక నీతోడినీడయై కెడఁగూడి
పరఁగిన నన్నింత యెరవు సేసి,

తే. వచ్చి యీ వనలక్ష్మితో నిచ్చమెచ్చి
చెలిమిగొనియుండుటయుఁగాక చిత్తమునకుఁ
గన్నుఁగవకూఁతగా నహికటకురూపు
చిత్ర మిడి చూచె దిదియేమి చిత్ర మబల! 123

అర్థము : అబల = ఓ యింతీ! పార్వతీ!

ఎలమిన్ = ఇంపుతో, నీ - మై + తీఁగెన్ = నీ దేహలతయందు, నెఱకొన్న = పొదుకొనిన, సుకుమార = కోమలమైన, వాసంత - లక్ష్మీ - పొందు = వసంత శోభయొక్క పొందు, ఓసరించి = విడిచి,

మరిగి = మచ్చికపడి, నీ - జిహ్వా - సుమంజరిన్ = నీ నాలుకయనెడు మంచిపూలగుత్తియందు, విహరించు, భాషా - శుకంబులన్ = వాక్కులనెడు చిలుకలను, పాఱఁజోఁపి = పాఱఁద్రోలి,

సంధిల్లు = సమకూడునట్టి, నీ ముఖ - చంద్రుతోన్ = నీ ముఖమనెడి చంద్రునితో, రమియించు = క్రీడించు, దర - హాస - చంద్రికన్ = చిఱునవ్వనెడు వెన్నెలను, పొరపుచేసి = భిన్నముచేసి,

నెఱి - లేక = పాడిలేక, నీతోడి - నీడ + ఐ, కెరఁగూడి = ప్రక్కనుండి, పరఁగిన = ఒప్పిన, నన్నున్, ఇంత, ఎరవు + చేసి = అన్యముగా భావించి,

వచ్చి, ఈ వనలక్ష్మితోన్ = ఈ వనమనెడి లక్ష్మితో, ఇచ్చన్ - మెచ్చి = ఇష్టపడి, చెలిమి + కొనిఉండుటయున్ + కాక = స్నేహముగలిగియుండుటయే కాక, చిత్తమునకున్ = మనస్సునకును, కన్నుఁగవకున్ = కనుదోయికి, ఊఁతగాన్ = ఆధారముగా, అహి - కటకు - రూపు - చిత్రము = పాములు కడియములుగాఁగలవాని (శివుని) ఆకారముయొక్క చిత్తరువు, ఇడి = ఉంచి, చూచెదు = చూతువు, ఇది - ఏమి - చిత్రము = ఇ దేమి వింత?

తాత్పర్యము : పార్వతీ! నీ దేహలతయందు నెఱకొన్న కోమల వసంత శోభ పొందు విడిచి, నీ నాలుకయనెడుపూలగుత్తిని మరిగి విహరించు వాక్కులనెడు చిలుకలను బాఱఁద్రోలి, నీ ముఖమనెడు చంద్రునితోఁ గ్రీడించు చిఱునవ్వనెడు వెన్నెలను భిన్నముచేసి, నీతోడునీడయై ప్రక్కనుండునన్ను పాడితప్పి ఇంతవేఱుచేసి, వచ్చి, యీ వనలక్ష్మితో నిష్టపడి, స్నేహముగలిగియుండుటయేకాక మనసునకుఁ గనుదోయికి వునిరూపపుఁజిత్తరువు నాధారముగాఁజేసి చూతువు, ఇదేమి వింత!

విశేషములు : మైఁదీఁగ = మై అనెడుతీఁగ - రూపకము. వాసంత = వసంతసంబంధమయినది, జిహ్వా - సుమంజరి = జిహ్వఅనెడుసుమంజరి, భాషా - శుకంబులు = భాషయనెడుశుకములు, ముఖచంద్రుఁడు ముఖమనెడుచంద్రుఁడు, దర

హాస - చంద్రిక - దరహాసమనెడుచంద్రిక - రూపకములు. చూచెదిది = చూచెదవు + ఇది. లాట్టు వకారమునకు లోపము (బాల.క్రియ.24). అసదాదిస్వరసంధి. బాల.సంధి. 11. ఉత్వసంధి. బాల.సంధి.1. రూపు (వికృతి) - రూపము (ప్రకృతి) చిత్రము = (నానా.) చిత్తరువు. ఆశ్చర్యము.

వ. ఇదియంతయు హరువలని విరహవ్యంజకం బగుచున్నయది యనిన
నగజ నెచ్చెలిం గనుంగొని. 124

అర్థము : ఇది + అంతయున్, హరువలని = ఈశ్వరునితోడి, విరహ - వ్యంజకంబు = ఎడఁబాటును స్పష్టపఱుచునది. అగుచున్ + ఉన్న + అది. అనినన్. అగజ = పార్వతి. నెచ్చెలిన్ = చెలికత్తెను. కనుంగొని.

తాత్పర్యము: 'ఇదియంతయును ఈశ్వరునితోడియెడఁబాటును స్పష్టపఱుచుచున్నది' అనినఁ బార్వతి చెలికత్తెనుజూచి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: హరువలని విరహవ్యంజకంబు - 'కొన్నియెడల సిద్ధసమాస మధ్యగత పదంబులతోఁ దప్పిన్న పదంబుల కన్వయంబు చూపబడెడి'. ప్రౌఢ. సమాస. 35.

ఉ. ఆ దరహాస వాస లలితాస్యరుచుల్ దలుకొత్త నప్పు డా
హ్లాదముతోడఁ జూచి చనినప్పటి సమ్మదరాగలీల నాఁ
డాదిగఁ బాయ కీశుఁ డెద నప్పటి కప్పటి కొక్కభంగి న
న్నాదటఁ గూడియుండ విరహవ్యథ నా దెసఁ బొందనేర్చునే ? 125

అర్థము : ఆ - దర - హాస - వాస - లలిత + ఆస్య - రుచుల్ = ఆ యీశ్వరునియొక్క, చిఱునవ్వునకు ఆస్పదమైన, మనోహరమైన, ముఖముకాంతులు. తలుకొత్తన్ = ప్రకాశింపఁగా, అప్పుడు = శివునిసేవించు సమయమున, ఆహ్లాదము తోడన్ = సంతోషముతో, చూచి, చనిన + అప్పటి = చనిననాఁటి, సమ్మద - రాగ - లీల = సంతోషముతోడి అనురాగవిలాసము, నాఁడు + ఆదిగన్ = ఆ దినము మొదలుకొని, పాయక = విడువక, ఈశుఁడు, ఎదన్ = నా హృదయము నందు, అప్పటికిన్ + అప్పటికిన్ = నానాఁటికి, ఒక్క - భంగిన్ = ఒక్కరీతిగా.

నన్నున్, ఆదటన్ = ప్రీతితో, కూడి + ఉండఁగన్ = కలిసియుండఁగా. విరహ - వ్యథ = ఎడఁబాటువలనిబాధ, నా - దెసన్ = నా విషయమున, పొందన్ + నేర్చునే = పొందఁగలుగునా.

తాత్పర్యము : ఆ శివుని చిఱునగవుతోడి మనోహరముఖకాంతులను అతనిని సేవించు సమయమున సంతోషముతోఁ జూచి నేర్పడిన అనురాగము నాఁడు మొదలుకొని విడువక, ఈశ్వరుఁడు నా హృదయములో నానాఁటికి ఒక్కరీతిగాఁ బ్రీతితోఁ గూడియుండఁగా. నాకు విరహబాధ యేలకలుగును ?

విశేషములు : అప్పటికప్పటికిన్ - అప్పటికిన్ + అప్పటికిన్ - 'ఆమ్రేడితంబు పరంబగునపుడు విభక్తిలోపంబు బహుళంబుగా నగు.' బాల. సంధి. 41. ఇచ్చట విభక్తికి లోపము రాలేదు. 'అచ్చున కామ్రేడితంబు పరంబగునపుడు సంధి తఱచుగ నగు,' బాల, సంధి. 10. అప్పటికప్పటికిన్.

వ. అని కప్పి పల్కఁబోయి బయల్పడఁబల్కి వెలవెలఁబాఱుచు దన
బహిఃప్రాణయైన ప్రియవయస్యపై నల్లన వ్రాలుడు. 126

అర్థము : అని, కప్పి = మఱుఁగుపఱిచి, పల్కన్ + పోయి, బయల్పడన్ + పల్కి = బయలుపడునట్లుపలికి, వెలవెలఁబాఱుచున్ = తెల్లఁబోవుచు. తన- బహిస్ (ః) + ప్రాణ = తనవెలుపలి ప్రాణమైన, ప్రియ - వయస్య - పైన్ = అనుఁగుఁజెలిమీఁద, అల్లవన్ = మెల్లఁగా, వ్రాలుడున్ = వ్రాలినంతనే-

తాత్పర్యము ; అని పార్వతి తనలోని వియోగబాధను మఱుఁగుపఱిచి పలుకఁబోయి, బయలుపడునట్లు పలికి, తెల్లఁబోవుచుఁ దన వెలిప్రాణమైన అనుఁగుఁజెలి చతురికపై మెల్లఁగా వ్రాలినంతనే - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : బహిఃప్రాణ - బహిస్ + ప్రాణ - పదాంత సకారమునకు విసర్గాదేశము.

ఆ. ఉవిద మానసమున సుప్పొంగి వలరసం
బొక్కపెట్ట తఱిమి కుక్కిదంబు
గాఁగ నిండి తాల్మి కట్టవిసెనో యన
వెడలె నశ్రువారి వెల్లిగొనుచు. 127

అర్థము : ఉవిద - మానసమునన్ = యువతియైన పార్వతియొక్క మనస్సునందు, వల - రసంబు (వలపు + రసంబు) = వలపనెడి రసము, ఉప్పొంగి, ఒక్కపెట్ట = ఒక్కమాఱుగా, తఱిమి = విజృంభించి, కుక్కిదంబు + కాఁగన్ = క్రిక్కిఱియునట్లు, నిండి, తాల్మి - కట్ట = ఓర్పు అనెడు గట్టు, అవిసెనో + అనన్ = తెగెనా యనునట్లు అశ్రు - వారి = కన్నీరు, వెల్లి + కొనుచున్ = ప్రవాహము కట్టి, వెడలెన్ = పైకివచ్చెను.

తాత్పర్యము : పార్వతి మనస్సులోఁ బ్రేమరస ముప్పొంగి యొక్కమాఱుగా విజృంభించి, క్రిక్కిఱియునట్లు నిండి, సహనమనెడి గట్టుతెగెనా యనునట్లు కన్నీరు ప్రవాహముకట్టి బయలువెడలెను.

విశేషములు : అలంకారము ఉత్ప్రేక్ష. తాల్మి - కట్ట = తాల్మియనెడు కట్ట - అను రూపకమువలన రూపకానుప్రాణితము.

వ. అంతం జతురిక చతురోక్తుల నగజ ననునయించుచు. 128

అర్థము : అంతన్, చతురిక, చతుర + ఉక్తులన్ = నేర్పుతోడి మాటలతో, అగజన్ = పార్వతిని. అనునయించుచున్ = ఊఱడించుచు.

తాత్పర్యము : అంతఁ జతురిక నేర్పుతోడి మాటలతోఁ బార్వతిని ఊఱడించుచు - తరువాతి పద్యముతో నన్వయము.

మ. తగదే పోలదె చాలదే యమరదే త్రైలోక్యపూజ్యంబు నీ
తగులం బీశ్వరుమీఁద నట్టి యిది యేతన్మాత్రమే కన్యకా
సుగుణం బెమ్మెయి దూషితం బగునె సంశుద్ధాత్మ సర్వాత్మ స
ర్వగతుం జిత్తమునందుఁ గోరు టిది సద్వంద్యం బనింద్యం బిలన్. 129

అర్థము : ఈశ్వరుమీఁదన్ = శివునిపై. నీ - తగులంబు = నీ ప్రేమము తగదే, పోలదె, చాలదే, అమరదే. త్రైలోక్య - పూజ్యంబు = ముల్లోకములచేఁ బూజింపఁదగినది, అట్టి, ఇది, ఏతద్ + మాత్రమే = ఈపాటిదా ?. కన్యకా - సుగుణంబు = కన్యయొక్క మంచిగుణము, ఏ + మెయిన్ = ఏ విధముగను, దూషితంబు + అగునె = నిందింపఁబడినది యగునా?, ఇలన్ = భూమియందు, సంశుద్ధ + ఆత్మన్ = మిక్కిలి పవిత్రమైన ఆత్మగలవాఁడును, సర్వ + గతున్ = అంతటను వ్యాపించినవాఁడును, అగు, సర్వాత్మున్ = ఈశ్వరుని, చిత్తమునందున్ = మనసునందు, కోరుడు + ఇది = ఇట్లు కోరుట, సత్ + వంద్యంబు = మంచి వారికిఁ బూజింపఁ దగినది. అనింద్యంబు = నిందింపరానిది.

తాత్పర్యము : ఈశ్వరునిపై నీకుఁగల ప్రేమము మిక్కిలి తగినది కాదా; అది ముల్లోకములకుఁ బూజనీయమైనది. అది యీపాటిదికాదు. కన్యాత్వమేవిధముగను నిందితముకాదు. మిక్కిలి పవిత్రమైన ఆత్మగలవాఁడును, అంతటను వ్యాపించినవాఁడును అగు నీశ్వరుని గోరుట ఇలలో మంచివారు పూజింపఁదగినది అనవద్యమైనది.

విశేషములు : తగదే పోలదె చాలదే యమరదే - ఇట్లు సమానార్థకములను పెక్కిటిని బ్రయోగించుట అత్యంతముప్రశంసనీయమని పలుకుట.

ఏతన్మాత్రమే - ఏతద్ + మాత్రమే - అనునాసికసంధి. 'రహలుతప్ప మిగిలిన పదాంతగతహల్లులకు (యర్రులకు) అనునాసిక వర్ణము పరమగుచో వానికి సంబంధించిన అనునాసికవర్ణము వైకల్పికముగా ఆదేశమగును.' ఏతన్మాత్రమే - పక్షమున ఏతద్మాత్రమే. సద్వంద్యము - సత్ + వంద్యము - 'అనునాసికాంతస్థవర్ణములుతప్ప మిగిలిన పదాంతగతహల్లులకు (ఝల్లులకు) మృదుహల్లులు (హశ్శులు)కాని అచ్చులుకాని పరములగునపుడు ఆ హల్లుల వర్గమునకుఁజెందిన తృతీయవర్ణ మాదేశ మగును.' కోరుడు = కోరుట - భావార్థకటవర్ణకమునకు డువర్ణమును వాడుట యీ కవికిఁ బరిపాటి.

వ. అని సంబోధించుచు నంత నా చెలువకు విరహం బతిక్రాంతం బగు దెంచు డెఱింగి నగజం గనుంగొని చతురిక నిపుణికాది సఖీ జనంబులఁ దోడ్తెచ్చి శిశిరోపచారంబులు సేయించి విరహపరితాపంబు పుచ్చివై చెద నోడకుండు మని పోవ నిశ్చయించి. 130

అర్థము : అని, సంబోధించుచున్ = తెలియఁజెప్పుచు, ఆంతన్, ఆ - చెలువకున్ = ఇంతికి - పార్వతికి, విరహంబు = ఎడఁబాటు, అతిక్రాంతంబు = మించినది, అగుదెంచుడు = అగుట, ఎఱింగి, నగజన్ = పార్వతిని, కనుంగొని = చూచి, చతురిక, నిపుణికా + ఆది - సఖీ - జనంబులన్ = నిపుణిక మున్నగు చెలికత్తెలను, తోడ్తెచ్చి = తీసికొనివచ్చి, శిశిర + ఉపచారంబులు = శీతలోపచారములు, చేయించి, విరహ - పరితాపంబు = వియోగమువలనిసంతాపము, పుచ్చివైచెదన్ = పోఁగొట్టెదను, ఓడక + ఉండుము = భయపడకుండుము. అని, పోవన్ = పోవుటకు, నిశ్చయించి,

తాత్పర్యము : అని తెలియఁజెప్పుచు, పిమ్మటఁ బార్వతికి వియోగబాధ దుస్సహ మగుట యెఱిఁగి 'ఆమెను జూచి చతురిక నిపుణిక మున్నగుచెలులను దీసికొని వచ్చి శీతలోపచారములు చేయించి నీ విరహతాపము నుడిపెదను. భయపడకు' మని పోనిశ్చయించి - తరువాతి పద్యముతో నన్వయము.

ఉ. "ఆడెడు నెమ్మిఁ గన్గొనకుమమ్మ ! బయల్పడ నాడు చిల్కతో
నాడకు మమ్మ ! తేఁటిగెడ నాళతిసేయకుమమ్మ ! వెన్నెలం
జూడకుమమ్మ ! తెమ్మెరలఁ జోఁకకుమమ్మ ! తలిర్చు మావి క్రీ
నీడకుఁ బోకుమమ్మ!" యని నెచ్చెలికత్తెకుఁ జెప్పె సమ్మతిన్. 131

అర్థము : ఆడెడు - నెమ్మిన్ = నృత్యముచేయు నెమలిని, కన్గొనకుము + అమ్మ = చూడకు తల్లీ, బయల్పడన్ + ఆడు = వెల్లడిగాఁ బలుకు, చిల్కతోన్, ఆడకుము + అమ్మ = పలుకకు తల్లీ. తేఁటి + కెడన్ = తుమ్మెదప్రక్క, ఆళతి + చేయకుము + అమ్మ = రాగాలాపము చేయకు తల్లీ! వెన్నెలన్ + చూడకుము + అమ్మ, తెమ్మెరలన్ = దక్షిణపుగాలిని, - చల్లగాలిని, చోఁకకుము + అమ్మ = తాఁకకు తల్లీ, ! తలిర్చు - మావి - క్రీనీడకున్ = చిగిరించుమామిడిక్రింది నీడకు, పోకుము + అమ్మ = పోవకు తల్లీ! అని, నెచ్చెలికత్తెకున్ = ప్రియ వయస్యకు, సమ్మతిన్ = మంచిమనస్సుతో, చెప్పెన్,

తాత్పర్యము : 'పార్వతీ! నర్తించునెమలిని జూడకుము, వెల్లడిగా మాటాడు చిలుకతోఁ బలుకకుము. తుమ్మెదప్రక్క రాగాలాపము చేయకుము.

వెన్నెలను జూడకుము. ఛల్లగాలిని స్పృశింపకుము. చిగిర్చిన మామిడిచాయకుఁ బోవకుము,' అని చతురిక చెలికత్తెకు సమ్మతితోఁ జెప్పెను.

విశేషములు : కన్గొనకుమమ్మ - 'సంప్రార్థనంబుల ముజ్జున కదాదులు విభాష ననుప్రయుక్తంబు లగు.' బాలక్రియ.33. ఆళతి - (రూపాం.) ఆలతి. క్రీనీడ - క్రిందు + నీడ. 'సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చుమీఁదివర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు.' బాల.సంధి.36. క్రి + నీడ, క్రీఁగడుపు, క్రీఁగాలు, క్రీఁదొడ - ఇత్యాదులం గ్రిందు శబ్దమునకు లుప్తశేషంబునకు దీర్ఘంబు బహుళ గ్రహణముచేత నని యెఱుంగునది, క్రీనీడ.

వ. చని నిపుణికాది సఖీజనంబులకుం దద్వృత్తాంతం బెఱింగించిన నుదరిపడి యందఱుం జనుదెంచి మదనవేదనం బరవశయై యున్న యగ్గిరినందనం గని లగ్గ బెగ్గిల్లి. 132

అర్థము : చని = పోయి, నిపుణికా + ఆది - సఖీ - జనంబులకున్ = నిపుణిక మున్నగు చెలికత్తెలకు, తద్ + వృత్తాంతంబు, ఎఱింగించినన్ = తెలుపఁగా, ఉదరిపడి = ఉలికిపడి, అందఱున్, చనుదెంచి = వచ్చి, మదన - వేదనన్ = మన్మథబాధచే, పరవశ + ఐ = ఒడలుతెలియనిదయి, ఉన్న, ఆ + గిరి-నందనన్ = ఆ కొండకూఁతును - పార్వతిని, కని, లగ్గన్ + బెగ్గిల్లి = మిక్కిలిభయపడి.

తాత్పర్యము : వెడలి నిపుణిక మున్నగు చెలికత్తెలకు ఆ వృత్తాంత మెఱిఁగింపఁగా నులికిపడి యెల్లరును వచ్చి విరహబాధచే నొడలుతెలియకున్నపార్వతిని జూచి మిక్కిలి భయపడి తరువాతి పద్యముతో నన్వయము.

చ. అలకలఁ జిన్నిపూ వలికినంతన మోముసెమర్చుఁ జన్నుఁగ్రే
వల మృదుపత్రభంగములువ్రాయుడుఁ గొనసియాడు లగ్గ ని
మ్మెలఁతకు ; మాధవీకుసుమమేఖలఁ గట్టుటయున్ వడంకు నూ
రులు ; నిజమింత కోమలి మరుప్రసవాస్త్రిహతిం జలింపదే ! 133

అర్థము ; ఇమ్మెలఁతకున్ (ఈ + మెలఁతకున్) = ఈ యింతికి - పార్వతికి, అలకలన్ = ముంగురులందు, చిన్ని - పూవు. అలికిన + అంతన్ +

అ = చెరివినంతనే, మోము, చెమర్చున్ = చెమరించును - స్విన్నమగును, చన్ను + క్రేవలన్ = స్తనపార్శ్వములందు. మృదు - పత్రభంగములు = సుందరములైన మకరికాపత్రములు, వ్రాయుడున్ = వ్రాపినంతనే, కౌను = నడుము. లగ్గన్ = మిక్కిలి, అపియాడున్ = చలించును, మాధవీ - కుసుమ - మేఖలన్ = బండిగురివెందపూలమొలనూలిని, కట్టుటయున్ = కట్టఁగా, ఊరులు = తొడలు, వడంకున్ = చలించును, నిజము + ఇంత = ఇంతయు నిక్కువము, కోమలి = సుందరి - పార్వతి, మరు - ప్రసవ + అస్త్ర - హతిన్ = మన్మథుని పుష్పబాణముల దెబ్బచే. చలింపదే = కంపింపదా ?

తాత్పర్యము : ఈ పార్వతికి ముంగురులఁ జిన్నిపూవు చెరివినంతనే ముఖము స్విన్నమగును, స్తనపార్శ్వముల సుందరములైన మకరికాపత్రములు రచింపఁగనే నడుము మిక్కిలివడఁకును. బండిగురివెందపూలమొలనూలిని గట్టినంతనే తొడలు చలించును, ఇంతయు నిజముగా, నీమె మన్మథుని పూవుటమ్ములదెబ్బచేఁ జలింపదా :

వ. అని మెత్తమెత్తన తడుముచు. 134

అర్థతాత్పర్యములు : అని, మెత్తమెత్తన=మృదువుగా, తడుముచున్= స్పృశించుచు - అని మృదువుగా స్పృశించుచు - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. మృదురీతి నూర్పుఁదెమ్మెరలు నూల్కొలుపవే,
తెలవ ! నీ లేఁతమైఁదీఁగె యొలయ,
నధరారుణద్యుతి నభ్యుదయింపవే
పొలఁతి ! నీ యాననాంభోజ మలర,
దరహాసచంద్రికాస్ఫురణ పూరింపవే
రమణి ! నీ నయనోత్పలములు పొలయ,
భాషామృతముఁ గర్ణపథములఁ జొనుపవే
చెలువ ! నీ జీవంబు చేతరింప

ఆ. వెలఁది ! నీవ నీకు వెజ్జవై వలవంత
యవయవములఁ దీఱ నవయవముల
వలను మెఱయ కేల వలరాజుచలము సా
ధ్యమ్ము చేసెదమ్మ ! తలిరుబోఁడి. 135

అర్థము : తెఱవ = ఇంతీ! పార్వతీ, నీ - లేఁత - మై + తీఁగె = లేఁతయైన నీ దేహలత, ఒలయన్ = ఒప్పఁగా, - ఇష్టపడఁగా, మృదు - రీతిన్ = మృదువైనవిధముగా. ఊర్పు + తెమ్మెరలు = నిట్టూర్పుగాలి, నూల్కొలుపవే = ప్రసరింపఁజేయవా ?

పొలఁతి = ఇంతీ, ! నీ - ఆనన + అంభోజము = నీ ముఖపద్మము, అలరన్ = వికసింపఁగా, అధర + అరుణ - ద్యుతిన్ - క్రిందిపెదవి యెఱ్ఱనికాంతిని- క్రింది పెదవియనెడి సూర్యునికాంతిని, అభ్యుదయింపవే = పుట్టింపవా ;

రమణి = ఇంతీ! నీ - నయన + ఉత్పలములు = నీ కన్నుఁగలువలు, పొలయన్ = వికసింపఁగా, దర - హాస - చంద్రికా - స్ఫురణ = చిఱునగవనెడి వెన్నెలయొక్క ప్రకాశము, పూరింపవే = నింపవా ?

చెలువ = ఇంతీ!, నీ - జీవంబు = నీ ప్రాణము, చేతరింపన్ = చైతన్యము కలదియగునట్లు. భాషా + అమృతమున్ = వాక్కు అనెడి అమృతమును, కర్ణ పథములన్ = చెవులత్రోవలను, చొనుపవే = ప్రవేశపెట్టవా ?

వెలఁది = ఇంతీ!, నీవు + అ = నీవే, నీకున్, వెజ్జవు + ఐ = చికిత్సకురాలవయి, అవయవములన్ = అంగములందు, వలవంత = మన్మథవ్యథ, తీఱన్ = పోవునట్లు, అవయవములన్, వలను - మెఱయక = తగినట్లు ప్రకాశింపఁ జేయక, తలిరుబోఁడి = చిగురువంటిమేనుగలదానా ! పార్వతీ, వలరాజు - చలము = మన్మథుని పంతము, ఏల = ఎందులకు, సాధ్యమ్ము - చేసెదవు + అమ్మ = నెఱవేఱునట్లుచేసెదవు ?

తాత్పర్యము ; పార్వతీ ! లేఁతదైన నీ దేహలత ఒప్పునట్లు మృదువుగా నిట్టూర్పుల చల్లగాలిని ప్రసరింపఁజేయవా ? నీ ముఖపద్మము వికసించునట్లు క్రిఁదిపెదవి యెఱ్ఱనికాంతిని బుట్టింపవా ? నీ కనుఁగల్వలు వికసించునట్లు చిఱునవ్వు వెన్నెలల స్ఫూర్తిని గలిగింపవా ? నీ ప్రాణము చైతన్యవంత మగునట్లు వాగమృతమును జెవులఁ జొనుపవా ? ఇట్లు నీకు నీవే వైద్యము చేసికొని, నీ అవయవములందలి మన్మథవ్యథ తీఱ నీ యవయవములను ప్రకాశింపఁజేయక, మన్మథుని పంతము నేల చెల్లింతువు ?

విశేషములు: ఊర్పుఁదెమ్మెరలు, మైఁదీఁగె, అధరారుణ, ఆననాంభోజము, దరహాసచంద్రిక, నయనోత్పలములు - రూపకములు.

వ. అనుచు నందఱు నొండొరులం గనుంగొని 136

అర్థతాత్పర్యములు: అనుచు నందఱును ఒకరినొకరు చూచుకొని - తరువాతి పద్యముతో నన్వయము.

చ. తలిరులు మొగ్గలున్ వికసితప్రసవంబులుఁ దెండు మీరు, శీ
తలికలుఁ బిక్కమూలములుఁ దామరతూఁడులుఁ దెండు మీరు, చెం
గలువలుఁ దోవకామలును గంజదళంబులుఁ దెండు మీర, లీ
చెలువకు శీతలక్రియలు సేయుద మింకెడ సేయ నేటికిన్? 137

అర్థము: మీరు, తలిరులు = చివురులు, మొగ్గలున్, వికసిత - ప్రసవంబులున్ = వికసించిన పువ్వులును, తెండు = తీసికొనిరండు, మీరు, శీతలికలున్ = వట్టివేరులును, పిక్క - మూలములున్ - ఒకానొక చెట్టువేరులును, తామర - తూఁడులున్ = మృణాళములును, తెండు, మీరలు - మీరు, చెంగలువలున్ (చెన్ను + కలువలున్) = ఎఱ్ఱకలువలును, తోవకామలును = కలువకాఁడలును, కంజ - దళంబులున్ = తామరపాకులును. తెండు. ఇంకన్ + ఎడ + చేయన్ = ఇంక నాలస్యము చేయ, ఏటికిన్ = ఎందులకు. ఈ - చెలువకున్ = ఈ యింతికి - పార్వతికి. శీతల - క్రియలు = శీతలోపచారములు, చేయుదము.

తాత్పర్యము: పార్వతికి శీతలోపచారములు చేయుదము. ఇంక నాలస్యము చేయుటెందులకు? మీరు చివురులును, మొగ్గలును, విరిసినపూలును దెండు, మీరు వట్టివేరులును, పిక్కచెట్టు వేరులును, తామరతూండ్లును దెండు. మీరు ఎఱ్ఱకలువలును, గలువకాఁడలును, తామరపాకులును దెండు.

వ. అని యందఱు నొండొరులకు మీఱిన ట్లనేక శిశిరోపకరణద్రవ్యం
బులు తత్క్షణంబ కొనివచ్చి తమలోన. 138

అర్థము: అని, అందఱున్ = చెలికత్తె లందఱును, ఒండొరులకున్ - మీఱిన + అట్లు = ఒకరి నొకరు మించినట్లు, అనేక - శిశిర + ఉపకరణ -

ద్రవ్యంబులు = పెక్కు శీతలోపచారవస్తువులు, తద్ + క్షణంబు + అ = ఆ క్షణముననే, కొనివచ్చి, తమలోనన్,

తాత్పర్యము : అని చెలికత్తె లందఱును ఒకరినొకరు మించునట్లు పెక్కు శీతలోపచార సాధనములను దీసికొనివచ్చి తమలో – తరువాతి పద్యముతో నన్వయము,

సీ. పువ్వులు తొడిమలు పుచ్చు ! నయంబునఁ
చివుళుల కొమలు సిదుము ; లేఁత
తూఁడుల గంటులు తుదలకు ముఱువు ! చెం
గలువల పై రేకు లొలువు; మరఁటి
మోసుల వీజనంబులు సేయు ! కొలఁది వే
ళ్లిరవుగాఁ గూర్చి చామరలు సేయు !
తొవపువ్వుకొమలతో లిమ్ముగాఁ బుచ్చు !
పిక్కమూలంబుల పెనఁగు వాపు !

ఆ. చందనంబు రాచి సన్నియఁ బెట్టు చెం
గావి మన్ను నీరఁ గలపి తేర్చు !
కప్పురంబు దూలిగాఁ జేసి వడివెట్టు
మనుడుఁ గడఁగి ప్రియవయస్య లెల్ల. 139

అర్థము ; పువ్వుల - తొడిమలు = పూలవృంతములు. పుచ్చు (ము) = త్రుంపుము. నయంబునన్ = నేర్పుతో, చివుళుల - కొమలు = చివురులకొఁడలు, చిదుము (ము) = త్రుంపుము,

లేఁత - తూఁడుల - గంటులు = లేఁదూఁడులగనుపులు (వేరులు), తుదలకున్-కొనలకు- ముఱు (ర) వు (ము) = గిల్లుము, చెంగలువల (చెన్ను + కలువల) = ఎఱ్ఱకలువలయొక్క, పై రేకులు = మీఁదిరేకులు, ఒలువుము.,

అరఁటి - మోసులన్ = అరఁటిమొవ్వులతో, వీజనంబులు = వీవనలు, చేయు (ము), కొలఁదివేళ్లు = కొలవేరులు - వట్టివేరులు, ఇరవుగాన్ = ఒప్పుగా. కూర్చి, చామరలు చేయు (ము) = వింజామరములు చేయుము.

తొవ - పువ్వు - కొమల - తోలు = కలువపూలకాఁడల - పట్ట (త్వక్కు), ఇమ్ముగాన్ = బాగుగా, పుచ్చు (క్రి.) = తొలఁగింపుము, పిక్క - మూలంబుల = పిక్కచెట్ల వేరులయొక్క, పెనఁగు = మెలి, పాపు = పోఁగొట్టుము, చందనంబు = మంచిగంధము, రాచి, సన్నియఁబెట్టు(ము) = సన్నెకంటిపై నూఱుము, చెంగావి (చెన్ను + కావి) - మన్ను = మనోజ్ఞమైన యెఱ్ఱని మన్ను, నీరన్ = నీటియందు కలపి = కలిపి. తేర్చు(ము), కప్పురంబు = కర్పూరము, దూలి + కాన్ = దుమ్ముగా, చేసి, వడివెట్టుము = మెలిపెట్టుము, అనుడున్ = అనినంతనే, ప్రియవయస్యలు = అనుఁగుఁజెలులు, ఎల్లన్ = అందఱును, కడఁగి = పూని.

తాత్పర్యము : 'పూలతొడిమలు త్రుంపుము. చివురుల కాఁడలు నేర్పుతోఁ జిదుముము. లేఁదూఁడుల వేరులు చివరలకు గిల్లుము, ఎఱ్ఱకలువల మీఁదిరేకులు ఒలువుము, అరఁటిమొవ్వులతో వీవనలు చేయుము, వట్టివేరులు ఒప్పుగాఁగూర్చి వింజామరములు చేయుము. కలువపూలకాఁడల పట్టలు బాగుగాఁ దొలఁగింపుము. పిక్కచెట్ల వేరుల మెలి పోఁగొట్టుము. మంచిగంధము సన్నెకంట నూఱుము, చెంగావిరంగు మన్ను నీటియందుఁ గలిపి తేర్చుము. కర్పూరమును దుమ్ముగాఁజేసి మెలిపెట్టుము,' అనివంతనే అనుఁగునెచ్చెలు లందఱును బూని - తరువాతి గద్యముతో నన్వయము.

విశేషములు : ముఱు (రు) వు ధాతువు నిఘంటువులఁ గనఁబడలేదు. చామర . ఆకారాంత స్త్రీలింగశబ్దము, 'చామరా చామరం వాలవ్యజనం రోమగుచ్ఛకమ్' ఇతి రభసః (అమరసుధ), తొవ - తొగ - తోవ - (రూపాం,) పుచ్చు, చిదుము, చేయుము న్నగువానిలోని మువర్ణక లోపమునకు - 'మధ్యమపురుష మువర్ణకంబునకు హలవసానంబులు పరంబులగునపుడు లోపము విభాషనగు.' బాల, సంధి. 49, కప్పురము (వికృతి) - కర్పూరము (ప్రకృతి)

వ. అవి యన్నియు నవయవంబులుగా నమర్చి శిశిరవీర్యమంత్రంబుల నభిమంత్రించి, 140

అర్థము : అవి + అన్నియున్ = తొడిమలు, చివురులు మున్నగు నా వస్తువులన్నియును. అవయవంబులు + కాన్, అమర్చి = కూర్చి. శిశిర - వీర్య - మంత్రంబులన్ = చలువచేయుటకైన మంత్రములను, అభిమంత్రించి = పఠించి - సంస్కరించి.

తా త్ప ర్య ము ; తొడిమలు- చివురులు మున్నగు నా వస్తువుల నన్నిటిని అవయవములుగాఁగూర్చి చలువచేయుటకైన మంత్రములతో సంస్కరించి _ తరువాతి పద్యముతో నన్వయము.

ఉ. చందన కర్దమంబు, ఘనసార రజః ప్రసరంబు, శీతలుల్,
గెందలిరుల్, ప్రసూనములు. గేసరముల్, కుముదోత్పలాబ్జ త
త్కంద మృణాళపత్ర ఘన ధాతు తుషార ఘనోపలాంబువుల్
నొందగు శీతలోపకరణంబుల నర్చనలిచ్చి సిద్ధికిన్. 141

అ ర్థ ము : చందన - కర్దమంబు = మంచిగందపుఁబంకము, ఘనసార - రజస్ (ః)+ ప్రసరంబు = కప్పురపుఁబొడుల సమూహము, శీతలుల్ = వట్టివేరులు, కెందలిరుల్ (కెంపు + తలిరుల్) ఎఱ్ఱనిచివురులు, ప్రసూనములు = పువ్వులు కేసరముల్ = అకరువులు, కుముదో .... లాంబువుల్: కుముద = తెల్లకలువలు, ఉత్పల = కలువలు, అబ్జ = తామరలు, తద్ = వానియొక్క, కంద = దుంపలు, మృణాల = తూండ్లు, పత్ర = ఆకులు, ఘన = గొప్పవియగు, ధాతు = గైరికాది ధాతువులు, తుషార = మంచు, ఘన + ఉపల = పెనుతాలు, అంబువుల్ = నీరులు, నొందగు (నాన్ + తగు) = అననొప్పు, శీతల + ఉపకరణంబులన్ = శీతలోపచార సాధనములచే, సిద్ధికిన్ = సత్ఫలితమునకు, అర్చనలు = పూజలు, ఇచ్చి -

తా త్ప ర్య ము : మంచిగందపుఁబంకము, కప్పురపుఁబొడులు. వట్టివేర్లు, ఎఱ్ఱని చివురులు, పూలు, అకరువులు, తెల్లకలువలు, కలువలు, పద్మములు. వాని దుంపలు, తూండ్లు, ఆకులు, గొప్ప గైరికాదిధాతువులు, మంచుపెనుతాలు, నీరు అననొప్పు శీతలోపచారసాధనములచే సత్ఫలితమునకయి పూజలుచేసి - తరువాతి గద్యముతో నన్వయము.

వి శే ష ము లు : కెందలిరులు - కెంపు + తలిరులు - సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చుమీఁదివర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు.' బాల,సంధి. 36- కె + తలిరులు, 'లుప్తశేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమం బగు.' బాల,సంధి.37 కె+ను+తలిరులు. 'ద్రుతప్రకృతికముమీఁదిపరుషములకు సరళము లగు.' బాల.సంధి,16, కె+ను + దలిరులు. 'ఆదేశసరళములకుముందున్న ద్రుతమునకు

బిందుసంశ్లేషములు విభాష నగు.'బాల,సంధి.17, కెందలిరులు. నాన్ + తగు - ద్రుతకార్యముచే నాఁదగు అనురూపమొక్కటే కావలసియుండఁగా (దీర్ఘముమీఁదసాధ్య పూర్ణములేదు). నాందగునని పూర్ణబింసహితరూపమును బ్రయోగించుట నన్నెచోడుని ప్రాచీనతకు నిదర్శన మందురు.

వ. విరహాగ్నిదాహంబునఁ దల్లడిల్లుచున్న గౌరిం గనుంగొని. 142

అర్థము ; విరహ + అగ్ని - దాహంబువన్ = వియోగమనెడి అగ్నివలని తాపముచే, తల్లడిల్లుచున్ + ఉన్న = కలవరపడుచున్న, గౌరిన్ = పార్వతిని కనుంగొని = చూచి,

తాత్పర్యము : వియోగాగ్నిచేఁ దపించుచు 'బాధపడుచున్నపార్వతిని జూచి- తరువాతి పద్యముతో నన్వయము'

విశేషములు : విరహాగ్ని – విరహమనెడి అగ్ని - రూపకము,

తే. అలిగి మరునేర్చు హరుఁడుఁ దా నట్టి సాహ
సాత్ము నొడఁగూర్చి యా యంబుజాక్షి నింత
విరహవేదనఁ బెట్టెడు విధి కడంగి
మొసలి తా దండగుండము ముంచునట్లు. 143

అర్థము : హరుఁడున్ = శివుఁడును. అలిగి = కోపించి, మరున్ = మన్మథుని, ఏర్చున్ = దహించును, తాను = విధి, అట్టి, సాహస + ఆత్మన్ = మన్మథునిఁగాల్చునంతటిసాహసవంతుని, ఒడఁగూర్చి = చేసి, ఆ + అంబుజ + అక్షిన్ = ఆ పద్మనేత్రను - పార్వతిని, విధి = దైవము, కడంగి = పూని, మొసలి, తాన్, దండ-గుండమున్ = తనకాధారమైనగుండమునే, ముంచు+అట్లు = ముంచురీతిని, ఇంత, విరహ - వేదనన్ = వియోగబాధను, పెట్టెడున్ = కూర్చును

తాత్పర్యము : శివుఁడు కోపించి మన్మథుని దహించును, విధి శివునట్టి సాహసవంతునిఁజేసి యా పార్వతి నింత వియోగవ్యథపాలుచేయును, ఇది యెటు లున్నదన్న. మొసలి తనకాధారమైన నీటిగుండమునే ముంచునటులున్నది,

విశేషములు: మన్మథుఁడు మనసిజుఁడు. మన్మథుఁ డాధేయము. మనస్సు ఆధారము, ఆధేయమైన మన్మథుఁడు తన కాధారమైన మనస్సునే ముంచును. అట్లే మొసలి ఆధేయము, గుండము ఆధారము, ఆధేయమైన మొసలి తనకాధారమైన గుండమునే ముంచునట్లు మనసిజుఁడు తనకాధారమైన మనస్సును ముంచెనని భావము, అలంకార ముత్ప్రేక్ష.

ఇందు 'మొసలి తా దండగుండము ముంచునట్లు' అనునది సరియైన పాఠము గాదనియు, అది 'ముసలి తా దండగుండము ముంచునట్లు' అని యుండదగు ననియు శ్రీ నిడదవోలు వేంకటరావుగారి యభిప్రాయము - చూడు వావిళ్లవారి ప్రతిలోని నిడదవోలువారి పీఠిక. 'ఇది వీరశైవ సంప్రదాయకమగు సమ్మరి గుండయ్యకథకు సంబంధించినది. గుండయ యను భక్తుఁడొక్కఁడు తన యింటికి వచ్చుచుండఁగా మార్గములో నొకవేశ్య మేడపైనుండి యాతనిపై నెంగిలినీళ్లను జల్లెను. అవి యొక మానిసిపై బడెనని గ్రహించి యామె క్రిందికి వచ్చి యాతనిని స్నాతునిగావించి మృష్టాన్నఁ దృప్తుని జేసి చందనతాంబూలాదికముల నొసఁగి పంపివైచెను. ఇంటికి వచ్చిన యతని విని భార్య యనుమానించి తన్ను ముట్టుకొనవలదని వారించెను. అట్లు వా రిరువురు నెనుబదేండ్లు ముదుసలు లగువఱకును గలియకయే యుండిరి. ఈశ్వరుఁడు వారిభక్తిని బరీక్షింపఁదలఁచి యొక మహేశ్వరుఁడై యొక కప్పెరను దాఁచుఁడని చెప్పియిచ్చి తానే దాని నదృశ్యముచేసెను. శివుఁడు మరల దాని నిమ్మనఁగా వా రదియెట్లుపోయి నదో తమకుఁదెలియదనిరి, శివుఁ డంగీకరింపక వారి నా దండనున్న యొక గుండమున మునిఁగి ప్రమాణము చేయుఁడనెను. వా రట్లు చేయఁగా నీశ్వరుఁడుమెచ్చి వారికి పునర్యౌవనమును బ్రసాదించెను. ఈ పద్యమున హరుఁడు మరుని సంహరించి పార్వతీదేవికి విరహతాపమును సంఘటింపుట చూడఁగా మొదలు విరహావస్థలేని ముసలి దంపతులకుఁ దిరిగి యౌవనమును గలిగించి విరహావస్థ నొందించినటు లున్నదనియు, 'దండగుండము ముంప' అని దీనిని పాల్కురికి సోమనాథుఁడు బసవపురాణము 4 వ ఆశ్వాసమునఁ దిరునీలకంఠుని కథయందు వాడెననియు, జక్కనయు విక్రమార్కచరిత్ర (5-169) లో 'చామ చన్నులతోడ సరివత్తుమని కోకములు దండగుండావ మునిఁగెనేని' అని యీ కథనే సూచించె' ననియు శ్రీ నిడదవోలు వేంకటరావుగారి వచనము.

వ. అని విధి నుల్లాపించుచు నక్కుసుమకోమలి నల్లనల్లన తడమికొని వచ్చి. 144

అర్థము : అని, విధిన్ = బ్రహ్మను, ఉల్లాపించుచున్ = దూషించుచు, ఆ + కుసుమ - కోమలిన్ = పూవువలెమనోజ్ఞురాలైనఆమెను అల్లనల్లన - మెల్ల మెల్లఁగా, తడమికొనివచ్చి = నిమురుచువచ్చి.

తాత్పర్యము : అని దైవమును దూషించుచు, నా పార్వతిని మెల్లమెల్లఁగా నిమురుచు వచ్చి - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. హిమధామ ధాతు మిశ్రము లగు శశికాంత
జలములు వాసించి జలకమార్చి,
శీతాద్రి కందర ధాతురంజిత మగు
గైరికాంబరములు గట్టనిచ్చి,
ఘనసార పాంసు సంగత మగు నామోద
మలయజ పంకంబు గలయ నలఁది,
కోమల బిసతంతుగుణరోపితము లగు
నమల కర్పూరహారములు వెట్టి,

తే. సహజశైత్యాభినవపుష్పసమితిఁ దుఱిమి
తరుణ పల్లవ కర్ణావతంసకంబు
లిడి విదాహంబు వాపి మే యెలమి నవక
మెసఁగఁజేసిరి తనుపారు పసదనములు. 145

అర్థము : హిమధామ - ధాతు - మిశ్రములు = చంద్రుఁడనెడు ధాతువుతోఁ గలసినవి, అగు, శశికాంతజలములు = చంద్రకాంతశిలలనీరులు, వాసించి = పరిమళింపఁజేసి, జలకము + ఆర్చి = స్నానముచేయించి,

శీత + అద్రి - కందర - ధాతు - రంజితము = మంచుకొండగుహలందలి గైరికాదిధాతువులచే, నెఱ్ఱనైనది అగు, గైరిక + అంబరములు = జేగుఱు వస్త్రములు, కట్టన్ + ఇచ్చి = తాల్పఁజేసి,

ఘనసార - పాంసు - సంగతము = కప్పురపుఁబొడితోఁగూడినది, అగు, ఆమోద - మలయజ - పంకంబు=పరిమళవంతమైన చందనకర్దమమును, కలయన్ + అలఁది = అంతటను బూసి,

కోమల - బిస - తంతు - గుణ - రోపితములు = మృదువులైన తూఁటి దారములచే గ్రుచ్చఁబడినవి, అగు, అమల - కర్పూర - హారములు - నిర్మలము లైన కప్పురపుదండలు, పెట్టి,

సహజ - శైత్య + అభినవ-పుష్ప-సమితిన్=స్వభావసిద్ధమైన చల్లఁదనముగల క్రొత్తపూలసమూహమును, తుఱిమి = చెరివి, తరుణ - పల్లవ - కర్ణ + అవతంస కంబులు=లేఁజివురుల కర్ణాభరణములు, ఇడి = పెట్టి, విదాహంబు = విశేషమైన తాపము, పాపి = పోఁగొట్టి, తనుపారు = (తనుపు + ఆరు) = చల్లనైన, పసదనములన్ = అలంకారములచే, మే + ఎలమి - నవకము = శరీరపువికాస మును, మృదుత్వమును, ఎసఁగన్ + చేసిరి = అతిశయింపఁజేసిరి,

తాత్పర్యము : చంద్రధాతుమిశ్రములగు చలుపఁజాతినీరులు పరిమళవంత ములుచేసి స్నానమాడించి, హిమవత్పర్వతగుహలందలి గైరికాదిధాతువులచే నెఱనైన జేగుఱువస్త్రములను దాల్పఁజేసి. కప్పురపుఁబొడితోఁగూడిన పరిమళచందనపంకము నంతటను బూసి, మృదువులైన తూఁటిదారములచే గ్రుచ్చఁబడిన నిర్మలములైన కప్పు రపుదండలు పెట్టి, ప్రకృతిసిద్ధమైన చల్లఁదనముగల క్రొంబూలను జెరివి, లేఁజివురుల కర్ణాభరణములను బెట్టి ఆమె విశేషతాపమును బోఁగొట్టి, చల్లని అలంకారములచే దేహ మృదుత్వము నతిశయింపఁజేసిరి.

విశేషములు : అర్చి-అడుధాతువు, 'చుగాగమం బాచ్ఛికంబున కసంయుక్త నలడరాంతంబునకుం బ్రేరణంబున బహుళంబుగా నగు' బాల,క్రియ,73.అడు + చు, 'ఆ డోడు కూడుల దకారంబునకుం జుక్కు పరంబగునపుడు రేఫంబగు.'బాల.క్రియ.80. ఆ రుచు. 'అచ్ఛికంబులం బదమధ్యంబుల న ల డ ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు,'బాల,ప్రకీర్ణ.17. అర్చు. 'సమానాశ్రయంబులం బూర్వకాలం బునం దివర్ణకం బగు.'బాల. క్రియ.38. అర్చు + ఇ, 'అంద్వవగాగమంబులందప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు.' బాల,సంధి.11. అర్చి,

వ. తదనంతరంబ. 146

అర్థతాత్పర్యములు : తద్ + అనంతరంబు + అ = ఆ తరువాతనే, తరువాతి పద్యముతో నన్వయము,

చ. మరుఁ బ్రణుతించి, మందపవమానుఁ దలంచి, వసంతుఁ గొల్చి చం
దురునకు మ్రొక్కి, చూతనవతోయజసంహతిఁ దెల్చి, శారికా
పరభృత చంచరీక శుక బర్హిణ పంక్తికిఁ దృప్తిచేసి సు
స్థిర విరహాధిదేవతలఁ జిత్తమునం గొనియాడి భక్తితోన్. 147

అర్థము : మరున్ = మన్మథుని, ప్రణుతించి = మిక్కిలిపొగడి, మంద-పవమానున్ = మెల్లని వాయువును, తలంచి = స్మరించి, వసంతున్ = వసంతుని, కొల్చి, = సేవించి, చందురునకున్ = చంద్రునకు, మ్రొక్కి, చూత - నవ-తోయజ - సంహతిన్ = మామిడులయు, నూతనపద్మములయు సమూహమును, తెల్చి = స్తుతించి,. శారికా - పరభృత - చంచరీక - శుక - బర్హిణ - పంక్తికిన్ = గోరువంకలయు, కోకిలములయు, తుమ్మెదలయు, చిలుకలయు, నెమళులయు వరుసకు, తృప్తి - చేసి = తనుపుచేసి, సుస్థిర - విరహ - అధిదేవతలన్ = శాశ్వతులైన వియోగాధిష్ఠానదైవములను, చిత్తమునన్ = మనస్సునందు, భక్తితోన్, కొనియాడి = ప్రశంసించి.

తాత్పర్యము : మన్మథుని గొనియాడి, మలయవాయువును స్మరించి, వసంతుని సేవించి, చంద్రునకు మ్రొక్కి, మామిడుల క్రొందామరల సమూహమును స్తుతించి, గోరువంకలయు, కోకిలములయు, తుమ్మెదలయు, చిలుకలయు, నెమళులయు సమూహమును దనిపి సుస్థిరులైన వియోగాధిష్ఠానదైవతములను మనమున భక్తితోఁ బ్రశంసించి - తరువాతి పద్యముతో నన్వయము,

సీ. ఎలమావిజొంపముల్ బలసిన నెత్తమ్మి
కొలనిలోపలి దూబ నెలమిఁ బొదలి,
పెనఁగప్పి యొప్పిన యనఁటులలోపలి
చందన కర్పూర సహితవారి

ఝోరనఁ దొరఁగెడు ధారాగృహంబులో
విలసిల్లు శశికాంతవేదిమీఁదఁ
దనుపారు పువ్వులఁ దలిరుల నెడఁగొల్పి
పాటించి తీర్చిన పాన్పుమీఁద

ఆ. శైలతనయ నునిచి సఖు లోలిఁ దేలిన
ధాతుజలము లొడలఁ దడిపి తడిపి
కమల నవ దళములఁ గదళీదళమ్ముల
వీజనములు చేసి వీచి వీచి. 148

అర్థము : ఎలమావి - జొంపములన్ = లేఁతమామిడిగుబురులు, బలసిన = చుట్టియున్న, నెత్తమ్మి కొలనిలోపలి = తామరలసరస్సులోనున్న దూబన్ = దిబ్బ మీఁద, ఎలమిన్ = సంతోషముతో, పొదలి = ఒప్పి,

పెనఁగప్పి = దట్టమై, ఒప్పిన, అనఁటులలోపలి = అరఁటిచెట్లలోనున్న, చందన - కర్పూర - సహిత - వారి = మంచిగంధము, కప్పురము అనువానితోఁగూడిన నీరు,

ఝోరనన్ + తొరఁగెడు = శీఘ్రముగాఁ బ్రవహించు, ధారా - గృహంబులోన్ = జలయంత్రగృహములో, విలసిల్లు = ఒప్పు, శశికాంత - వేదిమీఁదన్ = చంద్రకాంతపుటరఁగుపైని, తనుపారు (తనుపు + ఆరు) = చల్లనగు, పువ్వులన్ = పువ్వులను, తలిరులన్ = చివురులను, ఎడఁగొల్పి = పఱచి, పాటించి = చక్కఁ బఱచి, తీర్చిన = సవరించిన, పాన్పుమీఁదన్ = శయ్యపై,

శైల - తనయన్ = కొండకూఁతును - పార్వతిని, ఉనిచి = ఉంచి, సఖులు = చెలికత్తెలు, ఓలిన్ = క్రమముగా, తేలిన, ధాతు ....జలములు = గైరికాది ధాతువులతోఁ గూడిననీరు, ఒడలన్ = శరీరమునందు, తడిపి తడిపి = మిక్కిలి తడిపి. కమల - నవ - దళములన్ = తామరల క్రొత్తతేకులతోను, కదళీ దళమ్ములన్ = అరఁటియాకులతోను, వీజనములు = వీవనలు, చేసి, వీచి - వీచి = మిక్కిలి విసరి,

తాత్పర్యము : లేఁతమామిడి గుబురులు చుట్టియున్న పద్మాకరములోని దిబ్బమీఁద దట్టమై యొప్పిన అరఁటిచెట్లలో నున్న చందన కర్పూరసహితజలము ప్రవహించు ధారాగృహములో నొప్పుచంద్రకాంత శిలావేదికపైఁ జల్లనిపువ్వులను, చివురులను బఱచి సరిచేసినపాన్పుపైఁ బార్వతినుంచి చెలికత్తెలు గైరికాదిధాతువులతో శరీరమును దడిపితడిపి తామరతేకులతోను అరఁటి యాకులతోను వీవనలచేసి మిక్కిలి విసరి - తరువాతి పద్యముతో నన్వయము.

క. కొలవేళులు నెలఁదూఁడులుఁ
దలిరులు నీహారవారిఁ దడిపి నయమునన్
గులిరుగొన మేన నొత్తిరి
లలనలు పార్వతికి శీతలక్రియ వెలయన్. 149

అర్థము ; లలనలు = స్త్రీలు - చెలికత్తెలు, కొలవేళులన్ = (కొలఁది వేళులన్) వట్టివేరులును, ఎలఁదూఁడులున్ = లేఁదూండ్లును, తలిరులన్ = చివురులును, నీహార - వారిన్ = మంచునీట. తడిపి, నయమునన్ = నేర్పుతో, పార్వతికిన్, శీతల - క్రియ = శీతలోపచారము, వెలయన్ = ఒప్పునట్లు, కులిరు + కొనన్ = చల్లనగునట్లు, మేనన్ = శరీరమున, ఒత్తిరి = అదిమిరి.

తాత్పర్యము : చెలికత్తెలు పార్వతికి శీతలోపచారము ఒప్పునట్లు వట్టివేరులను, లేఁదూండ్లను, చివురులను మంచునీటఁ దడిపి నేర్పుతోఁ జల్లనగునట్లు శరీరమున నదిమిరి.

వ. అంత నొక్కించుక యుల్లంబు చల్లనై గిరిజ కన్నులుమూసినం
గని సతు లొండొరువులం బదరికొని కెలంకుల కోసరించి రయ్యవస
రంబున. 150

అర్థము : అంతన్, ఒక్కించుక (ఒక్క + ఇంచుక) = ఒకకొంచెము. ఉల్లంబు = మనస్సు, చల్లన + ఐ, గిరిజ = పార్వతి, కన్నులు, మూసినన్ = మూయఁగా. కని = చూచి. సతులు = స్త్రీలు - చెలికత్తెలు, ఒండొరువులన్ = ఒకరి నొకరు, పదరికొని = తొందరపెట్టి, కెలంకులకున్ = ప్రక్కలకు, ఓసరించిరి = తొలఁగిరి, అయ్యవసరంబునన్ = (ఆ + అవసరంబునన్) ఆ సమయమునందు.

తాత్పర్యము: అంత నించుక మనసు చల్లఁబడి పార్వతి కన్నులు మూయఁగాఁ జూచి చెలికత్తె లొకరినొకరు తొందరపెట్టి పార్శ్వములకుఁ దొలఁగిరి. ఆ సమయమున - తరువాతి పద్యముతో నన్వయము.

చ. ఉదరెడు మోవి; ముత్పులకలొత్తెడు; నూరులుఁ గేలుఁ జన్నులుం
గదలెడు, మేన. బెంజెమట గ్రమ్మెడు: నూర్పులు నీగ్గెడున్; ముదం
బొదవఁ బ్రియుం గలం గవయుచున్నది; యిత్తఱి నేల నిద్ర దె
ల్పెద?' రని యంతరంగగతి భేదము దెల్పె విదగ్ధ ముగ్ధలన్. 151

అర్థము ; మోవి = పెదవి, ఉదరెడున్ = అదరును, ముద్ + పులకలు = ఆనందమువలనిగగుర్లు. ఒత్తెడున్ = హెచ్చును, ఊరులున్ = తొడలును, కేలున్ = చేతులును, చన్నులున్, కదలెడున్ = చలించును, మేనన్ = శరీరమునందు, పెంజెమట (పెను + చెమట) = ఎక్కువ చెమట, క్రమ్మెడున్ = వ్యాపించును, ఊర్పులున్ = శ్వాసములును, నీగ్గెడున్ = తగ్గును, ముదంబు = సంతోషము, ఒదవన్ = కలుగఁగా, ప్రియున్, కలన్ = కలయందు, కవయుచున్ + ఉన్నది = కూడుచున్నది, ఇత్తఱిన్ (ఈ+తఱిన్)=ఈ సమయమున. ఏల- నిద్ర - తెల్పెదరు = నిద్రలేపెదరేల?, అని, విదగ్ధ = నేర్పరియైన చెలి, ముగ్ధలన్ = ముద్దరాండ్రకు, అంతరంగ - గతి - భేదము = మనస్సుయొక్క గమనముయొక్క, మార్పు తెల్పెన్.

తాత్పర్యము: 'పెదవి యదరుచున్నది. ఆనందమువలన గగుర్పాటు హెచ్చెడును. తొడలును, చేతులును, స్తనములును చలించుచున్నవి. శరీరమునఁ జెమట యెక్కువయ్యెను. శ్వాసములు తగ్గెను. సంతోషము గలుగునట్టు కలలోఁ బ్రియుని గూడుచున్నది. ఈమెనేల నిద్రలేపెదరు?' అని యొక నేర్పరియైనచెలి ముద్దరాండ్రయిన చెలికత్తెలకు ఆమె మనోగతి పరిణామము తెలిపెను.

వ. అంత నగజ గల నిక్కవంబ కా భావించి బెదరి లేచి పతిం
గానక. 152

అర్థము: అంతన్, నగజ (అగజ) = పార్వతి, కల = స్వప్నము, నిక్కవంబు + అ = నిజమే, కాన్ = అగుట, భావించి = తలఁచి, బెదరి = భయపడి, లేచి, పతిన్ = ప్రియుని, కానక,

తాత్పర్యము : అంతఁ బార్వతి కల నిజమేయని భావించి బెదరి లేచి ప్రియునిఁ గానక - తరువాతి పద్యముతో నన్వయము.

ఉ. ఉమ్మలికమ్మునన్ సొలసి యుస్సని మెల్లన వ్రాలుఁ బాన్పుపైఁ,
గ్రమ్మన లేచి నిల్చి పతిఁ గానక విభ్రమ మంది చిత్తతా
పమ్మున నేలమీఁదఁబడి ప్రాణము నిల్పక తల్లడంబునన్
సొమ్మలువోవుఁ దన్ సఖులు చూచి భయంపడఁ గామవేదనన్. 153

అర్థము : (పార్వతి కర్తృపదము) తన్ = తను - తన్ను, సఖులు = చెలికత్తెలు, చూచి, భయంపడన్ = భయపడఁగా, కామ - వేదనన్ = మన్మథ బాధతో. ఉమ్మలికమ్మునన్ = దుఃఖముతో, సొలసి = పరవశయై, ఉస్సు + అని = ఉస్సురని, పాన్పుపైన్ = శయ్యమీఁద, మెల్లనన్, వ్రాలున్ = ఒఱగును, క్రమ్మనన్ = శీఘ్రముగా, లేచి, నిల్చి, పతిన్ = ప్రియుని, కానక = చూడక, విభ్రమము + అంది = తొట్రుపాటుచెంది, చిత్త - తాపమ్మునన్ = మనస్తాపముచే, నేలమీఁదన్ + పడి, ప్రాణము - నిల్పక, తల్లడంబునన్ = కలవరముతో, సొమ్మలు + పోవున్ = మూర్ఛిల్లును.

తాత్పర్యము : పార్వతి తన్నుఁ జెలికత్తెలు చూచి భయపడఁగా మన్మథ తాపముతో దుఃఖపరవశయై ఉస్సురని పానుపుపై మెల్లఁగా నొఱగును. వెంటనే లేచి ప్రియునిఁగానక తొట్రుపాటుచెంది మనస్తాపముచే నేలపైఁబడి ప్రాణముండఁబట్టలేక కలవరముతో మూర్ఛిల్లును.

విశేషములు : ఇందు అనంగదశలలో మూర్ఛ యను దశ వర్ణింపఁబడినది. అనంగదశలు పది. అవి -

దృఙ్మనస్సఙ్గ సఙ్కల్పా జాగరః కృశతాఽరతిః,
హ్రీత్యాగోన్మాద మూర్ఛాన్తా ఇ త్యనఙ్గదశా దశ.

తన్ - తన్ను - 'అకారంబు క్రింది అకారంబునకుం దుది ను లు ల క్రింది న ల లకు లోపంబు బహుళంబుగా నగు.' 'బాల. ప్రకీర్ణక, 7. తను. 'పదాంతంబులయి యుపంయుక్తంబులయిన ను లు రు ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బాల. ప్రకీర్ణక, 16. తన్.

వ. తదవసరంబున సఖీజనంబులు తల్లడిల్లె. 154

అర్థము : తద్ + అవసరంబునన్=ఆ సమయమున, సఖీ - జనంబులు = చెలికత్తెల సమూహములు, తల్లడిల్లె = కలఁతఁజెంది.

తాత్పర్యము : ఆ సమయమునఁ జెలికత్తెలు కలఁతఁజెంది - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. పరితాపవేదనాపరవశంబునఁ దూలి
నెలసిన చిత్తంబు నెలవుకొనఁగ,
నుమ్మలికమ్మున వెమ్మ నంగజవహ్ని
దురపిల్లునుల్లంబు మరులుకొనఁగ,
వలవంత వరువట్టు వట్టిన నాలుక
తల ముద్దుమాటలు మెలఁగియాడ,
నలరమ్ము నెఅనూర నాడిన వెస సొమ్మ
సిల్లిన జీవి సంజీవి కాఁగఁ,

ఆ. గోర్కి కోర్కి వీనిఁ గొలగొనఁ దనుఁగూడ
వగచుచున్న వగలు వగలఁగూడఁ
బరముఁ డెన్నఁడొక్కొ ప్రత్యక్షమై తన
రూపు శైలసుతకుఁ జూపు నెలమి. 155

అర్థము : పరితాప - వేదనా - పరవశంబునన్ = మన్మథతాపమువలని బాధచేనైన పారవశ్యముచేత, తూలి = చలించి, నెలసిన = ఉన్న. చిత్తంబు = మనస్సు. నెలవుకొనఁగన్ = స్థిరపడఁగను,

ఉమ్మలికమ్మునన్ = దుఃఖముచే, వెమ్మ = తప్తమగు, అంగజ - వహ్నిన్=మన్మథాగ్నిచే, దురపిల్లు=దుఃఖించు, ఉల్లంబు=మనస్సు, మరులుకొనఁగన్ = వలపుచెందఁగను.

వలవంతన్ = మన్మథవ్యథచే, పరువట్టు + పట్టిన = దప్పిగొన్న, నాలుక - తలన్ - నాలుకకొనపై, ముద్దుమాటలు = ముద్దులు గులుకుమాటలు, మలఁగి + ఆడన్ = వర్తిల్లి పలుకఁగను,

అలరమ్ము (అలరు+అమ్ము) =పూవుటమ్ము, నెఱను+ఊరన్+ఆడినన్= మర్మ స్థానమున నాటఁగా, వెసన్ = శీఘ్రముగా, సొమ్మసిల్లిన - జీవి = మూర్ఛ పోయిన ప్రాణి, సంజీవికాఁగన్ = బ్రదుకఁగను,

కోర్కి-కోర్కి = నీ ప్రతివాంఛయు, వీనిన్, చిత్తము = ఉల్లము, నాలుక, జీవి అనువానిని, కొలగొనన్ = కొల్లగొనఁగా, తనున్ = తన్ను - శివుని, కూడన్ = కూడుటకు, వగచుచున్ + ఉన్న = చింతించుచున్న, వగలు = చింతలు-దుఃఖములు, వగలన్ + కూడన్ = దుఃఖములను బొందఁగా, శివుఁడు ప్రత్యక్షమైనచో నిందనుక నాతనిని జూడ నామె పడువగలకే వగలుగలుగునని భావము, పరముఁడు = శివుఁడు (ఉత్కృష్టుఁడు), ఎన్నఁడు + ఒక్కొ = ఎప్పుడోకదా!, ప్రత్యక్షము + ఐ = ఎదుటఁదోఁచినవాఁడయి, తన - రూపున్ = తన ఆకారమును. శైల - సుతకున్ = కొండ కూఁతునకు - పార్వతికి, ఎలమిన్ = సంతోషముతో, చూపున్.

తాత్పర్యము : పరితాపవేదనవలని పారవశ్యముచేఁ జలించిన చిత్తము కుదుటఁబడఁగను, దుఃఖముచే రాఁజుకొను మన్మథాగ్నిచే దుఃఖించు మనస్సు వలపుఁ జెందఁగను, మన్మథవ్యథచేఁ బిడుచఁబాఱిపోయిననాలుక ముద్దులుగులుకుమాటలు పలుకఁగను, పూవుటమ్ము మర్మస్థానముల నాటఁగా మూర్ఛిల్లినప్రాణి ప్రాణవంతము కాఁగను, ప్రతివాంఛయు నా చిత్తాదులను గొల్లఁగొనఁగా నతనిని గూడుట కింతవఱకు నగచువగలకు వగపేర్పడఁగను, పరమశివుఁడు పార్వతి కెప్పుడు ప్రత్యక్షమై తన రూపమును సంతసముతోఁ జూపునోకదా!

విశేషములు : వేదనాపరవశంబున - వేదనాపారవశ్యమున నని యుండ వలయును, వెమ్మ + అంగజ - 'ఉదంతమగు తద్ధర్మార్థవిశేషణమున కచ్చు పర మగునపుడు నుగాగమంబగు'. బాల. సంధి. 33. వెమ్మనంగజ.

వ. అనుచు నత్తరుణి నెత్తి మెత్తన శిశిరతల్పంబువం బెట్టిన. 156

అ ర్థ ము : అనుచున్. ఆ + తరుణిన్ = ఆ యువతిని. ఎత్తి = లేవనెత్తి. మెత్తనన్ = మెల్లఁగా. శిశిర - తల్పంబునన్ = చల్లని పాన్పుపై. పెట్టినన్ = పెట్టఁగా.

తా త్ప ర్య ము : అనుచు నా యువతియగు పార్వతిని లేవనెత్తి మెల్లఁగాఁ జల్లని పాన్పుపైఁ బరుండఁబెట్టఁగా - తరువాతి పద్యముతో నన్వయము.

క. ఎలఁదూఁడులు గోలలు, విరు
అలుగులు, నవధాతుజలము లరుణాంబువులై,
పొలిచె సతి మారు నలర
మ్మ్ముల పాన్పున నున్నకరణి మూర్ఛాగతయై. 157

అ ర్థ ము : ఎల - తూఁడులు = లేఁ దూఁడులు. కోలలున్ = బాణములును, విరులు = పూలు, అలుగులున్ = బాణాగ్రములును, నవ - ధాతు - జలములు = క్రొత్తవియగు గైరికాదిధాతువుల జలములు. అరుణ + అంబువులు + ఐ = రక్తములు, అయి, సతి = స్త్రీ - పార్వతి. మూర్ఛాగత + ఐ = మూర్ఛ పొందినదయి, మారు + అలరు + అమ్ములు - పాన్పునన్ = మన్మథుని పూవు టమ్ముల పెజ్జమీఁద, ఉన్న - కరణిన్ = ఉన్నవిధమున. పొలిచెన్ = ఒప్పెను.

తా త్ప ర్య ము: : లేఁదూఁడులు బాణములును, పూలు బాణాగ్రములును గైరికాదిధాతు మిశ్రజలములు రక్తములును అయి, పార్వతి మూర్ఛిల్లి మన్మథుని పూవుటంపసెజ్జపై నున్న విధమున నొప్పెను.

వి శే ష ము లు : రూపకానుప్రాణితమైన ఉత్ప్రేక్ష. మారు నలరు - మారు + అలరు. 'షష్ఠీసమాసమునం దుకార ఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమం బగు.' బాల. సంధి. 34. మారునలరు. అలరమ్ము - అలరు + అమ్ము. 'కర్మధారయంబునందుఁ బేర్వాది శబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాషనగు.' బాల. సంధి. 29. ఇందు టుగాగమవ రాక, ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధి యగు,' బాల. సంధి. 1. చే అలరమ్ము సిద్ధించినది.

వ. అంత. 158

క. రే తల డెందము తల సం
ప్రీతిగ హిమవారిధార పెట్టుచు మలయో
ద్ధూతరజం బఱకాళులఁ
జేతుల నొరయుదురు సొమ్మసిల్లిన చోటన్. 159

అర్థము : రే - తల = రాత్రిప్రారంభమున. సొమ్మసిల్లినచోటన్ = మూర్ఛ పోయినప్పుడు. డెందముతలన్ = రొమ్మునందు, సంప్రీతిగన్ = మిక్కిలి యిష్టముతో, హిమ-వారి-ధార = మంచునీటిధార - పన్నీటిధార, పెట్టుచున్, మలయ + ఉద్ధూత - రజంబు = మలయపర్వతమునుండి యెగురఁ గొట్టఁబడిన ధూళిఁ(ఉద్ధూత కాక ఉద్భూత అయియుండును.) మలయపర్వతమునుండి పుట్టిన చందనధూళి - అఱకాళులన్ = అఱకాళ్లయందును, చేతులన్ = చేతులందును, ఒరయుదురు = రాచెదరు.

తాత్పర్యము : పార్వతి మూర్ఛిల్లినప్పుడు (సఖులు) రాత్రిప్రారంభమున రొమ్మునందు మంచినీటిధార పెట్టుచు, నఱకాళ్లను, జేతులను మలయజరజము రాచెదరు.

వ. ఇట్లందఱు నక్కెత్తికొనక చేయు శిశిరోపచారం బగజ కుష్ణోప చారంబులైనం దన సఖులం బదరుచుఁ దనువాసపడి దిశలు గలయం గనుంగొని యెందు నుపాశ్రయంబు గానక కలవరించుచు. 160

అర్థము : ఇట్లు, అందఱున్ = చెలికత్తెలెల్లరును, నక్కు + ఎత్తి కొనక = విసుపుచెందక, చేయు, శిశిర + ఉపచారంబు = శీతలక్రియ, అగజకున్ = పార్వతికి, ఉష్ణ + ఉపచారంబులు = వేఁడిచేయు క్రియలు, ఐనన్ = కాఁగా, తన-సఖులన్ = తనచెలులను, పదరుచున్ = కోపించుచు, తనువు + ఆసపడి = బ్రదుకాశించి, దిశలు = దిక్కులు, కలయన్ + కనుంగొని = అంతటను జూచి, ఎందున్ = ఎచ్చటను, ఉపాశ్రయంబు = ఆధారము, కానక, కలవరించుచున్ = మైమఱచి పలుకుచు - (కళవళించుచు ?)

తాత్పర్యము : ఇట్లు చెలికత్తె లెల్లరును విసుపుచెందక చేయు శీతలోపచారములు పార్వతి కుష్ణోపచారములుకాఁగా నామె చెలులను గోపించుచు బ్రదుకాశపడి

దిక్కులెల్లఁ జూచి, యెచ్చటను ఆశ్రయము కానక, ప్రేమఁ బిలుచుచు - తరువాతి పద్యముతో నన్వయము.

క. మలయానిలునకుఁ గదలీ
దళముల వీచిరొకో వేఁకి దనుకఁగ ? నా మై
నలఁదెదు మలయజకర్దమ
మలఁదిరొకో యుడుకులేవ నమృతాంశుపయిన్, 161

అర్థము: మలయ + అనిలునకున్ = మలయపర్వతమునుండి వీచు వాయువునకు - దక్షిణపుగాలికి, వేఁకి = వెచ్చన, తనుకఁగన్ = కలుగఁగా, కదలీ - దళములన్ = అరఁటియాకులతో, వీచిరి + ఒకో = వీచిరాయేమి ? నా - మైన్ + అలఁదెదు - మలయజ - కర్దమము = నా శరీరమునఁ బూయుచందనపంకము, అమృత + అంశు - పయిన్ = అమృతకిరణుని (చంద్రుని) పై, ఉడుకు = వేఁడిమి, లేవన్ = లేచునట్లు - పుట్టునట్లు, అలఁదిరి + ఒకో = పూసిరాయేమి ?

తాత్పర్యము: దక్షిణపుగాలికి ఇంకను వేఁడిపుట్టునట్లు అరఁటియాకులతో విసరిరా యేమి ? నా శరీరమునఁ బూయు మంచిగంధమును జంద్రునిపై నింకను వేఁడిపుట్టి తాపకరుఁడగునట్లు పూసిరా యేమి ?

విశేషములు: మలయానిలము సామాన్యులకుఁ జల్లఁదనము గలిగించినను విరహులకుమాత్రము తాపకరమగును. అట్లే అరఁటియాకులతో వీచుటయు సామాన్యులకుఁ జల్లన గలిగించినను, విరహులకుమాత్రము తాపకారకమగును, 'నాకు మొదలే తాపకరమగు మలయానిలమును తాపకారకమగు అరఁటియాకువీవనలచే వీచి మఱింత తాపకరముగ నెవరైనఁ జేసిరాయేమి ? అట్లే విరహులకుఁ దాపకరుఁడగు చంద్రునిపై - మఱింతతాపకరుఁ డగునట్లు, తాపకారణమగు చందనపంకము నెవరైనఁ బూసిరా యేమి ? అనుట. లేనిచో మలయానిలుఁడును, చంద్రుఁడును ఇప్పు డింత దుస్సహతరులగుటకుఁ గారణమేమి యనుట.

లేవన్ - లేచు ధాతు తుమంతరూపము. మలయానిల చంద్రులు మఱింత తాపకరులగుటకుఁ గదళీదళవీజన చందనచర్చలు క్రమముగాఁ గారణములు గాకున్నను గారణములుగా నూహించుటచే హేతూత్ప్రేక్ష. అనంగదశలు పదింటిలో నిది ఉన్మాద మనెడి దశ, కలవరించుచు - ఇది కళవళించుటయే, కళవళించుట ఉన్మాదలక్షణమే.

సీ. చివురెల్లఁ గసినొత్తి తొవరాకు గుత్తుక
దెక్కొని కోయిల వెక్కుచుండఁ,
బూవెల్ల విడిగొల్పి పుప్పొడి ముక్కున
కగ్గలమై యలుల్ దగ్గుచుండఁ,
దని పండ్లరసమెల్లఁ ద్రావి రసాధిక
మై చిల్క లెల్లఁ గ ట్టజిమికొనఁగ,
మలయానిలం బేచి మ్రానెల్ల నుగ్గు గా
వించి లా వఱి వీఁపు విఱిగి కూల,

తే. వలవదే దైవమా యిట్లు వనముఁ దాఁ
జోరి తమలోన సరిపోకపోయెనేని
బలము సాధనములుఁ జెడి చలము నెడక
కాముఁ డెక్కటి వచ్చి న న్నేమి సేయు ? 162

అర్థము : చివురు + ఎల్లన్ = వనములోని చివురంతయు. కసిన్ + ఒత్తి = కక్షతో (కోపముతో) నాక్రమించి. తొవరాకు (తొవరు + ఆకు) = ఎఱ్ఱని యాకు - చిగురాకు. కుత్తుక = గొంతు. దెక్కొని = దెక్కపట్టి. కోయిల, వెక్కుచున్ + ఉండన్ = వెక్కిళ్లు ఏర్పడుచుండఁగా - వలవదే ? అను సమాపక క్రియతో నన్వయము.

పూవు + ఎల్లన్ = వనముననున్న పూవులంతయును, విడిగొల్పి = విడునట్లుచేసి, పుప్పొడి, ముక్కునన్, అగ్గలము + ఐ = అధిక మయి. అలుల్ = తుమ్మెదలు, దగ్గుచున్ + ఉండన్ = దగ్గుచుండఁగా - వలవదే ?

తని - పండ్ల - రసము + ఎల్లన్ = పరిపక్వములైన పండ్లరస మంతయును, త్రావి = త్రాగి, రస + అధికము + ఐ = రసము ఎక్కువయై, చిల్కలు + ఎల్లన్ = చిలుకలన్నియు, కట్టజిమికొనఁగన్ (కడు + అజిమికొనన్) = మిక్కిలి అజిమిరోగము (అజీర్ణరోగము) గలదియగుచుండఁగా - వలవదే ?

మలయ + అనిలంబు = మలయ వాయువు, ఏచి = విజృంభించి, మ్రాను + ఎల్లన్ = చెట్టంతయును-వనములోనిచెట్లన్నియు, నుగ్గు + కావించి = ముక్కలుచేసి - పొడిచేసి, లావఱి = లావు + అఱి = బలముపోయి, వీఁపువిఱిగి = నడుము విఱిగిపోయి. కూలన్ - వలవదే = వలదా ? - ఈ పయిని జెప్పినవన్నియును జరగిన బాగుగా నుండునని విరహిణియగు పార్వతి ఆకాంక్ష.-ఏలయన ?

దైవమా = భగవంతుఁడా!. ఇట్లు, వనమున్ = అడవియును, తారున్ = తామును - కోకిలాదులును, పోరి, తమలోనన్ = తమలోఁదమకు, సరిపోక పోయెన్ + ఏని = సరిపడకుండునెడల, కాముఁడు = మన్మథుఁడు, బలమున్, సాధనములున్, చెడి = నశించి, చలము = పంతము, చెడక, ఎక్కటిన్ = ఒంటరిగా, వచ్చి, నన్నున్ ఏమి + చేయున్ = ఏమియుఁజేయఁజాలఁ డనుట.

తాత్పర్యము ; వనములోని చివురంతయుఁ గోపముతో నాక్రమించి, ఎఱ్ఱనియాకు గొంతున కడ్డుపడి డెక్కపడి కోకిల వెక్కిళ్లు విడుచుచో బాగుగానుండును. ఉన్నపూవంతయు విడునట్లుచేసి పుప్పొడి ముక్కున కధికమై తుమ్మెదలు దగ్గుచున్నచో బాగుగానుండును. పరిపక్వఫలముల రసమంతయుఁ ద్రావి రస మెక్కువయై చిలుక లన్నియు మిక్కిలి అజీర్ణరోగగ్రస్తములగుచో బాగుగానుండును. మలయవాయువు విజృంభించి వనములోని చెట్టంతయుఁ బొడిచేసి దుర్బలమై నడుమువిఱిగికూలుచో బాగుగానుండును, ఇట్లు వనమును, మన్మథపరివారమగు కోకిలాదులును దమలోఁ దాము పోరి, ఒకరికొక్కరు సరిపడక వర్తిలుచో, మన్మథుఁడు బలమును, సాధనము లును గోలుపోయి, ఏకాకియై, పంతముండిమాత్రము, నన్నేమిచేయఁగలఁడు? ఏమియుఁ చేయఁజాలఁ డనుట.

విశేషములు : మన్మథుఁడు సపరివారుఁ డయినప్పుడే తనకు బాధాకరుఁడు. అతని పరివారమైనకోకిలాదులకు ఏదోవిధముగ బాధగలిగిచెడినచో, నతఁ డేకాకియై, త న్నేమియుఁజేయఁజాలఁ డనుట. ఇది యంతయు విరహిణియగు పార్వతి స్వాను కూలకాంక్ష. చివురు. పూవు, రసము, మ్రాను - అనునవి జాత్యేకవచనములు.

ఉ. కంతుఁ డనంగుఁ, డమ్ము లనఁగా విరు, లింమఁడు తా సుధాంగుఁడ
త్యంతహిమంబు చంద్రి కనయం బిపు డా లయమూర్తి కల్కమై
నింతబలంబుఁ గ్రొవ్విరుల కింత ప్రచండతయున్, సుధాత్మునం
దింతబలంబు, శైత్యమున కింత విదాహకరంబుఁ గల్గునే? 163

అర్థము : కంతుఁడు = మన్మథుఁడు, అనంగుఁడు = శరీరమేలేని వాఁడు, అమ్ములు = బాణములు, అనఁగాన్, విరులు = పూలు, విచ్చిపోవునట్టివి, ఇందుఁడు = చంద్రుఁడు. తాన్ = తాను, సుధా + అంగుఁడు = అమృతమయమైన దేహముగలవాఁడు - ద్రవరూపుఁడు - దార్ఢ్యములేనివాఁ డనుట, చంద్రిక = వెన్నెల, అనయంబున్ = ఎప్పుడును, అత్యంత - హిమంబు = మిక్కిలి చల్లనిది, ఇపుడు, ఆ - లయ - మూర్తికిన్ = ఆ నష్టరూపుఁడైన మన్మథునకు, అల్కమైన్= కోపముతో, ఇంత - బలంబు, అంగమేలేనివాని కింత బల మెట్లుగలుగు ననుట, క్రొవ్విరులకున్ (క్రొత్త + విరులకున్) = క్రొంబూలకు, ఇంత - ప్రచండతయున్ = ఇంతటి తీక్ష్ణతయును, సుధా + ఆత్మ + అందున్ = అమృతస్వరూపునందు. చంద్రునందు, ఇంత - బలంబున్, శైత్యమునకున్ = చల్లఁదనమునకు, ఇంత-విదాహకరంబున్ = ఇంతటి విశేషదాహకరత్వమును, కల్గనే = కలుగునా ? కలుగ వనుట.

తాత్పర్యము : చూడఁగా మన్మథుఁడు దేహమే లేనివాఁడు. బాణములో విరులు, విచ్చిపోవు స్వభావముగలవి. చంద్రుఁడు అమృతమయుఁడు. ద్రవరూపుఁడు- ఏమాత్రము దార్ఢ్యములేనివాఁ డనుట, వెన్నెల చూడ నెల్లప్పుడును ఎంతో చల్లనిది. లయమూర్తి - నష్టరూపుఁడు - అయిన ఆ మన్మథునకు ఇప్పుడు ఇంతబలమును, క్రొంబూల కింతటితైక్ష్ణ్యమును, సుధాత్మున కింతటిశక్తియును, వెన్నెల కింతటి విదాహకరత్వమును గలుగునా ? కలుగ వనుట.

విశేషములు ; అనంగుఁడు, విరులు, సుధాంగుఁడుఁ హిమము అను శబ్దములు వరుసగా మన్మథుఁడు, అమ్ములు, ఇందుఁడు, చంద్రిక అనువాని దౌర్బల్యమును సమర్థించునవి యగుటచే నలంకారము కావ్యలింగము- చంద్రిక + అనయంబు = చంద్రికనయంబు - అత్వసంధి. 'బహుళగ్రహణముచేత స్త్రీవాచక తత్సమ సంబోధనాంతంబులకు సంధిలేదు.' బాల. సంధి. 4. అయినను అర్థసౌలభ్యమునకై యీ యనిష్టసంధిని సమ్మతింపవలసి వచ్చినది. 'చంద్రిక-నయంబు' అనునది అన్వయయోగ్యముగా లేదు. లయమూర్తి లయమును (నాశనమును) పొందిన మూర్తిగలవాఁడు-మన్మథుఁడు, క్రొవ్విరులు - క్రొత్త + విరులు - 'సమాసంబునం బ్రాఁతాదుల తొలి యచ్చు మీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు.' బాల, సంధి, 36. క్రొ + విరులు 'క్రొత్త శబ్దమున కాద్యక్షరశేషంబునకుం గొన్నియెడల నుగాగమంబునుం గొన్ని

యెడల మీఁదిహల్లునకు ద్విత్వంబు నగు.' బాల. సంధి. 38. క్రొవ్విరులు. నాల్గవపాద మున 'శైత్యమున' కనిగాక, 'చంద్రిక'కని యుంట లెస్స యని తోఁచుచున్నది. 'విదాహకరంబు' - విదాహకరత్వమని భావము.

వ. అని లగ్గ బెగ్గలించి భయాకులహృదయ యగుచున్న గిరిరాజ నందనం బ్రియసఖులెల్ల సంతరించుచు. 164

అర్థము: అని, లగ్గన్ = మిక్కిలి, బెగ్గలించి = భయపడి, భయ + ఆకుల - హృదయ = వెఱపుచేఁ గలఁతనొందిన హృదయముగలది, అగుచున్ + ఉన్న, గిరి - రాజ - నందనన్ = కొండలఱేని కూఁతును - పార్వతిని. ప్రియ - సఖులు = అనుఁగుఁజెలులు, ఎల్లన్ = ఎల్లరును, సంతరించుచున్ = చక్కఁ బఱుచుచు.

తాత్పర్యము: అని మిక్కిలిభయపడి, భయముచేఁ గలఁగిన హృదయము గలది యగుచున్న పార్వతిని అనుఁగుఁజెలు లెల్లరుఁ జక్కఁబఱుచుచు - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. బాల! నీ వేనలి కాలోరగం బని
మలయానిలంబు నీవలన రాదు.
కమలాస్య! నీ కనుంగవ చకోరము లని
వెన్నెల సోరదు నీయున్న యెడకు.
నబల! నీ యెలుఁగు పికారావ మని నీకుఁ
జూతమ్ము క్రొమ్మొలచూప వెఱచుఁ
జపలాక్షి! నీ ముక్కు చంపక మను భీతి
నలులు నీ పొదగని యలయఁబాఱు

ఆ. వనిత! నీకుఁ బ్రాణవల్లభుండై మది
నొలసి శివుఁడు పాయకుండు నదియ
పేద మరు శరములు నీదెస రా నోడు;
వీని కేల నీవు వెఱచెదమ్మ? 165

అర్థము : బాల = అమ్మాయీ !, నీ - వేనలి = నీ జడ, కాల + ఉరగంబు = నల్లని త్రాచు, అని, మలయ + అనిలంబు = దక్షిణపుగాలి, నీవలనన్ = నీ వైపునకు, రాదు,

కమలాక్షి + అస్య = తామరవంటి ముఖము గలదానా ! పార్వతీ !, నీ - కనుంగవ (కను + కవ) = నీ కన్నుల జంట, చకోరములు + అని = వెన్నెలపులుఁగు లని, వెన్నెల, నీ + ఉన్న + ఎడకున్ = నీ వున్నచోటికి, చొరదు = ప్రవేశింపదు.

అబల = ఇంతీ ! పార్వతీ!, నీ - ఎలుఁగు = నీ కంఠధ్వని, పిక + ఆరావము = కోకిలధ్వనిగలది, అని, నీకున్, చూతమ్ము = మామిడి, కొమ్ములు - చూపన్ = ఎదిరింప, వెఱచున్ = భయపడును - కొమ్మలుచూపవెఱచు ననియు. కొమ్ము = కొమ్మ.

చపల + అక్షి = చంచలములైనకన్నులు గలదానా. పార్వతీ!, నీ - ముక్కు - చంపకము = సంపెఁగ, అను - భీతిన్ = అనెడు భయమున, అలులు = తుమ్మెదలు, నీ - పొడ + కని = నీ రూపుఁజూచి, అలయన్ + పాఱున్ = అలసిపోవునట్లు పాఱిపోవును.

వనిత = ఇంతీ ! నీకున్, శివుఁడు, ప్రాణ - వల్లభుండు + ఐ = ప్రాణసమానమైనప్రియుఁడయి. మదిన్ = మనస్సును, ఒలపి = ప్రవేశించి, పాయక + ఉండున్ + అని + అ = వీడకుండుననియే, పేద - మరు - శరములు - పిఱికివైన మన్మథబాణములు. నీ - దెసన్ = నీవైపు, రాన్ + ఓడున్ = వచ్చుటకు జంకును, వీనికిన్ = ఈ మలయానిలాదులకు, నీవు, ఏల, వెఱచెదు + అమ్మ (వెఱచెదవు + అమ్మ) = భయపడుదువమ్మా !

తాత్పర్యము : 'బాలా ! నీ జడ కాలసర్పమని మలయానిలము నీ దిక్కునకు రాదు. (సర్పమునకును వాయువునకును విరోధము, సర్పము వాయువును దినును. వాయువునకు నీ వేనలియందు సర్పభ్రాంతి గలిగి నీవైపు రా దనుట.) పద్మముఖీ ! నీ కనుదోయి చకోరపక్షులని వెన్నెల నీవున్నచోటికి రాదు. (వెన్నెలకును జకోరములకును విరోధము, చకోరములు వెన్నెలను భక్షించును. వెన్నెలకు నీ కనుదోయి యందుఁ జకోరభ్రాంతిగలిగి, భయమేర్పడి, నీవున్నచోటికి రాదనుట). అబలా! నీ కంఠ

స్వరము కోకిలకంఠధ్వనియని మామిడి నీకు ఎదురుతిరుగ వెఱచును. (మామిడికిఁ గోకిలమునకు విరోధము. కోకిలములు మామిడిచివురులను మేయును. మామిడికి నీ యెలుఁగునందుఁ గోకిలకంఠభ్రాంతిగలిగి భయపడి నీ కెదురుతిరుగ దనుట). చంచలాక్షీ! నీ ముక్కు సంపెఁగ యని తుమ్మెదలు నిన్నుఁజూచినంతనే పాఱిపోవును. (తుమ్మెదలకును సంపెఁగకును విరోధము. తుమ్మెదలకు నీ ముక్కునందు చంపక భ్రాంతిగలిగి భయముచే నిన్నుఁజూడఁగనే పాఱిపోవు ననుట). వనితా! నీకు శివుఁడు ప్రాణప్రియుఁడై నీమనస్సును జొచ్చి విడువకుండుననియే పిఱికివైన మన్మథశరములు నీవైపు రా నోడును (మన్మథునకు శివునకు విరోధము ప్రసిద్ధమే). కావున నీ వీ మలయానిలాదుల కేల వెఱతువు? అవి వేఱువేఱు కారణములచే నీజోలికి రా వనుట.

విశేషములు: మలయానిలమునకుఁ బార్వతి వేనలియందు సర్పభ్రాంతి. వెన్నెలకు ఁబార్వతి కనుఁగవయందుఁ జకోరభ్రాంతి. మామిడికిఁబార్వతి యెలుఁగునందుఁ బికధ్వనిభ్రాంతి. తుమ్మెదలకుఁ బార్వతి ముక్కునందుఁ జంపకభ్రాంతి. అందుచే నలంకారము భ్రాంతిమంతము. వీనికి నీవు వెఱవఁబనిలే దను సమర్థనీయాంశము సమర్థింపఁబడుటచేఁ గావ్యలింగాలంకారమును.

వ. అని యనేకప్రకారంబుల బుజ్జగించుచున్నంత నక్కోమలికి విరహ తాప మతిక్రాంతమగుట గని భయస్థలై యిది మనచేతం దెగ దింతయు హిమవంతున కెఱింగింప వలయునని చని పర్వతాధీశ్వరుం గని తద్వృత్తాంతంబు విన్నపంబు సేసి వెండియు నిట్లనిరి. 166

అర్థము: అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కువిధముల, బుజ్జగించుచున్ + ఉన్న + అంతన్ = అనునయించుచుండఁగా, ఆ + కోమలికిన్ = ఆ సుందరాంగికి - పార్వతికి. విరహతాపము = వియోగమువలని తాపము, అతిక్రాంతము = మితిమీఱినది, అగుట, కని, భయస్థలు + ఐ = వెఱచినవారయి, ఇది, మనచేతన్, తెగదు = అణఁగదు, ఇంతయున్ = ఇది యంతయును, హిమవంతునకున్, ఎఱింగింపన్ + వలయున్ = తెలుపవలయును, అని, చని = పోయి, పర్వత + అధి + ఈశ్వరున్ = పర్వతాధిపుని, కని, తద్ + వృత్తాంతంబు = ఆ విషయము, విన్నపంబు + చేసి = విన్నవించి - మనవిచేసి, వెండియున్ = మరల, ఇట్లు + అనిరి.

తాత్పర్యము : అని పెక్కువిధముల ననునయించుచుండఁగా నా పార్వతికి విరహతాపము మితిమీఱుట చూచి. వెఱచినవారయి, 'యిది మనచే నణఁగదు. ఇంత యును హిమవంతునకుఁ దెలుపవలయు' నని పోయి పర్వతరాజున కా వృత్తాంతము విన్నవించి మరల నిట్లనిరి.

చ. మనసిజుఁ డా విలాసవతి మానధనం బెడ సూఱగొన్న క్రం
దునఁ గుటిలాలకద్యుతులఁ దుమ్మెద, లంగవిభాతిఁ దీఁగ, లా
నన కిరణాళి రాజు, చిఱునవ్వు వెలుంగు సితాబ్జముల్, విలో
కనరుచు లుత్పలల్ మగుడఁ గైకొనియెం దమ యచ్చువాటినన్. 167

అర్థము : మనసిజుఁడు = మన్మథుఁడు, ఆ - విలాసవతి-మాన - ధనంబు = ఆ ఒయ్యారి (పార్వతి) యొక్క మానమనెడిధనము. ఎడ - చూఱగొన్న - క్రందు నన్ = కొల్లగొన్నసందడిలో, తమ + అచ్చు + పాటినన్ = తమ పాచిక పాఱఁగా, - తమ ముద్ర కానరాఁగా, తుమ్మెదలు కుటిల + అలక - ద్యుతులన్ - వంకరయైన ముంగురుల కాంతులను, తీఁగలు, అంగ - విభాతిన్ = శరీరకాంతిని, రాజు = చంద్రుఁడు, ఆనన - కిరణ + ఆళిన్ = ముఖ కిరణముల వరుసను, సిత + అబ్జముల్ = తెల్ల తామరలు, చిఱు - నవ్వు - వెలుంగున్, ఉత్పలల్ = (ఉత్పలాల్) = కలువలు, విలోకన - రుచులు = చూపుల కాంతులు, మగుడన్ = మరల, కైకొనియెన్ = గ్రహించెను.

తాత్పర్యము : మన్మథుఁడు ఆ సౌందర్యవతి మానమనెడిధనమును గొల్ల గొట్టిన సందడిలో, తమ పాచికపాఱఁగా - తమ ముద్ర కనఁబడఁగా, తుమ్మెద లామె వంకరముంగురుల కాంతులను, తీఁగలు ఆమె శరీరకాంతిని. చంద్రుఁడు ముఖకిరణ రాజిని, తెల్లఁదామరలు చిఱునగవువెలుఁగులను, కలువలు చూపులకాంతులను దిరిగి కైకొనెను,

విశేషములు ; ఒక పెద్దదొంగ ఒకయింటఁ బెద్ద దొంగతనమును జేయఁగా. ఆ సందడిలోఁ దదనుచరులు చిన్నచిన్న దొంగతనములు చేయునట్లు, మన్మ థుఁడను గజదొంగ పార్వతి మానధనమును గొల్లగొట్టఁగా, చిల్లరదొంగలగు తుమ్మె దలు మున్నుగునవి ఆమె ముంగురులకాంతులు మున్నగువానిని, వానియందుఁ దమ

గుఱుతులు కనఁబడినందువలన, మరలఁగైకొనెను. పార్వతి ముంగురులు తుమ్మెదల వలెను, శరీరము తీఁగవలెను, ముఖము చంద్రునివలెను, చిఱునవ్వు తెల్లతామరవలెను, చూపులు కలువలవలెను నున్నవని భావము.

చ. తనరు మృణాళముల్ ముదిరి తామరకాఁడలు కర్కశంబులై
యనయములై నభంగి మృదులాంగమునన్ బులకాళి పేర్చి మా
రునిదొనయమ్ము లొక్కమొగి రోమమురోమముఁ దప్పకుండ నా
టినక్రియ నుండు నింతి మెయి డెక్కొని చిత్తవికారచేష్టలన్. 168

అ ర్థ ము : తనరు = ఒప్పునట్టి, మృణాళముల్ = తామరతూండ్లు, ముదిరి = లేఁతఁదనము, వీడి, తామర - కాములు = తామరకాఁడలు. కర్కశంబులు + ఐ = కఠిన ములయి - మృదువులుగానివయి, అనయములు = అయము (శుభము) కానివి ఐన - భంగిన్ = అయిన విధమున, మృదుల + అంగమునన్ = మెత్తని శరీరము నందు, పులక + ఆళి = గగ్గురులయొక్క వరుస, పేర్చి = అతిశయించి, మారుని = మన్మథునియొక్క, దొన + అమ్ములు = అంపపొదిలోని బాణములు, ఒక్క - మొగిన్ = ఒక్కపెట్టున, రోమము రోమమున్ = ప్రతిరోమమును, తప్పక + ఉండన్ = విడువకుండునట్లు, నాటిన - క్రియన్ = గ్రుచ్చుకొన్న విధమున, చిత్త వికార - చేష్టలన్ = మనోవికారమువంటి చేష్టలచేత, ఇంతి - మెయిన్ = పార్వతి శరీరమున డెక్కొని = నెలకొని, ఉండున్,

తా త్ప ర్య ము : ఒప్పునట్టి తూండ్లు ముదిరి తామరకాఁడలు కఠినములయి అయము (శుభము) లేనివయినవిధమునఁ బార్వతికి మనోవికారపుఁజేష్టలచే మెత్తని శరీరమున గగుర్పాటు అతిశయించి మన్మథుని అంపపొదిలోని బాణము లొక్కపెట్టున వెండ్రుకవెండ్రుకతప్పకుండునట్లు గ్రుచ్చుకొనెనా యనురీతిని నెలకొనియుండెను,

వి శే ష ము లు : తనరు మృణాళముల్ .... బులకాళిపేర్చి - అలంకార ముపమ, పులకాళిపేర్చి .... నాటినక్రియ - అలంకార ముత్ప్రేక్ష.

క. ధారాగృహమున నుండిన
నీ రెంతయు నింకెఁ గొలని నీరులలో నం
భోరుహ కదళీవన సహ
కారంబులు గలయఁ గోడుగమరులువోయెన్. 169

అర్థము : ధారా - గృహమునన్ = జలయంత్రగృహమున, ఉండిన, నీరు, ఎంతయున్ = మిక్కిలి, ఇంకెన్, కొలని - నీరులలోన్ = సరస్సునందలి జలములలో, అంభోరుహ - కదళీ - వన - సహకారంబులు = తామరలు, అరటులు, తియ్యమామిడులు, కలయన్ = అంతటను, కోడు - కమరులు + పోయెన్ = వాడి వత్తలయ్యెను.

తాత్పర్యము : జలయంత్రగృహమునందలినీరు మిక్కిలి యింకిపోయెను. సరస్సునందలి జలములలోని తామరలు, అరటులు తియ్యమామిడులు అంతటను వాడివత్తలయ్యెను.

క. విరహానలమున డెందము
దరికొని మదినున్నవిభునిఁ దాఁకునొ యని చె
చ్చెర దాని నార్పుక్రియ నెదఁ
దరుణి విగళితాశ్రుధారఁ దడుపుచునుండెన్. 170

అర్థము : విరహ + అనలమునన్ = వియోగాగ్నిచే, డెందము = హృదయము, దరికొని = మండి, మదిన్ = మనస్సునందు, ఉన్న, విభునిన్ = ప్రియుని, తాఁకునొ = స్పృశించునో, అని, చెచ్చెరన్ = శీఘ్రముగా, దానిన్ = ఆ మంటను, ఆర్పు - క్రియన్ = ఆర్పువిధమున, తరుణి = యువతి - పార్వతి, ఎదన్ = వక్షమును, విగళిత + అశ్రు = ధారన్ = కారిన కన్నీటిప్రవాహముచే, తడుపుచున్ + ఉండెన్.

తాత్పర్యము : వియోగాగ్ని హృదయమును మండించి యందున్న ప్రియుని స్పృశించునేమోయని శీఘ్రముగా నా మంటనార్పువిధమునఁ బార్వతి తాఁగార్చు కన్నీటి ధారచే వక్షమును దడుపుచుండెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష. విరహానలము - విరహమనెడి అనలము - రూపకము. రూపకానుప్రాణితమైన హేతూత్ప్రేక్ష.

క. రేలుం బగలును మొగమున
ౘ్రేలుచుఁ బతి పాయకున్న ౘ్రేఁగుననో, లో
దాలివలవంతనో య
బ్బాలిక మొగమెత్త; దలసభావన నుండున్. 171

అర్థము : అబ్బాలిక (అ + బాలిక) = ఆ బాల, రేలున్ = రాత్రులును, పగలును, మొగమునన్ = ముఖమునందు, ౘ్రేలుచున్, (కనులకుఁగట్టినట్లుండుచు) పతి = ప్రియుఁడు, పాయక + ఉన్న - ౘ్రేఁగుననో = విడువకుండుటవలనిభారము చేతనో, లో - దాలి - వలవంతన్ + ఓ = లోదాలియైన - మనస్సునందలి నిప్పుల గుంటయైన, మన్మథవ్యథచేతనో, మొగము, ఎత్తదు, అలస - భావనన్ + ఉండున్ = మాంద్యముతోఉండును - ఉత్సాహము లేకుండును.

తాత్పర్యము : రేయుంబవళ్లు ముఖమున ౘ్రేలాడుచుఁ బ్రియుఁడు విడువ కుండుటవలనిభారముచేతనో, మనసులోని దాలి (నిప్పులగుంట) యైన మన్మథ వ్యథచేతనో ఆ బాల ముఖము పయికెత్తక. ఉత్సాహరహితయై యుండును.

విశేషములు : అలంకారము హేతూత్ప్రేక్ష. మొగమున ౘ్రేలుచు - కను లకుఁగట్టినట్లుండుచు - 'మొకమున ౘ్రేలుచున్నయవి ముప్వురమూర్తులు నంచు నార్తుఁడై.' ఉ,హరి.2, లోదాలివలవంత - లోపలియగ్నివలెనున్న మన్మథవ్యథ.

సీ. పరితాప శిఖి శిఖల్ దరికొని వనములోఁ
గార్చిచ్చులై కొని కాలుచుండు,
నుడుగక వెడలు నిట్టూర్పులు జగములఁ
బ్రళయానిలంబులై పర్వినెగయు.
భోరనఁ దొరఁగు కన్నీరు వారాశికి
నేఱులై వెసఁగూడి పాఱుచుండు.
వగఁగూడి కడుఁగంది వందిన మైఁదీఁగ
కప్పున దెసలఁ జీఁకటులు కవియుఁ

తే. ప్రాణవల్లభుఁ డెద నున్కిఁ బ్రాణ మొడలఁ
బాయ దింతియ చెప్పంగ వేయు నేల ?
యా పరోక్షానుభూతి విరహానలంబు
దలఁప వినఁ జూడఁ గడు నద్భుతంబు దేవ ! 172

అర్థము ; పరితాప - శిఖి - శిఖల్ = సంతాపమనెడి అగ్నియొక్క జ్వాలలు, దరికొని = విజృంభించి, వనములోన్ = అడవిలో, కార్చిచ్చులు + ఐ = దావాగ్నులయి, కొని + వ్యాపించి, కాలుచున్ + ఉండున్ = దహించుచుండును.

ఉడుగక = మానక, వెడలు = పైకివచ్చు, నిట్టూర్పులు (నిడు+ఊర్పులు) దీర్ఘనిశ్వాసములు, జగములన్ = లోకములందు, ప్రళయ + అనిలంబులు + ఐ = ప్రళయకాలమునందలి అగ్ను లయి, పర్వి = వ్యాపించి, నెగయున్ = పైకిలేచును.

ఘోరనన్ = ఘోరుమని, తొరఁగు = ప్రవహించు, కన్నీరు, వారాశికిన్ = సముద్రమునకు, ఏఱులు + ఐ = ప్రవాహము లయి, వెసన్=శీఘ్రముగా, కూడి = కలిసి ఒక్కటియై, పాఱుచున్ + ఉండున్ = ప్రవహించుచుండును.

వగన్ + చింతతో, కూడి. కడున్ = మిక్కిలి, కంది = దుఃఖించి. వందిన= వాడిన, మైఁ దీఁగ = దేహలతయొక్క. కప్పునన్ = నలుపుచే. దెసలన్ = దిక్కులందు, చీఁకటులు, కలియున్ = ఆక్రమించును.

దేవ = ప్రభూ !, (హిమవంతుని సంబుద్ధి).

చెప్పంగన్ = చెప్పుటకు, వేయున్ + ఏల = వేయేల ? - పెక్కుమాటలు చెప్పనేల ?

ప్రాణ - వల్లభుఁడు = ప్రాణప్రియుఁడు, ఎడన్ = హృదయమునందు, ఉన్కిన్ = ఉండుటచే, ప్రాణము, ఒడలన్ = మేనియందుండి, పాయదు = పోదు, ఇంతియ = ఇంతే.

ఆ - సరోజ + ఆస్య . పైన్ = ఆ పద్మముఖిపై, విరహ + అనలంబు = వియోగమనెడి అగ్ని, తలఁపన్ = భావించుటకు, వినన్ = వినుటకు, చూడన్ = చూచుటకు, కడున్ = మిక్కిలి, అద్భుతంబు = ఆశ్చర్యము.

తాత్పర్యము : సంతాపాగ్నిజ్వాలలు విజృంభించి వనములో దావాగ్నులై వ్యాపించి కాలుచుండును. మానక బయల్వెడలు నిట్టూర్పులు లోకములందుఁ బ్రళయ కాల వాయువులై వ్యాపించి పైకిలేచును. ఘోరుమనిప్రవహించు కన్నీరు సముద్రమునకు నదులై శీఘ్రముగాఁగూడి ప్రవహించుచుండును. చింతతోఁగూడి మిక్కిలి దుఃఖముచే వాడిపోయినదేహలత నలుపుచే దిక్కులందుఁ జీఁకటులు ఆక్రమించును. ప్రభూ! పలు పలుకులేల ? ప్రాణప్రియుఁడు హృదయమున నుండుటచేఁ బ్రాణము మేనినుండి పోదు. ఇంతే. ఆ పద్మముఖిపై వియోగాగ్ని తలఁపను, వినను, జూడను మిక్కిలి ఆశ్చర్యకరము.

విశేషములు : వనములోని దావాగ్నులు పార్వతీ విరహతాపాగ్ని జ్వాలల వలనఁ గలిగినవే యనుట. జగములందలి ప్రళయవాయువు లామె నిరంతర నిశ్వాసముల వలన నేర్పడినవే యనుట. సముద్రమునఁ గలియు నదు లామె దుఃఖాశ్రువులవలన నైనవే యనుట. దిక్కులందలి చీఁకటు లామె దుఃఖమ్లానదేహలత నలుపే యనుట - నాల్గు పాదములందు నలంకారము సంబంధాతిశయోక్తి. ప్రాణవల్లభుఁ డెడనున్కి.... బాయదు - అలంకార ముత్ప్రేక్ష. పరితాప శిఖి. = పరితాపమనెడి శిఖి. విరహానలము = విరహమనెడి అనలము - రూపకములు.

ఒడలఁ బాయదు - ఒడలి వలనఁ బాయదు. 'ఉంది పదం బొకానొకచో వలన వర్ణకంబున కనుప్రయుక్తం బగు,' బాల, కారక. 10. ఒడలి వలననుండి పాయదు. 'ఉండి శబ్దము పరంబగునపుడు వలనకు ద్వితీయాసప్తములు ప్రాయికంబుగ నగు.' బాల. కారక. 11. ఒడలియందుండి పాయదు. 'ఔపవిభక్తికముల తృతీయాసప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు.' ఒడలనుండి పాయదు. 'వలన కాదేశంబగు ద్వితీయాసప్తములమీఁది యుండికి లోపంబు బహుళంబుగా నగు.' ప్రౌఢ. కారక. 11. ఒడలఁబాయదు.

వ. అనిన విని హిమవంతుం డదరిపడి మేనకాసహితం బతిసంభ్రమంబునం జనుదెంచునంత నిట పార్వతియును. 173

అర్థము: అనినన్, విని, హిమవంతుండు, అదరిపడి = ఉలికిపడి, మేనకాసహితంబు = మేనకతోఁగూడ, అతి - సంభ్రమంబునన్ = మిక్కిలి వేగిరపాటుతో, చనుదెంచు + అంతన్ = వచ్చునంత, ఇట = ఇక్కడ. పార్వతియును.

తాత్పర్యము : అని చెలులు చెప్పఁగా విని హిమవంతుఁ డులికిపడి మేనకతోఁగూడ మిక్కిలివేగమున వచ్చునంత నిక్కడఁ బార్వతియును - తరువాతి యాశ్వాసమునందలి రెండవ వచనముతో నన్వయము.

మ. జగదారాధ్యు, నసాధ్యు, సాధ్యు, విమలాచారున్, మహోదారు, స
ర్వగు, సర్వేశు, ననీశు, నీశు, సుగుణావాసుం, జగత్త్రాసుఁ, దత్
త్రిగుణాతీతు, నజాతు, జాతు, వృషవర్ధిష్ణుం, క్రియాజిష్ణు, లో
క గురున్, దృశ్యు, నవశ్యు, వశ్యు, వివిధాకల్పున్, సుజల్పున్,
మహిన్. 174

అర్థము : మహిన్ = భూమియందు, జగదారాధ్యున్ (జగత్ + ఆరాధ్యున్) = లోకముచేఁ బూజింపఁదగినవాఁడును, అసాధ్యున్ = సాధింపరానివాఁడును, సాధ్యున్ = సాధింపఁదగినవాఁడును, విమల + ఆచారున్ = పవిత్రమైన నడవడి గలవాఁడును, మహా (మహత్) + ఉదారున్ = మిక్కిలి గొప్పవాఁడును. సర్వగున్ = అన్నింటియం దుండువాఁడును, సర్వ + ఈశున్ = అన్నింటికిని ప్రభువైనవాఁడును. అనీశున్ = ప్రభువులేనివాఁడును - స్వతంత్రుఁడును. ఈశున్ = ప్రభువైనవాఁడును, సుగుణ + అవాసున్ = మంచిగుణములకు స్థానమైనవాఁడును, జగత్ + త్రాసున్ = లోకభయంకరుఁడును, తద్ + త్రిగుణ + అతీతున్ = ఆ సత్త్వరజస్తమోగుణముల నతిక్రమించినవాఁడును, అజాతున్ = పుట్టనివాఁడును, జాతున్ = పుట్టినవాఁడును, వృష - వర్ధిష్ణున్ = ధర్మముచే వృద్ధిపొందుశీలము గలవాఁడును, క్రియా - జిష్ణున్ = పనులయందు జయించు స్వభావముగలవాఁడును, లోక - గురున్ = లోకములకు గురువైనవాఁడును, దృశ్యున్ = దర్శింపఁదగి = వాఁడును, అవశ్యున్ = లోఁబడని వాఁడును, వశ్యున్ = లోఁబడినవాఁడును, వివిధ + ఆకల్పున్ = పెక్కువిధములైన ఆభరణములు గలవాఁడును, సుజల్పున్ = బాగుగా మాటలాడువాఁడును - అగు కృతిపతిని - జంగమమల్లికార్జునదేవుని.

తాత్పర్యము : జగత్తుచే నారాధింపఁదగినవాఁడును, అసాధ్యుఁడును, సాధ్యుఁడును, విమలమైన నడవడిగలవాఁడును, మిక్కిలి గొప్పవాఁడును, అన్నిట నుండువాఁడును, అన్నిటికిని ప్రభువైనవాఁడును, దనకుఁ బ్రభువొకఁడు లేనివాఁడును, ప్రభువైనవాఁడును, సుగుణములకు స్థానమైనవాఁడును, జగత్తునకు భయంకరుఁడును, సత్త్వరజస్తమోగుణముల నతిక్రమించువాఁడును, పుట్టుక లేనివాఁడును, పుట్టినవాఁడును, ధర్మముచే వృద్ధిపొందువాఁడును, పనులయందు జయించు శీలముగలవాఁడును, లోకములకు గురువైనవాఁడును, దర్శింపఁదగినవాఁడును, లోఁబడనివాఁడును, లోఁబడినవాఁడును, వివిధములైన ఆభరణములు గలవాఁడును, బాగుగా మాటలాడు వాఁడును - అగు కృతిపతిని శ్రీజంగమ మల్లికార్జునదేవుని -

విశేషములు : అలంకార మనుప్రాసము.

క. సుజ్ఞానామల తత్త్వవి
ధిజ్ఞుఁ, గళాభిజ్ఞు, భారతీరమణుఁ, ద్రిలో
కజ్ఞు, నయజ్ఞు, సుధీనిధి,
నజ్ఞానవిముక్తు, సుచరితాభరణాంకున్. 175

అర్థము : సుజ్ఞాన + అమల - తత్త్వ - విధిజ్ఞున్ = మంచి జ్ఞానమనెడు నిర్మలమైనతత్త్వముయొక్క విధి నెఱిఁగినవాఁడును. కళా + అభిజ్ఞున్ = కళల నెఱిఁగినవాఁడును, భారతీ - రమణున్ - వాక్ప్రియుఁడును, త్రిలోకజ్ఞున్ = మూఁడు లోకములు తెలిసినవాఁడును, నయజ్ఞున్ = నీతి నెఱిఁగినవాఁడును, సుధీ - నిధిన్ = మంచి తెలివికి నిధియైనవాఁడును, అజ్ఞాన - విముక్తున్ = అజ్ఞానమునుండి విడువఁ బడినవాఁడును, సుచరిత + ఆభరణ + అంకున్ = మంచిచరితమనెడి ఆభరణము గలవాఁడను బిరుదు గలవాఁడును అగు కృతిపతిని శ్రీజంగమమల్లికార్జున దేవుని -

తాత్పర్యము : సుజ్ఞానమనెడు నిర్మలతత్త్వవిధము నెఱిఁగినవాఁడును, కళల నెఱిఁగినవాఁడును, వాక్ప్రియుఁడును, త్రిలోకముల నెఱిఁగినవాఁడును, నీతి

నెఱిఁగినవాఁడును, మంచి తెలివికి నిధియైనవాఁడును, అజ్ఞానమువలన విముక్తుఁడైనవాఁడును, సుచరితాభరణుఁ డనెడి బిరుదు గలవాఁడును అగు కృతిపతిని శ్రీజంగమ మల్లికార్జునదేవుని.

విశేషములు :అలంకార మనుప్రాసము.

మ. కరుణామిత్రు, నమిత్రు, మిత్రు, నుతలోకజ్ఞుం, గళాభిజ్ఞు, సా
గరగంభీరు, నదూరు, దూరగతజాఘన్యున్, జగన్మాన్యు, భూ
సురవంశాద్యు, నభేద్యు, భేద్యు, సుమనఃశుద్ధున్, మనఃశుద్ధు, వి
స్తరితశ్లోకు,నలోకు,లోకు,శివసంసక్తున్,విముక్తున్,మహిన్, 176

అర్థము: మహిన్. కరుణా - మిత్రున్ - దయకు మిత్రుఁడైనవాఁడును, అమిత్రున్ = మిత్రుఁడుకానివాఁడును, మిత్రున్ = మిత్రుఁడైనవాఁడును, నుత - లోకజ్ఞున్ = పొగడఁబడిన లోకజ్ఞానముగలవాఁడును, కళా + అభిజ్ఞున్ = కళలు దెలిసినవాఁడును, సాగర - గంభీరున్ = సముద్రమువలె లోఁతయినవాఁడును, అదూరున్ = దూరములేనివాఁడును, దూర - గత - జాఘన్యున్ = దవ్వైన నైచ్యము గలవాఁడును, జగత్ + మాన్యున్ = లోకములకు మాన్యుఁడైనవాఁడును, భూసుర - వంశ + ఆద్యున్ = బ్రాహ్మణవంశమున కాద్యుఁడైనవాఁడును, అభేద్యున్ = భేదింపరానివాఁడును, భేద్యున్ = భేదింపఁదగినవాఁడును, సుమనస్ (ః) + శుద్ధున్ = మంచిమనస్సుచేఁ బవిత్రుఁడును, (దేవతవలెఁ బవిత్రుఁడైనవాఁడును). మనస్ (ః) - శుద్ధున్ = మనస్సుచే శుద్ధుఁడైనవాఁడును, విస్తరిత - శ్లోకున్ = విస్తరించిన కీర్తి గలవాఁడును, అలోకున్ = లోకములు లేనివాఁడును, లోకున్ = లోకములు గలవాఁడును. శివ - సంసక్తున్ = శివునితోఁగూడినవాఁడును, విముక్తున్ = విడువఁబడినవాఁడును అగు కృతిపతిని శ్రీ జంగమ మల్లికార్జున దేవుని.

తాత్పర్యము : దయకు మిత్రుఁడైనవాఁడును, అమిత్రుఁడును, మిత్రుఁడును, పొగడఁబడిన లోకజ్ఞుఁడును. కళల నెఱిఁగినవాఁడును, సముద్రగంభీరుఁడును. దవ్వుకానివాఁడును, నైచ్యమునకు దవ్వయినవాఁడును, లోకములకు మాన్యుఁడైన

వాఁడును, బ్రాహ్మణవంశమున కాద్యుఁడైనవాఁడును, భేదింపరానివాఁడును, భేదింపఁదగినవాఁడును, మంచిమనస్సుచేఁ బవిత్రుఁడైనవాఁడును, (దేవతవలెఁ బవిత్రుఁడైనవాఁడును). మనస్సుచే శుద్ధుఁడైనవాఁడును, వ్యాపించిన కీర్తిగలవాఁడును, లోకములు లేనివాఁడును, లోకములు గలవాఁడును, శివునితోఁ గూడినవాఁడును, విడువఁబడినవాఁడును - అగు కృతిపతిని - శ్రీ జంగమమల్లికార్జునదేవుని.

విశేషములు : అలంకార మనుప్రాసము.

క. లోకాలోకన కీర్తి
శ్రీకాంతాకాంతు, విబుధశేఖరు, దురితా
నోకహ కుఠారు, సకల క
ళా కల్పాకల్పు మల్లికార్జునదేవున్. 177

అర్థము : లోకాలోకన - కీర్తి - శ్రీ - కాంతా - కాంతున్ = చక్రవాళపర్వతమువఱకు వ్యాపించిన, కీర్తియనెడు, లక్ష్మీదేవికి, భర్తయైనవాఁడును, విబుధ - శేఖరున్ = దేవతలలోఁ దలమానికమైనవాఁడును (శ్రేష్ఠుఁడును), దురిత + అనోకహ - కుఠారున్ = పాపములనెడి చెట్లకు గొడ్డలియైనవాఁడును, సకల - కళా + ఆకల్ప + ఆకల్పున్=ఎల్ల కళలనెడు ఆభరణములకు ఆభరణమైనవాఁడును అగు, మల్లికార్జునదేవున్ = కృతిభర్తయగు శ్రీజంగమ మల్లికార్జునదేవుని.

తాత్పర్యము : చక్రవాళపర్వతమువఱకును వ్యాపించిన కీర్తియనెడు లక్ష్మికి భర్తయైనవాఁడును, దేవతలలోఁ దలమానికమైనవాఁడును, పాపము లనెడు చెట్లకు గొడ్డలియైన వాఁడును, ఎల్ల - కళలనెడు అభరణములకు ఆభరణమైనవాఁడును, అగు శ్రీ జంగమ మల్లికార్జునదేవుని.

విశేషములు : లోకాలోక (న) - 'లోకాలోక శ్చక్రవాళః' 'అస్యాభ్యన్తరం సూర్యకిరణైః ప్రకాశ్యతే న బాహ్య మితి ప్రకాశాప్రకాశతయాలోక్యతే న లోక్యత ఇతి చ లోకాలోకః' ఈ పర్వతముయొక్క లోపలిపార్శ్వము సూర్యకిరణములచేతఁ బ్రకాశించును. వెలుపలిపార్శ్వము ప్రకాశింపదు గనుక కొంత చూడఁబడునదియు, కొంత చూడఁబడనిదియు నగుటచే లోకాలోకము - అమరము. దురితానో

కహాకుఁడారు - దురితములనెడి అనోకహములకుఁ గుఠారమైనవాఁడు - రూపకము.
కీర్తి శ్రీ కాంతా కాంత - కీర్తియనెడు శ్రీకాంతకు కాంతుఁడైనవాఁడు - రూపకము.

మాలిని. అమలపరమయోగాయత్తు, సంశుద్ధచిత్తున్,
కమల విశిఖ రమ్యాకారు, దుస్సంగదూరున్
శమిత విషయుఁ, దత్త్వాసక్తు, సంసారముక్తున్,
శమ దమ నియతాత్మున్, శాంతు, వాక్ఛ్రీసుకాంతున్. 178

అర్థము : అమల - పరమ - యోగ + ఆయత్తున్ = నిర్మలము, ఉత్కృష్టము అయిన యోగమునకు వశమైనవాఁడును. సంశుద్ధచిత్తున్ = మిక్కిలి పవిత్రమైన మనస్సుగలవాఁడును, కమల - విశిఖ - రమ్య + ఆకారున్ = పద్మములు బాణములుగాఁ గలవాని (మన్మథుని) వలె సుందరమైన రూపముగలవాఁడును, మనస్ + సంగ - దూరున్ = చిత్తముయొక్క సంగమునకు దవ్వైనవాఁడును, శమిత - విషయున్ = శమించిన ఇంద్రియవాంఛలు గలవాఁడును, తత్త్వ + ఆసక్తున్ = భగవత్ప్రతిపాదకవిషయమునందు ఇష్టముగలవాఁడును, సంసార - ముక్తున్ = సంసారబంధమునుండి విడువఁబడినవాఁడును, శమ - దమ - నియత + ఆత్మున్ = శాంతము, ఇంద్రియనిగ్రహము అనువానిచే నియమింపఁబడిన ఆత్మగలవాఁడును, శాంతున్ = శాంతగుణముగలవాఁడును, వాచ్ (క్) + శ్రీ - సుకాంతున్ = వాక్కు లనెడు సంపదచేత మిక్కిలి మనోహరమైనవాఁడును . అగు కృతిపతిని శ్రీ జంగమ మల్లికార్జునదేవుని -

తాత్పర్యము : నిర్మలము, ఉత్కృష్టము నైన యోగమునకు వశమయిన వాఁడును, మిక్కిలి పవిత్రమైన మనస్సుగలవాఁడును, మన్మథుని ఆకారమువలె రమ్యమైన ఆకారముగలవాఁడును, మనస్సంగమునకు దవ్వైనవాఁడును, శమించిన ఇంద్రియవాంఛలు గలవాఁడును, భగవత్ప్రతిపాదక విషయమునం దాసక్తిగలవాఁడును. సంసారబంధమునుండి విడువఁబడినవాఁడును, శాంతము, ఇంద్రియనిగ్రహము అనువానిచే నియమింపఁబడినవాఁడును. శాంతుఁడును, వాక్సంపదచేత మిక్కిలి మనోహరమైనవాఁడును అగు కృతిపతిని శ్రీ జంగమమల్లికార్జున దేవుని.

విశేషములు : వాక్ఛ్రీ = వాచ్ + శ్రీ = వాక్ + శ్రీ.

గద్యము

ఇది శ్రీమజ్జంగమ మల్లికార్జునదేవ దివ్య పాదపంకజ భ్రమరాయమాణ కవి రాజశిఖామణి నన్నెచోడదేవప్రణీతంబైన కుమారసంభవంబను కథయందుఁ బంచమాశ్వాసము.

దీనికి వ్యాఖ్య ప్రథమాశ్వాసాంత గద్యమునకు వలెనే,

మ. ఇది శ్రీ జొన్నలగడ్డ వంశమణియౌ మృత్యుంజయాఖ్యుండు స
మ్మద మొప్పారఁ గుమారసంభవము శ్రీమన్నన్నెచోడాఖ్య వి
ద్వదధీశోక్తము శాబ్దికార్థ వివిధస్వారస్య తాత్పర్యముల్
చదురొప్పన్ వచియించి మన్చు విలసత్ సంజీవనీవ్యాఖ్యయౌ.

కుమారసంభవము

షష్ఠాశ్వాసము

శ్రీవాణీవరు, నఖిలక
ళావిదు, నఘరహితు, నిహలలాటేశుఁ, ద్రిత
త్త్వావిష్కృతమతి, నఖిల శు
భావహు, నణిమాదిగుణగణాలంకారున్. 1

అర్థము : శ్రీ - వాణీ - వరున్ = శోభాయుక్తమైన వాక్కుచేత శ్రేష్ఠుఁడైనవాఁడును, అఖిల - కళా - విదున్ = ఎల్ల కళలు తెలిసినవాఁడును, అఘ - రహితున్ = పాపములేనివాఁడును, ఇహ - లలాట + ఈశున్ = భూలోకశివుఁడును, త్రి - తత్త్వ + ఆవిష్కృత - మతిన్ = సత్త్వము, రజస్సు, తమస్సు అను మూఁడుతత్త్వములచేత ఆవిష్కరింపఁబడిన బుద్ధిగలవాఁడును, అఖిల - శుభ + ఆవహున్ = ఎల్ల శుభములను గలిగించువాఁడును, అణిమ + ఆది - గుణ - గణ + అలంకారున్ = అణిమము మున్నగు అష్టైశ్వర్యములనెడు గుణములయొక్క సమూహము అలంకారముగాఁ గలవాఁడును అగు కృతిపతిని శ్రీ జంగమమల్లికార్జునుని.

తాత్పర్యము : శోభాయుక్తమగువాక్కులచే శ్రేష్ఠుఁడును, సకలకళాకోవిదుఁడును, పాపరహితుఁడును, భూలోకేశ్వరుఁడును, సత్త్వాదితత్త్వత్రయముచే నావిష్కృతమైన మతిగలవాఁడును, సర్వశుభావహుఁడును, అణిమము మున్నగు నెనిమిది యైశ్వర్యము లలంకారములుగాఁ గలవాఁడును అగు కృతిపతిని శ్రీ జంగమమల్లికార్జున దేవుని.

విశేషములు : అణిమ - అష్టైశ్వర్యములలో నొకటి - దీనివలన మిక్కిలి సూక్ష్మాకారమొంది సర్వత్ర పోవుటకు శక్తి గలుగును, తక్కిన యైశ్వర్యములు - మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి ప్రాకామ్యము, ఈశత్వము, వశిత్వము.

వ. పరమేశ్వరుం దపోమహిమ నర్చించి మెచ్చించి నిజాధీశ్వరుండుగాఁ బడయుదు నని తపోవనంబునకుం బోవనిశ్చయించి కన్యాంతః పురంబునకుం జనుదెంచె నంత హిమవంతుం డరుగుదెంచి విరహాన లార్తిం దీవ్రకరాహతేందురేఖయుంబోలె వివర్ణయై యున్న హైమ వతిం గని నెమ్మనంబునం దల్లడిల్లుచు. 2

అర్థము : పరమేశ్వరున్, తపస్ (ః) + మహిమన్ = తపస్సుయొక్క ప్రభావముచే, అర్చించి = పూజించి, మెచ్చించి, = మెప్పించి, నిజ + అధి + ఈశ్వరుండు + కాన్ = తనభర్తగా, పడయుదున్ + అని = పొందుదునని, తపస్ (ః) + వనంబునకున్ = తపస్సుకొఱకైన వనమునకు, పోవన్, నిశ్చయించి, కన్యా + అంతఃపురంబునకున్ = కన్నియల అంతిపురమునకు, చనుదెంచెన్ = వచ్చెను. అంతన్, హిమవంతుండు, అరుగుదెంచి = వచ్చి, విరహ + అనల + ఆర్తిన్ = వియోగమనెడి అగ్నివలని పీడచే, తీవ్రకర - ఆహత - ఇందురేఖయున్ + పోలెన్ = తీక్ష్ణకిరణుని (సూర్యుని) చేఁ గొట్టఁబడిన చంద్రకళవలె, వివర్ణ + ఐ = పాలిపోయిన దయి, ఉన్న, హైమవతిన్ = పార్వతిని, కని = చూచి, నెమ్మనంబునన్ (నెఱ + మనంబునన్) = నిండుమనస్సునందు, తల్లడిల్లుచున్ = కలఁతచెందుచు.

తాత్పర్యము : పరమేశ్వరునిఁ దపఃప్రభావముచేఁ బూజించి మెప్పించి తనభర్తనుగాఁ బొందుదునని తపోవనమునకుఁ బోవ నిశ్చయించి పార్వతి కన్యాంతః పురమునకు వచ్చెను. అంత హిమవంతుఁడు వచ్చి వియోగాగ్నిచే సూర్యునిచేఁగొట్టఁ బడిన చంద్రకళవలెఁ గాంతిహీనయైయున్న యామెనుజూచి నెమ్మనమునందుఁ గలఁతఁ జెందుచు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : తపోమహిమ - తపస్ + మహిమ - పదాంతసకారమునకు విసర్గాదేశము - తపః + మహిమ. హ్రస్వఅకారము తరువాతవచ్చు విసర్గమునకు హ్రస్వ అకారముకాని, మృదుహల్లులు (హళ్ళులు) కాని పరములగునపుడు ఉ ఆదేశముగా వచ్చి పూర్వమందున్న అకారముతోఁగూడి గుణసంధి ననుసరించి ఓ గా మాఱును. తప + ఉ + మహిమ - తపోమహిమ. ఇట్లే తపోవనము. తీవ్రకరాహతేందురేఖయుంబోలె - అలంకార ముపమ. నెమ్మనము - నెఱ + మనము. 'అన్యంబులకు సహిత మిక్కా ర్యంబులు కొండొకచోఁ గానంబడియెడి.' బాల. సంధి. 39

తే. పుడికి వైచిన మవ్వంపుఁ బొఱయుఁబోలె
వాడి సొమరుచు మేఁదీఁగ వంది కంది
వెలఁది నీవింత వగఁగూరి విన్నఁబాఱి
యునికి దుఃఖాబ్ధి మ మ్మిడి యునికి కాదె! 3

అర్థము : వెలఁది = అమ్మాయీ!, పుడికివైచిన = త్రుంచివైచిన, మవ్వంపుఁబొఱ (ర) యున్ + పోలెన్ = మృదువైన పయిపట్టు విధమున, మేఁదీఁగ (మే + తీఁగ) = లతవంటి మేను. వాడి = మ్లానమయి, సొమరుచున్ = వెలవెలఁబాఱుచు, వంది = వివర్ణమయి, కంది = తేజోహీనమయి, నీవు, ఇంత, వగన్ + కూరి = దుఃఖించి, విన్నఁబాఱి = వికాసముచెడి, ఉనికి = ఉండుట, మమ్మున్, దుఃఖ + అబ్ధిన్ = దుఃఖమనెడు సముద్రమున, ఇడి + ఉనికి కాదె = పెట్టియుండుట కాదా !

తాత్పర్యము : అమ్మాయీ! త్రుంచివైచిన మృదువైన పయిపట్టువలె దేహాలత వాడిపోయి వెలవెలఁబాఱుచుండ నీ వింతదుఃఖమునొంది వికాసముచెడి యుండుట మమ్ము దుఃఖసముద్రమున ముంచుట కాదా ? - అగు ననుట.

విశేషములు : అలంకారము రూపకము.

మవ్వంపుఁబొఱ - మవ్వము + పొఱ - 'కర్మధారయంబులందు మువర్ణకంబు నకుం బుంపు లగు' బాల. సంధి. 32, మవ్వంపు + పొఱ 'సమాసంబుల నుదంతంబు లగు శ్రీసమంబులకుం బుంపులకుం బరుషసరళంబులు పరంబులగునపుడు నుగాగమం బగు.' బాల. సంధి. 25. మవ్వంపు + న్ + పొఱ. 'ద్రుతప్రకృతికముమీఁది పరుష ములకు సరళములగు.' బాల. సంధి. 16. మవ్వంపు + న్ + బొఱ. 'ఆదేశసరళము లకు ముందున్న ద్రుతమునకు బిందుసంశ్లేషములు విభాష నగు.' బాల. సంధి. 17. మవ్వంపుఁబొఱ. పొఱ - ఈ యర్థమున నీ గ్రంథమునమాత్రమే శకటరేఫ యుక్త ముగాఁ గనుపట్టుచున్నది, దుఃఖ+అబ్ధి-సవర్ణదీర్ఘసంధి దుఃఖమనెడి అబ్ధి-రూపకము.

వ. అని యనేకప్రకారంబులఁ దన్ను సంతరించుచున్నం బార్వతి విజాభి ప్రాయం బచలాధీశ్వరున కెఱింగింపు మని చతురిక కెఱింగించిన. 4

అ ర్థ ము : అని, అనేక ప్రకారంబులన్ = పెక్కువిధముల. తన్నున్, సంతరించుచున్ + ఉన్నన్ = ఓదార్చుచుండఁగా, పార్వతి, నిజ + అభిప్రాయంబు = తన తలఁపు, అచల + అధి + ఈశ్వరునకున్ = పర్వతాధిపతికి - హిమవంతునకు, ఎఱింగింపుము + అని, చతురికకున్, ఎఱింగించినన్.

తా త్ప ర్య ము : అని పెక్కురీతులఁ దన్ను ఓదార్చుచుండఁగాఁ బార్వతి తనతలఁపుఁ బర్వతరాజునకుఁ దెలుపుమని చతురికకుఁ జెప్పఁగా - తరువాతి పద్యముతో నన్వయము.

క. కడలేని విరహవేదన
ఇడుగడ పడుచుండుకంటె నీ భర మెల్లన్
మృడు నెయిదఁ దపోవర్తన
నొడలేర్చెద నరిగి దారుణోగ్రాటవులన్. 5

అ ర్థ ము : కడ - లేని = అంతములేని, విరహ - వేదనన్ = వియోగము వలని బాధచే, ఇడుగడ + పడుచున్ + ఉండుకంటెన్ = కష్టపడుచుండుటకంటె. ఈ - భరము + ఎల్లన్ = ఈ భారమంతయు, మృడున్ = శివుని, ఎయిదన్ = పొందుటకు, దారుణ + ఉగ్ర + అటవులన్ = భయంకరములైన అడవులందు, అరిగి = వెడలి. తపోవర్తనన్ = తపస్ (:) + వర్తనన్ = తపస్సుచేఁతచే, ఒడలు + ఏర్చెదన్ = శరీరమును దపింపఁజేయుదును.

తా త్ప ర్య ము : అంతములేని వియోగబాధచేఁ గష్టపడుచుండుటకంటె, శివునిఁబొందుటకు భయంకరాటవుల కేఁగి తపస్సుచేసి మేను తపింపఁజేసెదను.

వి శే ష ము లు : 'ఈ భర మెల్లన్' అనుదానికిఁ బద్యమున నన్వయ మంత సుగమముగా లేదు. దారుణోగ్ర - దారుణ + ఉగ్ర - గుణసంధి. దారుణోగ్రాటవులు - దారుణోగ్ర + అటవులు - సవర్ణదీర్ఘసంధి. అటవి (ప్రకృతి) - అడవి (వికృతి)

వ. అని విన్నపంబు సేసి 'పీడ్కొని చన నిశ్చయించినది' యని చతురిక
పలికిన విని తీవ్రానలాహతిని, నవనీతపిండంబునుంబోలె శోకానలా
హతిం గరంగుచు హిమవంతుం డనేక ప్రకారంబుల ననునయించుచుఁ
బ్రియనందననెత్తి కౌఁగిటికిం దిగిచికొని. 6

అర్థము : అని, విన్నపంబు + చేసి = మనవిచేసి. వీడ్కొని, చనన్ = పోవుటకు, నిశ్చయించినది, అని, చతురిక, పలికినన్, విని, తీవ్ర + అనల + ఆహతిని = తీవ్రమైన అగ్నియొక్క దెబ్బచే, నవనీత - పిండంబునున్ + పోలెన్= వెన్నముద్దవలె, కరంగుచున్, హిమవంతుండు, అనేక ప్రకారంబులన్ = పలురీతుల, అనునయించుచున్ = ఓదార్చుచు, ప్రియ - నందనన్ = అనుఁగుఁ గూఁతును, ఎత్తి, కౌఁగిటికిన్, తిగిచికొని = తీసికొని.

తాత్పర్యము : అని మనవిచేసి 'వీడ్కొని యేఁగ నిశ్చయించినది.' అని చతురిక పలుకఁగా విని తీవ్రమైన అగ్నిదెబ్బచే వెన్నముద్దవలెఁ గరఁగుచు హిమవంతుఁడు పెక్కువిధములనోదార్చుచు ననుఁగుఁగూఁతు నెత్తి కౌఁగిటఁ జేర్చికొని.-తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : తీవ్రానలాహతిని .... కరంగుచు - అలంకార ముపమ.

చ. వలవదు తల్లి! నీకుఁ దగువాని వయోగుణరూపవంతు నీ
వలచినవానిఁ జేసెద; నవశ్యము నీవు తపంబు సేయఁ బోఁ
దలఁపకుమమ్మ; చిత్తపరితాపము సేయకుమమ్మ మాకుఁ; గో
మలి! వనదుర్గవాసము ప్రమాదమగున్ దగ దాఁడువారికిన్. 7

అర్థము : వలవదు - తల్లి = వలదమ్మా!, నీకున్, తగువానిన్ వయస్ (స) + గుణ - రూపవంతున్ = యౌవనము, సుగుణములు, అందము గలవానిని, నీ - వలచినవానిన్ = నీవు కోరినవానిని. అవశ్యమున్ = తప్పక, చేసెదన్ = పెండ్లిచేసెదను, నీవు, తపంబు + చేయన్ + పోన్ = తపమొనరింపఁబోవ, తలఁపకుము+అమ్మ! = ఎంచకుమమ్మా, కోమలి = ఇంతీ, మాకున్,

చిత్త - పరితాపము = మనస్సంతాపము, చేయకుము + అమ్మ. వన - దుర్గ-వాసము = అడవియందలి కష్టపుఁద్రోవలో నివసించుట, ప్రమాదము = అపాయము, అగున్, ఆఁడువారికిన్, తగదు.

తాత్పర్యము : వలదమ్మా! నీకుఁ దగినవానిని యౌవనవంతుఁడు, గుణవంతుఁడు, సౌందర్యవంతుఁడు అగువానిని నీవు కోరినవానిని దప్పక నీకు వివాహము గావించెదను. తపముచేయఁ బోనెంచకుమమ్మా! మాకు మనస్సంతాపమును గూర్చకుమమ్మా! కోమలీ! అడవులలో నివసించుట అపాయకరము. ఆఁడువారికిఁ దగదు.

విశేషములు : కాళిదాసు తన కుమారసంభవమున నీ మాటలను దల్లియగు మేనచేఁ గూఁతునకుఁ జెప్పింపఁగా, నీ కవి తండ్రిచేఁగూడఁజెప్పించెను.

నీ వలచినవాని - నీవు వలచిన వాని-'ధాతుజవిశేషణ భావార్థక పూర్వవ్యవహితావ్యవహిత కర్తృపదప్రథమకుఁ దఱచుగ యొక్క-షష్ఠి యగు'. ప్రౌఢ.కారక.15. నీ యొక్క-వలచినవాని. 'యొక్క-కు లోపంబు బహుళంబు.' ప్రౌఢ.కారక.16. నీ వలచినవాని. వయస్ + గుణ - వయః + గుణ - వయోగుణ. చూడు వచనము 2.

వ. అదియునుంగాక. 8

అర్థతాత్పర్యములు ; సులభములు.

విశేషములు: అదియునున్ + కాక = అదియునుం గాక. 'కొన్నియెడల ద్రుతంబుమీఁద నకారంబు గానంబడియెడి.' బాల.సంధి.21.

క. దొర యెఱిఁగి కోరవలదే
స్మరహరునకు నీకు హస్తిమశకాంతర మా
పరమునకు నీకుఁ బర్వత
పరమాణ్వంతరము తలఁపఁ బతి యెట్లగున్ ? 9

అర్థము : దొర = సామ్యము, ఎఱిఁగి, కోరన్ + వలదే, స్మర - హరునకున్ = మన్మథుని హరించినవానికి - శివునకు, నీకున్, హస్తి - మశక + అంతరము = ఏనుఁగునకును, దోమకును గల వాసి, ఆ పరమునకున్ = ఆ ఉత్కృ

ష్టునకును, నీకున్, పర్వత - పరమ + అణు + అంతరము = కొండకును అతి సూక్ష్మాణువునకును గల వాసి, తలఁపన్ = ఆలోచింపఁగా, పతి = భర్త, ఎట్టులు+ అగున్.

తాత్పర్యము: సామ్యమెఱిఁగి కోరవలదా? ఆ శివునకును నీకును ఏనుఁగునకును దోమకును గల వాసి, ఆ ఉత్కృష్టునకును నీకును గొండకును బరమాణువునకును గల వాసి, చూడఁగా నతఁడు నీకు భర్త యె ట్లగును?

విశేషములు: అలంకారము విషమము, యథాసంఖ్యము. దొర - 'సరియుద్ది ప్రతి దిస్సు సవతు పోలిక దొర జత యనఁగా సదృశమున కెసఁగు'. సాం.ని. పరమ + అణు = పరమాణు - సవర్ణదీర్ఘసంధి. పరమాణు + అంతరము= పరమాణ్వంతరము - యణాదేశసంధి 'ఇ ఉ ఋ ౠ లకు అసవర్ణములయిన అచ్చులు పరములగునపుడు క్రమముగా య్, వ్, ర్, ల్, లు ఆదేశము లగును.

ఆ. చిఱుత వెదిరి నిన్ను నెఱుఁగవు గాన నీ
యర్థి కారణముగ ననియె దబల,
వాసవాదు లతని దాసులుఁగాఁ గాన
రేను మామ గాఁగ నేల కూడు? 10

అర్థము: అబల! = ఇంతీ!, చిఱుతవు = చిన్నదానవు, ఎదిరిన్, నిన్నున్, ఎఱుఁగవు, కానన్ = కావున, నీ - అర్థి - కారణముగన్ = నీ కోరిక కారణముగా, అనియెదు=అనియెదవు, వాసవ + ఆదులు=ఇంద్రుఁడు మున్నగువారు, అతని-దాసులున్ = అతని దాసులుకూడ, కాన్ = అగుటకు, కానరు = చాలరు, ఏను = నేను, మామ, కాఁగన్ = అగుటకు, ఏల, కూడున్ = సంభవించును!

తాత్పర్యము: ఇంతీ! నీవు చిన్నదానవు, ఎదిరిని నిన్నుఁ గానవు. నీ కోరిక ననుసరించి పలుకుదువు. ఇంద్రాదులు అతని దాసులుగానైనఁ గానోపరు. అట్టిచో నేను అతనికి మామగా నగుట యెట్లు సంభవించును?

విశేషములు: అలంకారము కావ్యార్థాపత్తి.

వ. అనుచుండె మఱియు మేనక బాష్పాకులితలోచన యగుచు. 11

అర్థము : అనుచున్ + ఉండెన్, మఱియున్, మేనక, బాష్ప + ఆకులిత - లోచన = కన్నీటిచేఁ గలఁగిన కన్నులుగలది, అగుచున్.

తాత్పర్యము : అనుచుండెను. మఱియును మేనక కన్నీటిచేఁ గలఁగిన కన్నులుగలది యగుచు-తరువాతి పద్యముతో నన్వయము.

క. పూవోపూవో యని చే
రేవినఁ గందు నని యోసరిల్లెదు; నా మై
జీవంబు నిలుచునే ? నినుఁ
బో విడిచి మహోగ్రదుర్గముల పాల్పడఁగాన్. 12

అర్థము : పూవో పూవో, అని, చేన్ = చేతితో, రేవినన్ = రేఁగినన్= రేఁపినచో, కందున్ + అని = కందిపోవునని, ఓసరిల్లెదున్ = తొలఁగుదును, నినున్ = నిన్ను, మహత్ (మహా) + ఉగ్ర - దుర్గముల - పాల్ + పడఁగాన్= మిక్కిలి భయంకరములైన దుర్గమప్రదేశములపాలగుటకు, పోన్ + విడిచి, నా - మైన్ = నా మేన, జీవంబు = ప్రాణము, నిలుచునే ?

తాత్పర్యము : పూవో పూవో యని చేతితో రేఁపినంతమాత్రముననే కంది పోవునని తొలఁగుదును, నిన్ను మహాభయంకరదుర్గములపాలుగాఁ బోవిడిచి నా మేనఁ బ్రాణము నిలుచునా ? నిలువ దనుట.

విశేషములు : పూవో పూవో యనునది తెలుఁగుజాతీయము. నిన్నుఁ బోవిడిచి నా మై జీవంబు నిలుచునే-ఇట విడిచి యను క్త్వార్థమునకుఁ జేదర్థకత. విడిచి = విడిచినచో.

సీ. తలిరాకుకంటెను మెలపారు పదుగులు
ధరమీఁద మోపుడుఁ దెరలిపోవుఁ
గ్రొవ్విరితొవకంటెఁ గోమలంబగుమోము
రేయెండ ముట్టిన వోయుఁ దద్ద

దవనంపుఁబొరకంటె నవకంపుమెయిదీఁగె
వడగాలి సోఁకుడు వాడు లగ్గ
నాదిగర్భేశ్వరి వంటినఁ గందెడు
నెలకన్నెఱుంగవునేని ముంద

తే. ఁన్న యునికినె వెలువడ నుత్సహింపఁ
దలఁచితేనియు నిది తుదిఁదాఁక నెట్లు
నెయిదనేరదు కాన నీ వింద యుండి
కోర్కె సేకుఱ సర్వేశుఁ గొలువు మబల! 13

అర్థము: తలిరాకుకంటెను (తలిరు + ఆకు) = చివురాకుకంటెను, మెలపారు + అడుగులు = మృదువులైన పాదములు, ధర - మీఁదన్ = నేలపై, మోపుడున్ = మోపినంతనే, తెరలిపోవున్ = కాలిపోవును.

క్రొవ్విరి (క్రొత్త + విరి) - తొవకంటెన్ = క్రొత్తగా విరిసిన కలువ కంటెను, కోమలంబు + అగు = సుందరమైన, మోము, రేయెండ = వెన్నెల, ముట్టినన్ = తాఁకినచో, తద్దన్ = మిక్కిలి, నోయున్ = నొచ్చును.

దవనంపుఁబొర (దవనము + పొర) కంటెన్ = దవనము పైపట్టకంటెను, నవకంపు - మెయి - తీఁగె = మృదువైన దేహలత, వడగాలి = వేఁడిగాలి, సోఁకుడున్ = సోఁకినంతనే, లగ్గన్ = మిక్కిలి, వాడున్ = వాడిపోవును.

ఆదిగర్భేశ్వరివి = పుట్టిననాఁటఁగోలె శ్రీమంతురాలవు, అంటినన్ = తాఁకినచో, కందెదు = కందెదవు - వాడుదువు. ముందరన్ = ముందు, నెలకన్నెఱుంగవు నేనిన్ = అచంద్రంపశ్యవు - చంద్రునిఁగూడ జూచియెఱుఁగవు.

ఉన్న + ఉనికినె = ఉన్నట్లుండఁగనే, వెలువడన్ = బయటికివచ్చుటకు, ఉత్సహింపన్ + తలఁచితి (వి) + ఏనియున్ = ఉత్సాహపడఁగోరినదానవయినను, ఇది = ఈకార్యము, తుదిఁదాఁకన్ = నెఱవేఱుటకు, ఎట్లున్ = ఏ విధముగను, ఎయిదన్ + నేరదు = సాగఁజాలదు, కానన్ = కావున, అబల = ఇంతీ!

నీవు, ఇందున్ + అ = ఇందే. ఉండి, కోర్కె = కోరిక, చేకుఱన్=సిద్ధించుటకు, సర్వ + ఈశున్ = సర్వేశ్వరుని, కొలువుము = సేవింపుము.

తాత్పర్యము : చివురాకుకంటెను మృదువులైన పాదములు నీవి. వానిని నేలపై మోపినంతనే కాలిపోవును. క్రొత్తగా విరిసిన కలువకంటెను గోమలమైన నీ ముఖము వెన్నెల తాఁకినచో మిక్కిలి నొచ్చును, దవనము పైపట్టకంటెను నవకమైన నీ దేహలత వడగాడ్పు సోఁకినంతనే మిక్కిలి వాడిపోవును. నీ వాదిగర్వేశ్వరివి. అంటినఁ గందిపోవుదానవు. ముందు అచంద్రదంపశ్యవు. ఉన్నట్లుండఁగనే బయటికి రా నుత్సాహముఁజూపఁగోరితివేనియు నీ కార్య మెట్లును జివరకు సిద్ధింపనేరదు. కావున నీ విందేయుండి కోరికనెఱవేఱ సర్వేశ్వరు సేవింపుము.

విశేషములు : తలిరాకు - తలిరు + ఆకు - 'కర్మధారయంబునందుఁ బేర్వాదిశబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమంబు విభాష నగు' బాల.సంధి.29. ఇది టుగాగమము రాక ఉత్వసంధి జరగిన రూపము. క్రొవ్విరి = క్రొత్త + విరి. తొవ = తొగ (రూ.), దవనంపుఁబొర = దవనము + పొర - పుంప్వాదేశ, నుగా గమ, ద్రుతకార్యములు. నవకంపుమెయిఁదీఁగె - నవకము + మెయిఁదీఁగె - పుంప్వా దేశము. కందెదు-కంద్రెదవు. లాద్వకారమునకు వైకల్పికలోపము, అపదాదిస్వరసంధి. నేని = ఏని - అప్యర్థకము. 'నీవును జూచితట్టిసభనేని వినంబడ దే యుగంబులన్'- నన్నయ.భార.సభా.2.95. తలఁచితేనియు - తలఁచితివి + ఏనియు - లిద్వకారమునకు వైకల్పికలోపము, మధ్యమపురుషేకారసంధి. కోర్కె-కోరికె. కోరికి, కోర్కి, కోరిక- (రూపాం), కోర్కెసేకుఱ = కోర్కె + చేకుఱ - గసడదవాదేశము.

వ. అని మేనక కూఁతు ననునయంబునం బట్టుకొలుపుచుండె నంత
నంతిపురంబునం గల వృద్ధకంచుకిప్రౌఢాంగనలుఁ దమ బలిమియుం
గలిమియు మెఱయుచు నగజ భంగించుచు నగ్గించుచు. 14

అర్థము : అని, మేనక, కూఁతున్, అనునయంబునన్ = ఓదార్పుతో. పట్టుకొలుపుచున్ + ఉండెన్ = పట్టువఱుచుచుండెను. అంతన్, అంతిపురంబునన్= అంతఃపురమునందు, కల = ఉన్న. వృద్ధకంచుకిప్రౌఢ + అంగనలున్ = వృద్ధ కంచుకులైన జాణలగు స్త్రీలు, తమ, బలిమియున్ = శక్తియును, కలిమియున్ =

వంపదయు, మెఱయుచున్ = మెఱయించుచు, అగజన్ = పార్వతిని, భంగించుచున్ = మందలించుచు, అగ్గించుచున్ = పొగడుచు.

తాత్పర్యము: అని మేనక పుత్రిక నోదార్పుతోఁ బట్టువఱుచుచుండెను. అంత నంతఃపురమునందలి వృద్ధకంచుకులైన జాణలగు స్త్రీలు తమ శక్తి యుక్తులను బ్రదర్శించి పార్వతిని మందలించుచు, పొగడుచు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: పట్టుకొలుపు - పట్టుకొను ప్రేరణరూపము - అంగీకరింపఁ జేయు. మెఱయుచు - మెఱయించుచు - అంతర్భావితప్రేరణము.

క. ఆలవు బేలవు కడుఁ గొమ
రాలవు కోమలివి ముద్దరాలవు దగ మం
చాలవు బేలవు గా కిది
కాలమె తపమున కపారకాంతారములన్? 15

అర్థము: ఆలవు = స్త్రీవి, బేలవు = అమాయికురాలవు, కడున్ = మిక్కిలి, కొమరాలవు = సుందరివి, కోమలివి = సుకుమారవు, ముద్దరాలవు = బేలవు - ముగ్ధవు. తగము = అనర్హలము, అంచున్ = అని, ఆలవు - బేలవు + కాక = అమాయికురాలవు గాకపోవుచో, అపార - కాంతారములన్ = పారము (మితి)లేని, అడవులలో, తపమునకున్, ఇది, కాలమె = సమయమా?

తాత్పర్యము: స్త్రీవి, అమాయికురాలవు మిక్కిలి సుందరాంగివి. సుకుమారవు, బేలవు. ఈ పనికిఁ దగము అనుచు, బేలవైన స్త్రీవి గాక, అపారములైన అడవులలోఁ దపస్సుచేయుట కిది యదనా? కా దనుట,

విశేషములు: తగ మం చాలవు - తగన్ - మంచి + ఆలవు = మంచిస్త్రీవి - అనియా విభజనము? తగము + అంచున్ + ఆలవు అనియా విభజనము? అన్వయ మించుక క్లేశకరముగ నున్నది. తగదుంజాలవు అను పాఠమును గనుపట్టు చున్నది.

ఆ. ఇడ్డ బొట్టు వోలె నింటిలో నుండక
యాఁడుదాన వింత యదరి బాస
నడవిలోనఁ దపము వడఁబోదు నను నింత
జఱభితనము లెందుఁ గఱచి తీవు ? 16

అర్థము : ఇడ్డ - బొట్టు + వోలెన్ = పెట్టిన బొట్టువలె, ఇంటిలోన్, ఉండక, ఆఁడుదానవు, ఇంత, అదరి = విజృంభించి, బాసన్ = ప్రతిజ్ఞతో. అడవిలోనన్, తపము+పడన్+పోదున్=తప మొనరింపఁబోవుదును, అను, ఇంత=ఇంతటి, జఱభితనములు = తెగువలు, ఈవు = నీవు, ఎందున్ = ఎక్కడ, కఱచితి (వి)= నేర్చితివి ?

తాత్పర్యము : పెట్టినబొట్టువలె నింటియందుఁ గుదురుగా నుండక, ఆఁడుదానవు, ఇంత విజృంభించి, ప్రతిజ్ఞచేసి, యడవిలోఁ దపస్సుచేసెద నను నింతటి తెగువ నీ వెందునేర్చితివి ?

విశేషములు : ఇడ్డ = ఇడిన - 'పద్వాదుల నవర్ణకంబున కత్వంబును గడహల్లునకు ద్విత్వంబును విభాష నగు' ; 'బాల.క్రియ.51, ఇడ్డ బొట్టు వోలె-పెట్టిన బొట్టువలె-స్థిరముగా - జాతీయము. తపము వడన్ = తపము + పడన్ = తపముఁ బూనన్, జఱభి = తెగువగలది - 'తన వర్ణకంబు త్వార్థంబునందగు,' బాల.తద్ధిత.1. కఱచితి + వి+ ఈవు - లిద్వకారమునకు వైకల్పికలోపము - అపదాదిస్వరసంధి, మధ్యమపురుషేకారసంధి.

సీ. హరిఁ దెత్తుమే నీకు నమ్మాడువడియుండఁ ?
బరమేష్ఠిఁ దెత్తుమే బంటుఁజేసి ?
దేవేంద్రుఁ దెత్తుమే నీ వేలఁ గొనియుండ ?
నురగేంద్రుఁ దెత్తుమే యురులుగొలిపి ?
శశిఁ దెత్తుమే నీకు సంబవు లిడి యుండ ?
ధననాథుఁ దెత్తుమే దాసుఁజేసి ?
రవిఁ దెత్తుమే నీకు రమణుండుగా ? నల
కూబరుఁ దెత్తుమే కోలుకొలిపి

తే. మదనసంహరుఁ డొక్కఁడు మాకు నెలసి
వచ్చు రాఁ డవుఁగా కెట్టివారినైన
నొరుల నొకవ్రేలిమిడిఁదిరుల్ మరుల కొలిపి
తివియమే దేవి! నీ యట్టి దీము గలుగ? 17

అర్థము: దేవి = దేవీ! పార్వతీ!

నీకున్, అమ్ముడు + పడి + ఉండన్ = అమ్ముడుపోయియుండునట్లు, హరిన్ = విష్ణువును, తెత్తుమే = తీసికొనివత్తుమా?

బంటున్ + చేసి = సేవకునిగాఁజేసి, పరమేష్ఠిన్ = బ్రహ్మను, తెత్తుమే?

నీ - వేలన్ + కొని + ఉండన్ = నీ దాస్యము నంగీకరించియుండునట్లు, దేవ + ఇంద్రున్, తెత్తుమే?, ఉరులు + కొలిపి = వలలోవైచి, ఉరగ+ఇంద్రున్= నాగరాజును, తెత్తుమే?

నీకున్, సంబవులు = పాదరక్షలు, ఇడి + ఉండన్ = ఇచ్చుటకు, శశిన్ = చంద్రుని, తెత్తుమే?. దాసున్ + చేసి = దాసునిగాఁజేసి, ధన - నాథున్ = కుబేరుని, తెత్తుమే?

నీకున్, రమణుండు + కాన్ = ప్రియుఁడుగా, రవిన్ = సూర్యుని, తెత్తుమే? కోలుకొలిపి = ప్రోత్సాహపఱిచి, నలకూబరున్, తెత్తుమే?

మదన - సంహరుఁడు = మన్మథుని సంహరించినవాఁడు - ఈశ్వరుఁడు, ఒక్కఁడు, మాకున్, ఎలసి = వశపడి, వచ్చున్ - రాఁడు + అవున్ + కాక = రావచ్చును, రాకపోవచ్చునుగాక, నీ + అట్టి = నీవంటి, దీము = దీమము, ఎర, కలుగన్ = కలుగఁగా, ఒరులన్ = ఇతరులను - శివేతరులను, ఎట్టివారిన్ + ఐనన్, ఒక - వ్రేలిమిడిన్ = ఒక చిటికెలో, తిరుల్మరులుకొలిపి = వెఱ్ఱిప్రేమమును బుట్టించి, తివియమే = ఆకర్షింపమా?

తాత్పర్యము: దేవీ! నీకమ్ముడువడియుండునట్లు విష్ణువును దెత్తుమా? సేవకునిగాఁజేసి బ్రహ్మను దెత్తుమా? నీకు దాస్యమొనరింప దేవేంద్రునిఁ దెత్తుమా?

పశపఱుచుకొని నాగరాజును దెత్తుమా? నీకుఁ బాదరక్షలు మోయఁ జంద్రునిఁ దెత్తుమా? నీకు దాసునిగాఁజేసి కుబేరునిఁ దెత్తుమా? నీకుఁ బ్రియుఁడగునట్లు సూర్యునిఁ దెత్తుమా? ప్రోత్సాహపఱిచి నలకూబరునిఁ దెత్తుమా? ఈశ్వరుఁ డొక్కఁడు మాకు వశపడి రావచ్చును, రాకపోవచ్చునుగాక। నీవంటి యెర యుండఁగా నిఁక నితరులనెట్టి వారినైనను ఒక చిటికెలో వెఱ్ఱిప్రేమమును గలిగించి ఆకర్షింపమా?

వి శే ష ము లు : తెత్తుమే - తెచ్చు ధాతువు. 'తద్ధర్మాదులందు లాట్టగు' బాల.క్రియ,5. తెచ్చు+లాట్టు. 'లకారంబునకు డు ౙు వు రు ను ముఙ్ఞగు.' బాల.క్రి.8. ఉత్తమపురుషబహువచనమున-తెచ్చు+ము. లాట్టు రుఙ్ఞు పరంబగునపుడు దుగాగమం బగు.' బాల.క్రియ.22.తెచ్చు+దు+ము. 'చువర్ణంబుతోడ దుగ్గకారంబు తకారంబగు' బాల. క్రియ.108. తెచ్ + చుద్+ఉ + ము - తెచ్ + త్ + ఉ + ము - చ త ల సంయోగము విజాతీయముగాన నిర్దేశానుసారముగ చకారము తకార మగును. తెత్తుము. 'తద్ధర్మభూతక్రియ లార్థ్యాద్యర్థపరకంబులయి ప్రశ్నార్థకంబులగు' ప్రౌఢ.క్రి.3. తెత్తుము+ ఏ - 'ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధియగు' బాల.సంధి, 1.తెత్తుమే. దీము - దీమము (రూపాం), పశుపక్ష్యాదులను వశముచేసికొనుటకై యేర్పఱిచిన పశుపక్ష్యాదికము.

వ. అని యనేకప్రకారంబులఁ దన్ను సిబ్బిద్దిపడం బలుకుచున్నవారి నందఱం గటాక్షించి చూచి కోప రసభరితాకుంచితభ్రూలతారక్త నయనాస్ఫురితాధర యగుచు గిరినందన పరిచ్ఛేదించి. 18

అ ర్థ ము : అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కు విధముల, తన్నున్, సిబ్బిద్ది + పడన్ = అనునయించునట్లు (?), పలుకుచున్ + ఉన్న - వారిన్ + అందఱన్, కటాక్షించి - చూచి = క్రీఁగంటితోఁజూచి, కోప .... తాధర : కోప - రస = క్రోధమనెడిరసముతో, భరిత = నిండిన, ఆకుంచిత = వంపఁబడిన, భ్రూ - లతా = బొమతీవలు, ఆరక్త - నయన = ఎఱ్ఱనికన్నులు, ఆస్ఫురిత + అధర = 'చలించిన క్రిందిపెదవి గలది, అగుచున్, గిరి - నందన = కొండకూఁతురు - పార్వతి పరిచ్ఛేదించి = భాగించి (?)

తా త్ప ర్య ము : అని పెక్కువిధములఁ దన్ను అనునయించునట్లు పలుకుచున్నవారినందఱను గ్రీఁగంటఁజూచి క్రోధరసముతోనిండి వంపఁబడినబొమ

తీవలు, ఎఱ్ఱనైన కన్నులు,చలించిన క్రిందిపెదవి గలది యగుచుఁ బార్వతి విభజించి - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : వారి సందఱం గటాక్షించి చూచి .... నయనాస్ఫురితాధర యగుచు - అలంకారము స్వభావోక్తి.

చ. చెవుడుపడంగ నల్గడలఁ జీఱుచు నన్నొకవెందుచేసి మీ
రివి యవి యంచు బుజ్జనము లిన్నియు నెన్నఁగ నేల ? నాకు నీ
భవమున నీశ్వరుండ పతి. ప్రాణము దేహముఁ జిత్తవృత్తులున్
శివపదపంకజార్పణము సేసితిఁ, బాసితి మీకు నింతతోన్. 19

అర్థము : చెవుడు - పడంగన్ = చెవు డేర్పడునట్లు, నల్గడలన్ = (నలు + కడలన్) = నాలుగు దిక్కులను, చీఱుచున్ = పిలుచుచు, నన్నున్, ఒక, వెందు = తనకు వశపడుటకై తుమ్మెదలు మధ్యనుంచి పాడెడు పురుగును, చేసి, మీరు, ఇవి, అవి, అంచున్, బుజ్జనములు = ఉపలాలనములు, ఇన్నియున్, ఎన్నఁగన్ + ఏల ? = పలుకు టెందులకు ?, నాకున్, ఈ - భవమునన్ = ఈ పుట్టువున, ఈశ్వరుండు + అ = ఈశ్వరుఁడే, పతి, ప్రాణమున్, దేహమున్ = శరీరమును, చిత్త - వృత్తులున్ = మనోవ్యాపారములును, శివ - పద - పంకజ + అర్పణము = శివుని పాదపద్మముల కర్పణము, చేసితిన్, ఇంతతోన్ = ఇంతటితో, మీకున్, పాసితిన్ = మిమ్ము వీడితిని.

తాత్పర్యము : చెవు డేర్పడునట్లు నాలుగుదిక్కులను బిలుచుచు నన్నొక వెందుచేసి మీరు ఇవి యని యిన్నిబుజ్జగింపుమాటలు పలుకనేల ? నాకీ పుట్టువున నీశ్వరుఁడే భర్త. నేను నా ప్రాణమును, శరీరమును, మనోవ్యాపారములును శివపాద పద్మముల కర్పణముచేసితిని, ఇంతటితో మిమ్ము విడిచితిని.

వ. అని తెగం బలికిన మాఱువలుక నోడి గిరినందన తపోవనంబునకుం బోవుట కందఱు సమ్మతించి. 20

అర్థము : అని, తెగన్ + పలికినన్ = ఖండితముగాఁ బలుకఁగా, మాఱు + పలుకన్ + ఓడి = అడ్డుచెప్పుటకు జంకి, గిరినందన = పార్వతి, తపస్ (ః) + వనంబునకున్, పోవుటకున్, అందఱున్, సమ్మతించి = అంగీకరించి.

తాత్పర్యము : అని నిశ్చితముగాఁ బలుకఁగా నందఱును అడ్డుచెప్పుటకు జంకి పార్వతి తపోవనమున కేఁగుట కంగీకరించి-తరువాతి పద్యముతో నన్వయము,

తరువోజ. "బాలవు ; నీకు నిప్పటఁగోలె నీ త
పం బిది గైకొని పారమేదింపఁ
బోలదు వల"దని బుద్ధులు చెప్పఁ
బోయిన మా మాటఁ బోవక మమ్ము
నేలిదముగఁ జేసి యెప్పని వోయె
దేని, నక్కడ నీవ యెఱుఁగుదు ; నిన్ను
వాలాయముగ నాఁగవచ్చునె ? యింత
వలవంతతన మాఁడువారికిఁ దగునె ?" 21

అర్థము ; బాలవు - చిన్నపిల్లవు, నీకున్, ఇప్పటన్ + కోలెన్ = ఇప్పటినుండియు, ఈ - తపంబు, ఇడి, కైకొని=అంగీకరించి, పారము+ఏదింపన్= ఆవలిదరిని బొందించుట, పోలదు = జరుగదు, వలదు, అని, బుద్ధులు. చెప్పన్ + పోయినన్ = చెప్పఁబోఁగా, మా - మాటన్ + పోవక = మా మాటననుసరింపక, మమ్మున్, ఏలిదముగన్ + చేసి = చులుకనచేసి, ఎప్పని + పోయెదు+ఏనిన్= నిరాకరించిపోవుదువేని, అక్కడన్, ఈవు + అ=నీవే, ఎఱుఁగుదు (వు), నిన్నున్, వాలాయముగన్ = బలవంతముగా, ఆఁగన్ + వచ్చునె = ఆఁపశక్యమా?, ఆఁడువారికిన్, ఇంత, వలవంతతనము = మన్మథవ్యథ, తగునె ?

తాత్పర్యము : చిన్నపిల్లవు, నీ కిప్పటినుండియు నీ తపముఁబూని చివరి వఱకు సాధించుట జరుగదు, వద్దని బుద్ధులుచెప్పఁబోఁగా మా మాట వినక మమ్ముఁ జులుకనచేసి నిరాకరింతువేని అట నీకే తెలియును. నిన్ను బలవంతముగా నాఁపఁదరమా? ఆఁడువారి కింత మన్మథవ్యథ తగదు,

వ. అనుచుండి రంత హిమవంతుండు నారదాదేశమ్ముఁ దలంచి. 22

అర్థము : అనుచున్ + ఉండిరి, అంతన్, హిమవంతుండు, నారద + ఆదేశమ్మున్ = నారదుని ఆజ్ఞను, తలంచి,

తాత్పర్యము : అనుచుండిరి. అంత హిమవంతుఁడు నారదుఁ డానతిచ్చిన విధమును స్మరించి - తరువాతి పద్యముతో నన్వయము.

క. హరిణాక్షి తపోబలమునఁ
బరమేశ్వరుఁ గూడఁబడయుఁ; బరమార్థం, బ
త్యురుతర తపమునకు సవి
స్తరశివయోగంబ కాదె తగు ఫల మెందున్ ? 23

అర్థము : హరిణ + అక్షి = లేడికన్నులవంటికన్నులుగలది - పార్వతి, తపస్ (సు) + బలమునన్ = తపశ్శక్తిచేత, పరమేశ్వరున్ = శివుని, కూడన్ + పడయున్ = పొందఁగలదు, పరమ + అర్థంబు = తప్పదు, ఎందున్, అతి + ఉరు తర - తపమునకున్ = మిక్కిలిగొప్పతపస్సునకు, తగు - ఫలము, సవిస్తర - శివ - యోగంబు + అ - కాదె = సవిస్తరముగా శివునితోఁ గూడుటయే కదా !

తాత్పర్యము : పార్వతి తపశ్శక్తిచేఁ బరమేశ్వరునిఁ బొందఁగలదు. తప్పదు. ఎచ్చటనైనను మిక్కిలిగొప్పతపమునకుఁ దగినఫలము శివునితో సవిస్తరముగాఁ గూడుటయే కదా !

విశేషములు: విశేషము సామాన్యముచే సమర్థింపఁబడుటచే నలంకారము అర్థాంతరన్యాసము.

వ. అని నిశ్చయించి నిజతనయ తపోవనంబునకుం జనుట కొడంబడియె నంతఁ బార్వతి జననీజనకాదివృద్ధజనంబుల వీడుకొని మహా హర్షంబున నిజనివాసంబునకుం జనుదెంచి గమనోద్యోగంబు సేయుచు. 24

అర్థము : అని, నిశ్చయించి, నిజ - తనయ = తనదైనకూఁతురు- పార్వతి. తపస్ (కు) + వసంబునకున్, చనుటకున్ = పోవుటకు, ఒడంబడియెన్= అంగీకరించెను, అంతన్. పార్వతి, జననీ - జనక + ఆది - వృద్ధ - జనంబులన్= తల్లి తండ్రి మున్నగు పెద్దవారిని, వీడుకొని=వీడి, మహత్ (మహా)+హర్షంబునన్= గొప్ప సంతోషముతో, నిజ-నివాసంబునకున్=తనదైన ఉనికిపట్టునకు. చనుదెంచి = వచ్చి, గమన + ఉద్యోగంబు = పోవయత్నము, చేయుచున్.

తాత్పర్యము ; అని నిశ్చయించి తన కూఁతురు తపోవనమునకుఁ బోవుట కంగీకరించెను. అంతఁ బార్వతి తల్లిదండ్రులు మున్నగు పెద్దలను వీడ్కొని మిక్కిలి సంతోషముతోఁ దన నివాసమునకు వచ్చి. పోవుటకు యత్నముచేయుచు- తరువాతి పద్యముతో నన్వయము,

మ. హరిణీ ! వచ్చెదె కానకుం దపము సేయంబోద మంచున్ మృగిం
బురుడున్; మామిడి, నీవు గ్రమ్మఱెదె నన్ బోఁజోపి యంచు న్నవా
జిరచూతంబును గౌఁగిలించుకొను, నా చే వాయుడుంగాక మ
ద్గురువృత్తస్తన సంగతిం దొఱఁగితే ఘోషావతీ ! నీ వనున్. 25

అర్థము : హరిణీ ! అఁడులేడీ ! తపము + చేయన్+ పోదము, కానకున్ అడవికి. వచ్చెదె = వత్తువా ? అంచున్, మృగిన్ = ఆఁడులేడిని, పురుడున్ = నిమురును, మామిడి = ఓమామిడీ, నన్ = నన్ను, పోన్ + చోపి = పోవనంపి, నీవు. క్రమ్మఱెదె = మరలిపోవుదువా ? అంచున్, నవ + అజిర - చూతంబునున్= ముంగిటనున్న క్రొమ్మావిని, కౌఁగిలించుకొనున్, ఘోషావతీ = ఓ వీణా ? నీవు, నా చే + పాయుడున్ + కాక= నా చేయి వీడుటయేకాక, మత్ + గురు - వృత్త స్తన - సంగతిన్ = నా పెద్దవియు, వర్తులములు నగు కుచముల సాంగత్యమును. తొఱఁగితే (తొఱఁగితివి + ఏ) = విడిచితివా ?, అనున్.

తాత్పర్యము : 'హరిణీ ! తపము చేయఁబోవుదము, అడవికి వత్తువా ;' అని యాఁడులేడిని నిమురుచు నడుగును. 'మామిడీ ! న న్నంపి నీవు మరలుదువా ?' యని ముంగిటనున్న క్రొమ్మావిని గౌఁగిలించుకొనును, 'వీణా ! నీవు నా చేతినుండి తొలఁగుటకాక పెద్దవియు, వర్తులములు నగు నా కుచముల సాంగత్యమును విడిచితివా ?' యనును,

విశేషములు : పురుడు - ప్రేమముతో సమత్వముచూపు. నిమురు. విశేష్య మైనపుడు - జాతాశౌచము, స్పర్ధ, పోలిక. పోదము - పోవు ధాతువు. 'ఆశీర్నాపసం ప్రార్థనవిధులందు లూట్టగు.' బాల. క్రియ. 6. పోవు + లూట్టు- 'లకారంబునకు దు ఙ్రు వు రు ను ముఙ్ఞగు. బాల. క్రియ. 8. పోవు + ము. 'ఉభయ ప్రార్థనంబున దుగాగమంబున కత్వంబగు.' బాల. క్రియ. 36. లూట్టునకు దుగాగమము విధింపఁబడ లేదు కాని యీ సూత్రమున అత్వమును విధించిన సామర్థ్యముచే దుగాగమము, ఉత్వమున కత్వము రెండును నగును, పోవుదము. 'పోవునకు దుఙ్మత్తులు ముఙ్ఞం బరంబు లగునపుడు వు లోపంబుం బొద పదలను విభాష నగు.' బాల. క్రియ. 98. పోదము. చేయి, చే (రూపాం.) మత్ + గురు - అనునాసికాంతస్థ వర్ణములతప్ప మిగిలిన పదాంతగత హల్లులకు (ఝల్లులకు) మృదుహల్లులు (హశ్శులు) కాని అచ్చులు కాని పరములగునపుడు ఆ హల్లుల వర్గమునకుఁ జెందిన తృతీయవర్ణ మాదేశముగా వచ్చును. మద్గురు. వచ్చెదె - వచ్చు ధాతువు. 'తద్ధర్మాదులందు లాట్టగు.' బాల. క్రియ. 5. వచ్చు + లాట్టు. 'లకారంబునకు డు ఙ్రు వు రు ను ముఙ్ఞగు.' బాల. క్రియ. 8. వచ్చు + వు. 'లాట్టు రుఙ్ఞు పరంబగునపు డెదగాగమంబును ప్రథమ నువర్ణకంబు పరంబగు నపు డెడు గెడి గాగమంబులును బహుళంబుగా నగు.' బాల. క్రియ. 38. వచ్చు + ఎద + వు. 'అంద్వవగాగమంబులం దప్ప నపదాదిస్వరంబు పరంబగునపు డచ్చు నకు సంధి యగు' బాల. సంధి. 11, వచ్చెద + వు. 'లిఙ్లాట్టుల వకారంబునకు లోపంబు విభాష నగు,' బాల. క్రియ. 24. వచ్చెద + ఉ. అపదాది స్వరసంధి. బాల. సంధి. 11. వచ్చెదు + ఎ = వచ్చెదె. పార్వతి వీణకు 'ఘోషావతి' యనిపేరు.

వ. మఱియును. 26

తే. చెలువ తన చెల్మికత్తెలఁ బిలిచి, "నాకుఁ
గూర్చుగుమ్మలు నెవ్వ రీ కొమ్మలందు
వారు నేకొని రక్షింపవలయు వీని
ప్రాఁతిగా" నని యందఱఁ బట్టువఱిచి. 27

అర్థము : చెలువ = స్త్రీ - పార్వతి, తన - చెల్మికత్తెలన్, పిలిచి, నాకున్. ఈ కొమ్మల + అందున్ = ఈ యింతులలో - మీలో, కూర్చు - గుమ్మలు =

అనుఁగుఁజెలులు, ఎవ్వరు ?, వారు, వీనిన్, బ్రాఁతిగాన్ = ప్రీతిగా, చేకొని = స్వీకరించి, రక్షింపవలయున్, అని, అందఱన్, పట్టువఱిచి = వశపఱుచుకొని.

తాత్పర్యము ; పార్వతి తన చెలికత్తెలను బిలిచి 'మీలో నాకు అనుఁగుఁజెలు లెవ్వరో, వారు వీనిని బ్రీతితో స్వీకరించి రక్షింపవలయు' నని యందఱను అనునయముతో వశపఱుచుకొని-తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: చెల్మికత్తె - చెలి, 'పేర్వాదుల కిమి వర్ణకం బగు.' బాల. తద్ధి. 5, చెలి + ఇమి. అపదాదిస్వరసంధి, బాల. సంధి. 11. చెలిమి 'లాఁతి యచ్చునకు సహిత మొకానొకచో నుడి నడుమ లోపంబు గానంబడియెడి.' బాల. ప్రకీర్ణ. 18. చెల్మి. 'కా కత్తియవర్ణకంబులు పుంస్త్వస్త్రీత్వంబుల మతుబర్థంబునం దాటాదుల కగు.' బాల. తద్ధిత. 11. చెల్మికత్తె, బ్రాఁతి - ఇది సానుస్వారమనియు, నిరనుస్వారమనియు నభిప్రాయభేదములు గలవు. భారతాదిప్రయోగములు నిరనుస్వారమనుటకు నిర్ధారకములు. (సూ. ని.). గుమ్మలు నెవ్వరు - ఇందు 'గుమ్మలు' అనుదానిచివర నువర్ణమునకుఁ బ్రయోజనము గనుపట్టదు.

ఉ. "ఈ కలహంసిఁ బెంపు మదినేమఱ కీవు ; మయూరపోతముం
జేకొని పెంపు మీవు ; కవ చిల్కలఁ బెంపుము నీవు ; పెంపు మీ
కోకిల నీవు ; పెంపు మెలగోరఁట నీ; వెద మెచ్చఁ గొల్చి యే
నా కఱకంఠుఁ దోడ్కొని రయమ్మునఁ గ్రమ్మఱివచ్చునంతకున్." 28

అర్థము : ఏను = నేను, ఆ - కఱకంఠున్ = ఆ గరళకంఠుని - శివుని, ఎదన్ హృదయమునందు, మెచ్చన్ = మెచ్చుకొనునట్లు కొల్చి = సేవించి, తోడ్కొని = వెంటఁదీసికొని, రయమ్మునన్ = శీఘ్రముగా, క్రమ్మఱి = తిరిగి, వచ్చు + అంతకున్ = వచ్చు నంతవఱకు, ఈవు = నీవు, ఈ - కలహంసిన్ = ఈ రాజహంసిని, మదిన్ = మనస్సునందు, ఏమఱక = పరాకులేక, పెంపు = పోషింపుము, ఈవు, మయూర - పోతమున్ = నెమలిపిల్లను, చేకొని = స్వీకరించి, పెంపుము, నీవు, కవ - చిల్కలన్ = చిలుకల జంటను పెంపుము, నీవు, ఈ - కోకిలన్, పెంపుము, నీవు, ఎల - గోరఁటన్ = లేఁత గోరఁటను, పెంపుము,

తాత్పర్యము: "నేనా గరళకంఠుని, అతఁడు మదిలో మెచ్చుకొనునట్లు కొలిచి, వేగముగాఁ దీపికొనివచ్చునంతలో నీ పీ కలహంసిని బరాకులేక పెంపుము, నీ పీ నెమలిపిల్లను ఆదరించిపెంపుము, నీ పీ చిలుకలజంటను బెంపుము. నీ పీ కోకిలను బెంపుము. నీవు లేఁతగోరఁటను బెంపుము".

విశేషములు: పెంపు మది = పెంపుము + మది. 'మధ్యమపురుష మువర్ణకంబునకు హలవపానంబులు పరంబులగునపుడు లోపము విభాష నగు.' బాల.సంధి.47. కళకంఠుఁడు - 'ఆర్యవ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు.' బాల. సంజ్ఞా.23, చిన్నయ దీనిని గ్రామ్యమనఁగా, నిది గరకంఠశబ్దభవమనియు, బహుబ్రీహి యనియుఁ బ్రౌఢవ్యాకరణకర్త.

వ. అని నియమించుచున్నతఱిం బ్రియవయస్యలైన రాజనందనలు తమ యందఱకు వగ కల్గినకన్నెఱింగి. 29

అర్థము: అని, నియమించుచున్ + ఉన్న - తఱిన్ = నియమించుచున్న సమయమున, ప్రియ - వయస్యలు = అనుఁగుఁజెలులు, ఐన, రాజనందనలు = రాచ కూఁతులు, తమ + అందఱకున్, వగ = దుఃఖము, కల్గిన కన్నెఱింగి = కలిగిన జాడయెఱిఁగి,

తాత్పర్యము: అని నియమించుచున్న సమయమున ననుఁగుఁజెలులైన రాచకూఁతులు తమకందఱకు దుఃఖము కలిగిన జాడ తెలిసి - తరువాతి పద్యముతో నన్వయము,

సీ. 'పొలయించి నీ చూపు నలఁతులఁ గనఁగోరి
కొనిచూచు రాలేటికొదమ లివియుఁ
గడు మృదురీతి నీ నడపాడుగతికి రా
నని క్రాలి నడచు రాయంచ లివియు
భావించి నీ ముద్దుఁబలుకుల మెయివడి
బలవడఁ గఱచు రా చిలుక లివియుఁ
బాటించి నీ కేశపాశంబు మీఁదికిఁ
బొదివెంచు రానమ్మిపదుపు లివియుఁ

ఆ. దరుణి ! వీని నింత మఱపించి ననుపారఁ
బెనిచి నీవు ననఁగి పెనఁగి పెరిఁగి
'నేఁటి కెడఁద నింత నిర్మోహివై తెగ
విడిచెదమ్మ ! మమ్ము విడిచె దేని ?' 30

అర్థము ; తరుణి = ఓ యువతీ - పార్వతీ !

రాలేటి కొదమలు + ఇవియున్ = మేలైన ఈ జింకపిల్లలును, పొలయించి= ప్రసరింపఁజేసి, నీ - చూపు + అలఁతులన్ = నీ కన్నుల పరిమితులను, కనన్ + కోరికొని = చూడఁగోరి, చూచున్.

రాయంచలు + ఇవియున్ = ఈ రాజహంసములును, కడున్ = మిక్కిలి, మృదు - రీతిన్ = అందమైనవిధమున, నీ - నడపాడు - గతికిన్ = నీ నడచురీతికి, రాన్ + అని = వచ్చుటకని, క్రాలి = ఒప్పి, నడచున్.

రాచిలుకలు + ఇవియున్ = ఈ రాజకీరములును, భావించి = తలఁచి, నీ- ముద్దు + పలుకుల - మెయివడిన్ = నీ ఇంపైన పలుకులవిధమును, బలవడన్ = బలపడన్ = బలపడుపట్లు, కఱచున్ = అభ్యసించును.

రా - నమ్మి - పదుపులు + ఇవియున్ = ఈ రాచనెమలి (మేలైన నెమలి) గుంపులు, పాటించి = ప్రమాణముగాఁగొని, నీ - కేశ - పాశంబు - మీఁదికిన్ = నీ శిరోజముల సమూహముమీఁదికి, పొదివెంచున్ = పురివిచ్చును,

వీనిన్ = ఈ లేటికొదమలు మున్నగువానిని, ఇంత - మఱపించి = స్నేహముచే మరిగియుండునట్లుచేసి, ననుపారన్ = ప్రీతితో, పెనిచి = పెంచి, నీవున్, అనఁగి - పెనఁగి = కలసి మెలసి, పెరిఁగి. నేఁటికిన్ = ఈ నాఁటికి, ఎడఁదన్ = హృదయమునందు, ఇంత, నిర్మోహివి + ఐ = ప్రేమములేనిదానవయి, మమ్మున్, విడిచెదు + ఏనిన్ (విడిచెదవు + ఏనిన్) = విడిచిన విడుతువుగాక, తెగన్ = బంధము తెగిపోవునట్లు, విడిచెదు +అమ్మ (విడిచెదవు + అమ్మ) = విడుతువా ?

తాత్పర్యము : యువతీ ! పార్వతీ ! ఈ రాజింకపిల్లలు తమ చూపులను బ్రసరింపఁజేసి నీ కన్నులపరిమితులను జూడఁగోరును. ఈ రాయంచలును సుందరమైన నీ గమనవైఖరికి సరివచ్చునట్లు నడచును. ఈ రాచిలుకలును ఎంచి నీ ముద్దుపలుకుల

రీతిని గట్టిగా నభ్యసించును. ఈ రాచనెమలిగుంపులును నీ కేశపాశమును ప్రమాణముగాఁగొని దానిపైఁ బురివిచ్చును. ఇట్టి వీనిని ఇంత స్నేహముచే మరిగియుండునట్లు చేసి, ప్రీతితోఁ బెంచి, నీవును వానితోఁ గలసిమెలసి పెరిఁగి, యిప్పుడు హృదయమున నింత నిర్మోహవయి మమ్ము విడిచిన విడుతువుగాక, బంధము తెగిపోవునట్లు విడుతువా?

విశేషములు: అలంకార ముత్ప్రేక్ష. లేటి = లేడి. నమ్మి - నమలి, నెమలి. నెమ్మి (రూపాం.)

వ. అని యందఱకు వగపు పుట్టించి మనసు గుదియంబలుకుచున్న చెలికత్తెలం గనుంగొని నగజ నగుచు వారి నందఱిం బౌరజనంబుతోన వీడుకొలిపి చతురికాద్యాప్త సఖీజన పరివృతయై చని తపోవన ప్రవేశంబు సేసి. 31

అర్థము: అని, అందఱకున్. వగపు = దుఃఖము, పుట్టించి = కలిగించి, మనసు, కుదియన్ = క్రుంగునట్లు, పలుకుచున్ + ఉన్న, చెలికత్తెలన్, కనుంగొని, నగజ = పార్వతి, నగుచున్ = నవ్వుచు, వారిన్ + అందఱిన్. పౌర - జనంబుతోన్ + అ = పురజనులతోనే, వీడుకొలిపి = వీడుకొనఁజేసి. చతురికా + ఆది + ఆప్త - సఖీజన - పరివృత + ఐ = చతురిక మున్నగు ప్రియసఖీసమూహముచేఁ జుట్టఁబడినదయి, చని, తపస్ (ః) + వనప్రవేశంబు + చేసి = తపోవనమును ప్రవేశించి.

తాత్పర్యము: అని యందఱకును దుఃఖము గలిగించి మనసు క్రుంగునట్లు పలుకుచున్న చెలికత్తెలను జూచి పార్వతి నవ్వుచు, వారినందఱను బురజనులతోపాటే పంపివైచి చతురిక మున్నగు నెచ్చెలులతోఁగూడి తపోవనమును బ్రవేశించి - తరువాతి పద్యముతో నన్వయము.

క. గిరినందన గిరి నందన
తరు గుల్మ లతా నదీ నద ప్రాకట ని
ర్ఝర సరసీ పులిన తలాం
తరముల విహరించుచును ముదం బొదవ మదిన్. 32

అర్థము : గిరి - నందన = కొండకూఁతురు — పార్వతి, గిరి .... తరములన్ : గిరి = కొండలయందలి, నందన = ఉద్యానములలోని, తరు = చెట్ల, గుల్మ = పొదల, లతా = తీఁగల, నదీ = నదుల, నద = నదముల, ప్రాకట= ప్రసిద్ధమైన,నిర్ఝర - సరసీ = దివ్యసరస్సుల, పులిన - తల = ఇసుకప్రదేశముల, అంతరములన్ = లోపలిభాగములందు, మదిన్ = మనస్సునందు, ముదంబు = సంతోషము, ఒదవన్ = కలుగునట్లు, విహరించుచును = క్రీడించుచును.

తాత్పర్యము : పార్వతి కొండలయందలి యుద్యానవనములలోని చెట్ల, పొదల, తీఁగల, నదీనదముల, దివ్యసరస్సుల, యిసుకతిన్నెలయందు మనసునకు సంతోషముగలుగునట్లు విహరించుచు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : నది- నదము - పడమటినుండితూర్పునకుఁ బ్రవహించునట్టిది నది, తూర్పునుండి పడమటికిఁ బ్రవహించునట్టిది నదము.

సీ. అరుణాంఘ్రితలదీప్తి నవనీతలం బెల్లఁ
  బద్మరాగస్థలభాతి నొనర,
వదనేందుకాంతి దిగ్వదనకైరవములఁ
  గాలచంద్రాతపలీల నెనయ,
నధరారుణద్యుతి నారణ్యతరులతా
  సమితి పల్లవితవిభ్రమముఁ బడయఁ,
దనులత సుడియు నెత్తావి గైకొని సమీ
  రుఁడు గంధవహుఁ డను రూఢిఁ దనర,

ఆ. వఱలు నయనరుచుల వనమయూరములు వి
  ద్యుల్లతావలోకనోత్సవంబుఁ
బొరయ నరుగుదెంచెఁ దరువనస్థలి సువి
  రాజితముగ శైలరాజతనయ. 33

అర్థము : శైల - రాజ - తనయ = కొండలఱేని కూఁతురు - పార్వతి, అరుణ + అంఘ్రి - తల - దీప్తిన్ = ఎఱ్ఱని పాదతలముల కాంతిచే, అవనీ -

తలంబు + ఎల్లన్ = భూతలమంతయు, పద్మరాగ - స్థల - భాతిన్ = పద్మరాగ ప్రదేశము విధమున. ఒనరన్ = ఒప్పఁగను,

వదన + ఇందు - కాంతిన్ = ముఖమనెడి చంద్రునికాంతితో, దిశ్ (క్) + వదన - కైరవములు = దిక్కులయొక్క ముఖములనెడు కలువలు, అకాల - చంద్ర + ఆతప - లీలన్ = అకాలపు వెన్నెలవిలాసమును. ఎనయన్ = పొందఁగను.

అధర + అరుణ - ద్యుతిన్ = క్రిందిపెదవియొక్క యెఱ్ఱని కాంతిచే, ఆరణ్య - తరు - లతా - సమితి = అడవియందలి చెట్ల తీఁగల సమూహము, పల్లవిత - విభ్రమమున్ చిగిర్చినదనెడు విభ్రాంతిని, పడయన్ = పొందఁగను,

తనులత = తీఁగవంటి దేహము, సుడియు = ప్రసరించు, నెత్తావి (నెఱ + తావి) = పరిమళము. కైకొని = గ్రహించి. సమీరుఁడు = వాయువు. గంధవహుఁడు = పరిమళమును మోయువాఁడు, అను, రూఢిన్ = ప్రసిద్ధితో, తనరన్ = ఒప్పఁగను,

వఱలు = ప్రకాశించునట్టి, నయన - రుచులన్ = కన్నులకాంతులచే, వన - మయూరములు = అడవినెమళులు, విద్యుత్ + లతా + అవలోకన + ఉత్సవంబున్ = మెఱపుఁదీఁగలను జూచుటయందలి వేడుకను, పొరయన్ = పొందఁగను,

తరు - వన - స్థలి = చెట్లతోడి వనప్రదేశము, సు - విరాజితముగన్ = మిక్కిలి ప్రకాశింపఁగను, అరుగుదెంచెన్ = వచ్చెను.

తాత్పర్యము : ఎఱ్ఱని పాదతలములకాంతిచే భూతలమంతయుఁ బద్మరాగ ప్రదేశమట్లు ఒప్పఁగను, ముఖచంద్రకాంతిచే, దిఙ్ముఖములనెడి కలువలు అకాలపు వెన్నెలవిలాసమును పొందఁగను, క్రిందిపెదవి యెఱ్ఱనికాంతిచే నడవిలోనిచెట్ల తీఁగల సమూహము చిగిరించినదనువిభ్రాంతిని పొందఁగను, దేహలత ప్రసరింపఁజేయుపరిమళమును గ్రహించి వాయువు గంధవహుఁ డను ప్రసిద్ధితో నొప్పఁగను, ప్రకాశించు కన్నుల కాంతులచే నడవినెమళ్లు మెఱపుఁదీఁగలను జూచుటయందలివేడుకను పొందఁగను, చెట్లతోడి వనప్రదేశము మిక్కిలిప్రకాశింపఁగను పార్వతి వచ్చెను.

విశేషములు : వదనేందుకాంతి దిగ్వదనకైరవములు రూపకము. విద్యుత్ + లతా = విద్యుల్లతా - తవర్గవర్గములకు లకారము పరమగుచోఁబరసవర్ణము ఆదేశ మగును.

వ. తదవసరంబున. 34

అర్థతాత్పర్యములు : తద్ + అవసరంబునన్ = ఆ సమయమున తరువాతి పద్యముతో నన్వయము.

ఉ. పాయక వేరువెల్లఁకియుఁ బండులు నొండులుఁ గూరగాయలుం
గోయుచు నుక్కునం బులుల గోళులుఁ దోళులుఁ గొంచుఁ బేర్చునం
గూయఁ జంపి యేనుఁగుల కొమ్ములు నెమ్ములుఁ గొంచుఁ గానలో
నేయెడఁ దారయై పొలుచు నెర్కులు మొర్కులు నేకపాదులున్ 35

అర్థము : పాయక = విడువక, వేరు - వెల్లఁకియున్ = వేరుదుంపయును, పండులున్ = పండ్లును, ఒండులున్ = అన్యములును (?) కూర + కాయలున్, కోయుచున్, ఉక్కునన్ = బలముతో, పులుల - గోళులున్ = పులుల గోరులును, తోళులున్ = పులిచర్మములును, కొంచున్ = తీసికొనుచు, పేర్చునన్ = అతిశయ ముతో, కూయి + అఱన్ = కూఁత రాకుండునట్లు, చంపి, ఏనుఁగుల - కొమ్ములున్ = ఏనుఁగుల దంతములును, ఎమ్ములున్ = ఎముకలును. కొంచున్, కానలోన్ = అడవిలో, ఏ + ఎడన్ = ఎందును, తారు + ఆ + ఐ = తామే యయి, పొలుచు = ఒప్పునట్టి, ఎర్కులున్ = ఎఱుకులును. మొర్కులున్ = మొఱకులనెడి ఆటవిక జాతులును, ఏకపాదులున్ = ఏకపాదులనెడి ఆటవికులును.

తాత్పర్యము : వేరుగడ్డలును, పండ్లును, గూరగాయలును, విడువక కోయుచు, బలముతోఁ బులులగోరులును, చర్మములును గొనుచు, అతిశయముతో నేనుఁగులను అఱవకుండఁ జంపి వాని దంతములును, ఎమ్ములును గొనుచు నడవిలో నెందును దామే యయి యొప్పు నెఱుకువాం(డును, మొఱకువాం(డును. ఏకపాదులును- తరువాతి వచనముతో నన్వయము.

విశేషములు : వెల్లఁకి = గడ్డ, దుంప, ఇది 'వేరు' శబ్దపూర్వకముగనే ప్రయోగములఁ గానఁబడుచున్నది. కూర + కాయ • 'ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గ స డ ద వ ల గు.' బాల. సంధి. 15. కూరగాయలు, గోళులు - గోరు + లు. 'బహువచనము పరంబగునపు డసంయుక్తంబులయి యుదంతంబులయిన ట ల ర ల కలఘు లకారంబు బహుళంబుగా నగు'. బాల ఆచ్ఛిక. 13. గోళులు. ఇట్లే తోలు + లు - తోళులు. ఎఱుకు - ఎర్క్కు, మొఱకు - మొర్క్కు, 'అలఘురేఫము లూప్తాచ్కమగుచో లఘురేఫం బగు.' ప్రౌఢ - ముక్త, వి. 2 పంతులు - ఒంటులు, గోళులు - తోళులు, కొమ్ములు - ఎమ్ములు, ఎర్క్కులు - మొర్క్కులు - అనుప్రాసము.

వ; అను నాటవికజనంబు లయ్యపూర్వస్త్రీరూపంబులు చూచి తదవలోకన కుతూహలపరులై కూడం జనుదెంచి రంత. 36

అర్థము : అను, ఆటవిక - జనంబులు = అడవిజనులు = కిరాతులు. ఆ + అపూర్వ - స్త్రీ - రూపంబులు = తా మంతకుమును పు చూడని స్త్రీల యాకారములు. చూచి, తద్ + అవలోకన - కుతూహల - పరులు + ఐ = వారినిజూచుట యందలి వేడుకయం దాసక్తి గలవారయి, కూడన్ = వెంట, చనుదెంచిరి = వచ్చిరి. అంతన్

తాత్పర్యము : అనెడి కిరాతులు ఆ యపూర్వ స్త్రీరూపములు చూచి వారిని దర్శించుటయందలి వేడుకయందు ఆసక్తిగలవారయి వెంటవచ్చిరి. అంత-తరువాతి పద్యముతో నన్వయము.

సీ. పఱచుంచుఁదలలును బఱుదులు దబ్బర
మిడిసిన గ్రుడ్డులుఁ బడఁకి చెవులుఁ
గందుఁబండ్లుఁ బఱికిగడ్డంబులును నఱ
పొఱఁదులు నంటురూపులునుఁ గుఱుచ
కోంజేతులు నిఱికిగోళ్లను నొక్కుఁ బ్ర
క్కలు బొక్కతొమ్ములు కఱకుఁ ద్రొండి
కడుపులు మురివి (మోఁకాళులుఁ బొరలెత్తి
నెఱసిన యడుగులుఁ గుఱులు గట్టి

ఆ. వరళు వెత్తియున్న పరువంపు టొడళులు
నడవిలోనఁ గలయ మొదుచు రేఁగి
గదరు వలచు కంపుఁ గాళిమచ్ఛాయయుఁ
గలుగు నెఱుకుముసుఁడిఁ గనిరి సతులు. 37

అర్థము ; సతులు - స్త్రీలు. పఱి - చుంచు + తలలును = చింపిరిజుత్తు గల తలలును, పఱ (ఱు) డులున్ = గఱుకులును, దబ్బఱ = భయంకరములును, అగు, మిడిపిన - గ్రుడ్డులున్ = పయి కుబికిన కనుగ్రుడ్డులును, పడఁకి (కు) - చెవులున్ = గుహలవంటి (పెద్దవియైన) చెవులును.

కందు + పండ్లున్ = నల్లని దంతములును, పఱికి - (క) గడ్డంబులును = బిరుసైన గడ్డములును, అఱపొఱడులున్ = సగము గూనులును. అంటు - రూపులున్ = అపరిశుద్ధమైన ఆకృతులును, కుఱుచకోంజేతులు = పొట్టివియు, గొట్టముల వంటివియు నగు చేతులును (?), ఇఱికి - గోళ్లను = ఇఱుకైన గోరులును. నొక్కు + ప్రక్కలున్ = లోపలికిఁబోయిన ప్రక్కలును, బొక్కి - తొమ్ములున్ = గుంటలుపడిన వక్షములును, కఱకు + త్రొండి - కడుపులున్ = కఱకైన. లోఁతునకుఁబోయిన కడుపులును, మురివి - మోఁకాళులున్ = వంకరలైన మోఁకాళ్లను, పొరలెత్తి నెఱపిన - అడుగులున్ = లేచిన పొరలుగలవి యగు పాదములును, కుఱులు - కట్టి = మచ్చలేర్పడి (?) వరళులెత్తియున్న = కాయలుగాచియున్న (?), పరుసంపుటొడళులున్ - (పరుసము + ఒడళులున్) = కఠినమైన శరీరములును,

అడవిలోనన్, కలయన్ = అంతటను, మొదుచురేఁగి = మొత్తముగరేఁగి (?), గదరువలచుకంపున్ = (గదురు ?) = దుర్గంధమువేయుకంపును, కాళిమ + ఛాయయున్ = నల్లని రంగును. కలుగు, ఎఱుకు - ముసుఁడిన్ = ఎఱుకువాండ్ర సమూహమును, కనిరి = చూచిరి,

తాత్పర్యము : పార్వతియు నామె చెలికత్తెలును - చింపిరిజుత్తుగలతలలును, గఱుకులును భయంకరములును అగు మిడిగ్రుడ్డులును, గుహలవంటి చెవులును, నల్లని దంతములును, బిరుసైన గడ్డములును, సగముగూనులును, అపరిశుద్ధములైన ఆకారములును, పొట్టివియు, గొట్టములవంటివియునైన చేతులును. ఇఱుకైన గోరు

లును. లోపలికిఁ బోయిన ప్రక్కలును, గుంటలుపడిన బొమ్మలును, కఱకైన, లోఁతునకుఁబోయిన కడుపులును, వంకరలైన మోఁకాళ్లును. పొరలులేచిన యడుగులును, మచ్చలేర్పడి కాయలుగాచియున్న మొఱటు శరీరములును, అడవిలో నంతటను మొత్తముగ రేఁగిదుర్గంధముగొట్టుకంపును, నల్లని దేహకాంతియుఁ గలుగు నెఱుకు వాండ్ర సమూహమును' జూచిరి.

విశేషములు : అఱపొఱడు - 'అఱపొఱడు కుఱుచచేతులు' - నన్నయ. భార. అర. 2. 134. పరుసంపుటొడళులు - పరుసము + ఒడళులు - 'కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపు లగు.' బాల. సంధి. 32. పరుసంపు + ఒడళులు - 'కర్మధారయంబులం దుత్తున కచ్చు పరంబగునపుడు టుగాగమం బగు.' బాల. సంధి. 28. కాళిమచ్ఛాయ - కాళిమ + ఛాయ - 'హ్రస్వమునకుఁ బరమైనఛకారముద్విరుక్తమగును.'

వ. అట్టి వికృతాకారంబులు గని విస్మితులగుచుండి రంత. 38

అర్థము : అట్టి. వికృత + ఆకారంబులు = వికృతములైనరూపములు. కని = చూచి, విస్మితులు + అగుచున్ + ఉండిరి = ఆశ్చర్యపడుచుండిరి. అంతన్.

తాత్పర్యము : అటువంటి వికృతములైనరూపములు చూచి ఆశ్చర్యపడుచుండిరి.

మ. చమరీవాలములున్ మయూరవరపింఛవ్రాతముల్ గండశృం
గములున్ సూకర వేణు నాగ ఘన ముక్తాజాలముల్ ఋక్ష చ
ర్మములున్ సింహ నఖంబులున్ మధువులున్ మాంసంబులున్ దాల్చి రౌ
ద్రముతోవచ్చు పుళిందులం గనిరి కాంతారాంతరాళంబులన్. 39

అర్థము : సతులు - కర్త అధ్యాహార్యము.

చమరీ - వాలములున్ = ఆఁడుసవరపు మెకములతోఁకలును, మయూర - వర - పింఛ - వ్రాతముల్ = నెమళ్ల శ్రేష్ఠములైన పింఛముల సమూహములును,

గండ - శృంగములన్ = పెద్ద కొమ్ములును. సూకర - వేణు - నాగ-ఘన-ముక్తా - జాలముల్ = వరాహములనుండి, వెదురులనుండి, ఏనుఁగులనుండి పుట్టిన గొప్ప ముత్యముల సమూహములు, ఋక్ష - చర్మములున్ = ఎలుఁగుగొడ్డుల తోళ్లను, సింహ - నఖంబులున్ = సింహముల గోరులును, మధువులున్ = మద్యములును, మాంసంబులున్, తాల్చి, రౌద్రముతోన్ = భయంకరత్వముతో, వచ్చు, పుళిందులన్ = కిరాతులను, కాంతార + అంతరాళంబులన్ = అడవి లోపలి ప్రదేశములందు, కనిరి = చూచిరి,

తా త్ప ర్య ము: పార్వతియుఁ జెలికత్తెలును అడవిలోపలిభాగములందు అఁడు నవరపుమొకవ-లతోఁకలును. నెమళ్ల మేలైన పింఛముల సమూహములును, పెద్దకొమ్ములును, వరాహముల కోఱలనుండి, వెదురులనుండి, ఏనుఁగులనుండి పుట్టిన ముత్యముల సమూహములును, ఎలుఁగుగొడ్లతోళ్లను, సింహముల గోరులును. మద్యములును. మాంసములును దాల్చి భయంకరులై వచ్చుకిరాతులను జూచిరి,

వి శే ష ము లు ; సూకర వేణు నాగ ఘన ముక్తా జాలముల్ - సూకరాదుల నుండి ముత్యములు పుట్టు ననుటకు - 'కరీంద్ర జీమూత వరాహ శంఖ మత్స్యాహి శుక్త్యుద్భవ వేణుజాని ముక్తాఫలాని ప్రథితాని లోకే. తేషాం తు శుక్త్యుద్భవ మేవ భూరి.'

వ. అం దాటవికబలాధీశ్వరుఁ డచలాధీశనందన యగు టెఱింగి యతి సంభ్రమమున. 40

అ ర్థ ము : అందున్, ఆటవిక - బల + అధి + ఈశ్వరుఁడు = కిరాత సైన్యముల ప్రభువు. అచల + అధి + ఈశ - నందన = పర్వతరాజగు హిమవంతుని కూఁతురు. అగుట ఎఱింగి, అతి - సంభ్రమమునన్ = మిక్కిలి వేగిరపాటుతో-

తా త్ప ర్య ము : అందుఁ గిరాతసైన్యములప్రభువు ఆమె పర్వతరాజుకూఁతు రగుట తెలిసి మిక్కిలి వేగిరపాటుతో - తరువాతి పద్యముతో నన్వయము.

తే. దర్పితేభారి నఖరక్షతప్రకోష్ఠుఁ,
డిభ విషాణాహతోరస్కుఁ, డభయుఁ, డుగ్ర
కోల దంతాగ్ర భిన్న జంఘుండు, శబర
నాథుఁ డేతెంచి శైలకన్యకకు మ్రొక్కె. 41

అర్థము : దర్పి .... ప్రకోష్ఠుఁడు. దర్పిత = మదించిన, ఇభ + అరి= ఏనుగులశత్రువు లైన సింహములయొక్క, నఖర = గోరులచేత, క్షత = గాయ పడిన, ప్రకోష్ఠుఁడు = ముంజేతులు గలవాఁడును, ఇభ - విషాణ + ఆహత + ఉరస్కుఁడు = ఏనుఁగుల దంతములచేఁ గొట్టఁబడిన ఱొమ్ము గలవాఁడును, అభయుఁడు = భయములేనివాఁడును, ఉగ్ర - కోల - దంత + అగ్ర + భిన్న - జంఘుండు = భయంకరములైన వరాహముల కోఱలకొనలచే ఛేదింపఁబడిన పిక్కలు గలవాఁడును, అగు, శబర - నాథుఁడు = కిరాతరాజు, ఏతెంచి = వచ్చి, శైల - కన్యకకున్ = పర్వతపుత్త్రికకు - పార్వతికి, మ్రొక్కెన్.

తాత్పర్యము : గర్వించిన సింహముల గోరులచే గాయపడిన ముంజేతులు గలవాఁడును, ఏనుఁగు దంతములచేఁ గొట్టఁబడిన ఱొమ్ముగలవాఁడును, భయములేని వాఁడును, భయంకరములైన వరాహముల కోఱలచే ఛేదింపఁబడిన పిక్కలుగల వాఁడును అగు కిరాతప్రభువు వచ్చి పార్వతికి నమస్కరించెను.

వ. తదనంతరంబ 42

అర్థతాత్పర్యములు : ఆ తరువాతనే.

సీ. హరినీలమణులకు నాయువు వచ్చె నాఁ
గమనీయమగు తనుకాంతి లెసఁగ,
మెఱుఁగుఁదీఁగలు గండుమీలపై నెలసె నా
దృగ్భాసురద్యుతుల్ దేజరిల్లఁ
జమరీ సుకేశ పాశములఁ దుమ్మెదపిండు
తగిలె నాఁ గుటిల కుంతలము లమరఁ,
గాంచన కుంభముల్ కరికుంభ కర్కశ
మెనసె నాఁ జాలిండ్లు పొనరి తనరఁ

తే. పాపవశమున శాపంబు పడి విహీన
జనులసంగతికర్హమై పొనరఁ గన్న
యమరసతులొకో యన దర్శనార్హలైన
యెఱుకులేమలఁ గాంచె శైలేంద్రతనయ. 43

అ ర్థ ము : హరినీలమణులకున్ = ఇంద్రనీలమణులకు, ఆయువు-వచ్చెన్ + నాన్ = ప్రాణము వచ్చెనా యనునట్లు, కమనీయము + అగు = మనోహరమైన, తను - కాంతులు = శరీరకాంతులు, ఎసఁగన్ = అతిశయింపఁగను,

మెఱుఁగు + తీఁగలు = విద్యుల్లతలు, గండు మీలపైన్ = మగచేఁపలపై, ఏలసెన్ + నాన్ = వ్యాపించెనా యనునట్లు, దృక్ (క్) + భాసుర - ద్యుతుల్ = చూపుల ప్రకాశించు కాంతులు, తేజరిల్లన్ - ప్రకాశింపఁగను.

చమరీ-సుకేశపాశములన్ = ఆఁడు సవరపుమెకముల కేశ సమూహములందు. తుమ్మెద - పిండు = తుమ్మెదల గుంపు, తగిలెన్ + నాన్ = వ్రాలెనా యను నట్లు, కుటిల - కుంతలములు = వక్రములైన శిరోజములు, అమరన్ = ఒప్పఁగను,

కాంచన - కుంభముల్ = బంగారు కుండలు, కరి కుంభ - కర్కశము = ఏనుఁగు కుంభస్థలము కార్కశ్యము (కాఠిన్యము), ఎనసెన్ + నాన్ = పొందెనా యనునట్లు, పాలిండ్లు = స్తనములు, పొనరి తనరన్ = ఒప్పుచుండఁగను.

పాప - వశమునన్ = పాపమునకు లోనగుటచే, శాపంబు - పడి = శాప మును బొంది, విహీన - జనుల - సంగతికిన్ = తక్కువ జాతి జనుల సాంగత్యము నకు, అర్హము + ఐ = తగి, పొనరన్ + కన్న = ఒప్పిన, అమర - సతులు + ఒకో + అనన్ = దేవతాస్త్రీలా యనునట్లు, దర్శన + అర్హలు = చూడఁదగిన వారు, ఐన, ఎఱుకు - లేమలన్ = ఎఱుకతలను, శైల + ఇంద్ర - తనయ = పర్వత శ్రేష్ఠుఁడైన హిమవంతుని కూఁతురు - పార్వతి, కాంచెన్ = చూచెను.

తా త్ప ర్య ము : ఇంద్రనీల మణులకుఁ జైతన్యము వచ్చెనా యనునట్లు మనోహరములైన నల్లని దేహకాంతులు ఒప్పఁగను, విద్యుల్లతలు గండుమీలపై వ్యాపించెనా యనునట్లు చూపుల భాసురములైన కాంతులు ప్రకాశింపఁగను, ఆఁడు

నవరపు మెకముల మేలైన కేశసముహములందుఁ దుమ్మెదలగుంపు వ్రాలెనా యను నట్లు వక్రములైన శిరోజము లొప్పఁగను, బంగారు కుండలు ఏనుఁగుల కుంభస్థలముల కాఠిన్యమును బొందెనా యనునట్లు స్తనము లొప్పుచుండఁగను, పాపకర్మములు చేయుటచే శాపమును బొంది తక్కువజాతి స్త్రీల సాంగత్యమునకుఁ దగినవారైన దేవతాస్త్రీలవలెఁ జూడఁదగియున్న యెఱుకతలను బార్వతి చూచెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష, మీలు - మీను + లు, 'బహు వచనంబు పరంబగునపుడు చేను పేను మీను శబ్దంబుల ను వర్ణంబు లోపించు.' బాల. ఆచ్చిక. 20. కరి కుంభ కర్కశము - కరికుంభ కర్కశత్వము - కార్కశ్యము అని యుండనగును.

చ. వర తరు కోట రాహి ఫణ వర్గముఁ దేనులుసావి తద్వనే
చరియలు రాఁపఁబోవుచు భుజంగఫణావలిగా నెఱింగి చె
చ్చెరఁ బెడఁబాసి పోవునెడఁ జెల్వుగఁ బూచిన కాఁదపూవు ల
య్యెరగని డాయనోడుదు రహివ్రజశంక విభీతచిత్తులై. 41

అర్థము ; తద్ + వనేచరియలు = ఆ బోయతలు, వర - తరు - కోటర + అహి - ఫణ - వర్గమున్ = మేలైన చెట్ల తొఱ్ఱలందలి పాముల పడగల సమూహమును, తేను (నె)లు - సావి = తేనె లని, రాఁపన్ + పోవుచున్ = (రాఁపన్ ?) రేఁపఁబోవుచు, భుజంగ - ఫణా + ఆవలి + కాన్ = పాముల పడగల వరుసగా, ఎఱింగి, చెచ్చెరన్ = శీఘ్రముగా, పెడఁబాసి = విడిచి, పోవు + ఎడన్ = పోవునప్పుడు, చెల్వుగన్ = అందముగా, పూచిన = పుష్పించిన, కాఁదపూవులు = వనపుష్ప విశేషములు, అయ్యెరగని - అయ్యెరఁ గని=ఆ వ్యసన మునఁ గని, అహి - వ్రజ - శంకన్ = పాముల సమూహమనెడి అనుమానముతో, విభీత - చిత్తు (త్తు)లు + ఐ = భయపడిన మనస్సులు గలవారయి, డాయన్ + ఓడుదురు + సమీపింప జంకుదురు.

తాత్పర్యము : ఆ బోయతలు చెట్లతొఱ్ఱలందలి పాముల పడగలసమూహ మును తేనెలని భ్రమించి రేఁపఁబోయి, పాముల పడగలని తెలిసి, శీఘ్రముగా వీడి పోవునప్పుడు, అందముగాఁ బుష్పించిన కాఁదపువ్వులను జూచి పాములగుంపు లనెడి యనుమానముతో భయపడిన మనస్సులుగలవారయి సమీపింప జంకెదరు.

విశేషములు: పాములపడగలను జూచి తేనెలనియు, కాఁదపువ్వులను పాములగుంపు లనియు బోయతలు భ్రమించి రనుటచే నలంకారము భ్రాంతిమంతము. తేనులు - తేనెలు ? తేనియ కలదు గాని 'తేని' కానరాదు. తద్వనేచరియలు - వనేచరీ శబ్దమునకుఁ దత్సమ బహువచనరూపము - వనేచరులు - వనేచరియలు ఏమి ?, రాఁపఁబోవుచు - రాపఁబోవుచు ? రేఁపఁబోవుచు ?, విభీతచిత్తులై - ఇది పుంలింగ విశేషణము. ఇచ్చటఁ గర్త వనేచరియలు స్త్రీలు కావున 'విభీతచిత్తలై' యనియుండుట సముచితము, కాఁదపూవులు - వనపుష్పవిశేషములు. ఇవి వర్షర్తువునఁ బుష్పించును.

ఉ. జీటికకల్లుఁ ద్రావి మదసింధురగామిను లన్ని కేరియల్
వాఱుచు గౌఁడుగీతములు పాడుచుఁ బొల్పుగఁ గ్రాలియాడుచున్
గోఁటడమాడుచుం బతులకున్ వశవర్తులుగాక మేరకున్
మీఱుచు వన్నెకాంతలు రమింతురు తద్విపినాంతరంబునన్. 45

అర్థము: మద - సింధుర - గామినులు = మదించిన యేనుఁగులవలె నడచువారు (అగు), వన్నె - కాంతలు = విలాసవతులు, ('వన్యకాంతలు' - పాఠాంతరము - ఆటవికస్త్రీలు), జీటికకల్లున్ = జీటికచెట్టుకల్లును, త్రావి, అన్ని = మదించి, కేరియల్ + పాఱుచున్ = కేరింతలుకొట్టుచు, గౌఁడు - గీతములు = కల్లుగీసెడువారి పాటలు, పాడుచున్, పొల్పుగన్ = చక్కఁగా, క్రాలి = ఒప్పి, ఆడుచున్, కోఁటడము + ఆడుచున్ = ప్రతికూల వచనములు పలుకుచు, పతులకున్ = భర్తలకు, వశ - వర్తులు - కాక = లోఁబడియుండక, మేరకున్ - మీఱుచున్ = హద్దుమీఱుచు, తద్ + విపిన + అంతరంబునన్ = ఆ యడవిలోపలి ప్రదేశమున, రమింతురు = క్రీడింతురు.

తాత్పర్యము ; మదగజగామినులైన యా యాటవికస్త్రీలు జీటిక కల్లుఁ ద్రావి, మత్తిల్లి, కేరింతలుకొట్టుచు, కల్లుగీఁతవారి పాటలు పాడుచుఁ బతులకుఁ బ్రతికూలవచనముల్లు పలుకుచు వారికి వశపడక మేరమీఱుచు ఆ యడవిలోఁ గ్రీడింతురు.

విశేషములు: అలంకారము స్వభావోక్తి. కేఱియల్ - కేరియల్. వన్నెకాంతలు - వన్యకాంతలని పాఠాంతరము- 'జీటిక' - కల్లుతీయు నొకానొకచెట్టు.

వ. మఱియు నొక్కయెడ. 46

అర్థతాత్పర్యములు : మఱియు నొకచోట - తరువాతి పద్యముతో నన్వయము.

చ. పటికపుఁదోల ముల్వెదురుఁబ్రాలొగిఁ బోయుచు గౌరుకొమ్ము రోఁ
కటఁ గొని దంచుచున్ శబరకామిని పెక్కులు రాగముల్ మదో
త్కటముగఁ బాడెఁ జుట్టిన మృగంబులు సోమ, మనుష్యరూప ధూ
ర్జటి మునిముఖ్యలోకగురు జంగమలింగము మల్లికార్జునున్. 47

అర్థము : శబర, కామిని = కిరాతస్త్రీ, పటికపు - తోలన్ = స్ఫటిక శిలానిర్మితమైన తోటియందు, ముల్ వెదురు + ప్రాలు = ముల్లు వెదురుబియ్యము, ఒగిన్ = లెస్సగా, పోయుచున్. గౌరు - కొమ్ము - రోఁకటన్ = ఏనుఁగుదంతపు రోఁకటితోఁ గొని, దంచుచున్, మనుష్యరూప ధూర్జటిన్ = మానవాకారుఁడైన శివుఁడును, ముని - ముఖ్య - లోకగురున్ = మునిశ్రేష్ఠుల సమూహమునకు గురుఁడైన వాఁడును. (అగు), జంగమ - లింగమున్ - మల్లికార్జునున్ = జంగమ మల్లికార్జునుని గూర్చి, పెక్కులు - రాగముల్ = అనేక రాగములు, మద + ఉత్కటము గన్ = మదాతిశయముతో, చుట్టిన - మృగంబులు = పరివేష్టించిన - చుట్టునున్న. లేడులు, సోమన్ = పరవశింపఁగా, పాడెన్.

తాత్పర్యము : కిరాతస్త్రీ పటికజాతి తోటియందు ముల్లువెదురు బియ్యము లెస్సగాఁ బోయుచు నేనుఁగు దంతపు రోఁకటితో దంచుచు మనుష్యరూపమునమన్న శివుఁడును, మునిశ్రేష్ఠులగురువును అగు జంగమమల్లికార్జునునిగూర్చి చుట్టునున్న లేళ్లు పరవశించుచుండఁగాఁ బెక్కు రాగములు మదాతిశయముతోఁ బాడెను.

విశేషములు : అలంకారము స్వభావోక్తి. ప్రాలు - ప్రాయి బహువచన రూపము, ఇది బహువచనాంతముగానే ఈ యర్థమునఁ బ్రయోగింపఁబడుచున్నది. గౌరు- ఏనుఁగు 'గౌ రనంగఁ గరి యొప్పు'. ఆం.నామ.సం, పటికపు తోలు - పటికము + తోలు - 'కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు,' బాల. సంధి. 32. రోఁకటన్ - రోఁకలి + చేతను 'టివర్ణంబు గొన్నింటి యంత్యాక్షరం బున కాదేశం బును గొన్నింటి కంతాగమంబును గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికం

బుగ నగు॰' బాల, ఆచ్ఛి. 31, రోఁకటి + చేతను, 'ఔపవిభక్తికముల తృతీయా సప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు.' బాల, ఆచ్ఛి. 38. రోఁకటి + అను 'అంద్వవగాగమంబులం దప్ప నపదాది స్వరంబు పదంబగునపు డచ్చునకు సంధి యగు' బాల. సంధి. 11, రోఁకటన్,

క. వేణుజ మౌక్తికములు దొడి
[1]వీనుల కింపెసఁగ నెఱుక[2]వెలఁదులు ప్రీతిన్
వాణీధరుఁ బాడిరి గీ
ర్వాణాధిపభోగి భువనవంద్యు ననింద్యున్. 48

అర్థము: ఎఱుక - వెలఁదులు = కిరాతస్త్రీలు, వేణుజ - మౌక్తికములు = వెదురునుండి పుట్టిన ముత్యములు, తొడి = ధరించి, గీర్వాణ + అధిప - భోగిన్ = దేవేంద్రునివలె భోగములు గలవాఁడును, భువన - వంద్యున్ = లోకములచేత నమస్కరింపఁ దగినవాఁడును, అనింద్యున్ = నిందింపఁదగనివాఁడును అగు, వాణీ-ధరున్ = వాణిని ధరించినవాఁడు - పండితుఁడు - అగు జంగమ మల్లికార్జునునిగూర్చి. వీనులకున్ = చెవులకు, ఇంపు + ఎసఁగన్ = సంతోష మతిశయించునట్లు, ప్రీతిన్ = ఇష్టముతో, పాడిరి.

తాత్పర్యము: : ఎఱుకతలు వెదురులనుండి పుట్టిన ముత్యములు ధరించి దేవేంద్రునివలె భోగియైనవాఁడును, లోకములచే నమస్కరింపఁదగినవాఁడును, నిందింపఁదగనివాఁడును అగు పండితుని - జంగమ మల్లికార్జునుని గూర్చి గానము చేసిరి-

వ. ఇట్లతి విచిత్రంబులగు శబరాలయంబులు గడచి చనిచని. 49

అర్థము : ఇట్లు, అతి - విచిత్రంబులు = మిక్కిలి ఆశ్చర్యకరములు, అగు, శబర + ఆలయంబులు = కిరాతుల గృహములు, కడచి = అతిక్రమించి, చని చని = పోయి పోయి,

---

1, గాణల. 2, ‹గన్నెలు,

తాత్పర్యము : ఇట్లు మిక్కిలి వింతలైన కిరాతుల గృహములు దాఁటి పోయి పోయి _ తరువాతి పద్యముతో నన్వయము.

చ. ఎలమిన పూరిమేసి, సెలయేఱుల నీరులు ద్రాగి, మేలి వెం
చల, నెలమావిజొంపములఁ, జల్లని నీడల నిల్చి, పొల్చి మం
దలు గొని, నందిపోతులును దారును బేయలు సమ్మదంబునన్
గలసి రమించు ధేనువులఁ గాంచిరి తద్విపినాంతరంబునన్. 50

అర్థము : ఎలమిన = కనుపట్టిన, పూరి = గడ్డి, మేసి, సెలయేఱుల= సెలయేఱులందలి, నీరులు. త్రాగి, మేలి - వెంచలన్ = మేలయిన మడుఁగులందును. ఎలమావి జొంపములన్ - లేఁత మామిడిగుబురులందును, చల్లని - నీడలన్, నిల్చి, పొల్చి = ఒప్పి, మందలు + కొని = గుంపులుకూడి, నంది - పోతులును = ఎద్దులును, తారును - పేయలున్ = తామును పెయ్యలును, సమ్మదంబునన్ =సంతోషముతో, కలసి = కూడి, రమించు= క్రీడించు, ధేనువులన్ = ఆవులను, సతులు = పార్వతియు, నామెచెలికత్తెలును, తద్ + విపిన + అంతరంబునన్ = ఆ యడవి లోపల, కాంచిరి = చూచిరి.

తాత్పర్యము : కనుపట్టు గడ్డినిమేసి, సెలయేఱులందలి నీరుత్రాగి, మేలైన మడుఁగులందు, లేమావిగుబురులందుఁ జల్లని నీడల నిల్చి గుంపులుగూడి యెద్దులను బెయ్యలను సంతోషముతోఁ గూడి క్రీడించు ఆవులను పార్వతియు నామె చెలికత్తెలును ఆ యడవిలోపలిభాగమునఁ జూచిరి.

వ. తదనంతరంబ పత్రఫలపుష్పమూలనీవారకారవల్కలేధ్మకుశాహర
ణార్థంబు విహరించుచున్న మునికుమారులం జూచుచు వచ్చి వచ్చి
ముందటం బుష్పవాటికాంబుపరిషేచనైకలాలసలై విహరించుచున్న
ఋషికుమారీసమూహంబుం గని వారి సహజ సౌందర్యరూపాతి
శయంబునకు మెచ్చి శిరఃకంపంబు సేయుచు. 51

అర్థము : తద్ + అనంతరంబు + అ = ఆ తరువాతనే, పత్ర.... ణార్థంబు: పత్ర = ఆకులు, ఫల = పండ్లు, పుష్ప = పువ్వులు, మూల =

వేరులు, నీవార = నివ్వరిధాన్యము, కార = బలుసుకూర, వల్కల = నారచీరలు, ఇధ్మ = సమిధలు, కుశ = దర్భలు, అనువాని, ఆహరణ + అర్థంబు = తీసికొని వచ్చుటకు, విహరించుచున్ + ఉన్న = తిరుగుచున్న, ముని - కుమారులన్, చూచుచున్, వచ్చి, వచ్చి, ముందటన్ = ఎదుట, పుష్ప - వాటికా + అంబు పరిషేచన + ఏక - లాలసలు + ఐ = పుష్పోద్యానమును నీటితోఁ దడుపుటయందే ఆసక్తి గలవారయి, విహరించుచున్ + ఉన్న, ఋషి - కుమారీ - సమూహంబున్ = మునికన్యల సమూహమును, కని = చూచి, వారి - సహజ - సౌందర్య - రూప + అతిశయంబునకున్ = వారియొక్క సాజమైన అందముతోడి ఆకారముయొక్క గొప్పతనమునకు, మెచ్చి, శిరస్(ః) + కంపంబు + చేయుచున్ = తలయూఁపుచు.

తాత్పర్యము : ఆ తరువాతనే ఆకులు, పండ్లు, పూలు, వేరులు, నివ్వరి, సమిధలు, దర్భలు అనువానిని దీసికొనిరా విహరించుచున్న మునికుమారులను జూచుచు వచ్చివచ్చి యెదుట పూలవనమును దడుపుటయందే మిక్కిలి యాసక్తి గలవారై విహరించు మునికన్యల సమూహమును జూచి వారి సహజ సౌందర్యమునకు మెచ్చి తలయూఁచుచు - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. అనులేపనములు మండనములు లేకయు
భాసురాంగము లింత దేసి యగునె ?
లలితాంబరములు మేఖలలు లేకయు హారి
జఘనంబు లింత మాసరము లగునె ?
వరహారములుఁ బత్రవల్లికల్ లేకయు
వలిచన్నుఁగవ లింత చెలువ మగునె ?
భ్రూలతానటనంబు పొలపంబు లేకయు
విచలేక్షణము లింత రుచిర మగునె ?

తే. కమ్మనూనియ మెఱుఁగెక్కఁ గలయ దువ్వి
కురులు దీర్పకయును గచభరము లింత
పొలుచునే యని చూచె నా భూసురాధి
రాజకన్యలఁ బర్వతరాజకన్య.

అర్థము : అనులేపనములన్ = మైపూఁతలును, మండనములన్ = అలంకారములును, లేకయున్ = లేకున్నను, భాసుర + అంగములు = ప్రకాశించు నవయవములు, ఇంత, దేపి = మనోహరములు, అగునె ?

లలిత + అంబరములన్ = సుందరములైన వస్త్రములును, మేఖలలన్ = మొలనూలులును, లేకయున్ = లేకున్నను, హారి - జఘనంబులు = మనోహరములైన, కటిప్రదేశములు, ఇంత, మాసరములు + అగునె = అందమైనవి యగునా ?

వర - హారములన్ = మేలైన హారములను, పత్త్రవల్లికల్ = పత్త్రభంగములు, లేకయున్, వలి - చన్ను + కవలు = గుండ్రనివియగు చనుదోయిలు, ఇంత - చెలువము + అగునె = ఇంత సుందరము లగునా ?

భ్రూలతా - నటనంబు = బొమతీవల నాట్యముయొక్క, ఓలపంబు = చలనము, లేకయున్, విచల + ఈక్షణములు = విశేషముగాఁ జలించు కన్నులు, ఇంత - రుచిరము + అగునె = మనోహరము లగునా ?

కమ్మ - నూనియ = పరిమళముగల తైలము, మెఱుఁగు + ఎక్కన్ = ప్రకాశించునట్లు, కలయన్ = అంతటను, దువ్వి, కురులు = శిరోజములు, తీర్పకయును = చక్కదిద్దకున్నను. కచ - భరములు = కేశపాశములు, ఇంత - ఓలిచునే = ఇంతగా నొప్పునా ?

అని, పర్వత - రాజ - కన్య = పార్వతి, ఆ భూసుర + అధిరాజ - కన్యలన్ = బ్రాహ్మణశ్రేష్ఠుల - మునిశ్రేష్ఠుల కన్యలను, చూచెన్.

తాత్పర్యము : 'మైపూఁతలును, అలంకారములును లేకున్నను ప్రకాశించు నవయవము లింత మనోహరము లగునా ? సుందరములైన వస్త్రములును, మొలనూలులును లేకున్నను అందమైన కటిప్రదేశము లింత అందముగా నుండునా ! మేలైనహారములును, పత్త్రరచనలును లేకున్నను గుండ్రనివగు చనుదోయి లింత యొప్పునా ! బొమతీవల నాట్యములేకున్నను విశేషముగాఁ జలించు కన్ను లింత మనోజ్ఞము లగునా ? పరిమళతైలములు మెఱుఁగెక్కునట్లు రాచి బాగుగా దువ్వి శిరోజములను జక్కదిద్దకున్నను కేశపాశము లింత యొప్పునా ?' అని పార్వతి ఆ మునికన్యలను జూచెను.

విశేషములు: కారణములేకుండఁగనే కార్యము గలిగినట్లు చెప్పఁబడుటచే నలంకారము విభావన. 'విభావనా వినాపి స్యాత్కారణం కార్యజన్మ చేత్'. చన్ద్రా.

వ. తదనంతరంబ 53

అర్థతాత్పర్యములు: ఆ వెంటనే - తరువాతి పద్యముతో నన్వయము.

మ. వృతయూపాటవి, యాగ పావక శిఖావిర్భూత ధూమోత్థ రూ
షిత సంప్రాప్త మహీరుహప్రకర, ముత్క్షిప్త ప్రవర్గ్యాగ్ని రం
జిత, మభ్యర్చిత దేవతానికర, మాశ్లిష్టాగమాచార, మూ
ర్జిత పుణ్యంబు, మునీశ్వరాశ్రమముఁ గాంచెన్ గౌరి సంప్రీతితోన్. 54

అర్థము: గౌరి = పార్వతి.

వృత - యూప + అటవి = ఆవరింపఁబడిన - యజ్ఞ పశువును గట్టు కంబములుగల అడవి కలదియు, యాగ.... ప్రకరము: యాగ = యజ్ఞసంబంధమైన, పావక = అగ్నియొక్క శిఖా = జ్వాలలనుండి, ఆవిర్భూత = పుట్టిన, ధూమ = పొగలచే, ఉత్థ = వెలువడి, రూషిత = కప్పఁబడిన, సంప్రాప్త = పొందఁబడిన, - చేరువనున్న, మహీరుహ = చెట్లయొక్క, ప్రకరము = సమూహము గలదియు, ఉత్క్షిప్త - ప్రవర్గ్య + అగ్ని - రంజితము = ఎగఁజిమ్మఁబడిన ప్రవర్గ్యమను యాగ విశేష సంబంధమైన అగ్నిచేత రంగువేయఁబడినదియు, అభ్యర్చిత - దేవతా నికరము = పూజింపఁబడిన దేవతలయొక్క సమూహము గలదియు, ఆశ్లిష్ట + అగమ + ఆచారము = కూడికొన్న వేదవిహితమైన ఆచారములు గలదియు, ఊర్జిత - పుణ్యంబు = గొప్ప పుణ్యముగలదియు, అగు, ముని + ఈశ్వర + ఆశ్రమమున్ = మునిశ్రేష్ఠుల ఆశ్రమమును, సంప్రీతితోన్ = సంతోషముతో, కాంచెన్ = చూచెను.

తాత్పర్యము: యూపస్తంభములు గల అడవిచే నావరింపఁబడినదియు, యాగాగ్నిజ్వాలల పొగచేఁ గప్పఁబడిన సమీపవృక్ష సముదాయము గలదియు, ఎగఁజిమ్మఁబడిన ప్రవర్గ్యమను యాగము నగ్నిచే రంగువేయఁబడినదియు, పూజింపఁబడిన

దేవతల సమూహము గలదియు, పాటింపఁబడిన వేదవిహితాచారములు గలదియు, గొప్పపుణ్యముగలదియు నగు మున్యాశ్రమమును పార్వతి సంతోషముతోఁ జూచెను.

వ. కని తదీయతత్త్వ మహత్త్వంబులకు మెచ్చి వర్తించుచు. 55

అర్థము ; కని = చూచి, తదీయ - తత్త్వ - మహత్త్వంబులకున్ = ఆ మున్యాశ్రమముయొక్క స్వభావమునకును గొప్పతనమునకును, మెచ్చి, వర్తించుచున్ = ఉండుచు.

తాత్పర్యము : చూచి ఆ మున్యాశ్రమము తత్త్వమునకును, గొప్పతనమునకును మెచ్చి వర్తిలుచు - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. భారతి నడపాడు పదగతు లన మెల్పు
దలకొని క్రాలు పదక్రమములు,
వాణి చేఁ బడి మ్రోయు వీణారవంబు నాఁ
గమనీయమగు సామగానములును,
భాషా కటాక్ష విభ్రమము నా మెఱుఁగారు
సదమల శబ్దార్థశాస్త్రములును,
వాగ్దేవి మంజుల వాక్యంబు లనఁగ నిం
పొదవిన సాహిత్యపదవిపొలుపు,

ఆ. రాజితంబుగా సరస్వతీ పీఠక
సదన మనఁగఁ దనరు సకలకళలు
సంతతంబు మూర్తిమంతంబులై విహ
రించుచుండు దివ్యఋషుల పల్లి. 56

అర్థము : సకల - కళలున్ = ఎల్ల విద్యలును, సంతతంబున్ = ఎల్లప్పుడును, మూర్తిమంతంబులు + ఐ = రూపుగాంచినవయి, విహరించుచున్ + ఉండు = వర్తిలుచుండునట్టి, దివ్య + ఋషుల - పల్లి = దివ్యులైన మునుల పల్లె.

భారతి = సరస్వతి, నడపాడు = సంచరించు, పద - గతులు + ఆనన్ = అడుగుల గమనములు అనునట్లు, మెల్పు = సౌకుమార్యము. తలకొని = కలిగి. క్రాలు = ఒప్పునట్టి, పద - క్రమములున్ = వేదమంత్రముల పదవిభాగగతులును,

వాణి = సరస్వతియొక్క, చేన్ = చేతియందు. పడి. మ్రోయు, వీణా - రవంబు + నాన్ = వీణాధ్వని యనఁగా. కమనీయము + అగు = మనోజ్ఞమైన, సామ-గానములును = సామవేదపు గానములును,

భాషా - కటాక్ష - విభ్రమము - నాన్ = వాగ్దేవియొక్క క్రీఁగంటిచూపుల యొక్క విలాసము అనఁగా, మెఱుఁగు + ఆరు = మిక్కిలి ప్రకాశించు, సదమల (సత్ + అమల) = మిక్కిలి పవిత్రమైన, శబ్ద + అర్థ - శాస్త్రములును = శబ్దములయు. అర్థములయు శాస్త్రములును,

వాగ్దేవి = సరస్వతీదేవియొక్క. మంజుల = మనోహరములైన. వాక్యంబులు. అనఁగన్, ఇంపు + ఒదవిన = మనోహరమైన, సాహిత్య - పదవి - పొలుపున్ = సాహిత్య మార్గముయొక్క ఒప్పును.

రాజితంబుగాన్ = ప్రకాశింపఁగా, సరస్వతీ - పీఠక - సదనము + అనఁగన్ = సరస్వతీ పీఠముగల ఆలయము అనఁగా, తనరున్ = ఒప్పును.

తాత్పర్యము: సకలవిద్యలును ఎల్లప్పుడును రూపుగాంచి విహరించుచుండెడు దివ్యమునులపల్లె - సరస్వతి యడుగుల గమనములో యన సౌకుమార్యము గలిగి యొప్పు వేదమంత్రముల పదగతులును- వాణిచేతియందుండి మ్రోయు వీణా నాదమోయన మనోజ్ఞములైన సామవేద గానములును, భాషాదేవి క్రీఁగంటిచూపుల విలాసమో యన మిక్కిలి ప్రకాశించు అతి నిర్మలములైన శబ్దార్థముల శాస్త్రములును- సరస్వతీదేవి మనోహరములైన వాక్కులో యన నింపొందు సాహిత్యమార్గము నొప్పును - ప్రకాశింపఁగా సరస్వతీ పీఠమునకు నిలయ మన నొప్పును.

విశేషములు; అలంకార ముత్ప్రేక్ష. తదనుప్రాణితమైన ఉపమ.

క. ఎలుకలుఁ బిల్లులు, లేళ్లం
బులులు, మదేభములు సింహములుఁ, గప్పలుఁ బా
ములు. గువ్వలు డేఁగలుఁ, బిక
ములుఁగాకులుఁ గూడియాడు మునిపల్లి వడిన్. 57

అర్థము : ఎలుకలున్ + పిల్లులున్, వేళ్లన్ + పులులున్, మద + ఇభము లున్ = మదపుటేనుఁగులును, సింహములున్, కప్పలున్ + పాములున్, గువ్వలున్ = పావురములును, డేఁగలున్, పికములున్ = కోకిలములును, కాకులున్, ముని పల్లి = మునులపల్లెయొక్క, వడిన్ = శక్తిచేత, కూడి + ఆడున్=కలిసి వర్తించును.

తాత్పర్యము : పరస్పర సహజవైరముగల ఎలుకలును పిల్లులును, లేళ్లను పులులును, మదపుటేనుఁగులును సింహములును, కప్పలును పాములును, గువ్వలును డేఁగలును. కోకిలములును కాకులును మునిపల్లెశక్తిచేఁ గలిసి వర్తిలును.

వ. ఇట్టి మునిపల్లి చొత్తెంచు నవసరంబున. 58

అర్థము : ఇట్టి, మునిపల్లి, చొత్తెంచు = ప్రవేశించు, అవసరంబునన్ = సమయమున

తాత్పర్యము : ఇట్టి మునిపల్లి ప్రవేశించునప్పుడు - తరువాతి పద్యముతో నన్వయము.

చొత్తెంచు నవసరంబునన్ = చొత్తెంచు + అవసరంబునన్ - 'ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరంబగునపుడు నుగాగమం బగు.' బాల.సం, 33

క. దూషిత కుతర్క వాదులు,
భూషిత షట్తర్కు. లఖిల బుధ వినుతులు, వి
ద్వేషిత దోషులు. సతతా
న్వేషిత సన్మార్గు, లఖిల విద్యానిపుణుల్. 59

అర్థము : దూషిత - కుతర్కవాదులు = నిందింపఁబడిన కుతర్కముతో వాదించువారుగల వారును. భూషిత - షట్ + తర్కులు = ప్రశంసింపఁబడిన ఆఱు విధములైన తర్కములు గలవారును. అఖిల - బుధవినుతులు = ఎల్ల పండితులచే విశేషముగాఁ బొగడఁబడువారును. విద్వేషిత - దోషులు = విశేషముగా ద్వేషింపఁ బడిన దోషములు గలవారును, సతత + అన్వేషిత - సత్ + మార్గులు = ఎల్లప్పుడును అన్వేషింపఁబడిన సన్మార్గముగల వారును, అఖిల - విద్యా - నిపుణుల్ = ఎల్ల విద్యలందును నేర్పుగలవారును.

తాత్పర్యము : కుతర్క వాదులను దూషించువారును, ఆయువిధములైన తర్కములు గలవారిని ప్రశంసించువారును, ఎల్ల పండితులచే విశేషముగాఁ బొగడఁబడువారును, దోష (దోషము) లను విశేషముగా ద్వేషించువారును, ఎల్లప్పుడును మంచి మార్గమును వెదకువారును, ఎల్లవిద్యలందును నేర్పరులును - ఈ విశేషణములు 64 వ వచనములోని 'దివ్యర్షిగణములు' అనుదానితో నన్వయించును.

క. శిష్టాచారులు, బోధా
శ్లిష్టాత్మకు, లనఘు, లఖిలసేవ్యులు సకలా
భీష్ట విరక్తులు, మౌనులు,
స్రష్ట్రన్వయకరులు, సద్విచారులు, ధీరుల్. 60

అర్థము ; శిష్ట + ఆచారులు = మంచినడవడి కలవారు, బోధ + ఆశ్లిష్ట = ఆత్మకులు = జ్ఞానముతో విశేషముగాఁ గూడిన ఆత్మకలవారును, అనఘులు = పాపరహితులును, అఖిల - సేవ్యులు = ఎల్లరచే సేవింపఁదగినవారును, సకల + అభీష్ట- విరక్తులు = ఎల్ల కోరికలందును రక్తిలేనివారును, మౌనులు = మౌనవ్రతము గలవారును, స్రష్టృ + అన్వయకరులు - బ్రహ్మయొక్క వంశమును - బ్రాహ్మణవంశమును జేయువారును, సత్ + విచారులు = మంచి ఆలోచన గలవారును- ధీరుల్ = ధైర్యము గలవారును.

తాత్పర్యము : సదాచారులును, జ్ఞానసంపన్నులును, పాపరహితులును, సకలసేవ్యులును, సర్వాభీష్టములందును విరక్తులైనవారును, మౌనవ్రతము గలవారును, బ్రాహ్మణవంశకరులును, సద్విచారులును, ధీరులును - అగు దివ్యర్షిగణములు.

క. నిష్ఠాపరు, లురు వేదా
నుష్ఠాన సమాచరులు, మనోహరులు మహః
శ్రేష్ఠాత్మకు, లమలులు, పర
మేష్ఠి సములు, సర్వసత్త్వ మిత్రులు, పాత్రుల్. 61

అర్థము : నిష్ఠా - పరులు = నియమములందు ఆసక్తి గలవారును, ఉరు - వేద + అనుష్ఠాన - సమాచరులు = గొప్పదియగు వేదవిహితమైన అనుష్ఠానము

నాచరించువారును, మనస్ (ః) + హరులు = మనస్సును హరించువారును - మనస్సును జయించువారును. మహత్ (మహా) - శ్రేష్ఠ + ఆత్మకులు = మిక్కిలి శ్రేష్ఠమైన ఆత్మగలవారును, అమలులు = నిర్మలులును, పరమేష్ఠి - సములు = బ్రహ్మ సమానులును. సర్వ - సత్త్వ మిత్రులు = ఎల్ల సత్త్వగుణమునకును - ప్రాణులకును, మిత్రులైనవారును.

తాత్పర్యము : నిష్ఠాపరులును, వేదవిహితానుష్ఠానమును లెస్సగా నాచరించువారును, మనస్సును జయించినవారును. మిక్కిలి శ్రేష్ఠులును, నిర్మలులును. బ్రహ్మ సమానులును, సకల సత్త్వమునకును - ప్రాణులకును మిత్రులైనవారును, పాత్రతగలవారును - అగు దివ్యర్షి గణములు.

క. దుష్కర్మ చరణ కుజన బ
హిష్కారపరుల్, సదా మహేశ్వర తత్త్వా
విష్కృత బుద్ధులు. సిద్ధులు,
నిష్కళ చారిత్రపరు, లనింద్యులు, వంద్యుల్. 62

అర్థము : దుష్కర్మ - చరణ - కుజన - బహిష్కార - పరుల్ = చెడు పనుల నాచరించు దుర్జనుల వెలివేఁతయం దాసక్తిగలవారును, సదా - మహేశ్వర - తత్త్వ + ఆవిష్కృత - బుద్ధులు = ఎల్లప్పుడును, పరమేశ్వరతత్త్వముచే నావిష్కరింపఁబడిన బుద్ధిగలవారును, సిద్ధులు = సిద్ధిపొందినవారును. నిష్కళ - చారిత్ర - పరులు = నిష్కపటమైన నడవడియందు ఆసక్తిగలవారును, అనింద్యులు = నిందింపఁదగనివారును, వంద్యుల్ = నమస్కరింపఁదగినవారును.

తాత్పర్యము : దుష్కర్మముల నాచరించు దుర్మార్గులను బహిష్కరించుటయం దాసక్తిగలవారును, ఎల్లప్పుడును బరమేశ్వరతత్త్వము నావిష్కరించు బుద్ధిగలవారును, సిద్ధిపొందినవారును, నిష్కపటమైన చరిత్రగలవారును, అనింద్యులును, నమస్కరింపఁదగినవారును - అగు దివ్యర్షిగణములు,

క. కృష్ణాజినోత్తరీయులు,
కృష్ణాచారాపహరులు, కృతకృత్యులు, శ్రీ
కృష్ణోదితార్చకులు, గత
తృష్ణాంతఃకరణపరులు, దివ్యులు, భవ్యుల్. 63

అర్థము : కృష్ణ + అజిన + ఉత్తరీయులు = నల్లని యిఱ్ఱిచర్మము ఉత్తరీయముగాఁ గలవారును. కృష్ణ + అపార + అపహారులు = పాపకర్మములను హరించువారును, కృతకృత్యులు = కృతార్థులైనవారును, శ్రీకృష్ణ + ఉదిత + అర్చకులు = శ్రీకృష్ణునియందుఁ గలిగిన పూజ గలవారును - శ్రీకృష్ణుని బూజించు వారును. గత-తృష్ణా + అంతఃకరణ - పరులు = పోయిన ఆశకల అంతఃకరణము గలవారును, దివ్యులు = అమానుషులును, భవ్యల్ = యోగ్యులును,

తాత్పర్యము : నల్లయిఱ్ఱితోలు ఉత్తరీయముగాఁ గలవారును, పాపకర్మములను హరించువారును, కృతార్థులైనవారును, శ్రీకృష్ణునిఁ బూజించినవారును, తృష్ణలేని మనస్సు గలవారును, దివ్యులును, యోగ్యులును అగు దివ్యర్షిగణములు.

వ. అనంబరఁగు దివ్యర్షిగణంబులందు. 64

అర్థము : అనన్ + పరఁగు = అననొప్పునట్టి, దివ్య + ఋషి - గణంబుల + అందున్ = దివ్యులైన మునుల సమూహములందు.

తాత్పర్యము : అననొప్పునట్టి దివ్యమునుల సమూహములందు - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. పడి మోక్షమార్గంబు విడువక నడతు న
నన్నతఁ డేల లోకులగతిఁ జరించు ?
ననిశంబుఁ బరమాత్మ నాత్మఁగూరెతు నాతఁ
డొరుల సంగతి నేల పొరసియుండు ?
ననుపమ ముక్త్యంగనాధీశుఁడుగఁ గోరు
నతఁ డేల కుజనుల సతుల కోఱుగుఁ ?
బరమ యోగామృత వర రస సేవనఁ
దవులువాఁ డే లొండుచవుల కెఱఁగు ?

ఆ. నోటువడు శరీర మొల్ల నన్వాఁడు దే
హేంద్రియంబు లిచ్చ లేల చలఁపుఁ ?
గర్మరహిత యోగ నిర్మలచరితుండు
పురుషుఁ డేల క్రియలఁ బొందు నెందు ? 65

అ ర్థ ము : ఎందున్ = ఎచ్చటను, వడిన్ = వేగముగా, మోక్ష - మార్గంబున్ = మోక్షపుఁద్రోవను, విడువక, నడతున్ = నడచెదను, అన్న + అతఁడు= అనినవాఁడు, లోకుల - గతిన్ = లోకమున నున్నవారి విధమున, ఏల = ఎందులకు, చరించున్ = తిరుగును ?

అనిశంబున్ = ఎల్లప్పుడును, పరమాత్మన్, ఆత్మన్ = మనసునందు, కూరెడు + అతఁడు = నింపువాఁడు, ఒరుల - సంగతిన్ = ఇతరుల సాంగత్యమును, ఏల, పొరసి + ఉండున్ = పొందును ?

అనుపమ - ముక్తి + అంగనా + అధి + ఈశుఁడుగన్ సాటిలేని, ముక్తియను కాంతకు భర్తయగుటకు, కోరు + అతఁడు = కోరువాఁడు, కుజనుల - సతులకున్ = భూమియందలి జనుల స్త్రీలకు, ఒఱగున్ = ఆసక్తి గలవాఁడగును ?

పరమ - యోగ + అమృత - వర - రస - సేవనన్ = ఉత్కృష్టమగు యోగమనెడి అమృతరసమును సేవించుటయందు, చవులవాఁడు = ఆసక్తివహించువాఁడు. ఒండు - చవులకున్ = ఇతర రుచులకు. ఏల, ఎఱఁగున్ = వంగును - ఆసక్తివహించును ?

ఓటు + పడు - శరీరము = భంగపడునట్టి. దేహము. ఒల్లన్ + అన్ + వాఁడు = ఇష్టపడననువాఁడు, దేహ + ఇంద్రియంబుల = శరీరము, ఇంద్రియముఱ అనువాని, ఇచ్చలు = కోరికలు, ఏల, చలుపున్ = చేయును?

కర్మ - రహిత - యోగ - నిర్మల - చరితుండున్ = నిష్కర్మమైన యోగముచేఁ బవిత్రమైన నడవడిగలవాఁడు, అగు, పురుషుఁడు, క్రియలన్ = కర్మములను, ఏల, పొందున్.

తా త్ప ర్య ము : ఎచ్చటను - మోక్షమార్గమును వీడక వర్తింతుననువాఁడు లోకమునందలి వారివలె నేల చరించును ? ఎల్లప్పుడును పరమాత్మను ఆత్మలో నింపువాఁడు ఇతరుల సాంగత్యము నేల పొందియుండును ? నిరుపమమైన ముక్తి కాంత కధీశుఁడు గాఁ గోరువాఁడు భూజనుల స్త్రీలయం దేల ఆసక్తిఁ జూపును ? పరమయోగ మనెడి అమృతరసమును సేవించుటయం దాసక్తి గలవాఁడు ఇతరరుచుల కేల మఱగును? భంగపడు శరీరము నొల్లననువాఁడు దేహేంద్రియములను, కోరికలను ఏల ఆచరించును? నిష్కర్మయోగముచే నిర్మలమైన వర్తనముగలవాఁడు కర్మముల నేల యాచరించును?

విశేషములు : అన్నతఁడు = అనిన + అతఁడు, 'పద్యాదుల సవర్ణకం బున కత్వంబును గఢహల్లునకు ద్విత్వంబును విభాషనగు.' బాల. క్రియ. 51, అన్న+ అతఁడు. 'అత్తునకు సంధి బహుళముగా నగు.' బాల. సంధి. 4, అన్నతఁడు. కూరెడు నాతఁడు - కూరెడు + ఆతఁడు - 'ఉదంతమగు తద్ధర్మార్థవిశేషణమున కచ్చు పర మగు నపుడు నుగాగమంబగు.' బాల. సంధి. 33, ముక్త్యంగనా - ముక్తి + అంగనా- యణాదేశసంధి. 'ఇ ఉ ఋ ఌ లకు అసవర్ణములైన అచ్చులు పరములగునపుడు క్రమ ముగా య్, వ్, ర్, ల్ లు ఆదేశము లగును.' - ముక్తియనెడు అంగన - రూపకము. పరమయోగామృత - పరమయోగమనెడి అమృత - రూపకము. అన్వాఁడు - అను + వాఁడు - 'అను కొను లోనగు ధాతుజవిశేషణముల యంత్యోకారమునకు హల్లు పరం బగునపుడు లోపంబు వైకల్పికంబు.' ప్రౌఢ. సంధి. 13. దేహేంద్రియంబు లిచ్చలు = దేహేంద్రియంబుల + ఇచ్చలు - 'అత్తునకు సంధి బహుళముగా నగు.' బాల. సంధి. 4.

చ. అనయము రక్తపూరములు, నస్థులు, మేదము, మూత్రవిష్ఠలుం
దనరు జరారుజాలియును, దామసవృత్తి, భయాతురాదులుం
బెనఁగిన దుఃఖపుంజమగు ప్రేతము సొచ్చి మునింగి మర్త్యుఁ డీ
తనువునఁ బొంద రోయఁ డటె ! తా నరకస్థితి కేమి రోసెడిన్. 66

అర్థము : అనయమున్ = ఎల్లప్పుడును, రక్త - పూరములున్ = రక్త ప్రవాహములును. అస్థులున్ = ఎముకలును, మేదమున్ = మేదస్సును (సప్తధాతు వులలో నొకటి). మూత్ర విష్ఠలున్ = మూత్రమును, మలమును. తనరు = కలుగు నట్టి, జరా - రుజా + ఆలియును = ముసలితనమును,రోగముల వరుసయును. తామస - వృత్తి = తమోగుణము. భయ + ఆతుర + ఆదులున్ = భయము, వ్యాధి మున్నగునవియును, పెనఁగిన = కూడిన, దుఃఖ - పుంజము + అగు = దుఃఖముల సమూహము, అగునట్టి, ప్రేతము = కళేబరము. చొచ్చి = ప్రవేశించి, మునింగి, మర్త్యుఁడు = మనుష్యుఁడు, ఈ - తనువునన్ = ఈ దేహమునందు, పొందన్ = పొందుటకు, రోయఁడు + అటె = అసహ్యించుకొనఁడఁట, తాన్ = తాను, నరక - స్థితికిన్ = నరకలోకమునందు దునికికి. ఏమి - రోసెడిన్ - ఏమి అసహ్యించుకొనును?

తా త్ప ర్య ము : ఎల్లప్పుడును రక్తప్రవాహములును, ఎముకలును, మేదస్సును, మూత్రమును, మలమును, ముసలితనమును, రోగములును, దమోగుణమును, భయమును, వ్యాధిపీడ అను వానితోఁగూడిన దుఃఖసముదాయమైన కళేబరమును జొచ్చి, మునిఁగి మనుష్యుఁడు ఈ దేహమునఁ బొందుటకు అసహ్యించుకొనఁ డనఁగా నిఁక నరకలోకమువం దునికి కేమి అసహ్యించుకొనును? అసహ్యించుకొనఁడని భావము.

వి శే ష ము లు : అలంకారము కావ్యార్థాపత్తి. 'కైముత్యే నార్థసంసిద్ధిః కావ్యార్థాపత్తి రిష్యతే.' చన్ద్రా.

క. విని చెవుల, ముట్టి తోలం,
గని కన్నుల, నమలి నాలుకను, మూర్కొని ము
క్కునఁ బురుషుఁ డెఱుఁగు మనమా
రను శబ్ద స్పర్శ రూప రస గంధంబుల్. 67

అ ర్థ ము : పురుషుఁడు, చెవులన్ = చెవులతో, విని, తోలన్ = చర్మముతో, ముట్టి = తాఁకి, కన్నులన్ = కన్నులతో, కని = చూచి, నాలుకను = నాలుకతో, నమలి, ముక్కునన్ = ముక్కుతో, మూర్కొని = ఆఘ్రాణించి, మనమారను (మనము + ఆరను) = మనస్సు తృప్తిగా, శబ్ద స్పర్శ రూప రస గంధముల్ = శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము అనునవి, ఎఱుఁగున్.

తా త్ప ర్య ము : మనుష్యుఁడు చెవులతో విని, చర్మముతో స్పృశించి, కన్నులతోఁ జూచి, నాలుకతో నమలి, ముక్కుతో నాఘ్రాణించి మనసార వరుసగా శబ్ద స్పర్శ రూప రస గంధముల నెఱుఁగును.

వి శే ష ము లు : తోలన్ - తోలుశబ్ద మౌపవిభక్తికముగాఁ బ్రయుక్తమైనది. ఇది దాని తృతీయైకవచనరూపము - తోలితో నని యర్థము. తోలు + చేతను - 'ఔపవిభక్తికముల తృతీయాసప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు.' బాల అచ్చిక. 38. తోలు + అను - 'అంద్వవగాగమంబులం దప్ప నపదాదిస్వరంబు పరంబగు నప్పు డచ్చునకు సంధి యగు'. బాల. సంధి. 11. తోలన్. అలంకారము యథాసంఖ్యము.

క. చక్షు మదనేంద్రియములు ము
ముక్షులు మదిగెలుతు రెఱిఁగి మును శ్రోత్ర త్వ
క్చక్షు ర్జిహ్వా ఘ్రాణ స
పక్షగవా క్పాణి పాద పా యూపస్థల్. 68

అర్థము : ముముక్షులు = మోక్షమును గోరువారు. మును = ముందు. శ్రోత్ర - త్వచ్(క్) + చక్షస్(ః) + జిహ్వా + ఘ్రాణ సపక్షగ + వాచ్(క్) + పాణి - పాద - పాయు + ఉపస్థల్ = చెవులు, చర్మము, కన్నులు, నాలుక, ముక్కు అనువానివి, వాక్కు, చేతులు, పాదములు, గుదస్థానము, రహస్యావయవము అను వానిని, ఎఱిఁగి, చక్షు - మదన + ఇంద్రియములు = కన్నులు. మన్మథవికారమును గలిగించు నింద్రియములు, మదిన్ = మనస్సునందు గెలుతురు.

తాత్పర్యము : మోక్షము నిచ్ఛించువారు ముందుగా చెవులు, చర్మము, కన్నులు, జిహ్వా, ముక్కు అనువానిని, వాక్కు, పాణులు, పాదములు, గుదస్థానము, రహస్యావయవములు తెలిసికొని చక్షువును, మన్మథుని. ఇంద్రియములును జయింతురు.

విశేషములు : సకారాంతమైన చక్షు శ్శబ్ద మిట ఉకారాంతముగాఁ బ్రయుక్త మగుట విశేషము. చక్షు ర్మదనేంద్రియములు అని యుండనగును. ముముక్షులు = మోక్షమును గోరువారు, ముచ్ ధాతు సన్నంత కర్త్రర్థకరూపము. మోక్తు మిచ్ఛన్తి ఇతి ముముక్షవః. - ముముక్షులు - ముముక్షువులు, 'వువర్ణకేతర విభక్తి పరమగుచో నుకారాంతంబులకు బహుళంబుగా గోశబ్దంబునకు నిత్యంబుగా వుగాగమం బగు.' బాల.త. 49. ఇది వుగాగమ రహితరూపము. చక్షుర్జిహ్వా - చక్షుస్ + జిహ్వా - పదాంత సకారమునకు విసర్గాదేశము. చక్షుః + జిహ్వా. అ ఆలు తప్పఁ దక్కిన అచ్చుల తరువాతవచ్చు విసర్గమునకు అచ్చులుకాని మృదుహల్లులు (హశ్శులు) కాని పరములగునపుడు రేఫమాదేశమగును. చక్షుర్జిహ్వా.

ఆ. అనుభవించి తనిసి యట మఱి విషయముల్
విడుతు నని తలంచు వెడఁగుఁదలఁపు
లఖిల శిఖి శిఖాలియం దింధనాజ్యముల్
గమియమైచి యార్పఁ గడఁగునట్లు. 6

అర్థము : అనుభవించి, తనిసి = తృప్తి నొంది, అటన్, మఱి, విషయముల్ = ఇంద్రియములు, విడుతున్ + అని = విడిచెదనని, తలంచు, వెడఁగు+తలఁపులు = వెఱ్ఱి యాలోచనలు, అఖిల - శిఖి - శిఖా + ఆలి యందున్ = ఎల్ల అగ్నిజ్వాలల సమూహమునందు, ఇంధన + ఆజ్యముల్ = కట్టెలను, నేయియును, కమియన్ - వైచి = ఎక్కువగా వైచి, ఆర్పన్ + కడఁగు + అట్లు = ఆర్పఁబూను విధము.

తాత్పర్యము : అనుభవించి, తృప్తిపడి ఆ తరువాత నింద్రియములను విడుతునని తలఁచు వెఱ్ఱి యాలోచనలు అగ్నిజ్వాలలందు అధికముగాఁ గట్టెలను, నేయియును వేసి యార్పుటకుఁ బూనునట్లు.

విశేషములు : అలంకార ముపమ. కట్టెలను, నేయియును వేసిన పిమ్మట అగ్నినార్పుట యెంతకష్టమో తృప్తిగా అనుభవించిన పిమ్మట నింద్రియములను విడుచుటయు నంతకష్టమనుట.

చ. తలఁకఱ నిల్చి, శాంత మెదఁ దాల్చి, మమత్వము మాల్చి, ధైర్య మి
ట్టలముగఁ బెంచి, మోహము లడంచి, యఘావలిఁ ద్రుంచి, కోర్కి యు
గ్గలముగ మాన్చి, యీషణలఁ గ్రాఁచి సదాశివుఁ గొల్చి యాత్మలో
పల ననురక్తి నిశ్చలత భక్తిఁ దలంచిన ముక్తి చేకుఱున్. 70

అర్థము : తలఁకు + అఱన్ = చాంచల్యములేక, నిల్చి, శాంతము, ఎదన్ = హృదయమునందు, తాల్చి, మమత్వమున్ = నాది యను భావమును, మాల్చి = నశింపఁజేసి, ధైర్యము, ఇట్టలముగన్ = అధికముగా, పెంచి = వృద్ధిపొందించి, మోహములు = వలపులు, అడంచి = అణఁచివైచి, అఘ + ఆవలిన్ = పాపములవరుసను, త్రుంచి = ఖండించి, నశింపఁజేసి, కోర్కి = కోరిక, అగ్గలముగన్ = అధికముగా, మాన్చి = లేకుండఁజేసి, ఈషణలన్ = కోరికలను - దారేషణ, పుత్త్రేషణ, ధనేషణ అనువానిని, క్రాఁచి = నశింపఁజేసి, సదాశివున్ = పరమేశ్వరుని, కొల్చి = సేవించి, ఆత్మలోపలన్ = మనసులోపల, అనురక్తి - నిశ్చలతన్ = అనురాగముయొక్క స్థిరత్వముతో, భక్తిన్=భక్తితో, తలంచిపన్ = తలఁచినచో, ముక్తి = మోక్షము, చేకుఱున్ = లభించును.

తాత్పర్యము : చాంచల్యములేక నిలిచి, హృదయమున శాంతమును దాల్చి, మమతను నశింపఁజేసి, ధైర్యము నధికముగాఁ బెంచి, పాపములను ఖండించి, కోరికలను లేకుండఁజేసి, ధనదార పుత్త్రేషణలను విడనాడి, పరమేశ్వరుని గొల్చి ఆత్మలో నిశ్చలమైన అనురక్తి భక్తులతో ధ్యానించినచో మోక్షము లభించును.

తరుపద. హృదయాంబుజములోన నెప్పుడుఁ బాయ
కేర్పడి వెలుఁగు మాహేశ్వర రూప
మది పరంజ్యోతి సదాభ్యాసవృత్తి
యంద చిత్తంబు లయంబు గావించు
నది భావభావ్యంబు లడఁగిన మఱి ని
జాకారుఁడగు పరమాత్ముఁడు దాన
పదిలమై నిలుచు నిర్బంధమై నిష్ప్ర
పంచమై నిర్వాణ పదవి దా నదియు. 71

అర్థము : హృదయ + అంబుజములోనన్ = పద్మమువంటి హృదయమునందు, ఎప్పుడున్, పాయక - విడువక, ఏర్పడి. వెలుఁగు = ప్రకాశించు, మహేశ్వర - రూపము = పరమేశ్వరుని రూపు, అది, పరంజ్యోతి = ఉత్కృష్టమైన జ్యోతి, సదా + అభ్యాస - వృత్తి + అందున్ + అ = నిరంతరమును అభ్యాసముచేయు ప్రవృత్తియందే. చిత్తంబున్ = మనస్సును, లయంబు + కావించునది = లీనము గావింపవలయును. భావ - భావ్యంబులు = భావమును, భావింపఁదగినదియు, అడఁగినన్ = నశించినచో, మఱి, నిజ + ఆకారుఁడు + అగు = తనదైన ఆకారము గలవాఁడగు, పరమాత్ముఁడు, తాను + అ = తానే, పదిలము + ఐ = స్థిరమయి, నిర్బంధము + ఐ = బంధరహితమై, నిష్ప్రపంచము + ఐ = వైవిధ్యము లేనిదయి, నిలుచున్, తాను + అదియున్, నిర్వాణ - పదవి = మోక్షమార్గము,

తాత్పర్యము : హృదయపద్మములో నిరంతరమును వెలుఁగు పరమేశ్వర రూపము పరంజ్యోతి. సదాభ్యాసప్రవృత్తితో మనస్సు లీనము గావింపవలయును, భావము, భావ్యము అడఁగినచో పరమాత్ముఁడు స్వస్వరూపముతో స్థిరముగను, బంధరహితముగను, వైవిధ్యములేకుండఁగను నిలుచును, అదియే మోక్షము.

విశేషములు: తరుపద - నాలుగుపాదము లుండును. ఒక్కొక్క పాదమునను మూఁడింద్రగణములు. ఒక సూర్యగణము. మరల మూఁడింద్రగణములు నొక సూర్యగణము ఉండవలయును. మొదటిగణము మొదటియక్షరమునకు, మూఁడవ గణము మొదటి యక్షరమునకు, అయిదవగణము మొదటియక్షరమునకు, ఏడవగణము మొదటియక్షరమునకు యతిమైత్రి, ప్రాసనియమము గలదు. దీని లక్షణము తరువోజ లక్షణముతో సమముగ నున్నది.

సీ. భావించి మెచ్చింపఁగా వచ్చు నందమే
        వగవ భావంబు భావ్యంబుఁ దాన;
ప్రణుతించి మెచ్చింపఁ బడయుద మందమే
        తనర శబ్దంబు నర్థంబుఁ దాన;
పూజించి మెచ్చింపఁ బోలుఁబో మ్మందమే
        తగిన కర్మంబుఁ గర్తయును దాన;
కాన మనస్సు వాక్కాయ కర్మంబులు
        శివునియంద నిలిపి చిత్తవృత్తిఁ

ఆ. దన్ను శివునికంటె నన్యంబు గాకుండ
    నెఱిఁగి తలరకుండు టిదియె ముక్తి;
    కాన మోక్షమొందు కర్మమార్గంబునఁ
    బడయఁగడఁగు టెల్ల భ్రాంతి కాదె? 72

అర్థము: భావించి = భావమునందుంచి. మెచ్చింపఁగాన్ + వచ్చున్ + అందమే = సంతోషింపఁ జేయవచ్చు నందమా. వగవన్ = చింతింపఁగా, భావంబున్ - భావ్యంబున్ = భావించునదియు, భావింపఁదగినదియు. తాను + అ = తానే.

ప్రణుతించి = సంస్తుతిచేసి, మెచ్చింపన్ + బడయుదము + అందమే = మెప్పింపఁగలుగుదు మందమా, తనరన్ = ఒప్పఁగా, శబ్దంబున్ + అర్థంబున్ శబ్దార్థములు రెండును, తాను + అ = తానే.

పూజించి, మెచ్చింపన్ + పోయిన్ + బొమ్మ = అందమే + మెప్పింపఁ దగుమ బొమ్మందమా, తగిన, కర్మంబున్ + కర్తయును = ఫలాశ్రయమును, వ్యాపారాశ్రయమును, తాను + అ.

కానన్ = కావున, మనస్సు, వాక్ + కాయ - కర్మంబులు = వాక్కును, శరీరమును, క్రియయును, శివుని + అందున్ + అ = శివునియందే, నిలిపి, చిత్తవృత్తిన్ + మనస్సునందు, తన్నున్. శివునికంటెన్. అన్నెంబు = వేఱు, కాక + ఉండుట = కాకపోవుట, ఎఱిఁగి, తలరక + ఉండుడు = చలింపకుండుట, ఇదియె, ముక్తి,

కానన్, మోక్షము, ఒండు - కర్మ - మార్గంబునన్ = వేఱొక కర్మమార్గముచే, పడయన్ + కడఁగుట + ఎల్లన్ = పొందయత్నించుట అంతయును, భ్రాంతి - కాదె = భ్రమముకాదా?

తాత్పర్యము: భావించి సంతోషింపఁజేయవచ్చునందమేని, భావభావ్యములు, రెండును దానే. సంస్తుతిచేసి మెప్పింపఁగలుగుడు మందమేని. సంస్తుతికి వలయు శబ్దార్థములు రెండును దానే, పూజించి మెప్పింపఁబోలు నందమేని. ఫలవ్యాపారాశ్రయములు రెండును దానే. కావున మనోవాక్కాయకర్మములు శివునియందే నిలిపి చిత్తమునఁ దాను శివునికంటె వేఱువాఁడు కాకుండుట తెలిసి చలింపకుండుటయే మోక్షము. కావున మోక్షమును వేఱొకకర్మమార్గమునఁ బొంద యత్నించుటెల్ల భ్రాంతియే.

విశేషములు: అలంకారము కావ్యలింగము. అన్నెము (వికృతి) - అన్యము (ప్రకృతి).

క. తాన సమస్తములోఁ దన
లోనన సకలంబు గనుట లోనును వెలియుం
దాన యయి తనకు వే అనఁ
గా నేమియు లేక తాన కలిగి వెలుంగున్. 73

అర్థము: తాను + అ = తాన - తానే, సమస్తములోన్ = అంతటను, తనలోనన్ + అ = తనలోపలనే. సకలంబున్ = అంతయును, కనుట = చూచుట

లోనును - వెలియున్ = లోపలను, వెలుపలను, తాను + అ = తానే, ఆయి, తన కున్. వేఱు + అనఁగాన్ = తనకంటె వేఱయినది అన, ఏమియున్, లేక, తాను+ అ, కలిగి = ఉండి, వెలుంగున్ = ప్రకాశించును,

తాత్పర్యము : తానే అంతటను, తనలోనే అంతయును ఉండి. బహిరం తరములు తానే యయి, తనకంటె వే అనునది యేఁది యు లేక తానే యుండి ప్రకాశిం చును.

క. కలిగియుఁ జెప్పను జూపను
దలఁపను రా దెల్లచోటఁ దానై యెందున్
గలయఁడు సర్వగుఁడై ని
శ్చలుఁ డగు నేకాంతుఁడయ్యు సర్వాత్ముఁడగున్. 74

అర్థము : కలిగియున్ + ఉండియును. చెప్పను = చెప్పుటకును, చూపను = చూపుటకును. తలఁపను = భావించుటకును, రాదు = వలనుపడదు, ఎల్ల చోటన్ = అంతటను, తాను + ఐ = తానయి. ఎందున్ = ఎచ్చటను. కలయఁడు= కలియఁడు, సర్వగుఁడు + ఐ = అంతటను వ్యాపించినవాఁడయి, నిశ్చలుఁడు = చలింపనివాఁడు, అగున్. ఏకాంతుఁడు + అయ్యున్ = ఒంటరివాఁడయ్యును, సర్వ+ ఆత్ముఁడు = సర్వస్వరూపుఁడు. అగున్.

తాత్పర్యము: ఉండియును జెప్పుటకును, చూపుటకును, తలఁచుటకును వీలుపడఁడు. అంతటను దానయి యెందును గలియఁడు. అంతటను వ్యాపించినవాఁ డయి నిశ్చలుఁడగును, ఒంటరియయ్యు. సర్వాత్ముఁ డగును.

క. తలఁప నని తలఁచి యించుక
తలఁచుడుఁ దలఁపంగలేక తానును లేక
పలుకులును లేక యెప్పుడుఁ
గలిమియె పొడవైనవాఁడు కదిరి వెలుంగున్! 75

అర్థము : తలఁపన్ + అని = తలఁచుటకని, తలఁచి, ఇంచుక = కొంచెము, తలఁచుడున్ = తలఁచినంతనే, తలఁపంగన్ + లేక = తలఁపలేక.

తానును, లేక, ఆ + పలుకులును, లేక, ఎప్పుడున్, కలిమియె = ఉండుటయె, పొడవు + ఐన - వాఁడు = రూపమైనవాఁడు, కదిరి = విజృంభించి, వెలుంగున్ = ప్రకాశించును.

తాత్పర్యము : తలఁతువనిచెప్పి తలఁచి కొంచెము తలఁచినంతనే యిఁకఁ దలఁపఁజాలక, తానును, లేక, ఆ పలుకులును లేక యెప్పుడును ఉండుటయే రూపము అయినవాఁడయి విజృంభించి ప్రకాశించును.

క. తలఁపఁబడు దానితోడన
తలఁపుల మును సెఱిచి మఱచి తాఁ బరమాత్మం
దలఁచుట మఱవక నిజ మని
నిలిచిన పురుషుండు తాన నిర్వాణి యగున్. 76

అర్థము : తలఁపఁబడు - దాని - తోడన్ + అ = తలఁపఁబడు దానితోనే, తలఁపులన్ = తలఁపులను, మును = ముందు, చెఱిచి, మఱచి = ఆ తలఁపులను మఱచి, తాన్ = తాను, పరమాత్మన్, తలఁచుట, మఱవక, నిజము, అని నిలిచిన, పురుషుండు, తాను + అ, నిర్వాణి = నిర్వాణము - మోక్షముగలవాఁడు, అగున్.

తాత్పర్యము : తలఁపఁబడు దానితోనే తలఁపులను జెఱిచి, ఆ తలఁపులను మఱచి, పరమాత్మనిఁ దలఁచుట మాత్రము మఱవక, నిజమనిభావించు పురుషుఁడే మోక్షముగలవాఁ డగును.

చ. దొరకొను నింద్రజాలమునఁ దోఁచిన రూపము లింద్రజాల మం
చరయఁగలేక చూపఱకు నన్నియు నిక్కమ వోలె నైనయ
ట్లైరవుగఁబారమార్థికుల కెప్పుడు ద్రవ్యము లెల్ల మిథ్యలై
నిరతముఁజూడ లోకులకు నిక్కములై చను భ్రాంతి పెంపునన్. 77

అర్థము : దొరకొను + ఇంద్రజాలమునన్ = సమర్థమగు నింద్రజాల విద్యచేత, తోఁచిన = కానవచ్చిన, రూపములు = ఆకృతులు, ఇంద్రజాలము + అంచున్ = ఇంద్రజాలమని, అరయఁగన్ + లేక = తెలిసికొనలేక, చూపఱకున్ = చూచువారలకు, అన్నియున్, నిక్కము + అ + పోలెన్ = నిజమే యను విధమున,

ఐన + అట్లు = అయినట్లు, ఇరవుగన్ = ఒప్పుగా, పారమార్థికులన్ = యథార్థము నెఱిఁగినవారికి, ఎప్పుడున్, ద్రవ్యములు + ఎల్లన్ = పదార్థము లన్నియు, మిథ్యలు + ఐ = అసత్యములయి, నిరతమున్ = ఎల్లప్పుడును, చూడన్ = చూడఁగా, లోకులకున్ = సామాన్యజనులకు, భ్రాంతి-పెంపునన్ = భ్రమాతిశయము చేత, నిక్కములు + ఐ = సత్యములయి, చనున్ = ఒప్పును.

తాత్పర్యము : సమర్థమైన ఇంద్రజాలఘుచేఁ గనుపట్టిన ఆకారములు ఇంద్రజాలముననైనవని తెలిసికొనలేక చూచువారి కన్నియును నిజముగా భాపించునట్లు, యాథార్థ్యవిదుల కెప్పుడును వస్తువులన్నియు నసత్యములై సామాన్యులైన జనులకు మాత్రము భ్రాంత్యతిశయముచే సత్యములుగా భాపించును.

విశేషములు : అలంకార ముపమ.

వ. అని యనేకప్రకారంబుల వేదశాస్త్ర పురాణాగమ సారవృత్త్యాధ్యాత్మ శాస్త్రవిధి హేయోపాదేయ పదార్థంబులు నిజ శిష్యగణంబులకు విస్పష్టంబుగా వ్యాఖ్యానంబు చేయుచున్న మునిముఖ్యుల దర్శింపుచుం జని చని ముందట. 78

అర్థము : అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కు రీతుల, వేద - .... పదార్థంబులు; వేద - శాస్త్ర - పురాణ + ఆగమ = వేదములు, శాస్త్రములు, పురాణములు, ఆగమములు, అనువానియందలి, సార - వృత్త = సారవంతమైన విషయము నందును, అధ్యాత్మ - శాస్త్ర = అధ్యాత్మ శాస్త్రమునందును గల, విధి = చేయవలసినది, హేయ = విడువఁదగినది, ఉపాదేయ = స్వీకరింపఁదగినది, అగు, పదార్థంబులు + విషయములు, నిజ - శిష్య - గణంబులకున్ = తమ శిష్యుల సమూహములకు, విస్పష్టంబుగాన్ = మిక్కిలి స్పష్టముగా, వ్యాఖ్యానంబు + చేయుచున్ + ఉన్న = వివరించుచున్న, ముని - ముఖ్యులన్ = మునిశ్రేష్ఠులను, దర్శింపుచున్ = చూచుచు, చని, చని, ముందటన్.

తాత్పర్యము : అని పెక్కురీతుల వేదములు, శాస్త్రములు, పురాణములు, ఆగమములు, అధ్యాత్మశాస్త్రములు అను వానియందలి చేయఁదగిన, విడువఁదగిన

స్వీకరింపఁదగిన విషయములు విస్పష్టముగాఁ దమశిష్యులసమూహములకు వివరించు చున్న మునిశ్రేష్ఠులను దర్శించుచుఁ బోయిపోయి యెదుట - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : దర్శింపుచు - ఆగమచకారమునకు ముత్తు (ముజ్జీత్తులు) పరమగునపుడే పత్వాదేశము. ఇచ్చట శత్రర్థక చువర్ణకము పరమగుచున్నను చకారమునకు పత్వాదేశము వచ్చుట విశేషము. దర్శించుచున్ అనియే యుండ వలయును.

ఉ. వాసనగా శివాగమము వర్ణనకెక్కఁ ద్రయీసదర్థముల్
దేసిగ నాత్మశిష్యులకుఁ దెల్పుచు సద్విధినున్న నిష్కళా
భ్యాసమునందు లీనమగుభావము నిల్పి వెలుఁగుచున్న స
ద్భూసురముఖ్య విప్రమునిపుంగవు జంగమ మల్లికార్జునున్. 79

అర్థము : శివాగమము (శివ + ఆగమము) - శివసంబంధమైన ఆగమము, వాసనగాన్ = పూర్వజన్మ సంస్కారముగా, వర్ణనకున్ + ఎక్కన్ = ప్రసిద్ధి నొందఁగా, త్రయీ - సత్ + అర్థముల్ = వేదముల మేలైన యర్థములు, దేసిగన్= బాగుగా, ఆత్మ - శిష్యులకున్ = తన శిష్యులకు, తెల్పుచున్ = బోధించుచు, సత్ + విధిన్ = ఉత్తమరీతితో, ఉన్న, నిష్కళ + అభ్యాసమునందున్ = సంపూర్ణమైన సాధనయందు, లీనము + అగు = తదేకాయత్తమైన, భావమున్ = మనస్సును, నిల్పి, వెలుఁగుచున్ + ఉన్న = ప్రకాశించుచున్న, సత్ + భూసుర - ముఖ్యున్= ఉత్తమ బ్రాహ్మణశ్రేష్ఠుఁడును, విప్ర - ముని - పుంగవున్ = బ్రాహ్మణమునీశ్వరుఁడును. అగు, జంగమ మల్లికార్జునున్ = జంగమ మల్లికార్జునుని.

తాత్పర్యము : శైవాగమము పూర్వజన్మ సంస్కారవశముగా, ప్రసిద్ధి నొందఁగా. మేలైన వేదార్థములను దన శిష్యులకు బాగుగా బోధించుచు, ఉత్తమరీతి నున్న సంపూర్ణసాధనయందు తదేకాయత్తముగా భావమును నిల్పి ప్రకాశించుచున్న బ్రాహ్మణ మునిశ్రేష్ఠుఁడగు జంగమమల్లికార్జునుని - తరువాతి పద్యముతో నన్వయము.

మత్తకోకిలము.

వృక్షమూలనివాసు, నాతత వేద వేది, ననూనరు
ద్రాక్షధారి, నఘారి, నత్యమలాంగు, నున్నతమోక్షసా
పేక్షితున్, నిరపేక్షితున్, బుధవృద్ధవంద్యు, ననింద్యు, ను
గ్రాక్షపాదసరోరుహార్చకు, నాత్మవిత్తము, సత్తమున్. 80

అర్థము : వృక్ష - మూల - నివాసున్ = చెట్టుమొదలు నివాసముగాఁ గల వాఁడును, ఆతత - వేదవేదిన్ = విస్తృతమైన వేదజ్ఞానముగలవాఁడును, అనూన (న + ఊన) - రుద్రాక్ష - ధారిన్ = తక్కువకాని (గొప్పదియగు) రుద్రాక్షమాలను ధరించినవాఁడును, అఘ + అరిన్ = పాపమునకు శత్రువైనవాఁడును - అనఘుఁడును. అతి + అమల + అంగున్ = మిక్కిలి పవిత్రమైన శరీరముగల వాఁడును. ఉన్నత - మోక్ష - సాపేక్షితున్ = మిక్కిలి గొప్పదియగు మోక్షమును గోరువాఁడును, నిరపేక్షితున్ = కోరికలు లేనివాఁడును, బుధ - వృద్ధ - వంద్యున్ = పండితులైన పెద్దలచే నమస్కరింపఁదగినవాఁడును, అనింద్యున్ = నింధింపఁదగని వాఁడును, ఉగ్రాక్ష (ఉగ్ర + అక్షి) - పాద - సరోరుహ + అర్చకున్ = శివుని పాదపద్మములను బూజించువాఁడును, ఆత్మ - విద్ + తమున్ = ఆత్మజ్ఞానముగల వారిలో శ్రేష్ఠుఁడును, సత్తమున్ = సర్వోత్తముఁడును, అగు జంగమ మల్లికార్జునుని -

తాత్పర్యము : వృక్షమూలము నివాసముగాఁ గలవాఁడును, వేదవిదుఁడును, అనల్పమైన రుద్రాక్షమాలను దాల్చువాఁడును, పాపరహితుఁడును, మిక్కిలి నిర్మలమైన శరీరము గలవాఁడును, ఉన్నతమైనమోక్షమును గోరువాఁడును, కోరికలు లేని వాఁడును, పండితులైనపెద్దలచే నమస్కరింపఁదగినవాఁడును, నిందింపఁదగనివాఁడును, శివపాదపద్మపూజకుఁడును, ఆత్మజ్ఞానియును, సర్వోత్తముఁడును అగు జంగమ మల్లికార్జునుని - తరువాతి గద్యముతో నన్వయము.

వ. కని భూరిప్రీతిం బ్రణమిల్లి గురుస్థానంబుగా స్వీకరించి పార్వతి పరమభక్తియుక్తి నారాధించి తత్ప్రసాదంబును బడసి నిజాభిమతం బెఱింగించి శైవాగమవిధి దీక్షగొని పరమేశ్వరుండు రయంబునం

ప్రసన్నుండగునట్టి మంత్రధ్యానవ్రతాచారంబు లుపదేశంబుగొని
తన్నియోగంబున. 81

అర్థము : కని = చూచి, భూరి - ప్రీతిన్ = మిక్కిలి యిష్టముతో, ప్రణమిల్లి = నమస్కరించి, గురు - స్థానంబు + కాన్ = గురుస్థానీయునిగా, స్వీకరించి = గ్రహించి, పార్వతి, పరమ - భక్తి - యుక్తిన్ = గొప్పభక్తితో, ఆరాధించి = పూజించి, తద్ + ప్రసాదంబును = అతని యనుగ్రహమును, పడసి = పొంది, నిజ + అభిమతంబు = తనదైన కోరిక, ఎఱింగించి = తెలిపి, శైవ = ఆగమ-విధిన్ = శైవాగమముప్రకారముగా, దీక్షన్ + కొని = దీక్ష స్వీకరించి, పరమేశ్వరుండు, రయంబునన్ = శీఘ్రముగా, ప్రసన్నుండు + అగు + అట్టి = ప్రత్యక్షమగునట్టి, మంత్ర - ధ్యాన - వ్రత + ఆచారంబులు = మంత్రములు, ధ్యానము, వ్రతములు, ఆచారములు, ఉపదేశంబు + కొని = ఉపదేశముపొంది, తద్ + నియోగంబునన్ = అతని ఆదేశముచొప్పున,

తాత్పర్యము : చూచి అధిక సంతోషముతో నమస్కరించి గురుస్థానీయునిగా, గైకొని పార్వతి మిక్కిలిభక్తితోఁ బూజించి, యాతని యనుగ్రహమును బొంది, తనకోరిక నెఱింగించి, శైవాగమముప్రకారముగా దీక్షను స్వీకరించి, పరమేశ్వరుఁడు శీఘ్రముగాఁ బ్రత్యక్షమగునట్టి మంత్రధ్యాన వ్రతాచారముల నుపదేశముపొంది యాతని ఆదేశముచొప్పున-తరువాతి పద్యముతో నన్వయము.

సీ. పవడంపులతమీఁదఁ బ్రాలేయపటలంబు
పర్వె నా మెయినిండ భస్మమలఁది,
లాలితంబగు కల్పలత పల్లవించె నాఁ
గమనీయ ధాతువస్త్రములు గట్టి,
మాధవీలత కలిమాలికల్ ముపరె నా
రమణ రుద్రాక్షహారములు వెట్టి,
వరహేమలతికపైఁ బురినమ్మి యూఁగె నా
సమ్మతంబగు నెఱిజడలు పూని,

తే. హరుఁడు మాహేశ్వరీరూపమైన చెలువ
మభినయించెనొ యని మును లర్థిఁ జూడ
గురుతపశ్శక్తి మూర్తి నేకొనిన కరణిఁ
దగిలి యుమ తపోవేషంబుఁ దాల్చి పొల్చె. 82

అర్థము : పవడంపు-లత (పవడము - లత) - మీఁదన్ = పవడపుఁదీఁగపై, ప్రాలేయ - పటలంబు = మంచుసమూహము, పర్వెన్ + నాన్ = వ్యాపించెనా యనునట్లు, మెయినిండన్ = శరీరమునిండ, భస్మము + అలఁది = బూది పూసికొని,

లాలితంబు + అగు = మనోహరమైన, కల్ప - లత = కల్పవృక్షపుఁదీఁగ, పల్లవించెన్ + నాన్ = చివురించెనా యనునట్లు, కమనీయ - ధాతు - వస్త్రములు = మనోహరమైన, కావివలువలు, కట్టి = ధరించి,

మాధవీ - లతకున్ = బండిగురివెందతీఁగకు, అలి - మాలికల్ = తుమ్మెదల బారులు, మునరెన్ + నాన్ = మునరెనా అనునట్లు, రమణన్ = అందముగా, రుద్రాక్ష - హారములు + పెట్టి = రుద్రాక్షమాలలు తాల్చి,

వర - హేమ - లతికపైన్ = శ్రేష్ఠమైన మందారలతమీఁద, పురి-నమ్మి = పురివిప్పిన నెమలి, ఊఁగెన్ + నాన్ = ఆడెనా యనునట్లు, సన్నుతంబు+అగు= మిక్కిలి పొగడఁదగినదగు. నెఱి - జడలు = అందమైన జడలు. పూని = ధరించి.

హరుఁడు = ఈశ్వరుఁడు, మాహేశ్వరీ - రూపము + ఐన = మాహేశ్వరి (పార్వతి) ఆకారము గలది యగు, చెలువము = అందము, అభినయించెనొ = నటించెనో, అని, మునులు, అర్థిన్ = కోరికతో, చూడన్, గురు - తపస్ + శక్తి = గొప్పదియగు తపస్సుయొక్క శక్తి, మూర్తి = ఆకారము, చేకొనిన - కరణిన్ = తాల్చిన విధమున, ఉమ = పార్వతి, తగిలి = ఆసక్తి వహించి, తపస్(ః) - వేషంబున్ = తపస్సునకైన వేషమును, తాల్చి = ధరించి, పొల్చెన్ + ఒప్పెను.

తాత్పర్యము : పవడపుఁదీఁగపై మంచుసమూహము వ్యాపించెనా యనునట్లు శరీరమునిండ విభూతిపూసి, మనోహరమైన కల్పవృక్షపుఁదీఁగ చివురించెనా

యనునట్లు రమణీయమునైన కావివలువలుదాల్చి, మాధవీలతపైఁ దుమ్మెదలబారులు ముసరెనా యనునట్లు అందముగా రుద్రాక్షమాలలు ధరించి, మేలైన మందారలతమీఁద పురివిప్పిన నెమలి ఆడెనా యనునట్లు అందమైన జడలు పూని, మహేశ్వరుఁడు మాహేశ్వరీరూపము నభినయించెనేమోయని మునులు కోరికతోఁ జూడ, గొప్పదియగు తపశ్శక్తి మూర్తీభవించెనా యను విధమునఁ బార్వతి తపోవేషమును దాల్చి యొప్పెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష.

వ. తదనంతరంబ. 83

అర్థతాత్పర్యములు : ఆ పిమ్మటనే - తరువాతి పద్యముతో నన్వయము.

గీ. మేని కుంకుమరాగంబు, మెలఁత తోఁపు
మోవి తాంబూలరాగంబు మొగిన పాసి
చారుతర మయ్యెఁ జూడ నా శైలతనయ
వీతరాగంబు ప్రకటించు విధమువోలె. 84

అర్థము : మేని - కుంకుమ - రాగంబున్ = శరీరపుఁగుంకుమపు ఱెుఱపును. తోపుమోవి-తాంబూల-రాగంబున్ = ఎఱ్ఱని పెదవితమ్మలపు ఱెుఱపును, మొగిన్ + అ = ముందే, పాసి = విడిచి - తొలఁగిపోయి, మెలఁత = ఇంతి, ఆ - శైల - తనయ = ఆ కొండకూఁతురు - పార్వతి, వీత - రాగంబు = రాగము (ఎఱుపు, అనురాగము) పోవుటను, ప్రకటించు - విధము + పోలెన్ = తెలుపు విధమున చూడన్ = చూడఁగా, చారుతరము + అయ్యెన్ = మిక్కిలి అందగించెను.

తాత్పర్యము : ఆ పార్వతి తపశ్చరణ సమయమున మేనికుంకుమపు ఱెుఱపును, ఎఱ్ఱని పెదవి తమ్మలపు ఱెుఱపును విడిచి, రాగత్యాగమును దెలుపు చున్నదా యనునట్లు మిక్కిలి అందగించెను.

విశేషములు : తపస్సుచేసికొను నీ సమయమున నామె మేనికి గుంకుమము నలఁదుటలేదు. తాంబూలమును సేవించుట లేదు. అందుచే నామె మేనును, మోవియు రాగములేక యుండెను. అది యీ సమయమున నామె అనురాగమును వీడెనా యనునట్లుండెను. అలంకారము శ్లేషానుప్రాణితమైన ఉత్ప్రేక్ష.

గీ. కురులతోఁగూడ విలసిల్లు గిరిజ మొగము
జడలు తాల్చినఁ గడు బెడం గడరి పొల్చె
భృంగములు మూఁగి చెలువొందు బిసరుహంబు
పాఁకు దాల్చియుఁ గర మొప్పు భంగి వోలె. 85

అర్థము : కురులతోన్ = శిరోజములతో, కూడన్ = కూడఁగా, విలసిల్లు = ప్రకాశించు, గిరిజ - మొగము = పార్వతి ముఖము, జడలు - తాల్చినన్ = జడలు ధరించినను, భృంగములు = తుమ్మెదలు, మూఁగి, చెలువు + ఒందు = అందగించు, బిసరుహంబు = పద్మము, పాఁకు + తాల్చియున్ = నాఁచుతోఁ గూడియు, కరము = మిక్కిలి, ఒప్పు = ఒప్పునట్టి, భంగి + పోలెన్ = విధమున, కడున్ + బెడంగు = మిక్కిలి అందము, అడరి = అతిశయించి, పొల్చెన్ = ఒప్పెను.

తాత్పర్యము : ముంగురులతోఁ గూడి ప్రకాశించు పార్వతి ముఖము ఇప్పుడు తపశ్చరణ సమయమున జడలు ధరించి, తుమ్మెదలు మూఁగి అందగించు పద్మము నాఁచుతోఁ గూడియు మిక్కిలి అందగించునట్లు మిక్కిలి అందముగా నుండెను.

విశేషములు : ఈ భావము కాళిదాసునను గలదు.
యథా ప్రసిద్ధై ర్మధురం శిరోరుహై
ర్జటాభి రప్యేవ మభూత్ త దాననమ్,
న షట్పద శ్రేణిభి రేవ పఙ్కజం
సశైవలాసఙ్గ మపి ప్రకాశతే. సం.కు.సం. 5-9.

అలంకార ముపమ.

వ. ఇట్లు పార్వతి తపోలక్ష్మి ముఖ విశేషకంబునుంబోని తపోవేషంబు దాల్చి మహోత్సాహంబున నిజగురువరానుజ్ఞాతయై యా క్షణంబ. 86

అర్థము: ఇట్లు, పార్వతి, తపస్(ః) + లక్ష్మీ - ముఖ - విశేషంబునున్ + పోని = తపస్సనెడి లక్ష్మియొక్క ముఖమునందలి మకరికాపత్రరచనను . పోలిన, తపస్(ః) + వేషంబు, తాల్చి, మహత్ (మహా) + ఉత్సాహంబునన్ = మిక్కిలి

వేడుకతో, నిజ - గురు, వర + అనుజ్ఞాత + ఐ = తన గురువర్యునిచే ననుమతింపఁబడినదయి, అ క్షణంబు + అ = వెంటనే.

తాత్పర్యము: ఇట్లు పార్వతి తపోలక్ష్మి ముఖ మకరికాపత్రరచనను బోలిన తపోవేషమును దాల్చి. మిక్కిలి వేడుకతోఁ దన గురువర్యుని అనుజ్ఞఁ బడసి వెంటనే - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు: అలంకారము రూపకానుప్రాణితమయిన ఉత్ప్రేక్ష.

క. ఆ నగపతిసుత మదిఁ బర
మానందముతో మహేశు నారాధింపం
గా నిర వరయుచుఁ జని గం
గా నది తీరమునఁ గాంచె గౌరీవనమున్. 88

అర్థము: ఆ - నగ - పతి - సుత = ఆ కొండలఱేని కూఁతురు - పార్వతి, మదిన్ = మనస్సునందు, పరమ + ఆనందముతోన్ = మిక్కిలి సంతోషముతో, మహేశున్ = పరమేశ్వరుని, ఆరాధింపంగాన్ = పూజించుటకు, ఇరవు = స్థానము, అరయుచున్ = వెదకుచు, చని = వెడలి, గంగా - నది = గంగానది యొక్క, తీరమునన్ = ఒడ్డున, గౌరీవనమున్, కాంచెన్ = చూచెను.

తాత్పర్యము: ఆ పార్వతి మనస్సున మిక్కిలి సంతోషముతో మహేశ్వరు నారాధించుటకు స్థానము నన్వేషించుచుఁ జని గంగానదీతీరమున గౌరీవనమును జూచెను.

విశేషములు: 'గౌరి తపస్సు చేసినదగుటచేతనే యది తరువాత గౌరీశిఖరమని పేరు పొందెను.' అని సంస్కృత కుమారసంభవము. 'ప్రజాసు పశ్చాత్ ప్రథితం తదాఖ్యయా, జగామ గౌరీ శిఖరం శిఖండిమత్.' సం.కు.సం. 5-7.

వ. కని దాని పత్ర పుష్ప ఫల సమృద్ధికి మెచ్చుచు. 89

అర్థము: కని = చూచి, దాని = ఆ గౌరీవనముయొక్క, పత్ర - పుష్ప - ఫల - సమృద్ధికిన్ = ఆకుల, పూల, పండ్ల పెంపునకు, మెచ్చుచున్.

తాత్పర్యము : చూచి ఆ గౌరీశిఖరము పత్ర పుష్ప ఫలముల పెంపునకు మెచ్చుచు - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. స్థల పద్మ మృదు రత్న దళపాదతల కాంతిఁ
గమనీయ మత్తేభ గమన లీల,
సన్నుత రంభోరు సంపద నిర్ఝర
పులిన నితంబ విస్ఫురణ పేర్మి,
మానిత మృగరాజమధ్య దేశ స్థితి
వర పయోధరభార వహనశక్తిఁ
జకిత కురంగ శాబక లోచన ద్యుతిఁ
జమరీ సుకేశ పాశ ప్రభాతిఁ

ఆ. బేరి యందె కాదు చారుతరావయ
వంబులందుఁ దమ్ముఁ వరుసఁబోలి
యునికిఁ దద్ద మరిగి యున్నట్లు యుండె నా
గౌరి వనమునందు గౌరి దేవి. 89

అర్థము : స్థల - పద్మ - మృదు - రత్న - దళ = మెట్టతామరలు, మృదువులైన రత్నఖండములనెడి, పాద - తల - కాంతిన్ = అఱకాళ్ళ కాంతిచేతను, స్థలపద్మములు, రత్నఖండములు గల ప్రదేశముల కాంతిచేతను, కమనీయ - మత్త + ఇభ - గమన - లీలన్ = మనోహరమైన మదగజగమనముయొక్క విలాసము చేతను,

సన్నుత - రంభా + ఊరు - సంపదన్ = పొగడఁబడిన అరఁటులనెడి తొడల వైభవముచేతను, రంభా + ఉరు - సంపదన్ = అరఁటుల గొప్పసంపదచేతను, నిర్ఝర - పులిన - నితంబ - విస్ఫురణ - పేర్మిన్ = సెలయేటి యిసుక తిన్నెలనెడి పిఱుఁదులయొక్క ప్రకాశాతిశయముచేతను, సెలయేటి యిసుకతిన్నెలుగల కొండనడిమి ప్రదేశముల ప్రకాశముచేతను,

పీనిత - మృగ - రాజ - మధ్య - దేశ స్థితిన్ = పొగడఁబడిన సింహము నడుము అనెడు నడుముయొక్క, ఉనికిచేతను, సింహములతోడి నడిమిప్రదేశముచేతను వర-పయోధర - భార - వహన - శక్తిన్ = శ్రేష్ఠములైన స్తనముల బరువును మోయు శక్తిచేతను, మేఘముల బరువును మోయు శక్తిచేతను,

చకిత - కురంగ - శాబక - లోచన - ద్యుతిన్ = భయపడిన, లేడిపిల్ల కన్నులవంటి కన్నులకాంతిచేతను, భయపడిన లేడిపిల్లల కన్నులకాంతిచేతను, చమరీ - సుకేశ - పాశ - ప్రభాతిన్ = ఆఁడుసవరపుమెకములనెడి మేలైన శిరోజములసమూహము కాంతిచేతను, ఆఁడుసవరపుమెకముల కేశపాశకాంతిచేతను,

పేరియందున్ + ఎ = నామమునమాత్రమే, కాదు, చారు - తర + అవయవంబుల + అందున్ = మనోహరతరములైన అంగములందుఁగూడ, తన్నున్, వరుసన్ = క్రమముగా, పోలి + ఉనికిన్ = పోలియుండుటచేత, గౌరిదేవి, ఆ - గౌరీ వనమునందున్ = ఆ గౌరీవనమునందు, తద్ద = మిక్కిలి, మరిగి + ఉన్న + అట్లు + అ = పరిచితమయినట్లే, ఉండెన్,

తాత్పర్యము : మెట్టతామరలు, మృదురత్నఖండములు అనెడి పాదతలముల కాంతిచేతను, మెట్టతామరలు మృదురత్నఖండములు గల ప్రదేశములచేతను. మనోహరమైన మదగజ గమనముల విలాసముచేతను, సన్నుతమైన అనఁటికంబములనెడి ఊరువుల సంపదచేతను, అనఁటికంబముల గొప్ప సంపదచేతను, సెలయేటి యిసుకతిన్నెలనెడి పిఱుఁదుల ప్రకాశాతిశయముచేతను. సెలయేటి యిసుకతిన్నెలుగల కొండనడిమి ప్రదేశములచేతను, సింహము నడు మనెడి నడుముచేతను, సింహములతోడి నడిమి ప్రదేశముచేతను, మేలైన స్తనముల భారమును వహించు శక్తిచేతను, మేలయిన మేఘముల భారము వహించు శక్తిచేతను, భయపడిన లేడిపిల్ల కన్నులనెడి కన్నుల కాంతిచేతను, లేడిపిల్లల కన్నుల కాంతిచేతను, ఆఁడు సవరపు మెకములనెడి కేశ సమూహము కాంతిచేతను. చమరమృగముల కేశపాశముల చేతను, నామము నందేకాక మనోహరతరములైన అవయవములందును దన్నుఁ బోలియుండుటచే గౌరీదేవి ఆ గౌరీవనమందు మిక్కిలి పరిచితమయినట్లే యుండెను.

విశేషములు ; పార్వతికి స్థలపద్మములు, రత్నదళములు అనెడి పాదతలములు గలవు, ఆ తపోవనమునకును స్థలపద్మ రత్నదళములతోడి పాదతలములు గలవు

ఆమెకు మత్తేభ గమనమునుబోలిన గమనము గలదు, దానికి మత్తేభముల గమనములు గలవు. అనఁటికంబములవంటి ఊరుసంపద యామెకుఁ గలదు. దానికి అనఁటికంబముల ఉరుసంపద గలదు. ఆమెకు నిర్ఝరపులినములవంటి పిఱుఁదులు గలవు. దానికి నిర్ఝర పులినములతోడి కొండనడిమి ప్రదేశములు గలవు. ఆమెకు పయోధర = స్తనభారము గలదు. దానికి పయోధర = మేఘభారము గలదు. ఆమెకు లేడిపిల్లల కన్నులవంటి కన్నులు గలవు. దానికి లేడిపిల్లల కన్నుల శోభ గలదు. ఆమెకు చమరీమృగముల కేశపాశమువంటి కేశపాశముగలదు. దానికి చమరీమృగముల కేశపాశము గలదు. ఇట్లు గౌరి పేరియందేకాక, అవయవములందును అ గౌరీవనముతో సామ్యముగలిగి యుండె ననుట. అలంకారము శ్లేషానుప్రాణితమైన ఉపమాలంకారము.

వ. అట్లు గౌరినగంబునందుఁ బరమేశ్వరుం గోరి ఘోరతపము సేయం దొడంగి విహితస్నానార్చనా హోమాది నిత్యకర్మంబుల, శాకాహార ఫలాహార పర్ణాహార జలాహార మారుతాహార నిరాహారాది మహా తపోవ్రతంబుల, నందవాసాత్రికవా సైక పాదాంగుష్ఠోర్ధ్వబాహూర్ధ్వ ముఖాధోముఖాగ్నిముఖ పంచాగ్ని మధ్యాద్యనేకోగ్ర తపంబులం, ప్రాణాయామ ప్రత్యాహార ధ్యాన ధారణ జప సమాధులను, షడంగ యోగంబుల, మనోవాక్కాయకర్మంబుల, నతినిష్ఠానుష్ఠానంబులం బరమేశ్వరారాధన తాత్పర్యయై నిరంతరానంత తపోవృత్తిం బ్రవ ర్తించుచుండె నంత. 90

అర్థము : అట్లు, గౌరి - నగంబునందున్ = గౌరీపర్వతమునందు. పరమేశ్వరున్, కోరి, ఘోర-తపంబు=భయంకరమైన తపస్సు, చేయన్ + తొడంగి= చేయఁబూని, విహిత .... కర్మంబులన్ : విహిత = విధింపఁబడిన. స్నాన= స్నానము, అర్చనా = పూజ, హోమ = హోమము, ఆది = మున్నగు, నిత్య - కర్మంబులన్ = నిత్యకృత్యములచేతను, శాకాహార .... వ్రతంబులన్ : శాక + ఆహార = కాయగూరలను దినుట, ఫల + ఆహార = పండ్లను దినుట, పర్ణ + ఆహార = ఆకులను దినుట, జల + ఆహార + నీరుద్రావుట, మారుత + ఆహార= గాలిని భుజించుట - పీల్చుట, నిరాహార = ఏమియుఁ దినకుండుట, ఆది = మున్నగు, మహత్ (మహా)+తపస్ (ః)+వ్రతంబులన్ + గొప్ప తపో నియమములచేతను,

ఏక - పాద + అంగుష్ఠ + ఒకకాలిబొటనవ్రేలిపై నిలఁబడుట. ఊర్ధ్వ - బాహు = చేతులు పయికెత్తుట. ఊర్ధ్వ - ముఖ = ముఖము పయికెత్తుట. అధో - ముఖ = ముఖము క్రిందు చేయుట. అగ్నిముఖ = అగ్నినైపు ముఖము గలిగియుండుట. పంచ + అగ్ని + మధ్య = అయిదగ్నుల నడుమ నుండుట (నాలుగుదిక్కులను నాలు గగ్నులను, పైని సూర్యుఁడును గలిగియుండుట). ఆది = మొదలగు. అనేక = పెక్కు. ఉగ్ర - తపంబులన్ = భయంకరములైన తపస్సుల చేతను. ప్రాణాయామ = ప్రాణవాయువును మంత్రపూర్వకముగా నిరోధించుట. ప్రత్యాహార = చిత్తమును. ఇంద్రియములను విషయములనుండి మరలించుట. ధ్యాన = చిత్తచాంచల్యము లేక ఏకాగ్రముగాఁ దలంచుట. ధారణ = గాలిని బీల్చి లోపల నిలఁబెట్టుట (కుంభకప్రాణాయామము). జప = మంత్రాదుల నావృత్తిచేయుట. సమాధులను = ధ్యేయమునందు ఏకాగ్రముగా మనస్సు నిలుపుట అనువానిచేతను. షడంగ యోగంబులన్ + మంత్రోచ్చారణ పూర్వకముగా ఆయా అంగములను స్పృశించుట. చిత్తవృత్తినిరోధము అనువానిచేతను. మనస్ (ః) + వాచ్ (క్) + కాయ-కర్మములన్ = మనస్సు. వాక్కు, శరీరము. క్రియ అను నాలుగింటిచేతను. అతి - నిష్ఠా + అనుష్ఠానంబులన్ = మిక్కిలి నియమములతో నాచరించుటచేతను. పరమేశ్వర + ఆరాధన - తాత్పర్య + ఐ = పరమేశ్వరపూజయందు ఆసక్తిగలదయి. నిరంతర + అనంత - తపస్ (ః) + వృత్తిన్ = ఎడతెగని. అంతులేని తపస్సు నాచరించుటయందు. ప్రవర్తించుచున్ + ఉండెన్ = వర్తిలుచుండెను.

తాత్పర్యము: అట్లు గౌరీపర్వతమున పరమేశ్వరుని గోరి ఘోరమైన తపస్సు చేయఁబూని శాస్త్రవిహితమైన స్నానము, పూజ, హోమము మున్నగు నిత్యకర్మములచేతను, శాకాహారము, ఫలాహారము, పర్ణాహారము, జలాహారము, మారుతాహారము, నిరాహారము, మున్నగు మహాతపోవ్రతములచేతను, నందవాసము, అభ్రకవాసము, ఏకపాదాంగుష్ఠము, ఊర్ధ్వబాహువు, ఊర్ధ్వముఖము, అధోముఖము, అగ్నిముఖము, పంచాగ్ని మధ్యము మున్నగు పెక్కు భయంకర తపోవిధానములచేతను, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధ్యానము, ధారణము, జపము, సమాధి అనువానిచేతను, షడంగములు, యోగము అనువానిచేతను మనస్సు. వాక్కు, శరీరము, కర్మము అనువానిచేతను, అతినిష్ఠతోను, అనుష్ఠానముచేతను, పరమేశ్వరు నారాధించుటయం దాసక్తిగలదయి. నిరంతరము, అనంతమునైన తపశ్చరణమునందుఁ బ్రవర్తించుచుండెను. అంత - తరువాతి పద్యముతో నన్వయము.

చ. అలకల పొల్పు తేఁటిగములందు, మదాలసయానలీల హం
సల కడ, వక్త్రభాతి జలజంబులపైఁ, దనుకోమలంబుఁ దీఁ
గల దెస, దృగ్విలాసము మృగంబులచే నగజాత యిల్లడల్
కలయఁగఁ బెట్టె నాఁ దను వికాసము లేదెఁ దపఃప్రసంగతిన్. 91

అర్థము: నగ - జాత = కొండకూతుఁరు - పార్వతి, అలకల-పొల్పు = ముంగురుల అందము, తేఁటి - గములందున్ = తుమ్మెదల గుంపులందును, మద + అలస - యాన - లీలన్ = మదముచేత మందమైన గమనముయొక్క విలాసమును, హంసల - కడన్ = అంచల దగ్గఱను, వక్త్ర - భాతిన్ = ముఖకాంతిని, జలజంబుల పైన్ = తామరలయందును, తను - కోమలంబున్ = శరీరమార్దవమును, తీఁగల - దెసన్ = తీఁగలయెడను, దృశ్(క్) + విలాసము = కన్నుల అందము, మృగంబులచేన్ = లేళ్ళచేతను, ఇల్లడల్ = న్యాసములు - అడిగినప్పుడు తిరుగనిచ్చు పద్ధతిని ఒకరియొద్ద ధనాదికమును దాఁచుట, కలయఁగన్ + పెట్టెన్ + నాన్ = పొంచుపఱిచెనా యనునట్లు, తపస్(ః) + ప్రసంగతిన్ = తపఃకారణమున, తను - వికాసములు = మేని యందములు, ఏదెన్ = లేనిదయ్యెను.

తాత్పర్యము ; పార్వతి ముంగురుల యందమును దుమ్మెదల గుంపులందును, మదముచే మందమైన గమనము నొప్పును అంచల కడను, ముఖకాంతిని బద్మములందును, శరీరమార్దవమును లతల యెడను, కన్నులయందమును లేళ్ళయందును ఇల్లడపెట్టెనా యనునట్లు తపఃకారణమున మేని యొప్పులు లేనిదయ్యెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష. తిరిగి తీసికొనుపద్ధతి నొకరియొద్దఁ దనవస్తువును దాఁచుకొనుట యిల్లడ. తపస్సమయమున నాయా యంగముల యొప్పులు తన కనావశ్యకములు గావున నామె ఒక్కొక్కదానిని ఒక్కొక్క తగినదానికడ 'ఇల్లడ' పెట్టెను. తపస్సు ముగిసినవెంటనే మరలఁ దీసికొనును గావున నది యిల్లడ యైనది. తపస్సమయమున బార్వతి కాయాయియందములు లేవనియు, తపోఽనంతరము ఆమె యథాపూర్వ సౌందర్యవతి యగుననియు భావము. ఈ భావము కాళిదాసునను గలదు.

'పునర్గ్రహీతుం నియమస్థయా తయా
ద్వయేఽపి నిక్షేప ఇవార్పితం ద్వయమ్।
లతాసు తన్వీషు విలాస చేష్టితం
విలోలదృష్టం హరిణాఙ్గనాసు చ,' సం.కు.సం. 5-13

సంస్కృతమున రెండవయవయవములనుగూర్చియుత్ప్రేక్ష చెప్పఁగాఁ, దెలుఁగున నైదింటిని జెప్పి పద్యమును మనోహరతరము చేసెను.

గీ. ఉగ్రతపమునఁ దోడ్తోన విగ్రహంబు
చాల శోషించెఁ బ్రాలేయశైల తనయ
యర్ధనారిగాఁ దన దేహ మభవు మేన
నల్ప మల్పము నంటించునట్ల పోలె. 92

అర్థము : ప్రాలేయ - శైల - తనయ = మంచుకొండ కూఁతురు - పార్వతి, అర్ధ - నారి - కాన్ = సగము స్త్రీగా. తన - దేహము = తన శరీరము, అభవు - మేనన్ = శివుని శరీరమునందు, అల్పము + అల్పము + కొంచెము కొంచెముగా, అంటించు + అట్లు + అ + పోలెన్ = తగిలించు విధమును బోలు నట్లుగా, ఉగ్ర - తపమునన్ = భయంకరమైన తపస్సుచేత, తోడ్తోన్ + అ = క్రమక్రమముగా, విగ్రహంబు = శరీరము, చాలన్ = మిక్కిలి, శోషించెన్ = శోషిల్లు నట్లు - ఎండునట్లు - చేసెను.

తాత్పర్యము : హిమవత్పర్వతపుత్త్రిక సగముస్త్రీగాఁ దన శరీరమును శివుని శరీరమున నించించుకగాఁ దగిలించుచున్నదా యనునట్లు భయంకరమైన తపస్సుచేఁ గ్రమక్రమముగా శోషిల్లునట్లు చేసెను.

విశేషములు : హేతువు కానిదానిని హేతువుఁగా జెప్పుటచే అలంకారము హేతూత్ప్రేక్ష. శోషించె.... 'సంస్కృతంబున కంగలాదుల కించుక్కగు.' బాల. క్రియ.63. శుష్ + ఇంచు. 'సంస్కృతంబునకు లఘూపధంబున కించుక్కు పరంబగు నపుడు గుణంబగు.' బాల, క్రియ.66. శోష్ + ఇంచు. 'సర్వంబునకుం బ్రేరణంబునం దించుక్కగు.' బాల. క్రియ. 70. శోష్ + ఇంచు + ఇంచు. 'ఇంచుక్కు పరంబగు నపుడు రంజాదుల యించుక్కునకు లోపం బగు.' బాల. క్రియ. 72. శోష్ + ఇంచు. శోషించు. 'భూతంబున లిట్టగు.' బాల. క్రియ, 3. శోషించు + లిట్టు. 'లకారంబు నకు డు ఞు వు రు ను ముఞ్ఞగు.' బాల. క్రియ. 8. శోషించు + డుఞ్. 'లిడ్లాట్టుల డుఞ్ఞన కెను ను వర్ణంబు లగు.' బాల, క్రియ 16. శోషించు + ఎను. 'అంద్వవగాగ మంబులం దప్ప నపదాది స్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు.' బాల. సంధి. 11. శోషించె.

వ. అంత. 93

అర్థతాత్పర్యములు: అంతన్ = తరువాత - తరువాతి పద్యముతో నన్వయము.

వర్షాకాల వర్ణనము

మ. గత సంతాపము, శీతలీకృతమహీకాంతాంగ, మత్యుద్గత
స్మిత కుందోత్కర కేతకీకుటజరాజి భ్రాజితామోద, మూ
ర్జిత వల్లీప్రకరంబు, వర్ధిత శిఖిశ్రేణీ ప్రమోదంబు ర
మ్యతరంబై కుతలం బనం బరఁగె వర్షారంభ మత్యున్నతిన్. 94

అర్థము: గత - సంతాపము = పోయిన అధికతాపముగలది, శీతలీకృత - మహీ - కాంతా + అంగము = చల్లపఱుపఁబడిన భూమియను స్త్రీయొక్క శరీరము గలది, అత్యుద్గత.... మోదము: అతి + ఉద్గత = మిక్కిలి బయల్వెడలిన, కుంద + ఉత్కర = మొల్లల సమూహము, కేతకీ - కుటజ - రాజి = మొగలి పూలయొక్కయు, కొండమల్లెల యొక్కయు సమూహముయొక్క, భ్రాజిత = ప్రకాశించిన ఆమోదము = పరిమళముగలది, ఊర్జిత - వల్లీ - ప్రకరంబు = అధికమైన తీఁగల సమూహముగలది, వర్ధిత - శిఖి - శ్రేణీ - ప్రమోదంబు = వృద్ధి పొందింపఁబడిన, నెమళ్ళ పరుసయొక్క, సంతోషముగలది, అగు, వర్షా + ఆరంభము = వర్షాకాలము యొక్క ఆరంభము, అతి + ఉన్నతిన్ = మిక్కిలి గొప్పతనముతో, రమ్య తరంబు + ఐ = మిక్కిలి రమణీయమయి, కుతలంబు = భూతలము, అనన్ + పరఁగెన్ = అన నొప్పెను.

తాత్పర్యము: అధికమైన తాపము పోయినదియు, చల్లపఱుపఁబడిన భూమియను స్త్రీ శరీరముగలదియు, మొల్లల, మొగలిపూల, కొండమల్లెల పరిమళము బయలువెడలినదియు, తీఁగల సమూహ మధికమయినదియు, నెమళ్ళగుంపుల సంతోషము వృద్ధిపొందించినదియు అగు వర్షాకాలారంభము రమ్యతరమై భూతలమన మిక్కిలి గొప్పతనముతో నొప్పెను.

విశేషములు: మహీ - కాంతా = భూమియనుస్త్రీ - రూపకము, రమ్యతరమై కుతల మనఁబరఁగుట సహేతుకముగా సమర్థింపఁబడినది కావున కావ్యలింగము. స్వభావోక్తి.

ఆ. దిశలఁ బొలయ మెఱుఁగుదృష్టులు, ఘుర్ఘుర
గర్జనంబు లులియ, గజప గతులు,
ఘన పయోధరములు దనరంగ జవ్వని
వోలె వచ్చె వానకాల మర్థి. 95

అర్థము: మెఱుఁగు - దృష్టులు = మెఱుపులనెడు చూపులు, దిశలన్ = దిక్కులందు, పొలయన్ = వ్యాపింపఁగను, ఘుర్ఘుర - గర్జనంబులు = ఘుర్ఘుర ధ్వనులనెడి ఉఱుములు, ఉలియన్ = ధ్వనింపఁగను, గజప - గతులున్ = గజ రాజుల గమనములును, ఘన - పయోధరములున్ = గొప్ప మేఘములనెడి గొప్ప స్తనములును, తనరంగన్ = ఒప్పఁగను, వానకాలము, అర్థిన్ = కోరికతో, జవ్వని + పోలెన్ = జవరాలివలె, వచ్చెన్.

తాత్పర్యము: మెఱుపులనెడి చూపులు దిక్కుల వ్యాపింపఁగను, ఘుర్ఘుర ధ్వనులనెడి యుఱుములు ధ్వనింపఁగను, గజరాజగమనములును, ఘనస్తనములును ఒప్పఁగా వానకాలము జవరాలివలె వచ్చెను.

విశేషములు: మెఱుఁగు దృష్టులు - రూపకము. ఘుర్ఘుర గర్జనంబులు = ఘుర్ఘురములనెడి గర్జనములు - రూపకము. ఘన - పయోధరములు = మేఘములనెడి గొప్ప పయోధరములు - శ్లేష, రూపకము. జవ్వని వోలెన్ - ఉపమ. రూపకానుప్రాణితమైన ఉపమ.

మ. పరమస్నేహము హృత్సరోరుహమునం బాత్రంబు గావించి, సు
స్థిరతం బుణ్యదశం దపోగ్ని మది నుద్దీపించి, బ్రహ్మాండ క
ర్పరఖండంబున మంత్రకజ్జల మొగిన్ ఫాలాక్షుఁ గూర్పింప న
గ్గిరిరాజాత్మక పట్టె నా నమరి నింగిం బర్వె నీలాభ్రముల్. 96

అర్థము : ఆ + గిరి - రాజ + ఆత్మక = ఆ కొండలఱేని కూఁతురు, ఫాల + అక్షన్ = నుదుటఁ గన్నుగలవానిని . శివుని, కూర్పింపన్ = కూడునట్లు చేయుటకు, పరమ - స్నేహమున్ = గొప్పప్రీతియనెడి చమురును, హృద్ + సరోరుహమునన్ = హృదయమనెడి పద్మమునందు, పాత్రంబు + కావించి = యుక్తముచేసి, సుస్థిరతన్ = మంచినిలుకడతో, పుణ్య - దశన్ = పుణ్యమనెడి వత్తిని, తపస్(ః) + అగ్నిన్ = తపస్సనెడి అగ్నిచేత, మదిన్ = మనస్సునందు, ఉద్దీపించి = ప్రకాశింపఁజేసి, బ్రహ్మాండ - కర్పర - ఖండంబునన్ = బ్రహ్మాండమనెడి కుండపెంకునందు, మంత్ర - కజ్జలము = సమంత్రకమైన కాటుక, ఒగిన్ = క్రమముగా. పట్టెన్ + నాన్ = పట్టెనా యనునట్లు, అమరి = ఒప్పి, నీల = అభ్రముల్ = నల్లని మేఘములు, నింగిన్ = ఆకాశమునందు, పర్వెన్ = వ్యాపించెను.

తాత్పర్యము : ఆ కొండలఱేని కూఁతురు - పార్వతి శివుని గూడునట్లు చేయుటకు అధికమైన నెయ్యమనెడి చమురును హృదయమనెడి పద్మమునందు యుక్తముచేసి, సుస్థిరతతోఁ బున్నెమనెడి వత్తిని తపస్సనెడి అగ్నితో వెలిఁగించి, బ్రహ్మాండమనెడి కుండపెంకునందు సమంత్రకమైన కాటుకను బట్టెనా యనునట్లు ఒప్పి నల్లనిమేఘములు ఆకాశమున వ్యాపించెను.

విశేషములు : రూపకానుప్రాణితమైన ఉత్ప్రేక్షాలంకారము. తపోఽగ్ని = తపస్ + అగ్ని - పదాంత సకారమునకు విసర్గాదేశము. తపః + అగ్ని, హ్రస్వమైన అకారము తరువాతవచ్చు విసర్గమునకు హ్రస్వ అకారముగాని, మృదుహల్లులు (హశ్శులు) గాని పరములగునపుడు 'ఉ' ఆదేశముగావచ్చి పూర్వమందున్న అకారముతోఁగూడి గుణసంధి ననుసరించి ఓ గా మాఱును. తప + ఉ + అగ్ని = తపో అగ్ని. పదాంత గతములైన ఏ ఓలకు హ్రస్వమైన అకారము పరమగునపు డా అకారము ఏ ఓలలో లీనమైపోవును. అదృశ్యమైన హ్రస్వ అకారమునకు సూచనగా అవగ్రహము (ఽ)నుంతురు. తపోఽగ్ని.

గీ. ధర నిదాఘవాతాహతి నెరియకుండ
విధి తమాలమంటపము గావించె ననఁగ
నొప్పె నీలాభ్రపటల మ చ్చప్పరమున
రాళ్ళు లన నెల్లదెస వానకాళ్ళు లమరె. 97

అర్థము: ధర = భూమి, నిదాఘ - వాత + ఆహతిన్ = వడగాలి దెబ్బచే, ఎరియక + ఉండన్ = కాలిపోవకుండ, నిధి = బ్రహ్మ, తమాల - మంట పము = చీఁకటిమ్రాని మండపము, కావించెన్ + అనఁగన్ = చేసెనా యనునట్లు, ఆ + చప్పరమునన్ = ఆ యాకాశమున(?), (మండపమున), నీల + అభ్ర - పటలము = నల్లనిమేఘముల సమూహము, ఒప్పెన్, రాళులు = ఱాలు, అనన్ + అనఁగా, ఎల్ల - దెసన్ = అన్ని దిక్కులందును, వానకాఱులు = వర్షధారలు, అమరెన్ = ఒప్పెను.

తాత్పర్యము: భూమి వడగాలి దెబ్బకుఁ గాలిపోకుండునట్లు బ్రహ్మ చీఁకటిమ్రాని మండపము నిర్మించెనా యనునట్లు ఆ యాకాశమున నల్లని మేఘముల సమూహము ఒప్పెను. దాని ఱా లనునట్లు అన్ని వైపులను వర్షధార లొప్పెను.

విశేషములు: అలంకారము ఉపమ, ఉత్ప్రేక్ష. చప్పరమనఁగా మండ పమని యర్థమయినను, ఇట సందర్భానుసారముగా ఆకాశమని యర్థము చెప్పఁబడినది. అభ్రపటలము నీలము గావున, తమాల మంటపమని చెప్పఁబడినది.

క. పుడమిఁ దన యాజ్ఞ సేకొని
నడపిన దంపతులమీఁద నలి మరుఁ డింపే
ర్పడఁ బుష్పవృష్టిఁ గురిసిన
వడువునఁ దొలువాన గురిసె వడగండులతోన్. 98

అర్థము: పుడమిన్ = భూమియందు, తన - ఆజ్ఞ, చేకొని = కైకొని, నడపిన = ఆచరించిన, దంపతుల - మీఁదన్ = దంపతులపై, నలిన్ = ఒప్పుగా, మరుఁడు = మన్మథుఁడు, ఇంపు = ఆనందము, ఏర్పడన్ = కలుగునట్లు, పుష్ప - వృష్టిన్ పూలవానను, కురిసిన - వడువునన్ = కురిపిన విధమున, తొలువాన = తొల కరివాన, వడగండులతోన్ = వడగండ్లతో, కురిసెన్.

తాత్పర్యము: భూమిలోఁ దన యానతిని గైకొని ఆచరించిన దంపతులపై నొప్పుగా మన్మథుఁడు సంతోషముతోఁ బూలవాన గురిసినట్లు తొలకరివాన వడగండ్లతోఁ గురిసెను.

విశేషములు: అలంకారము ఉత్ప్రేక్ష. వడగండులు - వడగల్లు + లు - 'ఔపవిభక్తికంబుల లివర్ణ సలలువర్ణంబులకు బహువచనంబు పరంబగునపుడు పూర్ణ బిందుపూర్వక డువర్ణంబు బహుళంబుగా నగు.' బాల. అచ్చిక. 16

చ. ఉదుటఁ దెమల్చి మ్రింగు సరసోదకబిందులమౌక్తికంబుఁ లం
గదఁ గబళించిపీల్చు; వడగండులకుం దను వోసరించుఁ; దో
యదము లదల్చి తూరు; నచిరాంశు లతాగ్రములెక్కి మెల్పునం
జదలకు నుప్పరం బెగయుఁ జాతకపోతకముల్ సెలర్చుచున్. 99

అర్థము: చాతక - పోతకముల్ = పిల్లవానకోయిలలు. ఉదుటన్ - ఉద్ధతితో, తెమల్చి = కదల్చి. సరస + ఉదక - బిందుల - మౌక్తికంబులు = సరసములైన జలబిందువుల ముత్యములు, మ్రింగున్, అంగదన్ = ఆఁకటితో, కబళించి = మ్రింగి, పీల్చున్, వడగండులకున్ = వడగండ్లకు, తనువు = శరీరము, ఓసరించున్ = తొలగఁజేయును, తోయదములు = మేఘములు, అదల్చి = గద్దించి, తూరున్ = ప్రవేశించును, అచిరాంశు - లతా + అగ్రములు = మెఱవుదీఁగలకొనలు, ఎక్కి. మెల్పునన్ = నేర్పుతో, చెలర్చుచున్ = విజృంభించుచు, చదలకున్ = ఆకాశమునకు. ఉప్పరంబు + ఎగయున్ = పైకెగురును.

తాత్పర్యము: పిల్లవానకోయిలలు సరస జలబిందువుల ముత్యములను దెమలించి మ్రింగును, ఆఁకటితోఁ గబళించును. పీల్చును. వడగండ్లకు మేను తొలఁగఁ జేయును. మేఘములను ద్రోసికొని ప్రవేశించును. మెఱపుఁదీఁగల కొనలనెక్కి విజృంభించి నేర్పుతో నాకాశముమీఁది కెగురును,

విశేషములు: అలంకారము స్వభావోక్తి. చెలర్చుచున్ + చెలరు ధాతువు నిఘంటువులఁ గానరాలేదు. సందర్భమునననుసరించి యర్థము చెప్పఁబడినది.

క. చలిగాడ్పుల ముసరులమెయి
వలిగొని ధాత్రీపురంధ్రి వలిఁ బచ్చని కం
బలిఁ గలిచికొన్న విధమునఁ
బొలుపుగఁ జిప్పరువు గవిసె భూతల మెల్లన్. 100

అ ర్థ ము : ధాత్రీ - పురంధ్రి = భూమియనుస్త్రీ, చలిగాడ్పుల - మునరుల - మెయిన్ = చలిగాలులు వీచుటతో, వలి - కొని = చలివైచి, గడగడలాడి, వలిన్ = చలితో, పచ్చని - కంబలిన్ = పచ్చని కంబళమును, కలిచికొన్న విధమునన్ = కప్పికొనినరీతిని, పొలుపుగన్ = అందముగా, భూతలము + ఎల్లన్, చిప్పరువు = చిప్పరలు - సాధుపాఠము = చిప్పమొక్కలు - భూస్తృణము, కవిసెన్ = వ్యాపించెను.

తా త్ప ర్య ము ; భూమియనెడుస్త్రీ చలిగాలులు వీచుటచే గడగడలాడి చలికిఁ బచ్చని కంబళము గప్పికొనెనా యనునట్లు భూతలమంతయుఁ జిప్పమొక్కలు వ్యాపించెను.

వి శే ష ము లు : అలంకార ముత్ప్రేక్ష.

క. కారను వీరుఁడు మెఱుఁగను
దోరసిఁ బాంథులను రిపులఁ దునిమినఁ దద్దే
హారుణబిందులు దొరిఁగెనొ
ధారుణి నన నింద్రగోపతతి విలసిల్లెన్. 101

అ ర్థ ము : కారు + అను - వీరుఁడు = వర్షాకాలము అను వీరుఁడు, మెఱుఁగు + అను - దోన్ (ఽ) + అసిన్ = మెఱుపు అనెడి చేతి కత్తి చేత, పాంథులు = బాటసారులు - విరహులు, అను = అనెడి, రిపులన్ = శత్రువులను, తునిమినన్ = ఖండింపఁగా, తద్ + దేహ + అరుణ - బిందులు = వారి శరీరము నందలి రక్తపుఁజుక్కలు, ధారుణిన్ = భూమియందు, తొరిఁగెనొ = స్రవించెనో, అనన్ = అనునట్లు, ఇంద్రగోపతతి = ఆరుద్రపురుగుల సమూహము, విలసిల్లెన్ = ప్రకాశించెను.

తా త్ప ర్య ము : వర్షాకాలమనెడి వీరుఁడు మెఱుపు అనెడి చేతికత్తితో విరహులనెడి శత్రువులను ఖండింపఁగా, వారిదేహమునుండి రక్తపుఁజుక్కలు నేలపైఁ గాఱెనో యనునట్లు అరుద్రపురుగులగుంపు ఒప్పెను.

వి శే ష ము లు : రూపకానుప్రాణితమైన ఉత్ప్రేక్ష.

ఆ. సురపగోప చాప శోభితంబై యుండు
నవ పయోదవేళ దివి యు భువియు
దెసలు దీటుకొనఁగఁ దృణ ఘన నివహ సం
ఛన్నమయ్యెఁ మఱియు మన్ను మిన్ను. 102

అర్థము : నవ - పయోద - వేళన్ = తొలకరి సమయమున, దివియున్ = ఆకాశమును, భువియున్ = భూమియును, (క్రమముగా) సురపగోపచాప - శోభితంబు = ఇంద్రగోపముల (ఆరుద్ర పురుగుల) తోను, ఇంద్రధనుస్సుతోడను, ప్రకాశించునది, ఐ = అయి, ఉండున్, మఱియున్, మన్నున్ = నేలయును - మిన్నున్ = ఆకాశమును, దెసలు = దిక్కులు, దీటుఁకొనఁగన్ = నిండఁగా, (క్రమముగా), తృణ , ఘన - నివహ - సంఛన్నము, = గడ్డియొక్కయు, మేఘముల యొక్కయు, సమూహముచేత, బాగుగాఁ గప్పఁబడినది, అయ్యెన్.

తాత్పర్యము : క్రొక్కారు సమయమున ఆకాశమును, భూమియును, క్రమముగా ఇంద్రగోపములతోను, ఇంద్రధనుస్సుతోను ప్రకాశించెను. మఱియును, నేలయు. ఆకాశమును దిక్కులు నిండునట్లు గడ్డితోను, మేఘసమూహముతోను గప్పఁబడినదయ్యెను.

విశేషములు : అలంకారము యథాసంఖ్యము, స్వభావోక్తి.

శా. ఆ క్రొక్కారను రాజుమ్రోల నిజరావానంతగేయాభ్రనా
దైకాతోద్యముఁ గూర్చి మ్రోయ సురగోపాంభోజ రాగత్విషా
నీకోద్యద్ధరిదశ్మకస్థల లసన్నృత్యోరు రంగస్థలిన్
గేకిపాత్రము లాడె భావముగ నుత్క్షిప్తాగ్ర పింఛంబులై. 103

అర్థము : ఆ - క్రొక్కారు (క్రొత్త + కారు) + అను - రాజు - మ్రోలన్ = ఆ తొలుకారు అనెడి రాజునెదుట, కేకీ - పాత్రములు=ఆఁడు నెమలు లనెడి నట్టువకత్తెలు, నిజ - రావ + అనంత - గేయ + అభ్రనాద - ఏక + ఆతోద్యమున్ = తమవైన ధ్వనులనెడి అంతులేని గీతములకు ఉఱుము లనెడి ముఖ్యమైన వాదిత్రమును (తతము, ఆనద్ధము, సుషిరము, ఘనము అనెడి వాద్యచతుష్టయమును),

కూర్చి = సమకూరునట్లుచేసి, మ్రోయన్ = మ్రోయఁగా, సుర....స్థలిన్ సుర గోప = ఇంద్రగోపములు (ఆరుద్రపురుగులు) అనెడి, అంభోజ - రాగ = పద్మ రాగములయొక్క ఎఱుపుయొక్క, త్విషా = కాంతులయొక్క, అనీక = సమూహమువలన. ఉద్యత్ = పూనుచున్న, హరిత్ + అశ్మక - స్థల = గరుడపచ్చ ఱాతినేల యనెడు. లసత్ = ప్రకాశించుచున్న, నృత్య = నాట్యమునకైన, ఉరు = పెద్ద, రంగ - స్థలిన్ = రంగస్థలమునందు, ఉత్ + క్షిప్త + అగ్ర - పింఛంబులు + ఐ = పైకి విప్పారిన కొనలుగల పింఛములు గలవయి, భావముగన్ = భావయుక్తముగ, ఆడెన్ = నాట్యముచేసెను.

తాత్పర్యము : ఆ తొలుకారు అనెడి రాజునెదుట ఆఁడు నెమలులనెడి నట్టువరాండ్రు తమపైన కేకారవములనెడి అంతులేని గీతములకు ఉఱుముల ధ్వనులనెడి వాదిత్రమును సమకూర్చి మ్రోయఁగా, ఇంద్రగోపములనెడి పద్మరాగ కాంతుల సమూహమువలని గరుడపచ్చఱాతి నేల యనెడు పెద్ద నాట్యరంగస్థలమునందు పైకి విప్పారిన పింఛాగ్రములు గలవై భావయుక్తముగ నాట్యముచేసిరి.

విశేషములు: అలంకారము రూపకము. క్రొక్కారే రాజు. అతని యెదుట అఁడునెమళ్ళనెడి నట్టువరాండ్రు పింఛియముల కొనలెత్తి భావయుక్తముగ నాట్యము చేయుచుండిరి. ఆ నాట్యమునకు రంగస్థల మేది యన - ఇంద్రగోపములనెడి పద్మ రాగమణుల కాంతులచేనైన గరుడపచ్చఱానేల.

క్రొక్కారు = క్రొత్త + కారు 'సమాసంబునం బ్రాఁతాదుల తొలియచ్చు మీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు.' బాల.సంధి. 36. క్రొ + కారు. 'క్రొత్తశబ్దమున కాద్యక్షరశేషంబునకుం గొన్నియెడల నుగాగమంబునుం గొన్ని యెడల మీఁది హల్లునకు ద్విత్వంబు నగు.' బాల.సంధి. 38. నాద + ఏక నాదైక. వృద్ధి సంధి. అ ఆలకు ఏ ఐలు పరములగునపుడు ఐకారమును, ఓ ఔలు పరము లగునపుడు ఔకారమును ఏకాదేశమగును. అంభోజ. అనుదానికి 'అంభోద' అను పాఠాంతరముగలదు. 'అంభోద' కంటె 'అంభోజ' మేలనిపించి అది స్వీకరింపఁబడినది. త్విషా - షకారాంత త్విట్ఛబ్దమేకాక 'త్విషా' అను ఆకారాంత స్త్రీలింగశబ్దముగూడఁ గలదని శబ్దరత్నాకరకారుఁడు. ఉద్యద్ధరిదశ్మక - ఉద్యత్ + హరిత్ = వర్గముల మొదటి నాల్గక్షరముల (ఝయ్యల) కంటె పరమగు

హకారమునకు పూర్వసవర్ణాదేశము (ఆ వర్గములకు చెందిన చతుర్థవర్ణాదేశము) వైకల్పికముగా నగును. ఉద్యత్ + ధరిత్, ఉద్యత్ + హరిత్. అనునాసికాంతస్థ వర్ణములు తప్ప మిగిలిన పదాంతగతహల్లులకు (ఝల్లులకు) మృదుహల్లులు (హశ్శులు) కాని, అచ్చులు కాని పరమగునపుడు ఆ హల్లుల వర్గమునకుఁ జెందిన తృతీయవర్ణ మాదేశముగా వచ్చును. ఉద్యద్ధరిత్, ఉద్యద్ధ్వరిత్. ఈ సూత్రముచేతనే హరిత్ + అశ్మక హరిదశ్మక అగును. లసన్నృత్య = లసత్ + నృత్య. ర హలు తప్ప మిగిలిన పదాంతగత హల్లులకు (య్రలకు) అనునాసికవర్ణము పరమగుచో వానికి సంబంధించిన అనునాసికవర్ణము వైకల్పికముగ అదేశమగును. లసన్నృత్య-పక్షమున లసద్నృత్య. నృత్యోరు - నృత్య + ఉరు-గుణసంధి. సంయుతాసంయుత ప్రాసము.

తే. రలలు తమక్రింద జడ్డలై క్రాలు వ్రాలు, ప్రాసవర్ణంబులై వానిఁ బాసియైన।
గూడి యైనను బెఱ యడుగులను నిలుచు, సంయుతాసంయుతప్రాససంజ్ఞఁ దనరి.
-అప్పకవీయము.

కేకీపాత్రము లాడె.... ఉత్క్షిప్తాగ్రపింఛంబులై - ఆఁడునెమలులకుఁ బింఛము లుండునా ?

గీ. డింద మై పూచి పర్విన కుందలతల
తోన కదములుఁ బూచెఁ దొల్వానకాల;
మెసఁగె విరహులు విరహాగ్ని నెరసి నీఱు
పొరపు గొనియున్న నిప్పులప్రోవు లనఁగ, 104

అర్థము : తొల్ + వాన - కాలము = తొలుకారువ, డిందము + ఐ = దట్టమయి (?), పూచి, పర్విన = వ్యాపించిన, కుంద - లతలతోన్ + అ = మొల్ల తీవలతోపాటే, కదములున్ - కడపలున్ = కడిమిచెట్లుగూడ, పూచెన్, (అవి), విరహులు = వియోగులు, విరహ + అగ్నిన్ = విరహమనెడి అగ్నిచేత, ఎరిపి = కాలి, నీఱు = నివుఱు, పొరపు + కొని + ఉన్న = కూడికొనియున్న, నిప్పుల - ప్రోవులు + అనఁగన్, ఎసఁగెన్ = అతిశయించెను.

తా త్ప ర్య ము : తొలకరియందు మొల్లలు విఱుగఁబూచినవి. వానితోపాటే కడిమిచెట్లును బూచినవి. అవి - వియోగులు వియోగాగ్నిచేఁ గాలఁగానైన నివుఱు గప్పిన నిప్పులప్రోవులో యన నొప్పెను.

వి శే ష ము లు : రూపకానుప్రాణితమైన ఉత్ప్రేక్ష. వర్షాకాలమునఁ గుంద ములును, కదంబములును పూచును. కుందపుష్పములు తెల్లనై నివుఱువలెను, కదంబ ములు ఎఱ్ఱనై నిప్పులవలెను ఉండును. కడపలు - ఈ శబ్దము నిఘంటువులఁ గాన రాలేదు. కడప శబ్దమునకుఁ గడిమిచెట్టనునర్థము గలదు. (సూ.ని.) "సీ. కడవపూఁ దేనియఁ గడుపారఁగొని ప్రోసి తిరుగు తేఁదేఁటుల తెరలికయును." హరి. పూ. 9-68. గీ. కడిమి కడప యటం చనఁబడుఁ గదంబ. ము.ఆం.భా. 2-46. అది కడప లయియుండునేమో !

తొలువాన-తొల్వాన - 'పదాంతంబు లయి యసంయుక్తంబు లయిన ను లు రుల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బాల.ప్రకీర్ణక. 16. తొల్వానకాలము- 'కాలాధ్వములకుం ద్రాయికంబుగాఁ ద్రథమ యగు.' బాల.కారక. 25.

క. సురనది ఝషములు డిగ్గఁగ
శరనిధి, కా శరధిలోని ఝషకము లెక్కన్
సురనది, కి ట్లెడపడకయ
కురిసె మహావృష్టి గుండ్లు గూల్చిన భంగిన్. 105

అ ర్థ ము : సురనది-ఝషములు = ఆకాశగంగానదిలోని చేఁపలు, శరనిధి కిన్ = సముద్రమునకు, డిగ్గఁగన్ = దిగఁగా, ఆ - శరధిలోని = ఆ సముద్రము నందలి, ఝషకములు = చేఁపలు, సుర - నదికిన్ = ఆకాశగంగానదికి, ఎక్కన్ = ఎక్కఁగను, ఇట్లు, ఎడపడక + అ = నిర్విరామముగనే, గుండ్లు + కూల్చిన - భంగిన్ = రాలు కూల్చినట్లుగా - అధికముగా, మహత్ (మహా) - వృష్టి = పెద్ద వాన, కురిసెన్.

తా త్ప ర్య ము : ఆకాశగంగానదిలోని చేఁపలు సముద్రమునకు దిగఁగా, సముద్రమునందలివి ఆకాశగంగలోని కెక్కఁగా - ఈ రీతిగా ఎడతెగకయే రాలు కూల్చినట్లుగాఁ బెనువాన కురిసెను.

విశేషములు: అలంకారము సంబంధాతిశయోక్తి. 'సంబన్ధాతిశయోక్తి స్స్యా దయోగే యోగ కల్పనమ్.' చన్ద్రా.

చ. దరములు ముంపుచుం, దరులతాతతి వేళులతోన కూలఁగా
నురువడిఁ ద్రోచుచున్, మడువు లోలిఁ గలంచుచు, నంబుజాలి సం
హరణము సేయుచున్, మదజలౌఘము గ్రమ్మ మదాంధగంధసిం
ధురమునుబోలెఁ బెల్లన నదుల్ చనుదెంచె భయంకరాకృతిన్, 106

అర్థము: నదుల్ = నదులు, దరములు = గోతులు, ముంపుచున్ = ముంచుచున్ = ముంచివైచుచు, తరు - లతా - తతిన్ = చెట్లయుఁ, దీఁగలయు సమూహమును, వేళులతోన్ + అ = వేరులతోనే, - సమూలముగా, కూలఁగాన్ = కూలిపోవునట్లు, ఉరువడిన్ = ఉరవడితో-మిక్కిలి వేగముతో, త్రోచుచున్ = పడఁగొట్టుచు, మడువులు = మడుఁగులు, ఓలిన్ = క్రమముగా, కలంచుచున్ = కలఁచివైచుచు, అంబుజ + ఆలిన్ = తామరల వరుసను, సంహరణము + చేయుచున్ = నాశనముచేయుచు, మద - జల + ఓఘము = ఉద్ధతితోడి జల మనెడి మదజలముయొక్క ప్రవాహము, గ్రమ్మన్ = ఆక్రమింపఁగా, మద + అంధ - సింధురమును + బోలెన్ = మదముచే గ్రుడ్డిదైన ఏనుఁగువలె, భయంకర + ఆకృతిన్ = వెఱపుగొలుపు ఆకారముతో, పెల్లనన్ = అధికముగా, చనుదెంచెన్ = వచ్చెను.

తాత్పర్యము: వర్షాకాలమున నదులు గోతులను ముంచివైచుచు, చెట్లయుఁ దీఁగలయు సమూహమును సమూలముగా మిక్కిలి వేగముతోఁ గూల్చివైచుచు, మడుఁగులను గలంచివైచుచు, తామరలను నాశనముచేయుచు, ఉద్ధతితోడి జలమనెడి మదజల ప్రవాహము వ్యాపింపఁగా మదముచేఁ గన్నులుగానని యేనుఁగువలె భయంకరాకారముతో నధికముగా వచ్చెను.

విశేషములు: అలంకారములు-స్వభావోక్తి, ఉపమ.

వేళులు - వేరు + లు. 'బహువచనము పరంబగునపు డసంయుక్తంబులై యుదంతములయిన డ-ల-ర-ల కలఘులకారంబు బహుళంబుగా నగు.' బాల.అచ్చి. 13. జలౌఘము - జల + ఓఘము - వృద్ధి సంధి. ముంపుచున్ - ముంచుచున్ అని

యుండనగు. ఆగమ చకారంబునకు నెఱసున్న మీఁదిదానికి దుక్కుపరంబగునపుడు పకారంబు విభాషనగు-బాల.క్రియ. 90. ఇచ్చట దుక్కుగాక, శర్ధ్రక చువర్ణకము పరమగుటచే పత్వమురాదు. ఇచ్చట 'ముంచుచున్' అని యున్నను ఛందోభంగము కాదు.

వ. అట్టి వర్షాసమయంబునం దంభోవాసినియై గౌరి ఘోరతపంబు చేయు నవసరంబున, 107

అ ర్థ ము : అట్టి వర్షాసమయంబునందున్, అంభస్(ః) + వాసిని + ఐ = జలమునందు నివసించునదియై, గౌరి = పార్వతి, ఘోర - తపంబు = భయంకర మైన తపస్సు, చేయు + అవసరంబునన్ = చేయునప్పుడు.

తా త్ప ర్య ము : అట్టి వర్షాకాలమునందు నీటనివసించుచుఁ బార్వతి భయంకరమైన తపస్సుచేయునప్పుడు - తరువాతి పద్యముతో నన్వయము.

వి శే ష ము లు : అంభస్ + వాసిని - పదాంత సకారమువకు విసర్గాదేశము. అంభః + వాసిని. హ్రస్వ అకారము తరువాత వచ్చు విసర్గమునకు హ్రస్వ అకారము కాని, మృదుహల్లులు (హశ్శులు)కాని పరములగునపుడు 'ఉ'ఆదేశముగా వచ్చి పూర్వమందున్న అకారముతోఁగూడి గుణసంధి ననుసరించి ఓ గా మారును. చేయు నవసరంబున - చేయు + అవసరంబున - 'ఉదంతమగు తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమంబగు.' బాల.సంధి. 33.

క. అమరె నెఱిజడలపై ను
త్తమరుచి నవజలకణములు దగిలి బెడంగై
యుమ తపమున కెదమెచ్చి త
దమరులు ముత్యములనేస లలికిన భంగిన్. 108

అ ర్థ ము : నవ - జల - కణములు = తొలకరి నీటి బిందువులు, ఉత్తమ - రుచిన్ = శ్రేష్ఠమయిన కాంతితో, నెఱి - జడలపైన్ = అందమైన జడలమీఁద, తగిలి = అంటి, బెడంగు + ఐ = సుందరమయి, తద్ + అమరులు = ఆ దేవతలు, ఉమ - తపమునకున్ = పార్వతి తపస్సునకు, ఎదన్ = హృదయము

నందు, మెచ్చి = సంతోషించి, ముత్యముల - సేసలు = ముత్యములనెడి ఆశీరక్షతలు, అలికిన - భంగిన్ = చల్లిన విధమున, అమరెన్ = ఒప్పెను,

తాత్పర్యము ; తొలకరి నీటి బిందువులు మేలయిన కాంతితోఁ పార్వతి సుందరములైన జడలపై నంటి అందమై, ఆ దేవత లామె తపస్సునకు సంతోషించి ముత్యములనెడి అశీరక్షతలు చల్లిరా యనునట్లు ఒప్పెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష.

వ. మఱియును. 109

చ. అడరు నవాంబుధారలు జటాటవిలోఁ బడి విభ్రమించి వె
ల్వడి చనుదెంచి రాలుగొని పక్ష్మములన్ వెడ నిల్చి మోవిపైఁ
బడి కుచఘట్టనం జెదరి పాఱి రయంబున ముత్తరంగలన్
మడుఁగులుపాఱి నాభి కెడమానక చొచ్చె ననుక్రమంబునన్. 110

అర్థము : అడరు = విజృంభించు నవ + అంబు - ధారలు = తొలకరి నీటి ప్రవాహములు, అనుక్రమంబునన్ = వరుసగా, జటా + అటవిలోన్ = జడలనెడి అడవిలో, పడి, విభ్రమించి = విశేషముగాఁజలించి, వెల్వడి=బయలు వెడలి, చనుదెంచి = వచ్చి, రాలు + కొని = జాఱి, పక్ష్మములన్ = కనుఱెప్పవెంట్రుకలయందు, వెడ - నిల్చి = ఇంచుకయుండి, మోవిపైన్ = పెదవిమీఁద, పడి, కుచ - ఘట్టనన్ = స్తనముల రాపుచే, చెదరి - పాఱి = చెదరి ప్రవహించి, రయంబునన్ = వేగముగా, ముత్తరంగలన్ (మూఁడు తరంగలన్) = మూఁడు వళులందును, మడుఁగులు పాఱి = మడుఁగు లగునట్లు అయి, నాభికిన్, ఎడ - మానక = చోటు విడువక - సంపూర్ణముగా ననుట, చొచ్చెన్ = ప్రవేశించెను.

తాత్పర్యము : తొలకరి నీటి ప్రవాహములు అతిశయించి క్రమముగా జడలనెడి అడవిలోఁబడి విశేషముగాఁ జలించి, బయలువెడలివచ్చి యచ్చటినుండి జాఱి, ఱెప్పవెంట్రుకలయందు ఇంచుకసేపు నిలిచి పెదవిపైఁబడి, స్తనములరాపుచేఁ జెదరి ప్రవహించి, వేగముగా మూఁడువళులందు మడుఁగులుగా నయి నాభియందు సంపూర్ణముగాఁ బ్రవేశించెను.

విశేషములు : ఈ పద్యము సంస్కృత కుమారసంభవములోని

స్థితాః క్షణం పక్ష్మసు తాడితాధరాః
పయోధరోత్సేధ నిపాత చూర్ణితాః,
వలీషు తస్యాః స్ఖలితాః ప్రపేదిరే
చిరేణ నాభిం ప్రథమోదబిన్దవః. సం.కుమార. 5-24

అను శ్లోకమునకు ఇంచుమించు అనువాదమనియే చెప్పవచ్చును. ఆ శ్లోకమునకు వ్యాఖ్యాతలు పార్వతి తపస్సునకుఁ గూర్చుండిన స్థితితోపాటు వ్యంగ్యముగ నామె సౌందర్యముగూడఁ జెప్పఁబడినట్లయినదని వ్యాఖ్యానించిరి. ఆ వ్యాఖ్యానమంతయుఁ దెలుఁగుపద్యమునకుఁగూడ సరిపోవును. - నవాంబుధారలు జటాటవిలోఁ బడె ననుట సంస్కృత శ్లోకమున లేదు. తెలుఁగున నధికము. సముచితము. నవాంబుధారలు - 'నవ' విశేషణముచే ధారల విరలత్వమును, బహువచనముచే నాతివిరలత్వమును సూచింపఁబడుచున్నది. పక్ష్మములన్ వెదనిల్చి - నిల్చి యనుటచేఁ బక్ష్మముల సాంద్రతయు, 'వెడ' అనుటచే స్నైగ్ధ్యము గమ్యమానమగును. మోవిపైఁబడి - సంస్కృతమున తాడితాధరాః - అని యుండుటచే అధరమార్దవము గమ్యమానమగు చున్నది. తెలుఁగునఁగూడ 'పడి' యనియుందుటచే ఆ స్వారస్య మూహింపనగును. కుచ ఘట్టనం జెదరి పాఱి - చెదరి యనుటచే కుచముల కాఠిన్యము సూచితమగుచున్నది. ముత్తరంగలన్ మడుఁగులు పాఱి - తరఁగల నిమ్నోన్నతత్వములు తెలియును. 'నాభి కెడమానక చొచ్చె' ననియే కాని అవి తరువాత నేమయ్యెనవియుఁ జెప్పఁబడలేదు. అందుచే నాభి గాంభీర్యము తెలియుచున్నది.

ఎడమానక - ఎడము + ఆనక అని విఱుచుచో యతిభంగము. కావున ఎడ-మానక అనియే ఛేదము. ముత్తరంగలన్ - మూఁడు + తరంగలన్ - 'సమానాధి కరణంబగు నుత్తరపదంబు పరంబగునపుడు మూఁడుశబ్దము డు వర్ణంబునకు లోపం బును మీఁదిహల్లునకు ద్విత్వంబు నగు.' బాల.సమాస. 17. 'ద్విగువున కేకవచనంబు ప్రాయికంబుగా నగు. మిశ్రంబునకుఁ గాదు.' బాల. సమాస. 18. ఇందు మిశ్రము గాకున్నను ఏకవచనము రామి విశేషము.

వ. తదనంతరంబ. 111

అర్థతాత్పర్యములు : ఆపిమ్మటనే - తరువాతి పద్యముతో నన్వయము.

శరత్కాల వర్ణనము

మ. దళితాంభోరుహసప్తపత్రసుమహత్కాశాసనౌఘంబు, ని
ర్గలితాంబుప్రదకేతకీకుటజకుందవ్రాత, ముద్భాసితేం
దులసన్మత్తమరాళకంబు. గతవిద్యుత్కేకిసల్లాస్య మ
గ్గలమై పర్వె జగంబులందు రుశరత్కాలంబు రమ్యాకృతిన్. 112

అర్థము : దళితాం.... ఔఘంబు : దళిత = వికసించిన, అంభోరుహ = తామరల, సప్తపత్ర = సప్తవర్ణ ? - ఏడాకులపొన్నల, సుమహత్ = మిక్కిలి గొప్పవియగు, కాశ = తెల్లుపూల, అసన + ఓఘంబు = వేగిసపూల సమూహము గలది, నిర్గలితాంబు....వ్రాతము : నిర్గలిత = చక్కగా ఛేదింపబడిన, అంబుప్రద = మేఘముల, చక్కగా వికసించిన, కేతకీ = మొగలిపూల. కుటజ = కొండమల్లెల, కుంద = మొల్లల, వ్రాతము = సమూహముగలది, ఉద్భాసిత.... మరాళకంబు : ఉత్ + భాసిత = మిక్కిలి ప్రకాశించిన, ఇందు = చంద్రుడును, లసత్ = ప్రకాశించుచున్న, మత్త - మరాళకంబు = మదించిన హంసలుగలది, గత.... సల్లాస్యము; గత = పోయిన, విద్యుత్ = మెఱపులు, కేకి = నెమలుల యొక్క, సత్ + లాస్యము (సల్లాస్యము) = మంచి నాట్యముగలది, అగు, ఉరు శరద్ + కాలంబు = గొప్పదియగు శరదృతువు, జగంబులందున్ = లోకములందు, రమ్య + ఆకృతిన్ = మనోహరమైన రూపముతో, అగ్గలము + ఐ = అధికమయి, పర్వెన్ = వ్యాపించెను.

తాత్పర్యము : శరత్కాలము రమణీయాకారముతో వచ్చెను. అప్పుడు పద్మములు. సప్తపత్రములు, కాశములు, వేగిసపూలు వికసించెను. మేఘములు చక్కగా ఛేదింపబడెను. మొగలిపూలు, కొండమల్లెలు, మొల్లలు వికసించెను. చంద్రుడు మిక్కిలి ప్రకాశించెను. మదమరాళములు ప్రకాశించెను. మెఱపులును, నెమళ్ళ మంచి నాట్యములును పోయెను.

విశేషములు : సప్తపత్రము - సప్తవర్ణమయి యుండునా ? అసన + ఓఘ - అసనౌఘ - వృద్ధిసంధి. సల్లాస్య - సత్ + లాస్య-తవర్గవర్ణములకు లకారము పరమగుచో వరసవర్ణము ఆదేశమగును. శరద్ + కాలము - శరత్కాలము -

అనునాసికాంతస్థ భిన్నములైవ హల్లులకు (ఝల్లులకు) కఠినహల్లులు (ఖరులు) పరనుగునపుడు వాని వర్గములందలి ప్రథమవర్ణములు (చరులు) ఆదేశముగా వచ్చును.

క. జలవాసులైన హరి ల
క్ష్ములు వర్ష నిశావసానమున మేల్కొని క
న్నులు విచ్చి చూచినట్టులు
జలజోత్పల రుచులు వెలసె శారదవేళన్. 113

అర్థము: జల - వాసులు + ఐన = నీటియందు నివసించువారగు, హరి - లక్ష్ములు = విష్ణువును, లక్ష్మియును, వర్ష - నిశా + అవసానమునన్ = వర్షాకాల మనెడిరాత్రి ముగింపునందు, మేల్కొని = నిద్రలేచి, కన్నులు - విచ్చి = కనులు విప్పి, చూచిన + అట్టులు = చూచినవిధమున, శారద - వేళన్ = శరదృతువు నందు, జలజ + ఉత్పల - రుచులు - క్రమముగాఁ దామరలయుఁ, గలువలయుఁ గాంతులు, వెలసెన్ = ప్రకాశించెను.

తాత్పర్యము: సముద్రమున శయనించు విష్ణువును, లక్ష్మియును వర్షర్తు వనెడిరాత్రి ముగియఁగనే మేల్కాంచి కన్నులువిచ్చి చూచిరా యనునట్లు, పద్మము లయుఁ. గలువలయుఁ గాంతులు క్రమముగా నొప్పెను.

విశేషములు: హరిలక్ష్ములు - హరియును లక్ష్మియును - ద్వంద్వము. వర్షనిశా = వర్షమనెడి నిశ - రూపకము, యథాసంఖ్యము. రూపకానుప్రాణి తోత్ప్రేక్ష. శరత్సంబంధమయినది శారదము.

క. తేటెం గొలఁకులు, వే తడి
యాఱె మహీతలము, విరిసె నబ్జము, తెలమిన్
బాఱె మరాళము, లోలిం
దీఱెను బులినములు, వెలిఁగె దిక్కులు గలయన్. 114

అర్థము; కొలఁకులు = సరస్సులు, తేఱెన్ + తేటపడెను, మహీ - తలము = భూతలము, వే = శీఘ్రముగా, తడి - ఆఱెన్ = తడియాఱిపోయెను,

అబ్జములు = తామరలు, విరిసెన్ = వికసించెను, ఎలమిన్ = సంతోషముతో, మరాళములు = హంసలు, పాఱెన్ = పరువెత్తెను, ఓలిన్ = క్రమముగా, పులినములు = ఇసుకతిన్నెలు, తీఱెన్ = ఏర్పడెను, దిక్కులు, కలయన్ = అంతటను, వెలింగెన్ = ప్రకాశించెను.

తాత్పర్యము : శరత్కాలమున సరస్సులు తేఱెను. దిక్కులు భూమి తడి యాఱెను. తామరలు వికసించెను. హంసలు సంతోషముతోఁ బరువెత్తెను. క్రమముగా నిసుకతిన్నె లేర్పడెను. దిక్కులు అంతటను బ్రకాశించెను.

విశేషములు : అలంకారము స్వభావోక్తి. కొలఁకులు - కొలను + లు, 'కలన్వాదుల నువర్ణంబు కుఙ్గగు బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు.' బాల.ఆచ్ఛిక. 18.

సీ. కాంతల హారప్రకాశంబుతోడన
కాశ వికాసప్రకాశ మెసఁగె;
మదవతుల తిన్నని నడపులతోడన
నయమున రాయంచ నడపు లడరెఁ;
బొలఁతుల కనుఁగవ పొలపంబు తోడన
నలిఁ జకోరంబుల పొలప మెలసె;
వెలఁదుల ముఖకాంతి వెలుఁగుటతోడన
విమలమై శశికాంతి వెలుఁగు డమరెఁ:

తే. దెఱవ లెదల కలఁక తేఱుటతోడన
యేఱులందుఁ గలఁక తేఱఁదొడఁగె;
మదనవతుల మద సముదయంబుతోడన
పంబి శారదోదయంబు తనరె. 115

అర్థము : కాంతల = స్త్రీలయొక్క, హార - ప్రకాశంబుతోడన్ + అ ॥ హారములయొక్క ప్రకాశముతోపాటే, కాశ - వికాస - ప్రకాశము = తెల్లయొక్క వికాసముయొక్కకాంతి, ఎసఁగెన్ = అతిశయించెను.

మడఁతుల = స్త్రీల, తిన్నని = బాగైన, నడపుల - తోడన్ + అ = నడకలతోపాటే, రాయంచ - నడపులు = రాజహంసముల నడకలు, నయమునన్ = బాగుగా, అడరెన్ = అతిశయించెను.

పొలఁతుల = స్త్రీల, కనుఁగవ (కను + కవ) = కన్నుల జంటయొక్క, పొలపంబుతోడన్ + అ = చలనముతోపాటే, నలిన్ = తగునట్లుగా, చకోరంబుల = వెన్నెలపులుఁగులయొక్క, పొలపము = చలనము, ఎలసెన్ = కలిగెను.

వెలఁదుల = స్త్రీలయొక్క, ముఖ - కాంతి = ముఖప్రకాశము, వెలుఁగుట - తోడన్ + అ = ప్రకాశించుటతోపాటే, శశి - కాంతి = చంద్రునికాంతి, విమలము + ఐ = నిర్మలమయి, వెలుఁగుడు + అమరెన్ = ప్రకాశించుట ఒప్పెను.

తెలువ లెదల (తెలువల + ఎదల) = స్త్రీల హృదయములయొక్క, కలఁక = కలఁగుట, తేలుట + తోడన్ + అ = తేటపడుటతోపాటే, ఏఱుల + అందున్ = నదులందు, కలఁక, తేలన్ + తొడఁగెన్ = తేటపడఁజొచ్చెను.

మదనవతుల = స్త్రీలయొక్క, మద - సముదయంబుతోడన్ + అ = మదముల సమూహముతోపాటే, శారద + ఉదయంబు = శరత్సంబంధమైన అభ్యుదయము, పంబి = అతిశయించి, తనరెన్ = ఒప్పెను.

తాత్పర్యము: స్త్రీల హారముల ప్రకాశముతోపాటే తెల్లపూల వికసన ప్రకాశము అతిశయించెను. స్త్రీల తిన్ననైన నడకలతోపాటే రాజహంసముల నడకలు బాగుగా నతిశయించెను. స్త్రీల కనుదోయి చలనముతోపాటే చకోరముల చలనము వ్యాపించెను. స్త్రీల ముఖకాంతితోపాటే చంద్రునికాంతి నిర్మలమై వెలుఁగనారంభించెను. స్త్రీల హృదయములు కలఁకతేలుటతోపాటే, నదులు కలఁకదేలఁజొచ్చెను. మదవతుల మదసముదాయముంతోపాటే శరత్కాలపుటభ్యుదయము అతిశయించి యొప్పెను.

విశేషములు: అలంకారము సహోక్తి, స్వభావోక్తి.

ఉ. చారు నిశీథినీ విమల సాంద్ర సుధాకరభాతి రోదసీ
పూరితమై దినంబుల నభోమణి దీప్తిఁ దఱంక కిమ్ముగాఁ
బేరి ఘనీభవించె ననఁ బె ల్లెసఁగన్ సితమేఘ హంస పం
కేరుహ కాశ సంహతులు క్రిక్కిఱిసెన్ శరదాగమంబునన్. 116

అర్థము : శరద్ + ఆగమంబునన్ = శరత్ప్రాప్తియందు, చారు.....
భాతి : చారు = మనోహరమైన, నిశీథినీ = రాత్రులయొక్క, విమల = స్వచ్ఛమైన, సాంద్ర = దట్టమైన, సుధాకర - భాతి = చంద్రునికాంతి, రోదసీ - పూరితము + ఐ భూమ్యాకాశముల నడిమిభాగము నిండినదయి, దినంబులన్ = పగళ్ళను, నభోమణి = సూర్యునియొక్క, దీప్తిన్ = కాంతిచేత, తఱంకక = తగ్గక, ఇమ్ముగాన్ = బాగుగా, పేరి = అతిశయించి, ఘనీభవించెన్ + అనన్ = గడ్డకట్టె ననఁగా, పెల్లు + ఎసఁగన్ = మిక్కిలి అతిశయించునట్లు, సిత - మేఘ - హంస - పంకేరుహ-కాశ - సంహతులు = తెల్లని మేఘములయు, హంసలయు, పద్మములయు, తెల్లుపూలయు సమూహములు, క్రిక్కిఱిసెన్= దట్టమయ్యెను.

తాత్పర్యము : శరత్సమయమునందు మనోహరములైన రాత్రులయందలి నిర్మలము, సాంద్రమునైన చంద్రకాంతి భూమ్యాకాశముల నడిమిభాగము నిండి, పగటివేళల సూర్యకాంతిచేఁ దఱుగక బాగుగా నతిశయించి గడ్డకట్టెనా యనునట్లు తెల్లని మేఘముల, హంసల, పద్మముల, తెల్లుపూల సమూహములు మిక్కిలి అతిశయించి సాంద్రమయ్యెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష. తఱఁకు - ఈ శబ్దము ఒక్క సమాసంభవమునందే వివిధార్థములందుఁ బ్రయుక్తమైనది. (సూ.ని.) క్రిక్కిఱిసెన్- క్రిక్కు + ఇఱిసెన్.

శా. శ్వేతద్వీపము చంద్రబింబము, మహాక్షీరాబ్ధి తజ్జ్యోత్స్న, త
ద్భాతిం గృష్ణుఁడు తన్మృగాంకము, లసత్పద్మాలయాక్షిద్యుతుల్
ప్రీతిం జారు చకోరదంపతులు నాఁ బృథ్వీధరుంబోలి వి
ఖ్యాతిం బొల్పగు శారదాభినుతరాకారాత్రు లత్యున్నతిన్. 117

అర్థము : శ్వేతద్వీపము = తెలిదీవి, చంద్రబింబము = చంద్రమండల మును, మహత్ (మహా) క్షీర + అబ్ధి = గొప్పదియగు పాలసంద్రము. తద్ + జ్యోత్స్న = ఆ చంద్రుని వెన్నెలయును, తద్ + ఖాతిన్ = ఆ విధముగనే, కృష్ణుఁడు, తద్ + మృగ + అంకమున్=ఆ చంద్రునియొక్క లేడిచిహ్నమును-మచ్చయును, లసత్ + పద్మాలయా + అక్షి - ద్యుతుల్ ప్రకాశించుచున్న. లక్ష్మీదేవియొక్క నేత్రకాంతులు, ప్రీతిన్ = ఒప్పుతో, చారు - చకోర - దంప తులు = మనోహరములైన వెన్నెలపులుఁగుల జంటలును, నాన్ = అనఁగా, శారద + అభినుత - రాకా - రాత్రులు = శరత్సంభవములైన, పొగడఁబడిన, పున్నమరేలు, అతి + ఉన్నతిన్ = మిక్కిలి గొప్పతనముతో, పృథ్వీధరున్ = విష్ణువును, పోలి, విఖ్యాతిన్ = ప్రసిద్ధితో, పొల్పు + అగున్ = ఒప్పును.

తాత్పర్యము : తెలిదీవి చంద్రమండలమును, మహాక్షీరసముద్రము ఆ చంద్రునివెన్నెలయును, అట్లే కృష్ణుఁడు ఆ చంద్రునిలోని మచ్చయును, లక్ష్మీదేవి కన్నుల కాంతులు వెన్నెలపులుఁగుల జంటయును గాఁగా శారదరాత్రులు అత్యున్న తితో విష్ణుమూర్తిని బోలి ప్రసిద్ధికెక్కెను.

విశేషములు : అలంకారము ఉపమ, రూపకము, ఉత్ప్రేక్ష.

క. నారీ సంగమ సుఖములఁ
జేరని గాంభీర్యవృత్తిఁ జేకొనక సరి
త్తీరజలంబుల మధ్యమ
వారిన్ నగునట్లు కాశవనరుచి వెలిఁగెన్. 118

అర్థము ; సరిత్ + తీర - జలంబులు + అ=నదియొడ్డుననున్న నీరులే, నారీ - సంగమ - సుఖములన్ + స్త్రీ సాంగత్యమువలని సౌఖ్యములను, చేరని = పొందని, గాంభీర్య-వృత్తిన్ = గాంభీర్యముతోడి వర్తనమును (లోఁతుగానుండు టను), చేకొనక = స్వీకరింపక, మధ్యమ - వారిన్ = నడిమి జలమును, నగు + అట్లు = పరిహసించునట్లు, కాశ-వన-రుచి = తెల్లువనములకాంతి, వెలిఁగెన్ = ప్రకాశించెను.

తాత్పర్యము : స్త్రీలు నదియొడ్డుననున్నజలములందే స్నానమాచరింతురు, నడిమిజలములందుఁ జేయరు. అందుచే నదీతీరజలములకు నారీసంగమసౌఖ్య ముండును. నడిమిజలముల కా సౌఖ్యముండదు. నదీతీరజలములు లోఁతుగా నుండవు. నడిమి జలములు లోఁతుగా నుండును. స్త్రీసాంగత్యసౌఖ్యములులేని గాంభీర్యముగల నడిమిజలములను ఆ సౌఖ్యముగల నదీతీరజలములు పరిహసించుచున్నవా యనునట్లు ఒడ్డునందలి తెల్లువనములకాంతి ప్రకాశించెను.

విశేషములు : నవ్వు తెలుపని కవి సమయము. తెల్లుపూలకాంతి తెలుపగుటచే నగునట్లున్నవని భావము. గాంభీర్య మనఁగా గంభీరభావమును లోఁతును. స్త్రీసంగతిలేని గాంభీర్యముగల నడిమిజలములను అట్టి గాంభీర్యములేకున్నను, స్త్రీసాంగత్య శోభగల నదీతీరజలములు నవ్వుచున్నవా యనునట్లు తెల్లుపూలు ప్రకాశించెను. అలంకార ముత్ప్రేక్ష.

క. శరదాగమమున శోభా
కరముగఁ గై వ్రాలఁ బండి కలమవనంబుల్
గరుసున నెలమిన తామర
విరిపువ్వుల తావి కెఱఁగువిధమునఁ బొలిచెన్ 119

అర్థము ; శరద్ + ఆగమమునన్ = శరదృతువురాకయందు, శరదృతువునం దనుట, కలమ - వనంబుల్ = వరిమొక్కలు, శోభా + ఆకరముగన్ = ఒప్పునకు నిలయమగునట్లు, కై వ్రాలన్ = బరువై వంగునట్లు, పండి, గరుసువన్= బరువుతో(?), ఎలమిన్ + అ = సంతోషముతోనే, తామర - విరి - పువ్వుల - తావికిన్ = విచ్చిన తామరపువ్వుల పరిమళమునకు, ఎఱఁగు - విధమునన్ = వ్రాలు రీతిని, పొలిచెన్ = ఒప్పెను.

తాత్పర్యము : శరదృతువునందు వరిమొక్కలు శోభాయమానముగ ఏపుగఁబండి బరువుతోఁ బ్రీతిమై వికసించినతామరపూల పరిమళమునకు వ్రాలురీతిని ఒప్పెను.

విశేషములు : అలంకార ముత్ప్రేక్ష.

ఉత్సాహ. అరుణ శాలి కణిశములు శుకాలి గఱచుకొనుచు నం
బరతలమున నోలి నెగసి పాఱు; దిగ్వధూచయం
బరయఁ జెలువ మెసఁగు శారదాగమమున నుత్సవో
త్కరవిభాతిఁ దోరణములు గట్టినట్లు లందమై. 120

అ ర్థ ము : శుక + అలి = చిలుకల వరుస, అరుణ - శాలి-కణిశములు = ఎఱ్ఱని వరియెన్నులు, కఱచుకొనుచున్ = నోటఁగఱచుకొనుచు, ఓలిన్ = క్రమముగా, అంబర - తలమునన్ = ఆకాశమునందు, నెగసి = ఎగిరి, దిశ్(క్) + వధూ - చయంబు = దిక్కులనెడు స్త్రీలసమూహము, అరయన్ = చూడఁగా, చెలువము = అందము, ఎసఁగు = అతిశయించు, శారద + ఆగమమున్ = శరదృతువునందు, ఉత్సవ + ఉత్కర - విభాతిన్ = వేడుకలయొక్క సమూహముయొక్క విశేష కాంతితో, తోరణములు, కట్టిన + అట్టులు = కట్టిన విధముగా, అందము + ఐ, పాఱున్ = పరువెత్తును.

తా త్ప ర్య ము : చిలుకలవరుస ఎఱ్ఱని వరియెన్నులను నోటఁగఱచుకొని ఆకాశతలమునఁ గ్రమముగా నెగిరి, దిక్కులనెడి స్త్రీలసమూహము అంద మతిశయించు శరదృతువునందు ఉత్సవము మెఱయఁ దోరణములు కట్టెనా యనునట్లు అందమై పాఱెను.

వి శే ష ము లు : అలంకారి ముత్ప్రేక్ష. అది రూపకానుప్రాణితము. చిలుకలు పచ్చగా నుండును. అవి నోటఁగఱచుకొనిన శాలికణిశము లరుణములై యున్నవి. కావున దిగ్వధువులు రంగురంగులతోరణములు కట్టినట్లుండును.

ఛందస్సు: ఉత్సాహ వృత్తమునకు నాలుగుపాదము లుండును. ప్రతిపాదమునను ఏడు సూర్య గణములు, నొక గురువునుండును. మొదటి యక్షరమునకును, అయిదవ గణము మొదటి యక్షరమునకును యతిమైత్రి ప్రాసనియమము కలదు. దిగ్వధూ - దిశ్ + వధూ - దిక్ + వధూ దిగ్వధూ. దిక్కులనెడి వధువులు - రూపకము. శుకాలి - ఒక్క శుకము గాదు. శుకముల బారు. కావుననే తోరణమువలె నుండెను. ఓలిన్ - అవి క్రమముగాఁ బాఱుచుండుటచేతనే తోరణములవలె నుండెననుట. ఒక్క ఉత్సవము గాక ఉత్సవోత్కరమగుటచేతనే వి - భాతి. కావుననే తోరణములు కట్టుటయును.

వ. ఇట్లఖిలమనోరంజకంబై యతిరమణీయంబైన శరత్సమయంబునం
బార్వతి తత్కాలోచితంబు లనుష్ఠించుచుండు నంత. 121

అర్థము : ఇట్లు, అఖిల - మనస్(ః) + రంజకంబు + ఐ = ఎల్లర మనస్సులకును సంతోషమును గలిగించునదియై, అతి - రమణీయంబు = మిక్కిలి మనోహరము, ఐన, శరద్ + సమయంబునన్ = శరత్కాలమునందు, పార్వతి, తద్ + కాల + ఉచితంబులు = ఆ సమయమునకుఁ దగినవి, అనుష్ఠించుచున్ + ఉండు + అంతన్ = చేయుచుండునంతలో_

తాత్పర్యము : ఈ రీతిగా నెల్లరమనస్సులను సంతోషింపఁజేయునదియై మిక్కిలి మనోహరమైన శరత్కాలమునఁ బార్వతి ఆ సమయమున కుచితములైన పనులను చేయుచున్నంత - తరువాతి పద్యముతో నన్వయము.

హేమంత వర్ణనము

ఉ. శాంత దినాధిపప్రకర చండతరత్వము, మందితాబ్జవి
క్రాంతము, వీత సప్తదల గర్వము, ధూత మరాళికాలి వి
భ్రాంతము, నిర్గతేందుకరభాసము దేశములందుఁ బర్వె హే
మంతము సంతతోపచిత మారవికార మనుక్రమంబునన్. 122

అర్థము : శాంత....తరత్వము: శాంత = శమించిన, దిన + అధిప = సూర్యునియొక్క, ప్ర - కర = ప్రకృష్టములైన కిరణములయొక్క, చండ తరత్వము = తీవ్రతరత్వము - తైక్ష్ణ్యము గలదియు, మందిత + అబ్జ - విక్రాంతము = మందముగాఁ జేయఁబడిన, తామరలయొక్క పరాక్రమముగలదియు, వీత - సప్తదల - గర్వము = పోయిన ఏడాకులరఁటుల గర్వముగలదియు, ధూత - మరాళికా + అలి - విభ్రాంతము = ఎగురఁగొట్టఁబడిన - ఆఁడుహంసల యొక్కయుఁ, తుమ్మెదలయొక్కయు సంచారముగలదియు, నిర్గత + ఇందు - కర - భాసము = పోయిన చంద్రకిరణముల ప్రకాశముగలదియు, సంతత + ఉపచిత - కుమార - వికారము = నిరంతరముగా వృద్ధిపొందింపఁబడిన మన్మథ వికారము గలదియు, అగు, హేమంతము, అనుక్రమంబునన్ = క్రమముగా, దేశముల + అందున్, పర్వెన్ = వ్యాపించెను.

తాత్పర్యము: శమించిన సూర్యకిరణ తైక్ష్ణ్యముగలదియు, తగ్గిన తామరల విజృంభణము గలదియు, అడఁగిన ఏడాకుల అరఁటుల గర్వముగలదియు, పోయిన ఆఁడుఅంచలయుఁ దుమ్మెదలయు సంచారముగలదియు, పోయిన చంద్రకిరణ కాంతి గలదియు, నిరంతరము పెంపొందిన మన్మథవికారము గలదియు అగు హేమంతము క్రమముగా దేశములందు వ్యాపించెను.

విశేషములు: అలంకారము స్వభావోక్తి, అంత్యానుప్రాసము.

క. శరదాగమంబు తన సుత
కురు పరితాపంబు సేయుచుండుట హిమభూ
ధరపతి గని వానిపయిన్
బరిగొనియెనొ నాఁగఁ దుహినపటలము పర్వెన్. 123

అర్థము: శరద్ + ఆగమంబు = శరత్తు అనువానియొక్క రాక, తన-సుతకున్ = తన కూఁతునకు - పార్వతికి, ఉరు - పరితాపంబు = గొప్ప బాధ, చేయుచున్ + ఉండుట, హిమ - భూధర - పతి = హిమవత్పర్వతమనెడి రాజు, కని = చూచి, వానిపయిన్ = ఆ శరత్తనువానిమీఁద, పరిగొనియెనొ = దండు వెడలెనొ, నాఁగన్ = అనునట్లు, తుహిన - పటలము = మంచుసమూహము, పర్వెన్ = క్రమ్మెను.

తాత్పర్యము: శరత్తనువాని రాక తన కూఁతురైన పార్వతికి గొప్ప బాధను గలుగఁజేయుచుండుట చూచి హిమవంతుఁ డనురాజు వానిపై దాడివెడలెనా యనునట్లు మంచుసముదాయము వ్యాపించెను.

విశేషములు: అలంకారము హేతూత్ప్రేక్ష.

శిశిర వర్ణనము

శా. శీతాత్యంతనిపీడనం బడి జగజ్జీవాళు లత్యార్తులై
పాతాళంబులు సొచ్చున ట్టిరవు లొప్పన్ భూగృహావాసులై
భీతిన్ వెల్వడకుండ వహ్ని మెయి కంపింపం బ్రచండార్చికిన్
జేతుల్ గ్రొవ్వెరవోవుచుండ శిశిరోచ్ఛేదంబు పర్వెన్ మహిన్. 124

అర్థము : జగత్ + జీవ + ఆళులు = జగత్తునందలి ప్రాణుల సమూహములు, శీత + అత్యంత - నిపీడనన్ = చలివలని మిక్కిలిబాధను, పడి = పొంది, అతి + ఆర్తులు + ఐ = మిక్కిలి దుఃఖించినవారయి, పాతాళంబులు + చొచ్చు + అట్టు = పాతాళములు ప్రవేశించు విధమున, ఇరవులు = ఇండ్లు, ఒప్పన్, భూ - గృహ + ఆవాసులు + ఐ = భూమిలోపలిగృహములు నివాసములుగాఁ గలవారయి, భీతిన్ = భయముతో, వెల్వడక + ఉండన్ = వెలుపలికిరాకుండఁగా, వహ్ని - మెయి = అగ్నియొక్కశరీరము, కంపింపన్ = వడఁకఁగా, ప్రచండ + అర్చికిన్ = తీక్ష్ణములయిన కిరణములుగలవానికి - సూర్యునకు, చేతుల్ = కరములు = కిరణములు, క్రొవ్వెర + పోవుచున్ + ఉండన్ = కొంకరలు పోవుచుండఁగా, మహిన్ = భూమియందు, శిశిర + ఉచ్ఛేదంబు = చలివలని బాధ, పర్వెన్ = వ్యాపించెను,

తాత్పర్యము : భూమియందుఁ జలి మిక్కిలి వ్యాపించెను. ఆ చలిబాధను భరింపలేక జగతిలోని ప్రాణులు మిక్కిలి దుఃఖించినవారయి పాతాళలోకములు చొచ్చినట్లు భూగర్భగృహములలోనికిఁ బోయి అందుండి వెలువడకుండిరి. అగ్నికే శరీరము కంపించునట్లును, సూర్యునకే కరములు కొంకరలుపోవుచున్నట్లును జలి మిక్కిలి విజృంభించెను.

విశేషములు : పాతాళంబులు సొచ్చువట్లు - అలంకార ముత్ప్రేక్ష. అగ్నిమెయి కంపింపన్ - ప్రచండార్చికిన్ జేతుల్ గ్రొవ్వెరవోవుచుండ - అలంకార మతిశయోక్తి. వహ్ని మెయిఁ గంపింపన్ - అనియున్నదానిని అర్థసౌలభ్యమునకయి 'వహ్ని మెయి కంపింపన్' అనిమార్పఁబడినది.

వ. తదనంతరంబ. 125

అర్థతాత్పర్యములు : అ పిమ్మటనే,

తే. తనరి హేమంతమగుడుఁ బద్మంబు లడఁగి
పోవఁ బోయినఁ గొల నొక్కపువ్వు తనకు
విత్తుగా దాఁచికొనియున్న విధముపోలె
శైలసుతముఖ ముదకవాసమున నొప్పె. 126

అర్థము : తనరి = ఒప్పి, హేమంతము, అగుడున్ = అయినంతనే, పద్మంబులు = తామరలు, అడఁగిపోవన్ + పోయినన్ = నశించిపోఁబోఁగా, కొలను = సరస్సు, ఒక్క - పువ్వు, తనకున్, విత్తు + కాన్ = విత్తనముగా, దాఁచికొని + ఉన్న - విధము - పోలెన్ = దాఁచుకొనియున్నట్లుగా, శైల - సుత - ముఖము = పర్వతపుత్త్రిక - పార్వతి - మోము, ఉదక - వాసమునన్ = నీటియందు దునికిచే, ఒప్పెన్.

తాత్పర్యము : హేమంతము వచ్చినంతనే కొలనిలోని తామరలన్నియు నంచిపోఁబోవఁగాఁ, గొలను తన కొక్కపువ్వును విత్తనమునకై దాఁచుకొనెనా యున్నట్లు పార్వతిముఖము జలనివాసముచే నొప్పెను.

విశేషములు : అలంకారము హేతూత్ప్రేక్ష. కాళిదాసు కుమారసంభవము నందలి యీ క్రిందిశ్లోకము భావమునే యీ కవి యించుకమార్చి, క్రొత్తఅందమును గూర్చెను.

> 'ముఖేన సా పద్మసుగన్ధినా నిశి ప్రవేపమానాధరపత్త్రశోభినా,
> తుషారవృష్టిక్షతిపద్మసంపదాం సరోజసన్ధాన మి వాకరో దపామ్',
>
> సం.కు.సం. 5.27

తుషారవృష్టిచే రేయి పద్మసంపదను గోల్పోయిన నీటికి పార్వతి పద్మసుగంధియు. ప్రవేపమానాధరపత్త్రశోభియు నగు తనమోముచే పద్మమును సమకూర్చెనా యన నొప్పుచుండెనని సంస్కృతమున నుండఁగా, హేమంతమునకుఁ బద్మములన్నియు నశింపనుండఁగాఁ, గొలను తనకు విత్తనముకొఱ కుంచుకొనెనా యనునట్లు పార్వతి ముఖము జలనివాసముచే నొప్పెనని యితఁడు చెప్పెను.

వ. మఱియును. 127

చ. వనజములెల్ల మంచుఁగొని వాడినచో నొకపువ్వు నిల్చినన్
గని యవి లన్నియున్ నెలవుగై కొని దీనికి గ్రుచ్చువచ్చునో
యను వగ మీఁదఁ బిండుకొని యడ్డమునిల్చెనొ నాఁగ నంబుజా
ననముపయిం జటావలి పెనంగి నగాత్మజ కొప్పు నత్తఱిన్. 128

అర్థము : అత్తఱిన్ = ఆ + తఱిన్ = ఆ సమయమున - శిశిరమున, వనజములు + ఎల్లన్ = తామరలన్నియును, మంచున్ + కొని = మంచును గ్రహించి, వాడినచోన్ = వాడినచోట, ఒక - పువ్వు, నిల్చినన్ = నిలిచినచో, నిలువఁగా, కని = చూచి, అలులు = తుమ్మెదలు, అన్నియున్, నెలవు + కైకొని = స్థానమేర్పఱుచుకొని, దీనికిన్ = ఆ ఒక్కపువ్వునకును, ముచ్చు - వచ్చునో + అను - వగన్ = ముప్పువచ్చునేమో యనుభీతితో, మీఁదన్ = పైని, పిండు - కొని = గుమిగూడి, అడ్డము - నిల్చెనొ - నాఁగన్ = తుమ్మెదల కడ్డముగా నిలిచెనో యనునట్లు, నగ + ఆత్మజకున్ = కొండకూఁతునకు - పార్వతికి, అంబుజ + ఆననము - పయిన్ = ముఖపద్మముమీఁద, జటా + ఆవలి = జడలవరుస, ఒప్పున్.

తాత్పర్యము : ఆ శిశిర సమయమునఁ బద్మములన్నియు మంచుచే వాడిపోయి ఒక్కపువ్వు పార్వతీముఖరూపమున నిలువఁగాఁ దుమ్మెదలన్నియును జూచి దానిపై మూఁగి, స్థానమేర్పఱుచుకొని, ముప్పుతెచ్చునేమో యనుభీతిచే, మీఁద గుమిగూడి తుమ్మెదల కడ్డమునిలిచెనా యనునట్లు పార్వతికి ముఖపద్మముపై జడలసమూహము ఒప్పును.

విశేషములు : అలంకారము హేతూత్ప్రేక్ష.

ఈ భావము కాళిదాసు భావమున కించుక పెంపు. మంచువానచేఁ బద్మ సంపదను గోలుపోయిన నీటికిఁ బార్వతిముఖము పద్మసంధానమును జేయుచున్నదని (కుమార, 5-27) శ్లోకమునఁ గాళిదాసుభావముకాఁగా, నన్నెచోడుఁ డా పద్మముపైఁ తుమ్మెదలు వ్రాలి దానికెక్కడముప్పుతెచ్చునోయని యామె జడలు వాని కడ్డము నిలిచెనా యనునట్లుండెనని యించుక విస్తరించుట రమ్యముగా నున్నది.

అంబుజాననము - ఆననాంబుజ మనుట. ఇట్టి ఉపమానపూర్వపదములు సంస్కృతలక్షణమునకు విరుద్ధములు. చిగురుఁగేలు, జుంటిమోవివంటి యిట్టివి తెలుఁగుననే యుండును.

వ. ఇట్లతిదుస్సహనీయ శీతోపేతంబులగు హేమశిశిరంబులందు నిరంత రోదకవాస నిరాహారాది ఘోరతపోవృత్తిం బ్రవర్తించుచుండు నంత. 129

అర్థము ; ఇట్లు, అతి - దుస్సహనీయ - శీత + ఉపేతంబులు = మిక్కిలి దుఃఖముచే సహింపఁదగిన - ఓర్వరాని, చల్లఁదనముతోఁ గూడుకొన్నవి అగు, హేమ - శిశిరంబుల + అందున్ = హేమంత శిశిరర్తువులందు, నిరంతర + ఉదక - వాస = ఎడతెగని జలనివాసముగలది, నిరాహార = భోజనములేనిది, ఆది= మొదలగు, ఘోర = భయంకరమైన, తపస్(ః) + వృత్తిన్ = తపస్సునందు వర్తనముచే, ప్రవర్తించుచున్ + ఉండు + అంతన్ = ప్రవర్తిలుచుండునంతలో.

తాత్పర్యము ; ఇట్లు మిక్కిలి దుస్సహమైన చల్లఁదనముతోఁ గూడినవైన హేమంతశిశిరర్తువులందు నిరంతరము నీటనుండిచేయునట్టియు, ఆహారముతీసికొనకుండఁజేయునట్టియు మున్నగుతపస్సులందుఁ బ్రవర్తిలుచుండు నంత - తరువాతి పద్యముతో నన్వయము,

వసంత వర్ణనము

చ. జలజల డుల్లు పర్ణముల చప్పుడు, లక్కడఁ జూడఁజూడఁబై
నెలమెడు వల్ద మోసులును, నేర్పడు కెందలిరాకుజొంపముం,
బొలుపగు మొగ్గలున్, విరియుపూవులుఁ, బూఁపలు, ప్రానిమ్రాని క
గ్గలముగఁ దాల్చెఁ జెప్ప వినఁ గాదది యెట్టివసంతవేగమో. 130

అర్థము : జలజల = జలజలమనుధ్వనితో, డుల్లు = రాలునట్టి. పర్ణముల = ఆకులయొక్క, చప్పుడులు = ధ్వనులు, అక్కడన్ = అచ్చట, చూడన్ + చూడన్=చూడఁగాఁజూడఁగా, పైన్=మీఁద, ఎలమెడు=వ్యాపించునట్టి, వల్ద - మోసులును = స్థూలమైన అంకురములును, ఏర్పడు = స్పష్టపడునట్టి, కెందలిరాకు - జొంపమున్ - (కెంపు + తలిరు + ఆకు) = ఎఱ్ఱని చివురాకుల గుబురును, పొలుపు + అగు = అందమగు, మొగ్గలున్, విరియు = వికసించునట్టి, పూవులున్, పూఁపలున్ = పూఁబిందెలును, మ్రాని - మ్రానికిన్ = చెట్టు చెట్టునకు, అగ్గలముగన్ = అధికముగా, తాల్చెన్ = ధరించెను, చెప్పన్, వినన్ + కాదు, చెప్పుటకును, వినుటకును గానిది, అది - ఎట్టి - వసంత - వేగమో = వసంతము వడి అది యెట్టిదో!

తాత్పర్యము : జలజల రాలు ఆకులచప్పుడులును, అచ్చటఁ జూడఁగాఁ జూడఁగా పైని వ్యాపించు మోసులును, ఏర్పడు కెంజిగురాకుల గుబురును, సుందరములైన మొగ్గలును, విరిసెడిపువ్వులును, పూఁబిందెలును, చెట్టుచెట్టునకు నెక్కువగా నొప్పెను. చెప్పను వినను అలవికాని వసంతవేగ మెంతటిదో కదా!

విశేషములు : అలంకారము స్వభావోక్తి.

వ. అన నిఖిలభువనమనోరంజకం బగుచు. 131

అర్థము : అనన్ = అనునట్లుగా, నిఖిల - భువన - మనస్(ః) + రంజకంబు = ఎల్లలోకముల మనస్సును సంతోషపెట్టునది, అగుచున్.

తాత్పర్యము : అనునట్లుగా నెల్లలోకములవారి మనస్సులకు సంతోషము గలిగించునది యగుచు - తరువాతి పద్యముతో నన్వయము.

చ. పొలుపుగనేచి, చెల్వడరఁబూచి, బెడంగుగఁగాచి, పండ మ్రాఁ
కులు, మరుఁడేయఁ, గోయిలలు గూయ, మదాలులు మ్రోయ, రాగులన్
వలరసమందఁ, బ్రోషితులు వందఁ, గవల్ ముదమంద వచ్చె న
త్యలఘువసంత ముర్వర ననంతవిభూతి నిరంతరంబుగాన్. 132

అర్థము: అతి + అలఘు - వసంతము = మిక్కిలి గొప్పదియగు వసంతము, మ్రాఁకులు = చెట్లు, పొలుపుగన్ = ఒప్పుగా, ఏచి = విజృంభించి, చెల్వు + అడరన్ = అంద మతిశయింపఁగా, పూచి=పుష్పించి, బెడంగుగన్ = అందముగా, కాచి = ఫలించి, పండన్ = పండఁగను, మరుఁడు = మన్మథుఁడు, ఏయన్ = కొట్టఁగను, కోయిలలు = కోకిలములు, కూయన్ = కూయఁగను, మద + అలులు = మదముతోడి తుమ్మెదలు, మ్రోయన్ = రొద చేయఁగను, రాగులన్ = ప్రేమికులను, వల - రసము = అనురాగమనెడి రసము - శృంగార రసము, అందన్ = పొందఁగను, ప్రోషితులు = విరహులు, వందన్ = బాధ నొందఁగను, కవల్ = దంపతులు, ముదము + అందన్ = సంతోషపడఁగను, ఉర్వరన్ = భూమియందు, అనంత - విభూతి = అంతులేనిసంపద-నిరంతరంబు+ కాన్ = ఎడతెగనిదికాఁగను, వచ్చెన్.

తాత్పర్యము : మిక్కిలి గొప్పదియగు వసంతము చెట్లు ఏపుగాఁ బెరిఁగి, అందమతిశయింపఁ బుష్పించి, సుందరముగా ఫలించి, పండఁగను, మన్మథుఁడు బాణప్రయోగము చేయఁగను, గోయిలలు కూయఁగను, మదించిన తుమ్మెదలు రొద పెట్టఁగను, అనురక్తులను శృంగారరసము పొందఁగను, విరహులు బాధపడఁగను, దంపతులు సంతోషమందఁగను, భూమియం దనంతమైన సంపద యెడతెగకుండఁగను వచ్చెను,

విశేషములు : అలంకారము స్వభావోక్తి. చెల్వు - చెలువు. 'అచ్చికంబులం బదమధ్యంబుల నలడరల యుత్వంబునకు లోపంబు బహుళంబుగ నగు.' బాల.ప్రకీర్ణక. 17. ప్రూఁకులు - ప్రూను + లు. 'కలన్వాదుల నువర్ణంబు కుగాగు బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగును.' బాల.అచ్చిక. 18. 'ప్రూ + కుక్ + లు. 'జీత్తు బిందుపూర్వంబగు.' బాల.తత్సమ. 19. ప్రూఁకులు.

వ. అంతం బార్వతి వసంతానంతలతాంతసంతతి నంతకాంత కాక్రాంత
పూజాత్యంతహోమాదిక్రియలం బ్రవర్తించుచుండు నంత. 133

అర్థము : అంతన్, పార్వతి, వసంత + అనంత - లతాంత - సంతతిన్ = వసంతర్తువునందలి అంతులేని పూలసమూహముచేత, అంత.... క్రియలన్: అంతక + అంతక = యము నంతమొందించిన వాని (శివుని)చేత, ఆక్రాంత = ఆక్రమింపఁబడిన, పూజా = పూజలు, అత్యంత = మిక్కిలి, హోమ + ఆది = హోమములు మున్నగు, క్రియలన్ = పనులందు, ప్రవర్తించుచున్ + ఉండున్ + అంతన్ = నడచుచున్నంత-

తాత్పర్యము : అంతఁ బార్వతి వసంతమునందలి కడలేని పూలసమూహముతో శివపూజాహోమాదికార్యముల నడచుచున్నంత - తరువాతి పద్యముతో నన్వయము.

గ్రీష్మ వర్ణనము

చ. స్ఫురదురుదావపావకము, శోషితసింధుచయోదకంబు, సం
హరితపతంగసంఘ. మసమర్థిత మార్గిగణంబు, తప్తభూ
మిరుహకులంబు, వర్ధితసమీరవిదాహ, మశేషదగ్ధభూ
ధరనికరంబు నాఁ బటు నిదాఘము పర్వె భయంకరాకృతిన్. 134

అర్థము : స్ఫురత్ + ఉరు-దావ-పావకము = విజృంభించుచున్న గొప్ప దావాగ్నికలదియు, శోషిత - సింధు - చయ + ఉదకంబు = ఎండింపఁజేయఁబడిన నదులసమూహమునందలి జలముగలదియు, సంహరిత - పతంగ - సంఘము = సంహరింపఁబడిన పక్షులగుంపుగలదియు, అసమర్థిత - మార్గి - గణంబు = అశక్తులుగాఁజేయఁబడిన బాటసారుల సమూహముగలదియు, తప్త - భూమిరుహ - కులంబు = తపింపఁజేయఁబడిన చెట్లసమూహముగలదియు, వర్ధిత - సమీర - విదాహము = వృద్ధిపొందింపఁబడిన గాడ్పుయొక్క వేఁడిమిగలదియు, అశేష - దగ్ధ - భూధర - నికరంబు = ఎల్ల దహింపఁడిన పర్వతముల సమూహముగలదియు, నాన్ = అనఁగా, పటు - నిదాఘము = తీక్ష్ణమైన వేసవి, భయంకర + ఆకృతిన్= వెఱపుఁగొలుపురీతితో, పర్వెన్ = వ్యాపించెను.

తాత్పర్యము : విజృంభించుచున్న గొప్పదావాగ్ని కలదియు, ఎండింపఁబడిన నదీసమూహజలము గలదియు, సంహరింపఁబడిన పక్షులగుంపు గలదియు, అశక్తులుగాఁజేయఁబడిన పాంథులసమూహము గలదియు, తపింపఁజేయఁబడిన చెట్లగుంపు గలదియు, వృద్ధిపొందింపఁబడిన గాడ్పువేఁడిమి గలదియు, దహింపఁబడిన యెల్ల పర్వతముల సమూహము గలదియు అనునట్లు తీక్ష్ణమైన వేసవి భయంకరాకారముతో వ్యాపించెను.

క. తలఁచిన డెందము కందును,
బలికిన నోరెల్లఁబొక్కుఁ, బ్రభ సూచిన రె
ప్పలు కమరు ననఁగఁ బటుతర
విలయానలభాతి నెండ వేసవిఁ గాఁచెన్. 135

అర్థము : తలఁచినన్ = భావించినచో, డెందము = హృదయము, కందును = నొచ్చును, పలికినన్ = పలికినచో, నోరు + ఎల్లన్ = నోరంతయు, పొక్కున్ = బొబ్బలెక్కును, ప్రభ = వెలుఁగు, చూచినన్, రెప్పలు = కను రెప్పలు, కమరున్ = కాలును, అనఁగన్, పటుతర - విలయ + అనల - భాతిన్= తీవ్రతరమైన ప్రళయాగ్ని విధమున, ఎండ, వేసవిన్ = వేసవియందు, కాఁచెన్ = తపింపఁ జేసెను.

తాత్పర్యము : భావించినచో హృదయము తపించును, పలుకునెడ నోరంతయు బొబ్బలెక్కును. వెలుఁగుచూచుచోఁ గనురెప్పలు కాలును అనునట్లు తీవ్రతర ప్రళయాగ్నివిధమువ నెండ వేసవియందుఁ దపింపఁజేసెను.

విశేషములు : అలంకార ముపమ.

మ. స్ఫురదారణ్య మహీధరోపరి సముద్భూతోగ్ర[1]దావానలో
త్కర విస్ఫార శిఖాలిఁ గూడి రవికాంతవ్రాత సంజాత దు
స్తర తీవ్రాగ్నిఁ బెనంగి వీచె వడ యా సంక్రుద్ధకాలాగ్నిరు
ద్ర రయోచ్ఛ్వాస సమేతమో [2]యని జనవ్రాతంబు
కంపింపఁగన్. 136

అర్థము : వడ = వేఁడిగాలి, స్ఫుర......శిఖాలిన్ ; స్ఫురత్ = విజృంభించుచున్న, అరణ్య = అరణ్యసంబంధమైన. మహీధర + ఉపరి = కొండలపై, సముద్భూత = పుట్టిన, ఉగ్ర = భయంకరమైన, దావ + అనల = కార్చిచ్చులయొక్క, ఉత్కర = సమూహముయొక్క, విస్ఫార = ప్రకాశముగల, శిఖా + ఆలిన్ = జ్వాలలవరుసతో, కూడి, రవికాంత....తీవ్రాగ్నిన్ : రవికాంత= సూర్యకాంతశిలలయొక్క. వ్రాత = సమూహమునుండి, సంజాత = పుట్టిన. దుస్తర = దాఁటశక్యముగాని, తీవ్ర + అగ్నిన్ = తీక్ష్ణమైన అగ్నితో, పెనంగి= కూడి, ఆ, సంక్రుద్ధ....సమేతమో : సంక్రుద్ధ = మిక్కిలికోపించిన. కాల + అగ్ని ప్రళయాగ్నియనెడు, రుద్ర = రుద్రుని (శివుని) యొక్క, రయ = వేగముగల, ఉచ్ఛ్వాస = ఊర్పుతో, సమేతమో = కూడియున్నదా, అని, జన - వ్రాతంబు = జనుల సమూహము, కంపింపఁగన్ = వడఁకఁగా, వీచెన్ = విసరెను.

తాత్పర్యము : ప్రకాశించుచున్న అడవిలోనికొండలపైఁ బుట్టిన కార్చిచ్చుల ప్రకాశముగల జ్వాలలవరుసనుగూడి, సూర్యకాంతపుఱాల సమూహమువలనఁ బుట్టిన దాఁటుటకు శక్యముకాని తీక్ష్ణమైన అగ్నితోఁగూడి మిక్కిలి కోపించిన ప్రళయాగ్ని యనెడు రుద్రుని వేగవంతమైన ఉచ్ఛ్వాసముతోఁగూడినదో యని లోకులు కంపింపఁగా వడగాడ్పు వీచెను.

1. వ్రా.ప్రతి. జీవానలోత్కర. 2. యనుచు లోకుల్ భీతిఁ గంపింపఁగన్.

వి శే ష ము లు : అలంకారము-రూపకానుప్రాణితోత్ప్రేక్ష.

రు - ద్ర రయోచ్ఛ్వాస సమేతమో యనుచు లోకుల్ భీతిఁ గంపింపఁగన్ అను పాఠమున యతిభంగ మయినది.

తే. ఉరు నిదాఘాతపాహతిఁ గరుల తలలు
వ్రస్సి లోపలి ముత్యముల్ వరుస విరిసి
మంగలములోని ప్రేలలభంగిఁ దూలి
ప్రేలిపడఁ గాఁచెఁ గట్టెండ పిడుగువరించి. 137

అ ర్థ ము : ఉరు - నిదాఘ + ఆతవ+ఆహతిన్ = గొప్పదియగు, వేసవి యందలి, ఎండయొక్క, దెబ్బచే, కరుల - తలలు = ఏనుఁగుల తలలు, వ్రస్సి = బద్దలయి, లోపలి - ముత్యముల్ = లోనున్న ముత్తెములు,వరుసన్ = క్రమముగా, విరిసి = చెదరి, మంగలములోని = వేఁపుడు చట్టిలోని, ప్రేలల - భంగిన్ = పేలాలవలె, తూలి = చలించి, ప్రేలి - పడన్ = ప్రేలిపడునట్లు, కట్టెండ (కడు + ఎండ) = తీవ్రమైన ఎండ, పిడుగువరించి = పిడుగువలె అతిశయించి, కాఁచెన్ = క్రాఁగునట్లు చేసెను.

తా త్ప ర్య ము ; గొప్పదియగు వేసవియందలి యెండదెబ్బచే నేనుఁగుల తలలు బ్రద్దలయి, వానిలోనున్న ముత్యములు క్రమముగాఁ జెదరి మంగలములోని పేలాల విధమునఁ జలించి ప్రేలిపడునట్లు తీక్ష్ణమైనయెండ పిడుగువలె అతిశయించి కాఁచెను.

వి శే ష ము లు : అలంకార ముత్ప్రేక్ష.

ముత్యము - ముత్తియము, ముత్తెము రూపాంతరములు. ప్రేలలు - ప్రేలాలు పేలాలు రూపాంతరములు. కడు + ఎండ = 'కుఱు చిఱు కడు నడు నిడు శబ్దముల అడల కచ్చు వరంబగునపుడు ద్విరుక్తటకారం బగు'. బాల. సంధి. 12. కట్టు + ఎండ. 'ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధి యగు'. బాల. సంధి. 1 కట్టెండ.

క. హరి శరధిఁ గ్రుంకె, నభవుఁడు
సురనదిఁ దలఁదాల్చె, నబ్జజుఁడు గ్రమ్మఱ నం
బురుహంబు సొచ్చె. నతి దు
స్తర దుస్సహ తీవ్రతర నిదాఘ భయమునన్. 138

అ ర్థ ము ; అతి.........భయమునన్; అతి = మిక్కిలి, దుస్తర = దాఁటుటకు శక్యముగాని, దుస్సహ = ఓర్చుటకువీలులేని, తీవ్రతర = మిక్కిలి తీవ్రమైన, నిదాఘ - భయమునన్ = వేసవివలని వెఱపుతో, హరి = విష్ణువు, శరధిన్ = సముద్రమునందు, గ్రుంకెన్ = మునిఁగెను, అభవుఁడు = శివుఁడు, సురనదిన్ = ఆకాశగంగను, తలన్ = శిరస్సునందు, తాల్చెన్ = ధరించెను, అబ్జజుఁడు = బ్రహ్మ (తామరనుండి పుట్టినవాఁడు), గ్రమ్మఱన్ = మరల, అంబురుహంబు + చొచ్చెన్ = పద్మమును బ్రవేశించెను.

తా త్ప ర్య ము : మిక్కిలి దుస్తరము, దుస్సహము, తీవ్రతరము అగు వేసవివలని వెఱపున విష్ణుపు సముద్రమున మునిఁగెను. శివుఁడు ఆకాశగంగానదిని శిరస్సున ధరించెను. బ్రహ్మ మరలఁ బద్మమును బ్రవేశించెను.

వి శే ష ము లు : అలంకారము హేతూత్ప్రేక్ష.

చ. అవియని గండశైల మన, నంఘ్రులతోడన యెండకున్న భూ
భవ మన, నింకి బీటగిలఁ బాఱని యేఱన, మస్తకం బొగిం
బవులని మార్గిసంఘ మనఁ బట్టుచు లోకములోన నిట్టివే
సవి గలదయ్యె నా నఖిల సాధ్వస మయ్యె నిదాఘ ముగ్రమై. 139

అ ర్థ ము : అవియని = బ్రద్దలుకాని, గండ - శైలము + అనన్ = పెద్ద కొండఱాయి, అనన్ = అనునట్లును, అంఘ్రుల - తోడన్ + అ = వేరులతోనే, ఎండక = ఉన్న, భూభవము = చెట్టు, అనన్, ఇంకి = ఇగిరిపోయి, బీటగిలన్ = బీటలువాఱునట్లు, పాఱని = ప్రవహింపని, ఏఱు + అనన్ = నది యనునట్లును, మస్తకంబు = తల, ఒగిన్ = లెస్సగా, పవులని = పగులని, మార్గి - సంఘము + అనన్ = బాటసారులగుంపు అనునట్లును, పట్టుచున్=ఆక్రమించుచు,

లోకమునన్ = లోకమునందు, ఇట్టి వేసవి - కలదయ్యె = ఇటువంటి వేసవి కలదా ? నాన్ = అనునట్లు, నిదాఘము = వేసవి, ఉగ్రము + ఐ = తీవ్రమయి, అఖిల - సాధ్వసము = ఎల్లరకు భయము, అయ్యెను.

తాత్పర్యము : బద్దలుకాని పెద్ద కొండతాయి అనునట్లును, వేరులతోనే ఎండకున్నచెట్టు అనునట్లును, ఇంకి బీటలువాఱునట్లు ప్రవహింపని నది యనునట్లును తల పవులని బాటసారులసమూహ మనునట్లును, ఆక్రమించుచు, లోకములో నిట్టిది గలదా యన వేసవి తీవ్రమయి సర్వభయావహ మయ్యెను.

విశేషములు : అలంకార ముపమ.

వ. ఇట్లతిదారుణంబైన ఘర్మదివసంబునం బార్వతి పంచాగ్ని మధ్యాగ్నిముఖాధోముఖోర్ధ్వ ముఖాదిఘోరతపంబులు సేయుచు. 140

అర్థము : ఇట్లు, అతి - దారుణంబు + ఐన = మిక్కిలి ఘోరమైన, ఘర్మ - దివసంబునన్ = వేఱవిదినమున, పార్వతి, పంచాగ్నిమధ్య. అగ్నిముఖ, అధోముఖ, ఊర్ధ్వముఖ = పంచాగ్నిమధ్యము, అగ్నిముఖము, అధోముఖము. ఊర్ధ్వముఖము, ఆది = మున్నగు, ఘోర - తపంబులు = భయంకరములైన తపస్సులు, చేయుచున్.

తాత్పర్యము : ఇట్లు మిక్కిలి ఘోరమైన వేసవిదినమునఁ బార్వతి పంచాగ్నిమధ్యము, అగ్నిముఖము, అధోముఖము, ఊర్ధ్వముఖము మున్నగు భయంకర తపస్సులు చేయుచు - తరువాతి పద్యముతో నన్వయము.

విశేషములు : పంచాగ్నిమధ్యతపస్సు - నాలుగు దిక్కులను నాలు గగ్నులు ఏర్పఱిచి పైని సూర్యుని జూచుచుఁజేయు తపస్సు. అగ్నిముఖము = అగ్నిని జూచుచుఁ జేయుతపము, అధోముఖము = మొగము క్రిందికిఁబెట్టి చేయు తపము, ఊర్ధ్వముఖము = ముఖముపైకిఁబెట్టి చేయు తపము.

ఉ. ఆతపభీతి నీడలు రయంబున మ్రాఁకుల క్రిందుఁదూరెనో,
యా తరులుం దృషాభిహతులై తమనీడలు తార త్రాగెనో
ఖాతి ననంగ నీడ లఱు పాదప మూలములం దడంగె గ్రీ
ష్మాతప మధ్యవాసరములందుఁ జలింపకయుండు నెండలన్. 141

అ ర్థ ము ; గ్రీష్మ + ఆతప - మధ్య - వాసరముల + అందున్ = వేసవితాపముగల మధ్యాహ్నములందు, చలింపక + ఉండు + ఎండలన్ = చలనము లేని యెండలలో, నీడలు, ఆతప - భీతిన్ = ఎండవలని భయమున, రయంబునన్= శీఘ్రముగా, మ్రాఁకుల - క్రిందున్ - చెట్ల క్రిందిభాగమును, తూరెనో, ప్రవేశించెనో, ఆ - తరులున్ = ఆ చెట్లును, తృషా + అభిహతులు + ఐ = దప్పిచేఁ గొట్టఁబడినవయి, భాతిన్ = వెలుఁగునందు, తమ - నీడలు, తారు + అ = తామే, త్రాగెనో, అనంగన్, నీడలు, ఉరు - పాదప - మూలముల + అందున్ = పెద్ద చెట్ల మొదళ్ళయందు, అడంగెన్ = దిగఁబడియుండెను.

తా త్ప ర్య ము : వేసవితాపముగల మధ్యాహ్నములందుఁ జలనములేని యెండలలో నీడలు ఎండవలనిభయమున శీఘ్రముగాఁ జెట్లక్రిందిభాగమును బ్రవేశించెనో, ఆ చెట్లుమ దప్పిచేఁ గొట్టఁబడినవయి వెలుఁగులో తమనీడలను దామే త్రాగివైచెనో అనునట్లు నీడలు పెద్దచెట్ల మొదళ్ళయం దడఁగియుండెను.

వి శే ష ము లు : అలంకారము హేతూత్ప్రేక్ష.

మ. పరితాపోగ్రనిదాఘవేళ శిలపైఁ బంచాగ్నిమధ్యంబునన్
బరమధ్యాన సమేతయై నిలిచి విభ్రాజిల్లె నుద్యత్తప
శ్చరణాలంకృత శైలనందన కనత్సంధ్యారుణాంభోధరో
త్కరమధ్య స్థిరకాంతకాంతియుతశీతద్యోతిరేఖాకృతిన్. 142

అ ర్థ ము : ఉద్యత్.........నందన : ఉద్యత్ = పూనుచున్న తపస్ = తపస్సుయొక్క, చరణ = చేఁతచే, అలంకృత = అలంకరింపఁబడిన, శైల - నందన = కొండకూఁతురు - పార్వతి, పరితాప + ఉగ్ర - నిదాఘ - వేళన్ = మిక్కిలి తాపముచే భయంకరమైన వేసవిసమయమున, శిలపైన్ = ఱాతిమీఁద, పంచ + అగ్ని - మధ్యంబునన్ = అయిదగ్నుల నడుమ, పరమ - ధ్యాన - సమేత + ఐ = ఉత్కృష్టమగు ధ్యానముతోఁ గూడినదయి, నిలిచి = ఉండి, కనత్.........కృతిన్ : కనత్ = ప్రకాశించుచున్న, సంధ్యా = సంధ్యాసమయము నందలి, అరుణ = ఎఱ్ఱనైన, అంభోధర + ఉత్కర = మేఘసముదాయము యొక్క, మధ్య = నడుమ, స్థిర = నిలుకడగల, కాంత = మనోహరమైన, కాంతి = ప్రకాశముతో, యుత = కూడుకొన్న, శీతద్యోతి - లేఖా + ఆకృతిన్ = చంద్రరేఖ విధమున, విభ్రాజిల్లెన్ = ప్రకాశించెను.

తాత్పర్యము : తపశ్చరణముచే నలంకరింపఁబడిన పార్వతి మిక్కిలి తాపముచే భయంకరమైన వేసవిసమయమున జాతిమీఁదఁ బంచాగ్నిమధ్యమున గొప్ప ధ్యానముతోఁ గూడియుండి, ప్రకాశించుసంజవేళనెఱ్ఱనైన మేఘసముదాయము నడుమ స్థిరమైనదియు, మనోహరమైనదియు నగు కాంతితోఁ గూడుకొన్న చంద్రరేఖ వలె మిక్కిలి ప్రకాశించెను.

విశేషములు : అలంకార ముపమ. పార్వతి కుపమానము చంద్రరేఖ. పంచాగ్నిమధ్యమున కుపమానము సంధ్యారుణాంభోధరోత్కరమధ్యము. ఆకృతిన్ - ఉపమావాచకము. విభ్రాజిల్లెన్ = సామాన్యధర్మము. కావున సంపూర్ణోపమ.

క. చెటచెటఁ దేలుచు నలుగడఁ
బటుతర శిఖి శిఖలు నెగయఁ బదిలముగా నుం
గుటము ధర నూఁది సుస్థితిఁ
గుటిలాలక వదన మెత్తికొని రవిఁ జూచున్. 143

అర్థము : కుటిల + అలక = వంకరలైన ముంగురులుగలది - పార్వతి, చెటచెటన్ = ఛటచ్ఛటాధ్వనులతో, పేలుచున్, నలుగడన్ = నాలుగుదిక్కులను, పటుతర - శిఖి - శిఖలు = తీవ్రతరములైన అగ్నిజ్వాలలు, నెగయన్ = పైకి లేవఁగాఁ, పదిలముగాన్ = స్థిరముగా, ఉంగుటమున్ = బొటనవ్రేలిని, ధరన్ = నేలపై, ఊఁది = ఆని, సుస్థితిన్ = నిలుకడతో, వదనము = ముఖము, ఎత్తికొని, రవిన్ = సూర్యుని, చూచున్.

తాత్పర్యము : ఛటచ్ఛటాధ్వనులతోఁ బేలుచు నాలుగుదిక్కులను దీవ్రతరమైన అగ్నిజ్వాలలు పైకి లేవఁగా, పార్వతి స్థిరముగా నంగుష్ఠము నేలమోపి నిలుకడతో ముఖమునెత్తుకొని సూర్యునిఁ జూచును.

విశేషములు ; పంచాగ్నిమధ్యతపోవిధాన మిదియే. చెటచెట అగ్ని పేలుటయందలి ధ్వన్యనుకరణశబ్దము. 'ఛటఛట' అను పాఠమున ఛటచ్ఛట అగుటచే, మొదట గురువు అయి గణభంగమగునని యిట్లు మార్పఁబడియుండును.

క. ఖరకర కరహతి ముఖసర
సిరుహము కడు వంది కాంతి సెడ నయనేందీ
వరము లలరె గిరిజతప
స్స్థిరశక్తిని బగలు రేయి చేసెనొ యనఁగాన్. 144

అర్థము: గిరిజ = పార్వతి, తపస్ + స్థిర - శక్తినిన్ = తపస్సుయొక్క అచంచలమైన మహిమచే, పగలు, రేయి = రాత్రి, చేసెనొ+అనఁగాన్ = చేసెనా యనునట్లు-ఖరకర - కర - హతిన్ = సూర్యుని కిరణముల దెబ్బచే, ముఖసరసిరుహము = ముఖమనెడిపద్మము, కడున్ = మిక్కిలి, వంది = వాడిపోయి, కాంతి చెడన్ = కాంతి నశింపఁగా, నయన+ఇందీవరములు = కన్నులనెడి కలువలు, అలరెన్ = వికసించెను.

తాత్పర్యము: రాత్రివేళఁ బద్మములకుఁ గాంతి యుండదు. కలువలు రాత్రి వికసించును. పార్వతి ముఖపద్మము పగలే సూర్యకిరణముల దెబ్బకుఁ గమలి కాంతి చెడియుండెను. రాత్రిగాని వికసింపని కనుగల్వలు పగలే వికసించెను. కావునఁ బార్వతి తన తపశ్శక్తిచేఁ బగటిని రేయిచేసెనా యనునట్లుండెను.

విశేషములు: అలంకారము రూపకానుప్రాణితోత్ప్రేక్ష

అది పగలయినను (ముఖ) పద్మము వికసింపకపోవుటచేతను, (కను) గలువలు వికసించుటచేతను రాత్రివలె నుండెను. పార్వతి తన తపశ్శక్తిచేఁ బగటిని రాత్రిగా మార్చెనా యనునట్లుండెనని భావము.

వ. అట్టి తపంబునందునుం బరమేశ్వరుండు ప్రసన్నుండు కామికి నగజ తపఃక్లేశంబు పరమేశున కెయిదనేరమికి నుద్వేగించుచు. 145

అర్థము: అట్టి తపంబునందునున్ = అట్టి తపస్సునందుసైతము, పరమేశ్వరుండు, ప్రసన్నుండు - కామికిన్ = ప్రత్యక్షము కాకుండుటకు, అగజ = పార్వతి, తపస్ (ః) + క్లేశంబు = తపశ్శ్రమము, పరమేశునకున్ = ఈశ్వరునకు. ఎయిదన్ + నేరమికిన్ = చేరలేకుండుటకు. ఉద్వేగించుచున్ = వ్యాకులపడుచు.

తాత్పర్యము : అట్టి ఘోరతపస్సునందును బరమేశ్వరుఁడు ప్రత్యక్షము కాకుండుటకుఁ బార్వతి తపశ్శ్రమము ఈశ్వరునిఁ జేరలేమికి వ్యాకులపడుచు - తరువాతి పద్యముతో నన్వయము.

చ. "ఇనుము రసంబులోన్ నుడుగ కెప్పుడు నూనినఁగాని కాదె కాం
చన? మమరాద్రి వాయసము సంతతమున్ వసియించికాని యే
కనకము చాయగాదు చిరకాలసుసేవనఁగాని కాదె స
న్మనమున నిన్ దలంచు డొక మాత్రయ చాలదె ముక్తి కీశ్వరా?" 146

అర్థము : ఈశ్వరా!, ఇనుము, రసంబులోన్ = పాదరసములో, ఉడుగక = మానక, ఎప్పుడున్, ఊనినన్ + కాని = ఉన్ననేతప్ప, కాంచనము = బంగారము, కాదె = కాదా? వాయసము = కాకి, అమర + అద్రిన్ = మేరుపర్వతమునందు, సంతతమున్ = ఎల్లప్పుడును- వసియించికాని = ఉండికాని, ఏ - కనకము - చాయ = ఏ బంగరుచాయ, కాదె = కాదా? చిర - కాల - సుసేవనన్ + కాని = దీర్ఘకాలము మంచిసేవ చేయుటచేఁగాక, కాదె = కాదా? సత్ + మనమునన్ (సన్మనమునన్) = మంచిమనస్సుతో, నిన్ = నిన్ను, తలంచుడు = ధ్యానించుట, ఒక - మాత్ర + అ = ఒక్కక్షణమే, ముక్తికిన్ = మోక్షమునకు, చాలదె = సరిపోదా?

తాత్పర్యము : ఈశ్వరా! ఇనుము పాదరసములో మానక ఎప్పుడును ఉన్ననేకాని బంగారము కాదా? కాకి బంగరుకొండపై నెల్లప్పుడు నున్ననేకాని బంగరు కాంతి పొందదా? అట్లే నిన్నుఁ జిరకాలము సేవించిననేకాని మోక్షము లభింపదా? సద్బుద్ధితో ఒక్కక్షణము తలఁచుట సరిపోదా? - సరిపోవునని భావము

విశేషములు : అలంకారము దృష్టాంతము, సన్మనము - సత్ + మనము- అనునాసికసంధి. 'రహలుతప్ప మిగిలిన పదాంతగత హల్లులకు (యద్రులకు) అనునాసిక వర్ణము పరమగుచో వానికి సంబంధించిన అనునాసికవర్ణము వైకల్పికముగ నాదేశమగును. సన్మనము, పక్షమున - సద్మనము,

చ. "కర మవిచారి, తద్దయు వికారి మనం, బది సారివోలెనే
తిరిగెడుఁగాని నిల్వ దెటః దీనిఁ జలత్వము మాన్పి నీ పదాం
బురుహములంద సంస్మరణఁబొంద దయన్ సురబందవంద్య : సు
స్థిరముగ నిల్పు: తత్త్వవిధిఁ దెల్పు! సమస్థితి సల్పు! శంకరా!" 147

అర్థము : సుర - బృంద - వంద్య = వేల్పుల సమూహమునకు నమస్కరింపఁ దగినవాఁడా !, శంకరా ! మనంబు = మనస్సు, కరము = మిక్కిలి అవిచారి = ఆలోచనలేనిది, తద్దయున్ = మిక్కిలి, వికారి = వికారముగలది, అది, సారి + పోలెనే = చక్రమువలెనే, తిరిగెడున్ + కాని = తిరుగునుగాని, ఎటన్ = ఎచ్చటను, నిల్వదు. దయన్ = దయతో, దీనిన్, చలత్వమున్ = తిరుగుటను, మాన్పి = మానఁజేసి. నీ - పద + అంబురుహముల + అందున్ + అ = నీ పాద పద్మములందే, సంస్మరణన్ = ధ్యానమును, పొందన్ = పొందునట్లు, సుస్థిరముగన్ = మంచి నిలుకడతో, నిల్పు = నిల్పుము, తత్త్వ - విధిన్ = తత్త్వముయొక్క రీతిని, తెల్పు = తెలుపుము, సమ - స్థితి = సమత్వము, సల్పు = సల్పుము.

తాత్పర్యము : దేవతా సమూహమునకు నమస్కరింపఁదగినవాఁడా ! ఈశ్వరా ! మనస్సు మిక్కిలి ఆలోచనలేనిది. మిక్కిలి వికారముగలది, అది చక్రము వలెనే తిరుగునుగాని యెక్కడను నిలువదు. నీవు దయతో దీని తిరుగుటను మాన్చి సుస్థిరముగ నుండునట్లు నిలుపుము, తత్త్వప్రకారమును దెలుపుము. సమత్వముతో నుండునట్లు చేయుము.

విశేషములు ; అలంకార ముపమ. నిల్పు - తెల్పు - సల్పు (ము) 'మధ్యమ పురుష ము వర్ణకంబునకు హలవసానంబులు పరంబులగునపుడు లోపము విభాష నగు' బాల. సంధి, 47.

వ. అనుచుం బరమేశ్వరధ్యాన లీయమాన మానసయై దేహంబు నిరంతర తపః క్లేశంబునం జర్మాస్థిమయంబై కాష్ఠావస్థ నెయిదియుం దపోనిష్ఠ విడువ కనుష్ఠించుచు. 148

అర్థము ; అనుచున్, పరమేశ్వర - ధ్యాన - లీయమాన - మానస + ఐ = పరమేశ్వరునియొక్క ధ్యానమునందు లీనమగుచున్న మనస్సు గలదియై, దేహంబు =

శరీరము, నిరంతర - తపస్(శ్) + క్లేశంబునన్ = ఎడతెగని తపస్సువలని శ్రమము చేత. చర్మ + అస్థి - మయంబు + ఐ = చర్మము, ఎముకలు అనువానితో నిండినదయి, కాష్ఠ + అవస్థన్ = కఱ్ఱయొక్క, స్థితిని, ఎయిదియున్ = పొంది యును, తపస్(శ్) + నిష్ఠన్ = తపస్సునందలి నియమమును, విడువక, అనుష్ఠించుచున్ = ఆచరించుచు.

తాత్పర్యము : అనుచుఁ బరమేశ్వరుని ధ్యానమునందు లీనమగుచున్న మనస్సుగలదియై, శరీరము ఎడతెగని తపఃపరిశ్రమముచేఁ జర్మము, ఎముకలు అను వానితో నిండినదయి (మాంసములేక యనుట), కఱ్ఱవలె నయియుఁ దపోనిష్ఠ విడువక ఆచరించుచు - తరువాతి పద్యముతో నన్వయము.

క. అరగొనక శైలకన్యక
హరు మనమునఁ గోరి చేయు నత్తపమున క
చ్చెరువంది భువనముల నిది
యరుదని ముత్తెంపుసేస లలికిరి విబుధుల్. 149

అర్థము : శైల - కన్యక = కొండకూఁతురు - పార్వతి, అర + కొనక = వెనుదీయక, హరున్ = శివుని, మనమునన్ = మనస్సునందు, కోరి, చేయు, ఆ - తపమునకున్, విబుధుల్ = దేవతలు, అచ్చెరువు + అంది = ఆశ్చర్యపడి, భువనములన్ = లోకములందు, ఇది = ఇట్టితపస్సు, అరుదు + అని = వింత అని, ముత్తెంపు - సేసలు (ముత్తెము + సేసలు) = ముత్యముల అక్షతలు, అలికిరి = కురిపిరి.

తాత్పర్యము ; పార్వతి వెనుదీయక శివుని మనస్సునందుఁ గోరి చేయు నట్టి అ తపస్సునకు దేవతలు ఆశ్చర్యపడి లోకములం దిట్టితపము వింతయని యామెపై ముత్యాల యక్షతలు గురిసిరి.

విశేషములు : ముత్తెంపు సేసలు - ముత్తెము + సేసలు - 'కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపు లగు,' బాల. సంధి. 32.

వ. తద్దవసరంబున. 150

అర్థతాత్పర్యములు: తద్ + అవసరంబునన్ = ఆ సమయమున. తరువాతి పద్యముతో నన్వయము.

మ. చిర సద్బ్రహ్మతపోధనావలి తపస్తేజంబులుం బేర్మితోఁ
దిరమై పొల్పగు దేవ తాపస తపస్తేజంబులుం గౌరి సు
స్థిర భావోగ్రతపోగ్రతేజమున నిస్తేజంబులై యుండె న
త్యురుచండాంశుకరప్రభాప్రతిహత ద్యోతిఃప్రభాభాసమై. 151

అర్థము; చిర - సత్ + బ్రహ్మ - తపోధన + ఆవలి - తపస్ + తేజంబులున్ = బహుకాలపు సద్బ్రాహ్మణులైన మునులయొక్క సమూహము యొక్క తపఃప్రకాశములును, పేర్మితోన్ = గొప్పతనముతో, తిరము + ఐ = స్థిరమయి, పొల్పు + అగు = ఒప్పయిన, దేవ - తాపస - తపస్ + తేజంబులున్ = దేవమునులయొక్క తపఃప్రకాశములును, గౌరి - సుస్థిర భావ + ఉగ్ర + తపస్(ః) + అగ్ర - తేజమునన్ = పార్వతియొక్క, మంచినిలుకడతోడి భయంకరమైన తపస్సుయొక్క ప్రధానమైన తేజస్సుచేత, అత్యురు.........భాసమై: అతి = మిక్కిలి, ఉరు = గొప్ప, చండాంశు = తీక్ష్ణములైన కిరణములుగలవాని - సూర్యుని యొక్క, కర = కిరణములయొక్క, ప్రభా = కాంతిచేత, ప్రతిహత = కొట్టఁబడిన, ద్యోతిస్(ః) = నక్షత్రములయొక్క, ప్రభా = కాంతివలె, భాసము + ఐ = ప్రకాశించునదియై, నిస్ + తేజంబులు + ఐ = తేజోవిహీనములయి, ఉండెన్ = ఉండెను.

తాత్పర్యము: బహుకాలపు సద్బ్రాహ్మణమునుల తపఃప్రకాశములును, సుస్థిరములైన దేవమునుల తపఃప్రకాశములును పార్వతి సుస్థిరము భయంకరమునైన తేజస్సుచేత సూర్యకిరణములకాంతిచేఁ గొట్టఁబడిన నక్షత్రకాంతివలెఁ దేజోవిహీనములై యుండెను.

విశేషములు: అలంకార ముపమ. తపస్తేజము - తపస్ + తేజము - పదాంతసకారమునకు విసర్గాదేశము. తపః + తేజము. ఊష్మపరకములు కాని చఛ, టఠ, తథలు పరములగునపుడు విసర్గము సకారముగా మాఱి చఛలు పరమగునపుడు శ్చుత్వమును, టఠలు పరములగునపుడు ష్టుత్వమును పొందును. తపస్ + అగ్ర - తపః + అగ్ర - తపోఽగ్ర. అతి + ఉరు = అత్యురు - యణాదేశసంధి.

వ. మఱియును. 152

క. ధర కంపించె; నిశాకర
ఖరకర గతు లెడలెఁ; దారకంబులు డుల్లెన్;
గిరు లురిలె; శరధు లింకెం
బరమేష్ఠి చలించె; నమరపతి మది నులికెన్. 153

అర్థము : ధర - భూమి, కంపించెన్ = చలించెను, నిశాకర - ఖర - కర- గతులు = చంద్రసూర్యగమనములు, ఎడలెన్ = పోయెను, తారకంబులు = నక్షత్రములు, డుల్లెన్ = రాలెను, గిరులు = కొండలు, ఉరిలెన్ = పగిలెను: శరధులు = సముద్రములు ఇంకెన్, పరమేష్ఠి = బ్రహ్మ, చలించెన్ = వడఁకెను, అమర - పతి = దేవరాజు - ఇంద్రుఁడు, మదిన్ = మనస్సునందు, ఉలికెన్ = భయపడెను-

తాత్పర్యము :- భూమి అదరెను, చంద్రసూర్యులు గతులు తప్పిరి. నక్షత్రములు రాలెను, కొండలు పగిలెను. సముద్రము లింకెను, బ్రహ్మ వడఁకెను- దేవేంద్రుఁడు మనసునందు భయమందెను.

క. ఉరగపతి విషము గ్రక్కెను;
హరి చిత్తమునందు వందె; నగతనయ తపో
భరమున ధారుణిఁ దాల్పఁగ
భరమై కమఠంబు డిందువడి కడు నడఁగెన్. 154

అర్థము : ఉరగ - పతి = పాఁపతేఁడు-వాసుకి, విషముఁ గ్రక్కెను, హరి = విష్ణువు, చిత్తమునందున్ = మనసునందు, వందెన్ = దుఃఖించెను, అగ - తనయ = కొండకూఁతురు - పార్వతి, తపస్ (ః) + భరమునన్ = తపస్సుయొక్క భారము చేత. ధారుణిన్ = భూమిని, తాల్పఁగన్ = భరించుటకు, భరము + ఐ = బరువయి, కమఠంబు = ఆదికూర్మము, డింందు + పడి = క్రుంగి, కడున్ = మిక్కిలి, అడఁగెన్ = అణఁగెను.

తాత్పర్యము : పాఁపతేఁడు విషమును గ్రక్కెను. విష్ణువు మనస్సునందు బాధపడెను. పార్వతీ తపోభారముచే భూమిని భరింప బరువయి యాదికూర్మము మిక్కిలి క్రుంగెను.

క. వనరాశు లేడు నుప్పరి
పెనమున నీరులును బోలెఁ బెల్లున నుడిగెన్;
గనకాద్రి క్రోవిలోపలి
కనకంబును బోలె నీరుగాఁ గరఁగె వడిన్. 155

అర్థము : వనరాశులు + ఏడున్ = సప్తసముద్రములును, ఉప్పరి - పెనమునన్ = కాలిన పెనమునందు. నీరులును + పోలెన్ = జలములవలె, పెల్లువన్ = అధికముగా. ఉడిగెన్ = ఇగిరిపోయెను, కనక + అద్రి = బంగరు కొండ - మేరువు, క్రోవిలోపలి కనకంబును + పోలెన్ = మూసలోని బంగారము వలె. వడిన్ = వేగముగా, నీరుగాన్ = ద్రవముగా, కరఁగెన్.

తాత్పర్యము ; సముద్రము లేడును గాలినపెనమునందలి జలములవలె మిక్కిలి యిగిరెను. మేరుపర్వతము మూసలోని బంగారమువలె ద్రవముగాఁగరఁగెను.

విశేషములు : అలంకార ముపమ. వనరాశులేడును . లవణ సముద్రము ఇక్షు సముద్రము, సురా సముద్రము, సర్పిస్సముద్రము, దధి సముద్రము, క్షీర సముద్రము, జల సముద్రము.

క. తారకము లెల్ల రుచిరాం
గారంబుల కరణి వెలిఁగెఁ; గమలారి తమో
హారులు క్రాఁగిన రజత మ
హారజతాదర్శనంబు లనఁ దనరి రెడన్. 156

అర్థము : తారకములు + ఎల్లన్ = నక్షత్రము లన్నియు, రుచిర + అంగారంబుల - కరణిన్ = కణకణలాడు నిప్పులబొగ్గుల విధమున, వెలిఁగెన్ = ప్రకాశించెను, కమల + అరి - తమస్ (ౘ) + హారులు = చంద్ర సూర్యులు, క్రాఁగిన = తపించిన, రజత - మహారజత + ఆదర్శనంబులు + అనన్ = వెండి బంగారముల అద్దము లనునట్లు, ఎడన్ = సమయమున, తనరిరి = ఒప్పిరి.

తాత్పర్యము : నక్షత్రములన్నియుఁ గణకణలాడు నిప్పుల బొగ్గుల విధమునఁ బ్రకాశించెను. చంద్రుఁడును. సూర్యుఁడును గ్రాఁగిన వెండి బంగారు అద్దములట్లు సమయమున నొప్పిరి.

విశేషములు ; అలంకార ముపమ.

క. పొండిగ నగజ తపశ్శిఖి
మూఁడు జగంబులను దీవ్రముగఁ బర్విన౯ బ్ర
హ్మాండము గాఁచిన కాంచన
భాండముక్రియఁ దాల్చెఁ దత్ప్రభాభాసితమై. 157

అర్థము : పోండిగన్ = పోఁడిగన్ = ఒప్పిదముగా, అగజ = పార్వతియొక్క, తపస్ + శిఖి = తపస్సనెడి అగ్ని, మూండు - జగంబులను = మూఁడు లోకములందును, తీవ్రముగన్ = మిక్కిలి వేఁడిగా, పర్వినన్ = వ్యాపింపఁగా, తద్ + ప్రభా-భాసితము + ఐ = ఆ కాంతిచేతఁ బ్రకాశించినదియై, బ్రహ్మాండము, కాఁచిన = కాల్చిన, కాంచన - భాండము - క్రియన్ = బంగారుకుండ విధముగ, తాల్చెన్.

తాత్పర్యము : పార్వతి తపస్సనెడిఅగ్ని ఒప్పిదముగా మూఁడులోకములందును మిక్కిలి వేఁడిగా వ్యాపింపఁగా, బ్రహ్మాండము ఆ కాంతిచేఁ బ్రకాశించినదయి కాల్చిన బంగారుకుండ విధమున నుండెను.

విశేషములు ; అలంకారము రూపకానుప్రాణితోపమ. పోండిగ, మూండు - అనువాని నిట్లు పూర్ణబిందుయుక్తములుగాఁ బ్రాసస్థానమునఁ బ్రయోగించుట యీ కవి ప్రాచీనతకు నిదర్శన మందురు.

క. గిరిసుత తపః ప్రభాతికిఁ
దరతరమ చలించి రజతధరణీధర మ
చ్చెరువుగ జిడ్డునఁ దిరిగెం
బురహరుతోఁగూడ వెండిబొమ్మరము క్రియవ్. 158

అ ర్థ ము : గిరి - సుత - తపస్ (ః) + ప్రభాతికిన్ = పార్వతి తప ప్రకాశమునకు, రజత - ధరణీధరము = వెండికొండ - కైలాసపర్వతము, తరః తరమ = క్రమక్రమముగా, చలించి, పురహరుతోన్ + కూడన్ = శివునితోఁ గూడ, వెండి - బొమ్మరము - క్రియన్ = వెండి బొంగరము విధమున, అచ్చెరువు గన్ = ఆశ్చర్యముగా, జిఱ్ఱనన్, తిరిగెన్.

తా త్ప ర్య ము : పార్వతి తపఃప్రకాశమునకు వెండికొండ క్రమక్రమ ముగాఁ జలించి యీశ్వరునితోఁగూడ వెండిబొంగరము విధమున నాశ్చర్యముగా జిఱ్ఱనఁ దిరిగెను.

వి శే ష ము లు : అలంకార ముపమ.

వ. అంత నట చని కృతాంతాంతకుండు కంతు లతాంతాస్త్ర హతాంత రంగుండై కాంతావియోగంబునం దురపిల్లుచు. 159

అ ర్థ ము : అంతన్, అట, చని, కృతాంత + అంతకుండు = యమనాశ కుఁడు - శివుఁడు, కంతు = మన్మథునియొక్క, లతాంత + అస్త్ర - హత + అంతరంగుఁడు + ఐ = పుష్పబాణములచేఁ గొట్టఁబడిన మనస్సుగలవాఁడయి, కాంతా = వియోగంబునన్ = ప్రియురాలితోడి యెడఁబాటున, దురపిల్లుచున్ = దుఃఖించుచు.

తా త్ప ర్య ము : అంత నక్కడ వెడలి శివుఁడు మన్మథుని పూవుటమ్ము లచేఁ గొట్టఁబడిన మనస్సుగలవాఁడయి ప్రియావిరహమున బాధపడుచు - తరువాతి పద్యముతో నన్వయము.

సీ. "హిమవంతుఁ డింతి నాకీఁదెచ్చు డెటిఁగియు
నా మాట లే నేల యాడనైతి?
నతఁడొండు నా నోడి యతివ నా కడనుంచి
యేఁగిన కన్నేల యెఱుఁగనైతి?
నా బాల ననుఁగూడ నాసించుచున్నచో
మిన్నక తపమేల పన్నికొంటి?
నెలనాఁగ నా మీఁద నెలయింప వచ్చిన
భావజుతో నేల పగయుఁగొంటిఁ?

ఆ. దరుణి వలరసంబు దఱిమి పైఁబడనున్న
నెఱవెఱింగి కూడనేర కేల
బేల నైతి?" ననుచు బాలేందుధరుఁ డాత్మ
చింత విడిచి విరహచింతఁ దగిలె. 160

అర్థము : హిమవంతుఁడు, ఇంతిన్ = స్త్రీని - పార్వతిని, నాకున్, ఈన్ = ఇచ్చుటకు - వివాహము గావించుటకు, తెచ్చుడు = తెచ్చుట, ఎఱిఁగియున్, నేను, ఆ మాటలు = పెండ్లి మాటలు, ఏల, ఆడనైతిన్ = పలుక కుంటిని ?

అతఁడు = ఆ హిమవంతుఁడు, ఒండు = ఒకటి - ఒక్కమాట, నాన్ = అనుటకు, ఓడి = జంకి, అతివన్ = స్త్రీని, నా - కడన్ = నా దగ్గఱ, ఉంచి, ఏఁగిన - కన్ను = వెడలిపోయినజాడ, ఏల, ఎఱుఁగనైతిన్ = తెలియకుంటిని ?

ఆ - బాల = ఆ కన్య - పార్వతి, ననున్ = నన్ను, కూడన్ = పొందుటకు, ఆపించుచున్ + ఉన్నచోన్ = కోరుచున్నప్పుడు, మిన్నక = ఊరక, తపము. ఏల. పన్నుకొంటిన్ = కల్పించుకొంటిని ?

ఎలనాఁగన్ = స్త్రీని - పార్వతిని, నామీఁదన్ = నాపై, ఎలయింపన్ + వచ్చిన = ఉన్ముఖునిగాఁ జేయవచ్చినట్టి, భావజాతోన్ = మన్మథునితో, ఏల, పగయున్ + కొంటిన్ = వైరము వహించితిని ?

తరుణి = యువతి - పార్వతి, వల - రసంబు = అనురాగరసము తఱిమి = వెంటనంటి, పైన్ + పడన్ + ఉన్నన్ = మీఁదఁబడనుండఁగా, నెఱవు + ఎఱింగి = మార్గముతెలిసి, కూడన్ + నేరక = ఆమెను పొందలేక, ఏల, బేలన్ + ఐతిన్ = వెఱ్ఱివాఁడనైతిని.

అనుచున్, బాల + ఇందు - ధరుఁడు = చంద్రకళను దాల్చినవాఁడు - శివుఁడు, ఆత్మ - చింతన్ = ఆత్మధ్యానమును - తపస్సును, విడిచి, విరహ - చింతన్ = వియోగ దుఃఖమును, తగిలెన్ = పొందెను.

తాత్పర్యము : 'హిమవంతుఁడు పార్వతిని నాకిచ్చుటకే తెచ్చెనని తెలిసియు నేను ఆ మాటల నేల పలుకనైతిని ? అతఁడు ఒక్కమాటనైన అనుటకు జంకి పార్వతిని నా సన్నిధినుంచి వెడలినజాడను నే నేల యెఱుఁగనైతిని ? ఆ కన్య నన్నుఁ గూడుటకుఁ గోరుచుండఁగా నే నూరక యీ తపము నేల కల్పించుకొంటిని ? ఆమెను నాయందు దాసక్తి వహించునట్లు చేయఁబూనిన మన్మథునితో నే నేల విరోధపడితిని ? ఆ యువతి వల పతిశయింప నాపైఁ బడనుండఁగా మార్గమెఱిఁగి యామెను గూడలేక నే నేల వెఱ్ఱివాఁడనైతిని ?' అనుచు నీశ్వరుఁడు తపస్సుమాని విరహదుఃఖమునఁ బడెను.

మ. బొమ లల్లార్చుచు, లోచనద్యుతులఁ బైఁ బూరించుచున్, మందహా
స మరీచుల్ దళుకొత్తఁ బల్కు నొఱపుల్ సంధించుచున్, లోలభా
వము సూచించుచు నీశుమ్రోల నెలమిన్ వర్తింపఁజొచ్చెన్ మనో
రమణం బార్వతి రూపవిభ్రమ మహోరాత్రంబు సాన్నిధ్యమై. 161

అర్థము : పార్వతి - రూప - విభ్రమము = పార్వతియొక్క ఆకార విలాసము, బొమలు = కనుబొమలు, అల్లార్చుచున్ = ఆడించుచు, లోచన - ద్యుతులన్ = కంటి కాంతులను, పైన్ = పైని, శివునిపై, పూరించుచున్ = నిండించుచు, మంద - హాస - మరీచుల్ = చిఱునవ్వు కిరణములు, తళుకొత్తన్ (తళుకు + ఒత్తన్) = మెఱయఁగా, పల్కు + ఒఱపుల్ = మాటలయొక్క నేర్పులు, సంధించుచున్ = కూర్చుచు, లోల - భావమున్ = చంచలభావమును, సూచించుచున్ = చూపుచు, మనస్ (:) + రమణన్ = మనఃప్రీతితో, అహో రాత్రంబు = పగలును రాత్రియును, సాన్నిధ్యము + ఐ = చేరువ నున్నదయి, ఈశు - మ్రోలన్ = ఈశ్వరునెదుట, ఎలమిన్ = సంతోషముతో, వర్తింపన్ + చొచ్చెన్ = ఉండ మొదలిడెను.

తాత్పర్యము : పార్వతి ఆకారవిలాసము కనుబొమల నాడించుచు, కన్నుల కాంతులను శివునిపై నించుచు, చిఱునగవుకాంతులు మెఱయఁగా మాట నేర్పులను గూర్చుచు, చాంచల్యమును సూచించుచు ఈశ్వరునెదురఁ బగలును రాత్రియును జేరువ నున్నదయి మనఃప్రీతితో సంతోషమున నుండఁజొచ్చెను.

విశేషములు : అలంకారము స్వభావోక్తి. పల్కొనొఱపుల్ - పల్కు + ఒఱపుల్ = 'షష్ఠీసమాసమునం దుకారఋకారముల కచ్చు పరమగునపుడు నుగాగమం బగు' బాల. సంధి. 34. మనస్ + రమణన్ = మనః + రమణన్ = మనోరమణన్. అహోరాత్రంబు - అహశ్చ రాత్రిశ్చ - అహోరాత్రమ్. అహ శ్శబ్దమునకుఁ బరమైన రాత్రి శబ్ద ఇ కారమునకు అప్రత్యయము వచ్చును,

చ. హరునకుఁ జూడఁగా మహిఁ జరాచరరూపము లెల్ల సమ్మతిన్
గిరిసుత రూపమై విరతఖేదముఁ జెప్పఁదొడంగె; నట్ల కా
కరయఁగ నాదిశక్తి సచరాచరరూపమ కావునన్ మహా
పురుషుల కన్నకాన్కి యనపోహము కావు డిదేమి చోద్యమో. 162

అర్థము : మహిన్ = భూమియందు, చర + అచర - రూపములు + ఎల్లన్ = కదలునవి, కదలనివి అగు ఆకృతులన్నియును. హరునకున్ = ఈశ్వరునకు, చూడఁగాన్, సమ్మతిన్ = అంగీకారముతో, గిరి - సుత - రూపము + ఐ = పార్వతి ఆకారమయి, విరత - ఖేదమున్ = విరమించిన దుఃఖమును. చెప్పన్ + తొడంగెన్ = తెలుప నారంభించెను, అట్లు + అ - కాక = ఆ విధముగనే కాక, అరయఁగన్ = పరిశీలింపఁగా, ఆదిశక్తి = పరాశక్తి - పార్వతి, స-చర + అచర-రూపము + అ=చరములు, అచరములు అనువానితోడి రూపమే, కావునన్, మహత్ (మహా)-పురుషుల-కన్న-కాన్కి=గొప్పవారియొక్క చూచిన చూపు, అనపోహము= అపోహము కానిది, భ్రమము కానిది, కావుడు=అగుట, ఇది + ఏమి-చోద్యమో= ఇదేమి వింతయో.

తాత్పర్యము : భూమిలో నున్న చరములు అచరములునైన స్వరూపము లన్నియు శివునకు పార్వతివలెఁ గనుపట్టుచు పార్వతీ విరహదుఃఖమును బోఁగొట్టుచుండెను. అది యట్లే. ఆదిశక్తి స్వరూపిణియగు పార్వతి సచరాచర రూపమే కావున మహాపురుషుల దృష్టి భ్రమరహితమగుట యేమి వింత ? కాదని భావము.

విశేషములు : విశేషము సామాన్యముచే సమర్థింపఁబడినది కావున అలంకార మర్థాంతరన్యాసము, మహాపురుషులకన్నకాన్కి - 'ధాతుజవిశేషణ భావార్థక

పూర్వవ్యవహితావ్యవహిత కర్తృపద ప్రథమకుఁదఱచుగ యొక్కషష్ఠి యగు.' ప్రౌఢ. కారక, 15. మహాపురుషులయొక్క కన్నకాన్కి. 'యొక్కకు లోపంబు. బహుళంబు' 'ప్రౌఢ. కారక . 16. మహాపురుషులకన్నకాన్కి. కాన్కి = చూపు . ఈ శబ్దము నకుఁ బ్రయోగాంతరము లేదు.

వ. తదవసరంబున. 163

అర్థతాత్పర్యములు: తద్ + అవసరంబునన్ = ఆ సమయము నందు . తరువాతి పద్యముతో నన్వయము.

సీ. ఉరు కపర్దారుణతరదీప్తు లను మృదు
నవ సహకార పల్లవ విభాతి,
నీలకంఠప్రభాజాలంబు లను సమ
దాలోల రోలంబ మాలికలును,
బాండురాంగామల బహుళ దీధితు లను
పూర్ణచంద్రాతపాకీర్ణ రుచులు,
గంగాంబుశీకరోత్కలితాహి నిశ్శ్వాస
ముల మందపవనంబుఁ బొందుచేసి.

తే. కాముఁ జంపిన పగఁ దీర్పఁ గడఁగి సూక్ష్మ
భావమునఁ జొచ్చి చిత్తతాపావహంబు
లయ్యెనొకొ నాఁగ శివుఁ డంగజాపహారి
యయ్యు విరహాగ్నిఁ బడి వేఁగు నలసిసొలసి. 164

అర్థము: ఉరు . కపర్ద + అరుణతరదీప్తులు = పెద్దదియగు జడముడి యొక్క మిక్కిలి యెఱ్ఱనైన కాంతులు, అను = అనెడి, మృదు . నవ . సహకార . పల్లవ . విభాతి = మెత్తని క్రొత్త తీయమామిడిచివురుల కాంతియు,

నీల . కంఠ ప్రభా . జాలంబులు = నల్లని కంఠముయొక్క కాంతుల సమూహములు, అను = అనెడి, సమద + ఆలోల . రోలంబ . మాలికలును = మదముతోఁగూడినవి, చంచలములు అగు తుమ్మెదల వరుసలును,

పాండుర + అంగ + అమల - బహుళ - దీధితులు = తెల్లని శరీరము యొక్క నిర్మలములయిన పెక్కు కాంతులు, అను = అనెడి, పూర్ణ - చంద్రాతప + ఆకీర్ణ - రుచులు = నిండువెన్నెలయొక్క అంతట వ్యాపించిన కాంతులును,

గంగాం........పవనంబున్ : గంగా = గంగానదియందలి, అంబు = నీటియొక్క, శీకర = తుంపరతో, ఉత్కలిత = కూడిన, అహి = పాముల యొక్క, నిశ్శ్వాసముల = నిట్టూర్పులనెడు, మంద - పవనంబున్ = మెల్లని గాలియును, పొందు - చేసి = కూడి, కామున్ = మన్మథుని, చంపిన పగన్ = చంపిన విరోధమును, తీర్పన్ = తీర్చుటకు, కడఁగి = పూని, సూక్ష్మ - భావమునన్ = సూక్ష్మరూపమున, చొచ్చి = ప్రవేశించి, చిత్త - తాప + ఆవహంబుల్ = మనస్తాపమును గలిగించునవి, అయ్యేన్ + ఒకో = అయ్యేనా, నాఁగన్ = అనఁగా, శివుఁడు, అంగజ + అపహారి = మన్మథ నాశకుఁడు, అయ్యున్ = అయినను, విరహ + అగ్నిన్ = ఎడఁబాటు అనెడి అగ్నియందు, పడి, అలపి సొలపి = డప్పి పరవశుఁడయి, వేఁగున్ = తపించును,

తాత్పర్యము : పెద్దదియగు జడముడి యెఱ్ఱనికాంతులనెడి మృదువులు, క్రొత్తవియు నగు తీయమామిడిచివురుల కాంతియును, నల్లని కంఠపుఁగాంతుల సమూహ మనెడి మదించినవి చలించినవి యైన తుమ్మెదలబారులును, తెల్లని శరీరపు నిర్మలములు అధికములునైన కాంతులనెడు నిండువెన్నెల వ్యాపించుకాంతులును, గంగానదినీటితుంపరతోఁగూడిన పాము నిట్టూర్పులనెడు మందవాయువును గూడి మన్మథునిఁ జంపినవైరమును దీర్చుకొనఁబూని సూక్ష్మరూపమున మనసునందుఁ బ్రవేశించి తాపమును గలిగించుచున్నవా యన శివుఁడు, మన్మథహరుఁ డయినను, విరహ మనెడి అగ్నియందుఁ బడి అలపి సొలపి తపించును.

విశేషములు : అలంకారము రూపకము. త దనుప్రాణితమైన ఉత్ప్రేక్ష. సహకారపల్లవములు, రోలంబమాలికలు, చంద్రాతపము, మందపవనము - ఇవి యన్నియు మన్మథపరివారములోనివి. తమ యజమానుఁడైన మన్మథునకు హానిఁ జేసినవాఁడుగావున నవి శివుని చిత్తమును సూక్ష్మరూపమునఁ బ్రవేశించి తాపమును గలిగించుచున్నవి. శివుఁ డంగజాపహారియయ్యు విరహాగ్నిఁబడివేఁగు . ప్రతిబంధక మున్నప్పటికిని గార్యము కలిగినదని చెప్పుటచే విభావనాలంకారము. 'కార్యోత్పత్తి స్తృతీయా స్యా త్సత్యపి ప్రతిబన్ధకే' చన్ద్రాః.

మ. అలిధమ్మిల్ల, మృణాలహస్తఁ, గమనీయావర్తనాభిన్, మహో
త్పలగంధిం, గలహంసయాన, విలసద్బంధూకరక్తోష్ఠ, ను
త్పలనేత్రం, గమలాస్య, నంగజరసాంభఃపూరఁ, దత్పార్వతీ
జలజావాసముఁ జొచ్చి యాడక మనోజాతానలం బాఱునే ? 165

అర్థము : అలి - ధమ్మిల్లన్ = తుమ్మెదల వంటి కొప్పుగలదియు. మృణాల హస్తన్ = తామరతూఁడులవంటి చేతులుగలదియు, కమనీయ + ఆవర్త - నాభిన్ = మనోహరమైన సుడివంటి నాభిగలదియు, మహోత్పల - గంధిన్ = పద్మము సువాసనవంటి సువాసన గలదియు, కలహంస - యానన్ = రాయంచ నడకవంటి నడక గలదియు, విలసత్ + బంధూక - రక్త + ఓష్ఠన్ = ప్రకాశించుచున్న మంకెన పువ్వువలె నెఱ్ఱనైన పెదవి గలదియు. ఉత్పల - నేత్రన్ = కలువలవంటి కన్నులు గలదియు. కమల + ఆస్యన్ = పద్మమువంటి ముఖము గలదియు, అంగజ - రస+ అంభస్ (ః)+ పూరన్ = శృంగారరసమనెడి నీటితో నిండినదియు అగు, తద్ + పార్వతీ - జలజావాసమున్ = ఆ పార్వతియనెడు తామరకొలనిని. చొచ్చి = ప్రవేశించి, ఆడక = స్నానముచేయక, మనోజాత + అనలంబు = మన్మథుఁడనెడి అగ్ని, ఆఱునే = ఉపశమించునా ?

తాత్పర్యము :* తుమ్మెదలవంటి కొప్పు గలదియు. తామరతూండ్లవంటి చేతులు గలదియు, మనోహరమైన సుడివంటి నాభిగలదియు, పద్మగంధమువంటి గంధము గలదియు, రాయంచ నడకవంటి నడకగలదియు. ప్రకాశించుచున్న బంధూక పుష్పములవలె నెఱ్ఱనైన పెదవిగలదియు, కలువలవంటి కన్నులుగలదియు, పద్మము వంటి ముఖము గలదియు, శృంగార రసమనెడు నీటితో నిండినదియు, నగు ఆ పార్వతి యనెడి పద్మాకరమును జొచ్చి స్నానముచేయక మన్మథాగ్ని చల్లాఱునా - చల్లాఱదని భావము.

విశేషములు : అగ్ని చల్లాఱవలయునన్న సరఃప్రవేశము చేయవలయును. ఇచ్చట అగ్ని మన్మథుఁడు, సరస్సు పార్వతి. సరస్సునందుండునవి యన్నియుఁ బార్వతియందున్నవి. తుమ్మెదలు. మృణాలములు, ఆవర్తము, మహోత్పలములు, కలహంసములు, బంధూకములు, ఉత్పలములు. కమలములు, అంభస్సు — ఇవి యన్నియు సరస్సులోనివి. వరుసగా ధమ్మిల్లము, హస్తములు, నాభి, గంధము

యానము, ఓష్ఠము, నేత్రములు. ఆస్యము. అంగజరనము - ఇవి పార్వతియం దున్నవి. కావుననే పార్వతి జలజావాసముగా రూపింపఁబడినది. అలంకారము రూప కము.

మహోత్పలము , 'వా పుంసి పద్మం నళిన మరవిన్దం మహోత్పలమ్' — మహచ్చ తత్ ఉత్పలం చ మహోత్పలమ్ - మహత్తైన ఉత్పలము - పద్మము- అమరము - 'ఉత్పలనేత్రి' యని యెల్లప్రతులలోను గలదు. 'అంగాదులకుఁదప్ప సంయోగోపధంబులకు జీ ప్రత్యయంబు లేమింజేసి మీననేత్రి పద్మనేత్రి ఇత్యాదు లసాధువులు'. బాల. తత్సమ 85. కావున ఛందోభంగము లేమి ఉత్పలనేత్ర అని మార్పఁబడినది.

ఉ. అత్తనుమధ్యరూపుఁ గడు నందముగాఁ గుసుమాయుధుండు నా
చిత్తమున దు రేఖగొని చిత్రము వ్రాసెనొ ? పోలుపొంద న
చ్చొత్తెనొ ? నేర్పునం గలయ నూన్చెనొ ? గా కిది తన్మనోభవో
న్మత్త వికారమో ? మదను మాయయొ ? నిక్కవమో? తలంపఁ
గాన్. 166

అర్థము : తలంపఁగాన్ = ఆలోచింపఁగా. అ + తనుమధ్య, రూపున్ = సన్నని నడుముగల ఆ పార్వతియొక్క రూపమును, కుసుమ + ఆయుధుండు = పూవులు బాణములుగాఁ గలవాఁడు - మన్మథుఁడు, కడున్ = మిక్కిలి, అందము గాన్, చిత్తమునందున్ = మనసునందు, రేఖగొని = గీఁతలచేత గుఱుతులు పెట్టు కొని, చిత్రమున్ = బొమ్మను, వ్రాసెనో = గీసెనో. పోలుపొందన్ = యథార్థ ముగా, అచ్చొత్తెనో = ముద్రపైచెనో, నేర్పునన్ = నేర్పుతో, కలయన్ = అంత టను. ఊన్చెనో = కలిగించెనో, కాక = అట్లుగాక, ఇది, తద్ + మనో - మనస్ (8) - భవ + ఉన్మత్త - వికారమో = ఆ మన్మథుని వలని ఉన్మాదపు వికృతియో, మదను - మాయయొ = మన్మథుని మాయయో, నిక్కవమో=నిజమో.

తాత్పర్యము : భావింపఁగా నా పార్వతి రూపమును మన్మథుఁడు మిక్కిలి అందముగా మనసునందు గీఁతలచే గుఱుతుపెట్టుకొని బొమ్మగీసెనో ? యథార్థముగా నచ్చొత్తెనో: నేర్పుతో నంతటను గలిగించెనో ! అట్లుగాక ఇది ఆ మన్మథునివలని ఉన్మాదపు వికారమో ! మన్మథకృతమాయయో ! నిజమో !

విశేషములు : అలంకారము సందేహము.

వ. అని యనేకప్రకారంబులం ద్రిలోచనుండు రణరణక వ్యథాకులిత హృదయుండగుచు నుండె నంత నగజ తపఃప్రభావం బీశాను బలాత్కారంబున నాకర్షింపం దొడంగిన. 167

అర్థము : అని, అనేక - ప్రకారంబులన్ = పెక్కురీతుల, త్రిలోచనుండు = శివుడు, రణరణక - వ్యథా + ఆకులిత - హృదయుండు = విరహబాధచే (ఉత్కంఠ, బాధ అనుదానిచే) - (మన్మథబాధచే) గలతచెందిన హృదయము గలవాడు, అగుచున్. ఉండెన్, అంతన్, అగజ - తపస్ (ః) + ప్రభావంబు = పార్వతియొక్క తపస్సుయొక్క మహిమ, ఈశానున్ = శివుని, బలాత్కారంబునన్ = బలవంతముగా, ఆకర్షింపన్ + తొడంగినన్ = లాగ నారంభింపగా.

తాత్పర్యము : అని పెక్కురీతుల ముక్కంటి విరహతాపముచే గలగిన హృదయము గలవా డగుచుండెను. అంత బార్వతీతపఃప్రభావ మీశ్వరుని బలవంతముగా లాగనారంభింపగా - సప్తమాశ్వాస రెండవ గద్యముతో నన్వయము.

క. గుణగణరత్నభూషణు, డకుత్సితచిత్తుడు, పూర్ణచంద్రభూ
షణ పదపంకజాత మదషట్పదు, డాశ్రిత సజ్జనార్య పో
షణు, డమితాభవాగమ విశారదు, డీడిత సన్మునీశ్వరా
గ్రణి, శుభమూర్తి, సజ్జనశిఖామణి, ధీమణి, విశ్వసంస్తుతిన్, 168

అర్థము : విశ్వ - సంస్తుతిన్ = విశ్వముయొక్క సంస్తుతియందు, (జంగమ మల్లికార్జునుడు), గుణ - గణ - రత్న - భూషణుడు = సద్గుణముల సమూహమనెడి రత్నములు అలంకారములుగా గలవాడు, అకుత్సిత - చిత్తుడు = అనిందితమైన మనస్సు గలవాడు, పూర్ణ - చంద్ర - భూషణ - పద - పంకజాత - మద - షట్పదుడు = నిండు చందురుడు అలంకారముగా గలవాని - శివునియొక్క పాదపద్మములకు మదించిన తుమ్మెదయైనవాడు, ఆశ్రిత - సత్ + జన + ఆర్య - పోషణుడు = ఆశ్రయించిన మంచిజనుల, పూజ్యుల, పోషణముగలవాడు, అమిత + అభవ + ఆగమ - విశారదుడు = అధికమైన శైవాగమములందు నేర్పుగలవాడు, ఈడిత - సత్ + ముని + ఈశ్వర + అగ్రణి = పూజింపబడిన మునిశ్రేష్ఠులందు మొదటివాడు, శుభ - మూర్తి = శుభమైన ఆకారము

గలవాఁడు, సత్ + జన - శిఖామణి = మంచిజనులలోఁ దలమానికమైన వాఁడు - శ్రేష్ఠుఁడు, ధీమణి = బుద్ధియను మణి గలవాఁడు.

తాత్పర్యము : కృతిపతియగు జంగమ మల్లికార్జునుఁడు సద్గుణసమూహము అనెడి రత్నాలంకారములు గలవాఁడును, శివపాదపద్మములకు మదించిన తుమ్మెద యైనవాఁడును, ఆశ్రయించిన సజ్జనులను, ఆర్యులను పోషించువాఁడును, అమితములైన శైవాగమములందు నేర్పరియైనవాఁడును, పూజితులైన సన్ముని శ్రేష్ఠులలో మొదటివాఁడును, శుభాకారుఁడును, సజ్జనులలోఁ దలమానికమైనవాఁడును, ధీమణియును అని విశ్వముచేత సంస్తుతింపఁబడువాఁడు.

విశేషములు : గుణగణరత్నభూషణుఁడు - గుణగణములనెడి రత్న భూషణుఁడు - రూపకము. పూర్ణచంద్రభూషణ పదపంకజాతమదషట్పదుఁడు - పూర్ణచంద్రభూషణుని పదములనెడు పంకజాతములకు మదషట్పదుఁడు - రూపకము. శివుఁడు పూర్ణచంద్రభూషణుఁడా ? చంద్రకళాభూషణుఁడు గదా !

క. సంయమ సుచరిత్రుఁడు, వా
క్సంయమ సువ్రతరతుండు, చౌషష్టి కళా
సంయుతుఁ డనఘుఁడు, కాంతా
సంయోగ వియోగ భోగ సంత్యక్తుఁ డిలన్. 169

అర్థము : (జంగమ మల్లికార్జునుఁడు) ఇలన్ = భూమియందు, సంయమ - సుచరిత్రుఁడు = చిత్తనిరోధముతోడి మంచిచరిత్రగలవాఁడు, వాచ్(క్) - సంయమ - సువ్రత - రతుండు = వాఙ్నిగ్రహమనెడి మంచివ్రతమునందు ఆసక్తిగలవాఁడు. చౌషష్టి - కళా - సంయుతుఁడు = అఱువది నాలుగుకళలతోఁ గూడినవాఁడు, అనఘుఁడు = అఘము (పాపము) లేనివాఁడు, కాంతా - సంయోగ - వియోగ - భోగ - సంత్యక్తుఁడు = స్త్రీసంయోగవియోగములు, భోగములు అనువానిచేత విడువఁబడినవాఁడును.

తాత్పర్యము : జంగమ మల్లికార్జునుఁడు భూమియందు చిత్తనిరోధముతోడి సుచరిత్రము గలవాఁడు, వాఙ్నిగ్రహమనెడు సద్వ్రతమునం దాసక్తిగలవాఁడు, అఱువదినాలుగుకళలతోఁ గూడినవాఁడు, పాపములులేనివాఁడు, కాంతలసంయోగములు, భోగములు అనువానిచే విడువఁబడినవాఁడు - కాంతా సంయోగవియోగభోగములను విడిచినవాఁడు.

చ. గతమదమత్సరుండు, జిత కామ లతాంత శిలీముఖ వ్రజా
హత పరితాపచేతసుఁ డఘామితకంటక బంధుభూరుహా
యత నిబిడాజవంజవ మహావిపినానలుఁ, డింద్రియేభ సం
హతి మదవర్ధనోగ్రనఖరాయుధుఁ, డాత్మవిదుండు సద్విధిన్. 170

అర్థము : గత - మద - మత్సరుండు = పోయిన మదమాత్సర్యములు గలవాఁడు - మదమాత్సర్యములు లేనివాఁడు, జిత.......చేతసుఁడు; జిత - కామ = జయింపఁబడిన మన్మథునియొక్క, లతాంత - శిలీముఖ - వ్రజ = పూవులనెడి బాణముల సమూహముచే, ఆహత = కొట్టఁబడిన, పరితాప - చేతసుఁడు = సంతాపముగల మనస్సుగలవాఁడును, అఘా.....నానలుఁడు : అఘ = పాపములనెడి, అమిత = అధికమైన కంటకములకు, బంధు = చుట్టములైన, భూరుహ = చెట్లచేత, ఆయత = విరివియైన, నిబిడ = దట్టమైన, ఆజవంజవ = సంసారమనెడి, మహత్ (మహా) - విపిన + అనలుఁడు = గొప్ప అడవికి అగ్నియైనవాఁడు, ఇంద్రి.....యుధుఁడు : ఇంద్రియ = ఇంద్రియములనెడు, ఇభ = ఏనుఁగుల యొక్క, సంహతి = గుంపుయొక్క, మద = క్రొవ్వుయొక్క, వర్ధన = ఖండించుటకు, ఉగ్ర = భయంకరమైన, నఖర + ఆయుధుఁడు = సింహమైనవాఁడు, సత్ + విధిన్ = మంచినియమమునందు, ఆత్మ - విదుండు = ఆత్మజ్ఞానము గలవాఁడు.

తాత్పర్యము : మదమాత్సర్యములు లేనివాఁడు. మన్మథుని పూవులనెడి బాణముల సమూహముచేఁ గొట్టఁబడిన సంతాపముగల మనస్సును జయించినవాఁడు, పాపములనెడి పెక్కుముండ్లకుఁ జుట్టములైన చెట్లచే విరివియైనట్టియు, దట్టమయినట్టియు గొప్ప అడవికి అగ్నియైనవాఁడు, ఇంద్రియములనెడి ఏనుఁగులగుంపు మదమును నశింపఁజేయుటయందు భయంకరమైన సింహమైనవాఁడు, సద్విధిచే ఆత్మజ్ఞానముగలవాఁడు.

విశేషములు : పరితాపచేతసుఁడు - బహువ్రీహి సమాసమున నుత్తరపదములుగా నున్నప్పుడు ఉరః ప్రభృతులకు క ప్రత్యయము వచ్చును. పరితాపచేతస్కుఁడు కావలసియుండఁగా నిట పరితాపచేతసుఁడని యున్నది. అలంకారము రూపకము. 'గతమదమత్సరుండు' ఇదే సమాసముతో మొదలిడు నన్నయ పద్యము. భార.అర. 3-36.

క. సూరిజన స్తుత కీర్తి

శ్రీరమణీ రమణుఁ, డమలచేతస్కుఁడు[1] వా

ణీ రుచిరానన తిలకుఁ, డ

పారగుణార్ణవుఁడు, సుజనబాంధవుఁ, డెలమిన్. 171

అర్థము : సూరి - జన - స్తుత - కీర్తి - శ్రీ - రమణీ - రమణుఁడు = పండితులైన జనులచేతఁ బొగడఁబడిన కీర్తిలక్ష్మి యనెడుస్త్రీకిఁ బ్రియుఁడైనవాఁడు అమల - చేతస్కుఁడు = నిర్మలమైన మనస్సుగలవాఁడు, వాణీ - రుచిర + ఆనన - తిలకుఁడు = సరస్వతిచేత మనోహరమైన ముఖముగలవారిలో శ్రేష్ఠుఁడు. అపార - గుణ + అర్ణవుఁడు = అనంతములైన గుణములకు సముద్రమైన వాఁడు, ఎలమిన్ = ప్రీతియందు, సుజన - బాంధవుఁడు = మంచివారికి బంధువైన వాఁడు,

తాత్పర్యము : విద్వజ్జనులచే నుతింపఁబడిన కీర్తిలక్ష్మికిఁ బ్రియుఁడైన వాఁడు, నిర్మలమైన మనస్సుగలవాఁడు, వాక్కుచే మనోహరమైన ముఖముగల వారిలో శ్రేష్ఠుఁడు, పెక్కుసుగుణములకు సముద్రమైనవాఁడు, ప్రీతియందు సజ్జను లకు బంధువైనవాఁడు.

విశేషములు : అమల చేతస్కుఁడు - బహువ్రీహి సమాసమున నుత్తర పదములుగా నున్నప్పుడు ఉరః ప్రభృతులకు కప్రత్యయము వచ్చును.

లలితగతి. కమలదళనేత్రుఁ డవికారుఁడు సుధీరుం

డమిత శివతత్త్వవిదుఁ డార్యుఁ డతివర్యుం

డమలిన చరిత్రుఁ డమలాత్ముఁడు మహాత్ముం

డమరగురుభాతి మతియందు నుతుఁ డెందున్. 172

అర్థము : కమల - దళ - నేత్రుఁడు = తామర రేకులవంటి కన్నులుగల వాఁడు. అవికారుఁడు = వికారములులేనివాఁడు, సుధీరుండు = మంచిధైర్యవంతుఁడు, అమిత - శివ - తత్త్వ - విదుఁడు = అధికమైన శివతత్త్వము తెలిసినవాఁడు, ఆర్యుఁడు = పూజ్యుఁడు, అతి వర్యుండు = మిక్కిలి శ్రేష్ఠుఁడు - అతిమన్మథుఁడు-

1. వావిళ్ళప్ర. రే.

మన్మథుని మించినవాఁడు, అమలిన - చరిత్రుఁడు = నిర్మలమైన చరిత్రముగలవాఁడు, అమల + ఆత్ముఁడు = నిర్మలమైన మనస్సుగలవాఁడు, మహాత్ముండు, = గొప్పవాఁడు, మతి + అందున్ = బుద్ధియందు, అమర - గురు - భాతి = దేవతల గురువైన బృహస్పతి విధమువాఁడు, ఎందున్, నుతుఁడు = పొగడఁబడినవాఁడు,

తాత్పర్యము : పద్మదళములవంటి కన్నులుగలవాఁడు, వికారములేనివాఁడు, ధైర్యవంతుఁడు, అధికమైన శివతత్త్వమెఱిఁగినవాఁడు, పూజ్యుఁడు. మిక్కిలి శ్రేష్ఠుఁడు - అతిమన్మథుఁడు, నిర్మలమైన చరిత్రముగలవాఁడు. నిర్మలస్వభావుఁడు, మహాత్ముఁడు, బుద్ధియందు బృహస్పతివంటివాఁడు. ఎందును పొగడఁబడువాఁడు.

విశేషములు : వర్యుఁడు, = శ్రేష్ఠుఁడు, మన్మథుఁడు. సూ.ని.

ఛందస్సు. లలితగతి - నాలుగు పాదము లుండును. ప్రతిపాదమునను న, స, న, భ, య గణములుండును, మొదటి అక్షరమునకును బదియవ యక్షరమునకును యతిమైత్రి. ప్రాసనియమము గలదు, దీనికి అప్పకవీయమున అలసగతి యని పేరుగలదు,

గద్యము ఇది శ్రీమజ్జంగమ మల్లికార్జునదేవ దివ్య శ్రీపాద
పంకజ భ్రమరాయమాణ కవిరాజశిఖామణి నన్నెచోడ
దేవ ప్రణీతంబైన కుమారసంభవంబను కథయందు

షష్ఠాశ్వాసము

అర్థతాత్పర్యములు : ప్రథమాశ్వాసాంత గద్యమునకు వలెనే,

మ. ఇది శ్రీ జొన్నలగడ్డ వంశ మణి యౌ మృత్యుంజయాఖ్యుండు స
మ్మద మొప్పారఁ గుమారసంభవము శ్రీమన్నన్నెచోడాఖ్య వి
ద్వ దధీశోక్తము శాబ్దికార్థ వివిధస్వారస్య తాత్పర్యముల్
చదురొప్పన్ వచియించి మన్చు విలసత్ సంజీవనీవ్యాఖ్యయౌ.

శ్రీ అద్దేపల్లి నాగేశ్వరరావు గారిచే సరస్వతీ పవర్ ప్రెస్సు నందు ముద్రితము.
రాజమహేంద్రవరము - 1994.

నన్నెచోడదేవ కృత

కుమారసంభవము

సంజీవనీ వ్యాఖ్యా సమేతము

అకారాది పద్యానుక్రమణిక

(ప్రథమాశ్వాసమునుండి షష్ఠాశ్వాసాంతము వఱకు.)

—o—